
# శ్రీ యోగవాసిష్ఠము

Vol 2



ఓమ్

# వాసిష్ఠ రామాయణము

అను

# శ్రీయోగవాసిష్ఠము

(తాత్పర్యప్రకాశికయను ఆంధ్రానువాద సహితము)

## మహర్షి వాల్మీకి ప్రణీతము

పూర్వార్ధము - ద్వితీయ సంపుటము

అనువాదకులు :

శ్రీ పూర్ణానంద స్వాములవారు

సంపాదకులు = ప్రకాశకులు :

శ్రీ వ్యాసాశ్రమము

వ్యాసాశ్రమము పోస్టు, (మార్గము) ఏర్పేడు, చిత్తూరు జిల్లా. (ఆ.ప్ర.)

పిన్ : 517 621 ఫోన్ నెం. 08574 - 68528

2009

★

| | | |
|---|---|---|
| ప్రథమ ముద్రణ 1948 సం॥ము | 1000 | ప్రతులు |
| ద్వితీయ ముద్రణ 1969 సం॥ము | 1000 | ప్రతులు |
| తృతీయ ముద్రణ 1997 సం॥ము | 2000 | ప్రతులు |
| చతుర్థ ముద్రణ 2009 సం॥ము | 1000 | ప్రతులు |
| | ------ | |
| మొత్తము | 5000 | ప్రతులు |
| | ------ | |

వెల : రూ.





**ప్రకాశకులు :**

**శ్రీవ్యాసాశ్రమమువారు**

**ప్రతులకు :**

మేనేజరు, శ్రీ వ్యాసాశ్రమము,
(వయా) ఏర్పేడు - 517 621, చిత్తూరు (జిల్లా)
ఆం.ప్ర. ఫోన్ నెం. 08578 - 287528

**ముద్రణ :**

**శ్రీ పారాశర్య ప్రెస్ - శ్రీవ్యాసాశ్రమము**

(వయా) ఏర్పేడు - 517 621, చిత్తూరు (జిల్లా)
ఆం.ప్ర. ఫోన్ నెం. 08578 - 287528


# నివేదన

శ్రీవ్యాసాశ్రమం వారు ప్రకటించిన ఆధ్యాత్మిక గ్రంథాలు ఆంధ్రదేశంలో విస్తృతప్రచారం పొందాయి. వాటిలో తలమానికంగా ఎన్నదగినది యోగవాసిష్ఠం. దీన్ని 'వాసిష్ఠ రామాయణం', 'వసిష్ఠగీత' అని కూడా వ్యవహరిస్తారు.

వాల్మీకి కృతిగా ప్రసిద్ధమైన ఈ గ్రంథంలో ముప్పది రెండువేల శ్లోకా లున్నాయి. వైరాగ్య - ముముక్షు - ఉత్పత్తి - స్థితి - ఉపశమ - నిర్వాణ ప్రకరణా లన్న పేరుతో ఆరు విభాగా లున్నాయి. అద్వైతవేదాంతం ఈ పుస్తకంలో అత్యద్భుతంగా ప్రతిపాదింపబడింది. వసిష్ఠ మహర్షి శ్రీరామ చంద్రుణ్ణి ఉద్దేశించి చేసిన తత్త్వోపదేశమే ఇందలి విషయం.

"మహాగ్రంథాలలో ఒకటైన యోగ వాసిష్ఠం నాదృష్టిలో ప్రపంచంలో వ్రాయబడిన గ్రంథాలన్నింటిలోనూ అత్యాశ్చర్యకరమైనది"(One of the greatest books, the most wonderful according to me ever written under the sun, is Yogavasistha.) అని శ్రీ స్వామి రామతీర్థులవారు ఈ గ్రంథాన్ని ప్రశంసించి వున్నారు.

దీన్ని మహర్షి సద్గురు శ్రీమలయాళస్వాములవారు సమగ్రంగా ఆంధ్రతాత్పర్యంతో సహా నలుబదేండ్ల క్రితం ముద్రింపజేశారు. అంతకు ముందెవరూ దీన్ని తెలుగులో సంపూర్ణంగా ముద్రించలేదు. శ్రీ సద్గురు స్వాములవారి ప్రోత్సాహంతో శ్రీపూర్ణానందేత్యవర నామధేయ శ్రీనిర్వికల్పానంద స్వాములవారు ఈ గ్రంథానికి చెందిన పూర్వార్ధాన్ని అనువదించారు. తరువాతి భాగాన్ని శ్రీ సద్గురు దేవుల ముఖ్య శిష్యులు శ్రీ విద్యా ప్రకాశానంద స్వాములవారు తెనిగించారు. 1936 లో ప్రారంభమైన దీని ముద్రణ 1954 లో పూర్తి అయింది. నాల్గువేల పుటలకు పైబడిన ఈ పుస్తకం మొదట నాలుగు సంపుటాలుగా రాయల్ సైజులో ప్రచురింపబడింది.

జిజ్ఞాసువులైన పాఠకుల ప్రీతికి పాత్రమై మూడుసార్లు ముద్రితమయింది.


ఇటీవల చాలాకాలం నుండి దుర్లభంగా వుండిపోయిన ఈ గ్రంథరత్నం కావాలంటూ ఆశ్రమానికి పలువురు లేఖలు వ్రాసేవారు. భగవదనుగ్రహం వల్ల, గురుకరుణవల్ల ఈ మహాగ్రంథాన్ని ఇప్పుడు మళ్లీ ప్రచురించే సదవకాశం లభించింది. పాఠకుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని దీని నిప్పుడు డెమ్మీ 1/8 సైజులో ఎనిమిది సంపుటాలుగా ప్రచురిస్తున్నాము.

ఈ గ్రంథగౌరవాన్ని గుర్తించి తిరుమల తిరుపతి దేవస్థానం వారు దీని పునర్ముద్రణకు ఉదారంగా ఆర్థిక సహాయం అందించారు. ఇందు దేవస్థానం పాలకమండలికి ఎంతో కృతజ్ఞులము. ఈ విషయంలో సహకరించిన ఆశ్రమపూర్వ విద్యార్థి, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీ సముద్రాల లక్ష్మణయ్యగారిని అభినందిస్తున్నాము.

ఈ ఉద్గ్రంథం ఇంకా విస్తృత వ్యాప్తి చెంది పాఠకులకు ఆత్మానందాన్ని ప్రసాదించుగాక!

శ్రీ వ్యాసాశ్రమం ప్రకాశకులు

22-8-1997.



## ద్వాత్రింశః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అథ వీరవరోత్కంఠ నృత్యదప్సరసి స్థితా
లీలావలోకయామాస వ్యోమ్ని విద్యాన్వితాపనా, 1
స్వరాష్ట్రమండలే భర్తృ పాలితే బలమాలితే
కస్మింశ్చిద్వితతారణ్యే ద్వితీయాకాశభీషణే. 2
సేనాద్వితయమాక్షుబ్ధం సామ్యాబ్ధిద్వితయోపమమ్
మహారంభఘనం మత్తం స్థితం రాజద్వయాన్వితమ్. 3
యుద్ధసజ్జం సుసన్నద్ధ మిద్ధమగ్ని మివాద్భుతమ్
పూర్వప్రహారసంపాత ప్రేక్షాక్షుబ్ధాక్షిలక్షితం. 4
[illegible] నవాజనం
కచత్పరశ్వధప్రాస భిందిపాలర్ష్టి ముద్గరం. 5

వసిష్ఠుడు:- వీరులనుబొందు ఆశతో అప్సరసలు నృత్యమొనర్చు ఆకాశమండలమున లీల సరస్వతీ దేవితోగూడి కాంచెను.—అచ్చటి అరణ్యదేశము సైన్యములతోనిండి, భీషణమై రెండవ ఆకాశమువలె కన్పట్టుచుండెను. ఉభయసైన్యములు మహాసముద్రమువలె కల్లోల్లుచు, ఆడంబరమొనర్చుచుండెను. అట ఇరువాగుల కధిపతులగు రాజులుండిరి. యుద్ధవేషమునుదాల్చి, కవచములను ధరించిన సైనికులు మండుచున్న నిప్పువలె నుండిరి. క్రిందటిజాముననగిలిన శస్త్రఘాతములను గొందరు తీవ్రదృష్టితో జూచుకొనుచుండిరి. కొందరు ఖడ్గధారలను జలధారలవలె సహించుచుండిరి. అచ్చటచ్చట గొడ్డలి మున్నగు ఆయుధములు పడియుండెను.

గరుత్మత్పతక్షుబ్ధ వనసంపాతకంపితం
ఉద్యద్దినకరాలోక చంచత్కనకకంటకమ్. 6
పరస్పరముఖాలోక కోపప్రోద్దామితాయుధమ్
అన్యోన్యబద్ధదృష్టిత్వా చ్చిత్రం భిత్తావివార్పితమ్. 7
లేఖామర్యాదయా దీర్ఘ బద్ధయా స్థాపితస్థితి
అనివార్యమహాసైన్య ఝూంకారాశ్రుతసంకథమ్. 8
పూర్వప్రహారస్మయత శ్చిరం సంశాంతదుందుభి
నిబద్ధయోధసంస్థాన నిఖిలానీకమంథరం. 9
ధనుర్ద్వితయమాత్రాత్మ శూన్యమధ్యైకసేతునా
విభక్తం కల్పవాతేన మత్తమేకార్ణవం యథా. 10

గరుత్మంతుని రెక్కలవలన గంపింపబడిన అరణ్యమువలె, ఆ రణరంగము కంపించుచుండెను, ఉదయసూర్యప్రభలవలె, సువర్ణకవచకాంతులు మెరయుచుండెను. యోధులు ఒకరినొకరు కోపముతో జూచుకొనుచు బాణముల వదలుచుండిరి, మరికొందరు క్రోధవీక్షణములు జరుపుకొనుచు, బొమ్మలవలె, నిలబడియుండిరి. ఇరువాగులవారు, గీచుకొనిన గిరినిదాటి

యుద్ధమొనర్చుచుండిరి. నాల్గుదిక్కుల సైనికుల ఝుంకారము లేచుచుండుటవలన పల్కులు వినబడకుండెను. యుద్ధమునకు పూర్వమే యోధులు, యుద్ధనీతినతిక్రమించి, కొట్టుకొనిన దుందుభిధ్వని ఆగిపోవుచుండెను. సేనానాయకులు బలవంతులను ముందరనిల్పి, తరువాత బలహీనులను, పిదప అంతకంటె తక్కువబలముగలవారిని క్రమముగ నిల్పుచుండిరి. ప్రళయవాయువు సముద్రమును రెండుగా జేసినట్లు, రెండుసేనలనడుమ కొంతచోటు సేతువువలెనుండి భయమును గొల్పుచుండెను.

కాయే సంకటసంరంభ చింతాపరవశేశ్వరం
విరటద్భేకకంఠత్వగ్భంగురాంగనస్వాగ్రహం. 11
ప్రాణసర్వస్వసంత్యాగ సోద్యోగాసంఖ్యసైనికం
కర్ణాకృష్టశరాఘాఘత్యాగోన్ముఖధనుర్ధరం. 12
ప్రహారపాతసంప్రేక్షా నిష్పందాసంఖ్యసైనికం
అన్యోన్యోత్క్రాంతకాఠిన్య భరప్రభకటికసు కటం. 13
పరిస్ఫురసుసంఘుష్ట కటుటంకార శంకటం
వీరఘోరాధముఖాదగ్ధ భీరుప్రేక్షితకోటరం. 14
మిథఃసంస్థానకాలోక మాత్రాసందిగ్ధజీవితం.
సమస్తాంగరుహాసక్త ప్రాంశు వృద్ధదేభమానవం. 15

ఘోరముగ జరుగు యుద్ధమునుగాంచి రెండుపక్షముల రాజులును చింతాన్వితులైరి. పిరికివారిగుండెలు, భేకకంఠపాళ చర్మమువలె, కంపింపసాగెను. లెక్కపమించిన సైనికులు ప్రాణములపై ఆశవిడచి, యుద్ధమునకు సంసిద్ధులగుచుండిరి. ధనుర్ధరులు, ఆకర్ణాంతము ధనుస్సును లాగి, బాణములను వదలుచుండిరి. ఇంకొకచోట సైనికులు బాణవర్షమును అస్త్రఘాతములను రెప్పవాల్పక జూచుచుండిరి. కొందఱు యుద్ధోత్సాహమున కఠినులై, కనుబొమ్మలను ముడుచుకొనుచుండిరి. ఒండొరులు తాకికొనుటవలన కవచముల టంకారవములు వినబడుచుండెను. పిరికిపందలు సేనాధిపతుల వేడిపల్కులు వినజాలక తమ సెలవులకు జనుచుండిరి. దుర్బలులగు సైనికులు యుద్ధభూమినిగాంచి, ప్రాణములు నిల్చునాయని సందేహించుచుండిరి. శరీరమునకు దుమ్మంటుకొన, మనుష్యులును, ఏనుగులును, లావెక్కినట్లుండిరి.

పూర్వప్రహారసంప్రేక్షా వ్యగ్రప్రాణతయా తయా
సంశాంతకల్లోలరవం నిద్రాముద్రపురోపమం. 16
సంశాంతశంఖసంఘాత తూర్యనిర్హ్రాదదుందుభి
భూతలాకాశసంలీన సద్వపాంసుపయోధరమ్. 17
పలాయనపరైఃపశ్చాత్త్యక్తమంగులమండలమ్
విసారిమకరవ్యూహ మత్స్యసంఖ్యాబ్ధిభాసురమ్. 18
పతాకామంజరీపుంజ విజితాకాశతారకం
హాస్తికోత్తంభితకర కాననీకృతఖాంతరం. 19



తరత్తరలభాపూర సపక్షసకలాయుధం
ధమద్ధమితశబ్దైశ్చ శ్వాసోత్థైర్ధ్వాంతఖాంతరం, 20

ప్రథమయామయుద్ధమును గాంచువీరుల కలరవము భయమున గట్టువడ, అచ్చోటు నిద్రించుచున్న పురివలెనుండెను. శంఖ, తూర్య, దుందుభిధ్వానము లాగిపోయెను. ధూళి ధూమ్యాకాశములనిండి మేఘమువలె కన్పడుచుండెను. పిరికివారు సేనాధిపతులనువీడి పరుగిడుచుండిరి. మత్స్య మకర వ్యూహములబన్ని యుద్ధమొనర్చుచున్నచోటు, సముద్రమువలెనుండెను. పతాకలులేచి సముద్రమును గప్పివుచ్చుచుండెను. ఏనుగులు తొండములనెత్తి ఆకసమును అరణ్యమువలె నొనర్చుచుండెను. పిదప, ఆయుధము లెగసి, తళతళ మెరయుచు, లెక్కలున్నట్లు తోచుచుండెను. శంఖములయొక్కయు, భేరులయొక్కయు, ఘర్ఘర ధ్వనులతో ఆకాశము నిండియుండెను.

చక్రవ్యూహకరాక్రాంత దుర్వృత్తసురభాసురం
గరుడవ్యూహసంరంభ విద్రవన్నాగసంచయం. 21
శ్యేనవ్యూహవిభిన్నాగ్ర సన్నివేశోత్తమధ్వని
అన్యోన్యాస్ఫోటనిఃశేష ప్రపతద్భూరివృందకం. 22
వివిధవ్యూహవిన్యాస వాంతవీరవరారవం
కరప్రతోలనోల్లాస మత్తముద్గరమండలం. 23
కృష్ణాయుధాంశుజలద శ్యామీకృతదివాకరం
అనిలాధూతపల్యాల సూత్కృతాభశరధ్వని. 24
అనేకకల్పకల్పాగ్రసవృందమివ సంస్థితం
ప్రలయానిలసంక్షుబ్ధ మేకార్ణవమివోత్థితం. 25
సద్యశ్ఛిన్నం మహామేరోః పక్షద్వయమివస్ఫురత్
క్షుబ్ధమారుతనిర్ధూత మివ కజ్జలపర్వతం. 26
పాతాలకుహరాత్క్షుబ్ధ మంథకారమివోత్థితం
లోకాలోకమివోన్మత్త నృత్యలోలలసత్తటం
మహానరకసంఘాతం భిత్వావనిమివోత్థితం. 27

చక్రవ్యూహమునుబన్ని దేవతలు రాక్షసులను సంహరించునట్లొకపక్షము వారెదిరి వారిని జంపుచుండిరి. ఇంకొకచోట గరుడవ్యూహమునుబన్ని ఏనుగులను, పాములను దరుముచుండిరి. ఇంకొకతావున సైనికులు, శ్యేనవ్యూహమునుబన్ని కోలాహల మొనర్చుచుండిరి. మఱియొకచోట, యోధులు, భుజముల జరచుకొనుచు, యుద్ధమున బ్రవేశించుచుండిరి. నానావిధ వ్యూహములనుండి తప్పించుకొని, వెలువడిన వీరులు కోలాహల మొనర్చుచుండిరి. ఇంకొకప్రదేశమున యోధులు ముద్గరములను జేతులతో ద్రిప్పుచుండిరి. శ్యామాస్త్రకాంతిపుంజములను [illegible] సూర్యుడు గూడ నల్లబడెను. గాలిచేగొట్టబడిన గడ్డినుండి వెలువడు సూత్-కృత

ములవలె, బాణపు ధ్వనులు వినవచ్చుచుండెను. ఆ సైన్యములు, పుష్కలావర్త మేఘముల వలెను, ప్రళయవాయు విక్షోభిత సముద్రమువలెను, సద్యశ్ఛిన్న మేరు పక్షములవలెను, మారుత నిర్ధూతమగు అంజనాద్రివలెను, పాతాళమునుండి వెలువడిన అంధకారమువలెను, నరకముల భేదించుకొని వచ్చిన చక్రవాళపర్వతముల నాట్యములవలెను నగుపడుచుండెను.

ఆలోలకుంతముసలాసి పరశ్వధాంశు
శ్యామాయమానదివసాతపవారిపూరైః
ఏకార్ణవం భువనకోశమివాచిరేణ
కర్తుం సముద్యతమగాధమనంతపూరైః. 33

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ఆహవారంభణం నామ ద్వాత్రింశః సర్గః ॥ 32 ॥

ఆ రణరంగమున ప్రయోగింపబడుచున్న కుంతాద్యాది కిరణసమూహములను సముద్రము వెంటనే తన అనంత జలప్రవాహముతో భూమిని ఏకార్ణవ మొనర్పబూనినదా యనిపించు చుండెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్యప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
లీలోపాఖ్యానమున ఆహవారంభణమను ద్వాత్రింశ సర్గము ॥ 32 ॥

## త్రయస్త్రింశః సర్గః

శ్రీరామ ఉవాచః—

భగవన్ యుద్ధమేతన్మే సమాసేన మనాగ్వద
శ్రుతిరాహ్లాద్యతే శ్రోతు ర్యస్మాదేతాభిరుక్తిభిః 1

శ్రీరాముడు:— భగవానుడా! ఈ యుద్ధమునంతటిని కొంచెము క్లుప్తముగ వర్ణింపుడు. మీరు నుడివినదంతయు విన వింపుగనున్నది.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

అథ తత్రైవ తే దేవ్యౌ సంగ్రామం తము వేక్షితుం
విమానే కల్పితే కాంతే రుద్ధే రురుహతుః స్థిరే. 2

వసిష్ఠుడు:— పిదప, ఆ యువతులిర్వురును యుద్ధము చూచెడికోర్కెతో, తమ సత్య సంకల్పమువలన నిర్మింపబడిన, విమానములను అధిరోహించి, వాటిని కదలకుండునట్లొనర్చిరి.

తస్మిన్నంతరే తత్ర లీలేశః ప్రతిపక్షతః
తముల్లోధమునక్తః సన్ సుఖవ్యతికరే రణే. 3



ప్రలయార్ణవకల్లోల ఇవోత్పత్త్యోద్భయే భటే
జవహా సానావివ శిలాం భటస్యోరసి ముద్గరమ్. 4

అప్పుడు శత్రుపక్షసైన్యములరుదెంచి నిర్భయచిత్తమున గొట్టనారంభింప, లీలాపతి సహింపజాలక, పర్వతసానువును రాళ్లతోగొట్టునట్లు, వారివక్షములను ముద్గరములతోగొట్టసాగెను

అథ ప్రవృత్తః ప్రసభం ప్రలయార్ణవరంహసా
సేనయోః శస్త్రసంపాతః కిరన్ననలవిద్యుతః 5

అనంతరము ఇరువాగులవారును, ప్రళయార్ణవములవలె, ఢీకొని, బాణముల విడుచుకొన ప్రారంభించిరి. మెఱపులవలె వెలుగు కత్తులనుండి నిప్పురవ్వలు వెలువడసాగెను.

తరత్తరలధారాగ్ర రేఖాంకితనభస్థలః
ధ్వనత్కణకణాశబ్ద మధ్యలక్షితటాంకృతిః. 6
ధీరహుంకారమిశ్రోష్మ ఘుర్ఘురారవఘుస్మరః
ప్రవృత్తశరధారాగ్ర భాస్కరార్చిర్వితానకః. 7
నదత్కంకటటంకార ప్రోడ్డీనకణపావకః
పరస్పరాహతిచ్ఛిన్న హేతిఖండఖగాంబరః. 8
వీరదోర్ద్రుమసంచార వహద్వననభస్థలః
కోదండచక్రక్రేంకార ద్రవద్వ్యోమానికాంగనః. 9
మహాహలహలారావ భృంగీకృతఘనధ్వనిః
నిర్వికల్పసమాధిస్థ ఇవైకఘనతావశాత్. 10

ఆకాశము శస్త్రసమూహముల పడుటవలన రేఖాంకితమైనట్లుండెను. ధనుష్టంకారములు, శరముల "కణకణ" శబ్దములు విననగుచుండెను. కొన్నితావుల వీరుల హుంకారధ్వనియు "ఘుర్ఘుర" ధ్వనియు లేచుచుండెను. విడువబడిన బాణపుకొనల ప్రతిఫలించిన సూర్యకిరణములు వితానములవలె నగుపడుచుండెను. యోధుల కవచములనుండి టంకార ధ్వనియు, అగ్నిస్ఫులింగములును లేచుచుండెను. పైకిలేచుచున్న కత్తులు పక్షులవలె గన్పడుచుండెను; అవి పరస్పరము ఢీకొని ముక్కలగుచుండెను. వీరుల బాహువృక్షములు చలించుచుండుటవలన ఆకాశము అరణ్యమువలె నగుపడుచుండెను. బాణక్రేంకృతికి భయపడి విమానములనున్న స్త్రీలు అరచుచుండిరి. నాల్గుదిక్కుల లేచు కోలాహలమున, మేఘధ్వని తుమ్మెదల రొదవలె నుండెను. నిర్వికల్ప సమాధియందు ఇతరధ్వనులు వినబడనట్లు, యుద్ధధ్వనులుగాక, ఇతరధ్వనులు వినబడకుండెను.

నారాచాసారధారాగ్ర లూనశూరశిరస్కరః
పరస్పరాంససంఘట్ట రణత్కంకటసంకటః. 11
హుంకారహతహేత్యగ్ర సంఘట్టకటుటాంకృతః
తరద్ధారాతరంగాభ్ర దంతురాశేషదిఙ్ముఖః. 12
హేతిసంఘట్టవిక్షోభ ముష్టిగ్రాహ్యార్ఘుణజ్ఝణః
చిరమాస్ఫోటకాస్ఫోట లుఠచ్చటచటారవః. 13

ప్రవహాత్ ఖడ్గసీత్కార జ్వలత్కణసణధ్వనిః
సరచ్ఛరభరాధ్వాంత శరత్ఖరఖరారవః. 14
ధగద్ధగితివిచ్ఛిన్న కంఠోత్థప్రాణలోహితః
ఛిన్నబాహుశిరఃఖడ్గ ఖండనిర్వివరాంబరః 15

బాణపు దెబ్బల శూరులశిరములు ప్రక్కలు గాదొడగెను. పరస్పరభుజఘట్టనమున కవచములనుండి ధ్వనులు వెలువడుచుండెను. కత్తుల రాపిడివలన వెలువడిన కటుశబ్దములు, వీరుల హుంకారరవమున లీనమవదొడగెను. శస్త్రధారా సమూహములు లేచి, దిక్కులనన్నిటి మేఘముల వలె, అలముకొనసాగెను. కత్తుల రాపిడికి "ఝుణఝుణ" ధ్వని లేచుచుండెను. వీరుల బాహుస్ఫాలనమున 'చటచట' ధ్వనియగుచుండెను. ఒరలనుండి త్వరగా వెలువరించు కత్తులనుండి 'సణసణ' ధ్వనులు వచ్చుచుండెను. ధనుస్సులనుండి బయటపడు బాణములు 'ఖరఖర' ధ్వని నొనర్చుచుండెను. కంఠములు తెగినవారి ప్రాణములు పోవుచుండ, రక్తము 'ధగధగ' ధ్వనితో వెలువడుచుండెను. ఆ హతుల అవయవములతోడను, అస్త్రములతోడను, ఆకాశము నిరవకాశమయ్యెను.

కంకటోత్థస్ఫురద్వహ్ని సటాస్పృష్టశిరోరుహాః
రణత్పతదసిప్రాగ మత్తపీనఝణజ్ఝణః. 16
కుంతకుంతితమాతంగ తరంగోత్తుంగలోహితః
దంతిదంతవినిష్పేష తారచీత్కారకర్కశః. 17
మహాముసలసంపాత పిష్టకష్టోద్ధురస్వరః
తరచ్ఛారశిరఃపద్మ ప్రకారాచ్ఛాదితాంబరః. 18
వ్యోమన్యస్తభుజాహీంద్రః పూర్ణధూళిమయాంబుదః
ఛిన్నహేతినరారబ్ధ కేశాకేశిప్రతిక్రియః. 19
నఖానఖనికృత్తాక్షి కర్ణనాసోష్ఠకంధరః
ఛిన్నాయుధమహామల్ల హేలోల్లాలనలబ్ధభూః. 20

వీరుల కవచములు రాచుకొన నిప్పురవ్వలులేచి, శిరోరుహముల నంటుకొనసాగెను. కత్తులు పడ 'ఝుణఝుణ' శబ్దము గాదొడగెను. కుంతాస్త్రముల గొట్టబడిన ఏనుగుల శరీరములనుండి, రక్తము తరంగములవలె పొర్లసాగెను. కొందఱు, ఏనుగుల దంతముల నలుగగొట్టబడి పెద్దగ నరచుచుండిరి. ముసలాయుధమున పిండిచేయబడినవారు దీనముగా ఎలుగిడుచుండిరి. వీరుల శిరఃపద్మములు తెగి, ఆకసము నుప్పుచుండెను. తెగిన చేతులు ఆకసమున పాములవలె నగుపడుచుండెను. మేఘములు దుమ్ముతో కప్పబడెను. ఆయుధములు పోగొట్టుకొనినవారు 'జుట్టు జుట్టు' పట్టుకొని పోరాడసాగిరి. ఇంకొకచోట కొందఱు గోళ్లతో గ్రుచ్చుకొని అవయవములను పీకుకొనసాగిరి. ఇంకొకతావున మల్లురు కేకలిడుచు, బాహుయుద్ధమొనర్చి గెల్చుచుండిరి.

పలిత్సమదమాతంగ కంపితోర్వీలుఠద్రయః
[illegible] ద కేసరిణః. 21



రజోరచితనీహారః కచత్రప్రవహాదాయుధః
ఏకీకృతఘనక్షోభ సైన్యసాగరగర్జితః. 22
మత్తహాసవిలాసేన మృత్యునా పరిచర్చితః
గర్వితాద్రీంద్రనాగేంద్ర ఖర్వితాంభోదగర్జితః. 23
వృతశ్వభ్రతటీచ్ఛన్న చక్రశక్త్యృష్టిముద్గరః
శరోర్ణాతంతునీరంధ్ర ధృష్టయోధాద్రిమేఖలః. 24
మేఘవిశ్రాంతవిచ్ఛిన్న పతాకాపటచామరః
యంత్రపాషాణచక్రౌఘ దూరవిద్రుతఖేచరః. 25

మత్తగజములు దెబ్బదిని పడినప్పుడు, దుర్బలులగువారు వణకి, కూలసాగిరి. రథచక్రమార్గముల రక్తము ప్రవహింపసాగెను. దుమ్ములేచి, ఆకసమున పొగమంచువలె కప్పడుచుండెను. ఆయుధములు విప్పారి వెలుగుచుండెను. మేఘధ్వనులు సైన్యధ్వనులతో నేకమైపోవుచుండెను. మృత్యువు వికటహాస్య మొనర్చి, జీవులను నములుచున్నట్లుండెను. పెద్దకొండలవలెనున్న ఏనుగులు ఘీంకరించుచు మేఘధ్వనుల గర్వమును హరించుచుండెను. చక్రాద్యాయుధములతో చోటంతయు నిండిపోయెను. యోధులవలెనున్న పర్వతముచుట్టు, బాణములను సాలెగూడు అల్లుకొనిపోయెను. పైకి లెగురవైచిన పతాకాదులు మేఘములవలన జింపబడుచుండెను. క్షేపణీయంత్ర నిర్ముక్తము లగు శిలాచక్రముల తాకిడి కాగజాలక, పక్షులు పారిపోవుచుండెను.

మరణవ్యగ్రకృత్తాంగ యోధాక్రందాతిఘుర్ఘరః
కుఠారఘాతసంఘాత విదలన్మస్తకవ్రజః. 26
దూరోడ్డీనకచత్ఖడ్గ ఖండతారకితాంబరః
శక్తినిర్ముక్తశక్త్యౌఘ విభిన్నేభావృతావనిః. 27
సైన్యవ్యాకులవేతాల లలనోన్ముక్తముద్గరః
గగనోత్తంభితోత్తుంగ శూరతోమరతోరణః. 28
భుశుండీభగ్నఖడ్గౌఘ ఖండాలీవ్యోమకుంతలః
కుంతవేణువనన్యస్త తాపాంబరకచచ్ఛవిః. 29
ఖడ్గర్ష్టి వృష్టిసంపుష్ట రాజపూజితసైనికః
శూలోత్తంభితసచ్ఛూర గ్రహణోద్యమితాప్సరాః. 30

ఛిన్నాంగులగు భటులు మృత్యుభయమున రోదించుచుండిరి. గొడ్డలిదెబ్బలకు సైనికుల తలలెగిరిపోవుచుండెను. కత్తులను పైకెత్తి చాలసేపు వుంచుటవలన, ఆకసమున చుక్కలు లేచినట్లుండెను. బలముతో శక్త్యాద్యాయుధములవిసర, వాటివ్రేటునబడిన ఏనుగులతో భూమి నిండిపోయెను. వేతాళస్త్రీలు సైనికులపై ముద్గరములను విసరసాగిరి. పైకిలేచిన తోమరాస్త్రములు తోరణమువలెనుండెను. భుశుండాస్త్రమున ఎగిరినకత్తులు కేశములవలె దోచుచుండెను. కుంతాస్త్రములకాంతి దావానలదగ్ధమగు వేణువనమువలెనుండెను. రాజులు తమ సైనికుల పరాక్రమమును, నేర్పును, మెచ్చి సన్మానించుచుండిరి. శూలముల మడిసినవారిని పైకొన, అప్సరసలు ప్రయత్నించుచుండిరి.

గదాతుషారవిగల స్ఫురితాంగదదిఙ్ముఖః
ప్రాసప్రసభసంపిష్ట కష్టచేష్టతమోత్కటః. 31
చక్రక్రకచసంచార చ్ఛిన్నాశ్వనరవారణః
పరశువ్రాతసంపాత పతత్సమదవారణః. 32
లకుటోల్లోడనోడ్డీన ప్రోడ్డామరచటద్భటః
యంత్రపాషాణసంపాత పిష్టకేతురథద్రుమః. 33
శరవాలవిలూనాగ్ర చ్ఛత్రపంకజపాండురః
క్షేపణక్షోభసంక్షీణ సైన్యక్షోభోఽప్యలక్షణః. 34
కబంధబంధసంనేత్ర పాతసంపిష్టపార్శ్వగః
సాంకుశాంకితసంక్షుబ్ధ వీరవారితవారణః. 35

గదయనుమంచున కేయూరధారులగు భటులముఖపద్మములు వాడిపోవుచుండెను. ప్రాసమర్దితులగు సైనికులు మూర్ఛపోవుచుండిరి. చక్రక్రకచాఘాతముల సైనికులు, అశ్వములు, గజములు ముక్కలు చెక్కలగుచుండెను. పరశుధారల మదపుటేనుగులు ఒరగుచుండెను. ప్రబలపరాక్రమమున దండహస్తులగు సైనికులు దుముకుచుండిరి. క్షేపణీయంత్రము కత్తిలల రథ పతాకావృక్షములు నలిగిపోసాగెను. యోధుల శిరములనున్న పద్మములు, ఛత్రములు కత్తికొనల ద్రుంపబడుచుండెను. పడి, మరణించుచున్న వారిని కౌగిలించుకొనబోవుటవలన మరికొందరు నలుగద్రొక్కబడుచుండిరి. ఏనుగులు అంకుశాఘాతములకు దడసి పారిపోవుచుండ వీరులు వారించుచుండిరి.

పరశువ్రాతసంపాత పతత్సమదవారణః
పాశాపాశివిశేషజ్ఞ వీరాతిపరిదేవనః. 36
క్షురికాకుక్షినిర్భేద గలత్పద్మపతజ్జనః
త్రిశూలవలనోన్మత్త శూరసంకరనర్తతః. 37
ధావద్ధానుష్కసంపూర్ణ కులకూజితకాకలిః
భిండిపాలసటాటోప హుంకారారభటీనటః. 38
వజ్రముష్టివినిష్పిష్ట పిష్టసద్భటసంకటః
శ్యేనవద్వ్యోమపదవీం ప్రోత్పతత్పటుపట్టిశః. 39
అంకుశాకృష్టశూరేశ రథేభహయకేతనః
హాలాహలిహతాలూన హేలాకులకులాచలః. 40

పరశుధారలకు మదగజములు పడుచుండెను. పాశాస్త్రమును గైకొని, తమ నాయకుడు మరణించిన దుఃఖమున, గొందరు పోరుచుండిరి. కొందరు క్షురికాస్త్రమున జీల్చబడి, మరణించుచుండిరి. త్రిశూలమును గైకొని కొందరు శంకరునివలె, నర్తింపసాగిరి. కొందరు ధనుస్సుల ధరించి కాకలీధ్వని నొనర్చుచు, పరుగిడుచుండిరి. కొందరు చేతులతో కేసరములను గదల్చుచు హుంకరించుచు, నృసింహవేషధారులవలె కన్పడసాగిరి. కొందరు మల్లుర పిడిగ్రుద్దులకు నలిగిపోవుచుండిరి. పట్టికాస్త్రములు ఆకాశమున డేగలవలె యెగురసాగెను. కొన్నిచోట్ల, అంకుశాహతులై వీరులు, రథములు, ఏనుగులు, ఛిన్నములగుచుండెను. కులపర్వతములవలెనున్న వారలు హాలాయుధముల గొట్టబడుచుండిరి.



సుతాలోత్తాలకుద్దాల నిఖాతవనభూతలః
ధనుర్ద్విగుణమాత్రాన్త లూనలోకశిలావనిః. 41
క్రకచోభయపార్శ్వేభ చ్ఛిన్నమత్తమతంగజః
సంగ్రామోలూఖలక్షుణ్ణ లోకతండులమానలీ. 42
అస్త్రౌఘశృంఖలాజాల బద్ధసేనావిహంగమః
లోలాసివీరనిస్త్రింశ నీతవాదిగృహాంగణః. 43
గణశో నీయమానాగ్ర్య శ్వాపదారావనిర్భరః
నఖాంగుష్ఠఖనత్పుంఖ ప్రేంఖారణరణారవైః. 44
మరిచైర్వ్యంజనానీవ రంజయన్సకలారవాన్
సైన్యనిక్షిప్తకుంభాగ్ని మృతయోధేరితాయుధః. 45
సైన్యనిక్షిప్తకుంభాగ్ని దగ్ధయోధోజ్ఝితాయుధః
సైన్యనిక్షిప్తకుంభస్థ తప్తాంగారహతేక్షణః
సైన్యనిక్షిప్తకుంభస్థ విషవారిదలజ్జనః. 46

కొందరు రణభూమిని త్రవ్వి, చదును చేయసాగిరి; వారు తోళ్లవలె పొడుగుగనుండిరి. కొందరు, యుద్ధభూమిని విశాలమొనర్చు, జనులను, శిలలను దొలగించుచునుండిరి. క్రకచాస్త్రమున మదపుటేనుగులు ముక్కలగుచుండెను. యుద్ధమను రోటియందుబడి, యోధులను తండులములు పిండి కాదొడగెను. అస్త్రములను వలలో వీరులను పక్షులుబడి, కత్తుల కెరలై, యముని ఇంటికరుగుచుండిరి. అటునట బడియున్న శవములను వ్యాఘ్రాది క్రూరజంతువులు కొనిపోసాగెను. అర్ధమృతులు మూల్గుచుండిరి. గోటితో సంధించి విడచిన బాణధ్వని మిరియపు పొడికలసిన కూరవలె, చక్కగనుండెను. కుంభాగ్ని దగ్ధులై, మరణింపబోవువారు ఆయుధములను విడచుచుండిరి. కుంభాగ్నిదగ్ధులగువారు ఆయుధములను దూరవేయుచుండిరి. కుంభాగ్నివలన కొందరి అవయవములు దహింపబడి, కళ్లు పోవుచుండెను. కొందరు సైనికులు కుండలలో విషపునీటిని బోయుచుండిరి.

నారాచవర్ష వరవారిదవీరపూర మత్తాభ్రసంభ్రమసన్నృత్తకబంధబర్హీ
కల్పాంతకాలఇవవేగవివర్తమాన మాతంగశైలవలితో రణసంభ్రమోఽభూత్. 47

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
సేనయోః ప్రథమపాతవర్ణనంనామ త్రయస్త్రింశత్తమః సర్గః ॥ 33 ॥

ఆ రణరంగమున, వీరులను మేఘములనుండి బాణములను వర్షము గురియుచుండ, మొండెములను నెమళ్లు నర్తించుచుండెను; మఱియు కొండలబోలు ఏనుగులు సంచరించుచుండెను. అందువలన నప్పుడు ప్రళయము దాపురించినట్లుండెను.

ఇది శ్రీవాసిష్ఠతాత్పర్యప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
లీలోపాఖ్యానమున సేనలప్రథమపాతవర్ణనమను త్రయస్త్రింశ సర్గము ॥ 33 ॥

—:0:—

# చతుస్త్రింశః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అథరాజ్ఞాం యుయుత్సూనాం భటానాం మంత్రిణామపి
నభసః ప్రేక్షకాణాంచ తత్రేమాః ప్రోదగుర్గిరః. 1

వసిష్ఠుడు:–అనంతరము యుద్ధమొనర్చుచున్న రాజులును, భటులును, మంత్రులును, ఆకాశమండలముననున్న ప్రేక్షకులును ఇట్లు పల్క దొడగిరి.

చలత్పద్మంసరఇవ వహద్విహగమేవచ
నభః శూరశిరః కీర్ణం భాతితారకితాకృతి. 2

శూరుల ఖండితమస్తకములతోనిండి, ఆకాశము కదలుచున్న పద్మములతోడను, ఎగురుచున్న హంసలతోడను బూర్ణమైన సరోవరమువలె గనంబడుచున్నది. మఱియు, నక్షత్రము లుదయించినట్లు గూడ దోచుచున్నది.

పశ్యరక్తపృషత్పూర సిందూరారుణమారుతైః
సాంధ్యాఇవవిభాంత్యేతే మధ్యాహ్నేఽంబుదమానవః. 3

చూడుడు! వీచుచున్న గాలి, సిందూరమువలె, రక్తబిందు సంయోగమున నెఱ్ఱబడ, మధ్యాహ్న సూర్యకిరణములును, మేఘములును, సంధ్యాసమయమున నుండునట్లు ప్రకాశించుచున్నవి.

కిమిదంభగవన్వ్యోమ పలాలభరితంస్థితమ్
నేదంపలాలంవీరాణా మేతేశరశరాంబుదాః. 4

(ఒకానొకడు గౌరవనీయుడగువానిని ప్రశ్నించుచున్నాడు) భగవానుడా! ఇదేమి? హఠాత్తుగా ఆకాశము పలాలమయము (తృణపుంజమయము) అయినదేమి? (అతడు ప్రత్యుత్తరించుచున్నాడు.) ఇవిపలాలములుగావు; వీరులు ప్రయోగించుచున్న బాణములు.

యావంతో భువిసిచ్యంతే రుధిరై రణరేణవః
తావంత్యబ్దసహస్రాణి భటానామాస్పదందివి. 5

ఈ యుద్ధభూమియందున్న ధూళికణములెన్ని రక్తమున దడిసినవో, అన్నివేల యేండ్లు, యుద్ధహతులగు వీరులు స్వర్గమున నుందురు.

మాభైష్టనైతే నిస్త్రింశా నీలోత్పలదలత్విషః
అమీ వీరావలోకిన్యా లక్ష్మ్యానయనవిభ్రమాః. 6

వీరులారా! భయపడకుడు, నీలోత్పలదళకాంతితోగూడి అగుపడుచున్న ఈ నిస్త్రింశము నిస్త్రింశముగాదు. ఇయ్యది జయలక్ష్మి (లేక స్వర్గలక్ష్మి) యొక్క నయన విభ్రమము.

వీరాలింగనలోలానాం నితంబే సురయోషితాం
మేఖలాః శిథిలీకర్తుం ప్రవృత్తః కుసుమాయుధః. 7

(నభశ్చరులు బల్కుచున్నారు) వీరులారా! మిమ్ముల గౌగలించుకొన నుత్సాహపడు దేవతాస్త్రీల పిరుదులనున్న మొలనూలును మన్మథుడు వదులుచేయుచున్నాడు.



లసద్భుజలతాలోలా రక్తపల్లవపాణయః
మంజరీమత్తనయనా మధ్వామోదసుగంధయః. 8
గాయంత్యోమధురాలాపై ర్నందనోద్యానదేవతాః
తవాగమనమాశంక్య ప్రవృత్తాః పరినర్తితుమ్. 9

(ఒకానొకయోధుడు మరియొకనితో బల్కుచున్నాడు) విలోలభుజలతాశాలురును, రక్తపల్లవములను నగుదేవతలు మధురగంధముతో శోభిల్లు నందనవనమున నీ రాక నపేక్షించుచు, మంజరీమత్తనయనముల జూచుచు, మధురముగ బాడుచు, నృత్యమొనర్పబోవుచున్నారు.

ప్రత్యనీకం భినత్త్యంతః కుఠారైః కఠినైరియమ్
సేనాగ్రామ్యేవ వనితా దయితం దృష్టిచేష్టితైః. 10

యువతి ప్రియుని జూపులచే బడవేయునట్లు, ఈ సేనాధ్యక్షుడు ప్రతిపక్షులను కఠిన కుఠార ధారల బడగొట్టుచున్నాడు.

హా పితుర్మమభల్లేన శిరోజ్వలితకుండలమ్
సూర్యస్యనికటంనీతం కాలేనేవాష్టమోగ్రహః. 11

(మఱియొకడు బల్కుచున్నాడు) గ్రహణసమయమున రాహువును సూర్యునికడకు గొనిపోవునట్లు ఉజ్జ్వలకుండలములతో గూడిన నాతండ్రి శిరస్సును భల్లాస్త్రము సూర్యునికడకు గొనిపోవుచున్నది.

ఆపాదశృంఖలాప్రోత భ్రమత్స్థూలోపలద్వయమ్
భ్రమయంశ్చిత్రదండాఖ్యం చక్రమూర్ధ్వభుజోజవాత్. 12
యోధో యమఇవాభాతి యామ్యాదాయాతిదిక్తటాత్
సర్వతః సంహరన్సేనామేహి యామోయథాగతం. 13

(ఇంకొక డనుచున్నాడు) వీరుడొకడు చేతులను పైకెత్తి పాదములపరకు వ్రేలుగొలుసున పెద్దరాళ్లను గట్టుకొని, చిత్రదండమను చక్రమును ద్రిప్పుచు దక్షిణదిక్కునుండి, యమునివలె, వేగముగా వచ్చుచు, సైన్యమును సంహరించుచున్నాడు. చూడుము. రమ్ము! రమ్ము! మనము వచ్చిన త్రోవనే మరలుదము!

సద్యశ్ఛిన్నశిరః శ్వభ్ర మజ్జత్కంకకులాకులాః
కబంధాః పరినృత్యంతి తాలోత్తాలా రణాంగణే. 14

రణరంగమున తాటిచెట్లవలె పొడుగగు మొండెములు, యుద్ధతాళముల ననుసరించుచు నాట్యమాడుచున్నవి. వారి కంఠచ్ఛిద్రముల కంకపక్షులు రక్తమును ద్రావ, వ్రాలుచున్నవి.

గీర్వాణగణగోష్ఠీషు ప్రవృత్తాః సంకథామిథః
కదా లోకాంతరం ధీరాః కథంయాస్యంతి కే కుతః. 15

ఏయే వీరు డెప్పుడు ఏ ఏ లోకమున కేట్లరుగును? అని దేవతలు సభగూడి పరస్పరము ప్రశ్నించుకొను చుండిరి.

నిగిరత్యాగతాః సేనాః స్రవంతీరివసాగరః
సమత్స్యమకరవ్యూహా అహోనువిషమోభటః. 16

అహో! మత్స్య, మకరవ్యూహములబన్ని, నదివలె అరుదెంచు ఈ సేనను హఠాత్తుగా వీరు డొకడరుదెంచి, సముద్రునివలె, మ్రింగుచున్నాడు.

కటేషుకరిణాంకీర్ణా ధారానారాచరాజయః
పతితాఇవసంపూర్ణాః శృంగసంఘేషువృష్టయః. 17

ఏనుగుల గండస్థలములబడు బాణధారలు, పర్వతశృంగమున గురియు వర్షధారలవలె, దోచుచున్నవి.

హాకుంతేనశిరోనీతం మమేత్యేవం వివక్షతః
శిరసాఽజీవమిత్యేవం ఖేఖగేనేవ వాశితమ్. 18

'కుంతాస్త్రము నామస్తకమును గొనిపోవుచున్నది. కాని, అయ్యది స్వర్గోత్సవమును దర్శింప జీవించియే యున్నది' అని భటుడొకడు పక్షివలె సెలుగిడుచుండెను.

యంత్రపాషాణవర్షేణ యైషాస్మాన్పరిషించతి
సేనానుశృంఖలాజాల వలనాక్రియతాం బలాత్. 19

'యంత్రములనుండి రాళ్లవానను గురిపించుచున్న ఈ సైన్యమును గొలుసులతో బలవంతముగ బంధింపుడు అని సైనికుడొకడు పల్కెను.

వలీవలితనిర్ముక్తం పూర్వభార్యాప్సరాఃసతీ
అంగీకరోతిభర్తారం పరిజ్ఞాయ రణేహతమ్. 20

యుద్ధభూమి కరిగిన భర్తమరణింపకమున్నే ప్రాణములను వదలి, స్వర్గమున కతిగి, అప్సరసయై ఆతని కొరకు వేచియున్నసతి, అతడు రణరంగమున మడసి స్వర్గమునకు రాగా, అతనిని గుర్తించి, గ్రహించుచున్నది.

ఆదివం రచితాకారాః కుంతకాననకాంతయః
వీరాణాంస్వర్గమారోఢు మివ సోపానపంక్తయః. 21

కుంతాస్త్రములు లేచి ఆకాశమువరకు వ్యాపించి, వీరులు స్వర్గమునకెక్కగ నిర్మించిన సోపానపంక్తులవలె నగుపడుచున్నవి.

కాంతకాంచనకాంతాంగే భటస్యోరసికామినీ
దృష్ట్వాదేవపురంధ్రీయం భర్తురన్వేషణాన్వితా. 22

స్వర్ణ విభూషితాంగుడును, యుద్ధమృతుడునునగు భర్తయొక్క వక్షస్థలమున మరణించిన ఈ యువతి, స్వర్గమున దేవతాస్త్రీయైన భర్తను వెదకుకొనుచున్నది.

హాహాతంసైన్యమస్మాకం భటైరుద్ధతముష్టిభిః
మహాప్రలయకల్లోలైః సురశైలస్థలంయథా. 23



ఆహా! ప్రళయసముద్ర తరంగములు మేరుపర్వత శిఖరములను గొట్టునట్లు, శత్రువీరులు మన సైన్యములను పిడిగ్రుద్దుల మర్దించుచున్నారు.

యుధ్యధ్వమగ్రతోమూఢా నయుతార్థమృతాన్నరాన్
నిజాన్పాదప్రహారేణ మైతాన్ దారయతాధమాః. 24

మూఢులారా! ముందునకరిగి యుద్ధమొనర్పుడు! అర్ధమృతులను దొలగింపుడు. అధములారా! ఇదేమి? మీవారినే పాదములతో ద్రొక్కుచున్నారు.

ధమ్మిల్లవలనావ్యగ్రే ఘనోత్కంఠేఽప్సరోగణే
భటోదివ్యశరీరేణ పార్శ్వప్రాప్తోసరీత్యతామ్. 25

చూడుడు! భటులు దివ్యశరీరములను బరిగ్రహించి, జుట్టుముడివేసుకొన తొందరపడుచున్న అప్సరస ప్రక్కన నిలంబడుచున్నారు.

ఫుల్లహేమారవిందాసు ఛాయాశీతజలానిలైః
స్వర్గనద్యాస్తటీష్వేనం దూరాయాతంవినోదయ. 26

చాలాదూరమునుండి అరుదెంచిన ఈ వీరుని, వికసిత స్వర్ణపద్మములతోడను ఛాయతోడను గూడిన గంగాతీరమునకు గొనిపోయి, నీటిచినజల్లి, విసిరి, శ్రమను బోగొట్టుము' అని అప్సరసలు ఒండొరులతో బల్కుకొన జొచ్చిరి.

వివిధాయుధసంఘట్ట ఖండితోగ్రాస్థికోటయః
ఖే కవంత్యఃకణత్కారైః ప్రసృతాస్తారకాఇవ. 27

నానావిధాస్త్రముల నలుగగొట్టబడిన, అస్థిసమూహములు ఆకాశమండలమునకులేచి, కణత్, కణత్ ధ్వని నొనరించుచు తారకలవలె, ప్రకాశించుచున్నవి.

వ్యోమ్నిజీవనదీవాహే వహత్సాయకవారిణి
చక్రవర్తిని గచ్ఛంతి గిరయోఽవ్యాణుపంకతామ్. 28

బాణములను జలములతోడను, చక్రములను సుడిగుండములతోడను ఆకాశమున ప్రవహించు ఈ జీవనదియందు పర్వతములబడిన దుమ్మైన, బురదగామారునా యనిపించుచున్నది.

భ్రమద్భిర్గ్రహమార్గేషు శిరోభిర్వీరభూభృతామ్
ఆయుధాంశులతానాల లగ్నాసిదలకంటకైః. 29
కేతుపట్టమృణాలాంగ దలైర్లబ్ధశిలీముఖైః
వహద్వాతచలత్పద్మం నభఃపద్మసరఃకృతమ్. 30

గ్రహమార్గమున రాజుల ఛిన్నమస్తకములు పద్మములవలె తిరుగుచుండుటవలన, ఆకాశము సరోవరమువలె నగుపించుచున్నది; ఆయుధకిరణములను నాళముల ఖడ్గదళములను కంటకములు దగిలియున్నవి. పతాకలు మృణాళములవలె నున్నవి. శిలీముఖములను (బాణములను) భ్రమరములట దిరుగుచున్నవి.

మృతమాతంగసంఘాతే గిరావివ పిపీలికాః
భీరవః పరిహీయంతే స్త్రియః పుంవత్ససేవచ. 31

పర్వతమున చీమయు ప్రియునివక్షఃస్థలమున యువతియు లీనమైయుండునట్లు, పిరికివారు ఘూర్ణించిన ఏనుగుల నడుమ దాగుకొనియున్నారు.

అపూర్వోత్తమసౌందర్యకాంతసంగమశంసినః
వాంతివిద్యాధరస్త్రీణామలకోల్లాసినోఽనిలాః. 32

అపూర్వోత్తమ సౌందర్యవంతులగు ప్రియులతో విద్యాధర రమణులకు గూడిక కలుగునని దెల్పునట్లు శుభసూచకముగ గాలివీచుచున్నది.

ఛత్రేషూడ్డీయమానేషు స్థితేషు వ్యోమ్ని చంద్రతా
ఇందునేవ యశోమూర్త్యా కృతాన్యభ్రాతపత్రతా. 33

ఆకాశము శ్వేతచ్ఛత్రములతో నిండి చంద్రమయమైనదా యనిపించుచుండెను; వీరుల కీర్తిచంద్రికలే ఇట్లువ్యాపించినవా? యని మఱికొందర నుకొనుచుండిరి.

భటో మరణమూర్ఛాంతే నిమేషేణామరం వపుః
స్వకర్మశిల్పిరచితం ప్రాప్తః స్వప్నపురం యథా. 34

ఆహతులగు భటులు, యుద్ధమూర్ఛనుండి తేరుకొనినవెంటనే, స్వకర్మలను శిల్పినిర్మించిన అమరదేహమును నిముసములో స్వప్నపురివలె బొందుచుండిరి.

శూలశక్త్యృష్టిచక్రాణాం వృష్టయో ముక్తతుష్టయః
వ్యోమాబ్ధౌ మత్స్యమకర సంకులావయవాఃస్థితాః. 35

ఆకాశసాగరమున శూలాద్యాయుధ వర్షము గుఱియ, నయ్యది 'మత్స్యమకర సంకులమై, విసుగునందినట్లు చలించుచున్నది.

శరోత్కృత్తసితచ్ఛత్ర కలహంసైర్నభఃస్థలమ్
భాతిసంచితపూర్ణేందు బింబలక్షైరివావృతమ్. 36

బాణముల ఖండింపబడిన శ్వేతచ్ఛత్రములు హంసలవలె నాకాశమున కెగయ, ఆకాశమండలమున పూర్ణచంద్ర బింబములనేకము లుదయించునట్లగపడుచుండెను.

క్రియతే గగనోడ్డీనైశ్చామరైశ్చారుఘర్ఘరైః
వాతావధూతసంరోధ తరంగనికరద్యుతిః. 37

ఆకాశమున లేచిన చామరసమూహములు గాలివలన కదల్పబడిన తరంగముల సొంపును గూర్చుకొనుచుండెను.

దృశ్యంతే హేతిదలితాశ్ఛత్ర చామరకేతవః
ఆకాశక్షేత్రవిక్షిప్తా యశఃశాలిలతా ఇవ. 38

కత్తులచే దునుమబడిన ఛత్రచామర, పతాకాసమూహములు ఆకాశమను క్షేత్రము (=పొలము)న కెగిరి, అందు పాతబడిన యశోరూప శాలిలతలవలె నగుపడుచున్నవి.

వహద్భిర్వ్యోమ్ని నక్షేమ పశ్యసీతాక్షయం శరైః
శక్తివృష్టిరుపాయాంతీ సస్యశ్రీః శలభైరివ. 39



చూడుడు! ధాన్యశోభను మిడుతలు బాడుచేయునట్లు, అస్త్రవర్షము శక్తి-ఆయుధములను బాడుచేయుచున్నవి.

ఏషా ప్రసృతదోర్దండ భటఖడ్గచ్ఛటాకృతిః
కఠినాత్కంకటాజ్జాతా మృత్యోరేవోగ్రహుంకృతిః. 40

ఈ యోధుడు చేతినిజాపి విపక్షవీరుని కవచముపైగొట్ట వెలువడిన ఛటాత్కారము, మృత్యుహుంకారధ్వనివలె, నున్నది.

హేతికల్పానిలక్షుణ్ణా దంతనిర్ఝరవారయః
జనతాక్షయకాలేఽస్మిన్ భగ్నా నాగా నగా ఇవ. 41

ఈ జనప్రళయ సమయమున ఖడ్గాద్యస్త్రధారలను వాయువువలన ఏనుగులను పర్వతములు గొట్టబడి, దంతములను సెలయేళ్లను బ్రవహింపజేయుచు, భగ్నములగుచున్నది.

సచక్రనాథసూతాశ్వం వ్యూఢం రక్తమహాహ్రదే
హాహాభిభూతగతికం చేష్టతే రథపత్తనమ్. 42

ఆహా! రథికుడును, సారథియు, అశ్వమును, చక్రములును రక్తహ్రదమున మునిగి, కదలలేక తన్నుకొనుచున్నారు.

కరకంకటకుట్యంక ఖడ్గసంఘట్టటాంకృతైః
కాలరాత్ర్యా ప్రనృత్యంత్యా రణవీణేవ వాద్యతే. 43

ఖడ్గఘాతమున వీరుల కర, కవచములనుండి వెలువడు టంకారధ్వని, కాలరాత్రి నృత్యమొనర్చుచు, మీటుచున్న రణవీణాధ్వనివలె నున్నది.

నరేభఖరవాజిభ్యో యే చ్యుతా రక్తనిర్ఝరాః
పశ్య తద్బిందుసిక్తేన వాయునారుణితా దిశః. 44

చూడుడు! నిహతులగు నరులనుండియు, అశ్వములనుండియు, గజములనుండియు రక్తము ప్రవహించుచున్నది. వాయువా రక్తబిందువులతడిసి, వీచుచుండుటవలన దిక్కులు లోహిత వర్ణమును దాల్చినవి.

శస్త్రాంశుజలదే వ్యోమ్ని కాలీచికురమేచకే
శరకోరకభారస్రజ్మేఘే విద్యుదివోదితా. 45

అస్త్రసమూహ కిరణములవలన నాకాశమున మేఘములు క్రమ్ముకొనినట్లును, కాళికాదేవి కబరీబరమువలెను, నల్లబడినది. ఇట్టి ఆకాశమున మొగ్గలబోలు బాణములు పుష్పమాలలవలె కదలుచు మెఱపులు మెఱయుచున్నవా యనిపించుచున్నవి.

అనంతరక్తసంసక్త సన్నావనితలాయుధైః
భువనంభాత్యభిజ్వాల మగ్నిలోక ఇవాకులమ్. 46

భూమియు, బాణములను రక్తమయములగుటజేసి, జగత్తు అగ్నిమయ లోకమయినదా యనిపించుచున్నది.

భుశుండీశక్తిశూలాసి ముసలప్రాసవృష్టయః
అన్యోన్యచ్ఛేదభేదాభ్యాం కరప్రకరతోఽపతన్. 47

యోధులు హస్తములనున్న శక్త్యాద్యాయుధములు పరస్పరము ఛిన్నభిన్నమొనర్చుకొనుచు, నాలుగుదిక్కుల బడుచున్నవి.

అక్షోభైకప్రహరణా ద్యాతుధానోన్యచేష్టితమ్
సంరంభావేక్షణప్రజ్ఞం రణంస్వప్నమివస్థితమ్. 48

ఈ యుద్ధము స్వప్నయుద్ధమువలె నాకగుపడుచున్నది. స్వప్నవీరులు క్రియారహితులు, స్వప్నరణమున ఆ వీరులను, నాశనమొనర్పబోవుమాయవలె, ఈ యుద్ధముగూడ, అలీకము.

అనన్యశబ్దావిరత హతాహతిరణఝణైః
గాయతీవక్షతక్షోభ ముదితో రణభైరవః. 49

ఒకరినొకరు అనవరతము గొట్టుకొనుటవలన వెలువడు 'రణఝణ' శబ్దములు, జనసంహారమును గాంచి రణభైరవుడు సంతసించి, సల్పెడి గానమువలె నుండెను.

అన్యోన్యరణ హేత్యుగ్ర చూర్ణపూర్ణోరణార్ణవః
వాలుకామయపవాభూ శ్ఛిన్నచ్ఛత్రతరంగకః. 50

చూర్ణవిచూర్ణములైబడిన అస్త్రసమూహము లా రణసముద్రమునందలి ఇసుకవలెను, చినిగిపోయిన ఛత్రములు తరంగములవలెను గనిపించుచున్నవి.

సరభసరసవద్విసారితూర్య ప్రతిరవపూరితలోకపాలలోకః
రణగిరిరయముగ్రపక్షదక్ష ప్రతిస్మృతివృత్తఇవాంబరేయుగాంతే. 51

నాలుగుదిక్కులనుండి వెలువడు రణతూర్యనాదముల సుమధురధ్వనులు దిక్పాలకలోకములనుగూడ, నింపుచుండెను. ఆ యుద్ధమను పర్వతము ప్రతికూలముగ చలించు ఉభయపక్షసైన్యములను రెక్కలతో, ప్రళయము సమీపించుటవలన, ఆకాశమున నెగురబోవుచున్నట్లున్నది.

హాహాధిక్కృవికటకంకటానసోద్య త్రోడ్డీనప్రకటతడిచ్ఛటాప్రతప్తాః
క్రేంకారస్ఫురితగుణేరితా రణంతో నారాచాఃశిఖరిశిలాగణంవహంతి. 52

ఆహా! మా బాణములు క్రేంకారధ్వనితో ధనుస్సునుండి వెలువడియు, శత్రుకవచములను భేదింపజాలకున్నది. కవచపుదెబ్బతిని, విద్యుత్తువలె వెలువడిన నిప్పురవ్వవలన గాల్చబడి, దగ్గరనున్న కొండబాళ్లను బగులగొట్టుచున్నవి.

ఛిన్నైచ్ఛాచ్ఛమితి న యావదంగభంగం కుర్వంతోజ్వలదనలోజ్జ్వలాఃపృషత్కాః
తావద్రాగ్ద్రుతమితపహి మిత్ర యామో యామోఽయంప్రవహతివాసరశ్చతుర్థః.53

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
రణప్రేక్షకజనోక్తి వర్ణనం నామ చతుస్త్రింశః సర్గః ॥ 34 ॥



(యుద్ధమున డస్సినవాడొకడు మఱియొకనితో ననుచున్నాడు:—) మిత్రుడా! రమ్ము మండుచున్న నిప్పులవలెనున్న ఈ బాణములు మనశరీరములను భేదింపకమున్నే పారిపోదము! ఈ నాల్గవజాము యమదినమువలె నందరిని బొట్టపెట్టుకొనుచున్నది.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
లీలోపాఖ్యానమున రణప్రేక్షక జనోక్తి వర్ణనమను చతుస్త్రింశ సర్గము ॥ 34 ॥

## పంచత్రింశః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అథప్రోడ్డయనోద్యుక్త తురంగమతరంగకః
ఉత్తాండవఇవోన్మత్తో బభూవ స రణార్ణవః. 1

వసిష్ఠుడు:- ఆ సంగ్రామ-సాగరము క్రమముగా, ఉన్మత్తమును, భీషణమును నవసాగెను. అందశ్వములు తరంగములవలె సంచరింపసాగెను.

ఛత్రడిండీరవిశ్రాంత సితేషు శఫరోత్కరః
అశ్వసైన్యోల్లసల్లోల కల్లోలాకులకోటరః. 2

ఛత్రములు ఫేనమువలెను, శరములు చేపవలెను, అశ్వారోహకులు తరంగములవలెను నుండిరి.

నానాయుధనదీనీత సైన్యావర్తవివృత్తిమాన్
మత్తహస్తిఘటాపీత చలాచలకులాచలః. 3

నానావిధ ఆయుధములను నదీసమూహము లీ రణసముద్రమున బ్రవేశించి ప్రవహించుచుండెను; సైన్యములను సుడిగుండములందు తిరుగుచుండెను. మదపుటేనుగులు కులాచల పర్వతములవలె నగుపడుచుండెను.

కచచ్చక్రశతావర్త వృత్తిభ్రాంతిశిరస్తృణః
ధూళీజలధరాపీత భ్రమత్ఖడ్గప్రభాజలః. 4

చక్రములను సుడిగుండముల బారిటబడిన తలలు, గడ్డిపరకలవలె నుండెను. ధూళి పటలమును మేఘసమూహములు ఖడ్గకాంతులను నీటిని త్రావదొడగెను.

మకరవ్యూహవిస్తార భగ్నాభగ్నభటౌఘనౌ
మహాగుడుగుడావర్త ప్రతిశ్రుద్ధనకందరః. 5

మకరవ్యూహమునబడి భటులను నావలు భగ్నములును, అర్థభగ్నములును గాదొడంగెను. ఈరణసముద్రమునందలి సుడిగుండపు ధ్వనులకు, పర్వత గుహలు ప్రతిధ్వనుల నీయసాగెను.

మీనవ్యూహవినిష్క్రాంత శరబీజౌఘసర్షపః
హేతివీచీవరాలూన పతాకావీచిమండలః. 6

మీనవ్యూహమును భేదించుకొని బాణములను గ్రుడ్లు వెలువడఁదొడగెను. ఖడ్గతరంగముల బారిఁబడి, పతాకాతరంగములు విరిగిపోవుచుండెను.

శస్త్రవారికృతాంభోద సదృశావర్తకుండలః
సంరంభఘనసంచార సేనా తిమితిమింగిలః. 7

బాణప్రవాహములయందచ్చటచ్చట మేఘములవలె చంచలములగు సుడిగుండములు, కుండలములవలె. తిరుగుచుండెను. క్రోధాంధులగు సైనికులుతిమింగిలాది జలజంతువులవలె, పరిభ్రమింపసాగిరి.

కృష్ణాయసపరీధాన వలత్సేనాంబుభీషణః
కబంధావర్తలేఖాంత ర్బద్ధసైన్యాదిభూషణః 8

లోహకవచధారులగు సైనికులను నీటితోనిండి, ఆచోటు భయమును గొల్పుచుండెను. వందలకొలదిగనున్న మొండెములను గుండముల, వారి ఆభరణములు ప్రకాశించుచుండెను.

శరసీకరనీహార సాంధకారకకుబ్గణః
నిర్ఘోషాశోషితాశేష శబ్దైకఘనఘుంఘుమః. 9

బాణములను మంచువలన దిక్కులన్నిటియందు, చీకటి అలముకొనెను. ఆ రణధ్వనుల ముందర, ఇతరశబ్దములు వినరాకుండెను.

పతనోత్పతనవ్యగ్ర శిరఃశకలసీకరః
ఆవర్తచక్రవ్యూహేషు ప్రభ్రమద్భటకాష్ఠకః. 10

సైనికుల ఛిన్నమస్తకములాసముద్రమున లేచి పడుచున్న నీటితుంపురులవలె నుండెను. చక్రవ్యూహమను సుడిగుండమున భటులను కాష్ఠములు తిరుగసాగెను.

కష్టటాంకారకోదండ కుండలోన్మథనోద్భటః
అశంకమేవపాతాలా దివోద్యత్సైనికోర్మిమాన్. 11

శత్రుసైనికుని కోదండమను సర్పమును ఛేదింప, యోధులు యత్నించుచుండిరి. ఆ భటసమూహమును గాంచిన, పాతాళమునుండి సైన్యతరంగములు లేచివచ్చినవా యనిపించుచుండెను.

గమాగమపరానంత పతాకాచ్ఛత్రఫేనిలః
వహద్రక్తనదీరంహః ప్రోహ్యమానరథద్రుమః. 12

వచ్చుచు పోవుచుండెడి ఛత్రపతాకలవలన ఆరణసముద్రము ఫేనిలమాయెను. రక్తప్రవాహమున దేలుచెట్లను రథములను భటు లధిరోహించియుండిరి.

గజప్రతిమసంపన్న మహారుధిరబుద్బుదః
సైన్యప్రవాహవిచల ద్ధయహస్తిజలేచరః. 13

ఏనుగులనుండి ప్రవహించుచున్న రక్తమారణసముద్రమందలి నీటిబుడగవలె నుండెను. ఆ సైన్యప్రవాహమున ఏనుగులు, గుఱ్ఱములు జలజంతువులు తిరుగాడుచుండెను.



ససంగ్రామోఽంబరగ్రామ ఇవాశ్చర్యకరో నృణాం
అభూత్ప్రలయభూకంప కంపితాచలచంచలః. 14

ఇట్టి సంగ్రామసముద్రము చూపరులకు, గంధర్వనగరమువలె, ఆశ్చర్యమును గలిగించుచుండెను. ప్రళయకాల-భూకంపమున పర్వతము లదరునట్లు, ఆ రణ సముద్రము కంపించుచుండెను.

తరత్తరంగవిహగః పతత్కరిఘటాతటః
త్రస్తభీరుమృగానీక స్ఫూర్జద్ఘుర్ఘురఘురారవః. 15

పక్షులను తరంగములు పడుచున్న ఏనుగులను కొండకొనలనెక్కి, పిరికివారగు సైనికులను మృగముల 'ఘుర్ఘురు' శబ్దములవిని, లేచిపోదొడగెను.

సరచ్ఛరాలీశలభ శతభంగురసైనికః
తరత్తురంగశరభః శరభారవనావనిః. 16

ప్రయోగింపబడుచున్న బాణములను శలభములవలన సైనికులు విరిగిపోవుచుండిరి. తురంగములను శరభములట నీఁదులాడసాగెను. బాణధారులగు వీరులు, వనసంకులమగు భూమివలె నగుపడుచుండిరి.

చలద్ద్విరేఫనిర్హ్రాదో రసత్తూర్యగుహాగురుః
చిరాత్ససైన్యజలదో లుఠద్భటమృగాధిపః. 17

భ్రమర నినాదధ్వనుల పర్వతగుహలు ప్రతిధ్వనించుచుండెను. అచ్చట, సైనికులను మేఘములును, యోధులను సింహములును విహరించుచుండెను.

ప్రసరద్ధూలిజలదో విగలత్సైన్యసానుమాన్
పతద్రథవరాఢ్యాంగః ప్రతపత్ఖడ్గమండలః. 18

ధూళిపటలములను మేఘములు వ్యాపించుచుండెను, సైనికులను పర్వతములు బడుచుండెను, మహారథికుల అంగములు వ్రక్కలగుచుండెను. ఖడ్గసమూహములు ద్రెళ్లుచుండెను.

ప్రోత్పతత్పదపుష్పౌఘః పతాకాచ్ఛత్రవారిదః
వహద్రక్తనదీపూర పతత్సారావవారణః. 19

సైనికుల పాద—కుసుమములు రాలుచుండెను, పతాకాఛత్రములను మేఘములు లేచుచుండెను, రక్తనదీప్రవాహమున ఏనుగులు ఘీంకరించుచు బడుచుండెను.

సోఽభూత్సమరకల్పాంతో జగత్కవలనాకులః
పర్యస్తసధ్వజచ్ఛత్ర పతాకారథపత్తనః. 20

అప్పుడు యుద్ధమను ప్రళయము జగత్తును మ్రింగుచున్నట్లుండెను. ఇటనట, ధ్వజచ్ఛత్రపతాకారథములు విరిగి, పడుచుండెను.

పతద్వ్యోమలహేత్యోఘ భూరిభాస్వరభాస్కరః
కఠినప్రాణసంతాప తాపితాఖిలమానసః. 21

క్రిందబడిన అస్త్రసమూహములు నిర్మలకాంతుల వెదజల్లుచు, సూర్యునివలె, ప్రకాశింపదొడగెను. బాణపుదెబ్బలవలన బాధపడువారిని గాంచి, తదితరుల మనస్సుగూడ బాధపడుచుండెను.

కోదండపుష్కరావర్త శరధారానిరంతరః
వహత్ఖడ్గశిలాలేఖా విద్యుద్వలయితాంబరః. 22

కోదండములను పుష్కరావర్త మేఘములనుండి శరధారలను వర్షము నిరంతరము గురియుచుండెను. ఖడ్గకాంతులవలన నాకాశము మెఱపులతో నిండినట్లుండెను.

ఉచ్ఛిన్నరక్తజలధిపతితేభకులాచలః
నభోవికీర్ణనిపతచ్ఛత్త్రారకణతారకః. 23

ఆహతుల రక్తసముద్రమున గజములను కులాచలములును, రక్తపుబొట్లను నక్షత్రములును బడుచుండెను.

చక్రకుల్యాంబుదావర్త పూర్ణవ్యోమశిరాంబుదః
అస్త్రకల్పాగ్నినిర్దగ్ధ సైన్యలోకాంతరక్రమః. 24

బాణములను కల్పాంతాగ్నివలన దహింపబడి సైనికులు పరలోకమున కఱుగుచుండిరి. చక్రసమూహములను మేఘము లాకాశమున విహరింపదొడగెను

హేతివర్షాశనిచ్ఛన్న భూతలామలభూధరః
గజరాజగిరివ్రాత పాతపిష్టజనవ్రజః. 25

బాణవర్షమను వజ్రములతో భూమియు, పర్వతములును గప్పవడెను. ఏనుగులను కొండలును బడుటవలన, జనులు పిండిగాజొచ్చిరి.

శరధారాఘనానీక మేఘచ్ఛన్నమహీనభాః
మహానీకార్ణవక్షోభ సంఘట్టఘటితాద్రవః. 26

శరధారలు, సైనికులను మేఘములు భూనభోంతరముల వ్యాపించుచుండెను. సైన్యసముద్రము క్షోభిల్ల, నుపద్రవము సంభవించి నట్లుండెను.

వ్యావృత్తఉగ్రానిలోద్ధూతైర్జలవ్యాలైరివాచలః
అన్యోన్యదలనవ్యగ్రైః శస్త్రైస్త్వాతఇవోత్థితైః. 27

పరస్పరము డీకొను శస్త్రసమూహముల రణభూమి నిండుపడ, ప్రళయవాయువుచే గొట్టబడిన సముద్రసర్పములు సముద్రస్థిత పర్వతము నాశ్రయించుచున్నట్లగపడజొచ్చెను.

శూలాసిచక్రశరశక్తిగదాభుశుండీ
ప్రాసాదయో విదలనేన మిథోధ్వనంతః
దీప్తాఅధుర్దశదిశః శతశోభ్రమంతః
కల్పాంతవాత పరివృత్త పదార్థలీలామ్. 28

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
రణవర్ణనంనామ పంచత్రింశః సర్గః ॥ 35 ॥



శూలాద్యాయుధములు పరస్పరధ్వంసముగోరి, కొట్టుకొనుచు, ధ్వనులతో దశదిక్కులు పిక్కటిల్లజేయుచు, భ్రమించుచు, ప్రళయవాయువువలన లేవనెత్తబడిన పదార్థముల శోభనుదాల్చెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తి ప్రకరణమున
లీలోపాఖ్యానమున రణవర్ణనమను పంచత్రింశ సర్గము ॥ 35 ॥

## షట్త్రింశః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అథశృంగోపమానేషు స్థితేషుశరరాశిషు
సర్వభీరుషుభగ్నేషు విద్రుతేషుదిశోదశ. 1
మాతంగశవశైలేషు విశ్రాంతాంబుదపంక్తిషు
యక్షరక్షఃపిశాచేషు క్రీడత్సు రుధిరార్ణవే. 2

వసిష్ఠుడు:— అనంతరము యుద్ధరంగమునగూలిన ఏనుగులను కొండలమీద బాణసమూహములు శిఖరములవలె నగపడజొచ్చెను. భీరులగువారు ఓడిపోయి, దశదిక్కుల పర్వెడుచుండిరి. మాతంగశవములను మేఘములు విశ్రమించుచుండెను. యక్ష, రాక్షస, పిశాచాదులా రుధిరసముద్రమున గ్రీడింపసాగిరి.

మహతాం ధర్మనిష్ఠానాం శీలౌజఃసత్త్వశాలినామ్
శుద్ధానాం కులపద్మానాం వీరాణామనివర్తినామ్. 3
ద్వంద్వయుద్ధాని జాతాని మేఘానామివగర్జతామ్
మిథోనిగరణోత్కాని మిలంత్యాపగపూరవత్. 4

అప్పుడు ధర్మచరులును, సత్స్వభావులును, బలసత్త్వవిభూషితులును, అపరాఙ్ముఖులును, కులాలంకారులును నగు వీరులు మేఘములవలె గర్జించుచు, ద్వంద్వయుద్ధ మొనర్పసాగిరి. వారు పరస్పరము మ్రింగుకొనదలచు నదీప్రవాహములవలె, కలియపడసాగిరి.

పంజరఃపంజరేణేవ గజౌఘేన గజోచ్ఛ్రయః
సవనఃసవనేనాద్రి రద్రిణేవామిలద్బలాత్. 5
అశ్వౌఘోమిలదశ్వానాం వృందేనారావిరంహసా
తరంగౌఘేనఘోషేణ తరంగౌఘఇవార్ణవే. 6

సముద్రతరంగములు గర్జించుచు ఒకదానితో, మఱొకటి కలయునట్లు, ఏనుగులు ఏనుగులతోడను, గుఱ్ఱములు గుఱ్ఱములతోడను డీకొనుచుండెను. వానినిజూడ, అరణ్యపరివృతములగు పర్వతము లొండొంటితో గలియబడుచున్నట్లుండెను.

నరానీకంనరానీకః సమాయుధమయోధయత్
వేణోర్ఘమివవేణ్వోఘో మరుల్లోలోమరుద్బలమ్. 7
రథౌఘశ్చరథౌఘేన నిష్పిష్టాఖిలంవపుః
నగరంనగరేణేవ దైవేనోడ్డీనమాసురమ్. 8

భటులు ఆయుధములను ధరించి, వాయువుచే గదల్పబడిన వెదుళ్లవలె, యుద్ధమొనర్పసాగిరి. దేవతలరథములవలన రాక్షసుల రథములు పిండియగునట్లు, వీరుల రథములబారిటబడి శత్రువీరుల రథములు నలిగిపోజొచ్చెను.

సరచ్ఛరభరాసార రచితాపూర్వవారిదమ్
యుయుధేన్ధగితాకాశా ధనుర్ధరపతాకినీ. 9

ధనుస్సులనుండి వదలబడిన బాణములు ఆకాశమునకు లేచి, వింతమేఘముల వడువున గప్పడజొచ్చెను. ధనుర్ధరుల ధ్వజపతాకలాకాశమును గప్పి పోరాడదొడగెను.

విషమాయుధయుద్ధేషు యోద్ధారఃపేలవాశయాః
యదాయుక్త్యాపలాయన్తే రణకల్పానలేతదా. 10
మిలితాశ్చక్రిణశ్చక్రై ర్ధనుర్ధారై ర్ధనుర్ధరాః
ఖడ్గిభిఃఖడ్గయోద్ధారో భుశుండీభిర్భుశుండయః. 11
ముసలై ర్ముసలోదారాః కుంతినఃకుంతిధారిభిః
ఋష్ట్యాయుధాఋష్టిధరైః ప్రాసిభిఃప్రాసపాణయః. 12
సముద్గరాముద్గరిభిః సగదైర్వ్యాలసద్గదాః
శాక్తైః శక్తియోద్ధారః శూలైఃశూలవిశారదాః 13
ప్రాసాసనవిదఃప్రాసైః పరశూక్తాఃపరశ్వధైః
లకుటోద్యైర్లకుటిన క్షేపణై రుపలాయుధాః. 14
పాశిభిఃపాశధారిణ్యః శంకుభిఃశంకుధారిణః
క్షురికాభిస్తుక్షురికాభిందిపాలైశ్చతద్గతాః. 15
వజ్రముష్టిధరావజ్రై రంకుశై రంకుశోద్ధతాః
హలైర్హాలనికామజ్ఞా స్త్రిశూలైశ్చత్రిశూలినః. 16
శృంఖలాజాలినోజాలైః శృంఖలై రలికోమలైః
క్షుభితాకల్పవిక్షుబ్ధ సాగరోర్మిఘటాఇవ. 17

పిరికివారు బాణయుద్ధమును సహింపజాలక పారిపోయిరి; అప్పుడు, ప్రళయాగ్నివలెనున్న ఆరణరంగమున, చక్రధరులు చక్రధరులతోడను, ధనుర్ధరులు ధనుర్ధరులతోడను, ఖడ్గధారులు ఖడ్గధారులతోడను, భుశుండీ-అస్త్రధరులు భుశుండీ-అస్త్రధరులతోడను, ముసలధారులు ముసలధారులతోడను, ఋష్టిధరులు ఋష్టిధరులతోడను, ప్రాసహస్తులు ప్రాసహస్తులతోడను, ముద్గరులు ముద్గరులతోడను, శక్తిధరులు శక్తిధరులతోడను, శూలపాణులు శూలహస్తులతోడను, పరశుధారులు పరశుధారులతోడను, వేణుదండధరులు వేణుదండధరులతోడను, శిలాహస్తులు శిలాహస్తులతోడను, పాశధరులు పాశ



ధరులతోడను, క్షుద్రక్షురికాధరులు క్షుద్రక్షురికాధరులతోడను, క్షురికాధరులు క్షురికాధరులతోడను, భేదపరాయణులు భేదపరాయణులతోడను, వజ్రధరులు వజ్రధరులతోడను, అంకుశహస్తులు అంకుశహస్తులతోడను, హలధరులు హలధారులతోడను, త్రిశూలధరులు త్రిశూలధారులతోడను, శృంఖలాయుధులు శృంఖలాయుధులతోడను, ప్రళయక్షుభిత సాగరతరంగములవలె, డీకొనిరి.

క్షుబ్ధచక్రదలావర్తః శరసీకరమారుతః
ప్రభ్రమద్హేతిమకరో వ్యోమ్నైకార్ణవ ఆబభౌ. 18
ఉత్ఫుల్లాయుధకల్లోల శిరాకులజలేచరః
రోదోరంధ్రసముద్రోఽసౌ బభూవామరదుస్తరః. 19

భ్రమించుచక్రములను సుడిగుండములతోడను, శరసమూహములను సీకరయుక్తవాయువులతోడను, కదలుచున్న కత్తులను మొసళ్లతోడను, ప్రయోగింపబడుచున్న బాణములను తరంగములతోడను, నక్కలను జలజంతువులతోడనుగూడి, భూమ్యాకాశ మధ్యస్థలమునిండిన ఆరణసముద్రము దేవతలకుగూడ దుస్తరమై (దాటరానిదై) యుండెను.

దివ్యావృష్టకజనానీకం పక్షద్వయతయాతయా
అర్ధేనార్ధేనకుపితం భూపాలాభ్యాంతథాస్థితమ్. 20

ఇరువాగులవారును వరుసదీరి, కోపముతోనట్లు నిలబడియుండిరి. వారిపైన, ఆకాశదేశమున యక్ష,రాక్షస, పిశాచ, అసురగణము లొకవరుసగను, దేవ, గంధర్వ, కిన్నర, విద్యాధర గణములొకవరుసగను నిలంబడి, భావివిజయ పరాజయముల నపేక్షించుచుండిరి.

మధ్యదేశాదిసంఖ్యానే ప్రాగ్దిగ్భ్యోఽభ్యాగతానిమాన్
లీలానాథస్యపద్మస్య పక్షేజనపదాఞ్ఛృణు. 21

రాఘవా! లీలానాథుడగు పద్మునకు సాయముచేయ తూర్పుదిక్కునుండి వచ్చినవారి దేశములను వర్ణించుచున్నాను, వినుము.

పూర్వస్యాంకోసలాః కాశిమాగధామిథిలోత్కలాః
మేఖలాఃకర్కరాముద్రాస్తథా సంగ్రామశౌండకాః. 22
ముఖ్యాహిమారుద్రముఖ్యా స్తామ్రలిప్తాస్తథైవచ
ప్రాగ్జ్యోతిషావాజిముఖా అంబష్ఠాఃపురుషాదకాః. 23
వర్ణకోష్ఠాఃసవిశ్వోత్రా ఆమమీనాశనాస్తథా
వ్యాఘ్రవక్త్రాఃకిరాతాశ్చ సౌవీరాఏకపాదకాః. 24
మాల్యవాన్నామశైలోఽత్ర శిబిరాంజనపర్వచ
వృషలధ్వజపద్మాద్యా స్తథోదయకరోగిరిః. 25

తూర్పునుండి కోసల, కాశీ, మగధ, మిథిల, ఉత్కళ, మేఖల, కర్కర, ముద్ర, ముఖ్యాహిమ, రుద్రముఖ్య, తామ్రలిప్త, ప్రాగ్జ్యోతిష వాజిముఖ, అంబష్ఠ, నిషాద, వర్ణకోష్ఠ, సవిశ్వోత్ర, ఆమమీనాశన, వ్యాఘ్రవక్త్ర, కిరాత, సౌవీర, ఏకపాదాది దేశములనుండియు, మాల్యవంత, శిబి, అంజన, వృషలధ్వజ, పద్మాస్య, ఉదయ, అస్తాచలములను పర్వత సప్తకములనుండియు వీరులు [illegible] వచ్చిరి.

అథప్రాగ్దక్షిణాయాంతు ఇమేవింధ్యాదివాసినః
చేదయోవత్సదాశార్ణా అంగవంగోపవంగకాః. 26
కలింగపుండ్రజఠరా విదర్భామేఖలా స్తథా
శబరాననవర్ణాశ్చ కర్ణాత్రిపురపూరకాః. 27
కంటకస్థలనామానః పృథగ్ద్వీపకకోమలాః
కర్ణాంధ్రాశ్చోలికాశ్చైవ తథాచార్మణ్వతాఅపి. 28
కాకకాహేమకుడ్యాశ్చ తథా శ్మశ్రుధరాఅపి
వలిగ్రీవమహాగ్రీవాః కిష్కింధానాలికేరిణః. 29

ప్రాగ్దక్షిణభాగమునుండి, వింధ్య, చేది, వత్స, దశార్ణవ, అంగ, వంగ, ఉపవంగ, కళింగ, పుండ్రక, జఠర, విదర్భ, మేఖల, శబరానన, శబరవర్ణ, కర్ణ, త్రిపురపురక, కంటకస్థల, పృథగ్ద్వీప, కోమల, కర్ణాంధ్ర, చోలిక, చర్మణ్వత, కాకక, హేమకుడ్య, కిష్కింధా, నాలికేరాది (27) దేశముల నుండి, వీరులరుదెంచిరి.

అథలీలాపతేరస్య దక్షిణస్యామిమేనృపాః
వింధ్యోఽథకుసుమాపీడో మహేంద్రో దర్దుర స్తథా. 30
మలయఃసూర్యవాంశ్చైవ గణారాజ్యసమృద్ధకాః
అవంతీరితివిఖ్యాతా స్తథాశాంబవతీతిచ. 31
దశపూరకథాచక్రా రేషికాతురకచ్ఛపాః
వనవాసోపగిరయ స్తే భద్రగిరయ స్తథా. 32
నాగరాదండకాశ్చైవ గణరాష్ట్రనృరాష్ట్రికాః
సాహాశ్శైవార్ష్యమూకాశ్చ కర్కోటావనబింబలాః. 33
పంపానివాసినశ్చైవ కైరకాఃకర్కవీరకాః
స్వైరికా యాసికాశ్చైవ ధర్మపత్తనపంజికాః. 34
కాశికా స్తృష్ణఖల్లూలా యాదా స్తేతామ్రపర్ణకాః
గోనర్దాఃకణకాశ్చైవ దీనపత్తననామకాః. 35
తామ్రికాదంభరాకీర్ణాః సహకారైణకా స్తథా
వైతుండకాస్తుంబవనా లాజినద్వీపకర్ణికాః. 36
కర్ణికాభాశ్చశివయః కొంకణాశ్చిత్రకూటకాః
కర్ణాటమంటవటకా మహాకటకికా స్తథా. 37
ఆంధ్రాశ్చకోలగిరయ శ్చావంతికవిశేషికాః
చండాయత్తాదేవనకాః క్రౌంచా వాహి స్తథైవచ. 38
శిలాతీరోదభోనందమర్దనా మలయాభిధాః
తే చిత్రకూటశిఖరా లంకారత్నోగణాస్మృతాః. 39



దక్షిణదిక్కునుండి వింధ్య, కుసుమాపీడ, మహేంద్ర, దర్దుర, మలయ, సూర్యవంతపర్వతము (6) లయందున్నవారును, అవంతీ, సాంబవతి, దశపూరీ, రథచక్ర, రేషిక, ఆతుర, కచ్ఛప, వనవాసోపగిరి, భద్రగిరి, నాగర, దండక, గణరాష్ట్ర, నృరాష్ట్ర, సాహ, శైవ, ఋష్యమూక, కర్కోట, వనబింబల, పంపా, కైరక, కర్క, స్వైరిక, యాసిక, ధర్మపత్తన, పంజిక, కాశిక, తృష్ణఖల్లుల,యాద, తామ్రపర్ణక, గోనర్ద, కనక, దీనపత్తన, తామ్రక, దంభర, కీర్ణ, సహకార, ఏణక, వైతుండక, తుంబన, లాజీనద్వీప, కణిక, కణికాభ, శిబి, కొంకణ, చిత్రకోటక, కర్ణాట, మంటవటక,మహాకటకిక, ఆంధ్ర,కోలగిరి, అచలాంతక, విశేషిక, దేవనక, క్రౌంచవాహ, శిలా, తీరోద, భోనంద, మర్దల, చిత్రకూట, లంకాది (68) దేశములవారు అరుదెంచిరి,

అథప్రత్యగ్దక్షిణస్యాం మహారాజ్యసురాష్ట్రికాః
సింధుసౌవీరశూద్రాఖ్యా ఆభీరాద్రవిడా స్తథా. 40
కీకటాఃసిద్ధఖండాఖ్యా స్తథాకాలిరుహాఅపి
అత్రహేమగిరిఃశైల స్తథా రైవతకోగిరిః. 41
జయకచ్ఛోమయవరో యవనా స్తత్రజంతవః
బాహ్లీకా మార్గణావంతా ధూమ్రాస్తుంబకనామకాః. 42
తథాలాజకణాశ్చైవ తథాత్రగిరివాసినః
తతోఽబ్ధితోకనియుతా ఏతే లీలాపతేర్జనాః. 43

పశ్చిమమునకును దక్షిణమునకును మధ్యభాగమునుండి లీలాపతికి సాయమొనర్ప మహారాజ్య సురాష్ట్ర, సింధు, సౌవీర, శూద్ర, ఆభీర, ద్రవిడ, కీటక, సిద్ధఖండ, కాలిరుహాది (19) దేశముల వారును, హేమగిరి, రైవతక, జయకచ్ఛ, మయవర్దా (4) పర్వతములవారును, యవన, బాహ్లీక, మార్గణ, అవంత, ధూమ్ర, తుంబక, లాజగణములును, అచ్చటనున్న పర్వతములవారును, సముద్రతీర వాసులును అరుదెంచిరి.

అథతత్ప్రతిపత్స్థానిమాన్ జనపదాఞ్ఛృణు
పశ్చిమాయాం దిశిప్రౌఢా ఇమేతావన్మహాద్రయః. 44
మణిమాన్నామశైలేంద్రః కురార్పణగిరిస్తథా
వనోఽర్క హా మేఘభవ శ్చక్రవాన స్తపర్వతః. 45
జనాఃపంచజనానామ కాశబ్రహ్మచయాంతకాః
తథైవభారతస్తథాః పారకాఃశాంతికా స్తథా. 46
శైబ్యారమరకాయాచ్ఛా గుహాలత్వానియమా స్తథా
హైహయాఃసుహ్మగాయాశ్చ తాజికాహూణకా స్తథా. 47
పార్శ్వేకతకయోఃకర్కా గిరిపర్ణావమా స్తథా
సంత్యక్తధర్మమర్యాదా స్తే వర్ణామ్లేచ్ఛజాతయః. 48
తతో జనపదాభూమిర్యో జనానాం శతద్వయమ్
తతో మహేంద్రశిఖరీ ముక్తామణిమయావనిః. 49

యుతోమహీధరశ్శైత్రే రథాశ్వోనామపర్వతః
తతోమహార్ణవోభీమః పారియాత్రగిరిస్తతః. 50

పశ్చిమదిక్తటమున మణిమంత, కురాపూర్ణ, వనోకహ, మేఘభవ, చక్రవాళ పర్వతములున్నవి. ఈ (9) పర్వతములనుండువారును, పంచజన, కాశీ, బర్హిమ్మచయ, ఆంతక, భారత, పారక, శాంతిక, శైబ్య, రమరక, ఛాయా, గుహుక, హైహయ, ముహ్యాగాయ, తేజక, హూణక, కర్క, గిరిపర్ణ, మ్లేచ్ఛ, (18) దేశములవారు ప్రతిపక్షులకు సాయమొనర్పవచ్చిరి. పిదప రెండువేల యోజనముల విస్తీర్ణముగల దేశమును, మహేంద్ర పర్వతమును, ముక్తామణిమయ భూమియు, రథాశ్వపర్వతమును సముద్రమును, పారియాత్ర పర్వతములునున్నవి, అచ్చటవారుగూడ వీరికే సాయమొనర్పవచ్చిరి.

పశ్చిమోత్తరదిగ్భాగే దేశోగిరిమతిస్థితః
తథావేణుపతిశ్చైవ తతోనరపతిర్మహీ. 51
తథాఫల్గుణకాశ్చైవ మాండవ్యానేకనేత్రకాః
పురుకుందాశ్చపారాశ్చ భానుమండలభావనాః. 52
వన్మిలా నలినా దీర్ఘా దీర్ఘకేశాంగబాహవః
రంగాశ్చస్తనికాశ్చాన్యా గురుహాశ్చలుహాస్తథా. 53
తతః స్త్రీరాష్ట్రమతులం గోవృషాపత్యభోజనమ్

పశ్చిమోత్తరభాగము పర్వతప్రదేశము. అటనుండి, వేణుపతి, మహీపతి, ఫాల్గుణక, మాండవ్య, అనేకనేత్రక, పురుకుంద, పార, భానుమండలభావన, వర్మిల, నలిన, విశిష్ట, రంగ, స్తనిక, గురుహ, లూహ, స్త్రీరాష్ట్రాది (16) దేశములవారు వచ్చిరి.

అథోత్తరస్యాంహిమవాన్ క్రౌంచోఽథమధుమాన్గిరిః. 54
కైలాసో వసుమాన్మేరుస్తత్త్వాదేషుజనాఉభే
మద్రావారేవయోధేయా మాలవాశ్శూరసైనికాః. 55
రాజన్యాశ్చతథాజ్ఞేయా అర్జునాతనయస్తథా
త్రిగర్తఏకపాత్క్షుద్రామబలాస్వస్తవాసినః. 56
అబలాః ప్రఖలాః శాకాః క్షేమధూర్తయఏవచ
దశధానాగావసన్య దండాహాన్యసనాస్తథా. 57
దానదాః సరకాశ్చైవ వాటధానాస్తథైవచ
అంతరద్వీపగాంధారాస్తథావంతిసురాస్తథా. 58
అథతక్షశిలానామ తతో వీలవగోధనీ
పుష్కరావర్తదేశస్య యశోవతిమహీతతః. 59
తతోనాభిమతి ర్భూమి స్తిష్ఠాకాలవరాస్తథా
కాహాకం నగరంచైవ సురభూతిపురంతథా. 60
తథైవ రతికాదర్శా అంతరాదర్శఏవచ
తతఃపింగలపాండవ్యం యామునే యాతుధానకాః. 61



మానవా నాంగనా హేమతాలాః స్వస్వముఖాస్తథా
హిమవాన్వసుమాన్క్రౌంచ కైలాసావిత్యగాస్తథా. 62
తత్రోఽజనపదాభూమి రశీతిశతయోజనా

ఉత్తర దిక్కునుండి హిమవంత, క్రౌంచ, మధుమంత, కైలాస, వసుమంత, మేరు (6) పర్వతములవారును, మద్రవార, మాలవ, శూరసేన, త్రిగర్త, ఏకపాద, మబల, శ్వభ్ర, అచల, ప్రఖల, శాక, క్షేమ, దశధన, ధానద, సరక, వాటధానక, అంతరద్వీప, గాంధార, అవంతీ, తక్షశిలా, గోధన, నాభమతి, కాహాక, సురభూతి పుర, రతికాదర్శ, అంతరాదర్శ, పింగలపాండవ్య, హేమతార (44) దేశీయులును అరుదెంచిరి. హిమవంతాది పర్వతములటనున్నవి. అచ్చట భూమివైశాల్యము ఎనుబది వందల యోజనములు.

అథప్రాగుత్తరస్యాంతు క్రమాజ్జనపదాఞ్ఛృణు. 63
కాలుతాబ్రహ్మపుత్రాశ్చ కుణిదాఃఖదినాస్తథా
మాలవారంధ్రరాజ్యాశ్చ వనారాష్ట్రాస్తథైవచ. 64
కేడవస్త్రాః సింహపుత్రాస్తథావామనతాంగతాః
సావాకచ్చాపలవహాః కామిరా దరదాస్తథా. 65
అభిసాసదజార్వాకాః పలోలకువికాతుకాః
కిరాతాయాముపాతాశ్చ దీనాఃస్వర్ణమహీతతః. 66

పూర్వోత్తర భాగమునుండి, కాలుత, బ్రహ్మపుత్ర, కులిద, ఖదిన, మాలవ, రంధ్ర, వనరాజ్య, కేడవంత, సింహపుత్ర, సావక, ఆపలవహ, కామీర, దరద, అభిసాసద, జావ, అర్కపలోల, కుబికాతుక, కిరాత, యాముపతాది (24) దేశములవారరుదెంచిరి.

దేవస్థలోపవనభూస్తదనూదితశ్రీ
ర్విశ్వావసోస్తదనుమందిరముత్తమంచ
కైలాసభూస్తదనుమంజువనశ్చశైలో
విద్యాధరామరవిమాన సమానభూమిః. 67

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
జనపదవర్ణనంనామ షట్త్రింశః సర్గః ॥ 36 ॥

మఱియు, స్వర్ణమహి, దేవస్థలాదివాసులును, విద్యాధరులును, దేవతలును అరుదెంచి లీలాపతికి ప్రతిపక్షులై పోరాడుచుండిరి.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు, ఉత్పత్తిప్రకరణమున
లీలోపాఖ్యానమున జనపదవర్ణనమను షట్త్రింశ సర్గము ॥ 36 ॥

——:0:——

## సప్తత్రింశః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

రణేరభసనిర్లూన నరవారణదారుణే
అహంపూర్వమహంపూర్వ మితివృందానుపాతిని. 1
ఏతేచాన్యేచబహవ స్తత్ర భస్మత్వమాగతాః
ప్రవిశంతఃప్రయత్నేన శలభాఇవపావకే. 2

వసిష్ఠుడు:– రాఘవా! హతులగు జనులతోడను, ఏనుగులతోడను నిండిన ఆ రణరంగమున, సైనికులు, 'నేనుముందర, నేనుముందర', అని తొందరపడి ముందునకువచ్చుచు, నిప్పునబడు మిడుతలవలె, భస్మమవసాగిరి.

అత్రాన్యేమధ్యదేశీయా జనా. నోదాహృతా మయా
తానిమాఞ్ఛృణువక్ష్యామి పక్షాంల్లీలామహీభృతః. 3

మధ్య దేశములనుండి లీలానాథునకు సాయమొనర్పవచ్చిన వారి పేర్లను నీకుజెప్పలేదు; ఇప్పుడు చెప్పుచున్నాను, వినుము.

తద్దేహికాఃశూరసేనా గుడాఅశ్వఘనాయకాః.
ఉత్తమజ్యోతిభద్రాణి మదమధ్యమికాదయః. 4
సాలూకాకోద్యమాలాస్య దాక్షేయాఃపిప్పలాయనాః
మాండవ్యాః పాండునగరాః సౌగ్రీవాద్యాగురుగ్రహాః. 5
పారియాత్రాః కురాష్ట్రాశ్చ యామునోదుంబరాఅపి
రాజ్యావహ్వోఉజ్జిహానాశ్చ కాలకోటికమాథురాః. 6
పాంచాలాధర్మారణ్యాశ్చ తథైవోత్తరదక్షిణాః
పాంచాలకాఃకురుక్షేత్రా స్తథాసారస్వతాజనాః. 7

తద్దేహిక, శూరసేన, గుడ, అశ్వాద్యనాయక, జ్యోతిభద్ర, మదమాధ్యమిక, కాలక, కోద్యమాల, దాక్షేయ, పిప్పలాయన, మాండవ్య, పాండ్యనగర, సౌగ్రీవ, గురుగ్రహ, పారిపాత్ర, సురాష్ట్రి, యామున, ఉదుంబర, రాజ్య, ఉజ్జిహాన, కాలకోటి, మాథుర, పాంచాల, ధర్మారణ్య, తదుత్తరదక్షిణ, పాంచాలక, కురుక్షేత్ర, సారస్వతాది (29) జనపదముల వారరుదెంచిరి.

అవంతీస్యందనశ్రేణీ కుంతిపాంచనదేరితైః
స్పందమానావిద్రవంతీ నిపపాత మహాభృగా. 8

అవంతివాసుల రథములు కుంతి, పంచనద దేశీయులవలన దరుమబడి, కొండలోయలో బడిపోయెను.

కోశబ్రహ్మవసానాశ్చ ఛిన్నావత్త్రవతీజనైః
భూమౌ నిపతితాఃసంతో మిలితామత్తవారణైః.

కోశ, బ్రహ్మవసానులు వత్త్రవతి దేశీయులవలన [illegible], భూమిపైబడి, ఏనుగులవలన [illegible].



శూరా దాశపురాఃశస్త్ర నికృత్తోదరకంధరాః
బాణక్షితిభిరాక్రమ్య యోజితాయోజనేహ్రదే. 10

దశపురవాసులు బాణభూమివారిచే జీల్చిచెండాడబడి, పదునిడి శతయోజన విస్తీర్ణమగు హ్రదమున మునిగిపోయిరి.

దీర్ణోదరవినిర్యాత స్వాంత్ర తంత్రీనియంత్రితాః
శాంతికాఃశాంతసంచారాః పిశాచై శ్చర్వితా నిశి. 11

వీరుల పొట్టలనుండి వెలువడిన ప్రేగులను, పిశాచములు రాత్రియందు నమలదొడగెను. అప్పు డారణరంగము శ్మశానమువలె భయంకరమై, జనసంచారరహితమయ్యెను.

ఉద్రవై ర్భద్రగిరిభిః సంగ్రామాధ్వరదీక్షితైః
క్షోణీగర్తేషునిక్షిప్తా మరగాః కమఠాఇవ. 12

రణయజ్ఞదీక్షితులగు భద్రగిరివాసులు సింహనాద మొనర్చుచు, మురగదేశీయులను బట్టుకొని, తాబేళ్లవలె, బురదగుంటలో బడవేయజొచ్చిరి.

ప్రద్రుతావిద్రవద్రక్తా విద్రావితమహారయః
దండికాస్థానిలోద్ధూతా హైహయైర్హారిణాఇవ. 13

హైహయదేశీయులు దండికానగర వాసులను చిదుకకొట్ట వారిశరీరము రక్తముతో దడిసెను. అప్పుడు వారు, గాలిచే నెగురగొట్టబడిన రేళ్లవలె, పారిపోయిరి.

దంతిదంతవినిర్భిన్నా దరదా దలితారయః
నీతారక్తమహానద్యా ద్రుమాణాంపల్లవాఇవ. 14

శత్రునాశకులగు దరదదేశీయులు, ఏనుగుల దంతముల జీల్పబడి, రక్తనదీప్రవాహమునందు తేలు చిగురుటాకులవలె, కొట్టుకొనిపోయిరి.

నారాచైశ్చర్వితాశ్చీనా జీర్ణాజర్జరజీవితాః
జహుర్జలనిధౌదేహాన్ భారభూతానివస్థితాన్. 15

బాణపుదెబ్బల దినిన చీనాదేశీయులు మృతప్రాయులై, భారభూతములగు శరీరములను సముద్రమున ద్యజించుచుండిరి.

కర్ణాటసుభటోడ్డీన కుంతాకలితకంధరాః
భగ్నా నలదశూరాశ్చ తారకానికరాఇవ. 16

నలదేశీయులు కర్ణాట దేశవీరులు కుంతముల ఛిన్నకంఠులై, నక్షత్రములవలె రాలిపోవుచుండిరి.

కరీంద్రమకరవ్యూహా రంహాఃసంహతహేతయః
కేశాకేశికృతారంభా వినేదుర్దాశశాఃశకాః. 17

దాశక, శకదేశీయులు, మకర వ్యూహమునందలి ఏనుగులవలె, అస్త్రముల బోగొట్టుకొని కేశాకేశి యుద్ధ మొనర్పసాగిరి.

దశార్ణాః పాశనిర్ముక్త శృంఖలాజాలభీరవః
నిలీనా రక్తజంబాలే వైతసా స్తిమయో యథా. 18

దశార్ణ, పాపదేశీయులు బన్నిన వలలగాంచి భయపడినవారలు, వేతసవనమున విహరించి డస్సిన చేపలవలె, రక్తపురొంపియందు దాగుకొన దొడగిరి.

గుర్జరానీకనాశేన గుర్జరీ కేశలుంచనమ్
విహితం తంగణోత్తుంగ నాసికంకుశతైరణే. 19

తుంగణదేశీయులు అనేకములగు ఆయుధముల ప్రయోగించి, గుర్జర సైన్యమును జంపి, వారి కేశములను గత్తిరించిరి.

సిషిచుః శస్త్రకర్ణాఘూద్బిందుభ్యో నిగడాగుహాన్
శరధారా వనానీవ వీరహేతి ప్రభాంబుదాః. 20

నిగడదేశీయులు ఆకర్ణాంతము సంధింపబడిన ధనుస్సులను మేఘములనుండి శరధారలను (బాణవర్షము) గుహాదేశీయులను వనములపై వర్షించిరి.

భుశుండీమండలోద్ద్యోత శ్యామార్కోత్పాతభీరుషు
ఆభీరేష్వరయః పేతు ర్గోగణాహారి తేష్వివ. 21

శత్రువులవలన బ్రయోగింపబడిన భుశుండి ఆయుధములు సూర్యమండలమును గప్పివడజేసి, పచ్చిక బయళ్లనున్న అలమందవలె, భీతులగు ఆభీర దేశీయులను దునిమెను.

కాంతకాంచనకాంతాసీ త్తామ్రమనగ్రామవాహినీ
భుక్తా గాడభటేనాంగ నఖకేశనికర్షణైః. 22

రామా! తామ్రములను యవనులసేన, నానావిధకాంచన భూషితమై అరుదెంచెను; గాడ దేశీయులు దానిని కొల్లగొట్టి తమవశ మొనర్చుకొనిరి.

రణేనగనయాసంఖ్య కవచ్ఛక్రనికృంతనైః
తంగణాః కణశః కీర్ణాః కంకగృధ్రేషుభాసకైః. 23

తంగదేశీయులకడ కొండల పిండిజేయగల చక్రము లుండెను; భాపదేశీయులు, వారిని వారిచక్రములను ఛిన్నము నొనర్చి గ్రద్దలు, రాబందు, లుండుచోట, ననగా శ్మశానమున బడవేసిరి.

లగుడాలోడనోడ్డీనం గాడంగుడుగుడారవమ్
శ్రుత్వా గాంధారగావోఽగ్రే దుద్రువుర్ద్రవిడా ఇవ. 24

గాడదేశీయులు కఱ్ఱలను ద్రిప్పుచుండ వెలువడిన గుడగుడధ్వనిని విని, గాంధార దేశీయులు ఆవులవలె పరుగిడిరి.

ఆకాశగార్ణవప్రఖ్యో వహచ్ఛకకదంబకః
అకరోత్పారసీకానాం ఘనసైశతమోభ్రమమ్. 25

ఆకాశమున బ్రవహించు సముద్రమువలె, (నల్లటి బట్టలకట్టుకొనిన) శకదేశీయులు కొండల నుండి దిగుచుండ, (తెల్లబట్టల కట్టుకొనిన) పారసీకులకు అంధకార భ్రాంతి కలుగుచుండెను.



మందరాహననోడ్డీన స్వచ్ఛక్షీరార్ణవోదరే
వనానీవాయుధాన్యాస ఞ్ఛత్రుప్రాలేయసానుని. 26

క్షీరసముద్రమును మథించుచున్న మందరపర్వతవనములవలె త్రిప్పబడుచున్న ఆయుధములు చూపరులకు, హిమపర్వతవనములవలె గన్పడుచుండెను.

యదంబుదైరివోడ్డీనం శస్త్రవృందైర్నభోంగణే
తద్దృష్టం వీచివలనై ర్లోలైః ప్లుతమివార్ణవే. 27

ఆకాశదేశమున ద్రిప్పబడుచున్న ఆయుధ సమూహములు, సముద్రతరంగములవలె గన్పడుచుండెను.

శతచంద్రం సితచ్ఛత్త్రైః శరైః శలభనిర్భరమ్
శక్తిభిః కిలనీరంధ్రం దృష్టమాకాశకాననమ్. 28

ఆకాశ - కాననము శక్తి - ఆయుధములవలన గప్పబడెను. ధవళఛత్రములగాంచిన, నూర్గురు చంద్రులుదయించిరా యనిపించుచుండెను. బాణములుజూచిన, మిడుతలు చట్టముగ వ్యాపించినాయని తోచుచుండెను.

వీరాసవసమాక్రంద కారిణః కేకయైః కృతాః
కంకైః కంకకులాక్రాంత వ్యోమోద్ధూలితమస్తకాః. 29

కేకయులు శత్రువులను కంకాస్త్రములతో గొట్ట వారు గాయములనంది ఆర్తనాద మొనర్ప అధ్వానులతో ఆకాశమండలము నిండిపోయెను.

కిరాతసైన్యకన్యానాం కామంకలకలారవైః
అంగై రనంగతాంనీతా భైరవైరివగర్జితమ్. 30

అంగదేశీయులు కిరాతకన్యలను అంగహీనలుగ నొనర్చిన, భైరవగణమువలె, భీషణముగ గర్జింపసాగిరి.

కాశైః స్వదేహాక్రాంతా అదృశ్యైర్మాయయాఖగైః
నిర్ధూతపక్షైః క్షుభితైః పవనైరివ పాంసవః. 31

కాశదేశీయులు మాయాబలముల పక్షిరూపమునుదాల్చి, గాలిదుమ్మును జెదరగొట్టునట్లు, తద్దేశీక నివాసులను జెదరగొట్టిరి.

ఉన్మత్తాః సువినిర్ధూతా స్త్యక్తహేతిరణాంబరాః
నార్మదానర్మనిర్మాత్ర నన్నృతుర్జహసుర్జగుః. 32

నార్మదులు క్రోధోన్మత్తులై అస్త్రములను బ్రయోగించి, హాస్యనృత్యగానాదుల నొనర్ప సాగిరి.

ప్రక్వణత్కింకిణీజాలం శక్తివర్షముపాగతమ్
సాల్వబాణానిలోద్భూత మగమత్పృషదాకృతి. 33

శాల్వురు క్వణక్వణశబ్దముల నొనర్చు కింకిణీజాలములను తునకలు చేసిరి.

శైబ్యాస్తు ఖండితాః కాంతైర్భ్రమత్కుంతైర్విఘట్టితాః
శవీభూతా దివంనీతా దృష్టా విద్యాధరా ఇవ. 34

శైబ్యులు కుంతిదేశీయుల అస్త్రముల గొట్టబడి, ప్రాణములను త్యజించి, విద్యాధరులవలె, స్వర్గమున కరిగిరి.

ధరాధరణధర్మిణ్యా ధీరయా హీనసేనయా
లుంఠితాః పాండునగరా శ్చలనోల్లాసమాత్రతః. 35

ఆక్రమణ విశారదులను, ధీరులునగు అహీనదేశీయులు ఉల్లాసముతో నరిగి పాండునగరవాసులను చావమోదిరి.

తందేహకాః పాంచనదై ర్దలితామత్తశాలిభిః
కుంతదంతద్రుమోద్దామా నగాఇవమతంగజైః. 36

ఏనుగలు చెట్లను బడగొట్టునట్లు, పంచనదవాసులు తందేహకులను బడగొట్టిరి.

బ్రహ్మవత్సనకా నీపై శ్చక్రైః కృత్తాగతామహీమ్
సహాయాః క్రకచోత్కృత్తా వృక్షాః కుసుమితాఇవ. 37

సనక దేశీయవాసులు, నీపవాసుల చక్రాస్త్రముల నరుకబడి, కుసుమిత వృక్షములవలె కూలిరి.

శ్వేతకాకాననం లూనం కుఠారై ర్జఠరేరితైః
ఏతద్దదాహపార్శ్వస్థో భద్రదేశః శరవహ్నినా. 38

జఠరదేశీయులు కుఠారములతో శ్వేతకాయుల ముఖములను జీల్చిరి; ప్రక్కనున్న భద్రదేశులు వీరిని మరల బాణాగ్నితో దహించిరి.

కాష్ఠయోధే నిరాలానం మగ్నాజీర్ణామతంగజాః
లయమాజగ్మురాయుద్ధ మిద్ధేగ్నావింధనంయథా. 39

మతంగదేశీయులను మతంగకాష్ఠములు, యుద్ధనిపుణులగు వీరులను పంకమున గూరుకొనిపోయి, మండుచున్న నిప్పునబడిన కట్టెలవలె, భస్మమైరి.

మిత్రగర్తాస్త్రిగర్తాత్తా భ్రమితోర్ధ్వంతృణోపమమ్
వివిశుర్వ్యస్తమూర్ధానః పాతాలాంతం పలాయితుమ్. 40

మిత్రగర్తులు త్రిగర్తదేశీయులవలన నాక్రమింపబడి ఊర్ధ్వదేశమున గడ్డిపరకలవలె తిరిగి తలక్రిందులై పాతాళమునకు బారిపోవుచుండిరా యనునట్లుండిరి.

మందానిలచలాంభోధి భాసురే మాగధేబలే
నిర్మగ్నావనిలామందాః పంకే జీర్ణగజాఇవ. 41

వనిలదేశీయులు మందమారుతమున గదల్పబడు సముద్రమువలె గన్పడు మగధదేశీయ సైన్యమధ్యమునబడి, బురదలో క్రుక్కుకొనిన ఏనుగులవలెనున్నారు.

చేదయశ్చేతనాంజహ్రు స్తంగణానాం రణాంగణే
పుష్పాణాం పథిశీర్ణానాం సౌకుమార్యమివాతపాః. 42

చేదిదేశీయవీరులు తంగణదేశీయుల చైతన్యమును, దారియందు రాలిపడియున్న పుష్పముయొక్క సౌకుమార్యమును ఎండహరించునట్లు, హరించినారు.



కౌసలాః పౌరవారావ మసహంతో ఽంతకాఇవ
తైరున్ముక్తగదాప్రాస శరశక్త్యతివృష్టయః. 43

బభూవుర్భిల్లకృత్తాంగా ఽవిస్మయా విద్రుమద్రుమాః
ఇవాద్రావిద్రవంత్యార్ద్రి సాంద్రాసృక్సూర్యమూర్తయః. 44

యమునివలెనున్న కౌసలులు పౌరవుల గర్జనములకును, ఆయుధవర్షమునకును దాళలేకపోవుచుండిరి. మఱియువారు ఖండితాంగులై, రక్తమయదేహులై సూర్యునివలె నగపడుచు, కొండమీద పరుగిడసాగిరి. అప్పుడు వారు ప్రవాళవృక్షములవలె నుండిరి.

నారాచౌఘమహాహేతి మారుతాధూతమూర్తయః
బభ్రముర్భ్రమరానీక భాసురా జలదాఇవ. 45

అనంతరము కోసలదేశీయులు బాణవర్షమునకును, ఖడ్గవర్షమునకును ఆగజాలక, భ్రమరములవలె నల్లనగు మేఘములవలె వణకదొడగిరి.

శరధారాధరామేఘాః శరోర్ణాపూర్ణమేషకాః
శరపత్రావృతావృక్షా భ్రేముస్తద్గర్జనాగజాః. 46

అప్పుడు శరధారలతో నిండిన మేఘములో, శర రోమములతో గూడిన పొట్టేళ్లో లేక శర పత్రములతో గూడిన వృక్షములో, చలించుచు గర్జించుచున్నట్లు తోచుచుండెను.

వనరాజ్యజరాజీర్ణాః కందాకస్థలజంతవః
అత్రుటన్స్వరమాకృష్టాః పేలవాఇవతంతవః. 47

కందాకస్థలవాసులగు వారి అవయవములు, వనరాజ్యవాసులను జరపలన నాక్రమింపబడి సన్నటిదారమువలె తెగిపోవుచుండెను.

రథేషుధ్వస్తచక్రేషు నిఖాతేఽముత్రమూర్ధసు
నిపేతుర్జనసంఘాతా మేఘాఇవ వనాద్రిషు. 48

రథచక్రములు గుంటలలోబడి విరుగ, రథములుకూలిపోసాగెను; అప్పుడు శత్రువులు వాటిపై, వనపర్వతములమీద మేఘములు వ్రాలునట్లు, పడసాగిరి.

శాలతాలవనంప్రాప్య జనతావలనంవనమ్
భుజావకర్తనంచాసీ దుత్తాలంస్థాణుకాననమ్. 49

సాలతాల వృక్షములవలె పొడుగగు వీరులు యుద్ధక్షేత్రము అను అరణ్యమునుజొచ్చి, అచ్చటివారిచే ఖండింపబడిరి. అప్పుడు ఆ యుద్ధ — అరణ్యము ఉన్నతవృక్షములతో నిండినట్లగపడుచుండెను.

ననర్దుర్నందనోద్యాన సుందర్యో మత్తయావనాః
వనోపవనదేశేషు మేరోర్వీరవరాశ్రితాః. 50

మత్తయావనలగు సురసుందరీమణులు మేరుసానుతటముననున్న నందనోద్యానవనమున ...లతోగూడి. ఇట్లనుకొన జొచ్చిరి:—

తావత్తారారవం రేజే సైన్యకాననముత్తమమ్
యావన్న పరపక్షేణ ప్రాప్తం కల్పానలార్చిషా. 51

సైన్యారణ్యము పరపక్షమను ప్రళయాగ్నివలన దహింపబడనంతవఱకు, ఉచ్చనినాదానముల సల్పుచు, ప్రకాశించుచున్నది.

ఛిన్నాః పిశాచసంయుక్తా భూతాపహృతహేతయః
పాతయిత్వాయయుః కర్ణాన్ దశార్ణాస్తర్ణకా ఇవ. 52

కామరూపదేశ పిశాచములతో యుద్ధమొనర్చు దశార్ణదేశస్థులు, ఆయుధముల బోగొట్టుకొని, లేగదూడలవలె, కర్ణములను బడవేయపోవుచున్నారు.

జహుర్భగ్నేశ్వరాః కాంతిం తాం జిగీషవనౌజసా
కాననయః కమలానీవ శుష్కస్రోతస్వినౌజసా. 53

నాయకుని బోగొట్టుకొనిన సైనికులు, తాంజిగీషదేశీయవారుల బలమున కాంతిదక్కి, శుష్కసరోవరమునను్న పద్మములవలె నైనారు.

తుషారా మేఖలైః కీర్ణాః శరశక్త్యసిముద్గరైః
విద్రుతా నరకైః క్షిప్తాః కటకిచ్ఛలనా అపి. 54

తుషారామేఖలులు శక్త్యాద్యాయుధముల బ్రయోగింప, పారిపోవుచున్న కటకచ్ఛలనవానులను, నరకదేశీయులు మర్దించిరి.

కాంతక్షేత్రాః ప్రస్థవాసైః స్థిత్వా యోధిభిరావృతాః
గుణా ఇవ ఖలాక్రాంతా గతా వ్యక్తమశక్తతామ్. 55

కాంతక్షేత్రవాసులు ప్రస్థదేశవీరులవలన నాక్రమింపబడి, దుర్మార్గులవలన నాక్రమింపబడిన సద్గుణములవలె, శక్తిహీనులైరి.

ద్విపయో బాహుధానానాం క్షణేనాదాయ మస్తకమ్
భల్లైః పలాయ్యాశుగతా విలూనకమలా ఇవ. 56

ద్విపులు భల్లాస్త్రములు బ్రయోగించి క్షణములో బహుధానుల మస్తకములను కమలములను ద్రుంచి, పారిపోయిరి.

మిథః సారస్వతాసీత్వా ఆదినాంతం కృతాజయః
పండితా ఇవ వాదేషు నోద్విగ్నా న పరాజితాః. 57

సరస్వతీతీరవాసులు రోజంతయు యుద్ధమొనర్చి, వాదించు పండితులవలె, అనుద్విగ్నులును, అపరాజితులును నైయుండిరి.

ఖర్వగాః ఖదితాః క్షుద్రా యాతుధానైః పరావృతాః
తేజః పరమమాజగ్ముః శాంతాగ్నయ ఇవేంధనైః 58

క్షుద్రులగు ఖర్వగులోడిపోయినను, లంకాస్థితులగు రాక్షసుల సాయమున, ఆరిపోయిడినిప్పు, కట్టెలుపడిన మరల బ్రకాశించునట్లు తేజమునందిరి.



యదాఖ్యాయత పతజ్జిహ్వానిచయైః కీలాలమాకులితః
వాసుకిరపి వర్ణయితుం న సమర్థో రణవరం రామ. 59

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే లీలోపాఖ్యానే ఉత్పత్తి ప్రకరణే జనపద వర్ణనం నామ సప్తత్రింశః సర్గః ॥ 37 ॥

రామా! ఇంకెట్లు నేనీయుద్ధమును వర్ణింపగలను? — వాసుకి తనసహస్ర జిహ్వలను దెరచియు, ఈయుద్ధమును వర్ణింపజాలడు.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున జనపద వర్ణనమను సప్తత్రింశ సర్గము ॥ 37 ॥

## అష్టత్రింశః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఏవమత్యాకులే యుద్ధే సాస్ఫోటభయసంకులే
ఆదిత్యే తమసా వృద్ధే చటత్కారికంకటే. 1
వహత్స్వంబూత్పతంతీషు పతంతీష్వశ్మవృష్టిషు
నదీషు క్షేపణాచ్ఛాసు వరకేష్వబ్జపంక్తిషు. 2
మిథః ఫలాగ్రకాటోత్థ వహ్నిసీకరిణీషు చ
ఆయాంతీషు ప్రయాంతీషు దూరం శరనదీషు చ. 3
వహల్లూనశిరః పద్మచక్రావర్తైస్తరంగితైః
ఖార్ణవే పూరితే హేతివృందమందాకినీగణైః. 4
సమీరణరణత్కార్వాణ శస్త్రపూర్ణఘనైర్ఘనైః
సందేహం తేషు సిద్ధేషు కపికచ్ఛవ్యథాప్రదైః. 5
అష్టభాగదశాశేష ప్రతాపమధురాకృతి
శస్త్రఘాతౌజసా వీర ఇవాహ స్తనుతాం యయౌ. 6
శ్రాంతాశ్వేభాః ప్రభగ్నాశ్చ హేతిసంఘాతదీప్తయః
దివసేన సమం సేనా యయుర్మందప్రతాపతామ్. 7

వసిష్ఠుడు:— ఇట్లు యుద్ధమత్యంత భయంకరమై జరుగుచుండ, ఓడిపోయినవారి గుండెలు 'పీచు పీచు' మనుచుండెను. వీరుల కవచములు తునిగి రక్తము ప్రవహింపసాగెను; రాళ్లవాన ఊర్ధ్వాధోదేశముల కురియుచుండ, నదులలోనున్న పద్మములు తునిగిపోవుచుండెను. బాణము లొండొంటితో

రాచుకొన, నిప్పురవ్వలు లేచుచుండెను; బాణనదులిటునటు ప్రవహించుచుండెను. ఛిన్నమస్తక పద్మములను సుడిగుండములతోగూడిన ఖడ్గములను గంగానదులతో ఆకాశసముద్రము నిండిపోయెను. కపికచ్ఛవాసుల వేడినిట్టూర్పులతో ఆకాశమునునిండించు శస్త్రములను మేఘమాలతో నాకాశము నిండ, సిద్ధులు ప్రళయకాలము దాపురించినదా యని సందేహపడ జొచ్చిరి. ఎనిమిదవజాము ముగిసినందువలన, దినముకూడ శస్త్రాహతులగు వారులవలె క్షీణప్రభమయ్యెను. ఏనుగలు, గుఱ్ఱములు డస్సిపోయెను. ఖడ్గములకాంతి తగ్గిపోయెను. సైనికులుగూడ దివాభాగమువలె మందప్రతాపులైరి.

అథసేనాధినాథాభ్యాం విచార్యసహమంత్రిభిః
దూతాఃపరస్పరంవృత్తా యుద్ధంసంహ్రియతామితి. 8

అప్పుడు ఉభయపక్ష సేనాపతులు మంత్రులతో యోచించి, యుద్ధమునాపుజేయ దూతలను బంపసాగిరి.

తత్రశ్రమవశాన్మంద యంత్ర శస్త్రపరాక్రమైః
రణసంహారణంకాలే సర్వైరేవాదరీకృతమ్. 9

వీరులయొక్కయు, అస్త్రముయొక్కయు ప్రతాప ముడిగినందువలన, అందఱును యుద్ధము నాపుట కొప్పుదలజూపిరి.

తతోమహారథోత్తుంగ కేతుప్రాంతకృతాస్పదమ్
బలయోరారురోహైక ఏకోయోధోద్రుమోయథా. 10

అప్పుడా యుభయసేనలనుండి యోధులిర్వురు రథపతాకాస్తంభములనెక్కి, ధ్రువనక్షత్రములవలె, ప్రకాశింపసాగిరి.

సోఽంశుకంభ్రామయామాస సర్వదిఙ్మండలేసితమ్
శ్యామేవదీర్ఘశుద్ధాంశుం యుద్ధంసంహ్రియతామితి. 11

వారు సితపతాకలను, రాత్రిచంద్రుని ద్రిప్పునట్లు యుద్ధవిరామ సూచకముగ ద్రిప్పసాగిరి.

తతోదుందుభయోనేదుః ప్రతిధ్వనితదిఙ్ముఖాః
మహాప్రలయసంశాంతౌ పుష్కరావర్తకాఇవ. 12

పిదప, మహాప్రళయానంతరము పుష్కలావర్తములు గర్జించునట్లు, దుందుభులు ధ్వనింప, దిక్కులు ప్రతిధ్వనుల నీనసాగెను.

శరాదిహేతిసరితో విస్తీర్ణే గగనేస్థితే
ప్రవృత్తాఃసుఖమాగంతుం సరసఃసరితోయథా. 13

మానస సరోవరమునుండి నదులుక్రిందకు దిగునట్లు, ఖడ్గాద్యాయుధములు క్రిందపడసాగెను.

యోధదోర్ద్రుమసంచార స్తనుతామాయయాశనైః
భూకంపాంతే వనస్పంద ఇవాభ్రాంతఇవార్ణవః 14

భూకంపానంతరము వనకంపమును, శరత్కాలమున సముద్రచలనమును శాంతించునట్లు, యోధులభుజవృక్షసంచాలన మాగిపోయెను.



వినిర్గంతుంప్రవవృతే రణాదథబలద్వయమ్
వారిపూరశ్చతుర్దిక్షు ప్రలయైకార్ణవాదివ. 15

ప్రళయకాలమున సముద్రమునుండి నీరు వెలువడునట్లు, ఉభయసైన్యములు యుద్ధభూమినుండి వెడలిపోజొచ్చిరి.

ఉత్క్షిప్తమందరక్షీర సముద్రవదనాకులమ్
సైన్యంప్రశామ్యదావర్తం శనైఃసామ్యముపాయయౌ. 16

మందరపర్వతమును వెలువరింప శాంతించిన క్షీరసముద్రమువలె, సైనికుల కల్లోలము శాంతింపసాగెను.

క్రమేణాసీన్మహూర్తేన వికటోదరభీషణమ్
అగస్త్యపీతార్ణవవ చ్ఛూన్యమేవ రణాంగణమ్. 17

రణరంగము క్రమముగ వికటోదరమువలె భీషణమై, అగస్త్యుడుత్రావిన సముద్రమువలె, శూన్యమవజొచ్చెను.

శవసంతతిసంపూర్ణం వహద్రక్తనదాకులమ్
పరికూజనరఝంకార పూర్ణఝిల్లీవనోపమమ్. 18
వహద్రక్తసరిత్స్రోత స్తరంగారవఘర్ఘరమ్
సాక్రందార్ధమృతాహూత సప్రాణవ్యగ్రమానవమ్. 19
మృతార్ధమృతదేహౌఘ స్పృతాసృక్ప్లుతనిర్ఝరమ్
సజీవనరపృష్ఠస్థ శవస్పందనభ్రాంతిదమ్. 20

అప్పుడచ్చట శవసమూహములు పడియుండెను. రక్తనదులు ప్రవహింపజొచ్చెను. చూచుటకయ్యది ఝిల్లీరవములతోనిండిన అడవివలెనుండెను. రక్తనదీ తరంగములు ధ్వనినొనర్చుచుండెను. అర్ధమృతులితరులను దీనముగ పిలువజొచ్చిరి. మృతులును, అర్ధమృతులును నగువారిశరీరములనుండి రక్తము సెలయేళ్లవలె ప్రవహింపసాగెను. జీవితులప్రక్కన బడియున్న శవములుకదలి, జీవించియున్నట్లు తోచుచుండెను.

కరీంద్రశవరాశ్యగ్ర విశ్రాంతాంబుదఖణ్డకమ్
విశీర్ణరథసంఘాతం వాతచ్ఛిన్నమహావనమ్. 21
వహద్రక్తనదీరంహః ప్రోహ్యమానహయద్విపమ్
శరశక్త్యృష్టిముసల గదాప్రాసాసిసంకులమ్. 22
పర్యాణావవసన్నాహ కవచావృతభూతలమ్
కేతుచామరపట్టౌఘ గుప్తం శవశరీరకమ్. 23
ఫణాస్ఫుటకతూణీర కుంజకూజత్సమీరణమ్.
శవరాశిపలాలౌఘ తల్పసుప్తపిశాచకమ్. 24
మాలిహారాంగదద్యోత శక్రచాపఘనావృతమ్
శ్వశృగాలకరాకృష్ట సాంద్రాంత్రాదీర్ఘరజ్జుకమ్. 25

రక్తక్షేత్రక్వణత్కాంచి చ్ఛేదజీవన్మృదంతురమ్
రక్తకర్దమనిర్మగ్న సజీవనరదర్దురమ్. 26
వరాంగకవచప్రఖ్య నిర్గతాక్షిశతోచ్ఛ్రయమ్
వహద్భుజోరుకాష్ఠౌఘ ఘోరరక్తసరిచ్ఛతమ్. 27
సాక్రందబంధువలితం మృతార్ధమృతమానవమ్
శరాయుధరథాశ్వేభ పర్యాణాసంవరాంతరమ్. 28
నృత్యత్కబంధదోర్దండ మండలానమితాంబరమ్
మదమేదోవసాగంధ పీటార్ద్రిఘ్రాణకోటరమ్. 29
ఉత్తాల్యార్ధమృతేభాశ్వవార్యమాణాల్పజీవితమ్
వహద్రక్తనదీవీచి ప్రవాహరహతదుందుభి. 30

మేఘములు పర్వతములని భ్రమపడి, మృతించిన ఏనుగులమీద విశ్రమింపసాగెను. విరిగిపోయిన రథములు గాలిచే భిన్నమొనర్పబడిన అరణ్యమువలె కన్పడుచుండెను. రక్తనదీప్రవాహమున ఏనుగులును, గుఱ్ఱములును దేలిపోవుచుండెను. ఖడ్గాద్యాయుధములతో నాతావు నిండియుండెను. పల్యాణము (=గుఱ్ఱపుజీను) లతోడను, కవచములతోడను, యుద్ధభూమియు, పతాకములతోడను, చామరములతోడను శవములును గప్పబడియుండెను. అమ్ములపొదియందు గాలిదూర, వెదురుపొదయందువలె, ధ్వనివెలువడుచుండెను. శవములను తలగడలుగ జేసికొని, రక్తశయ్యల పిశాచములు పరుండియుండెను. చూడామణులనుండియు, అంగదములనుండియు కాంతులువెలువడి, ఇంద్రధనుస్సుల అరణ్యమాయనిపించుచుండెను. అప్పుడు కుక్కలు, నక్కలువచ్చి, శవముల పొట్టలనుజీల్చి ప్రేగులను త్రాళ్లను లాగసాగెను. ప్రాణములను వదలువారు పళ్లు 'పటపట' లాడించుచుండిరి. రక్త - కర్దమము (బురద)న జీవితులగు నరులను కప్పలుమునుగుచుండెను. యోధుల నయనములు విచిత్రకవచములవలె దోచుచుండెను. కొండటి భుజములు, తొడలు తెగి రక్తనదియందు, కట్టెలవలె, తేలిపోవుచుండెను. మృతులును, అర్ధమృతులునునగువారిని చుట్టుముట్టి బంధువులు, విలపించుచుండిరి. శరాద్యాయుధములతోడను, రథాదివస్తువులతోడను, అశ్వాదులగు జంతువులతోడను, యుద్ధభూమి నిండియుండెను. శవములు చేతులెత్తి నాట్యమొనర్చుచుండ, నింగిక్రుంగుచుండెను. హస్తిమదగంధము ముక్కులకు పీడగలిగించుచుండెను. కొనయూపిరియున్నవారు అర్ధమృతములును, ఊర్ధ్వశ్వాసులునునగు గజాశ్వాది జంతువులతాకిడులవలన మరణించుచుండిరి. ఆగిపోయిన దుందుభులు రక్తనదీతరంగాఘాతముల మరల మ్రోగసాగెను.

ఉహ్యమానమృతేభాశ్వ మకరాసృక్సరిచ్ఛతమ్
మ్రియమాణనరానీక ఘూత్కృతాసృక్ప్రణాలికమ్. 31
స్వల్పజీవశరాపూర్ణ ముఖదృక్కాంతితస్వనమ్
పిండభార్యావసాగంధ వాతాంతోత్పీతలోహితమ్. 32
ఉన్నాసార్ధమృతేభేంద్ర కరాక్రాంతకబంధకమ్
నిరధిష్ఠితహాస్త్యశ్వ పాతితోచ్చకబంధకమ్. 33



రుదత్క్రందత్పరిభ్రష్ట శవలుబ్ధాసృగుద్ధతి
మృతభర్తృగలేశస్త్ర త్యక్తప్రాణ కులాంగనమ్. 34
సేనోత్క్రాంతతతక్షిప్త బహుపాంథపరీక్షణమ్
శవహారకరాకృష్ట సప్రాణానుచరాకులమ్. 35
కేశశైవాలవక్త్రాబ్జ చక్రావర్తనదీశతమ్
తరత్తుంగతరంగాఢ్య వహద్రక్తమహానదమ్. 36
అంగలగ్నాయుధోద్ధార వ్యగ్రార్ధమృతమానవమ్
విదేశమృతసాక్రంద హుతాంగగజవాజినమ్. 37
ప్రాణాంతస్మృతపుత్రేష్ట మాతృదేవపరాభిధమ్
హాహాహీహీతికథిత మర్మచ్ఛేదనవేదనమ్. 38
మ్రియమాణమథౌజిష్ఠ ద్విష్టప్రారబ్ధసంచయమ్
దంతియుద్ధాసమర్థాగ్ర మృతదేహేష్టదైవతమ్. 39
మ్రియమాణమహావజ్ఞా శూరాశ్రితపలాయనమ్
అశంకితాసృగావర్త భీమాస్పదగమోత్సుకమ్. 40

రక్తనదులు నూర్లకొలది ప్రవహించుచుండ, అందు ఏనుగలు గుఱ్ఱములు అను మొసళ్లు తేలిపోవుచుండెను. మృతింపబోవు సైనికులు ఘూత్కారమొనర్చుచుండ, వారి నోళ్లనుండి రక్తము వెలువడి, ప్రవహింపసాగెను. కొనయూపిరితోనున్నవారి కంఠధ్వనులు, వారినోళ్లు బాణములు గ్రుచ్చబడియుండుటవలన, అవరుద్ధమగుచుండెను. పొట్టకడమసైపునున్న మాంసఖండమునుండి వెలువడు దుర్గంధమున రక్తము కరుడుగట్టిపోవునట్లుండెను. అర్ధమృతములగు ఏనుగులు తొండములతో మొండెములను లాగుచుండెను. తోలువారు లేకపోవుటవలన గుఱ్ఱములును, మావటీంద్రుడు లేకపోవుటవలన ఏనుగులును, శవములపై బడుచుండెను. ఏడ్చుచు కూలుచున్న శరీరముల వలన రక్తప్రవాహము చిందిపైకిలేచుచుండెను. మృతభర్తల కంఠములను గౌగలించుకొని వారిభార్యలు, కత్తితోపొడుచుకొని, ప్రాణములను వదలుచుండిరి. శవములను దహింపవచ్చినవారు, భయముతో, తొందరగ తమవారి శవములను వెదకుచుండిరి. కొందఱు బ్రతికియున్నవారి చేతులను బట్టుకొని నడిపించుకొని పోవుచుండిరి. ఆరక్తనదియందు, మృతుల కేశములునాచువలెను, ముఖములు పద్మములవలె, చక్రములు సుడిగుండములవలెను, తురంగములు తరంగములవలెను, శోభించుచుండెను. అర్ధమృతులగువారు తమశరీరమునకు గ్రుచ్చుకొనియున్న ఆయుధములను పెకలించుకొన, తొందరపడుచుండిరి. పరదేశవాసి తనవారిస్మృతిని వగచి, ఆభరణములను, వాహనములను ఇతరులకిచ్చివేయుచుండెను. ప్రాణములను వదలువారు తుదకు తల్లిదండ్రుల పేర్లను ఇష్టులగువారి పేర్లను, పరమేశ్వరునినామములను దలచుచుండిరి. కొందఱు బాధనుసహింపజాలక 'హాహాహీహీ' అని అరచుచుండిరి. మఱికొందఱు, తమప్రారబ్ధ కర్మలను గుఱించి వగచుచుండిరి; దంతియుద్ధమున నోడిపోయి, నలిగిపోయినవారు తమ ఇష్టదేవతలను స్మరించుచుండిరి. చావనున్నవారిని పాదములతోత్రొక్కి శత్రువులు అవమానించుచుండుటగాంచి, పరిగిడగలవారు పారిపోవుచుండిరి. ఆతొందరలో వారు రక్తనదీ-ఆవర్తములలో పడిపోదుమేమో? యని గూడతలపలేదు.

మర్మచ్ఛేదశరాఘాత వ్యథావిదితదుష్కృతి
కబంధబంధప్రారబ్ధ వేతాలవదనాక్రమమ్. 41
ఉహ్యమానధ్వజచ్ఛత్ర చారుచామరపంకజం
కిరత్సంధ్యారుణాం దిక్షు తేజస్కందరక్తపంకజమ్. 42
రథచక్రధరావర్తం రక్తార్ణవమివాప్తమమ్.
పతాకాఫేనపుంజాఢ్యం చారుచామరబుద్బుదమ్. 43
విపర్యస్తరథంభూమి పంకమగ్నపురోపమమ్
ఉత్పాతవాతనిర్ధూత ద్రుమం వనమివాతతమ్. 44
కల్పదగ్ధజగత్ప్రఖ్యం మునిపీతార్ణవోపమమ్
అతివృష్టిహతం దేశ మివప్రోజ్ఝితమానవమ్. 45
కలాపకుంతవలితం భుశుండీమండలాకులమ్
మత్తనాగశతాకార శవతోమరముద్గరమ్. 46
శిలాశిఖరసంజాత తాలజాలమివాతతమ్
తరద్రక్తనదీతీర జాతకుంతోన్నతద్రుమమ్ 47
నాగాంససూత్యతహేత్యోఘ వృతాంశుకుసుమాకులమ్
కంకకృష్టాంత్రరసనా వృందజాలకితాంబరమ్. 48
అసృక్సరిత్తీరజాతం కుంతోన్నతవనద్రుమమ్
అసృక్సరోవరోర్ధ్వస్థ పతాకానలినీగణమ్. 49
రక్తకర్దమనిర్మగ్న నరాహూతసుహృజ్జనమ్
కరీంద్రకుణపాపాత నిర్యద్భగ్నజనేక్షితమ్. 50

శరాఘాతమున బాధపడుజీవులు పూర్వపు దుష్కర్మలను దలచుకొనుచుండిరి. రక్తమును ద్రావ, బేతాళగణము, మొండెములనుండి తలలను వేరుపరచుచుండెను. రక్తనదీప్రవాహమున ధ్వజ, ఛత్రచామరములను పద్మములు తేలుచుండెను. సంధ్యారాగము రక్తనదియందు ప్రతిఫలింప, నలుదిక్కుల నెట్టిదామరల జల్లినట్లుండెను. అచ్చటిరక్తమును చూచువారికి రథచక్రములను సుడిగుండములతోను, పతాకములను ఫేనముతోడను, చామరములను బుద్బుదములతోడను గూడిన ఈరక్తసముద్రము నెనిమిదవ సముద్రమా యనిపించుచుండెను, 'రథములు తలక్రిందులై బురదలో కూరికొనిపోయిన పట్టణముల వలెనుండెను. సైనికులు పెనుగాలిచే నూపబడుచున్న చెట్లతోగూడిన అరణ్యమువలె నగుపడుచుండిరి. ప్రళయదగ్ధమగు ప్రపంచమువలెను, అగస్త్యపీతమగు సముద్రమువలెను, అతివృష్టిహతమగు దేశమువలెను, జనశూన్యమగు ఆరణరంగ మగుపడుచుండెను. ఆభరణములును, అస్త్రములును బడియుండెను. భుషుండి అస్త్రములు 'చిందరవందర' యైయుండెను. ఏనుగులవలె శవములును, పాములవలె శరతోమరాదులును పడియుండెను. రక్తనదీతీరమున కుంతవృక్షములు లేచియుండెను; అవి కొండకొమ్మన మొలచిన తాటిచెట్లవలె నగుపడుచుండెను. ఏనుగులకు గ్రుచ్చబడిన కత్తులను చెట్లనుండి వెలువడు కిరణములను కుసుమములతో, అచోటునిండియుండెను. కంకపక్షులు వాలుకలను, ప్రేగులను లాగుచుండ, ఆకా-



శమును వలతోగప్పినట్లుండెను. కుంతాయుధములు రక్తనదీతీరమునను్న వృక్షములవలె దోచుచుండెను. పతాకలు రక్తనదియందున్న తుమ్మెదలవలె నగుపించుచుండెను. రక్తపురొంపిలో గూరుకొనిపోయినవారు, తమ స్నేహితులను బిలచుచుండిరి. ఏనుగుల శవములనుండి బడినవారు నురల జావంకను జూచుచుండిరి.

హేతిలూనలతైర్వృత్తైః సందిగ్ధార్థకబంధకమ్
అసృఙ్నదీవహద్ధస్తి కటకగ్పటనౌగణమ్. 51
రక్తస్రోతఃస్ఫురచ్ఛుక్ల వస్త్రడిండీరపిండకమ్
సంసారనియతక్షిప్ర భృత్యవిచ్ఛిన్నమానవమ్. 52
ఇతశ్చేతశ్చనిపతత్ కబంధరవదానవమ్
ఊర్ధ్వస్థూలాంక చక్రౌఘ చ్ఛిన్నసైన్యద్రవజ్జనమ్. 53
రక్తనిఃస్వనభాంకార ఫేత్కారార్ధమృతారవమ్
శిలాముఖలలద్రక్త ధారాధూతరజఃఖగమ్. 54
సుతాలోత్తాలవేతాల తాలతాండవసంకటమ్
పర్యస్తరథదార్వంత రర్ధాంతరితసద్భటమ్. 55
అంతస్థసజ్జీవభట స్పందిస్పందనభీతిదమ్
రక్తకర్దమపూర్ణాస్య కించిజ్జీవకృపాచ్ఛవమ్. 56
కించిజ్జీవసర్తోద్గ్రీవ దుఃఖదృష్టశ్వవాయసమ్
ఏకామిషోత్క్రవ్యాద యుద్ధకోలాహలాకులమ్
ఏకామిషార్థయుద్ధేహ మృతక్రవ్యాదసంకులమ్. 57

మొండెములను జూచువారికి, కొమ్మలువిరిగిన చెట్లాయను సందేహము కలుగసాగెను. రక్తప్రవాహమున దేలిపోవు ఏనుగుల గండస్థలములును, తదలంకృతములగు వస్త్రములును నాకయను భ్రమను గొల్పుచుండెను. రక్తప్రవాహమున దేలిపోవు శుక్లవస్త్రములు ఫేనము (నురుగు)వలె గన్పడుచుండెను. సేవకు లరుదెంచి జీవితులను, మృతులను, వేరుపరచుచుండిరి. ఇటనట [illegible] చక్రములవలన భిన్నమొనర్పబడి సైనికులు పరిగిడుచుండిరి, అర్ధమృతులగువారు [illegible] గ్రక్కుకొనుచు[illegible] కార, ఫూత్కార" శబ్దములు వెలు[illegible]. పక్షు[illegible]లతో దుమ్ము లేవనెత్తుచు, బాణముల నుండి పారుచున్న రక్తమును ద్రావసాగెను. తాళ్లవలె పొడుగుగనున్న బేతాళురు తాళములు వైచుచు ఒనర్చునృత్యము బ్రతికియున్న భటులకు గష్టమును గలిగించుచుండెను. కొందఱు రథకాష్ఠముల గప్పబడియుండిరి. కొనయూపిరితోనున్నవారు కదలుచుండ, భయముకలుగుచుండెను. రక్తపురొంపిలో మునిగియున్న అర్ధమృతులను గొందఱు దయతో నటనుండి తొలగించుచుండిరి. అల్పజీవులు కొందఱు దుఃఖముతో కుక్కలను, కాకులను జూచుచుండిరి. మాంసాహారులగు జంతుజాలము మాంసము సంతటిని గైకొన కోలాహల మొనర్చుచు పోరాడసాగెను. అందోడిపోయిన వాటి ప్రాణములుగూడ పోవుచుండెను.

విప్రకృత్తాసంఖ్యాశ్వద్విరదపురుషాధీశ్వరరథ
ప్రకృత్తోష్ట్రిగ్రీవాప్రసృతరుధిరోద్గారసుసరిత్
రణోద్యానమ్మృత్యోస్తద భవదశుష్కాయుధలతం
సశైలంకల్పాంతే జగదివవిపర్యస్తమఖిలమ్. 58

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ఆహవవర్ణనంనామ అష్టత్రింశః సర్గః ॥ 38 ॥

ఇట్లు, మృతులగు మనుష్యులయొక్కయు, జంతువులయొక్కయు కంఠమునుండి రక్తము ప్రవహించుచుండ, ఆయుధ — లతలు చిగిర్చి, ఆ రణరంగము మృత్యుదేవత విహరించు వనమువలె నగపడుచు, ప్రళయకాలమున పర్వతములతోగూడ తల్లకిందులైన జగత్తువలెనుండెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
లీలోపాఖ్యానమున ఆహవవర్ణనమను అష్టత్రింశ సర్గము ॥ 38 ॥

——— :o: ———

## ఏకోనచత్వారింశః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అథ వీర ఇవారక్తః కాలేనాస్తమితో రవిః
అస్త్రతేజఃపరిమ్లాన ప్రతాపోఽబ్ధౌ సమున్ఝితః. 1

వసిష్ఠుడు:— రామా! అప్పుడు సూర్యుడు వీరులవలనే ఎఱ్ఱబడి, అంతర్హితుడయ్యెను. అస్త్రతేజము పరిమ్లానమై ప్రతాపాబ్ధియందు గ్రుంకెను.

రణరక్తరుచిర్వ్యోమ దర్పణప్రతిబింబితా
జహౌ సూర్యశిరశ్ఛేదే సంధ్యాలేఖోదభూత్క్షణమ్. 2

సూర్యుడను అశ్వముయొక్క శిరస్సు ఖండింపబడ, ఆకాశ — దర్పణమున ప్రతిబింబించిన రక్తకాంతి, ఆకాశదేశమును బరిత్యజించెను. క్షణములో సంధ్య అరుదెంచెను.

భూపాతాలనభోదిగ్భ్యః ప్రలయాబ్ధిజలౌఘవత్
సమాజగ్ముస్తనత్తాలా వేతాలావలయాఇవ. 3

అప్పుడు బేతాళగణము భూనభోపాతాళములనుండియు, నలుదిక్కులనుండియు, చప్పట్లు చరచుచు, ప్రళయసముద్రజలమువలె వలయాకారమును దాల్చి, రాదొడంగిరి.

మృష్టధ్వాంతాసివలితే దినానాగేంద్రమస్తకే
సంధ్యారాగారుణం కీర్ణం తారానికరమౌక్తికమ్. 4



దినము అను ఏనుగుయొక్క కుంభస్థలమును రాత్రి అను ఖడ్గము ఛేదింప, సంధ్యారాగమున అరుణములైన నక్షత్రములను ముత్యములు చెదరిపడినట్లుండెను.

నిఃసత్త్వేషు తమోంధేషు రసనారసశాలిషు
సంకోచమాయయుఃపద్మా మృతానాంహృదయేష్వివ. 5

యోధుల హృదయపద్మములు ప్రాణమను * హంస లేకుండుటవలన మోహాంధకారమున మునిగి సంకుచితములయ్యెను.

మాలత్పతఃతృణాత్సుప్తాః కృచ్ఛ్రప్రోచ్ఛ్రితకంధరాః
కులాయేషుఖగాఅసఙ్ఘవాంగేష్వివ హేతయః. 6

మృతుల శరీరములకు గ్రుచ్చుకొనియున్న శస్త్రములు, గూండ్లయందు మెడలెత్తి కూర్చొనియున్న పక్షులవలె నగుపడుచుండెను.

ఆసన్నచంద్రసుభగా లోకాఃకుసుమపంక్తయః
ఉల్లసద్హృదయా జాతా వీరపక్షేష్వివశ్రియః. 7

వీరులను వరించిన జయలక్ష్మివలె, కలువలు వెన్నెలరాగా వికసించెను.

రక్తవారిమయీసాయ ముంగగుప్తశిలీముఖా
సంకుచద్వక్త్రపద్మాభూద్రణభూమిరివాబ్జినీ. 8

రక్త — జలమయమగు రణభూమి ముఖపద్మము, గుప్తశిలీముఖమగు పద్మినివలె, ముడుచుకొనిపోయెను. ‡

ఉపర్యభూద్వ్యోమసరస్తారాకుముదమండితమ్
అధస్త్వభూద్వారిసరః స్ఫురత్కుముదతారకమ్. 9

ఊర్ధ్వమునయున్న ఆకాశ — సరోవరము నక్షత్రములను కలువలతో నలంకరింపబడెను. అధోదేశమునయున్న సరోవరముల కలువలను నక్షత్రములు ప్రకాశింపసాగెను.

తమస్యపేతభీతాని భూతాని మిలితాన్యలమ్
పయాంసీవ వినేతూని ప్రసృతాని దిశంప్రతి. 10

గట్టునుదాటిపోగోరు నీరు, అడ్డుకట్టలేకున్న నలువైపులకు పారునట్లు, ఆ యంధకారమున భూతములు నలువైపులనుండివచ్చి, కలిసికొనసాగెను.

ఆసీద్రణాంగణం గాయ ద్వేతాలకులసంకులమ్
క్వణత్కంకాలకాంకస్థ కంకకాకోలకేలిమత్. 11

---

* హంస = సూర్యుడు, అంచ,

‡ శిలీముఖమన, బాణము, భ్రమరము అను అర్థములున్నవి. పద్మమున తుమ్మెదలుండ, అది ముడుచుకొనిపోయినప్పుడు తుమ్మెదలందు బంధింపబడుననుట లోకప్రసిద్ధము; అందువలన గుప్తశిలీముఖమను విశేషణము ప్రయోగింపబడినది. ఇక, రణభూమియందు బాణములు పడియేయున్నవికదా! అందువలన, గుప్తశిలీముఖపదము ఇయ్యెడలగూడ లక్షింపబడినది. — అను.

అథకాష్ఠచితాజ్వాల సతారాంబరభాస్వరమ్
పచత్పచపచాశబ్ది మేదోమాంసమయానలమ్. 12
సర్వాంగాస్థిస్ఫుటాస్ఫోట స్ఫుటచ్చితిచయోన్ముఖమ్
వేతాలలలనారబ్ధ జలలీలాతిరోహితమ్. 13
శ్వకాకయక్షవేతాల తాలకోలాహలోల్బణమ్
గమాగమేనభూతానాం సముడ్డీనవనోపమమ్. 14
రక్తమాంసవసామేదో హారణవ్యగ్రడాకిని
చర్వితాసృగ్వసామాంస స్రవత్సృక్కిపిశాచకమ్. 15
మధ్యమధ్యచితాలోక ప్రకటాసుక్శవవ్రజమ్
విరూపికానీయమాన స్వాంసన్యస్తమహాశవమ్. 16
ఉత్తాండవోగ్రకుంభాండ మండలోడ్డామరోదరమ్
ఛమిచ్ఛమిత్రుటల్లాపాంతం మేదోసృగ్బాష్పసాంబుదమ్. 17
వహద్రక్తనదీరంహో రూఢభూచరరూపికమ్
వేతాలకులకంకాల కర్షణాకులకాకలమ్. 18
మృతేభోదరమంజూషా సుప్తవేతాల బాలకమ్
వివిక్తకరణోద్దేశ పానక్రీడాస్థరాక్షసమ్. 19
మత్తవేతాలకలహ చితాలాతరణోజ్జ్వలమ్
వహద్రక్తవసామిశ్ర గంధబంధురమారుతమ్. 20

అప్పుడా రణరంగము, పాడుచున్న బేతాళగణములతో నిండిపోయెను. "కణకణ" శబ్దముల నొనర్చు అస్థిపంజరములమీద కంకాదిపక్షులు వ్రాలి, క్రీడింపసాగెను. వీరుల చితులనుండి అగ్ని జ్వాలలు లేచి నక్షత్రమండితమగు ఆకాశమును ప్రకాశింపజేయసాగెను. క్రొవ్వుమాంసములు నిప్పునబడికాలుచుండ "పచపచ" ధ్వనులను, ఎముకలు కాలుచుండ "స్ఫుటస్ఫుట" ధ్వనులను వెలువడుచుండెను. బేతాళ — లలనలు చితాగ్నియందుండి, జలక్రీడ నారంభింపసాగిరి. శ్వాన, కాక, యక్ష, భేతాళ, భూతగణముల కోలాహలము భయంకరమైయుండెను; భూతముల రాకపోకలవలన, ఆచోటు ఉబ్బెత్తుగలేచిన అడవివలెనుండెను. రక్తమాంసాదులనుగైకొన, భూతములు తొందరపడుచుండెను. వాటి నారగించుచున్న భూతములనోళ్లనుండి, అవికారుచుండెను. మధ్యమధ్య, చితాగ్నికాంతివలన, శవములును, రక్తమునునగుపడుచుండెను. కురూపిణులగు పిశాచములు శవములను భుజములనిడికొని మోసికొనిపోవుచుండెను. ఉగ్రములగు కుంభాండ — పిశాచములు సంచరింపసాగెను. చితినుండి "చిమచిమ" శబ్దములు వెలువడసాగెను. మేదోమాంసముల పొగవలన మేఘములు క్రమ్ముకొనినట్లుండెను. రక్తనదియందు పాదములు కూరుకొనిపోవ, ఖేచరులుగూడ భూచరులవలెనే అగుపించుచుండిరి. బేతాళగణములు కొనిపోవు కంకాళములను, కంకపక్షులు లాగసాగెను. బేతాళబాలురు మృతించిన ఏనుగుల పొట్టలను పెట్టెలలోదూరి, పరుండసాగిరి అరుబయట రాక్షసులు రక్తమునుద్రావుచు క్రీడింపసాగిరి. బేతాళగణ మున్మత్తమై చితులనుండి నిప్పునుగొని, ఒకరినొకరు కాల్చుకొనసాగిరి. అచ్చటిగాలి, రక్తమేదో గంధములతో నిండిపోయెను.



రూపికాపేటికావాంతా రణద్రటరటారవమ్
అర్ధపక్వశవాస్వాద లుబ్ధయక్షోల్లసత్కలి. 21
తుంగవంగకలింగాంగ తంగణాంగలగత్ఖగమ్
తారాపాతోపమహాస త్సంముఖజ్వాలరూపికమ్. 22
పతద్వేతాలసోల్లాస మధ్యస్థాసృగ్విరూపికమ్
పిశాచాకర్ణితాభ్యర్ణ యోగినీగణనాయకమ్. 23
ప్రసృతాంత్రమహాతంత్రీప్రాయసంపన్నవాదనమ్
పిశాచవాసనోత్క్రాంత పిశాచీభూతమానవమ్. 24
రూపికాలోకనాపూర్వ త్రాసార్ధమృతసద్భటమ్
క్వచిద్వేతాలరక్షోభి రపరీపూర్ణమద్రకమ్. 25
స్వరూపికాస్కంధపత చ్ఛవత్రస్తనిశాచరమ్
నభఃసంఘట్టితాపూర్వ భూతపేటకసంకటమ్. 26
అతిప్రయత్నాపహృత మ్రియమాణనరామిషమ్.
స్వభక్ష్యోపేక్షపక్షేషు విక్షిప్తశవరాశిమత్. 27
శివాముఖానలశిఖా ఖండోత్థమితిరక్తగైః
సముడ్డీననవాశోక పుష్పగుచ్ఛమివాభితః. 28
కబంధకంధరాబంధ వ్యగ్రవేతాలబాలకమ్
యక్షరక్షః పిశాచాది కచదాకాశగోల్ముకమ్. 29

పిశాచముల పేటికల 'రట రట' శబ్దములు వినబడసాగెను. యక్షులు అర్ధపక్వములగు శవముల రుచిమరిగి, పోరాడసాగిరి. ర్రాత్రులందు తిరుగాడుపక్షులు, అంగ, వంగ, కళింగ, తంగణదేశీయుల శరీరములపైవ్రాలెను. పిశాచములు నవ్వుచుండ, నక్షత్రములు పడినట్లుండెను. బేతాళగణము రక్తపు గ్రొంపియందు కాలుజారిపడ, పిశాచములునవ్వసాగెను. పిశాచములు యోగినీగణనాయకుల సావ్వినింపనాడగెను. అవి వీరుల హస్తములనుండి శస్త్రములను లాగుచుండ వీణానాదమునుబోలు ధ్వని వెలువడసాగెను. పిశాచములనుగూర్చి తలపోయుచుండుటవలన, మృతులగు మనుష్యులుగూడ పిశాచరూపములనుదాల్చిరి. పిశాచములనుజూచి భయపడి, భటులు అర్ధమృతులైరి. బేతాళగణమును, రాక్షసగణమునుగలిసి, ఆనందోత్సవము నొనరించుకొనసాగిరి. రాక్షసీగణముల భుజములమీద పడుచున్న శవముల శబ్దములను విని రాక్షసులు భయపడుచుండిరి; భూతగణములను పెట్టెలతో ఆకాశము నిండిపోయెను. మృతులమాంసమును (పిశాచములు) అతి ప్రయత్నముతో గ్రహించుచుండెను; శవములను భక్షింపవేచియున్న పిశాచముల ముందట, శవరాసులనుదెచ్చి వారి బందుగులుంచుచుండిరి. యుద్ధమున గాయపడి రక్తదేహులైనవారు మూర్ఛనుండి తేరుకొనిన పిమ్మట, జంబుకముఖ నిర్గతకాంతులనుండుట, అశోకపుష్పగుచ్ఛములవలె నగుపడుచుండిరి. బేతాళ బాలకులు మొండెములకు మరల తలల నంటించుచు నాడుకొనసాగిరి. ఆకాశమున యక్షరాక్షస పిశాచములు నిప్పులవలె ప్రకాశింపబొచ్చిరి.

ఆకాశభూధరనికుంజగుహాంతరాల
పిండోపమండితతమోంబుద పీఠపూరమ్
వ్యాలోలభూతరభసాకులకల్పవాత
వ్యాధూతలోక కరకాండక పేటకల్పమ్. 30

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
నిశాచరాకులరాత్రి రణాంగణవర్ణనంనామ ఏకోనచత్వారింశః సర్గః ॥ 39 ॥

ఆకాశము, కొండలు, పొదలు, గుహలు పిండాకృతులగు అంధకార మేఘములతో నిండిపోయెను; అప్పుడు భూతముల వేగముతో నిండిన ఆ రణభూమి, కల్పాంతవాయు విక్షోభితమగు బ్రహ్మాండమువలె భయంకరమై తనరారెను

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తి ప్రకరణమున
లీలోపాఖ్యానమున రాత్రిరణాంగణవర్ణనమను ఏకోనచత్వారింశ సర్గము ॥ 39 ॥

## చత్వారింశః సర్గః.

శ్రీవసిష్ఠ ఉవాచః—

ఏవంనిశాచరాచార చిరఘోరే రణాంగణే
అహనీవజనాచారే స్థితేయామానరేహితే. 1
హాస్తవార్యతమఃపిండ స్ఫుటకుడ్యేనిశాగృహే
లాభోచ్ఛదోచ్ఛలచతే భూతసంఘప్రవల్గతి. 2
నిఃశబ్దేధ్వాంతసంచారే నిద్రారుద్ధకకుబ్గణే
లీలాపతిరుదారాత్మా కించిత్ఖిన్నమనాఇవ. 3
ప్రాతఃకార్యంవిచార్యాశు మంత్రిభిర్మంత్రకోవిదైః
దీర్ఘచంద్రసమాకారే శయనేహిమశీతలే. 4
చంద్రోదరనిభేచారు గృహే శిశిరకోటరే
నిద్రాం ముహూర్తమగమ న్ముద్రితేక్షణపుష్కరః. 5

వసిష్ఠుడు:– ఇట్లు నిశాచరుల క్రీడతో భయంకరమైన రణరంగమున యమదూతలును, పిశాచములును తమతమ కార్యములను, పగటిపూట మనుష్యులాచరించునట్లు, ఒనర్చుచుండిరి. చేతితో గైకొన వీలగు, తమఃపిండములను కుడ్యములుగల నిశాగృహమున భూతములు భక్ష్యములనుబొంది ఆనందముతో నృత్యమొనర్పసాగెను నలుదిక్కులు గాఢాంధకారమున మునుగ, ప్రాణులందరు నిద్రితులైరి. అంతయు నిశ్శబ్దముగనుండెను. అప్పుడుదారుడగు లీలాపతి నిపుణులగు మంత్రులతో



మరుసటిరోజున నొనర్పవలసిన కార్యముల నాలోచించెను; పిదప, చంద్రమండలమునుబోలు మనోహరగృహమున, మంచువలె చల్లనగు పాన్పున బరుండి, కనుదమ్ముల మూసికొని, ఒకింత నిద్రించెను.

అథతే లలనేవ్యోమ తత్పరిత్యజ్యతద్గృహమ్
రంధ్రైర్వివిశతుర్వాత లేఖేఽబ్జముకులం యథా. 6

అప్పుడు లీలయును, సరస్వతీదేవియును నాకాశమును బరిత్యజించి, గాలి తామర మొగ్గలో దూరునట్లు, రంధ్రద్వారమున ఆగృహమును బ్రవేశించిరి.

శ్రీరామ ఉవాచః—

కియన్మాత్రమిదంస్థూలం శరీరం వాగ్విదాంవర
రంధ్రేణతంతుతనునా కథమాశ్వావిశత్ప్రభో. 7

శ్రీరాముడు:– ప్రభూ! వాగ్మివరా! అత్యంతస్థూలమగు ఈశరీరము, ఛిద్రద్వారముగుండ లోని కట్లుసగగలిగెను.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఆధిభౌతికదేహోఽహ మితి యస్యమతిభ్రమః
తస్యాసావణురంధ్రేణ గంతుం శక్నోతి నానఘ. 8
రోధితోఽహమనేనేతి న మామ్యత్రేతి యస్యధీః
అనుభూతానుభవతీ భవతీత్యనుభూయతే. 9
యేనానుభూతంపూర్వార్ధం గచ్ఛామీతి సత్క్రియః
కథంభవతిపశ్చార్ధం గమనోన్ముఖచేతనః. 10

వసిష్ఠుడు:– అనఘా! ఆధిభౌతిక దేహభ్రాంతియుతులగువారు, అణుప్రమాణమగు రంధ్రమున ప్రవేశింపజాలరు. 'నేను స్థూలశరీర బద్ధుడను, ఛిద్రమున బ్రవేశింపజాలను' అను సంస్కారముగలవారదు ప్రవేశింపజాలరనుట అనుభవసిద్ధము. స్థూలదేహబుద్ధిలేనివారును, ఆతివాహిక దేహనిశ్చయము గలవారునునగు పురుషులు తమసంస్కారబలమున, సూక్ష్మప్రదేశముల కటిగిరాగలరు.

నహివార్యూర్ధ్వమాయాతి నాధోగచ్ఛతిపావకః
యాయథైవప్రవృత్తాచిత్సా తథైవప్రతిష్ఠితా. 11
ఛాయాయాముపవిష్టస్య కుతస్తాపానుభూతయః
యస్యసంవేదనేఽన్యోఽర్థః కేనచిన్నానుభూయతే. 12

వస్తువులు తమతమ స్వభావమును వీడజాలవు; నీరు మెరకకు పారదు, అగ్ని జ్వాలలు క్రిందికిరావు, నీడలో గూర్చొనిన ఎండతగులదు; పరమాత్మ నెఱింగినచో నెట్టిదుఃఖములును గలుగవు.

యథాసంవిత్తథాచిత్తం సా తథావస్థితింగతా
పరమేణప్రయత్నేన నీయతేఽన్యదశాంపునః. 13
సర్పైకప్రత్యయో రజ్జ్వా మసర్పప్రత్యయే బలాత్
నివర్తతేఽన్యథాత్వేష తిష్ఠత్యేవ యథాస్థితః. 14

యథాసంవిత్తథాచిత్తం యథాచిత్తంతథేహితమ్
బాలంప్రత్యపిసంసిద్ధ మేతత్కోఽనానుభూతవాన్. 15

చిత్తము చైతన్యము ననుసరించును, రజ్జువున సర్పభ్రాంతియు, రజ్జుజ్ఞానమును జ్ఞానబలము ననే కలుగుచున్నవి. యోగాభ్యాసాది ప్రయత్నములవలన స్థూలశరీరబుద్ధి నశించును. చిత్తము సంవిత్తు ననుసరించునట్లు, ప్రయత్నము చిత్తము ననుసరించుననుట, బాలకునకుగూడ దెలియును.

యఃపునః స్వప్నసంకల్ప పురుషః ప్రతిమాకృతిః
ఆకాశమాత్రకాకారః సకథం కేనరోధ్యతే. 16
చిత్తమాత్రం శరీరంతు సర్వస్యైవహిసర్వతః
విద్యతేవేదనాచ్చైతత్ క్వచిదేతీవ హృద్గతాత్. 17
యథాభిమతమేవాస్య భవత్యస్తమయోదయమ్
ఆదిసర్గేస్వభావోత్థం పశ్చాద్ద్వైతైక్యకారణమ్. 18

చిత్తాకాశంచిదాకాశ మాకాశంచతృతీయకమ్
విద్ధ్యేతత్త్రియమేకంత్వ మవినాభావనావశాత్. 19
ఏతచ్చిత్తశరీరత్వం విద్ధి సర్వగతోదయమ్
యథాసంవేదనేచ్ఛత్వా ద్యథా సంవేదనోదయమ్. 20

స్వప్న, సంకల్ప పురుషులనుబోలు ఆకాశరూపు డెద్దానిచే, నెట్లు, నిరోధింప బడగలడు? చిత్తమాత్రాకృతియగు ఆతివాహిక దేహము నెద్దియు నిరోధింపజాలను. జ్ఞానప్రభావమున ఈ స్థూలశరీరమే ఆతివాహిక భావమునందును పరమాత్మ చిత్తవృత్తులననుసరించియే భౌతిక దేహముయొక్క ఉత్పత్తి, లయములు జరుగుచున్నవి. అజ్ఞానమే పంచీకరణమునకు గారణమగుచు, స్థూలదేహ విభాగము నొనర్చుచున్నది. అధిష్ఠాన సత్తావ్యతిరిక్తములగుటవలన, చిదాకాశ, చిత్తాకాశ, మహాకాశము లొక్కటియేయని గ్రహింపుము. ఈ చిత్తశరీర — భావము వస్తువులన్నిటియందు స్ఫురించుచున్నది. ఏలయన, జ్ఞానేచ్ఛ ననుసరించియే, జ్ఞానోదయమగుచున్నది.

వసతిత్రసరేణ్వంత ర్ధ్రియతే గగనోదరే
లీయతేఽఙ్కురకోశేషు రసీభవతిపల్లవే. 21

ఈ చిత్తశరీరము అతిసూక్ష్మమై త్రసరేణుమధ్యమున వెలయుచున్నది; గగనమున నంతర్హితమైయున్నది. అంకురమున విలీనమైయున్నది. చిగురాకుల రసమై వెలయుచున్నది.

ఉల్లసత్యంబువీచిత్వే ప్రనృత్యతి శిలోదరే
ప్రవర్షత్యంబుదోభూత్వా శిలీభూయావతిష్ఠతే: 22

జలముల తరంగమై ఉల్లసిల్లుచున్నది; శిలామధ్యమున నృత్యమొనర్చుచున్నది. అంబుదరూపమున వర్షించుచున్నది. శిలయై వెలయుచున్నది.

యథేచ్ఛమంబరేయాతి జఠరేఽపిచ భూభృతామ్
అనంతరాకాశవపు ర్ధత్తేఽథపరమాణుతామ్. 23



ఇయ్యది ఇచ్చవచ్చినట్లు, ఆకాశమున మసలగలదు, కొండగుహల ప్రవేశింపగలదు. అనంతాకాశ వ్యాపియయ్యు, పరమాణువుగ మారగలదు.

భవత్యద్రిర్ధరాధారో బద్ధపీఠోనభఃశిరాః
దేహాస్యాంతర్బహిరపి దధద్వనతనూరుహామ్. 24

ఇయ్యది గగనస్పర్శియగు పర్వతమై దృఢరూపమున వెలయగలదు; అప్పుడు లోపలను బయటను నున్న వనములను తనూరుహాము (రోమము) లను ధరించగలదు.

భవత్యాకాశమాధత్తే కోటీఃపద్మజసద్మనామ్
అనన్యాఃస్వాత్మనోఽంభోధి రావర్తరచనాఇవ. 25

సముద్రమునుండి సుడిగుండములు వేరుకానట్లు, కోటికోటి బ్రహ్మాండములున్నను అయ్యవి చిత్తముకంటె వేరుకావు; ఇట్టి బ్రహ్మాండరూపమున నయ్యది దాల్చగలదు.

అనుద్విగ్నప్రబోధోఽసౌ సర్గాదౌచిత్తదేహకః
ఆకాశాత్మామహాన్భూత్వా వేత్తిప్రకృతతాం తతః. 26

ఈ చిత్తమే సృష్ట్యాదియందు ఉద్వేగరహితమగు జ్ఞానస్వరూపమున వెలయుచు, ఆకాశరూపమున విస్తరిల్లి, ప్రారబ్ధకర్మల ననుసరించుచున్నది.

అసత్యమేవవారిత్వం బుద్ధ్యోదేతీవ తత్తథా
వంధ్యాపుత్రోఽయమస్తీతి యథా స్వప్నేభ్రమో నరః. 27

మరుభూమియందు జలత్వబుద్ధి అసత్యము నాశ్రయించి ఉదయించునట్లును, వంధ్యాపుత్రుడున్నాడను బుద్ధికలుగునట్లును, ఈ ఆకాశాత్మస్వరూపుడు తనయందున్న అసత్యబుద్ధివలన, బ్రహ్మాండమై విస్తరిల్లుచున్నాడు.

శ్రీ రామఉవాచ:—

కిం చిత్తమేతద్భవతి కింవాభవతి నో కథమ్.
కథమేవ నసద్రూపం నాన్యద్భవతి వీక్షణాత్ 28

శ్రీరాముడు:- మాచిత్తమునకిట్టి శక్తియున్నదా? మాచిత్తములన్నియు వేరువేరు జగత్తుల ననుభవించుచున్నవా? లేక, ఒకే జగత్తును గాంచుచున్నవా? ఇయ్యదెందువలన సద్రూపముకాదు ?

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ప్రత్యేకమేవ యచ్చిత్తం తదేవంరూపశక్తికమ్
పృథక్ ప్రత్యేకముదితః ప్రతిచిత్తం జగద్భ్రమః. 29

వసిష్ఠుడు:- ప్రతి చిత్తమునకును ఇట్టిశక్తియున్నది. ప్రతిచిత్తమున్ను వేర్వేరు జగద్భ్రమలను బొందుచున్నది.

క్షణకల్పజగత్సంఘాః సముద్యంతి గలంతిచ
నిమేషాత్కస్యచిత్కల్పాత్ కస్యచిచ్ఛ్రక్రమంశృణు. 30

ప్రళయానంతర సృష్టినిగురించియు, నిముషములో లెక్కకుమించిన జగత్తులుద్భవించి, లీనములగుటను గురించియు చెప్పుచున్నాను, వినుము.

మరణాదిమయీమూర్ఛా ప్రత్యేకేనానుభూయతే
యైషా తాం విద్ధి సుమతే మహాప్రలయయామినీమ్. 31

సుమతీ! ఈజగత్తున మరణ — మూర్ఛ నందరును బొందుచున్నారు; ఇయ్యదియే ప్రళయ — రాత్రి అని గ్రహింపుము.

తదంతే తనుతే సర్గం సర్వ ఏవ పృథక్ పృథక్
సహజస్వప్నసంకల్పాన్ సంభ్రమాచలనృత్యవత్. 32

ఈప్రళయ — రాత్రి గడచినపిమ్మట అందఱును వేర్వేరు సృష్టులనుగల్పించుకొనుచున్నారు. మోహితుడు పర్వత — నృత్యమును గాంచునట్లు, వీరందరును తమతమ సంస్కారములకు దగిన దృశ్యములను గాంచుచున్నారు.

మహాప్రలయరాత్ర్యంతే చిరాదాత్మమనోవపుః
యథేదం తనుతే తద్వత్ ప్రత్యేకం మృత్యనంతరమ్. 33

మహాప్రళయానంతరము, సమష్టి మనోస్వరూపుడగు హిరణ్యగర్భుడు, సమష్టిభోగ సమూహములను విస్తరించునట్లు, వీరు వ్యష్టి భోగసమూహములను మృత్యనంతరము కల్పించుకొనుచున్నారు.

**శ్రీ రామఉవాచ:—**

మృతేరనంతరం సర్గో యథాస్మృత్యానుభూయతే
చిరాత్తథానుభవతి నాత్రో విశ్వమకారణమ్. 34

శ్రీరాముడు:— మరణానంతర సృష్టివలె, విశ్వసృష్టిగూడ హిరణ్యగర్భ స్మృతిననుసరించి గలుగునన్న నయ్యది అకారణము అనగా బ్రహ్మకారణముకాజాలదు.

**శ్రీ వసిష్ఠ ఉవాచ:—**

మహాప్రలయే రామ సర్వే హరిహరాదయః
విదేహముక్తతాం యాంతి స్మృతేః క ఇవ సంభవః. 35

వసిష్ఠుడు:— రామా! మహాప్రళయసమయమున హరిహరాది దేవతలుగూడ విదేహముక్తులగుదురు; అందువలన వారిస్మృతి ఇకెట్లు నిలచియుండును.

అస్మదాదిః ప్రబుద్ధాత్మా కిలావశ్యం విముచ్యతే
కథం భవంతు నో ముక్తా విదేహాః పద్మజాదయః. 36

మమ్మువోలు తత్త్వజ్ఞులే ముక్తులగుదురన్న, బ్రహ్మాదులమాట వేరుగ చెప్పవలయునా?

అన్యే త్వమివ యే జీవాస్తేషాం మరణజన్మసు
స్మృతిః కారణతామేతి మోక్షాభావవశాదిహ. 37

నిన్నుబోలు బద్ధజీవుల జననమరణములకు స్మృతియేకారణమగుచున్నది; దీనికి కారణము మోక్షాభావమే.

జీవో హి మృతిమూర్ఛాంతే యదంతః ప్రోన్మిషన్నివ
అనున్మిషిత ఏవాస్తే తత్ప్రధానముదాహృతమ్. 38



మరణమూర్ఛానంతరము జీవుడుగాంచు సృష్టియే పురాణాదులయందు ప్రధానమని చెప్పబడుచున్నది.

తద్వ్యోమ ప్రకృతిః ప్రోక్తా తదవ్యక్తం జడాజడమ్
సంస్మృతేరస్మృతేశ్చైవ క్రమ ఏష భవోదయే. 39

దీనినే ఆకాశ — ప్రకృతియనిగూడ అందురు. ఇయ్యది అవ్యక్తము, జడము అజడముగూడనైయున్నది. సృష్టి, ప్రళయముల క్రమమియ్యది:—

బోధోన్ముఖత్వే హి మహత్తత్త్వబుద్ధం యదా భవేత్
తదా తన్మాత్రదిక్కాల క్రియాభూతాద్యుదేతి ఖాత్. 40

ఈ ఆకాశ ప్రకృతి చిద్వస్తువున ప్రతిఫలించినప్పుడు అహంభావమును, పంచతన్మాత్రలును, దిక్కాలాది సూక్ష్మభావములును ఉదయించుచున్నవి.

తదేవోచ్ఛూనతామాబుద్ధం భవతీంద్రియపంచకమ్
తదేవ బుధ్యతే దేహః స ఏషోఽస్త్యాతివాహికః. 41

ఇయ్యదియే మఱొకింత విస్తరిల్లి, సూక్ష్మేంద్రియ పంచకమును కలిగించుచున్నది. ఇయ్యదియే ఆతివాహిక — దేహమని గ్రహింపబడుచున్నది.

చిరకాలప్రత్యయతః కలనాపరిపీవరః
ఆధిభౌతికతాం బోధ మాధత్తే చైష బాలవత్. 42

పిదప, చాలకాలము గడచినపిమ్మట నిదియే స్థూలదేహకల్పనను పుష్టమొనర్చుకొని, ఆధిభౌతిక దేహమగుచున్నది.

తతో దిక్కాలకలనాస్తదాధారతయా స్థితాః
ఉద్యంత్యనుదితా ఏవ వాయోః స్పందక్రియా ఇవ. 43

అప్పుడు స్థూలదేహము నాశ్రయించుకొనియున్న చక్షురాదీంద్రియములును, తదధీనములగు పదార్థములును, వాయువున స్పందనముత్పన్నమగునట్లు, దానియందు మిథ్యాభావమున నుత్పన్నములగుచున్నవి.

వృద్ధిమిత్థమయం యాతో ముధైవ భువనభ్రమః
స్వప్నాంగనాసంగసమస్త్వనుభూతోఽప్యసన్మయః. 44

ఇట్లు వ్యర్థముగ జగద్భ్రాంతి వర్ధిల్లుచున్నది. ఇయ్యది స్వప్నాంగనాసంభోగమువలె, అనుభూతమగుచున్నను, అసత్యమే.

యత్రైవ మ్రియతే జంతుః పశ్యత్యాశు తదేవ సః
తత్రైవ భువనాభోగ మిమమిత్థమివ స్థితమ్. 45

జీవుడెట మరణించినను, అతనికి తత్క్షణమే ఇట్టి జ్ఞానముకలిగి, మాయామయమగు జగత్తు గనబడును.

వ్యోమ్న్యేవానుభవత్యచ్ఛ మహం జగదితి భ్రమమ్
వ్యోమరూపం వ్యోమరూపీ జీవో జాత ఇవాత్మవాన్. 46

ఇట్లు, ఆకాశసూక్ష్మ్రుడగుష్టజీవుడు జన్మాదిశూన్యుడయ్యు, ఆగంతుకములగు దేహాదిభావనలకు లోబడి, జన్మాది భ్రమలకు లోనగుచున్నాడు.

సురపత్తనశైలార్క-తారానికరసుందరమ్
జరామరణవైక్లవ్య వ్యాధిసంకటకోటరమ్. 47
స్వభావాభావ సంరంభ స్థూలసూక్ష్మచరాచరమ్
సాబ్ధ్యద్ర్యుర్వీనదీశాహో రాత్రికల్పక్షణక్షయమ్. 48

ఈ భ్రాంతి, దేవపురి, మేరుగిరి, సూర్యుడు, నక్షత్రములతోగూడి సుందరమై కన్పడుచున్నది. జరామరణ వ్యాధులతో సంకటమైన భూలోక — ఛిద్రముగ నగుపడుచున్నది. సూక్ష్మములగు చరాచరజంతువులు ఇష్టప్రాప్తి, అనిష్ట పరిహారములకొఱకు ప్రయత్నించుచున్నారు. నదులు, కొండలు, భూమి, దిశలు, రాత్రిందినములు, క్షణములు, అను భ్రమగలుగుచున్నది.

అహంజాతోఽ మునాపిత్రా కిల్యాత్ తేత్యాప్తనిశ్చయమ్
ఇయంమాతా ధనమిదం మమేత్యుదితవాసనమ్. 49
సుకృతం దుష్కృతంచేదం మమేతి కృతకల్పనమ్
బాలోఽభూవమహం త్వద్య యువేతి విలసద్ధృది. 50

'నే నతనికి బుట్టితిని, అతడు నాతండ్రి, అతడు నామిత్రుడు, ఈమె నాతల్లి ఇది నా ధనము, ఇది నాకోర్కె, ఇవి నా పాపపుణ్యములు, నేను బాలుడనైయుంటిని, ఇప్పుడు యువకుడనైతిని' అను జగద్భ్రమ హృదయమున స్ఫురించుచుండ మరణ మూర్ఛితుడు కనుగొనును.

ప్రత్యేకమేవముదితః సంసారవనఖండకః
తారాకుసుమితోనీల మేఘచంచలపల్లవః. 51
చరన్నరమృగానీకః సురాసురవిహంగమః
ఆలోకకాసుమరజాః శ్యామాగహనకుంజకః. 52
అబ్ధిపుష్కరిణీపూర్ణో మేర్వాద్యచలలోష్టకః
చిత్తపుష్కరబీజాంతర్నిలీనానుభవాంకురః. 53

ఇట్లు ప్రతివారికినిగలుగు జగద్భ్రమయను వనభూమియందు నక్షత్రములను పువ్వులును, మేఘములను చిగుళ్లును, మనుష్యులను మృగములును, దేవతలను పక్షులును, వెలుగను పుప్పొడియు, అంధకారమను లతాగృహములును, సముద్రమను చెఱువును, మేర్వాది పర్వతములను గడ్డిపరకలును, చిత్తమను పద్మబీజములును, తదంతస్థములగు సంస్కారములను అంకురములును ఉన్నవి.

యత్రైవ మ్రియతే జీవస్తత్రైవం పశ్యతిక్షణాత్
ప్రత్యేకముదితేష్వేవం జగత్ ఖండేషు భూరిశః 54

జీవుడెచ్చట మరణించినను, క్షణములో ఇట్టి సంసారవనభూమిని దర్శించును.

కోటయోబ్రహ్మరుద్రేంద్ర మరుద్విష్ణువివస్వతామ్
గిర్యబ్ధిమండలద్వీప లోకాంతరదృశాం గతాః. 55



బ్రహ్మ, రుద్ర, మరుత్, విష్ణు, సూర్యాదిదేవతలును, పర్వతములు, సముద్రములు, ద్వీపములును, కోట్లకొలదిగ కనపడి పోవుచున్నవి.

యాతాయాస్యంతి యాంత్యేతా దృష్టయో నష్టరూపిణీః
యాబ్రహ్మణ్యుపబృంహోథ్యా స్తాః కే గణయితుంక్షమాః. 56

నిరాకారమగు పరబ్రహ్మమున నెన్ని అసత్స్వరూపము లుద్భవించినవో, ఉద్భవింపనున్నవో, ఎవ్వరు నిరూపింపగలరు?

ఏవంకుడ్యమయంవిశ్వం నాస్త్యేవ మననాదృతే
మననే చలమేవాంతస్తదిదానీం విచారయ. 57

కుడ్యమువలె స్థూలమగు ఈ విశ్వము మనస్సంకల్ప వ్యతిరిక్తముకాదు. మనస్సు చంచలస్వభావకము, విశ్వము స్థిరము, అందువాఁ విచారించిచూడుము, విశ్వముగూడ చంచలము అనగా క్షణభంగురమని గ్రహింపగలవు.

యదేవ తచ్చిదాకాశం తదేవమననంస్మృతమ్
యదేవ చ చిదాకాశం తదేవపరమంపదమ్. 58

చిదాకాశమే మనస్సన కాశ్రయమని చెప్పబడుచున్నది; ఈ చిదాకాశమే పరమపదముగూడనైయున్నది.

యదేవాంబు సఆవర్తో నత్వస్యావర్తవస్తుసన్
ద్రష్టైవాస్తేదృశ్యమివ దృశ్యం నత్వస్తివస్తుసత్. 59

నీరే ఆవర్తము, దృశ్యమే ద్రష్ట, నీటికిని సుడిగుండమునకును భేదములేనట్లు, ద్రష్టృదృశ్యములకు భేదములేదు.

చిద్వ్యోమ్నాభూతనభసి కచనంయన్మణేరివ
తజ్జగద్భావినానాస త్తత్త్వం శ్వభ్రమివాంబరే. 60

ఇంద్రజాలికుడు మణి — ఆకాశమున వివిధఛిద్రములను గల్పించి, అందు నానావిధములగు విచిత్రవస్తువులను దోపజేయునట్లు, మిథ్యారూపమును, అనాదియునగు మాయగూడ చిదాకాశమున లేక చిత్తాకాశమున నామరూపములను గనుగొనజాలు జీవభావమును స్ఫురింపజేయుచున్నది.

మద్బుద్ధ్యార్థోజగచ్ఛబ్దో విద్యతేపరమాత్మృతమ్
త్వద్బుద్ధ్యార్థస్తు నాస్త్యేవ త్వమహంశబ్దకాదపి. 61

'అహం' జ్ఞానమున్న పరమార్థస్వరూపమున జగచ్ఛబ్దార్థ మనుభవింపబడుచున్నది. కాని, 'నీవు' అనుజ్ఞానమున్న జగచ్ఛబ్ద మారోపితమని బోధయగుచున్నది.

తస్మాల్లీలాసరస్వత్యా వాకాశవపుషాస్థితే
సర్వగేపరమాత్మాచ్ఛే సర్వత్రాప్రతిఘేఽనఘే. 62
యత్రయత్రసదావ్యోమ్ని యథాకామం యథేప్సితమ్
ఉదయం కురుతస్తేన తద్గేహేఽస్తిగతిస్తయోః. 63

రాఘవా! అందువలన, ఆకాశస్వరూపిణులగు లీలాసరస్వతు లిర్వురును తమతమ ఇచ్ఛల ననుసరించి ఆగృహమును ప్రవేశింపగల్గిరి. చిద్వస్తువు సర్వవ్యాపి, యథార్థజ్ఞానము, సత్యకామ, సత్య సంకల్పములు దానివలననే కలుగుచున్నది.

సర్వత్రసంభవతిచిద్గగనంతదత్ర
సద్వేదనంకలనమాత్మనవిసారి
తచ్చాతివాహికమిహావరకుడ్యమేవ
దేహంకథం కఇవతంవదకిం రుణద్ధి. 64.

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే లీలోపాఖ్యానే
సమరసమనంతర సంస్మృత్యనుభవవర్ణనంనామ చత్వారింశః సర్గః ॥ 40 ॥

సర్వగామియు, అప్రతిహతమును, సూక్ష్మమునునగు చిద్వస్తువును నెవ్వరడ్డగింపగలరు?

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు, ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున
సమరసమనంతర సంస్మృత్యనుభవవర్ణనమను చత్వారింశ సర్గము ॥ 40 ॥

## ఏకచత్వారింశః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

తయోఃప్రవిష్టయోర్ద్వయోః పద్మసద్మబభూవతత్
చంద్రద్వయోదయోద్ద్యోత ధవలోదరసుందరమ్. 1
కోమలామలసౌగంధ్య మృదుమందారమారుతమ్
తత్ప్రభావేన నిద్రాలునృపేతర నరాంగనమ్. 2
సౌభాగ్యనందనోద్యానం విద్రుతవ్యాధివేదనమ్
సవసంతం వనమివ ఫుల్లంప్రాతరివాంబుజమ్. 3
తయోర్దేహప్రభాపూరైః శశినిస్యందశీతలైః
ఆహ్లాదితోఽసౌ బుబుధే రాజోక్షితఇవామృతైః. 4
ఆసనద్వయవిశ్రాంతం సదదర్శాప్సరోద్వయమ్
మేరుశృంగద్వయే చంద్రబింబద్వయమివోదితమ్. 5

వసిష్ఠుడు:– ఆ యువతు లిర్వురును ఆ గృహమును ప్రవేశింప, చంద్రద్వయ ముదయించిన మాడ్కి, ఆ గృహము శుభ్రకాంతులతో శోభిల్లెను. మందార కుసుమగంధమును గైకొని మంద వాయువు ప్రవహింపసాగెను. వారి ప్రభావమున, నృపతి తప్ప, అందరును నిద్రితులైయుండిరి. ఆచోటు సౌభాగ్యమున నందనవనమువలె నొప్పుచు, వ్యాధిహీనమయ్యెను. మఱియు, వసంతో



ద్యానమువలెను, ప్రాతఃకాల పద్మమువలెను, సఫుల్లమయ్యెను. చంద్రకిరణములవలె చల్లనగువారి దేహకాంతులవలన పద్మమమృతసిక్తుడైనవానివలె నాహ్లాదితుడై, మేల్కాంచెను. మేల్కాంచి, మేరు పర్వత శిఖరద్వయమున నుదయించిన చంద్రబింబముల జంటవలె, సింహాసనద్వయమున వెలయుచున్న అప్సరసల నిర్వురను గాంచెను.

నిమేషమివసంచింత్య సవిస్మితమనానృపః
ఉత్తస్థౌశయనాచ్ఛేషాదివ చక్రగదాధరః. 6

ఆ రాజొకింత విస్మితుడై చింతించి, అనంతశయ్యనుండి శేష విష్ణునివలె, లేచెను.

పరిసంయమితాలంబి మాల్యహారాధరాంబరః
పుష్పాహారఇవోత్ఫుల్లం జగ్రాహ కుసుమాంజలిమ్ 7
ఉపధానప్రదేశస్థాత్ స్వయం పటలకోటరాత్
బద్ధపద్మాసనోభూమౌ భూత్వోవాచేదమానతః. 8

కంఠమున వ్రేలు మాలలను, హారమును, కట్టుబట్టను సవరించుకొని, తోటమాలివలె, తల గడకడనున్న పుష్పపాత్రనుండి విప్పారిన పువ్వులను గైకొని, పద్మాసనమున భూమిమీద గూర్చుండి నమస్కరించి, ఇట్లు పల్కదొడగెను:—

జయతాంజన్మదౌస్థిత్య దాహదోషశశిప్రభే
దేవ్యౌబాహ్యాంతరతమో విద్రావణరవిప్రభే. 9

జన్మాది దాహదోష శశిప్రభలకు జయమగుగాక! బాహ్యాంతర తమోనాశరవిప్రభలగు దేవులకు జయము!

తయోరుక్త్వేతితత్యాజ పాదయోఃకుసుమాంజలిమ్
తీరద్రుమోవికసితః పద్మిన్యోఃపద్మయోరివ. 10

ఇట్లుపల్కి, తీరవృక్షము సరస్సునన్న పద్మముల జంటయందు పువ్వులను రాల్చినట్లు, వారి పాదముల కుసుమాంజలి నర్పించెను.

లీలాయైభూపజన్మాథ వక్తుం మంత్రిణమీశ్వరీ
బోధయామాసపార్శ్వస్థం సంకల్పేన సరస్వతీ. 11

అనంతరము, ఈశ్వరియగు సరస్వతి లీలకు రాజుయొక్క జన్మవృత్తాంతమును దెల్ప, ప్రక్క నిద్రించుచున్న మంత్రిని సంకల్పబలమున మేల్కొల్పెను.

ప్రబుద్ధోప్సరసౌదృష్ట్వా ప్రణమ్యకుసుమాంజలిమ్
తయోఃపాదేషుసంత్యజ్య వివేశపురతో నతః. 12

మంత్రి మేల్కాంచి అప్సరసలనుగాంచి నమస్కరించి, ముందునకరుదెంచి వారి పాదముల పుష్పాంజలిని విడిచెను.

ఉవాచదేవీహేరాజన్ కస్త్వంకస్యసుతఃకదా
ఇహజాతఇతిశ్రుత్వా సమంత్రీవాక్యమబ్రవీత్. 13

దేవి ప్రశ్నించెను — రాజా! నీ వెవ్వడవు ఎవ్వరి పుత్రుడవు? నీ వెట్లు జన్మించితివి? ఇట కెట్లరుదెంచితివి — మంత్రి ఈ ప్రశ్నలను విని ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను.

దేవ్యా యుష్మత్ప్రసాదోఽయం భవతోర్యరపియత్పరః
వక్తుంశక్నోమితద్దేవ్యౌ శ్రూయేతాం జన్మమత్ప్రభోః. 14

దేవులారా! మీ అనుగ్రహమునజేసి, మీ ముందరనే నా ప్రభుని జన్మవృత్తాంతమును జెప్పుచున్నాను. వినుడు.

ఆసీదిక్ష్వాకువంశోత్థో రాజారాజీవలోచనః
శ్రీమాన్కుందరథోనామ దోశ్ఛాయాచ్ఛాదితావనిః 15

ఇక్ష్వాకు వంశీయుడును, పద్మనేత్రుడును, శ్రీమంతుడుననగు కుందరథుడను రాజుండెను; అతడు బాహుబలమున పృథివినంతటిని జయించెను.

తస్యాభూదిందువదనః పుత్రోభద్రరథాభిధః
తస్యవిశ్వరథఃపుత్ర స్తస్య పుత్రోబృహద్రథః. 16
తస్యసింధురథఃపుత్ర స్తస్యశైలరథఃసుతః
తస్యకామరథఃపుత్ర స్తస్యపుత్రోమహారథః. 17
తస్యవిష్ణురథఃపుత్ర స్తస్యపుత్రోనభోరథః
అయమస్మత్ప్రభు స్తస్య పుత్రఃపూర్ణామలాకృతిః. 18
అమృతాపూరితజనః క్షీరోదస్యేవచంద్రమాః
మహద్భిఃపుణ్యసంభారై ర్విదూరథఇతిశ్రుతః. 19
జాతోమాతుః సుమిత్రాయా గౌర్యాగుహఇవాపరః
పితాస్యదశవర్షస్య దత్వారాజ్యం వనంగతః. 20

అతనికి భద్రరథుడను పుత్రుడుండెను; అతని పుత్రుడు విశ్వరథుడు, విశ్వరథుని పుత్రుడు బృహద్రథుడు, అతని పుత్రుడు సింధురథుడు, అతని పుత్రుడు శైలరథుడు, అతని పుత్రుడు కామరథుడు, అతని పుత్రుడు మహారథుడు, అతని పుత్రుడు విష్ణురథుడు, అతని పుత్రుడు నభోరథుడు, అతని పుత్రుడే మా ప్రభువు. ఈయన క్షీరసముద్రమును జంద్రుడు సంతోషపరుచునట్లు, స్నేహాది గుణములతో లోకులను సంతోషపెట్టుచున్నాడని పేరుగాంచినాడు. గౌరీదేవికి కుమారస్వామి జన్మించినట్లే మన సుమిత్రకు బుట్టినాడు. నభోరథుడీయనకు పదావయేటనే రాజ్యము నొసగి అరణ్యమున కరిగినాడు.

పాలయత్యేష భూపీఠం తతఃప్రభృతిధర్మతః
భవత్యావద్యసంప్రాప్తే ఫలితే సుకృతద్రుమే. 21
దేవ్యాదీర్ఘతపఃక్లేశ శతైర్దుష్ప్రాపదర్శనే
ఇత్యయంవసుధాదీశో విదూరథఇతిశ్రుతః 22
అద్యయుష్మత్ప్రసాదేన పరాంపావనతాంగతః
ఇత్యుక్త్వాసంస్థితేతూష్ణీం మంత్రిణ్యవనిపేతథా. 23



కృతాంజలౌ నతముఖే బద్ధపద్మాసనేఽవనౌ
రాజన్స్మరవివేకేన పూర్వజాతిమితిస్వయమ్. 24
వదంతీమూర్ధ్నిపస్పర్శ తం కరేణ సరస్వతీ
అథహార్దంతమోమాయా పద్మస్య క్షయమాయయా. 25

అప్పటినుండియు ఈయనరాజ్యమును ధర్మానుసారము పాలించుచున్నాడు. నేడుమీరాక వలన మాపుణ్యవృక్షము ఫలించినది. దీర్ఘకాలము తపస్సునాచరించినను మీదర్శనము దొరకుట కడుం గడు కష్టము. దేవులారా! నేడుమీదర్శనమునుబడసి ఈవిదూరథుడు పవిత్రుడైనాడు. మంత్రి ఇట్లు పల్కి యూరకుండెను. రాజుకూడ మునుపటియట్లే కూర్చొనియుండెను. అప్పుడు, సరస్వతీదేవి "రాజా! వివేకమువలన నీపూర్వజన్మను స్మరింపుము" అనిబల్కుచు, అతని మస్తకమును స్పర్శించెను, వెంటనే, అతనిహృదయమును గప్పియున్న తమస్సు తొలగిపోయెను.

సువికాసంచహృదయం జ్ఞప్తిస్పర్శోదయేఽభవత్
సస్మారపూర్వవృత్తాంత మంతఃస్ఫురదివస్థితం. 26
త్యక్తదేహైకరాజ్యత్వం లీలావిలసితాన్వితం
జ్ఞాత్వాప్రజ్ఞప్తివృత్తాంతం లీలాయాస్తువిజృంభితమ్. 27
ఆత్మోదంతం బభూవాసా వుహ్యమానఇవార్ణవే
ఉవాచాత్మని సంసారే బతమాయేయమాతతా. 28
పరిజ్ఞాతాప్రసాదేన దేవ్యోరిహ మయాధునా

సరస్వతీదేవి స్పర్శవలన నతనిహృదయము, వికసించెను. అతడు తన పూర్వవృత్తాంతమును గ్రహింపగలెను. అతడు, రాజైయుండుట, అతనికి లీలయను పత్నియుండుట, రాజ్యమును, దేహమును బరిత్యజించుట, సరస్వతీదేవి వృత్తాంతము, లీలావిలాసము మొదలగు వాటినన్నిటిని దెలిసికొని, సముద్రమున దేలుచున్నవానివలె నయ్యెను. 'ఆశ్చర్యము! ఈ సంసారమాయను నేనిప్పుడీదేవుల అనుగ్రహమువలన గ్రహింపగలిగితిని!' అని యనుకొనదొడంగెను.

రాజోవాచ:—

హేదేవ్యౌకిమిదంనామ దినమేకంమృతస్య మే. 29
గతమద్యేహ జాతాని వయోవర్షాణిసప్తతిః
స్మరామ్యనేకకార్యాణి స్మరామిప్రపితామహమ్. 30
స్మరామిబాల్యంతారుణ్యం మిత్రంబంధుపరిచ్ఛదమ్

రాజు:— దేవులారా! నేను మరణించి ఒక్కరోజైయైనను, నావయస్సు డెబ్బదియేండ్లయినదే! నా పూర్వకార్యములను, ప్రపితామహుని, బాల్యయౌవనములను, మిత్రులను, బంధుగులను స్మరింపగలుగుచున్నాను.

జ్ఞప్తిరువాచ:—

రాజన్మృతిమహామోహ మూర్ఛాయాఃసమనంతరమ్. 31
తస్మిల్లోకాంతరేతీతే తస్మిన్నేవముహూర్తకే
తస్మిన్నేవగృహే చాస్మిన్నేవవ్యోమ్న్యపిసద్మని. 32

అయంతస్యగృహస్యాంత ర్వ్యోమన్యేవకిలస్థితే
గిరిగ్రామకవిప్రస్య గృహేఽంతర్యాభవమండపః. 33
తస్యాంతరేఽయమాభాతి ప్రత్యేకంచజగద్గృహమ్
కిలబ్రాహ్మణగేహాంత ర్జీవస్తే మదుపాస్థితః. 34
తత్రైవతస్యభూపీఠం తస్మింశ్చకిలమండపే
తస్యైవచగృహస్యాంత రిదం సంసారమండలమ్ 35
తత్రైవేదంతవగృహం స్థితమారంభమంథరమ్
తత్రైవచేతసి తవ నిర్మలాకాశనిర్మలే. 36
ప్రతిభామాగతమిదం వ్యవహారభ్రమాతతమ్
యథేదంనామమేజన్మ తథేక్ష్వాకుకులంమమ. 37
ఏవంనామానఏతేమే పురాభూవన్పితామహాః
జాతోఽహమభవం బాలో దశవర్షస్యమేపితా. 38
పరివ్రాడ్వపినంయాత ఇహరాజ్యేఽభిషిచ్యమామ్
తతోదిగ్విజయంకృత్వా కృత్వారాజ్యమకంటకమ్. 39
అమీభిర్మంత్రిభిఃపౌరైః పాలయామివసుంధరామ్
యజ్ఞక్రియాక్రమవతో ధర్మేపాలయతఃప్రజాః. 40
వయసఃసమతీతాని మమవర్షాణిసప్తతిః
ఇదంపరబలంప్రాప్తం మమదారుణవిగ్రహః. 41
యుద్ధంకృత్వేదమాయాతో గృహమస్మిన్యథాస్థితమ్
ఇమేదేవ్యౌగృహేప్రాప్తే మయైతేపూజయామ్యహమ్. 42
పూజితాహిప్రయచ్ఛంతి దేవతాఃస్వసమీహితమ్
మమేయమేతయోరేకా జ్ఞానంజాతిస్మృతిప్రదమ్. 43
ఇహదత్తవతీదేవీ భాబ్జస్యేవ వికాసనమ్
ఇదానీంకృతకృత్యోఽస్మి జాతోఽస్మిగతసంశయః. 44
శామ్యామిపరినిర్వామి సుఖమాసేచకేవలమ్

జ్ఞప్తి:- రాజా! మృత్యుమూర్ఛానంతరము, నీవధిష్ఠించిన చిదాకాశ యంతర్ధానమున, గిరిగ్రామమునందలి విప్రగృహము, పద్మరాజు రాజ్యముగను, అందలి ముఖ్యగృహముగను, గృహాకాశముగను, నీ హృదయాకాశమున ప్రతిబింబించినవి. నీవుగాంచునవన్నియు, ఆబ్రహ్మాండ మండపముననే యున్నవి. అచ్చట నీజీవుడు నన్నుపాసించుచుండెడివాడు. అచ్చటనే పద్ముని రాజ్యము గృహాదులు, ఉండినవి. నిర్మలాకాశముకంటె నిర్మలమగు నీ చిదాకాశముననే, ఈ భ్రమలన్నియు ప్రతిభాతములైనవి. 'నాపేరు ఇది' ఇది నాజన్మ, నేను ఇక్ష్వాకువంశమున జన్మించితిని. తండ్రినాకు పదవయేటనే—బాల్యముననే—రాజ్యమునొసగి పరివ్రాజకుడై, అరణ్యమున కేగినాడు, అప్పుడు నేను శత్రువులను జయించి రాజ్యమును మంత్రులతోడను, పౌరులతోడనుగూడి పాలించుచున్నాను; యజ్ఞక్రియానిరతుడనై, ధర్మానుసారము ప్రజలను పాలించుచున్నాను. నాకు డెబ్బది ఏండ్లునిండినవి. ఇప్పుడు శత్రువులరుదెంచినారు. దారుణయుద్ధము జరుగుచున్నది. యుద్ధమొనర్చి ఈ గృహమునకుండ దేవులరుదెంచినారు. వారిని పూజించితిని, పూజించిన దేవతలు కోర్కెలను దీర్తురు; సూర్యుడు పద్మములను వికసింపజేయునట్లు ఈ దేవి నా పూర్వజన్మ స్మృతిని వికసింపజేసినది. నేనిప్పుడు కృతకృత్యుడనైతిని, నాసంశయములు తొలగిపోయినవి, నాకట్టి దుఃఖమును లేదు. ఏకరసరూపకమగు సుఖమున మగ్నుడనగుదును.



ఇతీయమాతతాభ్రాంతి ర్భవతోభూరిసంభ్రమా. 45
నానాచారవిహారాఢ్యా నలోకాంతరసంచరా
యస్మిన్నేవముహూర్తేత్వం మృతిమభ్యాగతఃపురా. 46
తదైవప్రతిభైషాతే స్వయమేవోదితాహృది
ఏకామావర్తచలనాం త్యక్త్వాదత్తేయథాపరామ్. 47
క్షిప్రమేవనదీవాహో విత్వవాహస్తథైవచ
ఆవర్తాంతరసంమిశ్రో యథావర్తఃప్రవర్తతే. 48
కదాచిదేవంసర్గశ్రీ ర్మిశ్రామిశ్రాచవర్ధతే
తస్మిన్స్మృతిముహూర్తేతే ప్రతిభానముపాగతమ్. 49
ఏతజ్జాలమసద్రూపం చిద్భానోఃసముపస్థితమ్
యథాస్వప్నముహూర్తేఽంతః సంవత్సరశతభ్రమః. 50
యథాసంకల్పనిర్మాణే జీవనంమరణంపునః
యథాగంధర్వనగరే కుడ్యమండనవేదనమ్. 51
యథానౌయానసంరంభే వృక్షపర్వతవేపనమ్
యథాస్వధాతుసంక్షోభే పూర్వపర్వతనర్తనమ్. 52
యథాసమంతసంస్వప్నే స్వశిరఃప్రవికర్తనమ్
మిథ్యైవైవమియంప్రౌఢా భ్రాంతిరాతతరూపిణీ. 53

ఇట్టివేయగు భ్రాంతులనేకములు నీయందు విజృంభించినవి. నీవు పూర్వము మరణించినప్పుడే నీకిట్టిజ్ఞానము హృదయమున ఉదయించినది. నీరు ఒకసుడిగుండమును విడచి, మరొకసుడిగుండమును ఆశ్రయించునట్లు, జ్ఞానప్రవాహముగూడ ఒక దృశ్యమును వీడి, మరొకదృశ్యమును ప్రతిభాసింపజేయుచున్నది. ఒకానొక సుడిగుండము ఇంకొకదానితోగలసి ప్రవర్తిల్లునట్లు, సృష్టివిభవముగూడ మిశ్ర, అమిశ్రభావముల పెంపొందుచున్నది. నీ మరణ సమయమున చిత్స్వరూప సూర్యునిముందు ప్రతిభాతములైన ఈ జగజ్జాలములన్నియు అసత్స్వరూపములు, స్వప్నమున ఒక్కనిమిషములో పెక్కేండ్లు గడిచినట్లు భ్రమగలుగునట్లును, సంకల్పమాత్రమున జననమరణములు గడచినట్లును, గంధర్వనగరమున గోడలగుపడునట్లును, నావ అరుగునప్పుడు వృక్షాదులు కదలునట్లు తోచురీతిగను, ధాతువులు ప్రకోపించిన, పర్వతము నాట్యమాడు నట్లగపడునట్లును, స్వప్నమునదోచు స్వశిరఃఖండనమువలెను, ప్రౌఢమగు ఈ భ్రాంతి మిథ్యయని గ్రహింపుము.

వస్తుతస్తునజాతోఽసి నమృతోఽసికదాచన
శుద్ధవిజ్ఞానరూపస్త్వం శాంతఆత్మనితిష్ఠసి. 54
పశ్యసీవైతదఖిలం నచపశ్యసికించన
సర్వాత్మకతయానిత్యం ప్రకచస్యాత్మనాత్మని. 55
మహామణిరివోదార ఆలోకఇవభాస్వరః
వస్తుతస్తునభూపీఠ మిదంనచభవానయమ్. 56
నచేమేగిరయోగ్రామా నచైతేనచవై వయమ్
గిరిగ్రామకవిప్రస్య మండపాకాశకేకిల. 57
తల్లీలాభర్తృదారాఢ్యం జగదాభాతిభాస్వరమ్
తత్రలీలారాజధానీ మండపామండితాకృతిః. 58
భాతితస్యోదరేవ్యోమ్ని తదేవంవిదితంజగత్
తస్మిన్జగతిగేహేఽంత ర్యస్మిన్వయమిహస్థితాః. 59
ఏవంతేషాం మండపానాం వ్యోమావ్యోమైవనిర్మలమ్
తథైవమండపేష్వస్తి నమహీనచపత్తనమ్. 60
నవనానినశైలౌఘా నమేఘసరిదర్ణవాః
కేవలంతత్రనిఃశూన్యే విహరంతిగృహేజనాః. 61
నపశ్యంతిజనా నాపి పార్థివానచభూధరాః

వాస్తవమునకు నీకు జన్మలేదు. మృతియును లేదు. నీవు శుద్ధవిజ్ఞాన స్వరూపమును, శాంతమునునగు పరమాత్మయందు వెలయుచున్నావు. నీవు ఈ జగత్తునంతటిని గాంచుచున్నావు. కాని అది మరల (నిర్వికల్పసమాధి సమయమున) నగుపడదు. సర్వాత్మకుడవగుటకతన, నీవు నీయందే ప్రకాశించుచున్నావు. మహామణివలె ఉజ్జ్వలమును సూర్యునివలె భాస్వరమునై ప్రకాశించు ఈ భూపీఠముగూడ మిథ్యయే. ఈగిరులు, గ్రాములు మనముగూడ మిథ్యయేయైయున్నాము. గిరిగ్రామవాసియగు విప్రుని మండపాకాశమున లీలాదేవితోడను, ఆమె భర్తతోడనుగూడిన జగత్తు ప్రతిభాతమగుచున్నది. ఆ గృహాకాశమండపము రాజధానిగ శోభిల్లుచున్నది. మనమా జగత్తుననేయున్నారము. ఆ మండపాకాశము వాస్తవమునకు నిర్మలమగు బ్రహ్మమే. అందు భూమి, పట్టణము, అరణ్యము, పర్వతములు, నదులు మున్నగునవి లేవు. జనుల పరిభ్రమణము పరస్పరదర్శనములుగూడ మిథ్యలే. అంతయు చిన్మాత్రపూర్ణము అని గ్రహింపుము.

**విదూరథ ఉవాచః—**

ఏవంచేత్తత్కథందేవి మమేహానుచరాఇమే. 62
సంపన్నాఆత్మనా సంతి తే కిమాత్మని నోఽథవా
జగత్స్వాప్నార్థవద్భాతి తస్యస్వప్ననరాదయః. 63
కథమాత్మనిసత్యాఃస్యు ర్నసత్యావేతిమేవద



విదూరథుడు:- దేవీ! అట్లైన, నా అనుచరులందరును ఆత్మనుండియే జన్మించి, ఆత్మయందే వెలయుచున్నారా! లేక, వారి ఉనికికి ఆధారముగ ఇంకొకవస్తువేదైనయున్నదా? ఈ జగత్తు స్వాప్నానుభూతివలె మిథ్యయైన ఇందున్న జనులు స్వాప్నానుభూతసదార్థములవలె మిథ్యాస్వరూపులయ్యు, ఆత్మయందట్లు సత్యస్వరూపులై వెలయుచున్నారు? లేక ఈ ఆత్మగూడ మిథ్యయేనా?—వచింపుము.

**శ్రీ సరస్వత్యువాచః—**

రాజన్విదితవేద్యేషు శుద్ధబోధైకరూపిషు. 64
నకించిదేతత్సద్రూపం చిద్వ్యోమాత్మసు జాగతమ్
శుద్ధబోధాత్మనోభాతి కృతోనామజగద్భ్రమః. 65

శ్రీసరస్వతి:- రాజా! విదితవేద్యమును, శుద్ధబోధస్వరూపమును ఏకరూపమును చిదాకాశమునునగు ఆత్మసమూహముల ఈ జగదాదులు సద్రూపము లెవ్వియును కావు. శుద్ధబోధ స్వరూపమగు దానికి జగద్భ్రమ ఎట్లు కలుగ గలదు?

రజ్వాంసర్పభ్రమేశాంతే పునఃసర్పభ్రమఃకుతః
అసద్భావేపరిజ్ఞాతే కుతఃసత్తాజగద్భ్రమే. 66
పరిజ్ఞాతేమృగజలే పునర్జలమతిఃకుతః
స్వప్నకాలేపరిజ్ఞాతే స్వేస్వప్నమరణం కుతః
స్వస్వప్నేస్వప్నమృతిభీరమృతస్యైవ జాయతే. 67

రజ్జువునందున్న సర్పభ్రాంతి తొలగిన, అదెట్లు మరల కలుగగలదు? అసద్భ్రమను గ్రహించిన మరల జగద్భ్రాంతి ఎట్లు కలుగును? ఎండమావి స్వరూపమును గ్రహించిన మరల జలభ్రమ కలుగదు. స్వప్నమునుండి తేరుకొనిన స్వప్న మరణ మెట్లుండగలదు? జీవించియున్న వానికే, స్వప్నమును, స్వప్న—మృత్యువును కలుగుచున్నవి.

బుద్ధస్యశుద్ధస్య శరన్నభఃశ్రీః
స్వచ్ఛావదాతాతితతాశయస్య
అహంజగచ్చేతి కుశబ్దకార్థో
నవస్తుతఃసోఽంగ హివాచికంతత్. 68

వత్సా, అజ్ఞానమను మేఘావరణము తొలగిన, శరదాకాశశోభవలె స్వచ్ఛుడును, పూర్ణుడును ఏకరస స్వరూపుడునునగు తత్త్వజ్ఞునకు, 'నేను జగత్తు' అను కుత్సితశబ్దముల అర్థము బోధపడదు. అది వాచారంభణమమాత్రమే (పేరుకు మాత్రమే, వాస్తవమునకు మిథ్య.)

**శ్రీ వాల్మీకిరువాచః—**

ఇత్యుక్తవత్యథమునా దివసో జగామ
సాయంతనాయ విధయేఽస్తమినో జగామ
స్నాతుంసభాకృత నమస్కరణా జగామ
శ్యామాక్షయే రవికరైశ్చ సహాజగామ. 69

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తి ప్రకరణే లీలోపాఖ్యానే
భ్రాంతివిచార వర్ణనంనామ ఏకచత్వారింశః సర్గః ॥ 41 ॥
(పంచమదినమ్)

వాల్మీకి:- వసిష్ఠు డిట్లు నుడువుచుండ సాయంకాలమయ్యెను. సాంధ్యకృత్యముల నాచరించుటకు గారణమగు సూర్యుడస్తాద్రి కతిగెను. సభ్యులు నమస్కరించి స్నాన మొనర్పనతేగిరి. రాత్రిగడవ, మరలవారు సూర్యకిరణములతోబాటు సభకరుదెంచిరి.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున
భ్రాంతివిచార వర్ణనము ఏకచత్వారింశ సర్గము ॥ 41 ॥
(ఇది ఐదవదినము.)

## ద్విచత్వారింశః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

యస్త్వబుద్ధమతిర్మూఢో రూఢోనవితతేపదే
వజ్రసారమిదంతస్య జగదస్త్యసదేవసత్. 1

వసిష్ఠుడు:- మూఢుడును అప్రబోధితుడును అవ్యుత్పన్నమతియునగువానికి అసత్య — జగత్తు, వజ్రమువలె దృఢమై సత్యమువలెనే అగపడును.

యథాబాలస్యవేతాలే మృతిపర్యంతదుఃఖదః
అసదేవసదాకారం తథామూఢమతేర్జగత్. 2

వేతాళుడు బాలునకు ఆ మరణము దుఃఖమును గలిగించునట్లు, అసదాకారమగు ఈ జగత్తు మూఢునకు (తత్త్వజ్ఞానమును బొందునంతవఱకు) దుఃఖము నొసగుచు నేయుండును.

తాపఏవయథావారి మృగాణాంభ్రమకారణమ్
అసత్యమేవ సత్యాభం తథామూఢమతేర్జగత్. 3

ఎడారియందలి సూర్యకిరణములు జంతువులకు నీరను భ్రమను గలిగించునట్లు, మూఢునకు ఈ జగత్తు సత్యమువలెనే గోచరించును.

యథాస్వప్నమృతిర్జంతో రసత్యాసత్యరూపిణీ
అర్థక్రియాకరీభాతి తథామూఢధియాంజగత్. 4

స్వప్నమృతి జీవునకు శోకదుఃఖాదులను గలుగజేయునట్లు, మూఢునకీ జగత్తు కష్టములను గొని తెచ్చుచున్నది.



అవ్యుత్పన్నస్యకనకే కానకేకటకేయథా
కటకజ్ఞప్తిరేవాస్తినమనాగపిహేమధీః. 5

తథాఽజ్ఞస్యపురాగార నగనాగేంద్రభాసురా
ఇయందృశ్యదృగేవాస్తి నత్వన్యాపరమార్థదృక్. 6

అజ్ఞునకు ఆభరణమున సువర్ణము గనపడక, ఆభరణముగనే కనుపడునట్లు, మూఢునకు పరమవస్తువు కనబడక పురనగరాదులు గోచరించుచున్నవి.

యథానభసిముక్తాలీ పిచ్ఛకేశోండ్రకాదయః
అసత్యాఃసత్యతాంయాతా భాత్యేవందుర్దృశాంజగత్. 7

ఆకాశమున ముత్యములు, పింఛము, కేశపాశము మున్నగు అసత్య వస్తువులు (చక్షు రోగికి) సత్యములుగ కనుబడునట్లు, పరమార్థ దృష్టిహీనునకు ఈ జగత్తు కనిపించుచున్నది.

దీర్ఘస్వప్నమిదంవిశ్వం విద్ధ్యహంతాదిసంయుతమ్
అత్రాన్యేస్వప్నపురుషా యథాసత్యాస్తథాశృణు. 8

అహంకారాది భావములతో గూడుకొనిన ఈ జగత్తు దీర్ఘస్వప్నమువంటిదని గ్రహింపుము. స్వాతిరిక్తులును, స్వప్నదృశ్యులునునగు పురుషు లెంతమటుకు సత్యమో వచింపుచున్నాను, వినుము.

అస్తిసర్వగతంశాంతం పరమార్థమనంశుచి
అచేత్యచిన్మాత్రవపుః పరమాకాశమాతతమ్. 9

తత్సర్వగంసర్వశక్తి సర్వంసర్వాత్మకంస్వయమ్
యత్రయత్రయథోదేతి తథాస్తేతత్రతత్రవై. 10

అచేత్య చిన్మాత్రస్వరూపుడును, శాంతుడును, నిరతిశయుడును సత్యమును, నగు పురుషుడు సర్వగతుడు, సర్వశక్తియుతుడు, సర్వాత్మకుడునైయున్నాడు. ఇతడు సర్వాధారుడును, సర్వశక్తిమంతుడునునైయున్నాడు. అందువలన నితడు స్వమాయవలన అర్థక్రియల కనుకూలమై ఉదయించిన పట్ల, తదనుసారమే క్రియలు జరుగుచున్నవి.

తేనస్వప్నపురేద్రష్టా యాన్వేత్తిపురవాసినః
నరానితి నరాఏవ క్షణాత్తస్యభవంతి తే. 11

స్వప్నద్రష్టచే స్వప్నమున పురవాసులని తలపబడువారు, క్షణకాలము అట్లే అతనికి గోచరింతురు.

యద్ద్రష్టుశ్చిత్స్వరూపం తత్స్వాప్నాకాశాంతరస్థితమ్
స్వప్నాకాశచిత్తాభంహి నరానామేతిభావితమ్. 12

ద్రష్టయొక్క స్వరూప చైతన్యము స్వప్నాకాశ మధ్యమునయున్నది; ఆ చైతన్యము స్వప్నద్రష్ట వాసనలననుసరించి, తదాధారమగు చిత్తముతోగలసి, ప్రకాశమునందుచున్నది. అందువలననే ద్రష్టకు తాను నరుడను బోధకలుగుచున్నది.

వేదితృత్వైక్యవశతో నరతేవావబుధ్యతే
ఆత్మన్యతశ్చిద్బలేన ద్వయోరప్యేతిసత్యతా. 13

ఇట్టి చైతన్యైక్య ప్రభావముననే నరత్వబోధ కలుగుచున్నది. ఈ చిద్బలముననే స్వప్న జాగ్రజ్జగత్తులు సత్యములని తెలియబడుచున్నవి.

శ్రీ రామఉవాచ:—

స్వప్నేఽపిస్వప్నపురుషా నసత్యాస్స్యుర్మునేయది
వదతత్కో భవేద్దోషో మాయామాత్రశరీరిణి. 14

శ్రీ రాముడు:- మునీ! స్వప్నమున మాయామాత్ర శరీరుడగు స్వప్న పురుషుడు మిథ్యయైనచో దోషమేమి?—వచింపుడు.

శ్రీ వసిష్ఠఉవాచ:—

స్వప్నేన పురవాస్తవ్యా వస్తుతఃసత్యరూపిణః
ప్రమాణమత్రశృణుమే ప్రత్యక్షంనామనేతరత్. 15

వసిష్ఠుడు:- స్వప్నమున పురవాసులు మున్నగువారు సత్యస్వరూపమున గోచరింతురనుటకు ప్రత్యక్షముగాక వేరొండు ప్రమాణము లేదు;

సర్గాదావాత్మభూర్భాతి స్వప్నాభానుభవాత్మకః
తత్సంకల్పకలంవిశ్వ మేవంస్వప్నాభమేవతత్. 16

సృష్ట్యాదియందు స్వయంభువు స్వప్న తుల్యుడును, అనుభవాత్మకుడును నై, ప్రకాశించును. అతని సంకల్పమువలన జనించిన ఈ జగత్తుకూడ స్వప్నతుల్యమే.

ఏవంవిశ్వమిదంస్వప్న స్తత్రసత్యంభవాన్మమ
తథైవత్వంతథైవాన్యే స్వప్నేస్వప్నవరా నృణామ్. 17

ఇట్లు ఈ విశ్వము స్వప్నసదృశమగుచున్నది. నీవు నాకు—సత్యమైనట్లు, ఇతరులు మరొకరికడ సత్యమే యగుచున్నారు.

స్వప్నేనగరవాస్తవ్యాః సత్యానస్యురిమేయది
తదిహాపి తదాకారే నసత్యంమేమనాగపి. 18

స్వప్నమున నగుపడు నగరవాసులు సత్యముగానిచో, అట్టివారేయగు ఈ జాగ్ర జ్జాగతిక పురుషలందుగూడ సత్యబుద్ధి కలిగెడిదికాదు.

యథాహం తవసత్యాత్మా సత్యంసర్వంభవేన్మమ
స్వప్నోపలంభే సంసారే మిథఃసిద్ధ్యైప్రమేదృశీ. 19

నీవు నాకడ సత్యాత్ముడవైనట్లే, ఇతరములుగూడ సత్యములగుచున్నవి. స్వప్నము, సంసారముల సిద్ధికిదియే ప్రమాణము.

సంసారే విపులేస్వప్నే యథాసత్యమహంతవ
యథాత్వమపిమేసత్యం సర్వంస్వప్నేష్వితిక్రమః. 20



విశాలమగు స్వప్న—సంసారమున నేను నీకడ సత్యమైనట్లే, నీవుకూడ నాకడ సత్యమగుచున్నాడవు. ఇయ్యదియే స్వప్నక్రమము.

శ్రీరామ ఉవాచ:—

స్వప్నద్రష్టరి నిర్నిద్రే తద్దృష్టుఃస్వప్నపత్తనమ్
సద్రూపత్వాత్తథైవాస్తే మమేతి భగవన్మతిః. 21

శ్రీరాముడు:-భగవానుడా! స్వప్నద్రష్ట మేల్కొనిన, స్వప్నదృష్టములగు నగరాదులు సద్రూపములగుటవలన అట్లేయుండుననుకొందును.

శ్రీవసిష్ఠ ఉవాచ:—

ఏవమేతత్తథైవాస్తే సత్యత్వాత్ స్వప్నపత్తనమ్
స్వప్నద్రష్టరి నిర్నిద్రేఽప్యాకాశవిశదాకృతి. 22

వసిష్ఠుడు:- అవునట్లే, స్వప్నద్రష్ట మేల్కొనినను, స్వప్నదృష్టములగు నగరాదులు సత్యములగుటవలన, అవి ఆకాశమువలె సత్యస్వరూపములై యుండును.

ఏతదాస్తామిదంతావ ద్యజ్జాగ్రదివమన్యసే
విద్ధితత్స్వప్న మేవాంత ర్దేశకాలాద్యపూరకమ్. 23

ఈ విషయము నిట్లుండనిమ్ము. నీవుజాగ్రదవస్థయని తలచునదికూడ, స్వప్న దేశకాలాది తుల్యమగు స్వప్నమేయని గ్రహింపుము.

ఏవంసర్వమిదంభాతి నసత్యంసత్యవత్స్థితమ్
రంజయత్యపి మిథ్యైవ స్వప్నస్త్రీసురతోపమమ్. 24

ఇట్లవన్నియు సత్యములు గాకపోయినను సత్యములయట్లే నెలయుచున్నవి; స్వప్నస్త్రీ సంగమమువలె మోహమును గలుగజేయుచున్నది.

సర్వత్రవిద్యతేసర్వం దేహస్యాంతర్బహిస్తథా
యత్తువేత్తియథాసంవిత్తత్తథా సైవపశ్యతి. 25

అంతయు దేహమునకు వెలుపల, బయట వెలయుచున్నది. చైతన్యము దేశకాలాది పూరకమగుటవలన సత్యమైయున్నది. మఱియు, మాయాశక్తి ప్రభావమున సర్వత్ర సమభావమున స్ఫురించుచున్నది.

యత్రకోశే విద్యతేద్రవ్యం తద్దృష్టాలభ్యతేయథా
తథాస్తిసర్వంచిద్వ్యోమ్ని చేత్యతే తత్త్వనేనవై. 26

ధనాగారముననున్న ద్రవ్యమునంతటిని ద్రష్ట పొందును; చిదాకాశమే తనయందున్న దానినంతటిని జూపించుచున్నది.

అనంతరమువాచేదం దేవీ జ్ఞప్తిర్విదూరథమ్
కృత్వాబోధామృతాసేకై ర్వివేకాంకురసుందరమ్. 27

అనంతరము జ్ఞప్తిదేవి విదూరథుని జ్ఞానామృతమునదడపి, వివేకాంకురమును మొలకెత్తించి, ఇట్లుపల్కెను:—

ఏతదేవమయారాజన్ లీలార్థముపవర్ణితమ్
స్వస్తితేఽస్తుగమిష్యావో దృష్టాదృష్టాంతదృష్టయః. 28

రాజా! దీనినంతటిని లీలకొఱకు వర్ణించితిని, నీకు మంగళమగుగాక! మేము మా త్రోవన కఱుగుచున్నారము, లీల బ్రహ్మాండ కల్పనామిథ్యాత్వదృష్టాంతమును గ్రహించినది.

శ్రీ వసిష్ఠఉవాచ:—

ఇతిప్రోక్తేసరస్వత్యా గిరామధురవర్ణయా
ఉవాచవచనంధీమాన్ భూమిపాలో విదూరథః. 29

వసిష్ఠుడు:—సరస్వతి మధురముగ నిట్లుపల్క, బుద్ధిమంతుడగు విదూరథు డిట్లుపల్కజొచ్చెను.

విదూరథ ఉవాచ:—

మమాపిదర్శనందేవి మోఘం భవతి నార్థిని
మహాఫలప్రదాయాస్తు కథం తవ భవిష్యతి. 30

విదూరథుడు:—నావంటి సామాన్యమానవుని దర్శనమే వ్యర్థముగానప్పుడు, మహాఫలప్రదమగు నీదర్శనమెట్లు విఫలముకాగలదు.

అహందేహంసముత్సృజ్య లోకాంతరమితోఽపరమ్
నిజమాయామి హేదేవి స్వప్నాత్స్వప్నాంతరంయథా 31
పశ్యాదిశాశు మాంమాతః ప్రపన్నంశరణాగతమ్
భక్తేవహేలావరదే మహతాం నవిరాజతే. 32
యంప్రదేశమహంయామి తమేవాయాత్వయంమమ
మంత్రీకుమారీచైవేయం బాలేతి కురుమే దయాం. 33

దేవీ! స్వప్నమునుండి ఇంకొకస్వప్నమున కఱుగునట్లు, నేనీదేహమును బరిత్యజించి పూర్వదేహమును గ్రహింతును. ఆజ్ఞాపింపుము. నేనుప్రపన్నుడను, శరణాగతుడను. మాతా! భక్తావహేళన గొప్పవారలకు తగదు. నే నరిగుచోటునకు, ఈ నామంత్రియు, కుమారియు అరుదెంచు నట్లనుగ్రహింపుము.

శ్రీ సరస్వత్యువాచ:—

ఆగచ్ఛరాజ్యముచితార్థవిలాసచారు
ప్రాగ్జన్మమండలపతే కురునిర్విశంకం
అస్మాభిరర్థిజనకామనిరాకృతిర్హి
దృష్టానకాచన కదాచిదపీతి విద్ధి. 34

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే స్వప్నపురుష సత్యత్వనిరూపణంనామ ద్విచత్వారింశత్తమః సర్గః ॥ 42 ॥



శ్రీసరస్వతి:—రాజా! రమ్ము! నీవు శంకారహితుడవై, యథోచితమును, విలాససంపన్నయును నగు రాజ్యమును బాలింపుము. మావలన, అర్థిజనుల కోర్కెలు, నిరాకరింపబడినట్లేరును, ఎన్నడును గాంచలేదు, అని గ్రహింపుము.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున స్వప్నపురుష సత్యత్వనిరూపణమను ద్విచత్వారింశ సర్గము ॥ 42 ॥

———:0:———

## త్రిచత్వారింశః సర్గః.

శ్రీ సరస్వత్యువాచ:—

అస్మిన్రణవరేరాజన్ మర్తవ్యంభవతాధునా
ప్రాప్తవ్యంప్రాక్తనంరాజ్యం సర్వంప్రత్యక్షమేవతే. 1
కుమార్యామంత్రిణాచైవ త్వయాచప్రాక్తనంపురం
ఆగంతవ్యం శవీభూతం ప్రాప్తవ్యం తచ్ఛరీరకం. 2
అహంయావోయథాయాతం వాతరూపేణచత్వయా
ఆగంతవ్యఃసదేశస్తు కుమార్యామంత్రిణాపిచ. 3
అన్యైవ గతిరశ్వస్య గతిరన్యాఖరోష్ట్రయోః
మదస్విన్నకపోలస్య గతిరన్యైవదంతినః. 4

శ్రీసరస్వతి:—రాజా! ఈ రణరంగమున నీవు మరణింపవలసియున్నాడవు; అనంతరము నీవు నీ పూర్వపు రాజ్యమును బొందెదవు; అప్పుడు నీవును; నీమంత్రియు, పుత్రియును శవములై పడియున్న మీమీ శరీరములను బొందెదరు. మేము వచ్చినట్లే, అరిగెదము; మీరు ఆతివాహిక దేహమును ధరించి అట కరిగెదరు. అశ్వమునొక్కయు, ఖరమునొక్కయు, ఉష్ట్రమునొక్కయు, దంతియొక్కయు గతులు విభిన్నలైయున్నవి.

ప్రస్తుతేతి కథాయావన్మిథోమధురభాషిణోః
తావత్ప్రవిశ్యసంభ్రాంత ఉవాచోర్ధ్వస్థితోనరః. 5

ఇట్లు వారు మధురముగ సంభాషించుచుండ, ప్రాసాదమునుండి, రాత్రి జరుగుచున్న విషయముల గాంచుచున్న పురుషుడు సత్వరమరుదెంచి ఇట్లు పల్కదొడగెను.

దేవసాయకచక్రాసి గదాపరిఘవృష్టిమత్
మహత్పరబలంప్రాప్త మేకార్ణవ ఇవోద్ధతః. 6
కల్పకాలానిలోద్ధూత కులాచలశిలోపమం
గదాశక్తిభుశుండీనాం వృష్టిం ముంచతితుష్టిమత్. 7

నగరేనగసంకాశే లగ్నోఽగ్ని ర్వ్యాప్తది క్తటః
దహంశ్చటచటాస్ఫోటైః పాతయత్యుత్తమాంపురీమ్. 8
కల్పాంబుదఘటాతుల్యా వ్యోమ్ని ధూమమహాద్రయః
బలాత్ప్రోడ్డయనంకర్తుం ప్రవృత్తాగరుడా ఇవ. 9

దేవా! చక్రాద్యాయుధముల ద్రిప్పుచు కల్లోలసముద్రమువలెనున్న శత్రుసైన్యమొకటి ఈవైపున కరుడెంచుచున్నది. పర్వతమువలెనున్న ఈనగరమునకు నాల్గువైపుల నిప్పంటుకొనినది; 'చటచట' ధ్వనులతో సుందరమగు ఈపురి తగులబడిపోవుచున్నది. ప్రళయమేఘములబోలు ధూమపర్వతములు, పక్షులవలె ఆకాశమున కెగసిపోవుచున్నవి.

శ్రీవసిష్ఠ ఉవాచ:—

ససంభ్రమంవదత్యేవం పురుషేపరుషారవః
ఉదభూత్ప్రరయన్నాశా బహిఃకోలాహలోమహాన్. 10
బలాదాకర్ణకృష్టానాం ధనుషాంశరవర్షిణామ్
బృంహితామతిమత్తానాం కుంజరాణాంతరస్వినామ్ 11
పురేచటచటాస్ఫోటై ర్దహతాం జాతవేదసామ్
పౌరాణాందగ్ధదారాణాం మహాహలహలారవైః 12
తరతామగ్నిఖండానాం టాంకారఃకథితోరవైః
జ్వలితానాంపరిస్పందా ద్ధగద్ధగితిచార్చిషామ్. 13

వసిష్ఠుడు:- ఆపురుషుడిట్లు భయముతో విన్నవించుచుండ, బయట కోలాహలములు మిన్నుముట్టుచుండెను. ఆకర్ణాంతము సంధింపబడి బాణముల వర్షించుచున్న ధనుస్సులయొక్క 'టంకారమును' మదపుటేనుగుల ఘీంకారమును వినబడదొడగెను. పురమును దహించుచున్న అగ్నియొక్క 'చటచట' ధ్వనులును, భార్యలు తగులబడి గోడుమండ భర్తల కోలాహలమును, నలువైపుల పడుచున్న నిప్పుకల టంకార ధ్వనియు, అగ్నిశిఖల 'ధగద్ధగ' ధ్వనులును వినవచ్చుచుండెను.

అథవాతాయనాద్దేవ్యా మంత్రీరాజావిదూరథః
దదృశుఃప్రోల్లసన్నాదం మహానిశిమహాపురమ్. 14
ప్రలయానలసంక్షుబ్ధ పూర్ణైకార్ణవరంహసా
పూర్ణం పరబలేనోగ్ర హేతిమేఘతరంగిణా. 15
కల్పాంతవహ్నివిగల న్మేరుభూధరభాసురైః
దహ్యమానంమహాజ్వాలా జాలైరంబరపూరకైః 16
ముష్టిగ్రాహ్యమహామేఘ గర్జాసంతర్జితోర్జితైః
ఘోరంకలకలారావై ర్మాంసలై ర్దస్యుజల్పితైః. 17
పుష్కరావర్తసంకాశ ధూమ్రాభ్రపిహితాంబరమ్
ప్రోడ్డీనహేమాగ్రనిభై ర్జ్వాలాపుంజై ర్నిరంతరమ్. 18



తరదుల్ముకఖండోగ్ర తారాతరలితాంబరమ్
అన్యోన్యదేశసద్మౌఘ ప్రజ్వలజ్జ్వలనాచలమ్. 19
హతసైన్యపురాపాతం దృతాంగారాభ్రకోటరైః
కర్కశాక్రందనిర్దగ్ధ లోకపూగోగ్రగర్జితమ్. 20

అనంతరము దేవద్వయమును, మంత్రియు, రాజును, గవాక్షముగుండ గాంచిరి.— ఆ అర్ధరాత్రి పురమంతయు భీషణశబ్దములతో నిండియుండెను. ప్రళయానలమున దహింపబడు సముద్రమువలె ఘూర్ణిల్లుచుండెను. నిశితఖడ్గములను మేఘములుగల్గిన శత్రుబలము ముట్టించిన అగ్నిజ్వాల, సుమేరుగిరిని ప్రళయకాలమున దహించు అగ్నివలె, కన్పడుచు ఆకాశమువఱకు వ్యాపించి పురినంతటిని దహించుచుండెను. దస్యులు వస్తువులను దొంగలింప యత్నించుచు, మేఘములవలె తర్జనభర్జనముల నొనర్పసాగిరి. ఆకాశము పుష్కలావర్తములబోలు పొగతో నిండుచుండ, బంగారమును బోలు అగ్నిజ్వాలలు దట్టముగ వ్యాపించుచు పైకిలేచుచుండెను. మండుచున్న కఱ్ఱలను తెక్కలతో ఆకసము నిండుచుండెను. ఇండ్లనుగాంచుచున్న అగ్నిజ్వాలలు కలసికొని పర్వతమువలె కన్పడసాగెను. యుద్ధమున మిగులువడినవారు పురమున ప్రవేశించుచుండిరి. పైకి చిందుచున్న నిప్పులు మేఘచ్ఛిద్రములవలె నుండెను. కాల్పబడిన మనుష్యులు కర్కశస్వరమున రోదించుచు, ఉగ్రముగ గర్జింపసాగిరి.

కృశానుకణనారాచ నిరంతరతరాంబరమ్
బహుహేతిశిలాజాలలుఠద్దగ్ధపురోత్కరమ్. 21
రణద్ద్విరదసంఘట్ట కుట్టితోద్భటసద్భటమ్
విద్రవత్తస్కరచ్ఛేద మార్గకీర్ణమహాధనమ్. 22
అంగారరాశినిపత న్నరనార్యుగ్రరోదనమ్
స్ఫుటచ్చటచటాశబ్ద ప్రలుఠస్ఫుటకాష్ఠకమ్. 23
విపులాలాతచక్రౌఘ శతసూర్యనభ స్తలం
అంగారశిఖరాకీర్ణ సమస్తవసుధాతలమ్. 24
దగ్ధాగ్నికాష్ఠకేంకార రణజ్జ్వలనసైనవమ్
దగ్ధజంతుఘనాక్రంద రుదత్సకలసైనికమ్. 25
పాంసుశేషాత్తరాజశ్రీ వృద్ధతృప్తహుతాశనమ్
సకలగ్రసనారంభ సోద్యోగాగ్నిమహాశనమ్. 26
యదృచ్ఛాత్కారడాత్కార కఠినాగ్నిరటద్గృహమ్
అనంతజంతుభోజ్యాన్న వహ్నిభుక్తేంధనస్ఫ్రహమ్. 27

అగ్ని స్ఫులింగములను బాణములతో నాకాశము నిరవకాశమయ్యెను. దగ్ధులైనవారు ఖడ్గఘాతముల నొరగుచుండిరి. యుద్ధపుటేనుగుల ఒత్తిడికి భటులు నలిగిపోవుచుండిరి. పారిపోవుచున్న దొంగల తలలు నరుకబడ, వారు గొనిపోవుచున్న ధనమటు వెదజల్లబడుచుండెను. నిప్పులబడిన వరనారీసమూహము రోదన మొనర్పుచుండెను. కాలుచున్న కఱ్ఱలు 'చటచట' శబ్దముల నొనర్చుచు నలువైపుల పడదొడగెను. నిప్పుకలు ఆకాశమున చక్రములవలె లేచి, నూర్గురు సూర్యులచందమున

తోపజేయుచుండెను. నిప్పులతో భూమినిండిపోయెను. దూలములును, వెదుళ్లును క్రేంకారము నొనర్చుచు తగులబడిపోవుచుండెను. కాలిపోవుచున్న జంతువులును, సైనికులును రోదించుచుండిరి. అగ్ని రాజసంపదను బూడిదగ మార్చెను. అగ్నియను తిండిపోతు అన్నిటిని మ్రింగివేయదొడగెను. దొంగలు హఠాత్తుగవచ్చి గృహస్వామిని గొట్టి, అంతటిని గొనిపోవుచుండ, వారేడ్చుచుండిరి. అగ్ని అంతటినిగాల్చ, మిగిలిన దానినిగూడ కొందఱు త్రోసివేయుచుండిరి.

అథశుశ్రావతత్రాసౌ గిరోరాజవిదూరథః
యోధానాందగ్ధదారాణాంపశ్యతామభిధావతామ్. 28

అనంతరము విదూరథుడు, దగ్ధమగుచున్న దారాదులగాంచ పరుగిడుచున్న యోధుల పల్కుల నీ విధముగ వినెను:—

హామత్తమరుదూర్ధ్వస్థానంగారగృహపాదపాన్
రణత్ఖరఖరంసీర జాలామాతపపంథినః. 29
హాదగ్ధదారాఃప్రాలేయశీతా దేహేషుదంతినామ్
మగ్నామనస్సుమహతా మివ విజ్ఞానసూక్తయః. 30

ఆహా! ఎండవేడిని ఆపగల నాయింటిని మాపుమాప పెనుకాలి పెద్దధ్వనిజేయుచు వచ్చుచున్నది. అయ్యో! భార్యలు ఇదివఱకే చలికి కొయ్యబారిపోయినారు. వారిప్పుడు అగ్నివలన దహింపబడి, గొప్పవారి మనస్సుల సదుపదేశములుండునట్లు, ఏనుగుల మాటున నణగియున్నారు.

హాతాత హేతయో లగ్నా స్తరుణీకబరీతృణే
జ్వలంతిశుష్కపర్ణౌఘా ఇవవీరానిలేరితాః. 31

హా! తండ్రీ! ఆగ్నేయాస్త్రములన్నియు వనితలకేశపాశ—తృణముల తగుల్కొని, వీరులు ప్రయోగించుచున్న మారుతాస్త్రమున రగుల్కొని, ఎండుటాకులవలె వాటిని గాల్చుచున్నవి.

ఆవర్తనదీదీర్ఘా వహత్యూర్ధ్వతరంగిణీ
పశ్యేయం ధూమయమునా వ్యోమగంగాంప్రధావతి. 32

చూడుము! ఈ ధూమ యమునానది కల్లోల తరంగములతో పైకిలేచుచు, ఆకాశ గంగవైపుకు పరిగిడుచున్నది.

వహదుల్ముకకాష్ఠోర్ధ్వగామినీ ధూమసిమ్నగా
వైమానికానంధయతి పశ్యాగ్నికణబుద్బుదా. 33

ధూమనది పైకి పరుగిడుచు, అంగారకాష్ఠములను గొనిపోవుచు, అగ్నికణములను బుద్బుదములను విడచుచు, వైమానికులను అంధులుగ నొనర్చుచున్నది.

అస్యామాతాపితాభ్రాతా జామాతా స్తనపాఃసుతే
అస్మిన్సద్మనినిర్దగ్ధా దగ్ధైవాసత్సమింధనే. 34

ఈ అబలయొక్క తల్లిదండ్రులును, సోదరులును, చనుపాలుద్రావు పసిబిడ్డలును కాలిపోయినారు. అందువలన ఈమె అగ్నివలన దహింపబడకపోయినను, శోకాగ్నివలన దహింపబడుచున్నది.



హాహాహాగచ్ఛతేశీఘ్ర మేతదంగారమందిరమ్
ఇతఃప్రవృత్తం పతితుంసుమేరుఃప్రలయేయథా. 35

హాహా!! త్వరగారమ్ము! నీ గృహము అంగారములుగమారి, ప్రళయకాల మేరుగిరివలె కూలనున్నది.

అహోశరశిలాశక్తి కుంతప్రాసాసి హేతయః
జాలసంధ్యాభ్రపటలం విశంతిశలభాఇవ. 36

ఆహా! శరాద్యాయుధములు సాంధ్యమేఘములవలెనున్న, గృహగవాక్షముల శలభములవలె ప్రవేశించుచున్నవి.

హేతిప్రవాహోజ్వలనం నభస్యంత్యాంవిశంత్యహో
బడవానలముజ్జ్వాల మర్ణఃపూరాఇవార్ణవాత్. 37

సముద్రమునుండి జలప్రవాహము బడబాగ్నియందు పడునట్లు, ఖడ్గసమూహములు ఈ పురిని గాల్చు అగ్నియందు పడుచున్నవి.

ధూమాయంతిమహాభ్రాణి జ్వాలాఃశిఖరికోటిషు
సరసాన్యపిశుష్యంతి హృదయానీవరాగిణామ్. 38

పొగ మేఘముల ప్రవేశించుచున్నది. అగ్నిశిఖలు హర్మ్యాగ్రముల నారోహించుచున్నవి. సరసములగు వాపీకూపతటాకాదులుకూడ రోగి హృదయమువలె శుష్కించుచున్నవి.

అలానత్వరుషేవైతా దంతిభిర్వృక్షపంక్తయః
స్ఫురత్కటకటారావం పాత్యంతే కృతచీత్కృతైః. 39

ఏనుగలు కట్టుకంబములను భ్రాంతితో వృక్షములను "కటకట" శబ్దమొనర్చుచు, విరచివైచుచున్నవి.

పుష్టపుష్పఫలస్కంధా గతశ్రీకాగృహద్రుమాః
గతానిర్దగ్ధసర్వస్వా గృహస్థాఇవదీనతామ్. 40

పూలతోను పండ్లతోడను నిండినవియు, లావాటి బోదెలు గలిగినవియునగు చెట్లు దహింపబడి, అంతటిని బోగొట్టుకొనిన గృహస్థులవలె దీనములైనవి.

మాతాపితృవినిర్ముక్తా బాలకాస్తిమిరావలీమ్
మగ్నంతోఽంగేషు రథ్యాసు కుడ్యపాతేన హాహతాః. 41

అయ్యో! తల్లిదండ్రులను బోగొట్టుకొనినపిల్లలు చీకటిలో ఇంటిని వెదుకుకొనుచు బాణములతోనిండిన రథమార్గమునబడి, గోడకూలగ మరణించుచున్నారు.

వాతవిద్రావితాత్త్రస్య న్కరిణోవ్యరణమూర్ధని
పతదంగారకాగార భారిణఃకటుకూజితమ్. 42

గాలిచే నెగురగొట్టబడి నిప్పులుమీదబడుచుండ ఏనుగులు భయపడి, కటువుగ ఘీంకరించుచున్నవి.

హాకష్టమసినిర్భిన్నే స్కంధేసన్నద్ధ్యదుల్ముకే
పతితోఽయంత్రపాషాణః పురుషస్యాశనిర్యథా. 43

అయ్యో! ఎంతకష్టము! కత్తిచేనరుకబడిన భుజముమీద నిప్పులుబడినవి. మరల దానిమీద పిడుగువలె, యంత్ర—పాషాణము పడుచున్నది.

గవాశ్వమహిషేభోష్ట్రశ్వశృగాలైడకైరహో
ఘోరై రణమివారబ్ధం మార్గరోధకమాకులైః 44

ఆవులు, గుఱ్ఱములు, దున్నలు, ఏనుగులు, లొట్టిలు, నక్కలు, మేకలు, మున్నగునవి దారి కనుపడక పోవుటవలన భయపడి యుద్ధమొనర్చు చున్నట్లున్నవి.

పట్టైః పటపటాశబ్ద జలజలాలిమాలితైః
ఆక్రందంత్యః స్త్రియోయాంతి స్థలపద్మాచితా ఇవ. 45

స్త్రీలు అగ్నిభయమునజేసి తడిబట్టల గట్టుకొని, మెట్టదామరల గప్పబడినవారివలె, నరుగుచున్నారు. వారి బట్టలనుండి 'పటపట' శబ్దములు వెలువడుచున్నది.

స్త్రీణాంజ్వాలాలవాః పశ్య లిహంత్యలకవల్లరీః
కుర్వంతోఽశోకపుష్పాభాం కరభాఇవపన్నగీః. 46

లొట్టియలు వృక్షశాఖలను భక్షింప, సాగునట్లు అగ్నిజ్వాలలు స్త్రీలముంగురుల నాధారపరచుకొనుచు, అశోకపుష్పశోభను గలిగించుచున్నవి.

హాహాహారిణశావాక్ష్యాః పక్షులక్షణపక్ష్మసు
కుమార్గేష్వివవిశ్రాంతి మేతికార్శ్యానవీ శిఖా. 47

హరిణనయనల భ్రమరపక్షసదృశములగు కనురెప్పలను దహింప అగ్నిజ్వాలలు యత్నించుచున్నవి.

దహ్యమానోఽపినిర్యాతి న కలత్రంవినానరః
అహోబతదురుచ్ఛేదాః ప్రాణినాంస్నేహవాగురాః. 48

దహింపబడు భార్యను వెలువరింప యత్నించువాడు భార్యనుగైకొనకుండ, ఈవలికి రాలేకున్నాడు! ఆహా! ప్రాణుల స్నేహబంధములు త్రెంపవీలులేనివికదా!

కరీరభసనిర్లూన జ్వలదంగారపాదపః
ప్లుష్టపుష్కరకఃకోపా న్మగ్నఃపుష్కరదం సరః 49

ఏనుగ తన్నుకట్టియుంచిన చెట్లుకూలగా దానినిపిండిచేసి, కాలినతొండమును జల్లబరచుకొన పద్మ—సరోవరమున మునుగుచున్నది.

ధూమాంబుదపదంప్రాప్యవిలోలాంతస్తడిల్లతః
జ్వలదంగారనారాచ నికరం పరివర్షతి. 50

ధూమమేఘములు అగ్నిశిఖలను విద్యుత్తులనుగైకొని అంగారములను బాణములను వర్షించుచున్నవి.



దేవధూమస్ఫురద్వహ్నికణ ఆవర్తవృత్తిమాన్
స్థితఆపీడవాన్వ్యోమ్ని రత్నపూర్ణ ఇవార్ణవః. 51

దేవా! ఆకసమున పొగయందు నిప్పు సుడిగుండమువలె తిరుగుచున్నది. అందువలన అగ్నిజ్వాలలను తరంగములతోగూడుకొని రత్నాకరమువలె నగుపించుచున్నది.

గౌరమంబరమాభాతి జ్వాలాశిఖరతేజసా
మృత్యునేవోత్సవే దత్తః కుంకుమాక్తకరండకః. 52

ఆకాశమండలము అగ్నిశిఖల పీతవర్ణమును దాల్చ, మృత్యుదేవుడు జీవహింసోత్సవ సమయమున దిగ్వధువులను కుంకుమచేటికతో నలంకరించెనాయను నట్లుండెను.

అహోనువిషమంచేదం వర్తతే వృత్తవర్జితమ్
ధ్రియంతేరాజనార్యోఽపి వైరిభిరుదాయుధైః. 53

ఆహా! ఇదేమి అన్యాయము! వైరివీరులు రాజస్త్రీలనుగూడ ఆయుధహస్తులై కొనుపోవుచున్నారే!

లోలస్రగ్దామకుసుమైర్మార్గప్రాకారకారకైః
అర్ధనిర్దగ్ధకబరీకీర్ణవక్షస్థలస్తనాః 54

అర్ధదగ్ధములగు కేశపాశములు రమణుల వక్షస్థలమును, స్తనమండలమును గప్పివేయుచున్నవి. వారి హారములుతునిగి దారియందంతటను బడియున్నవి.

ఆలోలాంబరసంలక్ష్య నితంబజఘనస్థలాః
పతన్మాణిక్యవలయ పలితావనిమండలాః. 55

స్వచ్ఛవసనముల వారి పిరుదులును, తొడలును గనంబడుచున్నవి. పెరిగిపోయిన మాణిక్యములతో భూమి కప్పబడియున్నది.

భిన్నహారలతాజాల వికీర్ణామలమౌక్తికాః
దృష్టాదృష్టస్తనశ్రేణీ పార్శ్వోద్యత్కనకప్రభాః. 56

వీరి భిన్నహారములనుండి ముత్యములు రాలిపడుచున్నవి. వీరి స్తనమండల పార్శ్వమునుండి కనకకాంతులు వెలువడుచున్నవి.

కురరీకర్కశాక్రంద మందీకృతరణారవాః
ధారావాహాస్రుతారావ భిన్నపార్శ్వవిచేతనాః. 57

కురరీరవములవలె కర్కశములగు ఈ నారుల కర్కశశబ్దముల సంగ్రామ రవములు మందములగుచున్నవి. మఱియు, ఈ రవముల వారి పొట్టతరుగుకొని పోవుచున్నట్లున్నవి.

రక్తకర్దమబాష్పాంబుక్లిన్నగ్రంథితవాససః
భుజమూలార్పితభుజైర్నీయమానా బలాన్నృభిః. 58

రక్తపు రొంపివలనను, కన్నీటివలనను వారి కట్టుబట్టలు తడసిపోయినవి. వీరిని బలవంతముగ భుజములమీద శిక్కించుకొని పరరాజులు కొనిపోవుచున్నారు.

కణివాస్మిన్పరిత్రాతా స్యాదిత్యాదీనవీక్షితైః
ఉత్పలాలీవవర్షద్భిః పరిరోదితసైనికాః. 59

'మమ్ము రక్షించువారెవ్వరును లేరా?' అనునట్లు వీరు చూడ్కు కలువల గుటిపించుచుండ శక్తిహీనులగు సైనికు లేడ్చుచున్నారు.

మృణాలకోమలాచ్ఛోరు మూలజాలైః సునిర్మలైః
స్వచ్ఛాంబరతలాలక్ష్యై రాకాశనలినీనిభాః. 60

తామరతూండ్లవలె కోమలములును, నిర్మలములునునగు వారి ఊరుమూలములు స్వచ్ఛవసనమున గప్పబడి, ఆకాశపద్మములవలె గనంబడుచున్నవి.

ఆలోలమాల్యవసనా భరణాంగరాగా
బాష్పాకులాతత చలాలకవల్లరీకాః
ఆనందమందరనిరంతర మథ్యమానా
త్కామార్ణవాత్సముదితా ఇవరాజలక్ష్మ్యః. 61

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
అగ్నిదగ్ధగృహాది వర్ణనంనామ త్రిచత్వారింశః సర్గః ॥ 43 ॥

ఈ నారుల మాల్యవసనాదులన్నియు వికంపితము లగుచున్నవి. వారి ముంగురులు కన్నీట దడసి, ఇటునటు ఊగులాడుచున్నవి. వారు కామసముద్రమును ఆనందమను మందరపర్వతమున మథింప, లేచిన రాజలక్ష్ములవలెనుండిరి.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు, ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున
అగ్నిదగ్ధ గృహాది వర్ణనమను త్రిచత్వారింశ సర్గము ॥ 43 ॥

## చతుశ్చత్వారింశః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఏతస్మిన్నంతరేరాజమహిషీ మత్తయావనా
తద్వివేశగృహంలక్ష్మీ రివపంకజకోటరమ్. 1
ఆలోలమాల్యవసనా భిన్నహారలతాకులా
అనుయాతా వయస్యాభి ర్దాసీభిర్భయవిహ్వలా. 2
చంద్రాననావదాతాంగీ శ్వాసోత్కంపిపయోధరా
తారకాకారదశనా స్థితాద్యౌరివరూపిణీ. 3



వసిష్ఠుడు:- ఇంతలో ఆలోలమాలవసనయు, భయవిహ్వలయు, విచ్ఛిన్న హారలతా ధారిణియు, పూర్ణయౌవనయు నగు రాజమహిషి చెలికత్తెలను, పరిచారికలను గొని, లక్ష్మి, పద్మకోటరమును ప్రవేశించునట్లు, ఆ రాజభవనమును రూపుదాల్చిన ఆకాశమువలె ప్రవేశించెను. ఆమె పయోధరములు నిశ్వాసవేగమున కంపించుచుండెను. ఆమె దంతములు నక్షత్రములవలె మెరయుచుండెను.

అథతస్యావయస్యైకా రాజానం తంవ్యజిజ్ఞపత్
భూతసంగ్రామసంరబ్ధ మమరేంద్రమివాప్సరాః. 4

అప్పుడు చెలికత్తె ఒకతె అప్సరసలు దేవేంద్రునకు దెల్పునట్లు, యుద్ధవిశేషములను రాజునకు దెల్పదొడంగెను:—

దేవదేవీసహస్రాభిః పలాయ్యాంతఃపురాంతరాత్
శరణం దేవమాయాతా వాతార్తేవలతాద్రుమమ్. 5

దేవా! పెనుగాలివలన నూపబడిన తీగె చెట్టునాశ్రయించునట్లు, ఈ పట్టమహిషి మమ్ము వెంటనిడికొని పారిపోయివచ్చి, మిమ్ము శరణుజొచ్చుచున్నది.

రాజన్దారాహృతాస్తాస్తే బలవద్భిరుదాయుధైః
ఊర్మిజాలైర్మహాబ్ధీనాం తీరద్రుమలతా ఇవ. 6

రాజా! సముద్రతరంగములు, తీరద్రుమవేష్టిత లతాసమూహమును గొనిపోవునట్లు, ఆయుధహస్తులగు శత్రువులు మీ భార్యలనందఱిని గొనిపోయినారు.

అంతఃపురాధిపాః సర్వే పిష్టాః శత్రుభిరుద్ధతైః
అశంకితాభిపతితై ర్వాతై రివవరద్రుమాః. 7

"పెను గాలి చెట్లను పిండిజేయునట్లు, ఉద్ధతులగు శత్రువులు అంతఃపురపాలకుల నందఱిని పిండిచేసివైచినారు.

దూరేణాశంకమాయాతైః పరైర్నః పురమాహృతమ్
రాత్రౌ వర్షాస్వివోద్ఘోషైః కమలానీవవారిభిః. 8

"రాత్రియందు వర్షధారలు ధ్వనినొనర్చుచు కమలవనమును కుళ్లగించునట్లు, శత్రువులు దూరమునుండివచ్చిపడి, మన పురిని దోచుకొనుచున్నారు.

ధూమం వర్షద్భి రున్నాదై ర్లేలిహానోగ్రహేతిభిః
వహ్నిభిర్నః పురంప్రాప్తం పరయోధైశ్చభూరిభిః. 9

"విశ్వమును మ్రింగఁగోరు అగ్నిజ్వాలలు ధూమమును వర్షించుచు, భయంకరశబ్దముల నొనర్చుచు పురినాక్రమించుకొనుచున్నవి. పొగవలె నల్లనివగు కవచముల ధరించిన శత్రువీరులుగూడ చేతగత్తులగొని నలువైపుల పురిని ముట్టడించుచున్నారు.

పరివారైర్విలాసిన్యో దేవ్యఆహృత్యమూర్ధజైః
ఆక్రందంత్యోబలాన్నీతాః కురర్య ఇవధీవరైః. 10

వేటగాండ్రు పక్షులను, మృగములను గొనిపోవునట్లు, అంతఃపురస్త్రీలను శత్రువులు కేశముల బట్టుకొని కొనిపోవుచున్నారు.

ఇతినోఽయేయమాయాతా శాఖాప్రసరశాలినీ
ఆపత్తామలముద్ధర్తుం దేవస్త్యేవా స్తిశక్తతా. 11

"శాఖాప్రశాఖలతో విస్తరిల్లు ఈ ఆపదనుండి రక్షించుశక్తి మీ కొక్కరికే యున్నది.

ఇత్యాకర్ణ్యావలోక్యాసౌ దేవ్యోయుద్ధాయయామ్యతిః
క్షమ్యతాంమమభార్యేయం యుష్మత్పాదాబ్జషట్పదీ. 12

రాజీపల్కులనాలించి దేవులను గాంచి, ఇట్లనెను:— "నేను యుద్ధమునకు వరుగు చున్నాడను; నన్ను క్షమింపుడు. నా భార్యను మీ పాదపద్మములకడ నుంచుచున్నాను, రక్షింపుడు.

ఇత్యుక్త్వానిర్య యౌరాజా కోపారుణితలోచనః
మత్తేభనిర్భిన్నవనః కందరాదివకేసరీ. 13

రాజిట్లుపల్కి క్రోధమున కన్నెఱ్ఱబడ, మదపుటేనుగుల చించివేయుచు గుహనుండి వెలువడు సింహమువలె బయట కఱిగెను.

లీలాలీలాందదర్శాథ స్వాకారసదృశాకృతిమ్
ప్రతిబింబమివాయాతా మాదర్శే చారుదర్శనామ్. 14

అప్పుడు తన ప్రతిబింబమువలె మనోహరముగ నున్న లీలను సరస్వతీదేవితో నున్న (ప్రబుద్ధలీల) లీలాదేవి గాంచదొడగెను.

ప్రబుద్ధ లీలోవాచ:—

కేమిదందేవి హే బ్రూహి కస్మాదియమహాంస్థితా
యా సాఽభవమహంపూర్వం కథంసేయమహాంస్థితా. 15
మంత్రిప్రభృతయః పౌరా యోధాః సబలవాహనాః
సర్వఏవతఏవేమే స్థితా స్తత్రతథైవతే. 16
తత్రత్రావీహచహేదేవి సర్వేకథమవస్థితాః
బహిరంతశ్చ ముకురే ఇవైతే కింప్రచేతనాః. 17

ప్రబుద్ధలీల:— దేవీ! ఇదేమి? ఈమె సరిగ నావలెనున్నదే! ఈమె, మున్ను నేనున్నట్లే ఉన్నదే! కారణమేమి? వచింపుము. మంత్రిప్రభుతులను గాంచిన పూర్వపు రాజ్యమేయని తోచుచున్నది. వీరు అద్దమునగుపడు నీడలవలె, నా వెలుపల బయిట నెట్లున్నారు? వీరు సచేతనులేనా?

శ్రీ దేవ్యువాచ:—

యథాజ్ఞప్తిరుదేత్యంత స్తథానుభవతిక్షణాత్
చితిశ్చేత్యార్థతామేతి చిత్తంచిత్తార్థతామివ. 18
యాదృగర్థంజగద్రూపం తత్రైవోదేతి తత్క్షణాత్
నదేశకాలదీర్ఘత్వం నవైచిత్ర్యంపదార్థజమ్. 19
బాహ్యమాభ్యంతరంభాతి స్వప్నార్థోఽత్రనిదర్శనం
యదంతఃస్వప్నసంకల్పపురంచ కచనంది తే. 20



శ్రీదేవి:— హృదయమున జ్ఞానముదయించునట్లే, క్షణకాలము అనుభూతికూడకల్గును. స్వప్న సమయమున చిత్తము జాగ్రదనుభూతములగు వస్తువుల రూపమును ధరించునట్లు, చిత్ — శక్తిగూడ చిత్తముయొక్క ఆకారమును బొందును. చైతన్యము ప్రతిఫలించునట్లే, సంస్కారాత్మకమగు ఈ జగత్తుకూడ చిత్తమున ప్రతిఫలించుచున్నది. దేశకాలముల దీర్ఘత్వము, పదార్థముల వైచిత్ర్యము దీనికి ప్రతిబంధకముకాదు. చైతన్య మధ్యస్తమైనను బయటనున్నట్లే తోచును. స్వప్నమున నగుపడు వస్తువు లీవిషయమున ప్రమాణములు. స్వప్నకల్పితములగు నగరాదులు అంతరముననున్నను, అవి బయటనున్నట్లే తోచుచున్నవి. అట్లే, అంతఃపరికల్పితమగు జగత్తుకూడ, చైతన్యము సర్వవ్యాపకమగుటవలన, బయటనున్నట్లు తోచుచున్నది.

తదేతద్బాహ్యనామ్నైవ స్వభ్యాసాత్సత్ స్ఫుటంస్థితం
యాదృగ్భావోమృతోభర్తా తవతస్మింస్తదాపురే. 21
తాదృగ్భావస్తవేవార్థం తత్రైవసముపాగతః
అన్యఏవహ్యమీభూతా స్తేభ్యస్తాదృశాఅపి. 22
సద్రూపాఏవచైతస్య స్వప్నసంకల్పసైన్యవత్
అవిసంవాదిసర్వార్థరూపం యదనుభూయతే. 23
తస్యతావద్వదకథం కీదృశీవాపి సత్యతా
అథవోత్తరకాలేతు భంగురత్వాదవస్తుతత్ 24
ఈదృక్చసర్వమేవేదం తత్రకానాస్తితాధికా
స్వప్నేజాగ్రదసద్రూపా స్వప్నోజాగ్రత్యసన్మయః. 25

అందువలన, అంతరమునదోచు మిథ్యాజగత్తు చిరాభ్యాసఫలముగ ఎట్టి ఆటంకమును లేకుండగనే బయల సత్యమట్లు తోచుచున్నది. నీ భర్త పూర్వము మరణించినప్పుడుండిన సంస్కారముల ననుసరించియే అత డీరూపమును గ్రహించినాడు; మంత్రులు మున్నగువారి విషయమునగూడ ఇదేమాట చెల్లును. వారు మునుపటియట్లగపడుచున్నను, అభిన్నులుకారు, విభిన్నులు. ఇవన్నియును చైతన్యమున సద్రూపములే. జాగ్రదనుభూతములగు వస్తువులు, స్వప్నవస్తువులవలె గాక, సర్వసాధారణములై యున్నవి. కాని ఇవిగూడ తరువాత నాశనములగుచుండుటవలన, సత్యములని చెప్పజాలము. అందువలన, ఈ స్వప్నజాగ్రదనుభూతవస్తు జాలమునకు నాస్తిక్యముదప్ప వేరొండుగతిలేదు; స్వప్నకాలమున జాగ్రద్దశ అసత్తగునట్లు జాగ్రద్దశయందు స్వప్నముగూడ అసత్తగుచున్నది.

మృతిజన్మన్యసద్రూపా మృత్యాం జన్మాప్యసన్మయం
విశరేద్విశరారుత్వా దనుభూతేశ్చరాఘవ. 26

రాఘవా! జన్మ ముహూర్తమున మృత్యువు అసన్మయమగునట్లు మృత్యుసమయమున జన్మగూడ అసత్తగుచున్నది. వస్తువులు ధ్వంసమునందున్నప్పుడు, మొమ్మొదట అవయవములు వినష్టములగును; పిదప, ఆ వస్తువుయొక్క అభావము సిద్ధించుచున్నది. బాధకాలమున విపర్యయానుభవము కలుగుచున్నది.

ఏవంనసన్నాసదిదం భ్రాంతిమాత్రం విభాసతే
మహాకల్పాంతసంపత్తావప్యద్యాథ యుగేఽనఘ. 27

నకదాచనయన్నాస్తి తద్బ్రహ్మైవాస్తితజ్జగత్
తస్మిన్మధ్యేకచంతీమా భ్రాంతయఃసృష్టినామికాః. 28

అనఘా! ఇట్లీ జగత్తు సత్తుగాక, అసత్తుయుగాక కేవలము భ్రాంతిరూపమున విభాసించుచున్నది. మహాప్రళయమున బొత్తుగనుండని వస్తువెన్నటికిని సత్యముకాజాలదు. అందువలన, అధిష్ఠానమగు బ్రహ్మమొక్కటియే సత్యమని గ్రహింపుము. ఈ బ్రహ్మయే జగత్తు, ఇందు సృష్టులను భ్రాంతు లుదయించుచున్నవి.

వ్యోమ్ని కేశోండ్రకానీవ న కచంతీవ వస్తుతః
యథాతరంగాజలధౌ తథేమాఃసృష్టయఃపరే. 29

సముద్రమున తరంగములు లేచుచున్నట్లు బ్రహ్మమున ఈ జగత్తులు లేచుచున్నవి. కాని ఇవి ఆకాశమున గనబడు కేశపాశములవలె మిథ్యలు.

ఉత్పత్త్యోత్పత్త్యలీయంతే రజాంసీవమహానిలే
తస్మాద్భ్రాంతిమయాభానే మిథ్యాత్వమహమాత్మని. 30

పెనుగాలియందు ధూళిపుంజములు లేచిపడునట్లు, ఈ సృష్టులు ఉత్పన్నములై, మరల బ్రహ్మమున విలీనములగుచున్నవి. అందువలన, ఆత్మవస్తువు నందొనర్పబడుచున్న 'నీవు, నేను' అను విభాగములు మిథ్యయేయని గ్రహింపుము.

మృగతృష్ణాజలచయే కైవాస్థాసర్గభస్మని
భ్రాంతయశ్చనతత్రాన్యాస్తాస్తదేవపరంపదం. 31

మృగతృష్ణాజలమువలె భస్మప్రాయమగు సృష్టియందు విశ్వాస మెందులకు? భ్రాంతిరహితమగునదే పరమపదము.

ఘనేతమసియక్షాభాస్తమపవనయక్షకః
తస్మాజ్జన్మమృతిర్మోహా వ్యామోహాత్మమిదంతతం. 32
సర్వంతత్సమహాకల్పం శాంతౌయదవశిష్యతే
నాతఃసత్యమిదందృశ్యం నచాసత్యంకదాచన. 33
ద్వయమేవైతదథవా బ్రహ్మతత్త్వైవ సంభవాత్
ఆకాశేపరమాణ్వంతర్ద్రవ్యాదేరణుకేపిచ. 34
జీవాణుర్యత్ర తత్రేదం జగద్వేత్తినిజంవపుః
అగ్నిరౌష్ణ్యంయథావేత్తి నిజభావక్రమోదితం 35
పశ్యతీదంతథైవాత్మా స్వాత్మభూతంవిశుద్ధచిత్

గాఢాంధకారమున బాలకులకు యక్షు (భూత) భ్రాంతికలుగుచున్నది; కానివాస్తవమున కయ్యది గాఢాంధకారమే, యక్షుడుకాదు. అట్లే, జననమరణాది అజ్ఞానవ్యామోహముతోగూడిన జగత్తు శాంతించిన, మిగులునది పరమసత్యమగు బ్రహ్మమొక్కటియే. ఈ బ్రహ్మముగాక సత్యమింకొకటిలేదు. దృశ్యము సత్యముగాదు. ఒకపదార్థము ఉభయధర్మకము అనగా సత్యమును, అసత్యమును



గాజాలదు. ఆకాశమునను, ద్రవ్యాదులయందునునున్న పరమాణువుల మధ్యనున్న జీవాణువుల, జగత్తు నిజరూపమును అనగా మిథ్యాత్వమును గ్రహింపగలదు. అగ్నితన్నుభావించుకొనుచు ఉష్ణమును గ్రహింపగలిగినట్లు, విశుద్ధమగు చిదాత్మగూడ జగత్తును ఆత్మభూతమని గ్రహింపగలదు.

యథాసూర్యోదయేగేహే భ్రమంతిత్రసరేణవః. 36
తథేమేపరమాకాశే బ్రహ్మాండత్రసరేణవః
యథావాయౌస్థితఃస్పంద ఆమోదఃశూన్యమంబరే. 37
పిండగ్రహావినిర్ముక్తం తథావిశ్వంస్థితంపరే
భావాభావాగ్రహోత్సర్గ స్థూలసూక్ష్మచరాచరాః. 38
వివర్జితస్యావయవైర్భాగాబ్రహ్మణఈదృశాః
సాకారస్యావబోధాయ విజ్ఞేయా భవతాధునా. 39
అనన్యాఃస్వాత్మనస్తస్య తేనానవయవాఇవ
యథాస్థితమిదంవిశ్వం నిజభావక్రమోదితం. 40
రిక్తంనవిశ్వశబ్దార్థై రనన్యద్బ్రహ్మణిస్థితం
నతత్సత్యంనచాసత్యం రజ్జుసర్పభ్రమోయథా. 41

సూర్యోదయమైన త్రసరేణువులు గృహమున పరిభ్రమించునట్లు పరమాకాశమున బ్రహ్మాండత్రసరేణువులు పరిభ్రమించుచున్నవి. వాయువున చలనము, సుగంధములును, ఆకాశమున శూన్యత్వమును నుండునట్లు, అవయవ విహీనమగు ఈ జగత్తు బ్రహ్మమున నిలచియున్నది. సాకారమగు ఈ విశ్వమును నిరాకారమని దెలియుటకుగాను, నీవిద్దానిని ఆత్మకంటె అభిన్నమని గ్రహింపుము. నిజభావనా బలమున నుదయించిన ఈ విశ్వము పూర్ణబ్రహ్మమున నిలచియుండుటవలన, అర్థరహితముకాదు. రజ్జువున సర్పభ్రమవలె, సత్యమునుగాదు, అసత్యమునుగాదు.

మిథ్యానుభూతితః సత్యమసత్యంసత్పరీక్షితం
పరమంకారణంచిత్త్వా జ్జీవత్వమితిచేత్యలం. 42
తతస్తథైవానుభవా జ్జీవత్వంవిందతిస్ఫుటం
సత్యంభవత్వసత్యంవా ఖేవిభాతమిదంజగత్. 43

మిథ్యానుభూతిని సత్యమువలన బరీక్షించిన నయ్యది, అసత్యమగుచున్నది. మాయదాలగింపబడిన జీవుడే, పరమకారణ నుగుచున్నాడు, జీవభ్రాంతివలననే జీవత్వము లభించుచున్నది. జగత్తు సత్యమే కానిమ్ము, మిథ్యయేకానిమ్ము, ఇయ్యది చిదాకాశమున నేయున్నది.

రంజయత్యేవజీవాణుః స్వేచ్ఛాభిరనుభూతిభిః
అనుభూయంతఏవాశు కాశ్చిత్పూర్వానుభూతితః. 44
అపూర్వానుభవాఃకాశ్చి త్సమాశ్చైవాసమాస్తథా
క్వచిత్కదాచిత్తాఏవ క్వచిదర్థసమాఅపి. 45
కచంత్యసత్యాఃసత్యాభా జీవాకాశేఽనుభూతయః
తత్కులాస్తత్సమాచారా స్తజ్జన్మానస్తదీహితాః. 46

తథైవమంత్రిణఃపౌరాః ప్రతిభానే భవంతిచ
తేచైవాత్మన్యలంసత్యా దేశకాలేహితైఃసమాః. 47
సర్వగాత్మస్వరూపాయాః ప్రతిభాయాఇతిస్థితిః
యథారాజాత్మనివ్యోమ్ని ప్రతిభోదేతిసన్మయీ. 48
తథాతదగ్రగోదేతి సత్యేవప్రతిభాంబరే
త్వచ్ఛీలాత్వత్సమాచారా త్వత్కులాత్వద్వపుర్మయీ. 49
ఇతి లీలేయమాభాతి ప్రతిభాప్రతిబింబజా
సర్వగేసంవిదాదర్శే ప్రతిభాప్రతిబింబతి. 50

జీవుని భోగేచ్ఛయే సంసారోత్పాదనకు గారణమగుచున్నది. ఈ సృష్టికిని సత్యమిథ్యాత్వములకును సంబంధమేలేదు. విషయము సత్యమేయగుగాక, లేక మిథ్యయేయగుగాక, దాని భోగమే ఉత్పత్తికి మూలకారణమగుచున్నది. మొట్టమొదట జీవుడు తానుగోరుకొను విషయమువలన రంజితుడగును. పిదపనవి అనుభవమునకు వచ్చును; ఈ అనుభవ మొక్కొక్కప్పుడు సంపూర్ణముగ మనుసటియట్లే యుండును, ఇంకొకప్పుడు తద్వ్యతిరిక్తముగనో, లేక ఒకింతబోలియోయుండును. కాని, ఈ అనుభవములన్నియు మిథ్య; అవి జీవాకాశము నాశ్రయించుకొనియున్నవి. కనుక, వెనుకటివగు కులాచార ప్రయత్నములును, మంత్రులును ఉన్నట్లు ప్రతిభాసకలుగుచున్నది. దీనిస్థితి సత్యస్వరూపమగు ఆత్మయందే. రాజఆత్మయందు సత్యమనుబోధ కలిగినట్లు, ఈశ్వరునియందు సత్యసంకల్పము గలుగుచున్నది. అందువలననే, ఈలీల సరిగ నీవలెనేయున్నది. సర్వగమగు ఆత్మచైతన్యమున, ఇట్లు ప్రతిభ సర్వదా ప్రతిబింబించుచునే యున్నది.

యాదృశీయత్రసాతత్ర తథోదేతినిరంతరం
జీవాకాశస్యయాంతస్థా ప్రతిభా కురుతేస్వయం
సాబహిశ్చిదాదర్శే ప్రతిబింబాదియం స్థితా. 51

ఆయాస్థానముల ననుసరించి, ఆయారూపములు ఉదయించుచుండును. సంకల్పము మొట్టమొదట జీవాకాశమున నుదయించి, పిదప బయట ప్రకాశించుచున్నది. కనుకనే, ఇవన్నియు నిట్లగపడుచున్నవి.

ఏషాత్వమంబర మహంభువనంధరాచ
రాజేతిసర్వమహమేవ విభాతమాత్రం
చిద్వ్యోమబిల్వజఠరంవిదురంగ విద్ధి
త్వంతేనశాంతమమలాస్వయథాస్థితేహ. 52

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తి ప్రకరణే
జగద్బ్రహ్మవర్ణనంనామ చతుశ్చత్వారింశః సర్గః ॥ 44 ॥

లీలా! నీవు, నేను, ఆకాశము, పృథివి, రాజు మొదలగునవన్నియు చిన్మాత్ర స్వభావములై అహంభావముననే స్ఫురించుచున్నవి. తత్త్వజ్ఞులు దీనినంతటిని సత్తామాత్ర స్వభావకమగుటవలన



చిద్వ్యోమ — బిల్వబీజగర్భమని ఎఱింగినారు. నీవును దీని నిట్టిదానిగనే గ్రహించిన, స్వభావస్థితవును నిర్మలవును నై శాంతస్వభావమున వెలయగలవు.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున
జగద్బ్రహ్మవర్ణనమను చతుశ్చత్వారింశ సర్గము ॥ 44 ॥

## పంచచత్వారింశః సర్గః.

శ్రీ సరస్వత్యువాచ:—

విదూరథస్తేభర్తైష తనుంత్యక్త్వారణాంగణే
తదేవాంతఃపురంప్రాప్య తాదృగాత్మాభవిష్యతి. 1

శ్రీ సరస్వతి:- (ద్వితీయలీలనుద్దేశించుచు—) లీలా! నీభర్తయగు ఈ విదూరథుడు రణరంగమున శరీరమును బరిత్యజించి, ఆ అంతఃపురమును ప్రవేశించి మరల పద్ముడగును.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఇత్యాకర్ణ్యవచోదేవ్యా లీలాసాతత్పురాస్పదా
పురఃప్రహ్వాస్థితోవాచ వచనం విహితాంజలిః. 2

వసిష్ఠుడు:- దేవియొక్క ఈ వాక్యముల నాలించి, చేతుల జోడించి, ద్వితీయలీల ఇట్లు పల్కెను:—

ద్వితీయ లీలోవాచ:—

దేవీభగవతీజ్ఞప్తిర్నిత్య మేవార్చితా మయా
స్వప్నేసందర్శనందేవి సాదదాతి నిశాసుమే. 3
సా యాదృశ్యేవ దేవేశి తాదృశ్యేవత్వమంబికే
తన్మేకృపణకారుణ్యా ద్వరందేహి వరాననే. 4

ద్వితీయలీల:- నేను జ్ఞప్తిదేవిని నిత్యము అర్చించుచుంటిని; దేవి! ఆమె నాకు రాత్రులయందు స్వప్నమున దర్శన మొసంగుచున్నది. అంబా! ఆమె నీవలెనేయున్నది! అందువలన, దయయుంచి, నాకు వరము నొసంగుము.

శ్రీవసిష్ఠ ఉవాచ:—

ఇత్యుక్త్వాసాతదాజ్ఞప్తిః స్మృత్వాతద్భక్తిభావనం
ఇదంప్రసన్నాప్రోవాచ తాం లీలాం తత్పురాస్పదామ్. 5

వసిష్ఠుడు:- ఇట్లామె నుడువ సరస్వతీదేవి లీలయొక్క భక్తిప్రపత్తులను గుర్తునకు దెచ్చుకొని ప్రసన్నయై ఇట్లనెను:—

శ్రీ దేవ్యువాచ:—

అనన్యయాభావనయా యావజ్జీవమజీర్ణయా
పరితుష్టాస్మి తేవత్సే గృహాణాభిమతంవరమ్ 6

శ్రీదేవి:—నీవు యావజ్జీవమొనర్చిన భక్తిభావనకు సంతోషించితిని. నీ ఇచ్చవచ్చిన వరమును వేడుకొనుము.

తద్దేశలీలోవాచ:—

రణాద్దేహంపరిత్యజ్య యత్రతిష్ఠతిమేపతిః
అనేనైవ శరీరేణ తత్రస్యామేతదంగనా. 7

ద్వితీయలీల:— దేవీ! నాభర్త యుద్ధమున దేహమును బరిత్యజించి మఱియొకతావున కఱుగు నంటివి కదా! అట, నేను ఈ శరీరముతోడనే అతనికి భార్యనైయుండగలుగునట్లొనర్పుము.

శ్రీ దేవ్యువాచ:—

ఏవమస్తుత్వయాఽవిఘ్నం పూజితాస్మిసుతేచిరమ్
అనన్యభావయాభూరి పుష్పధూపసపర్యయా. 8

శ్రీదేవి:— బిడ్డా! నీవు చాలకాలము నిర్విఘ్నముగను సాంగముగను ధూపదీప పుష్పాదులతో నన్నర్చించితివి. నీకోర్కె నెరవేరును గాక!

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అథతద్దేశలీలాయాం ఫుల్లాయాం తద్వరోదయాత్
పూర్వలీలాబ్రవీద్దేవీం సందేహాలులితాశయా. 9

వసిష్ఠుడు:— ఇట్లాలీల కోరినవరమునుబొంది సంతుష్టయగ, పూర్వలీల సందేహచిత్తముతో నిట్లు ప్రశ్నించెను:—

పూర్వలీలోవాచ:—

యేసత్యకామాఃసంత్యేవంసంకల్పా బ్రహ్మరూపిణః
త్వాదృశాఃసర్వమేవాశు తేషాంసిద్ధ్యత్యభీప్సితమ్. 10
తత్తేనైవశరీరేణ కిమర్థంనాహమీశ్వరీ
లోకాంతరమిదం నీతా తం గిరిగ్రామకంపద. 11

పూర్వలీల:— ఈశ్వరీ! నీవంటి సత్యసంకల్పుల అభీష్టములన్నియు సత్వరము సిద్ధించును. నన్నేల పూర్వపు శరీరముతోడనే గిరిగ్రామ నగరమునకు గొనిపోలేదో వచింపుము.

శ్రీ దేవ్యువాచ:—

నకించిత్కస్యచిదహం కరోమి వరవర్ణిని
సర్వంసంపాదయత్యాశు స్వయం జీవః స్వమీహితమ్ 12

శ్రీదేవి:— వరవర్ణినీ! నేను స్వయముగ ఏమియును ఒనర్పను; జీవులు స్వయముగనే తమతమ కార్యములను నిర్వహించుకొనుచున్నారు.



అహంహితం రచేజ్ఞప్తి సంవిన్మాత్రాధిదేవతా
ప్రత్యేకముస్తిచిచ్ఛక్తి ర్జీవశక్తిస్వరూపిణీ. 13

నేను సంవిదధిష్ఠాత్రినగు జ్ఞప్తిదేవతను. జీవశక్తి స్వరూపమగు చిచ్ఛక్తి అందఱికిని ఉన్నది నేను జీవుల వాంఛితములను ప్రకాశితమొనర్చుచున్నాను.

జీవస్యోదేతియాశక్తి ర్యస్యయస్యయథాయథా
భాతితత్ఫలదానిత్యం తస్యతస్యతథాతథా. 14

ఏ జీవునియందు ఎట్టిశక్తి ఉదయించుచున్నదో, అదియట్లే ఫలించుచున్నది.

మాం సమారాధయంత్యాస్తు జీవశక్తిస్తవోదితా
తదాభవద్యదీహాస్యాం ముక్తాస్మీతిచిరంతదా. 15

నీవు నన్నారాధించినప్పుడు నీజీవశక్తి "నేను ముక్తినందెదను" అను రూపముననుండెను.

తేనతేనప్రకారేణ త్వంమయాసంప్రబోధితా
తయాయుక్త్యామలంభావం నీతాసివరవర్ణిని. 16

నేను నీకట్లే ప్రబోధమొనర్చితిని; యుక్తిపూర్వకముగ నీకీ అమలభావమును బ్రసాదించితిని.

అనయైవంభావనయా బోధితాసి చిరంతదా
తమేవార్థంప్రాప్తవతీ సదాస్వచితిశక్తితః 17

నీకప్పుడు ముక్తినందవలెనను బుద్ధియుండుటవలన, చిత్—శక్తి పరిభావమున ముక్తినే బడసితివి.

యస్యయస్యయథోదేతి స్వచిత్ప్రయతనంచిరమ్
ఫలందదాతికాలేన తస్యతస్యతథాతథా. 18

ఎవని చిత్—శక్తిప్రయత్నము అనగా, పౌరుషము ఏతీరుగనుండునో, అతడావిధమగు ఫలములనే యథాసమయమున నందును.

తపోవా దేవతావాపి భూత్వాస్వైవచిదన్యథా
ఫలందదాత్యథస్వైరం నభఃఫలనిపాతవత్. 19

స్వీయ చిచ్ఛక్తియే తపస్సో లేక దేవతయోయై, ఆకాశఫలములవలె మిథ్యాభూతములగు ఫలముల ప్రసాదించుచున్నది.

స్వసంవిద్యతనాదన్య న్నకించిచ్చకదాచన
ఫలందదాతితేనాశు యథేచ్ఛసితథాకురు. 20

స్వీయ చిత్ప్రయత్నము (పౌరుషము) గాక, వేరొండులేదు; ఇదియే శీఘ్రముగ ఫలముల నొసంగుచున్నది. అందువలన, నీవు పొందకోరుదాని కనుగుణముగ, ప్రయత్నింపుము.

చిద్భావపవనానుసర్గగతోఽంతరాత్మా
యచ్చేతతిప్రయతతేచతదైతితచ్ఛ్రీః
రమ్యంహ్యరమ్య మథవేతి విచారయస్వ
యత్పావనం తదవబుధ్యతదంతరాస్స్వ. 21

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
సత్యకామ సత్యసంకల్పాస్తితా నామ పంచచత్వారింశస్సర్గః ॥ 45 ॥

చిద్భావమే సృష్టియందంతటను వ్యాపించియున్నది. కాని యత్నానుసారమే ఫలశ్రీ ఉదయించుచున్నది. మంచిని, చెడుగును బాగుగ విచారించిచూడుము. చూచి, పవిత్రమని గ్రహించిన దానినే ఆచరింపుము.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు లీలోపాఖ్యానమున
సత్యకామ సత్యసంకల్పాస్తిత్వమను పంచచత్వారింశ సర్గము ॥ 45 ॥

---:0:---

## షట్చత్వారింశః సర్గః.

శ్రీ రామఉవాచ:—

ఏవంసంకథయంతీషు తాసుతస్మిన్గృహోదరే
విదూరథఃకిమకరో న్నిర్గత్యకుపితోగృహాత్. 1

శ్రీరాముడు:– ఇంతకుమున్ను కోపమున ఇంటినుండి వెలువడిన విదూరథుడు, లోపవీరిట్లు మాట్లాడుకొనుచుండ, ఏమిచేయుచున్నాడు?

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

విదూరథఃస్వసదనా న్నిర్గతఃపరివారితః
పరివారేణమహతా ఋక్షౌఘేనేవచంద్రమాః 2
సన్నద్ధసర్వావయవో లగ్నహారవిభూషణః
మహాజయజయారావైః సురేంద్రఇవనిర్గతః 3

వసిష్ఠుడు:– విదూరథుడు గృహమునుండి వెలువడి, నక్షత్రములచే చంద్రుడావృతుడగునట్లు, గొప్పసేనచే పరివృతుడై, సర్వాంగముల కవచముల ధరించి, హారవిభూషణముల ధరించి, జయజయ ధ్వనులతో, నింద్రునివలె వెలువడెను.

సమాదిశన్యోధగణం శృణ్వన్మండలసంస్థితమ్
ఆలోకయన్వీరగణా నారురోహ నృపోరథమ్. 4

ఆరాజు యోధుల కాజ్ఞనొసంగుచు, మంత్రులకడ సేనలస్థితిని వినుచు, వీరులను గాంచుచు, రథము నెక్కెను.

కూటాకారసమాకారం ముక్తామాణిక్యమండితమ్
పతాకాపంచభిర్వ్యాప్తం ద్యువిమానమివోత్తమమ్. 5



చక్రభిత్తిపరిప్రోత ప్రకచత్కాంచనాంకురమ్
ముక్తాజాలరణత్కార చారువిక్రమకూబరమ్. 6
సుగ్రీవైర్లక్షణోపేతైః ప్రశస్తైఃప్రచలైఃకృశైః.
జవోడ్డయనవేగేన ప్రవహద్భిః సురానివ. 7
వాయుం జవేనసహసా అసహద్భిర్గతిక్రమైః
ప్రోహ్యద్భిరివపశ్చార్ధ మాపిబద్భిరివాంబరమ్. 8
హేషాజిత్తైరివసంపూర్ణై శ్చంద్రైశ్చామరదీప్తిభిః
అశ్వైరష్టభిరాబద్ధ మాశాపూరకహేషితైః. 9

ఆ రథము పర్వతశిఖరమువలె నెత్తుగనుండెను. ముక్తా మాణిక్యముల నలంకరింపబడియుండెను. పతాకలైదు ఎగురుచుండెను. చూచుటకది దేవవిమానమువలె నుండెను. దాని చక్రముల బంగారపు శాలలుండెను. వాటి మొదళ్ళ ముత్యములుండెను. సులక్షణ సంపన్నములగు గుఱ్ఱములెనిమిది ఆ తేరును అతివేగముతో, అంతరిక్షమున దేవతలరుగుచున్నారా? యనిపించునట్లు, లాగుకొని పోవుచుండెను. వాటి వేగము వాయువేగమును మించియుండెను. అవి తమ పశ్చాద్భాగమును మోసికొనుచు, ఆకాశమును పానమొనర్చ అరుగుచున్నావా? అనునట్లుండెను; వాటి హేషలతో దిక్కులు నిండిపోవుచుండెను.

అథోదపతదుద్దామ నాగాభ్రరవనిర్భరః
శైలభిత్తి ప్రతిధ్వాన దారుణోదుందుభిధ్వనిః. 10

అనంతరము మదగజములను మేఘముల గర్జనతోగలసిన దుందుభిధ్వనితో కొండగుహాలు ప్రతిధ్వనించెను.

మత్తసైనికనిర్ముక్తైర్వ్యాప్తంకలకలారవైః
కింకిణీజాలనిర్ధ్వానైర్హేతిసంఘట్టఘట్టితైః. 11
ధనుశ్చటచటాశబ్దైః శరసీత్కారగాయనైః
పరస్పరాంగనిష్పిష్ట కవచౌఘరుఘణఝణైః. 12
జ్వలదగ్నిటణత్కారై రార్తిమత్క్రందనారవైః
పరస్పరభటాహ్వానై ర్బందివిక్షుబ్ధరోదనైః. 13
శిలాఘనీకృతాశేష బ్రహ్మాండకుహరోధ్వనిః
హస్తగ్రాహ్యోఽభవద్భీమో దశాశాకుంజపూరకః, 14

మత్తులగు సైనికుల కలకలధ్వని, కింకిణీజాలముల యొక్కయు, ఖడ్గములయొక్కయు ధ్వనులును, ధనుస్సుల చటచట శబ్దములును, శరముల చీత్కారములును, పరస్పరాంగ ఘట్టణమున కవచముల ఝణఝణ శబ్దములును, అగ్నియొక్క టణత్కారములును, పీడితుల చీత్కారరవములును, యోధుల ఆహ్వానధ్వనులును, ఆర్తుల క్రందనములును, క్షుబ్ధుల రోదనధ్వనులును గలసి, బ్రహ్మాండ కుహరమును శిలవలె ఘనీభూతమొనర్చినట్లుండెను. దిక్కులనన్నిటిని నించుచున్న ఆధ్వనులు చేతితో బట్టుకొననగునట్లుండెను.

అథోదపతదాదిత్య పథపీవరరోధకమ్
రజోనిభేనభూపీఠ మంబరోడ్డయనోన్ముఖమ్. 15

అనంతరము భూమి ధూళిపుంజములతో సూర్యపథమును నిరోధించుచు, పైకిలేచుచున్నదా! యనిపించుచుండెను.

గర్భవాసమివాపన్నం తేనాసీత్తన్మహాపురమ్
మూఢత్వంయౌవనేనేవ ఘనతామాయయాతమః. 16

అంధకారముననున్న ఆ మహాపురము గర్భవాస మొనర్చుచున్నట్లుండెను. యౌవనమున తమోగుణ మధికమగునట్లు, చీకట్లు దట్టమగుచుండెను.

ప్రయయుఃక్వాపిదీపౌఘాదివసేనేవతారకాః
ఆయయుర్బలమాలోలా నైశభూతపరంపరాః. 17

పగటిపూట నక్షత్రములగపడునట్లు దీపను లదృశ్యము లయ్యెను. నిశాచరుల బలము వృద్ధి నొందజొచ్చెను.

దదృశుస్తన్మహాయుద్ధం ద్వేలీలే సా కుమారికా
ప్రస్ఫుటద్ధృదయేనేవ దేవీదత్తమహాదృశౌ. 18

దేవీప్రసాదమునందిన లీలాద్వయమును కుమారికయును ఆ యుద్ధమును వీక్షింపసాగిరి.

ప్రశేమురథహేతీషు ప్రోద్యత్కటకటారవాః
ఏకార్ణవపయఃపూరైర్వాలవాఙ్ఞవవహ్నయః. 19

ఆ రణరంగమునకు విదూరథుడరుగ, ప్రళయ కాలమున జగత్తు ఏకార్ణవమైన, బడబానల మునశమించునట్లు, నగరమునుదోచు దొంగల కటకట శబ్దములు శాంతిల్లెను.

శనైఃసేనాంసమాకర్షన్నాజ్ఞాయత బలాంతరమ్
వివేశపక్షప్రోడ్డీనో మేరురేకమివార్ణవమ్. 20

ప్రళయకాలమున మేరుపర్వతము సముద్రమున ప్రవేశించునట్లు, విదూరథుడు పరపక్ష స్వపక్షముల గుర్తింప సైన్యమధ్యమున ప్రవేశించెను.

అథోదభూద్ఘనధ్వానం చటచ్చటదితిస్ఫుటం
రచితాంశుమయాంభోదాశ్చేరుఃపరవరంపరాః. 21

అనంతరము అస్త్రాదుల చటచటధ్వనులు వెలువడసాగెను. శత్రువులు అస్త్రముల నీల కాంతులను మేఘముల గల్పించి తిరుగాడసాగిరి.

యయురంబరమాశ్రిత్య నానాహేతివిహంగమాః
ప్రసస్రురలమాత్తాసు మలినాః శస్త్రదీప్తయః 23

నానావిధాస్త్రములను పక్షులాకాశమున విహరింపసాగెను. పరప్రాణ — అపహరణపాపమున శస్త్రకాంతులు నల్లబడినట్లుండెను.



జజ్వలుఃశస్త్రసంఘట్ట జ్వాలనాఉల్ముకాగ్నివత్
జగర్జుఃశరధారౌఘాన్వర్షంతో వీరవారిదాః 23

శస్త్రముల రాపిడికగ్నిలేవ దొడగెను. వీరులను మేఘములు శరధారలను వర్షించుచు గర్జింపసాగెను.

వివిశుఃక్రకచక్రూరా వీరాంగేషుచ హేతయః
పేతుఃపటపటారావం హేతినిష్పిష్టయోఽంబరే. 24

క్రకచములవలె క్రూరములగు అస్త్రములు వీరుల అంగముల బ్రవేశింపసాగెను. ఆకాశమున ఖడ్గప్రహారముల పటపట శబ్దములు వెలువడసాగెను.

జగ్ముఃశమం తమాంస్యాశు శస్త్రకానలదీపకైః
బభూవురఖిలాసేనా నవనారాచ రోమశాః. 25

శస్త్రాగ్నికాంతుల నంధకారము తొలగిపోవ, సైనికులు బాణములను రోమములతో నొప్పుచున్నట్లుండిరి.

ఉత్తస్థుర్యమయాత్రాయాం కబంధనటపంక్తయః
జగురుచ్చైరణోద్రేకం పిశాచ్యో రణదారికాః. 26

మొండెములను నటుల యమోత్సవమును జరుపుచుండ, పిశాచకన్యలను నటీగణము వారిని గూడసాగిరి.

ఉదగుర్దంతసంఘట్ట టంకారా దంతినాంబలాత్
ఊహుఃక్షేపణపాషాణ మహానద్యోనభస్తలే. 27

ఏనుగుల దంతముల రాపిడికి టంకారధ్వని కాదొడగెను. విసరబడిన పాషాణములను నదులు ఆకాశమున బ్రవహింపసాగెను.

పేతుఃశవా నివాతాస్త సంశుష్కవనపర్ణవత్
నిర్యయుర్లోహితానద్యో రణాద్రేర్మృతివర్షిణః. 28

గాలికిపడు ఎండుటాకులవలె, శవములు కూలసాగెను. మరణ—వర్షము కురియ, రణ— పర్వతమునుండి రక్త—నదులు ప్రవహింపసాగెను.

ప్రశేముఃపాంసవోరక్తైస్తమాంస్యాయుధవహ్నిభిః
యుద్ధైకధ్యానతఃశబ్దా భయాన్మృతినిశ్చయైః. 29

అభవత్కేవలంయుద్ధ మపశబ్దమసంభ్రమమ్
అనాకులాంబువాహాభం ఖడ్గవీచిసటాంకృతమ్. 30

రక్తపాతమున ధూళి అడగిపోయెను. ఆయుధ — వహ్నివలన చీకట్లు తొలగిపోయెను. యోధులు యుద్ధధ్యాన తత్పరులగుటజేసి వాగ్యుద్ధమడగెను. చాలమంది మరణభయమున భీతులైరి. ఆ యుద్ధస్థలము నిశ్శబ్దమై వీరులు ఖడ్గకిరణముల ప్రకాశించుచుండుటవలన, గాలిచే గదల్పబడని మేఘమువలె నగుపడసాగెను.

ఖదఖదరవసంవహచ్ఛరౌఘం
టకటకితారవ సంపతద్భుశుండి
ఝణఝణరవ సంమిలన్మహాస్త్రం
తిమితిమివద్రణమాసదుత్తరంతత్. 31

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
విదూరథ నిర్యాణ వర్ణనం నామ షట్చత్వారింశః సర్గః ॥ 46 ॥

అట శరసమూహముల ఖదఖద ధ్వని వెలువడసాగెను. టకటక శబ్దముల భుశుండీగణము పడసాగెను. మహాశస్త్రముల ఝణఝణ శబ్దములతో పరస్పరము కొట్టుకొనసాగెను. 'తిమితిమి' శబ్దములతో నా యుద్ధరంగము భీరువులకు దుస్తరమయ్యెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున
విదూరథ నిర్గమనమను షట్చత్వారింశ సర్గము ॥ 46 ॥

## సప్తచత్వారింశః సర్గః.

శ్రీవసిష్ఠ ఉవాచ:—

ఏతస్మిన్వర్తమానేతు ఘోరేసమరసంగమే
లీలాద్వయమువాచేదం జ్ఞప్తిం భగవతీంపునః. 1

వసిష్ఠుడు:– ఇట్లు యుద్ధమతిభయంకరముగ జరుగుచుండ, లీలాద్వయము జ్ఞప్తిదేవి నిట్లు మరల ప్రశ్నించెను:—

లీలాద్వయమువాచ:—

దేవికస్మాదకస్మాన్నో భర్తాజయతినోరణే
వదత్వయ్యపి తుష్టాయా మస్మిన్విద్రుతవారణే. 2

లీలాద్వయము:– దేవీ! నీదయయున్నను మాభర్త జయమును బొందజాలకున్నాడేమి? వచింపుము.

శ్రీ సరస్వత్యువాచ:—

చిరమారాధితానేన విదూరథనృపారిణా
అహంప్రతిజయార్థేన నవిదూరథభూభృతా. 3
తేనాసావేవజయతి జీయతేచవిదూరథః
జ్ఞప్తిరంతర్గతా సంవిదేతాం సూంయోయదాయథా. 4



ప్రేరయత్యాశుత త్తస్య తదాసంపాదయామ్యహమ్
యోయథాప్రేరయతిమాం తస్యతిష్ఠామితత్ఫలా. 5
నస్వభావోఽన్యతాంధత్తే వహ్నేరౌష్ణ్యమివైషమే
అనేనముక్తపవస్యా మహామిత్యస్మిభావితా. 6
ప్రతిభారూపిణీతేన బాలేముక్తోభవిష్యతి
ఏతదీయఃస్వయంశత్రుః సింధుర్నామమహీపతిః. 7
జయామ్యహం స్యాం సంగ్రామ ఇత్యనేనాస్మిపూజితా
తస్మాద్విదూరథోదేహం త్యక్త్వాప్యసహభార్యయా. 8
త్వయానయాచకాలేన బాలేముక్తోభవిష్యతి
ఏతదీయఃస్వయంశత్రుః సింధునామమహీపతిః. 9
హత్వైనం వసుధాపీఠే జయీరాజ్యంకరిష్యతి

సరస్వతి:—బిడ్డలారా! విదూరథుని శత్రువు జయార్థము నన్ను చాలకాల మారాధించినాడు. అందువలన, నేను విదూరథునకు జయము నొసగజాలను. శత్రువు జయించును, విదూరథుడోడింపబడును. నేను అందఱి మనస్సులయందున నున్నాను. ఎప్పుడెవడు నన్నెట్లారాధించునో, అప్పుడాతనికి నేను అట్టి ఫలములనే ఒసగుదును. అగ్నియొక్క స్వభావము మారజాలనట్లు, నా స్వభావముకూడ మారదు. ఈ విదూరథుడు 'నేను ముక్తుడనగుదును' అను భావనతో నన్నారాధించినాడు. అందువలన నీతడు ముక్తినందును. ఈతని శత్రువగు సింధురాజు 'నేను జయింతును' అని నన్నారాధించినాడు. అందువలన, విదూరథుడును, ఆతనితో బాటు మీరును ముక్తినందిన పిమ్మట వసుధాపీఠమును జయించి, సింధురాజు పాలించును.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఏవందేవ్యాంవదంత్యాంతు బలయోర్యుధ్యమానయోః. 10
రవిర్దీప్తిమివాశ్చర్య మాజగామోదయాచలమ్
చేలుస్తిమిరసంఘాత బహానీవారిరూపిణః. 11
అస్పృజన్జీవసంఘాన్యే సంధ్యాయాం తారకాఇవ
శనైఃప్రకటతాంజగ్ముర్నీలాకాశాద్రిభూమయః. 12

వసిష్ఠుడు:– దేవి ఇట్లు పల్కుచుండ, ఇరువాగులవారును యుద్ధమొనర్చుచుండిరి. ఆ అద్భుతయుద్ధమును గాంచుటకో యనునట్లు సూర్యుడుదయాచలమునధిరోహించెను. వేటి ప్రభావమున రాత్రికాలమున తారకలవలె భూతములావిర్భవించినవో, ఎయ్యవి సూర్యునకు శత్రువులో, అట్టి అంధకారసమూహము లాతడుదయించిన వెంటనే, పారిపోయెను. గుహలు, పర్వతభూములు, ఆకాశము మున్నగునవి మెల్లమెల్లగ వెలుగందసాగెను.

భువనంగజ్జలాంభోధే రివోత్తిష్ఠమరాజత
పేతుఃకనకనిఃస్యందసుందరా రవిరశ్మయః. 13
శైలేషువరవీరేషు రణేరక్తచ్ఛటాఇవ

అంధకారము తొలగిపోవ, ఈ జగత్తు కాటుకసముద్రమునుండి లేవదీయబడిన దానివలె నుండెను. యుద్ధభూమియందు శూరుల శరీరములనుండి రక్తము చిమ్ముపడునట్లు, బంగారు కాంతులను జిమ్ము సూర్యుని కిరణములు పర్వతములపైబడసాగెను.

అదృశ్యత తతో వ్యోమ తథా రణమహీతలమ్. 14
బాహుభిర్భ్రాంతభుజగం ప్రభాభిః కీర్ణకాంచనమ్
కుండలైః కీర్ణరత్నౌఘం శిరోభిర్భ్రష్టపంకజమ్. 15
ఆయుధైః ఖడ్గనీరంధ్రం శరైః శలభనిర్భరమ్
రక్తాభాస్థిరసంధ్యాభ్యాం సంసిద్ధిపురుషం శవైః. 16

అప్పుడు రణభూమియందును, ఆకాశమునను ఇట్లు కన్పడుచుండెను:— వీరుల బాహువులు — సర్పములు ఇటునటు తిరుగాడుచుండెను; సూర్యకిరణములు కాంచనకాంతివలే పడుచుండెను. కుండలములనున్న రత్నములు నలువైపుల బడుచుండెను; క్రిందబడిన శిరములు పద్మములవలె నగపడుచుండెను; ఆయుధములను ఖడ్గమృగములు చెలరేగుచున్నట్లుండెను; శరములను మిడుతలు దట్టముగ వ్యాపించుచుండెను. నాలుగు దిక్కులు రక్తధారల నెఱ్ఱబడ, సాయంకాలమైనదా? అనిపించుచుండెను. శవముల గాంచిన, సిద్ధపురుషులు సమాధిమగ్నులైయున్నారా? అని తోచుచుండెను.

హారైః ససర్పనిర్మోకం కబ్ధైరిద్ధం సుసంకులమ్
లసల్లతం పతాకాభిరురుభిః కృతతోరణమ్. 17

క్రిందబడిన హారములు పాము కుబుసములవలెనుండెను; కవచములతో నాతావునిండియుండెను. పతాకాసమూహములు లతలవలె నగుపడుచుండెను. తెగిపడిన తొడలు తోరణములవలె నుండెను

హస్తైః పాదైః పల్లవితం శరైః శరవణోపమమ్
శస్త్రాంశుశాద్వలశ్యామం శస్త్రపూరైః ససైకతమ్. 18

హస్తపాదములను చిగుళ్లతోగూడిన శరవనము బాణములఅడవి లేక రెల్లుదుబ్బు అటునున్నట్లగపడుచుండెను. మఱియు నాతావు శస్త్రకిరణములను పచ్చికబయలుతోడను, బాణపురాసులను ఇసుక తిన్నెలతోడను గూడియున్నట్లగపడుచుండెను.

కీర్ణమాయుధమాలాభిరున్మత్తమివ భైరవమ్
ఫుల్లాశోకవనాకారం శస్త్రసంఘట్టవహ్నిభిః. 19

ఆయుధమాలలతో నిండిన ఆరణంగము ఉన్మత్తుడగు భైరవునివలె నగుపడుచుండెను. బాణములొకదానితో మరొకటి రాచుకొనుటవలన నిప్పుపుట్టి, అశోకవనమా యనిపించుచుండెను.

ఉదఘుంఘుమహాశబ్దైర్విద్రవత్సిద్ధనాయకైః
సౌవర్ణనగరాకారం బాలార్కకచితాయుధైః. 20

సముద్రమువలె ఘుంఘుమశబ్దమొనర్చుచు సిద్ధనాయకులు పరుగులెత్తుచుండిరి. బాలార్క కాంతులతో ప్రకాశించు ఆయుధములతో ఆచోటు సువర్ణనగరమువలెనుండెను.



ప్రాసాసిశక్తిచక్రర్ష్టి ముద్గరారణితాంబరమ్
వహద్రక్తనదీరంహః ప్రోహ్యమానశవోత్కరమ్. 21

ప్రాసాద్యాయుధ ధ్వనులతో నాకాశము ధ్వనించుచుండెను. రక్తనదీప్రవాహమున శవములు తేలసాగెను.

భుశుండీశక్తికుంతాసి శూలపాషాణసంకులమ్
శూలశస్త్రాభిహతిచ్ఛిన్నకబంధపతనాన్వితమ్ 22

భుశుండ్యాద్యాయుధములతో నాసమరాంగణము సంకులమయ్యెను. శూలములయొక్కయు, శస్త్రములయొక్కయు ఆఘాతములకు మొండెములు తెగసాగెను.

కాలతాండవవేతాలకులారబ్ధహలారవమ్
శూన్యే రణాంగణే దీప్తౌ పద్మసింధ్వో రథౌ చలౌ. 23
అదృశ్యేతాం నభశ్ఛిన్నౌ చంద్రసూర్యౌ దివీవ తౌ
చక్రశూలభుశుండ్యృష్టిప్రాసాయుధసమాకులౌ. 24
సహస్రేణసహస్రేణ వీరాణాం పరివారితౌ
విచరంతౌ యథాకామం మండలైర్వితతారవైః. 25
సచీత్కారమహాచక్రపిష్టానేకమృతామృతౌ
తరంతౌ రక్తసరితౌ మత్తవారణలీలయా. 26
కేశశైవలసంపన్నే చక్రచక్రజలేందుకే
వహచ్ఛ్రకాహతిక్షోభపాతితాకులవారణౌ. 27
మణిముక్తార్ఘుణత్కారరణత్కూబరకారవౌ
వాతాహతపతాకాగ్రపటత్పటపటారవౌ. 28
అనుయాతౌ మహావీరైర్భూరిభిర్భీరుసైనికైః
ధారావమద్భిః కుంతానాం శరాణాం ధనుషామపి. 29
శక్తీనాం ప్రాసశంకూనాం చక్రాణాం కచతాం రణే
తత్రతౌ క్షణమావృత్త్య మండలే భూమికుండలే. 30
ఉభావ్యతిబభూవాతే సంముఖావాయుధావుభౌ
నారాచధారానికర విక్షేపకరకధ్వనౌ. 31
అన్యోన్యమపిగర్జంతౌ మత్తాబ్ధిజలదావివ
తయోః ప్రహారతోర్బాణా వసుధానరసింహయోః. 32
పాషాణముసలాకారా వ్యోమవిస్తారిణోఽభవన్

బేతాళగణము నృత్యమొనర్చుచు కోలాహలమొనర్పసాగెను. క్రమముగ రణరంగము శూన్యము గాదొడగెను. కేవలము పద్మునియొక్కయు సింధురాజుయొక్కయు రథములు ఆకాశముననున్న సూర్యచంద్రులవలె నగపడజొచ్చెను. ఆరథములు చక్రాద్యాయుధములతో గూడియుండెను. వాటిని,

వీరులు నలువైపుల చుట్టుముట్టియుండిరి. ఆ రథములు మండలాకారమున నడువదొడగెను. ఆ రథచక్రములబడి చాలమంది నలిగిపోయి, అరచుచు మృతులును అర్ధమృతులును గాద్దాడగిరి. ఆ రథములు రక్తనదియందు మదపుటేనుగులవలె, పోజొచ్చెను. ఆ రక్తనదియందు మృతులకేశములను నాచు తీయాడుచుండెను. చక్రములు అందు ప్రతిబింబించుచున్న చంద్రబింబములవలెను, చక్రవాక పక్షులవలెను నగుపడుచుండెను. చక్రపు దెబ్బలకు ఏనుగులు కూలుచుండెను. మణులయొక్కయు ముత్యములయొక్కయు ఝణత్కారములును, రథపుటిరుసుల కిరకిరలును, పతాకముల పటపటలును వినవచ్చుచుండెను. ధైర్యవంతులగు వీరులు పిరికివారితోగూడి, కుంతాద్యాయుధముల గొనివచ్చి రథముల వెనుక నక్కుచుండిరి. అప్పుడారథములు రణభూమికుండలములవలె నొకింత తిరిగి, ఎదురెదురుగ నిలబడెను. అప్పుడా రాజులు బాణవర్షమును శిలావర్షమును గురిపించుచు, గర్జించుచున్న మేఘములవలెను, సముద్రమువలెను నుండిరి. గర్జించు అపరనరసింహమూర్తులవలె నగపడుచున్న ఆ రాజుల బాణములతో నాకాశము కప్పవడిపోయెను.

కరవాలముఖాః కేచి న్ముద్గరాననకాః పరే.    33
శితచక్రముఖాః కేచి త్కేచిత్పరశువక్త్రికాః
కేచిచ్ఛక్తిముఖాః కేచి త్కేచిచ్ఛూలశిలాముఖాః
త్రిశూలవదనాః కేచి త్స్థూలాఇవమహాశిలాః.    34

వారి బాణములు కొన్ని కరవాలముఖములును, కొన్ని ముద్గరముఖములును, కొన్ని చక్రముఖములును, కొన్ని పరశుముఖములును, కొన్ని శక్తిముఖములును, కొన్ని శూలముఖములును, కొన్ని శిలాముఖములును, కొన్ని త్రిశూలముఖములును, కొన్ని మహాశిలలవలె స్థూలములును నైయుండెను.

ప్రలయపవనపాతితాః శిలౌఘా
ఇవ నిపతంతి శిలీముఖా స్తదా స్మ
ప్రమిలితమభవ త్తయో స్తదానీం
ప్రలయవిజృంభితసింధుసంభ్రమేణ.    35

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
లీలోపాఖ్యానే విదూరథసింధుసమాగమోనామ సప్తచత్వారింశః సర్గః ॥ 47 ॥

అప్పుడు ప్రళయవాయువునబడు శిలాసమూహములవలె బాణము లిటునట బడసాగెను. అప్పుడు, ప్రళయసమయమున గలిసికొనిన సముద్రద్వయములపోల్కి, వారి సమాగమము అత్యంత భీషణమైయుండెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
లీలోపాఖ్యానమున విదూరథసింధుసమాగమమను సప్తచత్వారింశ సర్గము. ॥ 47 ॥

---

## అష్టచత్వారింశః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ప్రాప్యరాజాపురః ప్రాప్తం సింధుముద్ధురకంధరమ్
మధ్యాహ్నతపనాం తేన కోపేన వితతోఽభవత్.    1

వసిష్ఠుడు:— ఉన్నతకంధరుండగు సింధురాజిట్లు, ఎట్టయెదుట కరుదేర, విదూరథుడు కోపమున మధ్యాహ్న సూర్యునివలె మండిపడజొచ్చెను.

ధనురాస్ఫాలయామాస చిరారావితదిఙ్ముఖమ్
కల్పాంతపవనాస్ఫోట ఇవమేరుగిరే స్తటమ్.    2

ప్రళయవాయువు మేరుగిరి తటమును గొట్టునట్లాతడు ధనుస్సును ప్రయోగించుచు దిక్కులను ప్రతిధ్వనింపజేసెను.

విససర్జోర్జితోరాజా ప్రలయార్కఃకరానివ
తూణీరరజనీబద్ధాః శిలీముఖపరంపరాః.    3

ప్రళయసూర్యుడు కిరణముల ప్రసరింపజేయునట్లాతడు తూణీరమను ముకుళితపద్మములనుండి బాణములను తుమ్మెదలను విసర్జింపసాగెను.

ఏకఏవవినిర్యాతి గుణా త్తస్యశిలీముఖః
సహస్రంభవతివ్యోమ్ని గచ్ఛన్పతతిలక్షశః.    4

అతని అల్లెత్రాటినుండి బాణమొకటి వెలువడి, ఆకాశమున వెయ్యియై, క్రిందపడు నప్పుడు లక్షలగుచుండెను.

సింధోరపితథై వాసీ చ్ఛక్తిర్లాఘవమేవచ
వరేణవరదస్యైవం విష్ణోర్ధానుష్కతా తయోః.    5

సింధురాజుగూడ ఇట్టివేయగు శక్తిసామర్థ్యములను గలిగియుండెను; వారిరువురును విష్ణువునారాధించి సమానశక్తిని బడసిరి.

ముసలానామతేబాణా ముసలాకృతయోంబరమ్
ఛాదయామాసురున్నాదాః కల్పాంతాశనయోయథా    6

వారు ప్రయోగించిన ముసలాయుధములు, కల్పాంతవజ్రములవలె, భీషణధ్వని నొనర్చుచు, ఆకాశమును గప్పివైచెను.

రేజుఃకనకనారాచరాజయో వ్యోమ్నిసస్వనాః
రసంత్యఃకల్పవాతార్తాః పతంత్యఇవతారకాః.    7

సువర్ణబాణము లాకాశమున కెగసి, ధ్వనినొనర్చుచు, ప్రళయవాతహతములగు నక్షత్రములవలె, మరల క్రిందపడుచుండెను.

విదూరథాచ్ఛరాసారా అజస్రమభినిర్యయుః
అబ్ధేరివపయఃపూరాః సూర్యాదివమరీచయః.    8
ప్రచండపవనోద్ధూతా త్పుష్పాణీవ మహాతరోః
అయఃపిండాదివోత్తప్తా త్తాడితాత్కణపంక్తయః.    9

ధారావర్షముచఇవ సీకరాఇవనిర్ఝరాత్
తత్పురాగ్నిమహాదాహాత్ స్ఫులింగాఇవభాసురాః. 10

సూర్యునినుండి కిరణములును సముద్రమునుండి జలరాశియును, ప్రళయవాయు వికంపితమగు వృక్షమునుండి పుష్పములును, కాల్చికొట్టబడు ఇనుమునుండి నిప్పురవ్వలును, సెలయేటినుండి నీటిబొట్లును, ఆపురమును దహించుచున్న అగ్నినుండి రవ్వలును వెలువడునట్లు, విదూరథుని ధనుస్సునుండి ఎడతెగకుండ బాణవర్షము కురియసాగెను.

తయోశ్చటచటాస్ఫోట శృణ్వన్కోదండయోర్ద్వయోః
బలద్వయమభూత్త్రస్తం మూకం శాంతఇవాంబుధిః 11

ఆ రాజుల కోదండములనుండి వెలువడు చటచట ధ్వనులనువిని, ఇరువాగులవారును సముద్రమువలె శాంతించిరి.

వహంతిస్మ శరాపూరా గంగాపూరాఇవాంబరే
సింధోరభిముఖంయుద్ధే ఘుర్ఘురారావరంహసః. 12

విదూరథుని బాణములు ఘుర్ఘురరవముల నొనర్చుచు, ఆకాశమున ప్రవహించు గంగాప్రవాహమువలె, సింధురాజు అభిముఖముగ పడజొచ్చెను.

కచత్కనకనారాచ శరవర్షాఅనారతమ్
వహచ్ఛవశవాశబ్దం నిర్యయుర్ధనురంబుదాత్. 13

అతని ధనుస్సుఅను మేఘమునుండి సువర్ణబాణ — వర్షమెడతెగకుండ కురియసాగెను.

బాణమందాకినీపూరం ప్రజంతంసింధుపూరణే
వాతాయనాత్తమాలోక్య లీలాతత్పురవాసినీ. 14

ఆపురవాసినియగు లీల, విదూరథుని బాణగంగాప్రవాహము సింధుపూరణార్థమై (సముద్రమును నిండించుటకు, సింధురాజును వధించుటకు అని శ్లేష) అరుగుచుండుటను గాంచెను.

తేనబాణసమూహేన జయమాశంక్యభర్తరి
ఉవాచవాక్యమానంద వికసన్ముఖపంకజా. 15

ఆ బాణసమూహమును గాంచి తనభర్త జయించునను ఆశవలన మోమువిప్పార, దేవితో లీల ఇట్లనెను: ....

జయదేవిజయత్యేష నాథోఽస్మాకంవిలోకయ
కించానేనశరౌఘేణ మేరురప్యేతిచూర్ణతామ్. 16

జయము, దేవీ! మానాథుడు జయించును, ఇతని బాణముల మేరువుగూడ పొడి కావగలదు.

తస్యామేవం వదంత్యాంతు ఘనస్నేహరవాకులమ్
ప్రేక్షణవ్యగ్రయోర్దేవ్యోర్హసంత్యోర్మానుషీంహృదా. 17

ఇట్లు ప్రగాఢమోహవ్యాకులయై లీల వచింపుచుండ, యుద్ధమును గాంచుచున్న దేవు లిద్దరును తమలోదాము నవ్వుకొనిరి.



తచ్ఛరార్ణవమామత్త మపిబత్సింధువాడవః
శరోష్మణాహ్యగస్త్యేన జహ్నుర్మందాకినీమివ. 18

అప్పుడు సింధురాజను బడబాగ్ని అగస్త్యుడు సముద్రమును, జహ్నుముని గంగను త్రావినట్లు, విదూరథుడు ప్రయోగించిన బాణములను సముద్రమును, త్రాగివైచెను.

బాణవర్షేణకణశస్తం సాయకమహాఘనమ్
ఛిత్త్వాతనురజః కృత్వాచిక్షేపగగనార్ణవే. 19

సింధురాజు బాణవర్షమును కురిపించుచు, విదూరథుని బాణములను మేఘములను ముక్కలొనర్చు, పొడిచేసి, ఆకాశమను సముద్రమున బడవైచెను;

యథాదీపస్య శాంతస్య నపరిజ్ఞాయతేగతిః
తస్యసాయకసంఘస్య నవిజ్ఞాతాతథాగతిః. 20

దీపమారిపోయిన నది ఎచ్చటకటిగినదో తెలియనట్లు, ఆతని బాణములు 'ఐపు' లేకుండపోయెను.

తంఛిత్త్వాసాయకాసారం శరీరాంబుధరంఘనమ్
వ్యోమ్నిప్రసారయామాస రసాచ్ఛవ శతాన్వితమ్. 21

నూరుమొనలుగల బాణధారలు శరీరములను మేఘములును జింపుచు ఆకాశమున వ్యాపింపసాగెను

విదూరథస్తమప్యాశు వ్యధమత్సాయకోత్తమైః
సామాన్యజలదంమత్తం కల్పాంతపవనోయథా. 22

విదూరథుడుగూడ, ప్రళయవాయువు మేఘములను నివారించునట్లు ఆ బాణధారలను ఉత్తమములగు బాణముల శాంతింపజేయుచుండెను.

కృతప్రతికృతైరేవం బాణవర్షైర్మహీపతీ
వ్యర్థీకృతై రనయతాం ప్రహారమవిచారణైః. 23

ఇట్లా రాజులిర్వురును బాణవర్షమున ప్రతీకారము సల్పుకొనుచు కాలమును వ్యర్థపరచుచుండిరి.

అథాదధే మోహనాస్త్రం సింధుర్గంధర్వసౌహృదాత్
ప్రాప్తంతేనయయుర్లోకా వినామోహంవిదూరథాత్. 24

అనంతరము సింధురాజు గంధర్వులతో మైత్రినొనర్చి సంపాదించిన మోహనాస్త్రమును ప్రయోగించెను; విదూరథుడుతప్ప అంతయును మోహవశులైరి.

వ్యస్తశస్త్రాంబరామూకా విషణ్ణవదనేక్షణాః
మృతాఇవాభవన్యోధా శ్చిత్రన్యస్తాఇవాథవా 25
యావద్విదూరథాదన్యం మోహోనయతిమందతామ్
తావద్విదూరథోరాజా ప్రబోధాస్త్రమథాదదే. 26

అప్పుడు వారు బాణముల బారవైచి, విషణ్ణులై చిత్రపటములవలెనో శేక మృతులవలెనో పడియుండ, వారి మోహమును దొలగించుట కింకొక ఉపాయమును గనజాలక విదూరథుడు ప్రబోధాస్త్రమును గ్రహించెను.

తతఃప్రబోధమాపన్నాః ప్రజాఃప్రాతరివాబ్జినీ
విదూరథేఽభవత్సింధుః క్రుద్ధోఽర్క ఇవరాత్రిషు. 27

పిదప సైనికులు ప్రాతఃకాలపద్మములవలె ప్రబోధితులవ, సూర్యుడు మందేహులను రాత్రులయెడ క్రోధమును దాల్చునట్లు, విధూరథునియెడల సింధురాజు క్రుద్ధుడయ్యెను.

నాగాస్త్రమాదదేభీమం పాశబంధనఖేదదమ్
తేనాభవన్నభోవ్యాప్తం భోగిభిఃపర్వతోపమైః. 28
సర్పైర్వ్యాలసితాభూమి ర్మృణాలైఃసరసీయథా
సంపన్నాగిరయఃసర్వే కృష్ణపన్నగకంబలాః 29
పదార్థాఃసర్వఏవేమే విషోష్మఖిన్నతాంయయుః
సపర్వతవనాభోగా యయావివశతాంమహీ. 30
పూతాంగార సమాకీర్ణం విషవైషమ్యశంసినః
వవూ రూక్షోష్ణనీహార వాతాజ్వాలనరేణవః. 31

అప్పుడు సింధురాజు పాశబంధన సమర్థమగు నాగాస్త్రమును బ్రయోగించెను. దాన ఆకాశము పర్వతములబోలు పాములతో నిండిపోయెను. సరోవరమున తామరతూడులు చలించునట్లు, పాములు భూమిమీద తిరుగాడసాగెను. గిరులు కృష్ణసర్పములతో నిండిపోయెను. పదార్థములన్నియు విషమయములయ్యెను. పర్వతములు, వనములు, భూమి, వ్యాకులతనందెను. మంచుతుంపురులతోగూడుకొనిన గాలికూడ, నిప్పురవ్వలను వెదజల్లుచున్నట్లుండెను.

విదూరథోఽథసౌపర్ణ మాదదేఽస్త్రంమహాస్త్రవిత్
ఉదగుర్గరుడాస్తేన సౌపర్ణఃపర్వతాఇవ. 32
కాంచనీకృతసర్వాశాః సర్వాశాపరిపూరకాః
పక్షపర్వతసంరంభజనితప్రలయానిలాః. 33
ఘోణానిలజవాకృష్ణ శ్వసద్భుజగమండలాః
మహాఘురఘురారావ పూరితాంభోధిఖండకాః. 34
ససుపర్ణఘనోఽపాత్తం సర్పౌఘంభూప్రపూరకం
కృష్టంశిలశిలాయంత మగస్త్యఇవవారిధిమ్. 35
సర్పకంబలనిర్ముక్తం భూమండలమరాజత
చిరాత్తమవనీరంధ్ర మివనిర్వారిరాశిచ. 36
తతస్తద్గరుడానీకం క్వాప్యగచ్ఛదదృశ్యతామ్
దీపౌఘఇవవాతేన శరదేవాబ్దమండలమ్. 37



వజ్రభీత్యేవపక్షౌఘు పర్వతప్రకరఃపురః
స్వప్నదృష్టం జగదివ సంకల్పపురపూరవత్. 38

అనంతరము అస్త్రకోవిదుడగు విదూరథుడు గారుడాస్త్రమును బ్రయోగింప, నలుదిక్కుల పర్వతాకారములగు గరుడపక్షులు విహరింపదొడగెను. ఈ గరుడపక్షులు దిక్కులను సువర్ణమయముల నొనర్చుచు, రెక్కలనాడించుచు ప్రళయవాయువునుబోలు గాలిని లేవదీసెను. నిశ్వాసవాయువున సర్పముల నాకర్షింప దొడగెను, వాటి ఘురఘుర శబ్దము సముద్రములవరకు వ్యాపించుచుండెను. అగస్త్యుడు సముద్రమును ద్రావినట్లు, అవి భూమండలము నంతటిని వ్యాపించియున్న సర్పములను బీల్చివైచెను. అప్పుడు సర్పముక్తమగు భూమండలము సముద్రమునుండి లేవనెత్తబడినదానివలె నుండెను. పిదప, గాలివలన దీపము లారిపోవునట్లును, శరత్కాలమున మేఘము లదృశ్యమగునట్లును, వజ్రభయమున పర్వతములు పారిపోవునట్లును, స్వప్నజగత్తును, సంకల్పపురమును అదృశ్యమగునట్లును ఆ గరుడపక్షులన్నియును ఎచ్చటికో ఎగిరిపోయి, అంతర్ధానము నందెను.

తతస్తమోఽస్త్రమసృజత్ సింధురంధాంధకారదమ్
తేనాంధకారో వవృధే కృష్ణో భూజరోపమః. 39
రోదోరంధ్రేప్రవిసృత ఏకార్ణవఇవాభవత్
మత్స్యాఇవాభవన్సేనా స్తారాశ్చమణయోఽభవన్. 40
అంధకారప్రవృత్తేన మషీపంకార్ణవోపమమ్
కజ్జలాచలసంభారో ద్భూతకల్పానిలైరివ. 41
అంధకూపే నిపతితా ఇవాసన్సకలాఃప్రజాః
కల్పాంతఇవసంశేము ర్వ్యవహారా దిశాంప్రతి. 42

అనంతరము సింధురాజు గాఢాంధకారప్రదమగు తమోస్త్రమును బ్రయోగింప, భూమ్యాకాశ మధ్యభాగమున భూగర్భమునందువలె కారుచీకట్లు క్రమ్మదొడగెను. అప్పుడు జగత్తు ఏకార్ణవమైపోయెను. సైనికులందలి చేపలవలెను, నక్షత్రములు మణులవలెను నగుపడుచుండెను. ఆయంధకారమును గాంచిన దిక్కులు నల్లటిబురదలో కూరుకొనిపోయినట్లుగను, ప్రళయవాయువు కాటుకకొండలను చిమ్మినట్లుగను దోచుచుండెను. అందఱును చీకటినూతిలో బడినవారివలె నుండిరి. ప్రళయాంతమున శాంతవ్యవహారమైన జగత్తువలె తోచుచుండెను.

విదూరథోఽథమార్తండం దీపంబ్రహ్మండమండపే
అస్త్రమంత్రవిదాంశ్రేష్ఠః సృష్ట్వామంత్రోవ్యచేష్టయత్. 43
అథోదితతమోంభోధి మర్కాగస్త్యో గభస్తిభిః
అపిబత్కృష్ణమంభోదం శరత్కాలఇవామలః. 44
అంధకారాంబరోన్ముక్తా విరేజురమలా దిశః
భూపతేఃపురతఃకాంతా ఇవరమ్యపయోధరాః. 45
యయుఃప్రకటతామంత రఖిలా వనరాజయః
లోభకజ్జలజాలేన ముక్తాఇవ సతాం ధియః. 46

మంత్రజ్ఞ శ్రేష్ఠుడగు విదూరథుడు బ్రహ్మాండగృహదీపమగు సూర్యాస్త్రమును బ్రయోగించి, మంత్రవిచారము (రహస్యవిచారము) లేకుండగనే జగత్తును మరల చేష్టాయుత మొనర్చెను. నిర్మల శరత్తు కృష్ణమేఘములను పాన మొనర్చునట్లు, సూర్యుడను అగస్త్యుడు కిరణములతో నంధకారసముద్రమును ద్రావివైచెను. అప్పుడు దిక్కులన్నియు అంధకార—అంబరములను బరిత్యజించి, రమ్యపయోధరయగు నారివలె, విదూరథునియందు శోభిల్లసాగెను. లోభమను మకిలిలేని సాధువుల బుద్ధివలె, వనాంతరసమూహములు ప్రకాశింపసాగెను.

అథకోపాకులఃసింధూ రాక్షసాస్త్రంమహాభయమ్
క్షణాదుదీరయామాస మంత్రోదీర్ణ శరాత్మకమ్. 47
ఉదగుర్భీషణాదిగ్భ్యః పరుషావనరాక్షసాః
పాతాలగజపూత్కార క్షుబ్ధాఇవమహార్ణవాః. 48
కపిలోర్ధ్వజటాధూమ్రాః స్ఫుటచ్చటచటారవాః
అగ్నయోలేలిహానోగ్ర జిహ్వాఆర్ద్రేంధనాఇవ. 49
సావర్తవృత్తయోవ్యోమ్ని భీమచీత్కారటాంకృతాః
అగ్నిదాహామహాధూమ విలోలాఇవసోల్ముకాః 50
దంష్ట్రాబిసాంకురాక్రాంత ముఖపంకాక్షదేహకాః
ఉదితాలోమజంబాలా దుష్పల్వలతటాఇవ. 51
నిగిరంతఃప్రధావంతో గర్జంతఃసర్జితాఇవ
జటాజాలతడిత్పుంజా జలదాఃసజలాఇవ. 52

అనంతరము సింధునరపతి క్రుద్ధుడై, మహాభయప్రదమగు రాక్షసాస్త్రమను శరమును బ్రయోగించెను. అప్పుడు దిగ్గజపూత్కారమున క్షుబ్ధమైన సముద్రములుబోలు రాక్షసగణము నలుదిక్కుల నుండి రాదొడగెను. వారు కపిల జడలతో నొప్పుచు, జిహ్వలను జూపసాగిరి; అవి కాష్ఠములను భస్మమొనర్ప జ్వలించి అగ్నికీలలవలెనుండెను. వారు ఛటఛట ధ్వనుల నొనర్పసాగిరి! పురదాహసమయమున ధూమజాలములు లేచి అంధకారమయ మొనర్చునట్లు వారు నలుదిక్కులను అంధకారమున ముంచి, ఆకాశమున మండలాకారముగ బరిభ్రమింపసాగిరి. వారి ముఖ—పంకమున దంష్ట్రములను మృణాళనాళములు వెలయుచుండెను. పాడుపడిన చెఱువును నాచుదట్టముగ కప్పియుండునట్లు, వారి శరీరమును రోమములు కప్పియుంచెను. జటలను మెఱుపులతోగూడి, ఆ రాక్షసులు సజల—జలదముల వలె గర్జించుచు, లోకమును దిగమ్రింగుటకు సృష్టింపబడిరాయనునట్లు, జనులను దినుచ దిరుగాడసాగిరి.

ఏతస్మిన్నంతరే తస్మింల్లీలానాథో విదూరథః
నారాయణాస్త్రంప్రదదే దుష్టభూతనివారణమ్. 53
ఉదీర్యమాణఏవాస్మి న్మంత్రరాజేఽస్త్రరాజయః
రాక్షసానాంప్రశేముస్తా అంధకారఇవోదయే. 54
ప్రమృష్టరాక్షసానీక మభవద్భువనత్రయమ్
శరదీవ గతాంభోదం వ్యోమనిర్మలమాబభౌ. 55



అప్పుడు లీలాపతియగు విదూరథుడు, రాక్షసనివారణ సమర్థమగు నారాయణాస్త్రమును బ్రయోగించెను. వెంటనే, సూర్యోదయమున అంధకార ముపశమించునట్లు, రాక్షసులు మాయమై పోయిరి. శరత్కాలమున ఆకాశము మేఘశూన్యమైనట్లు, ముల్లోకములు రాక్షస విహీనములై నిర్మలములయ్యెను.

అథసింధుర్ముమోచాస్త్ర మాగ్నేయంజ్వలితాంబరమ్
జజ్వలుఃకకుభస్తేన కల్పాగ్నిజ్వలితాఇవ. 56
ధూమాంబుదభరాచ్ఛన్నా బభూవుఃసకలాదిశః
గగనేప్రోతపాతాల తిమిరాకులితాఇవ. 57
బభూవుర్జ్వలితాకారా గిరయఃకాంచనాఇవ
ప్రఫుల్లవననీరంధ్ర చంపకౌఘవనాఇవ. 58
యయుర్వ్యోమాద్రిదిక్కుంజా జ్వాలాజాలజటాలతామ్
కుంకుమేనోత్సవే మృత్యోః సమాలబ్ధాఇవస్రజః. 59
జ్వలితాజనతాచైక శంకినీ సా నభఃస్పృశా
సహస్రాకృతినావేగ చలితేనేవ సాగరాత్ 60

అనంతరము సింధురాజు ఆగ్నేయాస్త్రమును బ్రయోగింప, ఆకాశమండలమును, దిక్కులును కల్పాగ్నివలన గాల్పబడుచున్నట్లాయెను. దిక్కులన్నియు ధూమమేఘముల గప్పబడ, పాతాళమున దాగుకొనినచీకట్లరుదెంచి దిక్కులను అంధకారమున యుంచుచున్నవా యనిపించుచుండెను. కాలుచున్న పర్వతములు కనక కాంతులదాల్చి, వికసిత చంపకవనమువలె నగుపడుచుండెను. అగ్ని శిఖలతోనిండి ఆకాశము, పర్వతములు దిక్కులు ఎఱ్ఱబడి మారణోత్సవమునకు గల్పింపబడినవియును, కుంకమలిప్తములునగు మాలలాయనిపించుచుండెను. ఆ అగ్నినిగాంచి సముద్రమునసున్న బడబాగ్నిని వేలకొలది నావలతో గొనిరా నయ్యదిజగత్తునకు వహ్న్యద్వైతమును బ్రసాదించుచున్నదాయని సంశయింపసాగిరి.

జిత్వా రిపుంపునరసౌ యథాప్రవహరతేతథా
వారుణంవిససర్జాస్త్రం పూజయిత్వావిదూరథః. 61
ఆయయుఃసలిలాపూరా స్తమఃపూరాఇవాభితః
అధస్తాదూర్ధ్వతోదిగ్భ్య ద్రవరూపాఇవాద్రయః. 62
భాగాఇవశరవ్యోమ్ని ధృతయానాఇవాంబుదాః
మహార్ణవాఇవోచ్ఛన్నః కులశైలశిలాఇవ. 63
తమాలౌఘాఇవోడ్డీనః సంధితాఇవరాత్రయః
కజ్జలౌఘాఇవోద్ధూతా లోకాలోకతటాదివ 64
రసాతలగుహాభోగా ఇవవ్యోమదిదృక్షవః
మహాఘురఘురారావ రంహోబృంహితమూర్తయః. 65
తామగ్నిసంతతింమత్తా మాచచామాంబుసంతతిః
భువనవ్యాపినీసంధ్యా మాశుకృష్ణేవ యామినీ. 66

తామగ్నిసంతతిం వీత్వా పూరయామాసభూతలమ్
జలశ్రీర్ఘటితందేహం నిద్రేవ వ్యక్తిమేయుషీ 67
ఏవంవిధానస్త్రమోహాన్ విదధుర్ధావనేతరే
మిథోమాయామయానగ్రే పశ్యంత్యనుభవంతిచ. 68
హేతిభారవరాఃసింధో శ్చక్రరక్షా స్తతోఽంభసా
తృణానీవగతాః ప్రోహ్య రథశ్చాస్యాభవత్ప్లుతః 69

అప్పుడు విదూరథుడు ఆగ్నేయాస్త్రమునుపశమింపజేయజాలు వారుణాస్త్రమును బూజించి ప్రయోగించెను. అంధకార ప్రవాహమువలె, నలుదిక్కుల జలప్రవాహము పారదొడగెను. పైనుండియు, క్రిందనుండియు పర్వతములు నీరుగమారి పడుచున్నవా యనిపించుచుండెను. అప్పుడాకాశమున మేఘముల వేగము హెచ్చినదా, సముద్రములు పైకిలేచుచున్నవా, అనిపించుచుండెను. కులపర్వతముల శిలలు పడుచున్నట్లును, తమాలవనములు ఎగురుచున్నట్లును, కాలమంతయు రాత్రియైనట్లుగను, చక్రవాళ పర్వతములనుండి కాటుక పారుచున్నట్లును, పాతాళగుహలు ఘుర్ఘురధ్వనుల నొనర్చుచు ఆకాశమును దర్శింప అరుదెంచినట్లును దోచుచుండెను. కృష్ణపక్షరాత్రి వేగమున సంధ్యను తుద ముట్టించునట్లు, భువనమును వ్యాపించియున్న ఆ జలధారలు అగ్నిజ్వాలలను ఆర్పివైచెను. నిద్ర సర్వాంగముల నవశముల నొనర్చునట్లు, ఆ జలలక్ష్మి భూతముల నన్నిటిని అవసన్నములుగ నొనర్చెను. అప్పుడు సింధురాజు సైన్యములును, తద్రక్షకులును నీటిలో గడ్డిపరకలవలె, తేలిపోసాగిరి. రథములు గూడ మునిగిపోయెను.

ఏతస్మిన్నంతరే సింధు రస్త్రంసస్మారశోషణమ్
అపత్త్రాణకరందైవం దదాచ శరరూపిణమ్. 70
శశామాంబుమయీమాయా తేనయామేనభాస్వతా
యేమృతా స్తేమృతాఏవ బభూవుఃశోషితాభువః. 71

ఈ లోపుగ సింధురాజు శోషణాస్త్రమును స్మరించి, ఆ ఆపదనుండి తప్పించుకొనుటకు దానిని ధనుస్సున సంధించి, ప్రయోగించెను. సూర్యోదయమైన రాత్రిమాయమగునట్లు, శోషణాస్త్ర ప్రయోగమున జలమయమగు ఆ మాయ, అంతర్ధానము నందెను. మరణించినవారు అట్లే పడియుండిరి. భూమి ఎండువడిపోయెను.

అథ మూర్ఖ రుషా తుల్య స్తాపఃసంతాపయన్ప్రజాః
జజృంభేర్ఘుర్ఘురాకీర్ణ వనవిస్తారకర్కశః. 72
కచత్కనకనిఃస్యంద సుందరాంగచ్ఛవిర్దిశామ్
ఆసీద్రాజవరస్త్రీణా మివాలేపోఽంగసంగతః. 73
తేనఘర్మమయీంమూర్ఛా మాజగ్ముస్తద్విరోధినః
గ్రీష్మదావానలోత్తప్తా మృదవఃపల్లవాఇవ. 74

అనంతరము ఎండుటాకులతోనిండిన అడవివలె కర్కశములగు అస్త్రముల వేడిహెచ్చి మూర్ఖుని క్రోధమువలె నీటిని కాగువడునట్లొనర్పసాగెను. కనకద్రవ్యతుల్యమగు అస్త్రతాపము, రాజ



పత్నుల అంగరాగమువలె, దిక్కులను రంగున ముంచివైచెను. ఆ అస్త్రతాపమునకు విదూరథుని సైన్యము చెమట ఓడ్చుచు మూర్ఛనందిరి.

విదూరథో రణోద్రేకేతావత్కేంకారమాతతమ్
కోదండంకుండలీకృత్య పర్జన్యాస్త్రమథాదదే. 75
ఉదగుఃపంక్తయోఽబ్దానాం యామిన్యఇవసంచితాః
తమాలవిపినోడ్డీన సంరంభాదంబుమంథరాః. 76
వామనావారిపూరేణ గర్జనోద్దామసంచరాః
మహిమ్నా మంథరాశేష కకుమ్మండలకుండలాః. 77
వప్రరావలితాసారా మేఘడంబరభేదినః
కీర్ణసీకరనీహార భారోదారాఃసమీరణాః. 78
ప్రపుస్ఫురుఃసుసావర్ణ సర్పావత్సరణోపమాః
విద్యుతోదివిదైవ్యస్త్రీ కటాక్షవలనాఇవ. 79
జుఘూర్ణుర్గర్జనోచ్ఛ్వాస ప్రతిశ్రుద్ఘనకందరాః
దిశశ్చలితమాతంగ సింహర్క్షరవఘుర్ఘురాః. 80
మహాముసలధారాభిః పేతురాసారవృష్టయః
కష్టటంకారకఠినాః కృతాంతస్యేవదృష్టయః. 81
ఉదభూత్ప్రథమంబాష్ప ఉష్ణోఽనలనిభోభువః
పాతాలాదభ్రవృందానాం యుద్ధాయేవాత్తవిభ్రమః. 82
తతోనిమేషమాత్రేణ ప్రశేముర్మృగతృష్ణికాః
పరబోధరసాపూరై ర్యథాసంసారవాసనాః 83
అసీత్పంకాంకమఖిలం భూమండలమసంచరమ్
పూరితఃపూర్ణధారాభిః సింధుఃసింధురివాంబునా. 84

అప్పుడు విదూరథుడల్లెత్రాటిని మ్రోగించుచు, వింటిని వంచి మేఘాస్త్రమును బ్రయోగించెను. అప్పుడు, నీటితోనిండినవియు, కడిమిచెట్లవలె నల్లనివియునగు మేఘములు పైకిలేచి, లోకమును చీకటియందు ముంచివైచి, రాత్రులనేకములు ఒకచోట గూడినవాయని తోపజేయుచుండెను. జల భారమున వంగిన మేఘములు గర్జించుచు నలుదిక్కుల దిరుగుచు, వర్షింపసాగెను. నీటితుంపురలనుగొని మెల్లగవీచు గాలి, మేఘాడంబరమును కొంచెపరుపసాగెను. ఆ మేఘముల సువర్ణ — సర్పములవలెను, యెరుపురూబోడికడగంటి చూడ్కులవలెను మెరుపులు మెరియసాగెను. ఏనుగలవలె ఘీంకరించుచు సింహములవలె గర్జించుచు, ఎలగులవలె ఎలుగిడుచు మేఘములు నలుదిక్కుల వ్యాపింపసాగెను. ముసల ధారలతో వర్షముగుటియసాగెను. యముని చూడ్కులవలె వడగళ్లు పడసాగెను. మొదటివాన కురిసి వెలియగనే పాతాళమునుండి, మేఘములతో యుద్ధమొనర్చుటకాయనునట్లు, వేడి ఆవిరి లేవదొడగెను. ఆత్మసాక్షాత్కారమైన సంసారవాసనలు నశించునట్లు, ఆ ఆవిరి వెంటనే (మేఘాస్త్రమువలన) నశించిపోయెను. అంతయు బురదయై నడువవీలులేకుండపోయెను. జలప్రవాహముతో సముద్రము

నిండునట్లు, ఆ వర్షధారలతో సింధుడు నిండువడెను. (అనగా, అతడును అతనిసైన్యమును మునిగిపోయిరి. అని భావము.)

వాయవ్యమస్త్రమసృజ త్పూరితాకాశకోటరమ్
కల్పాంతనృత్తసంమత్త రటద్భైరవభీషణమ్. 85

అప్పుడు సింధురాజు ప్రళయకాలమున నృత్యమొనర్చు భైరవునివలె భయంకరమగు వాయవ్యాస్త్రమును బ్రయోగింప నయ్యది ఆకాశమువఱకును వ్యాపించెను.

వపురశనినిపాతపీడితాంగా
దలితశిలాశకలాఃకకుమ్ముఖేషు
ప్రలయసమయసూచకాభటానాం
కృతపటుటాంకృతటంకినఃసమీరాః 86

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
లీలోపాఖ్యానే ఆయుధవర్ణనం నామాష్టచత్వారింశః సర్గః ॥ 48 ॥

అప్పుడు, పిడుగులుపడ జనుల అవయవములు నలిగిపోసాగెను. రాళ్లుపగిలి, నలువైపులకు చిట్లిపోసాగెను. ప్రళయసూచకములగు గాలులు, సైనికులను జీల్ప బ్రయోగింపబడు పాషాణాయుధములవలె 'టంకృతము'ల నొనర్చుచు, వీవసాగెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు, ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున
ఆయుధవర్ణనమను అష్టచత్వారింశ సర్గము ॥ 48 ॥

## ఏకోనపంచాశః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

వపుర్జ్వలితనీహారా వికీర్ణవనపల్లవాః
వాయవోద్ధూతవృక్షౌఘాః నల్లీలాపీడపాంసవః. 1
పతద్విద్రావితవృక్షౌఘాః పతనోత్పాతనోద్భటాః
వికుట్టితాట్టాలఖండా శ్చాభ్రభిత్తివిభేదినః. 2
తేనాతిభీమనా తేన విదూరథరథోఽవ్యథ
ఉహ్యమానోఽభవన్నద్యా యథాజర్జరపల్లవః. 3



వసిష్ఠుడు:_అప్పుడు పంచుతుంపురులతోడను, దుమ్ముతోడను నిండినగాలి చిగుళ్లను, చెట్లను ఊపుచు వీవసాగెను. వాయువేగమున చెట్లు పక్షులవలె తిరుగసాగెను. భటులు కూలిపోవుచుండిరి. సౌధములు పిండియైపోవుచుండెను. మేఘములు ముక్కలై పోవుచుండెను. ఎండుటాకు నదీప్రవాహమున తిరుగునట్లు, ఆవాయుప్రవాహమున విదూరథుని రథము తిరుగసాగెను.

విదూరథోఽథతత్యాజ పార్వతాస్త్రంమహాస్త్రవిత్
వ్యోమాపి ఘనతోయేన సమాచ్ఛాదితుమివోద్యతమ్. 4
తేనశైలాస్త్రఘాతేన విరాట్ప్రాణసమీరణః
శమంచైతన్యశాంత్యేవ ప్రయయావాయురాతతః. 5
అంతరిక్షగతా వృక్షపంక్తయః పతితాభువి
నానాజనశవవ్యూహే కాకానామివకోటయః. 6
శేముఃసూత్కారడాత్కార ఝాంకారోత్కారకా దిశామ్
ప్రలాపాఇవవిధ్వస్తాః పూర్గ్రామవనవీరుధామ్. 7
గిరీనవశ్యన్నభసః పతతఃపత్రపర్ణవత్
సింధుఃసింధురివోత్పతన్ మైనాకాదీనితస్తతః. 8

అప్పుడు మహాస్త్రవిదుడగు విదూరథుడు, పర్వతాస్త్రమును బ్రయోగించెను. అయ్యది మేఘోదకమునుబోలు ఆకాశమును మ్రింగునట్లుండెను. మాయ శాంతిల్లగతకార్యమగు ప్రాణవాయువు శమించునట్లు శైలాస్త్రప్రయోగమున వాయువు శాంతించెను. అప్పుడు, గాలిచే లేవనెత్తబడిన చెట్లు, కాకులవలె, భూమిమీదనున్న శవములపై పడసాగెను. నలుదిక్కులనున్న పురగ్రామాదులు లుంఠన, ఝాంకార, చీత్కారశబ్దము లాగిపోయెను. సముద్రుడెగురుచున్న మైనాకాది పర్వతములను గాంచునట్లు, సింధురాజు ఆకాశ— పర్ణములవలె రాలుచున్న పర్వతసమూహమును గాంచెను.

వజ్రాస్త్రమసృజద్దీప్తం చేరుర్వ్రజగణాస్తతః
పిబంతోఽద్రీంద్రతిమిర మగ్నిదాహమివాగ్నయః. 9
తే గిరీణాంతథాక్షిప్తాః కోటితుండావఖండనైః
శిరాంసి పాతయామాసుః ఫలానీవోల్బణానిలాః. 10

అప్పుడాతడు వజ్రాస్త్రమును బ్రయోగించెను. అది, వజ్రములను విడువసాగెను. ఆ వజ్రములు, అగ్నికట్టెలను మ్రింగునట్లు, పర్వతములను చీకట్లను దిగమ్రింగసాగెను. ఆ వజ్రధారల పర్వతములు ముక్కలుచెక్కలైన పండ్లవలె, నేలమీదపడసాగెను.

విదూరథోఽథవజ్రాస్త్ర శాంత్యై బ్రహ్మాస్త్రమత్యగాత్
తతోబ్రహ్మాస్త్రవజ్రాస్త్రే సమంప్రశమమాగతే. 11

అనంతరము విదూరథుడు వజ్రాస్త్రమును వారింప, బ్రహ్మాస్త్రమును విడచెను, అప్పుడా రెండును ఒకేతడవ ఆగిపోయెను.

శ్యామాశ్యామంపిశాచాస్త్ర మథసింధురచోదయత్
తేనోదగుఃపిశాచానాం పంక్తయోఽత్యంతభీతిదాః. 12

సంధ్యాయామథభీత్యేవ దివసః శ్యామతాంయయౌ
పిశాచాభువనంజగ్ముః రంధకారభరాఇవ. 13
భస్మనః స్తంభసదృశా స్తాలోత్తాలవిలాసినః
దృశ్యమానమహాకారా ముష్టిగ్రాహ్యానకించన. 14
ఊర్ధ్వకేశాఃకృశాంగాశ్చ కేచిచ్ఛ్మశ్రులా అపి
కృష్ణాంగామలినాంగాశ్చ గ్రామ్యాఇవనభశ్చరాః. 15
సభయామూఢదృష్టాశ్చ యత్కించనకరాశ్చలాః
దీనావజ్రాసినః క్రూరా దీనాగ్రామ్యజనాఇవ. 16
తరుకర్దమరథ్యాంతః శూన్యగేహగృహాశ్చలాః
లేలిహానాః ప్రేతరూపాః కృష్ణాంగాశ్చపలాఇవ. 17
జగృహుస్తేతదామత్తా హతశిష్టమరేర్బలమ్
ఆసంస్తత్సైనికాస్తత్ర భిన్నాస్త్రత్రుబ్ధచేతనాః 18
త్యక్తాయుధతనుత్రాణా త్రస్తప్రాణాః స్ఖలద్గమాః
నేత్రైః శిరోంగైః ర్ముఖైః పాదైః ర్వికారభరకారిణః 19
త్యక్తకౌపీనవసనా నిమగ్నావసనోత్తరాః
విష్ఠాంమూత్రంచకుర్వంతః స్థిరమారబ్ధనర్తనాః. 20
పిశాచరాజీరాజానం తన్వయావద్విమారథమ్
సమాక్రామతితావత్తాం మాయాం స బుబుధేబుధః. 21

పిదప, సింధురాజు చీకటివలె కారునలుపగు పిశాచాస్త్రమును బ్రయోగించెను. అప్పుడత్యంత భయంకరములగు పిశాచసమూహము వెలువడసాగెను. పిశాచభయమువలననాయనునట్లు, సంధ్యయందువలె, దినము నల్లబడెను. చీకటిగుంపులవలె పిశాచముల దండు బయలుదేరెను. వారు కాలిన కంబమువలె నుండిరి. చప్పట్లు చరచుచు నృత్యమొనర్పసాగిరి. వారి ఆకృతిభయంకరమైయుండెను. (మాయాస్వరూపులగుటవలన) చేతి కందకుండిరి. వారి అంగములు కృశించియుండెను, శిరోజములు పైకిలేచియుండెను, కొందఱికి గడ్డములుండెను, కొందఱు నల్లగను, దరిద్రులవలె మలినులునునై యుండిరి. కొండఱు, ఆకాశమునగూడ సంచరింపగలిగియుండిరి. వారి చేతులలో ఎముకలు మొదలగునవి ఉండెను, వారు మూఢులవలె నగుపడుచుండిరి. గ్రామ్యులవలె దీనులును, వజ్రమువలె కఠినులునునైయుండిరి. చెట్లు, అడుసునేల, పాడుపడిన ఇండ్లుమున్నగుతావుల వారుందురు. వారినాలుకలు వెలుపలికి వచ్చియుండెను; ప్రేతరూపులగువారు విద్యుత్తులవలె, కనుపడియు కనుబడకుండిరి. వారు విదూరథుని సైన్యము నాక్రమింపసాగెను. అప్పుడు వారు ఆయుధాదులను ప్రయత్నమును విడచి, బుద్ధిమందగింప నేత్రాదులవలన పిశాచ—ఆవేశ వికారము నగపర్చుచు, వస్త్రములను బరిత్యజించుచు, నృత్యమొనర్పసాగిరి, ఆ పిశాచములు విదూరథుని ఆక్రమింపబోవుచుండ, అతడద్దానిని గ్రహింపగలెను.

పిశాచసంగ్రామకరీం మాయాంవేత్తిసభూమిపః
తయాపిశాచసైన్యంత త్పరసైన్యే న్యయోజయత్. 22



తతఃస్వసైనికాఃస్వస్థాః పరయోధాఃపిశాచినః
తస్యాశురూపికాస్త్రంచ దదావన్యదసౌ రుషా 23
ఉదగుర్భూతలాద్వ్యోమ్నా రూపికాఊర్ధ్వమూర్ధజాః
నిర్మగ్నావికరాలాక్ష్య శ్చలచ్ఛోణపయోధరాః 24
ఉద్భిన్నయౌవనావృద్ధాః పీవరాంగ్యోఽథజర్జరాః
స్వరూపారూపజఘనా దుర్నాభ్యోవికసద్భగాః. 25
నరరక్తశిరోహస్తాః సంధ్యాభ్రారుణగాత్రికాః
అర్ధచర్వితమాంసాసృక్ ప్రవత్సృక్కాకులాననాః 26
నానాంగవలనా నానానమన్నమనసత్తమాః
శిలాభుజగవక్రోరు కటిపార్శ్వాకరాంగికాః. 27
నారీకృతార్భకశవా హస్తాకృష్టాంత్రరజ్జవః
శ్వకాకోలూకవదనా నిమ్నవక్త్రహనూదరాః 28
జగృహుస్తాన్ పిశాచాంస్తా దుర్బలాన్దుఃశిశూనివ
పిశాచరూపికాసైన్యం తదాసీదేకతాంగతమ్ 29
నిర్మగ్ననర్తనోత్తాన వదనాంగవిలోచనమ్
పరస్పరాక్రాంతికరం ప్రధావచ్చపరస్పరమ్. 30
నిష్కాసితమహాజిహ్వాం నానాముఖవికారదమ్
శరభారాఢ్యమన్యోన్యం హ్రియమాణశవాంగకమ్. 31
రుధిరాంభసిమజ్జంత దున్మజ్జదుల్లసత్తను
లంబోదరం లంబభుజం లంబకర్ణోష్ఠనాసికమ్. 32
రక్తమాంసమహాపంకే ష్వన్యోన్యంవేల్లనాభ్యసత్
మందరోద్ధూతదుగ్ధాబ్ధి లసత్కలకలాకులమ్. 33

పిశాచములను లోబర్చుకొని, పరులపై వాటినివదలు విద్య నాతడెరింగియుండెను. అతడద్దానిని బ్రయోగింప, స్వసైన్యము పిశాచ—మాయనుండి తేరుకొనెను. శత్రుసైన్యము పిశాచావిష్టమయ్యెను. దానికితోడు, రోషమున నాతడు రూపికాస్త్రమును బ్రయోగించెను. అప్పుడు ప్రూతనాగణము ఆకాశమునుండియు, భూమినుండియు, లేవదొడగెను. వాటి కేశములు పైకిలేచియుండెను. కళ్లు గుంటలుపడియుండెను, వాటి అదుపునకు మేఘములు కదలసాగెను. కొన్నినవయౌవనలును, కొన్ని వృద్ధలును, కొన్ని స్థూలాంగలును, కొన్ని జీర్ణాంగలునునై యుండెను; తొడలు వారి రూపమునకు తగినట్లేయుండును. వారి నాభిమండలమును యోనిదేశమును విశాలముగనుండెను. చేతులలో శిరములును రక్తమును ఉండెను. శరీరము సంధ్యారుణమైయుండెను. దవడలనుండి, మాంసమును నమలుచుండుటవలన, రక్తము కారుచుండెను. వారి అవయవములన్నియు పాములవలె వక్రములును, శిలలవలె కఠినములునునై యుండెను. ఇతరుల తలల నొంపగల్గినవారుగూడ, వాటి ముంగల తలలనువంచుచుండిరి, వారి గళముల శిశు శవ—మాలలు వెలయుచుండెను; చేతులతో నాడులను పెకలించుచుండిరి.

వారి ముఖములు కుక్కలు, నక్కలు, గ్రుడ్లగూబలను బోలియుండెను. నోరు, దవడల మధ్యనున్న చోటు వంకరతిరిగియుండెను. వారు వెనుకటి పిశాచములను, అల్లరిపిల్లలవలె, భర్తలుగ గ్రహించిరి. అప్పుడీరెండును ఏకమైపోయెను. వారు క్రీడామగ్నులై, అవయవముల గదల్చుచు, ఒకరినొకరు లాగుకొనుచు నృత్యమొనర్పసాగిరి. వారు వాళ్ళలను జాపుచు; నానావిధముఖవికారముల నొనర్చుచు, శవములను లాగసాగిరి. లంబోదరులును, లంబబాహువులును, లంబకర్ణులును, లంబోష్ఠులును, లంబనాసికలునునగు పిశాచగణము రక్త—జలమున మణిగి ఈదులాడసాగెను. రక్త — మాంసపంకమునబడి, కౌగిలించుకొనసాగిరి. అప్పుడు, మందరమథితక్షీరసముద్రమునుండి వెలువడునట్లు భీషణధ్వనులు వెలువడసాగెను.

యథైవమాయాసంచార స్తేనతస్యకృతఃపురా
తేనాపితస్యాశుతథా కృతోబుద్ధ్వా స లాఘవాత్. 34
వేతాలాస్త్రంతతోదత్తే తేనోత్తస్థుఃశవవ్రజాః
అమూర్ధానఃసమూర్ధానో వేతాలావేశవల్గితాః. 35
తతఃపిశాచవేతాల రూపికోగ్రకబంధవత్
తద్బభూవబలంభీమ ముర్వీనిగరణక్షమమ్. 36

విదూరథుని మాయాప్రయోగమును గ్రహించిన సింధురాజు దానినాప, బేతాళాస్త్రమును విడచెను. వెంటనే మస్తకరహితములును, మస్తకయుతములును నగు శవములు పైకి లేవనొడగెను. అప్పుడా పిశాచ, పూతనా, బేతాళ సైన్యముకలసి, భూమిని మ్రింగగలిగినట్లుండెను.

అథేతరోఽపిభూపాలో మాయాంసంహార్య తాం గురా
రాక్షసాస్త్రంససర్జాథ త్రైలోక్యగ్రహణోన్ముఖమ్. 37
ఉదగుఃపర్వతాకారాః సర్వతఃస్థూలరాక్షసాః
దేహమాశ్రిత్యనిష్క్రాంతాః పాతాలాన్నరకాఇవ 38
అథోదభూద్బలంభీమం ససురాసురభీతిదమ్
గర్జద్రక్షోమహానాద వాద్యనృత్యత్కబంధకమ్. 39
మేదోమాంసోపదంశాఢ్యం రుధిరాసవ సుందరమ్
క్షీబకూశ్మాండవేతాల యక్షతాండవ సుందరమ్. 40

అనంతరము విదూరథుడా మాయను సంహరించి, ముల్లోకముల మ్రింగగలరాక్షసాస్త్రమును ప్రయోగించెను. అప్పుడు నలుదిక్కులనుండి పర్వతసములగు రాక్షసలురాగా, నరకములు శరీరమును దాల్చి పాతాళమునుండి వెలువడినవా యనునట్లుండెను. ఆసైన్యము సురాసురలకుగూడ భయమును గలిగించుచు, భీషణమైయొప్పుచుండెను. రాక్షసగర్జనములను వాద్యధ్వనులతో కబంధములు (మొండెములు) నృత్యమొనర్పసాగెను. బేతాళగణము మేదో మాంసములను నములుచు, రక్తాసవమును ద్రావుచు నాట్యమొనర్పసాగిరి.

కూశ్మాండకోత్తాండవదండపాద క్షుబ్ధాసృగుత్క్షిప్తతరంగసిక్తైః
సంధ్యాభ్రరాగోత్కరకోటికాంతి భూతైరసృక్స్రోతసి దత్తసేతు. 41



ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
తృతీయాస్త్రయుద్ధం నామైకోన పంచాశః సర్గః ॥ 49 ॥

భూతములు కూష్మాండ తాండవమున లేచిన రక్తతరంగముల నభిషిక్తములై, సంధ్యాకాలశ్యామకాంతులవలె దోచుచు, రక్త ప్రవాహమున కిడిన సేతువువలె నగపడుచుండెను.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున
తృతీయాస్త్రయుద్ధమను ఏకోనపంచాశ సర్గము ॥ 49 ॥

## పంచాశత్తమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

తస్మింస్తదావర్తమానే ఘోరేసమరవిభ్రమే
సర్వారిసైన్యనాశార్థ మేకంస్వబలశాంతయే. 1
సస్మారసస్మృతిమానంతో మహోదారాధిధైర్యభృత్
అస్త్రమస్త్రేశ్వరంశ్రీమ ద్వైష్ణవం శంకరోపమమ్. 2
అథహోఽసౌశరస్తేన వైష్ణవాస్త్రాభిమంత్రితః
ముక్తస్తస్యఫలంప్రాంతా దుల్కాకాదివనిర్యయౌ. 3
పంక్తయఃస్ఫారచక్రాణాం శతార్కీకృతదిక్తటాః
గదానామభియాంతీనాం శతవంశీకృతాంబరాః. 4
వజ్రాణాం శతధారాణాం తృణరాజీకృతాంబరాః
పట్టిశానాం సపద్మానాం దీనవృక్షీకృతాంబరాః. 5
శరాణాం శితధారాణాం పుష్పజాలీకృతాంబరాః
ఖడ్గానాం శ్యామలాంగానాం పత్రరాశీకృతాంబరాః. 6

వసిష్ఠుడు:- అప్పుడు సింధురాజు యుద్ధతీవ్రతనుగాంచి, స్వసైన్య రక్షణకొఱకును, శత్రుసైన్యనాశనము కొఱకును, కాలరుద్రునివలె సంహారకమగు వైష్ణవాస్త్రమును ప్రయోగించెను. దానినుండి నానావిధములగు ఆయుధములు వెలువడ దొడగెను. అద్దానినుండి వెలువడిన చక్రాయుధములు, దిక్కులను శతసూర్యులవలె వెలిగింపసాగెను. గదలు వెలువడ, ఆకాశము పెక్కు వెదుళ్లతో నిండిపోయినట్లగపడుచుండెను. వజ్రములు తృణాచ్ఛాదితములగు పద్మదళములవలె నగుపడుచుండెను. పట్టిశాస్త్రములు ఆకాశ వృక్షములవలె నగపడుచు, నిశిత ఖడ్గములను పూలగానులతోడను, శ్యామలఖడ్గములను ఆకులతోడను వెలయుచుండెను.

అథరాజాద్వితీయోఽపి వైష్ణవాస్త్రస్య శాంతయే
దదౌ వైష్ణవమేవాస్త్రం శత్రునిష్ఠావపూరకమ్. 7
తతోఽపినిర్య యుర్నద్యో హేతీనాంహత హేతయః
శరశక్తిగదాప్రాస పట్టిశాదిపయోమయాః. 8
శస్త్రాస్త్రసరితాంతాసాం వ్యోమ్ని యుద్ధమవర్తత
రోదోరంధ్రభయకరం కులశైలేంద్రదారుణమ్. 9
శరపాతితశూలాసి ఖడ్గకుట్టితపట్టిశమ్
ముసలప్రతనాప్రాస శూలసాతితశక్తికమ్. 10
శరాంబురాశిమథన మత్తముద్గరమందరమ్
గదావదనతోయుక్తం దుర్వారాస్త్రనిభాసిని. 11
రిష్టారిష్టప్రశమన భ్రమత్కుంతేందుమండలమ్
ప్రాసప్రసరసంరబ్ధ ప్రోద్యతాంతకృతాంతకమ్. 12
చక్రావకుంఠితోర్ధ్వాస్త్రం సర్వాయుధభయంకరమ్
శబ్దస్ఫుటద్విరించాండం ఘాతభగ్నకులాచలమ్. 18
ధారానికృత్తశస్త్రౌఘ మస్త్రయోర్యుధ్యమానయోః
మదస్త్రవారణేనేవ వజ్రావిజరపర్వతమ్. 14
శంకుశంకితనూత్కార కాశిశూలశిలాశతమ్
భుశుండీనిర్జితోద్దండ భిందిపాలోగ్రమండలమ్. 15
పరశూలకరాభైక పరశూలైకలంపితమ్
పహదుచ్ఛిన్నచంచూర చారణంశత్రువారణమ్. 16
స్ఫుటచ్చటచ్చటాస్ఫోట రుద్ధస్త్రపథగారయమ్
హేత్యస్త్రచూర్ణసంభార మహాధూమవితానకమ్ 17
అన్యోన్యాశస్త్రసంఘట్టా ద్భ్రమజ్జాలోల్లసత్తడిత్
శబ్దస్ఫుటద్విరించాండం ఘాతమగ్నకులాచలమ్. 18
ధారానికృత్తశస్త్రౌఘ మస్త్రయోర్యుధ్యమానయోః
మదస్త్రవారణేనైవ కాలోపాయోఽచలాత్మనః. 19
అయంకియద్బలఇతి సింధావిత్థతిహేలయా
విదూరథోస్త్రమాగ్నేయం తత్యాజాశనిశబ్దవత్ 20

అనంతరము విదూరథుడుగూడ వైష్ణవాస్త్ర శాంతికొఱకు వైష్ణవాస్త్రమును ప్రయోగించెను. దానినుండి శరాద్యాయుధములను జలముతోగూడిన అస్త్రనది ప్రవహింపసాగెను. అయ్యది, శత్రువు ప్రయోగించిన అస్త్రములను పరాభవింప గలిగియుండెను. ఆ అస్త్రద్వయ ప్రవాహము, ఆ ఆకాశమును నిరవకాశ మొనర్చుచు, కులపర్వతములు ప్రక్కలగునట్లు, డీకొనసాగెను. శరముల శూలములును, కత్తులును పడసాగెను. ఖడ్గముల పట్టిశములు చూర్ణమై పోవుచుండెను. ముసల, ప్రాస,



శూలాస్త్రముల శక్తి – అస్త్రములు ముక్కలగు చుండెను. ముద్గరమను మందరపర్వతము వలన శర సముద్రము త్రచ్చబడుచుండెను. గదలనుండి ఎడతెగకుండ, ఖడ్గములు వెలువడదొడగెను. కుంతాస్త్రములను చంద్ర మండలములు, తమ తమ సైన్యముల కీడు బాపుటకో యనునట్లు, తిరుగసాగెను. ఆయుధముల నన్నిటిని ఖండించుచు పైకి లేచుచున్న అస్త్రములు చక్రాస్త్రముల వలన ఖండింపబడు చుండెను. పరస్పరము యుద్ధ మొనర్చుచున్న అస్త్రములధ్వని వినిన, బ్రహ్మాండము, కులపర్వతము లును బ్రద్దలైనట్లుండెను. క్షుద్ర ఖడ్గమువలలన శూలములును, శిలలును ఖండింపబడు చుండెను. భుషుండి అస్త్రము భేదపరాయణులను నిర్జించుచుండెను. సర్వ సంహార సమర్థమును, రుద్రహస్త స్థితమునునగు శూలమునుబోలు శూలములు అస్త్ర సమూహమును వమ్ము చేయదొడగెను. భిన్నములైన అస్త్రములన్నియు అటునిటు బడసాగెను. వాటి చటచట ధ్వనుల వేగమునకు ఆకాశ గంగానది వేగము నిలచిపోయెను. ఖడ్గములు పొడియై, ఆకాశమును మబ్బులతో కప్పినట్లుండెను. ఇట్లస్త్రములన్నియు యుద్ధమొనర్చుచుండ విద్యుత్తులవలె అగ్నిశిఖలు వెలువడ దొడగెను. కులగిరులును, బ్రహ్మాండమును పెట్టినట్లు ధ్వనులు వెలువడ సాగెను. సింధురాజు దీనినంతటిని గాంచి, విదూరథుడు నా అస్త్రములను వారించుటయందే కాలమును గడపు చున్నాడు. ఇతని కెంత బలమున్నది? అని చుల్కనగ తలచుచు ఊరకుండెను అప్పుడు విదూరథుడు, వజ్రపాతమువలె, ఆగ్నేయాస్త్రమును విడిచెను.

జ్వాలయామాస స రథం సింధోఃకక్షమివారసమ్
ఏతస్మిన్నంతరేవ్యోమ్ని హేతినిర్వివరోదరే. 21
ససన్నాహఇవప్రావృట్పయోదతటినీవ యః
అస్త్రైరాజ్ఞోఃతృణంకృత్వా యుద్ధంపరమదారుణమ్ 22
అన్యోన్యంశమమాయాతే సవీర్యేసుభటావివ
ఏతస్మిన్నంతరేసోఽగ్ని రథంకృత్వాతుభస్మసాత్ 23
ప్రాపదగ్ధ్వావనంసింధుం మృగేంద్రమివకందరాత్
సింధురథ్యానతోఽగ్న్యస్త్రం వారుణాస్త్రేణశామయన్. 24
రథంత్యక్త్వావనింప్రావ్య ఖడ్గాస్ఫోటకవానభూత్
అక్ష్ణోర్నిమేషమాత్రేణ రథాశ్వానాం రిపోఃఖురాన్. 25
లులావకరవాలేన మృణాలానీవలాఘవాత్
విదూరథోఽపివిరథో బభూవాస్ఫోటకాసిమాన్. 26
సమాయుధావమోత్సాహౌ చేరతుర్మండలానితౌ
ఖడ్గక్రకచలాంయాతౌ మిథఃప్రహారతోస్తయోః 27
దంతమాలేయమన్యేవ బలేచర్వ్యయతఃప్రజాః
శక్తిమాదాయచిక్షేప ఖడ్గంత్యక్త్వావిదూరథః. 28
సింధ్వంబుఘుర్ఘరారావో మహోత్పాతఇవాశనిః
అవిచ్ఛిన్నాసమాయాతా పతితాసాస్యవక్షసి. 29

అప్రియస్యయథాభర్తు రనిచ్ఛంతీస్వకామినీ
తేనశక్తిప్రహారేణ నాసౌమరణమాప్తవాన్. 30
కేవలంరుధిరవ్రాతం నాగోజలమివాత్యజత్

ఆ అస్త్రప్రభావమున సింధురాజు రథము శుష్కతృణమువలె, మండసాగెను. ఈలోపుగ ఆకాశమున వర్షకాలమేఘము, నదులవలె, వేగముగ యుద్ధమొనర్చుచున్న అస్త్రములు శాంతిలెను అగ్నియు రథమును దహించి, దావాగ్ని వనదాహానంతరము సింహము నాక్రమించునట్లు, సింధురాజు నాక్రమింప దొడగెను. సింధురాజు వారుణాస్త్రమున ఆ అగ్నిని ఆర్పి, రథమునువిడచి, క్రిందకుదిగి, ఖడ్గమును చేతగొని యుద్ధమొనర్పసాగెను. వెంటనే అనాయాసముగ తామరతూడులవలె, విదూరథుని రథాశ్వఖురము (గిట్ట)లను ఖండించివైచెను. విదూరథుడుగూడ విరథుడై, ఖడ్గమును గైకొనెను. వారిట్లు, సమానోత్సాహమున, సమానాయుధములగొని సైన్యమండలమున విహరింపసాగిరి. వారు పోరాడుకొనుచుండ, కత్తులు మొండిపారిపోయెను. విదూరథుడు కత్తినిపారవైచి, శక్తిని సింధునిపై విసరెను. అయ్యది సముద్రతరంగములవలెను, పిడుగువలెను ధ్వనించుచు సింధుని వక్షముపైబడెను. భార్య భర్తకు ఎట్టికీడును ఒనర్చనట్లు, అయ్యదియు ఎట్టి అపకారమును జేయలేదు. సింధురాజు మరణింప లేదు. కాని, ఏనుగుతొండముతో నీటిని చిమ్మినట్లు, ఆతనినోటినుండి రక్తధారలు పడసాగెను.

తద్దేశలీలాతంద్రృష్ట్వా భగ్నంతమఇవేందునా. 31
నవికానఘనానందా పూర్వలీలామువాచహ

అప్పుడు అప్రబుద్ధలీల, చీకటి చంద్రునివలన హతమగునట్లు, సింధురాజుహతుడగుటగాంచి పూర్వలీలతో సంతోషమున నిట్లుపల్కెను:-

దేవిపశ్యనృసింహేన హతోభర్త్రాప్రియమావయోః. 32
శక్తికోటినఖైర్దైత్యః సింధురుద్ధురకంధరః
సరఃస్థలస్థనాగేంద్ర కరపూత్కృతవారివత్. 33
పిష్టోరసోఽస్యనిర్యాతి రక్తంచులచులారవైః
హాకష్టంరథమానీతం సింధురారోఢుముద్యతః. 34
సౌవర్ణంమైరవంశృంగం పుష్కరావర్తకోయథా
పశ్యదేవిరథోఽస్యాసౌ ముద్గరేణవిచూర్ణతః. 35
భ్రమత్సార్థనిపాతేన సౌవర్ణంనగరంయథా
ప్రవృత్తోరథమారోఢు మానీతం పతిరేషమే. 36
కష్టంవజ్రమివేంద్రేణ ముసలంసింధునేక్షితమ్
జవాత్పతిః ప్రయాతోమే సైంధవంముసలాయుధమ్. 37
వంచయిత్వావిలాసేన రథమారుహ్యలాఘవాత్
హాధిక్కష్టమసౌసింధురార్యపుత్రరథం రయాత్. 38



హరిశ్వభ్రమివారూఢం ప్లవేనోర్ధ్వమివద్రుమమ్
క్రీడిత్వాపీడయామాస శరవర్షైర్విదూరథమ్. 39

ఛిన్నధ్వజంఛిన్నరథం ఛిన్నాశ్వంఛిన్నసారథిమ్
ఛిన్నకార్ముకవర్మాణం భిన్నసర్వాంగమాకులమ్. 40

'దేవీ! చూడుము! నాభర్త నృసింహదేవుడు హిరణ్యకశిపుని గోళ్లతో జీల్చునట్లు, సింధురాజును శక్తి — అస్త్రధారతో జీల్చివైచినాడు. కొలనినీటనున్న ఏనుగుతొండమునుండి నీరు వెడలునట్లు, ఇతని వక్షస్థలము చితికి చుళుచుళుమనుచు రక్తమువెలువడుచున్నది. అహో! పుష్కలావర్తములు మేరుపర్వతపు సువర్ణశిఖరముల నధిరోహించునట్లు, మరల కొనిరాబడిన రథము నెక్కుచున్నాడే! చూడుడు, ఫాల్గునిబాణముల నివాతకవచుల సువర్ణపురి భగ్నమైనట్లు, ముద్గరప్రహారముల ఇతని రథము చూర్ణమైపోయినది. నాభర్త సింధురాజును వంచించి, ఆ రథమెక్కి పోవుచున్నాడు. హా! కష్టము! సింధురాజు పచ్చనిచెట్టువలె పెద్దదగు ఆ రథము నెక్కి ఆర్యపుత్రుని పీడించుచున్నాడు. ఆయన ధ్వజము, రథము, అశ్వములు, సారథి, కోదండము, కవచము, అంగములు భిన్నములైపోయినవి. ఆయన తల్లడిల్లుచున్నాడు.

హృదిస్ఫోటశిలాపట్ట దృఢేపీవరమూర్ధని
భిత్త్వావజ్రసమైర్బాణైః పాతయత్యేషభూతలే. 41
అథాన్యంరథమానీతం కృచ్ఛ్రేణప్రాప్యచేతనామ్
ఖడ్గేనారోహతోఽస్యాంసం ఛిన్నంభర్తుర్విలోకయ. 42
పద్మరాగగిరిద్యోత మివర్ధాసృగ్విముంచతి
హాహాధిక్కష్టమేతేన సింధునాఖడ్గధారయా. 43
జంఘయోర్మేపతిశ్ఛిన్నః క్రకచేనేవపాదపః
హాహాహతాస్మిదగ్ధాస్మి మృతాస్మ్యపహతాస్మిచ. 44
మృణాలేఇవపత్యూర్మే లూనేద్వేఅపిజానునీ
ఇత్యుక్త్వాసాతదాలోక్య భర్తుర్భావభయాతురా. 45
లతాపరశుకృత్తేవ మూర్ఛితాభువి సాఽపతత్

"అహా! ఈ సింధురాజు శిలాపట్టమువలె దృఢమగు వక్షస్థలమును, స్థూలమగు మస్తకమును నాపతిని వజ్రసమమగు బాణముతో గొట్టి కూల్చివైచినాడు. ఈ మహారాజు మరల తెప్పరిల్లి, రథము నెక్కుచున్నాడు. ఆహా! సింధురాజు మరల భుజములు తెగగొట్టినాడు. నాభర్త శరీరమునుండి రక్తముకారు, నయ్యది పద్మరాగపర్వతమువలె నగపడుచున్నది. ఆహా! కష్టము! కష్టము! క్రకచము వృక్షమును ఛేదించునట్లు, సింధుని ఖడ్గము నాభర్తయొక్క మోకాళ్లను తెగగొట్టినది! అహా! చచ్చితిని. నాప్రాణ మూడినది! అతని జానువులు మృణాలనాళములవలె తెగినవి" అని పల్కుచు, భర్తనుగాంచి భయాతురయై ఆమె మూర్ఛనంది, పరశుచ్ఛిన్నలతవలె నేలపైకూలెను.

విదూరథోఽపినిర్జానుః ప్రహరన్నేవనిద్విషి. 46
పపాతస్యందనస్యాథ శ్ఛిన్నమూలఇవద్రుమః
పతన్నేవై షసూతేన రథేనై వాపవాహితః 47
యదాతదాహతింతస్య కంఠేఽదాత్సింధురుద్ధతః
అర్ధవిచ్ఛిన్నకంఠోఽసౌ వనుయాతోఽథసింధునా. 48
స్యందనేనావిశత్సద్మ పద్మం రవికరోయథా
సరస్వత్యాః ప్రభావాఢ్యం తత్ర ప్రవేష్టుమసౌ గృహమ్
నాశకన్మశకోమత్తో మహాజ్వాలోదరంయథా. 49

మొదలునతికిన చెట్టువలె, జానుహీనుడగు విదూరథుడుగూల, వెంటనే సారథి రథమున అతని నెక్కించుకొని, కొనిపోయెను. కాని, సింధురాజు అడుదెంచి అతని కంఠమును నరకెను. కంఠహీనుడగు విదూరథుడు సూర్యకిరణములు పద్మమును ప్రవేశించునట్లు, సారథివలన ఇంట ప్రవేశింప జేయబడెను. దోమ నిప్పున జొరలేనట్లు, సరస్వతీ ప్రభానురక్షితమగు ఆ గృహమును సింధురాజు ప్రవేశింపజాలక పోయెను.

ఖడ్గావకృత్తగలగర్తగలత్సవాత
రక్తచ్ఛటాఛురితవస్త్రతనుత్రగాత్రమ్
తత్యాజ తం భగవతీమభితోగృహాంతః
సూతః ప్రవేశ్యమృతితల్పతలేగతోఽరిః. 50

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
విదూరథమరణ వర్ణనంనామ పంచాశత్తమః సర్గః ॥ 50 ॥

అప్పుడు, ఛిన్నగళదేశమునుండి రక్తధారలు ఒలుక, విదూరథుని వస్త్రములును అవయవములును, తడసిపోయెను. సారథి అతనిని సరస్వతి కట్ట ఎదుట, మరణశయ్యమీదనుంచెను. సింధురాజు, వెనుదిరిగిపోయెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు లీలోపాఖ్యానమున
విదూరథ మరణవర్ణనమను పంచాశ సర్గము. ॥ 50 ॥

## ఏకపంచాశత్తమః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

హతోరాజాహతోరాజా ప్రతిరాజేనసంయుగే
ఇతిశబ్దేసముద్భూతే రాష్ట్రమాసీద్భయాకులమ్. 1



భాండోపస్కరభారాఢ్యం విద్రవచ్ఛకటవ్రజమ్
సాక్రందాత్తకలత్రాఢ్యం ద్రవన్నాగరదుర్గమమ్. 2
పలాయమానసాక్రందం మార్గాహృతవధూగణమ్
అన్యోన్యలుంఠనవ్యగ్ర లోకలగ్నమహాభయమ్. 3
పరరాష్ట్రజనానీక తాండవోల్లాససారవమ్
నిరధిష్ఠితమాతంగ హయవీరపతజ్జనమ్. 4
కపాటపాటనోడ్డీన కోశాంతరవఘర్ఘరమ్
లుంఠితాసంఖ్యకౌశేయ ప్రావృతాభిభటోద్భటమ్. 5
ఛురికోత్పాటితార్ద్రాంత్ర మృతరాజగృహాంగనమ్
రాజాంతఃపురవిక్రాంత చండాలశ్వపచోత్కరమ్. 6
గృహాపహృతభోజ్యాన్న భోజనోన్ముఖపామరమ్
సహేమహారవీరౌఘ పాదాహతరుదచ్ఛిశు. 7
అపూర్వతరుణాక్రాంత కేశాంతఃపురికాంగనమ్
చోరహస్తచ్యుతానర్ఘ్య రత్నదంతురమార్గగమ్. 8
హాయేభరతసంఘట్ట వ్యగ్రసామంతమండలమ్
అభిషేకోద్యమాదేశపరమంత్రిపురఃసరమ్ 9
రాజధానీవినిర్మాణ సారంభస్థపతీశ్వరమ్
కృతవాతాయనశ్వభ్ర నిపతద్రాజవల్లభమ్. 10
జయశబ్దశతోద్ఘోష సింధురాజన్యనిర్భరమ్
అసంఖ్యనిజరాజౌఘ ధృతసింధుకృతాస్థితి. 11
గ్రామాంతరసమాక్రాంత విద్రవద్రాజవల్లభమ్
మండలాంతరసంజాత నగరగ్రామలుంఠనమ్. 12
అనంతచోదయోపార్థ రుద్ధమార్గగమాగమమ్
మహానుభావవైధుర్య సనీహారదినాతపమ్ 13
మృతబంధుజనాక్రందైర్మృతతూర్యరవైరపి
హాయేభరథశబ్దైశ్చ పిండగ్రామ్యాఘనధ్వని. 14

వసిష్ఠుడు:—సింధురాజు 'విదూరథుడు చంపబడినాడు' అని కేకలు వేయుచుండ ఆరాష్ట్రమత్యంతభయంకరమయ్యెను. ద్రవ్యములతో నిండిన బళ్లు, పరుగిడసాగెను. ఆర్తలగు స్త్రీలు ఆక్రందన మొనర్పసాగిరి. నగరవాసులు పరుగెత్తుచు, దారిలేకుండచేసిరి. ఏడ్చుచు పరుగెత్తు వధువులు అపహరింప బడుచుండిరి. జనులు మహాభయంకరమగురీతి, ఒకరినొకరు దోచుకొనసాగిరి. సింధురాజు సైనికులు ఉల్లాసముగ కేకలిడుచు, నృత్యమొనర్పసాగిరి. యజమానులులేని ఏనుగులు, గుఱ్ఱములు ధ్వనులనొనర్పసాగెను. కవాటభేదన శబ్దములు భయంకరముగ వినవచ్చుచుండెను. దస్యులు, ధనాగారముల

దోచుకొని, తత్పాలకులగుభటులు మోయును వస్త్రములతో గప్పుకొని పారిపోవుచుండ, వారి వెంట బడుచుండిరి. వారు అంతఃపురమునుజొచ్చి, రాజాంగనల ఆభరణముల ఒలుచుకొనిపోవుచుండిరి. చండాలురు, శ్వపచులు రాజాంతఃపురమున విశ్రమింపసాగిరి. పామరులు రాజగృహమునుండి భక్ష్యములను దొంగిలించి, తినసాగిరి. దస్యులు రాజశిశువులపాదములమీద గొట్టి వారి హేమహారము లను గైకొనుచుండ, అసహాయులగు వారేడ్చుచుండిరి. తరుణులు అంతఃపుర స్త్రీలకేశములను బట్టు కొని ఈడ్చుచుండిరి. చోరులుగొనిపోవు రత్నములు జారి క్రిందబడి మార్గమును నించివుంచెను. సామంతులు తప్పిపోయినయేనుగులను, గుఱ్ఱములను, రథములను వెదకి, ఒకచోట చేర్చి, ఉంచుచుండిరి. సింధురాజు మంత్రులు అభిషేకప్రయత్నముల నొనర్పదొడగిరి. ప్రధానశిల్పులు రాజధానిని నిర్మింప సాగిరి. రాజపురుషులు నూతననగరమునుజూడ, వాతాయనముల గూర్చును చుండిరి. సింధురాజు పుత్రునకభిషేకమొనర్ప జయశబ్దముద్ఘోషిత మవదొడంగెను; అతని సామంతులు రాష్ట్రమర్యాదను శిరసావహింపజొచ్చిరి. గ్రామాంతరమున ప్రచ్ఛన్నులై యుండిన విదూరథుని బంధుగులుగూడ ఆక్ర మింపబడుచుండిరి; ఆ మండలముననున్న గ్రామములన్నియు దోచుకొనబడుచుండెను. దొంగలు పెక్కుమంది చౌర్యాభిలాషతో దారినడ్డగించియుండిరి. మహానుభావుడగు విదూరథుని మృతికి వగచి పగటిఎండగూడ నీహారమయమైనట్లుండెను. మృతుల బంధుజనుల ఆక్రందనములు, శత్రువుల ఆనందతూర్యరావము, హస్త్యశ్వరథముల ధ్వనులనుగలసి, పిండాకృతిని దాల్చినట్లుండెను.

సింధుదేవో జయత్యేక చ్ఛత్రభూమండలాధిపః
ఇత్యనంతరమారేభే భేర్యః ప్రతిపురం తదా. 15

ఏకచ్ఛత్రభూమండలాధిపుడగు సింధురాజునకు జయమగుగాక! అని భేరిధ్వనులు మ్రోయ దొడగెను.

రాజధానీం వివేశాథ సింధురుద్ధురకంధరః
ప్రజాః స్రష్టుం యుగస్యాంతే మనుర్జగదివాపరః. 16

యుగాంతమున మరల సృష్టింపనింకొక మనువరుదెంచునట్లు, పుత్రాభిషేకానంతరము ఉన్నతకంధరుడగు సింధుడు స్వరాజధానిని బ్రవేశించెను.

ప్రవృత్తా దశదిగ్భ్యోఽథ ప్రవేష్టుం సైంధవంపురమ్
కరాః కరిహయాకారా రత్నపూరా ఇవాంబుధిమ్. 17

రత్నములు సముద్రమును బ్రవేశించునట్లు, నాలుగుమూలలనుండి హస్త్యశ్వరూపకములగు అప్పనములువచ్చి, సింధునిరాజధాని బ్రవేశింపదొడగెను.

నిబంధనాని చిహ్నాని శాసనాని దిశం ప్రతి
క్షణాన్నివేశయామాసుర్మండలం ప్రతి మంత్రిణః. 18

మంత్రులు వెంటనే నలుదిక్కుల రాజనామాంకితములగు చిహ్నములను, శాసనములను, నియమములను, స్థాపింపసాగిరి.

ఉదభూదచిరేణైవ దేశే దేశే పురే పురే
జీవితే మరణే మానే నియమోఽయమతో యథా. 19



ప్రతిదేశముననుు నగరముననుు వెంటనే యమకఠోరములగు శాసనములు నియమింపబడెను.

అథ శేముర్నిమేషేణ దేశోపప్లవవిభ్రమాః
ప్రశాంతోత్పాతపవనాః పదార్థావృత్తయో యథా. 20

పెనుగాలితగ్గిన తృణపర్ణాదుల ఆవర్తనశాంతించునట్లు, నిముషములో కఠోరనియమములజేసి దేశోపద్రవము శాంతించెను.

సౌమ్యతామాజగామాశు దేశో దశదిగన్వితః
క్షీరోదః క్షుభితావర్తో ప్రాగివోద్ధృతమందరః. 21

మంథనానంతరము నిర్మందరమొనర్పబడిన క్షీరోదధివలె, దిక్కులు ప్రశాంతములయ్యెను.

వపురలకచయాన్ విలోలయంతో
ముఖకమలాలికులాని సైంధవీనామ్
జలలవవలనాకులాః సమీరా
అశివగుణానివ సర్వతః క్షణేన. 22

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
సింధురాష్ట్రవర్ణనం నామ ఏకపంచాశత్తమః సర్గః ॥51॥

అప్పుడు జలకణయుతములగు వాయువులు, సింధుస్త్రీల ముంగురులను మోము - తుమ్మెదలను గదల్చుచు, సంతాపదౌర్గంధ్యాది అమంగళ గుణములను బాపుచు, వీచెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు లీలోపాఖ్యానమున
సింధురాష్ట్రవర్ణనమను ఏకపంచాశ సర్గము ॥ 51 ॥

## ద్విపంచాశత్తమః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఏతస్మిన్నంతరే రామ లీలోవాచ సరస్వతీమ్
శ్వాసావశేషమాలోక్య మూఢం భర్తారమగ్రగమ్. 1
ప్రవృత్తో దేహముత్సృష్టుం మద్భర్తాయమిహాంబికే

వసిష్ఠుడు:– రామా! ఇట లీల శ్వాసమాత్రావశిష్టుడును, మూర్ఛితుడును నగు భర్తనుగాంచి సరస్వతీదేవితో నిట్లనియెను:— "అంబా! నాభర్త ఇప్పుడు ప్రాణమును బరిత్యజింపనున్నాడు;

**జ్ఞప్తిరువాచ:—**

ఏవంరూపమహారంభే సంగ్రామే రాష్ట్రసంభ్రమే. 2
సంపన్నేఽపిస్థితేఽప్యుచ్చై ర్విచిత్రారంభమంథరే
నకించిదపిసంపన్నం రాష్ట్రం నచమహీతలమ్. 3
నస్థితంక్వచనాప్యేవం స్వప్నాత్మకమిదంజగత్
తస్యతన్మండపస్యాంతః శవస్యనికటాంబరే. 4
ఇదంభూరాష్ట్రమాభాతి భర్తృజీవస్య తేఽనఘే
అంతఃపురగృహాంతే తదిదం రాష్ట్రాన్వితోదరమ్. 5
వసిష్ఠవిప్రగేహేఽంతర్వింధ్యాద్రి గ్రామకే స్థితమ్
వసిష్ఠవిప్రగేహేఽంతః శవగేహజగత్స్థితమ్. 6

జ్ఞప్తి:- నీవుగాంచిన ఈ అద్భుత సంగ్రామము, రాష్ట్రవిప్లవము మున్నగునవి వాస్తవములు కావు; ఈ స్వప్నజగత్తున స్థిరమగునదేదియును లేదు. నీభర్తయొక్క ఈ రాజ్యము పద్మ-గృహాకాశమునను, అయ్యది వసిష్ఠ - గృహాకాశమునను వెలయుచున్నది.

శవగేహజగత్కుక్షా విదంగేహజగత్స్థితమ్
ఏవమేవమహారంభో జగత్త్రియమయోభ్రమః. 7
త్వయామయాఽనయాఽనేన సంయుక్తఃసార్ణవావనిః
గిరిగ్రామకదేహాంత ర్మధ్యేగగనకోశకే. 8

వసిష్ఠబ్రాహ్మణుని శవమున్నచోటనే పద్మని సంకల్పజగత్తును, మరల అచ్చోటనే విదూరథుని బ్రహ్మాండమును ఉన్నవి. నీవు, నేను, ఈ లీల, విదూరథుడు, సాగరయుతమగు అవనీమండలము మున్నగునవన్నియు గిరిగ్రామ - గృహాకాశముననే వెలయుచున్నవి.

స్వాత్మైవకచతివ్యర్థో నకచత్యేవవాక్వచిత్
తత్పదంపరమంవిద్ధి నాశోత్పాదవివర్జితమ్. 9
స్వయంకచితమాభాతం శాంతంపరమనామయమ్
కిలమండపగేహేఽంతః స్వస్వభావోదితాత్మని. 10

స్వీయమగు ఆత్మయే ఒకొక్కప్పుడు వ్యర్థముగ ప్రకాశించుచుండును. మరొకప్పుడెచ్చోటను ప్రకాశమునందదు. ఈ ఆత్మయే ఉత్పత్తి వినాశరహితమగు ఆత్మయని గ్రహింపుము. ఆఆత్మయే మండపాంతర గృహమున నుదయించినది.

ఏవమారంభఘనయోరపి మండపయోస్తయోః
ఉదరేశూన్యమాకాశ మేవాస్తి నజగద్భ్రమః. 11

ఆ మండపద్వయ మధ్యముననున్న ఆకాశము, పైన జరిగిన కార్యములకు కారణమైనను, శూన్యమే. జగత్తు వాస్తవమునకు లేదు; అయ్యది భ్రమయే.

భ్రమద్రష్టురభావేహి కీదృశీభ్రమతాభ్రమే
నాస్త్యేవభ్రమసత్తాతో యదస్తితదజంపదమ్. 12



భ్రమను గాంచువాడే లేకున్న, మరల భ్రమవిషయకమగు భ్రమ ఎట్లు కలుగగలదు? అందువలన భ్రమకు సత్తయే లేదు; కేవలమూ ఉత్పత్తిరహితమగు పరమపదము (ఆత్మ) ఒక్కటియే యున్నది.

భ్రమోదృశ్యమసత్తస్య ద్రష్టృదృశ్యదశాకుతః
ద్రష్టృదృశ్యక్రమాభావా దద్వయంసహజం హి తత్. 13

ద్రష్టృవ్యాపార ఫలాధారమే దృశ్యము. ద్రష్ట తనయందే కార్యమును, కర్తృకర్మవిరోధ కారణమున, కల్పించుకొనజాలడు. అందువలన ద్రష్టృదృశ్యముల అభావము సహజముగనే సిద్ధించుచున్నది.

తత్పదంపరమంవిద్ధి నాశోత్పాదవివర్జితమ్
స్వయంకచితమాభాతం శాంతమాద్యమనామయమ్. 14

జనన మరణరహితమును, స్వయంప్రకాశమును, శాంతమును, ఆద్యమును, అనామయమును నగునదే పరమపదమని గ్రహింపుము.

కిలమండపగేహాంతః స్వస్వభావోదితాత్మని
విహరంతి జనాస్తత్ర స్వగేహేస్వవ్యవస్థయా. 15

ఆ మండప గృహవాసులగు జనుల ఆత్మ వారివారి స్వభావము ననుసరించియే స్ఫురించినది. వారి వారి కనుకూలమగు స్థితియందే సంచరించుచున్నారు.

నజగత్తత్రనోసర్గః కశ్చిదప్యనుభూయతే
తేనాహమజమాకాశం జగదిత్యేవవర్తతే. 16

దానియందు జగత్తుగాని సృష్టిగాని తత్త్వజ్ఞులచే అనుభవింపబడుటలేదు; అందువలన జగత్తు అజమును ఆకాశస్వరూపమునునగు పరబ్రహ్మముకంటె అన్యముకాదు.

సర్వంశూన్యాత్మవిజ్ఞానం మేర్వాదిగిరిజాలకమ్
నేదం కుడ్యమయంకించి ద్యథాస్వప్నే మహాపురమ్. 17

దృశ్యములగు మేర్వాదిగిరులన్నియు అజ్ఞానమునుండియే విజృంభించినవి. స్వప్నదృష్ట మహానగరము వాస్తవమునకు కుడ్యరహితమైనట్లు, ఇవియును శూన్యాత్మకములే.

దేశేప్రాదేశమాత్రేఽపి గిరిజాలమయాన్యపిచ
వజ్రసారాణిఖాన్యేవ లక్షాణిజగతోవిదుః. 18

మనుజుల కంఠహృదయమధ్య పరిమితమగు ఆకాశమున, ఆత్మచైతన్యము పర్వతమయమగు జగత్తును గాంచుచున్నది.

జగంతి సుబహూన్యేవ సంభవంత్యణుకేఽపిచ
కదలీపల్లవానీవ సన్నివేశేన భూరిశః. 19

అట్లే, అణుపరిమితమగు చోటకూడ, నానాకారములగు జగత్తు అరటిసారగులవలె నిమిడియున్నవి.

త్రిజగచ్చిదణావంతరస్తిస్వప్నపురంయథా
తస్యాత్యంతశ్చిదణవస్తేష్వప్యేకైకశోజగత్ 20.

స్వప్నపురములవలె, చిదణువున ఈ జగత్తు లిమిడియున్నవి; ఆ జగత్తున మరల చిదణువును, చిదణువున నింకొక జగత్తును నిమిడియున్నవి.

తేషాంయస్మిన్ జగత్యేష పద్మోరాజాశవస్థితః
లీలాతవసపత్నీయం ప్రాప్తాపూర్వతరాశుభే. 21

యద్దైవమూర్ఖామాయాంతా లీలేయంపురతస్తవ
తద్దైవభర్తుఃపద్మస్య శవస్యానికటేస్థితా. 22

ఇట్టి జగత్తులలో నొకటియగు ఈ జగత్తున పద్ముని శవమున్నది. నీసపత్నియగు లీల అటకతేగినది. ఈ లీల నీయందు మూర్ఛవండనప్పుడే పద్ముని జీవము శవముకడ కతేగినది.

**లీలోవాచ:—**

కథమేషాపురాదేవి సంపన్నాతత్రదేహినీ
కథంచతత్సపత్నీక భావమాప్తవతీస్థితా. 23

తేచాస్యావదకింరూపం పశ్యంత్యథవదంతి కిమ్
తద్గేహావరవాస్తవ్యాః సమానేనేతి మే వద. 24

లీల:– దేవీ! ఈమె అట నెట్లు దేహమును ధరించినది. నే నామెకెట్లు సపత్నినైతిని, పద్ముని గృహజను లామెనెట్లు జూచుచున్నారు. వారేమనుచున్నారు? — నాకు జెప్పుము.

**శ్రీ దేవ్యువాచ:—**

శృణుసర్వంసమాసేన యథాపృష్టంవదామి తే
లీలే లీలాస్వవృత్తాంతమంతదం దృశ్యదుర్దశమ్. 25

శ్రీదేవి:– లీలా! నీ వడిగినదానిని జెప్పుచున్నాను, వినుము. స్వవృత్తాంతమును మరణాంతర దుర్దశను గ్రహింపగలవు.

పద్మస్తవ స భర్తైష భ్రాంతిం తావత్తతామిమామ్
ఇయంజగన్మయీతస్మిన్నేవసద్మనిపశ్యతి. 26

విదూరథరూపియును, నీ భర్తయునగు పద్ముడు ఆ శవగృహముననే, ఈ జగద్భ్రాంతిని దర్శించుచున్నాడు.

భ్రాంతియుద్ధమిదంయుద్ధమేషాభ్రాంతిర్జనోఽజనః
భ్రాంత్యైవాస్తీహమరణమేషచైవంభ్రమాత్మకః. 27

ఈ యుద్ధము, జనులు మరణముమున్నగునవన్నియును (స్వప్నయుద్ధమువలె) భ్రాంతిమంతములు. (వాస్తవమున ఈ జనులందరును జన్మాది వికారరహితమగు ఆత్మస్వరూపులే.)



భ్రమక్రమేణానేనైవ లీలాస్యదయితాస్థితా
త్వంచైషాచవరారోహే స్వప్నమాత్రం వరాంగనే. 28

భ్రాంతివలననే లీల ఇతని భార్యయైనట్లు కనబడినది. నీవును, ఆమెయుగూడ, స్వప్నమువలె, మిథ్యలే.

యథాభవత్యావేతస్య స్వప్నమాత్రంవరాంగనే
తథాభవత్యోర్భర్తైష తథైవాహమపిస్వయమ్. 29

ఇదంతయు నీ భర్తకు స్వప్నమైనట్లు, మీకుగూడ ఇవంతయును, నేనునుకూడ స్వప్నమేయని గ్రహింపుము.

జగచ్ఛోభైవేదృశీయం దృశ్యమేతదిహోచ్యతే
ఏతదేవపరిజ్ఞాతం దృశ్యశబ్దార్థముజ్ఝతి. 30

ఈ జగత్తు ఇట్లు ప్రతిభాసించుచుండుటవలన, దృశ్యమని చెప్పబడుచున్నది. ఈ తత్త్వమును గ్రహింపగల్గిన దృశ్యత్వము నష్టమైపోవును.

ఏవమేషాత్వమేషాచ సంపన్నైవమసౌనృపః
అహంచాత్మనిసత్యత్వం గతాసర్వతయాత్మనః. 31

ఈ ఆత్మయొక్కటియే సంపూర్ణ సత్యము; దీని నాశ్రయించియే, నీవును, నేనును, ఈ రాజును విజృంభించితిమి.

ఇమేవయమిహాన్యోన్యం సంపన్నాశోచ్ఛదితాఇతి
ఇత్థంసర్వాత్మకతయా మహాచిద్ఘనసంస్థితేః. 32

ఏవమేషాస్థితారాజ్ఞీ హరిహాసవిలాసినీ
లీలావిలోలవదనా నవయౌవనశాలినీ. 33

పేశలాచారుమధురా మధురోదారభాషిణీ
కోకిలాస్వరసంకాశా మదమన్మథమంథరా. 34

అసితోత్పలపత్రాక్షీ వృత్తపీనపయోధరా
కాంతాకాంచనగౌరాంగీ పక్వబింబఫలాధరా. 35

త్వత్సంకల్పాత్మకస్యైషా యదాభర్తుర్మనఃకలా
తదాత్వత్సదృశాకారా స్థితైషాచిచ్చమత్కృతా. 36

త్వద్భర్తుర్మరణేక్షిప్రం సమనంతరమేవహి
త్వద్భర్త్రైషాపురోదృష్టా త్వత్సంకల్పాత్మనామునా. 37

ఈ రాజు మున్నగువారును, మనమును ఆత్మనుండియే జన్మించియున్నట్లు, సుహాసినియును విలాసినియును, చంచలవదనయును, నవయౌవనశాలినియును, కోమలోదారస్వభావయును, మధుర[illegible]సినియును, కోకిలస్వరయును, మన్మథ మదమందగతియును, ఉత్పలనేత్రయును, పీనపయో[illegible]

కాంచన గౌరాంగియును, బింబాధరయును, రాజమహిషియునునగు లీలగూడ నట్టే ఉత్పన్నయై యున్నది. ఈమె పద్మని మనోవృత్తివలన నుద్భవించినది. నీభర్త మరణించిన వెంటనే ఆతని చిత్తము లీలాకృతిని దాల్చ, అందుండియే ఈ లీల వెలువడినది. ఆతని సంకల్పముననుసరించియే ఆతడు నిన్ను బోలు లీలను బయటగాంచగల్గినాడు.

యదాధిభౌతికంభావం చేతోఽనుభవతిస్వయమ్
చేత్యంసన్మయమేవాత ఆతివాహికకల్పనమ్. 38

చిత్తమాధిభౌతికభావమును దాల్చునప్పుడు ఆధిభౌతికభావమును పరమార్థ సత్యమనియు, ఆతివాహికమును కల్పనయనియు దలపోయును.

యదాధిభౌతికంభావం చేతోవేత్తినసన్మయమ్
అతివాహికసంకల్ప స్తదాసత్యోవజాయతే 39

అధిభౌతిక భావమును మిథ్యయని తలచునప్పుడు, ఆతివాహిక భావమేసత్యమై వెగడును.

అథోమరణసంవిత్త్యా పునర్జన్మమయేభ్రమే
త్వంహి సంవిదితానేన త్వయాచగతఏవసః. 40

నీభర్త మరణమూర్ఛానంతరము పునర్జన్మభ్రమయందుపడి, వాసనారూపిణియగు, లీలను బొందినాడు. అందువలన నీవే ఆలీలవై యున్నావు.

ఇత్థంత్వాందృష్టవానేష దృష్టశ్చైషత్వయేతిచ
త్వమప్యాత్మనిసంపన్నా సర్వగత్వాచ్చిదాత్మనః. 41

చిదాత్మ సర్వగతమగుటవలన, నీవుగూడ వాసనామయమగు మరొకశరీరమును, నిన్ను బోలినదానిని, గాంచితివి. ఆ లీలగూడ, నిన్ను గాంచగల్గినది.

బ్రహ్మసర్వగతంయస్మాద్యథాయత్రయదోదితమ్
భవత్యాశుతథాతత్ర స్వప్నశక్త్యైవపశ్యతి. 42

సర్వగమగు బ్రహ్మవస్తువెచ్చట, ఏ రూపమగు వాసనలు గలుగుచుండునో, అచ్చట ఆ తీరుగనే, స్వప్నమువలె, గాంచబడుచుండును.

సర్వత్రసర్వశక్తిత్వా ద్యత్రయాశక్తి రున్నయేత్
ఆస్తేతత్రతథాభాతి తీవ్రసంవేగహేతుతః. 43

ఆత్మ సర్వవ్యాపియును, సర్వశక్తియుతమును నై యున్నది. దృఢవాసనాబలానుసారము కనబడుచు, ప్రకాశింపబడుచు, వెలయుచుండును.

మృతిమోహాత్క్షణేనైవ యదేతౌదంపతీస్థితౌ
తదైవాభ్యామిదం బుద్ధం ప్రతిభాసవశాద్ధృది. 44
ఆవయోఃపితరావేతౌ విమేవై చాపిమాతరౌ
దేశఏషధనంచేదం కర్మేదంపూర్వమీదృశమ్. 45



ఆవాంవివాహితావేవ మేవంనామైకతాంగతౌ
ఏతయోఃసాపిజనతా యాతాతత్రైవసత్యతామ్. 46

ఈదంపతులిర్వురును మరణమూర్ఛానంతర మిట్లు బుద్ధిబలమున సంకల్పించుకొనిరి. 'వీరు మాతల్లిదండ్రులు, ఇది మాదేశము, ఇవి మాధనము, ఇది మాకర్మ, మేము ఇట్లు వివాహమొనర్చుకొని ఏకమైతిమి, వీరు మాపరిజనులు.'

తథైవాత్రాస్తిదృష్టాంతః ప్రత్యక్షంస్వప్నవేదనమ్
ఇత్యేవంభావయా లీలేలీలయాహమథార్చితా. 47
నాహంస్యాంవిధవేత్యేవం వరోదత్తోమయాప్యసౌ
ఇత్యర్థేనమృతాపూర్వ మేవేహ ఖలుబాలికా. 48

లీలా! ఈవిషయమున సంగతమగు దృష్టాంతము స్వప్నము. ఈలీల, నన్నర్చించి, 'నేను విధవ నవకుందునుకాక!' అని ప్రార్థించినది. నేనీవరము నిచ్చితిని. అందువలన ఈబాల భర్తమరణింపక మున్నే మరణించినది.

భవతాంచేతనాంశానామహం చేతనధర్మిణీ
కులదేవీసదాపూజ్యా స్వతఏవకరోమ్యహమ్. 49

నేను మీ చేతనాంశమును చేతితమొనర్చు కులదేవిని, పూజ్యురాలను. నాస్వభావ మిట్టిదే.

అథాస్యాజీవకోదేహాత్ప్రాణ మారుతరూపధృక్
మనసాచలతాంప్రాప్తో ముఖాగ్రత్యక్తదేహకః. 50
తతోమరణమూర్ఛాంతే గృహేఽస్మిన్నేవచైతయా
బుద్ధాభావితఆకాశే దృష్టోజీవాత్మనా తతః. 51

పిదప, ఆలీలయొక్క జీవము ప్రాణముతోగలసి, దేహమునుండి వెలువడినది. మరణ మూర్ఛానంతరము ఆమె, స్వసంకల్పానుసారము, చిత్తాకాశమున అనుభవింపదొడగినది.

సంపన్నైషా హరిణనయనా చంద్రబింబాననశ్రీ
ర్మానోన్నద్ధాదయితలలితా కాంతమాభోక్తుకామా
పూర్వస్మృత్యానరభసముఖీ సంయుతా మండలాంతః
స్వప్నాంతేవాఽప్రకృతివిభవా పద్మినీచోదితేవ. 52

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
మరణసమనంతర దేహప్రతిభా వర్ణనంనామ ద్విపంచాశత్తమః సర్గః ॥ 52 ॥

అనంతరము హరిణనయనయును, చంద్రవదనయునునగు ఆలీల, సూర్యకిరణవికసితమగు పద్మమువలె, పూర్వవాసనలననుసరించి, వికాసమునంది, మనోహరుడగు భర్తననుభవింప, పూర్వస్మృతి ననుసరించి పద్మగృహమండపమున కఱిగి, ఆతనిని గలసికొనెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు లీలోపాఖ్యానమున మరణసమనంతర దేహప్రతిభావర్ణనమను ద్విపంచాశ సర్గము ॥ 52 ॥

—:0:—

## త్రిపఞ్చాశత్తమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అథలబ్ధవరాదేహేనానేనైవ మహీపతిమ్
పతిమాప్తుంప్రయాత్యేషా నభోమార్గేణవిష్టపమ్. 1
ఇతిసంచింత్యసానంద ముద్దామమకరధ్వజా
పుష్పవేపేలవాకారా పక్షిణీవ నభస్తలే. 2
కుమారీంతత్రసాప్రాప జ్ఞప్త్యైవ ప్రహితాంహితామ్
స్వసంకల్పమహాదర్శాత్పురతో నిర్గతామివ. 3

వసిష్ఠుడు:— అనంతరము వరమునుబొందినలీల ఆవాసనామయ దేహముననే పద్మునిభర్తగా నంద, ఆకాశమున నరుగసాగెను. భర్తనుబొందు ఆనందమున కామాతురయై కోమలాకారముగు పక్షివలె ఆకాశమున నెగురసాగెను. అట నామె జ్ఞప్తిదేవివలన బంపబడిన, స్వకన్యకనుగాంచెను; ఆమె లీలాదేవియొక్క సంకల్పదర్పణమునుండి జనించినదానివలెనుండెను.

కుమార్యువాచ:—

దుహితాస్మినఖిజ్ఞప్తేః స్వాగతంతేఽస్తుసుందరి
ప్రతీక్షమాణాత్వామేవ స్థితాస్మీహ నభఃపథి. 4

కుమారి:— జ్ఞప్తిసహచరీ! నేను నీబిడ్డను. సుందరీ! నీకు స్వాగతమగుగాక! నేను ఈ ఆకాశపథమున నీకొఱకై వేచియున్నాను.

లీలోవాచ :—

దేవిభర్తుః సమీపంమాం నయ నీరజలోచనే
మహతాం దర్శనం యస్మాన్నకదాచననిష్ఫలమ్. 5

లీల:— దేవీ! పద్మలోచనా! (నీవు నాకంటె ముందు ఆరుడెంచియున్నావు; నీకు దారి తెలిసియేయున్నది. కాన,—) నన్ను నాభర్తకడకుగొనిపొమ్ము. గొప్పవారలదర్శనము వ్యర్థముకాదు.

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

ఏహితత్రైవగచ్ఛావ ఇత్యుక్త్వా సా కుమారికా
పురస్తస్యాఃస్థితావ్యోమ్ని మార్గదర్శనతత్పరా. 6
తతస్తదనుయాతా సా ప్రాప కోటరమంబరమ్
నిర్మలం కరమాలాగ్రం యథాలక్షణలేఖికా. 7



వసిష్ఠుడు:— 'రమ్మా! మనమటకరుగుదము,' అనివచించి ఆకుమారి ముందుగనరుగుచు, దారిని జూపసాగెను. శుభలక్షణసూచకములగు హస్తరేఖలు నిర్మలహస్తములను ప్రవేశించునట్లు, లీలయు ఆమెననుసరించి బ్రహ్మాండచ్ఛిద్రమగు అంబరతలమును ప్రవేశించెను.

మేఘమార్గమథోల్లంఘ్య వాతస్కంధాంతరేగతా
సూర్యమార్గాదభిగతా తారామార్గమతీత్యచ. 8
వాయ్వింద్రసురసిద్ధానాం లోకానుల్లంఘ్యలాఘవాత్
బ్రహ్మవిష్ణుమహేశానాం ప్రాపబ్రహ్మాండఖర్పరమ్. 9
హిమశైత్యంయథాంతస్థం కుంభేఽభిన్నే బహిర్వ్రజేత్
తథాసంకల్పసిద్ధాసా బ్రహ్మాండాన్నిర్గతాబహిః. 10

అనంతరము వారు మేఘపథమునుదాటి, వాయుమండలమును బ్రవేశించి, సూర్యమార్గమును దాటి, సూర్యమండలమునుండి తారాపథమునతిక్రమించి, వాయువు, ఇంద్రుడు, దేవతలు సిద్ధుల లోకములను అనాయాసముగదాటి, త్రిమూర్తులలోకములను అతిక్రమించి, బ్రహ్మాండఖర్పరమును జేరుకొనిరి. సంకల్పసిద్ధమగు లీల, హిమశైత్యము ఘటమునకు ఛిద్రములేకున్నను వెలుపలకు వచ్చునట్లు, బ్రహ్మాండమునుండి వెలువడెను.

స్వచిత్తమాత్రదేహైషా స్వసంకల్పస్వభావజమ్
అంతరేవానుభవతి కిలైవంనామవిభ్రమమ్. 11

చిత్తమాత్రదేహయగు లీలాదేవి సంకల్పప్రభవములగు ఈవిభ్రమములను నన్నిటిని, తన అంతరముననే అనుభవించుచుండెను.

బ్రహ్మాదిస్థానమాక్రమ్య ప్రాప్యబ్రహ్మాండఖర్పరమ్
తతోబ్రహ్మాండపారస్థా జలాద్యావరణానిచ. 12
సముల్లంఘ్యపురఃప్రాప మహాచిద్గగనాంతరమ్
అదృష్టపారపర్యంత మతివేగేనధావతా
సర్వతోగరుడేనాపి కల్పకోటిశతైరపి. 13

ఇట్లామె బ్రహ్మాదిలోకములనుదాటి, బ్రహ్మాండఖర్పరమునుబొంది, దానినిదాటి, జలాద్యావరణములను అధిగమించెను. మఱియు, గరుడుడుశతకోటికల్పములు వేగముగపరిగిడినను అంతుగాంచలేని చిదాకాశమును బొందెను.

తత్రబ్రహ్మాండలక్షాణి సంత్యసంఖ్యానిభూరిశః
తాన్యన్యోన్యమదృష్టాని ఫలానీవమహావనే. 14
తత్రైకస్మిన్పురఃసంస్థే వితతావరణాన్వితే
వేధయిత్వావివేశాంత ర్బదరంకృమికోయథా. 15

అట, ఉద్యానవనమున లెక్కకుమించినపండ్లుండునట్లు, అసంఖ్యాకములగు బ్రహ్మాండములు, ఒకదానికింకొకటి కనపడకుండనుండెను. అచ్చటనున్న బ్రహ్మాండములలో నొక్కదానిని ఛిద్రమొనర్చి, కీటకము రేగుపండును బ్రవేశించునట్లు, ప్రవేశించిరి.

పునర్బ్రహ్మేంద్రవిష్ణ్వాది లోకానుల్లంఘ్యభాస్వరాన్
తన్మహీమండలం శ్రీమత్ ప్రాపతారావథాదధః. 16
తత్రతన్మండలంప్రాప్య తత్పురంతచ్చమండపమ్
ప్రవిశ్యపుష్పగుప్తస్య శవస్యనికటేస్థితా. 17

మరల బ్రహ్మాదుల లోకములనుదాటి, ఆకాశమండలమునకు గ్రిందనున్న పద్ముని రాజ్యమును ప్రవేశించిరి. ప్రవేశించి, పద్ముని పురమునకరిగి, మండపమును ప్రవేశించి, శవమున్నచోటికి జేరుకొనిరి.

ఏతస్మిన్నంతరేసాచ న దదర్శకుమారికామ్
మాయామివపరిజ్ఞాతాం క్వాపియాతాం వరాననా. 18

ఇంతలో, నాపె కుమారికను మరల గాంచజాలకపోయెను. ఎఱుగబడినచో, మాయ ఎచ్చటికోపోవునట్లు, కుమారియు నెచ్చటికో అరిగెను.

ముఖమాలోక్యసాతస్య స్వభర్తుఃశవరూపిణః
ఇదంబుద్ధవతీసత్యం ప్రతిభావశతఃస్వతః 19
అయంసభర్తాసంగ్రామే నిహతోమమసింధునా
వీరలోకానిమాన్ప్రాప్య క్షణంశేతేయథాసుఖమ్. 20
అహందేవ్యాఃప్రసాదేన సశరీరైవమీదృశమ్
ఇహప్రాప్తవతీధన్యా మత్సమానాస్తికాచన. 21
ఇతిసంచింత్యసాహస్తే గృహీత్వాచారుచామరమ్
వీజయామాసచంద్రేణ ద్యౌరివావనిమండలమ్ 22

లీలాదేవి శవరూపియగు భర్తవదనమును గాంచి, తన ప్రతిభవలననే ఇట్లు గ్రహించెను:— ఇతడు నాభర్త, యుద్ధమున సింధునిచే జంపబడి, వీరలోకములను బొంది, ఇచ్చట సుఖముగ పరుండియున్నాడు. నేను దేవీప్రసాదమున ఈ శరీరముతోడనే, ఇచ్చటికి రాగలిగితిని. నన్నుబోలు అదృష్టవంతురాలు మరొకతె లేదు; ఇట్లు తలపోసి ఆపె చామరమునుగైకొని, ఆకాశము చంద్రునిగైకొని భూమికి వీచునట్లు, వీవసాగెను.

ప్రబుద్ధలీలోవాచ:—

తేభృత్యాస్తాశ్చవై దాస్యః సరాజాచప్రబుద్ధవాన్
వక్ష్యంతివదతాందేవి కింకథైవకథంధియా. 23

ప్రబుద్ధలీల:— దేవీ! పద్మునిదాసీగణము, భృత్యులు అచ్చటనుండిరికదా! వారరుదెంచిన లీలనుగాంచి ఏమనుకొనిరి? ఎట్లాచరించిరి?—వచింపుము.

శ్రీ దేవ్యువాచ:—

సరాజాసాచతేభృత్యాః సర్వఏవవరస్వరమ్
చిదాకాశైకతావేశా దావయోశ్చప్రభావతః. 24



మహాచిత్ప్రతిభాసత్వాన్మహానియతినిశ్చయాత్
అన్యోన్యమేవపశ్యంతి మిథఃసంప్రతిబింబితాత్. 25
ఇయంమేసహజాభార్యా మమేయంసహజాసఖీ
మమేయంసహజారాజ్ఞీ భృత్యోఽయంసహజోమమ. 26
కేవలంత్వమహంసాచ యథావృత్తమఖండితమ్
జ్ఞాస్యామఇదమాశ్చర్యం ననుకశ్చిదపీతరః. 27

శ్రీదేవి:—ఆ రాజును, లీలయు, భృత్యులును, పరమాత్మ సర్వవ్యాపకమగుటవలనను, మన ప్రభావమువలనను, చిత్ప్రతిభాసవలనను, నియతిప్రేరణవలనను, తమ్ము పరిచితులుగనే భావించుకొనుచున్నారు. రాజు భృత్యులను, భార్యలను, సఖులను, తనవారగనే భావించుకొనుచున్నాడు. నీవును, నేనును ఆ లీలయు ఈ ఆశ్చర్యవృత్తాంతమును గ్రహించియున్నాము. ఇతరు లెరుంగరు.

ప్రబుద్ధలీలోవాచ:—

అమునైవశరీరేణ కిమర్థం న గతా పతిమ్
ఏషావరేణసంప్రాప్తా లీలాలలితవాదినీ. 28

ప్రబుద్ధలీల:— దేవీ! మీ వరమునందిన లీల స్థూలశరీరముననే అటకరుగలేక పోయినదేమి?

శ్రీ దేవ్యువాచ:—

అప్రబుద్ధధియఃసిద్ధ లోకాన్పుణ్యావశోదితాన్
నసమర్థాఃస్వదేహేన ప్రాప్తుంఛాయాఇవాతపాన్. 29

శ్రీ దేవి:— నీడ ఎండను సమీపింపజాలనట్లు, అప్రబుద్ధులగువారు పుణ్యావశమునబొందిన సిద్ధలోకములకుస్థూలశరీరమున నరుగజాలరు.

ఆదిసర్గేచనియతిః స్థాపితేతిప్రబోధిభిః
యథాసత్యమలీకేన న మిలత్యేవకించన. 30

హిరణ్యగర్భాదులు సృష్ట్యాదియందే సత్యమసత్యముతో గలవదను నియమమొనర్చియున్నారు.

యావద్వేతాలసంకల్పో బాలస్యకిలవిద్యతే
నిర్వేతాలధియస్తావ దుదయస్తస్య కఃకథమ్. 31

బాలునకు మిథ్యారూపమగు బేతాళభ్రాంతియున్నను, తద్భ్రాంతి హీనులకు బేతాళుడగుపడడుకదా!

అవివేకజ్వరోష్ణత్వం విద్యతేయావదాత్మని
తావద్వివేకశీతాంశు శైత్యంకుతఉదేత్యలమ్. 32

ఆత్మయందు అవివేకజ్వరోష్ణమున్నంతవఱకు, వివేకచంద్రశైత్య మెట్లుదయింపగలదు?

అహంపృథ్వ్యాదిదేహాఃఖే గతిర్నాస్తిమమోత్తమా
ఇతినిశ్చయవాన్యోఽంతః కథంస్యాత్సోఽన్యనిశ్చయః. 33

'నేను పృథ్వ్యాదిభూతనిర్మితమగు దేహమును ధరించియున్నాను. నాకాకాశమున నరుగు సామర్థ్యములేదు' అని నిశ్చయించుకొనినవారు ఆకాశమున నెట్లరుగగలరు?

అతోజ్ఞానవివేకేన పుణ్యేనాథవరేణచ
పుణ్యదేహేనగచ్ఛంతి పరంలోకమనేనతు. 34

అందువలన జ్ఞానము, వివేకము, పుణ్యము, వరము, పుణ్యదేహముల శక్తివలన జనులు పరలోకమున కఱుగుచున్నారు.

శుష్కపర్ణంకేలాంగారే పతదేవాశుదహ్యతే
అయందేహమహాందేహః ప్రాప్త ఏవవిశీర్యతే. 35

శుష్కపర్ణములు నిప్పునబడిన దగ్ధమగునట్లు, ఆతివాహిక దేహము లభించిన వెంటనే స్థూల శరీరము దగ్ధమగుచున్నది.

ఏతావదేవభవతి వరశాపవిజృంభితైః
యథాసంచింత్యఏవాహం తథాస్మృతఇతిస్మృతిః. 36

వరశాపములుకూడ ప్రాక్తనవాసనలననుసరించియే జరుగుచున్నవి; ఇవి పూర్వకర్మలను స్మరింపజేయుచున్నవి.

యఃసర్పప్రత్యయోరజ్జ్వాం సకథంసర్పకార్యకృత్
ఆత్మన్యేవహియోనాస్తి తస్యకా కార్యకారితా. 37

రజ్జువున సర్పభ్రమకలుగుచున్నను నయ్యది, సర్పమువలె పనిచేయుచుండుటలేదు. స్వస్వరూపమునలేనట్టిది ఎట్లు కార్యమునొనర్పగలదు.

యస్త్వేతన్మృతఇత్యేవ మిథ్యానమనుభూయతే
ప్రాగభ్యాసస్యపుష్టస్య నామైతత్ప్రవిజృంభతే. 38

'ఇయ్యది మృతించినది' ఇట్టిదగు మిథ్యానుభవము పూర్వాభ్యాసవిజృంభణమే.

స్వానుభూతే జగజ్జాలే సుగమాః సంస్మృతిభ్రమాః
నాన్యసంకల్పితోనామ సర్గాద్యభ్యాస ఈదృశః. 39

స్వానుభూతములగు జగత్తులసంస్మృతిభ్రమ అనాయాసముగనే కలుగుచున్నది. ఇట్లు, సృష్టులన్నియును హిరణ్యగర్భునివలన సంకల్పింపబడుచున్నవి.

అంతరనుభూయమానాః సంసృతయో బాహ్యభూతజాలానామ్
అవిదితవేద్యదృశామపి దూరే పుంసామివైందవంబింబమ్. 40

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
లీలోపాఖ్యానే సంసృతివిదితవేద్యం నామ త్రిపంచాశత్తమః సర్గః ॥ 53 ॥

అజ్ఞుల అంతరముననే ఈసంసారస్మృతి ఉదయించుచున్నది. జలబింబితమగుచంద్రబింబము, జలముననున్నట్లే బోధయగునట్లు, ఈసంసారముకూడ అంతరముననే కల్పింపబడుచున్నది.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున
సంసృతివిదితవేద్యమను త్రిపంచాశ సర్గము. ॥ 53 ॥

---

## చతుష్పంచాశత్తమః సర్గః.

శ్రీ దేవ్యువాచ:—

తస్మాద్యే వేద్యవేత్తారో యేవా ధర్మంపరంశ్రితాః
ఆతివాహికలోకాంస్తే ప్రాప్నువంతీహ నేతరే. 1
ఆధిభౌతికదేహత్వం మిథ్యాభ్రమమయాత్మకమ్
కథంసత్యేస్థితింయాతి చ్ఛాయాస్తేకథమాతపే 2
లీలావిదితవేద్యానో పరమంధర్మమాశ్రితా
కేవలంతేనసాభర్తుః కల్పితంనగరంగతా. 3

శ్రీ దేవి:—తత్వజ్ఞులును, ధర్మపరులునునగువారే ఆతివాహిక లోకమునకఱుగగలరు; ఇతరులరుగజాలరు. మిథ్యయును, భ్రమమయమునునగు ఆధిభౌతికదేహము సత్యపదార్థము నెట్లాశ్రయించుకొని ఉండగలదు? — ఎండయందు నీడఉండగలదా! మన ఈలీల తత్వజ్ఞురాలు, పరమమగుధర్మమును బొందినది. అందువలననే భర్తృకల్పితమగు నగరమున కఱుగగలిగినది.

ప్రబుద్ధ లీలోవాచ:—

ఏవమేషాప్రయాతాస్తు భర్తాపశ్యమమాంబికే
ప్రవృత్తఃప్రాణసంత్యాగే కర్తవ్యంకిమిహాధునా. 4
భావాభావేషుభావానాం కథంనియతిరాగతా
కథంభూయో ప్యనియతిర్మృతిజన్మాదిసూచితా. 5
కథంస్వభావసంసిద్ధిః కథంసత్తాపదార్థగా
కథమగ్న్యాదిషూష్ణత్వం పృథ్వ్యాదా స్థిరతాకథమ్. 6
హిమాదిషుకథంశైత్యం కాసత్తాకాలఖాదిషు
భావాభావగ్రహోత్సర్గ స్థూలసూక్ష్మదృశఃకథమ్ 7
కథమత్యంతముచ్ఛ్రాయం తృణగుల్మనరాదికమ్
వస్తు నాయాత్యనిష్టేఽపి స్థితేస్వోచ్ఛ్రాయకారణే. 8

ప్రబుద్ధలీల:—నీ ఉపపాదన న్యాయమేయగుగాక! కాని, అంబా! నాభర్త ఇప్పుడు ప్రాణములను త్యజింపనున్నాడు. దీనినెట్లు సమర్థింతువు? సుఖదుఃఖాదిసూచకములగు అదృష్టదురదృష్టములేటీరున అరుదెంచి, మరలపోవుచున్నవి? స్వభావమెట్లు సిద్ధించుచున్నది? పదార్థముల సత్త ఎట్లేర్పడుచున్నది? అగ్నిమున్నగు పదార్థముల ఉష్ణత్వమును, పృథ్వ్యాది పదార్థముల స్థిరత్వమును, హిమాదిపదార్థముల శైత్యమును, ఆకాశము, కాలము మొదలగు పదార్థముల ఉనికి ఎట్లనుభూతములగుచున్నవి? వాస్తవములగు రజతాది పదార్థములగ్రహణమును, భ్రాంతములగు శుక్తిరజతాదుల త్యాగమును ఇంద్రియముల సూక్ష్మత్వమును, దృశ్యములును ఎట్లు సిద్ధించుచున్నవి? తృణగుల్మలతానరాది జీవముల నిమ్నోన్నతాకారము లెట్లేర్పడుచున్నవి?— వచింపుము.

శ్రీ దేవ్యువాచ:—

మహాప్రలయసంపత్తౌ సర్వార్థాస్తమయేసతి
అనంతాకాశమాశాంతం సద్బ్రహ్మైవావతిష్ఠతే. 9

శ్రీదేవి:- మహాప్రళయము ఘటిల్లిన, పదార్థములన్నియును వినష్టములై పోవును; అప్పుడు అనంతాకాశస్వరూపమును, శాంతమునునగు బ్రహ్మవస్తువొక్కటియే సద్రూపమున వెలయుచుండును.

తచ్ఛిద్రూపతయా తేజః కణోఽహమితిచేతతి
స్వప్నే సంవిద్యథా హి త్వమాకాశగమనాదిచ. 10

నీవు స్వప్నమున ఆకాశగమనాదులను అనుభవించునట్లు, ఆబ్రహ్మప్రకాశ స్వరూపములగు సూక్ష్మభూతములను తనయందనుభవించును.

తేజఃకణోఽసౌస్థూలత్వ మాత్మనాత్మనివిందతి
అసత్యమేవ సత్యాభం బ్రహ్మాండం తదిదం స్మృతమ్. 11

సూక్ష్మభూతరూపమునుదాల్చిన ఆబ్రహ్మవస్తువు, జలాద్యావరణరూపకమగు స్థూలత్వమును కల్పనాబలమునబొంది, ఈ పరిదృశ్యమాన బ్రహ్మాండస్వరూపమున గోచరించుచున్నది; ఇయ్యది వాస్తవమున కసత్యమయ్యు సత్యమువలె నగుపడుచున్నది.

తత్రాంతర్బ్రహ్మతద్వేత్తి బ్రహ్మాయమహమిత్యథ
మనోరాజ్యం సకురుతే స్వాత్మైవంతదిదం జగత్. 12

ఇట్లా బ్రహ్మవస్తువు బ్రహ్మాండమునందుండి, నేను హిరణ్యగర్భుడను అని చింతించి, మనోరాజ్యమును విస్తరింపజేయుచున్నది. ఈ మనోరాజ్యమే జగత్తనబడుచున్నది.

తస్మిన్ప్రథమతః సర్గే యాయథా యత్ర సంవిదః
కచితాస్తాస్తథాతత్ర స్థితా అద్యాపినిశ్చలాః. 13

సంకల్పవృత్తినియమములు సృష్ట్యాదియందున్నట్లే, ఇప్పుడుగూడ చెక్కుచెదరకుండ నిలిచియున్నవి.

యద్యథాస్ఫురితంచిత్తం తత్తథా హ్యాత్మచిద్భవేత్
స్వయమేవానియమత స్తత్తత్స్యాన్నేహ కించన 14

చిత్తవృత్తులననుసరించియే ఆత్మచైతన్యము స్ఫురించుచున్నది. అందువలన ఈజగత్తున అనియతమగు కార్యమొక్కటియును జరుగుటలేదు.

నచనామ నకించిత్త్వం యుజ్యతే విశ్వరూపిణః
త్యక్త్వా సమస్తసంస్థానం హేమతిష్ఠతి నైకథమ్. 15

మాయాశబలమగు బ్రహ్మమున ననాదినుండి వెలయుచున్న జగత్తెన్నటికిని అనగా ప్రళయమునగూడ శూన్యము గాజాలదు, బంగారము ఆభరణముల రూపమును విడచియుండజాలదుకదా !

సర్గాదౌ స్వయమేవాంత శ్చిద్యథాకచితాత్మని
హిమాగ్న్యాదితయాద్యాపి సాతథా స్తేస్వసత్తయా. 16

తస్మాత్స్వసత్తాసంత్యాగః సతః కర్తుం నయుజ్యతే
యదాచిదాస్తే తేనేయం నియతిర్న వినశ్యతి. 17



సృష్టి - ఆదియందు ఏవస్తువెట్లు ఆవిర్భవించియున్నదో, అది అట్లే, ఇప్పుడుగూడనున్నది. అందువలన బ్రహ్మము స్వసత్తనుబరిత్యజించుననుట సంగతముకాజాలదు. ఈ చైతన్య మిట్లున్నంత వఱకు, నియతితొలగిపోజాలదు. మంచు చల్లదనమును, నిప్పు వేడిని విడువజాలవు; విడువకుండ సృష్ట్యాదినుండి అట్లేయున్నవి.

యద్యథాకచితం యత్ర వ్యోమరూప్యపిపార్థివమ్
సర్గాదౌ తన్న చలితు మద్యయావన్న యుజ్యతే. 18

ఆకాశరూపములగు పృథ్వ్యాదులు మున్ను సృష్ట్యాదియందున్నట్లే, నేడును నియతివలన నిలచియున్నవి. ఒకింతయును మార్పుకలుగుటలేదు.

యాయథా చిత్ప్రకచితా ప్రతివస్తువిదంవినా
నసా తతః ప్రచలతి వేదనాభ్యాసతః స్వయమ్. 19

చావుబ్రతుకుల నియమములుగూడ పైనజెప్పినయట్లే మారకుండనున్నవి. జీవులందఱును, ఆ నియమమునవలంబించియే చనుచున్నారు.

జగదాదావనుత్పన్నం యచ్చేదమనుభూయతే
తత్సంవిద్వ్యోమకచనం స్వప్నస్త్రీసురతంయథా 20

ఇదంతయు మాయికమగు దృశ్యజగత్తునుపలక్షించి చెప్పబడినది. కాని, వాస్తవమునకు జగత్తు ఉత్పన్నమేయుపలేదు. అనుభవింపబడునదంతయు, స్వప్నస్త్రీసంగమమువలె, మిథ్య; చిదాకాశముయొక్క లీల.

అసత్యమేవసత్యాభం ప్రతిభానమిదంస్థితమ్
ఇతిస్వభావసంపత్తి రితిభూతానుభూతయః. 21

ప్రాగ్వర్ణితములగు నియతిస్వభావ జీవన మరణాద్యనుభవములు అసత్యములయ్యు సత్యమువలె నగపడుచుండుట, సత్తయొక్కయు, సంస్కారముయొక్కయు మహిమవలననని గ్రహించునది.

సర్గాదౌ యాయథారూఢం సంవిత్కచనసంతతిః
సాద్యాప్యచలితాన్యేన స్థితా నియతిరుచ్యతే. 22

సర్గాదియందు చైతన్యమునవికసించి రూఢమై నేటివఱకు మారకుండ ఉన్నదే నియతియని చెప్పబడుచున్నది.

గృహీతవ్యోమసంవిత్తి చిద్వ్యోమవ్యోమతాంగతమ్
గృహీతకాలతాసంవి చ్ఛిన్నభః కాలతాంగలమ్. 23

గృహీతజలసంవిత్తి చిద్వ్యోమవారివత్స్థితమ్
స్వప్నేయథాహిపురుషః పశ్యత్యాత్మనివారితామ్. 24

స్వప్నచిత్సంవిదాభాతి భవత్యేషాయథాస్థితా
చిచ్చమత్కారచాతుర్యా దసదేతత్సమూహతే. 25

ఆ చిదాకాశమే సృష్ట్యాదియందు వ్యోమసంవిత్తును గ్రహించుటవలన, ఆకాశముగను, కాలసంవిత్తును స్వీకరించుటవలన కాలముగను, జలసంవిత్తును గ్రహించుటవలన జలముగను మారినది. పురుషుడు స్వప్నమున తనయందే నీటిని గాంచునట్లు, చిద్వస్తువు తనయందే ఆకాశాదిభావములను బొందుచున్నది. మాయయొక్క మహిమ ఇట్టిది. అది లేనివస్తువులనుగూడ కల్పించి, లయమొనర్చుచున్నది.

ఖత్వంజలత్వముర్వీత్వ మగ్నివాయుత్వమప్యసత్
వేత్త్యంతఃస్వప్నసంకల్పధ్యానేష్వివచితిఃస్వయమ్. 26

ఆకాశత్వ, జలత్వ, పృథ్వీత్వ, అగ్నిత్వ, వాయుత్వములన్నియును అసత్తులు. కాని చిత్-శక్తి వాటిని స్వప్న, సంకల్ప ధ్యానములందువలె, తనయందు కల్పించుకొని అనుభవించుచున్నది.

మరణానంతరంకర్మ ఫలానుభవనక్రమమ్
సర్వసందేహశాంత్యర్థం మృతి శ్రేయస్కరంశృణు. 27

మరణానంతరము జీవుడు కర్మఫలముల నెట్లనుభవించునది, వచించుచున్నాను వినుము. దీనినివినిన నీసందేహములు తొలగిపోయి శ్రేయస్సుచేకూరగలదు.

రూఢాదిసర్గేనియతిర్హ్యేకద్విత్రి చతుఃశతా
పూర్వాదిష్వాయుషః పుంసాం తస్యామేనియతింశృణు. 28

కృతయుగమున నాలుగువందలు, త్రేతాయుగమున మూడువందలు, ద్వాపరమున రెండువందలు, కలియుగమున నూరేండ్లుగ మనుష్యుల ఆయుర్దాయముండునని సృష్ట్యాదియందు నియమమేర్పరుపబడినది. ఆయుర్దాయము మరల హెచ్చుటయు, తగ్గుటయునుగూడ కలదు. ఈ విషయమును వర్ణించుచున్నాను వినుము.

దేశకాలక్రియాద్రవ్య శుద్ధ్యశుద్ధీస్వకర్మణామ్
న్యూనత్వేచాధికత్వేచ నృణాంకారణమాయుషః. 29

దేశ, కాల, క్రియా, ద్రవ్యముల పవిత్రతాపవిత్రతల ననుసరించి మనుష్యుల కర్మఫలము భేదించుచున్నది; అందువలన ఆయుర్దాయమునగూడ, మార్పుకలుగుచున్నది.

స్వకర్మధర్మేహ్రాసతి హ్రాసత్యాయుర్నృణామిహ.
వృద్ధేవృద్ధిముపాయాతి సమమేవ భవేత్సమే. 30

నిర్దిష్టకర్మలయొక్కయు తదాచరణఫలితమగు ధర్మముయొక్కయు, హెచ్చుతగ్గులననుసరించియే ఆయువు హెచ్చుచు తగ్గుచుండును. అవి పెరిగిన, ఆయువు పెరుగును. అవి తగ్గిన ఆయువు తగ్గును. అవి సమముగనుండిన, ఆయువు సమానముగ నేయుండును.

బాలమృత్యుప్రదైర్బాలో యువాయౌవనమృత్యుదైః
వృద్ధమృత్యుప్రదైర్వృద్ధః కర్మభిర్మృతిమృచ్ఛతి. 31

బాల్యమృత్యుదాయకములగు కుకర్మలనాచరించిన బాల్యముననే మృత్యువు కలుగుచున్నది. అట్లే నిషిద్ధకర్మలనాచరించిన తదనుసారము యౌవన, వార్ధక్యముల మృత్యువు కలుగుచున్నది.



యోయథాశాస్త్రమారబ్ధం స్వధర్మమనుతిష్ఠతి
భాజనంభవతిశ్రీమాన్ సయథాశాస్త్రమాయుషః 32

శాస్త్రవిహితమగు సుకర్మలనాచరించుచు, శ్రీమంతుడు శాస్త్రనిర్దిష్టమగు ఆయుర్దాయమును బొందగలుగుచున్నాడు.

ఏవంకర్మానుసారేణ జంతురంత్యాందశామితః
భవంత్యంతంగతవతో దృఙ్మర్మచ్ఛేదవేదనాః. 33

ఆయువు క్షీణించి అంతిమకాలము అరుదెంచిన, కర్మానుసారము మర్మచ్ఛేదకమగు వేదన కలుగును.

ప్రబుద్ధలీలోవాచ:—

మరణంమేసమాసేన కథయేందుసమాననే
కింసుఖంమరణంకింవా దుఃఖంమృత్వాచకింభవేత్. 34

ప్రబుద్ధలీల:—చంద్రాననా! మరణమును గురించి సంక్షేపముగ నాకు జెప్పుడు; మరణదుఃఖమెట్లుండును? అప్పుడేమైన సుఖము లభించునా? మరణానంతర మేమి జరుగును? (యోగుల మృతికిని సాధారణులగువారి మరణమునకును భేదమేమైన ఉన్నదా?)

శ్రీదేవ్యువాచ:—

త్రివిధాఃపురుషాఃసంతి దేహస్యాంతే ముమూర్షవః
మూర్ఖోఽథధారణాభ్యాసీ యుక్తిమాన్పురుషస్తథా. 35

శ్రీదేవి:—చనిపోవు పురుషులు మూర్ఖులు, ధారణాభ్యాసులు, యుక్తిమంతులు అని మూడు తెఱంగులుగ నుందురు.

అభ్యస్యధారణానిష్ఠో దేహంత్యక్త్వాయథాసుఖమ్
ప్రయాతిధారణాభ్యాసీ యుక్తియుక్తస్తథైవచ. 36

వీరిలో ధారణాభ్యాసులును, యుక్తిమంతులును నగువారు దేహమును బరిత్యజించునప్పుడు గాని, పరిత్యజించిన పిదపగాని దుఃఖమును బొందరు; సుఖమునే బడయుదురు *

ధారణాయస్యనాభ్యాసం ప్రాప్తానైవచయుక్తిమాన్
మూర్ఖఃస్వమృతికాలేఽసౌ దుఃఖమేత్యవశాశయః. 37

ధారణాభ్యాసులును, యుక్తిమంతులును గాని మూర్ఖులు మరణసమయమున దుఃఖమునే బొందుచున్నారు.

వాసనావేశవైవశ్యం భావయన్విషయాశయః
దీనతాంపరమామేతి పరిలూనమివాంబుజమ్. 38

* ప్రాణమును, మనస్సును నాభి, హృదయము, కంఠము, భ్రూమధ్యప్రదేశము, బ్రహ్మరంధ్రములకడ నిల్పగలిగినవారు ధారణాభ్యాసులనంబడుదురు. పరకాయప్రవేశము నొనర్చు నాడీమార్గమును ఎఱిగినవారు యుక్తిమంతులనంబడుచున్నారు — అను.

ఇట్టివారు వాసనలవలన చలించు చిత్తముతో, వాటినిగూర్చిచింతించుచు, వాడిన తామరల వలె దీనులగుచున్నారు.

అశాస్త్రసంస్కృతమతి రసజ్జనపరాయణః
మృతావనుభవత్యంత ర్దాహమగ్నావివచ్యుతః. 39

శాస్త్రసంస్కారము లేనివారును, దుస్సాంగత్యపరులును నగువారు, నిప్పునబడినవారివలె మరణసమయమున ఎడతెగని దుఃఖమును బడయుచున్నారు.

యదాఘుర్ఘురకంఠత్వం వైరూప్యందృష్టివర్జితమ్
గచ్ఛత్యేషోఽవివేకాత్మా తదాభవతి దీనధీః. 40

కంఠము బొంగురుపోయి, చూపు, రంగు తగ్గిపోవ, నిట్టివారు మృత్యువును సమీపించుచు దీనులగుచున్నారు.

పరమాంధ్యమనాలోకో దివాప్యుదితతారకః
సాభ్రదిఙ్మండలాభోగో ఘనమేచకితాంబరః. 41

అప్పుడు వారికి, దిక్కులన్నియు వెలుగుతగ్గి, అంధకారమయములగును. దిఙ్మండలము కారు మొయిళ్ల నావరింపబడుచున్నట్లగపడును, పగటిపూటగూడ నక్షత్రము లగపడును;

మర్మవ్యథావిచ్ఛురితః ప్రభ్రమద్దృష్టిమండలః
ఆకాశీభూతవసుధో వసుధాభూతఖాంతరః 42

వారు అపరిమితమగు బాధను పొందుదురు. ఆకాశమును భూమిగను; భూమిని ఆకాశముగను కాంచుదురు. కళ్లుతిరిగి పోవుచున్నట్లుండును.

పరివృత్తకకుబ్చక్ర ఉహ్యమానఇవార్ణవే
నీయమానఇవాకాశే ఘననిద్రోన్ముఖాశయః. 43

వారి కప్పుడు దిక్చక్రము తిరుగుచున్నట్లు తోచుచుండును. సముద్రమున దేలిపోవుచున్నట్లును, ఆకాశమునకు గొనిపోబడినట్లును, గాఢమగు నిద్రచే నావరింపబడినట్లును, వారు తలపోసికొనుచుందురు.

అంధకూపఇవాపన్నః శిలాంతరివయోజితః
స్వయంజడీభవద్వర్ణో వినికృత్తఇవాశయే. 44

చీకటినూతియందు బడినట్లును, రాతిమధ్యకప్పబడినట్లునుగూడ వారెంచుకొనుచుందురు. చెప్పవలెనని యున్నను పలుకులు వెలువడక బోవుటవలన నేమియునప్పుడు వచింపజాలరు. హృదయము భిన్నమైపోయినట్లుండును.

పతతీవ నభోమార్గా త్తృణావర్తఇవార్పితః
రథేద్రుతఇవారూఢో హిమవద్గలనోన్ముఖః. 45

సుడిగాలిచే లేవనెత్తబడి క్రిందబడవేయబడిన గడ్డిపరకవలెను, తొందరగ చనుచున్న రథమున నెక్కినట్లును, మంచుగడ్డవలె కతిగిపోవుచున్నట్లును వారు తమ్మెంచుకొనుచుందురు.



వ్యాకుర్వన్నివసంసారం బాంధవానస్ఫురన్నివ
భ్రమితక్షేపణేనేవ వాతయంత్రఇవాస్థితః. 46
భ్రమితోవాభ్రమఇవ కృష్టోరసనయేవవా
భ్రమన్నివజలావర్తే శస్త్రయంత్రఇవార్పితః 47
ప్రోహ్యమానస్తృణమివ వహత్వర్జన్యమారుతే
ఆరుహ్యావారిపూరేణ నిపతన్నివచార్ణవే. 48
అనంతగగనేశ్వభ్రే చక్రావర్తేపతన్నివ
అబ్ధిరుర్వీవిపర్యాస దశామనుభవన్స్థితః. 49
పతన్నివానవరతం ప్రోత్పతన్నివచాభితః
సూత్కారాకర్ణనోద్భ్రాంత పూర్ణసర్వేంద్రియవ్రణః. 50

అప్పుడు వారు సంసారదుఃఖమును బంధుగులకు దెలియజెప్పుచున్నట్లుందురు. క్షేపణాయంత్రమునను, వాయుయంత్రమునను, భ్రమయంత్రమునను బడినవారివలె ఉందురు. నాలుకను ఎవరోపట్టిలాగుచున్నట్లును, సుడిగుండమున దిరుగుచున్నట్లును, శస్త్రయంత్రమున బడినట్లును, పెద్ద వానగురియుచున్నప్పుడు నీటగొట్టుకొనిపోయి సముద్రమునబడు గడ్డిపరకవలెను, వారు తమ్ము భావించుకొనెదరు. అనంతాకాశమునను, అగాధమునను, సుడిగుండమునను బడినవారివలెవారుందురు. సముద్రము, భూమితల్లక్రిందులైనట్లు వారు తలచుచుందురు. అనవరతము క్రిందపడుచున్నట్లును పైకిలేచుచున్నట్లును వారెంచుకొనుచుందురు. తమ నిశ్వాసధ్వనిని విని భయపడుచుందురు; ఇంద్రియములను వ్రణములబాధను అనుభవించుచుందురు.

క్రమాచ్ఛ్యామలతాంయాంతి తస్యసర్వార్థసంవిదః
యథాస్తంగచ్ఛతిరవౌ మందాలోకతయాదిశః. 51

సూర్యుడస్తమింప వెలుగుతగ్గి, దిక్కులన్నియును మలినమగునట్లు, వారి ఇంద్రియములన్నియును చేవతగ్గ, మాలిన్యమును బొందుచున్నవి.

పూర్వాపరంనజానాతి స్మృతిస్తానవమాగతా
యథాపాశ్చాత్యసంధ్యాంతే నష్టాదృష్టిర్దిగష్టకే. 52

స్మృతిశక్తిక్షీణింప పూర్వాపరజ్ఞానము తొలగిపోవును. సాయంకాలమైపోయిన ఎనిమిది దిక్కులు అగపడనట్లు, వారిచూపుగూడ కనబడకుండ పోవును.

మనఃకల్పనసామర్థ్యం త్యజత్యస్యవిమోహతః
అవివేకేనతేనాసౌ మహామోహేనిమజ్జతి. 53

అప్పుడు మనస్సు కల్పనాసామర్థ్యమును గోల్పోయి, వివేకరహితమై, మహామోహమున మునుగుచున్నది.

యదైవామోహమాదత్తే నాదత్తేపవనస్తదా
నత్వాదత్తేయదాప్రాణా న్మోహమాయాత్యలంతదా. 54

ప్రాణవాయువు వారి అంగసంధులజేరి, వారికి చైతన్యమును కలిగింపనంకవలనను, వారిట్లే మోహమున బడియుండెదరు.

అన్యోన్యపుష్టతాంయాతై ర్మోహసంవేదనభ్రమైః
జంతుఃపాషాణతామేతి స్థితిమిత్యాదిసర్గతః. 55

మోహము, పూర్వసంస్కారము, భ్రాంతులు ఒండొంటిని బలపరచుకొనుచుండుటవలన మనుష్యుడు పాషాణమువలె జడుడైయుండును; ఇట్లుసర్గాదినుండి జరుగుచున్నది.

ప్రబుద్ధ లీలోవాచః—

వ్యథాంవిమోహంమూర్ఛాంతం భ్రమంవ్యాధిమచేతనమ్
కిమర్థమయమాయాతి దేహోహ్యష్టాంగవానపి. 56

ప్రబుద్ధలీల:- దేవీ! శిరః, పాణి, పాద, గుహ్య, నాభి, హృదయములను అష్టాంగములతో గూడియున్నను ఈశరీరము, బాధ, మోహము, మూర్ఛ, భ్రాంతి, వ్యాధి, జడత్వముల నేల బొందు చున్నది?

శ్రీ దేవ్యువాచః—

ఏవంసంవిహితంకర్మ సర్గాదౌస్పందసంవిదా
యద్యస్మిన్సమయేదుఃఖం కాలేనైతావతేదృశమ్. 57
స్యాన్మేఇత్యేవసంవిశ్య గుల్మవత్తత్స్వభావజమ్
వేత్తిచిత్తవిజృంభోత్థం నాన్యదత్రాస్తికారణమ్. 58

శ్రీదేవి:- క్రియాశక్తిప్రధానుడగు ఈశ్వరుడు, 'నాకంటె అభిన్నుడగు జీవుడు బాల్య యౌవనవృద్ధాప్యములయందు ఈఈకర్మల ఫలముననుభవించునుగాక!' అని సంకల్పించును. అప్పుడు జీవుడు స్వయముగ చిత్తపరికల్పితములగు తరులతాదులవలె స్వసంకల్ప జనితములగు దుఃఖములను అనుభవించును.

యదావ్యథావశాన్నాడ్యః స్వసంకోచవికాసనైః
గృహ్ణంతిమారుతోదేహే తదోజ్ఝతినిజాంస్థితిమ్ 59

జీవుని దేహమునందున్న నాడులు పిత్తాదిధాతుప్రకోపమున రసపూరితములై, సంకోచ వికాసములనంది భుజింపబడిన అన్నపానాదులరసమును గ్రహించినప్పుడు, సమానవాయువు తన సంగ్రహవ్యాపారమును త్యజించుచున్నది.

ప్రవిష్టానవినిర్యాంతి గతాఃసంప్రవిశంతినో
యదావాతావినాడీత్వాత్తదాస్పందాత్స్మృతిర్భవేత్. 60

నాడులయందు ప్రవేశించినవాయువు వెలువడకున్నను, వెలువడినను మరల బ్రవేశింపకున్నను నాడుల వ్యాపారము ఆగిపోవుచున్నది; అప్పుడు చక్షురాది ఇంద్రియములు తమపనులను విడుచు చున్నవి; ఇంద్రియజ్ఞానము తొలగిపోవుచున్నది.

నవిశత్యేవవాతో న నిర్యాతిపవనోయదా
శరీరనాడీవైధుర్యాన్మృత ఇత్యుచ్యతే తదా. 61



నాడుల వ్యాపారమాగిపోయి, వాయుగతి నిరోధమైన, జీవుడుమృతుడైనాడని చెప్పబడు చున్నాడు.

ఆగంతవ్యోమయానాశః కాలేనైతావతేతియా
పూర్వసంవిదితాసంవిద్యాతి తచ్చోదితామృతిమ్. 62

'నేను జన్మింతును, ఈసమయమున మరణింతును' అను ప్రాక్తనచిత్సంకల్పనియతియే మృతికిం గారణమగుచున్నది.

ఈదృశేనమయేహేత్థం భావ్యమిత్యాదిసర్గజా
సంవిద్బీజకలానాశం నకదాచనగచ్ఛతి. 63

'నేనీస్థానమున నిట్లగుదును' అను సంకల్పమాయాశక్తి సృష్ట్యాదియందు ఉదయించినది. ఇది ఎన్నటికి నాశనమును బొందదు.

సంవిదోవేదనంనామ స్వభావోవ్యతిరేకవాన్
తస్మాత్స్వభావసంవిత్తేర్నాన్యేమరణజన్మనీ. 64

అవినాశస్వభావకమగు ఈ మాయాశక్తికి నాశనములేదు. ఈ స్వభావజ్ఞానమునకును, జననమరణములకును భేదములేదు.

క్వచిదావృతిమత్సౌమ్యం క్వచిన్నద్యాంజలంయథా
క్వచిత్సౌమ్యంక్వచిజ్జీవ ధర్మేదంచేతనంతథా. 65

నదీజలమొక్కచోట తరంగములతోగూడి కలుషితమగునట్లు, ఇంకొకచోట నిర్మలముగను నుండునట్లు ఈ చైతన్యముగూడ ఒక్కొక్కప్పుడు సాధనాదికర్మలవలన నిర్మలమును, ఇంకొకప్పుడు జీవధర్మారోపమువలన రాగద్వేషాదికలుషితమును నగుచున్నది.

యథాలతాయాఃపర్వాణి దీర్ఘాయామధ్యమధ్యతః
తథాచేతనసత్తాయా జన్మానిమరణానిచ. 66

దీర్ఘలతయందు మధ్యమధ్యకణుపు లుండునట్లు, ఈ అచేతన సత్తయందు జనన మరణ రూపకములగు గ్రంథులున్నవి.

నజాయతేనమ్రియతే చేతనఃపురుషఃక్వచిత్
స్వప్నసంభ్రమవద్భ్రాంత మేతత్పశ్యతి కేవలమ్. 67

కాని, వాస్తవమునకు చైతన్యపురుషుడు జన్మించుటలేదు, మరణించుటయును లేదు. కేవలము స్వప్నభ్రాంతివలె దానిని గాంచుచున్నాడు.

పురుషశ్చేతనామాత్రం సకదాక్వేవనశ్యతి
చేతనవ్యతిరిక్తత్వే వదాన్యత్కింపుమాన్భవేత్. 68

చైతన్య స్వరూపుడగు పురుషునకెన్నటికిని నాశనములేదు. చేతన రహితమగు దాని యందు, పురుషత్వ మెట్లారోపింపబడగలదో, వచింపుము.

కోఽద్యయావన్మృతంబ్రూహి చేతనంకస్యకింకథమ్
మ్రియంతేదేహలక్షాణి చేతనంస్థితమక్షయమ్. 69

ఇంతవఱకెన్నడు చేతనవస్తువు మరణించియున్నదో వచింపుము; కేవలము శరీరములు నశించుచున్నవి. చైతన్యము స్థిరముగనేయున్నది.

అమరిష్యన్నవై చిత్తమేకస్మిన్నేవతన్మృతే
అభవిష్యత్సర్వభావ మృతిరేకమృతావిహ. 70

చైతన్యమే మరణించిన చిత్తమొక్కటియే యగుటవలన ఒక్కడు మరణించిన, అందఱును మరణించియుందురు.

వాసనామాత్రవైచిత్ర్యం యజ్జీవోఽనుభవేత్స్వయమ్
తస్యైవజీవమరణే నామనీపరికల్పితే. 71

అసలునకు జీవుని జననమరణములు వాస్తవములుగావు; ఇవి వాసనావైచిత్ర్యములు. ఈ వాసనా వైచిత్ర్యమే మరణమని చెప్పబడుచున్నది.

ఏవంనకశ్చిన్మ్రియతే జాయతేనచకశ్చన
వాసనావర్తగర్తేషు జీవోలుఠతికేవలమ్. 72

కనుక జీవుడు జన్మించుటలేదు. మరణించుటయును లేదు; జీవుడు వాసనావర్తములను గర్తములబడి కొట్టుకొనుచున్నాడు.

అత్యంతాసంభవాదేవ దృశ్యస్యాసౌచవాసనా
నాస్త్యేవేతివిచారేణ దృఢజ్ఞాతైవనశ్యతి. 73

దృఢవిచారమున దృశ్యవస్తువుల అత్యంతాభావము బోధపడిన, వాసనలన్నియును వినాశమునందును; అప్పుడు దృశ్యసత్తగూడ క్షీణించిపోవును.

అనుదితముదితం జగత్ప్రబంధం
భవభయతోఽభ్యసనైర్విలోక్యసమ్యక్
అలమనుదితవాసనోహిజీవో
భవతివిముక్తఇతీహసత్యవస్తు. 74

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
లీలోపాఖ్యానే మరణవిచారోనామ చతుష్పంచాశత్తమః సర్గః ॥ 54 ॥

వైరాగ్యాది సాధనసంపన్నుడును, అవికారియునునగు జీవుడు భ్రాంతి సముదితమగు ఈ జగత్తును తత్త్వదృష్టివలన మిథ్యయని గ్రహించి, ద్వైతవాసనాహీనుడై, భవభయమునుండి ముక్తుడగును. ఈముక్తాత్మస్వరూపమొక్కటియే సత్యము; ఇతరములన్నియును మిథ్య.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున
మరణవిచారమను చతుఃపంచాశసర్గము ॥ 54 ॥

---

## పంచపంచాశత్తమః సర్గః

ప్రబుద్ధ లీలోవాచ:—

యథైవజంతుర్మ్రియతే జాయతేచయథాపునః
తన్మేకథయదేవేశి పునర్బోధవివృద్ధయే. 1

ప్రబుద్ధలీల:— దేవేశీ! మనుజుడెట్లు మరణించి, మరల జన్మించునో నాకు మరల జెప్పుడు, దీనివలన జ్ఞానము వృద్ధినందును.

శ్రీ దేవ్యువాచ:—

నాడీప్రవాహేవిధురే యదావాతవిసంస్థితిమ్
జంతుః ప్రాప్నోతిహితదా శామ్యతీవాస్యచేతనా. 2

శ్రీదేవి:— నాడీస్పందనము శాంతింప, ప్రాణవాయువు ఆగిపోయినప్పుడు, మనుజుని చైతన్యము ఉడిగినట్లగపడును.

శుద్ధంహిచేతనంనిత్యం నోదేతినచశామ్యతి
స్థావరేజంగమేవ్యోమ్ని శైలేఽగ్నౌపవనేస్థితమ్. 3

స్వాభావికముగ చైతన్యము శుద్ధము, నిత్యము. దీనికి క్షయముగాని, ఉత్పత్తిగాని లేదు. ఇయ్యది స్థావరజంగమములందును, ఆకాశశైలాగ్ని వాయువులున్నగు పదార్థములన్నిటను వెలయుచున్నది.

కేవలంవాతసంరోధా ద్యదాస్పందఃప్రశామ్యతి
మృతఇత్యుచ్యతేదేహ స్తదాసౌజడనామకః. 4

వాయువు నిరోధమైన, నాడీస్పందమాగిపోయినప్పుడు, కేవలము జడదేహము మృతించినదని చెప్పబడుచున్నది; ఇయ్యది శరీరధర్మమేగాని, ఆత్మధర్మముకాదు.

తస్మిన్దేహేశవీభూతే వాతేచానిలతాంగతే
చేతనంవాసనాముక్తం స్వాత్మతత్త్వేఽవతిష్ఠతి. 5

శరీరము శవముగామారి, ప్రాణవాయువు మహానిలమున గలసినను, చైతన్యము వాసనలతో గూడి ఆత్మతత్త్వమున వెలయుచున్నది.

జీవఇత్యుచ్యతేతస్య నామాణోర్వాసనావతః
తత్రైవాస్తేసచ శవాగారే గగనకే తథా. 6

సూక్ష్మమగు ఈ చైతన్యము పునర్జన్మకు గారణములగు వాసనలతోగూడుటవలన జీవుడని పేర్కొనబడుచున్నది. ఇయ్యది వేరుపదార్థముగాకున్నను వాసనాబలమున శవమున్న ఆకాశస్థానమున వెలయుచున్నది, పరలోకమున కఱుగుట వాస్తవముకాదు.

తతోఽసౌప్రేతశబ్దేన ప్రోచ్యతేవ్యవహారిభిః
చేతనం వాసనామిశ్ర మామోదానిలవత్స్థితమ్, 7

ఈ జీవునే వ్యవహారజ్ఞులు ప్రేతశబ్దమున వ్యవహరించుచున్నారు. వాయువున సుగంధమిమిడియుండునట్లు, చైతన్యముగూడ జీవునివాసనలతో గలసియుండును.

ఇదందృశ్యంపరిత్యజ్య యదాస్తేదర్శనాంతరే
సస్వప్నఇవసంకల్ప ఇవనానాకృతిస్తదా. 8

జీవుడీదేహమును గాంచుటవదలి, దేహాంతరములను గాంచునప్పుడాతడు స్వవాసనానురూపమగు పరలోకమును, అచ్చటిభోగములను అనుభవించును.

తస్మిన్నేవప్రదేశేఽంతః పూర్వవత్స్మృతిమాన్భవేత్
తద్దైవమృతిమూర్ఛాంతే పశ్యత్యన్యశరీరకమ్ 9

అచ్చట మరల మునుపటివలె జన్మస్మృతినిబొంది, మరణమూర్ఛను అనుభవించి, ఇంకొక శరీరమును బొందినట్లు, భావించుకొనుచున్నాడు.

ఆత్మన్యస్తిఘటాపుష్ట మన్యస్యవ్యోమ కేవలమ్
ఆకాశభూతలే సాకం సాకాశశశివాసరమ్. 10

ఆకాశము, పృథివి, లేక విశ్వమంతయును మృతుని ఆత్మయందు ఆకాశమున మేఘసమూహ మగుపడునట్లు, దృష్టిమగును. ఇతరు లద్దానిని గాంచజాలరు; వారు కేవలము గృహాకాశమునే కాంతురు.

భవంతిషడ్విధాఃప్రేతా స్తేషాంభేదమిమంశృణు
సామాన్యపాపినో మధ్యపాపినఃస్థూలపాపినః. 11
సామాన్యధర్మా మధ్యమధర్మాచోత్తమధర్మవాన్
ఏతేషాంకస్యచిద్భేదో ద్వ్యాత్రయోఽవ్యథకస్యచిత్. 12

ప్రేతము లారు తెరంగులు; వాటి భేదమును జెప్పుచున్నాను వినుము. సామాన్యపాపి, మధ్యపాపి, స్థూలపాపి, సామాన్యధర్మి, మధ్యధర్మి, ఉత్తమధర్మి; వీటియందు మరల రెండుమూడు తెఱగులున్నవి.

కశ్చిన్మహాపాతకవాన్ వత్సరంస్మృతిమూర్ఛనమ్
విమూఢోఽనుభవత్యంతః పాషాణహృదయోపమః. 13
తతఃకాలేనసంబుద్ధో వాసనాజఠరోదితమ్
అనుభూయచిరంకాలం నారకందుఃఖమక్షయమ్. 14
భుక్త్వాయోనిశతాన్యుచ్చైర్దుఃఖాద్దుఃఖాంతరంగతః
కదాచిచ్ఛమమాయాతి సంసారస్వప్నసంభ్రమే. 15

వీటిలో గొప్పపాపము నొనర్చినవాడు, పాషాణమువలె జడుడై, సంవత్సరకాలము మరణమూర్ఛ ననుభవించును. మరల, యథాసమయమున ప్రబుద్ధుడై, వాసనా - గర్భమున నివసించి, చాలకాలము నరకయాతనల నంది, నూర్లకొలది జన్మల నెత్తి చాలదుఃఖము ననుభవించును. మరల నొకానొకప్పుడు (ఈశ్వర ప్రసాదమున) వాని సంసారస్వప్నమును శాంతించును.

అథవామృతిమోహాంతే జడదుఃఖశతాకులామ్
క్షణాద్వృక్షాదితామేవ హృత్స్థామనుభవంతి తే. 16



స్వవాసనానురూపాణి దుఃఖాని నరకేపునః
అనుభూయాథయోనీషు జాయంతేభూతలేచిరాత్. 17

మరికొందరు మరణమోహానంతరము అత్యంత దుఃఖపూర్ణమగు జడవృక్షాది భావమును హృదయమున అనుభవింతురు. పిదప, వాసనానురూపకమగు నరకముల ననుభవించి, భూతలమున నానావిధ యోనుల పరిభ్రమింతురు.

అథమధ్యమపాపోయో మృతిమోహాదనంతరమ్
సశిలాజఠరంజాడ్యం కంచిత్కాలంప్రపశ్యతి. 18
తతఃప్రబుద్ధఃకాలేన కేనచిద్వా తద్దైవవా
తిర్యగాదిక్రమైర్భుక్త్వా యోనీఃసంసారమేష్యతి. 19

మధ్యపాపులు మరణమూర్ఛానంతరము కొంతకాలము పాషాణమువలె జడత్వమును బొందుదురు. పిదప, యథాసమయమున, ప్రబుద్ధులై పశ్వాదియోనుల దిరుగాడుదురు.

మృతఏవానుభవతి కశ్చిత్సామాన్యపాతకీ
స్వవాసనానుసారేణ దేహంసంపన్నమక్షతమ్. 20
సస్వప్నఇవసంకల్ప ఇవచేతతితాదృశమ్
తస్మిన్నేవక్షణేతస్య స్మృతిరిత్థముదేతిచ. 21

సామాన్య పాపులగువారు మరణించి, వాసనానుసారముత్పన్నమైన ఆతివాహిక దేహమునుబొంది, స్వప్న, సంకల్పములవలె జననమరణాదుల ననుభవించుచుందురు.

యేతూత్తమమహాపుణ్యా మృతిమోహాదనంతరమ్
స్వర్గవిద్యాధరపురం స్మృత్యాస్వనుభవంతి తే. 22
తతోఽన్యకర్మసదృశం భుక్త్వాన్యత్రఫలంనిజమ్
జాయంతే మానుషేలోకే సశ్రీకే సజ్జనాస్పదే. 23

ఉత్తములును, మహాపుణ్యశీలురునగువారు మరణానంతరము, పూర్వస్మృతిననుసరించి, స్వర్గవిద్యాధరాది పురములననుభవించుచున్నారు. పిదప, ఇలావృతకింపురుషాది వర్షముల ఇతర కర్మఫలములననుభవించి సంపద్యుక్తమును, సజ్జననిలయమునునగు మనుష్యలోకమున జన్మించుచున్నారు.

యేచమధ్యమధర్మాణో మృతిమోహాదనంతరమ్.
తే వ్యోమవాయువలితాః ప్రయాంత్యోషధిపల్లవమ్. 24
తత్రచారుఫలంభుక్త్వా ప్రవిశ్యహృదయంనృణామ్
రేతసామధితిష్ఠంతి గర్భేజాతిక్రమోచితే. 25

మధ్యధర్ములు మరణానంతరము ఆకాశవాయువుచే గొనిపోబడి, ఓషధిపల్లవ ప్రధానములగు చైత్రరథ, నందన వనాదిదేశములను, కిన్నరకింపురుషయక్షాది శరీరములను, బొందుచున్నారు. అచ్చట పుణ్యఫలములననుభవించి, చ్యుతులై వ్రీహియవాది భోజనద్రవ్యముల బ్రవేశించి, యథోచితమగు జాతికిజెందినవాని హృదయమునను, రేతస్సునను బ్రవేశించి, స్త్రీగర్భమున వాసమొనర్చి జన్మను గ్రహించుచున్నారు

స్వవాసనానుసారేణ ప్రేతాప్తాంవ్యవస్థితిమ్
మూర్ఛాంతేఽనుభవంత్యంతః క్రమేణైవాక్రమేణచ. 26

ఎట్టి మృతవ్యక్తియైనను, మరణానంతరము ఈ నియమమును లోనగుచున్నాడు; క్రమమిట్లేయుండవచ్చును, లేక ఇంకొకరీతిగ నుండవచ్చును.

ఆదౌమృతావయమితి బుధ్యంతేతదనుక్రమాత్
బంధుపిండాదిదానేన ప్రోత్పన్నా ఇతివేదినః 27
తతోయమభటాఏతే కాలపాశాన్వితాఇతి
నీయమానఃప్రయామ్యేభిః క్రమాద్యమపురంత్వితి. 28
ఉద్యానానివిమానాని శోభనానిపునఃపునః
స్వకర్మభిరుపాత్తాని దివ్యానీత్యేవపుణ్యవాన్. 29
హిమానీకంటకశ్వాభ్రశస్త్రపత్రవనానిచ
స్వకర్మదుష్కృతోత్థాని సంప్రాప్తానీతిపాపవాన్. 30

మృతుడు మరణమూర్ఛనుండి తేరుకొనినపిదప, 'నేను మరణించితిని'. అని భావించుకొనును. పిండప్రదానానంతరము 'శరీరము వచ్చినది' అని తలచుకొనును. యమాలయమున కఱుగుచు, 'యమభటులు కాలపాశమునుధరించి నన్నుగొనిపోవుచున్నారు' అని తలపోయును. వీరిలో పుణ్యవంతులు దివ్యములగు విమానములను, ఉద్యానవనములను అనుభవింతురు; ఇవన్నియు వారి కర్మల ననుసరించినవియేయైయుండును. పాపి 'నాకర్మలనుబట్టి హిమ, కంటక, గర్త, అసిపత్రవనాదులు లభించినవి' అని తలపోయును.

ఇయంమేసౌమ్యసంపాతా సరణిఃశీతశాద్వలా
స్నిగ్ధచ్ఛాయాసవాపీకా పురఃసంస్థితిమధ్యమః 31
అయంప్రాప్తోయమపుర మహామేవసభూతపః
అయంకర్మవిచారోఽత్ర కృతఇత్యనుభూతిమాన్. 32

మధ్యరకముగ పుణ్యమాచరించినవాడు, 'చల్లటిపచ్చికతో గప్పబడిన సుందరమార్గమిద్ది, చల్లటినీడ, బావి ముందరనున్నవి, నేనీమార్గమున యమపురమున కఱుదెంచితిని, భూతపతియగు యముడీకార్యమును విచారించుచున్నాడు' అని అనుభవించును.

ఇతిప్రత్యేకమభ్యేతి పృథుఃసంసారఖండకః
యథాసంస్థితనిఃశేష పదార్థాచారభాసురః. 33

ఇట్లు మరణానంతరము అందఱును భిన్నభిన్నములగు పారలౌకిక అనుభవములను బొందుచున్నారు. కాని అందఱును అర్థక్రియలతోగూడుకొనిన ఈ విశాలసంసారమును సత్యమనియే భావించుచున్నారు.

ఆకాశఇవనిఃశూన్యే శూన్యాత్మైవవిబోధవాన్
దేశకాలక్రియాద్రవ్యభాసుధోఽపి నకించన. 34



స్వరూపదృష్టియున్నచో, వారు ఆకాశసదృశమును, ఆకారరహితమును, అద్వయమును నగు ఆత్మయొక్కటియే జాగరిల్లియున్నదనియు, దేశకాలక్రియలును, హ్రస్వదీర్ఘాద్యాకృతులతో గూడుకొనిన దృశ్యములును సత్యములుకావనియు, గ్రహించియుందురు.

ఇతోఽయమహామాదిష్టః స్వకర్మఫలభోజనే
గచ్ఛామ్యాశుశుభంస్వర్గ మితోనరకమేవచ. 35
యఃస్వర్గోఽయంమయాభుక్తోభుక్తోఽయంనరకోఽథవా
ఇమాస్తాయోనయోభుక్తా జాయేఽహం సంసృతౌపునః. 36
అయంశాలిరహంజాతః క్రమాత్ఫలమహాంస్థితః
ఇత్యుదర్కప్రబోధేన బుధ్యమానోభవిష్యతి. 37

పిదప యమునివీటికజేగిన పురుషులు, 'యముడు మమ్ము మాకర్మఫలముల ననుభవింపజేయుచున్నాడు, మేము త్వరగ స్వర్గమున కఱుగుచున్నాము, నరకమున కఱుగుచున్నాము, పశుజన్మనెత్తుచున్నాము' అనియు, 'నేను మనుష్యలోకమున కఱుదెంచితిని, ధాన్యాంకురమునైతిని, ఫలమునైతిని,' అనియు ఎంచుకొనుచుందురు.

సంసుప్తకరణస్త్వేవం బీజతాంయాత్యసౌనరే
తద్బీజంయోనిగలితం గర్భోభవతిమాతరి. 38

శరీరమును, అంతఃకరణమును, క్రియలునులేని ఈ ధాన్యాంకురము మనుష్యునిచే దినబడి రేతస్సుగ మారుచున్నది. పిదప నయ్యది యోనిద్వారమున మాతృగర్భమున బ్రవేశించుచున్నది.

సగర్భోజాయతేలోకే పూర్వకర్మానుసారతః
భవ్యోభవత్యభవ్యోవా బాలకోలలితాకృతిః. 39

ఆగర్భము పూర్వకర్మానుసారము అదృష్టవంతుడుగనో లేక దురదృష్టవంతుడుగనో లేక చక్కటిబాలుడుగనో జన్మించుచున్నది.

తతోఽనుభవతీంద్వాభం యౌవనంమదనోన్ముఖమ్.
తతోజరాంపద్మముఖే హిమాశనిమివచ్యుతామ్. 40

పిదప, చంద్రునివలె చంచలమగు యౌవనమును అనుభవించును. పిదప, తామరపూవుపైన, పిడుగు పడినట్లు, జరవచ్చి దీనిని పాడుజేయుచున్నది.

తతోఽపివ్యాధిమరణం పునర్మరణమూర్ఛనామ్
పునఃస్వప్నవదాయాతం పిండైర్దేహపరిగ్రహమ్. 41
యామ్యంయాతిపునర్లోకం పునరేవభ్రమక్రమమ్
భూయోభూయోఽనుభవతి నానాయోన్యంతరోదయే. 42
ఇత్యాజవంజవీభావ మామోక్షమతిభాసురమ్
భూయోభూయోఽనుభవతి వ్యోమ్న్యేవవ్యోమరూపవాన్. 43

మరల వ్యాధి, మరణము, మరణమూర్ఛ, బందుగులొసర్చిన పిండప్రదానములవలన నింకొకదేహమును గ్రహించుట, కలవలె జరిగిపోవును. మరల యమలోకమున కఱిగి, భ్రమననుభవించుచు,

నానావిధయోనుల పరిభ్రమించును. ఆకాశరూపమగు ఆత్మ ఆకాశముననే జీవభ్రాంతిని బొందుట మొదలుకొని మోక్షమువఱకు ఇట్టిమార్పులను బొందుచుండును.

ప్రబుద్ధలీలోవాచ:—

ఆదిసర్గే యథాదేవి భ్రమ ఏష ప్రవర్తతే
తథాకథయ మే భూయః ప్రసాదాద్బోధవృద్ధయే. 44

ప్రబుద్ధలీల:— దేవీ! సృష్ట్యాదియందీభ్రమ ఎట్లు కల్గుచున్నదో నాకనుగ్రహించి, జ్ఞానాభివృద్ధినిమిత్తము వచింపుము.

శ్రీ దేవ్యువాచ:—

పరమార్థఘనం శైలాః పరమార్థఘనం ద్రుమాః
పరమార్థఘనం పృథ్వీ పరమార్థఘనం నభః. 45

శ్రీదేవి:— నీవు గాంచుచున్న పర్వతములును, వృక్షములును, పృథివియును, ఆకాశమును మున్నగునవన్నియును పరమార్థఘనములు అనగా విశుద్ధ చైతన్యస్వరూపములు.

సర్వాత్మకత్వాత్సయతో యథోదేతి చిదీశ్వరః
పరమాకాశశుద్ధాత్మా తత్ర తత్ర తథైవ తత్తథా. 46

విశుద్ధచైతన్యమే ఇన్నిరూపములతో మాయాప్రభావమున ఉదయించుచున్నట్లగపడుచున్నది. చేతనామయుడగు ఈశ్వరుడు సర్వవ్యాపియై వెలయుచున్నాడు. అతడు ఎచ్చట ఏరూపమున ప్రతిభాసించుచున్నాడో, అచ్చట ఆరూపముననే పేర్కొనబడుచున్నాడు.

సర్గాదౌ స్వప్నపురుషన్యాయేనాది ప్రజాపతిః
యథాస్ఫుటం ప్రకచిత స్తథాద్యాపి స్థితా స్థితిః. 47

ప్రథమోఽసౌ ప్రతిస్పందః పదార్థానాం హి బింబకమ్
ప్రతిబింబితమేతస్మాద్యత్తదద్యాపి సంస్థితమ్ 48

అతడు స్వప్నపురుషునివలె జీవసమిష్టిరూపుడగు ప్రజాపతియై, సృష్టిసంకల్పముతో సప్తలోకములుగ వివర్తము నందుచున్నాడు. ఆ సృష్టికాలీన సంకల్పమే నేడుకూడ నిల్చియున్నది.

యన్నామ సుషిరంస్థానం దేహానాం తద్గతోఽనిలః
కరోత్యంగపరిస్పందం జీవతీత్యుచ్యతే తతః. 49

సర్గాదావేవమేవైషా జంగమేషు స్థితా స్థితిః
చేతనా అపి నిస్పందాస్తేనైతే పాదపాదయః. 50

రోమకూపములగుండ వాయువులోనికరిగి, అవయవముల నన్నిటిని కదల్చుచున్నది. ఇట్టి దేహమును జీవితదేహమందురు; దీనినే జంగమమనికూడ పేర్కొందురు. చేతనములయ్యు ప్రయత్నరహితములగు వృక్షాదులను స్థావరము లందురు.

చిదాకాశోఽయమేవాంశం కురుతే చేతనోదితమ్
సపవనం విద్ధ్యవతి శేషం భవతి నైవతత్. 51



ఈశ్వరుడే ఈ జీవవిభాగము నొనర్చుచున్నాడు. ఔపాధిక భేదమునననుసరించి వ్యావహారికములగు చిజ్జడభేదభావములుగూడ ఏర్పడుచున్నవి.

నరోపాధిపురం ప్రాప్తం చేతత్యక్షిపుటం నయత్
తత్తస్యా నాక్షి చిజ్జీవం నో జీవత్యేవ సర్గతః. 52

బుద్ధిగుహయందు ప్రవేశించిన చిదాకాశమే నరశరీరమను నగరమును, చక్షురాదియింద్రియ స్థానములను బొంది, బుద్ధివృత్తులవలన బయటనున్న పదార్థములను ప్రకాశింపజేయుచున్నది. కాని, చక్షురాది ఇంద్రియములు చేతనములుగావు. అందువలన, కారణకారణమగు చిత్సంకల్పమే ఈ నియమములకు గారణమని గ్రహింపనగును.

తథాఖం ఖంతథా భూమి ర్భూమిత్వేనాప్త్వవజ్జలమ్
యద్యథా చేతతి స్వైరం తద్వేత్త్యేవ తథావపుః. 53

ఇతిసర్వశరీరేణ జంగమత్వేన జంగమమ్
స్థావరం స్థావరత్వేన సర్వాత్మా భావయన్ స్థితః. 54

తస్మాద్యజ్జంగమం నామ తత్స్వబోధనరూపవత్
తేనబుద్ధం తత స్తద్వత్తదేవాద్యాపి సంస్థితమ్ 55

శూన్యాకారమగు చిత్సంకల్పమే ఆకాశమనియు, భూమ్యాకారమగు చిత్సంకల్పమే భూమియనియు, జలశక్తి సంపన్నమగు చిత్సంకల్పమే జలమనియు, గ్రహింపవలెను. అయ్యాదియే ఇట్లు, జంగమ సంకల్పమువలన జంగమపదార్థములను స్థావరసంకల్పమువలన స్థావరములుగను వివర్తమునందుచున్నది. చిత్-శక్తి ఇట్లు వృక్షశిలాది రూపములనుగూడ గ్రహించుచున్నది. అయ్యాది సృష్ట్యాదియందు ఏ ఏరూపముల నుండగోరుకొనినవో, ఇప్పుడు ఆయారూపములుగనే యున్నది.

యద్వృక్షాదిధమాబుద్ధం స్థావరత్వేనవై పునః
జడమద్యాపి సంసిద్ధం శిలాతరుతృణాదిచ. 56

వృక్షములు మున్నగు జడపదార్థములేరీతిగ నప్పుడు భావింపబడినవో, ఇప్పుడును అట్లే యున్నవి.

నతుజాడ్యం పృథక్కించి దస్తినాపిచ చేతనమ్
నాత్రభేదోఽస్తి సర్గాదౌ సత్తాసామాన్యకేనచ. 57

జడమని చేతనమనిగాని వెవ్వేరు పదార్థములు లేవు. జడచేతనముల సత్త ఆ బ్రహ్మపదార్థమొక్కటియే. జడము సద్వస్తువు నాశ్రయించుకొని యుండజాలదు. అందువలన జడమను విభాగము మిథ్యయే.

వృక్షాణాముపలానాం యా నామాంతఃస్థాః స్వసంవిదః
బుద్ధ్యాదివిహితాన్యేవ తాని తేషామితిస్థితిః. 58

వృక్షపర్వతాదులుగూడ చిదేకరసముతోడనే నిండియున్నవి. అవి జడములను కల్పన బుద్ధియొక్క ఆరోపమమాత్రమేయై యున్నది.

విదోంతఃస్థావరాదేర్యా స్తస్యాబుద్ధ్యా స్తథాచితేః
అన్యాభిధానాస్థానార్థాః సంకేతై రపరై ఃస్థితాః. 59

ఆయా వస్తువులయందున్న ప్రత్యక్ బుద్ధి తమ్ము ఆయా వృక్షశిలాదులుగ భావించుకొనుచు, ఆ రూపముననే అభివ్యక్తినంది, అట్లేవ్యవహరింపబడుచున్నవి.

కృమికీటపతంగానాం యానామాంతఃస్వసంవిదః
తాన్యేవ తేషాంబుద్ధ్యాదీన్యభిధార్థాని కానిచిత్. 60

క్రిమికీటకశలభాది జంగమపదార్థములనున్న బుద్ధుల వికారభేదము వలననే వాటికి ఆయా పేర్లు ఏర్పడుచున్నవి.

యథోత్తరాబ్ధిజనతా దక్షిణాబ్ధిజనంస్థితమ్
నకించిదపిజానాతి నిజసంవేదనాదృతే. 61
స్వసంజ్ఞానుభవే లీనా స్తథాస్థావరజంగమాః
పరస్పరంయదాసర్వే స్వసంకేతపరాయణాః. 62

ఉత్తరసముద్ర తీరముననున్నవారు దక్షిణసముద్ర తీరముననున్నవారిని గుఱించి తెలిసికొన జాలనట్లు, ఈ స్థావరజంగమ పదార్థములుగూడ స్వస్వరూపమును గ్రహింపజాలకున్నవి; ఇయ్యవి తమతమ ప్రత్యక్ - చైతన్యజ్ఞాన వలయముననే బడియున్నవి. ఇతరులబుద్ధికల్పనను ఎఱుగజాలకున్నవి ఇదంతయు బుద్ధి - కల్పనను అనుసరించియే జరుగుచున్నది.

యథాశిలాంతఃసంస్థానాం బహిస్థానాంచవేదనమ్
అసజ్జడంచభేకానాం మిథోఽంత స్తథుషాంతథా. 63
సర్వంసర్వగతంచిత్తం చిద్వ్యోమ్నాయత్ప్రచేతితమ్
సర్గాదాచోపనంవాయుః సఇహాద్యాపిసంస్థితః. 64

సచ్చిద్రూపమగు పరబ్రహ్మమున వాయువున్నగు పదార్థములయొక్క సత్త వాస్తవము నకు లేకున్నను వాటికి కాల్పనికమగు సత్తయున్నది. రాతియందున్న కప్ప బయటనున్న కప్పను, బయటనున్న కప్ప రాతియందున్న కప్పను గ్రహింపజాలనట్లు పదార్థములన్నియును పరస్పరము గ్రహింపజాలకున్నవి. మహాప్రళయ సమయమున మాయయందు లీనమైన సమిష్టిచిత్తమే ఈ జగత్తుయొక్క సూక్ష్మావస్థ; మరలనియ్యది సృష్టిప్రారంభమున ప్రత్యక్ - చైతన్య చిదాకాశమున భావింపబడినట్లు, నేడుగూడ నిలిచియున్నది. సృష్ట్యాదియందు స్పందనధర్మియగు వాయువుగ చింతింపబడినదే నేడు గూడ అట్లే నిలిచియున్నది.

చేతితంయత్తుసౌషిర్యం తన్నభ స్తత్రమారుతః
స్పందాత్మేత్యాదిసర్గేహః పదార్థేష్వేవచోపనమ్. 65
చిత్తంతుపరమార్థేన స్థావరేజంగమేస్థితమ్
చోపనాన్యనిలై రేవ భవంతి నభవంతిచ. 66

ఛిద్రభావమున చింతింపబడినది ఆకాశరూపమున నిలిచియున్నది. ఈ ఆకాశమున స్పందధర్మియగు వాయువు వెలయుచున్నది. వాయువు సర్వవ్యాపియైనను శుష్కతృణాది లఘుపదార్థములుతప్ప, భారములగు పదార్థములు దానిచే కదల్పబడజాలనట్లు, చిత్తము సర్వత్ర వ్యాపించియుండి, సర్వత్ర పొగలిగినను, శరీరము వాయువుయొక్క స్పందాస్పందనముల బట్టి, స్థావరజంగమములను ద్వివిధాకారములను దాల్చినది.



ఏవంభ్రాంతిమయేవిశ్వే పదార్థాఃసంవిదంశవః
సర్గాదిషుయథై వాసం స్తథై వాద్యాపిసంస్థితాః. 67
యథావిశ్వపదార్థానాం స్వభావస్యవిజృంభితమ్
అసత్యమేవసత్యాభం తదేతత్కథితంతవ. 68

ఇట్లా బుద్ధిచైతన్యమున భ్రమమయములగు జగత్పదార్థములు, కిరణములవలె, ఎట్లువెలువడునో అట్లే నేటికిగూడ ప్రకాశించుచున్నవి. ఈ జగత్పదార్థముల విజృంభణము అసత్యమైనను సత్యమట్లు ప్రతిభాసించు రీతిని నీకు జెప్పితిని.

అయమ స్తంగతఃప్రాయః పశ్యరాజావిదూరథః
మాలాశవస్యపద్మస్య పత్యు స్తేయాతిహృద్గతమ్. 69

ఇప్పుడు విదూరథుడు మృతప్రాయుడైనాడు. చూడుము! మరణించి, పుష్పములచే గప్పబడిన పద్ముని హృత్పద్మమున ప్రవేశింప బోవుచున్నాడు.

ప్రబుద్ధ లీలోవాచః—

కేనమార్గేణ దేవేశి యాత్యేషశవమండపమ్
ఏనమేవాశుపశ్యంత్యా వావాం గచ్ఛావఉత్తమే. 70

ప్రబుద్ధలీలః- దేవేశీ! రమ్ము! ఇతడేమార్గము ననుసరించి శవమున్న చోటికి కలుగునో గాంతము;

శ్రీ దేవ్యువాచః—

మనుష్యవాసనాంతస్థం మార్గమాశ్రిత్యగచ్ఛతి
ఏషోఽహమపరంలోకం దూరంయామీతిచిన్మయః 71
మార్గేణైవమనేనైవ యావ స్తేయేనసంమతమ్
పరస్పరేచ్ఛావిచ్ఛిత్తి ర్నహిసౌహార్దబంధనీ. 72

శ్రీదేవి:- చిన్మయస్వరూపుడగు ఈ జీవుడు "దూరముననున్న పరలోకమున కరుగుచున్నాను" అనిభావించి హృదయముననున్న వాసనామయపథము ననుసరించి చనుచున్నాడు. మనమీ మార్గమున పోదము, రమ్ము! నీ అభీష్టము సిద్ధింపగలదు. వాంఛ సిద్ధింపకున్న స్నేహమునకు ముప్పువాటిల్లును కదా!

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఇతివిహితకథాగతక్లమాయాం
పరమదృశిప్రసృతే విబోధభానౌ
నృపతివరసుతామనస్యుదారే
విగలితచిత్తజడోవిదూరథోఽభూత్. 73

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే లీలోపాఖ్యానే సంసారమరణావస్థా వర్ణనంనామ పంచపంచాశత్తమః సర్గః ॥ 55 ॥

వసిష్ఠుడు:- సరస్వతీదేవియొక్క ఈ వాక్యముల నాలించుటవలన లీలాదేవికి శోకము తొలగిపోయి జ్ఞానసూర్యుడుదయించెను. విదూరథుడు లీనచిత్తుడును, మూర్ఛితుడును, చేతనారహితుడును నయ్యెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున సంసారమరణావస్థా వర్ణనమను పంచపంచాశ సర్గము. ॥ 55 ॥

## షట్పంచాశత్తమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఏతస్మిన్నంతరేరాజా పరివృత్తాక్షితారకః
బభూవైకతనుప్రాణ శేషఃశుష్కాసితాధరః 1
జీర్ణపర్ణ సవర్ణాభః క్షీణపాండుముఖచ్ఛవిః
భృంగధ్వనితసచ్ఛాయ శ్వాసకూజావికూణితః. 2
మహామరణమూర్ఛాంధ కూపేనిపతితాశయః
అంతర్నిలీననిఃశేష నేత్రాదీంద్రియవృత్తిమాన్. 3
చిత్రన్యస్తఇవాకార స్సాత్రదృశ్యోవివేచనః
నిఃస్పందసర్వావయవః సముత్కీర్ణ ఇవోపలే. 4
బహునాత్రకిముక్తేన తనుదేశేన తంజహౌ
ప్రాణఃపిపతిషుంవృక్షం స్వంపక్షీవాంతరిక్షగః. 5

వసిష్ఠుడు:- మూర్ఛితుడగు విదూరథుని కనుపాపలు తిరుగసాగెను. పెదవు లెండిపోయెను; ప్రాణమొక్కటియే మిగిలియుండెను. అతని శరీరకాంతి ఎండుటాకువలెనయ్యెను. ముఖకాంతి క్షీణించి, పాలిపోయెను. తుమ్మెదల రొదవలె ప్రాణవాయువు ధ్వనిచేయుచు, ముక్కులనుండి వెలువడదొడగెను. మరణమూర్ఛయను అంధకూపమున నతనిమనస్సు లీనమవ, ఇంద్రియకార్యములు కట్టువడెను. అవయవముల కదలికలేకపోవుటవలన నాతడు చిత్రపటమువలెను, రాతిబొమ్మవలెను, నగపడజొచ్చెను. ఇంక ఎక్కుడుగ చెప్పవలసినదేమున్నది? ఆకాశమునకు పోగోరుపక్షి తానుండు వృక్షమును త్యజించునట్లు, ప్రాణవాయు వాతని శరీరమును విడచెను.

తేతందదృశతుర్బాలే దివ్యదృష్టీనభోగతమ్
జీవంప్రాణమయీాసంవి ద్గంధలేశమివానిలే. 6



ఆఘ్రాణవృత్త్యుపహితమగు చైతన్యము వాయువుననున్న సూక్ష్మగంధమును గ్రహించునట్లు వారు దివ్యదృష్టివలన ఆకాశమున కదిగిన ఆజీవుని గాంచసాగిరి.

సాజీవసంవిద్గగనే వాతేనమిలితాసతీ
ఖేదూరం గంతుమారేభే వాసనానువిధాయినీ 7

ఆ విదూరథుని జీవచైతన్యము ఆకాశమున వాయువుతోగలసి, వాసనలననుసరించి, ఆకాశపథమున దూరముగ నరుగసాగెను.

తామేవానుససారాథ స్త్రీద్వయంజీవసంవిదమ్
భ్రమరీయుగలంవాత లగ్నాం గంధకలామివ. 8

భ్రమరములు వాయువుననున్న గంధముననుసరించునట్లు, ఆరమణులిర్వురును ఆజీవచైతన్యము ననుసరింపసాగిరి.

తతోముహూర్తమాత్రేణ శాంతే మరణమూర్ఛనే
అంబరేబుబుధేసంవిద్గంధలేఖేన వాయునా. 9
అపశ్యత్పురుషాన్యామ్యా న్నీయమానంచతైర్వపుః
బంధుపిండప్రదానేన శరీరంజాతమాత్మనః. 10
మార్గేకర్మఫలోల్లాస మతిదూరతరేస్థితమ్
వైవస్వతపురంప్రాప జంతుభిఃపరివేష్టితమ్. 11
ప్రాప్తంవైవస్వతపుర మాదిదేశ తతోయమః
అస్యకర్మాణ్యశుభ్రాణి నైవసంతి కదాచన. 12
నిత్యమేవావదాతానాం కర్తాయంశుభకర్మణామ్
భగవత్యాఃసరస్వత్యా వరేణాయంవివర్ధితః. 13
ప్రాక్తనోఽస్యశవీభూతో దేహోఽస్తికుసుమాంబరే
ప్రవిశత్వేషతంగత్వా త్యజ్యతామితిచేతసా. 14

పిదప, ముహూర్తములో నాతడు మరణమూర్ఛనుండి తేరుకొని, వాయువుననున్న గంధకణమువలె, ఆకాశదేశమున నిట్లనుభవింప దొడగెను:—

బంధువులు ఒనర్చిన ఔర్ధ్వదైహికక్రియలవలన శరీరముత్పన్నమైనది; యమభటులరుదెంచి ఆ శరీరమును గొనిపోవుచుండిరి. ప్రాణి కర్మఫలప్రదమును, జనాకీర్ణమును నగు యమపురికరిగినాడు. యముడీజీవుని గాంచి దూతలకిట్లనెను. "ఇత డెన్నడును పాపము నొనర్చలేదు, ఎల్లప్పుడును పవిత్రకార్యములనే ఆచరించినాడు, సరస్వతీదేవివరమున నితడు వర్ధిల్లినాడు. ఇతనిపూర్వశవము పుష్పములతో గప్పబడియున్నది. ఇతనిని విడచిపెట్టుడు, ఇత డద్దానప్రవేశించునుగాక !"

తతస్త్యక్తోనభోమార్గ యంత్రోపలఇవచ్యుతః
అథజీవకలాలీలా జ్ఞప్తిశ్చేతిత్రయంనభః. 15
పుష్పవేజీవలేఖాతు రూపిణ్యౌతే న పశ్యతి
తామేవానుసరంత్యౌతే సముల్లంఘ్యనభస్తలమ్. 16

లోకాంతరాణ్యతీత్యాశు వినిర్గత్యజగద్గృహాత్
ద్వితీయంజగదాసాద్య భూమండలముపేత్యచ. 17
తేద్వేసంకల్పరూపిణ్యౌ సంగతేజీవలేఖయా
పద్మరాజపురంప్రాప్య లీలాంతఃపురమండపమ్ 18
క్షణాద్వివిశతుఃస్వైరం వాతలేఖాయథాంబుజమ్
సూర్యభాసోయథాంభోజం సురభిఃపవనంయథా. 19

అనంతరము, యంత్రమునుండి విడువబడిన శిలవలె, నాజీవచైతన్యము ఆకాశదేశమునబడెను. పిదప, నయ్యది చనుచుండ, దానికై వేచియున్న లీలాసరస్వతులుగూడ దాని ననుసరింపసాగిరి. రూపములోనున్నను వారిని విదూరథుడు గాంచజాలకపోయెను. ఆ లలన లిర్వురును ఆజీవుని అనుసరించుచు ఆకాశమండలమును, ఇతరలోకములను దాటుచు, జగద్గృహమునుండి వెల్వడి, ద్వితీయ బ్రహ్మాండమును బ్రవేశించిరి. అచ్చట, భూమండలమును బ్రవేశించి, సంకల్పరూపులగు ఆ రమణీమణులు ఆసూక్ష్మజీవునితోగూడి, పద్మునిరాజధానిని బ్రవేశించిరి. వాయుకణము పద్మమున బ్రవేశించునట్లును, సూర్యకాంతి పద్మమునబడునట్లును, సుగంధము గాలిలో గలయునట్లును వారు క్షణములో లీలయొక్క అంతఃపురమండపమును బ్రవేశించిరి.

శ్రీరామ ఉవాచః—

బ్రహ్మన్‌ప్రాప్తఃకథమసౌ శవస్యనికటంగృహమ్
కథంతేనపరిజ్ఞాతో మార్గోమృతశరీరిణా. 20

శ్రీరాముడు:- బ్రహ్మజ్ఞా! విదూరథుని జీవచైతన్యమెట్లుమార్గమును గ్రహింపగలిగి శవమున్న గృహమును బ్రవేశింపగలిగినదో నాకు దెలియజెప్పుము.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

తస్యస్వవాసనాంతస్థ శవస్యకిలరాఘవ
తత్సర్వంహృద్గతంకస్మా న్నాసౌప్రాప్నోతితద్గృహమ్. 21

వసిష్ఠుడు:- రాఘవా! విదూరథ - జీవచైతన్యముయొక్క హృదయమున, వాసనాబలమున, పద్మునిశరీరమే తానను అహంకారమిమిడియుండెను. అందువలన నయ్యది దారిని తెలిసికొనగల్గెను.

భ్రాంతిమాత్రమసంఖ్యేయం జగజ్జీవకణోదరే
వటధానాతరుమివ స్థితంకోవానపశ్యతి. 22
యథాజీవద్వపుర్బీజ మంకురంహృదిపశ్యతి
స్వభావభూతంచిదణు స్త్రైలోక్యనిచయంతథా. 23
నరోయథైకదేశస్థో దూరదేశాంతరస్థితమ్
సంపశ్యతినిధానంస్వం మనసానారతంసదా. 24
తథాస్వవాసనాంతస్థ మభీష్టంపరిపశ్యతి
జీవోజాతిశతాఢ్యోఽపి భ్రమేఘరిగతోఽపిసన్. 25



వటబీజము తనయందు సూక్ష్మరూపముననున్న వృక్షమును తగినసమయము, కారణములు లభించిన పరిపూర్ణవృద్ధినందిన స్థితిలో గాంచగలిగినట్లు, జీవచైతన్యముగూడ తనహృదయముననున్న వాసనల ఉద్బోధకములు లభించిన పరిపుష్టములగుట గాంచుచున్నది. వినష్టముగాని బీజము తనయందున్న అంకురమును గ్రహింపగలిగినట్లు, చిత్స్వరూపుడగు జీవుడుగూడ, తనయందున్న సంస్కారరూపముననున్న ముల్లోకములననుభవించుచున్నాడు. మనుష్యుడు మఱియొకతావుననున్న ధనరాసులను భావనాబలమున గాంచునట్లు, జీవుడు నూర్లకొలది జన్మలుగడచి, భ్రమయందు పడుచున్నను, పూర్వవాసనలయందు దన అభీష్టమును గాంచుచున్నాడు. ఇత్యాది భ్రాంతియేయైనను, అతనికి సత్యమువలనే అగపడుచున్నది.

శ్రీరామ ఉవాచః—

భగవన్పిండదానాది వాసనారహితాకృతిః
కీదృక్సంపద్యతే జీవః పిండోయస్మైనదీయతే. 26

శ్రీరాముడు:- భగవానుడా! పిండప్రదానమొనర్పబడిన జీవునకట్టివాసనయుండదుకదా! అతనికెట్లు మరల శరీరమువచ్చునో వచింపుడు.

శ్రీ వసిష్ఠ ఉవాచః

పిండోఽథదీయతే మావా పిండోదత్తోమమేతిచేత్
వాసనాహృదిసంరూఢా తత్పిండఫలభాఙ్నరః 27

వసిష్ఠుడు:- పిండము వేయబడినను వేయబడకపోయినను, 'వేయబడినది' అని మృతుడు భావించిన, అతనికి పిండప్రదాన-ఫలము లభించుచున్నది.

యచ్చిత్తంతన్మయోజంతు ర్భవతీత్యనుభూతయః
సదేహేషువిదేహేషు నభవత్యన్యథాక్వచిత్. 28

చిత్తమేరూపముననుండునో, జీవుడుగూడ అదే రూపమును దాల్చునని విద్వాంసులు గ్రహించియున్నారు. ఈ నియమము మృతులపట్లను, జీవితుల పట్లనుగూడ వర్తిల్లును.

సపిండోఽస్మీతిసంవిత్త్యా నిష్పిండోఽపిసపిండవాన్
నిష్పిండోఽస్మీతిసంవిత్త్యా సపిండోఽపి నపిండవాన్. 29

పిండము బొందనివాడు, 'పిండమునుబొందితిని,' అని భావించిన అతనికి పిండఫలము దక్కుచున్నది. అట్లే, పిండమునుబొందినవాడు, 'పిండమును బడయలేదు' అని ఎంచిన అతనికి పిండప్రదానఫలము లభింపదు.

యథాభావనమేతేషాం పదార్థానాంహిసత్యతా
భావనాచపదార్థేభ్యః కారణేభ్యఉదేతిహి. 30

భావనాబలముననే ఈ పదార్థముల సత్యత్వము అనుభవింపబడుచున్నది. ఈ భావనకూడ కారణములగు పదార్థములనుండియే కలుగుచున్నది:

యథావాసనయాజంతో ర్విషమప్యమృతాయతే
అసత్యఃసత్యతామేతి పదార్థోభావనాత్తథా. 31

(గరుడోపాసకులకు) భావనాబలమున విషముగూడ అమృతమగునట్లు, అసత్యపదార్థములు భావనాబలమున సత్యములగుచున్నవి.

కారణేనవినోదేతి నకదాచనకస్యచిత్
భావనాకాచిదపినో ఇతినిశ్చయవాన్భవ. 32

కారణములేకుండగ ఎవ్వరికిని ఎట్టిభావనమును ఉదయింపదను నిశ్చయమును దృఢమొనర్చుకొనుము (ఈఅసత్యపదార్థములన్నియును సత్యమగు బ్రహ్మముననే అధ్యారోపితములని గ్రహింపుము, అని భావము).

కారణేన వినాకార్య మామహాప్రలయంక్వచిత్
నదృష్టంనశ్రుతంకించి త్స్వయంత్వేకోదయాదృతే. 33

బ్రహ్మ మొక్కటియే నిత్యప్రకాశవస్తువు, దీనికి వేరొక కారణములేదు. మహాప్రళయము వఱకు ఈ జగత్తునజరుగు ఏ ఒక్క కార్యమును కారణములేకుండ జరుగుచుండుట నెవ్వరును గాంచియుండలేదు లేక వినియుండలేదు.

చిదేవవాసనాసైవ ధత్తేస్వప్నఇవార్థతామ్
కార్యకారణతాంయాతి సైవాగత్యేవతిష్ఠతి. 34

విశుద్ధమగు చైతన్యమే వాసనారూపమున కార్యకారణ భావమునుదాల్చి జగద్రూపమున ప్రతిభాసించుచున్నది.

శ్రీరామ ఉవాచః—

ధర్మోనాస్తిమమేత్యేవ యఃప్రేతోవాసనాన్వితః
తస్యచేత్సుహృదాభూరిధర్మఃకృత్వాసమర్పితః. 35
తత్తద్వాసనకింధర్మో నష్టఃస్యాదుత వా న వా
సత్యార్థావాప్యసత్యార్థా భావనాకింబలాధికా. 36

శ్రీరాముడు,— 'నాకు (పిండప్రదానాదులనుండి కలిగిన) ధర్మములేదు' అని తలచు మృతవ్యక్తి నుద్దేశించి, అతని బంధుగులు లెక్కకుమీరిన ధర్మకార్యముల నాచరించిన, ఆ ధర్మము ఆ జీవుని పట్ల ఫలప్రదమగునా? బంధుగులొనర్చునది సత్యము, అతడు చింతించునది అసత్యము - వీటిలో ఎద్దానిబల మెక్కుడుగ నుండును?

శ్రీవసిష్ఠ ఉవాచః—

దేశకాలక్రియాద్రవ్య సంపత్త్యోదేతిభావనా
యత్రైవాభ్యుదితాసాస్యా త్సద్వయోరధికోజయీ. 37
ధర్మదాతుఃప్రవృత్తాచే ద్వాసనాతత్తయాక్రమాత్
అపూర్యతేప్రేతమతిర్న చేత్ప్రేతధియాశుభా. 38



ఏవంపరస్పరజయా జ్జయత్యత్రాతివీర్యవాన్
తస్మాచ్ఛుభేనయత్నేన శుభాభ్యాసముదాహరేత్. 39

వసిష్ఠుడు:- శాస్త్రవిహితములగు స్థల, కాలముల తదుక్తములగు క్రియా (శ్రాద్ధాదులు) ద్రవ్యసంపత్తులతో (దర్భతిలాదులతో) బంధుగులవలన నాచరింపబడిన ధర్మవాసనయే ప్రేతవాసనకంటె బలవత్తరము. ప్రేతవాసన శాస్త్రప్రమాణితము గాదు. లౌకిక సిద్ధము. ప్రేతము వేదవిద్వేషియగు నాస్తికుడుగానున్న అతనివాసన, ధర్మవాసనవలన జయింపబడుచున్నది. ఇట్లు, ఈ రెంటిలో నధిక బలమగునదే జయము నందుచున్నది. అందువలన, మిక్కిలిగ యత్నించి శుభమునే నేర్పవలయును.

శ్రీరామ ఉవాచః—

దేశకాలాదినాబ్రహ్మన్వాసనా సముదేతిచేత్
తన్మహాకల్పసర్గాదౌ దేశకాలాదయఃకుతః. 40
కారణేసముదేతీదం తైస్తదాసహకారిభిః
సహకారికారణానామభావే వాసనాకుతః. 41

శ్రీరాముడు:- బ్రహ్మజ్ఞా! దేశకాలాదులననుసరించి వాసన ఉదయించుచో, సృష్టి ఎటనుండివచ్చినది? కల్పాదియందు దేశకాలములులేవా! — ప్రథమసృష్టికి కారణమగు వాసన ఎటనుండి వచ్చినది? దృశ్యసమూహములుగూడ వాసనల కార్యమేయనినను ఇదే ప్రశ్నగలుగుచున్నది. దేశకాలాదులగు సహకారికారణములు లేకున్నను, ఈ వాసనలెటనుండి వచ్చినవి?

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఏవమేతన్మహాబాహో సత్యాత్మన్నకదాచన
మహాప్రలయసర్గాదౌ దేశకాలౌ నకౌచన. 42
సహకారికారణానామభావేసతిదృశ్యధీః
నేయమస్తినచోత్పన్నా నచస్ఫురతికాచన. 43
దృశ్యస్యాసంభవాదేవ కించిద్యద్దృశ్యతేత్విదమ్
తద్బ్రహ్మైవస్వచిద్రూపం స్థితమిత్థమనామయమ్. 44
ఏతచ్చాగ్రేయుక్తిశతైః కథయిష్యామ్యపవతే
ఏతదర్థంప్రయత్నోఽయం వర్తమానకథాంశృణు. 45

వసిష్ఠుడు:- మహాబాహూ! నీవు నుడివినదంతయు నిక్కమే. సృష్ట్యాదియందు దేశకాలము లేవియును లేకుండెను. కారణాభావమున దృశ్యపదార్థములకు ఉత్పత్తిలేదు. ఉత్పత్తిలేనివాటికి వినాశమెట్లు సంభవించును? అందువలన ఇదంతయు చిదాకారమగు పరబ్రహ్మమే, వేరొకటిలేదు. ఈ విషయమై నీకు చాలయుక్తులను జెప్పెదను. ఈ విషయమును దెలియజెప్పుటకే నేను ప్రయత్నించుచున్నాను. ప్రకృతమును వినుము.

ఏవందదృశతుః ప్రాప్తే మందిరంసుందరోదరమ్
కీర్ణంపుష్పోపహారేణ వసంతమివశీతలమ్. 46
ప్రశాంతాచారసంరంభ రాజధాన్యాసమన్వితమ్
మందారకుందమాల్యాది శవం తత్రసమంస్థితమ్ 47
మందారకుందస్రగ్దామ వృతాంబరబృహచ్ఛవమ్
శవశయ్యాశిరఃస్థాగ్ర్య పూర్ణకుంభాదిమంగలమ్. 48
అనివృత్తగృహద్వార గవాక్షకలినార్గలమ్
ప్రశామ్యద్దీపకాలోక శ్యామలామలభిత్తికమ్
గృహైకదేశసంసుప్త ముఖశ్వాససమీకృతమ్ 49
సంపూర్ణచంద్రసకలోదయకాంతికాంతం
సౌందర్యనిర్జితపురందరమందిరర్ధి
వైరించపద్మముకులాంతరచారుశోభం
నిఃశబ్దమందమివనిర్మలమిందుకాంతమ్. 50

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే లీలోపాఖ్యానే మరణశయనానంతరప్రేతవ్యవస్థానామ షట్పంచాశత్తమః సర్గః ॥ 56 ॥

జ్ఞప్తిదేవియును లీలయును నిల్లు నలుదిక్కుల పూలతో గప్పబడి వసంతకాలమువలె మనోహరమును, శీతలమునునగు ఆ పద్ముని భవనమును బ్రవేశించి, యిట్లు కాంచిరి:_ రాజకార్యములనువిడచి, పురజనులు అటనుండిరి. మందారకుందాదిపుష్పముల గప్పబడిన శవ మచ్చట నేయుండెను. శవమునకు దలవైపున పూర్ణకుంభము మున్నగు మంగళద్రవ్యము లుండెను. గదితలుపులును, గవాక్షములును గట్టిగ గడియవేయబడియుండెను. ప్రదీపకాంతి తగ్గిపోవుచుండుటవలన తెల్లనిగోడలుగూడ నల్లగనగపడుచుండెను. పరుండినవారందరును సమముగ గుఱ్ఱుపెట్టుచుండిరి. ఆ భవనము ఇంద్రుని వైజయంతమునుగూడ నోడించుచు, బయటనుండి లోనవెన్నెలపడినచోట్లు, భగవంతుని నాభికమలమువలె శోభిల్లుచుండెను. చంద్రునివలె మనోహరమగు ఆ ప్రాసాదము మూకవలె, నిశ్శబ్దముగ నుండెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున ప్రేతవ్యవస్థయను షట్పంచాశ సర్గము ॥ 56 ॥

## సప్తపంచాశత్తమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

తతోదదృశతుస్తత్ర శవశయ్యైకపార్శ్వగామ్
లీలాంవిదూరథస్యాగ్రే మృతాం తేప్రథమాగతామ్. 1
ప్రాగ్వేషాంప్రాక్సమాచారాం ప్రాగ్దేహాంప్రాక్సవాసనామ్
ప్రాక్తనాకారసదృశీం సర్వరూపాంగసుందరీమ్ 2
ప్రాగ్రూపావయవస్పందాం ప్రాగంబరపరీవృతామ్
ప్రాగ్భూషణభరచ్ఛన్నాం కేవలంతత్రసంస్థితామ్. 3
గృహీతచామరాంచారు వీజయంతీంమహీపతిమ్
ఉద్యచ్చంద్రామివదివం భూషయంతీంమహీతలమ్. 4
మౌనస్థాంవామహస్తస్థ వదనేందుతయానతామ్
భూషణాంశులతాపుష్పైః ఫుల్లామివవనస్థలీమ్. 5
కుర్వాణాంవీక్షితైర్దిక్షు మాలత్యుత్పలవర్షణమ్
సృజంతీమాత్మలావణ్యా దిందుమిందుంనభోదితమ్. 6
నరపాలాత్మనోవిష్ణో ర్లక్ష్మీమివసమాగతామ్
ఉదితాంపుష్పసంభారాదివ పుష్పాకరశ్రియమ్. 7
భర్తుర్వదనకేన్యస్త దృష్టిమిష్టవిచేష్టితామ్
కించిత్ప్రమ్లానవదనాం మ్లానచంద్రాం నిశామివ. 8
తాభ్యాంసాలలనాదృష్టా తయాతేతునలక్షితే
యస్మాత్తేసత్యసంకల్పే సా న తావత్తథోదితా. 9

వసిష్ఠుడు:_ అనంతరము సరస్వతీ లీలాదేవులు, విదూరథునికంటె ముందుగా మరణించి అరుదెంచిన అప్రబుద్ధ లీల శవపార్శ్వమున గూర్చొనియుండుటను గాంచిరి. ఆ లీలయొక్క వేషము, నడవడి, శరీరము, వాసనలు, ఆకారము, రూపము, అవయవస్పందనము, కట్టుబట్టలు, నగలు మున్నగున వన్నియును మునుపటియట్లే ఉండెను. కాని, భేదమేమన, ఆమె విదూరథుని ఇంటిని విడచి ఇట నున్నది. ఆమె చక్కటి చామరమునుగొని వీచుచుండెను. చంద్రోదయమున నాకాశ మలంకరింపబడునట్లు, ఆ చోటు ఆమె ఉనికివలన శోభిల్లుచుండెను. ఆమె ఎడమచేతియందు మోమునుంచి, తల వంచుకొని మాట్లాడకుండ నుండెను. ఆభరణకాంతులను వికసిత పుష్పములతో నామె వనస్థలివలె శోభిల్లుచుండెను. ఆమె నలుదిక్కుల జూచుచు, మాలతీ, ఉత్పల పుష్పముల వర్షించుచున్నట్లుండెను. స్వలావణ్యమువలన ఆకాశమున పెక్కుచంద్రులను ఉదయింప జేయుచున్నట్లుండెను. ఆమె రాజు అను విష్ణుని లక్ష్మియో, పుష్పసమూహమును గొనివచ్చిన వసంతలక్ష్మియో యనునట్లుండెను. ఆమె భర్తృవదనమును అభిలాషతో గాంచుచుండెను. ఆమె ముఖమండల మొకింత వాడియుండుటవలన, కాంతిదక్కిన చంద్రునితోగూడిన రాత్రివలె దోచుచుండెను. ప్రబుద్ధలీలయును, సరస్వతీదేవియును ఈమెను గాంచగల్గిరి, కాని, ఈమె వారిని, సత్యసంకల్ప గాకపోవుటవలన గాంచజాలక పోయెను.

శ్రీరామ ఉవాచ:—

తస్మిన్ప్రదేశే సాపూర్వా లీలాసంస్థాప్య దేహకమ్
ధ్యానేనజ్ఞప్తిసహితా గతాభూదితివర్ణితమ్. 10
కిమిదానీంసలీలాయా దేహస్తత్రనవర్ణితః
కింసంపన్నః క్వవాయాత ఇతిమేకథయప్రభో. 11

శ్రీరాముడు:– ప్రభూ! పూర్వలీల అచ్చట తనశరీరమునుంచి ధ్యానబలమున విదూరథుని భవనమున కఱిగెనని చెప్పియుంటిరి, ఇప్పుడు లీలయొక్క శరీరమును గుఱించి ఏమియును జెప్పలేదే ? ఆ దేహ మేమైనది.? ఎచ్చటి కఱిగినది? వచింపుడు.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

క్వాసీల్లీలాశరీరంత త్కుత స్తస్యాస్తిసత్యతా
కేవలాభ్రాంతిరేవాభూ జ్జలబుద్ధిర్మరావివ. 12

వసిష్ఠుడు:— లీలయొక్క శరీరము సత్యమైనగదా, అది ఎచ్చటనున్నది అను ప్రశ్నఉదయించును; ఆశరీరము మరుభూమియందలి జలమువలె భ్రాంతిమాత్రమే.

ఆత్మైవేదంజగత్సర్వం కుతోదేహాదికల్పనా
బ్రహ్మైవానందరూపం సద్యత్పశ్యసితదేవచిత్. 13

ఈ జగత్తంతయు ఆత్మయే, ఇందుదేహాదికల్పనలకు తావెచ్చటనున్నది? నీవు గాంచునదంతయు ఆనందరూపమగు చిన్మయబ్రహ్మమే.

యథైవబోధేలీలాసా పరిణామమితాక్రమాత్
పరేతథైవతస్మాత్త ద్ధిమవద్గలితంవపుః. 14

లీలయొక్కజ్ఞానము వృద్ధియైనకొలది, ఆపెశరీరము మంచువలె కఱిగిపోయినది.

ఆతివాహికదేహేన దృశ్యంయదవలోకితమ్
భూమ్యాదినామ తస్యైవ కృతంతచ్చాధిభౌతికమ్. 15

ఇప్పుడాపె ఆతివాహికదేహమున గాంచునవన్నియు పూర్వము భూమ్యాదినామములనుండి, ఆధిభౌతికరూపమున నుండెను. ఇప్పుడామెకు పూర్వపు భ్రాంతిలేదు.

వాస్తవేనతురూపేణ భూమ్యాద్యాత్మాధిభౌతికః
నశబ్దేననచార్థేన సత్యాత్మాశశశృంగవత్. 16

వాస్తవమునకు ఆధిభౌతికమనునదియే లేదు. శబ్దము, అర్థములుసత్యములుగావు. ఇవన్నియును కుందేటికొమ్మువలె అలీకములు.

పుంసోహరిణోఽస్మీతి స్వప్నేయస్యోదితామతిః
సకిమన్విష్యతిమృగం స్వమృగత్వపరీక్షయే. 17

స్వప్నమున 'నేను లేడిని' అని దలచినవాడు, ఈ విషయమును బరీక్షించుటకై లేడిని వెదకునా? (వెదకడు, తానులేడియేయను భ్రాంతియందు పడియుండును, అనిభావము).



ఉదేత్యసత్యమేవాశు తథాసత్యంవిలీయతే
భ్రాంతిర్భ్రమవతోరజ్జ్వా మపిసర్పభ్రమేగతే. 18

రజ్జువున సర్పభ్రమ తొలగిపోయిన, భ్రాంతిదూరమై సత్యము తెలియవచ్చునట్లు, భ్రాంతుని భ్రమ తొలగిపోయిన సత్యమగు జ్ఞానమే మిగిలియుండును.

నమస్తస్యాప్రబుద్ధస్య మనోజాతస్యకస్యచిత్
బీజంవినాప్యుపైవేయం మిథ్యారూఢిముపాగతా. 19

ఈ ఆధిభౌతిక ప్రపంచమంతయును అప్రబుద్ధమగు మనస్సువలన గల్పింపబడుచున్నది. ఈమిథ్యయే రూఢమగుచున్నది.

స్వాప్నోపలంభంసర్గాఖ్యం సనరోఽనుభవన్స్థితః
చిరమావృత్తదేహాత్మా భూచక్రభ్రమణంయథా. 20

జనులు (రంకులరాటము మున్నగువాటి నెక్కి) భూమి చక్రమువలె తిరుగుచున్నదనుకొనునట్లు, అజ్ఞులే స్వప్నమునుబోలు ఈ సృష్టిని అనుభవించుచున్నారు.

శ్రీ రామ ఉవాచ:—

బ్రహ్మన్లోకైః పురస్థస్య గచ్ఛతోయోగినోనిజమ్
ఆతివాహికతాందేహః కీదృశోఽయంవిలోక్యతే. 21

శ్రీరాముడు:– బ్రహ్మజ్ఞా! ఆత్మప్రాప్తినందిన యోగిదేహము ఆతివాహికభావము నందుననియు, ఆధిభౌతిక భావమును వీడుననియు, ఆతివాహిక దేహము కన్నుల కగపడదనియు, నాశరహితమనియు వచించియుంటిరి, అగుచో, దీనిని జనులెట్లు గాంచగలరు; ఇది ముక్తి-సమయమునగూడ నుండునా ?

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

దేహాద్దేహాంతరప్రాప్తిః పూర్వదేహంవినాసదా
ఆతివాహికదేహేఽస్మి న్స్వప్నేష్వివ వినశ్వరీ. 22

వసిష్ఠుడు:–స్వప్నమున పూర్వదేహమును బరిత్యజించకుండగనే దేహాంతర ప్రాప్తి కలుగునట్లు యోగులకుగూడ ఈ ఆతివాహిక దేహముననే దేహాంతరప్రాప్తి-కల్పన గలుగుచున్నది. *

యథాతపేహిమకణః శరద్వ్యోమ్నిసితోఽంబుదః
దృశ్యమానోఽప్యదృశ్యత్వ మిత్యేవంయోగిదేహకః. 23

ఎండయందగుపించు మంచుబొట్టును, శరత్కాలమున నాకాశముననగుపడు మేఘమును క్షణికములైనట్లు, కనుబడుచున్నను కనబడనివాటిలో చేరినయట్లే, యోగియొక్క శరీరముగూడ అదృశ్యవస్తువేయైయున్నది.

* యోగశాస్త్రమున నియ్యది కాయవ్యూహమనంబడుచున్నది. యోగులు తమప్రారబ్ధకర్మలను నశింపజేసుకొనుటకై, స్వశక్తివలన తదనుకూలములగు దేహసమూహములను గల్పించుకొని, ప్రారబ్ధమునను‌భవించి, కైవల్యము నందుచున్నారు, —అను.

ద్రాగిత్యేవాథవాకశ్చి ద్యోగిదేహోనలక్ష్యతే
యోగిభిశ్చపురోవేగా త్ప్రోడ్డీనఇవఖేఖగః. 24

'వెంటనే అదృశ్యమగుకాక' అను సంకల్పబలమున కొందఱియోగులశరీరము ఆకాశమున నెగురు పక్షివలె శీఘ్రముగ నదృశ్యమై యోగులకుగూడ నగపడకుండును. ఇంక ఇతరులమాటఏమి ?

స్వవాసనాభ్రమేణైవ క్వచిత్కేచిత్కదాచన
మృతోఽయమితిపశ్యంతి కేచిద్యోగినమగ్రగాః. 25

ఒకానొకడు 'ఈ యోగిబ్రతికియున్నాడు. ఈయోగిమరణించినాడు' అనురూపమున బరికించుట వారి వాసనాభ్రమమాత్రమే.

భ్రాంతిమాత్రంతుదేహాత్మా తేషాంతదుపశామ్యతి
సత్యబోధేనరజ్జూనాం సర్పబుద్ధిరివాత్మని. 26

రజ్జుజ్ఞానము గలిగిన సర్పజ్ఞానము తొలగిపోయి త్రాడేయను సత్యజ్ఞానముకలుగునట్లు జ్ఞానోదయమైన, పూర్వదేహదర్శనము భ్రాంతియని ఏర్పడగలదు.

కోదేహఃకస్యవాసత్తా కస్యనాశఃకథంకుతః
స్థితంతదేవయదభూదబోధః కేవలంగతః. 27

అప్పుడు, 'శరీరమన నేమి? దాని ఉనికియేమి ? దాని నాశనమేమి ? ఇవన్నియును అలీకములే. ఉండవలసినదేదియో ఉన్నది. అజ్ఞానము తొలగిపోయినది' అను జ్ఞానము కలుగును.

శ్రీరామ ఉవాచ:—

ఆతివాహికతామేతి ఆధిభౌతికఏవకిమ్
ఉతాన్యఇతిమేబ్రూహి యేనోహ్యాఇవభోఃప్రభో. 28

శ్రీరాముడు:— ప్రభూ! యోగుల అధిభౌతికదేహమే యోగబలమున ఆతివాహికమగుచున్నదా? లేక అది వేరుగ కలుగుచున్నదా ?—చెప్పుడు.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

బహుశోహ్యుక్తమేతత్తే నగృహ్ణాసి కిముత్తమ
ఆతివాహికఏవాస్తి నాస్త్యేవేహాధిభౌతికః. 29

వసిష్ఠుడు:— నేను నీకీవిషయమును ఇదివరలో చాలమార్లు చెప్పియుంటిని — నీవు గ్రహించకున్నావేమి ? ఆతివాహిక శరీరమొక్కటియేయున్నది. అధిభౌతిక శరీరములేదు.

తస్యైవాభ్యాసతోఽప్యేతి సాధిభౌతికతామతిః
యదాశామ్యతి సైవాస్య తదాపూర్వాప్రవర్తతే. 30

ఈ శరీరభ్రాంతి అధ్యాసమువలననే కలుగుచున్నది. అధ్యాసముతొలగిన, అధిభౌతిక బుద్ధిపోయి, ఆతివాహికబుద్ధి ఉదయించును.

తదాగురుత్వంకాఠిన్య మితియశ్చముధాగ్రహః
శామ్యేత్స్వప్ననరస్యేవ బోద్ధుర్బోధాన్నిరామయాత్. 31



కలనుండి తేరుకొనిన అందు గాంచిన నగరముయొక్క కాఠిన్యాదులగుపించనట్లు, ఆతివాహిక జ్ఞానముదయించిన ఈ దేహముయొక్క గురుత్వకాఠిన్యాదులు తోచవు; ఇవన్నియును లయమైపోవును.

లఘుతూలసమాపత్తి స్తతఃసముపజాయతే
స్వప్నేస్వప్నపరిజ్ఞానాదివ దేహస్యయోగినః. 32

'స్వప్నమున, ఇది స్వప్నము' అను జ్ఞానముకలిగిన స్వప్నభ్రాంతి తొలగిపోవునట్లు, ఆతివాహికబోధ ఉదయించిన అధిభౌతిక శరీరబుద్ధి బాధితమగును. ఇట్టి ఆతివాహిక జ్ఞానమును బొందిన యోగులశరీరము దూదివలె తేలిక (లాఘవము) యగును.

స్వప్నేస్వప్నపరిజ్ఞానా ద్యథాదేహోలఘుర్భవేత్
తథాబోధాదయందేహః స్థూలవత్ప్లుతిమాన్భవేత్. 33

స్వప్నసమయమున "నేను స్వప్నమును జూచుచున్నాను" అను జ్ఞానము కలిగిన శరీరము తేలికయై పోవును, భారమనిపించదు. అట్లే, జ్ఞానోదయమైన, స్థూలదేహముతో నాకాశమున కెగురుశక్తి లభించును.

అనేకదినసంకల్పదేహే పరిణతాత్మనామ్
అస్మిన్దేహే శవేదగ్ధే తత్రైవాస్థితివిహాయుషామ్. 34
లఘుదేహానుభవన మవశ్యంభావివై తథా
ప్రబోధాతిశయాదేతి జీవతామపియోగినామ్ 35

చాలకాలము సంకల్పదేహమున నుండువారి పూర్వశరీరము, దగ్ధమైనను, శవముగ మారినను, లఘుదేహము వారికి లభించుచున్నది; ఇంక యోగులసంగతి వేరుగ చెప్పవలయునా ? జ్ఞానాతిశయమువలన వారి కిట్టి సూక్ష్మశరీరము జీవదశయందే లభించుచున్నది.

ఉదితాయాంస్మృతౌతత్ర సంకల్పాత్మాహమిత్యలమ్
యాదృశఃసభవేద్దేహ స్తాదృశోఽయంప్రబోధతః. 36

జ్ఞానులకు స్వప్నమున "నేను సంకల్పమయుండను" అను స్మృతికలిగిన ఆకాశమున విహరింపగల సూక్ష్మశరీరము లభించినట్లు తోచురీతి, జ్ఞానమహిమవలన గూడ కలుగుచున్నది.

భ్రాంతిరేవమియంభాతి రజ్జ్వామివభుజంగతా
కింనష్టమస్యాంనష్టాయాం జాతాయాం కింప్రజాయతే. 37

త్రాటియందు పాము గపడుట భ్రమయైనట్లు, ఈ స్థూలదేహానుభవముగూడ భ్రాంతియే, ఈ భ్రాంతి తొలగిన (దుఃఖములు) అన్నియును తొలగిపోవును. ఈ భ్రాంతియుండిన (దుఃఖములు) అన్నియును సంభవించును.

శ్రీరామ ఉవాచ:—

అనంతరంయేవాస్తవ్యా లీలాంపశ్యంతితేయది
తత్సత్యసంకల్పతయా బుధ్యంతే కిమతఃప్రభో. 38

శ్రీరాముడు:- ప్రభూ! ఆతివాహిక దేహముతో పద్మని అంతఃపురమున కఱిగిన ప్రబుద్ధ లీలను, ఆమె సంకల్పేచ్ఛవలన, నచ్చటివారు కాంచగల్గుదురు కదా! కాంచి ఏమనుకొందురు? (జ్యేష్ఠ శర్మవలె దేవత యనుకొందురా? లేక రాణియే యనుకొందురా?)

**శ్రీ వసిష్ఠ ఉవాచః—**

ఏవంజ్ఞాస్యంతి తేరాజ్ఞీ స్థితేయమిహదుఃఖితా
వయస్యా కాచిదన్యేయం కుతోఽప్యస్యా ఉపాగతా. 39

సందేహాః కథవా తైషాం పశవో హ్యవివేకినః
యథాదృష్టంవిచేష్టంతే కుతఏషాంవిచారణా. 40

యథాలోష్టోలుఠద్వృక్షం వంచయిత్వాశుగచ్ఛతి
అజ్ఞానత్వేఽజపశవ స్తథా హ్యస్తిపురాదికమ్. 41

యథాస్వప్నవపుర్బోధా న్నజానే క్వేవగచ్ఛతి
అసత్యమేవతద్యస్మా త్తథైవేహాధిభౌతికమ్. 42

వసిష్ఠుడు:- ఆమెను దుఃఖముతోనున్న తమరాణియేయని భావింతురు; ద్వితీయలీలను ఎటనుండియో అరుదెంచిన చెలికత్తె యనుకొందురు. ద్వితీయలీలను మున్నెన్నడును గాంచలేదా? అని వీరును శంకింపరు - అవివేకులగు పశువులు తాముజూచు పదార్థముల ననుసరించియే వ్యవహరించు చుందురు. వారికి విచారశక్తి ఎటనుండివచ్చును? మట్టిగడ్డతో బలముకొద్ది వృక్షమును గొట్టిన, అది చెట్టుకుతగుల్కొనజాలదు. పిండియైపోవును. అట్లే, పశుతుల్యులగు అజ్ఞానులుగూడ పదార్థముల అంతరమున ప్రవేశింపజాలరు. తత్త్వనిర్ణయ మొనర్పజాలరు. వారు శరీరాదులను ఉన్నయట్లే అనుభవింతురు. స్వప్నమున గాంచబడిన వస్తువులు మేల్కొనినపిదప ఎచ్చటికిపోవునో తెలియజాలనట్లు, జ్ఞానియొక్క ఆధిభౌతికశరీరము ఎచ్చటికిపోవునో తెలియజాలము. అయ్యది మిథ్య.

**శ్రీరామ ఉవాచః—**

భగవన్స్వప్నశిఖరీ ప్రబోధే క్వేవగచ్ఛతి
ఇతిమేసంశయంఛింధి శరదభ్రమివానిలః. 43

శ్రీరాముడు:- భగవానుడా! స్వప్నమున గాంచబడిన పర్వతము నిద్రనుండి మేల్కొనిన పిమ్మట ఎచ్చటికిపోవుచున్నదో వచించి, వాయువు శరత్కాలమేఘములను బోగొట్టునట్లు, నా సందేహమును బోగొట్టుడు.

**శ్రీ వసిష్ఠ ఉవాచః—**

స్వప్నభ్రమేఽథసంకల్పే పదార్థాఃపర్వతాదయః
సంవిదోఽంతర్విలంత్యేతే స్పందనాన్యనిలేయథా. 44

వసిష్ఠుడు:- కదలిక గాలిలోకలియునట్లు, కలయందుగాంచబడిన కొండలుమున్నగునవి నిద్రనుండి మేల్కొనినపిమ్మట, మరల చైతన్యమునందే విలీనమగుచున్నవి.

అస్పందస్యయథావాయోః సస్పందోఽంతర్విశత్యలమ్
అనన్యాత్మాతథైవాయం స్వప్నార్థఃసంవిదో మలమ్. 45



కదలికలేని గాలియందు కదలెడుగాలి చొచ్చునట్లు, శూన్యములగు ఈ స్వప్నపదార్థములు కూడ చైతన్యమునకు ఆవరకములై (కప్పిపుచ్చునవై) అందు ప్రవేశించుచున్నవి.

స్వప్నాద్యర్థావభాసేన సంవిదేవస్ఫురత్యలమ్
అస్ఫురంతీతు తేనైవ యాత్యేకత్వంతదాత్మికా. 46

స్వప్నమనగనబడు పదార్థములరూపమున ఆత్మచైతన్యమే స్ఫురించుచున్నది. ఇట్టిస్ఫురణ లేనప్పుడది అద్వయమగు ఆత్మతత్త్వముగనే నిలచియుండును.

సంవిత్స్వప్నార్థయోర్ద్విత్వం నకదాచనలభ్యతే
యథాద్రవత్వపయసో ర్యథావా స్పందవాతయోః. 47

నీటికిని ద్రవత్వమునకును, గాలికిని స్పందత్వమునకును భేదము తెలియబడనట్లు, ఆత్మచైతన్యమునకును స్వప్నపదార్థములకును భేదము తెలియబడదు.

యస్త్వత్రస్యాదివాబోధ స్తదజ్ఞానమనుత్తమమ్
సైషాసంసృతిరిత్యుక్తా మిథ్యాజ్ఞానాత్మికోదితా. 48

ఈ స్వప్నపదార్థములయొక్కయు, ఆత్మచైతన్యముయొక్కయు భేదజ్ఞానమే మిక్కుటమగు అజ్ఞానము. దీనినే మిథ్యాజ్ఞానాత్మకమగు సంసారమనికూడ యందురు.

సహకారికారణానామభావే కిలకీదృశీ
సంవిత్స్వప్నపదార్థానాం ద్వితాస్వప్నే నిరర్థికా 49

స్వప్నమునదోచు పదార్థ-చైతన్య భేదజ్ఞానము లోకప్రసిద్ధములగు నిమిత్తకారణములుకూడ లేకపోవుటవలన నిరర్థకమగు చున్నది.

యథాస్వప్న స్తథాజాగ్ర దిదంనాస్త్యత్రసంశయః
స్వప్నే పురమసద్భాతి సర్గాదాభాత్యసజ్జగత్. 50

స్వప్నజాగ్రత్పదార్థము లొకేతరగతికి జెందినవనుటలో సందేహములేదు. స్వప్నదృష్టములగు పురనగరాదు లసత్యములైనట్లు, సృష్ట్యాదియందు ప్రతిభాతమగు ఈ జగత్తుకూడ అసత్యమే.

నచార్థోభవితుంశక్యః సత్యత్వేస్వప్నతోదితః
సంవిదోనిత్యసత్యత్వం స్వప్నార్థానామసత్యతా. 51

స్వప్నపదార్థములు సత్యములుకాజాలవు, అవి అసత్యములు. ఆత్మచైతన్య మొక్కటియే సత్యమును, నిత్యమునునైయున్నది.

ఝటిత్యేవయథాకాశం భవతిస్వప్నపర్వతః
క్రమేణవాతథా బోధే ఖంభవత్యాధిభౌతికమ్. 52

స్వప్నమున గాంచబడిన పర్వతము మేల్కొనిన ఆకాశమగునట్లు, జ్ఞానోదయమైన ఈ ఆధిభౌతిక శరీరము శూన్యమైపోవును.

ఉడ్డీనోఽయంమృతోవేతి పశ్యంతి నికటస్థితాః
జ్ఞమాతివాహికీభూతం స్వస్వభావహతా యతః. 53

అతివాహికభావమునందిన పరమపురుషుని శరీరము ఆకాశమున లేచుచున్నట్లుగాని, శవమైనట్లుగాని లోకులుకాంచుట వారి అజ్ఞానమువలననే.

మిథ్యాదృష్టయ ఏవేమాః సృష్టయోమోహదృష్టయః
మాయామాత్రదృశోభ్రాంతిః శూన్యాఃస్వప్నానుభూతయః. 54

స్వప్నదృష్ట పదార్థములవలె శూన్యమగు ఈ సృష్టి మిథ్యయును, మోహమునునగు భ్రాంతియే.

స్వప్నానుభూతయ ఇమామరణాంతబోధే
భ్రాంత్యేతరభ్రమదృశః స్ఫుటసర్గభాసః
భ్రాంత్యాతివాహిక శరీరగతాఃసమస్తా
మిథ్యోదితామృగనదీసరణక్రమేణ. 55

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
లీలోపాఖ్యానే స్వప్నార్థ విచారోనామ సప్తపంచాశత్తమః సర్గః ॥ 57 ॥

అనాదియగు భ్రమప్రవాహమునబడిన పురుషుడు మరణమూర్ఛకు బూర్వము అతివాహిక శరీరమునంది భ్రాంతివలన భవిష్యత్-సృష్టికనుకూలములగు సృష్టిప్రతిభాసలను అనుభవించుచున్నాడు. ఇవన్నియును అతని మనస్సుననే వెలయుచున్నవి, బయటలేవు. కాని, అతడు భ్రాంతిబలమున బయటనున్నట్లే తలచుచున్నాడు.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున స్వప్నార్థ విచారమను సప్తపంచాశ సర్గము ॥ 57 ॥

## అష్టపంచాశత్తమః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఏతస్మిన్నంతరేజ్ఞప్తిర్జీవంవై దూరథంపునః
సంకల్పేనరురోధాశు మనసఃస్పందనంయథా. 1

వసిష్ఠుడు:— ఈ లోపున జ్ఞప్తిదేవి సంకల్పబలమున చిత్తవృత్తిని నిరోధించునట్లు, విదూరథుని జీవమును, శవదేహమున బ్రవేశింపకుండునట్లు నిరోధించెను.

లీలోవాచ:—

వదదేవికియాన్కాలో గతోఽస్యామిహమందిరే
సమాధౌమయిలీనాయాం మహీపాలేశవేస్థితే. 2



లీల:— దేవీ! ఈ మందిరమున నేనెంత సమయమున సమాధియందుంటిని; రాజు ఎంతకాలము శవమైపడియున్నాడు?

జ్ఞప్తిరువాచ:—

ఇహమాసస్త్వతిక్రాంత ఇహదాస్యావిమేతవ
రక్షార్థంవాసగృహకే స్వపతోఽవహితేస్థితే. 3

జప్తి:— ఒక నెలగడచినది. నీదాసీద్వయము శవరక్షణార్థమై ఇటపరుండియున్నారు.

శృణుదేహస్యకింవృత్తం తవేహవరవర్ణిని
శరీరంతవపక్షేణ తత్క్లిన్నంబాష్పతాంగతమ్ 4
నిర్జీవంపతితంభూమౌ సంశుష్కమివపల్లవమ్
కాష్ఠకుడ్యోపమోజాతః శవస్తుహిమశీతలః. 5
తతోమంత్రిభిరాగత్య మృతైవేయమితిస్వయమ్
క్లేదాలోకాద్వినిర్ణీయ భూయోనిష్కాసితంగృహాత్. 6
బహునాత్రకిముక్తేన నీత్వాచందనదారుభిః
చితౌసంక్షిప్యసఘృతం సహసాభస్మసాత్కృతమ్. 7

వరవర్ణినీ ! నీ శరీరమేమైనదో వినుము. అయ్యది పదునైదుదినములు కుష్కించి, బాష్పభావము సందెను. జీవరహితమై, ఎండుటాకువలె, నేలమీద పడియుండెను. అప్పుడయ్యది కొయ్యవలె బిగుసుకొనిపోయి, మంచువలె చల్లబడెను. పిదప మంత్రులిద్దానినిగాంచి, 'ఈపె మరణించినది' అని సిరపరచుకొని బయటకుగొనిపోయిరి. ఇంకేమి చెప్పగుదును? వారు చితినంటించి గంధపుకట్టెలతోడను, నేతితోడను గాల్చి, భస్మమొనరించిరి.

తతోరాజ్ఞీమృతేత్యుచ్చైః కృత్వారోదనమాకులమ్
పరివారస్తవాశేషం కృతవానౌర్ధ్వదేహికమ్. 8

పిదప, నీ పరిజనులు 'రాణిమరణించినది' అని ఆందోళనపడుచు రోదించుచు పారలౌకిక క్రియల నొనరించిరి.

ఇదానీంత్వామిహాలోక్య సశరీరాముపాగతామ్
పరలోకాదాగతేతి మహచ్చిత్రంభవిష్యతి. 9

ఇప్పుడు వారు నిన్నుగాంచిన, పరలోకమునుండి అరుదెంచితివని భావించి ఆశ్చర్యపడుదురు.

త్వంతుతేనశరీరేణ సత్యసంకల్పతఃసుతే
దృశ్యసేన్నవదాతేన చిత్రం తత్రతవోపరి. 10

పుత్రీ! ఇప్పుడు నీవు అతివాహిక దేహమున నున్నందువలన వారికగపడకుంటివి. సత్యసంకల్ప ప్రభావమున నీవు వారికగపడిన, స్వచ్ఛమగు ఈ అతివాహిక దేహమును గాంచి వారాశ్చర్యపడెదరు.

యద్వాసనాత్వమభవో దేహంప్రతితదేవతే
రూపమభ్యుదితంబాలే తేనప్రాక్సదృశంతవ. 11

బాలా! నీకు నీ పూర్వశరీరమునందున్న అనురాగము ననుసరించి, ఇప్పటి శరీరమునకుగూడ అట్టివేయగు రూపలావణ్యములు గలిగినవి.

స్వవాసనానుసారేణ సర్వః సర్వం హి పశ్యతి
దృష్టాంతోఽత్రావిసంవాదీ బాలవేతాలదర్శనమ్. 12

అందఱును తమతమవాసనల ననుసరించియే తదనురూపములగు వస్తువులను గాంచుచున్నారు. ఇప్పట్ల బాలకుని బేతాళ దర్శనము నెరలేని ఉదాహరణము.

ఆతివాహికదేహాసి సంపన్నా సిద్ధసుందరీ
విస్మృతస్త్వేవ దేహోఽసౌ ప్రాక్తనోఽనపవాసనః. 13

సుందరీ! నీ కిప్పుడు ఆతివాహిక దేహము లభించినది; నీవు సిద్ధిని బొందితివి. ప్రాక్తనవాసనలతోగూడిన శరీరమును నీవు విస్మరించినావు.

రూఢాతివాహికదృశః ప్రశామ్యత్యాధిభౌతికః
బుధస్య దృశ్యమానోఽపి శరన్మేఘ ఇవాంబరే. 14

ఆతివాహిక దృష్టి దృఢమైన, ఆధిభౌతిక దేహము ఉపశమించును. ఇయ్యది అజ్ఞానులకు అగపడినను, జ్ఞానులకు శరన్మేఘమువలె క్షణికమే.

రూఢాతివాహికీభావః సర్వో భవతి దేహకః
నిర్జలాంభోదసదృశో నిర్గంధకుసుమోపమః 15

ఆతివాహికభావము దృఢమైన, శరీరములన్నియును నీరులేని మేఘములవలెను, వాసనలేని పుష్పములవలెను (నామమాత్రము) అగును.

సద్వాసనస్య రూఢాయా మాతివాహికసంవిది
దేహో విస్మృతిమాయాతి గర్భసంస్థేవ యౌవనే. 16

ఆతివాహికభావము దృఢమైన సద్వాసనలుగలవారు, యౌవనమున బాల్యమును మరచునట్లు, ఆధిభౌతిక దేహమును విస్మరింతురు. (ఎట్టివాసనలు లేకున్న, అసలు శరీరమే యుండదు.)

ఏకత్రింశేఽద్య దివసే ప్రాప్తావయమిహాంబరే
ప్రభాతే మోహితే దాస్యా మయైతే నిద్రయాధునా. 17

ఇప్పుడు ముప్పదియొక్కరోజులు గడచినవి. ఈ యుదయమున మనమీయాకాశమున కరుదెంచితిమి. నీ పరిచారికల నిప్పుడను నిద్రామోహితుల నొనర్చితిని.

తద్దేహయావల్లీలాయై లీలే సంకల్పలీలయా
ఆత్మానం దర్శయావోఽస్యై వ్యవహారః ప్రవర్త్యతామ్. 18

లీలా! రమ్ము; మన మిప్పుడీ (ద్వితీయ) లీలకు సంకల్పప్రభావమున దర్శన మిత్తము; యథోచితముగ ప్రవర్తింపుము.



శ్రీవసిష్ఠ ఉవాచ:—

ఆవాం తావదిమే లీలా పశ్యత్విత్యేవ చింతితే
జ్ఞప్త్యా దేవ్యా తతస్తత్ర దృశ్యే దీప్తే బభూవతుః. 19

వసిష్ఠుడు:– 'యమ్మ ఈ లీల గాంచుగాక' అని జ్ఞప్తిదేవి సంకల్పింప వారిర్వురును ప్రకాశించుచు నగపడసాగిరి.

సావిదూరథలీలాథ సమాకులవిలోచనా
గృహమాలోకయామాస తత్తేజఃపుంజభాస్వరమ్. 20

వారి తేజమున గృహము ప్రకాశితమవ, విదూరథుని లీల (ద్వితీయలీల) ఇంట నలుదిక్కులు చూడసాగెను.

చంద్రబింబాదివోత్కీర్ణం ధౌతం హేమద్రవైరివ
జ్వాలాయా ద్రవశీతాయా స్తత్ప్రభా ద్రవభిత్తిమత్. 21
గృహమాలోక్య పురతో లీలాజ్ఞప్తీ విలోక్య తే
ఉత్థాయ సంభ్రమవతీ తయోః పాదేషు సాపతత్. 22

అప్పుడా గృహము చంద్రమండలమునుండి పడినట్లును, హేమరసముచే గడుగబడినట్లును, శీతల ప్రభాప్రవాహమున కుడ్యములు లిప్తమైనట్లును దోచెను. లీల వారిని హర్షముతో గాంచి పాదములబడెను.

మజ్జయాయాగతే దేవ్యౌ జయతాం జీవనప్రదే
ఇహాపూర్వమహం ప్రాప్తా భవత్యోర్మార్గశోధినీ. 23
ఇత్యుక్తవత్యాం తస్యాం తా మానిన్యౌ మత్తయావనా
ఉపావిశన్విష్టరేషు లతామేరుశిరఃస్వివ. 24

దేవులారా! మీరు నా మంచికై అరుదెంచినారు, మీరు నా ప్రాణదాతలు, మీ పరిచారికనగు నేను మీకంటె ముందుగనే ఇట కరుదెంచితిని, అని లీల వారి నాహ్వానింప, వారు మేరుశృంగమునందలి లతలవలె సింహాసనముల గూర్చుండిరి.

జ్ఞప్తిరువాచ:—

సుతే వద కథం ప్రాప్తా త్వమిమం దేశమాదితః
కిం వృత్తం తే త్వయా దృష్టం కిమివాధ్వని కుత్ర వా. 25

జ్ఞప్తి:– పుత్రీ! నీ విటకు ముందుగ నెట్లరుదెంచితివి? నీ వృత్తాంతమేమి? దారిలో నెచ్చట ఏమి గాంచితివి? వచింపుము.

విదూరథ లీలోవాచ:—

దేవి తస్మిన్ప్రదేశే సా జాతమూర్ఛా తదాభవమ్
ద్వితీయేందోః కలేవాహం కల్పాంతజ్వాలయాహతా. 26
న చేతితం మయా కించిత్ సమం విషమమేవ చ
తతస్తరలపక్ష్మాంతే వినిమీల్య విలోచనే. 27

తతో మరణమూర్ఛాంతే పశ్యామి పరమేశ్వరి
యావదభ్యుదితాస్మ్యాశు ప్లుతా చ గగనోదరే. 28
భూతాకాశే ఽనిలరథం సమారూఢాస్మ్యహం తతః
ఆనీతా గంధలేఖేవ తేనాహమిమమాలయమ్. 29

విదూరథలీల:— దేవీ! నే నచ్చట, కల్పాగ్నివలన దహింపబడిన ద్వితీయ చంద్రరేఖవలె, మూర్ఛనందితిని. అప్పుడు నాకు 'ఇది అది' అను జ్ఞానము లేకుండెను. పరమేశ్వరీ! పిదప నేను కండ్లను మూసికొంటిని. మరణమూర్ఛానంతరము, తేరుకొని చూడ ఆకాశమున నెగురుచుంటిని. పిదప ప్రాణరథము నధిరోహించి గంధకణమువలె, నిచ్చట కరుదెంచితిని.

దేవి పశ్యామి సదనం నాయకేనాభ్యలంకృతమ్
దీప్తదీపం వివిక్తం చ మహార్హశయనాన్వితమ్. 30
పతిమాలోకయామీమం యావ దేష విదూరథః
శేతే కుసుమగుప్తాంగో మధుః పుష్పవనే యథా. 31
అథ సంగ్రామసంరంభశ్రమార్తోఽయం స్వపిత్యలమ్
ఇతి నిద్రామయా సేయం దేవేశ్వరి న వారితా. 32
అనంతరమిదం దేశం ప్రాప్తే దేవ్యావిమే త్వితి
యథానుభూతం కథితం మదనుగ్రహకారిణి. 33

దేవీ ఇచ్చట నీ గృహము యజమానితోగూడి దీపములతో ప్రకాశించుచు, జనశూన్యమై విలువగల పాన్పులతోగూడియుంటను గాంచితిని, ఇచ్చట నాభర్తయగు ఈ విదూరథుని గాంచితిని. పుష్పోద్యానమును వసంతు డధిష్ఠించియుండునట్లు, ఇతడు కుసుమాచ్ఛాదితుడై శయనించియున్నాడు. దేవేశ్వరీ! ఇతడు యుద్ధమున డస్సియుంటజేసి, మేల్కొల్పకుంటిని. ఇంతలో మీ రరుదెంచినారు. నన్ననుగ్రహించిన దేవీ! అనుభవించినదాని నంతటిని వచించినాను.

జ్ఞప్తిరువాచ:—

హే హంసహారిగామిన్యౌ లీలే లలితలోచనే
ఉత్థాపయామ్యహం నృపతిం శవతల్పతలాదిమమ్. 34

జ్ఞప్తి:— హంసయానలును, లలితలోచనలునగు లీలలారా! శవశయ్యయందు పరుండిన ఈ రాజును నేను లేపుచున్నాను.

ఇత్యుక్త్వాముముచే జీవ మామోదమివ పద్మినీ.
స సమీరలతాకార స్తన్నాసానికటం యయౌ. 35
ఘ్రాణకోశం వివేశాంతర్వంశరంధ్రమివానిలః
స్వవాసనాశతాన్యంత ర్దధదబ్ధిర్మణీనివ. 36

అనివచించి, పద్మిని సౌరభమును వదలునట్లు, విదూరథుని ప్రాణమును జ్ఞప్తిదేవి విడచెను. వాయులతనుబోలు ఆ జీవుడు శవముయొక్క నాసారంధ్రమును సమీపించి, గాలి వంశరంధ్రమును ప్రవేశించునట్లు, అందు ప్రవేశించెను. సముద్రమధ్యమున నూర్లకొలది మణులుండునట్లు, ఆ జీవుని యందు వాసనలుండెను.



అంతఃస్థజీవం వదనం తస్య తత్కాంతిమాయయౌ
పద్మస్యావగ్రహే పద్మం సువృష్ట ఇవ వారిణి. 37

ఆతని వదనమున జీవుడు ప్రవేశింప, అనావృష్టిసమయమున వర్షముకురిసిన పద్మము కాంతిమంతమగునట్లాతని మోము కాంతియుతమయ్యెను.

క్రమాదంగాని సర్వాణి సరసాని చకాశిరే
తస్య పుష్పాకర ఇవ లతాజాలాని భూభృతః. 38

క్రమముగ ఆ రాజుయొక్క అవయవములన్నియు, వసంతకాలమందలి లతలవలె, సరసములై ప్రకాశింపదొడగెను.

అథాబభౌ కలాపూర్ణః స రాకాయామివోడురాట్
భాసయన్భువనం భూరి వదనేందుమరీచిభిః. 39
స్ఫురయామాస సోఽంగాని రసవంతి మృదూని చ
కనకోజ్జ్వలకాంతీని పల్లవానీవ మాధవః. 40

అనంతరము రాజు పూర్ణచంద్రునివలె, ముఖకాంతివలన జగత్తును ప్రకాశింపజేయుచు, శోభిల్లెను. సరసములును, మృదులములును, కనకోజ్జ్వల కాంతిమంతములునునగు ఆతని అవయవములు, వసంతకాలమందలి చిగురాకులవలె, స్ఫురింపసాగెను.

ఉన్మీలయామాస దృశౌ విమలాలోలతారకే
హారిణ్యౌ సుభగాభోగే చంద్రార్కౌ భువనం యథా. 41

ఈ జగత్తు సూర్యచంద్రులను నయనములను దెరచునట్లు, ఆ రాజు తారాశోభితములును, సుందరములును, విశాలములునునగు నయనములను విప్పెను.

ఉత్తస్థౌ ప్రోల్లసత్కాయో వింధ్యాద్రిర్వృద్ధిమానివ
ఉవాచ కః స్థిత ఇతి ఘనగంభీరనిఃస్వనమ్. 42

పిదప, పెరుగుచున్న వింధ్యపర్వతమువలె ఉల్లసిత శరీరుడగు ఆ రాజులేచి, మేఘగంభీర ధ్వనితో, 'ఎవరచ్చటను?' అని పల్కెను.

లీలాద్వయమథాస్యాగ్రే ప్రోవాచాదిశ్యతామితి
స దదర్శ పురో నమ్రం లీలాద్వయమవస్థితమ్. 43
సమాచారం సమాకారం సమరూపం సమస్థితి
సమవాక్యం సమోద్యోగం సమానందం సమోదయం. 44
కా త్వం కేయం కుతశ్చేయ మిత్యాహ స విలోకయన్
తస్మై లీలాహ హే దేవ శ్రూయతాం యద్వదామ్యహమ్. 45

అప్పుడు లీల లిర్వురును ముందునకరిగి, 'ఆజ్ఞాపింపుడు' అని పల్కిరి. అప్పుడు విదూరథుడు, ఆచార, వ్యవహార, రూప, మర్యాద, వాక్య, ప్రయత్న, ఆనందముల సమానలగు లీల లిర్వురు ముందట నమ్రలై యుండుట గాంచెను. కాంచి, 'నీ వెవరవు? ఆమె ఎవరు?' అని విదూరథుడు ప్రశ్నించెను. అప్పుడు లీల 'దేవా! నేను జెప్పుదానిని వినుడు' అని వచించెను.

మహిలాతవలీలాహం ప్రాక్తనీసహధర్మిణీ
వాగర్థస్వేవసంపృక్తా స్థితా సంశ్లేషశాలినీ. 46
ఇయంలీలాద్వితీయాతే మహిలాహేలయామయా
ఉపార్జితా త్వదర్థేన ప్రతిబింబమయీశుభా 47
శిరోభాగోపవిష్టేయం పాహిహైమమహాసనే
ఏషాసరస్వతీదేవ త్రైలోక్యజననీ శివా. 48
అస్మాకంపుణ్యసంభారై రిహ సాక్షాదుపాగతా
అనయేమే పరాల్లోకా దిహానీతే మహీపతే. 49

'నేను మీపూర్వపు-భార్యను. వాక్కు-అర్థముతో గూడియుండునట్లు, నేను మీతో నెల్లప్పుడు నుండెడుదానిని, ఈ ద్వితీయ - లీలగూడ మీభార్యయే. మీ కొఱకే నా ప్రతిబింబమగు ఈమెను గల్పించితిని. మీతలవైపున, బంగారుగద్దెమీద గూర్చుండినయామె, త్రిలోకజననియగు సరస్వతీదేవి. మనపుణ్యబలమున మనకు సాక్షాత్కరించినది. ఈమె మనలను పరలోకమునుండి, గొనివచ్చినది.'

ఇత్యాకర్ణ్యసముత్థాయ రాజారాజీవలోచనః
లంబమాల్యాంబరధరః పపాత జ్ఞప్తిపాదయోః. 50

ఈ పలుకులు నాలించి రాజీవలోచనుడగు రాజు, తొట్రుపడుచులేచి, మాలలును, వస్త్రములును వ్రేలుచుండ జ్ఞప్తిదేవి పాదములబడి ఇట్లనెను:—

సరస్వతి నమస్తుభ్యందేవి సర్వహితప్రదే
ప్రయచ్ఛవరదేమేధాం దీర్ఘమాయుర్ధనానిచ. 51
ఇత్యుక్తవంతంహస్తేన పస్పర్శజ్ఞప్తిదేవతా

'సర్వహితప్రదవగు దేవీ! సరస్వతీ! నమస్కారము. దీర్ఘాయువును, ధనమును మేధను బ్రసాదింపుము.' ఇట్లు పలుకుచున్న రాజును జ్ఞప్తిదేవి హస్తమున స్పృశించెను.

సరస్వత్యువాచ:—.

త్వంపుత్రాభిమతార్థాఢ్యో భవేతిభవనాన్వితః. 52
సర్వాపదఃసకల దుష్కృతదృష్టయశ్చ
గచ్ఛంతువఃశమమనంతసుఖానిసమ్యక్
ఆయాంతు నిత్యముదితా జనతాభవంతు
రాష్ట్రేస్థిరాశ్చవిలసంతుసదైవలక్ష్మ్యః. 53

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే లీలోపాఖ్యానే
పద్మజీవనంనామ అష్టపంచాశత్తమః సర్గః ॥ 58 ॥



సరస్వతి:— వాంఛితార్థముల బడసి గృహమున వసింపుము. అన్ని ఆపదలును, పాపబుద్ధులును తొలగుగాక! అనంతసుఖములరుదెంచుగాక! నీ ప్రజలకు నిత్యసంతోషము కలుగుగాక! నీ రాష్ట్రమున లక్ష్మి స్థిరమై వెలయుగాక!

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
లీలోపాఖ్యానమున పద్మజీవనమను అష్టపంచాశ సర్గము ॥ 58 ॥

## ఏకోనషష్టితమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

సరస్వతీతథేత్యుక్త్వా తత్రైవాంతర్ధిమాయయా
ప్రభాతేపంకజైః సార్ధం బుబుధేసకలోజనః. 1
ఆలిలింగచతాంలీలాం లీలాచదయితంక్రమాత్
పునఃపునర్మహానందా న్మృతంప్రోజ్జీవితంపునః. 2

వసిష్ఠుడు:— సరస్వతీదేవి వల్లెయని పలికి అటనే అంతర్ధానమునందెను. అంతట, తెల్లవార, పద్మములతోబాటు జనులుగూడ ప్రబుద్ధులైరి. (పద్మములు వికసించెను; జనులు నిద్రనుండి మేల్కొనిరి. అని భావము) రాజు లీలను ఆలింగన మొనర్చుకొనెను. లీలగూడ పునర్జీవితుడగు భర్తను మరల మరల కౌగిలింపసాగెను.

తదాసీద్రాజసదనం మదమన్మథమంథరమ్
ఆనందమత్తజనతం వాద్యగేయరవాకులమ్. 3
జయమంగలపుణ్యాహ ఘోషఘుంఘుమఘుర్ఘరమ్
తుష్టపుష్టజనాపూర్ణం రాజలోకవృతాంగణమ్. 4
సిద్ధవిద్యాధరోన్ముక్త పుష్పవర్ష సహస్రభృత్
ధ్వనన్మృదంగమురజ కాహలాశంఖదుందుభి. 5
ఊర్ధ్వీకృతబృహద్ధస్త హాస్తిక స్తనితోత్కటమ్
ఉత్తాలతాండవస్త్రైణ పూర్ణాంగణలసద్ధ్వని. 6
మిథఃసంఘట్టనిపత జ్జనోపాయనదంతురమ్
పుష్పశేఖరసంభార మయసంసారసుందరమ్. 7
వికీర్ణాపాదితక్షౌమం మంత్రి సామంతనాగరైః.
స్థూలపద్మమయంవ్యోమ రక్తైస్తాండవినీకరైః. 8
మత్తస్త్రీకంథగావృత్త లీలాందోలితకుండలమ్
ప్రవృత్తపాదసంపాత ప్రోల్లసత్పుష్పకర్దమమ్. 9

పట్టవాసఃశరన్మేఘ వితానకవితానకమ్
వరాంగనాముఖై ర్నృత్యచ్చంద్రలక్షగృహాజిరమ్. 10

అప్పుడా రాజభవనము ఆనందపరవశులగు జనులతోడను గీతాది వాద్యధ్వనులతోడను నిండిపోయెను. జయధ్వనులును, మంగళ ధ్వనులును, పుణ్యాహధ్వనులును బోరుగొలుపదొడగెను. సంతోషభరితులగు జనులతోడను, రాజులతోడను, రాజభవన — ప్రాంగణము నిండిపోయెను. సిద్ధులును, విద్యాధరులును సహస్రములగు పుష్పవర్షములను గురిపింపసాగిరి. మృదంగములు, మద్దెలలు, కాహళములు, శంఖములు, దుందుభులును ధ్వనింపసాగెను. ఏనుగులు తొండములనెత్తి గంభీరముగ ఘీంకరింపసాగెను, అంగనాగణము ఆనందనృత్యములు సల్పసాగిరి. నలుదిక్కుల నుండి జను లప్పనములగొని అరుదెంచి ఒకరినొకరు త్రోసికొనసాగిరి. పుష్ప సమూహమును గొనివచ్చిన జనులతో నా గృహము శోభిల్లసాగెను. మంత్రులును, సామంతులును, పురజనులును, పువ్వులను, చేలాలను జల్ల ఆకాశము పట్టుగుడ్డతో గప్పబడినట్లుండెను. నృత్యమొనరించు స్త్రీల కరముల రక్తపద్మములుంటచేసి, ఆకాశము పద్మమయమైనట్లు తోచుచుండెను. ఆనందమత్తలగు యువతుల కుండలములు అల్లాడసాగెను. కాళ్ల రాపిడివలన దారి అంతయు పుష్పరస కర్దమముతో నిండిపోయెను. అటనట ఉత్సవార్థము శరన్మేఘములబోలు వితానము (చాందినీ) లమర్పబడెను. వరాంగనా — వదనములను చంద్ర సహస్రములతో గృహప్రాంగణము నిండిపోయెను.

పరలోకాదుపానీతా రాజ్ఞీ సాపతిరేవచ
ఇతినిర్వృత్తగాథాభి ర్జగుర్దేశాంతరేజనాః. 11

జను లిటనట 'రాజును రాణియును పరలోకమునుండి అరుదెంచిరి' అని గీతముల బాడసాగిరి.

పద్మోభూమిపతిః శ్రుత్వా వృత్తాంతంకథితంమనాక్
చక్రేస్నానంసమానీతై శ్చతుఃసాగరవారిభిః. 12

పద్మభూపతి సంక్షేపముగ తన మరణ వృత్తమును విని, నాల్గు సముద్రములనుండి కొనితేబడిన నీటితో స్నానమొనర్చెను.

తతోఽభిషిషిచుర్విప్రా మంత్రిణోభూభుజశ్చతమ్
లబ్ధోదయమనంతేహ మమరేంద్రమివామరాః. 13

దేవతలు నహుషచ్యుత్యనంతరము దేవేంద్రునభిషేకించినట్లు విప్రులును, మంత్రులును, రాజులును అతనికి మంగళార్థ మభిషేక మొనరించిరి.

లీలాలీలాచరాజాచ జీవన్ముక్తమహాధియః
రేమిరేపూర్వవృత్తాంత కథనైఃసురతైరివ. 14

జీవన్ముక్త — బుద్ధులగు లీల లిర్వురును, రాజును, తమ పూర్వవృత్తాంతమును గురించి ప్రసంగించుకొనుచు, సురతమువలన కలుగు ఆనందమువంటి ఆనందమునే పొందిరి.

సరస్వత్యాఃప్రసాదేన స్వపౌరుషకృతేనతత్
ప్రాప్తంలోకత్రయశ్రేయః పద్మేనేతి మహీభుజా. 15



ఇట్లు పద్ముడు నిజప్రయత్న బలమువలనను, సరస్వతీదేవి అనుగ్రహమువలనను, ముల్లోకముల పరమశ్రేయమగు పునర్జన్మను, రాజ్యమును, జ్ఞానమును బొందెను.

సజ్ఞప్తిజ్ఞానసంబుద్ధో రాజాలీలాద్వయాన్వితః
చక్రేవర్షాయుతాన్యష్టౌ తత్రరాజ్యమనిందితః. 16

ఆ పద్ముడు సరస్వతీ ఉపదేశ ప్రాప్తమగు ఆత్మతత్త్వజ్ఞానమునుబొంది, లీల లిర్వురతో గూడి, ఆనందమున ఎనుబదివేలఏండ్లు రాజ్యమును బాలించెను.

జీవన్ముక్తాస్తఇత్యేవం రాజ్యంవర్షాయుతాష్టకమ్
కృత్వావిదేహముక్తత్వ మానేదుః సిద్ధసంవిదః. 17

ఇట్లు వారు జీవన్ముక్తులై ఎనుబదివేల ఏండ్లు రాజ్యమును పాలించి, దృఢజ్ఞానులై విదేహముక్తి నందిరి.

యదుదయవిశదంవిదగ్ధముగ్ధం
సముచితమాత్మహితంచపేశలంచ
తదఖిలజనతోషదంస్వరాజ్యం
చిరమనుపాల్యసుదంపతీవిముక్తౌ. 18

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
లీలోపాఖ్యానే పద్మనిర్వాణం నామైకోనషష్టితమః సర్గః ॥ 59 ॥

ఆ దంపతులిర్వురును ప్రజాహితమొనర్చుచు, పాండిత్య ప్రజానురంజనములతో నొప్పుచు, దోషరహితులై యశస్సు ధర్మము, సౌభాగ్యము మున్నగు గుణములతోగూడి చాలకాలముపాలించి విదేహముక్తినందిరి. *

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు, ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున
పద్మనిర్వాణమను ఏకోనషష్టి సర్గము ॥ 59 ॥

---

* ద్వితీయలీల ప్రబుద్ధలీల ప్రతిబింబమగుటవలన ఆమె విదేహముక్తి వేరుగ చెప్పబడలేదు — అను.

## షష్టితమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఏతత్తేకథితంరామ దృశ్యదోషనివృత్తయే
లీలోపాఖ్యానమనఘం ఘనతాం జగతస్త్యజ. 1

వసిష్ఠుడు:- రామా! దృశ్యదోషమును వారింప నీకీ లీలోపాఖ్యానమును జెప్పితిని. నీ విప్పుడీ జగత్తు సత్యమను భావమును వీడుము.

శాంతైవదృశ్యసత్తాస్యాః శమనంనోపయుజ్యతే
సతోహి మార్జనక్లేశో నాసతస్తుకదాచన 2

దృశ్యపదార్థములు సత్యమను భావమును వీడుటకంటె వేరొక ఉపాయము,- దృశ్యమును వారింపగలిగినది- లేదు. సత్యత్వబుద్ధి ఉన్నంతవఱకు, దానిని నిర్మూలింప కష్టముగలుగుచున్నది; సత్యత్వబుద్ధి తొలగిపోయిన, ఈ కష్టముండదు.

జ్ఞానేనాకాశరూపేణ దృశ్యంజ్ఞేయస్వరూపకమ్
ఇత్యేకీభూతమాలోక్య జ్ఞస్తిష్ఠత్యంబరోపమః. 3

జ్ఞానులు దృశ్యపదార్థముల రూపమాకాశము (శూన్యము, మిథ్య) వంటిదని ఎంతురు. ఈ ప్రపంచమంతయు ఆకాశతుల్యుడగు పరమపురుషునియందు వెలయుచున్నది.

పృథ్వ్యాదిరహితేనేదం చిద్భాసైవ స్వయంభువా
సాధితంయదిసిద్ధేన తతఃస్వాత్మనిసాధితమ్ 4

పృథ్వ్యాది భూతరహితుడును, చిన్మాత్రశరీరుడునునగు స్వయంభువు తనయందు కల్పించుకొనిన వివర్తమంతయును అతనియందే వెలయుచున్నది.

సంవిద్యథా యా యతతే తథాసైవవ్యవస్థితా
విసృష్టాసృష్టివిన్నద్యాం యావద్యత్నాన్నరోధితా. 5

చైతన్యరూపుడగు స్వయంభువు ఎప్పుడెట్లు యత్నించునో, అతడట్లే వివర్తము నందుచున్నాడు. అతడు సృష్టికొఱకు యత్నించిన సృష్టియును, స్థితికొఱకు యత్నించిన స్థితియును, లయముకొఱకై యత్నించిన ప్రళయమును గలుగుచున్నది.

చిదాకాశావభాసోఽయం జగదిత్యవబుధ్యతే
చిద్వ్యోమ్న్యేవాత్మనిస్వచ్ఛే పరమాణుకణంప్రతి. 6

బ్రహ్మాత్మకమగు నిర్మలచిదాకాశమున ఈ జగత్తు ప్రతిభాసించుచున్నను, వాస్తవమునకు పరమార్థదృష్టితో బరికించిన దీనికి బ్రహ్మమునకూడ తావులేదు. ఇయ్యది బుద్ధివికారమగుటవలన (ఔపాధికమగుటవలన) బుద్ధిపరిచ్ఛిన్నుడగు జీవునియందే వెలయుచున్నది.

ఏవమస్యాముధాభ్రాంతేః కాసత్తాకేవవాసనా
కావాస్థాకాచనియతిః కావశ్యంభావితోచ్యతామ్. 7

ఇట్లు వ్యర్థమగు ఈ భ్రాంతికి సత్తగాని వాసనగాని ఎట్లుండగలదు? స్థిరమేమి? నియతి ఏమున్నది? ఆవశ్యకత ఏమున్నది? వచింపుము!



సర్వంచైతద్యథాదృష్టం స్థితమిత్థమఖండితమ్
మాయైవేయమనంతేయం నచమాయాస్తికాచన. 8

మాయవలన ఈ ప్రపంచమంతయు ఇట్లగపడుచున్నను, పరమార్థదృష్టియందు ఇయ్యది శూన్యమే; ఈ సృష్టి, మాయయొక్క కార్యము. మరల, మాయకూడ వాస్తవముకాదు.

శ్రీరామ ఉవాచః—

అహోనుపరమాదృష్టిర్దర్శితా భగవంస్త్వయా
దావాగ్నిదగ్ధకక్షాణాం దాహశాంతౌ కలైందవీ. 9

శ్రీరాముడు:- భగవంతుడా! నీవు పరమార్థదృష్టిని బ్రదర్శించితివి. చంద్రకళ దావాగ్నిదగ్ధములగు తృణములతాపమును వారించునట్లు, ఈ దృష్టికూడ జీవులకు శాంతిని ప్రసాదింపగలదు.

అహోనుచిరేణాద్య జ్ఞాతంజ్ఞాతవ్యముత్తమమ్
మయాయథేదంయచ్చేదం యాదృగ్జ్ఞేయంయతోయదా. 10

చాలకాలము గడచినపిదప తెలిసికొనదగిన దానిని తెలుసుకొంటిని; అహో! ఆశ్చర్యము! యథోచిత దృష్టాంతములతో తగిన దృష్టిని గ్రహించితిని.

శామ్యామీవ ద్విజశ్రేష్ఠ నిర్వామీవవికల్పయన్
ఏతదాఖ్యానమాశ్చర్యం వ్యాఖ్యానంశాస్త్రదృష్టిషు. 11

విప్రవరా! మీరు వర్ణించిన ఈ అద్భుత ఉపాఖ్యానమును, శాస్త్రవ్యాఖ్యనువిని, విచారించుటవలన, తత్త్వమునుగ్రహించి శాంతినో నిర్వాణమునో అందినట్లనుభవించుచున్నాను.

ఇమంమేభగవన్బ్రూహి సంశయంసర్వకోవిద
తవపాతుంనతృప్తోఽస్మి శ్రోత్రపాత్రైర్వచోఽమృతమ్. 12

భగవానుడా! సర్వజ్ఞా! మీ వచనామృతమును శ్రవణ-పాత్రముల గ్రోలినను నాకు పరిపూర్ణమగు తృప్తికలుగలేదు. ఇప్పుడు నా ఈ సందేహమును దూర మొనర్పుడు.

స సర్గత్రితయేకాలో లీలాభర్తుర్ద్విజోగతః
సక్వచిత్కిమహోరాత్రః క్వచిత్కింమాసమాత్రకః 13
క్వచిత్కింబహువర్షాణి కస్యచిత్కిము పేలవః
కస్యచిత్కింమహాదీర్ఘః కస్యచిత్కింక్షణఃస్థితః. 14
ఇతిమేభగవన్బ్రూహి త్వంయథావదనుగ్రహాత్
సకృచ్ఛ్రుతంనవిశ్రాంతి మేతి లోష్టేయథాజలమ్. 15

వసిష్ఠ, పద్మ, విదూరథుల సృష్టియందు పద్మునకు గడచినకాలముయొక్క స్వరూప మెట్టిది? అయ్యది, అహోరాత్రాత్మకమా? మాసాత్మకమా? వర్షాత్మకమా? క్షణాత్మకమా? లేక, దీర్ఘకాలస్థాయియా? ఇయ్యది నాసందేహము. భగవానుడా! అనుగ్రహించి తథ్యమును వచింపుడు. ఒక్కసారివినినను అయ్యది, శుష్కమృత్పిండమునబడిన జలబిందువువలె, నా చెవుల కంటలేదు.

శ్రీవసిష్ఠ ఉవాచః—

యేనయేనయథాయద్యద్యదాసంవేద్యతేఽనఘ
తేనతేనతథాతత్తత్తదాసమనుభూయతే. 16

వసిష్ఠుడు:- అనఘా! ఎవడెప్పుడేవిషయమున నెట్లు జ్ఞానమును బొందునో ఆయాపట్ల అతని కట్టివిషయమే అనుభవమునకు వచ్చును.

అమృతత్వంవిషంయాతి సదైవామృతవేదనాత్
శత్రుర్మిత్రత్వమాయాతి మిత్రసంవిత్తివేదనాత్. 17

నిరంతరము అమృతమనిభావించిన విషముగూడ అమృతమైపోవును. మిత్రుడని భావించిన శత్రువుగూడ మిత్రుడగును.

యథాభావితమేతేషాం పదార్థానాంనిజంవపుః
తదేవహిచిరాభ్యాసాన్నియతేర్వశమాగతమ్ 18

పదార్థము లేభావమున భావింపబడిన భావనాప్రభావమున పదార్థములుగూడ అట్లే ప్రభాసించి, కార్యకరము లగుచున్నవి.

కచనైకాత్మికైషాచిద్యథాకచతియాదృశమ్
తథాతథాశుభవతి తత్స్వభావైకకారణాత్. 19

బుద్ధి చిత్తమునసంకల్పించునట్లే పదార్థము లాకృతిమంతములై క్రియాకరము లగుచున్నది.

నిమేషేయదికల్పౌఘ సంవిదంపరివిందతి
నిమేషఏవ తత్కల్పో భవత్యత్రనసంశయః 20

ఒక నిమిషమున పెక్కుకల్పములను భావించి, అట్టి బుద్ధిని బడయగలిగిన ఆ నిమిషమే కల్పముగ తోచును; సందేహము లేదు!

కల్పేయదినిమేషత్వం వేత్తికల్పోఽప్యసౌతతః
నిమేషీభవతిక్షిప్రం తాదృగ్రూపాత్మికాహిచిత్. 21

కల్పములయందు నిమిషబుద్ధినుంచిన, అయ్యవి వెంటనే నిమిషములగుచున్నవి. చిత్తస్వరూపము ఇట్టిదే.

దుఃఖితస్యనిశాకల్పః సుఖితస్యైవచ క్షణః
క్షణఃస్వప్నేభవేత్కల్పః కల్పశ్చభవతిక్షణః 22

దుఃఖితునకు రాత్రి కల్పమువలెను, సుఖితునకు క్షణమువలెను దోచుచున్నవి. స్వప్నమున క్షణము కల్పమువలెను, కల్పము క్షణమువలెను నగపడుచున్నవి.

యథాచమృత్వాజాతోఽహం తరుణోయావనస్థితః
యాతోఽస్మియోజనశతం స్వప్నఇత్యనుభూయతే. 23

స్వప్నమున, 'మరణించి మరల జన్మించితిని, యువకుడనైతిని, శతయోజనముల దూరము తిరిగితిని,' అని తోచును.



రాత్రిం ద్వాదశవర్షాణి హరిశ్చంద్రోఽనుభూతవాన్
లవణోభుక్తవానాయు రేకరాత్ర్యాసమాఃశతమ్. 24

హరిశ్చంద్రు డొక రాత్రియందు పదిరెండు వర్షములను గడపినట్లనుభవించినాడు. లవణుడను రాజు ఒకరాత్రియందు నూరేండ్లాయువును అనుభవించినాడు.

యన్ముహూర్తఃప్రజేశస్య స మనోర్జీవితం మునేః
జీవితంయద్విరించస్య తద్దినంకిలచక్రిణః. 25

విష్ణోర్యజ్జీవితంరామ తద్వృషాంకస్యవాసరః
ధ్యానప్రక్షీణచిత్తస్య నదినాని న రాత్రయః. 26

ప్రజాపతి ముహూర్తము మహర్షిమనువు జీవితకాలము. బ్రహ్మయొక్క జీవితకాలము విష్ణునకొక దినము. విష్ణువుయొక్క జీవితకాలము శివునకొక రోజు. నిర్వికల్పసమాధియందు లీనుడైన యోగికి దివారాత్రభేదము లేదు.

నపదార్థానచ జగత్సత్యమాత్మనియోగినః
మధురం కటుతామేతి కటుభావేన చింతితమ్. 27

అతనికి కేవలము ఆత్మపదార్థమొక్కటియే సత్యమగుచున్నది. మధురములగు విషయములను వైరాగ్యభావమున జింతించిన అప్రియములగుచున్నవి.

కటు చాయాతిమాధుర్యం మధురత్వేనచింతితమ్
మిత్రబుద్ధ్యా ద్విషన్మిత్రం రిపుబుద్ధ్యారిపుఃసుహృత్. 28

మధుర భావమున జింతించిన కష్టకరమగు మనోనిరోధముగూడ ఆత్మసుఖమును బ్రసాదించుచు మధురమగుచున్నది. మిత్రులని భావించిన శత్రువులనుకొనబడు ఆప్తపురుషులు మిత్రులగుచున్నారు; విషయభోగముల ననుభవింప సాయపడు బంధుమిత్రులు పురుషార్థ వ్యాఘాతకులగుటవలన శత్రువులగుచున్నారు.

భవతీతిమహాబాహో యథాసంవేదనంజగత్
అనభ్యస్తాఃపదార్థా యే శాస్త్రపాఠజపాదయః. 29

తేషాంసంవేదనాభ్యాసాన్నూనమభ్యేతిసామ్యతా
నౌయాయినాంభ్రమార్తానాం వేదనాద్భూర్వివర్తతే. 30

ఆవేదనాభ్రమార్తానామపినైషాంవివర్తతే
శూన్యమాకీర్ణతామేతి వేదనాత్స్వప్నదృష్ట్వివ. 31

మహాబాహో! ఈ జగత్తు భావనామయము. శాస్త్రపాఠ, జపాదులు అనభ్యస్తములైన అత్యంత కఠినములై కన్పట్టును. చక్కగ గ్రహించి అభ్యసించిన తేలికయైనట్లే తోచును నౌకయందు, విహరించువారికి భ్రమవలన తీరభూమి తిరుగుచున్నట్లగపడును. తీరముననున్నవారి కిట్లగపడదు. బాగుగ గ్రహింపకపోవుటవలన, స్వప్నమునందువలె, శూన్యముగూడ పూర్ణముగనే యగపడును.

వేదనాత్పీతమానీలం శుక్లంవాప్యనుభూయతే
ఆపద్వాదుత్సవఃఖేదం కరోతి పరిమోహతః. 32

గ్రహించుటయందలి దోషమువలననే పచ్చటిపదార్థము నీలిరంగుగనో తెలుపురంగును గలిగియున్నట్లో అగపడును బాలుడు తన జన్మోత్సవాములను శుభసమయములగూడ ఖిన్నుడగు చున్నాడు.

కుడ్యేఽపిఖఇవాచారో దృష్టోనన్వవిచారిణః
అసద్యక్షోఽవిమూఢానాం ప్రాణానప్యపకర్షతి. 33

వివేకహీనునకు కుడ్యమునగూడ ఆకాశబుద్ధి కలుగుచున్నది. మిథ్యయగు యక్షుడు (భూతము) గూడ ప్రాణముల నపహరించుచున్నాడు.

వేదనాత్స్వప్నవనితా జాగ్రతీవ రతిప్రదా
యద్యథాభాసమాయాతం తత్తథా స్థిరతాంగతమ్. 34

సత్తాజ్ఞానమువలననే స్వప్నమున గనబడు వనిత జాగ్రదవస్థయందలి వనితవలెనే రతినిగూర్చుచున్నది. ఏది ఎట్లు ప్రతిభాసించుచున్నదో అదియట్లే స్థిరమగుచున్నది.

అసదేవ నభశ్చైవ నభఏవచిదాత్మని
శతహస్తాంబుదచ్ఛాయా నటనృత్తమివాతతమ్. 35

జగత్తు మిథ్యయగు ఆకాశమువంటిదైయున్నది. ఇయ్యది ఆత్మయందు, మేఘచ్ఛాయలో కల్పనాబలమున గాంచబడు మిథ్యానటుని అభినయమువలె, జగద్రూపమును విస్తరింపజేయుచున్నది.

గగనేమానసస్పందం జగద్విద్ధినవస్తుతత్
మిథ్యాజ్ఞానపిశాచస్య స్పందదర్శనమాకృతి. 36

సర్వసమిష్టి రూపమగు ఆకాశమునందగు మనోస్పందనమే జగత్తు; ఇయ్యది వేరొండు పదార్థముకాదు. బాలుడు మిథ్యాజ్ఞానమున గాంచు పిశాచముగూడ, మనస్సుయొక్క వికారమే.

మాయామాత్రకమేవేద మరోధకమభిత్తిమత్
ఇదంభాస్వరమాభాతం స్వప్నసందర్శనంస్థితమ్. 37
అపూర్వమేవాసుప్తస్య నరస్యేవోదితంవిదుః
అచేతాచేతతిస్తంభో యాదృశంశాలభంజికామ్. 38
పరమార్థమహాస్తంభః సృష్టించేతతితాదృశమ్
యాదృశోమేనరఃపార్శ్వే స్వప్నేక్షుబ్ధోమహాభటైః. 39
తాదృశోబ్రహ్మణఃసర్గో బుద్ధఏవసుషుప్తవత్
తృణగుల్మలతాయుక్తః శిశిరాంతేయథారసః. 40
వాసంతఃసంస్థితోభూమౌ తథాసర్గఃపరేపదే
యథాద్రవత్వంకనకే స్థితమంతరనున్మిషత్. 41
తథాస్థితఃపరేసర్గ ఆత్మవర్గాదణావణౌ
సన్నివేశోయథాంగానా మంగినోఽనన్యఆత్మనః. 42



జగదేవమనంగస్య స్వాత్మనోబ్రహ్మణస్తథా
యాదృగేకనరఃస్వప్నే యుద్ధమన్యంనరంప్రతి. 43
తాదృశంసదసద్రూపం స్వాత్మేదంవ్యోమగంజగత్
మహాకల్పాంతసర్గాదౌ చిత్స్వభావమిదంజగత్. 44
కారణత్వంమిథఃపశ్చా దసదేతి నవాస్తవమ్
ముక్తేఽస్మిన్బ్రహ్మణియది బ్రహ్మన్యస్స్మృతిజోభవేత్.
తత్స్మృతిజ్ఞప్తిజే సర్గేస్థితే వజ్ఞప్తిమాత్రతా. 45

తత్త్వజ్ఞులు, మాయాకల్పితమును, ఆకారరహితమును, బోధశక్తిహీనమును, నగు ఈజగత్తును, అనిద్రితుడగు వాడుగాంచు అపూర్వస్వప్నమని ఎఱుంగుదురు. అచేతనస్తంభము తనయందు బొమ్మ నగుపింప జేయునట్లు, సర్వాధారమును చిన్మయమును, పరమార్థమునునగు ఆత్మ — స్తంభముగూడ ఈ సృష్టిని దోపింపచేయుచున్నది. స్వప్నమున తనప్రక్కనున్న, యోధులవలన బాధింపబడినవ్యక్తి ప్రబుద్ధుడైనను అజ్ఞానస్వభావుడైనట్లు, బ్రహ్మయొక్క సృష్టిగూడ శీతకాలమునకు బిమ్మట, వసంతారంభమున పుష్పాదిరూపమున మారుటకు, తృణగుల్మాదులతో గూడినరసము భూమియందుండునట్లు, ఈ సృష్టి గూడ పరమపదమున వెలయుచున్నది. సువర్ణమున ద్రవత్వమిమిడియుండునట్లు, సూక్ష్మమగు పరమ చైతన్యమున ఈ ప్రపంచ మణగియున్నది. అంగసమూహ మాత్మకంటె వేరుగానట్లు, ఈ జగత్తు బ్రహ్మముకంటె వేరుకాదు; ఈ జీవాత్మగూడ బ్రహ్మమునుండి వేరుకాదు. కాని, ఆపరమాత్మ నిరవయవము. ఒకడు యుద్ధమొనర్చునట్లు కలగాంచుచున్న, అప్పటికప్పుడాతనికావిషయము సత్యమైనట్లు తోచినను, ఇతరుల కయ్యది మిథ్యయగునట్లు, మాయికదృష్టికి సత్యమైనట్లు విశుద్ధదృష్టికి అసత్యముగను తోచును. సృష్టికాలమునను, ప్రళయసమయమునను గూడ నియ్యది పరమాత్మయందే సదసద్రూపమున వెలయుచున్నది. ఒకానొక హిరణ్యగర్భునియందింకొక హిరణ్యగర్భుని సత్త కల్పింపబడినను, ఈ జగత్తు స్మృతి, జ్ఞప్తులనుండి కలుగుచుండుటవలన, సంస్కారరూపకమగు సత్తనే గ్రహించుచున్నది. దీనికి వాస్తవమగు సత్తలేదు.

శ్రీ రామ ఉవాచ:—

పౌరాణాంమంత్రిముఖ్యానాం విదూరథకులక్రమః
సమమేవ కథంతత్ర సర్వేషాంప్రతిభాసితః 46

శ్రీరాముడు:- విదూరథుని వంశపరంపర మంత్రులకును, పౌరులకును ఒకేరీతిగ నేల కన్పించినది?

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

చితఃసమనువర్తంతే ముఖ్యాయాఃసర్వసంవిదః
యథావిపులవాత్యాయాః సామాన్యావాతలేఖికాః. 47

వసిష్ఠుడు:- సామాన్యమగు వాయులేఖ, విశాలమగు వాయువు ననుసరించునట్లు జ్ఞానము తయు ఆ ముఖ్యచిత్తమును అనుసరించుచున్నది.

పరస్పరానుసారేణ తథారూపేణసంవిదః
కచితాస్తాఃప్రజాపాలప్రజావాస్తవ్యమంత్రిణః. 48

అందువలన పౌరులకును మంత్రులకును పరంపరాక్రమ మొక్కతీరుగనే కన్పించినది.

ఏవంరూపాత్కులాజ్జాతో రాజాస్మాకమయంత్వసౌ
కచితాఇవవాస్తవ్యవిదో వై దూరథేపురే. 49

"ఈతడు మా రాజు, ఈ కులమునుండి జన్మించినాడు" అను అభిప్రాయము విదూరథ పురవాసుల కుండెను.

కచనేచిత్స్వభావస్య నచకారణమార్గణమ్
యుక్తంమహామణేర్భాసా మివాన్యత్రస్వభావతః. 50

సంవిత్తు ఇట్లు ఆరోపితవిషయముల సత్యత్వమును గలిగించుననుటకు గారణమును, వెదకుట యుక్తముకాదు-దీని స్వభావమే ఇట్టిది. మణికి తనకాంతిని ఇతరత్రప్రకాశింపజేయుచిచ్చ లేకున్నను కాంతి ప్రసరించుచుండుటలేదా!

అహమేవంకులాచారే రాజాస్యామేవమిత్యపి
విదూరథవిదోరత్నాదుదితాప్రతిభాయథా. 51

చింతామణి కోటినకోర్కెల నొసంగునట్లు, "నేనీ వంశమున నీ తీరుగ జన్మింతును" అను వాసనాబలముననే విదూరథుని జీవచైతన్యమట్లు జన్మించినది.

యావంతో జంతవోయస్మిన్యేయేసర్గేయదాయదా
తేసర్వగత్వాచ్చిద్ధాతో రన్యోన్యాదర్శతాంగతాః. 52

సృష్టిసమయమున జీవచైతన్యరూపమున అభ్యస్తములగు నవన్నియు, చిత్పదార్థము సర్వగామియగుటవలన, పరస్పరము ఆదర్శముల వంటివగును.

తీవ్రవేగవతీ యా స్యాత్తత్రసంవిదకంపితా
సైవాయాతిపరంస్థైర్య మామోక్షంత్వేకరూపిణీ. 53

ఈ జీవులలో నెయ్యది బ్రహ్మాకారమున వెలయుచు, విషయదోషమున స్పర్శింపబడకుండునో నయ్యది అట్లే విదేహముక్తివఱకు ఉండి, బ్రహ్మమున లీనమగుచున్నది.

బలవచ్ఛిద్విలాసానా మనువృత్త్యాపరస్పరమ్
స్వభావాఃప్రతిబింబంతి చిదాదర్శేస్వభావతః 54

భావనాబలమున చిన్మయవస్తువు ఆయా ఆకారమున స్ఫురించుచుండుటవలన జీవులందఱును అందు స్వాభావికముగనే ప్రతిబింబించుచున్నారు.

తత్రాతియత్నాజ్జయతి సత్యాఃసంవిదఆత్మసాత్
కుర్వంతిసరిదంభోధిగామినీ సరితోయథా. 55

ఇట్లు చిన్మయవస్తువున జగదాకారము స్ఫురించుచుండుట పరిపాటియేయైనను, సత్యజ్ఞానము నకు ప్రమాదములేదు. సముద్రమున కలుగు మహానది ఇతరములగు ఉపనదులను తనయందు కలుపుకొనునట్లు, సత్యమగు బ్రహ్మాకారజ్ఞానము, మాయయును, చిత్‌స్ఫురణమును అగు జగదాకారమును లోబరచుకొనుచున్నది. ముక్తి నిరోధింపబడదు.



యేసమాస్తత్రతేతావ ద్యతంతేచిత్స్వభావతః
యావదేకోజయత్యత్ర ద్వితీయః స నిమజ్జతి. 56

బ్రహ్మభావమునంద యత్నించువారిలో అత్యంతదృఢముగ యత్నించు మధ్యమాధికారి తన ప్రయత్నమున జయము నందుచున్నాడు. ఇతరులు దీనికొఱకు ప్రయత్నించుచున్నారు.

జాయమానేషునశ్యత్సు వర్తమానేషుభూరిశః
ఏవంసర్గసహస్రేషు పరమాణుకణంప్రతి. 57

పరమాణుకణమునుండి భ్రాంతిమయమగు ఈ సృష్టి వెలువడి నశించుచున్నది. కాని, జీవునకు దీనియందు వాస్తవమున కేమియును లభించుటలేదు. ఆతడు యత్నించినను లభింపదు.

నకించిత్కేనచిద్వ్యాప్తం నకించిత్కేనచిత్ధృతమ్
చిదాకాశమిదంశాంత మతఃసర్వమభిత్తమత్. 58

అలీకవస్తువు లభించుటగాని, లభించకపోవుటగాని లేదు. అవకాశశూన్యమును, శాంతమునునగు చిదాకాశ మొక్కటియే వెలయుచున్నది.

అయమాభాసతే స్వప్నో నిర్నిద్రోదృష్టివర్జితః
అవశ్యంభావిబోధస్తు స్వనుభూతోఽప్యసన్మయః. 59

వివేకదృష్టి రహితమగు ఈ నిర్నిద్ర-స్వప్నము బ్రహ్మసాక్షాత్కారమగువఱకు అగుపించుచున్నది. అధిష్ఠానమగు బ్రహ్మము సత్యమేయైనను, ఈ స్వప్నము పూర్వానుభూతమేయైనను ఇయ్యది మిథ్యయే.

పత్రపుష్పఫలాంశాత్మా యథైకఃస్యాత్స్థితోద్రుమః
అనంతసర్వశక్త్యాత్మా హ్యేకఏవతథావిభుః. 60

ఆకులతోను, పండ్లతోను, పువ్వులతోడను నిండిన వృక్షమొక్క పదార్థమేయైనట్లు, సర్వశక్తిసంపన్నమై నానావిధాకారముల స్ఫురించుచున్నను బ్రహ్మమొక్కటియే; అందునానాత్వము లేదు. మఱియు, నయ్యది సర్వవ్యాపకము.

మాతృమేయప్రమాణాది మాయాత్మకమజంపదమ్
బుద్ధంవిస్మృతిమాయాది నకదాచనకస్యచిత్. 61

ప్రమాతృప్రమాణ, ప్రమేయాదులతోగూడి మాయామయమై వెలయు బ్రహ్మతత్త్వము నొక్కసారి గ్రహించిన మరల నెప్పటికిని మరువజాలము.

శూన్యోదయాస్తమయవస్తు తమఃప్రకాశం
దిక్కాలరూప్యపిసదైకమనాదిశుద్ధమ్
ఆద్యంతమధ్యరహితంస్థితమచ్ఛమంబు
సౌమ్యత్వవీచివలనాఢ్యమివైకమేవ. 62

ఆత్మ ఉదయాస్తరహితమును, తమఃప్రకాశకమును, దిక్కాలరూపమును అయినను, అయ్యది ఆదిమధ్యాంత రహితము, అద్వితీయమునునైయున్నది. ఇయ్యది సౌమ్యమును, మృదుతరంగయుక్తమునునగు సముద్రమువలె వెలయుచున్నది.

అహంత్వమిత్యాదిజగత్స్వరూపా
విశుద్ధబోధైకవిభా విభాతి
ఆకాశకోశే నిజశూన్యతేవ
ద్వైతైక్యసంకల్పవికల్పనాచ్చ. 62

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ప్రయోజనవర్ణనం నామ షష్టితమః సర్గః ॥ 60 ॥

ద్వైత, ఐక్య సంకల్ప వికల్పరూపమగు మనస్సునుండి 'నీవు నేను' అను భావమున వెలయు జగత్తు ప్రతిభాసించుచున్నట్లగపడుచున్నది. ఇయ్యది విశుద్ధ బోధస్వరూపకమగు బ్రహ్మముయొక్క ప్రకాశము మాత్రమే. ఆకాశము శూన్యమేయైనను అందు ముత్యములు మొదలగునవి (భ్రాంతదృష్టికి) గోచరించునట్లు బ్రహ్మమున నీ జగత్తు గోచరించుచున్నది.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున లీలోపాఖ్యానమున
ప్రయోజనవర్ణనమను షష్టితమ సర్గము ॥ 60 ॥

---

## ఏకషష్టితమః సర్గః

శ్రీరామ ఉవాచః—

అహంజగదితిభ్రాంతిః పరస్మాత్కారణంవినా
యథోదేతితథాబ్రహ్మన్ - భూయఃకథయసాధుమే. 1

శ్రీరాముడు:- బ్రహ్మజ్ఞా! సాధుపురుషా! 'నేను-జగత్తు' అను భ్రాంతి కారణములేకుండగనే ఎట్లు ప్రభవించుచున్నదో మరల వర్ణింపుము.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

సమస్తాఃసమతైవాంతాః సంవిదోబుధ్యతేయతః
సర్వథాసర్వదాసర్వం సర్వాత్మకమజస్తతః 2

వసిష్ఠుడు:- ఆత్మవేత్త, ఈ భ్రాంతి అంతయును చైతన్యాంతర్గతమేయనియు, తద్బహిర్భూతమును, వ్యతిరిక్తమునునగు పదార్థము లేదని గ్రహింపగలడు. త్రికాలముల, సర్వాత్మకమును జన్మరహితమునునగు బ్రహ్మమొక్కటియే సత్యమని అతడు గ్రహించును.

సర్వాహిశబ్దార్థదృశో బ్రహ్మైవైతాఃపృథఙ్నతత్.
సర్వార్థశబ్దార్థకలా రూప మాసాంనవిద్యతే. 3

ఇంద్రియగ్రాహ్యములగు ఈ పదార్థములకు వాస్తవమునకు, రూపములేదు. ఇవి బ్రహ్మమునందే వెలయుచున్నవి. బ్రహ్మముకంటె భిన్నములుకావు.



కటకత్వంపృథఙ్హేమ్నస్తరంగత్వంపృథగ్జలాత్
యథానసంభవత్యేవం నజగత్పృథగీశ్వరాత్ 4

ఆభరణము సువర్ణమునుండియు, తరంగములు నీటినుండియు వేరుగానట్లు ఈ జగత్తు ఈశ్వరునినుండి భిన్నముకాదు.

ఏషఏవజగద్రూపం జగద్రూపంతునేశ్వరే
హేమ్నైవకటకాదిత్వం కటకత్వంనహేమని. 5

ఈ ఈశ్వరుడే జగద్రూపమున స్ఫురించుచున్నాడు. కాని జగద్రూపము ఈశ్వరునియందు లేదు. ఎట్లన, సువర్ణమే ఆభరణాది రూపములనందుచున్నది. కాని అవి బంగారమునలేవు.

యథావయవినోరూప మనేకావయవాత్మకమ్
తథాऽనవయవాయాస్తు చితఃసర్వాత్మకంచయత్. 6

అవయవిరూపము అనేక — అవయవాత్మకమైనట్లు, అవయవశూన్యమగు చిద్వస్తువు సర్వాత్మకమగుటవలన నానారూపముల ప్రకాశించుచున్నది.

యత్తుల్యకాలమఖిలం తన్మాత్రావేదనంపరే
అంతస్థంతదిదంభాతి జగదిత్యహమిత్యపి 7

ప్రాణుల అంతరమున నొకసమయమున వెలయుచున్న బ్రహ్మస్వభావమునకున్న అజ్ఞానము 'నేను, జగత్తు' మున్నగురూపముల ప్రకాశించుచున్నది.

లేఖౌఘానాంయథాభేద సన్నివేశఃశిలోదరే
తథానన్యజ్జగదహం చేత్యంతశ్చిద్ఘనేఘనమ్. 8

స్ఫటికశిలయందు అరణ్యసమూహముయొక్క ప్రతిబింబము వేరుగాకున్నను వేరైనట్లగుపించులాగున, చిన్మయుడగు పరమేశ్వరునినుండి ఈ అహంభావాత్మకమగు జగత్తు వేరుకాకున్నను వేరైనట్లు తోచుచున్నది.

స్థితాస్తరంగాఃసలిలే యథాంతరతరంగితే
సృష్టిశబ్దార్థరహితా స్తథాంతఃసృష్టయఃపరే. 9

నీటియందు తరంగములు లేచుచు లీనములగుచున్నవి. అయ్యవి నీటియందు వేరుకావు. అట్లే, బ్రహ్మమున సృష్టితరంగములు, లేచుచు లీనములగుచున్నవి. అయ్యవి బ్రహ్మమునుండి భిన్నములు కావు.

నసర్గేస్థితిపరం సర్గస్స్థితినోపరే
అవయవావయవివ త్సత్తానవయవైస్తయోః. 10

పరబ్రహ్మమున సృష్టిలేదు, సృష్టియు పరబ్రహ్మమునలేదు. ఈ సృష్టి మాయాప్రతిభాసమాత్రమే. జ్ఞానులొక్కసత్తను (బ్రహ్మమును) మాత్రమేగాంచుచున్నారు.

చిద్రూపేణస్వసంవిత్త్యా స్వచిన్మాత్రంవిభావ్యతే
స్వమేవరూపహృదయం వాతేనస్పందనంయథా. 11

వాయువున చలనము కల్పింపబడునట్లు అవిద్యయందు ప్రతిఫలించిన జ్ఞానమువలన చిన్మయ పరబ్రహ్మము తనయందు చిన్మాత్రరూపకమగు జగత్తును కల్పించుకొనుచున్నది.

తత్కాలమేవశబ్దాణుశ్చిచ్చమత్కారరూపధృక్
చేత్యతేఖమివైవాంతః సంకల్పఇవచేతసా. 12

అప్పుడంతవరకు కారణమున లీనమైయున్న శబ్దతన్మాత్ర ఆకాశరూపమును ధరించుచున్నది.

తదేవానిలతాంవేత్తి నిజసత్తాత్మికాంస్వయమ్
అంతర్గతస్పర్శరసాం పవనస్పందతామివ. 13

ఆకాశరూపమగు ఈ బ్రహ్మమే స్పర్శతన్మాత్రతోగూడి, స్థిరమగు వాయువు చంచలమగునట్లు, అనిలత్వము ననుభవించుచున్నది.

తదేవాభాసతామేతి నిజసత్తాత్మికాంస్వయమ్
కోశస్థితాలోకలవాం తేజఃప్రకటతామివ. 14

వాయురూపమును ధరించిన బ్రహ్మమే, తేజఃప్రకాశమువలె, రూపతన్మాత్రతోగూడి తేజోమయత్వము నందుచున్నది

తదేవజలతాంయాతి నిజసత్తాత్మికాంస్వయమ్
అంతఃస్థితాస్వాదలవాం సలిలంద్రవతామివ. 15

తేజోరూపమును ధరించిన బ్రహ్మమే రసతన్మాత్రతోగూడి స్వసత్తాత్మకమగు జలత్వమును, నీరు ద్రవత్వము నందునట్లు, పొందుచున్నది.

తదేవావనితాంవేత్తి స్వచిత్తైకాత్మతామయీమ్
అంతఃస్థగంధతన్మాత్రా మూర్త్యాస్థైర్యకలామివ. 16

భూమి గట్టిపడునట్లు జలరూపాభిమానియగు బ్రహ్మమే, గంధతన్మాత్రతోగూడి, తన చిత్తముతో నొకటియైన పృథివీభావము నందుచున్నది.

తుల్యకాలనిమేషాంశ లక్షభాగప్రతీతియత్
నిజంవిదఃప్రకచనం తత్సర్గౌఘపరంపరా. 17

ఇట్లు జగత్తు చిన్మయాకారమున ప్రకాశించుచున్నది; ఈ ప్రకాశించుట నిమేషమును లక్షభాగములుగ విభజించిన లభించు సమయములో జరిగిపోవుచున్నది. ఇయ్యదియే, కోటికల్పముల కాలమువఱకు వెలయు సృష్టి.

శుద్ధంసకృత్ప్రభాతాంత ర్దృశ్యమధ్యమనామయమ్
ఉదయాస్తమయోన్ముక్తం బ్రహ్మాత్మన్యనిష్ఠితమ్. 18

శుద్ధమును, నిత్యప్రకాశమును, సృష్టిప్రళయయోనియును, అనామయమును, ఉదయాస్త రహితమునునగు బ్రహ్మము అనాధారమై, అనగా స్వమహిమయందే వెలయుచున్నది.

బుద్ధంసదపవర్గంత త్సర్గమపిసత్సమమ్
అబుద్ధంసర్గరూపాత్మ విసర్గమపితత్సదా. 19



ఈ పరమార్థ సత్తయందు సృష్టిస్థితి ప్రళయములున్నను వైషమ్యము లేదు. అజ్ఞానమున గప్పబడియున్నప్పుడీ భేదము లగుపడుచున్నను ప్రబుద్ధమైన ముక్తినిబొందును.

చిద్బ్రహ్మయద్యథాయేన బుధ్యతేస్వాత్మనాత్మని
తత్తత్తథానుభవతి సర్వంసర్వాంగశక్తిమత్. 20

ఎవరు ఎట్లు తమ అంతరమున బ్రహ్మవస్తువును గ్రహించుదురో, అది వారియందట్లే ప్రతిఫలించును ఏలయన, మాయాశక్తి పలురూపముల బ్రహ్మముననున్నది.

తత్సత్యంచిద్విలాసత్వాన్నిత్యానుభవరూపతః.
తదసత్యంమనఃషష్ఠాత్సర్వాఖ్యా నిగతంయతః. 21

అందువలన ఈ జగత్తు బ్రహ్మముయొక్క విలాసము కాక వేరొకటికాదని వచింపుచున్నాను. మనస్సు మొదలగు ఇంద్రియములు బహిర్ముఖప్రవృత్తివలన గాంచునవి, వినునవి, అనుభవించునవి కేవలము నామరూపాత్మకమగు కల్పనయే; కావున అసత్యము లగుచున్నవి.

యథైతత్స్పరణంవాయౌ తథాసర్గఃస్థితఃపరే
అసత్కల్పేపిసత్కల్పః సత్యేఽసత్యఇవాపిచ. 22

వాయువున చలనమున్నట్లు పరబ్రహ్మమున జగత్తు ఉన్నది; వాయువు చలించునప్పుడు ఉన్నట్లు తోచుచున్నను. చలనము లేనప్పుడు లేనట్లగుపడునట్లు, అజ్ఞానమున్నంతవఱకు జగత్తున్నట్లును, అజ్ఞానము తొలగిపోయిన లేనట్లును అగుపించును.

అన్యరూపాయథానన్యా తేజస్యాలోకతోదరే
తథాబ్రహ్మణివిశ్వశ్రీః సత్యాసత్యాత్మికాచితి. 23

తేజమును ప్రకాశమును బుద్ధితో గాంచనియెడల నయ్యవి అసత్యమైనట్లును, తేజము, ప్రకాశము లభిన్నములను దృష్టితో గాంచిన సత్యములైనట్లును, బ్రహ్మమును జగత్తును భేదభావమున గాంచిన భిన్నములును, అభేదదృష్టితో గాంచిన అభిన్నములును నగుచున్నవి.

అనుత్కీర్ణాయథాపంకే పుత్రికాచాథదారుణి
యథావర్ణామషీకల్కే తథాసర్గాఃస్థితాఃపరే. 24

మట్టియందును, కఱ్ఱయందును బొమ్మ ఒనర్పబడనప్పుడుగూడ ఉండునట్లు, ఈ జగత్తుగూడ ఒకప్పుడు (సృష్టికి పూర్వము) అవ్యక్తమై యుండెను.

అనన్యాన్యేవకచతి బ్రహ్మతత్త్వమరుస్థలే
అసత్యాత్మనిసత్యేవ త్రిజగన్మృగతృష్ణికా 25

ఇప్పుడా పరబ్రహ్మమను మరుభూమియందు ముల్లోకములను ఎండమావులు అసత్యములయ్యు సత్యములైనట్లు అగపడుచున్నవి.

బ్రహ్మణాచిన్మయేనాత్మా సర్గాత్మైవవిభావ్యతే
నభావ్యతేచానన్యత్వాద్బీజేనాంతరివద్రుమః. 26

గింజ తనయందున్న మొలకవలె వెలువడునట్లు, చిన్మయబ్రహ్మము భ్రాంతివలన జీవరూపమును గ్రహించి సృష్టిక్రమమునకు లోబడుచున్నది.

యథాక్షీరస్యమాధుర్యం తీక్ష్ణత్వంమరిచస్యచ
ద్రవత్వంపయసశ్చైవ స్పందనంపవనస్యచ. 27

స్థితోఽనన్యోయథాన్యస్సన్నాస్తితత్రతథాత్మని
సర్గోనిర్గలచిద్రూపః పరమాత్మాత్మరూపభృత్. 28

పాలయందు తీపియును, మిరియమున కారమును, నీటియందు ద్రవత్వమును, గాలియందు కదలికయును ఉన్నవి. అవి వేరైనను వేరుకావు. వాటికి విభిన్నసత్తలేదు. అట్లే బ్రహ్మము సృష్టినుండి వేరైనను సత్తవలన ఒకటిగ నగుపడుచున్నది అయ్యది సృష్టినుండి వేరైన, సత్తలేకపోవుటవలన జగత్తు మిథ్యయగుచున్నది.

కచనంబ్రహ్మరత్నస్య జగదిత్యేవయత్స్థితమ్
తదకారణకంయస్మాత్తేన నవ్యతిరిచ్యతే. 29

వాసనాచిత్తజీవాది వేదనంవేదనోదితమ్
నోదేత్యవేదనాదేవ యతనాదేవపౌరుషాత్. 30

ఎట్టి కారణము లేకుండగనే బ్రహ్మ - రత్నము జగద్రూపమున ప్రకాశించుచున్నది; ఈ ప్రకాశము బ్రహ్మమునుండి వేరుకాదు. వాసనలు, చిత్తము, జీవులు మనస్సునుండి ఉత్పన్నములగుచున్నవి. జ్ఞానయోగమువలనను, దృఢాభ్యాసమును పురుష ప్రయత్నమువలనను మనస్సు నాశనమైన అయ్యది మరల నుదయింపదు.

నాస్తమేతినచోదేతి క్వచిత్కించిత్కదాచన
సర్వంశాంతమజంబ్రహ్మ చిద్ఘనంసుశిలాఘనమ్. 31

సర్వాత్మకమును, శాంతమును, అజమును, చిన్మయమునునగు బ్రహ్మము నిత్యప్రకాశకమైయున్నది. అయ్యది జననమరణ రహితము. అయ్యది శిలవలె, చిద్ఘనమైయున్నది.

పరాణుంప్రతిసర్గౌఘాశ్చిత్తాద్భాంతిసహస్రశః
తేష్వప్యణావణావంతః కైవాత్రావాసనాకథమ్. 32

పరమాణువులపై ఈ సృష్టిపరంపర ప్రతిభాసించుచున్నది. ఈ భ్రాంతి, చిత్తముయొక్క సాయమునజేసి గలుగుచున్నది. పరమాణువులయందు సృష్టులెట్లుండగలవు - అవన్నియును మిథ్య.

యథాజలాంతరూర్మ్యాద్యా గుప్తాగుప్తాశ్చశక్తయః
జాగ్రత్స్వప్నసుషుప్తాద్యాస్తథాజీవేఽంతరాస్థితాః. 33

నీటియందు అలలు వెలువడుచును, అణగియును, ఉండునట్లు, ఈ జీవునియందు జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలు వెలయుచున్నవి.

జాతాచేదరతిర్జంతోర్భోగాన్ప్రతిమనాగపి
తదసౌ తావతైవోచ్చైః పదంప్రాప్త ఇతిశ్రుతిః. 34



భోగములయెడ జీవున కొకించుకయైన విరాగము కల్గిన, దానివలన నతడు ఉత్తమమగు పదమును బొందునని శ్రుతి పల్కుచున్నది.

యతోయతోవిరజ్యతే తతస్తతోవిముచ్యతే
అతోఽహమిత్యసంవిదన్కపతిజన్మసంవిదమ్. 35

సంపూర్ణముగ విరాగముకల్గిన జీవన్ముక్తినందునని స్మృతి చెప్పుచున్నది. అందువలన ఈ దేహాత్మబుద్ధి రహితుడగువాడు జననమరణభ్రాంతి నందడు.

చితింపరాపరామజామరూపికామనామికామ్
చరాచరాం ధరామయీం విదంతియేజయంతితే. 36

ఈశ్వరచైతన్య, జీవచైతన్యములను, కారణకార్యోపాధి విహీనములుగ గ్రహించి, వాటి ఐక్యమును గ్రహించినవారే ఈ సంసారమును జయించు (తరించు) చున్నారు.

స్ఫురేచితిఃస్వప్రకటాద్వితీయా
స్వావర్తలేఖేవ జలేద్రవాంతః
సాహం తయేమాని జగంతిధత్తే
నసంతినాసంతి పరాత్మకాని. 37

నీటినుండి తరంగము వేరుగానట్లు, జీవచైతన్యము ఈశ్వరచైతన్యమునుండి వేరుకాదు. అయ్యది అద్వితీయము, స్వప్రకాశస్వరూపము. అయ్యది అహంభావమున ఈజగద్భావమును ధరించుచున్నది. ఈశ్వరచైతన్యాత్మకమగు ఈ జగత్తు సత్తుకాదు. అసత్తునుగాదు.

అహంమయీపద్మజభావనాచిత్
సంకల్పభేదాద్వితనోతివిశ్వమ్
అంతర్ముఖైవానుభవత్యనంత
నిమేషకోట్యంశవిధౌయుగాంతమ్. 38

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
జగత్స్వరూప వర్ణనం నామ ఏకషష్టితమః సర్గః ॥ 61 ॥

అహంభావాపన్నుడును, చైతన్యస్వరూపుడునునగు బ్రహ్మయొక్క భావనయే సంకల్పభేదానుసారము ఈ విశ్వమును బ్రకాశింపజేయుచున్నది; ఇయ్యది విష్ణుని నిముషములోని కోట్యంశ సమయమున ప్రళయమును బొందుచున్నది. ఇయ్యది మాయయొక్క మహిమ.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున జగత్స్వరూప
వర్ణనము ఏకషష్టితమ సర్గము ॥ 61 ॥

## ద్విషష్టితమః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

పరమాణునిమేషాణాం లక్షాంశకలనాస్వపి
జగత్కల్పసహస్రాణి సత్యానీవవిభాంత్యలమ్. 1
తేష్వప్యంతస్తథైవాంతః పరమాణుకణంప్రతి
భ్రాంతిరేవమనంతేయం ఇయమిత్యవభాసతే. 2
వహంతీమాః పరాఃసత్తాః శాంతాఃసర్గపరంపరాః
సలిలద్రవతేవాంతఃస్ఫుటావర్తవివర్తికా. 3
మిథ్యాత్మికైవసర్గశ్రీ ర్భవతీహమహామరౌ
తీరద్రుమలతోన్ముక్త పుష్పాలీవ తరంగిణీ 4
స్వప్నేంద్రజాలపురవత్సంకల్పేహాపురాదివత్
సంకల్పవదసత్యైవ భాతిసర్గానుభూతిభూః. 5

వసిష్ఠుడు:- కల్పనాబలమున నొకపరమాణువును లక్షభాగములుగ విభజించి, ఒక నిమిషమును మరల నట్లే లక్షభాగములుగ నొనర్చిన, వాటియందు పరిదృశ్యమానమగు ఈ జగత్తువంటి జగత్తులును, వేలకొలది కల్పములును సత్యములట్లు ప్రతిభాసింపగలవు. మరల, ఆజగత్తులనున్న ప్రత్యేకపరమాణువున ఇట్టివేయగు జగత్తులు ప్రతిభాసింపగలవు. ఇయ్యది ఎనలేని భ్రాంతి. నీటియందు సుడిగుండములు తిరుగుట స్పష్టముగ కనిపించునట్లు, భూత, భవిష్యద్వర్తమాన జగత్తులు స్పష్టముగ నగుపించుచున్నది. నదీతరంగములును, తత్తీరలతావృక్షముల పుష్పవర్షమును మరుభూమియందు మిథ్యయైనట్లు, ఈ సృష్టిపరంపరలుగూడ బ్రహ్మమున మిథ్యయని గ్రహించునది. స్వప్నమునను, ఇంద్రజాలమునను గాంచబడు పర్వత, పురీ, నగరములు మిథ్యయైనను అనుభవింపబడునట్లు, ఈ సృష్టులు మిథ్యారూపములయ్యు సంకల్పబలమున అనుభవయోగ్యము లగుచున్నవి.

శ్రీరామ ఉవాచ:—

ఏకాత్మైకతయైవంహి జ్ఞాతే సమ్యగ్విచారణాత్
నిర్వికల్పాత్మవిజ్ఞానే పరే జ్ఞానవతాంవర. 6
కిమర్థమిహతిష్ఠంతి దేహాస్తత్త్వవిదామపి
దైవేనైవసమాక్రాంతా దైవమత్రచకింభవేత్. 7

శ్రీరాముడు:- తత్త్వజ్ఞశ్రేష్ఠా! జ్ఞానులకు విచారబలమున ఏకాత్మరూపకములు, నిర్వికల్పమును నగు పరమాత్మ బోధకలిగిన, వారిశరీరము దైవమువలన నాక్రమింపబడినదానివలె ఎట్లు నిలచియుండును? వారిపట్ల దైవ మెట్లు వర్తించును? - వచింపుడు.

శ్రీవసిష్ఠ ఉవాచ:—

అస్తీహనియతిర్బ్రాహ్మీ చిచ్ఛక్తిఃస్పందరూపిణీ
అవశ్యభవితవ్యైకసత్తా సకలకల్పంగా. 8
ఆదిసర్గేహి నియతి ర్భావవైచిత్ర్యమక్షయమ్
అనేనేత్థంసదాభావ్యమితి సంపద్యతే పరమ్. 9



మహాసత్తేతికథితా మహాచితిరితిస్మృతా
మహాశక్తిరితిఖ్యాతా మహాదృష్టిరితిస్థితా. 10
మహాక్రియేతిగదితా మహోద్భవ ఇతిస్మృతా
మహాస్పందఇతిప్రోక్తా మహాత్మైకతయోదితా. 11
తృణానీవజగంత్యేవ మితిదైత్యాః సురాఇతి
ఇతినాగా ఇతి నగా ఇత్యాకల్పంకృతాస్థితిః. 12

వసిష్ఠుడు :— స్పందరూపిణియును (ప్రాణముల అదృష్టము) అవశ్యంభావినియును (వస్తుశక్తి), చైతన్యశక్తియును, (ఈశ్వరసంకల్పము) నగు మహానియతి ఒక్కటి ఉన్నది; ఈ నియతియొక్క బలముననే తత్త్వజ్ఞుల శరీరము నిలబడి లౌకికవ్యవహార యోగ్యమగుచున్నది. ఈ నియతియే సృష్ట్యాదియందు "ఇయ్యది అగ్ని, ఇయ్యదిట్లు ఊర్ధ్వజ్వాలస్వభావసంపన్నమై సర్వదా వెలయుగాక!" అనురూపమున పరబ్రహ్మమున సంకల్ప వృత్తిగ నుదయించును. ఈ మహానియతియే, మహాసత్త, మహాచితి, మహాశక్తి, మహాదృష్టి, మహాక్రియ, మహోద్భవము, మహాస్పందము, మహాత్మరూపము అనునామముల వ్యవహరింప బడుచున్నది. ఈ నియతియొక్క బలముననే బ్రహ్మ జగత్సమూహములను గడ్డి పరకలవలె పరివర్తన మొనర్చుచున్నాడు; రాక్షసులు, దైత్యులు, దేవతలు, నాగులు మొదలగువారు కల్పాంతము వఱకు వ్యవస్థాపింపబడుచున్నారు.

కదాచిద్బ్రహ్మసత్తాయా వ్యభిచారోఽనుమీయతే
చిత్రమాకాశకోశేచ నాన్యథానియతేఃస్థితిః 13

బ్రహ్మసత్తయందు వ్యభిచారమనుమానింప బడినను, ఆకాశ-ఫలకమున చిత్రము గాంచబడినను, గాంచబడుగాక! (ఈ రెండును అసంభవ విషయములు. ఇట్టివి జరిగినను జరుగుగాక!) కాని, ఈ నియతి ఎన్నటికిని మారజాలదు.

విరించ్యాద్యాత్మభిర్బుద్ధై ర్బోధాయావిదితాత్మనామ్
బ్రహ్మైవసానియతిః సర్గోయమితికథ్యతే. 14

బ్రహ్మమును, నియతియును, సృష్టియును నొక్కటియే; తత్త్వజ్ఞులగు బ్రహ్మాదులీ తీరుగనే గాంచుచున్నారు. అజ్ఞులకు దెలియబర్చుటకే విరించ్యాదులు బ్రహ్మరూపిణియగు ఈ నియతిని సృష్టియను నామమున బేర్కొనిరి.

అచలంచలవద్దృష్టం బ్రహ్మపూర్వ వ్యవస్థితః
అనాదిమధ్యపర్యంతం సర్గోవృక్షఇవాంబరే. 15

అజ్ఞుల దృష్టియందే ఈ సృష్టి, ఆకాశమునందలి వృక్షమువలె, ఆదిమధ్యాంత రహితమగు ఈ బ్రహ్మమున నిలచియున్నది.

పాషాణోదరలేఖాఘు న్యాయేనాత్మనితిష్ఠతా
బ్రహ్మణానియతిఃసర్గో బుద్ధోఽబోధవతేవఖమ్. 16

స్ఫటికమున ప్రతిబింబించు వనము, స్ఫటికముయొక్క స్వచ్ఛతవలన ప్రకాశించునట్లు, మాయాశబలితమగు బ్రహ్మమునయున్న ప్రజాపతి, నిద్రించువాని హృదయాకాశమున స్వప్నము కనబడునట్లు, తనయందున్న నియతిని గ్రహించి దానికిదగినట్లు సృష్టినొనర్చుచున్నాడు.

దేహేయథాంగినోఽంగాది దృశ్యతేచిత్స్వభావతః
బ్రహ్మణాపద్మజత్వేన నియత్యాద్యంగకంతథా. 17

దేహియొక్క దేహమునుండి హస్తపాదాది అంగములు వేరుగజూపబడునట్లు, ఈ బ్రహ్మ హిరణ్యగర్భభావమును బొంది చైతన్యబలమున నియతిమున్నగు అంగములు తననుండి వేరుగాకున్నను వేరైనట్లు గాంచుచున్నాడు.

ఏషాదైవ మితిప్రోక్తా సర్వంసకలకాలగమ్
పదార్థమలమాక్రమ్య శుద్ధా చిదితిసంస్థితా. 18

ఈ మహానియతినే దైవ మందురు. ఇయ్యదియే సర్వకాలవ్యాపియును, సకలవస్తువ్యాపియును, సర్వమును, విశుద్ధచైతన్యరూపమగు ఈశ్వరసంకల్పమునునై యున్నది.

స్పందితవ్యం పదార్థేన భావ్యంవాభోక్తృతాపదమ్
అనేనేత్థమనేనేత్థ మవశ్యమితిదైవధీః. 19

'ఇయ్యది ఇట్లు తప్పక చలించును, ఇయ్యది ఈ రీతి ఈ సమయమున అవశ్యము ఉత్పన్నమగును, అను నియమమునే దైవమందురు.

ఏషైవపురుషస్పంద స్తృణగుల్మాదిచాఖిలమ్
ఏషైవసర్వభూతాది జగత్కాలక్రియాదివా. 20

దీనినే పురుషస్పందము, తృణగుల్మాదులు, జీవప్రభృతులు, దివారాత్రములు, క్రియలు అనిగూడ అందురు.

అనయాపౌరుషీసత్తా సత్తాస్యాః పౌరుషేణచ
లక్ష్యతేభువనంయావద్వ్యేకాత్మతయైవహి 21

ఈ నియతివలననే పురుషుని అదృష్టమును, పురుషుని అదృష్టమువలన నియతియును ప్రళయమువఱకు నిలిచియుండును. మహాప్రళయానంతరము ఈ రెండును ఏకమైపోవును. అనగా బ్రహ్మమున గలసిపోవును.

నరేణపౌరుషేణైవ కార్యేసత్తాత్మకేఽశుభే
ఈదృశ్యేతేన నియతిరేవం నియతిపౌరుషే. 22

ప్రష్టవ్యోఽహం త్వయారామ దైవపౌరుషనిర్ణయః
మదుక్తంపౌరుషంపాల్యం త్వయేతి నియతిఃస్థితా. 23

నియతియును, పురుషకారమును పురుషుని ప్రయత్నము ననుసరించియే యుండును. రామా! పెక్కేల? నీవు నన్ను దైవపురుషకారములను గుఱించి అడుగుట, నేను చెప్పుట, దానిని నీవు పాలించుటయుగూడ నియతియొక్క ఫలమే!

భోజయిష్యతిమాందైవ మితిదైవపరాయణః
యస్తిష్ఠత్యక్రియోమౌనం నియతేరేషనిశ్చయః. 24

దైవపరాయణుడై 'దైవమునన్ను భోజనమొనర్ప జేయును' అని తలచి, నిష్క్రియుడై యుండుటగూడ నియతియొక్క ఫలమే.



నస్యాద్బుద్ధిర్నకర్మాణి నవికారాదినాకృతిః
కేవలం త్విత్థమాకల్పం స్థిత్యాభావ్యమితిస్థితాః 25

ఏమియును ఒనర్పకుండ పురుషుడు పూర్వముండి, అట్లే జరుగవలసియున్న బుద్ధి, దానివలన జరుగుకర్మ, కర్మలవలనగలుగు భౌతికవికారములు, ఆకారములు మున్నగునవి కలిగెడివిగావు. అందువలన, కల్పారంభమునుండి ప్రళయమువఱకు జరిగెడివన్నియును నియతివలననే జరుగుచున్నవని గ్రహింపవలెను.

అవశ్యంభవితవ్యైషా త్విదమిత్థమితిస్థితిః
నశక్యతే లంఘయితు మపిరుద్రాదిబుద్ధిభిః. 26

అవశ్యముగ జరుగవలసిన దానిని రుద్రుడు మున్నగువారి బుద్ధిగూడ అతిక్రమింపజాలదు. అది జరిగియే తీరును. (అగ్ని తాపమునిచ్చునను నియతి దురతిక్రమము అనిభావము.)

పౌరుషంనపరిత్యాజ్య మేతామాశ్రిత్యధీమతా
పౌరుషేణైవరూపేణ నియతిర్హినియామికా. 27

కాని, బుద్ధిమంతుడగువాడు, ఈ నియతి నాశ్రయించి, పురుషకారమును బరిత్యజింపగూడదు. ఏలయన; నియతి పురుషకార రూపముననే కర్మలను నియమించుచున్నది. (అనగా, ఆయాకర్మల నాచరించిన ఆయాఫలములు లభించుచున్నవి.)

అపౌరుషంహినియతిః పౌరుషంసైవసర్గగా
నిష్ఫలాఽపౌరుషాకారా సఫలాపౌరుషాత్మికా. 28

ఇయ్యది పురుషప్రయత్నముతో వివక్షింపబడక, ఈశ్వర సంకల్పరూపమున నరుదెంచినప్పుడు నియతియనియు, సృష్టిరూపమున నరుదెంచినప్పుడు పురుషకారమనియు, వచింతురు. ఇయ్యది పురుషకారరూపమును (ప్రయత్నము) గ్రహింపకున్న నిష్ఫలము. పురుషకారరూపమును దాల్చిననే సఫలమగుచున్నది.

నియత్యా మూకతామేత్య నిష్పౌరుషతయాఽక్రియమ్
యస్తిష్ఠతిప్రాణమరు త్స్పంద స్తస్యక్వగచ్ఛతి. 29

నియతి నాశ్రయించి నిష్క్రియుడై భోజనాదుల నొనర్పకున్నవాడు క్షుత్పీడితుడయ్యు కొద్దికాలము జీవించిన జీవించుగాక! కాని, ఆతడు ఉచ్ఛ్వాస నిశ్వాసరూపమగు పురుషకారమును త్యజించిన అతనిగతి ఏమగును?

అథప్రాణక్రియారోధ మపికృత్వావిరామదమ్
యదితిష్ఠతితత్సాధు ర్ముక్తఏవకిముచ్యతే. 30

నిర్వికల్ప సమాధియందు వాయువును నిరోధించి, తత్త్వజ్ఞుడు ముక్తినందుటగూడ పురుషకారము వలననే. అందువలన, పురుషకారము లేకుండగనే ఫలము లభించునని ఎట్లు చెప్పగలము?

పౌరుషైకాత్మతాశ్రేయో మోక్షోఽత్యంతమకర్తృతా
అభ్యంతుసబలఃపక్షో నిర్దుఃఖైవ మహాత్మనామ్. 31

అందువలన శాస్త్రవిధిననుసరించి, పురుషకారము నవలంభించుట పరమశ్రేయము. సిద్ధి లభించిన తత్ఫలమును, అత్యంత నైష్కర్మ్యమునునగు మోక్షముగూడ పరమశ్రేయము. సాధ్యసాధనలలో జ్ఞానులపక్షమే (అనగా ముక్తి) బలవత్తరము.

నియతిర్బ్రహ్మసత్తాభా తస్యాంచేత్పరిణమ్యతే
నూనంపరమశుద్ధాఖ్యం తత్ప్రాప్తైవపరాగతిః 32

జ్ఞానుల నియతియందు (మోక్షమందు) ఎట్టి దుఃఖమునులేదు. దానివలన అవిద్యానాశనమై పోవును. ఇయ్యది లభించిన పరమశుద్ధమును, పరమప్రాప్తియును నగు పరమగతి లభించినదని గ్రహింపనగును.

ఏతైర్నియత్యాది మహావిలాసై
ర్బ్రహ్మైవవిస్ఫూర్జతిసర్వగాత్మా
తృణాదివల్లీతరుగుల్మజాలైః
సత్త్వైవతోయస్య ధరాంతరస్థా. 33

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
దైవశబ్దార్థనిరూపణం నామ ద్విషష్టితమః సర్గః ॥ 62 ॥

నీటియొక్క ద్రవత్వమే తృణ, లతా, వృక్షాది రూపముల ధరాతలమున ప్రకాశించునట్లు, సర్వగామియగు బ్రహ్మమే నియతిరూపమున బ్రకాశించుచున్నది.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున దైవశబ్దార్థ
నిరూపణమను ద్విషష్టితమ సర్గము. ॥ 62 ॥

## త్రిషష్టితమః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

యదేతద్బ్రహ్మతత్త్వంసర్వథా సర్వదైవసర్వతఏవ
సర్వశక్తిసర్వాకారం సర్వేశ్వరం సర్వగంసర్వమేవేతి. 1

వసిష్ఠుడు:- ఈ బ్రహ్మతత్త్వము సర్వకాలముల, సర్వదేశముల, సర్వశక్తిమంతమై వెలయుచున్నది. మఱియు నయ్యది, సర్వాకారమును, సర్వైశ్వర్యమును, సర్వవ్యాపియును, సర్వమును నై యున్నది.

ఏషత్వాత్మాసర్వశక్తిత్వాచ్చ క్వచిచ్చిచ్ఛక్తింప్రకటయతి క్వచిచ్ఛాంతిం
క్వచిజ్జడశక్తింక్వచిదుల్లాసం క్వచిత్కించిన్నకించిత్ప్రకటయతి, 2



ఈ బ్రహ్మమే ఆత్మ; ఇయ్యది సర్వశక్తిమంతమగుటవలన కొన్నిచోట్ల చిత్ - శక్తిని, సాత్త్విక ఉపాధులయందు శాంతభావమును, తామసిక ఉపాధులయందు జడశక్తిని రాజస ఉపాధులయందు రాగద్వేషాది ఉల్లాసములను ప్రకటించుచు, ప్రళయ సుషుప్తికాలముల నెద్దానినియును బ్రకటింపకుండ నున్నది.

యత్రయదాయదేవాసౌయథాభావయతి తత్రతదాతదేవాసౌప్రపశ్యతి. 3

ఇయ్యది ఎచ్చట ఎట్లేరూపమున సంకల్పించుచుండునో, అట నట్టిరూపముననే నవలోకించుచుండును.

సర్వశక్తేర్హియాయైవ యథోదేతితథైవసా. 4

సర్వశక్తిమంతమగు ఆ పరబ్రహ్మముయొక్క శక్తి ఎచ్చట ఏ రూపముననుదయించుచుండునో అయ్యదా రూపముననే వివృతినందును.

తదాస్తిశక్తిర్నానారూపిణీ సాస్వభావతఇమాఃశక్తయోఽయమాత్మేతి. 5

దానియొక్క శక్తి నానారూపముల వ్యవహృతమగుచు, వ్యవహారదృష్టికి విభిన్నములుగ నగుపించు చున్నది; కాని, పరమార్థదృష్టియందిది ఒక్కటియే.

ఏవంవికల్పజాలంవ్యవహారార్థంధీమద్భిః పరికల్పితం లోకే నత్వాత్మని
విద్యతేభేదః. 6

బుద్ధిమంతులు లౌకికవ్యవహారమునకై ఈ వికల్పముల (నానాత్వము) గల్పించినారు. కాని ఆత్మయందెట్టి భేదములును లేవు.

యథోర్మితరంగపయసాంసాగరే కటకాంగదకేయూరైర్వాహేమ్నః
అవయవావయవినోః సంవిత్కాల్పనికీ ద్వితానవాస్తవీ. 7

ఎట్లన, నీరు, అలలు సముద్రము అను విభజన కాల్పనికము. లేక, బంగారము, కటకాంగదాదులు అను కల్పన మిథ్య. అట్లే, బ్రహ్మమును తచ్ఛక్తియును ఒక్కటియే, వాటి భేదము కల్పన.

యథాయచ్చేత్యతేహి తథైవతన్న బాహ్యతోనాంతరతశ్చ
తత్సముదేతిహి. 8

(రజ్జువున సర్పమువలె) ఎయ్యది బుద్ధికెట్లు విషయీకృతమగునో, బాహ్యదృష్టికిగూడ అయ్యదట్లే గోచరించును. కాని, పరమార్థ దృష్టి కయ్యదట్లు గోచరింపదు.

సర్వాత్మత్వాత్సమాభాసం క్వచిత్కించిత్ప్రపశ్యతి. 9

సర్వాకారమయంబ్రహ్మైవేదంతతం మిథ్యాజ్ఞానవద్భిఃశక్తిశక్తిమత్త్వే
అవయవావయవిరూపే కల్పితే నపారమార్థికే. 10

ఈ బ్రహ్మము సర్వాత్మక మగుటవలన సర్వత్ర సమభావముననే గోచరించుచున్నది. (సర్వసాక్షి యగుటవలన) భ్రాంతికి లోనై, ఎచ్చటనో ఎద్దానినో గాంచును. ఎల్లెడలగాదు. ఈ దర్శనముగూడా వాస్తవము గాదు.

సద్వాభవత్వసద్వా చిద్యత్సంకల్పయత్యభినివిశతి తత్తత్పశ్యతి
సకలాతత్సద్బ్రహ్మైవ చిద్భాతి. 11

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ-మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
చిత్తవికారోనామ త్రిషష్టితమః సర్గః ॥ 63 ॥

సత్యమేయగుగాక, మిథ్యయేయగుగాక, చిత్తమెద్దానిని సంకల్పించునో, ఎద్దానియందభినివేశముంచునో, అద్దానిని సద్దేగాంచును. చిచ్ఛక్తియే ఇట్లు ప్రకాశించుచున్నది. అందువలన, బ్రహ్మమొక్కటియే సత్యము.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
చిత్తవికారమను త్రిషష్టితమ సర్గము ॥ ౬౩ ॥

## చతుఃషష్టితమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

యోఽయం సర్వగతోదేవః పరమాత్మా మహేశ్వరః
స్వచ్ఛఃస్వానుభవానందస్వరూపోఽంతాదివర్జితః. 1
ఏతస్మాత్పరమానందా చ్ఛుద్ధ చిన్మాత్రరూపిణః
జీవఃసంజాయతేపూర్వం స చిత్తం చిత్తతోజగత్. 2

వసిష్ఠుడు:- సర్వగమును, నిర్మలమును, స్వప్రకాశకమును, ఆనందస్వరూపమును, ఆద్యంతవివర్జితమునునగు, విశుద్ధమును, చిన్మాత్రస్వరూపమును, పరమానందమయమునునగు పరమాత్మనుండియే ప్రథమమున చిత్తయుతుడగు జీవుడు అనగా బ్రహ్మ ఉత్పన్నమగుచున్నాడు. పిదప, అతని చిత్తమునుండి జగత్తు సృష్టింపబడుచున్నది.

శ్రీరామ ఉవాచ:—

స్వానుభూతి ప్రమాణేఽస్మిన్ బ్రహ్మణి బ్రహ్మ బృంహితే
కథంసత్తా మవాప్నోతి జీవకో ద్వైతవర్జితే. 3

శ్రీ రాముడు:- అపరిచ్ఛిన్నమును, అద్వితీయమును, స్వప్రకాశకమును, అఖండమునునగు బ్రహ్మమున తద్వ్యతిరిక్తగుణియగు జీవుడెట్లు సత్తను బొందుచున్నాడు?

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అసదాభాస మచ్ఛాత్మ బ్రహ్మాస్తీహ ప్రబృంహితమ్
బృహచ్ఛిదైభరవవపు రానందాభిధమవ్యయమ్. 4



వసిష్ఠుడు:- ఈ బ్రహ్మమున మిథ్యయగు ద్వైతభావము (అవిద్యాసంస్కారమువలన) గలుగుచున్నది. ఈ బ్రహ్మము నిర్మలము, సర్వవ్యాపియునైయున్నది. దీని విశాల చిదాకారము ఆత్మదర్శనాసమర్థులగువారి కత్యంతభీషణమైయున్నది. కాని, ఇయ్యది తజ్ఞుల కానందమయమును శాశ్వతమునైయున్నది.

తస్యయత్సమమాపూర్ణం శుద్ధంసత్వమచిహ్నితమ్
తద్విదామప్యనిర్దేశ్యం తచ్ఛాంతం పరమంపదమ్. 5

ఉపాధిరహితమును, పరిపూర్ణమును, సత్త్వమయమునునగు దీనిస్థితిని పండితులుగూడ నిర్దేశింపజాలరు. దీనిని శాంతిమయమగు పరమపదమందురు ఇయ్యది పరమాత్మయొక్క ఆద్యస్వరూపము.

తస్యైవోద్యదివా శాంతి యత్సత్త్వం సంవిదాత్మకమ్
స్వభావాత్స్పందనం తత్తు జీవశబ్దేన కథ్యతే. 6

ఈ బ్రహ్మమే ఉపాధితోగూడి, సంవిదాత్మకమై ప్రాణమును ధరించిన ఆ భావము తొలగి ముక్తిలభించునంతవఱకు, జీవుడని చెప్పబడుచున్నది. ఇయ్యది ద్వితీయరూపము.

తత్రేమాః పరమాదర్శే చిద్వ్యోమ్న్యనుభవాత్మికాః
అసంఖ్యాః ప్రతిబింబంతి జగజ్జాలపరంపరాః. 7

చిదాకాశస్వరూపమగు ఈ పరమాదర్శమున అసంఖ్యాకములును, అనుభవాత్మకములునునగు జగత్తులు ప్రతిబింబించుచున్నవి.

బ్రహ్మణః స్ఫురణంకించి ద్యదవాతాంబుధేరివ
దీపస్యేవాప్యవాతస్య తంజీవంవిద్ధిరాఘవ. 8

రాఘవా! వాయుశూన్య సముద్రమునను, నిర్వాతకంపిత దీపమునను కలుగు చాంచల్యమువంటి చాంచల్యమే బ్రహ్మమునగల్గిన నద్దానిని జీవుడనుచున్నారు.

శాంతత్వాపగమేఽచ్ఛస్య మనాక్సంవేదనాత్మకమ్
స్వాభావికం యత్స్ఫురణం చిద్వ్యోమ్నః సోఽంగజీవకః. 9

వత్సా! నిర్మలమగు ఈ బ్రహ్మవస్తువున ప్రాణస్పందన మధ్యారోపితమైన, నిష్క్రియత్వము తొలగ, స్ఫురించు పరిచ్ఛిన్నభావ (=అహంభావ) స్ఫురణమే జీవుడని చెప్పబడుచున్నది.

యథావాతస్యచలనం కృశానోరుష్ణతాయథా
శీతతావా తుషారస్య తథాజీవత్వమాత్మనః 10

నిప్పున వేడిమి, మంచున చల్లదనముండునట్లు, ఈ బ్రహ్మమున చాంచల్యస్వరూపమగు జీవభావముగూడ ముక్తిలభించునంతవఱకు స్వాభావికముగనే యుండును.

చిద్రూపస్యాత్మతత్త్వస్య స్వభావవశతః స్వయమ్
మనాక్సంవేదనమివ యత్తజ్జీవ ఇతిస్మృతమ్. 11

చిద్రూపమగు ఈ ఆత్మతత్త్వమున స్వభావవశమున గలుగు పరిచ్ఛిన్నత్వమే, జీవుడనుపేరిట జెప్పబడుచున్నది.

తదేవఘనసంవిత్త్వా యాత్యహంతామనుక్రమాత్
వహ్న్యణుః స్వేంధనాధిక్యాత్స్వాం ప్రకాశకతామివ. 12

నిప్పురవ్వ కట్టెలెక్కువైనకొలది ప్రకాశించునట్లు, బ్రహ్మముయొక్క ఈ పరిచ్ఛిన్నత్వము (జీవభావము) దృఢములగు వాసనలబలమున అహంభావమును క్రమముగ పొందుచున్నది.

యథాస్వతారకామార్గే వ్యోమ్నః స్ఫురతినీలిమా
శూన్యస్యాప్యస్య జీవస్య తథాహంభావభావనా. 13

ఆకాశమున వాస్తవమునకు నీలిరంగు లేకున్నను, అయ్యది చక్షుర్గోచరముకాకున్నను అందు నీలవర్ణ మగుపించునట్లు, జీవునియందహంభావము లేకున్నను, ఆత్మదర్శన మవకపోవుటవలన తన్నహంభావాపన్నునిగ భావించుకొనును.

జీవోఽహంకృతిమాదత్తే సంకల్పకలయేద్ధయా
స్వయైతయా ఘనతయా నీలిమానమివాంబరమ్. 14

ఆకాశమున నీలిరంగు తోచునట్లు, పూర్వసంకల్ప-సంస్కారములచే ప్రబోధితుడై అధ్యాసవలన జీవుడహంభావమునందుచున్నాడు.

అహంభావోఽహిదిక్కాల వ్యవచ్ఛేదీకృతాకృతిః
స్వయంసంకల్పవశతో వాతస్పందఇవస్ఫురన్. 15
సంకల్పోన్ముఖతాంయాత స్త్వహంకారాభిధఃస్థితః
చిత్తంజీవోమనోమాయా ప్రకృతిశ్చేతినామభిః. 16

ఈ అహంభావమే దేశకాలాదిరూపముల పరిచ్ఛిన్నమై, స్వసంకల్పబలమున దేహాది ఆకారములదాల్చి, వాతస్పందమువలె స్ఫురించుచు, సంకల్పోన్ముఖమై చిత్తము, జీవుడు, మనస్సు, మాయ, ప్రకృతి అను నామముల చేర్కొనబడుచున్నది.

తత్సంకల్పాత్మకంచేతో భూతతన్మాత్రకల్పనమ్
కుర్వంస్తతో వ్రజత్యేవ సంకల్పాద్యాతి. పంచతామ్. 17

సంకల్పాత్మకమగు ఈ చిత్తమే (బ్రహ్మమే) సంకల్పబలమున భూతతన్మాత్రలను గల్పించి చేతనాత్మకమగు పూర్వావస్థనుండి ప్రచ్యుతినంది, జడయగు పంచతన్మాత్రలుగ మారుచున్నది.

తన్మాత్రపంచకాకారం చిత్తంతేజఃకణోభవేత్
అజాతజగతివ్యోమ్ని తారకాపేలవాయథా. 18
తేజఃకణత్వమాదత్తే చిత్తంతన్మాత్రకల్పనాత్
శనైఃస్వస్మాత్పరిస్పందాద్బీజమంకురతామివ. 19

పంచతన్మాత్రభావమునందిన ఈ చిత్తము, ఆకాశమునందలి నక్షత్రమువలె, తేజఃకణముగ మారుచున్నది; ఈ తేజఃకణభావము బీజము అంకురమగునట్లు, నెమ్మదిగ జరుగుచున్నది.

అసౌతేజఃకణోఽండాఖ్యః కల్పనాత్కశ్చిదండతామ్
ప్రయాత్యంతః స్ఫురద్బ్రహ్మ జలమాపిండతామివ. 20



పిదప, ఈ తేజఃకణమున బ్రహ్మప్రకాశించుచుండ, నయ్యది నీరు గడ్డకట్టునట్లు, అండత్వము నందుచున్నది.

కశ్చిద్దాత్రితిదేహాది కలనాద్యాతిదేహతామ్
భ్రాంతిత్వంతదతద్రూపం గంధర్వాశ్చవసత్పురమ్. 21
కశ్చిత్స్థావరతామేతి కశ్చిజ్జంగమతామపి
కశ్చిద్యాతిఖచార్యాదిరూపం సంకల్పతఃస్వతః. 22

పిదప, ఈ తేజఃకణము దివ్యదేహ కల్పనవలన దివ్యదేహమును, అహంభావ శూన్యపదార్థముల అహంభావ భ్రాంతిని బొందుచు, గంధర్వాది లోకముల కలుగుచున్నది. కొన్నిటి స్థావరభావమును, కొన్నిటి జంగమత్వమును, కొన్నిటి ఖేచరత్వమును స్వసంకల్ప మహిమవలన నందుచున్నది.

సర్గాదావాదిజోదేహో జీవఃసంకల్పసంభవః
క్రమేణపదమాసాద్య వైరించంకురుతేజగత్. 23

సృష్టికి బూర్వము సంకల్పమునుండి ఉదయించిన జీవదేహమే క్రమముగ విరించి పదమునంది జగత్తును నిర్మించుచున్నది.

ఆత్మభూఃకలనాత్మాసౌ యత్సంకల్పయతిక్షణాత్
తత్స్వభావవశాదేవ జాతమేవప్రపశ్యతి. 24

స్వయంభువగు విరించి సంకల్పించుదాని నంతటిని ఉత్పన్నముగ స్వభావవశమున గాంచుచున్నాడు.

చిత్స్వభావాత్సమాయాతం బ్రహ్మత్వంసర్వకారణమ్
సంసృతౌకారణంపశ్చాత్కర్మ నిర్మాయసంస్థితమ్. 25

అతడు చిత్స్వభావమునజేసి అన్నిటికి గారణమగు బ్రహ్మభావమునంది. జగత్కారణమై, కర్మలను నిర్మించుచుండును.

చిత్తంస్వభావాత్స్ఫురతి చితఃఫేనఇవాంభసః
కర్మభిర్బధ్యతేపశ్చా డ్డిండీరమివరజ్జుభిః. 26

నీటినుండి నురుగులేచునట్లు, స్వాభావికముగనే చిత్తునుండి చిత్తముదయించి, నురుగు నీటియందుండగ నాకారజ్జువున ఆబద్ధమగునట్లు, కర్మల ఆబద్ధమగుచున్నది. చిద్బద్ధముకాదు.

సంకల్పఃకలనాబీజం తదాత్మైవహిజీవకః
కర్మపశ్చాత్తనోత్యుచ్చై రుత్థాయాకర్మతఃక్రమాత్. 27
క్రోడీకృతాంకురాపూర్వం జీవోధత్తేస్వజీవితమ్
పశ్చాన్నానాత్వమాయాతి పత్రాంకురఫలక్రమైః. 28
అన్యేస్వపవయోజీవా ఏవమేవాకృతింగతాః
పూర్వోత్పన్నేజగతితే యాంతిభూతాశ్రయాంస్థితిమ్. 29
స్వకర్మభిస్తతోజన్మ మృతికారణతాంగతైః
ప్రయాంత్యూర్ధ్వమధస్తాద్వా కర్మచిత్స్పందఉచ్యతే. 30

మనుజాలు మొట్టమొదట సంకల్ప రహితులైయుండి, పిదప ఘటపటాదులను మనస్సున సంకల్పించి నిర్మించునట్లు, జీవుడు మొట్టమొదట నిష్క్రియుడైయుండి, పిదప సంకల్పించి, కర్మల నొనర్చుచున్నాడు. బీజమున అంకురము సూక్ష్మభావమున ఉత్పన్నమై, పెరిగి, పత్ర, కాండ, శాఖా, ఫల; పల్లవ, పుష్పాది రూపములుగ మారునట్లు, హిరణ్యగర్భునియందు సంకల్ప రూపముననుండిన జీవు లిట్లు నానారూపముల ప్రకాశము నందుచున్నారు. ఇతరులగు జీవులుగూడ పూర్వకల్ప-కృతకర్మాను గుణములగు శరీరముల నందుచున్నారు. పిదప, జనన మరణ కారణమగు తమకర్మల ననుసరించి, స్వర్గ నరకాదుల కరుగుచున్నారు. ఈ కర్మ చిత్స్పందము (సంకల్పము) గాక వేరొండుగాదు.

చిత్స్పందనంభవతికర్మతదేవదైవం
చిత్తంతదేవభవతీహశుభాశుభాది
తస్మాజ్జగంతిభువనాని భవంతిపూర్వం
భూత్వానిజాంగకుసుమానితరోరివాద్యాత్. 31

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
బీజాంకుర యోగనిర్ణయోనామ చతుఃషష్టితమః సర్గః ॥ 64 ॥

ఈ చిత్ - స్పందమే కర్మ, దైవము, చిత్తము, శుభాశుభములునైయున్నది. చెట్టున, దాని అంగములగు కుసుమాదులు పూర్వముండి మరల ఉత్పన్నమగునట్లు, ఆదికారణమగు యీ చిత్స్పందము అనగా బ్రహ్మమునుండియే, జగత్తులు మరలమరల నుద్భవించుచున్నవి.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
బీజాంకురయోగ నిర్ణయమను చతుఃషష్టితమ సర్గము ॥ 64 ॥

## పంచషష్టితమః సర్గః

శ్రీవసిష్ఠ ఉవాచః—

పరస్మాత్కారణాదేవ మనఃప్రథమముత్థితమ్
మననాత్మకమాభోగి తత్స్థమేవస్థితింగతమ్. 1
భావాభావలసద్దోలం తేనాయమవలోక్యతే
సర్గఃసదసదాభాసః పూర్వాగంధఇవేచ్ఛయా. 2
నకశ్చిద్విద్యతేభేదో ద్వైతైక్యకలనాత్మకః
బ్రహ్మజీవమనోమాయా కర్తృకర్మజగద్దృశామ్. 3
అపారావారవిస్తార సంవిత్సలిలవల్గనైః
చిదేకార్ణవఏవాయం స్వయమాత్మావిజృంభతే. 4



అసత్యమస్థైర్యవశా త్సత్యంసంప్రతిభానతః
యథాస్వప్న స్తథాచిత్తం జగత్సదసదాత్మకమ్. 5

వసిష్ఠుడు;- ఆ పరమకారణమునుండి మొదట మనస్సు ఉదయించినది. ప్రతిభోగ్యవస్తువును మనోమయమైయున్నది. దృశ్యపదార్థములన్నిటి మనస్సు నాశ్రయించుకొని యున్నది; మనస్సుగూడ స్వకారణమగు పరబ్రహ్మముకంటె వేరుగాదు. మనస్సు తరంగమువలె ఇటునటు మారుచుండును. ప్రపంచమునందున్న భేదములన్నియును మనఃకల్పితములే; మనస్సునాశనమైనయెడల ఈ భేదము లన్నియు తొలగిపోయి ఆ సద్వస్తు వొక్కటిమాత్రమే ప్రతిష్ఠింపబడును. మనస్సు లయమైన ఆత్మయొక్కటియే మిగులును, అత్తరి బ్రహ్మ (హిరణ్యగర్భుడు) జీవుడు, మనస్సు, మాయ, కర్త, కర్మ, జగత్తు మున్నగు భేదములుండవు. అంతయు ఆత్మజ్ఞాన సలిలములతో గూడిన చిత్-సముద్రమున నిమగ్నమైయున్నది. ఈ జగత్తు, చిత్తములు, అనిత్యములైయున్నవి. అందువలన, అసత్తులని చెప్పబడు చున్నవి. మరియు అజ్ఞానికి సత్యములవలె ప్రతిభాసించుచున్నవి. అందువలన వీటిని సత్తలని గూడ చెప్పవచ్చును. కాన ఈ జగత్తును (వ్యవహారిక దృష్టితో జూచుచున్న) సదసదాత్మకము అని గ్రహింపనగును. పారమార్థిక దృష్టియందు చిత్తము జగత్తులు రెండును స్వప్నమువలె అలీకములు.

నసన్నాసన్న సంజాతశ్చేతసో జగతో భ్రమః
అథధీసమవాయానా మింద్రజాలమివోత్థితః. 6

చిత్తము జగత్తునుగాంచుట నొక రీతిగ సత్యమును, మఱియొకరీతిన అసత్యమునునై యున్నది. (జ్ఞానసంస్కృత చిత్తమునకు జగత్తు మిథ్య, తద్వ్యతిరిక్త చిత్తమునకు సత్యము) మనస్సే వ్యర్థముగ ఈ సంసార స్వప్నమును గాంచుచున్నది.

దీర్ఘఃస్వప్నఃస్థితింయాతః సంసారాఖ్యోమనోబలాత్
అసమ్యగ్దర్శనాత్స్థాణావివ పుంస్ప్రత్యయో ముధా. 7

భ్రాంతుడు స్థాణువున పురుషుని గాంచునట్లు, ఆత్మజ్ఞానహీనమగు మనస్సు పరమాత్మ యందు మిథ్యయగు జగత్తును గాంచుచున్నది.

అనాత్మాలోకనాచ్చిత్తం చిత్తత్వంనానుశోచతి
వేతాలకల్పనాద్బాల ఇవసంకల్పితే భయే. 8

బాలుడు బేతాళకల్పనను గల్పించుకొని తదావిష్టచిత్తుడై భయపడి భయకారణమును విచారింపనట్లు, ఆత్మభావమునుండి చ్యుతినందిన చిత్తమద్దానిని గుర్తించి వితర్కింపదు.

అనాఖ్యస్యస్వరూపస్య సర్వాశాతిగతాత్మనః
చేతోన్ముఖతయాచిత్తం చిత్తాజ్జీవత్వకల్పనమ్. 9
జీవత్వాదప్యహంభావ స్త్వహంభావాచ్చచిత్తతా
చిత్తత్వాదింద్రియాదిత్వం తతోదేహాదివిభ్రమాః. 10
దేహాదిమోహాతఃస్వర్గనరకా మోక్షబంధనే
బీజాంకురవదారంభ సంరూఢే దేహకర్మణోః. 11

అవ్యక్తమును, సర్వశాంతి స్వరూపమును నగు ఆత్మయొక్క స్వేచ్ఛనుండియే చిత్తమును, చిత్తమునుండి జీవత్వమును, జీవత్వమునుండి అహంకారమును, అహంకారమునుండి విషయతన్మాత్రలును, విషయతన్మాత్రలనుండి ఇంద్రియములును, ఇంద్రియములనుండి దేహములును, దేహములనుండి తదంతర్గతములగు శోకమోహములును, వీటినుండి స్వర్గనరకములును బంధమోక్షములును బీజాంకురములవలె గలుగుచున్నవి.

ద్వైతం యథా నాస్తి చిదాత్మజీవయో స్తథైవ భేదోఽస్తి న జీవచిత్తయోః
యథైవ భేదోఽస్తి న జీవచిత్తయో స్తథైవ భేదోఽస్తి న దేహకర్మణోః. 12

చిదాత్మ, బ్రహ్మ, జీవుడు వాస్తవమునకు భిన్నములుగావు ఒక్కటియే. అట్లే, జీవుడు, చిత్తమును ఒకేపదార్థమై యున్నవి. జీవుడు, చిత్తమొక్కటియైనట్లే, దేహము, కర్మలు అభిన్నములు.

కర్మైవ దేహో ననుదేహ ఏవ చిత్తం తదేవాహమితీహ జీవః
సజీవ ఏవేశ్వర చిత్స ఆత్మా సర్వః శివ స్త్వేకపదోక్తమేతత్. 13

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
జీవవిచారో నామ పంచషష్టితమః సర్గః ॥ 65 ॥

వాస్తవమునకు కర్మలుగాక దేహమునకు వేరొక సత్తయే లేదు. అందువలన, కర్మలే చిత్తమును, చిత్తమే అహంభావ విశిష్టుడగు జీవుడును, ఆజీవుడే బ్రహ్మమును నైయున్నారు. (ఇయ్యది సంక్షేపితమగు సకల శాస్త్రవిచార రహస్యము).

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు, ఉత్పత్తిప్రకరణమున
జీవవిచారమను పంచషష్టితమ సర్గము ॥ 65 ॥

## షట్షష్టితమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఏవమేకం పరం వస్తు రామ నానాత్వమేత్యలమ్
నానాత్వమివ సంజాతం దీపాద్దీపశతం యథా. 1
యథాభూతమసద్రూప మాత్మానం యది పశ్యతి
విచార్యతేఽంత స్తదనుభావహీనం న శోచతి. 2
చిత్తమాత్రం నర స్తస్మి న్గతే శాంతమిదం జగత్.
ఉపానద్గూఢపాదస్య ననుచర్మా స్తృతైవ భూః. 3

వసిష్ఠుడు:- రామా! ఒక దీపమునుండి పెక్కుదీపములు వెలిగింపబడునట్లు, ఆపరమాత్మయొక్కటియే నానారూపములు వెలుగుచున్నది. విచారదృష్టికి బ్రహ్మముయొక్క యథార్థరూపము



గోచరించును. పరమాత్మ - జ్ఞానము లభించిన చిత్తముయొక్క జీవకల్పనయును, దానియొక్క బంధమును మిథ్యయని బోధపడగలదు; అప్పుడు మోక్షము లభించును. శోకము తొలగిపోవును. చిత్తమే జీవరూపమున ప్రతిభాసించుచుండుటవలన, విచారమొనర్చిన చిత్తమును, చిత్తారోపితమగు ప్రపంచమును తొలగిపోగలవు. మూర్ఖుడు కాళ్లకు చెప్పులుతొడగికొని భూమిచర్మాచ్ఛాదితమని తలచునట్లు, అజ్ఞానియే పరమాత్మను అజ్ఞానాచ్ఛన్నముగ భావించుచున్నాడు.

పత్రమాత్రాదృతేనాన్య త్కదల్యా విద్యతే యథా
భ్రమమాత్రాదృతేనాన్య జ్జగతో విద్యతే తథా. 4

కొన్ని ఆకులొక్కటిగూడి అరటిచెట్టుగ అగపడునట్లు, అజ్ఞానమే ప్రపంచరూపమున నగుపడుచున్నది.

జాయతే బాలతామేతి యౌవనం వార్ధకం తతః
మృతిం స్వర్గం చ నరకం భ్రమాచ్చేతో హి నృత్యతి. 5

భ్రాంతికిలోనై చిత్తమే జనన మరణములను, బాల్యయౌవన వార్ధక్యములను, స్వర్గనరకములను గాంచుచున్నది.

విచిత్రబుద్బుదోల్లాసే స్వాత్మనో వ్యతిరేకిణి
యథా సురాయాః సామర్థ్యం తథా చిత్తస్య సంసృతౌ. 6

సురాపానమొనర్చిన మయ్యాది శూన్యమగు ఆకాశమున అసంఖ్యాకములగు బుద్బుదములను దోపింపజేయునట్లు, అజ్ఞానముతో గూడినచిత్తము జీవునకసంఖ్యాకములగు బ్రహ్మాండబుద్బుదములను గాన్పింపజేయుచున్నది.

యథా ద్విత్వం శశాంకాదౌ పశ్యత్యక్షిమలావిలమ్
చిచ్చేతనకలాక్రాంతా తథైవ పరమాత్మని. 7

తిమిరరోగి ఆకాశమున నిర్వురుచంద్రులను గాంచునట్లు, చిత్త - రోగమున బీడింపబడు జీవుడు పరమాత్మయందు ద్వైతభ్రాంతిని గాంచుచున్నాడు.

యథా మదవశాద్భ్రాంతా న్క్షీబః పశ్యతి పాదపాన్
తథా చేతనవిక్షుబ్ధా న్సంసారాంశ్చిత్ప్రపశ్యతి. 8

సురాపానమత్తుడు స్థావరమగు వృక్షమును జంగమముగ భావించునట్లు, చిత్తవిమోహితుడగు జీవుడు, నిశ్చలమగు ఆత్మయందు సంసారమును గాంచుచున్నాడు

యథా లీలాభ్రమాద్బాలాః కుంభకృచ్చక్రవజ్జగత్
భ్రాంతం పశ్యంతి చిత్తాత్తు విద్ధి దృశ్యం తథైవ హి. 9

బాలురు గుండ్రముగతిరిగి ఆడుకొనుచు జగత్తును కుమ్మరిసారెవలె తిరుగుచున్నట్లు తలపోయునట్లు, చిత్తపరివర్తనముననే ఈ విచిత్రదృశ్యము లగపడుచున్నవి.

యదా చిచ్చేతతి ద్విత్వం తదా ద్వైతైక్యవిభ్రమః
యదా న చేతతి ద్వైతం తదా ద్వైతైక్యయోః క్షయః. 10

చిత్తము ద్వైతభ్రాంతిని బొందనప్పుడే ద్వైతభ్రమ కలుగుచున్నది. ద్వైత అనుభూతి నశించిన ద్వైతప్రపంచము నశించి కేవల మొక్క పరమవస్తువే ప్రతిష్ఠింపబడును.

యచ్చేత్యతే తదితరద్వ్యతిరిక్తం చితోఽస్తిన
కించిన్నాస్తీతిసంశాంత్యా చితః శామ్యతిచేతనమ్. 11

కట్టెలులేకున్న నిప్పారిపోవునట్లు, అభ్యాసమొనర్ప విషయదర్శనము తొలగిపోవ, చిత్తము గూడ నశించును. చిత్తముకంటె వేరగు విషయములు లేవు. ఇట్టి జ్ఞానమును, తదనుకూలమగు సమాధిని అభ్యసించిన చిత్తముయొక్క విషయదర్శనము లుప్తమైపోవును.

చిద్ఘనేనైకతామేత్య యదాతిష్ఠతినిశ్చలః
శామ్యన్వ్యవహరన్నాపి తదాసంశాంతఉచ్యతే. 12

ఇట్లు అభ్యాసమొనర్చుచు జీవుడట్టి జ్ఞానమును బొందిన, కర్మల నాచరించుచున్నను ముక్తుడని చెప్పబడును.

తన్వీచేతయతేచేత్యం ఘనా చిన్నాంగచేతతి
అల్పతీక్ష్ణః క్షోభమేతి ఘనక్షీబోహి శామ్యతి. 13

వత్సా! కల్లు కొద్దిగ త్రావిన, కైపుకొంచముగ గలుగును. అప్పుడు చిత్తము చంచలమగును. అట్లే, చైతన్యమల్పముగ ప్రకాశించిన విషయములు గన్పడును. మత్తుపూర్తిగ గల్గిన మనుజుడు నిశ్చేష్టుడగునట్లు, చైతన్యము సంపూర్ణముగ ప్రకాశించిన, విషయదర్శనము తొలగిపోవును.

చిద్ఘనైకప్రపాతస్యరూఢస్యపరమేపదే
నైరాత్మ్యశూన్యవేద్యాద్యైః పర్యాయైఃకథనంభవేత్. 14

నిర్వికల్ప సమాధియందు చైతన్యముయొక్క ప్రకాశమధికమగును. అత్యంత ప్రకాశయుక్తమగు ఘనచైతన్యమే పరమపదమని చెప్పబడుచున్నది. నిర్వికల్పసమాధి నందినవాని చిత్తమే నిర్విషయమగును.

చిచ్చేతనేన చేత్యత్వమేత్యేవం పశ్యతిభ్రమమ్
జాతోజీవామి పశ్యామి సంసరామీత్యసన్మయమ్. 15

శుద్ధచైతన్యమే చిత్తమువలన చేత్యభావము నందుచు, "నేను కర్తను ద్రష్టను" అనుభ్రమను సత్యమువలె అనుభవించుచున్నది.

స్వభావాద్వ్యతిరిక్తంతు నచిత్తస్యాస్తిచేతనమ్
స్పందాదృతేయథావాయోరంతఃకిం నామచేత్యతే. 16

గాలికి స్పందనముకంటె వేరగు సత్తలేనట్లు విషయములకంటె వేరగు సత్త చిత్తమునకులేదు. వేడితొలగిన నిప్పారిపోవునట్లు విషయములు తొలగిపోయిన చిత్తముగూడ నాశనమైపోవును.

చేత్యత్వం సంభవత్యేవం కించిద్యచ్చేత్యతేచితా
రజ్జుసర్పభ్రమాభాసం తమవిద్యాభ్రమంవిదుః. 17

శుద్ధచైతన్య మనుభవించు విషయములను చేత్యములందురు. మిథ్యాజ్ఞానమునజేసి రజ్జువున సర్పభ్రమ గలుగునట్లు, అవిద్యవలన శుద్ధచైతన్యమున విషయభ్రాంతి కలుగుచున్నది.



సంవిన్మాత్రచికిత్స్యేఽస్మిన్వ్యాధౌ సంసారనామని
చిత్తమాత్రపరిస్పందే సంరంభో నచ కించన. 18

ఆత్మజ్ఞానమొక్కటియే యీ సంసారవ్యాధికి తగినమందు. చిత్తము సమాధిదశ నందినగాని, యీ జ్ఞానము లభింపదు; వేరొక ఉపాయములేదు.

యదిసర్వంపరిత్యజ్య తిష్ఠస్యుత్క్రాంతవాసనః
అమునైవనిమేషేణ తన్ముక్తోఽసి నసంశయః 19

నీవీ బాహ్యదర్శనములను, అంతరముననున్న వాసనలను పరిత్యజించిన, ముక్తి నీకిప్పుడే లభింపగలదు.

యథారజ్జ్వాంభుజంగాభా వినశ్యత్యేవవీక్షణాత్
సంవిన్మాత్రవివర్తేన నశ్యత్యేవహిసంసృతిః. 20

యథార్థజ్ఞానము కలిగిన రజ్జు-సర్ప-భ్రాంతి నశించునట్లు, ఆత్మజ్ఞానము లభించిన పరమాత్మయందారోపింపబడిన సంసారభ్రాంతి తొలగిపోవును.

యత్రాభిలాష స్తన్న్యూనం సంత్యజ్యస్థీయతేయది
ప్రాప్తఏవాంగ తన్మోక్షః కిమేతావతిదుష్కరమ్. 21

వత్సా! విషయవాసనలను పరిత్యజించిన మోక్షము నిశ్చయముగ లభించును. ఇందేమంత కష్టమున్నది?

అపిప్రాణాం స్తృణమివ త్యజంతీహమహాశయాః
యత్రాభిలాష స్తన్మాత్రత్యాగే కృపణతా కథమ్. 22

కోరుకొను వస్తువులనుబొంద ప్రాణములనే తృణములవలె మహాశయులు పరిత్యజించుచున్నారు. అట్టిచో, కేవలమభిలాషను త్యజింప వెనుదీయనేల?

యత్రాభిలాష స్తత్త్యక్త్వా చేతసా నిరవగ్రహమ్
ప్రాప్తంకర్మేంద్రియైర్గృహ్ణం స్త్యజన్నష్టంచ తిష్ఠభోః. 23

నీవు వాంఛితములను పరిత్యజించి నిర్వికారుడవై యుండగలిగిన నిముషముననే కృతార్థుడవగుదువు.

యథాకరతలేబిల్వం యథావాపర్వతఃపురః
ప్రత్యక్షమేవ తస్యాలమజత్వం పరమాత్మనః. 24

కరతలముననున్న బిల్వఫలమువలెను, ఎట్టఎదుటనున్న పర్వతము, భవనములవలెను పరమాత్మయొక్క జన్మాది వికియాశూన్యత్వము ప్రత్యక్షమే; తిరోహితముకాదు.

ఆత్మైవభాతిజగదిత్యుదిత స్తరంగైః
కల్పాంతఏకఇవవారిధిరప్రమేయః
జ్ఞాతఃసఏవహిదదాతివిమోక్షసిద్ధిం
త్వజ్ఞాతఏవమనసేచిరబంధనాయ. 25

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
సంసృతి పరమయోగో నామ షట్షష్టితమః సర్గః ॥ 66 ॥

పరమాత్మయే అజ్ఞలపు తరంగభేదములతో నొప్పారు సముద్రమువలె, జగద్రూపమున ప్రతిభాసించుచున్నాడు. అతని నెఱింగిన మోక్షము సిద్ధించును, అతనిని గ్రహింపకున్న యీ సంసారబంధము చిరము వెలయును.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
సంసృతి పరమయోగమను షట్షష్టితమ సర్గము ॥ 66 ॥

———:0:———

## సప్తషష్టితమః సర్గః

శ్రీరామ ఉవాచ:—

మనస్త్వయోగ్యో జీవోఽయం కోఽభవేత్పరమాత్మనః
కథం వాస్మిన్సముత్పన్నః కో వాయం వద మే పునః 1

శ్రీరాముడు:- చిత్తోపాధితో గూడుకొనిన జీవునకు పరమాత్మతో గల సంబంధమేమి? యీ జీవుడెవడు? ఇతడు పరమాత్మనుండి ఎట్లుద్భవించినాడు? ఈ విషయమును నాకు మరల జెప్పుడు.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

సమస్తశక్తిఖచితం బ్రహ్మ సర్వేశ్వరం సదా
యయైవ శక్త్యా స్ఫురతి ప్రాప్తాం తామేవ పశ్యతి. 2

స్వయం యాం వేత్తి సర్వాత్మా చిరం చేతనరూపిణీమ్
సా ప్రోక్తా జీవశబ్దేన సైవ సంకల్పకారిణీ. 3

స్వభావాత్కారణం ద్విత్వం పూర్వసంకల్పచిత్స్వయమ్
నానాకారణతాం పశ్చాద్యాతి జన్మమృతిస్థితేః. 4

వసిష్ఠుడు:- బ్రహ్మ మవిద్యతో గూడి ఎప్పుడే శక్తితో బ్రకటితమగునో అప్పుడయ్యది తన్నట్టి శక్తితో గూడుకొనిన దానిగనే భావించుకొనును. బ్రహ్మమనాది కాలమునుండి ప్రకటితమగుచున్న చేతనశక్తినే జీవుడందురు. సంకల్పస్వరూపమును, చిత్తసంస్కారమయమునునగు చిచ్ఛక్తి తనయంతటదానే సంకల్పించుకొని ద్వైతభావమును, జననమరణాది భావములను బొందుచున్నది.

శ్రీరామ ఉవాచ:—

ఏవం స్థితే మునిశ్రేష్ఠ దైవం నామ కిముచ్యతే
కిముచ్యతే తథా కర్మ కారణం చ కిముచ్యతే. 5



శ్రీరాముడు:- మునిశ్రేష్ఠా! చిచ్ఛక్తియే స్వభావవశమున జననమరణాది భావములనందుచున్న, "ఇయ్యది దైవము, ఇయ్యది కర్మ, ఇయ్యది కారణము" అను పల్కులకర్థమేమి?

శ్రీవసిష్ఠ ఉవాచ:—

స్పందాస్పంద స్వభావం హి చిన్మాత్రమిహ విద్యతే
ఖే వాత ఇవ తత్స్పందాత్సోల్లాసం శాంతమన్యథా. 6

వసిష్ఠుడు:- స్పందాస్పంద స్వభావమగు వాయువుయొక్క స్వరూపమే ఆకాశమున నున్నట్లు తలపోయబడునట్లు, చైతన్యముయొక్క సృష్టిప్రళయలీలయే జగత్తుగ నగుపించుచున్నది. చైతన్యముగాక వేరొక సత్తలేదు; ఇయ్యది రజోపాధితో గూడుకొనినప్పుడు సృష్టించుచు, అది దూరగమైనప్పుడు శాంతమై వెలయుచున్నది.

చిత్త్వం చిత్తంభావితం సత్స్పంద ఇత్యుచ్యతే బుధైః
దృశ్యత్వాభావితం చైతదస్పందనమితి స్మృతమ్. 7

చైతన్యము, అనిర్వచనీయమును, స్వవిషయకమునునగు అజ్ఞానమువలన తన చిద్భావమును చిత్తమని తలచుటనే పండితులు చిత్స్పందమందురు.

స్పందాత్స్ఫురతి చిత్సర్గో నిఃస్పందాద్బ్రహ్మ శాశ్వతమ్
జీవకారణకర్మాద్యా చిత్స్పందస్యాభిధా స్మృతా. 8

ఈ చిత్స్పందనమే జగత్తు, అస్పందనమే బ్రహ్మము. జీవుడు, శరీరకారణమగు కర్మలు, దైవము, చిత్స్పందముయొక్క వేర్వేరు అవస్థలును, నామములునునై యున్నది.

యథైవానుభవాత్మాయం చిత్స్పందోఽస్తి సపవహి
జీవకారణకర్మాఖ్యో బీజమేతద్ధి సంసృతేః. 9

అనుభూతిస్వరూపమగు చైతన్యమే చిత్స్పందమని తెలుచున్నది; ఇయ్యదియే జీవుడు, సంసృతికారణము, మున్నగు నామముల బేర్కొనబడుచున్నది.

కృతద్విత్వచిదాభాస వశాద్దేహముపస్థితమ్.
సంకల్పాద్ద్వివిధార్థత్వం చిత్స్పందో యాతి సృష్టిషు. 10

చైతన్యము స్వాశ్రితమగు అవిద్యయందు ప్రతిబింబించిన ఉత్పన్నమగు చిదాభాసయే, ద్వైతభ్రమయే దేహాదులకు గారణమగుచున్నది. చైతన్యమే స్వవిషయకమగు అజ్ఞానమువలన నానారూపములధరించి సృష్టియందగపడుచు, సంకల్పానుసారము నానావిధయోనుల నందుచున్నది.

నానాకారణతాం యాతశ్చిత్స్పందో ముచ్యతే చిరాత్
కశ్చిజ్జన్మసహస్రేణ కశ్చిదేకేన జన్మనా. 11

ఇట్లు చైతన్యము నానావిధములును, జన్మహేతువులునునగు యోనిసహస్రములనందుచు మందాధికారి భావమునునందిన చేతనాంశము చాలకాలమునకును, ఉత్తమాధికారి భావమునందినది ఒకే జన్మయందును ముక్తినందుచున్నది.

స్వభావాత్కారణాద్విత్వం చిత్సమేత్యాధిగచ్ఛతి
స్వర్గాపవర్గనరక బంధకారణతాం శనైః. 12

చైతన్యమే యుపాధినై పున కాకృష్టమగునో, అయ్యది ఆ ఆకృతి నేబొందుచున్నది. ఎట్లన, సూక్ష్మభూతములతో నేకమై పితృశరీరమునుండి శుక్రరూపమున వెలువడి, స్వర్గము మోక్షము, బంధము మున్నగువాటికి గారణమగు శరీరమును బొందుచున్నది.

హేమ్నీవ కటకాదిత్వం కోష్ఠలోష్టసమస్థితౌ
దేహేష్వతినానాత్వం జడేభావవికారజమ్. 13

చైతన్యమొక్కటియే, కేవలము భిన్నభిన్న ఉపాధులతో గూడి భిన్నమట్లు అగపడుచున్నది. పితాపుత్రుల ప్రభేదము ఉపాధికృతము. సువర్ణమొక్కటియేయైనను వలయకంకణాద్యాకృతులనంది భిన్నమైనట్లు అగపడునట్లు, చైతన్యమొక్కటియేయైనను, వేర్వేరు శరీరముల నాశ్రయించి భిన్నమైనట్లగపడుచున్నది. శరీరోపాదానములగు పంచభూతముల వికారగ్రస్తములగుటవలన, అవి నానావిధముల భేదించుచున్నవి.

అజాతమప్యసద్రూపం పశ్యతీదంమనోభ్రమః
జాతఃస్థితోమృతోఽస్మీతి భ్రమార్తః పత్తనంయథా. 14
అహంమమేత్యసద్రూపమేవచేతః ప్రపశ్యతి
అదృష్టపరమార్థత్వా దాశావివశసంస్థితి. 15

అందువలన, చిద్వస్తువు నిత్యమయ్యు "నేను జన్మించితిని, మరణించితిని" మున్నగు భ్రాంతులను బొందుచున్నది. స్వప్నమున బడుట మిథ్యయైనను సత్యమువలె నగపడునట్లు, మమత్వాది భ్రాంతులతోగూడుకొనిన చిత్తముగూడ మిథ్యలగు జననమరణముల ననుభవించుచున్నది.

మధురాధిపతేరాజ్ఞో యథాశ్వపచసంభ్రమః
అసీదేవంహిచిత్తస్య స్ఫురతీయం జగత్స్థితిః. 16

మధురాధిపతియగు లవణునకు దనయందు చండాలభ్రమ కలిగినట్లు, అవిద్యామోహిత చిత్తమునకుగూడ ఆత్మయందు జగద్భ్రమ కలుగుచున్నది.

సర్వమేవమనోమాత్ర భ్రాంత్యుల్లాసవిజృంభణమ్
ఇదంజగత్తయారామ ప్రస్ఫురత్యంబుభంగవత్. 17
శివాత్త్వాకాకారణాత్పూర్వం చిచ్చేత్యకలనోన్ముఖీ
ఉదేతిసౌమ్యాబ్జలధేః పయఃస్పందోమనాగివ. 18

రామా! ప్రశాంతమగు సముద్రమునుండి చిఱుతరగలు లేచునట్లు, శాంతిమయమగు అయ్యాది కారణమునుండి సృష్ట్యున్ముఖమగు చిత్తు ఉదయించుచున్నది; ఇయ్యది మనోవికారమే.

స్ఫురణాజ్జీవచక్రత్వమేతి చిత్తోర్మితాం దధత్
చిద్వారిబ్రహ్మజలధౌ కురుతే సర్గబుద్బుదాన్. 19

చిత్ - సలిలములతోగూడుకొనిన బ్రహ్మ - సాగరమున, జీవులను ఆవర్తములును, చిత్తములను తరంగములును, స్వర్గనరకములను బుద్బుదములును లేచుచున్నవి.

స్వస్థఃసౌమ్యసమస్యైత ద్యత్సింహాస్యవిజృంభణమ్
బ్రహ్మణఃసంవిదాభాస స్తత్సంచేత్యమివస్వయమ్. 20



సౌమ్యుడా! మాయాబంధన భేదనకరమును, అచింత్యశక్తియుతమును నగు పరబ్రహ్మమున స్వాభావికముగనున్న మాయయొక్క విజృంభణమే జీవరూపమున వెలయుచు, దృశ్యరూపమున ప్రకటితమగును వ్యవహరింపబడుచున్నది.

చిత్సంవిత్త్యోచ్యతేజీవః సంకల్పాత్సమనోభవేత్
బుద్ధిశ్చిత్తమహంకారో మాయేత్యాద్యభిధంతతః 21

జీవుడు, సంకల్పాత్మకముగ మనస్సు బుద్ధి, చిత్తము, అహంకారము, మాయ మున్నగునవి చిత్తుయొక్క విభిన్ననామములై యున్నవి.

తన్మాత్రకల్పనా పూర్వంతనోతీదంజగన్మనః
అసత్యంసత్యసంకాశం గంధర్వనగరం యథా. 22

మనస్సే తన్మాత్రాదులను గల్పించుకొని గంధర్వనగరమువలె మిథ్యయగు జగత్తును సత్యమువలె విస్తరింప జేయుచున్నది.

యథాశూన్యేదృశఃస్ఫారా న్ముక్తావల్యాదిదర్శనమ్
యథాస్వప్నేభ్రమశ్చైవ తథాచిత్తస్యసంసృతిః. 23

ఆకాశమున ముక్తములను గాంచుట, స్వప్నభ్రాంతి మున్నగువానిని బోలునదే, చిత్తముయొక్క యీ జగద్దర్శనము.

శుద్ధఆత్మానిత్యతృప్త ఇవశాంతసమస్థితః
అపశ్యన్పశ్యతీవేమం చిత్తాఖ్యంస్వప్నవిభ్రమమ్. 24

శుద్ధమును నిత్యమునునగు ఆత్మ శాంతభావమున వెలయుచున్నది; అయ్యది దీనిని (పరమార్థభావమున) గాంచుటలేదు; అయ్యు, (వ్యావహారిక భావమున) స్వమాయారచితమగు యీ చిత్తభ్రమను అనుభవించు చున్నది.

సంసృతిర్జాగ్రదిత్యుక్తం స్వప్నంవిదురహంకృతిమ్
చిత్తంసుషుప్తభావః స్యాచ్చిన్మాత్రంతుర్యముచ్యతే. 25

ఈ ఆత్మయే ఇంద్రియద్వారముల బయటకు సంసృతమైన జాగ్రదవస్థ అనియు, అహంభావవాసితమై హృదయకంఠమధ్యప్రదేశమున సంచరించుటను స్వప్నమనియు, స్మృతిబీజములగు వాసనలతోగూడి హృదయముననుండుట సుషుప్తియనియు, యీ మూడు అవస్థలనుదాటి చిత్స్వరూపమున వెలయుట తురీయమనియు జెప్పబడుచున్నది.

అత్యంతశుద్ధేసన్మాత్రే పరిణామనిరామయమ్
తుర్యాతీతంపదంతత్స్యా త్తత్స్థోభూయోనశోచతి. 26

అత్యంతశుద్ధమును, సన్మాత్రమును, నిరామయమునునగు ఆ పరమపదమును బొందినయెడల, శోకమును దుఃఖములును సమూలముగ వినష్టములగును.

తస్మిన్సర్వముదేతీదం తస్మిన్నేవప్రలీయతే
నచేదంనచతత్రేదం దృష్టాముక్తావలీయథా. 27

నిర్మలాకాశమున మిథ్యలగు ముత్యములగుపించి మరల విలీనములగునట్లు, ఆ పరమపదమున ఈ బ్రహ్మాండము ప్రకాశించి, అందే విలీనమగుచున్నది. వాస్తవమునకు మిథ్యాముక్తావళికి సత్తలేనట్లును, నిర్మలాకాశము దాని ఆధారము గానట్లును, బ్రహ్మాండమునకు సత్తలేదు. అయ్యది బ్రహ్మమున నధిష్ఠితమై యుండను లేదు.

అరోధకత్వాత్ఖం హేతుర్యథా వృక్షసమున్నతేః
అకర్త్రాపితథాకర్త్రా చేతనాబ్ధిజగత్స్థితేః. 28

ఆకాశము వృక్ష వృద్ధికి కారణము కాకపోయినను, వృద్ధికి హానికరము గానందువలన లోకమునను శాస్త్రమునను ఆకాశము వృక్షవృద్ధికి గారణమని జెప్పబడుచున్నది. అట్లే నిష్క్రియమగు బ్రహ్మముగూడ ఎద్దానికిని గారణముగాక పోయినను, అవినాశకమగుటవలన మాయావిజృంభితమగు సృష్టికికర్తగ ఉపచరింపబడుచున్నది.

సన్నిధానాద్యథాలోహః ప్రతిబింబస్య హేతుతామ్
యాత్యాదర్శస్తథైవాయం చిన్మయోప్యర్థవేదనే. 29

దగ్గరగనుండుటవలన ప్రతిబింబము పడుటజేసి, అద్దమును ప్రతిబింబ కారణమని చెప్పబడునట్లు, దగ్గరగనుండుటవలన ఆత్మచైతన్యముగూడ వీటికన్నిటికిని గారణమని చెప్పబడుచున్నది.

బీజమంకురపత్రాది యుక్త్యాయద్వత్ఫలంభవేత్
చిన్మాత్రంచిత్తజీవాది యుక్త్యాతద్వన్మనోభవేత్. 30

బీజమునుండి అంకురములు, పత్రములు, ఫలములు ఉత్పన్నములగునట్లు, చిత్తునుండి చిత్తము జీవులు, మనస్సును గలుగుచున్నవి.

స్వతోబీజఫలా విప్రుడ్ యథాబీజంపునర్భవేత్
తథాచిచ్చైత్యచిత్తాది త్యక్త్వాస్వస్థా నతిష్ఠతి. 31

జీవుడు వర్షబిందువులతోగూడి సస్యములు బ్రవేశించి, మరల బీజమగునట్లు జీవవాసనామయమగు చైతన్యముగూడ ప్రళయానంతరము మరల సృష్ట్యాకారమున వివర్తమునందుచున్నది.

యద్యప్యబోధేబోధేవా బీజాంతస్తరుబీజయోః
ఇయాన్భేదోఽస్తినజగద్బ్రహ్మణోరపిచిత్తయోః. 32
తథాపివ్యజ్యతే బోధే సత్యాత్మకమఖండితమ్
రూపశ్రీరివదీపేన చిన్మాత్రాలోకరూపియత్. 33
యద్యన్నిఖన్యతేభూమే ర్యథాతత్తన్నభోభవేత్
యాయావిచార్యతే విద్యా తథాసాసాపరంభవేత్ 34

బీజముయొక్క వృక్షజనకశక్తియు బ్రహ్మముయొక్క జగజ్జనకశక్తియును ఒకతీరుగ సమానములైనను రెంటిమధ్య శక్తిభేదము గోచరించుచున్నది:— "బీజమే వృక్షము" అను జ్ఞానము కలిగినను బీజముకంటె వేరగు వృక్షముయొక్క అస్తిత్వబోధ తొలగిపోదు, కాని "బ్రహ్మమే విశ్వము" అను జ్ఞానమునయించిన బ్రహ్మముకంటె వేరగు విశ్వమున్నదను బోధయుండదు. దీపము



వలన రూపమభివ్యక్తమగునట్లు, భూమి నెచ్చటచ్చట త్రవ్విన నచ్చట ఆకాశము గోచరించునట్లు, విచారించిచూచిన చైతన్యమొక్కటియే గోచరించుచున్నది.

స్ఫటికాంతఃసన్నివేశః స్థాణుతావేదనాద్యథా
శుద్ధేఽనానాపినానేవ తథాబ్రహ్మోదరేజగత్. 35

మూఢులు స్ఫటికశిలయందు ప్రతిబింబించు అరణ్య ప్రతిబింబమును గాంచి వాస్తవ-అరణ్యమేయని తలపోయునట్లు, అవిద్యామోహితులగు వ్యక్తులు బ్రహ్మమున జగత్తును గాంచుచున్నారు.

బ్రహ్మసర్వంజగద్వస్తు పిండమేకమఖండితమ్
ఫలపత్రలతాగుల్మ పీఠబీజమివస్థితిమ్. 36

స్ఫటికఖండము వాస్తవమునకరణ్యముగాకపోయినను, వృక్షలతాదులుగను తదాధారభూతమగు మృత్తికగను ప్రతిభాసించుచున్నట్లు, బ్రహ్మముగూడ దృశ్యమున ప్రపంచమట్లు ప్రతిభాసించుచున్నది.

శ్రీరామ ఉవాచ:—

అహోచిత్రంజగదిదమసత్సదివ భాసతే
అహోబృహదహోస్వస్థమహోస్ఫుటమహోతను. 37
బ్రహ్మణిప్రతిభాసాత్మా తన్మాత్రగుణగోలకః
అవశ్యాయకణాభాసో యథాస్ఫురతితచ్ఛృతమ్. 38
యథాఽసాయాతివైపుల్యం యథాభవతిచాత్మభూః
యథాస్వభావసిద్ధార్థా త్తథాకథయమేప్రభో. 39

శ్రీరాముడు:—మహర్షీ! ఇందెంత విచిత్రము! ఈ పరిదృశ్యమాన జగత్తు సంపూర్ణముగ మిథ్యయయ్యు సత్యమువలె గోచరించుచున్నది. ప్రభూ! జగత్తు ఎట్లు గొప్పదో, స్వచ్ఛమో, ప్రస్ఫుటమో సూక్ష్మమో వింటిని; మంచు తుంపురులవంటి తన్మాత్రలతోగూడి ఈ బ్రహ్మాండమెట్లు పరిస్ఫురించుచున్నదో, వింటిని. ఇప్పుడు నాకు సమష్టి వ్యష్టిదేహములును, తత్తదభిమానులగు విశ్వవైశ్వానరులును ఉత్పన్నమగు రీతిని జెప్పుడు.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అత్యంతాసంభవద్రూప మనన్యత్స్వస్వభావతా
అత్యంతాననుభూతంసత్స్వానుభూతమివాగ్రతః. 40
ఉల్లాసఫుల్లోఫుల్లాంగ ఇతిబాలహృదిస్ఫుటమ్
యథోదేతితథోదేతి పరేబ్రహ్మణిజీవతా. 41
మానమేయాత్మికాశుద్ధా సత్యైవాసత్యవత్స్థితా
భిన్నేవచనభిన్నాస్యా ద్బ్రహ్మణోబృంహణాత్మికా. 42

వసిష్ఠుడు:— బాలుని హృదయమున ఆకారవిహీనమగు భూతముగూడ ఆకృతితోగూడిన దానివలె తోచునట్లు, జీవుడు ఆకృతి విహీనుడయ్యు పరబ్రహ్మమున ప్రథమమున బ్రకాశించుచున్నాడు. పూర్వకల్పీయ జీవసంస్కారము ననుసరించి పరబ్రహ్మమున నిట్లు జీవభావము ప్రకాశించు

చున్నది. అందువలన, జీవుడొకచక్కి శుద్ధుడయ్యు వాసనోద్భవుడుగను, సత్యమయ్యు అసత్యముగను, పరమాత్మకంటె అభిన్నుడైనను భిన్నుడుగను పరమాత్మయందు స్ఫురించుచున్నాడు.

యథాబ్రహ్మభవత్యాశు జీవఃకలనజీవితః
తథాజీవోభవత్యాశు మనోమననవేదనాత్. 43

చిత్తంతన్మాత్రమననం పశ్యత్యాశుస్వరూపవత్
ఏషసద్యోఽనిలలవ ప్రఖ్యఃస్ఫురితిఖాంతరే. 44

జీవకల్పనవలన పరమాత్మ జీవభావము నందునట్లు, మననజ్ఞానమువలన జీవుడు మనస్సుగ ప్రకాశము నందుచున్నాడు. మనస్సు తన్మాత్రలను గుతించి చింతించి తన్మాత్రలుగ మారుచున్నది. పిదప వాయవీయ పరమాణువులకంటె సూక్ష్మతన్మాత్రలతో గూడిన మనోచైతన్యము చిదాకాశమున స్ఫురించుచున్నది.

అస్తనిమేషోఽనుభవ త్యవశ్యాయకణోపమమ్
సంవేదనాత్మకం కాలకలితం కాంతమాత్మని. 45

అహంకిమితిశబ్దార్థ వేదనాభోగసంవిదమ్
సంవిదం తత్త్వశబ్దార్థం జీవఃపశ్యతిసార్థకమ్. 46

సూర్యమండలాకాశమున లెక్కకుమించిన మంచుతుంపురులు ప్రకాశించునట్లు, పైనచెప్పబడిన సమష్టిమనోరూపుడగు హిరణ్యగర్భునియందసంఖ్యములగు బ్రహ్మాండములును, తదంతర్గతములగు సూక్ష్మదేహములును, చిత్రింపబడినవానివలె, ప్రకాశమునందుచున్నవి. అప్పుడట్టి రూపమును బొందిన మనోచైతన్యము తన స్వరూపమును గుర్తింపజాలక, నేనెవ్వడను ? అను సందిగ్ధజ్ఞానమును బొందును. పిదప పురుషార్థ విచారముతోగూడిన ప్రాక్తనసంస్కారముదయించిన జగత్తత్త్వశబ్దము యొక్క అర్థమును, తద్విషయకమగు అస్ఫుటజ్ఞానమును గలుగును.

తాదృశవేదనాత్సోఽథ రసశబ్దార్థవేదనమ్
భావిజిహ్వార్థనామ్న్యేకదేశేఽనుభవతిక్షణాత్. 47

తాదృశవేదనాత్తేజః శబ్దార్థోన్ముఖతాంగతః
భవిష్యన్నేత్రనామ్న్యేకదేశే భవతిభాసనమ్. 48

తాదృశవేదనాత్సోఽథ ఘ్రాణంతద్దృష్టివేదనాత్
స్థితోయస్మిన్భవతీతి తావద్దృశ్యాదితాస్థితా. 49

ఇట్లస్పష్టముగ ప్రకాశించిన శరీరమునకు వెలుపల రసముయొక్కయు లోపల తద్గ్రాహకమగు నాలుకయొక్కయు ఉత్పత్తిని ఆతడనుభవించుచున్నాడు. ఇట్లే రూపమును, రూపగ్రాహకేంద్రియమగు నేత్రమును, గంధమును, తద్గ్రాహకమగు నాసికమును ఉత్పన్నములగుచున్నట్లాతడనుభవించుచున్నాడు.

ఏవంప్రాయః సజీవాత్మా కాకతాలీయవచ్ఛనైః
విశిష్టసంనివేశత్వం భావితంపశ్యతిస్వతః. 50

ఇట్లే శ్రోత్రాది ఇంద్రియములు ప్రసన్నములైనప్పుడాతడు శబ్దమును వినవలసివచ్చుచున్నాడు. జీవాత్మ ఇట్లు, కాకతాళీయముగ, కొద్దికొద్దిగ తన దేహభావమును గ్రహించుచున్నాడు.



స తస్యసన్నివేశస్య త్వసతోఽపిసతఃసతః
శబ్దభావైకదేశత్వం శ్రవణార్థేన విందతి. 51

జీవాత్మ ఏ అంశమున శబ్దమును గ్రహించుచున్నాడో, అయ్యది శ్రోత్రమనంబడుచున్నది. ఈ జీవాత్మ మిథ్యయైనను సత్యమువలెనే గోచరించుచున్నాడు.

స్పర్శభావైకదేశత్వం త్వక్శబ్దార్థేన విందతి
రసభావైకదేశత్వం రసనాత్వేన విందతి. 52

రూపభావైకదేశత్వం నేత్రార్థాకృతిపశ్యతి
గంధభావైకదేశత్వం నాసికాత్వేన పశ్యతి. 53

అట్లే, స్పర్శ, రస, రూప, గంధములను గ్రహించు అంశములు త్వక్, జిహ్వా, చక్షు, నాసికలనంబడుచున్నవి.

ఏవంభావమయైఃసత్తా ప్రకటీకరణక్షమమ్
భవిష్యదింద్రియాఖ్యంస రంధ్రంపశ్యతిదేహకే. 54

ఇట్లు భావనామయములగు ఇంద్రియములతోగూడిన జీవాత్మభావమయమగు దేహమును బాహ్యవిషయములను ప్రకాశింజేయగల ఇంద్రియ రంధ్రములతోగూడినదానిగ తలపోయును.

ఇత్యేవమాది జీవస్య రాఘవాద్యతనస్యచ
ఉదేతిప్రతిభాసాత్మా దేహఏవాతివాహికః 55

రాఘవా ! ఇట్లు సమిష్టిజీవునియొక్కయు, వ్యష్టిజీవియొక్కయు భావమయ — ఆతివాహిక దేహములుత్పన్నములగుచున్నవి.

అనాఖ్యేయంపరాసత్తాస్యాతివాహికతామివ
సాగచ్ఛత్యప్యగచ్ఛంతీ తాదృక్సత్త్వాత్మభావనాత్ 56

అవ్యక్తమగు పరమాత్మయే అజ్ఞానముతోగూడి ఆతివాహిక దేహమును బొందుచున్నది; అజ్ఞానముతొలగిన ఆ దేహసత్త పోవుచున్నది.

మాతృమేయప్రమాణాది యదాబ్రహ్మైవవేదనాత్
తదాతివాహికోక్తీనాం కఃప్రసంగస్తదేవతత్. 57

ఆత్మజ్ఞానము లభించిన ప్రమాతృప్రమేయ ప్రమాణముల భేదమేయుండదనిన, ఆతివాహిక శరీరము మాట వేరుగచెప్పవలెనా ?

అన్యత్వవేదనాదన్యః పరస్మాదాతివాహికః
బ్రహ్మత్వవేదనాద్బ్రహ్మ సాసంవిత్తిర్హినాన్యజా. 58

ఆ పరాసత్తయే బ్రహ్మభావనవలన బ్రహ్మస్వరూపముగను, అన్యభావమువలన అన్యరూపముగను ప్రతిభాసించుచున్నది.

శ్రీరామ ఉవాచ:—

అసంభవాదసంవిత్తేర్బ్రహ్మత్వైకతయాథవా
కోమోక్షఃకోవిచారశ్చేత్యలంభేదవికల్పనైః. 59

శ్రీరాముడు:- చిన్మాత్రస్వరూపమగు బ్రహ్మమున అజ్ఞానముయొక్క ఉనికి అసంభవము. అందువలన బ్రహ్మముయొక్క అద్వైతభావము స్వతఃసిద్ధమైయున్నది. అగుచో మోక్షము, విచారము మొదలగు భేదకల్పనల ఆవశ్యకత ఏమి?

శ్రీవసిష్ఠ ఉవాచ:—

సిద్ధాంతకాలపవైష ప్రశ్నస్తేరామరాజతే
అకాలపుష్పమాలాహి శోభనాపినశోభతే 60

సార్థైవానర్థికాఽకాల మాలావిలసితాయథా
తథైవాకాలమిజ్ఞంతో సర్వంకాలేహిశోభతే. 61

ప్రతిబంధాభ్యనుజ్ఞానాం కాలోదాతేతిదృశ్యతే
ననుసర్వపదార్థానాం కాలేన ఫలయోగతః. 62

వసిష్ఠుడు:- రామా! నీవు యథాసమయమున తగిన ప్రశ్ననొనరించితివి. సుందరమైనను అకాల కుసుమమాల అశుభకరమని ఆదరింపబడనట్లు, అసామయిక ప్రశ్నగూడ ఫలదాయకమవదు. వస్తువులన్నియు యథాయోగ్యకాలముననే శోభను బొందును.

ఏవమేవసజీవాత్మా స్వప్నాత్మాసముపస్థితః
పితామహత్వముచ్ఛానం పశ్యన్నాత్మనికాలతః. 63

జీవాత్మగూడ అట్లె యథాకాలమున తనయందు పితామహత్వము ననుభవించి స్వప్నాత్ముడగు హిరణ్యగర్భుని రూపమున నావిర్భవించును.

ఓముచ్చారణసంవిత్తి వేదనాచ్చప్రపశ్యతి
యత్కరోతిమనోరాజ్యం భవత్యాశుసతన్మయః. 64

ఆ హిరణ్యగర్భుడు ఓంకారరూపమగు ప్రణవము నుచ్చరించి దాని అర్థమును గ్రహించి, మనోరాజ్యమును విస్తరించి తన్మయుడగుచున్నాడు.

ఇదమేవమసత్సర్వ మివవ్యోమ్నితతాత్మని
పర్వతోచ్చాకృతిర్వ్యోమ జగద్వ్యోమ్నివిజృంభతే. 65

సమిష్టి మనోరాజ్యము పరమాత్మయందెట్లసత్తో, వ్యష్టిమనోరాజ్యమగు జగత్తుగూడ చిదాకాశమున అసత్తగుచున్నది.

నేహప్రజాయతేకించి న్నేవాకించిద్వినశ్యతి
జగద్గంధర్వనగర రూపేణబ్రహ్మజృంభతే. 66

ఈ జగత్తున వాస్తవమున కెయ్యదియును జన్మించుట లేదు. మృతించుటయును లేదు. (పరమార్థ సత్యమగు) బ్రహ్మమే (వ్యావహారిక సత్యమగు) జగద్రూపమునను, (ప్రాతిభాసిక సత్యమగు) గంధర్వనగరాది రూపములుగను ప్రకాశించుచున్నది.

యథైవపద్మజాదీనాం జీవానాంసదసన్మయీ
సత్తాతథైవసర్వేషామాసరీసృపమాసురమ్. 67



సంవిత్సంభ్రమపవాయ మేవమభ్యుత్థితోఽవ్యసన్
ఆబ్రహ్మకీటసంవిత్తేః సమ్యక్సంవేదనాత్క్షయః. 68

విచారించిచూచిన బ్రహ్మ మొదలుకొని సరీసృపమువఱకుగల జీవులందఱి సత్తయును సదసన్మయముగ తోచును. అజ్ఞానము తొలగిపోయిన అన్నియును అసత్తులగుచున్నవి.

యథాసంపద్యతే బ్రహ్మా కీటః సంపద్యతే తథా
కీటస్తుగూఢభూతౌఘవలనాత్తుచ్ఛకర్మకః. 69

ఆబ్రహ్మకీటపర్యంతము అందఱి సృష్టియు సమానమే; కాని, విశుద్ధసత్త్వ ప్రధానుడగుటవలన బ్రహ్మ గొప్పవాడుగను, మలినసత్త్వ ప్రధానమగుటవలన, కీటకము తుచ్ఛమునై యున్నది.

యదేవజీవనంజీవే చేతోన్ముఖ చిదాత్మకమ్
తదేవపౌరుషం తస్మిన్సారం కర్మతదేవచ. 70

ఉపాధి ననుసరించియే జీవుడును, పౌరుషమును వెలయుచున్నవి. మరల పౌరుషానుసారమే కర్మాచరణమును ఫలమును గలుగుచున్నవి.

బ్రహ్మణః సుకృతాత్పాపా త్కీటకస్యసముత్థితేః
చిత్తన్మాత్రాత్మికా భ్రాంతిః ప్రేక్షామాత్రం భవేత్క్షయః. 71

సుకృతఫలములుగ బ్రహ్మయును, దుష్కృతఫలముగ కీటకమును జన్మించుచున్నారు. బ్రహ్మజ్ఞానాభావమునజేసి, ఈ భేదబోధ కలుగుచున్నది. జ్ఞానోదయమైన ఈ భేదములన్నియును సమసిపోవును.

మాతృమాన ప్రమేయాణి నచిన్మాత్రేతరద్యతః
తతో ద్వైతైక్యవాదార్థః శశశృంగాబ్జినీసమః. 72

జ్ఞాతృ, జ్ఞాత, జ్ఞేయములు బ్రహ్మముకంటె భిన్నములుగావు. అందువలన ద్వైతాద్వైత భేదములు, ఆకాశపద్మ శశవిషాణములవలె తుచ్ఛములు.

భావదార్ఢ్యాత్మకం మిథ్యా బ్రహ్మానందోవిభావ్యతే
ఆత్మైవకోశకారేణ లాలాదార్ఢ్యాత్మకంయథా. 73

కోశకారకీటకము తన లాలాదార్ఢ్యమునజేసి బంధనము ననుభవించునట్లు, ఆనందస్వరూపుడు తనమాయవలన ద్వైతబంధము ననుభవించుచున్నాడు.

మనసాబ్రహ్మణాయద్య ద్యథాదృష్టం విభావితమ్
తత్తథాదృశ్యతే తజ్జైః స్వభావస్యైష నిశ్చయః. 74

సమిష్టి మనోస్వరూపడగు బ్రహ్మ జీవకర్మానుసారము ఎట్లద్దానిని భావించుచున్నాడో, జీవుడుగూడ దానినట్లే గాంచుచున్నాడు. ఇది నియతియొక్క వ్యవస్థ.

యథాయదుదితంవస్తు తత్తత్తన్నవినాభవేత్
నిమేషమపికల్పంవా స్వభావస్యైష నిశ్చయః. 75

వటబీజమునుండి వటవృక్షమును, అన్యబీజములనుండి అన్యవృక్షములును జన్మించుటయును, బుద్బుదములు క్షణకాలమును, బ్రహ్మాండములు మహాకల్ప పర్యంతమును వెలయుటయునుగూడ యీ స్వభావము ననుసరించియే జరుగుచున్నవి.

అలీకమిదముత్పన్న మలీకం చ వివర్ధతే
అలీకమేవస్వదతే తథాలీకం విలీయతే. 76

ఈ నియతిమహిమను గాంచి, సృష్టిని సత్యమని దలపరాదు. భావనామయములగు సృష్టిస్థితిలయము లలీకములనుటయే తథ్యము.

శుద్ధం సర్వగతం బ్రహ్మానంతమద్వితీయం దుఃఖబోధవశాదశుద్ధ మివాస దివానేక మివాసర్వగమివానబుధ్యతే. 77

జ్ఞానాభావమునజేసి, శుద్ధమును సర్వవ్యాపియును, ఏకమాత్రమును, అనంతమునునగు బ్రహ్మము అశుద్ధము, అసత్తు, పరిమితము, అనేకరూపమైనట్లు, గోచరించును.

జలమన్యత్తరంగోఽన్య ఇతి బాలకుకల్పనయా భేదః కల్ప్యత ఏవమవాస్తవస్తస్మాద్ద్వయోఽయమాభాతి భేదః సకేవలమతత్త్వవిద్భిః పరికల్పితో రజ్జ్వాం సర్ప ఇవ ఏవం భేదాభేదశక్త్యోరరిమిత్రయోరేవ బ్రహ్మణ్యేవ సంభవేత్. 78

మూఢులు నీటిని అలలను వేరుగభావించునట్లు, అజ్ఞులు, రజ్జుసర్పభ్రాంతివలె, ఈ భేదముల ననుభవించుచున్నారు. వాస్తవమున కీభేదము లేమియునులేవు. ఒకనియందే సంబంధ భేదమునజేసి, పరస్పరవిరోధములగు శత్రుత్వ మిత్రత్వ గుణములుండునట్లు, ఒకే బ్రహ్మమున పరస్పర విరోధములగు, భేదాభేదశక్తులు వెలయుచున్నవి.

తేనాత్మనాఽద్వితీయేనైవ ద్విత్వమివాతతం యథాసలిలేన తరంగకల్పనయా సువర్ణేన కటకకల్పనయైవమితి అతస్తేన స్వయమేవాత్మనాత్మాన్య ఇవచేత్యతే. 79

నీటియందు తరంగకల్పన నొసరించిన, ఆ రెండును వేరైనట్లుతోచునట్లు, సువర్ణవలయమనిన సువర్ణము, వలయము అను భిన్నవస్తువులున్నట్లు ఏర్పడురీతి, ఏకమాత్రవస్తువగు బ్రహ్మమున జగత్తు నారోపించిన, ఆ రెండును భిన్నములైనట్లు తోచును.

అతః కలనాజాతాసైవస్ఫారతాంప్రాప్య మనః సంపన్నం తేనాహంభావః కల్పితో నిర్వికల్పప్రత్యక్షరూపమేతత్ప్రథమం తన్మనస్తదహం భవతి క్షిప్రమహం శబ్దార్థభావనాత్. 80

ఆత్మయే ప్రథమమున మనోరూపమున ప్రకాశించుచున్నది. ఆ మనస్సునుండి అహంకారముత్పన్నమగుచున్నది. మనస్సు ప్రథమమున నిర్వికల్పమైయుండును. పిదప నయ్యదియే కల్పనాప్రభావమున అహంభావవిశిష్టమగుచున్నది.

తతోమనోఽహంకారాభ్యాంస్మృతిరనుసంహితా తైస్త్రిభిస్తదను భూతతన్మాత్రాణి కల్పితాని తన్మాత్రేషు జీవేన చిత్తాత్మనాస్వయం కాకతాలీయవద్బ్రహ్మాపాదానాదియాన్సన్నివేశః కల్పితో దృశ్యతే. 81



అహంభావవిశిష్టమగు ఆ మనస్సునుండి పూర్వానుభూతస్మృతి ననుసరించి తన్మాత్రలు గలుగుచున్నవి. ఇట్లు, భూతతన్మాత్రలు కల్పింపబడిన పిమ్మట, చిత్తాత్ముడగు జీవుడు బ్రహ్మమున కాకతాళీయముగ జగత్తును దర్శించుచున్నాడు.

ఏవంయదేవమనః కల్పయతితదేవపశ్యతి
సద్వాభవత్వసద్వా చిత్తంయత్కల్పయత్యభినివిష్టమ్
తత్తత్పశ్యతి యాస్యతి సదివప్రతిభాసముపగతంసద్యః. 82

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
సత్యోపదేశోనామ సప్తషష్టితమః సర్గః ॥ 67 ॥

సత్తయేయగుగాక, అసత్తయేయగుగాక, మనస్సెద్దానిని సత్తని దీర్ఘకాలము భావించునో, అయ్యది సద్రూపముననే ప్రతిభాసించును.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
సత్యోపదేశమను సప్తషష్టితమ సర్గము ॥ 67 ॥

## అష్టషష్టితమః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అత్రైవోదాహరంతీమమితిహాసం పురాతనమ్
రాక్షస్యోక్తంమహాప్రశ్నజాలమావలితాఖిలమ్. 1

వసిష్ఠుడు:— నీ కీ సందర్భమున పురాతనేతిహాసము నొకదానిని ఉదహరించుచున్నాను; దీనియందు రాక్షసియొక్క జటిల ప్రశ్నలున్నవి, వినుము.

అస్తికజ్జలపంకాద్రే రివోగ్రా శాలభంజికా
హిమాద్రేరుత్తరే పార్శ్వే కర్కటీనామరాక్షసీ. 2
విషూచికాభిధానాచ నామ్నాన్యాయబాధికా
వింధ్యాటవీవదేహేన శుష్కకార్శ్యముపాగతా. 3
మహాబలాగ్నినయనా రోదోరంధ్రార్ధపూరణీ
నీలాంబరధరాకృష్ణా దేవబద్ధేవయామినీ. 4
నీహారవసనచ్ఛన్నా మేదురాభ్రశిరఃపటా
లంబాభ్రబింబోల్లసితా నిత్యోత్థతిమిరోర్ధ్వజా. 5
స్థిరవిద్యుల్లతానేత్రా తమాలతరుజానుకా
వైదూర్యశూర్పాగ్రనఖీ భస్మనీహారహాసినీ. 6

నిర్మాంసనరదేహాఘు పుష్పస్రగ్దామభూషితా
సర్వాంగోదాత్తసంప్రోత శవమాలావిరాజితా. 7
వేతాలావేశవిచలత్కాల కంకాలకుండలా
అర్కాదానోత్కదీర్ఘాగ్ర భీమోగ్రభుజమండలా. 8
తస్యావిపులకాయత్వా ద్దుర్లభత్వాన్నిజాంధసః
అతృప్తోఽర్ణవలేఖాయా ఇవాభూజ్జాఠరోఽనలః. 9
సకదాచనసాతృప్తి ముపయాతా మహోదరీ
వడవానలజిహ్వేవ చింతయామాసచైకదా. 10

హిమాలయమున కుత్తరభాగముల కర్కటియను నొక భయంకర రాక్షసి నివసించుచుండెను. విషూచిక, అన్యాయబాధిక అను మఱి రెండు పేర్లు దానికిగలవు. దానివర్ణము కాటుకవలె నుండెను. కార్యములన్నియును అతిభయంకరములై యుండెను. చూచుటకయ్యది కృశాకారయైనను దాని బలము వింధ్యాటవివలె అసామాన్యమై యుండెను. కళ్లు పచ్చలుపడి అగ్నివలె నుజ్వలమై యుండెడివి. అయ్యది నీలవసనమును ధరించుటవలన, రాత్రి దానిశరీరమున ఆబద్ధమై యుండినదా అనిపించెడిది. దాని ఉత్తరీయ వస్త్రములన్నియును సజల జలదములవలె నుండెడివి. అది నిరంతరము లంబమాన మేఘ బింబమువలె నుల్లాసముగ నుండెడిది. చీకట్లవలెనుండు దానికేశములు పైకి రేగియుండెడివి. నేత్రములు విద్యుత్తులవలె ఉజ్జ్వలమును, జానువులు తమాలతరువులవలె విశాలములును, నఖములు శూర్పాగ్రములు వలెను, తీక్ష్ణములును, వైడూర్యమణులవలె ఉజ్జ్వలములునై యుండెను. ఆ రాక్షసి నవ్వునప్పుడు భస్మమో లేక మంచో పడుచున్నట్లుండెడిది. నరకంకాళమాలలనే నయ్యది పుష్పమాలగ ధరించెడిది. అయ్యది బేతాళురతోగూడి నృత్యమొనర్చునప్పుడు, నరకంకాళకుండలములు చలించెడివి. అప్పుడు పైకెత్తిన చేతులనుగాంచిన, సూర్యునే మ్రింగబోవు చున్నట్లుండెను. దానికితగిన ఆహారము లభింప నందువలన, దాని జఠరానలము సర్వదా, బడబానలమువలె, అతృప్తమై యుండెడిది. ఒకప్పుడా రాక్షసి క్షుధార్తయై ఇట్లు తలపోసెను.

జంబూద్వీపగతాన్సర్వా న్నిగిరామిజనాన్యది
అనారత మనుశ్వాసం జలరాశి మివార్ణవః. 11
మేఘేన మృగతృష్ణేవ తన్మేక్షుదుపశామ్యతి
అవిరుద్ధవసాయుక్తి ర్యయాపది హి జీవ్యతే. 12
మంత్రౌషధ తపోదాన దేవపూజాదిరక్షితమ్
సమమేవ జనం సర్వం నిర్బాధం కః ప్రబాధతే. 13
తపః కరోమిపరమమఖిన్నేనైవ చేతసా
తపసైవ మహోగ్రేణ యద్దురాపం తదాప్యతే. 14

సముద్రము నదులనన్నిటిని గ్రహించునట్లు, నేను జంబూద్వీపమునందున్న జీవులనందఱిని ఒకేతడవ మ్రింగగలిగిన నా ఆకలి కొంత తగ్గవచ్చును. కాని, అందఱిని ఒకేతడవ మ్రింగుట యుక్తియుకదా? వీరిలో చాలమంది మంత్రౌషధ నీతిదానపూజాదుల నెఱుంగుదురు. అందువలన, వీరి



నందఱిని ఒకేమారు మ్రింగుట సాధ్యముకాదు. వీరినందఱిని ఒకేతడవ మ్రింగవీలుపడుశక్తిని సంపాదింప ఉగ్రమగుతపస్సు నాచరించెదను; దుర్లభమగునది తపస్సువలన సులభమగును.

ఇతిసంచింత్యసాసర్వ జంతుజాతజిఘాంసయా
తపోఽర్థమథ సస్మార పర్వతం భూతదుర్గమమ్. 15
ఆరురోహచతచ్ఛృంగం స్థిరవిద్యుద్విలోచనా
హస్తపాదాదిమద్దేహా శ్యామలేవాభ్రమండలీ. 16
తత్రగత్వాథ సాస్నాత్వా తపఃకర్తుం కృతస్థితిః
అతిష్ఠదేకపాదేన చంద్రార్కాస్పందలోచనా. 17
క్రమేణ దివసాఃపక్షా స్తస్యా మాసర్తవోయయుః
శీతాతపేషు లీనాయాః కృతాయాఇవశైలతః 18
సాబభూవాభ్రమాలాయాః సమాసంస్తంభితాకృతిః
కృష్ణోర్ధ్వగోర్ధ్వకేశీచ ఖమాహర్తు మివోద్గతా. 19

ఇట్లు చింతించి, స్థిరవిద్యుల్లోచనయగు ఆ రాక్షసి, హస్తపాదాద్యవయవములతో గూడుకొనిన నీలమేఘమువలె, అతిదుర్గమమగు హిమాలయశృంగమును తపస్సు నాచరింప అధిరోహించెను. అట నొంటికాలుమీద తపమొనర్ప నిలబడెను. దాని నేత్రములు నిశ్చలములై, సూర్యచంద్రులవలె దోచుచుండెను. ఇట్లది తపస్సు నాచరించుచుండ దినములు, పక్షములు, మాసములు, ఋతువులు గడవజొచ్చెను. శీతాతపముల కారాక్షసి శరీరము కృశించి, పర్వతమున లీనమై పోవుచున్నట్లుండెను. ఊర్ధ్వకృష్ణకేశియగు ఆరాక్షసి, స్థిరాభ్ర సమూహమువలె, స్థిమితమై, ఆకాశమును మ్రింగబోవుదానివలె, తపము నాచరించుచునే యుండెను.

ఆలోక్య తాంపవనజర్జరితాంగకత్వక్
చీరాంగణా కృతిరణత్పవనావధూతైః
ఊర్ధ్వస్థమూర్ధజ తమఃపటలైర్దధానాం
తారాఘమార్తికమజః సముపాజగామ. 20

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కర్కట్యుపాఖ్యానే రాక్షసీవర్ణనంనామ అష్టషష్టితమః సర్గః ॥ 68 ॥

శీతవాతముల జర్జరితాంగయును, కృశాంగలోలచర్మవల్కలయును, తారాసమీపవర్తినులై ముక్తామండితములైన వానివలెదోచు రూక్షకేశియునగు కర్కటినిగాంచి బ్రహ్మ అరుదెంచెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున రాక్షసీవర్ణనమను అష్టషష్టితమ సర్గము. ॥ 68 ॥

## ఏకోనసప్తతితమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అథవర్ష సహస్రేణ తాంపితామహ ఆయయౌ
దారుణాంహి తపఃసిద్ధ్యై విషాగ్నిరపిశీతలః. 1

మనసైవ ప్రణమ్యైనం సా తత్రైవ స్థితాసతీ
కోవరఃక్షుచ్ఛమాయాలమితి చింతాన్వితాభవత్. 2

అస్మృతం ప్రార్థయిష్యేఽహం వరమేకమిమంవిభుమ్
అనాయసీ చాయసీచ స్యామహం జీవసూచికా. 3

అస్యోక్త్యాద్విధాసూచిర్భూత్వా లక్ష్యావిశామ్యహమ్
ప్రాణినాం సహసర్వేషాం హృదయం సురభిర్యథా. 4

యథాభిమతమేతేన గ్రసేయంసకలంజగత్
క్రమేణక్షుద్వినాశాయ క్షుద్వినాశః పరం సుఖమ్. 5

ఇతిసంచింతయంతీం తామువాచ కమలాలయః
అన్యాదృశ్యాస్తథా దృష్ట్వాస్తనితాభ్రారవోపమమ్. 6

వసిష్ఠుడు:- ఇట్లు కర్కటి సహస్ర వత్సరకాలము తపమాచరింప, బ్రహ్మ కృపాన్వితుడై అటకరుదెంచెను. ఉగ్రతపమున విషము, అగ్నియుగూడ చల్లబడును. బ్రహ్మమాట వేరుగ చెప్ప వలయునా? రాక్షసి బ్రహ్మకు మానసికముగనే వందనమాచరించి అచ్చటనే స్థిరముగనుండి, క్షున్నివృత్తికై ఏవరమును ప్రార్థింతును? అని చింతించి, 'వ్యాధియును, లోహమయమునునగు జీవసూచినవ వరమును గొందును' అని నిశ్చయించుకొనెను. ఏలయన, ఈ వరప్రభావమున నేను, ఘ్రాణాకృష్టమగు సుగంధమువలె మనుష్య హృదయమున ప్రవేశించి, ఇష్టానుసారము జగత్తును మ్రింగగలను. ఇట్లైయిన, నా ఆకలి తీరగలదు; క్షుద్వినాశనమే పరమసుఖము. మేఘధ్వనిగళయగు ఆ రాక్షసి ఇట్లు చింతించుచుండ బ్రహ్మ మధురవచనముల నిట్లనెను:

బ్రహ్మోవాచ:—.

పుత్రికర్కటికేరక్షః కులశైలాభ్రమాలికే
ఉత్తిష్ఠత్వంతు తుష్టోఽస్మి గృహాణాభిమతంవరమ్. 7

బ్రహ్మ:- పుత్రీ! కర్కటికా! రాక్షసకుల శైలాభ్రమాలా! నీ తపమునకు నేను సంతసించితిని. ఇచ్చవచ్చిన వరమును గొమ్ము! లెమ్ము!

కర్కట్యువాచ:—

భగవన్ భూతభవ్యేశ స్యామహంజీవసూచికా
అనాయసీచాయసీచ విధేఽర్పయసి చేద్వరమ్. 8

కర్కటి:- భగవానుడా! భూతభవ్యేశా! వరము నివ్వగోరిన నన్ను అనాయసి, ఆయసి యునునగు జీవసూచికగ నొనర్పుము.



శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఏవమస్త్వితితాముక్త్వా పునరాహపితామహః
సూచికాసోపసర్గాత్వం భవిష్యసి విషూచికా. 9

సూక్ష్మయా మాయయాసర్వలోకహింసాం కరిష్యసి
దుర్భోజనాదురారంభా మూర్ఖాదుస్థితయశ్చయే. 10

దుర్దేశవాసినోదుష్టాస్తేషాం హింసాంకరిష్యసి
ప్రవిశ్యాహృదయంప్రాణైః పద్మప్లీహాదిబాధనాత్. 11

వాతలేఖాత్మికావ్యాధిర్భవిష్యసి విషూచికా
సగుణం విగుణంచైవ జనమాసాదయిష్యసి. 12

వసిష్ఠుడు:- పితామహుడు రాక్షసికావరమునొసగి ఇట్లనెను:- నీవు సూచికయును (సూది), విషూచికయునుగూడ నగుదువు. నీవు అతిసూక్ష్మమగు మాయ నవలంబించి నిషిద్ధ, అపక్వ, అకాల అతిభోజనులును, కుకర్మరతులును, కుదేశవాసులునునగు వారిని సర్వదా హింసింపుము. వాయుపరమాణు తుల్యవై నాసారంధ్రమునుండి ప్రవేశించి జనుల అపాన-హృదయమధ్యదేశమును నాక్రమింపుము. ప్లీహాది అవయవములను బీడించి వారిని నాశమొనర్పుము. నీవు వాతలేఖాత్మికమగు విషూచికా వ్యాధివై, గుణవంతుని గుణహీనునిగూడ బాధింపగలవు.

బ్రహ్మోవాచ:—

గుణాన్వితచికిత్సార్థం మంత్రోఽయంతు మయోచ్యతే
హిమాద్రేరుత్తరేపార్శ్వే కర్కటీనామరాక్షసీ. 13

విషూచికాభిధానా సా నామ్నాప్యన్యాయబాధికా

బ్రహ్మ:- గుణవంతుల చికిత్సార్థము మంత్రమును జెప్పుచున్నాను:— హేమాద్రి ఉత్తరమున కర్కటియను రాక్షసి యొకర్తుక యున్నది. దానికి, విషూచిక, అన్యాయబాధిక అను మఱి రెండు నామములున్నవి.

తస్యామంత్రః

'ఓం హ్రీం హ్రాం రీం రాం విష్ణుశక్తయేనమః
ఓం నమో భగవతి విష్ణుశక్తిమేనాం
ఓం హర హర నయ నయ పచ పచ మథ మథ ఉత్సాదయ
దూరేకురుస్వాహా
హిమవంతం గచ్ఛ జీవ సః సః సః చంద్రమండలగతోఽసిస్వాహా
ఇతి మంత్రీ మహామంత్రం న్యస్యవామకరోదరే. 14

మార్జయేదాతురాకారం తేన హస్తేనసంయుతః
హిమశైలాభిముఖ్యేన విద్రుతాంతాంవిచింతయేత్
కర్కటీంకర్కశాక్రందాం మంత్రముద్గరమర్దితామ్. 15

ఆతురంచింతయేచ్చంద్రే రసాయనహ్రదిస్థితమ్
అజరామరణంయుక్తం ముక్తంసర్వాధివిభ్రమైః 16
సాధకో హి శుచిర్భూత్వా స్వాచాంతఃసుసమాహితః
క్రమేణానేనసకలాంప్రోచ్ఛినత్తి విషూచికామ్. 17

దానిమంత్రము:—"ఓంకారాది బీజరూపయగు విష్ణుశక్తికి నమస్కారము, భగవతీ! విష్ణుశక్తీ! నీ అంశమును, రోగమునునగు విష్ణుశక్తిని హరింపుము. హరింపుము, గ్రహింపుము, గ్రహింపుము, పచనమొనర్పుము, పచనమొనర్పుము, మథింపుము మథింపుము, దూరమొనర్పుము, దూరమొనర్పుము. స్వాహారూపిణివగు ఓ రోగశక్తీ! నీవు నీ తావగు చంద్రమండలమున కఱుగుము; మాంత్రికుడీ మహామంత్రమును తన వామకరతలమున లిఖించి, రోగి దేహము నా చేతితో తుడచి, ఏకాగ్రచిత్తమున నిట్లు చింతింపవలెను:— "కర్కటి మంత్రముద్గరమర్దితయై, రోగి దేహమునుండి వెలువడి ఏడ్చుచు హిమాలయాభిముఖియై పరుగిడుచున్నది. రోగి చంద్రమండలమున అమృతమున సర్వవ్యాధి వినిర్ముక్తుడై, జరామరణ వివర్జితుడై వెలయుచున్నాడు." సాధకుడు శుచివంతుడై ఆచమనమొనరించి, ఏకాగ్రచిత్తమున నిట్లనుష్ఠించిన విషూచిక సర్వము నశించిపోవును.

ఇతిగగనగతస్త్రిలోకనాథో గగనగసిద్ధగృహీతసిద్ధమంత్రః
గతఉపగతశక్రవంద్యమానో నిజపురమక్షయమాయముజ్జ్వలశ్రీః. 18

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ-మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కర్కట్యుపాఖ్యానే విషూచికామంత్రకథనంనామ ఏకోనసప్తతితమః సర్గః ॥ 69 ॥

త్రిలోకనాథుడగు బ్రహ్మ ఇట్లుపల్కి ఆకాశమార్గముననరుగుచు, సిద్ధులచే నమస్కరింపబడి, అట కరుదెంచిన ఇంద్రుని కీమంత్రము నొసగి, నిజలోకమున కఱిగెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున విషూచికామంత్ర కథనమను ఏకోనసప్తతితమ సర్గము ॥ 69 ॥

## సప్తతితమః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచః—

అథభూధరశృంగాభా సా మహాకృష్ణరాక్షసీ
కజ్జలాంబుదలేఖేవ తానవం గంతుముద్యతా. 1

వసిష్ఠుడు:—ఓ రామచంద్రా! పర్వతశిఖరమువలె నున్నదియు, నల్లని వర్ణముగలదియు మేఘాకారయునగు ఆరాక్షసి క్రమముగ సూక్ష్మత్వము నందుచుండెను.



బభూవాభ్రోపమాకారా తతోవిటపరూపిణీ
పుంప్రమాణాతతోప్యాసీ దథాభూద్ధస్తమాత్రికా. 2
తతఃప్రాదేశమాత్రాసా తతోఽప్యంగులిరూపిణీ
తతోమాషశమీతుల్యా తతఃసూచీబభూవహా 3
తతఃకౌశేయసూచిత్వం పద్మకేసరసుందరీ
ప్రాపసాశిఖరాకారా సంకల్పాద్రిరివాణుతామ్. 4

మొదట మేఘాకారముగను, పిమ్మట వృక్షాకారముగనునయి, ఆ పిమ్మట మనుజుని పరిమాణమును పొంది యింకను సూక్ష్మమై హస్తపరిమాణము గలదాయెను. ఆపిదప, అంగుళమంతయు,మినపగింజయంతయునయి, తరువాత సూచికయాయెను. పిమ్మట పట్టువస్త్రమునుకుట్టు సూదియయ్యెను. ఈ ప్రకారము పర్వతాకారముగల యాకర్కటి సంకల్పపర్వతమువలె అణుమాత్రపరిమాణముగల దయ్యెను

రరాజసూచికాకృష్ణా సూక్ష్మాయసమనాయసీ
పుర్యష్టకేన చలితా వ్యోమగావ్యోమవాసినీ. 5

నల్లని యినుపసూదిగను, జీవసూచికగను గూడనయి, పుర్యష్టకము (పంచమహాభూతములు, పంచజ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు, అంతఃకరణము, అవిద్య, కామము, కర్మము వీని సంఘాతము)చే చలింపబడుచు, ఆకసముననే సంచరించుచు శోభాయమానముగ నుండెను.

సూచీదృశ్యతపవాసా నత్వయోనామవిద్యతే
సంవిద్భ్రమకులేచైషా స్వల్పసూచీవలక్ష్యతే. 6

సూచిరూపత్వము, ఆరాక్షసియొక్క కల్పనామాత్రమే, దానియందు లోహత్వమే లేదు. భ్రమచేత నట్లగుపించుచున్నది.

రత్నసూచీవమసృణా మనోమననసంయుతా
వైదూర్యరశ్మిలేఖేవ భానుసంతానసుందరీ. 7

సూర్యకిరణములద్దానియందు ప్రసరించుటచే సుందర రూపముగలదై, రత్నసూచికవలె కాన్పించుచు, మననశీలమగు మనస్సుతోకూడి, వైడూర్యమణివలె ప్రకాశించుచుండెను.

కజ్జలాంభోదసంకల్ప లతేవపవనాహృతా
సూక్ష్మరంధ్రేక్షణస్వచ్ఛ దృష్టజ్యోతిఃకనీనికా. 8
సుముఖాగ్రాహ్యరూపేణ శ్లక్ష్ణపుచ్ఛశిఖాణునా
తదావైపుల్యశాంత్యర్థం పరంమౌనవ్రతంగతా. 9

సూర్యకిరణములు దానిపై ప్రసరించనపుడు, వాయువుచే నెగురగొట్టబడిన నల్లని మేఘమువలె నుండెను. సూక్ష్మరంధ్రమందుగల దాని కంటిపాపలు స్పష్టముగగన్పించు రెండు జ్యోతులవలె నుండెను. పరమాణువువలె సూక్ష్మమగు తనయుత్తమ అగ్రభాగముచేతను, బ్రహ్మదేవుని వరముచేతను ప్రసన్నమైన ఆరాక్షసి, తనవిశాలదేహమునుగూర్చి భావించుచు మౌనమువహించి యుండెను.

సుదూరాద్దీపవద్దృష్టం ఖతన్మాత్రత్వమాగతా
దూరాదేవమనోజ్ఞేన ప్రోద్గిరంతీముఖేన ఖమ్. 10

దూరమునుండి గాంచిన, నాకసమువలెనున్నయది దీపమువలె ప్రకాశించుచుండును. మరియు నతిసూక్ష్మమగుటచే దూరమునుండియే తనసుందరముఖముచే నాకాశమును మ్రింగునట్లుండెను.

కుంచితేక్షణసందృశ్యా దీర్ఘదీపాంశుకోమలా
సద్యఃస్నాతసముత్పన్న బాలవాలవిలాసినీ. 11
తంతుర్బిసాదివోడ్డీనా బాహ్యసంచారకౌతుకాత్
బ్రహ్మనాడిరివోద్యుక్తా బహీరంధ్రంసుసుందరీ. 12

దీపశిఖవలె సూక్ష్మమైనదగాన, నేత్రము ముకుళించియే చూడయోగ్యమైనదియు, అపుడే స్నానమాచరించిన బాలుని కేశములవలె కదలుచున్నదియు, కమలమందలి సన్ననిదారమువలె నున్నదియు నగు ఆరాక్షసి బ్రహ్మరంధ్రవినిర్గతమును, సూర్యమండలోన్ముఖమునునగు సుషుమ్నానాడివలె రమణీయముగనుండెను.

నియతేంద్రియశక్తిఃసా జీవేనైవబహిఃస్థితా
బౌద్ధతార్కికవిజ్ఞాన సంతానవదలక్షితా. 13
శూన్యసిద్ధార్థసవికా రంధ్రానీలమయారవా
అదృశ్యయాజీవసూచ్యా సంతతానుసృతాస్థితా. 14

దాని నేత్రాదీంద్రియములశక్తి తనయందే యంతర్హితమై యుండెను. లింగశరీరమునకు బాహ్యమున సూచికాకారము గల్గియుండెను. బౌద్ధ, నైయ్యాయికుల విజ్ఞానమువలె, యితరులచే దెలియనశక్యమై యుండెను. మరియునది ఆకాశమువలె నీలముగను, శబ్దరహితముగను గన్పట్టుచుండెను. అదృశ్యరూపముననున్న జీవసూచిక దీనినే ఆశ్రయించుకొనియుండెను.

కలాకలనధర్మిణ్యా వాసనామాత్రసారయా
క్షీణదీపాంశుసూచీవ తీక్ష్ణయానుపలభ్యయా. 15

పదార్థాకారమగు వృత్తులందు ప్రతిఫలించిన చిదాభాసుని కల్పనామయమగు ధర్మము గలదియు, వాసనామయమును, అదృశ్యమును తీక్ష్ణమునునగు ఆసూచిక క్షీణదీపశిఖవలె హానికరమైయుండెను.

గ్రాసార్థంసూచితాంయాతా సైవాస్థానోపయుజ్యతే
విచారితం తయానైత దహోమౌర్ఖ్యవిజృంభితమ్. 16

ఓ రామచంద్రా! జగత్తంతను భక్షించుటకయ్యది సూచీరూపమును ధరించెనుగాని, దేహరహితయగు నాపె యెట్లుభుజింపగలదు? ఆహా! చూడుము, దానిమూర్ఖత్వము! ఈ సూచికారూపముచే నేకార్యము సిద్ధించుననువిషయమది తలంచి యుండలేదు.

సాగ్రాసంచింతయామాస నసూచీరూపతుచ్ఛతామ్
చిత్తమీహితమేవైకం పశ్యంత్యాస్తేనిరర్థకమ్. 17

జగత్తును భక్షించు విషయమునుగూర్చి మాత్రమే, తలంచెనుగాని, సూచికయొక్క తుచ్ఛరూపమును గమనింపలేదు. పూర్వాపరములను, గుణదోషములను విచారింపక, కేవలము అభిలషించిన వస్తువునుగూర్చియే చింతనచేసిన ఆ రాక్షసియొక్క సంకల్పము నిరర్థకమాయెను.



అవిచార్యైవసూచిత్వం తయామూఢధియాస్థితమ్
నానర్థబుద్ధేఃస్ఫురతి పూర్వాపరవిచారణా. 18

ఆ మూఢబుద్ధి సూచీరూపమును విచారించలేదు. ఏలన, అనర్థమునే చింతించువారలకు పూర్వాపరవిచారణ యుండదు.

స్వార్థక్రియోగ్రసామర్థ్యాద్యాతి భావనయాన్యతామ్
పదార్థోఽభిమతాంశార్థో నిఃశ్వాసేనేవదర్పణః. 19

స్వార్థమునకై యభిలషించిన వస్తువునుగూర్చి ప్రయత్నముచేయుటచే, మనుజుని యుత్తమబుద్ధిగూడ, శ్వాసచే నద్దమువలె కలుషితమగును.

సూచీభావంప్రపన్నాయా స్త్యజంత్యాఃపీవరంవపుః
మహామరణమప్యస్యా రాక్షస్యాఃసుసుఖంస్థితమ్. 20

తన స్థూలశరీరమును వదలి సూచిత్వమును గ్రహించిన యారాక్షసికి, ఆకటిచే మరణము సంభవించినప్పటికిని పూర్వపుస్థితియే సుఖప్రదమగును.

ఏకవస్త్వతిరాగాణా మహోనువిషమాగతిః
దేహోఽపి తృణవత్త్యక్తో రాక్షస్యానిజయేచ్ఛయా. 21

ఆహా! ఒకేవస్తువునందు మిక్కిలి యనురాగముగల జీవులగతి అతిభయంకరమైనది. అట్టి ప్రీతివలననే, కర్కటి తనదేహమును సహితము తృణమువలె విసర్జించెను.

ఏకవస్త్వతిగంధేన భ్రశ్యంత్యన్యాహిసంవిదః
రాక్షస్యాగ్రాసగంధేన దేహనాశోఽపినేక్షితః 22

ఒక వస్తువునందలి యధికప్రీతిచే మనుజుని జ్ఞానమంతయును, నశించును. జగత్తును భక్షింపవలెనను తలంపుగల ఆరాక్షసి తనపూర్వశరీర వినాశనమునుగూర్చి చింతనచేయలేదు.

నాశోఽపిసుఖయత్యజ్ఞ మేకవస్త్వతిరాగిణమ్
సూచీభూతా విదేహాపి పరితుష్టైవరాక్షసీ. 23

ఒకవస్తువునందతిప్రేమగల మూఢబుద్ధికి తననాశముగూడ సుఖముగతోచును. ఎట్లన, కర్కటి సూచికఅయి, దేహములేకయున్నను ప్రసన్నముగనే యుండెను.

అన్యాబభూవలగ్నాసా తథాజీవవిషూచికా
వ్యోమాత్మికా నిరాకారా వ్యోమవృత్తిశరీరకా. 24

రెండవసూచిక, ఆకాశమయమును, నిరాకారమును, లింగశరీరధారియునయి సమస్తపదార్థములయందును ప్రవేశించు వ్యాధిస్వరూపమగు జీవసూచికరూపమును పొందెను.

తేజస్తనుప్రవాహాభా ప్రాణతంతుమయాత్మికా
మూలసంవేదనాకారా చంద్రార్కాంశుకసుందరీ. 25

అది, అగ్నివలె ప్రకాశవంతముగను ప్రాణములందు తంతురూపముగనుండి, కుండలినివంటి ఆకృతిగల్గి చంద్ర సూర్యకిరణములవలె మనోహరముగనుండెను.

పృథగేవాసిధారాభా పరమాణ్వావలీయ సా
కౌసుమీగంధలేఖేవ కలాకలనరూపిణీ. 26

పాపాత్మికామనోవృత్తిః సాహి తస్యాస్తథాస్థితా
పరప్రాణవశాదేవ పరమార్థపరాయణా. 27

ఆ రాక్షసియొక్క పాపయుక్తమగు క్రూరమనోవృత్తిరూపమైన ఈజీవసూచిక లోహసూచిక కంటెవేఱై పుష్పగంధమువలె సూక్ష్మముగనుండి ప్రాణులశరీరములందు ప్రవేశించి బాధించుచు పరప్రాణహరణమే తనమనోరథముగ గల్గియుండెను.

ఏవమస్యాస్తనుర్జాతా సూచీద్వయమయీహి సా
నీహారాంశుకవత్తన్వీ కార్పాసాంశుసుపేలవా. 28

ఈ ప్రకారమా రాక్షసి వస్త్రమువలె సూక్ష్మమును, కోమలమునునగు రెండు దేహములు (లోహసూచిక, జీవసూచిక) గలదాయెను.

తనుద్వయేనతేనాసా ప్రవిశ్యహృదయంనృణామ్
వేధయంతీతతఃక్రూరా ప్రబభ్రామదిశోదశ. 29

అయ్యది తనదేహద్వయముచే, మనుజుల హృదయములందు ప్రవేశించి, బాధ గల్గజేయుచు అటనుండి యన్నిదిక్కులు తిరుగసాగెను.

సర్వాఃస్వసంకల్పవశా ల్లఘుర్భవతివా గురుః
కర్కటోగ్రంవపుస్త్యక్త్వా సూచీత్వమురరీకృతమ్. 30

సర్వులును, తమ సంకల్పవశముచేతనే సూక్ష్మముగనో, స్థూలముగనో యగుచున్నారు. తన సంకల్పముచేతనే కర్కటి తనగొప్పశరీరమును వదలి సూచిత్వమంగీకరించెను గదా!

తుచ్ఛోఽవ్యర్థోఽల్పసత్త్వానాం గచ్ఛతిప్రార్థనీయతామ్
సూచీవృత్తపిశాచీత్వం రాక్షస్యాతపసాస్థితమ్. 31

క్షుద్రబుద్ధిగలవారు నీచవస్తువులనే ప్రార్థింతురు. రాక్షసి, తనతపస్సుచేతనే, సూచికయై, పిశాచిత్వ (నీచత్వ) మవలంబించెను.

అపి పుణ్యాశరీరాణాం జాతిబంధో నశామ్యతి
తనుసూచీపిశాచీత్వం రాక్షస్యాతపసార్జితమ్. 32

తపాదులొనర్చు పవిత్రులకుగూడ తమ జాత్యానుసారముగనుండు వాసనలుకొన్ని క్షయమొందవు, కర్కటి తనతపముచేతనే, ఇతరుల బాధించుటకొరకే సూచిత్వమందెను గదా!

తస్యాం దిగంతభ్రమణే ప్రవృత్తాయాం మహానిలైః
తత్రైవసాతనుస్థూలా గలితా శరదభ్రవత్. 33

సమస్త దిక్కులందును, సంచరించుట కెప్పుడది మొదలిడెనో, అపుడే, దానియొక్క పూర్వపు స్థూలశరీరము శరత్కాలమేఘమువలె గొప్పవాయువులచే నచటనే నశించినది.



కస్యచిద్వివశాంగస్య క్షీణస్యవిపులస్యచ
ప్రవిశ్యాంతర్వాతసూచిర్భవత్యతివిషూచికా. 34

కస్యచిత్తనుదేహస్య స్వస్థస్యసుధియోఽపివా
ప్రవిశ్య జీవసూచిత్వే భవత్యంతర్విషూచికా. 35

కృశాంగులైనను, స్థూలాంగులైనను, అస్వస్థుల దేహములప్రవేశించి, ప్రాణవాయువుతో గలసిఆజీవసూచిక వ్యాధి (విషూచిక) గల్గించుచుండెను. మరియు, బుద్ధిమాంద్యము, రోగము లేనివారలందు ప్రవేశించి, వారలను దుర్బుద్ధులుగ నొనర్చుచుండెను.

ఏవం క్వచిత్తృప్యతి సా దుర్బుద్ధిహృదయాస్థితా
క్వచిదుచ్ఛేద్యతేపుణ్యై ర్మంత్రౌషధి తపఃక్రమైః. 36

ఒక చోటనయ్యది దుర్బుద్ధుల హృదయములందుండి తృప్తిని బడయుచున్నది. మరియొక చోట మణిమంత్రౌషధముల ద్వారా నివారింపబడుచున్నది.

ఆసీద్బహూనివర్షాణి భ్రమన్త్యైకపరాయణా
దేహద్వయేన గచ్ఛంతీ వ్యోమ్ని భూమితలేతథా. 37

ఇట్లు, రెండు శరీరములుగలదై, ఆ రాక్షసి, ఆకాశమందును, భూమిపైనను, సంచరించుచుండ అనేకవత్సరములు గడచెను.

రజస్తిరోహితాభూమా హస్తేఽంగులితిరోహితా
ప్రభాతిరోహితావ్యోమ్ని వస్త్రేసూత్రతిరోహితా. 38

అంతస్థస్నాయుసరితి దుర్భగే పాంశుపాండురే
శుష్కరేఖాసరిత్థాతే సూక్ష్మరేఖాజరత్తృణే. 39

అర్థహీనే గతచ్ఛాయే శూన్యోడుచ్ఛ్యాసకారిణీ
మక్షికావాతహారితే శ్రీవృక్షపరివర్జితే. 40

స్థూలాస్థి గ్రంథివలితే నిత్యకంపస్ఫురత్తమే
అనాత్మీయాచ్ఛనీహారేఽశుద్ధాంశుకకృతభ్రమే. 41

కీణస్థాణ్వంగవిశ్రాంత మక్షికాపిక వాయసే
రాక్షరూఢరసద్వాతే విలోలాంగులిశాఖిని. 42

మాలాభ్రలేఖాసంసారే స్వాంగులివ్రణగర్తకే
స్పందావశ్యాయ పృషతి పదవల్మీక పర్వతే. 43

కచత్యాశు జలభ్రాంతౌ నఖాజగర కర్కశే
క్వచిత్కవిసరద్భీత భీతయూకకుపాంథకే. 44

విరూపా శుష్కసందష్ట వాటికాపూతివల్వలే
మధ్యస్థలేఖమార్గాఘు శీతశ్వసనగోచరే 45

గ్రస్తయూకా నరౌఘాసృక్ పూర్ణసృక్కనఖాస్యతామ్
దధతాంగుష్ఠపక్షేణ క్రాంతేసర్వత్రయాయినీ. 46

అది ధూళియందును, చేతివ్రేళ్లయందును, ఆకాశమందును, అగ్నియందును, వస్త్రముల దారములందును దాగుకొనుచుండెను. మరియునది శరీరమందలి నాడులందును, కృశించిన అవయవములందును, సూక్ష్మరోమములందును, శిథిల తృణములందును, దౌర్భాగ్యులయొక్కయు తేజోరహితులయొక్కయు శరీరపైభాగములందును, ఈగలచేతను, దుర్గంధయుక్త వాయువులచేతను కలుషితమగు పచ్చనిగడ్డిగల తావులందును, ఎముకలందును, గ్రంథులందును, వాయువుచే చలింపబడుచున్న వృక్షములుగల చోటునందును, అపవిత్ర స్థానములందును, మలిన వస్త్రధారులుండుతావునను, చెట్లతొఱ్ఱలందును, తేనెటీగలు, కోకిలలు, కాకులు విశ్రమించు, నరుకబడిన కొమ్మలుగల వృక్షమందును, ఉష్ణవాయువుగల చోటను, మంచుపడు తావులందును, విక్షతాంగులవద్దను, అనేకుల పాదచిహ్నములు పడినచోటను, ఎత్తైన పుట్టలందును, మరుభూములందును, వ్యాఘ్ర భల్లూక, అజగరములుగల భీకరారణ్యములందును, యాత్రికులుగూడు ప్రదేశమందును, ఎండుటాకులుగల దుర్గంధపూరితమగు మడుగులందును, మురికికాలువలలోను, అనేక బాటసారులు గుమిగూడి విశ్రమించుచోటను, బొటనవ్రేళ్లయందును, శరీరమందంతటను. వసించుచుండును.

నానావిరచనాచిత్ర పటపత్తనగామినీ
గమాగమపరిశ్రాంతా తత్రాత్యంతచిరాధ్వగా. 47

అనేకవిధములగు చిత్రములచే నలంకరింపబడిన నగరములందది వచ్చుచు పోవుచునుండును, మరియు చాలకాలము సంచరించుటచే నలసటజెందును.

నగరానగరేవ్యస్త సూత్రభాండైకభారిణీ
తప్తైకలేవరారణ్యే బలీవర్దాపవర్తినీ. 48

నగరములందును, గ్రామములందును పడియున్న చినిగిన వస్త్రముల నాశ్రయించుచు, జ్వరాదులచే పీడితులగువారిని నశింపజేయుచునుండును. అరణ్యమందలి కొన్ని ఎత్తైనతావులను, బలిష్ఠమగు యెద్దు కొమ్ములతో పొడిచి శిథిలమొనర్చులాగున ప్రాణుల శరీరమును సూచిక నశింపచేయుచుండెను.

గుప్తా విశ్రమణాయైవ మనాక్కరపరిచ్యుతా
తంతుప్రోతాముఖాకృష్టిః ఖిన్నాక్వాపి విలీయతే. 49

జనులు, సూదితో బట్టనుకుట్టునపుడు, అలసటజెందిన యా సూచిక చేతినుండి జారి క్రింద పడుటతోడనే, విశ్రమించుటకై కాబోలు ఎచటనో దాగుకొని కనబడకయుండును.

వేదనం కర్మసంశ్లిష్టా కఠినాపి నసాకరోత్
నహితీక్ష్ణో బహిఃకార్యో నిజత్వంవిజహాతిచేత్. 50

తనకు యోగ్యమగు కుట్టుపని (ఇతరులబాధించుట) యందే అసూచిక యానందమును బొందును. క్రూరత్వమే దాని స్వభావముగాన యితరుల బాధింపనిచో, తనస్వభావమునెట్లది వ్యక్తపరచగలదు?

సాయఃసూచీ మనఃసూచ్యా వలితా విజహారహ
దిక్ష్వాశేవ శిలాగుర్వీ నావాంగపలితాసతీ. 51



శరీరము వృద్ధావస్థను చెందినను, ఆలోహసూచిక, జీవసూచిక సాహాయ్యమున అన్నిదిక్కులను పరిభ్రమించుచుండెను.

విససారదిగంతేషు సాంతఃకరణసత్తయా
తుషలేఖేవ పవన శక్త్యా సంసృతిరూపయా. 52

గాలిచే నెగురగొట్టబడిన పొట్టువలె, తనయంతఃకరణశక్తిచే ప్రేరితమైన ఆకర్కటి దిగంతములు తిరుగజొచ్చెను.

ముఖేనసూక్ష్మసూత్రాంతం చరంతీవ పరోంభితమ్
పరపూరోద్యమేనాశు జాతేవహృదయాన్వితా. 53

జనులు వస్త్రముల కుట్టునపుడు దారములయొక్క సూక్ష్మమగు అగ్రభాగముల భక్షించుచు, యుదరపూరణగావించుకొనుచు శాంతహృదయయైయుండెను.

పరపూర రసేనైవ సూచ్యాహృత్సువికాసితమ్
అనారతపతత్సూక్ష్మ సూత్రాంతఇవ స్తంభితా. 54

పూర్వమా కర్కటి, తపస్సుచే, శ్రాంతమయిన తన మనస్సును, అన్యప్రాణుల వధించుటచే యుదరపూరణకాగలదను ధైర్యము జూపి ప్రసన్నముగ నొనర్చెను. ఇపుడావిధముననే, నిరంతరము భోజనము లభ్యమగుచుండుటచే, దాని మనోరథ మీడేరినట్లుండెను.

తీక్ష్ణైరపి చిరక్షీణం పూర్యతే నిర్విచారణా
దృష్టాంతోఽత్రతక్షణాత్సూచ్యా పరితోజర్జరఃపటః. 55

దారిద్ర్యముచే దుఃఖితులై కృశించియున్నవారినిగాంచిన, క్రూరస్వభావులుగూడ సహాయమొనర్తురు. చినిగి, శిథిలమైయున్న వస్త్రమును సూది ఒకక్షణములో యథాప్రకారముగ నొనర్చుటయే యిందుకు దృష్టాంతము.

సూత్రాంశు నిర్గమేయోగ్యాం సూచ్యాహృదయమార్జితమ్
పరిపూరణమైవాశు తేజశ్చ కవితార్కరుక్. 56

సూచిక తన యీస్థితిని తపస్సుచేతనే బడసెను. మొదటనయ్యది సూర్యకాంతివంటి తేజస్సును ప్రకాశింపజేయుటకే ఈ శరీరమును బొందెనుగాని యితరుల బాధించుటకుగాదు.

అకస్మాత్తేనరూఢేన క్షీణపూరేణరూపిణీ
హృదయేరాక్షసీ సూచిః కర్మణాతప్యతేచసా. 57

కాని, తపస్సుచే క్షీణదశను పొందిన తన దేహమునుగూర్చి యది అకస్మాత్తుగ తలంచి, పశ్చాత్తాపబడెను.

వేధంపూర రయేణేవ కరోతిస్వంప్రచారితా
ప్రకృతేన నిజేనాపి వేధాయవ్యవహారితా. 58

పిమ్మట నదీప్రవాహవేగమువలె నయ్యది తనరాక్షసస్వభావముననుసరించి, ప్రాణుల బాధింప నిశ్చయించి, అక్కార్యమందు ప్రవృత్తిగలదాయెను.

సంచారయతి వస్త్రేషు సూత్రంచతురవేధనాత్
ఆదీర్ఘ వాసనాతంతుః శరీరేష్వివచేతనామ్. 59

అతిదీర్ఘమగు వాసనాతంతువు, ప్రాణులందు చేతనత్వము గల్గించునట్లు, సూచికకూడ తన వేధనక్రియచే వస్త్రములందు దారమును ప్రవేశపెట్టును.

సంచార్యమాణ వేధేన ధావంతీవాక్షిపాతనే
అదర్శితముఖావివ దుర్జనామర్మవేధినః. 60

కనుకనే, వస్త్రముకుట్టునపుడు తనముఖమును వస్త్రముచే కప్పియుంచి ప్రవర్తించుచుండును. దుర్జనులు, తమముఖము నితరులకు జూపకుండుట లోకప్రసిద్ధముగదా!

కంఠవస్త్రాదలప్రోతా వేధాత్సా ముఖమీక్షతే
కథమేతా భినద్మీతి తీక్ష్ణానామేతదీప్సితమ్. 61

మరియొకప్పుడు జనుల యుత్తరీయమున బ్రవేశించి, తననేత్రము (రంధ్రముచే) వారి నవలోకించి 'వీరినెట్లు బాధింపగలను' అని చింతించును. "క్రూరస్వభావముగల నాకిక్కార్యము యిష్టమైనదే" యని తలచును.

సమమేవచ కౌశేయే క్షామేచవసనేస్మృతా
జడఃకలివవానామ గుణాగుణమపేక్షతే. 62

సన్ననిపట్టు వస్త్రమందును, ముతుకబట్టయందునుగూడ నవి ప్రవేశించును. దానికా రెండును సమమే. మందుడు గుణదోషముల విచారణచేయునా?

సాదధానాతతం సూత్ర మంగుష్ఠాంగులిపీడితా
ఆంత్రతతంతుమివామాంత ముద్గిరంతీనిరీక్షతే. 63

కుట్టువారి వ్రేళ్లచే పీడింపబడిన ఆసూది, తనముఖమందు వ్యాపించిన దారమును, ప్రేగులవలె, వెడలగక్కుచున్నదా యనునట్లుండెను.

తీక్ష్ణాప్యహృదయత్వేన సరసేష్వరసేష్వపి
సూత్రితాపి పదార్థేషు విశత్యరసదామినీ. 64

క్రూరస్వభావముగల్గిన యది, దారముచే గ్రుచ్చుచు, ఉత్తమ, నికృష్టవస్తువులందటు సంచరించును. మరియుహృదయము లేమి, విశేషజ్ఞాన రహితమైయుండెను.

అగర్ధతీముఖప్రోతా సుతీక్ష్ణాపిచతాపిధీః
సువేధితాప్యహృదయా రాజపుత్ర్యాపిదుర్భగా. 65

నిష్ఠురభాషణ మొనర్పకపోయినను, దాని ముఖముదారముచే నింపబడియుండును. వేధింపబడినను దానిదేహము ఛిద్రరహితమైయేయుండును. ఈ కారణముచేనది భాగ్యహీనయగు పుత్రికవలె దుర్దశను బొందుచుండెను.

వినాపరాపకారేణ తీక్ష్ణామరణమీహతే
వేదనాద్రోధితాసూచీ కర్మపాశేప్రలంబతే. 66



ఇట్టి దుర్దశ దీనికియోగ్యతమైనదే. ఏలయన ఇది ఇతరులకుపకారముచేయకున్నను వారిని బాధించుస్వభావముగలదైయె యున్నది. కనుకనే, దారము దీనియందు జొప్పింపబడునప్పుడు, తనకర్మము యురిత్రాటియందు తగుల్కొన్నదా యనునట్లుండును.

శేతే కింశ్యామమైత్ర్యేవ దూరేకరపరిచ్యుతా
స్వరూపసదృశంమిత్రం కస్మైనామనరోచతే. 67

కుట్టువారిచేతినుండి యెపుడైన జారిపడిపోయినచో, నింద్యస్థానములందు విశ్రాంతినొందును. తనకు సమమైనవారితోటి మైత్రినెవరు యాశింపరు?

మిశ్రితామూఢ చిత్తానాం వృత్తిభిఃప్రాకృతేజనే
తిష్ఠత్యాత్మసమాం కోహి సంగతింత్యక్తుమిచ్ఛతి. 68

మరియునిది మూఢులదుర్వృత్తులతో కూడియుండును. నీచుడు తనకుసమమగు పామరజనులస్నేహము గోరకుండునా?

భవత్యయస్కారవిత్తా సంత్యజ్యాంతర్ధిగామినీ
భస్త్రావాతైర్విచలితా గగనాదుత్పతోన్ముఖీ. 69

ఎపుడైన నది, కమ్మరివారి యధీనమయిన, కరగింపబడి, అగ్నియందుంచబడి, కొలిమితిత్తులచే బాధింపబడునుగాన, అపుడంతర్ధానమై, ఆకాశోన్ముఖమై, పరుగిడుటకు సిద్ధముగానుండును.

ప్రాణాపానప్రవాహస్థ హృత్పద్మాంతరచారిణీ
దుఃఖశక్తిర్మహాఘోరా జీవశక్తిరివోదితా. 70

ప్రాణాపానముల సంచారమార్గములందుండినదై, హృదయపద్మముద్వారా, దేహమందంతట సంచరించు జీవసూచికగాంచిన దుఃఖమే మూర్తివంతమై యున్నదా యనిపించును.

సమానవైపరీత్యేన సమానసమగామినీ
ఉదానవిపరీతత్వా దుదాన సమగామినీ. 71

అది ఉదాన, సమానవాయువులకు విరోధమగుకార్యముల జేయుచు వాటితోకలసి సంచరించుచుండును.

వ్యానస్థావ్యాధిజననీ సర్వాంగరసచారిణీ
హృత్కంఠశూలపవనే వైవర్ణ్యోన్మాదకారిణీ. 72

ఓరామచంద్రా! దుష్టమగు యీ జీవసూచిక వ్యానవాయువునందుండినదై దేహమందంతటను సంచరించుచు అనేక రోగములగల్గించును. హృదయమందును, కంఠమందును శూలరోగోత్పత్తికి హేతువగు వాయువునందును ప్రవేశించి, దేహమునకు కురూపత్వమును, దుర్బలత్వమును గల్గజేయును.

ప్రాయశోఽవికహాస్తస్థా సుప్తోర్ణాగంధకోటరే
బాలహస్తాంగులీతల్ప వేధనైకవిలాసినీ. 73

లోహసూచిక, యొకప్పుడు ఉన్నియుండు తావులందు కొంత విశ్రాంతిని బొందుచుండును మరియొకప్పుడు బాలురహస్తమునుగాని, వ్రేటినిగాని బాధించుటయందు తత్పరయైయుండును,

పాదప్రవిష్టారుధిర పానోపార్జనవిస్మితా
తుష్యత్యతితరాంగుచ్ఛభోజనా తుచ్ఛభోజనైః. 74

కాలియందు జొరబడినపుడు, రక్తపానముచే విస్మయమునొందును. పుష్పమాలలు గ్రుచ్చునపుడయ్యది ఆ పుష్పగుచ్ఛముల తుచ్ఛభోజనముచే సంతుష్టయగును.

శేతేకర్దమకోశస్థా చిరకాలమధోన్ముఖీ
ఇచ్ఛానురూపమాసాద్య కణివాస్పద ముజ్ఝతి. 75

పుప్పొడియందు పుష్పకోశమందు, చాలకాలము స్థిరముగానుండి, అధోముఖియై పరుండును. తనకనువగుచోటును విడచుట కెవడిచ్ఛగించును ?

క్రౌర్యేణాపహతాత్మానం దర్శయత్యపవేధనైః
ఉత్సవాదపి నీచానాం కలహోఽపి సుఖాయతే. 76

ఇతరుల ప్రాణముల హరించునంతవరకది వారిని బాధించుచు, తనక్రూరస్వభావమును, గన్పరచుచుండును. నీచుడు యితరుల బాధించుటయందే యానందముబొందును. ఒక వేళయితరుల ప్రాణహరణమొనర్పగల్గినచో, వానియానందమున కిక మేరలేదు.

కపర్దకార్థలాభేన కృపణోబహుమన్యతే
దురుచ్ఛేదాహిభూతానా మహంకారచమత్కృతిః 77

అయ్యది అత్యల్పమగు రక్తబిందువు నాస్వాదించుటయందే కోర్కెగల్గి, అట్టిలోభముచే నన్యుల వధించుటకును సంసిద్ధమగుచుండెను. దరిద్రునకొక గవ్వదొరకినను, దానిని గొప్పగాదలంచును. మరియు, రాక్షసకులమందు జన్మించినవారి యహంకారము నశించుట చాల కఠినము.

సూచికాయుగ్మలభ్యేన మోహితేనాత్మనానృణామ్
మృతిమాశంకతే చిత్రా స్వార్థేనోదేతిమూఢతా. 78

లోహసూచిక, జీవసూచిక యనురెండు శరీరములు గలదగుటచే గర్వియై, సదా మనుజుల వధించుటనుద్యుక్తనుగుచుండెను. మూఢులకు తమ స్వార్థమునెడ తుచ్ఛత్వబుద్ధి గల్గనిచో నేమి యాశ్చర్యము ?

వస్త్రతంతు విభేదేన పరమారణమాశుమే
ఇదం సంపద్యతఇతి భవత్యంతర్హి నిర్మలా. 79

వస్త్రములను శీఘ్రముగా కుట్టుటయందభ్యాసముగలయది, అనాయాసముగను, శీఘ్రముగను ప్రాణులవధించుచుండుటగాంచి ప్రసన్నయగుచుండెను.

స్థాపితామలమాదత్తే యథామృద్ఘర్షణంవినా
పరాపరాధవిరహా ద్వ్యాధిస్తస్యాః ప్రవర్తతే. 80

వాడుక లేనిచో సూది మలినమగునట్లు, యితరుల బాధింపనిచో, యీ జీవసూచిక రోగగ్రస్తయగును.

సూక్ష్మాఽదృశ్యాచైవబాత్రీ క్షణాద్వ్యస్మృతిమేతిసా
తీక్ష్ణభేదకరీక్రూరా సూచీచేష్టేవదైవికీ. 81



ఆ సూచిక, సూక్ష్మమై అదృశ్యరూపమున యితరుల శరీరముల వేధించుచుండెను. మరియు జీవసూచికయగునది, తనతీక్ష్ణత్వముచే దైవవశమున సంభవించిన యాపత్తువలె, సందరిని బాధించుచుండెను.

తంతువేధనమాత్రేణ హతోఽన్య ఇతితోషితా
దుర్జనోయేనతేనైవ నాశితేనైతి హృష్టతామ్. 82

ఛేదించుటయందు నిపుణత్వముగల నియ్యది వీడు చంపబడెననితలంచి మోదమందును. దుర్జనుడు పరుల వినాశనమందే ప్రీతిగొనును గదా!

పంకేమజ్జతియాతిఖం విహరతివ్యోమానిలైర్దిక్తటే
శేతేపాంసుషు భూతలేష్వివవనే పట్టేగృహేఽంతఃపురే
హస్తేశ్రోత్రసరోరుహేఽథమృదుని స్వేచ్ఛోర్ణికాఖండకే
రంధ్రేకాష్ఠమృదాంచమాతిహృదయే ద్రవ్యాత్మశక్త్యైవసా. 83

ఈ సూచిక ఒకప్పుడు బురదయందును, మరియొకప్పుడు ఆకాశమందును, వాయువుతో గూడియు, దిక్కులందును విహరించుచుండును. అంతఃపురముననున్న కోమలవస్త్రములపై పరుండును. భూమిపైనను, అరణ్యమందలి ధూళియందును, జనులచేతులందును, చెవులందును, గొఱ్ఱె బొచ్చుపైనను నిదురించుచుండును. మణిమంత్రాదులచే యోగి, యెచటనైనను సంచరింపగల్గునట్లు, ఈ జీవసూచిక, కొయ్య, మట్టి, గోడ మున్నగువాని సన్నని రంధ్రములందును ప్రవేశించి, అచట నివసించుచుండును.

శ్రీ వాల్మీకిరువాచః—

ఇత్యుక్తవత్యథమునౌ దివసోజగామ సాయంతనాయవిధయేఽస్తమినోజగామ
స్నాతుంసభాకృతనమస్కరణా జగామ శ్యామాక్షయే రవికరైశ్చసహాజగామ. 84

షష్ఠో దివసః.

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కర్కట్యుపాఖ్యానే సూచివ్యవహారవర్ణంనామ సప్తతితమః సర్గః ॥ 70 ॥

వాల్మీకి:— శ్రీవసిష్ఠమునీంద్రులిట్లు బల్కునపుడు సూర్యాస్తమైనందున సాయంస్నాన, సంధ్యాదికృత్యముల నెరవేర్చుటకై, సభ విరమింపబడెను. సభ్యులందరును నమస్కరించి వెడలిరి. ఆ రాత్రిగడచిన మీదట, సూర్యోదయముకాగానే, మరల అందరును యటజేరిరి.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున సూచివ్యవహార వర్ణనమును సప్తతితమ సర్గము ॥ 70 ॥

ఆరవ రోజు.

———:0:———

# ఏకసప్తతితమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

అథసాబహుకాలేన కర్కటీనామరాక్షసీ
సర్వేషాంనరమాంసానాం నతుతృప్తిముపాయయౌ. 1

వసిష్ఠుడు:— పిదప చాలకాలమువరకు ఆ కర్కటి మనుజులనేకుల మాంసము భుజించుచుండెనుగాని తృప్తినిబొందకుండెను.

పూర్వ్వైవైకిలాహ్నాసా తృప్తారుధిరబిందునా
సూచ్యాఃకిమివమాత్యంత స్తృష్ణాసూచీసుదుర్భరా. 2

ఒక్క రక్తబిందువుచేతనే దాని శరీరము నింపబడి, ఆకలి తొలగింపబడు చుండెనుగాని, తృష్ణయను సూచిక తృప్తిబొందుట కఠినము.

చింతయామాసహాకష్టం కిమహంసూచితాంగతా
సూక్ష్మాస్మి హతశక్తిశ్చ అప్రిగ్రాసో న మాతిచ. 3

ఆ సూచిక తనమనమున నిట్లనుకొనెను—నేనేల సూచిత్వమును గ్రహించితిని. ఇపుడతి సూక్ష్మమైనందున శక్తిహీనరాలైయున్నాను, లోన ఒక్క కబళమునకైనను తావులేకయున్నది.

క్వమేతాని విశాలాని గతాన్యంగానిదుర్ధియః
కాలమేఘవిశాలాని వనేశీర్ణానిపర్ణవత్. 4

ఆహా! దుర్బుద్ధియగు నాపూర్వపు, విశాలమైన అవయవములేమైనవి ? నల్లని మేఘమువలె విశాలమైన ఆ నాయంగములన్నియు అరణ్యమందు వృక్షములనుండి క్రిందపడిన యాకులవలె నశించినవి.

మయ్యస్యాం మందభాగ్యాయాం మనాగపి నమాతిహి
స్వాదుమాంసరసగ్రాసో వసావాసితఆననయన్. 5

రుచికరమగు మాంసమును భుజించునట్టి దుర్భాగ్యురాలగు నాయందిప్పుడేమియు భోజనము ప్రవేశించుటలేదు.

పంకాంతర్వినిమజ్జామి పతామిధరణీతలే
హతాస్మిజనపాదాగ్రైః శుక్రేణమలినాస్మిచ. 6

నే నితరుల పాదములందు గ్రుచ్చుకొనుచు, భూమిపై పడుచు, మనుజులపాదములచే కొట్టబడుచునున్నాను. ప్రాణులయొక్క వీర్యమందు ప్రవేశించుటచే మలినరాలైతిని.

హాహతాహమనాథాహ మనాశ్వాసానిరాస్పదా
దుఃఖాదుఃఖే నిమజ్జామి సంకటాత్సంకటేఽపి చ. 7

హా! నేను చచ్చితిని, అనాథను. నాకు ధైర్యమును గల్గించుటకు మిత్రులుగాని, బంధువులు గాని యెవరునులేరు. నాకాశ్రయమేమియులేదు. అధికదుఃఖమును పొందుచున్నాను. గొప్ప సంకటము ప్రాప్తించినది.

నసఖీనచమేదాసీ నమేమాతానమేపితా
నమేబంధుర్నమేభృత్యా నమేభ్రాతానమేసుతః. 8



నాకు సఖిగాని, దాసిగాని, తల్లిగావి, తండ్రిగాని, బంధువులుగాని, సేవకులుగాని, సోదరుడుగాని, పుత్రుడుగాని యెవరును లేరు.

నమేదేహోనమేస్థానం నమేకశ్చిత్సమాశ్రయః
నైకస్థానేసమావాసో భ్రామ్యామివనపర్ణవత్. 9

నాకు శరీరముగాని, ఉండుటకు తావుగాని, శరణ్యముగాని లేదు. వాయువువలె, ఇటునటు తిరుగాడుచున్నాను.

ఆపదాంధురిత్థామి నివిష్టాస్మిసుదారుణే
అభావమపివాంఛామి సోఽపిసంపద్యతే నమే. 10

ఇపుడు గొప్ప విపత్తు తటస్థించినది. గొప్ప సంకటమునం బ్రవేశించితిని. ఇపుడు నేను మరణమునే కోరుచున్నాను. కాని అట్టినాకు మరణముగూడ సంప్రాప్తించుటలేదు.

స్వకోదేహఃపరిత్యక్తో మూఢచేతనయామయా
కాచబుద్ధ్యావిమూఢేన హస్తాచ్చింతామణిర్యథా. 11

మూర్ఖుడు, తుచ్ఛమగు నొక గాజుముక్కకొరకు, తనచేతియందున్న చింతామణి త్యజించులాగున మూఢబుద్ధినగు నేను నా నిజశరీరమును వదలితిని.

ఆపతద్ధిమనోమోహం పూర్వమాపత్ప్రయచ్ఛతి
పశ్చాదనర్థవిస్తార రూపేణ పరిజృంభతే. 12

ఎవని మనమందైనను అజ్ఞానము ప్రవేశించుచో, మొదట, వానికి దుర్బుద్ధిగల్గును. పిదప అట్టి దుర్బుద్ధిగల చిత్తము, అనేకములగు యనర్థముల గల్గజేయును.

ధూమేషుపరిత్థామి మార్గేవిలులితాస్మిచ
తృణేషుప్రేషితాస్మ్యంత స్తామేదుఃఖపరంపరా. 13

ఒకప్పుడు పొగయందు వసించుచున్నాను. మరియొకప్పుడు మార్గమందు దొరలుచున్నాను. తృణములందు పడద్రోయబడుచున్నాను. ఆహా! నా యీ దుఃఖపరంపరలగాంచుడు !

పరప్రేరితకరీనిత్యం పరసంచారచారిణీ
పరంకార్పణ్యమాయాతా జాతాపరవశాస్మ్యలమ్. 14

నేనిప్పుడితరుల యాజ్ఞల నెరవేర్చుచు, వారిచే చలింపబడుచు, వారియధీనమైయున్నాను. ఆహా! ఎట్టి దీనత్వమందితిని !

భ్రాంతింకరోమి తుచ్ఛేచ సాపివేధనరూపిణీ
అహోమమాల్పభాగ్యాయా దౌర్భాగ్యమపి దుర్భగమ్. 15

ఛీ! తుచ్ఛమగు రక్తము నాస్వాదించుటయే, నేను కోరుచుంటినే ! అదైనను, యితరుల వధించుటయను ఫలమునే గల్గజేయుచున్నదిగాని, రుచిని గల్గించుటలేదు, ఏలన, నాకు జిహ్వేంద్రియముగాని, యుదరముగానిలేవు. ఆహా! ఎట్టి దౌర్భాగ్యము సంభవించినది!

ఉత్థితః స్ఫారవేతాలః కుర్వత్యాః శాంతిమద్య మే
సర్వనాశోఽవజాతేన ప్రవృత్తాయామమోదితః. 16

ఒక బేతాళమును తోఁగించుచుండ మరియొక గొప్పబేతాళము ప్రత్యక్షమయ్యెనను సామెత నాయందు సార్థకమగుచున్నది. గొప్పస్థితినిబొందదలంచిన నాకిపుడు సర్వస్వమును నశించినది.

కింమందయామయా తాదృక్ సంత్యక్తం తన్మహావపుః
యథానాశేనవాభావ్యం తథోదేత్యశుభామతిః 17

అభాగినియగు నేనా విశాలదేహము నెందుకు పరిత్యజించితిని? నాశనము గలుగనున్నచో, అందులకు తగిన దుర్బుద్ధి మనుజునందుదయించును.

మామవాంతరనిర్మగ్నాం సూక్ష్మాంకీటతనోరపి
ఉద్ధరిష్యతికోనామ పాంసురాశిభిరావృతామ్. 18

కర్మవశముచే నేనిపుడు, మార్గమందుబడుచు, ధూళిచే గప్పబడుచున్నాను. క్రిమికీటాదులవంటి, శరీరముగల, నన్నిపు డెవరుద్ధరింపగలరు ?

వివిక్తమనసాంబుద్ధ్యా క్వస్ఫురన్తి హతాశయాః
గ్రామమార్గతృణానీవ గిరేరుపరివాసినామ్. 19

ఓయీ ! మహాత్ములగు యోగులు, తమ సూక్ష్మదృష్టిచే, నిన్ను కాంతురని యెంచకుము. ఏలన, పర్వతము పైనుండు వారలు, క్రింది గ్రామమందుగాని మార్గమందుగానియున్న తృణములను పరిగణించనట్లు, అట్టి మహాత్ములు దుష్టజీవులఁగూర్చి తలంపరు.

స్థితాయా అజ్ఞతాంభోధౌ క్వమమాభ్యుదయో భవేత్
అంధస్యోదేతి ప్రాకాశ్యం నఖద్యోతానుసేవినః. 20

అజ్ఞానార్ణవమున మునింగిన నే నెప్పుడుద్ధరింతునో ! ఖద్యోతములచే మనుజుడు ప్రకాశమును బొందగల్గునా ?

అతఃకియంతంనోజానే కాలమావలితాపదమ్
మయాపచ్ఛ్వభ్రగర్తేషు లుఠితవ్యం హతేహయా. 21

ఇట్లెంతకాలము ఆపద్గ్రస్తనై, విపత్తులను గర్తములందు దొర్లవలసియుండునో?

కదాస్యామంజనమహాశైలపుత్రకరూపిణీ
ద్యావాపృథివ్యోర్వ్యధుర్యే స్తంభతామనుతిష్ఠతి. 22

భూమ్యాకాశములు నశించు సమయమున, సమస్తప్రాణులను సంహరించునట్టి శక్తి యెది గలదో, అద్దానిని పొంది, గొప్పపర్వతాకారము గలదాన నెప్పుడగుదునో?

మేఘమాలాసమభుజా చిరంవిద్యుత్ప్రదేక్షణా
నీహారజాలవసనా ప్రోచ్చకేశమితాంబరా. 23

మేఘములవలె విశాలమగు భుజములును, మెఱుపువలె చంచలమగు నేత్రములునుగల్గి, నీహార వస్త్రముధరించి, పొడవైన కేశములుగలదాననై, ఆకాశమువలె విశాలమగు ఆకారము గల్గి, నే నెప్పుడుందునో ?



లంబోదరాభ్ర సందర్శ ప్రనర్తితశిఖండినీ
లంబలోలస్తనీ శ్యామా దేహావాతద్రవత్స్తనీ. 24

మేఘమువంటి విశాలమగు నల్లని శరీరమును, దీర్ఘములును, చంచలమునగు స్తనములును యెప్పుడు గల్గియుందునో ?

హాసభస్మచ్ఛటాచ్ఛన్న సూర్యమండలరోధినీ
కృతాంతగ్రసనోద్యుక్త కృత్యైకాకృతిధారిణీ. 25

మందహాసముచేత, ధూళిచేనావృతమగు సూర్యమండలమునుగూడ నిరోధింప సమర్థతగల్గి, మృత్యువువలె, ప్రాణుల వధించుటయే కార్యముగ గలదాననై భీకరాకారయుక్తనై యెపుడుందునో

కృశానూలూఖలదృశా సూర్యస్రగ్దామహారిణీ
పర్వతాత్పర్వతేశృంగే న్యస్యపాదౌ విహారిణీ. 26

అగ్నివలె దేదీప్యమానమగు నేత్రములుగల్గి, సూర్యుని మాలగా ధరించి ఒక పర్వతమునుండి మరియొక పర్వతముపై పాదములనిడి యెపుడు సంచరింతునో !

కదామేస్యాద్గురుశ్వభ్ర భాసురంతన్మహోదరమ్
కదామేస్యాచ్ఛరన్మేఘ మేదురా నఖరావలీ. 27

ఆహా ! ఆ నా ప్రకాశవంతమగు విశాలశరీర మెప్పుడు మరల లభించును ? శరత్కాల మేఘములవంటి ఆ నా కోమల నఖపంక్తిని మరల యెప్పుడు పొందుదును ?

కదామేస్యాన్మహారక్షో విద్రావణకరంస్మితమ్
స్వస్ఫిగ్వాద్యైరరణ్యాన్యాం కదానృత్యేయమున్మదా. 28

క్రూరరాక్షసుల హృదయముల భేదించు ఆ చిరునవ్వు మరలయెపుడు కలిగియుండును? మహారణ్యములందు ప్రసన్నయై యెపుడు నాట్యమునల్పుదును.

వసానవమహాకుంభైర్మృత మాంసాస్థి సంచయైః
కదాకరిష్యేఽవిరతం మేదురోదరపూరణమ్. 29

మద్య పూరితఘటములతోను, శవముల మాంసముతోను, యెముకలచేతను, నిరంతరము, నా నునుపైన దేహమును యెపుడు నింపుదును ?

కదాపీతమహాలోక రుధిరాక్షీబతాంగతా
భవేయం ముదితా దృప్తా ముద్రితానిద్రయాతతః 30

లోకమందలి సర్వప్రాణులను హింసించి, వారి రక్తపానముచే మత్తత నెప్పుడు పొందుదునో! మరియు ఆ మదోన్మత్తతచే ప్రసన్నయు, గర్వియునై యెపుడు నిదురింతునో?

మయైవ కుతపోవహ్నౌ తదగ్ర్యం భాసురంవపుః
భస్మత్వం కనకేనేవ సూచిత్వమురరీకృతమ్. 31
క్వకిలాంజనశైలాభం వపుర్భరిత దిక్తటమ్
క్వప్రాచికాఖురసమం సూచిత్వం తృణపేలవమ్. 32

దుఃఖప్రదమైన ఫలముగల్గజేయు తపస్సను అగ్నియందు, నా ప్రకాశవంతమగు శరీరమును, నేనే నశింపజేసికొంటిని. బంగారు తనరూపమును పోగొట్టుకొని భస్మమైనట్లు, నేను నా సుందర రూపము నశింపజేసికొని, లోహసూచికనైతిని. విశాలమైన ఆకృతికల్గి పర్వతమువలె దృఢమై యున్న ఆ నా నల్లని వర్ణముగల శరీరమెచట, తృణమువలె కోమలమును సూక్ష్మమును నైన ఈ నా సూచీరూపమెచట?

త్యజత్యాశుమృదిత్యజ్ఞః ప్రాప్యాపి కనకాంగదమ్
మయాసూచిత్వలోభేన సంత్యక్తం భాసురంవపుః 33

అవివేకి, బంగారు ఆభరణమును పొందియు, అది మట్టియని తలఁచి, విడచునట్లు, నేను సూచీత్వలోభముచే, ఆ నా ప్రకాశవంతమగు విశాలదేహమును పరిత్యజించితిని.

హామహోదరవింధ్యాద్రి సనీహారగుహోపమ
అద్యనాంతం కరోషిత్వం కథంసింహేనహాస్తినామ్. 34

హా! వింధ్యపర్వత గుహవలె విశాలమగు నో దేహమా! నేడేల సింహమువలె యరణ్యములందు ఏనుగుల వధించుటలేదు?

హాభుజౌభరనిర్భగ్నశిఖరౌ శశభృన్నఖై:
పురోడాశధియాచంద్రం కథమద్యనబాధతః. 35

భారముచే పర్వతశిఖరములసైతము విరుగగొట్టు ఓ విశాల భుజద్వయమా; నేడు, పురోడాశము (యజ్ఞమందలి దేవభోజ్యమగు అన్నము) కొరకై, మీరేల చంద్రుని బాధించుటలేదు?

హావక్షఃకాచవైధుర్య గిరీంద్ర తటసుందర
నాద్యసింహాదియాకంతద్ధృతం రోమవనంతథా. 36

మణియుక్తమును, సుమేరువువలె మనోహరమునునగు ఓ వక్షమా; నేడు నీవు సింహములసైతము నశింపచేయు స్వభావముగల్గి రోమములను అరణ్యము నేల ధరింపలేదు?

హానేత్రేకృష్ణరజనీ రజఃశుష్కేంధనై జనే
కస్మాన్నమేభూషయతో దృగ్జ్వాలామాలయాదిశః. 37

కృష్ణపక్షపురాత్రియందలి యంధకారమను యెండుకట్టెల దహింపజేయు ఓ నేత్రద్వయమా, నీ దృష్టియను జ్వాలలచే దిక్కుల నేల యలంకరించుటలేదు?

హాస్కంధబంధోనష్టోఽసి నిషిద్ధోఽసి మహీతలే
కాలేనవినిపిష్టోఽసి నిష్పృష్టోఽసి శిలాతలే. 38

నా ప్రియ బంధువులగు ఓ భుజద్వయమా! నేను మిమ్ముల త్యజించితిని. మీరు భూమిపైబడి నశించితిరి. పర్వతశిలపైబడి చూర్ణమైపోయితిరి.

హాముఖేందో తపసి కిం నాద్యత్వంమమరశ్మిభిః
కల్పాంత దావసంశాంత చంద్రబింబమనోహర. 39

కల్పాంతమందలి దావాగ్నిచే దగ్ధమగు చంద్రబింబమువంటి మనోహరమగు ఓ ముఖచంద్రమా! నేడు నీవు నీ కిరణ[illegible] నేల ప్రకా[illegible]పజేయుటలేదు?



హాహాహస్తౌమహాకారౌ తావద్యక్వగతౌమమ
సంపన్నాస్మిమహాసూచి ర్మక్షికాఖురదోలితా. 40
హాభగోగ్రకరంజాఢ్య సత్కందశ్వభ్రశోభన
వింధ్యాద్వరేణ్యవిపుల నితంబామలబింబక. 41

ఓ దీర్ఘహస్తములారా! మీ రెచటికిబోయితిరి? నేనిపుడు చిన్నదోమచేతగూడ చలింపబడునట్టి సూచికనైతిని, వింధ్యపర్వత తటమువంటి ఓ నితంబభాగములారా! మీరిపుడెచటికి బోయితిరి?

క్వాకారోఽంబరపూరకఃక్వచనవం తుచ్ఛాత్మసూచీవపు
రోదోరంధ్రసమంక్వవాస్యకుహరం క్వేదంచసూచీముఖమ్
క్వగ్రాసోబహుమాంసభారబహులః క్వాబ్బిందునాభోజనం
సూక్ష్మాస్మ్యేతదహో మయైవరచితం స్వాత్మక్షయేనాటకమ్. 42

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కర్కట్యుపాఖ్యానే సూచికాపరిదేవనం నామైకసప్తతితమః సర్గః ॥ 71 ॥

ఆకాశమును సైతమునింపు ఆ నా శరీరమెచట, ఈ తుచ్ఛ సూచీరూపమెచట; ఆవిశాలముఖమెచట, ఈ అతిసూక్ష్మమగు యాకారమెచట; అనేకసంభారములతో గూడిన ఆ నా యాహారమెచట, ఈ జలబిందువుయొక్క భోజనమెచట ఆహా! నేనెంత సూక్ష్మముగనైతిని! నా యాత్మవినాశమునకు కారణము నేనే.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున సూచికాపరిదేవనమను ఏకసప్తతితమ సర్గము. ॥ 71 ॥

## ద్విసప్తతితమః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

సూచీసాసంభవద్వాణీ చింతయిత్వేత్యకంపనమ్
పునస్తద్దేహలాభాయ భవామ్యాశుతపస్వినీ. 1

వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! పిదప, ఆకర్కటి ఏకాగ్రచిత్తయై, మౌనము వహించి, తన పూర్వదేహమును పొందుటకొరకై తపస్సుచేయ సంకల్పించెను.

ఇతిసంచింత్యచిత్తస్థం సంహృత్యజనమారణమ్
తదేవహిమవచ్ఛృంగం జగామతపసేస్థితమ్. 2

ఇట్లు నిశ్చయించుకొని, ప్రాణిహింసాకృత్యముల నిరోధించినదై, హిమాలయపర్వతముపై పూర్వము తాను తపమొనరించిన స్థానమునకుఁజనెను.

అపశ్యదేవసూచిత్వం సాతన్మానసమాత్మని
ప్రాణవాతాత్మికాప్రాణైః ప్రవిశ్యహాతమానసమ్. 3
అథాత్మన్యేవ సూచిత్వం పశ్యత్యేవమనోమయమ్
ప్రాణవాతశరీరాసా జగామ హిమవచ్ఛిరః. 4

మొదట, అయ్యది తనయందు సూచీరూపత్వమును గాంచెను. పిదప, ప్రాణవాయురూపయగు జీవసూచిక, తనయుపాధి భూతములగు ప్రాణమనంబులచే కల్పింపబడిన లోహసూచికయందు ప్రవేశించి, ఆ పిమ్మట, జీవసూచికయందే లోహసూచికరూపమును గాంచుచు, క్రియా ప్రధానమగు ప్రాణవాయురూపపు శరీరముగలదై, హిమవత్పర్వత శిఖరముపైకి వెడలెను.

దృష్టదావానలే తత్ర సర్వభూతవివర్జితే
మహామహాశిలాభాభా రూక్షేపాంసు విధూసరే. 5
తస్థావభ్యుదితేవాసా నిస్తృణే విపులేస్థలే
మరావకస్మాత్సంజాత శుష్కతృణశిఖాయథా. 6

దావాగ్నిగలదియు, జనసంచారములేనిదియు, గొప్ప యింద్రనీలశిలవంటి కాంతిగలదియు, ధూళిచే ధూసరమైనదియు, నగు ఆ హిమవత్పర్వత శిఖరముపై విశాలమగు మరుభూమియందు యెండినతృణము అకస్మాత్తుగ యంకురించెనోయన ఆరాక్షసి యచట నిలబడెను.

సుసూక్ష్మస్యైకపాదస్య సాగ్రే నైవాశ్రితోర్వరా
స్వసంవిదేకపాదాత్మ తపఃకర్తుం ప్రచక్రమే. 7

సూక్ష్మరూపిణియగు నా సూచిక, తన యర్ధభాగముచే భూమినాశ్రయించి, తక్కిన అర్ధభాగమునల్లేయుంచి తప మొనరింపసాగెను.

సూక్ష్మపాదతలేనైషా వసుధారేణుసంకటీ
నివార్యత్రిపదీంకృత్వా యత్నేనోర్ధ్వముఖీస్థితా. 8

సూక్ష్మమగు తనపాదతలస్పర్శచే, భూమిపైని యణువులకు బాధ గల్గించుచున్నయది, ప్రయత్నపూర్వకముగ విషయమునుండి దృష్టిని నిరోధించి, ఊర్ధ్వముఖియై యట నిలంబడెను.

కృష్ణత్వహింస్రతాతైక్ష్ణ్య వ్యాప్త్యాస్యపవనాశనైః
యత్నాత్పదంనిబధ్నంతీ రేణ్వాణూపలసంకటే. 9

కృష్ణవర్ణియు, హింసాస్వభావయు, నగు నాసూచిక, తీక్ష్ణమగు అగ్రభాగము, సర్వాంగముల వ్యాప్తమగు ముఖము, వాయుభక్షణ, గలదగుటచే, ధూళియందలి పరమాణువులచే క్లేశముగలుగుచున్నను, ప్రయత్నముచే తన పాదమును స్థిరముగానుంచినదై, నిలఁబడెను.

అరణ్యేక్షుభితాసంపద్దూరాలోకార్థముత్థితామ్
పుచ్ఛాగ్రకోటి స్థితాం వాతాలోలామనుచకార సా. 10

ఆ యరణ్యమందు, క్షుభితులగు పాంథులఁ గాంచుటకు కాబోలు అది కంఠమెత్తి యుండెను. మరియు, తృణాగ్రమునసుండి పాంథులకు వ్యామోహము గల్గించుటకై కాబోలు, వాయువుచేనైనను, చలింపకయుండెను.



ముఖరంధ్రవినిష్క్రాంతా తస్యాభాస్కరదీధితిః
సఖీబభూవసూచ్యాభా పశ్చాద్భాగైకరక్షిణీ. 11

తనముఖమందలి రంధ్రముగుండా ప్రసరించుచున్న సూర్యకిరణమువలె, సూచ్యాకారమును ధరించిన తపస్సుగూడ, దానిని సఖివలె సంరక్షించుచుండెను.

క్షుద్రేఽపిస్వజనేభూతేఽప్యేతివత్సలతాంజనః
దీధిత్యాపిసఖీవృత్తం సూచ్యాం శుచితయాభృతమ్. 12

నీచుడైనను, మిత్రుడగుచో, జనులు వానిపై కరుణగల్గియుందురు. చూడుడు. తపస్సుకూడ సూచిక ప్రాణములను సఖివలె రక్షించుచుండెను.

బభూవతస్యాఃస్వచ్ఛాయా ద్వితీయా తాపసీసఖీ
ఏవంసూచీవమలినా తయాపశ్చాత్కృతేవసా. 13

ఆ సూచికయొక్క ఛాయ, దానికి రెండవసఖియాయెను. దానినది తన వెనుక భాగమును రక్షించునదిగా, నొనర్చుకొనెను.

సూచ్యాతయాసునిర్గత్య సుపాతాభ్యాస్మకూణితైః
పశ్చాత్సఖ్యాభయా సాధురన్యోన్యాచార కేవలమ్. 14

ఛాయారూపముననున్న సూచియు, సూర్యకిరణరూపముననున్న సూచియు, పరస్పరము సహాయ మొనర్చుకొనునట్లుండెను. ఇది వారియుత్తమ యాచరణయే యగును.

సూచ్యభిప్రేక్షితేయాతా మలింద్రుమలతాదయః
మహాతపస్వినీంసూచీం దృష్ట్వానోత్కంఠయంతి కే. 15

ఆ పర్వతముపైనిగల యరణ్యమందలి పక్షులకుగూడ, ఆ సూచికను గాంచుటచే సద్బుద్ధి గల్గినది. మహాతపస్వినియగు నా సూచికనుజూచిన యెవరికి సత్కార్యమొనరింప నుద్దేశ్యము గల్గకుండును ?

స్థిరబద్ధపదామేనాం స్వమనోవృత్తిముత్థితామ్
అనిలంభోజయాంచక్రుర్ముఖనిర్గత ఖాంకృతైః 16
ప్రసూతానిభవిష్యాణి గీర్వాణాన్యానివాచిరమ్
కౌసుమానిరజాంస్యస్యా ఇత్యాస్యంపర్యపూరయన్. 17

పాదముల స్థిరముగాబంధించి, తపఃక్రియయందే దృఢబుద్ధిగలిగియున్న యాతపస్విని గాంచి, వృక్షలతాదులు ఫలపుష్పాదులను, ఖాంకారశబ్దముతో కూడుకొనిన చల్లనివాయువును, దాని కాహారముగనొసంగెను. మనోహరమును, దేవతలకర్పింప యోగ్యమైనదియునగు పుష్పపరాగ మీ తపస్వినికీయవలెనని తలంచి, వృక్షలతాదులాపరాగముతో దానిముఖమును నింపెను.

తతోమహేంద్రప్రహితం వాతనున్నామిషంరజః
తయాత్వభ్రత్వవ్యాజేన ననిగీర్ణం ముఖేవిశత్. 18

ననిగీర్ణవతీ తాని రజాంసిదృఢనిశ్చయాత్
అంతఃసారతయాకార్శ్యం లఘవోఽప్యాపున్నవంతిహి. 19

అటు పిమ్మట, విఘ్నముగల్గింప నెంచిన యింద్రునిచేబంపబడిన మాంసకణము, వాయువుచే ప్రేరితమై, రంధ్రరూపముననున్న దానిముఖమందు ప్రవేశించెను గాని, దృఢనిశ్చయముగల్గి యద్దానినది భుజింపలేదు. తుచ్ఛజీవులుగూడ ఆత్మబలముచే తపోవిఘ్నముల బారద్రోలగల్గుదురు.

నపిబత్యాస్యసంస్థాని తథాపుష్పరజాంస్యపి
విస్మయం పవనః ప్రాప సుమేరూన్మూలనాధికమ్. 20

ఆ సూచిక, తనముఖమందున్న పుష్పపరాగమునుగూడ తినుటకిచ్ఛగింపలేదు. దీనిచే, మహామేరువును పెకలించుటచే గల్గు నాశ్చర్యముకంటె, యెక్కుడాశ్చర్యము, వాయువునకు గల్గెను.

ఆశిరః పిహితాపంకైః పూరితాపిమహాజలైః
విధూతాపి బృహద్వాతైర్దగ్ధాపి వనవహ్నిభిః. 21
భిన్నాపికరకాపాతైర్భ్రామితాపితటిద్భ్రమైః
ఉద్వేజితాపిజలదైః క్షోభితాత్యతిగర్జితైః. 22
అపివర్షసహస్రైఃసా చిత్తస్థదృఢనిశ్చయా
పాదాగ్రంతు కుసుప్తేవ నాకంపత తపస్వినీ. 23

ఆ కర్కటి, శిరమువరకు బురదచేగప్పబడెను. అగాధజలమందుంచబడెను. భయంకరమగు వాయువులచే చలింపబడెను, వనాగ్నిచేదహింపబడెను. రాళ్లవర్షముచే పీడింపబడెను. విద్యుల్లతలతోగూడిన గొప్పమేఘముల గర్జనలచే భయపెట్టబడెను. ఇట్లనేక వత్సరములు జరిగినను, దృఢనిశ్చయయై, ఆరాక్షసి, నిద్రుతునివలె తన స్వస్థానమునుండి కదలక యుండెను.

నివృత్తాయా బహిఃస్పందాద్దేశకాలేబహాగతే
విచారయంత్యాస్తస్యాఃస్వమాత్మాసత్యం సుచేతనమ్. 24
జ్ఞానాలోకః సముదభూత్సాపరావరదర్శినీ
బభూవనిర్మలాసూచిర్విషూచీ పావనంపరమ్. 25

ఓ రామచంద్రా! బాహ్య చేష్టలుడుగుటచేతను, సత్స్వరూపమగు ఆత్మను విచారించుటచేతను, ఆత్మ సాక్షాత్కారము గల్గినందున, ఆరాక్షసి ప్రబోధమునందెను. దీనిచేనది భూత భవిష్యత్తులగూడ నెరుంగగల్గి, పవిత్రయయ్యెను.

జాతావిదితవేద్యాసా స్వయమేవతయాధియా
తపసాదుష్కృతేక్షీణే సూచీస్వసుఖసూచినీ. 26

తపస్సుచే పాపమంతయు నశింప, యాసూచిక, యెరుంగదగిన వస్తువును (ఆత్మను) బాగుగ నెరుగగల్గెను.

ఇతివర్షసహస్రాణి సాకరోద్దారుణంతపః
సప్తసప్తమహాలోకా సంతాపకరమున్ముఖీ. 27



ఇట్లా సూచిక యూర్ధ్వముఖియై భూరాదిలోకముల తపింపజేయుచు ఏడువేల సంవత్సరములు, ఉగ్రతప మొనరించెను.

తస్యాః కల్పాగ్నిభీమేన తపసాహిమహాగిరిః
బభూవ తేనజ్వలితో జజ్వాలేవ తతోజగత్. 28

ప్రళయాగ్నివలె భయంకరమైన దానియుగ్రతపముచే, గొప్పదగు ఆ హిమవత్పర్వతముగూడ ప్రజ్వలింపబడెను. దానిచే, జగత్తంతయు దహింపబడినట్లాయెను.

కస్యేదంతపసాక్రాంతం జగదిత్యథవాసవః
నారదంపరిపప్రచ్ఛ సతస్యాకథయచ్ఛతత్. 29
సప్తవర్షసహస్రాణి సూచీదీర్ఘతపస్వినీ
మహావిజ్ఞానదేహాసా తేనేదం జ్వలితంజగత్. 30

ఓ రామచంద్రా! అత్తఱి, యింద్రుడు నారదునితో నిట్లనియె:— ఓ మునీంద్రా! యెవని తపంబుచే ముల్లోకములిట్లు తపించుచున్నయవి? నారదుడిట్లనెను:— ఓ ఇంద్రుడా! మహాతపస్వినియగు కర్కటి యేడువేల వత్సరములనుండి తపంబొనరించుచున్నది. ఇపుడది విజ్ఞానమయ శరీరమును బొందెను. అందుచే నీ జగంబంతయు ప్రదీప్తమయ్యెను.

నాగాఃశ్వసంతి విచలంతి నగాః పతంతి వైమానికా జలధివారిధరాః ప్రయాంతి
శోషందిశోఽర్కసహితామలినీభవంతిసూచ్యాఃసురేంద్రతపసాక్షయమాయయేవ. 31

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కర్కట్యుపాఖ్యానే సూచీతపఃప్రభావోనామ ద్విసప్తతితమః సర్గః ॥ 72 ॥

ఓ దేవేంద్రా! దానియొక్క ఉగ్రతపముచే, మయునిమాయవలె, సర్పములన్నియు భయపడి శ్వాసలగైకొనుచున్నవి. పర్వతములు చలించుచున్నవి. దేవతలు తమ విమానములనుండి పడుచున్నారు. సముద్రములు, మేఘములు శుష్కించుచున్నవి. సూర్యుడును దిక్కులన్నియును మలినములగుచున్నవి.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున సూచీతపఃప్రభావమను ద్విసప్తతితమ సర్గము ॥ 72 ॥

## త్రిసప్తతితమః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచః—

కర్కటీకటువృత్తాంతం సర్వమాకర్ణ్యవాసవః
నారదంపరిపప్రచ్ఛ పునర్జాతకుతూహలః. 1

వసిష్ఠుడు:- ఓ రామచంద్రా ! కర్కటియొక్క తపస్సునుగూర్చిన అప్రియ వృత్తాంతమంతయును విని, కౌతూహలాయత్తచిత్తుడై ఇంద్రుడు మరల నారదునితో నిట్లనియె.

శక్ర ఉవాచః—

సూచీవృత్తిపిశాచత్వం తపసోపార్జ్యతత్తయా
కర్కట్యాహిమమర్కట్యా కేభుక్తావిభవామునే. 2

ఇంద్రుడు:- ఓ మునీంద్రా ! పిశాచమువలె నదృశ్యమగు జీవసూచిత్వమును, తపముచే బొందిన, జడబుద్ధియగు నా కర్కటి, లోకమందే యే భోగముల ననుభవించెను ?

శ్రీ నారద ఉవాచః—

జీవసూచ్యాః పిశాచత్వం గతాయాః శక్ర పేలవమ్
ఆసీత్కార్ష్ణ్యాయసీసూచీ తస్యాః సమవలంబనమ్. 3

నారదుడు:- ఓ ఇంద్రా, చంచలమును, పైశాచిక స్వభావముగలదియు, నగు నా జీవసూచిక కాశ్రయము, కృష్ణవర్ణముగల లోహసూచికయని యెఱుంగుము.

తత్సమాలంబనంత్యక్త్వా వ్యోమవాతరథ స్తథా
ప్రాణమారుతమార్గేణ తయా దేహాన్ప్రవిష్టయా. 4
సర్వేషామాంత్రతంత్రీణాం స్నాయుమేదోవసాసృజామ్
రంధ్రేణపక్షిణేవాంతర్నిలీనం మలినాత్మనామ్. 5

అప్పుడప్పుడా లోహసూచికయొక్క యాలంబనను వదలి, ఆ జీవసూచిక, ఆకాశమందు, వాయువను రథముపైనెక్కి, ప్రాణవాయు మార్గముగుండా దుష్టులయొక్కయు, పాపులయొక్కయు, శరీరముల బ్రవేశించి, వారి ప్రేవులు, నాడులు, మేదస్సు, రక్తములందుజొచ్చి, ఆయాప్రాణుల శరీరములందు, రంధ్రముచేసి చెట్టుతొఱ్ఱలో పక్షివలె అందు నివసించుచుండును.

యస్యాంనాడ్యాంనభోవాయుర్యాతి తత్రాముపేతయా
తత్రశూలంకృతంస్థూలన్యగ్రోధాగ్ర ఇవోత్కటమ్. 6

ఏనాడియందు జ్వరహేతువగు వాయువు, ప్రవేశించునో, అచట ప్రవాహరూపమై శూలబాధ గల్గజేయును శ్రీ దక్షిణామూర్తియున్న స్థానమగు వటవృక్షముయెదుట శైవమతస్థాపన సూచకమగు ఉగ్రశూలము నాటబడినట్లు స్థిరముగానచ్చటనేనుండును.

తచ్ఛరీరేంద్రియైస్తాని తథాన్యానిబహూనిచ
భుక్తానినరమాంసాని భోజనాన్యుచితానిచ. 7

ఆయాప్రాణుల శరీరేంద్రియముల ద్వారా, వారివారి భోజనములను, మరియు మనుజుల మాంసవిశేషములను, ఆ జీవసూచిక యనుభవించెను.

సుప్తంవివలితానల్ప మాలయాముగ్ధబాలయా
కాంతవక్షఃస్థలస్యూత స్పష్టపత్రకపోలయా. 8

అనేకమాలల ధరించిన ముగ్ధబాలికయందు ప్రవేశించి, ఆపెతో సహా నిద్రించుచు, సుఖమందుచు విచిత్రభోగముల ననుభవించెను.



విద్రుతంవీతశోకాసు విహంగ్యావనవీథిషు
కల్పద్రుమౌఘపుష్పాగ్ర ద్విగుణాంభోజపంక్తిషు. 9

పక్షియందు ప్రవేశించి, దుఃఖరహితయై, కల్పవృక్షముయొక్క పుష్పములకంటె యధిక సుగంధయుక్తమగు కమల పుష్పములుగల వనమందు విహరించెను.

పీతఆమోదమందార మకరందకణాసవః
వనేష్వమరశైలానా మలిన్యామలినీలయా. 10

భ్రమరి శరీరమునఁజొచ్చి భ్రమరముతో లీలలసల్పుచు, దేవతల ఉద్యాన వనములందలి పుష్పములలోగల మధురరసమును గ్రోలెను.

చర్వితానిశవాంగాని గృధ్ర్యాఽగర్తానివృద్ధయా
ఖడ్గవృత్త్యేవసంగ్రామే వీరాఙ్గాని జవేద్ధయా. 11

యుద్ధమందు, ఖడ్గము, వీరులయంగములను భక్షించు (ఛేదించు) లాగున, గ్రద్దయందు ప్రవేశించి అయ్యది మాంసమును భక్షించెను.

సర్వాంగకోశనాడీషు దిత్స్యేవానిలలేఖయా
ఉడ్డీనమవడీనంచ కాచౌఘ వ్యోమవీథిషు. 12

సమస్త యంగములందును, నాడులందును, నీలవర్ణముగల్గిన యాకసమందును, వాయువువలె, క్రిందికి పైకి తిరుగుచుండెను.

విరాడాత్మహృది ప్రాణవాతస్పందాః స్ఫురంతితు
యథాతథా ప్రస్ఫురితం ప్రతిదేహగృహాంతయా. 13

విరాడాత్మ (సమస్త ప్రాణికోట్ల) యొక్క హృదయమందు ప్రాణవాయువు సంచరించునట్లు, ఈ సూచికయు, ప్రాణులయొక్క శరీరగృహములందు స్వతంత్రముగ విహరించెను.

సర్వప్రాణిశరీరేషు భ్రాంతిచిచ్ఛక్తయ స్తథా
దీపప్రభాభాసితయా గృహిణ్యేవస్వసద్మసు. 14

జీవులందరి శరీరములందును ప్రాణవాయువు చరించునట్లు చేతనశక్తులును, అంతః కరణోపాధి ననుసరించి భిన్నముగ స్ఫురించుచుండును. అనగా, దీపపుప్రకాశముచే గృహిణి గృహమందలి క్రియలజేయులాగున, చిత్ప్రకాశముచే తక్కినశక్తులు కార్యవంతములగును.

విహృతంరుధిరేష్వంత ర్ద్రవశక్త్యేవవారిషు
అబ్ధిష్వావర్తవృత్త్యేవ జఠరేషువివల్గితమ్ 15

జలమందు ద్రవత్వమును, సముద్రములందు ఆవర్త యుక్తమగు తరంగత్వము, యుదరమందనేక వాయురసాదుల చలనత్వము, నుండునట్లు, ఈ జీవసూచికయు, అనేకవిధములగు రక్త ప్రవాహములందు స్థితిని బొందియుండెను.

సుప్త మేదఃసు శుభ్రేషు శేషాంగేష్వివశౌరిణా
స్వాదితశ్చాంగ గంధోఽంతః పీతశక్త్యాఽమృతంయథా. 16

శ్రీ భగవానుడు శేషుని యంగములపై శయనించులాగున నయ్యది, జీవుల, కోమలమగు మేదస్సుపై శయనించెను. మరియు శరీరమందలి రసమును, అమృతమునువలె నాస్వాదించెను.

తరుగుల్మౌషధాదీనాం హృద్రాజాన్యనిలశ్రియా
పరిభుక్తాన్యశుక్లాని హింసయోధీకృతానిచ. 17

వాయురూప మొంది, వృక్షలతాదుల యుత్తమ రసములఁ గ్రోలెను. మరియు జీవులను హింసించుట ద్వారా లభించిన అపవిత్రరసములఁగూడ పాన మొనర్చెను.

అథో జీవమయీసూచీ స్యామితిస్థావరేణసా
సంపన్నా తాపసీసూచీ చేతనాపావనీసితా. 18

ఆ పిమ్మట, "నేను జీవసూచిక యయ్యెదనను దృఢనిశ్చయముతో తప మొనరించెను. ఆ తపఃప్రభావముచే నిపుడది పవిత్రయు, పాపరహితయు ఆయెను.

అదృశ్యయాతయాచేహ మారుతోగ్రతురంగయా
అయఃసూచ్యానిలతయా వహంత్యాదిక్ష్వరుద్ధయా 19
పీతంభుక్తం విలసితం దత్తందాపితమాహృతమ్
నర్తితంగీతముషిత మనంతైః ప్రాణిదేహకైః 20

అదృశ్యరూపమున, వాయువను గుఱ్ఱము నెక్కి లోహసూచిక నాశ్రయించి, వాయువేగమున దిక్కులన్నిటిని పరిభ్రమించుచు, ఆ జీవసూచిక, ప్రాణుల శరీరములద్వారా, అనేక వైభవములననుభవించెను. రసములఁ ద్రావెను, పదార్థములనిచ్చెను, ఇప్పించెను, ప్రసన్నముగ నృత్యముసల్పెను, గాన మొనర్చెను, మరియు యితరుల వస్తువుల శోషింపజేసెను.

అదృశ్యయాశరీరిణ్యా మనఃపవనదేహయా
కృతమాకాశరూపిణ్యా సతతస్తినయత్తయా. 21

అదృశ్యమును, ఆకాశమయమునునగు శరీరముధరించి, సమష్టి, వ్యష్టిమనోరూపముగనయి, వాయురూపమును జెంది, ఆ జీవసూచిక ప్రపంచమున సమస్త కార్యములఁజేసెను.

మత్తయాశక్తయాస్వాద రసాచ్చలితమేతయా
కాలమాలానమాశ్రిత్య కరిణ్యేవ వివల్గితమ్. 22

ప్రాణులరక్తము నాస్వాదించుటచే మదించినయది వారి ఆయువను బంధనస్తంభము నాశ్రయించుకొని, ఏనుగువలె, దేశమంతట తిరుగాడుచుండెడిది.

కల్లోల బహులాధూత దేహదృష్ట నదీష్వలమ్
వేగై ర్వ్యధురకారిణ్యా మత్తయామకరాయితమ్. 23

ప్రాణులశరీరముల నశింపజేయు ఈ సూచికయను గజము, మొసలివలె, జీవుల ప్రాణముల నపహరించుచు, వారిదేహములను నదులందు కల్లోల మొనర్చెను.

అశక్తయానిగిరితుం మేదోమాంసం తథాహృది
నూనంరుదితమర్థాఢ్య వృద్ధాతురధియాయథా 24



పదార్థాధిక్యముచే, మేదస్సును, మాంసమును మ్రింగజాలదయ్యె. ధనికుడు, వార్ధక్య, రోగాదులచే పీడితుఁడైన, విషయభోగముల ననుభవింప నశక్తుఁడై దుఃఖించులాగున, ఆ సూచికయు విలపింపసాగెను!

అజోష్ట్రమృగహస్త్యశ్వ సింహవ్యాఘ్రాదినర్తితమ్
నర్తక్యేవచిరంరంగే వలయాంగదమంగకే. 25

నర్తకి తనయాభరణముల యాడించునట్లు, ఇదియు, ఒంటె, ఏనుగ, గుఱ్ఱము, సింహము మొదలగు జంతువులను బాధించుచు, వాటిని రంగభూమియందువలె ఆడించెను.

బహిరంతశ్చవాయూనా మేకత్వమనుజాతయా
గంధలేఖికయేవాంతః స్థితందుర్బలయా తయా. 26

బాహ్య ప్రదేశమునగల వాయువుతోను, మరియు లోనగల ప్రాణవాయువుతోను ఐక్యమొంది వాయువునందు గంధమువలె, యందుండెను.

మంత్రౌషధితపోదాన దేవపూజాదిభిర్హతా
బహిర్గిరినదీతుంగ తరంగవదుపద్రుతా. 27

మంత్రౌషధ తపోదాన దేవపూజాదులచే దండింపబడి యది పర్వతముపైకి తరుమబడియుండెను.

దీపప్రభేవావిజ్ఞాత గతిర్గత్వాశులీయతే
అయఃసూచ్యాంమాతరీవ తత్రనిర్వృతిమేతిసా. 28

ఆరిన దీపమువలె, ఒకప్పుడంతర్ధానమై, తనశక్తిచే, లోహసూచికయందు ప్రవేశించి, తల్లియొడియందువలె, అచట విశ్రాంతిని బొందుచుండెడిది.

స్వవాసనానుసారేణ సర్వఆస్పదమీహతే
సూచిత్వమేవరాక్షస్యా సూచిత్వేనాస్పదీకృతమ్. 29

అందరును, తమతమ స్వభావమున కనువగు దానినే యాశ్రయింతురు, అట్లే క్రూరస్వభావయగు రాక్షసి, తీక్ష్ణమగు సూచికనే తనయాలంబనముగా చేసికొనెను.

సర్వావిహృత్యాపిదిశః స్వమేవాస్పదమాపది
జీవసూచీలోహసూచీ మివాయాతిజడోజనః. 30

అంతట సంచరించుచుండినను, ఆపత్తు సంభవించినపుడు, ప్రాణులెట్లు తమ స్వస్థానము నాశ్రయించుదురో, అట్లే ఈ జీవసూచికయు, లోహసూచిక నాశ్రయించెను.

ఏవంప్రయతమానా సా విహరంతీదిశోదశ
మానసీంతృప్తిమాయాతా నశారీరీంకదాచన. 31
సతిధర్మిణిధర్మాహి సంభవంతీహ నాసతి
శరీరంవిద్యతేయస్య తస్యతత్కిలతృప్యతి. 32

ప్రచండ శీలయగు నారాక్షసి యిట్లంతటను సంచరించుచు, మానసిక తృప్తిని బొంది

యుండెనుగాని, శారీరకతృప్తి దానికి లేకుండెను. ఏలయన, ధర్మియుండినగదా ధర్మములుండును. లేనిచో, యెట్లుండును? అట్లనే, శరీరమున్నవానికే శారీరకతృప్తి యుండునుగాని, లేనివారికుండదు.

అథతృప్తస్య దేహస్య స్మరణాత్ప్రాక్తనస్యసా
బభూవదుఃఖితస్వాంతా పూర్ణోదరసుఖార్థినీ. 33

పిమ్మట తనపూర్వపు విశాలదేహమును స్మరించినదై పూర్ణతృప్తిని, శారీరక సుఖమును బడయనెంచి, మనంబున మిగుల దురపిల్లెను.

తతఃప్రాక్తనదేహార్థం కరిష్యేవిపులంతపః
ఇతిసంచింత్యతపసే దేశంనిర్ణీయసాత్మనా. 34
వివేశాకాశగృధ్రస్య హృదయంతరుణస్యసా
ప్రాణమారుతమార్గేణ ఖంఖగీవబిలేశయా. 35

పిదప నయ్యది 'నావిశాలమగు పూర్వపు దేహమును మరల పొందుటకై యుగ్ర తపమాచరించెదనని' తలంచి, అట్టి తపస్సాచరించుటకై, తగినప్రదేశమును నిర్ణయించుకొని, ఆకసమున సంచరించుచున్న యొక గృధ్రపక్షియొక్క హృదయమందు, ప్రాణవాయుమార్గమున, గూటియందు పక్షివలె ప్రవేశించెను.

గృధ్రఃస్వామయసూచిత్వం కశ్చిదేతత్సమాశ్రితః
నితాంతప్రేరితఃసూచ్యా కర్తుంమనఉపాదదే. 36

రోగరూపమగు జీవసూచిత్వమొందిన యాగృధ్రము, సూచికచే ప్రేరితమై, తదభిలషిత కార్యమును నిర్వహించుటకు గడంగెను.

సూచీమాదాయగృధ్రోఽసా యయౌతచ్చింతితంగిరిమ్
అంతఃసూచిపిశాచ్యంతే నున్నోఽబ్దఇవవాయునా. 37
తత్రాజనేమహారణ్యే స్థాపయామాస తామసా
సర్వసంకల్పరహితే పదేయోగీవచేతనామ్. 38

అట్లాపక్షి వాయుప్రేరితమగు మేఘమువలె, శీఘ్రముగ, హిమవత్పర్వతముపైకి, సూచికను గొనిపోయి, జనశూన్యమగు నొకగొప్ప యరణ్యమందు, సర్వసంకల్పరహితమగు బ్రహ్మపదమందు యోగి తనచిత్తము నుంచునట్లు, దానినుంచెను.

ఏకేనైవాణునా తేన పాదప్రాంతేనసుస్థితా
సంప్రతిష్ఠాపితేవాద్రి మూర్ధ్నిగృధ్రేణదేవతా. 39
రజఃకణగృహస్థాణు శిరస్యేకేనసాణునా
పాదేనాతిష్ఠదుద్గ్రీవం శిఖీవ గిరిమూర్ధని. 40

అచట నాసూచిక, ఏకపాదస్థితయై, ధూళికణముపై తనసూక్ష్మమగు పాదమునుంచి, కంఠమెత్తి అగ్నివలె, నిలబడెను.

ఉత్థితాంస్థాపితాంసూచీం గృధ్రేణజీవసూచికా
దృష్ట్వాబహిర్వినిర్గంతుం ఖగదేహాత్ప్రచక్రమే. 41



గృధ్రముచే నెలకొల్పబడిన లోహసూచికఁగాంచి, జీవసూచికయు ఆ పక్షిశరీరమునుండి, బయటకురాదొడగెను.

ఖగదేహాన్నిర్జగామ సూచీప్రోన్ముఖచేతనా
పవనాద్గంధలేఖేవ ఘ్రాణవాతలవోన్ముఖీ. 42

బయటకు రాదలచిన జీవసూచిక, నాసికాభిముఖమగు గంధము, వాయువునుండి వచ్చులాగున పక్షిదేహమునుండి రాదొడగెను.

జగామగృధ్రఃస్వందేశం భారంత్యక్త్వేవభారికః
నివృత్తవ్యాధిరివన బభూవాంతరనాకులః. 43

తనయందలి రోగముశమింప, మనుజుడు స్వస్థచిత్తుడగునట్లు, ఆ పక్షియు, సూచిక నచట వదలుటచే, శాంతమునంది, తనస్థానమున కరిగెను.

అతఃసూచిస్తయాధార స్తపసేపరికల్పితా
దృఢఃసుసదృశోఽర్థానాం వినియోగోహిరాజతే 44

పదార్థములొకే స్వభావము గలిగియున్నపుడే, శోభించును. అట్లనే జీవసూచిక, తనవంటిదే యగు లోహసూచికను, తపస్సున కాధారముగా చేసికొనెను.

నహ్యమూర్తస్యసిధ్యంతి వినాధారంకిలక్రియాః
ఇత్యాధారైకనిష్ఠత్వ మాశ్రిత్యాసాతపఃస్థితా. 45

ఆకారరహితుల కేదేని యాధారములేనిచో, యేకార్యమును చేయజాలరు. కనుకనే, నొక యాధారమును గైకొనియే, జీవసూచిక తపముచేయ నారంభించెను.

జీవసూచీలోహసూచీం పిశాచీశింశుపామివ
సర్వతోవలయామాస వాత్యేవామోదలేఖికామ్. 46

పిశాచము వృక్షము నాశ్రయించునట్లును వాయువు గంధమున, వ్యాపించులాగునను, జీవసూచికయు లోహసూచిక నాశ్రయించి అందు వ్యాపించెను.

తతస్తతఃప్రభృత్యేషా సూచీదీర్ఘతపస్వినీ
అరణ్యాన్యాంస్థితాశక్ర తత్రవర్షగణాన్బహూన్. 47

ఓ ఇంద్రా! అప్పటినుండి, దీర్ఘతపస్వినియగు నారాక్షసి, సూచికారూపమున, ఆ యరణ్యమందనేక వర్షములు తపంబొనరించుచునే యుండెను.

తస్యా వరార్థంయత్నంత్వం కురుకర్తవ్యకోవిద
చిరేణసంభృతంలోకమలం దగ్ధుంహితత్తపః. 48

కార్యశీలుడవగు నోయింద్రా! దానికి వరమొసగుటకై యత్నింపుము. ఏలయన, బహు[illegible]ర్జితమగు, దాని తపశ్శక్తి ప్రపంచమును నశింపజేయగలదు.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఇతినారదతః శ్రుత్వా శక్రః సూచీనిరీక్షణే
మారుతం ప్రేషయామాస దశదిఙ్మండలాన్యథ. 49

వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! ఇట్లు, నారదునివలన విని, యింద్రుడు, ఆసూచికను వెదకుటకై, వాయువును దశదిక్కులకు బంపెను.

జగామాథమరుత్సంవిదాత్మనా తామవేక్షితుమ్
అథాముచ్యనభోమార్గం విచచారత్వరాన్వితః. 50

పిదప, వాయువు తనదివ్యదృష్టిచే, బోవలసినమార్గమును ముందుగ నిశ్చయించుకొని, ఆకాశమార్గమును వదలి, భూమిపై సంచరింపసాగెను.

సాతస్యసంవిత్తిప్రార్థేనైవసర్వగతాసతీ
పరమార్చిరివావిఘ్నం సహసైవదదర్శహ. 51
భూమేః సప్తసముద్రాంతే నిబద్ధాంవిపులస్థలీమ్
లోకాలోకాద్రిరసనాం తతోమణిమయోపమమ్. 52
స్వాదూదకాబ్ధివలయం సకోటరకకుబ్గణమ్
పుష్కరద్వీపవలయం తదంతర్గిరిమండలే. 53
మందిరాంభోధివలయం తజ్జలేచరసంస్థితమ్
గోమేదద్వీపకటకం తన్మధ్యావిషయంవ్రజమ్ 54
ఇక్షూదకాబ్ధిపరిఖం శాంతంగిరిగణాంతరమ్
క్రౌంచద్వీపోర్వరాపీఠం శాంతంగతగిరిక్రమమ్. 55
క్షీరాబ్ధిముక్తావలయం సమధ్యగతనాయకమ్
శ్వేతాఖ్యద్వీపవలయం సభూతప్రవిభాగకమ్. 56
తతోఘృతోదవలయ స్వాంతస్థపురమందిరమ్
కుశద్వీపవృతివ్యాప్తం సమహాశైలకోటరమ్. 57
దధ్యంభోరాశిరశనా సాంతాంబరపురోదరమ్
శాకద్వీపోర్వరాకారం సాంతస్థవిషయాంతరమ్. 58
క్షారాంభోరాశిపరిధిం సాంతస్థవిషయాంతరమ్.
జంబూద్వీపేమహామేరుం కులపర్వతసంకులమ్. 59
వాతస్కంధేభ్యఏవాదా పతితానిలవేదనా
క్రమేణానేనపర్యంతే తేనైవప్రసృతోంజసా. 60

ఆ వాయువుయొక్క దివ్యజ్ఞానాంశము శీఘ్రముగ, జగత్తంతటను బ్రహ్మజ్యోతివలె వ్యాపించెను. పిమ్మట సప్తసముద్రములను, భూమి చివరనున్న జనశూన్యమగు విశాలమైన సువర్ణమయమగు భూమిని, స్వాదుజల సముద్రావృతమగు పుష్కరద్వీపమును, దానియందలి పర్వత





మండలమునగల మదిరార్ణవవేష్టితమును జలచరజీవుల కాశ్రయమునునగు గోమేదకద్వీపమును, పిదప, ఇక్షుసముద్రముచే నావృతమును అనేక పర్వతపంక్తులుగలదియు ఉపద్రవరహితమును నగు క్రౌంచద్వీపమును, క్షీరసాగరముచే చుట్టబడిన మధ్యప్రదేశమున త్రైలోక్యనాథుడగు విష్ణుభగవానుడుగల శ్వేతద్వీపమును, అనేక నగరములు, యెత్తైనపర్వతములుగల్గి, ఘృతసముద్రముచే వ్యాపించియున్న కుశద్వీపమును, దధిసముద్రవేష్టితమగు శాకద్వీపమును, క్షారసముద్రముచే చుట్టబడి కులపర్వతములచే వ్యాప్తమై, మహామేరువుగల్గియున్న, జంబూద్వీపమును, ఇంద్రునిచే బంపబడిన వాయువు తన దివ్యసంవిత్ప్రభావమున క్రమముగ బరికించెను.

వాయురాలోకయన్నద్ధా జంబూద్వీపంనిరీక్ష్యచ
తత్రాప్యపహిమవచ్ఛృంగం యత్రసూచీతపస్వినీ. 61

ఇట్లా వాయువు ద్వీపసముద్రములన్నిటిని గాంచుచు, జంబూద్వీపమున తపస్వినియగు సూచికయున్న హిమవత్పర్వత శిఖరమును పొందెను.

శృంగమూర్ధ్ని మహత్యుగ్రే సారణ్యానిమవాప తామ్
ద్వితీయాకాశవితతాం వర్జితాంప్రాణికర్మభిః. 62

ఆయున్నత శిఖరముపై, ఆకాశమువలె విశాలమును, ప్రాణిసంచారవర్జితమునునగు యొక గొప్ప వనప్రదేశమును చేరెను.

అసంజాత తృణవ్యూహాం నికటత్వాద్వివస్వతః
రజోమయీ మేవతతాం సంసారరచనామివ. 63
మృగతృష్ణానదీసార్థ పూరణీయాబ్ధితాంగతామ్
శక్రకోదండసంకాశ మృగతృష్ణాసరిచ్ఛతామ్. 64
అమితానంతపర్యంతాం లోకపాలేక్షితైరపి
కేవలంపవనస్పంద ప్రవహద్ధూలికుండలామ్. 65
సూర్యాంశు కుంకుమాలిప్తాం లగ్నచంద్రాంశుచందనామ్
విలాసినీమివవ్యోమ్నా వాతసూత్కారపాయినీమ్. 66

ఆ ప్రదేశము, సూర్యునకు సమీపముననుండుటచే తృణరహితమును, ధూళిచే గప్పబడినదియు, మృగతృష్ణా నదులు గలదై సముద్రమువలె నున్నదియు, ఇంద్ర ధనుస్సువలెనున్న అనేక మృగతృష్ణారూపములగు నదులుగలదియు, ఇంద్రాది లోకపాలకులచేనైనను అంతమునుపొందనసాధ్యమైనదియు, వాయువుచే నెగురగొట్టబడిన ధూళికలదియు, సూర్యకిరణములను కుంకుమ, చంద్రకిరణములను చందనముతోగూడి ప్రియాలింగన సూచకముగ ధ్వనినిచేయుచున్న ఆకాశవిహారిణియగు నాయికవలెనున్నదియునై యుండెను.

సప్తద్వీపసముద్రముద్రణసముచ్ఛన్నైకదేశాశ్రయం
భూపీఠం పరితోవిహృత్యపవనోదీర్ఘాధ్వనాజర్జరః
తాంప్రాప్యోగ్రగిరిస్థలీమలివపురోవ్యోమాంగ లగ్నామివ
వ్యాప్తానంతదిగంతపూరక బృహద్దేహోవిసశ్రామసః. 67

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కర్కట్యుపాఖ్యానే సూచీతపోవర్ణనంనామ త్రిసప్తతితమః సర్గః ॥ 73 ॥

దిక్కులన్నిటిని వ్యాపించియున్నందున విశాలదేహముగల, ఆ వాయువు సప్తద్వీపములను, సప్తసముద్రములను గాంచి, చాలదూరమరగినందున యలసినదై తుమ్మెదవలె నల్లనివర్ణముగల నా హిమవత్పర్వత యుపరిభాగమున విశ్రమించెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున సూచీతపోవర్ణనమను త్రిసప్తతితమ సర్గము ॥ 73 ॥

## చతుఃసప్తతితమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

తస్యతత్రోర్ధ్వశృంగస్య తస్యాంభువిమహావనౌ
దదర్శమధ్యమాంసూచీం ప్రోత్థితాంసశిఖామివ. 1

వసిష్ఠుడు:— ఆ యెత్తైన పర్వతశిఖరము పైనిగల వనప్రదేశమున, శిఖయొకటి యుత్పన్నమైనదాయనిపించుచున్నట్లు నిలబడియున్న సూచికను వాయువు గాంచెను.

ఏకపాదంతపస్యంతీం శుష్యంతీం శిరఊష్మణా
సతతానశనాంశుష్క పిండీభూతోదరత్వచమ్. 2

అది ఏక పాదముపై నిలబడి తపమాచరించుచుండెను. శిరముపై యెండపడుచుండుటచే నది శుష్కించియుండెను. భోజనము లేనందుచే దాని శరీరము శిథిలమైయుండెను.

సకృద్విశసితాస్యేన గృహీత్వేవాతపానిలాన్
పశ్చాత్త్యజంతీంహృదయే మే న మాంతీత్యనారతమ్. 3

సూర్యరశ్మిని, వాయువును ఏకకాలమందు గ్రహించినదై మరల, 'ఇవి నాయందుండుటకు యోగ్యమైనవి కావని తలంచి, నిరంతరము వాటిని త్యజించుచుండెను.

శుష్కాంచండాంశుకిరణైర్జర్జరాంవనవాయుభిః
అచలంతీం నిజాస్థానాత్స్నపితామిందురశ్మిభిః 4

సూర్యుని తీక్ష్ణకిరణసమూహము చేతను, ఆవనప్రదేశమందలి ఉష్ణవాయువుల చేతను, శుష్కించినదైయున్నను, చంద్రకిరణస్నాతవలె సానందముగనుండి తనస్థానమునుండి కదలకుండెను.



పూర్వంరజోణునైకేన సంవిష్టచ్ఛన్నమస్తకామ్
కృతార్థత్వంకథయతీం దదతాన్యస్యనాస్పదమ్. 5

ధూళికణ మొకదానిచే దాని ముఖము గప్పబడియుండెను. దానిచేనది తన కృతార్థతను ప్రకటించుచుండెను.

అరణ్యాన్యేవదత్త్వార్థం చిరంజాతశిఖామివ
మూర్ధ్న్యవస్థాపితప్రాణ జటాజూటవలీమివ. 6

ఆ గొప్పవనము వృక్షలతాదియుక్తమగు తన సౌందర్యము నంతను మరియొక వనమునకిచ్చి, తాను తపమొనరించుటకై, సూచీరూపమయ్యెనా యనియు యోగ పరిపాకముచే, శిరముపై ప్రాణముగు జటాజూట ముత్పన్నమయ్యెనాయనియు తోచుచుండెను.

తాంప్రేక్ష్యపవనఃసూచీం విస్మయాకులలోచనః
ప్రణమ్యాలోక్యసుచిరం భీతభీతఇవాగతః. 7

ఆ సూచికను గాంచి, వాయువాశ్చర్యమొందెను. మరియు, దానికి నమస్కరించి, భీతిఁ జెందినదై సమీపమునకు వచ్చెను.

మహాతపస్వినీసూచీ కిమర్థం తప్యతేతపః
నేతిప్రష్టుంశశాకాసౌ తత్తేజోరాశినిర్జితః. 8

దాని తపఃప్రభావముచే, పరాజితమగు నా వాయువు "ఓ మహాతపస్వినీ! నీ వేల తపమొనరించుచున్నా"వని యడుగజాలకపోయెను.

భగవత్యామహాసూచ్యా అహోచిత్రంమహాతపః
ఇత్యేవకేవలంధ్యాయన్ మారుతోగగనంయయౌ. 9
సముల్లంఘ్యాభ్రమార్గంతు వాతస్కంధానతీత్యచ
సిద్ధవృందానధః కృత్వా సూర్యమార్గముపేత్యచ. 10
ఊర్ధ్వమేత్య విమానేభ్యః ప్రాపశక్రపురాంతరే
సూచీదర్శనపుణ్యాంతమాలిలింగ పురందరః. 11
పృష్టశ్చకథయామాస దృష్టంసర్వంమయేత్యసౌ
సహదేవనికాయాయ శక్రాయాస్థానవాసినే. 12

"ఆహా! దేవియగు నీ సూచికయొక్క తప మతివిచిత్రమైనది." అని తలంచుచు వాయువు ఆకసమునకెగరి, మేఘమార్గమును, వాయుమండలమును, సిద్ధులలోకమును దాటి, సూర్యమార్గమును బొంది, ఆ పిదప విమానములద్వారా ఇంద్రపురిఁ జేర, నంత సూచిదర్శనమున పవిత్రుడైన అతని నింద్రుడు కౌగలించుకొనెను. ప్రశ్నించినమీదట నా వాయువు, తాను వృత్తాంత మరసివచ్చితినని, దేవసమూహయుతుడగు యింద్రునితో బల్కెను.

వాయురువాచ:—

జంబూద్వీపేఽస్తిశైలేంద్రో హిమవాన్నామసూన్నతః
జామాతా యస్యభగవాన్ సాక్షాచ్ఛశికలాధరః. 13

తస్యోత్తరే మహాశృంగ పృష్ఠే పరమరూపిణీ
స్థితా తపస్వినీ సూచీ తపశ్చరతి దారుణమ్. 14

బహునాత్ర కిముక్తేన వాతాద్యశనశాంతయే
యయాస్వోదరసౌషిర్యం పిండీకృత్వా నివారితమ్. 15

శాంతసంకోచసూత్మార్థం వికాసాస్యం రజోణునా
తయాద్యస్థగితం శీతవాతాశననివృత్తయే. 16

తస్యాస్తీవ్రేణ తపసా తుహినాకరముత్సృజన్
అగ్న్యాకారమయోగ్రుష్ణాన్ దేవ దుఃసేవ్యతాంగతః 17

తదుత్తిష్ఠాశు గచ్ఛామః సర్వ ఏవ పితామహమ్
తద్వరార్థమనర్థాయ విద్ధి తత్సుమహత్తపః 18

వాయువు:- ఓ ఇంద్రా! జంబూద్వీపమందు, చాలయెత్తైనదగు హిమవత్పర్వతమను గొప్ప పర్వతమొండుగలదు. దాని యల్లుడు మహాదేవుడు. దాని యుత్తరభాగముననున్న శిఖరముపై మహాతపస్వినియగు సూచిక ఉగ్రతపమాచరించుచున్నది. ఓ ఇంద్రా! ఈ విషయమై నధికముగ చెప్పనేల, వాయువునైనను భుజింపకుండుటకై అది తనశరీరమును లోహమయముగ నొనర్చుకొనెను. మరియు, అతిసూక్ష్మమగు తనయందలి రంధ్రమును, శీతవాయువు ప్రవేశింపకుండుటకై, ధూళికణముచే గప్పివైచెను. దాని తపఃప్రభావముచే హిమవత్పర్వతము తన నైజగుణమునువదలి, ఉష్ణత్వమును గ్రహించుచు దుఃఖితమగుచున్నది. కాన రమ్ము దానికి వరమిప్పించుటకొరకై, మనమందరము గలసి, బ్రహ్మదేవునిపద్దకు బోవుదము. ఏలయన దాని తీవ్రతపము లోకానర్థము కొరకేయని తెలిసికొనుము.

ఇతి వాతేరితః శక్రః సహ దేవగణేన సః
జగామ బ్రహ్మణో లోకం ప్రార్థయామాస తం విభుమ్. 19

సూచ్యా వరమహం దాతుం గచ్ఛామి హిమవచ్ఛిరః
బ్రహ్మణేతి ప్రతిజ్ఞాతే శక్రః స్వర్గముపాయయౌ. 20

ఇట్లు వాయువుచే ప్రేరితుడై, యింద్రుడు దేవతలందరితోడనుగూడి బ్రహ్మయొద్దకేగి వానిని బ్రార్థించెను. అంత బ్రహ్మదేవుడు సూచికకు వరమొసంగుటకై తాను హిమవత్పర్వత శిఖరముపైకిపోవుచున్నానని జెప్ప, నదివిని యింద్రుడు తనస్వస్థానమున కఱిగెను.

ఏతావతాథ కాలేన సాబభూవాతిపావనీ
సూచీ నిజతపస్తాపతాపితామరమందిరా. 21

చాలకాలము (ఏడువేల సంవత్సరములు) తపస్సుచేయుటచే, దేవలోకమునుగూడ తపింపజేయు నా సూచిక పవిత్రయయ్యెను.

ముఖరంధ్రస్థితా ర్కాంశు దృశా స్వచ్ఛాయయైవ సా
వికాసిన్యాపి వర్తిన్యా చోదితా ముమవేక్షితా. 22



ఆ నిర్జనవనమందు దాని తపస్సును గాంచువారు తన (ఛిద్రమునుండి ప్రసరించిన సూర్యకిరణముచే యేర్పడిన) ఛాయతప్ప మరెవరును లేదు.

కౌశేయరూపయా సూచ్యా మేరుః స్థైర్యేణ నిర్జితః
మజ్జనం నైతి వృద్ధ్యైవం ముక్తమాద్యంతయోర్దినే. 23

మధ్యాహ్నే తాపభీత్యేవ విశంత్యామారుతాంతరమ్
అన్యదా గౌరవాద్దృష్ట్వా దూరతః ప్రేక్షమాణయా. 24

పట్టుదారమువలె సూక్ష్మమైన సూచికచే పరాజితుడగు మేరువు, లజ్జచే సముద్రమున ప్రుంగునట్లుండెను. కనుకనే, ఉదయ సాయం రాత్రులందు, దానిఛాయ, సూచికను చూచుటమాని, ఆ లజ్జితుడగు మేరువును జూచుటకుబోయెనా, యనిపించుచుండెను. ఆ ఛాయ మధ్యాహ్నకాలమందు, తాపభీతిచే సూచిక ప్రాణములందు ప్రవేశించును. తక్కిన సమయములందు సూచికను చూచుచునే యుండును.

సా తామవేక్షతే దూరాత్తాపాదంగే నిమజ్జతి
సంకటే విస్మరత్యేవ జనో గౌరవసత్క్రియామ్. 25

సూచిక నాఛాయ జాగరూకతతో వీక్షించుచుండును. అది తాపాధిక్యము గల్గునపుడు దాని యంగములందు లీనమగును. విపత్సమయముల జనులు తరచుగ తమ కర్తవ్యమును మరచుట ప్రసిద్ధమే గదా!

ఛాయాసూచీ తాపసూచీ యశ్చాత్మా సతృతీయయా
త్రికోణం తపసా పూతం వారాణస్యా సమం కృతమ్. 26

ఛాయాసూచి, జీవసూచి, లోహసూచి, ఈ మూడును పరస్పరము కూడియుండుటచే, తపస్సుచే పవిత్రమైన, తమయుక్త ప్రదేశమును అసీ, వరణ, గంగానదుల, మధ్యగల కాశివలె, పుణ్యవంతముగా జేసెను.

గతాస్తేన త్రికోణేన త్రివర్ణపరిఖావతా
వాయవః పాంసవో యేఽపి తేపరాం ముక్తిమాగతాః. 27

గంగా, యమునా, సరస్వతీ, నదులవలె శుక్ల కృష్ణాది వర్ణములుగల యామూడు సూచికలును చేరిన త్రికోణాకార ప్రదేశమందు ప్రవేశించిన వాయువు, ధూళి, మొదలగునవికూడ పవిత్రవంతములై ముక్తిని జెందుచుండెను.

విదితపరమకారణాద్యజాతా స్వయమనుచేతనసంవిదం విచార్య
స్వమననకలనానుసారపక్తి స్విహహి గురుః పరమో న రాఘవాన్యః. 28

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కర్కట్యుపాఖ్యానే సూచీతపః పరిపాకవర్ణనం నామ చతుఃసప్తతితమః సర్గః ॥ 74 ॥

ఓ రామచంద్రా! ఇపుడా రాక్షసి, ఆత్మతత్త్వమును గూర్చి విచారించినదై, పరమ కారణమగు బ్రహ్మము నెరింగెను. యుక్తులచే బాగుగ విచారించి ఆత్మజ్ఞానమునుబడసి, అద్దాని ననుసరించుట యనునదే ముఖ్యమైన గురువు. దీనికిమించిన గురువు మరియొకడు లేడు.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున సూచీతపఃపరిపాకవర్ణనమను చతుఃసప్తతితమ సర్గము. ॥74॥

## పంచసప్తతితమః సర్గః

---

శ్రీ వసిష్ఠ ఉవాచః—

అథవర్షసహస్రేణ తాంపితామహఆయయౌ
వరంపుత్రిగృహాణేతి వ్యాజహార నభస్తలాత్. 1

ఇట్లు జ్ఞానోదయమైన పిమ్మట వెయ్యి సంవత్సరములు గడువ, బ్రహ్మదేవుడు సూచిక వద్దకుబోయి, “ఓ పుత్రీ! వరమడుగుమ”ని యాకసమునుండి బల్కెను.

సూచీకర్మేంద్రియాభావా జీవమాత్రకలావతీ
నకించిద్వ్యాజహారాస్మై చింతయామాస కేవలమ్. 2
పూర్ణాస్మిగతసందేహా కింవరేణకరోమ్యహమ్
శామ్యామి పరినిర్వామి సుఖమాసేచ కేవలమ్. 3
జ్ఞాతంజ్ఞాతవ్యమఖిలం శాంతాసందేహజాలికా
స్వవివేకో వికసితః కిమన్యేనప్రయోజనమ్. 4
యథాస్థితేయమస్మీహ సంతిష్ఠేయంతథైవహి
సత్యాసత్యకలామేవ త్యక్త్వాకిమితరేణమే. 5
ఏతావంతమహంకాల మవివేకేనయోజితా
స్వసంకల్పసముత్థేన వేతాలేనేవబాలికా. 6
ఇదానీముపశాంతోఽసా స్వవిచారణయాస్వయమ్
ఈప్సితానీప్సితైరర్థైః కోభవేత్కలితైర్మమ. 7

కేవలము జీవమాత్రము గల్గి, కర్మేంద్రియములన్నియు లేని కారణముచే, నా సూచికేమియు ప్రత్యుత్తర మీయక యిట్లు చింతించెను. “నా సంశయములు నశించినవి, పూర్ణత్వమును, బడసితిని. ఇక వరములతో నాకేమిపని? శాంతమును, తృప్తిని, సుఖమును, పొందుచున్నాను తెలిసికొనదగిన దంతయు తెలిసికొంటిని. నాకు వివేకము సంప్రాప్తించినది. ఇక మరియొకదానితో నగత్యమేమి? ఇపుడెట్లుంటినో ఇకముందును, అట్లనేయుండగలను. నేను సత్యస్వరూపిణియైయుండ



ఇక మిథ్యయగు వస్తువులనేల యాశించవలెను? బాలిక, తనచే కల్పింపబడిన బేతాళముచే భయ మొందులాగున, నేనింతవరకు అవివేకముతో గూడియుండి దుఃఖపడుచుంటిని, ఇపుడాత్మ విచారణచే, నవివేకమంతయు శమించినది. ఇష్టానిష్టములచే నిక నేమి ప్రయోజనము?”

ఇతినిశ్చయయుక్తాంతాం సూచీంకర్మేంద్రియోజ్ఝితామ్
తూష్ణీంస్థితాం సనియతిః సపశ్యన్భగవాన్స్థితః. 8

ఇట్లు నిశ్చయించుకొనుచున్న (కర్మేంద్రియములు లేనందుచే) మౌనధారిణియగు సూచిని, నియతియుక్తుడగు బ్రహ్మదేవుడు తిలకించుచు నుండెను.

బ్రహ్మపునరువాచేదం వీతరాగాంప్రసన్నధీః
వరంపుత్రిగృహాణత్వం కించిత్కాలంచభూతలే. 9
భోగాన్భుక్త్వాతతః పశ్చాద్గమిష్యసి పరంపదమ్
అవ్యావృత్తిస్వరూపాయా నియతేరేషనిశ్చయః. 10

బ్రహ్మదేవుడు ప్రసన్నుడై, రాగరహితయగు సూచికతో నిట్లనియె – ఓ పుత్రీ! వరము గైకొనుము. మరియు కొంతకాలమువరకీ భూతలముపై భోగముల ననుభవింపుము. ఆ పిదప యుత్తమమగు బ్రహ్మపదముం జెందెదవు. ఇది ఈశ్వర నియతి. ఇద్దానిని మేమును యేమియు చేయజాలము.

తపసానేనసంకల్పః సఫలోస్తుతవోత్తమే
పీనాభవపునఃశైలే హిమకాననరాక్షసీ. 11

ఈ తపస్సుచే నీ సంకల్ప మీడేరుగాక! మరల నీవు విశాలశరీరమును బడసి హిమాలయముపై సంచరించు రాక్షసివగుము.

యయాపూర్వం వియుక్తాసి తన్వాజలదరూపయా
బీజాంతర్వృక్షతాపుత్రి బృహద్వృక్షతయాయథా. 12
యోగమేష్యసిభూయశ్చ తన్వాంతర్బీజరూపిణీ
తయైవరససేకేన లతయేవాంకురస్థితిః 13

బీజమందు, వృక్షమంతయు సూక్ష్మరూపమున నుండునట్లును, నీరుపోసిన నయ్యది అంకురించునట్లును, నీవును నీయందంతర్భూతమైయున్న నీ పూర్వదేహమును మరల పొందియుండుము.

బాధాంవిదితవేద్యత్వా న్నచలోకే కరిష్యసి
అంతఃశుద్ధా స్పందవతీ శారదీవాభ్రమండలీ। 14

చిత్తశుద్ధిచే, వేద్యమగు పరబ్రహ్మము నెరింగితివిగాన, నీవు నీపూర్వదేహమును పొందినను, శరత్కాల మేఘమువలె, లోకమునకు బాధ గలుగజేయక యుండెదవు.

అశ్రాంతధ్యాననిరతా కదాచిల్లీలయాయది
భవిష్యసి బహీరూపా సర్వాత్మధ్యానరూపిణీ. 15

ఓ పుత్రీ! నీవెల్లప్పుడు నిర్వికల్పసమాధియందే యుందువు. ఎపుడైనను సమాధినుండి లేచిన, సర్వులను ఆత్మస్వరూపులుగ జూచెదవు.

వ్యవహారాత్మకధ్యాన ధారణాధారరూపిణీ
హాతస్వభావవద్దేహపరిస్పందాద్విలాసినీ. 16

వ్యవహార దృష్టియందు నీవు ధారణ, ధ్యానాదుల నవలంబించి యుండుము. వాయువు తన స్వభావమగు చలనమును బొందియుండు లాగున నీశరీరమును చేష్టాయుక్తమై యుండగలదు.

తదావిరోధినీపుత్రి స్వకర్మస్పందరోధినీ
న్యాయేనక్షున్నివృత్త్యర్థం భూతబాధాంకరిష్యసి. 17

అపుడు నీవు, నీ రాక్షసకులమునకుచితమగు అశాస్త్రీయ హింసను నిరోధించెదవు. న్యాయోచితముగ, క్షుధానివృత్తికి మాత్రమే నీవు ప్రాణుల హింసించెదవు.

భవిష్యసిన్యాయవృత్తి ర్లోకేత్వన్యాయబాధికా
జీవన్ముక్తతయాదేహే స్వవివేకైకపాలికా 18

ఓ పుత్రీ! నీవు లోకమందు న్యాయవృత్తి నవలంబించెదవు. న్యాయము నతిక్రమించు వారల బాధించెదవు. మరియు జీవన్ముక్తవై వివేకముగల్గి యుండెదవు.

ఇత్యుక్త్వాగగనతలాజ్జగామదేవః సూచీసాభవతుమమేతికిం విరోధః
రాగోవాబ్జజవచనార్థవారణేఽస్మి న్నిత్యంతఃస్వతనుమయీమనాగ్బభూవ.
ప్రాదేశఃప్రథమమభూత్తతోఽపిహస్తోవ్యామశ్చాప్యథవిటపస్తతోఽభ్రమాలా
సోద్యత్స్వావయవలతాబభౌ నిమేషాత్సంకల్పద్రుమకణికాంకురక్రమేణ. 20

ఓ రామచంద్రా! ఆబ్రహ్మదేవుడిట్లాకసమునుండి బల్కి తనస్థానమునకుజనెను. ఆ రాక్షసియు, 'దీనికి విరోధమేమి, బ్రహ్మదేవుని వచనమేల నిరాకరింపవలెను' అని తలంచి, క్రమముగ తన మనంబున పూర్వశరీరాకారము జింతించుచు, మొదట యంగుష్ఠప్రమాణమును, ఆపిదప హస్తాకారమును పురుషప్రమాణమునునై, పిమ్మట వృక్షమంతయు, మేఘాకారముగను నాయెను. ఇట్లా సూచిక యొక్క సంకల్పబీజము క్రమముగ విశాలవృక్షమయి, అవయవములను లతలతో నొప్పుచుండెను.

తద్గాత్రాణ్యవికలశక్తిమంతిదేహః దుద్భూతాన్యథకరణేంద్రియాణిసమ్యక్
సంకల్పద్రుమవనపుష్పవత్సమంతా ద్బీజౌఘాన్యలమభవం స్తిరోహితాని. 21

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కర్కట్యుపాఖ్యానే సూచీశరీరలాభోనామ పంచసప్తతితమః సర్గః ॥ 75 ॥

సంకల్పముచే, వన, వృక్ష, పుష్పాదులావిర్భవించునట్లును, జల, మృత్తికాదుల సంయోగముచే బీజమందు సూక్ష్మముగ దాగియున్న వృక్షము మరల విజృంభించునట్లును, ఆరాక్షసికి పూర్వపు అవయవాదులన్నియు మరల నుత్పన్నమయ్యెను.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున సూచీశరీరలాభమను పంచసప్తతితమ సర్గము ॥ 75 ॥

———:0:———

# షట్సప్తతితమః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అథాభవదసౌసూచీ కర్కటీరాక్షసీపునః
సూక్ష్మేవస్థౌల్యమాయాతా మేఘలేఖేవవార్షికీ. 1

వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! అవయవములన్నియు నావిర్భవించుటచే నా కర్కటి, వర్షాకాలమేఘమువలె క్రమముగ స్థూలత్వమునందెను.

నిజమాకాశమాసాద్య కించిత్ప్రముదితాపతీ
బృహద్రాక్షసభావంతద్బోధాత్కంచుకవజ్జహౌ. 2

చిత్స్వరూప ప్రాప్తిచే, ప్రసన్నయైన యారాక్షసి జ్ఞానోదయమున, బహుకాలము తనయందు స్థితినిబడసియున్న రాక్షసస్వభావమును, సర్పము కుబుసమును విడచునట్లు, తొలగించివైచెను.

తత్రైవధ్యాయతీతస్థౌ బద్ధపద్మాసనస్థితిః
వ్యాలంబ్యసంవిదంశుద్ధాం సంస్థితాగిరికూటవత్. 3

ప్రాపంచిక వాసనలులేక, శుద్ధజ్ఞానము నాశ్రయించి, ఆత్మధ్యానపరాయణయై, పద్మాసనమువైచికొని, పర్వతమువలె స్థిరముగనుండెను.

అథసామాసషట్కేన ధ్యానాద్బోధముపాగతా
మహాజలదనాదేన ప్రావృషీవ శిఖండినీ. 4

ఆరునెలలు గడచినతరువాత, వర్షాకాలమందు నెమలివలె, ఆరాక్షసి సమాధినుండిలేచెను.

ప్రబుద్ధాసాబహిర్వృత్తి ర్బభూవక్షుత్పరాయణా
యావద్దేహం స్వభావోఽస్య దేహస్య ననివర్తతే. 5

సమాధినుండిలేచి బాహ్యవృత్తిగలది కాగా, ఆకుడాకటిచే బాధితయయ్యెను. ఏలన, శరీరమెంతవరకుండునో, అంతవరకు దాని స్వభావముండియే తీరును.

అథసాకింగ్రసఇతి చింతయామాసచింతయా
భోక్తవ్యః పరజీవశ్చ న్యాయేన నవినామయా. 6

పిదప నయ్యది, 'నేనెవరిని బాధించెదనని' తలంచినదై, న్యాయమతిక్రమించి యేజీవిని హింసింపరాదని నిశ్చయించుకొనెను.

యదార్యగర్హితం యద్వా న్యాయేన ననమర్జితమ్
తస్మాత్తాగ్రాసాద్వరమన్యే మరణందేహినామిదమ్. 7

పూజ్యులగు మహాత్ములచే గర్హింపబడినదియు, అన్యాయోపార్జితమునునగు పదార్థమును భుజించుటకంటె మరణించుటయే యుత్తమమని నేను తలంచెదను.

యదిదేహంత్యజామీదం తన్న్యాయోపార్జితంవినా
నకించిదస్తి నిర్న్యాయం భుక్తోఽర్థోహి గరాయతే. 8

న్యాయోపార్జితమగు యన్నములభించనందువలన, యీ శరీరము నశించినను, అందు దోషమేదియులేదు కాని, అన్యాయార్జితమగు యన్నము విషతుల్యమైనది.

యత్రలోకక్రమంప్రాప్తం తేనభుక్తేనకింభవేత్
నజీవితేన నోమృత్యా కించిత్కారణమస్తిమే. 9

లోకసమ్మతమగు విధమున పొందని, భోజనముచేనేమిఫలము? మరియు, నాకు జీవితముచేగాని, మరణముచేగాని యేమి ప్రయోజనము?

మనోమాత్రమహంవ్యాసం దేహాదిభ్రమభూషణమ్
తచ్ఛాంతంస్వావబోధేన దేహాదేహాదృశాకుతః. 10

నాదేహము కేవలము సంకల్పమాత్రమే, దేహాభిమానము ఆత్మజ్ఞానముచే రహితమైనందున, ఇక నాకు జీవనమరణముల దృష్టియెచట?

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఏవంస్థితామానవతీ శుశ్రావగగనాద్గిరమ్
రక్షఃస్వరూపసంత్యాగ తుష్టేనోక్తాంనభస్వతా. 11

వసిష్ఠుడు:— ఇట్లు తలంచుచు నా రాక్షసి మానమువహించెను. కర్కటి తన రాక్షస స్వభావమున త్యజించినందున, సంతుష్టుడై, వాయువు ఆకసమునుండి నిట్లుపల్కెను —

గచ్ఛకర్కటి మూఢాంస్త్వం జ్ఞానేనాశ్వవబోధయ
మూఢోత్తారణమేవేహ స్వభావో మహతామితి. 12

బోధ్యమానోభవత్యాపి యోనబోధముపైష్యతి
స్వనాశాయైవజాతోఽసౌ న్యాయ్యోగ్రాసోభవేత్తవ. 13

ఓ కర్కటీ! నీవజ్ఞానుల సమీపించి, వారలకు జ్ఞానోపదేశముచేయుము. మూఢుల యజ్ఞానము తొలగించుటయే మహాత్ముల స్వభావము. అట్లు నీవు బోధించినను, బోధితుడుకానివాడు తననాశనముకొరకే యుత్పన్నమాయెనని తలంచుము. అట్టివాడు నీకు న్యాయముగ లభించిన యాహారమగును.

శ్రుత్వేత్యనుగృహీతాస్మి త్వయేత్యుక్తవతీశనైః
ఉత్థాయ శైలశిఖరా క్రమాదవరురోహచ. 14
అధిత్యకామతీత్యాశు గత్వాచోపత్యకాతటాత్
వివేశ శైలపాదస్థం కిరాతజనమండలమ్. 15

అదివినిన కర్కటి, "నీవు నన్ననుగ్రహించితివని" బల్కి, యచటనుండి లేచి, ఆ పర్వత శిఖరముపైనుండి దిగి, శీఘ్రముగ, వనభూములఁ దాటి, యా పర్వతపాదతలమున నున్న కిరాతుల రాజ్యమును బ్రవేశించెను.

బహ్వన్నపశులోకౌఘ ద్రవ్యశష్పౌషధామిషమ్
అనంతమూల పానాన్న మృగకీటఖగాదికమ్. 16

ఆ ప్రదేశము సస్యసమృద్ధిగల్గి, పశు, ద్రవ్యాదులతో తులతూగుచు, వివిధములగు కందమూలములతోను, కీట, పక్షి, మృగాదులతోను శోభించుచుండెను.



ప్రచలితవలితాంజనాచలాభా హిమగిరిపాద నివేశితంసుదేశమ్
తదనుగతవతీనిశాచరీ సా నిశిసుఘనాంధతమిస్రమార్గభూమౌ. 17

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కర్కట్యుపాఖ్యానే అన్యాయబాధికోనామ షట్సప్తతితమః సర్గః ॥ 76 ॥

రాత్రిసమయమున, కృష్ణవర్ణయగు నా రాక్షసి, హిమాలయ పర్వత ప్రాంతమునందలి అంధకారావృతమయియున్న ఆ జనపదమందు బ్రవేశించెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున అన్యాయబాధికమను షట్సప్తతితమ సర్గము ॥ 76 ॥

## సప్తసప్తతితమసర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఏతస్మిన్నంతరే తత్ర కిరాతజనమండలే
హాస్తహార్యతమః పిండా బభూవాసితయామినీ. 1
నీలమేఘ పటచ్ఛన్నా నిరిందుగగనాంతరా
తమాలవనసంపిండా మాంసలోడ్డీనకజ్జలా. 2
లతాఘనతయాగ్రామ కోటరైకాంధ్యమంథరా
గృహాచత్వరసంబాధే నగరే నవయౌవనా. 3
చత్వరేషుతమఃపిండీ ప్రజిహ్మీకృతదీపికా
కుంచితచ్ఛిద్రనిష్క్రాంతా దీపికారోచిరాజితా. 4
సువయస్యేవ కర్కట్యాః పరినృత్యత్పిశాచికా
మత్తవేతాలకంకాల కాష్ఠమానమివాస్థితా. 5
సుషుప్త మృగభూతౌఘ ఘననీహారహారిణీ
మందమందమరుత్స్పర్శ లసత్ప్రాలేయసీకరా. 6
సరఃసు నివటద్వారి కాకభేకతరంగికా
అంతఃపురేషురమణ రణన్నారీనరాననా. 7
జంగలేషు జగజ్జ్వాలా జటాలజ్వలనోజ్జ్వలా
కేదారేష్వంబుసంసేక పృష్ఠపాకమిలచ్ఛలా. 8

నభస్థలేక్షితస్పంద ప్రవివిక్తర్క్షచక్రికా
వనేషువిసరద్ధ్వాంత పతత్పుష్పఫలద్రుమా. 9
శ్వభ్రేషుకౌశికస్వాంత ర్వ్యాయసవ్యాహృతారవా
తస్కరాక్రాంతపర్యంత గ్రామ్యాక్రందనకర్కశా. 10
విపినే విపినామానా నగరేసుప్తనాగరా
వనేషు విసరద్ధ్వాంతా నీడేష్వస్పందపక్షికా. 11
గుహాసు సుప్తసింహాఢ్యా కుంజేషుస్వపదేణకా
ఖే సావశ్యాయనికరా విపినేమానచారిణీ. 12
కజ్జలాంభోదమధ్యాభా కాచశైలోదరోపమా
పంకపిండాంతరఘనా ఖడ్గచ్ఛేద్యాంధ్యమాంసలా. 13
ప్రలయానిలవిక్షుబ్ధ కజ్జలాచలచంచలా
ఏకార్ణవమహాపంక పర్వతోదరమేదురా. 14
అంగారకోటరఘనా సౌషుప్తపదసుందరీ
అజ్ఞాననిద్రానిబిడా భృంగపృష్ఠచ్ఛదచ్ఛవిః. 15

వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! అట్టిసమయమున కిరాతులరాజ్యమందు అంధకారము వ్యాపించియుండెను. హస్తముచే గ్రహింపజాలునంత దట్టముగ చీకటి క్రమ్ముకొనెను. ఆరాత్రియందు యాకసము మేఘాచ్ఛన్నమై యుండెను. చంద్రుడాకాశమునుండి తలుమబడెను. తమాల వృక్షములందును, వనమందు దట్టముగ నల్లుకొనిన తీగెలందును, కాటుకకంటె నలుపైన చీకటి వ్యాపించియుండెను. దీపపుప్రకాశము యిండ్లకిటికీలనుండి కొంచెము కొంచెముగా బాహ్యప్రదేశమునఁ బ్రసరించుచుండెను. పిశాచములు, మదించిన బేతాళములు నృత్యము సల్పుచుండెను. అపుడు, మనుజులు, మృగములు, తక్కిన ప్రాణులు, అన్నియును నిదురించుచుండెను. మంచు దట్టముగా వ్యాపించియుండెను. పిల్లవాయువులు మెల్ల మెల్లగ వీచుచుండెను. చెరువులలోను, గోతులలోను, కప్పలు మొదలగునవి శబ్దమొనర్చుచుండెను, పొలములలో ధాన్యమంతయు పరిపక్వమై యుండెను. ఆకసమున నక్షత్రములు ప్రకాశించుచుండెను, వాయుచలనముచే, ఉద్యానవనమందలి ఫలపుష్పాదులు క్రిందకు రాలుచుండెను, వృక్షకోటరములందు గుడ్లగూబలరచుచుండెను. చోరులాక్రమించినందున కొందరు భయవిహ్వలులై శబ్దమొనర్చుచుండిరి. గూళ్లయందు పక్షులు చేష్టారహితములై నిదురించుచుండెను. గుహలందు సింహములు పరుండియుండెను. పొదలలో ఘాతుక మృగములు తిరుగాడుచుండెను. ఆ భయంకరమగు రాత్రి మౌనధారిణియు, నల్లనివర్ణము గలదియు, దీర్ఘశరీరియు, అంధకారముచే పోషింపబడినదియు, సముద్రమువలె విశాలమును, పర్వతమువలె ఘనమును నయియుండెను. అట్టి సమయమున, కర్కటి ఆ కిరాతుల రాజ్యమండలమునఁ బ్రవేశించెను.

తస్యాంరజన్యాంభీమాయాం కిరాతజనమండలే
మంత్రిణాసహభూపాల స్తస్మిన్నవసరే తదా. 16
నిర్గగామసుధీరాత్మా నగరాత్సుప్తనాగరాత్
అటవీం విక్రమోనామ విషమాం వీరచర్యయా. 17



భయంకరమగు నారాత్రియందు, కిరాతుల రాజ్యమండలమందు, ధీశాలియు, వీరుడును, కిరాతుల ప్రభువుననగు విక్రముడను నాతడు నగరనివాసులందరు నిద్రించుచుండ, నగరమునుండి బయలుదేరి దుష్టజీవుల సంహరించుటకై, యరణ్యమునకు బోయెను.

అటవ్యాం కర్కటీసాతౌ చరంతౌరాజమంత్రిణౌ
అవశ్యద్ధృతధైర్యాస్త్రౌ వేతాలాలోకనోన్ముఖౌ. 18

ధైర్యోపేతులును, ఆయుధప్రాణులును, బేతాలాదులఁ గాంచుటయందు తత్పరులును ఆ అరణ్యమున సంచరించుచున్న వారలుననగు రాజమంత్రులను, కర్కటి గాంచెను.

అథ సాచింతయామాస లబ్ధోభక్ష్యోహ్యహోమయా
మూఢావేతావనాత్మజ్ఞౌ భారోదేహాఃకిలానయోః. 19

వారినిజూచి యయ్యదిట్లు తలపోసెను – ఆహా! నాకిపుడు భోజనము లభించినది. ఏలన, వీరిరువురు ఆత్మజ్ఞానశూన్యులు, అజ్ఞానులగు వీరియొక్క దేహములు నిశ్చయముగ భూభారములేయగును.

ఇహాముత్రచనాశాయ మూఢోదుఃఖాయజీవతి
యత్నాద్వినాశనీయోఽసౌ నానర్థః పరిపాల్యతే. 20

మూఢుడిహ పరలోకములందును, దుఃఖ నాశములకొఱకే జీవించును. కాన, వీరిరువురిని యత్నముచే వధింపవలెను. ఏలన, అనర్థమునుగల్గజేయు ప్రాణులను రక్షింపరాదు.

అపశ్యతఃస్వమాత్మానం మృతిర్హ్యాఢస్యజీవితమ్
మరణేనోదయోఽస్యాస్తి పాపానంపత్తిహేతుతః. 21

తన యాత్మనెరుంగని మూఢుడు జీవించుటకంటె, మరణించుటయే శ్రేష్ఠము. అట్టి పాపికి మరణమే సహేతుకమైనది.

ఆదిసర్గేచనియమః కృతఃపంకజజన్మనా
హింస్రాణాం భోజనాయాస్తు మూఢాత్మానాత్మవానితి. 22

ఆత్మజ్ఞానులుకానివారు మూఢులును, అజ్ఞానులును, మాత్రమే హింసా స్వభావముగల జీవులకు భోజ్యమగునని సృష్టాదియందు బ్రహ్మదేవుడు నియమించెను.

తస్మాదిమావమైవాద్య భోక్తవ్యౌభోజ్యతాంగతౌ
అభవ్యపవనిర్దోషం ప్రాప్తమర్థముపేక్షతే. 23

కాన, వీరిద్దరును నాకు భోజ్యమగుదురు. మరియు నేడే వీరల భుజింపవలెను. న్యాయముగ సంప్రాప్తించిన భోజనమును త్యజించువాడు మందభాగ్యుడే యగును.

కదాచిత్త్వావిమౌస్యాతాం గుణయుక్తౌ మహాశయౌ
తాదృశ్నరవినాశోహి స్వభావాన్మేనరోచతే. 24

వీరలు, ఆత్మజ్ఞానయుక్తులగు మహాత్ములేయైనచో అట్టివారిని వధించుట నాకుతగదు. మరియు నట్లుచేయుట నా స్వభావమున్ను గాదు.

తదేతౌ సంపరిక్షేఽహం యదితాదృగ్గుణాన్వితౌ
తద్భుక్తం నకరోమ్యేతౌ నహింస్యాంగుణినఃక్వచిత్. 25

కాన, వీరిని పరీక్షించెదను. ఉత్తమ గుణాన్వితులగుచో, వీరిని భుజింపను. గుణవంతుల నెన్నటికిని హింసింపను.

అకృత్రిమం సుఖంకీర్తి మాయుశ్చైవాభివాంఛతా
సర్వాభిమతదానేన పూజనీయాగుణాన్వితాః. 26

ఉత్తమసుఖము, కీర్తి, ఆయువు నభిలషించువాడు, యిష్టపదార్థము లన్నింటిని సమర్పించి గుణవంతుల బూజింపవలెను.

అపినంత్యామిదేహేన నైవభోక్ష్యేగుణాన్వితమ్
సుఖయంతిహిచేతాంసి జీవితాదపిసాధవః. 27

నా శరీరము నశించిపోయిననుసరియేకాని గుణవంతు నెన్నటికిని భుజింపను. ఆత్మజ్ఞానులగు సాధువులు, తమచిత్తములను జీవితముకంటె ఎక్కుడు సుఖవంతముగ జేయుదురు (అనగా, శరీరపోషణ కంటె మానసిక (ధర్మ) రక్షణనే యెక్కువగ తలంతురు.)

అపిజీవితదానేన గుణినం పరిపాలయేత్
గుణవత్సంగమాసాద్యా మృత్యురప్యేతి మిత్రతామ్. 28

తన జీవితమైనను నర్పించి గుణవంతుని రక్షింపవలయును. ఏలయన, గుణవంతుని సాంగత్యమును పొందుటచే, మృత్యువుగూడ సుఖప్రదమై మిత్రునివలె తోచును.

యత్రాహమపిరక్షామి రాక్షసీగుణశాలినమ్
తత్రాన్యఃకోనకుర్యాత్తం హృదిహారమివామలమ్. 29

రాక్షసియగు నేనే గుణవంతుల రక్షించుచో, ఇక నట్టివారిని యెవరు తమ హృదయ మండలి హారముగ నొనర్పరు. (ఆదరింపరు)?

ఉదారగుణయుక్తాయే విహరంతీహ దేహినః
ధరాతలేందవఃసంగా ద్భుక్షంశీతలయంతితే. 30

ఉత్తమగుణాన్వితులయి, యీ ప్రపంచమున విహరించు సజ్జనులు, భూమిపై చంద్రుని వంటివారు. వారు తమ సాంగత్యముచేతను, అమృతమయములగు గుణములచేతను జనుల హృదయము లందు శాంతి, నెలకొల్పుదురు.

మృతిర్గుణితిరస్కారో జీవితంగుణిసంశ్రయః
ఫలంస్వర్గాపవర్గాది జీవితాద్గుణిసంశ్రితాత్. 31

గుణవంతుల తిరస్కరించుటయే మృత్యువు. ఆశ్రయించుటయే జీవితము. ఏలన, గుణవంతుల సహవాసముచే స్వర్గమోక్షాది ఫలములు సిద్ధించును.

తస్మాదిమౌపరీక్షేఽహం కయాచిత్ప్రశ్నలీలయా
కిమమూజ్ఞానకావేతావితి తామరసేక్షణా. 32-



కాన, కమల నేత్రములగు వీరిరువురియందును గుణములేవిగలవో, కొన్ని ప్రశ్నలరూపమున లీలామాత్రముగ బరీక్షించెద.

ఆదావిచార్యసుగుణాగుణలేశయుక్తిం పశ్చాచ్చిత్స్వాత్తోధికతరంచగుణైర్యదిస్యాత్
కుర్యాత్తతః సముపపత్తివశేనదండం దండ్యస్యయుక్తినదృశం ఘనసంభవేన. 33

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కర్కట్యుపాఖ్యానే కర్కటీరాక్షసీ విచారోనామ సప్తసప్తతితమః సర్గః ॥ 77 ॥

మొదట గుణలేశముచేతనే వీరుగుణవంతులా, గుణహీనులాయని నిర్ణయించి, పిదప, వారి విషయమై యధికముగ విచారించి, గుణహీనులైరేనచో, శాస్త్రోచితదండన విధించుటయు, గుణవంతులైరేనచో దండింపకుండుటయు, నొనరించుట యుక్తము.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున కర్కటీరాక్షసీ విచారమను సప్తసప్తతితమ సర్గము ॥ 77 ॥

## అష్టసప్తతితమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

అథసారాక్షసీ రక్షః కులకాననమంజరీ
తమస్యేవాభ్రలేఖేవ గంభీరంవిననాదహ. 1

నాదాంతేనమువాచేదం హుంకారావరుమంవచః
గర్జితానంతరంజాత శరకాలనిశబ్దవత్. 2

వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! అటుపిమ్మట రాక్షసకుల వనమునకు లతవంటిదగు నా రాక్షసి ఆయంధకారమున మేఘగర్జనగావించి, పాషాణవృష్టివలె నిష్ఠురవాక్యముల నిట్లు బల్కసాగెను.

భోభోఘోరాటవీవ్యోమపదవీశశిభాస్కరౌ
మహామాయాతమఃవీర శిలాకోటరకీటకౌ. 3

కౌభవంతౌమహాబుద్ధీ దుర్బుద్ధీవా సమాగతౌ
మద్గ్రాసపదమాపన్నౌ క్షణాస్మరణోచితౌ. 4

ఈ ఘోరారణ్యమను యాకాశమున చంద్రసూర్యులును, సమస్త ప్రాణులకు నాధారభూత మగు అజ్ఞానపీఠము నలంకరించు వారలును నగు ఓ దుష్టులారా! మీరెవరు? ఇచటికేల వచ్చితిరి? ఇప్పుడొక క్షణములో మృత్యువ్రాత బడెదరు, నాచే మ్రింగబడుటకే మీరిటకు వచ్చితిరి.

రాజోవాచః—

భోభోభూతకకింస్యాత్త్వం క్వతిష్ఠసిచ దేహకమ్
దర్శయాస్యాత్తవగిరః కోబిభేత్యలినిధ్వనేః. 5

రాజు:- ఓరీ తుచ్ఛుడా! నీ వెవరవు? ఎచట నున్నావు? నీ యల్పశరీరమును జూపుము. తుమ్మెద ధ్వనివంటి నీయఱపులచే నెవరు భయపడెదరు?

సింహవత్సర్వవేగేన పతంత్యర్థే కిలార్థినః
త్యజసంరంభమారంభం స్వసామర్థ్యం ప్రదర్శయ. 6

నీచుడు తానభిలషించిన పదార్థములపై సింహమువలె బహువేగముతో వచ్చిపడును. ఇక నీవు క్రోధమును త్యజించి, యితరుల భయపెట్టుటమాని నీ సామర్థ్యమును జూపుము.

కిం ప్రార్థయసి మే బ్రూహి దదామి తవ సువ్రత
కిం వా సంరంభశబ్దాభ్యాం భీషయాస్మాన్బిభేషి కిమ్. 7

ఓ సువ్రతా! నీవు దేనిని కోరుచున్నావు? వచింపుము. అద్దానిని నీ కిచ్చెదను. నీ క్రోధముతో, మా కేమిపని? నీ భయంకరశబ్దముల విని నీవే భీతిఁ జెందుట లేదుగదా!

క్షిప్రమాకారశబ్దాభ్యాం మాయయాసన్ముఖీభవ
న కించిద్దీర్ఘసూత్రాణాం సిద్ధ్యత్యాత్మక్షయాదృతే. 8

భయంకర నాదమొనర్చుచున్న నీవు శీఘ్రముగ ఎదుటకురమ్ము. విలంబనమొనర్చువారలకు నాశనమే సిద్ధించును.

రాజ్ఞేత్యుక్తే రమ్యముక్త మితి సంచింత్య సా తయోః
ప్రకాశాయాత్మ ధైర్యాయ ననాద చ జహాస చ. 9

రాజిట్లు బల్క "సరి బాగుగనే యున్నద"ని తలంచి రాక్షసి తనస్వరూపమును జూపుటకును, తన ధైర్యపరాక్రమముల ప్రకటించుటకును నిశ్చయించి మందహాసముతో గర్జించెను.

తతో దదృశతుస్తాం తౌ శబ్దపూరితదిగ్గణామ్
సాట్టహాసప్రభాపిండ పూరప్రకటితాకృతిమ్. 10

ఆ శబ్దముచే దిక్కులు పిక్కటిల్లెను. అట్టహాసమొనర్చుచున్న ఆ రాక్షసియొక్క దంతముల ప్రకాశముచే, దాని యాకారము వ్యక్తమవ, రాజును మంత్రియును దానిఁ గాంచగల్గిరి.

కల్పాభ్రాశనికోషేణ ఘృష్టామద్రితటీమివ
స్వనేత్రవిద్యుద్వలయ బలాకోజ్జ్వలితాంబరామ్. 11
తిమిరైః కార్ణవార్వాగ్ని జ్వాలావివలనామివ
గర్జద్ఘనఘటాటోప పీవరాసితకంధరామ్. 12
రణద్దశనసంరంభ హాహాహాతనిశాచరామ్
రోదసీకజ్జలస్తంభాం లీలయోల్లసితాం పునః. 13
ఊర్ధ్వకేశీం శిరాలాంగీం కపిలాక్షీం తమోమయీమ్
యక్షరక్షఃపిశాచానా మప్యనర్థభయప్రదామ్. 14
దేహరంధ్రవిశచ్ఛ్వాస వాతభాంకారభీషణామ్
ముసలోలూఖలాలాత హలశూర్పకశేఖరామ్. 15



స్ఫురంతీమివ కల్పాంతే వైదూర్యశిఖరస్థలీమ్
హాసఘట్టితవిశ్లేశాం కాలరాత్రిమివోదితామ్. 16
శరద్వ్యోమాటవీం సాభ్రాం కృతదేహామివాగతామ్
శరీరిణీం మహాభ్రాఢ్యాం యామినీమివ మాంసలామ్. 17
శరీరసంనివేశేన పంకపీఠమివోత్థితామ్
తనుం చంద్రార్క యుద్ధాయ తమ సేవ సమాశ్రితామ్. 18
ఇంద్రనీలమహాశుభ్ర లంబాభ్రయుగలోపమౌ
ఉలూఖలాదిహారాఢ్యౌ దధానామసితౌ స్తనౌ. 19
లగ్నామంగారకాష్ఠేన సమానాం చ మహాతనుమ్
ద్రుమాభాస్పందసశిర లసద్భుజలతాతనుమ్. 20
తామవేక్ష్య మహావీరౌ తథైవాక్షుభితౌ స్థితౌ
న తదస్తి విమోహాయ యద్వివిక్తస్య చేతసః. 21

ప్రలయకాల మేఘములనుండి పడిన వజ్రపాతముచే ఛేదింపబడిన పర్వతమువలె నున్నదియు తన నేత్రములను విద్యుత్కాంతులచే నంతరిక్షమును లెస్సగ ప్రకాశింప జేయునదియు, మేఘగర్జనమొనర్చుచున్నదియు, కృష్ణవర్ణయు, స్థూలాకారయు, తనభయంకర శబ్దములచే నిశాచరులకు వ్యథఁగల్గ జేయునదియు, ఊర్ధ్వకేశయు, యక్షరాక్షసపిశాచాదులకుగూడ భయమును గొల్పునదియు, తనశ్వాసచే భాంకారశబ్దము చేయుచున్నదియు, తల్పాంతమందు చూర్ణమైన వైడూర్యమణులవలె ప్రకాశించుచున్నదియు, కంఠమందు హారములుగలదియు, తన మందహాసముచే శివదూతవలె గొప్పదానవుల సైతము మరించునదియు, మేఘావృతమై మూర్తీభవించిన రాత్రివలె గన్పట్టునదియు, చంద్ర సూర్యులతో యుద్ధమొనర్చుటకై దేహముధరించి వచ్చిన రాహువువలె నున్నదియు, చలనరహితమును, నాడీ సంయుక్తమునునగు రెండు వృక్షములవంటి భుజములుగలదియు, విశాలదేహమునుగల్గి భయంకరముగనున్నదియునగు ఆ రాక్షసినిఁ గాంచి మహావీరులగు ఆ రాజ మంత్రు లిర్వురును ఏ విధమైన క్షోభనుపొందక యుండిరి. ఏలయన, సత్యాసత్యముల వివేచించు బుద్ధిగలవారలకేదియు మోహము గలుగజేయ జాలదు.

మంత్ర్యువాచ:—

మహారాక్షసి సంరంభో మహాత్మా కిమయం తవ
లఘవో హ్యథవా కార్యే లఘావప్యతిసంభ్రమాః. 22

మంత్రి:- ఓ రాక్షసి! నీకీ క్రోధమేల? అల్పులు స్వల్పకార్యములందైనను అధిక క్రోధమును గన్పరతురు.

త్యజసంరంభమారంభో నాయం తవ విరాజతే
విషయే హి ప్రవర్తంతే ధీమంతః స్వార్థసాధకాః. 23

ఈ నీ క్రోధమును వదలుము. ఇయ్యది బుద్ధిమంతులకు తగదు. ధీమంతులెల్లపుడును యోగ్యరీతిని, మరియు న్యాయోచితముగను కార్యములందు ప్రవర్తింతురు.

త్వాదృశానాం సహస్రాణి మశకానామివాబలే
అస్మాకం ధీరతా వాత్యా వ్యూఢాని తృణపర్ణవత్. 24

ఓ యబలా ! నీవంటి యల్పకీటకములు వేలకొలది మాధైర్యవాయువుచే, తృణపర్ణములవలె యెగురగొట్టబడినవి.

సంరంభద్వారముత్సృజ్య సమతాస్వచ్ఛయాధియా
యుక్త్యాచవ్యవహారిణ్యా స్వార్థఃప్రాజ్ఞైనసాధ్యతే. 25

క్రోధమును పరిత్యజింపుము. సమత్వమును, నిర్మలబుద్ధియుగల్గి ఉచితరీతిని వ్యవహరించు బుద్ధిమంతులు కార్యసిద్ధిని బడయుదురు.

స్వేనైవ వ్యవహారేణ కార్యంసిద్ధ్యతువానవా
మహానియతిరిత్యేవ భ్రమస్యావసరోహి కః. 26

కార్యముసిద్ధించినను, సిద్ధింపకున్నను 'సామ'మను యుపాయమునే ప్రప్రథమమున యవలంబింపవలెను. ఇది బహుకాలమునుండి యాచరింపబడుచున్నట్టి నియతిక్రమము. కార్యము నిశ్చితముకాగా, ఇక మూఢులవలె యేల వ్యవహరింపవలెను ?

కథయాభిమతంకింతే కిమర్థయసి చార్థినీ
అర్థీస్వన్నేఽపినాస్మాక మప్రాప్తార్థఃపురోగతః. 27

నీకేమివలయునో చెప్పుము. ఇంతవరకే యాచకుడైనను, తనయభీష్టవస్తువులను మా వలన బడయక యుండలేదు.

ఇత్యుక్త్వాసాతదా తేన చింతయామాసరాక్షసీ
అహోనువిమలాచారం సత్త్వంపురుషసింహయోః. 28

మంత్రి యిట్లువచింప, రాక్షసి తనయుల్లమున నివ్విధమున జింతించెను. — ఆహా ! పురుషశ్రేష్ఠులగు వీరలబుద్ధి యెంతనిర్మలమైనది! ఎట్టి పవిత్రాచరణము! ధైర్యము! బుద్ధిబలము !

నసామాన్యావిమావన్యే విచిత్రేయంచమత్కృతిః
వచోవక్త్రేక్షణేనైవ వదత్యంతర్వినిశ్చయమ్. 29

వీరిరువురు సామాన్యమానవులుకారు. ఇయ్యది చాల విచిత్రముగ నున్నది. ముఖనేత్ర కాంతులచేతను, ఉత్తమ వచనములచేతను, వీరాత్మజ్ఞానసంపన్నులనియే తోచుచున్నది.

వచోవక్త్రేక్షణద్వారైర్ధీమతామాశమామిథః
ఏకీభవంతిసరితాం పయాంసి వలనైరివ. 30

రెండు నదులు కలిసికొనిన, వానియందలి జలమేకమగునట్లు నేత్రవాగాదుల ద్వారా బుద్ధిమంతుల యభిప్రాయములును యేకమగును.

ఆభ్యాంప్రాయఃపరిజ్ఞాతో మమభావోఽనయోర్మయా
నవినాశ్యావయాచేమా స్వయమేవావినాశినౌ. 31

ఇపుడు నేను వారలయొక్కయు, వారు నా యొక్కయు యభిప్రాయముల నెఱింగియుండవచ్చును. కాన వీరల వధింపరాదు. మరియు వీరలాత్మదృష్టిచే నాశరహితులే యగుదురు.



మన్యేభవేతామాత్మజ్ఞౌ నాత్మజ్ఞానాదృతేమతిః
ప్రమృష్టసదసద్భావా ధ్రువత్యస్తభయా మృతౌ. 32

వీరిరువురును ఆత్మజ్ఞానులనియేతలంచెద. ఏలయనగా, ఆత్మజ్ఞానమును బడయనిచో మృత్యువిషయమై యింత నిర్భయముగ వర్తించెదరా ? ఆత్మజ్ఞానముచేతనే, జీవిత మరణముల యాశ నశించును.

తదేతౌపరిపృచ్ఛామి కించిత్సందేహముత్థితమ్
ప్రాజ్ఞంప్రాప్యనపృచ్ఛంతి యేకేచిత్తేనరాధమాః. 33

కాన, నాకుగల సందేహములగూర్చి వీరలనడిగెద, మహాత్ముల సంసర్గము గల్గియుండియు అట్టివారిచే సంశయ నివారణ యొనర్చుకొనని వారధములు.

ఇతిసంచింత్య పృచ్ఛాయై తస్యానావసరంతతః
అకాలకల్పాభ్రరవం హాసంసంయమ్యసాబ్రవీత్. 34

ఇట్లు తలపోసి, ఆరాక్షసి అకాల కల్పాన్త మేఘగర్జనవలె శబ్దమొనర్చుచు, నిట్లుపల్కెను.

కౌభవంతౌనరాధీరౌ కథ్యతామితిమేఽనఘౌ
జాయతేదర్శనాదేవ మైత్రీవిశదచేతసామ్. 35

ఓ పాపరహితులగు ధీరపుంగవులారా ! మీరెవరు ? వచింపుడు. నిర్మలచిత్తుల దర్శనమాత్రముచే మిత్రత్వము సిద్ధించునుగదా.

మంత్ర్యువాచ:—

అయంరాజా కిరాతానా మస్యాహంమంత్రితాంగతః
ఉద్యతౌరాత్రిచర్యేణ త్వాదృగ్జనవినిగ్రహే. 36

మంత్రి:—ఓ రాక్షసీ ! ఈతడు కిరాతుల ప్రభువు, నేను వీనిమంత్రిని. రాత్రులందు సంచరించుచు, నీవంటి హింసస్వభావుల దండించుటకై అనుద్యుక్తులమై యున్నారము.

రాజ్ఞోరాత్రిందివంధర్మో దుష్టభూతవినిగ్రహః
స్వధర్మత్యాగినోయేతు తేవినాశానలేంధనమ్. 37

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణయే రాజులకు సదా కర్తవ్యమైయున్నది. ఇట్టి ధర్మమునుపేక్షించుచో వారలగ్నియందింధనము వలె నశింతురు.

రాక్షస్యువాచ:—

రాజంస్త్వమసిదుర్మంత్రీ దుర్మంత్రీనన్నృపోభవేత్
సద్రూపస్యభవేన్మంత్రీ రాజసన్మంత్రిణోభవేత్. 38

రాక్షసి:—ఓరాజా ! నీమంత్రి దుష్టుడని తోచుచున్నది. దుష్టమంత్రిగలరాజు రాజు కానేరడు, ఉత్తమ మంత్రిగల రాజే రాజగును.

రాజాచాదావివేకేన యోజనీయఃసుమంత్రిణా
తేనార్యతాముపాయాతి యథారాజాతథాప్రజాః. 39

రాజు, వివేకముచే మొదట యుత్తమునే తనమంత్రిగ నేర్పరచుకొనవలెను. ఉత్త
మంత్రిచే రాజు కీర్తిని బడయును, మఱియు, రాజెట్లుండునో, వాని ప్రజలును అట్లనే యుందురు.

సమస్తగుణజాలానా మధ్యాత్మజ్ఞానముత్తమమ్
తద్విద్రాజాభవేద్రాజా తద్విన్మంత్రీచమంత్రవిత్. 40

సమస్తగుణములందును ఆత్మజ్ఞానమే యుత్తమమైనది. కాన ఆత్మజ్ఞుడే శ్రేష్ఠుడగు రాజగును.
ఆత్మజ్ఞుడగు మంత్రియు, మంత్రణాదికార్యముల ప్రవీణుడగును.

ప్రభుత్వంసమదృష్టిత్వం తచ్చస్యాద్రాజవిద్యయా
తామేవయోనజానాతి నాసౌమంత్రీనసోఽధిపః. 41

ఆత్మజ్ఞానము (రాజవిద్య) లేనిచో, రాజు సమదృష్టిగల్గి వర్తించుట సంభవింపదు. అట్టి
రాజవిద్య నెఱుంగని మంత్రి మంత్రికాడు, మఱియు రాజు రాజుకాడు.

భవంతౌ తద్విదౌ సాధు యదితచ్ఛేయఆప్నుథః
నోచేదనర్థదౌ స్వస్యాః ప్రకృతేరద్మ్యహంయువామ్. 42

ఆ యాత్మజ్ఞానమను రాజవిద్య నెఱింగియున్నచో మీరు ధన్యులే. అట్టిచో మీరు శ్రేయ
మునే పొందుదురు. ఎఱుంగనిచో, మీరనర్థమునే కలుగజేయు వారగుదురు గాన, నా స్వభావా
నుసారమట్టి మిమ్ముల మ్రింగివైచెదను.

ఏకోపాయేన మత్ప్రశ్నాద్బాలకావుత్తరిష్యథః
మత్ప్రశ్నపంజరంసారం చేద్విచారయథోధియా. 43

నాప్రశ్నలను మీరు మీ స్వబుద్ధిచే విచారించుచో, బాలుడు తల్లిదండ్రులకు ప్రీతి పాత్రు
డగునట్లు, మీరును నాకపుడు ప్రీతి పాత్రులయ్యెదరు.

ప్రశ్నానిమాన్కథయపార్థివవాచ మంత్రిన్‌స్త్రతార్థినీభృశమహంపరిపూరయార్థమ్
అంగీకృతార్థమదదత్క-ఇవాస్తిలోకే దోషేణసంక్షయకరేణ నయుజ్యతే యః. 44

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ-మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కర్కట్యుపాఖ్యానే రాక్షసీవర్ణనంనామ నామాష్టసప్తతితమః సర్గః ॥ 78 ॥

ఓ రాజ మంత్రులారా! నేనడగబోవు ప్రశ్నలకు ప్రత్యుత్తర మీయుడు. వాటిని
విని నభిలషించుచున్న నాయభీష్టము నెరవేర్పుడు. నాకోర్కె సఫలమొనర్చెదమని మీరు ప్రతిజ్ఞ చేసి
యున్నారు. తాను వచించిన ప్రకారమాచరింపని మనుజుడు దోషయుక్తుడే యగును.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున రాక్షసీవర్ణనమను అష్టసప్తతితమ సర్గము ॥ 78 ॥

# ఏకోనాశీతితమః సర్గః

వసిష్ఠ ఉవాచ:—

ఇత్యుక్త్వారాక్షసీప్రశ్నాన్ వక్తుముపచక్రమే
ఉచ్యతామితిరాజ్ఞోక్తే తానిమాన్‌శృణురాఘవ. 1

వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! రాక్షసిట్లుబల్కి రాజు వల్లెయని, ప్రశ్నలడుగుమనిన
వెంట నారాక్షసి యిట్లడుగుట కుపక్రమించెను. ఓ రామా! నీవాప్రశ్నలనుగూర్చి వినుము.

రాక్షస్యువాచ:—

ఏకస్యానేకసంఖ్యస్య కస్యాణోరంబుధేరివ
అంతర్బ్రహ్మాండలక్షాణి లీయంతే బుద్బుదాఇవ. 2

రాక్షసి:— యథార్థముగ ఒకటేయైనను, ఉపాధిభేదముచే ననేకముగ గన్పట్టునదేది?
సముద్రమందు బుద్బుదములవలె ఏయణువందు లక్షల కొలది బ్రహ్మాండములు లయమగును?

కిమాకాశమనాకాశం నకించిత్కించిదేవకిమ్
కోఽహమేవాసి సంపన్నః కోభవానప్యహంస్థితః. 3

శూన్యముగాని యాకాశమేది? లేనదైనను యునికిగలదేది? నేనెవరను? మీయందహం
భావము గల్గియున్నదేది?

గచ్ఛన్నగచ్ఛతిచకః కోఽతిష్ఠన్నపి తిష్ఠతి
కశ్చేతనోఽపిపాషాణః కశ్చిద్వ్యోమ్నివిచిత్రకృత్. 4

నడచుచున్నను నడువనిదేది? గతినిరోధమొనర్పకున్నను స్థిరముగ నుండునదేది? చేతన
వస్తువైనను రాతివలె కదలక యుండునదేది? చిదాకాశమున విచిత్రముగ చిత్రించునదెవరు?

వహ్నితామజహచ్చైవ కశ్చవహ్నిరదాహకః
అవహ్నేర్జాయతేవహ్నిః కస్మాద్రాజన్నిరంతరమ్. 5

తనరూపమును త్యజింపనిదియు, దహనశక్తి లేనిదియునగు అగ్నియేది? అగ్నికానట్టి దేనినుండి
నిరంతరమగ్ని యుత్పన్నమగును?

అచంద్రార్కాగ్నితారోఽపి కోఽవినాశఃప్రకాశకః
అనేత్రలభ్యాత్కస్మాచ్చ ప్రకాశఃసంప్రవర్తతే. 6

నాశరహితుడును, సమస్తమును ప్రకాశింపజేయువాడును ఎవరు? చంద్ర సూర్యాగ్ని
నక్షత్రములకు విలక్షణమై యున్నదేది? నేత్రమునకు విషయము కానిదైనను దృష్టికి హేతువై యున్న
దేది?

లతాగుల్మాంకురాదీనాం జాత్యంధానాంతథైవచ
అన్యేషామప్యలక్షాణా మాలోకఃకఇవోత్తమః. 7

తరుగుల్మలతాదులను, జన్మాంధులను, ఇంద్రియములులేని తదితర జీవులను లెస్సగ ప్రకాశింప
జేయునదేది?

జనకః కోఽంబరాదీనాం సత్తాయాః కః స్వభావదః
కో జగద్రత్నకోశః స్యాత్కస్య కోశో మణేర్జగత్. 8

ఆకాశాదుల నుత్పన్నము చేయువారెవరు? అన్నిటికిని సత్తను గల్గజేయునదేది? జగత్తను రత్నమునకు నిలయమేది? ఏ మణిమయకోశమంపీ జగత్తుకలదు?

కోఽణుస్తమః ప్రకాశః స్యాత్కోఽణురస్తి చ నాస్తి చ
కోఽణుర్దూరేఽప్యదూరే చ కోఽణురేవ మహాగిరిః. 9

తమస్సునుగూడ ప్రకాశింపజేయునదేది? ఉన్నదియు లేనిదియునగు అణువెయ్యది? దూరమునను, సమీపముననుగూడనుండునదేది? గొప్పపర్వతమువలెనుండు యణువేది?

నిమేష ఏవ కః కల్పః కః కల్పోఽపి నిమేషకః
కిం ప్రత్యక్షమసద్రూపం కిం చేతనమచేతనమ్. 10

నిమేషస్వరూపము గలదైనను, కల్పరూపమున నుండునదేది? కల్పమైనను నిముసగానుండునదేది? ప్రత్యక్షముగనున్నను, లేనట్లు దోచునదేది? చేతనమైనను అచేతనముగ గన్పట్టునదేది?

కశ్చ వాయురవాయుశ్చ కః శబ్దోఽశబ్ద ఏవ కః
కః సర్వం న చ కించిచ్చ కోఽహం నాహం చ కిం భవేత్. 11

వాయురూపమైనను వాయురూపముకానిదియు, శబ్దరూపమైనను అశబ్దముననగునదేది? అంతయు తానైనను, ఏదియుకానిదేది? అహంభావనారూపముగను, అనహంభావనారూపముననుఉన్నదేది?

కిం ప్రయత్నశతైః ప్రాప్యం లబ్ధ్వాపి బహుజన్మని
లబ్ధం న కించిద్భవతి కింతు సర్వం న లభ్యతే. 12

తన యాత్మస్వరూపమైయున్నను, అనేక జన్మలందు చేయబడిన ప్రయత్నములచేతనే లభ్యమగునదేది? ఏది లభించిన, యంతకు మించినలాభముండదో, కాని ఏది అంతయు లభింపదో అట్టివస్తువేది?

స్వస్థేన జీవితేనోచ్చైః కేనాత్మైవాపహారితః
కేనాణునాంతః క్రియతే మేరుస్త్రిభువనం తృణమ్. 13

స్వస్థ (విషయ భోగయుక్తమగు) జీవితముచే యేది తన్నుతాను నశింపజేసికొనును? మేరుపర్వతమును గూడ తనయందు ధరించునదియు, త్రిలోకములను గూడ తృణప్రాయముగ నొనర్చునదియునగు అణువేది?

కేనాప్యణుకమాత్రేణ పూరితా శతయోజనీ
కోఽణురేవ భవన్మాతి న యోజనశతేష్వపి. 14

అణువైయున్నను, అనేకయోజనముల వ్యాపించునదేది?

కేనాలోకనమాత్రేణ జగద్బాలః ప్రనాట్యతే
కస్యాణోరుదరే సంతి శిలావనిభృతాం ఘటాః. 15



దేనిఁ గాంచుటచే జగత్తను బాలుడు నృత్యముచేయ దొడగును? గొప్ప పర్వతములుగూడ ఏయణువందు ప్రవేశింపగలవు?

అణుత్వమజహాత్కోఽణుర్మేరోః స్థూలతరాకృతిః
వాలాగ్రశతభాగాత్మా కోఽణురుచ్చైః శిలోచ్చయః. 16

తన సూక్ష్మత్వమును త్యజింపకయే ఏది మేరువుకంటె యధికమగు స్థూలత్వముగల్గియున్నది? కేశాగ్ర భాగముకంటె సూక్ష్మముగనున్నను, పెద్ద పర్వతమువలెనుండు అణువేది?

కోఽణుః ప్రకాశతమసాం దీపః ప్రకటనప్రదః
కస్యాణోరుదరే సంతి సమగ్రానుభవాణవః. 17

ప్రకాశమును, అంధకారమును గూడ వ్యక్తపరచు అణువెయ్యది? వృత్తిసహిత జ్ఞానమంతయు ఏయణువందు గలదు?

కోఽణురత్యంతనిఃస్వాదు రపి సంస్వదతేఽనిశమ్
కేన సంత్యజతా సర్వమణునా సర్వమాశ్రితమ్. 18

అత్యంత స్వాదిష్టమైనను, మధురాది రసవర్జితమును నగు అణువేది? సమస్త పదార్థములకు విలక్షణమైయున్నను, అన్నిఁటికి నాశ్రయ భూతమైనదేది?

కేనాత్మాచ్ఛాదనాశక్తేనాణునాచ్ఛాదితం జగత్
జగల్లయే న కస్యాణోః సద్భూతమపి జీవతి. 19

తన్నాచ్ఛాదించుకొనలేకున్నను, జగత్తు నాచ్ఛాదించునదేది? దేనిశక్తిచే ఈ జగత్తు ప్రళయమందును సత్స్వరూపమై వెలయుచుండును?

అజాతావయవః కోఽణుః సహస్రకరలోచనః
కో నిమేషో మహాకల్పః కల్పకోటిశతాని చ. 20

అవయవ రహితమైనను, అనేకహస్తనేత్రాదులు గలదేది? అనేక కల్పమహాకల్పములకు సమమగు నిమిషమేది?

అణౌ జగంతి తిష్ఠంతి కస్మిన్బీజ ఇవ ద్రుమః
బీజాని నిష్కలాంతాని స్ఫుటాన్యనుదితాన్యపి. 21

యథార్థముగ ఉత్పన్నముగాకున్నను, ఏ బీజమునుండి సృష్టికాలమున జగత్తను వృక్షమావిర్భవించుచు, ప్రళయ కాలమందస్పష్టముగనున్నదై, మరల దానియందే లయించుచున్నది ?

కల్పః కస్య నిమేషస్య బీజస్యేవాంతరస్థితః
కః ప్రయోజనకర్తృత్వమత్యనాశ్రిత్య కారకః. 22

బీజమందు వృక్షమువలె, ఏ నిమిషమందు కల్పముగలదు ? ప్రయోజనము, కర్తృత్వము లేకయున్నను, అన్నిటికిని కర్తయగువాడెవడు ?

దృశ్యసంపత్తయే ద్రష్టా స్వాత్మానం దృశ్యతాం నయన్
దృశ్యం పశ్యన్స్వమాత్మానం కో హి పశ్యత్యనేత్రవాన్. 23

భోగ్యపదార్థసిద్ధికై తనరూపమునే దృశ్యముగా జేసికొను ద్రష్టయెవడు? బాహ్యజగత్తును గాంచుచున్నను నేత్రరహితుడును, తన యాత్మనే దర్శించువాడును, యెవడు?

అంతర్గలితదృశ్యంచ కఆత్మానమఖండితమ్
దృశ్యాసంపత్తయేపశ్యన్ పురోదృశ్యంనపశ్యతి. 24

దృశ్యమిథ్యాత్వసిద్ధికొరకై తన దృశ్యరహితమగు యఖండాత్మస్వరూపము నవలోకించుటచే సమ్ముఖముననున్నను, దృశ్యము నెవడు జూచుటలేదు.

ఆత్మానందర్శనందృశ్యం కోభాసయతిదృశ్యవత్
కటకాదీనిహేమ్నేవ వికీర్ణం కేనచత్రయమ్. 25

ద్రష్టృదర్శన దృశ్యములఁ బ్రకాశింపజేయునదెవరు? సువర్ణమందు కటకాది యాభరణములవలె, ఈ త్రిపుటినెవరు తనయందే వ్యక్తపరచుచున్నారు?

కస్మాన్నకించిచ్చపృథగూర్మ్యాదీవ మహాంభసః
కస్యేచ్ఛయాపృథక్చాస్తి వీచితేవమహాంభసః. 26

మహాసముద్రమందు తరంగమువలె, ఈ యల్పమగు జగత్తెవనికంటె భిన్నముకాదు? మరియు సముద్రముకంటె తరంగము వేఱుగా కన్పించునట్లెవని కోర్కెచే ఈ జగత్తు వేఱుగా గన్పట్టుచున్నది?

దిక్కాలాద్యనవచ్ఛిన్నా దేకస్మాదసత్మసతః
ద్వైతమప్యపృథక్కస్మా ద్ద్రవతేవ మహాంభసః. 27

సముద్రముకంటె ద్రవత్వము భిన్నముకానట్లు, ఈ ద్వైతప్రపంచమంతయు, దేశకాలవస్తువులచే నపరిచ్ఛిన్నమును, సూక్ష్మమునునగు ఏవస్తువుకంటె భిన్నముకాదు?

ఆత్మానందర్శనందృశ్యం సదసచ్చజగత్రయమ్
కోంఽతర్బీజమివాంతస్థం స్థితఃకృత్వాత్రికాలగః. 28

బీజమందు వృక్షమువలె ద్రష్టృదర్శన దృశ్యములతోఁగూడి, సదసత్స్వరూపమైయున్న ఈ త్రిలోకముల నెవరు, తనయందు సర్వదా ధరించుచున్నారు?

భూతంభవద్భవిష్యచ్చ జగద్వృందంబృహద్ద్రుమమ్
నిత్యంసమస్యకస్యాంత ర్బీజస్యాంతరివద్రుమః. 29

భూత భవిష్య ద్వర్తమానరూపమగు ఈ మిథ్యాజగజ్జాలమంతయు, బీజమందు వృక్షమువలె ఏ సమవస్తువునందు సర్వదాస్థితిఁ బడయుచున్నది?

బీజంద్రుమతయేవాశు ద్రుమోబీజతయేవచ
స్వమేకమజహద్రూప ముదేత్యనుదితోఽపి కః. 30

ఉత్పత్తిరహితమగు యేవస్తువు తన ఏకస్వరూపమును త్యజింపకయే బీజమును వృక్షరూపముగను, వృక్షమును బీజరూపముగను జేయుచు, సవికారమగు జగత్తగుచున్నది.



బిసతంతుర్మహామేరు ర్యోభిరాజక యదపేక్షయా
తస్యకస్యోదరేసంతి మేరుమందరకోటయః. 31

దేనిచెంత మహామేరువుగూడ, కమల సూత్రమువలె అదృశ్యమైయుండును? ఏది తనయందు కోట్లకొలది మందర పర్వతములు గలిగియున్నది?

కేనేదమాతతమనేకచిదేవవిశ్వం కింసారపేవమతివల్గసిహంసిపాసి
కిందర్శనేన నభవస్యథవానద్వైవ నూనంభవస్యమలదృగ్వదనఃస్వశాంత్యై. 32

ఉపాధి భేదముచే అనేకచైతన్యముల (జీవుల)తో కూడిన ఈ విశ్వము నెవరు విస్తరించిరి? ఏశక్తిచే నీవు సమస్త వ్యవహారములందును లెస్సగ ప్రవర్తించుచున్నావు? దేని దర్శనముచే నీవు నిర్మల బుద్ధిగల్గి, మరియు నద్దాని కన్యమగు దేనినికూడ తలంపక యుందువో, అట్టి వస్తువును నా చిత్తశాంతికొఱకై, వచింపుము.

ఏషోఽస్మాత్ప్రగలతుసంశయోమమమోహైచ్ఛ శ్చిత్తశ్రీముఖమిహకామలానులేపః
యస్యాగ్రే నగలతిసంశయః సమూలోనైవాసౌక్వచిదపిపండితోక్తిమేతి. 33

ఓ రాజా! నిర్మల చంద్రునినుండి మేఘాదియావరణ తొలగునట్లు, నీ ప్రత్యుత్తరములచే నాసంశయములు తొలగుగాక! ఎవఁడీ నా సంశయముల నివారింప నశక్తుడో, ఆత డవిద్యతోఁకూడియుండును గాన నట్టివాడు పండితుడుగ పేర్కొనబడడు.

ఏవంమేయదినవినేవ్యథఃక్రమోక్తం సంశాంతం లఘుతరసంశయంసుబుద్ధీ
తద్దక్షోజఠరవహుతాశనేంధనత్వం నిర్విఘ్నంర్ఝుటితిగమిష్యథఃక్షణేన. 34

క్రమముగ ఈ నాసంశయము లన్నింటిని బుద్ధిమంతులగు మీరు శీఘ్రముగ నివారింపనిచో ఒక్క క్షణములో నా రాక్షస స్వభావాగ్నికింధనములు కాగలరు.

పశ్చాత్తాంజనపదమండలీం సమంతాద్భావత్కామురుజఠరాక్షణాద్గ్రసేఽహమ్
ఏవంతేభవతుసురాజతేతి మన్యేమూర్ఖాణామతిరసపవసంక్షయాయ. 35

అట్లు మిమ్ముల నశింపజేసిన మీదట దీర్ఘదేహినగు నేను శీఘ్రముగ మీరాజ్యమందలి ప్రజలనందరిని మ్రింగివైచెదను. కాన నాప్రశ్నలకు తగు సమాధానమిచ్చి మీప్రజల క్షేమమును కాపాడుడు. ఏలయన, ఆత్మజ్ఞానశూన్యులగు మూర్ఖుల భోగ వైభవమంతయు, వారినాశనము కొఱకేయగును.

ఇత్యుక్త్వావిపులగభీరమేఘనాదప్రోల్లాసప్రకటగిరా నిశాచరీసా
తూష్ణీమప్యతివికటాకృతిస్తదాసీ చ్ఛధ్వాంతఃశరదమలాభ్రమండలీవ. 36

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కర్కట్యుపాఖ్యానే రాక్షసీప్రశ్నోనామైకోనాశీతితమః సర్గః ॥ 79 ॥

ఓ రామచంద్రా! మేఘగర్జనవలె, గంభీరముగను, ఉచ్చస్వరముతోడను, ఆ రాక్షసి ఇట్లు బల్కి, భయంకరరూపమును దాల్చియున్నను, మౌనమును వహించినదై, శుద్ధశరత్కాల మేఘమువలె శాంతముగ నుండెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున రాక్షసీప్రశ్న మను ఏకోనాశీతితమ సర్గము. ॥ 79 ॥

## అశీతితమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

మహానిశిమహారణ్యే మహారాక్షసకన్యయా
ఇతిప్రోక్తేమహాప్రశ్నే మహామంత్రీగిరం దదౌ. 1

వసిష్ఠుడు:— ఓ రామా! ఆ భయంకర రాత్రి సమయమున, మహారణ్యమందు రాక్షసిచే నిట్లు యుత్తమప్రశ్నలు జేయనంత నాధీశాలియగు మంత్రి యిట్లు చెప్ప దొడగెను.

మంత్ర్యువాచ:—

శృణుతోయదసంకాశే ప్రశ్నమేతంభినద్మితే
అనుక్రమాత్మకంమత్తం గజేంద్రమివకేసరీ. 2

మంత్రి:— మేఘమువలె శోభించుచున్న ఓ రాక్షసీ! మత్తగజేంద్రమును సింహము భేదించులాగున నీ ప్రశ్నక్రమమునంతయును నేను భేదించి వైచెదను.

భవత్యాపరమాత్మైష కథితఃకమలేక్షణే
అనయైవవచోభంగ్యా ప్రశ్నవిద్భ్యోర్థయోగ్యయా. 3

ఓ కమలేక్షణీ! ఉత్తమ వచనములచే, నీవు పరమాత్మను గూర్చియే తెలిపినావు.

అనాఖ్యత్వాదగమ్యత్వా న్మనఃషష్ఠేంద్రియస్థితేః
చిన్మాత్రమేవమాత్మాణు రాకాశాదపిసూక్ష్మకః. 4

వాగతీతమును, పంచేంద్రియములచేతను, మనస్సుచేతను గూడ పొంద నశక్యమైనదియునగు ఆత్మయే అణుస్వరూపమును, ఆకాశముకంటె సూక్ష్మమునునయి యున్నది.

చిదణోఃపరమస్యాంతః సదివాసదివాపివా
బీజేఽంతర్ద్రుమసత్తేవ స్ఫురతీదంజగత్థ్సితమ్. 5

ఆ పరమమగు చిదణువందే సదసద్రూపకమగు ఈ జగత్తంతయు బీజమందు వృక్షమువలె స్ఫురించుచున్నది.



సత్కించిదనుభూతిత్వా త్సర్వాత్మకతయాస్వతః
తదాత్మకతయాపూర్వం భావాఃసత్తాంకిలాగతాః. 6

సద్వస్తువు, సర్వుల యనుభవరూపమగుటచేతను, అందలి ఆత్మయై యుండుటచేతను, సృష్ట్యాదియందును స్థితిగల్గి యున్నందుచేతను, సమస్త పదార్థములును దానివలననే సత్తను బడయుచున్నవి.

ఆకాశంబాహ్యశూన్యత్వా దనాకాశంతుచిత్త్వతః
అతీంద్రియత్వాన్నోకించి త్సఏవాణురనంతకః. 7

చిదణువగు ఆ పరమాత్మయే బాహ్యవస్తుశూన్యమగుటచే నాకాశమనియు, శుద్ధ చైతన్యరూపమగుటచే నాకాశముకంటె భిన్నమనియు చెప్పబడును. అనంతమగు ఆ చిదణువు ఇంద్రియములకవిషయముగాన, రూపరహిత మనబడినది.

సర్వాత్మకత్వాద్యుక్తేచ తేనకించిన్నకించన
చిదణోఃప్రతిభా సాస్యా దేకస్యానేకతోదితా
అసత్యేవయథాహేమ్నః కటకాదితథాపరే. 8

అంతయు తనరూపమేయగుటచే సర్వరూపకమనియు, దృశ్యరహితమగుటచే అరూపమనియు నది చెప్పబడును. కనుకనే, సర్వము తానై యున్నను, ఏదియు గాకయున్నది. సువర్ణమందాభరణములవలె నొకే చైతన్యము భిన్నోపాధులందు ప్రతిబింబించుటచే భిన్న భిన్నములుగా గోచరమగుచున్నది.

ఏషోఽణుఃపరమాకాశః సూక్ష్మత్వాదవ్యలక్షితః
మనఃషష్ఠేంద్రియాతీతః స్థితఃసర్వాత్మకోఽపిసన్. 9

పరమాకాశస్వరూపమగు ఈ చిదణువే అన్నిటిని ప్రకాశింపజేయును. అది సూక్ష్మమగుటచే నలక్షితమును, సర్వరూపమైనను ఇంద్రియాగోచరమును నై యున్నది.

సర్వాత్మకత్వాన్నైవాసౌ శూన్యోభవతికర్హిచిత్
యదస్తినతదస్తీతి వక్తాత్మంతాఇతిస్మృతః. 10

ఆ సద్వస్తువు శూన్యమనుట ప్రమాణవిరుద్ధము. ఏది సర్వాత్మకమో అయ్యది శూన్యమెట్లగును? ఆ చిదణువాత్మస్వరూపమే యగుటచే, తనయాత్మనే నిషేధించుట యెవరికి యెట్లు సంభవించును?

కయాచిదపియుక్త్యైహ సతోఽసత్త్వంనయుజ్యతే
సర్వాత్మాస్వాత్మగుప్తేన కర్పూరేణేవ దృశ్యతే. 11

ఏ యుక్తిచేనైనను, సత్తు అసత్తు యెన్నటికిని కాజాలదు. కర్పూరము తన సుగంధము ద్వారా అంతటను వ్యాప్తమైయుండుచందమున, సద్రూపమగు ఆత్మయే అంతటననుభూతమగుచున్నది.

చిన్మాత్రాణుఃసఏవేహ సర్వంకించిన్మనఃస్థితమ్
నకించిదింద్రియాతీతరూపత్వాదమలఃస్థితః 12

ఇంద్రియ వృత్తులచే, ఆ చిద్వస్తు వనేక రూపములుగ ప్రతీతమగుటచే, అంతయు నదియే యగును. ఇంద్రియాతీతమును, అపరిచ్ఛిన్నమును నైన, శుద్ధ చైతన్యము మాత్రమయి యుండుటచే ఏదియుగాక యున్నది.

సఏవచైకోఽనేకశ్చ సర్వసత్త్వాత్మవేదనాత్
సఏవేదంజగద్ధత్తే జగత్కోశ స్తథైవహి. 13

ఆ పరమాత్మ యేకమైనను, ఉపాధిభేదముచే అనేకముగనున్నది. సర్వుల యాత్మస్వరూప మగుటచే జగత్తునంత నదియే ధరించుచున్నది. కాన జగత్తను రత్నమునకు నిలయ మదియే.

ఇమాశ్చిత్తమహాంభోధౌ త్రిజగల్లహరీచయః
ప్రజ్ఞాస్తస్మిన్కచంత్యప్సు ద్రవత్వాచ్చక్రతాఇవ. 14

ఆ చైతన్యార్ణవమందు, జగత్తను తరంగము చిత్తవికల్పముచే జలమందావర్తమువలె వ్యక్తమగుచున్నది.

చిత్తేంద్రియాద్యలభ్యత్వా త్సోఽణుః శూన్యస్వరూపవత్
స్వసంవేదనలభ్యత్వా దశూన్యంవ్యోమరూప్యపి. 15

ఇంద్రియ మనంబుల కప్రాప్య మగుటచే ఆ చిదణువసత్తు, లేక శూన్యమనియు, ఆత్మ సాక్షాత్కారముచే లభ్యమగునది గాన ఆకాశరూపమైనను, శూన్యము కాదనియు చెప్పబడు చున్నది.

సోఽహం భవానేవభవాన్ సంపన్నోఽద్వైతవేదనాత్
నభవాన్నభవేన్నాహం జాతోబోధబృహద్వపుః. 16

అద్వైతతత్త్వ సాక్షాత్కారముచే నేనాత్మనే యగుదును. నీ రూపమునను నేనే వెలుగు చున్నాను. అయినను, పారమార్థిక దృష్టియందు ఆత్మ నాదియుకాదు. నీదియుకాదు. అది కేవలము బోధస్వరూపము మాత్రమే యగును.

త్వంతాహంతాత్మకం సర్వం వినిగీర్యావబోధతః
నత్వంనాహంనసర్వంచ సర్వంవాభవతిస్వయమ్. 17

అట్టి కేవల బోధస్వరూపమగు ఆత్మయందు, నీవు, నేనను భేదభావమంతయు లయించును. అపుడంతయు తానై యది వెలుగుచుండును.

గచ్ఛన్నగచ్ఛత్యేషోఽణు ర్యోజనౌఘగతోఽపిసన్
సంవిత్త్యాయోజనౌఘత్వం తస్యాణోరంతరేస్థితమ్. 18

ఈ చైతన్యాణువే, ఆకాశమువలె అనేక యోజనములు వ్యాపించియున్నందున, చలించు చున్నను చలింపకయున్నది. స్వప్నకల్పనవలె, ఈ యణువందే యోజన సమూహములన్నియు గలవు. కాన, అయ్యదెట్లు చలించును?

నగచ్ఛత్యేషయాతోఽపి సంప్రాప్తోఽపిచ నాగతః
స్వసత్తాకాశకోశాంత ర్వ్యాసిత్వాద్దేశకాలయోః. 19



గమ్యంయస్యశరీరస్థం క్వకిలాసౌప్రయాతిహి
కుచకోటరగఃపుత్రః కింమాత్రాన్యత్రవీక్ష్యతే. 20

సర్వత్ర వ్యాప్తమైయున్నందున, ఎల్లెడల సంచరించుచున్నను స్థిరముగానుండును. తన చిదాకాశకోశమందు దేశకాలాదుల గల్గి చలింపకయున్నది. పొందదగిన ప్రదేశమంతయు దానియందే యున్నందున అదెచటికి పోగలదు? పైటక్రింద బాలునుంచుకొని, తల్లి వానికై మరియొకచోటు నకు బోవునా!

గమ్యోయస్యమహాదేశో యావత్సంభవమక్షయః.
అంతస్థఃసర్వకర్తుర్హి సకథంక్వేవగచ్ఛతి. 21

సమస్త దేశకల్పనయు తనయందుగల నయ్యదెట కెట్లు పోగలదు?

యథాదేశాంతరప్రాప్తే కుంభేవక్త్రసముద్రితే
తదాకాశస్య గమనాగమనే నతథాత్మనః. 22

ముఖమును బంధించి, ఘటమునొక ప్రదేశమునుండి మరియొక ప్రదేశమునకు గొనిపోయినను అందలి యాకాశమునకు గమనాగమనములుండనట్లు ఆత్మకును యుండజాలవు.

చిత్తతాస్థాణుతాస్వాంత ర్యదా స్తోఽనుభవాత్మికే
చేతనస్యజడస్యైవ తదాసాద్వయమేవచ. 23

జడమగు దేహాదులతోటి యభేదాధ్యాసముచే, జడత్వమును, చిత్త్వమును బొందియు న్నట్లు తోచుటచే, ఆత్మ జడమును చైతన్యమును గూడ యగునని చెప్పబడినది.

యదాచేతనపాషాణ సత్తైకాత్మైకచిద్వపుః
తదాచేతనఏవాసౌ పాషాణఇవరాక్షసి. 24

ఓ రాక్షసీ! రాతియందును, చిద్వస్తువు వ్యాప్తమైయున్నందున, అచేతన పదార్థము రాతివలె ఘనమని వచింపబడినది.

పరమవ్యోమ్న్యనాద్యంతే చిన్మాత్రపరమాత్మనా
విచిత్రంత్రిజగచ్చిత్రం తేనేదమకృతంకృతమ్. 25

అనాదియు, అనంతమును నగు చిదాకాశమందు చిత్స్వరూపుడగు పరమాత్మయే త్రిలోకములను విచిత్ర చిత్రముల చిత్రించుచున్నాడు. కాని యవన్నియు మిథ్యయగుటచే, అకృతములే యగును.

తత్సంవిత్త్యావహిన్నసత్తా తేనాత్యక్తానలాకృతిః
సర్వగోఽప్యదహత్యేవ సజగద్దీవ్యపావకః. 26

అగ్నిసత్త, ఆత్మసత్త, కఠినమగుటచేతను, ఆత్మసర్వవ్యాపి యైనందునను, జగత్తును అగ్నివలె ప్రకాశింపచేయు నాయాత్మ దేనిని దహింపదు.

ప్రజ్వలద్భాస్వరాకారా న్నిర్మలాద్గగనాదపి
ప్రజ్వలచ్చేతనైకాత్మా తస్మాదగ్నిఃసజాయతే. 2

దేదీప్యమానమును, ప్రకాశవంతమును, ఆకాశమువలె నిర్మలముగ నగు ఆత్మచైతన్యము నుండియే జ్వలనశక్తిగల అగ్ని యుత్పన్న మగుచున్నది.

సంవేదనాద్యదర్కాది ప్రకాశస్యప్రకాశకః
నన‌శ్యత్యాత్మభారూపో మహాకల్పాంబుదైరపి. 28

అనుభవరూపమగు నీ యాత్మయే చంద్ర సూర్యాదుల గూడ ప్రకాశింప జేయుచున్నది. ఆ యాత్మప్రకాశము మహాకల్పములను మేఘములచే గూడ నశింపదు.

అనేత్రలభ్యోఽనుభవరూపోహృద్గృహదీపకః
సర్వసత్తాప్రదోఽనంతః ప్రకాశః పరమఃస్మృతః 29

నేత్రాదులచే లభ్యముకాని ఈ యనుభవరూపమగు ఆత్మయే హృదయ గృహమును ప్రకాశింపజేయు దీపము. సమస్త ప్రకాశములకును సత్తను గల్గించునదీ యనంతమగుపరమ ప్రకాశమే యని వేదశాస్త్రములందు చెప్పబడినది.

ప్రవర్తతేఽస్మదాలోకో మనఃషష్ఠేంద్రియాతిగాత్
యేనాంతరాపివస్తూనాం దృష్టాదృశ్యచమత్కృతిః. 30

ఇంద్రియ మనంబులకవిషయమగు ఈ స్వయంజ్యోతి స్వరూపమగు నాత్మనుండియే ప్రకాశమంతయు నుత్పన్నమగుచున్నది. దీనివలననే దీపాదుల ప్రకాశాభావమునను దేహేంద్రియాది పదార్థముల యనుభవము కలుగుచున్నది.

లతాగుల్మాంకురాదీనా మనస్పాంచపోషకః
ఉత్సేధవేదనాకారః ప్రకాశోఽనుభవాత్మకః. 31

పరప్రకాశ స్వరూపమును, అనుభవరూపమునునగు ఆత్మయే తరుగుల్మలతాదులఁగూడ బోషించుచున్నది.

కాలాకాశక్రియాసత్తా జగత్త్రాస్తివేదనే
స్వామీకర్తా పితాభోక్తా ఆత్మత్వాచ్ఛనకించన. 32

అనుభవస్వరూపమగునట్టి యాత్మయందే దేశకాలక్రియాదులును, జగత్సత్తయును గలవు. బాహ్యదృష్టిచే పరమాత్మయే జగత్పితయైయొప్పుచు, యన్నిటికిని కర్తయు, భోక్తయు, ప్రభువును నగుచు, పరమార్థదృష్టిచే, పరిశుద్ధాత్మ స్వరూపుడగుటచే నేమియుగాక యుండును.

అణుత్వమజహాత్సోఽణు ర్జగద్రత్నసముద్గకః
మాతృమానప్రమేయాత్మ జగన్నాస్తీతికేవలే. 33

ఆ చిదణువు తనయణుత్వమును వదలకయే, జగత్తను రత్నమునకు నిలయమగుచున్నది. ప్రమాత, ప్రమాణ, ప్రమేయ రూపమగు నీ జగత్తు, శుద్ధమగు ఆత్మయందు లేదు.

సఏవసర్వజగతి సర్వత్ర కచతిస్ఫుటమ్
యదాజగత్సముద్గేఽస్మిం స్తదాసౌపరమోమణిః. 34

కాని ఈ జగత్తను పేటికయందు, తానే సర్వత్రవికాస మొందుచున్నందున, ఆత్మయే యుత్తమమణి యనఁబడినది.



దుర్బోధత్వాత్తమఃసోఽణు శ్చిన్మాత్రత్వాత్ప్రకాశదృక్
సోఽస్తిసంవిత్తిరూపత్వా దతఃహాతీత స్తథానసన్. 35

అధిక యత్నముచేతనే పొంగబడునదగుటచే నయ్యది తమస్సనియు, చిన్మాత్ర స్వరూపమగుటచే ప్రకాశమనియు, నెఱుంగవలెను.

దూరే సోఽనక్షలభ్యత్వా చ్చిద్రూపత్వాన్నదూరగః
సర్వసంవేదనాచ్ఛైలో హ్యసావేవాణురేవసన్. 36

ఈ చిదణువే ఇంద్రియాతీతమగుటచే దూరమునను, ఆత్మస్వరూపమగుటచె సమీపమునను యున్నది. ఎల్లప్పుడు, 'నేను' 'నేన'ని ప్రత్యక్షముగ నెదుటనున్న పర్వతమువలె ననుభూతమగుచుండుటచే సూక్ష్మమైనను గొప్ప పర్వతము వంటిదగును.

తత్సంవేదనమాత్రం యత్తదిదం భాసతేజగత్
నసత్యమస్తిశైలాది తేనాణావేవమేరుతా. 37

ఈ దృశ్యమానమగు జగత్తంతయు చిత్తస్ఫురణయేగాన, పర్వతాది వస్తువులన్నియు సత్యములుకావు. కనుకనే అణుస్వరూపమునను, మేరువుయొక్క సత్త సిద్ధింపవచ్చును.

నిమేషప్రతిభాసోహి నిమేషఇతికథ్యతే
కల్పేతిప్రతిభాసోహి కల్పశబ్దేనకథ్యతే. 38

ఆత్మ, నిముషకాలము ప్రతిభాసించుటచే నిముషమనియు, కల్పమనియు చెప్పబడుచున్నది.

కల్పక్రియావిలాసోహి నిమేషఃప్రతిభాసతే
బహుయోజనకోటిస్థం మనస్యేవమహాపురమ్. 39

అనేక కోట్ల యోజనముల దూరమున నున్నదైనను, యొక గొప్ప నగరము మనస్సునందు భాసించులాగున, కల్పమందలి క్రియలన్నిటితోను కూడినదై ఒక్క నిమిషమందే ఆత్మ ప్రతిభాసించుచున్నది.

నిమేషజఠరేకల్పసంభవః సముదేతిహి
మహానగరనిర్మాణం ముకురేఽంతరివామలే. 40

నిర్మల దర్పణమున విశాల నగరము ప్రతిబింబరూపమున స్థితిగల్గియుండుట సంభవమగునట్లు, నిమిషమందును కల్పము సంభవమగును.

నిమేషకల్పశైలాది పురయోజనకోటయః
యత్రాణావేవవిద్యంతే తత్రద్వైతైక్యతే కుతః. 41

నిముష, కల్ప, పర్వతాది సమూహమంతయు, మిథ్యాత్వమునాశ్రయించి, అతి సూక్ష్మమగు ఏ యణువందుండునో, అద్దానియందు ద్వైతముగాని ఏకత్వముగాని యేల సంభవముగాదు? (అనగా, మిథ్యాదృష్టిచే రెండును సంభవమగునని భావము).

కృతవాన్ప్రాగిదమహ మితిబుద్ధావుదేతిహి
క్షణాత్సత్యమసత్యంచ దృష్టాంతఃస్వప్నవిభ్రమః. 42

'బహుకాలసాధ్యమగు కార్యమును, పూర్వము, క్షణములో నేను చేసితిని'. అను స్వప్న భ్రమ, యేది బుద్ధియందుదయించుచున్నదో, అదియే ఇందులకు దృష్టాంతము.

దుఃఖే కాలఃసుదీర్ఘోహి సుఖే లఘుతరఃసదా
రాత్రిర్ద్వాదశవర్షాణి హరిశ్చంద్రస్యచోదితా. 43

రాజగు హరిశ్చంద్రున కొకరాత్రి పండ్రెండు వత్సరములుగ తోచినట్లు, దుఃఖమందల్ప కాలమైనను అతి దీర్ఘముగను, సుఖమందధిక కాలమైనను యల్పముగను గన్పించును.

నిశ్చయోయఉదేత్యంతః సత్యాత్మా సత్యఏవచ
హేమ్నీవకటకాదిత్వం సఏవచితిరాజతే. 44

సువర్ణమందు కటకాదియాభరణములవలె చైతన్యమందు సత్యాసత్యస్వరూపముల నిశ్చయము గలుగుచున్నది. వీటితో కూడినదై, ఆ చైతన్యము ప్రకాశించును.

ననిమేషోఽస్తినోకల్పో నాదూరంనచదూరతా
చిదణుప్రతిభైవైవం స్థితాన్యాన్యాన్యవస్తువత్. 45

పరమార్థ దృష్టియందు, నిమేషకల్పములుగాని, దూరత్వసమీపత్వములుగాని లేవు. చిదణువునందున్న చిత్తముయొక్క వృత్తియే భిన్నముగనున్నట్లు కాన్పించుచు, వివిధరూపముల చెన్నొందుచున్నది.

ప్రకాశతమసోర్దూరాదూరయోఃక్షణకల్పయోః
ఏకచిద్దేహయోరేవ నభేదోఽస్తిమనాగపి. 46

ఈ విధముగనే యధిష్ఠానమగు చైతన్యమందు, ప్రకాశాంధకార, సమీపత్వ దూరత్వ, జడ చైతన్యాది భేదములును లేవు.

ప్రత్యక్షమక్షసారత్వా దప్రత్యక్షంతతోఽతిగమ్
దృశ్యత్వేనైషవోదేతి చేత్యాద్రష్టైవ సద్వపుః. 47

ఆత్మయే సర్వేంద్రియములకు శక్తిని గలిగించునదగుటచే ప్రత్యక్షమును, ఇంద్రియాదులకు పరమగుటచే అప్రత్యక్షమును నగును. సద్రూపమును ద్రష్టయు నగు ఈ చైతన్యమే దృశ్యరూపమున ప్రకాశించుచున్నది.

యావత్కటకసంవిత్తి స్తావన్నాస్తీవ హేమతా
యావచ్చదృశ్యతావత్తి స్తావన్నాస్తీవ సాకలా. 48

కటకత్వ బుద్ధియెంతవరకుండునో అంతవరకును, సువర్ణత్వబుద్ధి గలుగనట్లు దృశ్యమందు సత్యత్వబుద్ధి యున్నంతవరకు చిత్స్వరూపబుద్ధి యుదయింపదు.

కటకత్వేఽకృతేఽదృష్టే సువర్ణత్వమివాతతమ్
కేవలంనిర్మలం శుద్ధం బ్రహ్మైవ పరిదృశ్యతే. 49



కటకత్వ బుద్ధి లేనిచో సువర్ణత్వమే భాసించునట్లు, దృశ్యకల్పన లేనపుడు శుద్ధ బ్రహ్మ మొక్కటే మాత్రము వ్యాప్తమైయున్నట్లు కన్పించును.

సర్వాత్మ్యాదేవసద్రూపో దుర్లక్ష్యత్వాదసద్వపుః
చేతనశ్చేతనాత్మత్వా చ్చేత్యాసంభవత స్త్వచిత్. 50

ఆత్మయే సర్వస్వరూపముగుటచే సత్తుగను, దుర్లక్ష్యముగుటచే నసత్తుగనునున్నది. ఎల్లప్పుడును చైతన్యరూపమైయుండునది యాత్మయే. అద్దానియందు విషయరూప మసంభవమగుటచే నీవు దానిని అచేతన (శూన్య) మని పేర్కొంటివి.

చిచ్చమత్కారమాత్రాత్మ న్యస్మింశ్చిత్ప్రతిభాత్మని
జగత్యనిలవృక్షాభే చిచ్చేత్యకలనే కుతః. 51

చిచ్చమత్కారమాత్రమును చిత్స్ఫురణరూపమునునగు ఈ మిథ్యాజగత్తును చైతన్య మెట్లాశ్రయించును?

యథాతాపస్యపీనస్య భానసంమృగతృష్ణికా
ఏవంపీవరమద్వైతం తథాచిద్భాసనంజగత్. 52

ఉష్ణాధిక్యమే, మృగతృష్ణారూపమున నగుపించునట్లు, విశాలమును, అద్వైతరూపమునునగు చిద్వస్తువే జగద్రూపమున వెలుగుచున్నది.

అర్కాంశుభిః సూక్ష్మతరనిర్మాణం యదనామయమ్
అస్తితానాస్తితే తత్ర కల్పాదేరివకైవధీః. 53

సూర్యకిరణ సంయోగముచే సూర్యుని యునికి స్థాపితమగునట్లును, దానియందస్తిత్వ నాస్తిత్వములు రెండును కల్పితములే యగునట్లును, బ్రహ్మమందును కల్పాదులతోకూడిన ఈజగత్తు కల్పింపబడినదై భాసించుచున్నది.

మాయయాంశుకణాంకే ఖే యథాకచతికాంచనమ్
తథాజగదిదంభాతి చిచ్చేత్యకలనే కుతః. 54

సూర్యకిరణ సంయోగముచే నాకసమున కాన్పించు రక్తవర్ణము యవివేకముచే సువర్ణమని తలంపబడునట్లు, అవిద్యచే బ్రహ్మమందు జగత్తును ప్రత్యక్షమగుచున్నది. వాస్తవముగ బ్రహ్మమందు చిత్, చేత్యాది భేదకల్పనయేలేదు.

స్వప్నగంధర్వసంకల్పనగరే కుడ్యవేదనమ్
నసన్నాసద్యథాతద్వద్విద్ధిదీర్ఘభ్రమంజగత్. 55

స్వప్న, గంధర్వనగర, సంకల్పనగరాదులందలి పదార్థముల యనుభవము సత్యమును గాక అసత్యమును గాక కేవలము భ్రమరూపమై యుండునట్లు, ఈ జగత్తుగూడ యాలాగున భ్రమమాత్రమే యని యెఱుంగుము.

తథాస్త్వైవంవిధన్యాయభావనాభ్యాసనిర్మలాత్
చిదాకాశేన నిర్యాతి యథాభూతార్థదర్శినః. 56

ఇట్లు జగన్మిథ్యాత్వమును సూచించు యుక్తులను మరల మరల చింతనచేయుచు, క్రమముగ నభ్యసించుచు రాగా, ముముక్షువుయొక్క చిత్తము నిర్మలమై యవిద్య యంతయు నశింప చిదాకాశము మాత్రము శేషించుటచే, మరల నానికి సంసారదుఃఖ ముదయింపదు.

నకుడ్యాకాశయోర్భేదో దృశ్యసంవేదనాదృతే
ఆబ్రహ్మజీవకలనా ద్వ్యద్రూఢంరూఢమేవచ. 57

భిత్తియందును, ఆకాశమందును, యథార్థముగ భేదములేదు. భేదము కల్పితమేయగును. వస్తువులందలి ఈ భిన్నత్వానుభవము, బ్రహ్మవరకును గల సమస్తజీవులందును, ఏ యే విధమున రూఢిపడియున్నదో ఆయా విధమున గలుగుచుండును.

ప్రతిభాసచ్చిదాకాశే సత్త్వాశూన్యంభవంతితాః
ప్రకచంతిహ్యనిర్భావ్యాః ప్రభాపిండఇవప్రభాః. 58

సూర్యాదుల ప్రకాశమందు మణి, దర్పణాదుల కాంతివలె చిదాకాశమందు చిత్ప్రకాశము చేతనే ఈ లోకములన్నియు ప్రకాశించుచున్నవి.

పృథక్తామతిభాసస్య స్వచమత్కారయోగతః
సర్వాత్మికాహిప్రతిభా పరావృక్షాత్మబీజవత్. 59

భిన్నత్వము గల్గజేయుశక్తిగల చిచ్చమత్కారముచే ద్వైతము తోచినను, అయ్యది అధిష్ఠానమగు బ్రహ్మకంటె భిన్నముకాదు. ఏలయన, పరమోత్తమమగు ఆ యాత్మప్రకాశము బీజమందు వృక్షమువలె వ్యాప్తమై సర్వాత్మకమై యున్నది.

బీజమంతస్థవృక్షత్వం నానాఽనానాయథైకదృక్
తథాఽసంఖ్యజగద్బ్రహ్మ శాంతమాకాశకోశవత్. 60

ఏకమగు బీజము భిన్నాభిన్నరూపములుగ, వృక్షమును తనయందు ధరించునట్లు, నిర్మలాకాశము వంటి బ్రహ్మమును, అసంఖ్యాకములైన జగత్తులన్నిటిని తనయందు గల్గి, అంతటను వ్యాపించి యున్నది.

బీజస్యాంతస్థవృక్షస్య వ్యోమాద్వైతా స్థితిర్యథా
బ్రహ్మణోఽంతస్థజగతః సాక్షిత్వాచ్చిత్స్థితిస్తథా. 61

తనయందు వృక్షసత్త గల్గియున్న బీజముయొక్క స్థితి అతిసూక్ష్మమగుటచే, ఆకాశమువలె నున్నట్లు, బ్రహ్మమందు గల ఈ జగత్తుయొక్క చిద్రూపస్థితియు నాకాశమువలె సూక్ష్మమై యున్నది.

శాంతంసమస్తమజమేకమనాదిమధ్యం నేహాస్తి కాచనకలాకలనాకథంచిత్
నిర్ద్వంద్వశాంతమతిరేకమనేక మచ్ఛమాభాసరూపమజమేకవికాసమాస్తే. 62

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కర్కట్యుపాఖ్యానే ప్రశ్నభేదనం నామాశీతితమః సర్గః ॥ 80 ॥



శాంతమును, జన్మాది వికార రహితమును ఆదిమధ్యాంతములు లేనిదియు, మాయను మాయాకార్యమును రహిత మొనర్చు మహాత్ములచే పొందయోగ్యమయినదియు, ఏకరూపమును, గుణరహితమును, నిర్మలమును, అద్వైత రూపమున, నిరాటంకముగ నంతట వ్యాప్తమైయున్నదియు, చిద్రూపమున నగు బ్రహ్మమొక్కటి మాత్రమే సత్యమై వెలయుచున్నది. యథార్థమున, దీనియందేవిధమైన కల్పనయు లేదు.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున ప్రశ్నభేదనమను అశీతితమ సర్గము ॥ 80 ॥

## ఏకాశీతితమః సర్గః

రాక్షస్యువాచ:—

అహోనుపరమార్థోక్తిః పావనీతవమంత్రిణః
రాజారాజీవపత్రాక్ష ఇదానీమేషభాషతామ్ 1

రాక్షసి:— ఓ మంత్రీ! నీ యీ పారమార్థిక వచనములతి పవిత్రవంతములైనవి. ఇక కమలనేత్రుడగు రాజు నా ప్రశ్నలకు సమాధాన మొసగుగాక!

రాజోవాచ:—

జాగత్ప్రత్యయాభావో యస్యాహుఃప్రత్యయంపరమ్
సర్వసంకల్పసంన్యాస శ్చేతసా యత్పరిగ్రహః. 2

రాజు:— జాగ్రత్స్వప్న సుషుప్తులను త్రివిధావస్థలందును ప్రాపంచిక వృత్తులను రహితమొనర్చుటచేతనే తురీయావస్థ గలుగును. కాని సమస్త సంకల్పములను తొలగింపబడునపుడే అట్టి యాత్మనిష్ఠ సంప్రాప్తించును.

యత్సంకోచవికాసాభ్యాం జగత్ప్రలయసృష్టయః
నిష్ఠావేదాంతవాక్యానా మథవాచామగోచరః. 3

ఎవని సంకోచ వికాసములచే జగత్తుయొక్క ప్రళయము, సృష్టి సంభవించుచున్నవో అతడు వాగతీతుడు. పరమాత్మనుగూర్చి యివ్విధముననే వేదాంత శాస్త్రములందు ప్రతిపాదింపబడినది.

కోటిద్వయాంతరాలస్థం మధ్యేకోటిద్వయీమయమ్
యస్యచిత్తమయీలీలా జగదేతచ్చరాచరమ్. 4

బ్రహ్మము సదసత్తులకు, శూన్యాశూన్యములకును విలక్షణమై అనిర్వచనీయమై యొప్పుచున్నది. అది దేశకాల పరిచ్ఛేదముతో కూడి భాసించుచున్నను, యథార్థముగ, వానితో కూడియుండలేదు. ఈ చరాచర జగత్తంతయు సదసత్తులయొక్కయు, చిజ్జడములయొక్కయు, సంధిరూపమై హిరణ్యగర్భుని చిత్తముయొక్క లీలామాత్రమే యగుచున్నది.

యస్యావిశ్వాత్మకత్వేఽపి ఖండ్యతే నైకపిండతా
సన్మాత్రం తత్త్వయా భద్రే కథ్యతే బ్రహ్మ శాశ్వతమ్. 5

ఓ మంగళస్వరూపిణీ! విశ్వరూపమున ప్రకాశించుచున్నను యెవని ఏకరూపత్వము బాధింపబడక యుండునో, అట్టినిత్యుడగు పరబ్రహ్మను గూర్చియే నీవడిగితివి.

ఏషోఽణుర్వేదనాద్వాయుః స్వభ్రాంతిర్దృగదృశ్యత
అతో న కించిద్వాయ్వాది కేవలం శుద్ధచేతనమ్. 6

చిదణువెపుడు తనయందు వాయురూపానుభవమును పొందునో, అపుడే భ్రాంతిచేనది వాయువుగ గన్పట్టును. నిజముగ దానియందు వాయ్వాదులులేవు. అది కేవలము శుద్ధచైతన్యమగు బ్రహ్మముమాత్రమే యగును.

శబ్దసంవేదనాచ్ఛబ్దః శబ్దస్య భ్రాంతిదర్శనమ్
తతోఽత్ర శబ్దశబ్దార్థ దృష్టేర్దూరతరం గతః. 7

అట్లనే, శబ్దరూపమును భావించుటచే భ్రాంతిచే నయ్యది శబ్దముగనే యనుభూతమగుచున్నది. కాని యథార్థముగ బ్రహ్మము శబ్దార్థములకంటె భిన్నమైనది.

సోఽణుః సర్వం న కించిచ్చ సోఽహం నాహం స ఏవ చ
సర్వశక్త్యాత్మనోఽస్యైవ ప్రతిభైకాత్ర కారణమ్. 8

మాయతో కూడియున్న ఈ పరమాత్మయే సమస్తమును నగును, శుద్ధరూపమున నేదియును గాక యుండును. ఈ సర్వశక్తివంతమగు చైతన్యమే, అహంకారమగును, అహంకారరహిత శుద్ధరూపమగను ప్రకాశించుచున్నది.

ఆత్మా యత్నశతప్రాప్యో లబ్ధేఽస్మిన్న చ కించన
లబ్ధం భవతి తచ్చైతత్పరమం నాన కించన. 9

ఆత్మజ్ఞానము లభించుట కష్టసాధ్యము. అనేక యత్నములచేతనే అది పొందబడును. అట్లు పొందబడిన నిక దానికి మించిన లాభమెద్దియులేదు.

తావజ్జన్మవనం తేషు సంసృతిప్రతతిశ్చిరమ్
వికసత్యుదితో యావన్న బోధో మూలకాషకృత్. 10

మూలాజ్ఞానము నశింపనంతవరకు ఆత్మజ్ఞానము పూర్ణముగ లభ్యముకాదు. మరియు యెంతవరకాత్మబోధ గలుగదో, అంతవరకును సంసారవృక్షము విజృంభించుచునేయుండును.

అణునానేన రూపత్వం దృశ్యతామివగచ్ఛతా
తాపేనాంబుధియేవేదం స్వస్థేనైవాపహారితమ్. 11

ఆత్మయే సాకారరూపము వహించి దృశ్యమగునపుడు, అట్టి దృశ్యమందు మగ్నుడగు అజ్ఞాని మరుభూమియందలి యెండమావులందు జలబుద్ధిగలవానివలె, స్వస్థ (విషయ భోగయుక్తమగు) జీవితముచే తన యాత్మను తాను నశింపజేసికొనుచున్నాడు.



అనేన సంవిదణునా మేరుస్త్రిభువనం తృణమ్
వమిత్వా బహిరంతస్థం మాయాత్మకమపేక్ష్యతే. 12

ఈ చిదణువే మేరుపర్వతమునుగూడ తనయందుగల్గి, త్రిలోకములను సైతము తృణప్రాయముగ నొనర్చుచున్నది. మరియు, తనయందున్న జగత్తును వెలుపలకు గ్రక్కి, మాయారూపమున నద్దానిని బాహ్యముననే గాంచుచున్నది.

చిదణోరంతరే యద్యదస్తి తద్దృశ్యతే బహిః
సంకల్పస్త్ర్యాలింగనాది దృష్టాంతోఽత్ర హి రాగిణః. 13

ఈ చేతనాణువందేయే పదార్థములు గలవో, అవియే బాహ్యమునను యగుపడుచున్నవి. కాముకుడు తన సంకల్పిత స్త్రీని బాహ్యదేశమున యాలింగన మొనర్చుకొనుటయే యిందులకు దృష్టాంతము.

ఆదిసర్గే సర్వశక్తిశ్చిద్యథైవోదితాత్మనా
తథాశు పశ్యత్యఖిలం సంకల్పే పర్వతః స్వతః. 14

ఆది సృష్టియందు సర్వశక్తిమంతుడగు పరమాత్మ ఏ విధమున వ్యక్తమగునో, ఆ విధముననే తన సంకల్పమందును శీఘ్రముగ గాంచును.

అభిజాతస్య యస్యాంతర్యద్యథా ప్రతిభాసతే
తత్తథా పశ్యతీవాసౌ దృష్టాంతోఽత్ర శిశోర్మనః. 15

హిరణ్యగర్భాత్మక మనోరూపమున వ్యక్తమయిన పరమాత్మయందు ఏయే పదార్థమెవ్విధమున భాసించునో ఆ విధముననే చైతన్యమద్దానిని గాంచుచుండును. బాలునిచిత్తమే యిందులకు దృష్టాంతము.

పరమాణుతయైవాపి చిన్మాత్రేణాణునామునా
పరిసూక్ష్మతమేనైవ విష్వగ్విశ్వం ప్రపూరితమ్. 16

ఈ చిదణువే దేశకాలవస్తురూపమున అంతటను నిండియున్నది.

అణురేవ నమాత్యేష యోజనానాం శతేష్వపి
సర్వగత్వాదనాదిత్వాదరూపత్వాదనాకృతిః. 17

సర్వగామియు, అనాదియునగుటచే ఈ యణువు ఆకారరహితమై యొప్పుచున్నది. కాన అనేక యోజనములది వ్యాపించియున్నది.

యథా ధూర్తేన ఖంగేన పుంసా బాలః ప్రతార్యతే
సుభ్రూవికారనయననిరీక్షణవిచేష్టితైః. 18

చిదాలోకేన శుద్ధేన సపర్వతతృణం జగత్
నాట్యతేఽవిరతం తద్వద్వివృత్త్యాభినయం సదా. 19

కాముకుడును, ధూర్తుడును నగువాడు తన నేత్రాదుల చేష్టలచే నజ్ఞులగు స్త్రీలను తన వశమొనర్చుకొనునట్లు శుద్ధచిత్ప్రకాశమును, అనేక చేష్టలఁజేయుచు, పర్వత తృణాదులతో కూడిన ఈ జగత్తంతను తన వశమొనర్చుకొని నాట్యమాడించుచున్నది.

తేనైవానంతరూపత్వాదణునా వాసనాయథా
సంవిదా తద్భవద్బాహ్యా కృత్వామేర్వాదివేష్టితమ్. 20

చేతనారూపమగు అణువే మేర్వాది పర్వతములుగల యీ జగత్తును బాహ్యమున గాంచుచున్నను, వాస్తవముగ తనయందేగలదై, అద్దానిని పరివేష్టించి ప్రకాశించుచున్నది.

దిక్కాలాద్యనవచ్ఛిన్న రూపత్వాన్మేరుతోఽబృహత్
బాలాగ్రశతభాగాత్మా ప్యేషసూక్ష్మఃపరోఽణుకః. 21

కేశాగ్రముయొక్క నూఱవ భాగముకంటెను సూక్ష్మమైయున్నను, అయ్యది దేశకాల వస్తుపరిచ్ఛేద రహితమగుటచే మేరువుకంటెను స్థూలమైనది.

శుద్ధసంవేదనాకాశరూపస్య పరమాణునా
శోభతే నహిసామ్యోక్తి ర్మేరుసర్షపయోరివ. 22

శుద్ధజ్ఞానస్వరూప, (ఆవగింజ) పరమాణువుల సామ్యమెద్దానిని మీరు నిరూపించియున్నారో, అదిసరికాదు మేరు సర్షపములవలె చైన్యమునకును, పరమాణువునకును సామ్యమెన్నటికిని సిద్ధింపదు.

మాయాకలాపినాణుత్వం నిర్మాయపరమాత్మని
హేమ్నీవకటకత్వేన నానాత్రసమతాభవేత్. 23

మాయావేష్టితమై యున్నను, పరమాత్మయందణుత్వము సిద్ధింపనేరదు. సువర్ణ, కటకాదులందలి సామ్యమును, యిచటకలుగజాలదు. అణుత్వమును, మహత్వమును, రెండును పరమాత్మయందు కల్పితములే.

ప్రకటోఽనేనదీపేన ప్రకాశోఽనుభవాత్మనా
స్వసత్తానాశపూర్వోహి వినానేన భవేత్తతః. 24

ఈ చైతన్య మాత్మస్వరూపమై యుండుటచే, ప్రకాశాంధకారములు రెండును, ఆత్మదీపముచేతనే ప్రకాశించుచున్నవి. అనుభవరూపమగు ఆత్మదీపప్రకాశములేక, ప్రకాశాంధకారముల యనుభవ మెన్నటికిని జీవులకు కానేరదు. వారియందు సద్వస్తువులేనిచో, అవియును లేనివేయగును.

యదిసూర్యాదికం సర్వం జగదేకం జడంభవేత్
తతఃకిమాత్మకంరూపం ప్రకాశఃస్యాత్క్వవాధకిమ్. 25

సూర్యాది పదార్థయుక్తమగు ఈ జగత్తంతయు జడమే అయిన, దానిని ప్రకాశింపజేయు చైతన్యము మరియొకటి లేనిచో, అయ్యదెట్లు స్థితిగల్గి యుండగలదు? (అనగా, ఆత్మ చైతన్యము లేనిచో, జగత్సత్తయే యుండజాలదని భావము.)

శుద్ధసన్మాత్రచిత్త్వంయత్స్వతః స్వాత్మనిసంస్థితమ్
తదేతదణునా తేజో దృష్టంబహిరవస్థితమ్. 26

శుద్ధజ్ఞాన స్వరూపమగు ఈ చైతన్యము తన రూపములేయగు ప్రకాశాంధకారాదులను తనయందు కల్పించుకొని యున్నది. మరియు నదియే ప్రకాశాదులను బాహ్యమునను గాంచుచున్నది.



తేజాంస్యర్కేందువహ్నీనాం నభిన్నానితమోఘనాత్
ఏతావానేవభేదోఽస్తి యద్వర్ణేశౌక్ల్యకృష్ణతే. 27

సూర్యచంద్రాగ్న్యాదుల ప్రకాశములు తమ కారణమగు అజ్ఞానముకంటె భిన్నములుకావు. కాని ప్రకాశము యొక్క వర్ణము తెలుపు. అజ్ఞానము యొక్క వర్ణము నలుపు. జడత్వ దృష్టియందు రెండును సమమే.

యాదృక్కజ్జలనీహారే మేఘనీహారయోర్భవేత్
తాదృక్ప్రకాశతమసో ర్భేదోనేతి తయోఃస్థితిః. 28

తుషార మేఘముల గల భేదమే ప్రకాశాంధకారములకును గలదు. రెంటిస్థితియు నొకటేయగును.

జడయోరుపలంభాయ చిదాదిత్యఃకిలైతయోః
యదా తపతితేనైతే లబ్ధసత్తైకతాం గతే. 29

ఏ చైతన్యమను సూర్యునిచే జడములగు ప్రకాశాంధకారములు రెండును తెలిసికొనబడుచున్నవో, అట్టి చైతన్యము నుండియే సంప్రాప్తించిన సత్త రెంటికిని సమమే.

తపత్యేకశ్చిదాదిత్యో రాత్రిందివమతంద్రితః
అంతర్బహిఃశిలాద్యంత రప్యనస్తమయోదయః. 30

సూర్యాదుల ప్రకాశము ఏకదేశమును, ఆత్మ ప్రకాశమునకధీనమును అగును. కాని చైతన్యమను సూర్యుడు, అహోరాత్రములు యెడతెగక బాహ్యాభ్యంతరములందును, శిలయందును గూడ, తమస్సునకు తావీయక నిరంతరము ప్రకాశించుచున్నాడు.

త్రిలోకీభాతితేనేయం జీవస్యప్రథితాత్మనః
నానోపలంభభాండాఢ్యా కుటీ కఠినకోటరా. 31

ఆత్మసాక్షాత్కారము బడసిన జీవునకు వివిధభోగ, వ్యవహారములతో కూడియున్న ఈ త్రిలోక కుటీరము ఆత్మతేజముచేతనే ప్రకాశించుచున్నట్లు, యనుభూతమగును.

తమస్త్వం తమసోదేహ మవినాశియతామునా
తప్యతేభాసయాభాసా సర్వమాభాస్యతేతమః. 32

ఈ చైతన్యము [illegible] చేయక దానిని కార్యరూపమున ప్రవృత్తిగల్గి యుండునటుల గావించుచున్నది. [illegible] రూపమున ప్రకాశిం[illegible] మెునర్పబడినవి.

పద్మోత్పలేయథార్కేణ తపతాప్రకటీకృతే
ప్రకాశతమసోఃసత్తే చిత్త్వైవంప్రకటీకృతే. 33

వెలుగుచున్న సూర్యుడు పద్మోత్పలముల వ్యక్తపరచునట్లు, చిద్వస్తువే ప్రకాశాంధకారముల రెంటిసత్తను వ్యక్తపరచుచున్నది.

అర్కఃకుర్వన్నహోరాత్రే దర్శయత్యాకృతింయథా
చితిఃసదసతీకృత్వా దర్శయత్యాకృతింతథా. 34

సూర్యుడు దినరాత్రి నిర్మాణమొనర్చునట్లు, చైతన్యమే సదసత్తుల రెంటికిని సత్తను గల్గజేయుచున్నది.

చిదణోరంతరేసంతి సమగ్రానుభవాణవః
యథామధురసస్యాంతః పుష్పపత్రఫలశ్రియః. 35

వృక్షరసమందు పత్రపుష్పఫలాదులన్నియు సూక్ష్మరూపమున నుండునట్లు చిదణువందు అనుభవములన్నియు, స్థితిగల్గియుండును.

ఉద్యంతిచిదణోరేతే సమగ్రానుభవాణవః
మధుమాసరసాచ్చిత్రా ఇవఖండపరంపరాః. 36

వసంతకాలమందలి వృక్షరసమునుండియే వనముయొక్క సౌందర్యవిశేషమంతయు గలుగునటుల చేతనాణువునుండియే సర్వానుభవములుత్పన్నములగును.

పరమాత్మాణురత్యంతనిఃస్వాదుఃసూక్ష్మతావశాత్
సమగ్రస్వాదుసత్తైకజనకఃస్వదతేస్వయమ్. 37

అతి సూక్ష్మమగుటచే నస్వాదువుగ గన్పించినను, అది రుచులన్నింటి యుత్పత్తికి హేతువగుచున్నది. ఏలయన, ఈ చైతన్యమనుభవరూపమున యెల్లకాలములందును సర్వులచే నాస్వాదింపబడుచునే యున్నది.

యోయోనామరసఃకశ్చి త్సమస్తోఽప్యప్స్వవస్థితః
ప్రతిబింబమివాదర్శే తంవినానాస్త్యసౌస్వతః. 38

వివిధజలములందలి రసములన్నియు, ఈ చైతన్యప్రతిబింబములే యగును. చైతన్యాభావముచే రసమనునదే సిద్ధింపదుగదా!

త్యజతానంస్థితంసర్వం చిన్మాత్రపరమాణునా
త్యక్తంజగదసంవిత్త్యా సంవిత్త్యాసర్వమాశ్రితమ్. 39

ఈ పరమాత్మ శుద్ధచైతన్యస్వరూపుడగుటచే వ్యక్తముగానందున సమస్తమును త్యజించియున్నట్లుండినను, స్ఫురణరూపముచే జగత్తునకాశ్రయమై వెలయుచున్నాడు.

అశక్త్యాస్వాత్మగుప్తౌ సర్వమాచ్ఛాదితంజగత్
చిత్తాణుతామేవపరాం సంప్రసార్యవితానవత్. 40

చేతనారూపమగు అణువు సర్వవ్యాపకమగుటచే, తన్నాచ్ఛాదించుకొనజాలకున్నది. కాని తన చైతన్యమును విస్తరించి, బ్రహ్మాండమునంతను గప్పియున్నది.

ఆత్మగుప్తౌనశక్నోతి పరమాత్మాంబరాకృతిః
మనాగపిక్షణమపి గజో దూర్వావనేయథా. 41

తృణము మాత్రముగల వనమందు గజము, తన్నాచ్ఛాదించుకొనజాలనట్లు, ఆకాశమువలె విశాలమగు యాకృతిగల పరమాత్మ తన్ను గప్పుకొని యుండజాలదు.



తథాప్యాకాశాంతవాన్విశ్వం జ్ఞాతోగోపాయతిక్షణాత్
జగద్ధానాకణంబాల ఇవాహోఘనమాయితా. 42

అతడీవిశ్వమంతటను వ్యాపించియుండెను. బాలుడు క్షేత్రమందు ధాన్యమును రక్షించునట్లు, పరమాత్మ క్షణములో నీ జగత్తంతను రక్షించుచున్నాడు. ఇట్లు తన్నాచ్ఛాదించుకొనజాలక జగత్తునంతయు నాచ్ఛాదించుట యనునది మాయయొక్క విచిత్రశక్తియే యగును.

చిన్మాత్రాన్నునయేనేదం జగత్సన్నపిజీవతి
వసంతరసబోధేన విచిత్రేవ వనావలీ. 43

వసంతాగమనముచే వనమందలి చిత్రవిచిత్రములగు వృక్షజాలమంతయు వికసించునటుల, చేతనాశ్రయమాత్రముచే ప్రలయమందు లీనమై సంస్కారమాత్రముగనున్న ఈ జగత్తంతయు మరలనుత్పన్నమగును.

చిత్తసత్తైవమఖిలం స్వతోజగదివోదితమ్
మధుమాసరసోల్లాసా చ్చిత్రోహివనఖండకః. 44

వసంతకాల వృక్షరసవిశేషముచే వనమందలి వృక్షములన్నియు వికసించునటుల, తన శక్తిచే ప్రలయమందు లీనమైయున్న జగత్తు మరల వికాసమును జెందును.

సత్యంచిన్మయమేవేదం జగదిత్యేవవిద్ధ్యలమ్
వసంతరసమేవ త్వం విద్ధిపల్లవగుల్మకమ్. 45

పత్రపుష్పలతాదులన్నియు వృక్షరసముమాత్రమే యైనట్లు, విశ్వమంతయు వాస్తవముగ చిన్మాత్రమనియే యెఱుంగుము.

సర్వావయవిసారత్వా త్సహస్రకరలోచనః
పరమాణురసావేవ నిత్యానవయవోదయః 46

ఈ చిదణువు అవయవరహితమైనను, అండజాది చతుర్విధప్రాణుల యంతరాత్మయగుటచే, అనేక హస్తనేత్రాదులు గల్గియున్నది.

నిమేషాంశావబోధోహి చిదణోఃప్రతిభాసతే
యతః కల్పసహస్రౌఘః స్వప్నేవార్ధకబాల్యవత్. 47

స్వప్నమందలి, బాల్యవార్ధక్యములవలె ఈ చేతనాణువుయొక్క నిమేషాంశమును అనేక కల్పములవలె తోచును.

తతఃసోఽపి నిమేషోఽణుః కల్పకోటిశతాన్యలమ్
సర్వసత్తావిలాసేన ప్రతిభైకావిజృంభతే. 48

ఆ పరమాత్మవలననే నిముషకాలమును, అనేకకోట్ల కల్పములుగా గన్పట్టుచున్నది. చేతనసత్తయొక్క స్ఫురణయే కల్పాదిరూపమును ధరించి శోభించుచున్నది.

అభుక్తవత్యేవయథా భుక్తవానహమిత్యలం
జాయతేప్రత్యయస్తద్వ న్నిమేషేకల్పనిశ్చయః. 49

భుజింపకున్నను, భుజించినట్లు స్వప్నమందనుభూతమగులాగున నిముషమందును కల్ప ప్రతీతి కలుగవచ్చును.

అభుక్త్వాభుక్తవానస్మీత్యేవంప్రత్యయశాలినః
దృశ్యంతేవాసనావిష్టాః స్వప్నేస్వమరణంయథా. 50

జీవించియున్నను, స్వప్నమునందు తాను మరణించినట్లును, భుజింపకయుండినను భుజించినట్లును మిథ్యానుభవమును గలుగజేయు వృత్తులు వాసనావృతములై యుండును.

జగంతిపరితిష్ఠంతి పరమాణౌ చిదాత్మని
ప్రతిభాసాః ప్రవర్తంతే తతఏవహిజాగతాః. 51

ఈ చైతన్యాణువునందే జగత్తులన్నియునుగలవు. జగత్సంబంధములగు స్ఫురణలన్నియు దీనివలననే గలుగుచున్నవి.

యదస్తియత్రతత్తస్మాత్సముదేతితదేవతత్
ఆకారిణివికారాది దృష్టంనగగనేఽమలే. 52

స్తంభమందు విగ్రహమువలె, ఏ పదార్థమెచట యునికిగలిగి యుండునో, అచటనే అయ్యది యుత్పన్నమగును. ఏలయన విగ్రహము స్తంభరూపమేగదా! ఏది యెచట యుండజాలదో, అయ్యది యచట ఉత్పన్నమవదు. కారణరహితమగు నిర్మల చిదాకాశమందేదియు నుత్పన్నమగుట లేదుగదా!

చితిభూతానిభూతాని వర్తమానానిసంప్రతి
భవిష్యంతిచభూతాని సంతి బీజేద్రుమా ఇవ. 53

బీజమందు వృక్షమున్నట్లు, ఈ చైతన్యమందే భూతభవిష్యద్వర్తమాన కాలమందలి జగత్తులును అందలి ప్రాణిసమూహములన్నియును గలవు.

నిమేషకల్పావేతేన తుషేణాన్నకణావివ
వలితావేవచేత్యాభ్యామణుః స్వాత్మాంగకంశ్రితః. 54

పొట్టుచే బియ్యపుగింజ కప్పబడియుండునట్లు చిద్వస్తువుచే నిమేషకల్పములావృతములై యున్నవి. విషయరూపములగు ఈ రెంటిని చైతన్యము తనయందేకదేశీయముగా నొనర్చినది.

ఉదాసీనవదాసీనో నసంస్పృష్టోమనాగపి
ఏషభోక్తృత్వకర్తృత్వైః స్వాత్మాసర్వజగత్యపి. 55

చైతన్యము జగత్తునకంతయు ఆత్మయైయున్నను, కర్తృత్వ భోక్తృత్వాదులచే స్పృశింపబడక, కేవలముదాసీనముగనే నున్నది.

జగత్సత్తోదితేయం హి శుద్ధచిత్పరమాణుతః
పరమాణోశ్చభోక్తృత్వకర్తృత్వేకేవలంస్థితే. 56

దీనిచేతనే జగత్సత్త యుదయించుచున్నది. ఇట్టి యాత్మయందలి కర్తృత్వ భోక్తృత్వములు మాయాకల్పితములేయగును.



జగన్నకించిత్క్రియతే సర్వదైవనకేనచిత్
విలీయతేచనోకించి న్మానుషాద్దృశ్యఖండనమ్. 57

జగత్తెప్పుడును, యెవుడును సృష్టించుటలేదు. లయమొనర్చుటలేదు, సృష్టి లయములు రెండును కల్పితములే. వేదాంతవాక్యములచే దృశ్యమును నిరసించుటనునది వ్యవహార దృష్టిచేగాని, పరమార్థమున గాదు (పరమార్థమున దృశ్యమేయుండదు గాన.)

సర్వంసమసమాభాస మిదమాకాశకోశకమ్
జగత్త్రయోపశబ్దంచ విద్ధ్యనాద్యంనిశాచరి. 58

ఓ రాక్షసీ! ఈ జగత్తంతయు సమమును, స్ఫురణరూపమునునగు కేవల చిదాకాశమాత్రమే అయినను, నామరూపయుక్తమైనందున వాక్కునకు విషయమును, వికారవంతమును నయియున్నదని యెఱుంగుము.

చిదణుర్దృశ్యసిద్ధ్యర్థ మాంతరీంచిచ్చమత్క్రియామ్
బహీరూపతయాధత్తే స్వాత్మనిపరిసంస్థితామ్. 59

చిదణువే దృశ్యసిద్ధి కొరకై తనయందలి మాయావిశిష్టమగు చైతన్యరూప చమత్కృతినే బాహ్యప్రపంచ రూపమున ధరించుచున్నది.

ఏతద్బహిష్ఠమంతస్థ మస్తిశబ్దేన వస్తుని
ఉపదేశాయసత్త్వానాం చిద్రూపత్వాజ్జగత్రయే. 60

ఆత్మయందంతర్భూతమగు నీజగత్తు బాహ్యమున గలదని వచించుట గూడ, ఈ త్రిలోకములందలి యధికారిజీవుల యుపదేశము కొరకేయగును గాని, వాస్తవము గాదు.

ద్రష్టాఽదృష్టపదంగచ్ఛన్నాత్మానం సంప్రపశ్యతి
నేత్రదృశ్యాభిపాతీవ సదేవాసదివస్థితమ్. 61

ద్రష్టయగు ఆత్మ నేత్రములద్వారా బాహ్యవిషయావలోకనము చేయుచు, సద్వస్తువగు చైతన్యమునే అసత్తగు ఘటపటాదిరూపమున గాంచుచున్నది.

నచగచ్ఛతిదృశ్యత్వం ద్రష్టాహ్యాసదవాస్తవమ్
ఆత్మన్యేవనయత్కించి త్తత్తామేతికథంపరః. 62

పరమార్థదృష్టియందు శుద్ధచైతన్యమగు ద్రష్ట దృశ్యరూపమును పొందజాలదు. ఏవస్తువు యథార్థముగ తనయందులేదో అద్దానినదెట్లుపొందగలదు?

దృగేవలోచనేసాచ వాసనాంతం నిజంవపుః
బహీరూపతయాదృశ్యం కృత్వాద్రష్టృతయోదితా. 63

నిత్యమును, అపరోక్షచైతన్యమునునగు దృక్-శక్తియే నేత్రము. ఈ దృక్-శక్తియే వాసనారూపమగు దృశ్యమును రచించి, దానికి ద్రష్టృత్వము వహించుచున్నది.

నవినాద్రష్టృతామస్తి దృశ్యసత్తాకథంచన
పితృతేవవినాపుత్రం ద్విత్వైక్యపదంవినా. 64

తండ్రిలేనిచో పుత్రుడును, ఏకత్వములేనిచో ద్వైతమును యుండనట్లు ద్రష్టయొక్క సత్తలేక దృశ్యసత్త యెన్నటికిని సిద్ధింపదు.

ద్రష్టైవదృశ్యతామేతి నద్రష్టృత్వంవినాస్తితత్
వినాపిత్రేవతనయో వినాభోక్త్రేవభోగ్యతా. 65

ద్రష్టయగు ఆత్మయే దృశ్యభావమును పొందుచున్నది. ఏలయన, తండ్రిలేనిచో పుత్రుడును, భోక్తలేనిచో భోజ్యమును యుండజాలనట్లు ద్రష్టయొక్క అభావముచే దృశ్యమున్ను సిద్ధింపదు.

ద్రష్టృదృశ్యవినిర్మాణే చిత్త్వాదస్త్యేవ శక్తతా
కనకస్యావదాతస్య కటకాదికృతావివ. 66

సువర్ణమునకు, కటకాది యాభరణ నిర్మాణమందెట్లు సామర్థ్యముగలదో, అట్లనే చైతన్యమగుటచే ద్రష్టకును దృశ్యనిర్మాణ సామర్థ్యముగలదు.

దృశ్యస్యద్రష్టృనిర్మాణే జడత్వాన్నాస్తిశక్తతా
కటకస్యతుహైమస్య యథాకనకనిర్మితౌ. 67

కటకాది యాభరణములు సువర్ణమునకు సత్తను గలుగజేయనసమర్థములగునట్లు, జడమగుటచే దృశ్యము ద్రష్టకు సత్తను గల్గజేయజాలదు.

చేతనాదృశ్యనిర్మాణం చిత్కరోత్యసదేవసత్
అకారణంమోహహేతుం హేమేవకటకభ్రమమ్. 68

అవివేకముచే సువర్ణమందు కటకాదుల భ్రమగలుగునట్లు, చిత్-శక్తినిర్మితమగు దృశ్యమందును, సత్యభ్రాంతి గలుగుచున్నది.

కటకత్వావభాసేహి యథాహేమ్నోనహేమతా
సత్యేవప్రకచత్యేవం ద్రష్టృదృశ్యస్థితౌవపుః. 69

కటకత్వము స్ఫురించినపుడు, సువర్ణత్వమెట్లు స్ఫురింపదో, అట్లనే దృశ్యస్ఫురణకాలమందు ద్రష్టయు స్ఫురింపదు.

ద్రష్టా దృశ్యతయాత్మిన్ ద్రష్టృతాముపజీవతి
సత్యాంకటకసంవిత్తౌ హేమేకాంచనతామివ. 70

ఆభరణము స్ఫురించినపుడు సువర్ణమే దానికి సత్తను గలుగజేయునదగునట్లు, దృశ్యమునకు గూడ చేతనమగు ద్రష్టయే సత్తను గల్గజేయుచున్నది.

ఏకస్మిన్ప్రతిభాసేహి నసత్తాద్రష్టృదృశ్యయోః
పుంప్రత్యయప్రకచనే క్వపశుప్రత్యయోదయః. 71

సువర్ణత్వకటకత్వాదులు రెండును ఒకేసమయమున స్ఫురింపనట్లు ద్రష్టృదృశ్యములు రెండును, ఒకే సమయమున ప్రకాశింపజాలవు. దూరస్థవస్తువును గాంచిన మనుజుడు, అయ్యది పశువా, మనుజుడాయని తలంచునప్పుడు, పశ్వాకారవృత్తి ఉదయించినచో మనుజుడును, మనుజాకారవృత్తి గల్గినచో, పశువును వానియందు స్ఫురింపకుండుటయే యిందులకు దృష్టాంతము.



దృశ్యంపశ్యన్స్వమాత్మానం నద్రష్టాసంప్రపశ్యతి
ద్రష్టుర్హిదృశ్యతాపత్తౌ సత్తాఽసత్తైవతిష్ఠతి. 72

ద్రష్ట, దృశ్యమును గాంచునపుడు తనయాత్మను గాంచజాలదు: అనగా దృశ్యాకారవృత్తి గలుగునపుడు, ఆత్మాకారవృత్తి సంభవింపదు. ఏలయనగా, దృశ్యము భాసించునపుడుగూడ ఆత్మసత్త యున్నప్పటికిని, అపుడది వానికసత్తుల్యమే యగును.

బోధాద్గలితదృశ్యస్య ద్రష్టుఃసత్తైవభాసతే
అబుద్ధేకటకేస్వస్య హేమ్నోఽకటకతాయథా. 73

కటకత్వదృష్టిలేనిచో, సువర్ణమందు కటకము స్ఫురింపనట్లు వివేకముచే దృశ్యభ్రాంతి తొలగిన కేవలము ద్రష్టమాత్రము ప్రకాశించును.

దృశ్యేసత్యస్తివై ద్రష్టా దృశ్యంద్రష్టరిభాసతే
ద్వయేనచ వినానైకం నైకమప్యస్తిచానయోః. 74

దృశ్యమున్నపుడే ద్రష్ట (త్రిపుటియందంతర్గతుడు) యు, ద్రష్టయున్నపుడే దృశ్యమునుండును. జ్ఞానోత్పత్తిచే దృశ్యమెపుడు నశించునో, అపుడు ద్రష్టృదృశ్యములు రెండును లేనివగుచున్నవి.

సర్వంయథావద్విజ్ఞాయ శుద్ధసంవిన్మయాత్మనా
వాచామవిషయంస్వచ్ఛం కించిదేవావశిష్యతే. 75

శుద్ధజ్ఞానస్వరూపుడగు ఆత్మనుగూర్చి అంతయు నెరింగినను, వాగతీత పరిశుద్ధాత్మస్వరూపమింకను శేషించియే యుండును. (అది కేవలమనుభవైక వేద్యమే).

ఆత్మానందర్శనందృశ్యం దీపేనేవావభాసితమ్
కృతంచసర్వమేతేన చిన్మాత్రపరమాణునా. 76

ద్రష్టృదర్శన దృశ్యముల మూటిని ఆత్మయే, (పదార్థములను దీపమువలె) ప్రకాశింపజేయుచున్నది. చైతన్యరూపమగు ఆత్మచేతనే యీ మూడును స్థితివంతములగుచున్నవి.

మాతృమానప్రమేయాఖ్యం బుధోనిగిరతిత్రయమ్
హేమేవకటకాదిత్వ మసన్మయముపస్థితమ్. 77

అసద్రూపమున వెలసిన కటకత్వము సువర్ణమందు లయమొనర్పబడునట్లు ప్రమాతృ ప్రమాణ ప్రమేయ రూపమగు త్రిపుటి, జ్ఞానిచే ఆత్మయందే లయమొనర్పబడును.

యథా నజలభూమాద్యైః పృథక్కించిన్మనాగపి
తథైతస్మాత్స్వభావాణోర్నకించిత్పృథగస్తిహి. 78

పృథ్వ్యాది భూతసముదాయమునకంటె భిన్నముగ దృశ్యవస్తువేదియులేనట్లు స్వభావసిద్ధమగు చేతనాణువుకంటె భిన్నముగ నేపదార్థమును లేదు.

సర్వగానుభవాత్మత్వా త్సర్వానుభవరూపతః
ఏకత్వానుభవన్యాయే రూఢేసర్వైకతాస్వహి. 79

ఆత్మసర్వవ్యాపియు, సర్వానుభవస్వరూపమును అగుటచే, ఆత్మానుభవ మెప్పుడు సిద్ధించునో అప్పుడన్నింటితో నైక్యము సహజముగ సంప్రాప్తమగును.

అస్యేచ్ఛయాఽపృథఙ్నాస్తి వీచితేవ మహాంభసః
ఇచ్ఛానురూపసంపత్తేర్భావితార్థైకతా కిల. 80

ఆత్మేచ్ఛానుసారము ఫలప్రాప్తిగలుగుటచే, పదార్థేచ్ఛల కైక్యము సిద్ధించుచున్నది. కాన సముద్రముకంటె తరంగములు వేఱుగానట్లు, ఆత్మేచ్ఛకన్యముగ నెద్దియును లేదు.

దిక్కాలాద్యనవచ్ఛిన్నః పరమాత్మాస్తి కేవలః
సర్వాత్మత్వాత్స సర్వాత్మ సర్వానుభవతః స్వతః. 81

ఈ పరమాత్మ దేశకాలవస్తువులచే నపరిచ్ఛిన్నుడు. అందఱియాత్మయే తానగుటచే అతనికి భిన్నమైన దేదియును లేదు. మరియు నాతడు సర్వుల యనుభవస్వరూపుడై వెలుగుచున్నాడు.

సన్నేష చేతనాత్మత్వాద్దర్శనానవబోధతః
ద్వైతైక్యే నాత్ర విద్యేతే సర్వరూపే మహాత్మని. 82

పరమాత్మ సచ్చిత్స్వరూపుడు, నేత్రాదీంద్రియములచే నెఱుగబడనందున, అతని నవివేకులు అసత్తుల్యునిగ భావించెదరు. సర్వస్వరూపుడగు పరమాత్మయందు ద్వైత, ఏకత్వాది భేదములు ఘటిల్లవు.

యది కశ్చిద్ద్వితీయః స్యాత్తదైకస్యైకతా భవేత్
ద్వైతైక్యయోర్మిథః సిద్ధిరాతపచ్ఛాయయోరివ. 83

ద్వైతము మిథ్యయనియు, ఏకత్వము సత్యమనియు కూడ చెప్పఁదగదు. రెండవ వస్తువుండినచో, ఏకత్వమనునది సంభవించును. కాన, ఛాయాతపములవలె ద్వైత, ఏకత్వములలో ఒకదాని యునికిలేక రెండవది సిద్ధింపదు.

యత్ర నాస్తి ద్వితీయో హి తత్రైకస్యైకతా కథమ్
ఏకతాయామసిద్ధాయాం ద్వయమేవ న విద్యతే. 84

రెండవ వస్తువే లేనపుడు, ఏకవస్తువుయొక్క యేకత్వమెట్లుండగలదు? ఏకత్వమెపుడు లేనిదగునో, అపుడు ద్వైతైకత్వములు రెండును లేనివేయగును.

ఏవం స్థితే తు యస్మింస్తత్తాదృక్తదివాస్తి హి
తస్మాన్న వ్యతిరిక్తం తద్రూపం ద్రవ ఇవాంభసః. 85

ఇట్లాత్మతత్త్వము ద్వైతాద్వైత భేదరహితమని స్థిరపరుపబడినను, సముద్రముకంటె ద్రవత్వము వేఱుకానట్లు, ద్వైతైకత్వములు రెండును ఆ పరమాత్మకంటె భిన్నములు కావని యెఱుంగనగును.

నానారంభవిభాసం చ సామ్యేనాక్షుబ్ధరూపిణః
బీజస్యాంతస్తరురివ బ్రహ్మణోఽంతః స్థితం జగత్. 86

బీజమందు వృక్షమువలె, సత్త్వరజస్తమోగుణ సామ్యస్థితినుండి చ్యుతినిబొందిన బ్రహ్మమందు అనేక కార్యజాతములలో కూడియున్న ఈ జగత్తంతయును గలదు.



ద్వైతమప్యపృథక్తస్మాద్ధేమ్నః కటకతా యథా
సమ్యగ్బుద్ధావబోధో హి ద్వైతం తచ్చ న సన్మయమ్. 87

సువర్ణాభరణములు వేఱుగానట్లు, ద్వైతప్రపంచమున్ను బ్రహ్మకన్యముకాదు. ఉత్తమబోధగలిగిన తత్త్వవేత్త ఈ ద్వైతస్థితియొక్క, యాథార్థ్యమెఱింగియుండును. కాన ద్వైతము మిథ్యయనియే ఆతడు నిశ్చయించును.

యథా ద్రవత్వం పయసః స్పందనం మాతరిశ్వనః
వ్యోమ్నః శూన్యత్వమేవం హి న పృథగ్ద్వైతమీశ్వరాత్. 88

జలమునకు ద్రవత్వము, వాయువునకు చలనము, ఆకాశమునకు శూన్యత్వమును వేఱుకాకయున్నట్లు ఈశ్వరునకే ద్వైతప్రపంచమును అన్యముగాక యున్నది.

ద్వైతాద్వైతోపలంభో హి దుఃఖాయైవ క్రియాత్మనే
నిపుణోఽనుపలంభో యస్త్వేతయోస్తత్పరం విదుః. 89

క్రియాత్మకములగు ద్వైతాద్వైతానుభవములు రెండును, దుఃఖప్రదములే. బుద్ధినైపుణ్యముచే ఈ రెంటిని రహితమొనర్చుటయే ఉత్తమజ్ఞానమనబడును.

మాతృమానప్రమేయాది ద్రష్టృదర్శనదృశ్యతా
ఏతావజ్జగదేతచ్చ పరమాణౌ చితి స్థితమ్. 90

ప్రమాతృ, ప్రమాణ, ప్రమేయములు, ద్రష్టృదర్శనదృశ్యములను త్రిపుటితోకూడిన ఈ జగత్తు చేతనమగు పరమాణువందే కలదు.

అయం జగదణుర్నిత్యమేతేనాణునమేరుణా
స్పందనం పవనేనేవ స్వాంగ ఏవ కృతాకృతః. 91

వాయువు తనయందు చలనము గలుగజేయుచు, మరలదానిని రహితమొనర్చుచుండునట్లు, ఆత్మయను సుమేరువు, జగత్తను అణువును సృష్టించుచు మరల తనయందు లయము గావించుచున్నది.

అహో ను భీమా మాయేయమథవా మాయినాం పరా
పరమాణ్వంతరేవాస్తి యత్త్రైలోక్యపరంపరా. 92

ఆహా! ఈ మాయయెంత భయంకరమైనది! జీవులకు వ్యామోహము గలజేయుటలో దీనికి మించినదేదియును లేదు. ఒక్క పరమాణువునందే అనేక త్రైలోక్యముల నది యుంచగలుచున్నది.

అథాసంభవమాయిత్వమేవైతత్సర్వదాస్థితమ్
చిన్మాత్రపరమాణుత్వమాత్రమేవ జగత్స్థితిః. 93

"ఏకమేవాద్వితీయమ్" ఇత్యాది శ్రుతివాక్యములచే ఆత్మయందు మాయయుండుట అసంభవముగాన ఈ జగత్తుకూడ చిత్-పరమాణురూపమే యగును.

అంతర్గతజగజ్జాలోఽప్యేషోఽణుః సామ్యముత్యజన్
స్థితోఽంతస్థ బృహద్వృక్షం బీజంభాండోదరే యథా 94

బీజము తనయందెట్లు విశాలవృక్షమును ధరించుచున్నదో, అట్లనే చిదణు స్వరూపుడగు పరమాత్మ తనయందనేక బ్రహ్మాండములను ధరించుచున్నాడు.

బీజేఽంతర్వృక్షవిస్తారః స్థితఃసఫలపల్లవః
పరయాదృశ్యతేదృష్ట్యా జగచ్చచిదణూదరే. 95

బీజమందు ఫలపల్లవ యుక్తమగు వృక్షము సూక్ష్మరూపమున యున్నట్లు, పారమార్థిక దృష్టిచే నీ చిదణువందే జగత్తులన్నియు స్థితిగల్గియున్నట్లు తెలియగలదు.

సశాఖాఫలపుష్పంస్వమజహద్బీజకోటరే
యథాతరుఃస్థిత స్తద్వ ద్వికాసిచిదణోర్జగత్. 96

ఫలపుష్ప శాఖాదులఁ ద్యజింపక, వృక్షము సూక్ష్మరూపమున బీజమందున్నట్లు, దృశ్యమగు ఈ జగత్తును చేతనారూపమగు పరమాణువందు గలదు.

సంస్థితంద్వైతమద్వైతం బీజకోశఇవద్రుమః
జగచ్చిత్పరమాణ్వంతర్యఃపశ్యతిసపశ్యతి. 97

బీజమందు వృక్షభిన్నరూపముగనున్నట్లు ఈ ద్వైత ప్రపంచమును, చిద్రూప పరమాణువునందు, అద్వైతరూపమున నున్నట్లు, గాంచువాడే జ్ఞాని.

నద్వైతంనైవచాద్వైతం నచబీజంనచాంకురః
నస్థూలంనచవాసూక్ష్మం నజాతంజాతమేవచ. 98

యథార్థముగ, ద్వైతాద్వైతములుగాని బీజాంకురములుగాని, స్థూలసూక్ష్మత్వములుగాని, అణుబ్రహ్మాండములుగాని లేవు.

నచాస్తినచనాస్తీదం నసామ్యంక్షుభితంనచ
త్రిజగచ్చిదణోరంతః ఖవాయ్వపినకించన. 99

చిదణువందీ త్రిలోకములును సదసద్రూపమున నున్నవి. అవి శాంతములుగను లేవు, అశాంతములుగను లేవు. పరమార్థ దృష్టియందాకాశాదులును లేనివేయగును.

నజగన్నాజగచ్చాస్తి విద్యతేచిత్పరాణుభా
సర్వాత్మికాయదాయత్ర సా యథోదేతి తత్తథా 100

ఈ జగత్తుగాని, తద్భిన్నమగు మరియొక వస్తువుగానిలేదు. కేవలము చైతన్యమాత్రముగలదు పూర్వ సంస్కారానుసార మయ్యది యెట్లావిర్భవించుచున్నదో, అట్లనే స్ఫురించుచున్నది.

ఉదేత్యనుదితోఽప్యేష స్వయంవేదనజృంభితః
పరమాత్మాణురేకాత్మ సమగ్రాత్మతయైవఖే. 101

సృష్టిరూపమున నుత్పన్నమైనను, వాస్తవముగనది యనుత్పన్నముగాకయే యున్నది. ప్రపంచ ఘటితమగు చిదాకాశమందేకరూపమున నున్నను, అనేక రూపములుగ నది గన్పట్టుచున్నది.



ద్రుమోభూమావస్వబీజత్వమివోదేత్యనుదేత్యపి
పరంతత్త్వంజగద్భంగ్యా జగతాంస్వోదయేనచ. 102

వృక్షము తన వృక్షస్వభావమును త్యజింపకయే బీజముల నుత్పన్నము చేయుచు, మరల బీజరూపమున భూమిపై నెలకొనునట్లు, పరతత్త్వమగు బ్రహ్మమును, జగద్రూపమున ఉదయించి, జనన మరణాది కల్పనామయమగు జగద్రూపత్వమును పొందుచున్నది.

ద్రుమోబీజతయైవాశు నసంత్యక్తసమస్థితిః
తిష్ఠత్యపగతస్పంద స్త్యాగాత్యాగపరోఽణుకః. 103

వృక్షము బీజరూపముగనైనను, తనవృక్షత్వమును త్యజించుటలేదు. కాని పరమాత్మ, త్యాగాత్యాగములు రెండును గలవాడు. అసంగుడును, అద్వితీయుడును అగుటచే నాతడు సర్వత్యాగపరుడును, సర్వవ్యాపియగుటచే దేనిని త్యజింపక ఏకరూపమున నున్నవాడును నగును.

బిసతంతుర్మహామేరుః పరమాణోరపేక్షయా
దృశ్యఃకిలవిశేత్తంతురదృశ్యాణ్వపరాణుతా. 104

చిదణువు యెదుట కమలనాళసూత్రముగూడ స్థూలమై మహామేరువుగ నుండును. ఏలయన కమలనాళసూత్రము దృగ్గోచరమగును; చిదణువట్లుకానేరదు.

బిసతంతుర్మహామేరుః పరమాణోఃకిలాత్మనః
తస్యైవతద్ఘనాః స్వాంతః స్థితామేర్వాదికోటయః. 105

ఈ చిత్-పరమాణువుకంటె కమలనాళసూత్రము మేరువువలె స్థూలమైనది. అయినను దానియందు కోట్లకొలది మేరు మందరాది పర్వత సమూహములు గలవు.

ఏకేనతేనమహతాపరమాణునాచ వ్యాప్తంతతంవిరచితంజనితంకృతంచ
దృశ్యంప్రపంచరచితంనభసేవవిశ్వం శూన్యత్వమచ్ఛనుభితఃపరిలబ్ధమేవ. 106

మహత్తరమగు అట్టి చిత్-పరమాణువుచేతనే ఈజగత్తంతయు వ్యాప్తమై, అద్దానిచే యుత్పత్తిని బడయుచు, కార్యవంతమగుచు నున్నది. ఆకాశమందు గంధర్వ నగరము కల్పింపబడినను దానిచే స్పృశింపబడక అయ్యది యథాప్రకారము నిర్మలముగను, శూన్యమును నుండునట్లే, పరమాత్మయు జగత్తుచే స్పృశింపబడక నిర్వికారుడై యుండును.

ద్వైతేనసుందరతరంస్వమనుజ్ఝితేన రూపంసుషుప్తసదృశేన యథావబోధాత్
ఐక్యంగతంస్థితిగమాగమముక్తమేవ మిత్థంస్థితంతనుజగత్పరమార్థపిండః. 107

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
శర్కట్యుపాఖ్యానే పరమార్థపిండీకరణం నామైకాశీతితమః సర్గః ॥ 81 ॥

ఆత్మజ్ఞానోదయ కాలమందును జడమును, అవిద్యాస్వరూపమును, సుషుప్తి తుల్యమునునగు ద్వైతస్థితియందునుగూడ, సచ్చిదానంద పరబ్రహ్మమేకరూపమై ప్రకాశించుచుండుటచే, క్రియారూపమగు ఈజగత్తు అధిష్ఠానమగు ఆత్మతత్త్వముకంటె భిన్నముగాక యున్నది. కాన ఈజగత్తు పర

మార్థమగు బ్రహ్మమే యగును. ఇవ్విధమున నేను ప్రపంచ రూపుడను గాక, కేవల మద్వైత పర బ్రహ్మస్వరూపుడనే యగుదును.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున పరమార్థపిండీకరణమను ఏకాశీతితమ సర్గము. ॥ 81 ॥

## ద్వ్యశీతితమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఇతిరాజముఖాచ్ఛ్రుత్వా కర్కటీవనమర్కటీ
అవబుద్ధవచాంతం స్వం జహౌమాత్సరచాపలమ్. 1

వసిష్ఠుడు;— ఓ రామచంద్రా! మర్కటమువలె చపలయగు నా రాక్షసి రాజు పల్కుల నాలించినదై, ఆత్మజ్ఞానమును బడసి, తనమాత్సర్యమును చిత్తచాపల్యమును విడనాడెను.

అంతఃశీతలతామేత్య విశ్రాంతిమపతాపతామ్
ప్రాప్తాప్రావృణ్మయూరీవ సజ్యోత్స్నేవకుముద్వతీ. 2

బాహ్యదృష్టిచే సంతాపమును జెందక, చిత్తశాంతిని బడసి వర్షాకాలమందలి మయూరము వలెను, చంద్రికగల రాత్రివలెను, శోభించుచుండెను.

తథారాజగిరాతస్యా ఆనందఉదభూద్భృశమ్
గర్భేఽంతఃఖేబలాకాయా రవేణేవ పయోముచః. 3

. ఆకసమందు మేఘనాదమును విని బకసమూహము గర్భధారణను గూర్చిన యానందమును పొందునట్లు రాజు వాక్యముల విని రాక్షసియు, హర్షాన్వితయయ్యెను.

రాక్షస్యువాచ:—

అహోబతపవిత్రేయం భవతోర్వాతి శేముషీ
అనస్తమితసారేణ ప్రబోధార్కేణభాసితా. 4

రాక్షసి:—ఓ రాజా! ఆహా! ఎట్టి ఆనందజనకమగు విషయము! శాంతమును, నిత్యోదితమును, ఏకరసమునునగు జ్ఞాన భాస్కరునిచే ప్రకాశితమై, మీ యిర్వుర బుద్ధియు నిర్మలమై వెలయుచున్నది.

శీతాసమరసాశుద్ధాజ్యోత్స్నేవశశిమండలాత్
వివేకకణికాంశ్రుత్వా భవతోహృదయాదియమ్. 5
వివేకినోజగత్పూజ్యాః సేవ్యా మన్యేభవాదృశాః
సత్సంగాత్సవికాసాస్మి చంద్రేణేవ కుముద్వతీ. 6



వివేకయుక్తములగు మీ వాక్యముల వినిన నేను, మిమ్ముల పూజ్యులుగా నెంచుచున్నాను. మీ సత్సంగముచే, చంద్రికచే రాత్రివలె నేనును ప్రకాశితమగుచున్నాను.

సౌరభంకుసుమాసంగా దేవసత్సంగమాచ్ఛుభమ్
వర్తతేహ్యర్కసంపర్కా ద్వికాసోఽంబురుహామివ. 7

పుష్పసంబంధముచే గంధము, సూర్యసంబంధముచే కమలములును, వికాసమును బొందునట్లు సజ్జనుల సాంగత్యముచే జీవులు శ్రేయమునే బొందుదురు.

మహతామేవసంపర్కా త్పునర్దుఃఖంనబాధతే
కోహిదీపశిఖాహస్త స్తమసాపరిభూయతే. 8

మహాత్ముల సంసర్గముచే జీవునకు దుఃఖమునశించినదై మరల యెన్నటికిని వానినది బాధింపదు. చేతియందు దీపము గలవాడు అంధకారముచే బాధింపబడునా ?

మయేమౌజంగలప్రాప్తౌ భవంతౌభూమిభాస్కరౌ
పూజనీయావతఃశీఘ్రు మీహితంకథ్యతాంశుభమ్. 9

ఈ యరణ్యమున మీరిరువురును భూమిపై సూర్యునివలె వెలుగొందుచున్నారు. మీరు నాకు పూజనీయులగుదురు. మీ వాంఛిత పదార్థమును శీఘ్రముగ దెల్పుడు. మీ మనోరథ మీడేర్చెద.

రాజోవాచ:—

అస్మిన్ జనపదే రక్షఃకులకాననమంజరి
జనస్యబాధతే త్యంతం సదాహృదయశూలనమ్. 10

రాజు:—రాక్షసకుల వనమునకు లతవగునో రాక్షసీ! ఈ ప్రదేశమున, మనుజుల హృదయములందు, శూలమువలె విషూచిక అధికమగు బాధను గల్గజేయుచున్నది.

యతఃసర్వైవజనతా తప్తాదృఢవిషూచికా
మండలేనను తేనాహం నిర్గతోరాత్రిచర్యయా. 11

ఈ రాజ్యమందలి జనులందరును విషూచిక (మహామారి)చే బాధితులగుచున్నారు. కనుకనే, ఈ రాత్రి సమయమున నేనిచట సంచరించుచుండుట తటస్థించినది.

శూలాదిహృదయేన్యాణాం నశామ్యతియదౌషధైః
తతోఽహంత్వద్విధప్రోక్త మంత్రార్థేన వినిర్గతః. 12

మనుజుల హృదయమందలి శూలము ఔషధములచే నశించదు. కాన మీవంటి మహాత్ములచే మంత్రముల బడయుట కొరకే నేను బయలుదేరితిని.

త్వాదృశస్యచలోకస్య ముగ్ధలోకాభిఘాతినః
నిగ్రహార్థంప్రవృత్తిర్మే సాచసంపత్తిమేత్యలమ్. 13

అజ్ఞుల వధించుటయందు తత్పరులగు మీ వంటివారలను వశమొనర్చుట కొరకే నేనిట కేతెంచితిని. నా సంకల్పమిపుడు సిద్ధించినది.

ఏతావదేవ చశుభే త్వయాంగీక్రియతాం వచః
భూయోభవత్యా ప్రాణాహి హింసనీయా న కస్యచిత్. 14

ఓ రాక్షసీ! ఇకనీవేజీవిని హింసింపకుండు నట్లంగీకరింపుము.

రాక్షస్యువాచ:—

బాధమేవం కరోమ్యద్య ప్రభృత్యవితథం ప్రభో
సత్యమేవ న కించిద్ధి హింసనీయం మయాధునా. 15

రాక్షసి:— ఓ రాజా! మంచిది. నేటినుండి నీవు వచించినట్లే యాచరించెద. ఇక నే ప్రాణిని బాధింపనని నిశ్చయముగా జెప్పుచున్నాను.

రాజోవాచ:—

యద్యేవం ఫుల్లపద్మాక్షి పరదేహైకభోజనే
కింస్యాచ్ఛరీరవృత్త్యై తే స్థితాయా మత్సమీహితే. 16

రాజు:— ఓ కమలేక్షణీ! అన్యులను భుజించు స్వభావముగల, నీవహింసానిరతవైనచో యిక నీశరీర నిర్వహణమెట్లు జరుగగలదు?

రాక్షస్యువాచ:—

షడ్భిర్మాసైర్గిరౌ రాజన్ ప్రబుద్ధాయాః సమాధితః
జాతా భోజనసంకల్పా ద్భోజనేచ్ఛేయమద్య మే. 17

రాక్షసి:— ఓ రాజా! ఈ పర్వతముపై ఆరునెలల వరకు సమాధియందుండి పిదప వ్యుత్థానదశనుపొంది, భోజనమును గూర్చిన సంకల్పమపుడు నాయందుదయింపగా నంత నాకద్దానిపై యపేక్షగల్గినది.

ఇదానీం శిఖరం గత్వా తదేవ ధ్యాననిశ్చలా
యావదిచ్ఛం సుఖేనాసే సజీవా శాలభంజికా. 18

ఇపుడు మరల నా పర్వత శిఖరమునకు బోయి, ధ్యాననిష్ఠ యందున్న దాననై దారు విగ్రహమువలె నిశ్చలముగ నుండెద.

ఆమృతీం ధారణాం బద్ధ్వా ధారయామి శరీరకమ్
యథేచ్ఛమథ కాలేన త్యక్ష్యామీతి మతిర్మమ. 19

అమృతస్వరూపమగు యాత్మనుగూర్చియే భావనచేయుచు జీవితమును గడపి, ఆ పిమ్మట నా యిచ్ఛానుసారము శరీరమును త్యజింప నిశ్చయించితిని.

ఆశరీరపరిత్యాగ మిదానీం న మయా నృప
హింసనీయాః పరప్రాణా స్తే నేదం మద్వచః శృణు. 20

ఓ రాజా! శరీరత్యాగ పర్యంతము నే నే ప్రాణిని హింసింపను. ఇక నేనిపుడు చెప్పబోవు దానిని నీవు వినుము.



హిమవాన్నామ శైలోఽస్తి శరచ్చంద్రాంశునిర్మలః
య ఉత్తరాశాహృదయే స్పృష్టపూర్వాపరార్ణవః 21

శరచ్చంద్రుని పగిది నిర్మలమగు హిమాలయమను పర్వతమొకటిగలదు. అది ఉత్తర దిక్కున నున్నదై పూర్వపశ్చిమ సముద్రములవరకును వ్యాపించియున్నది.

తత్రాహం నివసామ్యగ్రే హేమశృంగదరీగృహే
ఆయసీ మేఘలేఖేవ కర్కటీ నామ రాక్షసీ. 22

దానియందు సువర్ణచ్ఛాయవంటి కాంతిగల్గిన గుహ యొకటిగలదు. అందు లోహమయ మేఘమువలె భయంకరాకారముగల కర్కటియను రాక్షసి నివసించుచుండెను. ఆ రాక్షసిని నేనే.

తపసోపార్జితో బ్రహ్మా జనతామారణేచ్ఛయా
విషూచికా ప్రాణహరా స్యాం సూచ్యాత్మేతి భో మయా. 23

జనులవధింపనెంచి నేను తపస్సుచే బ్రహ్మదేవుని మెప్పించి, మనుజుల ప్రాణముల హరించునట్టి విషూచికయగునట్లు వరమిమ్మని యాతనిని కోరితిని.

తస్మాత్సంప్రాప్తవరయా బహూన్వర్షగణాన్మయా
భుక్త్వా విషూచికాత్వేన జనతా జీవబాధనైః. 24

ఇట్లమ్మహాత్మునినుండి వరమును బడసి, అనేక వత్సరముల ప్రాణులబాధించుచు, జనులనేకుల భక్షించుచు, కాలము గడపుచున్నాను.

త్వయా న గుణినో హింస్యా ఇతి మే బ్రహ్మణా తతః
నియమార్థం మహామంత్ర స్తదాయత్తాస్మి సంస్థితా. 25

గుణవంతుల బాధింపవలదని చెప్పి, వారి రక్షణకొరకై బ్రహ్మదేవుడు మంత్రమొకదానిని నొసంగెనుగాన, నేనద్దాని కధీనమైయున్నాను.

సోఽయం ప్రగృహ్యతాం తేన సర్వం హృదయశూలనమ్
శమమేష్యతి లోకేఽస్మాత్కా కథా మత్కృతే భ్రమే. 26

ఆ బ్రహ్మదత్తమగు మంత్రమును నీవు గైకొనుము. దానిచే ప్రపంచమునగల హృదయశూలబాధ యంతయు నశించగలదు. ఇక నాచే గల్గు బాధ నివారింపక యుండునా?

విరతైవాస్మి హింసాయాం యత్పురా హింసితం మయా
జనస్య హృదయం తేన నాడ్యో వై ధుర్యమాగతాః. 27
హింసిత్వా రక్తమాంసాని సంత్యక్తా యే మహాజనాః
తేభ్యో విధురనాడీభ్యో యే జాతాస్తేఽపి తాదృశాః. 28

బహుకాలమునుండి నేను, హింసాప్రవృత్తియే గల్గియున్నదానను. ప్రాణుల హృదయముల బాధనుగలుగజేయుటచే వారినాడులన్నియు కలుషితములైనవి. మరియు రక్తమాంసముల శోషింపజేసినందున, వారి సంతానముగూడ వారివలెనే దుర్బలమై, రోగగ్రస్తమైయున్నది.

రాజన్విషూచికామంత్రః సోఽయంసంపన్న ఏవ తే
నహిసత్త్వవతామస్తి దుఃసాధ్యమిహాకించన. 29

కాన ఓ రాజా! ఈ విషూచికామంత్రమును నీవు గైకొనుము. అది తప్పక సిద్ధిని గలుగ జేయును; ధీరులగు మహాత్ములకు దుస్సాధ్యమగునదెద్దియును లేదు.

అతోదుర్నాడికాశేషు శూలానాంపరిశాంతయే
మంత్రోయో బ్రహ్మణాప్రోక్తో రాజన్ శీఘ్రంగృహాణతమ్. 30

కలుషిత నాడులందలి శూలబాధను తొలగించుటకొరకై బ్రహ్మదేవునిచే వచింపబడిన మంత్రమును నీవు శీఘ్రముగ గైకొనుము.

ఆగచ్ఛనికటంనద్యా గచ్ఛామస్తత్రభూమిప
స్నాతాంతాభ్యాం సంయతాభ్యాం భవద్భ్యాం సుమతాదదే. 31

ఓ రాజా! నదీతీరమునకుఁ బోవుదమురమ్ము. అచట యాచమించి సంయమనిష్ఠులైయుండు మీరిరువురకును మంత్రప్రదానము గావించెదను.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఇతితస్యాంతదారాత్ర్యాం రాక్షసీమంత్రిభూభృతః
జగ్ముస్తేసరితస్తీరం మిథస్సంజాతసౌహృదాః. 32

వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! ఇట్లారాత్రి యామువ్వురును (రాజు, మంత్రి, రాక్షసి), మిత్ర భావముగల్గి, నదీతటమునకుఁబోయిరి.

అన్వయవ్యతిరేకేణ రాక్షస్యాః సౌహృదంతదా
జ్ఞాత్వాస్థితౌ తౌ స్నాతాంతా వుభావంతేనివాసినా. 33

రాక్షసియొక్క మిత్రత్వమును గుర్తెరింగి, రాజమంత్రులిర్వురును నామెపై విశ్వాసము గలవారై అచట యాచమించి, నామెకు శిష్యులై యెదుట నిలఁబడిరి.

తయాబ్రహ్మోపదిష్టోఽసౌ తతస్తాభ్యాంయథాక్రమమ్
స్నేహాద్విషూచికామంత్రః ప్రదత్తో జపసిద్ధిదః. 34

ఆ పిమ్మట రాక్షసి స్నేహయుక్తముగ బ్రహ్మప్రోక్తమును, (జపించుటచే) సిద్ధిదాయకమును, నగు విషూచికా మంత్రమును మొదట రాజునకును, పిదప మంత్రికిని యథోచితముగ నుపదేశించెను.

తతఃసంజాతసౌహార్దా తౌవిసృజ్యనిశాచరీ
యదాగంతుంప్రవృత్తాసా తదారాజాబ్రవీద్వచః. 35

ఇట్లు తన మిత్రభావమును వ్యక్తపరచినదై, ఆ రాక్షసి పిమ్మట అచ్చోట వీడి జనదలంపనంత రాజిట్లనియె.

రాజోవాచ:—

గురుస్త్వంనో మహాదేహే వయస్యాచసునిర్వృతా
నిమంత్రయామహేయత్నాద్గ్రాసాయ తవసుందరి. 36



రాజు:— ఓ దీర్ఘదేహీ! నీవిపుడు మాకు గురువును మిత్రురాలవును గూడనైతివి. కావున నీకిపుడు భోజనసదుపాయ మొనర్ప నెంచితిమి.

నచాస్మత్ప్రార్థనాయంప్రీతా వితథీకర్తుమర్హసి
సౌహార్దంసుజనానాంహి దర్శనాదేవవర్ధతే. 37

మా యీ నిశ్చయమును నీవు కార్యాన్వితమొనర్పవలెను. సజ్జనులగు మహాత్ముల దర్శన మాత్రముచే మిత్రత్వము సిద్ధించును గదా!

లఘుసౌభాగ్యసంయుక్తం కృత్వాకారం మనోరమమ్
ఆగచ్ఛాస్మద్గృహంభద్రే తత్రతిష్ఠయథాసుఖమ్. 38

నీవు సుందర భూషణముల ధరించి, మనోహరాకృతిగల్గి మా రాజగృహమునకు రమ్ము. అచట సుఖముగ నీవు వసింపవచ్చును.

రాక్షస్యువాచ:—

ముగ్ధస్త్రీరూపధారిణ్యై దాతుంశక్తోఽసిభోజనమ్
సంతర్పయసిమాంకేన రాక్షసాకారధారిణీమ్. 39

రాక్షసి:— ఓ రాజా! సుందర స్త్రీరూపమును ధరించిన నాకన్నపానముల సమకూర్చగలవు. గాని, రాక్షసినగు నన్నెద్దానిచే తృప్తిపరచగలవు?

రక్షోఽన్నమేవసంతుష్ట్యై నసామాన్యజనాశనమ్
పూర్వసిద్ధస్వభావోఽయమాదేహం ననివర్తతే. 40

రాక్షసోచిత యాహారము (నరమాంసాదులు) చేతనే నాకు దృప్తిగలుగును. గాని, సామాన్య భోజనముచే గాదు. ఏలయన, ఈ నా పూర్వరాక్షస స్వభావము దేహపతన పర్యంతమును నుండియేయుండును.

రాజోవాచ:—

హేమస్రగ్దామవలితా దినాని కతిచిద్గృహే
మమస్త్రీరూపిణీతిష్ఠ యావదిచ్ఛమనిందితే. 41

రాజు:— అనిందితవగు నో రాక్షసీ! బంగారు యాభరణములచే శోభించుచు స్త్రీ రూపధారణివై, కొంతకాలము మా గృహమున వసింపుము.

తతోదుష్కృతినశ్చౌరాన్ వధ్యాఞ్ఛతసహస్రశః
మండలేభ్యఃసమానీయ దదేతుభ్యంసుభోజనమ్. 42

అపుడు నా రాజ్యమందలి దుష్టులు, వధ్యార్హులు, చోరులు మొదలుగాగల వారనందరిని యొకచోజేర్చి, నీకు భోజనము సమకూర్చెద.

కాంతారూపంపరిత్యజ్య గృహీత్వారాక్షసంవపుః
ఆదాయవధ్యాఞ్ఛతశః పురుషాంస్తాన్సుసంచితాన్. 43

నయస్వహిమవచ్ఛృంగం తత్రభుంక్ష్వయథాసుఖమ్
మహాశనానామేకాంతే భోజనంహిసుఖాయతే. 44

నీవపుడు సుందర స్త్రీరూపమును త్యజించి, రాక్షసివై, ఆ వధ్యులను హిమవత్పర్వత శిఖరమునకుఁగొనిపోయి అచట సుఖముగ భుజింపుము. అధికముగ భుజించువారల కేకాంతభోజనమే సుఖప్రదమగును.

తృప్తానిద్రాంమనాక్కృత్వా భవభూయఃసమాధిభాక్
సమాధివిరతాభూయోఽప్యాగత్యపునరన్యదా 45
నేష్యస్యన్యాన్వధ్యజనాన్ హింసానైషాంచధర్మతః
స్వధర్మేణచహింసైవ మహాకరుణయాసమా. 46
త్వంసమేష్యసిచావశ్యం మాం సమాధివిరాగిణీ
అసతామపిసంరూఢం సౌహార్దంననివర్తతే. 47

భోజనముచే తృప్తినిబడసి, కొంతసేపు నిద్రించి, మరల సమాధిస్థవుకమ్ము. సమాధినుండి లేచిన పిదప, తక్కిన సమయములందిచటకువచ్చి, భోజనార్థము వధ్యార్హులగు ప్రాణులఁగైకొని పోవుము. అట్లొనర్చుట పాపముగాదు. ధర్మపూర్వకమగు హింస గొప్పదయయే యగును. సమాధినుండిలేచిన పిమ్మట యిచటకు రమ్ము. విరుద్ధస్వభావులగు జీవులండైనను, మిత్రత్వము స్థిరపడిన, నిక యదెన్నటికిని తొలగనేరదు.

రాక్షస్యువాచ:—

యుక్తముక్తం త్వయారాజన్ కరోమ్యేవమహంసఖే
సౌహార్దేనప్రవృత్తస్య కోవాక్యంనాభినందతి. 48

రాక్షసి:—ఓ రాజా! నీవు వచించినది యుక్తమే. అటులనే చేసెద. మిత్రునివాక్యముల నెవ్వడభినందింపడు ?

శ్రీవసిష్ఠ ఉవాచ:—

ఇత్యుక్త్వారాక్షసీ తత్ర సంపన్నాసువిలాసినీ
హారకేయూరకటక పట్టస్రగ్దామధారిణీ. 49
రాజన్నాగచ్ఛగచ్ఛామ ఇత్యుక్త్వాభూపమంత్రిణౌ
అగ్రేగంతుంప్రవృత్తౌతౌ రాత్రావనుససారసా. 50

వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! ఆరాక్షసిట్లు బల్కి, హారకుండల కటక మాలాదులధరించి, యుత్తమస్త్రీరూపమును బొందినదై, రాజాతో నిక వెడలెదమని వచింప, నంత, నా రాజమంత్రులిరువురును ముందు జన, వెనువెంట రాక్షసియు పోసాగెను.

అథ తేపార్థివగృహం ప్రాప్యతాంరజనీంమిథః
కథయైకగృహేరమ్యే క్షపయామాసురాదృతాః. 51

పిమ్మట, వారు ముగ్గురును, రాజగృహమునఁజేరి, యొక రమణీయప్రదేశమున స్నేహయుక్తముగ పరస్పర వార్తాలాపముల నొనర్చుచు, నా రాత్రియంతయు నచటనే గడపిరి.



ప్రభాతేఽంతఃపురేతస్థా పురంధ్రీనవలీలయా
రాక్షసీమంత్రిరాజానౌ స్వవ్యాపారౌబభూవతుః 52

మరునాడుదయమున రాక్షసి అంతఃపుర స్త్రీలతో కలసి విలాసముగ నుండజొచ్చెను. రాజ, మంత్రులును వారివారి కార్యములందు ప్రవృత్తులై యుండిరి.

తతోదివసషట్కేన సంచితానిమహీభృతా
నృపఃపరపురేభ్యోఽపి స్వమండలగణాత్తథా. 53
త్రీణివధ్యసహస్రాణి తానిగస్యైతదాదదౌ
సాబభూవనిశాకాలే సైవోగ్రాకృష్ణరాక్షసీ. 54
తానివధ్యసహస్రాణి జగ్రాహభుజమండలే
ధారానికరజాలాని మేఘమాలేవకోటరే. 55
యయౌరాజానమాపృచ్ఛ్య తదేవహిమవచ్ఛిరః
దరిద్రాలబ్ధహేమేవ ప్రగేహృష్టాగ్రశరీరిణీ. 56

ఇట్లాఱు దినములు గతించిన పిదప, రాజు, తనరాజ్యమందలి మూడువేల వధ్యార్హుల సమకూర్చి, రాక్షసికొసంగ, నంత నాభీకరాకార రాత్రిసమయమున, కృష్ణవర్ణయగు రాక్షసియై, వారలందరిని, తన భుజముపై నిడుకొని సువర్ణప్రాప్తిచే దరిద్రుడు ప్రసన్నుడగునట్లు, సంతోషాన్వితయై, రాజావద్ద సెలవుగైకొని, హిమవత్పర్వత శిఖరమునకు బోయెను.

తత్రతృప్తాభృశంభుక్త్వా సుఖంసుప్త్వాదినత్రయమ్
ఆసీత్ప్రబోధసుస్వస్థా సానమాధిమతిఃపునః 57

అచట చక్కఁగభుజించి తృప్తినిబడసి మూడుదినములవరకు నిద్రించి, పిదప, స్వస్థచిత్తయై సమాధినిష్ఠయందు ప్రవేశించెను.

పంచభిర్వాచతుర్భిర్వా వర్షైఃసాసంప్రబుధ్యతే
తతస్తతోమండలంయాతి తేనరాజసభాజనే. 58

ఇట్లు నాలైదు వత్సరములు సమాధియందుండి, పిమ్మట రాజుకోర్కె ననుసరించి వాని రాజ్యమునకు మరల బోయెను.

తత్రవిస్రంభగర్భాభిః కథాభిఃకంచిదేవసా
స్థిత్వాకాలంగృహీత్వాతాన్ వధ్యాన్స్వాస్పదమేత్యథ. 59

అచట కొంతకాలము పరస్పర సంభాషణమందును, కథా ప్రసంగములందును గడపి, ఆ రాజుచే సిద్ధముగా నుంచబడిన వధ్యప్రాణులగైకొని, తన నివాసమగు హిమవత్పర్వత శిఖరమునకుఁ జనెను.

జీవన్ముక్తతయైవమేవ విపినే సాద్యాపిరక్షోంగనా
తస్మిన్నేవగిరౌస్థితావిచలిత ధ్యానైకతానాశయా

తస్మిన్‌రాజని శాంతిమాగతవతి త్యక్తైషణేనాత్మనా
తద్రాష్ట్రాధిపసౌహృదైః స్వకవలానాస్వాదయంతీచిరమ్. 60

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కర్కట్యుపాఖ్యానే రాక్షసీసౌహార్దంనామ ద్వ్యశీతితమః సర్గః ॥ 82 ॥

ఓ రామచంద్రా! నేటికిని ఆరాక్షసి, ఆపర్వతముపైననే నివసించుచున్నదై, ఒకప్పుడు ధ్యాననిష్ఠయందును, మరియొకప్పుడు వ్యుత్థాన స్థితియందును కాలముగడుపు చుండును. ఆ కిరాతుల ప్రభువును, కోర్కెలన్నిటిని త్యజించి శాంతచిత్తుడై విదేహముక్తుడవ, నంత, వానివంశజుడగు నూతన ప్రభువుతో నా రాక్షసి మిత్రత్వము గల్గజేసికొనుచు, వానివలన భోజనమును బడయుచు, చిర కాలమట్లనే యుండెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున రాక్షసీసౌహార్దమను ద్వ్యశీతితమ సర్గము ॥ 82 ॥

## త్ర్య శీ తి త మః స ర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

కిరాతమండలేతస్మిన్ యేభవంతిమహీభృతః
తైస్తైఃసహపరామైత్రీ తస్యాఃసమభిజాయతే. 1

వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! ఆ కిరాతరాజ్యము నేలు ప్రభువులతో నెల్ల నారాక్షసి మిత్ర భావముగల్గియే యుండెను.

సర్వాంస్తత్రమహోత్పాతాన్ పిశాచాదిభయాన్యపి
రోగాంశ్చయోగసంసిద్ధా నివారయతి రాక్షసీ. 2

ఆ రాజ్యమందలి అరిష్టములను, పిశాచాదుల భయములను, రోగములను, యోగసిద్ధినిబడసిన ఆరాక్షసి, నివారించుచుండెను.

బహువర్షగణేనైషా ధ్యానాద్విరతిమాగతా
తత్రాగత్యసమస్తాంస్తాన్వధ్యాన్జంతూన్సుసంచితాన్. 3

అనేకవత్సరములు గతించిన మీదట సమాధినుండిలేచి కిరాత రాజ్యమునకువచ్చి, అచట సిద్ధముగా నుంచబడిన వధ్యప్రాణుల నయ్యది గొనిపోవుచుండును.



అద్యాపితత్రతయేవధ్యాస్తేతదర్థంమహీభుజా
నీయంతేమిత్రసన్మానే కేహినాధ్యవసాయినః. 4

ఇప్పటికిని అచటి రాజు వధ్యజీవులనందరిని ఆరాక్షసి కిచ్చుచుండును. మిత్రుని సన్మానించుటయందెవడు ప్రవృత్తుడు గానేరడు?

తస్యాంధ్యాననిషణ్ణాయాం కిరాతజనమండలే
అనాయాంత్యాంచిరంకాలం జనైర్దోషప్రశాంతయే. 5

సాదేవీకందరానామ్నీ మంగలేతరనామికా
సంప్రతిష్ఠాపితా మూర్త్యా పురే గగనకోటరే. 6

ధ్యాననిష్ఠయందుండుటచే యెప్పుడైనను చాలకాలమువరకు కిరాతుల రాజ్యమునకు రాక యుండినచో, అచటిజనులు, రోగనివారణకొరకై కందరా దేవియనియు, అమంగళాయనియు పేర్కొన బడు ఆద్దాని విగ్రహమును, ఉన్నత ప్రదేశమందు స్థాపనచేయుదురు.

తతఃప్రభృతితత్రత్యో యోయో భవతిభూమిపః
స కందరాంభగవతీం ప్రతిష్ఠాపయతి స్వయమ్. 7

అప్పటినుండియు, ఆ కిరాతరాజ్యమును పాలించు రాజులందరును, కందరాదేవియొక్క ప్రతిష్ఠను గావించుచుండిరి.

యఃకందరాంప్రతిష్ఠాంచ నకరోతినృపాధమః
తస్యోపతాపనిచయాః ప్రజానిఘ్నంతియత్నతః. 8

ఏ దుష్టుడగు రాజైనను కందరాదేవిని ప్రతిష్ఠింపకయుండిన, వాని ప్రజలరిష్టబాధ నొందుచుండిరి.

తత్పూజనాదవాప్నోతి జనస్తన్నిఖిలంఫలమ్
స్వవాసనావశోచ్ఛూన మనర్థంయాత్యపూజనాత్. 9

కందరాదేవి నర్చించుటచే మనుజుడు, అరిష్టనాశనము, రోగనివారణము మొదలగు ఉత్తమ ఫలములఁబొందును. లేనిచో వాని కనర్థమే సంప్రాప్తించును.

వధ్యలోకోపహారేణ సాదేవీపరిపూజ్యతే
ప్రతిమాసాస్థితాద్యాపి చిత్రస్థాఫలదాయినీ. 10

వధ్యప్రాణుల బలిచే, నాదేవి యర్చింపబడు చుండెను. ఆమె విగ్రహము నేటికిని గలదు. ఆదేవియొక్క లిఖితచిత్రముగూడ, ఆయాస్థలములందు ఫలముల ప్రసాదింపగలదు.

సకలకోమలమంగలకారిణీ కవలితాఖిల వధ్యమహాజనా
జయతిసాత్రకిరాతజనాస్పదే పరమబోధవతీ చిరదేవతా. 11

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కర్కట్యుపాఖ్యానే కందరాపూజనంనామ త్ర్యశీతితమః సర్గః ॥ 83 ॥

సర్వులకును సస్యసమృద్ధి గలుగజేయునదియు, ఐశ్వర్యములను, సకల సంపత్తులను ప్రసాదించునదియు, మంగళ మొనగూర్చునదియునగు, ఆ కందరాదేవి చాలకాలము జనులచే పూజింపబడుచున్నదై నేటికిని, ఆ కిరాతరాజ్యమున విజయము గాంచుచుండె.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్కట్యుపాఖ్యానమున కందారా పూజనమను త్ర్యశీతితమ సర్గము ॥ 83 ॥

## చతురశీతితమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఏతత్తేకథితంసర్వం మయాఖ్యానమనిందితమ్
కర్కట్యాహిమరాక్షస్యా యథావదనుపూర్వశః. 1

వసిష్ఠుడు:—ఓరామచంద్రా! హిమవత్పర్వతముపై నివసించుచున్న కర్కటియను రాక్షసి యొక్క యుత్తమచారిత్రమంతయును యథాప్రకారము నీకెరిగించితిని.

శ్రీ రామ ఉవాచ:—

హిమవద్గహ్వరేప్రోత్థా సాకథంకృష్ణరాక్షసీ
బభూవకర్కటీనామ్నా యథావద్వదమేప్రభో 2

శ్రీ రాముడు:—ఓ మునీంద్రా! హిమాలయమందలి భీకరారణ్యమున జన్మించిన ఆరాక్షసి, కర్కటియను పేరు యేల వహించెను?

శ్రీవసిష్ఠ ఉవాచ:—

కులానినంత్యనేకాని రాక్షసానాంస్వభావతః
తానిశుక్లానికృష్ణాని హరితాన్యుజ్జ్వలానిచ. 3

వసిష్ఠుడు:—ఓరామచంద్రా! వారివారి స్వభావము ననుసరించి రాక్షసులలో ననేక జాతులుగలవు. వారు శుక్ల, కృష్ణ, హరిత, ఉజ్జ్వలమను వివిధ వర్ణములు గల్గియుందురు.

కర్కటప్రాణిసాదృశ్యా త్కర్కటోనామరాక్షసః
బభూవ తజ్జా సాకృష్ణా కర్కటీకర్కటాకృతిః. 4

కర్కటమువంటి యాకృతి గల్గిన కర్కటుడను రాక్షసునకు జన్మించుటచేతను, కర్కటము (ఎండ్రకాయ)వలె భయంకరముగ నుండుటచేతను, కృష్ణవర్ణయగునది కర్కటియను పేరుచే ప్రసిద్ధికెక్కెను.

కర్కటీప్రశ్నసంస్మృత్యా మయైషాకథితాతవ
అధ్యాత్మోక్తిప్రసంగేన విశ్వరూపనిరూపణే. 5



అధ్యాత్మతత్త్వప్రసంగమందు ప్రపంచోత్పత్తిని నిరూపించుటకై, కర్కటి ప్రశ్నలం గూర్చి చెప్పదలచి, ఈ కర్కట్యుపాఖ్యానమును నీకు తెలియజేసితిని.

సంపన్నమేవ మే కస్మాదసంపన్నమివస్ఫుటమ్
ఇదంజగదనాద్యంతా త్పదాత్పరమకారణాత్. 6

ఈ జగత్తంతయు, ఆదిమధ్యాంత రహితమును, పరమకారణమును నగు బ్రహ్మమునుండి యుత్పన్నమైనది. కాని యథార్థముగ నేదియు నుత్పన్నమవలేదు.

ప్లావిన్యోవీచయో వారిణ్యన్యానన్యాః స్థితాయథా
వర్తమానాఅపిపరే సృష్టయఃసంస్థితాస్తథా. 7

చంచలములగు తరంగములు, జలమందు భిన్నాభిన్న రూపములుగ నుండునట్లు, పరబ్రహ్మమందు, భూతభవిష్యద్వర్తమాన కాలాత్మకమగు నీజగత్తున్న గలదు.

అజ్వలన్నేవకాష్ఠేషు వహ్నిరర్థక్రియాంయథా
కరోతిమర్కటాదీనాం శీతాపహరణాదికమ్. 8

సమంసౌమ్యత్వమజహదేవ నిత్యోదయస్థితి
తథాబ్రహ్మకరోతీదం నానాకర్తేవసజ్జగత్. 9

కాష్ఠమందగ్ని లేకున్నను, వానరాదుల దృష్టియందయ్యది శీతనివారణాది క్రియలం జేయదగునట్లు, బ్రహ్మమును, తనసమత్వ సౌమ్యత్వముల ద్యజింపయే కర్తయయి, జగన్నిర్మాణ మొనర్చుచున్నది.

అప్యనాగతపవాయ మేవంసర్గఉపాగతః
భోఃశాలభంజికాసంవిద్దారుణ్యేవ ముధోదితా. 10

కాష్ఠమందు విగ్రహమువలె, ఈజగత్తున్నూ, యెచటనుండియో సృష్టింపబడక, స్వయముగ మిథ్యారూపమున బ్రహ్మమందుదయించినది.

బీజేయథాఽనన్యదపి ఫలాద్యన్యదివోదితమ్
చితౌతథాఽనన్యదపి చేత్యమన్యదివోదితమ్. 11

బీజముకంటె ఫలాదులన్యముగాకున్నను అన్యముగా నగుపించునట్లు, జగత్తున్నూ బ్రహ్మకంటే భిన్నము గాకున్నను, భిన్నముగా గాన్పించుచున్నది.

అచ్ఛేదాదేకసత్తాయా నభేదఃఫలబీజయోః
చిచ్చేత్యయోశ్చ వార్యూర్మ్యో రివవస్తునికశ్చన. 12

బీజమందుగల పుష్పఫలాదుల సత్త నశింపక యుండునపుడు బీజఫలాదులకు భేదము లేనట్లును, వాయు, చలనములభిన్నమై యున్నట్లును, బ్రహ్మమందు చిత్, చేత్యము (విషయరూపమగు జగత్తు) లకు భేదములేదు.

అవిచారాత్కృతోభేదో నైతయోరుపపద్యతే
యతఃకుతశ్చిదుదితః సవిచారేణనశ్యతి. 13

విచారణ లేనందుననే భేదభావము స్ఫురించుచున్నది. ఇట్టిభేదభావన యుక్తముగానేరదు. అనిర్వచనీయమగు మాయచే గల్గిన ఈ భేదదృష్టి ఆత్మ విచారణచే నశించును.

భ్రాంతిరేషాయథాయాతా తథాయాతురఘూద్వహ
జ్ఞాస్యసేతత్త్వబుద్ధ్వైమేనాం కేవలముత్సృజ. 14

ఓ రఘుకుల ప్రదీపకా! కారణరహితముగ, ఈ భ్రాంతి యెట్లుత్పన్నమయ్యెనో మరల యట్లనే నశించును. నీవీభ్రాంతిని త్యజించివేయుము. మఱియు, యెపుడు నీకు బ్రహ్మ సాక్షాత్కారమగునో, అపుడే యద్దానిని బాగుగ నెఱుంగగలవు.

భ్రాంతిగ్రంథావిత్రుటితే మదుక్తిశ్రవణాత్తతః
జ్ఞానశబ్దార్థభేదానాం వస్తుజ్ఞాస్యస్యలంస్వయమ్. 15

ఈ నాయుపదేశముచే భ్రాంతిరూపమగు హృదయగ్రంథులు ఛేదింపబడ, జ్ఞానముయొక్క శబ్దార్థములఁగూర్చిన భేదభావన స్ఫురింపకయుండ నపుడు బ్రహ్మమును స్వయముగ నీ వెఱుంగగలవు.

చిత్తాదియమనర్థశ్రీస్తచ్ఛసా చేతరా చ తే
మదుక్తిశ్రవణాదేవ శాంతిమేష్యత్యసంశయమ్ 16

చిత్తముచేగల్గు యనర్థము, చిత్తకారణమగు అవిద్య – ఈరెండును నాయుపదేశముచే నిశ్చయముగ శాంతించును.

బ్రహ్మణఃసర్వముత్పన్నం సర్వంబ్రహ్మైవమేతిచ
ముద్గీర్భిఃసంప్రబుద్ధఃసన్ జ్ఞాస్యస్యలమనిందితమ్. 17

నేనుగావించు తత్త్వోపదేశముచే యెపుడు నీకు జ్ఞానోదయమగునో, అపుడే జగత్తంతయు బ్రహ్మమునుండి కలిగినది; మరల బ్రహ్మమందే లయించుచున్నదను విషయమంతయును బాగుగ తెలిసికొనగలవు.

శ్రీరామ ఉవాచ:—

తస్మాదియమితిబ్రహ్మన్ వ్యతిరేకార్థపంచమీ
ననుకేంవిద్ధిదేవేశా దభిన్నంసర్వమిత్యపి. 18

శ్రీరాముడు:– ఓ మహాత్మా! బ్రహ్మమునుండి జగత్తు యుత్పన్నమైనది – (తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః – శ్రుతి) అని చెప్పునపుడు, పంచమి విభక్తిప్రయోగము గావింపబడుటచే, జగద్బ్రహ్మలకు భేదముగలదని తెలియుచున్నది. ఇక, వాటికభేదము నిశ్చయించిన, అపుడు శబ్దప్రవృత్తియే కలుగనందున ఉపదేశమనునదే సిద్ధింపదుగదా!

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఉపదేశాయశాస్త్రేషు జాతఃశబ్దోఽథవార్థజః
ప్రతియోగివ్యవచ్ఛేద సంఖ్యాలక్షణపక్షవాన్. 19

వసిష్ఠుడు:–ఓ రామచంద్రా! శాస్త్రములందు, ఉపదేశార్థము తాత్కాలికముగ గావించిన భేదకల్పనచే శబ్దప్రవృత్తి సంభవించుచున్నది. లోకవ్యవహారార్థము గావింపబడు శబ్దప్రవృత్తి (ఉపదేశాదులు) 'ప్రతియోగీ అభావసంఖ్యా లక్షణ *'ము, 'పక్షము ‡ ను' మాత్రమే యగును.

* ఏపదార్థముయొక్క భేదము, లేక, అభావము తెలుపబడునో, అది ప్రతియోగి యనఁబడును.
‡ దేనియందు సందిగ్ధవస్తువును అనుమాన ప్రమాణముచే నిశ్చయింతురో దానిని పక్షమందురు.



భేదోదృశ్యతఏవాయం వ్యవహారాన్నవాస్తవః
వేతాలోబాలకస్యేవ కార్యార్థంపరికల్పితః. 20

బాలునికొరకు బేతాలము కల్పింపబడినను అయ్యది వాస్తవము కానట్లు, వ్యవహార దృష్టియందు భేదమగుపడినను, యథార్థముగ నది సత్యముగాదు.

ద్వైతైక్యమపినోయస్యాం తథాభూతార్థసంస్థితౌ
అస్తితస్యామిదృశఃస్యా త్కుతఃసంకల్పవిప్లవః. 21

ద్వైత, ఏకత్వములులేని స్వప్నగంధర్వ నగరాదులందుగూడ అట్టి ద్వైతాద్వైతలక్షణములు కల్పింపబడుచుండ, ఇక, సత్యసంకల్పయుతమగు ఉపదేశాదులఁగూర్చిన వ్యవహారమందును, సంకల్పవికల్పములు కల్పింపబడిన నేమి హానిగలదు?

కార్యకారణభావోహి తథాస్వస్వామిలక్షణమ్
హేతుశ్చహేతుమాంశ్చైవావయవావయవిక్రమః. 22

వ్యతిరేకావ్యతిరేకౌ పరిణామాదివిభ్రమః
తథాభావవిలాసాది విద్యావిద్యేసుఖాసుఖే. 23

ఏవమాదిమయీమిథ్యా సంకల్పకలనా మితా
అజ్ఞానామవబోధార్థం నతుభేదోఽస్తివస్తుని. 24

కార్య కారణభావము, 'స్వామి–భావలక్షణము' (నేను, నాది అనుట,) హేతువు హేతువంతమగునది! అవయవము, అవయవి, భేదాభేదపరిణామాది విభ్రమము, పదార్థముల వైచిత్ర్యము, విద్య, అవిద్య, సుఖము, దుఃఖము – ఈ మొదలగు మిథ్యాకల్పనలన్నియు, అజ్ఞానులకొరకే కల్పింపబడినవిగాని యథార్థముగ బ్రహ్మమందేవిధమైన భేదకల్పనమును లేదు.

అవిబోధాదయంవాదో జ్ఞాతేద్వైతంనవిద్యతే
జ్ఞాతేసంశాంతకలనం మౌనమేవావశిష్యతే. 25

ఈ భేదమంతయు అవివేకముచే కలిగినది. తత్త్వజ్ఞాన ప్రాప్తిచే, ఈ ద్వైతవాదమంతయు నశించి కల్పనారహితమగు మౌనము (బ్రహ్మము) మాత్రము శేషించును.

సర్వమేకమనాద్యంత మవిభాగమఖండితమ్
ఇతిజ్ఞాస్యసిసిద్ధాంతం కాలేబోధముపాగతః. 26

ఈ దృశ్యమంతయును ఆద్యంతరహితమును, విభాగ శూన్యమును, అఖండమునునగు ఒక్క పరమాత్మయే అను విషయమును కాలక్రమమున, ఆత్మబోధ ప్రాప్తిఁజెందునపుడు నీ వెఱుంగగలవు.

వివదంతే హ్యసంబుద్ధాః స్వవికల్పవిజృంభితైః
ఉపదేశాదయంవాదో జ్ఞాతేద్వైతంనవిద్యతే. 27

అజ్ఞానులు తమతమ కల్పనలఁగూర్చి వాద వివాద మొనర్చుకొందురు. కాని ఈ వాదములన్నియు వేదాంతోపదేశమునకు పూర్వమే సంభవించుగాని తత్త్వమెఱింగిన పిమ్మట యిక ద్వైతస్ఫురణయే యుండదు.

వాచ్యవాచకసంబంధో వినాద్వైతంనసిద్ధ్యతి
నచద్వైతంసంభవతి మౌనమవాపాదయత్యలమ్. 28

వాచ్యవాచక సంబంధము ద్వైతమందే సిద్ధించును. కాని ద్వైత మసత్యమగుటచే పరమార్థమున కేవలము మౌనమే శేషించును.

మహావాక్యార్థనిష్ఠాంతాం బుద్ధింకృత్వారఘూద్వహ
వచోభేదమనాదృత్య యదిదంవచ్మితేశృణు. 29

రఘుకుల శ్రేష్ఠుడవగు నో రామచంద్రా! 'యతోవా ఇమాని భూతానిజాయన్తే' (దేనినుండి ఈ సమస్తభూతములును ఉత్పన్నమగు చున్నవో) - ఈ మొదలగు శ్రుతివాక్యములందలి పంచమీ విభక్తి ప్రయోగముచే స్ఫురించు భేదమునువదలి, 'అహం బ్రహ్మాస్మి,' 'తత్త్వమసి' ఇత్యాది మహావాక్యముల లక్ష్యార్థమగు అఖండ పరబ్రహ్మమందే నీ చిత్తమును నిల్పి, యిక నే జెప్పబోవునది వినుము.

యతఃకుతశ్చిదుచ్ఛ్రాయం గంధర్వపురవన్మనః
భ్రాంతిమాత్రంతనోతీదం జగదాఖ్యంస్వవిజృంభణమ్. 30

అనిర్వచనీయమగు మాయచే, గంధర్వనగరమువలె భ్రాంతి మాత్రమగు మనస్సుదయించి, తనరూపమే యగు ఈ జగత్తును విస్తరించుచున్నది.

యథాచేతస్తనోతీమాం జగన్మాయాంతథానఘ
శృణుత్వంకథయామీదం దృష్టాంతందృష్టివేదనమ్. 31

ఈ చిత్తము,మాయారూపమగు జగత్తునెట్లు విస్తరించుచున్నదో తెలుపుటకొరకై సుబోధకమగు దృష్టాంతము చెప్పెద వినుము.

యంశ్రుత్వాసర్వమేవేదం భ్రాంతిమాత్రమితిస్వయమ్
రామనిశ్చయవాన్భూత్వా దూరేత్యక్ష్యసివాసనామ్. 32

దానిని వినిన, ఈ జగత్తంతయు భ్రాంతిమాత్రమేయను నిశ్చయము నీకు కలుగగలదు. అపుడే నీవు వాసనలనన్నింటిని త్యజించెదవు.

మనోమననిర్మాణ మాత్రమేవ జగత్త్రయమ్
సర్వముత్సృజ్య శాంతాత్మా స్వాత్మన్యేవ నివత్స్యసి. 33

మఱియు నీ వపుడు, సంకల్పమాత్రమున ఉదయించు ఈ త్రిలోకములఁ గూర్చిన భ్రాంతిని త్యజించి, శాంతచిత్తుడవై ఆత్మయందే స్థితిగల్గి యుందువు.

మద్వాక్యార్థావధానస్థో మనోవ్యాధిచికిత్సనే
వివేకౌషధలేశేన ప్రయత్నంచ కరిష్యసి. 34

మఱియు, నావాక్యార్థమందే దృష్టిగల్గి వివేకమను నౌషధముచే మనోవ్యాధిని నిర్మూలన మొనర్చుటకు ప్రయత్నించెదవు.



ఏవంస్థితేజగద్రూపం చిత్తమేవేహజృంభతే
నవిద్యతే శరీరాది సికతాంతరతైలవత్. 35

నేను చెప్పబోవు యీ ఆఖ్యాయికచే జగత్తంతయు మనోమాత్రమే యను నిశ్చయమెపుడు నీకుకలుగునో అపుడు యిసుకయందు నూనె లేనట్లు, ఈ శరీరాదులును నీదృష్టియందు లేనివేయగును.

చిత్తమేవహిసంసారో రాగాదిక్లేశదూషితమ్.
తదైవతైర్వినిర్ముక్తం భవాంతఇతికథ్యతే. 36

రాగద్వేషాదులచే కలుషితమగు చిత్తమే సంసారము. రాగాదులెప్పుడు తొలగునో, అపుడే ఈ సంసారభ్రమయంతయుఁ నశించును.

చిత్తంసాధ్యంపాలనీయం విచార్యంకార్యమార్యవత్
అహార్యంవ్యవహార్యంచ సంచార్యంధార్యమాదరాత్. 37

పాలన, విచారణ ఉత్తమకార్యాచరణ, సంపాదన, సంచయము, ధారణ, ఈ మొదలగు లౌకికక్రియలచే సాధ్యమగు పదార్థములన్నింటి రూపమునను చిత్తమే విజృంభించుచున్నది.

సర్వమభ్యంతరేచిత్తం బిభర్తిత్రిజగన్నభః
అహమాపూరమివ తద్యథాకాలం విజృంభతే. 38

ఈ దృశ్యమునంతయు ఆకాశరూపమగు చిత్తమేతనయందు ధరించుచున్నది. ఈ చిత్తమే క్రమముగ దేహేంద్రియాదులతో గలసి వర్తించునపుడు నేనొనర్చుచున్నానను అహంభావనను పొందుచున్నది.

యోఽయంచిత్తస్యచిద్భాగః సైషాసర్వార్థబీజతా
యశ్చాస్యజడభాగశ్చ తజ్జగత్సోఽంగసంభ్రమః. 39

చిత్తమందలి చిదంశము సమస్తపదార్థములకును బీజభూతమగు అహంకారము. అందలి జడాంశము జగద్రూపమగు దృశ్యము.

అవిద్యమానమేవేద మాదిసర్గేధరాదికమ్
నిరాకృతిరజఃస్వప్నం పశ్యతీవ నపశ్యతి. 40

ఆదిసృష్టియందు, నిరాకారుడగు బ్రహ్మదేవుడు యథార్థముగలేనివేయగు యీ పృథ్వ్యాదులను ఒకప్పుడు స్వప్నమువలె గాంచును, మరియొకప్పుడు గాంచకయుండును.

సర్గాదిదీర్ఘసంవిత్త్యా శైలాదిజడసంవిదా
సూక్ష్మంసూక్ష్మవిదాచేతి దేహంశూన్యం నవాస్తవమ్. 41

సృష్టి స్థితి లయములు గలదియు, పర్వతాది పదార్థయుక్తమునునగు విరాట్ - దేహమును, జడమగు అహంభావనా రూపమును, సమిష్టిసూక్ష్మస్వరూపమగు హిరణ్యగర్భదేహమును, మాత్రాత్మ స్వరూపమునుగూడ బ్రహ్మదేవుడు శూన్యముగనే గాంచును. అయ్యవి పరమార్థమున లేనివిగనే యూహించును.

సర్వగేనాత్మనావ్యాప్తం స్వచేత్యాత్మవపుర్మనః
ఆతతంసౌమ్యవిమలం వారీవ రవితేజసా. 42

ప్రశాంతి నిర్మల జలమందు సూర్యప్రకాశము అతిశయించి వ్యాపించునట్లు, సర్వవ్యాపియగు ఆత్మ, విషయరూపములగు దేహమనంబుల వ్యాపించియున్నది

చిత్తబాలోజగద్యక్షం మిథ్యాపశ్యత్యబోధతః
బోధితోఽసావరంరూపం స్వంపశ్యతినిరామయమ్. 43

చిత్తమను బాలుడు అజ్ఞానముచే మిథ్యారూపమగు జగత్తను బేతాలుని చూచుచున్నాడు. కాని జ్ఞానము కలుగగా నీతడే నిర్వికారమగు తన స్వరూపమును గాంచును.

యథాత్మాదృశ్యతామేతి ద్విత్వైక్యభ్రమదాయినీం
శృణుతత్తేప్రవక్ష్యామి వక్ష్యమాణకథాగమైః 44

ఓ రామచంద్రా! ద్వైతైక్యమును, ఏకత్వముల భ్రమనుగలుగఁజేయు దృశ్యరూపము నాత్మ యెటుల పొందెనో, అవ్విధమును ఈ వక్ష్యమాణ కథాప్రసంగముచేతను శాస్త్రప్రమాణములచేతను నీ కెఱిగించెద వినుము.

యత్కథ్యతేహిహృదయంగమయోపమాన యుక్త్యాగిరామధురయుక్తపదార్థయాచ
శ్రోతుస్తదంగహృదయంపరితోవిసారి వ్యాప్నోతితైలమివ వారిణివార్యశంకామ్. 45

మధురపదసంయుతమును, అర్థసహితమును, దృష్టాంతయుక్తమును నగు వాక్యము సంశయనివారణ మొనర్చి జలమందు తైలమువలె శ్రోతల హృదయముల వ్యాపించును.

త్యక్తోపమానమమనోజ్ఞపదందురాపం క్షుబ్ధంధరావిధురితం పినిగీర్ణవర్ణమ్
శ్రోతుర్నయాతిహృదయంప్రవినాశమేతి వాక్యంకిలాజ్యమివభస్మనిహూయమానమ్.

దృష్టాంతవర్జితమును, శాస్త్రవిరుద్ధమును కఠినపదయుక్తమును గ్రస్తాక్షర సహితమునునగు వాక్యము శ్రోతల కానందము గలుగఁజేయజాలనందున భస్మమందు వ్రేల్చబడిన ఘృతమువలె నిష్ఫలమగును.

ఆఖ్యానకాని భువియానికథాశ్చయాయా యద్యత్ప్రమేయముచితంపరిపేలవంవా
దృష్టాంతదృష్టికథనేన తదేతిసాధో ప్రాకాశ్యమాశుభువనం సితరశ్మినేవ. 47

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
మనోంకురోత్పత్తికథనంనామ చతురశీతితమః సర్గః ॥ 84 ॥

వివిధములగు కథలు, ఆఖ్యాయికలు, కావ్యనాటకాదులు,- అధ్యాత్మ విషయనిరూపక గ్రంథములు మొదలగునవి లోకప్రసిద్ధములగు దృష్టాంతములును ప్రమాణములును గలిగియున్నచో, నయ్యవి సూర్యకిరణమువలె ప్రపంచమున వ్యాపించి జనుల హృదయముల ప్రకాశింపజేయగలవు.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
మనోంకురోత్పత్తి కథనమను చతురశీతితమ సర్గము ॥ 84 ॥



## పంచాశీతితమః సర్గః

వసిష్ఠ ఉవాచః—

పురామేబ్రహ్మణాప్రోక్తం సర్వంతత్కథయానఘ
యదిదంతత్ప్రవక్ష్యామి త్వాయిపృచ్ఛతిరాఘవ. 1

వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! ఈ జగత్తు మనోమాత్రమేయని తెల్పుటకొరకై, బ్రహ్మదేవుడు పూర్వము నాకు జెప్పిన ఐందవోపాఖ్యానమును నీ సంశయ నివారణార్థమిపుడు వచించుచున్నాను, వినుము.

పురామయాహిభగవన్ పృష్టః కమలసంభవః
ఇమేకథముపాయాంతి బ్రహ్మన్సర్గగణాఇతి. 2

ఈ వివిధ సృష్టులన్నియు యెటుల కలుగుచున్నవని పూర్వము నేను భగవంతుడగు బ్రహ్మదేవుని యడిగితిని.

తదుపాశ్రుత్యభగవాన్ బ్రహ్మా లోకపితామహః
ఐందవాఖ్యానసహితం మామువాచ బృహద్వచః. 3

ఆ నాప్రశ్నను విని, సర్వలోకేశుడును భగవానుడును నగు బ్రహ్మదేవుడు, ఐందవోపాఖ్యానమును నా కెఱింగించుచు నిట్లుత్తమ వచనములఁబల్కెను.

బ్రహ్మోవాచః—

సర్వంహిమనఏవేద మిత్థంస్ఫురతిభూతిమత్
జలంజలాశయస్ఫారై ర్విచిత్రై శ్చక్రకై రివ. 4

బ్రహ్మ:— జలాశయమందు, జలము విచిత్రములగు ఆవర్తములతో కూడి యుండునట్లు, మహచ్ఛక్తియుతమగు మనస్సే ఈ జగద్రూపమున స్ఫురించుచున్నది.

దినాదౌసంప్రబుద్ధస్య సంసారంస్రష్టుమిచ్ఛతః
పురాకల్పేహికస్మింశ్చి చ్ఛృణుకింవృత్తమంగమే. 5

పూర్వమెుకానొక కల్పాదియందు సృష్టినిర్మాణమునుచేయ నాకిచ్ఛ పొడమెను. ఆ నా వృత్తాంతమంతయును చెప్పుచున్నాను, వినుము.

కదాచిదఖిలంసర్గం సంహృత్యదివసక్షయే
ఏకఏవాహమేకాగ్రః స్వస్థస్తామనయం నిశామ్. 6

అద్వితీయుడనగు నేనొక కల్పాంతమందు జగత్సంహార మొనర్చి ఏకాగ్రమనస్కుడను, స్వస్థచిత్తుడను అయి; ఆ రాత్రి (కల్పరాత్రి) యంతయు ప్రశాంతముగ గడపితిని.

నిశాంతేసంప్రబుద్ధాత్మా సంధ్యాంకృత్వాయథావిధి
ప్రజాఃస్రష్టుందృశౌస్ఫారే వ్యోమ్నియోజితవానహమ్. 7

నిశాంతమున మేల్కొని యథాప్రకారము సంధ్యోపాసనమొనర్చి, ప్రజల సృష్టింపనెంచి, నా విశాలనేత్రముచే నాకసమును బరికించితిని.

యావత్పశ్యామిగగనం నతమోభిర్న తేజసా
వ్యాప్తమత్యంతవితతం శూన్యమంతవివర్జితమ్. 8

అట్లాకాశమును గాంచ, నచట అంధకారముగాని, ప్రకాశముగాని లేకుండెను. అంతము లేని అచ్చోటంతయు, శూన్యమైయుండెను.

సర్గంసంకల్పయామీతి మతిం నిశ్చిత్యతన్మయా
సమవేక్షితుమారబ్ధం శుద్ధంసూక్ష్మేణచేతసా. 9

సృష్టిగావింప నిశ్చయించి, అందులకై, ఏకాగ్రచిత్తముతో సంతట బాగుగ నవలోకింప సాగితిని.

అథాహందృష్టవాం స్తత్ర మనసా వితతేంబరే
పృథక్ స్థితాన్మహారంభాన్ సర్గాన్ స్థితినిరర్గలాన్. 10

అపుడా విశాలాకాశమున, విష్ణ్వాదులచే పాలితములును, సువ్యవస్థితములును, ప్రతిబంధ రహితములును నగు వేలు వేలు సృష్టులనేకములఁ జూచితిని.

తేషుమత్ప్రతిబింబాభాః పద్మకోశనివాసినః
రాజహంసాన్సమారూఢాః సంస్థితా దశపద్మజాః. 11

అచట పద్మకోశములందున్న వారును, రాజహంసారూఢులును, నా ప్రతిబింబమువలె నున్న వారును నగు దశబ్రహ్మలుండిరి.

పృథక్స్థితేషుసర్గేషు తేషూద్యద్భూతపంక్తిషు
జలజాలేషుశుద్ధేషు జగత్సుజలదాయిషు. 12
ప్రవహంతిమహానద్యః ప్రధ్వనంతియథాబ్ధయః
ప్రతపంత్యుష్ణరుచయః ప్రస్ఫురంత్యంబరేఽనిలాః. 13
దివిక్రీడంతివిబుధా భువిక్రీడంతిమానవాః
దానవాభోగినశ్చైవ పాతాలేషు చసంస్థితాః. 14
కాలచక్రపరిప్రోతా యద్భావాఃసకలర్తవః
యథాకాలంఫలాపూర్ణా భూషయంత్యభితోమహీమ్. 15
ప్రోథ్యంశుభశుభాచారస్మృతయః కకుభంప్రతి
నరకస్వర్గఫలదాః సర్వత్రసముపాగతాః. 16
భోగమోక్షఫలార్థిన్యః సమస్తాభూతజాతయః
స్వామీహితంయథాకాలం ప్రయతంతే యథాక్రమమ్ 17
సప్తలోకాస్తథాద్వీపాః సముద్రా గిరయస్తథా
అప్యేష్యమాణాః కల్పాంతం స్ఫురంత్యుత్తరారవమ్ 18
క్వచిద్ధ్వాంసిత్వమాయాతం క్వచిత్స్థిరతరంస్థితమ్
స్థితంసర్వత్రకుంజేషు తమస్తేజోలవాదృతమ్. 19



నభోనీలోత్పలస్యాంత ర్భ్రమదభ్రమధువ్రతమ్
ప్రస్ఫురత్తారకాజాల కేసరాపూర్ణతాంగతమ్. 20
కల్పాంతఘననీహారో మేరుకుంజేషుసంస్థితః
శాల్మలేరమలంతూల మష్ఠీలాకోట రేష్వివ. 21
లోకాలోకాద్రిరసనా రణదర్ణవఘుంఘుమా
తమఃఖండేంద్రనీలాభా నిజరత్నవిరాజితా. 22
ధానాధరసుధా భూతరవకాకలిఘుంఘుమా
సంస్థితాభువనాభోగే స్వాంతఃపురఇవాంగనా. 23
గౌరాంగపంక్తిర్మధ్యస్థా రజనీరాజిరంజితా
పద్మోత్పలస్రజఇవ లక్ష్యతే వత్సరశ్రియః 24

అండజాది చతుర్విధ ప్రాణులతో కూడియున్న భిన్న భిన్న సృష్టులచట గలవు. మరియు జలమును వర్షించుశుద్ధమేఘములును, సముద్రమువలె శబ్దమొనర్చుచు ప్రవహించుచున్న పెద్దనదులును, గలవు. ఆకాశమందు వాయువువీచుచుండెను. స్వర్గమందు దేవతలును, భూలోకమున మనుజులును విలాసముగనుండిరి. పాతాలమందు దానవులును, సర్పములును గలవు. కాలచక్రము ననుసరించుచు తమ తమ స్వభావానుసారము వర్తించుచున్న శీతాతపవర్షాదులతోడను,వసంతాది ఋతువులతోడను పృథివీ తలము శోభాయమానముగ నుండెను. శుభాశుభములగు ఆచారముల విభజించితెల్పునట్టివియు, స్వర్గ నరకాది ఫలములఁ గల్గజేయునవియునగు, స్మృతులచట సర్వవర్ణముల వారిచేతను అనుగమింపబడు చుండెను. భూతకోట్లన్నియు, కాలానుసారము తమతమ యభీష్టసిద్ధికొరకు ప్రయత్నించు చుండెను. సప్తలోకములు సప్తద్వీపములు సప్తసముద్రములు పర్వతములు యధికముగ శోభించుచుండెను. ఒకచోట అంధకారము వ్యాపించియుండెను. మఱొకచోట ప్రకాశముండెను. వనకుంజములందంధకార ప్రకాశములు రెండును మిళితములైయుండెను. ఆకాశమను నీలకమలమున తుమ్మెదలవలె నొప్పు నక్షత్ర ములు గల్గి జగత్తను సరోవరము విరాజిల్లు చుండెను. మేరు పర్వత కుంజములందు మంచు దట్టముగా వ్యాపించియుండెను. లోకాలోక పర్వతములే మొలనూలుగాగలదియు, సముద్రములను ఆభరణముల ధ్వనితోకూడినదియు, అంధకారమును నశింపజేయు యింద్రనీలమణివంటి కాంతిగల్గిన రత్నములను తనయందుగలదియు, సస్యములను అమృతమును బడసియున్నదియు, ప్రాణుల శబ్దములను వాగ్విలా సముతో నొప్పుచున్నదియు నగు పృథివియను యంగన యంతఃపురమునందువలె యా బ్రహ్మాండమున శోభించుచుండెను. ప్రకాశాంధకారములను శ్వేతనీల కమలముచే నిర్మింపబడిన మాలలుగల్గి, విద్యుత్కాంతులతోను, నక్షత్రములతోను నలంకరింప బడినదై యాకసము చాల మనోహరముగ గన్పట్టుచుండెను.

బహుగర్తవిభాగస్థ భూతాలోకాఃపృథక్ పృథక్
జాతారుణావిలోక్యంతే దాడిమానీవకాంతికాః. 25
త్రిప్రవాహాత్రిపథగా కృతోర్ధ్వాధోగమాగమా
జగద్యజ్ఞోపవీతాభా స్ఫురతీందుకలామలా. 26

ఇతశ్చేతశ్చగచ్ఛంతి శీర్యంతేప్రోద్భవంతిచ
దిగ్లతాసుతడిత్పుష్పా వాతార్తామేఘపల్లవాః. 27

గంధర్వనగరోద్యాన లతావితానమాలినీ
సముద్రభూమినభసాం పదవీప్రవిరాజతే. 28

లోకాంతరేషుసంఘేన దేవాసురనరోరగాః
ఉదుంబరేషుమశకా ఇవఘుంఘుమితాఃస్థితాః. 29

యుగకల్పక్షణలవ కలాకాష్ఠాకలంకితః
కాలోవహాత్యకలిత సర్వనాశప్రతీక్షకః. 30

ప్రాణులను బీజములుగల్గి, సూర్యకాంతియను ఎఱుపురంగుగలదై బ్రహ్మాండమంతయు నట దాడిమఫలమువలె నొప్పుచుండెను. త్రివిధమార్గములుగల్గి ఊర్ధ్వాధోదిశల బ్రవహించు గంగానది జగత్తునకు జందెముగానున్నదై చంద్రునివలె బ్రకాశించుచుండెను. మేఘములను యాకులతోకూడిన మెఱపులను పుష్పములు దిక్కులను తీగెలందు ఉత్పన్నమగుచు నశించుచునుండెను. గంధర్వ నగరోద్యానమందలి లతలవలె సముద్ర భూమ్యాకాశములన్నియు మిక్కుటముగ శోభనొనగూర్చుచుండెను. ఉదుంబర (అత్తి) ఫలమందు క్రిమిసమూహమువలె బ్రహ్మాండమందలి తదితరలోకములందు దేవతలు అసురులు మనుష్యులు సర్పములు ఉండెను. ఈ లోకములంతటను యుగ, కల్ప, క్షణ, నిమేషాది రూపముననున్న కాలము సమస్త పదార్థములయొక్క నాశనమునకై ప్రతీక్షించుచుండెను.

ఏవమాలోక్యశుద్ధేన పరేణస్వేనచేతసా
భృశంవిస్మయమాపన్నః కిమేతత్కథమిత్యలమ్. 31

కథం మాంసమయేనాక్ష్ణా యన్నపశ్యామికించన
తన్మాయాజాలమతులం పశ్యామిమనసాంబరే. 32

శుద్ధచిత్తముచే నిట్లుగాంచి ఆశ్చర్యచకితుడనై ఇదియేమి? యెట్లుత్పన్నమాయెను? చర్మచక్షువున కగోచరమగు ఈ మాయాజాలమంతయును మనోనేత్రమునకేల బ్రత్యక్షమగుచున్నదని నేనపుడాలోచించితిని.

అథాలోక్యచిరంకాలం మనసైవాహమంబరాత్
అర్కంతస్మాజ్జగజ్జాలా దేకమానీయపృష్టవాన్. 33

ఆగచ్ఛదేవదేవేశ భోభాస్కరమహాద్యుతే
స్వాగతంతేస్త్వితిప్రోక్తో మయాసౌకథితోఽవ్యథ. 34

కస్త్వంకథమిదంజాతం జగదేవ జగంతిచ
యదిజానాసి భగవం స్తదేతత్కథయానఘ. 35

ఇట్లు చాలసేపు మనోనేత్రముచే జూచి, పిదప ఆకసముననున్న యొక సూర్యునిబిలచి యిట్లంటిని—ఓ దేవా! ప్రకాశవంతుడగుకో సూర్యభగవానుడా! రమ్ము, నీకు శుభాగమనమగు గాక! నీవెవరవు? ఈ జగత్తెట్లుత్పన్నమయినది? ఓ దేవా! దీనిని నీ వెఱింగినచో, వెంటనే తెలియజేయుము.



ఇత్యుక్తోమాం సమాలోక్య సంపరిజ్ఞాతవానథ
నమస్కృత్వాభ్యువాచేద మనింద్యపదయాగిరా. 36

సూర్యుని నేనిట్లడుగ అంతనాతడు నన్ను బాగుగ పరికించి నమస్కరించినవాడై యిట్లు త్తమ వాక్యములబల్కెను.

భానురువాచ:—

అస్యదృశ్యప్రపంచస్య నిత్యంకారణతాముసి
గతఃకస్మాన్నజానీషే. కింమామీశ్వరపృచ్ఛసి. 37

సూర్యుడు:— ఓ పరమేశ్వరా! నీ వీదృశ్య ప్రపంచమునకెల్ల సదా కారణరూపుడవై యుండియు దీని నెఱుంగక యుంటివా? ఏలనన్నడుగు చుంటివి?

అథమద్వాక్యసందర్భే లీలాచేత్తవసర్వగ
అచిన్తితాంమదుత్పత్తిం తచ్ఛృణుష్వవదామ్యహమ్. 38

సర్వవ్యాపివగు నో మహాత్మా! నావలననే అద్దానిని వినగోర్కగల్గియున్నచో యచింత్యమైయొప్పు నా యుత్పత్తిని గూర్చి నీకు తెలియజెద నాలకింపుము.

సదసదితికలాభిరాతతం యత్సదసదబోధవిమోహదాయినీభిః
అవిరతరచనాభిరీశ్వరాత్మన్స్వవిలసతీహ మనోమహన్మహాత్మన్. 39

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ఐందవోపాఖ్యానోపక్రమే బ్రహాదిత్యసమాగమోనామ పంచాశీతితమః సర్గః ॥ 85 ॥

ఓ పరమాత్మా! నిరంతరము జగన్నిర్మాణ మొనర్చుచున్న యీ మాయాశక్తి తత్త్వజ్ఞానాభావముచే సత్యముగను, ప్రబోధానంతర మసత్యముగ నున్నదై సదసద్రూపమైయుండి దేశకాలాదులచే పరిచ్ఛిన్నమై విజృంభించుచున్నదో అదంతయు మనోవిలాసమాత్రమే యని నీవు గ్రహింపుము.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
ఐందవోపాఖ్యానోపక్రమమందు బ్రహాదిత్యసమాగమను
పంచాశీతితమ సర్గము. ॥85॥

## షడశీతితమః సర్గః.

శ్రీభానురువాచ:—

కల్పనామ్నిమహాదేవ హ్యాస్తనేదివసేతవ
తల్లేకైలాసశైలస్య జంబూద్వీపైకకోణకే. 1

సువర్ణజటనామ్నాయ స్త్వత్పుత్రై ర్జనితప్రజైః
మండలంకల్పితంశ్రీమదనల్పసుఖసుందరమ్. 2

సూర్యుడు:— దేవా! పూర్వకాలమున, కైలాసపర్వతమున కధోభాగమున నున్న జంబూద్వీపమునందు సువర్ణజటయను పేరుగల ప్రదేశమొకటిగలదు. అచట ప్రజల సృష్టించు మరీచ్యాది నీ కొమరులు తమ నివాసార్థము ఐశ్వర్యయుక్తమును పలువిధ సుఖసామగ్రి గల్గి రమణీయమై నొప్పునదియునగు స్థానమును నిర్మించిరి.

తత్రాభూదతిధర్మాత్మా బ్రాహ్మణో బ్రహ్మవిత్తమః
ఇందునామాతిశాంతాత్మా కశ్యపస్యకులోద్భవః. 3

అచట, బ్రహ్మవిద్వరుడును కశ్యపకులోత్పన్నుడును ధర్మాత్ముడును నైన ఇందువను బ్రాహ్మణుడుండెను.

తస్మిం స్తదానివసతో నిత్యంస్వజనమండలే
తస్యప్రాణసమాభార్యా కాచి త్తస్యాంమహాత్మనః. 4
నబభూవాత్మజ స్తస్య మరుభూమాతృణంయథా
నవ్యరాజతసాభార్యా తస్యనిష్ఫలపుష్పితా. 5

అతడెల్లప్పుడును బ్రహ్మనిష్ఠులగు సత్పుంగవుల సాంగత్యము గలిగియుండును. ఆతనికి ప్రాణప్రియయగు భార్య యొకతె గలదు. కాని మరుభూమియందు తృణముండనట్లు వారలకు సంతతి లేకుండెను. అందుచే నా బ్రాహ్మణుని పత్ని ఫలపుష్పరహితమగు లతవోలె శోభావిహీనయై యుండెను.

ఋజ్వీగౌరీసుశుద్ధాపి శూన్యాశరలతాయథా
తౌతతోదంపతీఖిన్నౌ పుత్రార్థంతపసేగిరేః. 6
కైలాసస్యాంశమారూఢౌ రూఢావివ నవద్రుమౌ
భూత్వైరనావృతేశూన్యే తస్మిన్కైలాసకుంజకే. 7
తేపతుస్తౌతపో ఘోరం జలాహారౌతరుస్థితీ
ఏకంపానీయచులకం పీత్వాదివసపర్యయే. 8

ఆ స్త్రీ, సాధ్వియు గౌరవర్ణయు శుద్ధవంశజయు నైనను శరలతవలె శోభను పొందకుండెను. అందుచే ఖిన్నులగు ఆ దంపతులిర్వురును పుత్రసంతాన ప్రాప్తికై కైలాసపర్వతమునకుంబోయి అచట వృక్షమువలె స్థిరముగనుండి చాలదినముల కొకతూరి దోసిల నీటినిమాత్రము త్రావుచు, ఇవ్విధమున జలాహారులై యుండి ఘోరతపంబు చేయదొడంగిరి.

నిస్పందముత్థితౌవార్క్షీం వృత్తిమాశ్రిత్యసంస్థితౌ
తస్థతుస్తౌతదాతత్ర తావత్కాలంతరువ్రతౌ. 9
యావత్త్రేతాద్వాపరంచ యుగేద్వేపవతేగతే
తతస్తుష్టోఽభవద్దేవ స్తయోఃశశికలాధరః. 10



తరువువోలె నిశ్చలముగ నున్నవారై చేష్టారహితులై త్రేత, ద్వాపర యుగములు రెండును గడచు పర్యంతమును నిటులనే తపస్సు చేయుచుండ నంత చంద్రశేఖరుడగు మహాదేవుడు ప్రసన్నుడయ్యెను.

దినాతపాతాపితయో రిందుఃకుముదయోరివ
ఆజగామతముద్దేశం యత్రతౌవిప్రదంపతీ. 11
సలతాపాదపం దేశం పుష్పాకరఇవేశ్వరః
దంపతీతౌవృషారూఢం సోమంసోమార్ధశేఖరమ్. 12

దినమంతయు ఎండచే తపించిన కలువలకు చంద్రుడు తనరాకచే ప్రీతిగొల్పునట్లును, వృక్షలతా సమూహములకు వసంతఋతువు మదకును జేకూర్చునట్లును ఈశ్వరుడా దంపతుల కానందము కలుకజేయుటకొరకై వారిచెంతకు రాగా నంత వారిరువురును, వృషభారూఢుడును పార్వతీసహితుడును చంద్రశేఖరుడును నగు పరమేశ్వరుని దర్శించిరి.

ఫుల్లాననౌదదృశతుః కుముదే శశినంయథా
తౌతంప్రణేమతుర్దేవం తుషారామలమీశ్వరమ్. 13

కలువలు చంద్రుని ప్రీతితో నవలోకించునట్లు వికసిత నేత్రులగు వారిరువురును తుషారమువలె స్వచ్ఛకాంతి గల్గిన మహాదేవునిఁ గాంచి ప్రణమిల్లిరి.

ద్యావాపృథివ్యావుదితం పరిపూర్ణమివోడుపమ్
తర్జయన్పవనాధూత నవవృక్షాననస్వరమ్. 14
మృదూద్దామస్మితస్పంది ప్రోవాచాథవచఃశివః

వాయువుచే చలింపబడుచున్న పల్లవములుగల ఆమ్రవృక్షముపై మధురగానమొనర్చు భ్రమరకోకిలాదుల స్వరములగూడ తన మధురవాక్కుచే పరాజితము చేయు నీశ్వరుడు భూమ్యాకాశముల మధ్య నుదయించి మందహాసముతో నిట్లుపల్కెను.

శ్రీఈశ్వర ఉవాచ:—

వరంవిప్రగృహాణాశు తుష్టోఽస్మితవవాంఛితమ్. 15
మధుమాసరసాక్రాంత వృక్షవన్ముదితోభవ

ఈశ్వరుడు:— ఓ బ్రాహ్మణోత్తమా! నేను నీయెడ ప్రసన్నుడనైతిని. నీ యభీష్టమగు వరమును గైకొనుము. అద్దానిని బడసి వసంతకాలరసవిశేషముచే పూర్ణమైయొప్పు వృక్షమువలె శోభించుచు సంతుష్టుడవుకమ్ము.

విప్రఉవాచ:—

భగవన్దేవదేవేశ దశపుత్రామహాధియః. 16
భవ్యాభవంతుమేభూయః శోకోయేన నబాధతే

విప్రుడు:— దేవేశా! భగవానుడా! ఎవరినిబడయుటచే మరల దుఃఖము కెందకయుందునో అట్టి యుత్తములును సంపన్నులును బుద్ధిశీలురును నగు పదిగురు కొమరులు నాకు గల్గునటుల యనుగ్రహింపుము.

భానురువాచః—

అథైవమస్త్వితి ప్రోచ్య జగామాంతర్ధిమీశ్వరః. 17
వ్యోమ్నివారినిధిర్ధ్వానిదం కృత్వేవోర్మిమహావపుః
తతస్తౌదంపతీతుష్టౌ శివలబ్ధవరౌగృహమ్. 18
గతౌగీర్వాణసదృశౌ ఖమివోమామహేశ్వరౌ
తత్రాసౌబ్రాహ్మణగేహే బభూవోదారగర్భిణీ. 19
బభౌపూర్ణోదరాశ్యామా మేఘలేఖేవవారిణా
కాలేఽథసుషువేపుత్రాన్ప్రతిపచ్చంద్రకోమలాన్. 20

సూర్యుడు;— అంతనాకసమున మహాసముద్రమువలె శబ్దమొనర్చుచు యుచ్చస్వరముతో నీశ్వరుడు 'అట్లనేయగుగాక' యని బల్కి యంతర్ధానమయ్యెను. ఇట్లు శివునివలన వరముల బడసి, ప్రసన్నచిత్తులై ఆ దంపతులిర్వురు దేవతలాకాశమునకును శివపార్వతులు బ్రహ్మాకాశమునకును బోవునట్లు తమ గృహమునుగూర్చి వెడలిరి. ఆ బ్రాహ్మణస్త్రీయు గర్భవతియై శ్యామవర్ణముగల మేఘమువలె నొప్పుచు ప్రతిపచ్చంద్రునివలె నిర్మలురగు దశపుత్రులఁగనెను.

దశబాలాంస్తతోముగ్ధాన్ వసుధేవ నవాంకురాన్
కృతబ్రాహ్మణసంస్కారా వృద్ధిమీయుర్మహౌజసః. 21

పృథివి నూతనాంకురముసుత్పన్నము చేయునట్లామె సౌందర్యవంతులగు దశపుత్రులఁ గనెను. వారలకు జాతకర్మాది బ్రాహ్మణోచిత సంస్కారములు గావింపబడెను. తేజస్సంపన్నులగు వారలు క్రమముగ వృద్ధినంద జొచ్చిరి.

స్వల్పేనైవహికాలేన ప్రావృషేవ నవాంబుదాః
తేసప్తవర్షవయసో బభూవుర్జ్ఞాతవాఙ్మయాః. 22

నూతన వర్షాకాల మేఘమువలె యభివృద్ధగాంచుచు, యేడువత్సరములు ప్రాయముననే సర్వశాస్త్రముల నెఱింగిరి.

విరేజుస్తేజసాతత్ర నభసీవామలాగ్రహాః
అథకాలేనమహతా తేషాంతౌపితరౌతదా. 23
సంజగ్మతుస్తనుంత్యక్త్వా స్వాంగతింగతికోవిదౌ
మాతాపితృభ్యాంరహితా దశతేబ్రాహ్మణాస్తతః. 24
యయుఃకైలాసశిఖరం గృహంసంత్యజ్యఖేదినః
తత్రసంచింతయామాసు రుద్విగ్నాస్తేవిబాంధవాః. 25
కింస్యాదిహపరంశ్రేయ ఊచుశ్చేదంపరస్పరమ్

ఆకసమున నిర్మలముగ ప్రకాశించు గ్రహములవలెవారు శోభించుచుండిరి. ఇట్లుండ చాల కాలమైన వెనుక, తత్త్వజ్ఞులగు వారి తల్లిదండ్రులిరువురును తమ శరీరములఁత్యజించి విదేహముక్తులవ, వారి వియోగముచే ఖిన్నులైన, బంధురహితులగు ఆయిందుని దశపుత్రులును గృహమునువీడి కైలాస పర్వతశిఖరమునకుఁబోయి, అచట పరస్పరమిట్లు సంభాషించుకొనిరి.



కిమిహస్యాత్సముచితం భ్రాతరఃకిమదుఃఖదమ్. 26
కింమహత్త్వంకిమైశ్వర్యం కింమహావిభవంశుభమ్
కింతదేతజ్జనైశ్వర్యం సామంతోఽపిహిమహేశ్వరః. 27
సామంతసంపత్కింనామ రాజానోఽపి మహేశ్వరాః
కానామసంపద్భూపానాం సమ్రాడిహమహేశ్వరః. 28
కింనామతన్మహేంద్రత్వం యన్ముహూర్తంప్రజాపతేః
వినశ్యతినయత్కల్పే కింస్యాత్తదిహశోభనమ్. 29

సోదరులారా! ఉత్తమ శ్రేయమొనగూర్చునదియు, ఇహపరలోకముల సుఖమును గలుగజేయునదియు ఏది? కీర్తిని, ఐశ్వర్యమును, ప్రసాదించునదేది? శుభప్రదమును, వైభవయుక్తమును నగునదేది? — గృహగ్రామాదులు గలమనుజుని ఐశ్వర్యమే ఉత్తమమైనది. కాన, మండలాధిపతియే యైశ్వర్యవంతుడు—మండలాధిపత్యమేల, రాజులు దేశాధిపతులుగాన వారేమహదైశ్వర్య సంపన్నులు — దేశాధిపత్యమేమి, మహద్విభవోపేతుడగు చక్రవర్తి అనేక దేశముల పాలింపడా? కాన అతని ఐశ్వర్యమే వాంఛనీయమైయున్నది.— ఇక మహేంద్రపదవియు నుత్తమమైనదనెదరేమో, అదియునుఁ గాదు. మహేంద్రత్వమును, అల్పమైనదే. ఏలయన, అది బ్రహ్మదేవుని యొక్క ముహూర్తకాలములో నశించును. కాన కల్పమందును గూడ నశింపని ఉత్తమపదమీలోకమున, ఎయ్యది గలదు?

భాషమాణేష్వథైతేషు జ్యేష్ఠోభ్రాతామహామతిః
గంభీరవాగువాచేదం మృగయూథాన్మృగో యథా. 30

ఇట్లాసోదరులు పరస్పరము సంభాషించుకొనుచుండ, వారిలో జ్యేష్ఠుడును, మిక్కిలి బుద్ధిమంతుడును నగువాడు, మృగాధిపతి మృగయూథమునుగూర్చి పల్కినట్లు, గంభీరముగ నిట్లు వచించెను.—

ఐశ్వర్యాణాంహిసర్వేషా మాకల్పం నవినాశియత్
రోచతేభ్రాతరస్తన్మే బ్రహ్మత్వమిహనేతరత్. 31

ఓ సోదరులారా! సమస్తైశ్వర్యములలోను కల్పమందునుగూడ నశింపని బ్రహ్మత్వమే యుత్తమమైనదని నేను తలంచుచున్నాను.

ఏతదుక్తంతదఖిలా ద్విజపుత్రాస్తదుత్తమాః
వచోభిరైందవాస్తత్ర సాధుసాధ్వీత్యపూజయన్. 32
ఊచుశ్చేదంకథంతాత సర్వదుఃఖోపమార్జనమ్
పద్మాసనంజగత్పూజ్యం విరంచిత్వమవాప్నుమః. 33

జ్యేష్ఠసోదరుని యావాక్యములవిని, తక్కిన ఐందవులందరును 'మంచిది' 'మంచిదని' బల్కి, వానిని ప్రశంసించి మఱియు నిట్లనిరి. — ఓ సోదరా! సర్వదుఃఖోపశమన మొనగూర్చునట్టి, జగత్పూజ్యుడగు పద్మాసనుని దివ్యపదమెట్లు సంప్రాప్తించును?

భ్రాతాతేనపునఃప్రోక్తా భ్రాతరోభూరితేజసః
మదుక్తంసర్వఏవేమే భవంతఃపాలయంతువై. 34

అంత నధిక తేజస్సంపన్నుడగు నా జ్యేష్ఠ సోదరుడిట్లనియె–మీరందరును, దృఢనిశ్చయులై జీవితపర్యంతమును నే జెప్పునట్లాచరింపుడు.

పద్మాసనగతో భాస్వాన్ బ్రహ్మాహమితి తేజసా.
సృజామిసంహరామీతి ధ్యానమస్తుచిరాయ వః. 35

'పద్మాసనాసీనుడును ప్రకాశవంతుడును నగు బ్రహ్మయే నేను. నా శక్తిచే బ్రహ్మాండమునంతయు సృజించుచు మరల సంహారమొనర్చుచున్నాను.' ఇట్లు భావనచేయుచు మీరు చిరకాలము (భ్రమరకీట న్యాయమువలె) బ్రహ్మపదప్రాప్తిగలుగువరకు నిశ్చలముగ ధ్యానముచేయుడు.

అగ్రజేనేతికథితే బాఢంకృత్వాపడత్తమాః
ధ్యానాధీనధియస్తస్థుః సహైవజ్యాయసా రసాత్. 36

జ్యేష్ఠ సోదరుడిట్లు వచింప నంత వారదియే యుక్తముగ నున్నదని తలంచి, ఆతనివలెనే యందరును ధ్యాన పరాయణులైరి.

లిపికర్మార్పితాకారా ధ్యానాసక్తధియశ్చతే
అన్తస్థేనైవమనసా చింతయామాసురాదృతాః. 37

ధ్యాననిష్ఠులగు వారందరును లిఖితచిత్రమువోలె నిశ్చలముగ నున్నవారై బాహ్యవృత్తుల నిరోధించి చిత్తమునంతర్ముఖమొనర్చి బ్రహ్మపదమును గూర్చి యిట్లు చింతన చేయదొడగిరి.

అథఉత్ఫుల్లకమల కోశవత్రోన్నతాసనః
బ్రహ్మాహంజగతాంస్రష్టా కర్తాభోక్తామహేశ్వరః. 38

'వికసితకమలమే నాయాసనము. ఈ జగత్తునకు స్రష్టయు, కర్తయు, భోక్తయు, నేనే. ఈశ్వరుడనేనే.

యజ్ఞక్రియాక్రమవతః సాంగోపాంగామహర్షయః
సరస్వత్యాథగాయత్ర్యా యుక్తావేదా నరాఇమే. 39

యజ్ఞస్వరూపుడను నేనే. యాజకులగు మహర్షులును – శిక్షావ్యాకరణాది అంగములును పురాణాది ఉపాంగములునుగల గాయత్రీయుక్తమగు వేదమును, మానవకోటియంతయు నాయందే స్థితిగల్గియున్నవి.

లోకపాలపరాక్రాంతః సంచరత్సిద్ధమండలః
అయముద్దామసౌభాగ్యః స్వర్గఃస్వరవిభూషితః. 40

లోకపాలకులు సిద్ధులు నివసించినదియు, ఉత్తమస్వరముచే విభూషితమైనదియు నగు స్వర్గము నాయందే గలదు.

పర్వతద్వీపజలధి కాననైః సమలంకృతమ్
ఇదంభూమండలంచైవ త్రిలోకీకర్ణకుండలమ్. 41

పర్వత ద్వీప వనములచే సుశోభితమగు భూమండలము త్రిలోకమను స్త్రీకి కర్ణకుండలముగ నున్నదై నాయందే వెలయుచున్నది.

వితత్పాతాలకుహరం దైత్యదానవభోజితమ్
అమృతస్త్రీగణాకీర్ణం గృహాంగగనకోటరమ్. 42



ఆహా! దైత్య దానవులుగల పాతాలలోకమును, దేవతాస్త్రీలు గల్గియున్నదియు గృహమువలె నొప్పుచున్నదియునగు యాకాశమున్నూ నా యందెట్లు శోభించుచున్నవి.

అయమింద్రోమహాబాహుః ప్రజాలంకృతదోత్తమః
త్రైలోక్యనగరీమేకః పాతిపావనయజ్ఞభుక్. 43

ప్రజారంజకుడును గొప్ప బాహువులు గలవాడును, యజ్ఞభోక్తయు నగు యింద్రుడు నాయందే త్రిలోకమనునగరమును పాలించుచున్నాడు.

దీప్రజాలవరత్రాభి రవష్టభ్యాథదిగ్గణమ్
క్రమేణప్రపతంత్యేతే భానవోభూరిభానవః. 44

నాయందే తీక్ష్ణకిరణులగు ద్వాదశాదిత్యులు తమ కిరణ పాశములచే దిక్కులబంధించి క్రమముగ పండ్రెండుమాసములను తపింపజేయుచున్నారు.

లోకపాలాఇమేలోకం రక్షంతిశుద్ధవృత్తయః
మర్యాదాభిరతుచ్ఛాభి ర్గోపాలా గోపణంయథా. 45

పరిశుద్ధులగు ఇంద్రాది లోకపాలకులు నియతి యుక్తులై, గోపాలుడు గోవులను పాలించులాగున తమ తమ లోకముల పాలించుచున్నారు.

ఉన్మజ్జంతినిమజ్జంతి ప్రస్ఫురంతిపతంతిచ
తరంగాఇవ తోయానా మిమాఃప్రతిదినంప్రజాః. 46

తరంగములవలె జీవులు ఉత్పన్నమగుచు మరల నశించుచున్నారు. వారొకప్పుడైశ్వర్యయుక్తులయ్యు మరియొకప్పుడు దారిద్ర్య బాధచే క్రుంగుచును న్నారు.

సృజామీమమహంసర్గం సంహరామి తథాదృతః
అయమాత్మనితిష్ఠామి శామ్యామిభువనేశ్వరః. 47

ఈ సృష్టియంతయు నాచే నిర్మింపబడుచున్నది. నేనే దీనిని సంహారమొనర్చుచున్నాను. సమస్తలోకముల కీశ్వరుడనేనే. ఆత్మయందు స్థితిగల్గియున్నందున నేనుపరమశాంతిని బడయుచున్నాను.

అయంసంవత్సరోయాత ఇదంపరిణతంయుగమ్
సృష్టేరయమసౌకాలః స్వయం సంహరణస్యచ. 48

బ్రహ్మవత్సరము గడచినది; యుగపరివర్తనమైనది; ఇది సృష్టికాలము; లయకాలమిపుడే సంప్రాప్తించినది.

అయమేవగతఃకల్పో బ్రాహ్మీరాత్రిరియంతతా
అయమాత్మనితిష్ఠామి పూర్ణాత్మాపరమేశ్వరః. 49

ఈ కల్పమును గతించినది; బ్రహ్మరాత్రి యిపుడు గడపుచున్నది; పూర్ణాత్మ స్వరూపుడను పరమేశ్వరుడను నగు నేను స్వస్వరూపస్థితియందే స్థిరముగనున్నాను.

ఇతిభావితయాబుద్ధ్యా తే ద్విజాఅథఐందవాః
దశాద్రివృత్తయ స్తస్థుః సముత్కీర్ణాఇవోపలాత్. 50

ఓ బ్రహ్మదేవా! ఇట్లు బ్రహ్మభావనచేయుచు నా యైందవులు పర్వతమువలె నిశ్చలముగను శిలావిగ్రహమువలె స్థిరముగను నుండి ధ్యానమగ్నులైరి.

అధిగతకమలాసనక్రమాస్తే పరిగలితేతరతుచ్ఛవృత్తిజాలాః
సతతమతితరాం కుశాసనస్థాశ్చిరమితిపంకజకల్పనే విరేజుః. 51

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ఐందవోపాఖ్యానే ఐందవసమాధానంనామ షడశీతితమః సర్గః ॥ 86 ॥

కుశాసనస్థులగు నా పదిగురు బ్రాహ్మణపుత్రులును కమలాసనుని గూర్చి యిట్లు భావింపనపుడు దోషరహితులై బ్రహ్మపదమునందు ప్రతిష్ఠితులై చిరకాలము శోభాసంపన్నులై విరాజిల్లిరి.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
ఐందవోపాఖ్యానమున ఐందవసమాధానమనుషడశీతితమ సర్గము. ॥ 86 ॥

## సప్తాశీతితమః సర్గః.

భానురువాచ:—

పితామహక్రమే తస్మింస్తత స్తేబహుభావనాత్
కర్మభిస్తైఃసమాక్రాంత మనస్కాస్తస్థురాదృతాః. 1

సూర్యుడు:—ఓ బ్రహ్మదేవా! ఇట్లాయుపాసనాక్రమమున ఐందవులు లోకములయొక్కయు ప్రాణులయొక్కయు సృష్టి స్థితి సంహారముల గూర్చి భావించుచుండిరి.

యావత్తేదేహకాస్తేషాం తావేనపవనైస్తథా
కాలేనశోషమభ్యేత్య గలితాఃశీర్ణపర్ణవత్. 2

ఇవ్విధమున వారు బ్రహ్మోపాసనయందు మగ్నులైయుండ కొంతకాలమునకు వారి శరీరములు ఎండచేతను వాయువుచేతను శుష్కించి యెండుటాకువలె క్రిందకు వ్రాలెను.

జగ్ధుస్తాన్దేహకాంస్తత్ర క్రవ్యాదా వనవాసినః
ఇతశ్చేతశ్చలులితాన్సఫలానీవ మర్కటాః. 3

ఇటు నటు చెదరి పడియున్న వారి శరీరములను మాంసాహారులగు వన్యమృగాదులు, వానరములు ఫలముల తినునట్లు, తినివైచెను.

అథతేశాంతబాహ్యార్థా బ్రహ్మత్వైకకృతభావనాః
తస్థుశ్చతుర్యుగస్యాంతే యావత్కల్పఃక్షయంగతః. 4



దేహపతనానంతరము బాహ్యవృత్తిరహితులై చతుర్యుగాంతమందు కల్పక్షయ మగువరకు బ్రహ్మభావన చేయుచుండిరి.

క్షీయమాణేతతఃకల్పే తపత్యాదిత్యసంచయే
పుష్కరావర్తకేషూచ్చై ర్వర్షత్సుకఠినారవమ్. 5

వహత్సుకల్పవాతేషు స్థితఏకమహార్ణవే
క్షీణేషుభూతవృందేషు తేతథైవవ్యవస్థితాః. 6

కల్పాంతమైనను, సూర్యులు తమ తీక్ష్ణకిరణములచే లోకముల తపింపజేసినను, ప్రలయమేఘములు గొప్పధ్వనిచేయుచు వర్షించినను, కల్పాంతవాయువులు వీచినను; ప్రాణికోట్లన్నియు నశించినను, అంతయు జలమయమై యుండినను, ఆ ఐందవులట్లనే ధ్యాననిష్ఠయందుండిరి.

తతోరాత్రిక్రమపరే సర్వాంసంహృత్య తాంస్థితిమ్
స్థితేత్వయ్యాత్మని విభో తేతథైవవ్యవస్థితాః. 7

ఓ దేవా! సృష్టిసంహారమొనర్చిన పిదప బ్రాహ్మీరాత్రియందు నీవు స్థితిఁబొందియున్నప్పుడును వారలావిధముననే ధ్యానమగ్నులై యుండిరి.

అద్యప్రబుద్ధేభవతి స్రష్టుమిచ్ఛతిసంసృతిమ్
సుఖేనైవక్రమేణోచ్చైస్తేతథైవవ్యవస్థితాః. 8

ఇపుడా బ్రాహ్మీరాత్రినుండి మేల్కొని నీవు ప్రజల సృష్టింప నెంచుచుంటివి. కాని ఆ బ్రాహ్మణపుత్రులట్లనే సుఖముగ ధ్యానమందుండిరి.

తథైతేభగవన్బ్రహ్మన్ బ్రహ్మణోబ్రాహ్మణాదశ
తవతేదశసంసార మనోవ్యోమనిసంస్థితాః. 9

ఓ బ్రహ్మదేవా! ఇట్లాపదిగురు బ్రాహ్మణకుమారులును కాలక్రమమున బ్రహ్మలైరి. ఆ పది బ్రహ్మాండములును వారి చిత్తాకాశముననే ప్రతిష్ఠితములైయున్నవి.

తేషామేకతమస్యాహ మయమాకాశమందిరే
భానుర్భువి విభో కాలకలాకర్మణియోజితః. 10

ఆ పది బ్రహ్మాండములందలి యొకదానియందు కాలకర్మవిభాగమొనర్చుటకై ఆకసమందు సూర్యరూపమున నేను నియుక్తుడను కాబడితిని.

ఏషతేకథితఃసర్గో దిశానామబ్జసంభవ
బ్రహ్మాణాంసంభవోవ్యోమ్ని యథేచ్ఛసితథాకురు. 11

ఇట్లాకాశమందలి దశబ్రహ్మాండ సృష్టినిగూర్చి నీకు తెలిపినాను. ఇక నీ వెయ్యది యుచితమని తలంచెదవో యద్దాని నొనర్పుము.

వివిధకల్పనయావలితాంబరం యదిదముత్తమజాగతముత్థితమ్
కరణజాలకమాహితమోహనం తదఖిలంనిజచేతసివిభ్రమః. 12

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ఐందవోపాఖ్యానే దశజగద్వర్ణనంనామ సప్తాశీతితమః సర్గః ॥ 87 ॥

వివిధకల్పనలచే నాకసమును పరివేష్టించి బాహ్యాభ్యంతర ఇంద్రియసమూహమువలె బంధహేతువును మోహదాయకమును నైయున్న ఈ దృశ్యమంతయు కేవలము చిత్తభ్రాంతిమాత్రమే గాని యథార్థము కాదు.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
ఐందవోపాఖ్యానమున జగద్వర్ణనమను సప్తాశీతితమ సర్గము ॥ 87 ॥

## అష్టాశీతితమః సర్గః

బ్రహ్మోవాచః—

బ్రహ్మణో బ్రాహ్మణాభాను రిత్యుక్త్వా బ్రహ్మణో మమ
బ్రహ్మన్ బ్రహ్మవిదాం శ్రేష్ఠ తూష్ణీమేవబభూవసః. 1

బ్రహ్మ:- బ్రహ్మవిద్వరిష్ఠుడవగు నో వసిష్ఠమునీంద్రా! ఇట్లాదశబ్రహ్మలును బ్రాహ్మణపుత్రులేయని సూర్యుడు నాతో బల్కి యూరకుండెను.

తతఉక్తంమయాతస్య చిరంసంచింత్యచేతసా
భానోభానోఁవదాశుత్వం కిమన్యత్సంసృజామ్యహమ్ 2
ఏతానిదశవిద్యంతే కిలయత్రజగంతివై
తత్రాన్యోమమసర్గేణ కోఽర్థఃకథయభాస్కర. 3

అపుడు నేను చాలసేపు విచారించి యిట్లంటిని. ఓ-భాస్కరా! ఇక నే నేల మరియొక సృష్టి గావింపవలెను? ఈ దశ బ్రహ్మాండములుండ యిక నే జేయు సృష్టిచే నేమి ప్రయోజనమో వచింపుము.

ఇత్యుక్తోఽథమయాభానుః సంచింత్యసుచిరంధియా
ఇదమత్రవచోయుక్త ముువాచ స మహామునే. 4

ఓ మునీంద్రా! నే నిట్లడుగ నంత నా భాస్కరుడు దీర్ఘముగ విచారించి యిట్లుత్తమ వాక్యములఁబల్కెను. —

భానురువాచః—

నిరీహస్యనిరిచ్ఛస్య కోఽర్థఃసర్గేణతేప్రభో
వినోదమాత్రమేవేదం సృష్టిస్తవజగత్పతే. 5



ఓ దేవా! సంకల్పవర్జితుడును ఇచ్ఛారహితుడును నగు నీకు సృష్టిచే నేమి ప్రయోజనము? ఓ జగన్నాథా! ఈ సృష్టియంతయును నీయొక్క లీలయేగదా!

నిష్కామాదేవ భవతః సర్గంసంపద్యతేప్రభో
అర్కాదివజలాదిత్యప్రతిబింబమివాధియః. 6

సూర్యునిచే జలమందు ప్రతిబింబము కలుగులాగున నిష్కాముడగు నీచే ఈ జగదుత్పత్తి సంభవించుచున్నది.

శరీర సన్నివేశస్య త్యాగేరాగేచతేయదా
నిష్కామోభగవన్భావో నాభివాంఛతినోజ్ఝతి. 7

దేహాభిమానము ద్వంద్వములులేని నీవు అహంభావనా రహితుడవును నిష్కాముడవును నై దేనిని వాంఛించుటలేదు. త్యజించుటలేదు.

సృజసీదంతథాదేవ వినోదాయైవభూతప
పునఃసంహృత్యసంహృత్య దినందినపతిర్యథా. 8

ఓ జగదీశా! సూర్యుడు దినములనువలె నీవును ఈ జగత్తును సృష్టించుచు సంహారమొనర్చుచున్నావు. ఇదంతయు నీయొక్క లీలయేయగును.

తవనిత్యమసంసక్తం వినోదాయైవకేవలమ్
ఇదంకర్తవ్యమేవేతి జగన్నతూద్యమేచ్ఛయా. 9

కర్తవ్యమని తలంచియే ఆసక్తిరహితుడవై నిత్యము సృష్ట్యాదుల నొనర్చుచుంటివి. గాని, స్వార్థమభిలషించికాదు.

సృష్టించేన్నకరోషిత్వం మహేశపరమాత్మనః
నిత్యకర్మపరిత్యాగాత్కిమపూర్వమవాప్స్యసి. 10

సృష్టి గావింపక యథాప్రాప్తకర్మల ద్యజించియుండిన, దానిచే నీవే యపూర్వ వస్తువును పొందెదవు?

యథాప్రాప్తంహికర్తవ్య మసక్తేన సదాసతా
ముకురేణాకలంకేన ప్రతిబింబక్రియాయథా. 11

దేనిని వాంఛింపకయే దర్పణము ప్రతిబింబక్రియను జరుపునట్లు సత్పురుషులు యథాప్రాప్తకర్మల నాసక్తిరహితులై సదా యొనర్చుచుండవలెను.

యథైవకర్మకరణే కామనానాస్తిధీమతామ్
తథైవకర్మసంత్యాగే కామనానాస్తిధీమతామ్. 12

అప్రాప్తమగు కర్మల జేయుటయందాత్మజ్ఞానులకు కోర్కె యుండనట్లు యథాప్రాప్తమగు కర్మల, ద్యజించుటయందును వారలకు కోర్కెయుండదు.

అతఃసుషుప్తోపమయా ధియానిష్కామయాతయా
సుషుప్తబుద్ధసమయా కురుకార్యంయథాగతమ్. 13

కాన, వాస్తవముగ నేమియు చేయనందున సుషుప్తియందున్న వానివలెనుండి, కర్మప్రతీతి గల్గినచో దానిని స్వప్నమాత్రముగ దలంచుచు నిష్కాముడవై నీవ్వప్రాప్తించిన కార్యముల జేయుము.

సర్గైరథైందుపుత్రాణాం తోషమేషిజగత్ప్రభో
తదేతేతోషయిష్యంతి తంత్వాంసర్గాత్సురేశ్వర. 14

ఓ దేవా! ఇపుడెట్లు నీ వైందవుల సృష్టులఁగాంచి సంతుష్టుడవగుచుంటివో, అట్లనే నీ సృష్ట్యనంతరమును వారిచే సంతుష్టిబఱుపబడి యుండగలవు.

చిత్తనేత్రైర్భవానేతా న్సర్గానన్యస్యనోదృశా
అవశ్యంచక్షుషాసర్గం సృష్టమిత్యేవవేత్తి కః. 15

అన్యులచే గావింపబడిన ఈ సృష్టులను నీవు మనోనేత్రముచే గాంచగల్గుదువుగాని చర్మ చక్షువుచేగాదు. కాని సృష్టికర్త తాను సృష్టించిన దానినవశ్యము తన చర్మచక్షువుచే చూడగల్గును. మఱియు నిద్దానిని నేను సృజించితినని యాతడెఱుంగును.

యేనైవమనసాసర్గో నిర్మితఃపరమేశ్వర
సఏషమాంసనేత్రేణ తంపశ్యతిహినేతరః. 16

ఓ పరమేశ్వరా! ఎవరిచే సృష్టియొనర్పబడునో యాతడే తన చర్మచక్షువుచే నద్దానిని వీక్షింప గల్గునుగాని మరియొకడుకాడు

నచైతాన్దశసంసారాన్ దశేసీరజసంభవాన్
కశ్చిన్నాశయితుంశక్తశ్చిత్తదార్ఢ్యాచ్చిరస్థితాన్. 17

దృఢచిత్తముచే ప్రతిష్ఠితములైన ఈ పది బ్రహ్మాండములను వీటిని సృజించిన దశబ్రహ్మలను (ఐందవులను) యెవరును నశింపచేయుజాలరు.

కర్మేంద్రియైర్యత్క్రియతే తద్రోద్ధుంకిలయుజ్యతే
నమనోనిశ్చయకృతం కశ్చిద్రోధయితుంక్షమః. 18

కర్మేంద్రియములచే నొనర్పబడు కార్యమును నిరోధింపవచ్చును గాని మనోనిశ్చయముచే గావింపబడు దాని నెవరును నిరోధింపజాలరు.

యోబద్ధపదతాంయాతో జంతోర్మనసినిశ్చయః
సతేనైవవినాబ్రహ్మ న్నాన్యేన వినివార్యతే. 19

ఓ బ్రహ్మదేవా! ఎవని చిత్తమందేది దృఢముగ నిశ్చితమైయుండునో అద్దాని నాతడుతప్ప మరెవ్వడును తొలగింపజాలడు.

బహుకాలంయదభ్యస్తం మనసాదృఢనిశ్చయమ్
శాపేనాపినతస్యాస్తి క్షయోనష్టేపిదేహకే. 20

మనస్సునందలి దృఢనిశ్చయము బహుకాలాభ్యాసముచే కలుగునదగుటచే నయ్యది శాపాదులచే గాని దేహము నశించుటచే గాని వారింపబడదు.



యద్బుద్ధపీఠమభితోమనసిప్రరూఢం తద్రూపమేవపురుషోభవతీహనాన్యత్
తదోబ్ధనాదితరమత్రకిలాభ్యుపాయం శైలేఘునేకమివనిష్ఫలమేవమన్యే. 21

ఇత్యార్షే శ్రీవాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ఐందవోపాఖ్యానే ఐందవనిశ్చయకథనంనామ అష్టాశీతితమః సర్గః ॥88॥

ఐందవోపాఖ్యానం సంపూర్ణమ్.

ఏది మనంబున స్థిరముగ నిశ్చయింపబడునో మనుజుడారూపము నే పొందును గాని యన్యము గాదు. మఱియు సంసారదుఃఖోపశమన క్రియయందు ఆత్మబోధ తప్ప తక్కినవన్నియు రాతిపై జలము వలె (రాతిపై జలము అంకురోత్పత్తి గలుగ చేయజాలనట్లు) నిష్ఫలమగును.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
ఐందవోపాఖ్యానమున ఐందవనిశ్చయకథనమును
అష్టాశీతితమ సర్గము ॥88॥

———— :o: ————

## ఏకోననవతితమః సర్గః

భానురువాచ:—

మనోహిజగతాంకర్తృ మనోహిపురుషఃపరః
మనఃకృతంకృతంలోకే నశరీరకృతంకృతమ్. 1

సూర్యుడు:— ఓ బ్రహ్మదేవా! జగత్తులన్నింటిని సృష్టించునదీ మనస్సే. మనస్సే పరమ పురుషుడు. ఈ ప్రపంచమున చేయబడుచున్నదంతయు మనస్సుచేతనే గాని శరీరముచే గాదు.

సామాన్యబ్రాహ్మణాభూత్వా మనోభావనయాకిల
ఐందవా బ్రహ్మతాంయాతా మనసఃపశ్యశక్తతామ్. 2

ఈ మనస్సుయొక్క సామర్థ్యమెట్టిదో చూడుము— సామాన్యులగు బ్రాహ్మణపుత్రులైనను మనస్సుయొక్క దృఢభావనచే ఐందవులు బ్రహ్మపదము పొందగల్గిరి.

మనసాభావ్యమానోహి దేహతాంయాతిదేహకః
దేహభావనయాఽయుక్తో దేహధర్మైర్నబాధ్యతే. 3

మనస్సుయొక్క భావనచేతనే జీవుడు దేహత్వము పొందుచున్నాడు. కాన దేహభావన లేనిచో నిక దేహధర్మములగు జనన మరణాదులచే నాతడు బాధింపబడడు.

బాహ్యదృష్టిర్హినియతం సుఖదుఃఖాదివిందతి
నాంతర్ముఖతయాయోగీ దేహేవేత్తిప్రియాప్రియే.

బాహ్యదృష్టి (శరీరాదులు నేననుభావము) గలవానికే సుఖదుఃఖాద్యనుభవముండును. కాని అంతర్ముఖుడగు (ఆత్మదృష్టిగల) యోగికి దేహసంబంధములగు సుఖదుఃఖాదులేవియు నుండవు.

మనఃకారణకంతస్మా జ్జగద్వివిధవిభ్రమమ్
ఇంద్రస్యాహల్యయా సార్ధం వృత్తాంతోఽత్రనిదర్శనమ్. 5

కాన నీ ప్రపంచమందలి భ్రమలన్నిటికిని హేతువు మనస్సే. ఇంద్రాహల్యల వృత్తాంతమే యిందులకు తార్కాణము.

బ్రహ్మోవాచ:—

కాహల్యాభగవన్భానో కోవాత్రేంద్ర స్తమోనుద
యయోరుదంతశ్రవణే పావనీదృష్టిరేతిహి. 6

బ్రహ్మ:- ఓ భాస్కరా! అహల్య యెవతె? ఇంద్రుడెవరు? కథాశ్రవణమున పవిత్రదృష్టి యుదయింపజేయునట్టి యింద్రాహల్యలవృత్తాంతము నాకెఱింగింపుము.

భానురువాచ:—

శ్రూయతేహిపురాదేవ మాగధేషుమహీపతిః
ఇంద్రద్యుమ్న ఇతిఖ్యాత ఇంద్రద్యుమ్న ఇవాపరః. 7

సూర్యుడు:- ఓ దేవా! పూర్వకాలమున ఇంద్రద్యుమ్నుడను రాజు మగధదేశమును పాలించుచుండెను. ఆతడపర ఇంద్రద్యుమ్నుడనియే ప్రసిద్ధికెక్కెను.

తస్యేందుబింబప్రతిమా భార్యాకమలలోచనా
అహల్యానామతత్రాసీచ్ఛశాంకస్యేవరోహిణీ. 8

చంద్రునకు రోహిణివలె, నాతనికి చంద్రబింబసమానయు, కమలనేత్రియు, సౌందర్యవతియు నగు అహల్యయను భార్యగలదు.

తస్మిన్నేవపురేషింగః షింగప్రకరశేఖరః
ఇంద్రనామాపరఃకశ్చి ద్ధీమాన్విప్రకుమారకః. 9

ఆ పురమందే ఇంద్రుడను పేరుగలనొక జారుడగు బ్రాహ్మణకుమారు డుండెను.

అహల్యాపూర్వమింద్రస్య బభూవేష్టేత్యహల్యయా
శ్రుతంరాజమహిష్యాథ కథాప్రస్తావతఃక్వచిత్. 10

గౌతముని పత్నియగు అహల్య ఇంద్రుని యందాసక్తిగలిగియుండెనను విషయమును, ఆ ఇంద్రద్యుమ్నుని భార్యయగు యహల్య, పురాణాదులందు కథాప్రసంగమున వినియుండెను.

ఆకర్ణ్యైవమహల్యా సా బభూవేంద్రానురాగిణీ
అహల్యాంమాం స నో కస్మా త్సక్తోభ్యేతీత్యథోత్సుకా. 11

అట్లు వినిన యా రాణి ఆ ఇంద్రుడను బ్రాహ్మణకుమారునియందాసక్తిగలదై వానిని ప్రేమించెను. "నాయందనురాగము గల్గి ఆ ఇంద్రుడు నా చెంత కేలరాడ"ని యామె తలపోయుచుండెను.



మృణాలభారకదలీ పల్లవాస్తరణేషుసా
అతప్యతభృశంబాలా లతాతూలావనేష్వివ. 12

కమలవనమందును, అరటియాకుల పాన్పులందును, ఛిన్నలతవలె నా రూపవతి దుఃఖించుచుండెను.

ఖేదమాపసమగ్రాసు తాసుభూపవిభూతిషు
మత్సీనిదాఘతప్తాసు పరిలోలాస్థలీష్వివ. 13

రాజవైభవములందామె ప్రీతిఁగోల్పోయి గ్రీష్మర్తువు నందలి వేడిమిచే తపించిన ప్రదేశమందలి మత్స్యమువలె దుఃఖమునే బొందుచుండెను.

అయమింద్రోఽయమింద్రశ్చే త్యేవంజాతప్రలాపయా
లజ్జాపిహాతయాత్యక్తా వైవశ్యమనుయాతయా 14

'ఈతడే యింద్రుడు, ఈతడే యింద్రుడ'ని యరచుచు వివశయై యామె లజ్జను సైతము గోల్పోయెను.

ఇత్యార్తయాఘనస్నేహ మథతస్యా వయస్యయా
ఉక్తంతయాప్రియేఽవిఘ్న మింద్రమభ్యానయామ్యహమ్. 15

అపుడు రాణియందు మిక్కిలిస్నేహముగల సఖియొకతె నామెయొక్క దీనావస్థఁగాంచి నామెతో 'నేనింద్రుని నీ సమీపమునకు నిక్కముగ గొనివచ్చెద'నని బల్కెను.

ఇష్టంతవానయామీతి శ్రుత్వావికసితేక్షణా
పపాతపాదయోఃసఖ్యా నలిన్యానలినీయథా. 16

ఇట్లామెపల్కుల నాలించి అహల్య వికసితనేత్రయయ్యె. మరియు, తన వాడిన కమలము మరియొక కమలముపై పడునట్లామె సఖియొక్క పాదములపై బడెను.

తతఃప్రయాతేదివసే సమాయాతే నిశాగమే
సా వయస్యాతమింద్రాఖ్యం యయౌద్విజకుమారకమ్. 17

పిమ్మట దినముగడచి రాత్రిప్రవేశింప నాసఖి బ్రాహ్మణకుమారుడగు యింద్రునివద్దకుఁ బోయెను.

బోధయిత్వాయథాయుక్తం సా తమింద్రమథాంగనా
అహల్యానికటంరాత్ర్యామానయామాస సత్వరమ్. 18

అచట యథావిధముగ వృత్తాంతమంతయు వాని కెఱుకపరచి శీఘ్రముగ నా రాత్రియే ఇంద్రుని అహల్యచెంతకు దోడ్కొని వచ్చెను.

తతఃసా తేనషింగేన సహేంద్రేణరతింయయౌ
కస్మింశ్చిత్సదనే గుప్తే బహుమాల్యవిలేపనా. 19

అంతనహల్య అనేక పుష్పమాలల ధరించి సుగంధద్రవ్యములచే నలంకరించుకొని యొక రహస్యప్రదేశమందింద్రునితో రమించెను.

హారాంగదమనోజ్ఞేన తరుణీతేనసాతదా
రతేనావర్జితావల్లీ రసేన మధునాయథా. 20

వసంతఋతువునకు లతవలె, రతిక్రీడచే నాపె హార, అంగదాది యాభరణములచే శోభితుడగు నా బ్రాహ్మణకుమారునకు వశమయ్యెను.

తతస్తదనురక్తా సా పశ్యంతీ తన్మయం జగత్
న సమస్తగుణాకీర్ణం భర్తారం బహ్వమన్యత. 21

ఇట్లా బ్రాహ్మణుని యందాసక్తిగల్గిన రాణి ప్రపంచమంతయు తన్మయముగా గాంచుచు సమస్తయుత్తమ గుణములచే నలరారు తన భర్తనుగూడ యల్పునిగ తలంచెను.

కేనచిత్త్వథ కాలేన తస్యా ఇంద్రానురాగితా
సా జ్ఞాతా రాజసింహేన తన్ముఖవ్యోమచంద్రికా. 22

కొంతకాలమునకా రాజసింహుడగు ప్రద్యుమ్నుడు అహల్యయొక్క ముఖాకాశమున మెరయుచున్న చంద్రికవంటి ప్రకాశమునకు హేతువు ఇంద్రునియెడ నామెకు గల యనురాగమే యని తెలిసికొనెను.

ఇంద్రం ధ్యాయతి సా యావత్తావత్తస్యా విరాజతే
ముఖం పూర్ణేన చంద్రేణ ప్రబుద్ధమివ కైరవమ్. 23

ఎంతవరకా యహల్య ఇంద్రునిగూర్చియే తలంచుచుండునో అంతవరకామె ముఖమండలము పూర్ణచంద్రునిచే వికసితమగు కలువవలె శోభించుచుండెను.

ఇంద్రోఽపి చ తదాసక్త సమస్తకరణాకులః
న తిష్ఠతి క్షణమహో తయా విరహితః క్వచిత్. 24

ఇంద్రుడును నామెయందధికముగ నాసక్తిగల్గియుండి నాపె వియోగము నొక్కక్షణమైనను సహింపలేక యుండెను.

అథాతిసుఘనస్నేహ నిరావరణచేష్టయోః
తయోరనయవృత్తాంతో రాజ్ఞా కర్ణి కటువ్యథః. 25

సంతాపకరమును, అధర్మప్రవృత్తిరూపమును నగు వారిరువుర దృఢప్రేమబంధముఁగూర్చిన వృత్తాంతమంతయు క్రమముగ రాజెఱింగెను.

ఏవమన్యోన్యమాసక్తం భావమాలక్ష్య భూపతిః
చకార బహుభిర్దండైః సద్యోరథ శాసనమ్. 26

వారి పరస్పర ప్రేమభావము జూచి రాజు వారలకనేక దండనలు విధించి శిక్షించెను.

తావుభావపి సంత్యక్తౌ హేమంతే సలిలాశయే
తుష్టౌ జహసతుస్తత్ర న ఖేదం సముపాగతౌ. 27

కాని, శీతకాలమున చల్లనినీట నుంచబడినను వారు సంతుష్టులై దుఃఖమును పొందకయుండిరి.

అపృచ్ఛత తతో రాజా ఖిన్నౌ స్థోనతు దుర్మతీ
తావూచతుర్మహీపాలం జలాశయసముద్ధృతౌ. 28



'ఓ దుష్టులారా! మీకేల దుఃఖితులగుటలేదు' ని రాజు వారిని ప్రశ్నింప నంత నీటనుండి తీయబడిన వారు రాజుతో నిట్లనిరి__

సంస్మృత్యావామిహాన్యోన్య ముఖకాంతిమనిందితామ్
ఆత్మానం న విజానీవో రూఢభావం పరస్పరమ్ 29

ఓ రాజా! మేమిరువుర మొకరినొకరు స్మరించుకొనుచు, ఉత్తమముఖమండలముల శోభ గాంచుచు దృఢప్రేమచే బద్ధులమైయున్నందున మాకు దేహస్మృతియే లేకయుండెను.

శాసనేషు చ యత్సంగో నిఃశంకస్తేన హర్షితౌ
ముహ్యావో న మహీపాల స్వాంగైరపి వికర్తితైః. 30

ఓ రాజా! మా మనస్సంబంధము దృఢమైనదగుటచే నీచే బాధింపబడినను ఆనందమునే పొందుచున్నారము. మా అవయవములు ఛేదింపబడినను మేము ప్రేమబంధమును వీడక సంతుష్టులుగనే యుండెదము.

తతో భ్రాష్ట్రే పరిక్షిప్తౌ వఖిన్నావేవమేవ తౌ
ఊచతుర్మదితాత్మానా వన్యోన్యస్మృతిహర్షితౌ. 31

పిమ్మట వారగ్నియందుంచబడిరి. అచటను ఖేదమును పొందక ఒకరినొకరు తలంచుకొనుటచే ప్రసన్నులైయుండి రాజుతో వెనుకటివిధముననే బల్కిరి.

గ్రథితౌ గజపాదేషు నఖిన్నావేవ సంస్థితౌ
ఏవమేవోచతుర్భూప మన్యోన్యస్మృతిహర్షితౌ. 32

ఏనుగులచే త్రొక్కింపబడినను నారీమాత్రము విషాదముజెందక అన్యోన్యస్మృతిచే హర్షమునే పొందుచు రాజుతో నవ్విధముగనే బల్కిరి.

కశాహతావఖిన్నౌ తావేవమేవ కిలోచతుః
అన్యస్మాచ్ఛాసనాద్రాజ్ఞా కల్పితాచ్చ పునః పునః. 33

కొరడాదెబ్బలచేనైనను బాధజెందక, అదేప్రకారము రాజుతో బల్కిరి. ఇట్లు రాజుచే విధింపబడిన దండనలన్నింటిచే గూడ వారు క్లేశమును పొందక ప్రసన్నులుగనే యుండిరి.

ఉద్ధృతావూచతుః పృష్టౌ తమేవార్థం పునః పునః
ఉవాచేంద్రో మహీపాలం జగన్మే దయితామయమ్. 34

అపుడు శిక్షించుట మాని రాజు వారి సుఖమునకు కారణమడుగ వారు వెనుకటివిధముననే మరల మరల చెప్పిరి. మరియు నింద్రుడు రాజుతో నిట్లనెను_ ఈ జగత్తంతయు నాకహల్యామయముగ గాన్పించుచున్నది.

న శాతనాని దుఃఖాని బాధంతే కించిదేవ మే
అస్యాశ్చైవ జగద్రాజన్సర్వం మన్మయమేవ చ. 35

ఈ ప్రపంచమంతయు నాకీ స్త్రీరూపమునను, ఈ స్త్రీకి నారూపమునను గోచరించుచున్నది. కాన నీచే విధింపబడిన దండనలు మాకు బాధగల్గజేయజాలకుండెను.

తేనాన్యశాసనాద్దుఃఖం కించిదేవ నవిద్యతే
మనోమాత్రమహంరాజన్ మనోహిపురుషఃస్మృతః. 36

ఇరువురకును యీ ప్రపంచమంతయు యొకరిరూపమున మరొకరికి కాన్పించుటచే, అన్యులచే బాధింపబడినను దుఃఖితులముగాక యుంటిమి. ఓ రాజా! నేను మనోమాత్రుడను. మరియు మనస్సే పురుషుడు.

ప్రపంచమాత్రమేవాయం దేహోదృశ్యతఏవహి
సమకాలప్రయుక్తేన సహసాదండరాశినా. 37
వీరంమనోభేదయితుం మనాగపి నశక్యతే

ఈ కాన్పించు దేహము మనస్సుయొక్క కల్పనామాత్రమే. కాన అనేక దండన లేకకాలముననైనను విధించినప్పటికిని, అతిశక్తివంతమగు ఈ మనస్సును భేదించుటకెవరును సమర్థులుగారు.

కా నామ తా మహారాజ కీదృశ్యః కస్యశక్తయః. 38
యాభిర్మనాంసి ఖిద్యంతే దృష్టనిశ్చయవంత్యపి

ఓ రాజా! ఎట్టి శక్తిసంపన్నులైనను, యథార్థనిశ్చయముగలవారైనను యీ మనస్సును భేదింప శక్యులుకారు.

భావితార్థాభిపతితం మనస్తిష్ఠతిపూర్వవత్
వృద్ధిమాయాతువాదేహో యాతువా విశరారుతామ్. 39

శరీరము వృద్ధినందినను, లేక ముక్కలు ముక్కలుగా చేయబడినను, నశించినను దృఢభావనగల్గియున్న మనస్సెప్పటియట్లే యుండును.

భావాభావాఃశరీరస్థా నృపశక్తానబాధితుమ్
ఇష్టేర్థేచిరమావిష్టం దధానం తత్స్థితంమనః. 40

వాంఛిత పదార్థమందు చిరకాలము లగ్నమైయుండుటచే నాపదార్థాకారమునే జెందు మనస్సును భావాభావములు బాధింపనేరవు.

భావితంతీవ్రవేగేన మనసాయన్మహీపతే. 41
తదేవపశ్యత్యచలం న శరీరవిచేష్టితమ్
నశాశ్చనక్రియారాజన్వరశాపాదికాఅపి. 42
తీవ్రవేగేనసంపన్నం శక్తాశ్చాలయితుంమనః
తీవ్రవేగేనసంయుక్తం పురుషాహ్యభివాంఛితాత్. 43
మనశ్చాలయితుంశక్తా నమహాద్రింమృగాఇవ
మమేయమసితాపాంగీ మనఃకోశేప్రతిష్ఠితా. 44
దేవాగారే మహోత్సేధే దేవీ భగవతీయథా
నదుఃఖమనుగచ్ఛామి ప్రియయా జీవరక్షయా. 45
గిరిర్గ్రీష్మదశాదాహం లగ్నయేవాబ్దమాలయా
యత్రయత్రయథారాజం స్తిష్ఠామ్యభిపతామివా. 46



తత్రతేష్టసంగమాదన్య త్కించిన్నానుభవామ్యహమ్
అహల్యాదయితానామ్నా మనసేంద్రాభిధంమనః. 47

తీవ్రసంకల్పముచే మనస్సు దేనిని నిశ్చయించునో దానినే స్థిరముగ గాంచగల్గును. వర, శాపాదులేవియు నట్టి తీవ్రసంకల్పయుతమగు మనమును నిరోధింపజాలవు. పెద్దపర్వతమును లేడి కదలింప చేయజాలనట్లు తీవ్రాభిలాషగల్గిన మనస్సును యిష్టవస్తువునుండి తొలగించుట కెవరును సమర్థులుగారు. ఉన్నతదేవస్థానమున దేవివలె, యుత్తమ నేత్రగంటి చూపులుగల యహల్య నామనమున ప్రతిష్ఠితమై యున్నది. గ్రీష్మతాపముచే తపింపబడి పర్వతము మేఘపంక్తిచే దుఃఖానుభవమును పొందనట్లు, ఈ నా జీవహేతువగు ప్రియురాలిచే నేను దుఃఖానుభవమునే పొందుటలేదు. నేనెచట యుండినను, యెచట పతితుడనైనను, అచట నా ప్రియురాలి సమాగమము తప్ప అన్యమేదియు దలంపను. మనస్సుచేత అహల్యప్రియురాలును, ఇంద్రుడు ప్రియుడును నగును.

సంసక్తమిదమాయాతి నస్వభావాదృతేపరమ్
ఏకకార్యనివిష్టంహి మనోధీరస్యభూపతే. 48
నచాల్యతేమేరురివ వరశాపబలైరపి
దేహోహివరశాపాభ్యా మన్యత్వమివగచ్ఛతి
నమధీరంమనోరాజన్విజిగీషుతయాస్థితమ్. 49

ఇట్లు దృఢాసక్తిఁబొందియున్న నామనస్స్వభావము ననేకయత్నములచేతనైనను యెవరును మార్పజాలరు. దేనియందైనను నిమగ్నమయిన ధీరుల చిత్తము మేరుపర్వతమువలె స్థిరముగ నున్నదై వర శాపాదులచేనైనను చలింపక మరియొకదానియందు ప్రవేశింపకయుండును. వర శాపాదులచే భౌతికశరీరమన్యరూపమును బొందునుగాని, దృఢచిత్తము విక్షేపముల నన్నింటిని జయించి స్థిరముగ నుండును.

ఏతానిచాత్రమనసాంనచకారణాని రాజన్శరీరశకలానివృథోత్థితాని
చేతోహికారణమమీషుశరీరకేషు వారీవసర్వవనఖండలతాంతరేషు. 50

శరీరము మనస్సునకు కారణము కానేరదు. కాని, మనస్సు శరీరములకు కారణమై వనమందలి లతావృక్షాదులందు జలమువలె వాటన్నిటియందును వ్యాప్తమైయుండును.

ఆద్యంశరీరమిహవిద్ధిమనోమహాత్మన్సంకల్పితోజగతితేన శరీరసంఘః
ఆద్యంశరీరమధితిష్ఠతియత్రయత్ర తత్తద్ధ్రువంఫలతినేతరదస్యపుంసః. 51

మనస్సే జీవాత్మకు ప్రథమశరీరమై భోగానుభవమునకు హేతువగుచున్నది. మనస్సుచేతనే ప్రపంచమందలి ప్రాణికోట్ల శరీరములన్నియు కల్పింపబడినవి. అధిష్ఠానమును, ప్రథమశరీరమును నగు మనస్సునందు నేనను యభిమానమెపుడుదయించునో, అపుడే యట్టి మనంబుచే భిన్నభిన్న శరీరములు జీవులకేర్పడుచున్నవి.

ముఖ్యాంకురంసుభగవిద్ధిమనోహిపుంసోదేహాస్తతః ప్రవిసృతాస్తరుపల్లవాభాః
నష్టేఽంకురే పునరుదేతి నపల్లవశ్రీర్నైవాంకురః క్షయముపైతిదలక్షయేషు. 52

ఓ రాజా! జీవత్వమునకు ముఖ్యకారణము (అంకురము) మనస్సే, దానినుండి వృక్షమునకు పల్లవాదులవలె ననేక శరీరము లేర్పడుచున్నవి. అంకురము నశించిన పత్రపుష్పాదులుత్పన్నమవవు. కాని పత్రాదులు నశించినను, అంకురము నశింపకయుండును.

దేహేऽస్తతేవివిధదేహగణంకరోతి స్వప్నావనావివనవం నవమాశుచేతః
చిత్తేऽస్తతేతునకరోతిహికించిదేవ దేహాన్తతః సమనుపాలయ చిత్తరత్నమ్. 53

శరీరము నశించినను, స్వప్నమందువలె యీ చిత్తమనేక దేహములను శీఘ్రముగ నిర్మించును. కాన చిత్తము నశించిన, యిక దేహముండదు. అందుచే పరమపురుషార్థమందే యీ శ్రేష్ఠమగు చిత్తమును నియోగించి బంధనము నుండి రక్షించుకొనుము.

దిశిదిశిహరిణాక్షీమేవపశ్యామిరాజన్
ప్రియయువతిమనస్త్వాన్నిత్యమానందితోऽస్మి
తవపురప్రకృతీనాం యత్ఫలందుఃఖదాయి
క్షణమథసుచిరంతత్తన్నపశ్యామికించిత్. 54

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ఇంద్రాహల్యాఖ్యానే కృత్రిమేంద్రవాక్యంనామైకోన నవతితమః సర్గః ॥ 89 ॥

ఓ రాజా! ఈ మృగలోచననే నేనెల్లడల గాంచుచున్నాను. నా చిత్తమీ యువతిరూపమే అయి యుండుటచే నేను సర్వదా యానందమునే బొందుచున్నాను. ఈ నీ దండనలన్నియు నీ ప్రజలకే దుఃఖముగల్గజేయునుకాని నాకవి యెన్నడును దుఃఖప్రదములు కాజాలవు.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
ఇంద్రాహల్యాఖ్యానమున కృత్రిమేంద్రవాక్యమను
ఏకోన నవతితమ సర్గము ॥ 89 ॥

—:o:—

## నవతితమః సర్గః.

భానురువాచ:—

అథేంద్రేణైవముక్తోऽసౌ రాజారాజీవలోచనః
మునిం భరతనామానం పార్శ్వస్థంసమువాచహ. 1

సూర్యుడు:—ఓ బ్రహ్మదేవా! బ్రాహ్మణకుమారుడగు యింద్రుడిట్లుబల్కగ, కమలనేత్రుడగు నా రాజంత సమీపముననున్న భరతుడను మునితో నిట్లనియె—

రాజోవాచ:—

భగవన్సర్వధర్మజ్ఞ పశ్యామిసుదురాత్మనః
భృశమస్యముఖేస్ఫారం ధార్ష్ట్యంమద్దారహారిణః. 2



రాజు:—ఓ మునీంద్రా! ధర్మజ్ఞా! నా భార్య నపహరించి ఈ దుష్టుని నోటనుండి గర్వోక్తులే వెలువడుచున్నవి.

పాపానురూపమస్యాశు శాపం దేహిమహామునే
యదవధ్యవధాత్పాపం వధ్యత్యాగాత్తదేవహి. 3

కాన శీఘ్రముగ వీని పాపకార్యమునకు తగిన శాపము నీయుడు. అవధ్యుని వధించిన కలుగు పాపము వధ్యార్హుని వధింపకయున్నను గలుగును.

ఇత్యుక్తోరాజసింహేన భరతో మునిసత్తమః
యథావత్ప్రవిచార్యాశు పాపంతస్యదురాత్మనః 4
సహానయాదుష్కృతిన్యా భర్తృద్రోహాభిభూతయా
వినాశంవ్రజదుర్బుద్ధే ఇతిశాపంవిసృష్టవాన్. 5

అంత నా మునీంద్రుడు రాజసింహుని యా పల్కులవిని, ఆదుష్టుని పాపకృత్యమును గూర్చి బాగుగ విచారించి 'ఓ దురాత్మా! భర్తృద్రోహమొనర్చిన ఈ దుష్టురాలుతో కూడ నీవును శీఘ్రముగ నశించుగాక!' యని వానిని శపించెను.

తతస్తౌరాజభరతౌ ప్రత్యూచతురిదంవచః
సుదుర్మతీయువాం యాభ్యాం క్షపితందుశ్చరం తపః. 6

అప్పుడా యిర్వురును రాజమునీంద్రులఁగూర్చి యిట్లనిరి:—మీరల్ప బుద్ధిగలవారే యగుదురు, శాపమిచ్చుటచే మీరు మీ దుష్కరతపంబును నష్టమొనర్చుకొంటిరి.

అనేనశాపదానేన కించిద్భవతినావయోః
దేహేనష్టే ననాకించిన్నశ్యతిస్వాంతరూపయోః. 7

ఈ శాపముచే మాకేమియు హానికలుగదు. దేహమునశించినను మనోరూపులమగు మాకు నాశమెట్లుకలుగును?

స్వాంతంహినహికేనాపి శక్యతేనాశితుంక్వచిత్
సూక్ష్మత్వాచ్చిన్మయత్వాచ్చ దుర్లక్ష్యత్వాచ్చవిద్ధినా. 8

మా చిత్తము సూక్ష్మమును, చిన్మయమును, అగోచరమును యగుటచే నయ్యది యెవరిచే నెచటను గూడ నశింపకయుండునని నిశ్చయముగ తెలిసికొనుము.

భానురువాచ:—

సుఘనస్నేహసంబద్ధ మనసావేవశాపతః
పతితౌభూతలేవృక్షవిచ్యుతావివపల్లవౌ. 9

సూర్యుడు:—దృఢస్నేహ బద్ధులగు వారిర్వురును శాపకారణమున, వృక్షమునుండి రాలిన యాకులవలె భూమిపైబడి మరణించిరి.

అథవ్యసనసంసక్తౌ మృగయోనిముపాగతౌ
తతోద్వావపిసంసక్తౌ భూయోజాతౌవిహంగమౌ. 10

అధికప్రేమ గల్గియున్న-వారిద్దరును పిదప హరిణములై జన్మించిరి. ఆపిమ్మట పక్షిజన్మమెత్తిరి.

అథాస్మాకంవిభోసర్గే మిథస్సంబంధభావనా
తతఃపరౌమహాపుణ్యే జాతౌబ్రాహ్మణదంపతీ. 11

ఓ దేవా! ఈ మనయొక్క సృష్టియందు పరస్పరాసక్తచిత్తులగు వారిరువురు తపస్సంపన్నులగు బ్రాహ్మణ దంపతులుగ జన్మించిరి.

భారతోఽపి తయోఃశాపః నసమర్థోబభూవహ
శరీరమాత్రాక్రమణే నమనో నిగ్రహేప్రభో. 12

చూడుము! భరతమునియొక్క శాపమును, వారల దేహమునే నశింపచేయగల్గెను గాని.మనంబుల నిరోధింప జాలదయ్యె.

తావద్యాపిహితేనైవ మోహసంస్కారహేతునా
యత్రయత్రప్రజాయేతే భవతస్తత్రదంపతీ. 13

ఈ స్నేహసంస్కారముచే.నేటికిని వారెచటెచట జన్మింతురో, అచటచట స్త్రీ పురుషులయ్యే యుందురు.

అకృత్రిమప్రేమరసానువిద్ధం స్నేహంతయోస్తంప్రతివీక్ష్యకాంతమ్
వృక్షాఅపిప్రేమరసానువిద్ధాః శృంగారచేష్టాకులితాభవంతి 14

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
కృత్రిమేంద్రాహల్యానురాగోనామ
నవతితమః సర్గః ॥ 90 ॥

వారల సహజప్రేమభావమును, యధిక స్నేహమును బరికించి, వృక్షములుకూడ ప్రేమరసముచే పూర్ణమై శృంగారచేష్టల గావించుచుండెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కృత్రిమేంద్రాహల్యానురాగమను
నవతితమ సర్గము ॥ 90 ॥

———:o:———

## ఏకనవతితమః సర్గః

భానురువాచః—

తేనైతద్వచ్మిభగవన్ యథాకాలంమనోమునే
అనిగ్రాహ్యమభేద్యంచ శాపైరతిదురాసదైః. 1

సూర్యుడు:—ఓ బ్రహ్మదేవా! మునీశ్వరా! ఇవ్విధమున, దుస్సాధ్యమగు శాపములైనను, మనస్సును ఛేదింపజాలక, దానినేమియు ప్రభావిత మొనర్పజాలక యుండునని నేను వచించుచున్నాను.



ఐందవానామతఃసృష్టి క్రమాణాంప్రవినాశనమ్
యుజ్యతే నచతద్బ్రహ్మన్యుక్తమేతన్మహాత్మనః. 2
కింతదస్తిజగత్యస్మిన్వివిధేషుజగత్సుచ
తవాపినాథనాథస్య యద్దైన్యాయ మహాత్మనః. 3

కాననో దేవా! ఐందవుల సృష్టుల నశింపజేయుట యుక్తముగాదు మరియునట్లు జేయుట మీవంటి మహాత్ములకెన్నటికిని తగదు. ఈలోకమునకును, తదితర బ్రహ్మాండములన్నిటికిని ప్రభువగు నీకట్లొనర్చుట దీనత్వమునకే హేతువగును.

మనోహిజగతాంకర్తృ మనోహిపురుషఃస్మృతః
యన్మనోనిశ్చయకృతం తద్ద్రవ్యౌషధిదండనైః. 4
హంతుంనశక్యతేజంతోః ప్రతిబింబమణేరివ

బ్రహ్మాండములన్నింటిని సృజించునది మనస్సే, మనస్సే పురుషుడు, మనస్సుచే నిశ్చయింపబడుదానిని మణియొక్క ప్రతిబింబమునువలె, ద్రవ్యౌషధ దండనాదులచేనైనను, యెవడును నశింప చేయజాలడు.

తస్మాదేతేఽత్రతిష్ఠంతు భానురైఃసర్గసంభ్రమైః. 5
త్వంసృష్ట్వేహప్రజాస్తిష్ఠ బుద్ధ్యాకాశోహ్యనంతకః
చిత్తాకాశశ్చిదాకాశ అకాశశ్చతృతీయకః. 6

నీవును నీచిత్తాకాశమందు ప్రజల సృష్టించుము. ఏలయన,చిత్తాకాశ మనంతము. చిత్తాకాశ, చిదాకాశ, భూతాకాశములను ముత్తెఱంగులగు ఆకాశములు గలవు.

అనంతాస్త్రయప్యైతే చిదాకాశప్రకాశితాః
ఏకంద్వ్యాత్రీన్బహూన్వాపి కురుసర్గాన్జగత్పతే. 7

చిదాకాశముచే ప్రకాశింపబడు నీమూడును యనంతములైనవే. కాననో జగదీశా! నీవొకటిగాని, రెండుగాని, అనేకములుగాని సృష్టులు గావింపుము.

స్వేచ్ఛయాత్మని తిష్ఠత్వం కింగృహీతం తవైందవైః

ఐందవులు నీదగు దేనిని గ్రహించియుండలేదుగదా! కాన నీకోర్కె చొప్పున ఆత్మయందే స్థితిగల్గి యుండుము.

బ్రహ్మోవాచః—

అథైందవజగజ్జాలే భానునైవముదాహృతే. 8
మయాసంచింత్యసుచిర మిదముక్తం మహామునే
యుక్తముక్తంత్వయాభానో వితతంహి కిలాంబరమ్. 9

ఐందవనిర్మిత బ్రహ్మాండములగూర్చి సూర్యుడిట్టు వచించిన పిమ్మట, నేను చాలసేపు దీర్ఘ

ముగ విచారించి యిట్లుపల్కితిని—ఓ భాస్కరా! నీవు చెప్పినది సత్యమే. ఆ యాకాశములన్నియు ననన్తములే.

మనశ్చవితతంవాపి చిదాకాశశ్చవిస్తృతః
తద్యథాభిమతంసర్గం నిత్యకర్మకరోమ్యహమ్. 10

చిత్తాకాశము, మనస్సహిత చిదాకాశమును విశాలములై, అనంతములై యున్నవి. భూతాకాశము సృష్టియందే యంతర్భూతమైనది. బ్రహ్మాకాశమసంగమై యుండును. కాన, నాకభిమతమగు సృష్టి యొనర్చుచు, నిత్యకర్మ ననుష్ఠించుచుందును.

కల్పయామిబహూన్యాశు భూతజాలానిభాస్కర
త్త్వమేవాశుభగవ. న్ప్రథమో మే మనుర్భవ. 11
కురుసర్గంయథాకామం మయాసమభిచోదితః

నేనిపుడు శీఘ్రముగ, ప్రాణికోట్లను సృజించెదను. ఓ భాస్కరా! నీవే ప్రథమమనువు (స్వాయంభువు) యగు గాక! మరియు నాచే ప్రేరితుడవై నీయిచ్ఛానుసారము సృష్టిగావింపుము.

అథైతత్సమహాతేజా మమవాక్యంప్రభాకరః 12
అంగీకృత్యద్విధాత్మానం చకారతపతాంవర
ఏకేనప్రాక్తనేనాస్మిన్వపుషా సూర్యతాంగతః. 13
వ్యోమాధ్వగతయాసర్గే తతాన దివసావలిమ్
మన్మనుత్వంద్వితీయేన కృత్వాస్వవపుషాక్షణాత్. 14
ససర్జసకలాంసృష్టిం తాంతామభిమతాంమమ. 15

తాపసోత్తముఁడగు వసిష్ఠ మునీంద్రా! అటుపిమ్మట నా మహాతేజస్వియగు భానుడు, నేను చెప్పినదాని నంగీకరించి, తన శరీరమును రెండుగా విభజించెను. అందొక దానిచే నైందవ సృష్టియందు సూర్యుడుగ నుండి ఆకాశమధ్యమున సంచరించుచు దినరచన యొనర్చుచుండెను. రెండవదానిచే నాతడు నాచే నొసంగబడిన మనుపదము నధిష్ఠించి, నాకభిమతమగు సృష్టులనెల్ల గావించెను.

ఏతత్తేకథితంసర్వం వసిష్ఠ మనసో మునే
స్వరూపంసర్వకర్తృత్వంచ శక్తత్వంచ మహాత్మనః. 16

ఓ మునీంద్రా! మహచ్ఛక్తియుతమగు నీమనస్సుయొక్క సర్వకర్తృత్వము, శక్తిత్వమును గూర్చి యిట్లంతయును నీకుదెలిపితిని.

ప్రతిభాసముపాయాతి యద్యదస్యహిచేతసః
తత్తత్ప్రకటతామేతి స్థైర్యంసఫలతామపి. 17

ఈచిత్తమున యేదేని ప్రతిభాసించునో, అదియేవ్యక్తత్వమును, స్థిరత్వమును, సాఫల్యమును నొందును.

సామాన్యబ్రాహ్మణాభూత్వా ప్రతిభాసవశాత్కిల
ఐందవాబ్రహ్మతాంయాతా మనసఃపశ్యశక్తతామ్. 18



ఈ మనస్సామర్థ్యము తిలకింపుము! సామాన్య బ్రాహ్మణులయ్యు తమ మనోభావనచేతనే ఐందవులు బ్రహ్మపదము నొంద గల్గిరి.

యథాచైందవజీవాస్తే చిత్రత్వాద్బ్రహ్మతాంగతాః
వయంతథైవచిద్భావా చ్చిత్తత్వాద్బ్రహ్మతాంగతాః. 19

ఐందవులజీవచైతన్యము చిత్తత్వమెట్లు పొందెనో, మరియు, చిత్తమందలి భావనచే హిరణ్యగర్భప్రాప్తినొందెనో, అట్లనే మనముగూడ చైతన్యస్థితినుండి చిత్తత్వమును, తద్ద్వారా హిరణ్యగర్భపదమును ప్రాప్తినొందితిమి.

చిత్తంహిప్రతిభాసాత్మ యచ్చతత్ప్రతిభానకమ్
తదితంభాతిదేహాది స్వాంతంనాన్యాస్తిదేహదృక్. 20

ప్రతిభాసారూపమగు చిత్తమే దేహాదిరూపమున ప్రకాశించుచున్నది. ఈ దేహాదులు చిత్తముకంటె యన్యములు కావు.

చిత్తమాత్మచమత్కారం తచ్చతత్కురుతేస్వతః
యథావత్సంభవంస్వాత్మన్యేవాంతర్మరిచాదివత్. 21

చిత్తము వివిధ కల్పనలతో కూడియున్నది. మిరపగింజ కారముగను, ద్రాక్ష మధురరూపముగను తమతమ సంస్కారముల ననుసరించి యెట్లు వ్యక్తమగునో, అట్లే కామ, కర్మ వాసనల ననుసరించి, జీవునియందు చిత్తమెపుడేవిధమున నుండునో, అపుడావిధముననే నయ్యది వానియందాయా స్వభావ సంస్కారములననుసరించి వ్యక్తమగుచుండును.

తదేతచ్చిత్తవద్భాత మాతివాహికనామకమ్
తదేవోదాహరంత్యేవం దేహనామ్నాఘనభ్రమమ్. 22

అందువలన భ్రాంతిచే సూక్ష్మదేహమును స్థూలదేహముగా నెంచుకొనుచు, 'నేను దేవతను, నేను మనుజుడను'—అని వ్యర్థముగ దలంచుచు జీవులు మోహితులగుచున్నారు.

కథ్యతేజీవనామ్నైత చ్చిత్తం ప్రతనువాసనమ్
శాంతదేహచమత్కారం జీవంవిద్ధిక్రమాత్పరమ్. 23

సూక్ష్మ వాసనా సహితమగు చిత్తమును జీవుడనియు, స్థూలత్వభ్రాంతిచే దానినే దేహమనియు చెప్పుదురు. స్థూల, సూక్ష్మ కారణ శరీరముల కల్పనయేలేని జీవుని సాక్షాత్ బ్రహ్మముగనే యెఱుంగుము.

నాహంనచాన్యదస్తీహ చిత్రంచిత్తమిదంస్థితమ్
వసిష్ఠైందవసంవిద్వదసత్సత్తామివాగతమ్. 24

ఓ వసిష్ఠమునీంద్రా! దారముకంటె వస్త్రము వేఱుకానట్లు నీవు, నేను తదితరములన్నియును, ఆశ్చర్యకరమగు నీ చిత్తముకంటె నన్యములుకావు. ఈ చిత్త మసత్స్వరూపమైనను, ఐందవుల జీవచైతన్యమువలె సత్తనుపొంది వర్తించుచున్నది.

యథైందవమనోబ్రహ్మ తథైవాయమహంస్థితః
తత్కృతంచాహమేవేదం సంకల్పాత్మైవభాసతే. 25

ఐందవుల మనస్సే బ్రహ్మయైనట్లు, మనముకూడ మనస్సంకల్పముచేతనే బ్రహ్మలై యున్నారము. అట్టి మనస్సుచే స్థితిని బొందియున్న మనమును, మనచే రచింపబడిన యీ జగత్తును, సర్వము సంకల్పరూపముననే భాసించుచున్నది.

శశ్చిచ్చిత్తవిలాసోఽయం బ్రహ్మాహమిహసంస్థితః
స్వభావపవదేహాది విద్ధిశూన్యతరాత్మఖాత్. 26

ఈ చిత్తకల్పన చేతనే మరియొకడు 'నేను బ్రహ్మనని' తలంచుచున్నాడు. పరమాత్మయే, జగద్రహిత చిదాకాశముకంటె వేఱుగా గన్పించుచు, దేహాదిరూపమున ప్రకాశించుచున్నాడు.

శుద్ధచిత్పరమార్థైకరూపిణీత్యేవభావనాత్
జీవోభూయోమనోభూత్వా వేత్తీత్థందేహతాంముధా. 27

నిర్మలమగు చిత్తము పరమార్థస్వరూపమే యగును. భావనావశముచే నయ్యది జీవుడుగను, మలిన చిత్తముగను నయి, దేహాది రూపమున వ్యక్తమగుచున్నది.

సర్వమైందవసంసారవదిదంభాతి చిద్వపుః
సంపన్నసంప్రబోధాత్మా స్వప్నోదీర్ఘఃస్వశక్తిజః. 28

తన అజ్ఞానశక్తిచే నుత్పన్నమైన స్వప్నము, చిరకాలము స్థిరముగానున్నట్లు తోచుటచే జాగ్రత్తుగనే నుండునట్లు, ఈ చిద్వస్తువ్యాప్తమగు జాగ్రత్ప్రపంచమును, ఐందవసృష్టివలె సత్యముగనే యనుభూతమగుచున్నది.

ద్విచంద్రవిభ్రమాకారం తన్మాత్రాభాసపూర్వకమ్
ఐందవాంబరవద్రూఢం చిత్తాదేవాఖిలంభవేత్. 29

సూక్ష్మవాసనామయమై, శబ్దాది తన్మాత్రల యధ్యాసచే బలపడియున్నదియు, రెండు చంద్రుల భ్రమ వంటిదియు, ఐందవుల చిత్తమువలె దృఢత్వమును పొందినదియునగు చిత్తమే ఈ ప్రపంచము నంతను నుత్పన్నము చేయుచున్నది.

నసన్నాసదహంరూపం సత్తాసత్తే తదేవచ
ఉపలంభేన సద్రూప మసత్యంతద్విరోధతః. 30

అహంభావనారూపమున ప్రకాశించునది 'సత్తు' కాదు. ఏలయన, సర్వకాలములందును యది పొందబడుటలేదు. అది 'అసత్తును' గాదు. ఏలయన, అసద్వస్తువు ప్రాప్తింపకయే యుండవలెను. సద్వస్తు వెల్లప్పుడును సత్తుగను, అసద్వస్తు వసత్తుగను యుండును కాని యహంభావము సదసద్విలక్షణమై యుండుటచే మాయికమును, అనిర్వచనీయమును నయియున్నది.

జడాజడంమనోవిద్ధి సంకల్పాత్మబృహద్వపుః
అజడంబ్రహ్మరూపత్వా జ్జడందృశ్యాత్మతావశాత్. 31

సంకల్పాత్మమును, విశాలమునునగు మనస్సు జడముగను, అజడముగను కూడనున్నదని గ్రహింపుము. బ్రహ్మస్వరూపమగుటచే నది యజడమును, దృశ్యరూపమగుటచే జడమును నగును.

దృశ్యానుభవసత్యాత్మ నసద్భావే విలాసితత్
కటకత్వంయథాహేమ్ని తథాబ్రహ్మణి సంస్థితమ్. 32



దృశ్యానుభవ కాలమందే మనస్సు సత్యముగనే గాన్పించును. కాని బ్రహ్మనుభవకాలమందు బ్రహ్మకంటె వేఱుగనుండదు. కటకాదులు యాభరణ దృష్టిచే సువర్ణముకంటె భిన్నముగను, సువర్ణ దృష్టిచే యభిన్నముగను నుండు విధమున, మనస్సు బ్రహ్మయందు స్థితిగలిగియున్నది.

సర్వాత్మత్వాద్బ్రహ్మణః సర్వంజడంచిన్మయమేవచ
అస్మదాదిశిలాంతాత్మా నజడం నచచేతనమ్. 33

బ్రహ్మ సర్వస్వరూపమగుటచే జడచైతన్యములన్నియు బ్రహ్మమేయగును. బ్రహ్మాది స్థావరాంతములగు సమస్తపదార్థములును యథార్థముగ జడ చైతన్యములకు విలక్షణమై, మాయారూపమును, అనిర్వచమునునై యొప్పుచున్నవి.

దార్వాదీనామచిత్త్వేన నోపలంభస్యసంభవః
ఉపలంభోహిసదృశసంబంధాదేవజాయతే. 34

ఉపలబ్ధేఽజడం విద్ధి తేనేదంసర్వమేవహి
ఉపలంభోహిసదృశసంబంధాత్స్యాత్సమాత్మనోః. 35

కాష్ఠాది వస్తువులు కేవలము జడములేయైన, వాని పొందికయే తటస్థింపదు. సాదృశ్యసంబంధముచే-అనగా ప్రమాతృచైతన్యము, ప్రమేయచైతన్యము, రెండును వృత్తిద్వారా యభేదమును పొందుటచేతనే పొందిక సంభవించును. అట్లనే ప్రమాణాంతరముగూడ, చైతన్యముతో చైతన్యసంబంధము గలుగుటవలననే సిద్ధించును. ఇవ్విధమున సాదృశ్యసంబంధముచేతనే పొందిక సిద్ధించును గాన కాష్ఠాదుల యుపలబ్ధి పొందిక సంభవించుచో నయ్యవి చేతనములే యగును.

జడచేతనభావాది శబ్దార్థశ్రీర్నవిద్యతే
అనిర్దేశ్యపదేపత్రలతాదీవమహామరౌ. 36

విశాల మరుభూమియందు పత్రలతాదులుండనట్లు, వాక్కునకతీతమగు పరబ్రహ్మమందు జడ, చేతనముల గూర్చిన శబ్దార్థకల్పనయే లేదు.

చితోయచ్చేత్యకలనం తన్మనస్తముదాహృతమ్
చిద్భాగోఽత్రాజడోభాగో జాడ్యమత్రహిచేత్యతా. 37

చిద్వస్తువుయొక్క విషయసంబంధ స్ఫురణయే మనస్సని చెప్పబడును. ఈ మనస్సునందలి చిదంశ మజడమును, విషయాంశము జడమును నగును.

చిద్భాగోఽత్రావబోధాంశో జడంచేత్యంహిదృశ్యతే
ఇతిజీవోజగద్భ్రాంతిం పశ్యన్గచ్ఛతి లోలతామ్. 38

మనస్సునందలి జ్ఞానాంశమజడము (చైతన్యము)ను, విషయరూపానుభవము జడమును నయియున్నది. ఇట్లు జీవుడు జగద్భ్రాంతి ననుభవించుచు చాంచల్యము నొందుచున్నాడు.

చిత్తస్థఏవభావోఽసౌ శుద్ధఏవద్విధాకృతః
అతఃసర్వంజగత్త్వైవ ద్వైతలబ్ధంచసైవతత్. 39

చిత్తమందలి చిదంశమే చిత్తజగద్రూపముల విభజింపబడినది. కాన జగత్తంతయు చిద్వస్తుమాత్రమే యగును. చైతన్యముతో అభేదమును బొందుటచే జగత్తు చిద్రూపమేయగుచున్నది.

స్వమేవాన్యతయాదృష్ట్వా చితిర్దృశ్యతయావపుః
నిర్భాగాప్యేకభాగాభం భ్రమతీవభ్రమాతురా. 40

భేదదృష్టిచే నీచైతన్యమన్యరూపమును ధరించుచున్నది. విభాగరహితమైనను విభాగము గలదిగ నది గన్పట్టుచున్నది. భ్రమరహితమైనను భ్రమయుక్తముగ నున్నది.

నభ్రాంతి రస్తి భ్రమభాజ్ఞ్నైవేతీహానిశ్చయః
పరిపూర్ణార్ణవప్రఖ్యా వేత్థంసంస్థితాచితిః. 41

యథార్థముగ భ్రమయును లేదు. చేతనస్వరూపుడగు జీవుడు భ్రమను పొందుటయును లేదు. పూర్ణసముద్రమువలె చైతన్యము తనయందే యీ జగదాదుల యనుభవమును పొందుచున్నది.

సర్వంస్యాజ్జాడ్యమప్యస్యాశ్చితిశ్చిత్త్వంచవేత్సితత్
చిదాంగోంశోఽవబోధస్య త్వహంతాజడతోదయః. 42

చిద్వస్తువు సర్వస్వరూపమగుటచే జడపదార్థమును చిద్రూపమే యగును. ఏలయన, కేవలము జడమగుచో నది భాసింపకయే యుండవలెనుగదా! దాని జడాంశమందును నీవు చైతన్యానుభవమును పొందుచున్నావు. జ్ఞానముయొక్క చైతన్యాంశమం దహంభావమును, జడత్వమును యుదయించుచున్నవి.

అహంతాదిపరేతత్త్వే మనాగపినవిద్యతే
ఊర్మ్యాదీవపృథక్తోయే సంవిత్సారంహితద్యతః. 43

జలముకంటె నన్యముగ తరంగాదులులేనట్లు యథార్థముగ పరమాత్మయందు అహంకారాదులేవియును లేవు. దృశ్యమందలి సారమిా చైతన్యమే. అనగా నన్నిటియందది యేకరసమై ప్రకాశించుచున్నది.

అహంప్రత్యయసందృశ్యం చేత్యంవిద్ధిసముత్థితమ్
మృగతృష్ణాంబ్వివాంతస్థం నూనంవిద్యతఏవనో. 44

అహంభావనచే నుత్పన్నమగు విషయములన్నియు గొండమావులందలి నీటివలె మిథ్యయని యెఱుంగుము. అయ్యవి వస్తుతః లేనివేయగును.

అహంతాపదమంతాత్మ పదంవిద్ధి నిరామయమ్
విదంవిదురహంతాది శైత్యమేవయథాహిమమ్. 45

ద్వైతమంతయు తొలగగ, శేషించునట్టి యాత్మ అహంకారమున కాశ్రయమెట్లగును? అథవా శీతలత్వముచే, జలము ఘనీభవించి హిమత్వము, జెందునట్లు, చేతనవస్తువే అహంకారాది రూపమును పొందుచున్నది.

చిత్తైవచేత్యతేజాడ్యం స్వప్నే స్వమరణోపమమ్
సర్వాత్మత్వాత్సర్వశక్తిః కుర్వతీనైతిసామ్యతామ్. 46

స్వప్నమందలి స్వమరణమువలె, మిథ్యారూపమున చైతన్యమే జడత్వానుభవము నొందుచున్నది. సర్వాత్మకమగు నయ్యది దట్టిస్థితియందు తన శక్తుల నన్నింటిని వ్యక్తపరచుచున్న[illegible]



మనఃపదార్థాదితయా సర్వరూపంవిజృంభతే
నానాత్మాచిత్తదేహోఽయ మాకాశవిశదాకృతిః. 47

సమస్త వస్తువులకును మనస్సాదికారణమగుటచే నది యన్నింటి రూపమున వ్యక్తమగుచున్నది. అయ్యది, ఆకాశమువలె విశాలమును, అనేకరూపముల ధరించునదియునై యున్నది.

దేహాదిదేహప్రతిభా రూపాత్మ్యం త్యజతాసతా
విచార్యంప్రతిభాసాత్మ చిత్తంచిత్తేనవై స్వయమ్. 48

వైరాగ్యాది ఉత్తమ గుణములుగల యధికారి యగు జీవుడు స్థూల సూక్ష్మ కారణ శరీరముల భ్రాంతిని త్యజించి, ప్రతిభాసాత్మకమగు చిత్తమునుగూర్చి, చిత్తముచేతనే స్వయముగ విచారింపవలయును.

చిత్తతామ్రేశోధితేహి పరమార్థసువర్ణతామ్
గతేఽకృత్రిమఆనందః కిందేహోపలఖండకైః. 49

చిత్తమను తామ్రము (రాగి) శుద్ధమైనచో పరమార్థమను సువర్ణత్వమునుజెంది నిత్యనిరతిశయానందమును ప్రాప్తినొందగలడు. అట్టిచో నిక దేహాది శిలాఖండములగూర్చి విచారించుటచే నేమి ప్రయోజనము.

యద్విద్యతే శోధ్యతే తద్బోధః కేచఖపాదపాః
దేహాద్యవిద్యా సత్యాచేద్యుక్తఏతాంప్రతి గ్రహః. 50

ఏది సత్యమైనదో దానినిగూర్చియే విచారింపవలయును. అట్టి విచారణారూపమగు జ్ఞానమే సఫలమగును. అసత్యమును, కల్పితమునునగు దానినిగూర్చి విచారింపదగదు. ఆకసమందలి కల్పితవృక్షముల నెవడైన శోధించునా? అవిద్యతోకూడిన ఈ దేహాదులు సత్యములేయైన, నపుడవి విచారణాయోగ్యములగును.

అసత్యవినివిష్టానాం దేహవాచితయా త్విహ
యేనామోపదిశంత్యజ్ఞాః కించిత్తే పురుషైడకాః. 51

అసత్యమునే యాశ్రయించు దేహాత్మవాదులగు చార్వాకాదులలో నెవరైనను ప్రామాణిక వస్తువునుగూర్చి యుపదేశించుచో నట్టివారు పశుతుల్యులే యగుదురు.

యథైతద్భావయేత్స్వాంతం తథైవభవతిక్షణాత్
దృష్టాంతోఽత్రైంద్రవాహల్యాకృత్రిమేంద్రాదినిశ్చయాః. 52

చిత్తమెట్లుభావించునో, యొక్కక్షణములో నట్లనేయగును. అహల్యా కృత్రిమేంద్రుల మనోనిశ్చయమే యిందులకు దృష్టాంతము

యద్యద్యథాస్ఫురతిసుప్రతిభాత్మచిత్తం తత్తత్తథాభవతిదేహతయోదితాత్మా
దేహోఽయమస్తినచాహమితిస్వరూపం విజ్ఞానమేకమవగమ్యనిరిచ్ఛమాస్స్వ. 53

ఈ చిత్తమెవ్విధమున స్ఫురించునో దేహాదిరూపమున ప్రకటితమై యావిధముగనే నుండుచున్నది. వాస్తవముగ నీ దేహమును, అహంకారమున్ను లేనివే. కాన సర్వదా యేకరసమును, విజ్ఞానస్వరూపమునునై యుండు ఆత్మనెఱింగి యిచ్ఛారహితుడవై యుండుము.

దేహోఽయమేషచకిలాయమితిస్వభావా ద్దేహోఽయమేతదఖిలంతతఏతినాశమ్
యక్షాదికల్పనవశాద్భయమేతి బాలో నిర్యక్షదేహగతఏవకయాపియుక్త్యా. 54

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
జీవావతరణక్రమోపదేశో నామైకనవతితమః సర్గః ॥ 91 ॥

బాలుడు యక్షుని (బేతాలుని) దేహముతో సంబంధములేనివాడైనను నట్టి కల్పనచే భయాదుల ననుభవించును. మరియు నాకల్పన నశింప, భయాదులును నశించును. అట్లనే యాత్మయు కల్పనావశమున మనుష్యాది దేహములుగను, సర్వవ్యాప్య ప్రపంచముగను నగుచు దేహాదులు నశింప, తాను నశించితినని భావించుచున్నది. ఎప్పుడీ యవిద్యాకల్పన నశించునో, అపుడే భ్రమయును తొలగుటచే స్వస్వరూపప్రాప్తి సంభవించుచున్నది.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు, ఉత్పత్తిప్రకరణమున
జీవావతరణక్రమోపదేశమను ఏకనవతితమ సర్గము ॥ 91 ॥

## ద్వినవతితమః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఇత్యుక్తవాన్సభగవా న్మయా కమలసంభవః
రఘూద్వహాపునఃపృష్టో వాక్యమాక్షిప్యభూతపః. 1
త్వయైవభగవన్ప్రోక్తాః శాపమంత్రాదిశక్తయః
అమోఘాఇతితాఏవ కథంమోఘాఃకృతాఃపునః. 2

వసిష్ఠుడు:— రఘుకులప్రదీపకుడవగు నో రామచంద్రా! బ్రహ్మదేవుడిట్లుపల్క నపుడాతని వాక్యము యుక్తియుతముగ లేదని శంకించి నేనిట్లంటిని—ఓ దేవా! శాప మంత్రాదుల శక్తులమోఘము లని వచించియుంటివిగదా, ఇపుడేల నయ్యవి వ్యర్థములని పల్కుచుంటివి?

శాపేనమంత్రవీర్యేణ మనోబుద్ధీంద్రియాణ్యపి
సర్వాణ్యేవవిమూఢాని దృష్టాని కిలజంతుషు. 3

శాపమంత్రాదుల శక్తిచే మనస్సు, బుద్ధి, జ్ఞానేంద్రియములును మూఢావస్థ జెందుననుట జీవులందు నిక్కముగ గన్పించుచున్నది. (ఇట, శాపముచే నజగరమై జన్మించిన నహుషుడు తన వంశజుడగు భీముని బాధింపదలంచుట, ధర్మాత్ముడగు సౌదాసునకు బ్రహ్మవధాదులందు ప్రవృత్తిగల్గుట, మొదలగు దృష్టాంతము లనేకములు గలవు.



యథైతౌపవనస్పందౌ యథాన్నేహాతిలౌయథా
అభిన్నౌతద్వదేవైతౌ మనోదేహౌసదైవతత్. 4

వాయు, చలనములును, తిల, తైలములును అగ్న్యౌష్ణ్యములును భిన్నములు గానట్లు మనశ్శరీరములును భిన్నములుగావు. కాన శరీరము మనస్సేయగును. అట్టిచో వర, శాపాదులు మనస్సును ప్రభావితమొనర్ప జాలనిచో, నిక దేహమునుగూడ నట్లే యేమియునొనర్పక యుండునుగదా !

అథనాస్తీహవాదేహః కేవలంచేతసైవసః
ముధానుభూయతేస్వప్నమృగతృష్ణాద్విచంద్రవత్. 5
ఏకనాశేద్వయోరేవ నాశోఽత్రాభ్యుపపద్యతే
అవశ్యంభవితుంమనోనాశే దేహపరిక్షయః. 6

మఱియు, దేహము వాస్తవముగ లేదనియు, అది కేవలము చిత్తముయొక్క కల్పనయేయనియు ఎండమావుల వలెను, రెండుచంద్రులవలెను భ్రాంతిరూపమున నయ్యది వ్యర్థముగ నుత్పన్నమైనదనియు తలంచినను, యొకటి నశింప, రెండును నశింపవలసియుండును. రెండును సమానసత్తను గల్గియున్నవి. మనోనాశముచే శరీరనాశము సిద్ధించునట్లు శరీరనాశముచే మనోనాశమును సిద్ధింపవలసియుండును. గదా !

మనఃశాపాదిభిర్దోషైః కథంనాక్రమ్యతేప్రభో
కథమాక్రమ్యతేవాపి బ్రూహిమేపరమేశ్వర. 7

ఓ పరమేశ్వరా! శాపాదులచే మనస్సేల ప్రభావితము గాకయుండును? శరీరము మాత్రమేల ప్రభావితమగును? ఇవ్విషయమును నాకెఱింగింపుము ?

బ్రహ్మోవాచ:—

నతదస్తిజగత్కోశే శుభకర్మానుపాతినా
యత్పౌరుషేణశుద్ధేన నసమాసాద్యతేజనైః. 8

బ్రహ్మదేవుడు:— శుద్ధమగు పురుష ప్రయత్నముచేతను శుభకర్మచేతను జీవులకీ జగత్తున పొందరాని వస్తువేదియును లేదు.

ఆబ్రహ్మస్థావరాంతంచ సర్వదాసర్వజాతయః
సర్వఏవజగత్యస్మిన్ ద్విశరీరాఃశరీరిణః. 9

ఈ ప్రపంచమున బ్రహ్మాది స్తంబ పర్యంతముగల దేహధారులగు ప్రాణికోట్లన్నిటికిని రెండు శరీరములుగలవు.

ఏకంమనఃశరీరంతు క్షిప్రకారి సదాచలమ్
అకించిత్కరమన్యత్తు శరీరంమాంసనిర్మితమ్. 10

మొదటిది శీఘ్రముగ కార్యముల నొనర్చునదియు సదా స్థిరమైయుండునదియునగు మనస్సు, రెండవది మాంసనిర్మితమగు దేహము.

తత్రమాంసమయః కాయః సర్వస్యైవచసంగతః
సర్వైరాక్రమ్యతే శాపై స్తథావిద్యాదిసంచయైః. 11

ఈ రెండిటిలో మాంసమయదేహము సర్వులకును ప్రత్యక్షముగనే గోచరించుచుండును. అది సకలవిధములగు శాపములచేతను, అభిచారాది విద్యలచేతను శస్త్రాదులచేతను బాధింపబడును.

మూకప్రాయోహ్యశక్తోఽసౌ దీనఃక్షణవినశ్వరః
పద్మపత్రాంబుచపలో దైవాదివివశస్థితిః. 12

ఈ మాంసదేహము జడమును, అసమర్థమును, అతిదీనమును, క్షణవినాశియు తామరాకుపై నీటిబిందువువలె చంచలమును, ప్రారబ్ధ కర్మచేతను రాజదండనచేతను బాధితమగునదియు నైయున్నది.

మనోనామద్వితీయోఽయం కాయఃకాయవతామిహ
సఆయత్తోఽపినాయత్తో భూతానాంభువనత్రయే. 13

ఈ త్రిలోకమందలి జీవులందఱియొక్కయు రెండవశరీరము మనస్సు. అది స్వతంత్రమును అస్వతంత్రమునుకూడ నగును.

పౌరుషంస్వమవష్టభ్య ధైర్యమాలంబ్యశాశ్వతమ్
యదితిష్ఠత్యగమ్యోఽసౌ దుఃఖానాం తదనిందితః. 14

పురుషప్రయత్నము నాశ్రయించి నిత్యము ధైర్యమవలంబించి యుండినచో నది (మనస్సు) దుఃఖములఁజెందకుండును.

యథాయథాసౌయతతే మనోదేహోహి దేహినామ్
తథాతథాసౌభవతి స్వనిశ్చయఫలైకభాక్. 15

జీవులయొక్క యీ మనోమయ శరీర మేవిధమున యత్నము సల్పునో, యా విధముననే ఫలమును బొందుచుండును.

సఫలోమాంసదేహస్య నకశ్చిత్పౌరుషక్రమః
మనోదేహస్యసఫలం సర్వమేవస్వచేష్టితమ్. 16

మాంసమయదేహముయొక్క ప్రయత్న మేదియు సఫలముగాదు. మనోమయదేహము క్రియావంతమగునపుడే యంతయును ఫలవంతమగును.

పవిత్రమనుసంధానం చేతఃస్మరతిసర్వదా
నిష్ఫలా స్తత్రశాపాద్యాః శిలాయామివసాయకాః. 17

ఈ మనస్సెల్లపుడును పవిత్రమగుదానినే చింతించుచు ధ్యానించుచుండిన, రాతిని బాణము వలె, శాపాదులద్దాని నేమియు చేయజాలవు.

పతత్వంభసివహ్నౌవాకర్దమే వా శరీరకమ్
మనోయదనుసంధత్తే తదేవాప్నోతి తత్క్షణాత్. 18

దేహము జలమందుగాని, అగ్నియందుగాని, పంకమునగాని బడుగాక! అయినను, మనస్సు దేనిని చింతించుచుండునో యద్దానిని వెంటనే బొందగలదు.

పురుషాతిశయఃసర్వః సర్వభావోపమర్దనే
దదాత్యవిఘ్నేన ఫలం మనోహిమనసోమునే. 19

ఓ మునీంద్రా ! దేహాదులు క్రియాకారకములు కానప్పటికిని, పురుషప్రయత్న మధికముగ సిద్ధించుచో, నదియు నిర్విఘ్నముగ ఫలము గలుగజేయును. పురుషప్రయత్నము మనోరూపమేగాన, అట్టి ఫలమును మనస్సు మనస్సునకే గలుగజేయుచున్నదగును.

పౌరుషేణ బలేనాంతశ్చిత్తంకృత్వాప్రియామయం
కృత్రిమేంద్రేణ దుఃఖార్తి ర్నదృష్టాసామనాగపి. 20

పురుషప్రయత్నముచేతనే, కృత్రిమేంద్రుడు తనచిత్తమును ప్రియామయముగ నొనర్చుకొనినందున, దుఃఖబాధ యేమియును పొందకుండెనుగదా !

పౌరుషేణమనఃకృత్వా నీరాగం విగతజ్వరమ్
మాండవ్యేన జితాక్లేశాః శూలప్రాంతేప్రతిష్ఠితా. 21

పురుష ప్రయత్నముచేతనే మాండవ్యమహర్షి, శూలాగ్రమున నుంచబడినను, క్లేశమును పొందకుండెను.

అంధకూపస్థితేనాపి మానసైర్యజ్ఞసంచయైః
ఋషిణాదీర్ఘతపసా సంప్రాప్తం వైబుధంపదమ్. 22

అంధకూపమున బడినను దీర్ఘతపుడు*ను ఋషి, అచట మానసయజ్ఞముఁజేసి, ఇంద్రత్వమును బడసెను.

ఇందుపుత్రైర్ద్విజైరేవ పురుషాధ్యవసాయతః
ధ్యానేనబ్రహ్మతాప్రాప్తా సా మయాపి న ఖండ్యతే. 23

ఐందవులు సామాన్య మానవులైనను, పురుష ప్రయత్నముచేతను, మనోబలముచేతను, బ్రహ్మపదము ప్రాప్తినొందిరి. వారి నిపుడాయాస్థానములనుండి తొలఁగింప నేనును శక్తుఁడగాను.

అన్యేపిసావధానా యే ధీరాఃసురమహర్షయః
చిత్తాత్స్వమనుసంధానం నత్యజంతిమనాగపి. 24

ఇంకను, ప్రయత్నశీలురును, ధీరులునగు యనేక దేవతలు, ఋషులు, తమ చిత్తైకాగ్రతను, జ్ఞాన యుపాసనాదులను యే మాత్రము త్యజింపనొల్లరు.

ఆధయోవ్యాధయశ్చైవ శాపాఃపాపదృశ స్తథా
నఖండయంతి తచ్చిత్తం పద్మఘాతాఃశిలామివ. 25

ధ్యేయవస్తువునం దేకాగ్రతగల చిత్తమును, శారీరిక మానసిక వ్యాధులుగాని శాపములుగాని పాప స్వభావులగు రాక్షసులుగాని, కమలము శిలనువలె, ఖండింప నశక్తులైయుండురు.

---

*దీర్ఘతపుడను ఋషియజ్ఞము చేయనెంచి, యజ్ఞసామగ్రికొఱకై బయలుదేరి త్రోవలో నొక యంధకూపమునబడ, నచట మానస యజ్ఞముఁజేసెను. అపుడింద్రుడు ప్రసన్నుడై వానినందుండి పైకిదీసి, తన యింద్రపదవిని వానికి సమర్పించెను.

మేచాపిఖండితాః కేచి చ్ఛాపాద్యైరాధిసాయకైః
స్వవివేకాక్షమం తేషాం మనో మన్యే విపౌరుషమ్. 26

శాపములను బాణములచే ఖండితులైనవారి (నహుష, సౌదాసాదుల) చిత్తము లదృఢములై యత్నవంతములుగాకయు జ్ఞానప్రాప్తియందసమర్థములయ్యె ననుచున్నవనియే నేను తలంచెదను.

నకదాచనసంసారే సావధానమనామనాక్
స్వప్నేఽపికశ్చిద్ధృశ్యేవా దోషజాలైః ఖలీకృతః. 27

సావధాన చిత్తులీ ప్రపంచమున స్వప్నమునగాని, జాగ్రద్దశయందుగాని, దోషములచేనే మాత్రము పీడింపబడకయుందురు.

మనసైవ మనస్తస్మాత్పౌరుషేణపుమానిహ
స్వకమేవస్వకేనైవ యోజయేత్పావనే పథి. 28

కాన మానవులు, పురుషయత్నము నాశ్రయించి మనస్సును మనస్సుచేతనే పవిత్రమార్గమందు నియోగింపవలెను.

ప్రతిభాతంయదేవాస్య యథాభూతంభవత్యలమ్
క్షణాదేవ మనఃపీనం బాలవేతాలవన్మనే. 29

ఓ మునీంద్రా! చిత్తమున స్ఫురించినవస్తువు రూఢిపడి గ్రమముగ స్థూలత్వమందిన, బాలునిచే కల్పితమగు బేతాలునివలెనయ్యది వెంటనే వానికి సత్యముగతోచి ప్రత్యక్షమగును.

ప్రతిభాసస్యానుపదం ప్రాక్తనీంస్థితిముజ్ఝతి
కులాలకర్మానుపదం ఘటోమృత్పిండతామివ. 30

(తమ పూర్వపు దృఢవాసనా ప్రాబల్యముచే ఐందవులు మనుష్యరూపమును మరల యేల పొందలేదని శంకింపవలదు. ఏలయన-) కులాలుని (కుమ్మరివాని) క్రియానంతరము ఘటము మృద్దశను త్యజించునట్లు, ఉత్తరకాల దృఢవాసనా ప్రాబల్యముచే మనస్సు తన పూర్వవాసనలఁ ద్యజించును.

ప్రతిభాసార్థతామేతి క్షణాదేవమనోమునే
స్పందమాత్రాత్మకం వారి యథాతుంగతరంగతామ్. 31

(అయితే, పూర్వవాసనలు నశించిన, పూర్వకృత ఉపాసనాదులు నశించునుగాన, అన్యకార్య సంపాదనయందు మనస్సెట్లు ప్రవర్తించునని శంకింప నక్కరలేదు. ఏలనన-) ఓ మునీశ్వరా! ప్రవహించుచున్న జల మొక్కక్షణములో తరంగరూపమును బొందునట్లు, మనస్సున్నూ దృఢభావనచే వెంటనే ధ్యేయవస్తురూపమును పొందుచున్నది.

అనుసంధానమాత్రేణ సూర్యబింబేఽపియామినీమ్
మనఃపశ్యత్యశుద్ధాక్షశ్చంద్రబింబే ద్వితామివ. 32

(ప్రళయకాలమందును ఐందవులసృష్టి యేల నశింపక యున్నదనిన-) దోషయుక్తమగు నేత్రము లిరువురుచంద్రుల గాంచునట్లు దృఢభావనచే మనస్సు సూర్యబింబమందును నంధకారమును గాంచగలదు.



యత్పశ్యతితదేవాశు ఫలీభూతమిదంమనః
సహహర్షవిషాదాభ్యాం భుంక్తేతస్మాత్తదేవతత్ 33

ఈ మనస్సు దేనిని భావించునో, అద్దానినే శీఘ్రముగ పొందును, మఱియు దానినే హర్షవిషాదములతో గూడి యనుభవించును, కావ కర్తయగు మనస్సే భోక్తయగును.

ప్రతిభానుపదంచేత శ్చంద్రే వ్యగ్నిశిఖాశతమ్
దృష్ట్వాదాహమవాప్నోతి దగ్ధంచపరితప్యతే. 34

దృఢభావనచే ఈ చిత్తము చంద్రునియందనేక అగ్నిజ్వాలలగాంచుచు యుష్ణత్వమనుభవించుచున్నది. మరియు దగ్ధమై పరితాపము నొందుచున్నది.

ప్రతిభానుపదంచేతః క్షారేఽపిహి రసాయనమ్
దృష్ట్వాపీత్వాపరాంతృప్తిం యాతివల్గతినృత్యతి. 35

తనభావన ననుసరించి యీ చిత్త మూసరక్షేత్రమందును జలానుభవమును పొందుచున్నది. మరియు నా జలమును త్రావి, తృప్తిజెంది విజృంభించుచు నాట్యమాడుచున్నది.

ప్రతిభానుపదంచేతో వ్యోమన్యపిమహావనమ్
దృష్ట్వాలునాతి లూత్వాచ పునరారోపయత్యలమ్. 36

తన కల్పనచేతనే చిత్తమాకసమున గొప్పవనమును దర్శించి, యందలి ఫలపుష్పాదులఁ గోయుచు, వృక్షముల నఱుకుచు మరల నాటుచు నున్నది.

ఇత్థంయదేవపరికల్పయతీంద్రజాలం శీఘ్రంతదేవపరిపశ్యతితాతచేతః
నాసజ్జగన్నచసదిత్యవగమ్యనూనం లూనాందృశంవివిధభేదవతీం జహీహి. 37

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ-మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ఐందవోపాఖ్యానే మనోమాహాత్మ్యవర్ణనం నామ
ద్వినవతితమః సర్గః ॥ 92 ॥

ఓ మునీంద్రా! ఇవ్విధమున మనస్సు తాను కల్పించిన యింద్రజాలమును తానే శీఘ్రముగ వీక్షించుచున్నది. ఈ జగత్తు సత్తునుగాదు. అసత్తునుగాదని నిక్కముగ నెఱింగి పలువిధ భేదకల్పనలతో కూడిన యీ పరిచ్ఛిన్న దృష్టిని త్యజించివేయుము.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
మనోమాహాత్మ్యవర్ణనమను ద్వినవతితమ సర్గము ॥ 92 ॥

## త్రినవతితమః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఇతి మే భగవతా పూర్వముక్తం తదేతదద్య తుభ్యం కథితమ్. 1

వసిష్ఠుడు:— ఓ రామా! ఇట్లు భగవంతుడగు బ్రహ్మదేవుడు పూర్వము నాకు దెలిపిన విషయమంతయును నీకు జెప్పితిని.

తస్మాదనాఖ్యానా బ్రహ్మణః సర్వతః సర్వమనాఖ్యాన ముత్పద్యతే
స్వయమేవ తద్ఘనతాం ప్రాప్య మనః సంపద్యతే. 2

బ్రహ్మమునుండి ప్రథమమున సర్వవ్యాపకమగు అవ్యాకృతముదయించును, అదియే కాలక్రమమున స్వయముగ, సంకల్ప వికల్పరూపమగు మనన శక్తిచే స్థూలత్వముఁ జెంది మనస్సగును.

తన్మనస్తన్మాత్రకల్పనపూర్వకసన్నివేశం భవతి తతస్తైజసః పురుషః సంపద్యతే
సోఽయం బ్రహ్మేత్యాత్మని నామకృతవాన్. 3

ఆ మనస్సు సూక్ష్మభూత కల్పనతో గూడినపుడు దానినుండి తేజోరూపమగు సమష్టిలింగ శరీరాభిమానియగు పురుషుడుదయించెను. అతడు బ్రహ్మయని తనకు నామంబిడుకొనెను.

తేన రామ యోఽయం పరమేష్ఠీ తన్మనస్తత్త్వం విద్ధి.

కాన నో రామా! పరమేష్ఠియనఁబడు యీ బ్రహ్మ మనోరూపుడే యగుటచే యీ జగత్తునకంతయు కర్తయని యెఱుంగుము.

స మనస్తత్త్వాకారో భగవాన్ బ్రహ్మ సంకల్పమయత్వాద్యదేవ సంకల్ప
యతి తదేవ పశ్యతి. 5

మనస్తత్త్వాకారముగల భగవంతుడగు బ్రహ్మదేవుడు సంకల్పరూపుడే యగుటచే, దేనిని సంకల్పించునో దానిని వెంటనే గాంచును.

తతస్తేనేయమవిద్యా పరికల్పితా అనాత్మన్యాత్మాభిమానమయీతి తేన
బ్రహ్మణా గిరితృణజలధిమయమిదం క్రమేణ జగత్పరికల్పితమ్. 6

ఇట్లు సంకల్ప సిద్ధిగలవాడగుటచే నాతడు అనాత్మయందాత్మాభిమానము గలుగజేయు అవిద్యను కల్పించెను. ఈ యవిద్యాకల్పనచే బ్రహ్మదేవుడు పర్వత, తృణ, సముద్రయుక్తమగు యీ జగత్తంతయును సృజించెను.

ఇత్థం క్రమేణ బ్రహ్మతత్త్వాదియమాగతా సృష్టిరన్యత ఏవాగతేయమితి
లక్ష్యతే. 7

ఇవ్విధమున చిత్తస్వరూపుడగు బ్రహ్మనుండియే సృష్టిగలిగినను, నైయ్యాయికాదులు, జడములగు ప్రధాన, పరమాణ్వాదులచే నది గల్గెనని తలంచుచున్నారు.

తస్మాత్సర్వపదార్థానాం త్రైలోక్యోదరవర్తినామ్
ఉత్పత్తిర్బ్రహ్మణో రామ తరంగాణామివార్ణవాత్. 8



(ఒకేవస్తువున కనేక కారణములు కల్పింపబడుటచే పరమాణు కారణవాదము యుక్తముగాదు. కర్తలేకయే యీ విచిత్రమగు జగన్నిర్మాణము సిద్ధింపనేరదు. అసంగుడు, ఉదాసీనుడు నగు పరమాత్మ కర్తకానేరడు. కాన, ప్రధానకారణవాదమున్నూ సంగతము గాదు. క్షణికమగు విజ్ఞాన మెప్పటికిని జడరూపమును పొందదు గాన, విజ్ఞానకారణవాదమున్నూ సరికాదు. ఇక శూన్యమే కారణమగుట యెచటను గాంచబడలేదు. కాన శూన్యకారణవాదమున్నూ యుక్తము గాదు. ఇట్టి వాదము లన్నియును దోషయుక్తములే యగుటచే నీ సృష్టి యథార్థముగ యుత్పన్నమవలేదనియే నిశ్చయింపబడెను. శ్రుతి ననుసరించి జూచిన, అనిర్వచనీయమగు మాయాశక్తిచేతనే నదికలిగెనను బ్రహ్మ వివర్తవాదమే సత్యమగును.) కాన నో రామా! ఈ త్రిలోకములందలి పదార్థజాతమంతయును సముద్రమందు తరంగములవలె, ఆ బ్రహ్మదేవుని చేతనే యుత్పన్నమగుచున్నది.

య ఏవమనుత్పన్నే జగతి యా బ్రహ్మణశ్చిన్మనోరూపిణీ సాహంకారే
పరికల్ప్య బ్రహ్మ బ్రహ్మతామేతి. 9

ఇట్లు వివర్తవాదముననుసరించి యథార్థముగ జగత్తు ఉత్పన్నము గాకయున్నదని నిశ్చయింపబడ, బ్రహ్మముయొక్క చిత్-శక్తియే సమిష్టి అహంకారోపాధియందు ప్రవేశించినట్లు కల్పన యొనర్చి, హిరణ్యగర్భరూపము నొందెనని తెలియనగును.

యాస్త్వన్యాశ్చిచ్ఛక్తయః సర్వశక్తేరభిన్నా ఏవ కల్ప్యంతే. 10

వ్యష్ట్యహంకారోపాధులందలి చిదాభాస శక్తులును, సర్వ శక్తిమంతుడగు బ్రహ్మము కంటె వేఱుగావు.

జగతిస్ఫారతాం నీతే పితామహరూపేణ మనసా సముల్లసంతి. 11

ఎపుడీ జగత్తు స్థూలత్వమందుచున్నదో, అపుడే చిదాభాస (జీవ) శక్తులన్నియును, ప్రథమమున బ్రహ్మదేవుడను సమిష్టి మనోరూపమునుపొంది శోభించుచున్నవి.

ఏతే సహస్రశోఽపి పరివర్ధమాన జీవా ఉచ్యంతే. 12

వివర్తభావమునొందిన యీ వివిధశక్తులన్నియును జీవులని వ్యవహరింపబడుచున్నవి.

తేఽభ్యుత్థితా ఏవ చిన్నభసో నభసి తన్మాత్రావలితా గగన పవనాంతర్వర్తి
నశ్చతుర్దశవిధా యే భూతజాతమధ్యతయాభ్యాసే తిష్ఠంతి తస్యా ఏవ ప్రాణశక్తి
ద్వారేణ ప్రవిశ్య శరీరం స్థావరం జంగమం వాపి బీజతాం గచ్ఛంతి. 13

ఆ జీవులు చిదాకాశమునుండి బయలుదేఱి, మాయాకాశమందలి పంచభూతమాత్ర యుపాధులతో గలయుచు, ఆకాశమున గమనాగమనములొనర్చు వాయువుకంటె భిన్నమగు 'వాతస్కంధము' (సమిష్టి ప్రాణము) నందలి చతుర్దశ భువనములందును వాసనా, కర్మలననుసరించి స్థావర జంగమాది ఆయాజాతి ప్రాణులందు ప్రాణశక్తిద్వారా ప్రవేశించి, వీర్యరక్తాది రూపమున బీజత్వము నొందుదురు.

తదను యోనితో జగతి జాయంతే తదను కాకతాలీయయోగేనోత్పన్న
వాసనాప్రవాహానురూపకర్మఫలభాగినో భవంతి. 14

ఆ పిమ్మట యోనిమండలమునుండి వారీ జగత్తున యుత్పన్నమగుదురు. అప్పుడు కాక తాళీయ యోగమున సంభవించిన వాసనాజాలము ననుసరించి వారు తమ తమ కర్మఫలములననుభవించుచుందురు.

తతఃకర్మరజ్జుభిర్వాసనావలితాభిర్బద్ధశరీరా భ్రమంతః ప్రోత్పతంతి నిపతంతిచ. 15

పిదప శుభాశుభ వాసనలతో కూడుకొని, వారు తమపుణ్య పాప కర్మలను త్రాడుచే కట్టబడి, లింగశరీరమును గ్రహించి, యొకప్పుడు తమ లోకములకుం జనుచు, నటనుండి పడుచు, మఱల నరకమునకు బోవుచు నుందురు.

ఇచ్ఛైవైతాభూతజాతయః. 16

'కామమయఏవాయంపురుషః, (ఈ పురుషుడు కామమయుడే) అను శ్రుతి వాక్యము ననుసరించి ప్రాణులన్నియును యిచ్ఛారూపములే యగుచున్నవి. (కర్మ, వాసనలకు బీజము కామము, లేక రాగము. కావున జీవులందరును కామనామయులే యగుదురు.)

కాశ్చిజ్జన సహస్రాంతాః పతంతి వనపర్ణవత్
కర్మవాత్యాపరిభ్రాంతా లుఠంతి గిరికుక్షిషు. 17

ఆయా జాతులందలి జీవులు తత్త్వజ్ఞాన ప్రాప్తికి పూర్వము వనమందలి యాకులవలె నసంఖ్యాకములగు జన్మలను పొందుచు, సంసారము ననుభవించుచునే యుందురు. మఱియు, వాసనల ననుసరించి వర్తించుచు, కర్మయను వాయుచే నెగురగొట్టబడుచు జీవులను శిథిలవన పత్రములు పర్వతాదులం జేరుచున్నవి. ఏ జన్మయందు వారాత్మజ్ఞానము బడయుదురో, ఆజన్మమున నే ముక్తులగుదురు.

అప్రమేయభవాః కాశ్చిచ్చిత్సత్తాఽజ్ఞానమోహితాః
చిరజాతాభవంతీహ బహుకల్పశతాన్యపి. 18

కొందఱు జీవులు చిద్వస్తువు నెఱుంగక, అజ్ఞానముచే మోహితులై, అనేక కల్పముల పర్యంత మీ ప్రపంచమున జన్మించుచునే యుందురు.

కాశ్చిత్కతిపయాతీతా మనోరమభవాంతరాః
విహరంతి జగత్యస్మిన్ శుభకర్మపరాయణాః. 19

మరికొందఱు శుభ జన్మల ననుభవించి, ఈ జన్మమున శుభకర్మ పరాయణులై యుందురు. అట్టివారు కొలది జన్మలలోనే ముక్తిని బడయగలరు.

కాశ్చిద్విజ్ఞాతవిజ్ఞానాః పరమేవపదంగతాః
వాతోద్భూతాఃపయోమధ్యం సాముద్రాఇవబిందవః. 20

వాయువుచే నెగురగొట్టబడిన సముద్రమందలి జలబిందువులు, మరల నాజలమునే చేరునట్లు, కొందఱు తత్త్వజ్ఞానముబడసి యుత్తమమగు మోక్షపదమును ప్రాప్తినొందుచున్నారు.

ఉత్పత్తిఃసర్వజీవానామితీహ బ్రహ్మణఃపదాత్
ఆవిర్భావతిరోభావ భంగురాభవభావినీ. 21



వాసనావిషవైషమ్య వైధుర్యజ్వరధారిణీ
అనన్తసంకటానర్థ కార్యసత్కారకారిణీ. 22

నానాదిగ్దేశకాలాంత శైలకందరచారిణీ
రచితోత్తమవైచిత్ర్య విహితాఽఽసంభ్రమాఽసతీ. 23

ఏషాజగజ్జాంగలజీర్ణవల్లీ సమ్యక్సమాలోకకుఠారకృత్తా
వల్లీ వవిక్షుబ్ధమనఃశరీరా భూయోనసంరోహతిరామభద్ర. 24

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ఉత్పత్తిదర్శనంనామ త్రినవతితమః సర్గః ॥ 93 ॥

ఓ రామా! ఇట్లు, జీవులందఱి యుత్పత్తియును బ్రహ్మమునుండియే గల్గుచున్నది. ఆవిర్భావ తిరోభావము గల్గినదియు, క్షణభంగురమైనదియు, అనేక జన్మలు గలదై వాసనయనువిషముచే సంభవించిన వ్యాకులత్వమను జ్వరముచే పీడింబడుచున్న వారలకు కలుగు సంకట యనర్థములను సత్కరించునదియు, అనేక భిన్నదిగ్దేశకాలములందును వివిధ పర్వత గుహాదులందును సంచరించునదియు, విచిత్ర భ్రమదాయకమును, విక్షేపసహితమునగు మనస్సను లత సమ్యగ్జ్ఞానమను గండ్రగొడ్డలిచే నఱుకబడినచో మరలనది యెన్నటికిని యీ జగదారణ్యమున యుత్పన్నమవదు.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
ఉత్పత్తిదర్శనమను త్రినవతితమ సర్గము. ॥ 93 ॥

## చతుర్నవతితమః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఉత్తమాధమమధ్యానాం పదార్థానామితస్తతః
ఉత్పత్తీనాంవిభాగోఽయం శృణువక్ష్యామిరాఘవ. 1

వసిష్ఠుడు:- ఓ రామా! సాత్త్విక, రాజస, తామసగుణ భేదములచే నీ లోకమునగల యుత్తమ మధ్యమాధమ జీవుల యుత్పత్తిని గూర్చియు, వారి విభాగమునుగూర్చియు నీ కెఱింగించెద వినుము.

ఇదంప్రథమతోత్పన్నో యోఽస్మిన్నేవహిజన్మని
ఇదంప్రథమతానామ్నా శుభాభ్యాససముద్భవా. 2

(1. ఇదంప్రథమతా, 2. గుణపీవరి, 3. ససత్త్వా, 4. అధమసత్త్వా, 5. అత్యంతతామసీ, 6. రాజసీ, 7. రాజససాత్త్వికీ, 8. రాజసరాజసీ, 9. రాజసతామసీ, 10. రాజసాత్యన్తతామసీ, 11. తామసీ, 12. తామససత్త్వా, 13. తమోరాజసీ, 14. అత్యన్త తామసీ, యను పదునాలుగు భేదములందు

తుదిరెండును 5, 9 విభాగము లందంతర్భూతములు గాన పంద్రెండు భేదములే శేషించును. పూర్వకల్పమందలి అంతిమజన్మయందు జీవుడు శమదమాదియుక్తుడైయున్నను, శ్రవణాదులులేని కారణముననో లేక బలవత్తరములగు విఘ్నములు గలుగుటచేతనో, జ్ఞానప్రాప్తిని బడయక, ఈ కల్పమందలి ప్రథమ జన్మముననే శమదమాదులుగల్గి జ్ఞానప్రాప్తికి యోగ్యులై, పూర్వకల్పపు శుభాభ్యాసము గల్గియుండు వారు ఇదంప్రథమతాయను విభాగమునకు జెందుదురు. అనగ నీ జన్మముననే వారు ముక్త్యర్హులగుదురు.

శుభలోకాశ్రయా సాచ శుభకార్యానుబంధినీ
సాచేద్విచిత్రసంసార వాసనావ్యవహారిణీ. 3
భవైః కతిపయైర్మోక్షు మిత్యుక్తాగుణపీవరీ
తాదృక్ఫలప్రదానైక కార్యాకార్యానుమానదా. 4
తేనరామ ససత్త్వేతి ప్రోచ్యతే సా కృతాత్మభిః
అథచేచ్చిత్రసంసార వాసనావ్యవహారిణీ. 5
అత్యంతకలుషాజన్మ సహస్రైర్జ్ఞానభాగినీ
తాదృక్ఫలప్రదానైక ధర్మాధర్మానుమానదా. 6
అసావధమసత్త్వేతి తేన సాధుభిరుచ్యతే
సైవసంఖ్యాతిగానంత జన్మవృందాదనంతరమ్. 7
సందిగ్ధమోక్షాయది తత్ప్రోచ్యతేఽత్యంతతామసీ
అనద్యతనజన్మాతు జాతిస్తాదృశకారిణీ. 8
యోత్పత్తిర్మధ్యమా పుంసో రామ ద్విత్రిభవాంతరా
తాదృక్కార్యాతుసాలోకే రాజసీరాజసత్తమ. 9

తీవ్రవైరాగ్యము లేనివారై పుణ్యలోక ప్రాప్తికై యుపాసనాదులఁ జేయుచు, శుభకర్మ మిశ్రితమగు విచిత్రసంసారవాసనలచే భోగముల ననుభవించుచు, ఇక పది లేక పదునైదు జన్మలలో ము లగువారు "గుణపీవరీ" (ఉత్తమగుణ సంపన్నులు) యనియు, సుఖదుఃఖ పుణ్యపాపములఁ జెందుచు, యిఁక నూఱు జన్మలలో సత్త్వగుణాభివృద్ధి గల్గియుండువారు 'ససత్త్వ'యనియు విజ్ఞులందురు. మఱియు, విచిత్ర ప్రాపంచిక వాసనలు గల్గి వ్యవహరించుచు, మలినాంతఃకరణులై సుఖదుఃఖరూపఫలముల బొందుచు, ధర్మాధర్మములనాచరించుచు, వేలకొలది జన్మలకు జ్ఞానప్రాప్తిఁ జెందువారు అధమసత్త్వుల మహాత్ముల సమ్మతము. అట్టి లక్షణములు గల్గియు, అధ్యాత్మశాస్త్ర విముఖత్వముచే నిక వేలకొల జన్మలకైనను, కల్పమునకైనను ముక్తినిపొందుటలో సంశయాస్పదులై యుండువారు అత్యంతతామసు లనంబడుదురు. పూర్వకల్పపు వాసనల ననుసరించి విచిత్ర కర్మాచరణ గావించుచు మధ్యమో త్తినిబడసి, రెండుమూడు జన్మలలో మనుష్యత్వమును గ్రహించి, కర్మానుసారము స్వర్గనరకముల జనుచు మోక్షప్రాప్తియందు నిశ్చయములేనివారు రాజసులని పేర్కొనబడుదురు.

అవిప్రకృష్టజన్మాపి ప్రోచ్యతే కృతబుద్ధిభిః
సాహితస్మృతిమాత్రేణ మోక్షయోగ్యాముముక్షుభిః. 10



తాదృక్కార్యానుమానేన ప్రోక్తా రాజససాత్త్వికీ
సైవచేదితరైరల్పైర్జన్మభిర్మోక్షభాగినీ. 11
తత్తాదృశీహి సా తజ్జ్ఞైః ప్రోక్తారాజసరాజసీ
సైవజన్మశతైర్మోక్షభాగినీచేచ్చిరైషిణీ. 12
త్వదుక్తాతాదృగారంభా సద్భీ రాజసతామసీ
సైవసందిగ్ధమోక్షాచే త్సహస్రైరపిజన్మనామ్. 13
తదుక్తాతాదృశారంభా రాజసాత్యంతతామసీ
భుక్తజన్మసహస్రాతు యోత్పత్తిర్బ్రహ్మణోన్నృణామ్. 14
చిరమోక్షాహికథితా తామసీ సా మహర్షిభిః
తజ్జన్మనైవమోక్షస్య భాగినీచేత్తదుచ్యతే. 15
తజ్జ్ఞైస్తామసస్త్వేతి తాదృశారంభశాలినీ
భవైఃకతిపయైర్మోక్షభాగినీచేత్తదుచ్యతే. 16
తమోరాజసరూపేతి తాదృశైర్గుణబృంహితైః
పూర్వజన్మసహస్రాఢ్యా పురోజన్మశతైరపి. 17
మోక్షాయోగ్యాతతఃప్రోక్తా తజ్జ్ఞైస్తామసతామసీ
పూర్వంతుజన్మలక్షాఢ్యా జన్మలక్షైఃపురోఽపిచేత్. 18
సందిగ్ధమోక్షా తదసౌ ప్రోచ్యతేఽత్యంతతామసీ
సర్వాపతాఃసమాయాంతి బ్రహ్మణోభూతజాతయః. 19

వైరాగ్యోదయముకాగా జ్ఞాన ప్రాప్తి సిద్ధించుజన్మము సమీపముననే గలవారును, మృతించినతోడనే, మఱుజన్మమున మోక్షార్హులగువారును, మోక్షప్రాప్తికి యోగ్యమగు కర్మాచరణ చేయువారును, నిశ్చయబుద్ధిగల ముముక్షువులచే; రాజససాత్త్వికులని పిలువబడుదురు. పైవిధముగనే యక్షగంధర్వాదులందును, కొలది జన్మలలోనే ముక్తిఁబొందువారిని రాజసరాజసులని విజ్ఞులు బల్కుదురు. ఇక ననేక వందల జన్మలకు ముక్తులగువారును, కనుకనే, మందప్రయత్నము గలవారును, రాజస తామసులని పేర్కొనబడుదురు. అనేకవేల జన్మలందైనను మోక్షమును పొందక, తమస్సుచే నావరింపబడి కార్యముల మెల్లగ నాచరించువారు రాజసాత్యంత తామసులనబడుదురు. కల్పాదియందలి హిరణ్యగర్భోత్పత్తిని పెక్కువేల పర్యాయములు గాంచినవారును, అనగ ననేక కల్పములందుఁ జన్మించినవారును, ఇక బహుకాలమునకు మోక్షమును బొందువారును 'తామసు' లని మహర్షులచే యెన్నబడిరి. అట్టివారు మొదటి జన్మయందే మోక్షార్హులయి మోక్షప్రాప్తికి యోగ్యమగు కార్యాచరణమొనర్చుచో, 'తామససత్త్వు'లని పిలువబడుదురు. (తామసజన్మమందు ప్రహ్లాదుడు కర్కటి మున్నగువారు జ్ఞానవంతులగుట యిందులకు ప్రమాణము) ఇక నట్టివారిలో కొన్ని జన్మలైన పిదపనే ముక్తిఁ బొందువారు

తామసరాజసు లనందగుదురు. పూర్వ మనేక వేల జన్మ లెత్తి, యింకననేక జన్మలందును గూడ మోక్షార్హులు కానివారలు తామసతామసులని వచింపబడుదురు. అనేకలక్షల జన్మలు గడపి యున్న, యింక ననేక లక్షల జన్మలకైనను ముక్తులు కానివారు అత్యంతతామసులనంబడుదురు. ఓరామ ! భిన్న భిన్న యుపాధులుగల యీ జీవజాతులన్నియును బ్రహ్మమునుండియే యుత్పన్నమైనవని యెఱుంగుము.

కించిత్ప్రచలితాభోగాత్పయోరాశేరివోర్మయః
సర్వాఏవ వినిష్క్రాంతా బ్రహ్మణోజీవరాశయః. 20

చలించు సముద్రజలమందు తరంగములుత్పన్నమగునట్లు బ్రహ్మమునుండి జీవరాసులన్నియును గల్గినవి.

స్వతేజఃస్పందితాభోగా ద్దీపాదివ మరీచయః
సర్వాఏవసముత్పన్నా బ్రహ్మణోభూతపంక్తయః. 21

దీపమునుండి కిరణము లావిర్భవించునట్లు బ్రహ్మమునుండి ప్రాణికోట్లన్నియు నుద్భవించుచున్నవి.

స్వమరీచిబలోద్భూతా జ్వలితాగ్నేఃకణాఇవ
సర్వాఏవోత్థితా స్తస్మాద్బ్రహ్మణోజీవరాశయః. 22

ప్రజ్వలించుచున్న యగ్నినుండి మిణుగురులు లేచులాగున బ్రహ్మమునుండి ప్రాణిసమూహమంతయు నావిర్భవించినది.

మందారమంజరీరూపా శ్చంద్రబింబాదివాంశవః
సర్వాఏవసముత్పన్నా బ్రహ్మణోదృశ్యదృష్టయః. 23

చంద్ర బింబమునుండి, మందారలవంటి మనోహరమగు కిరణజాలము కలుగునట్లు, దృశ్యమంతయును బ్రహ్మమునుండియే ప్రకటితమగుచున్నది.

యథావిటపినశ్చిత్రా స్తద్రూపా విటపశ్రియః
సర్వాఏవసముత్పన్నా బ్రహ్మణోజీవపంక్తయః. 24

వృక్షమునుండి యనేక చిత్ర విచిత్రములగు శాఖలుత్పన్నమగునట్లు బ్రహ్మమునుండి వివిధ జీవరాసులన్నియు యేర్పడినవి.

కటకాంగదకేయూరయుక్తయః కనకాదివ
సర్వాఏవోత్థితారామ బ్రహ్మణోజీవరాశయః. 25

ఓరామా! సువర్ణమునుండి కటక కేయూరాది యాభరణములవలె బ్రహ్మమునుండియే ప్రాణికోట్లన్నియు నుత్పన్నములాయెను.

నిర్ఝరాదమలోద్ద్యోతాత్పయసామివబిందవః
అజస్యైవాఖిలారామ భూతసంతతికల్పనాః. 26

నిర్మలజలముగల సెలయేటినుండి నీటితుంపరలవలె, అజుడగు పరమాత్మనుండి యీ జీవకల్పనయంతయు గలిగినది.



ఆకాశస్యఘటస్థాలీరంధ్రాకాశాదయో యథా
సర్వాఏవోత్థితాలోకకలనాబ్రహ్మణఃపదాత్. 27

ఘటాకాశము మహాకాశమువస్థితిఁ బొందునట్లు, సమస్తలోకములును బ్రహ్మమందే కల్పింపబడి స్థితివంతములగుచున్నవి.

సీకరావర్తలహరీ బిందవఃపయసోయథా
సర్వాఏవోత్థితారామ బ్రహ్మణోదృశ్యదృష్టయః. 28

ఓ రామా ! జలబిందువులు, ఆవర్తములు, తరంగములు మున్నగునివన్నియు నీటినుండియే కలుగునట్లు, బ్రహ్మమునుండియే దృశ్యప్రతీతియంతయును కలుగుచున్నది.

మృగతృష్ణాతరంగిణ్యో యథాభాస్కరతేజసః
సర్వాదృశ్యదృశో ద్రష్టుర్వ్యతిరిక్తా న రూపతః. 29

ఎండమావులు సూర్యతేజముకంటె భిన్నముగానట్లు ద్రష్టకు భిన్నముగ దృశ్యములేదు.

శీతరశ్మేరివజ్యోత్స్నా స్వాలోకఇవతేజసః
ఏవమేతాహిభూతానాం జాతయోవివిధాశ్చ యాః. 30

చంద్రునినుండి వెన్నెలవలెను, అగ్నినుండి ప్రకాశమువలెను, బ్రహ్మమునుండి పలువిధ జీవజాతులన్నియు నుత్పన్నమగుచున్నవి.

యస్మాదేవ సమాయాంతి తస్మిన్నేవ విశంతిచ
కాశ్చిజ్జన్మసహస్రాంతే జాతయశ్చిరకాలికాః
కాశ్చిత్కతిపయాతీతజన్మరూపావ్యవస్థితాః. 31

ఏ పరమాత్మనుండి యీ జీవజాతులన్నియు నావిర్భవించుచున్నవో, ఆ పరమాత్మయందే మరల లీనమగుచున్నవి. కొన్ని చిరకాలమునకు (అనేకవేల జన్మలకు) లయించునవై యున్నవి. మఱికొన్ని కొలది జన్మలనుండియే సువ్యవస్థితములై యున్నవి. జగద్బ్రహ్మలకు యథార్థముగ భేదములేదు. ఉపాధులవలననే భేదప్రతీతి కలుగుచున్నది.

ఇత్థంజగత్సువివిధేషు విచిత్రరూపా స్తన్యేచ్ఛయా భగవతోవ్యవహారవత్యః
ఆయాంతియాంతి నిపతంతి తథోత్పతంతి రూపశ్రియఃకణఘటాఇవపావకోత్థాః. 32

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
బ్రహ్మణఃసర్వముత్పద్యతఇతి కథనంనామ చతుర్నవతితమః సర్గః ॥ 94 ॥

ఇవ్విధముగ యుపాధిభేదముచే బ్రహ్మాండములందంతట వ్యవహరించుచు జీవజాతులన్నియు, ఈశ్వరేచ్ఛచే గలుగుచు మరల నా సర్వేశ్వరునియందే లయించుచున్నవి. మఱియు నయ్యవి స్వర్గాదులనుండి యధోలోకములకు జనుచు, నరకాదులఁబొందుచు పరిభ్రమించుచున్నవి.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
బ్రహ్మణః సర్వముత్పద్యత ఇతి కథనమను చతుర్నవతితమ సర్గము ॥ 94 ॥

## పంచనవతితమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అభిన్నౌకర్మకర్తారౌ సమమేవపరాత్పదాత్
స్వయంప్రకటతాంయాతౌ పుష్పామోదౌతరోరివ. 1

వసిష్ఠుడు:— ఓ రామా! కర్తయును, క్రియయును, ఏకరూపమేయగును. వృక్షమునుండి పుష్పములును, సుగంధమును. అభిన్నముగనే వ్యక్తమగునట్లు, క్రియాకర్తలు రెండును పరమ పదమగు బ్రహ్మమునుండియే వ్యక్తములయినవి.

సర్వసంకల్పనాముక్తే జీవాబ్రహ్మణినిర్మలే
స్ఫురంతివితతేవ్యోమ్ని నీలమేవాజ్ఞచక్షుషః. 2

ఏ కల్పనయులేని నిర్మలమగు పరబ్రహ్మమందు, ఆకసమున నీలత్వమువలె, (అజ్ఞానదృష్టిచే) జీవత్వము స్ఫురించుచున్నది.

అప్రబుద్ధజనాచారో యత్రరాఘవదృశ్యతే
తత్రబ్రహ్మణఉత్పన్నా జీవాఇత్యుక్తయఃస్థితాః. 3

ఓ రామా! బ్రహ్మమునుండి జీవులుత్పన్న మయ్యెనను అసత్య సిద్ధాంతము అజ్ఞానులుండు తావుననే ప్రబలుచుండును.

సంప్రబుద్ధజనాచారే వక్తుమేతన్నశోభనమ్
యద్బ్రహ్మణఇదంజాతం నజాతంచేతిరాఘవ. 4

జ్ఞానులుండుచోట నిట్టి భ్రాంతవచనములకు తావులేదు. ఏలయన, బ్రహ్మమునుండి జగత్తు గలిగెననుట మిథ్యయేయగును.

కాచిద్వాకలనాయావన్ననీతారాఘవప్రథామ్
ఉపదేశ్యోపదేశశ్రీస్తావల్లోకే న శోభతే. 5

ఓ రామా! (అద్వైతస్థితియందు భేదభావనయే యుండదు గాన) ద్వైతకల్పనయందే ఉపదేశ్య ఉపదేశక భావము శోభించును.

అతోభేదదృశా దీనా మంగీకృత్యోపదిశ్యతే
బ్రహ్మేదమేతే జీవాశ్చ వేతి వాచామయంక్రమః. 6



కాన, భేదదృష్టిచే ననుత్తమమగు ద్వైతకల్పన నంగీకరించి—'ఇది బ్రహ్మము—వీరద్దాని నుండిగల్గిన జీవులు, అని యివ్విధమున నుపదేశింపబడుచున్నది.

ఇతిదృష్టో నిరాసంగాద్బ్రహ్మణోజాయతేజగత్
తజ్జంతదేవ తద్ధేతుగతం దురవబోధతః. 7

ఇట్టి కల్పనాక్రమమే లోకమున గాంచబడుచున్నది. అసంగుడును, అద్వితీయుడునగు బ్రహ్మమునుండి జగత్తుత్పన్నమయ్యెనని తలంచినను, అపుడద్దాని కుపాదాన కారణము బ్రహ్మమే యగును. కాన, జగత్తు బ్రహ్మరూపమేయని సిద్ధించుచున్నది. ఏలయన, ఉత్పత్తికి పూర్వమున జగత్తు తన యుపాదాన కారణమందే యున్నదై, అదేరూపమును పొందియున్నది. ఉత్పత్త్యనంతరము భ్రాంతిచే వేఱుగ గన్పట్టుచున్నది.

మేరుమందరసంకాశా బహవోజీవరాశయః
ఉత్పత్త్యోత్పత్త్యసంలీనా స్తస్మిన్నేవ పరేపదే. 8

మేరు, మందర పర్వతములవలె యనంతములైన జీవరాసులు బ్రహ్మమునుండి యుత్పన్నమగుచు మరల నా పరమపదమగు బ్రహ్మమందే లయించుచున్నవి.

అథానంతాఃస్ఫురంత్యేతే జాయమానాఃసహస్రశః
నానాఃకకుబ్నికుంజేషు పాదపేష్వివపల్లవాః. 9

అంతటను వనవృక్షముల యాకులవలె అనేక సహస్రాకములగు జీవులిపుడును నుత్పన్నమగుచు నేయున్నారు.

జీవౌఘాశ్చోద్భవిష్యంతి మధావివ నవాంకురాః
తత్రైవ లయమేష్యంతి గ్రీష్మేమధురసాఇవ. 10

ఇక భవిష్యత్కాలముననుగూడ వసంతకాలమందలి నూతనాంకురమువలె బ్రహ్మమునుండి యనేక జీవులుత్పన్నమగుదురు. మఱియు గ్రీష్మర్తువునందు వసంతకాల వృక్షరసమువలె నా బ్రహ్మమందే లయమొందుదురు.

తిష్ఠంత్యజస్రం కాలేషు తఏవాన్యేచభూరిశః
జాయంతేచప్రలీయంతే పరస్మిన్జీవరాశయః. 11

ఈ పరబ్రహ్మమందనేక జీవరాసులు త్రికాలములందును యుత్పన్నమగుచు, స్థితిఁబొందుచు, లయించుచునున్నవి.

పుష్పామోదావివాభిన్నౌ పుమాన్కర్మచరాఘవ
పరమేశాత్సమాయాతే తత్రైవ విశతఃశనైః. 12

ఓరామా! పుష్ప సుగంధములవలె పురుష, కర్మలకు భేదములేదు. అయ్యవి పరమాత్మనుండియే యుత్పన్నమై మరల వానినే చేరుచున్నవి.

దృష్టమేతే జగత్యస్మిన్ దైత్యోరగనరామరాః
ఉద్భవంత్యభవా భావైః ప్రస్ఫురంతిపునఃపునః. 13

యథార్థముగ నుత్పన్నము గాకున్నను, దైత్య, నాగ, మనుష్య, దేవతలు వాసనానిర్మితములగు పాంచభౌతికోపాధులతోగూడి మరల మరల జన్మించుచుండుట జగత్తున గాంచబడుచున్నది.

హేతుర్విహరణే తేషామాత్మవిస్మరణాదృతే
నకశ్చిల్లక్ష్యతే సాధో జన్మాంతరఫలప్రదః. 14

సాధువగు నో రామా! ఇట్టి వీరి పరిభ్రమణమునకు ఆత్మస్వరూపవిస్మరణము కాక యొండు కారణము లేదు. మఱియు దీనికన్యముగ జన్మాంతరమునను మఱియే ఫలదాతయును లేదు.

శ్రీరామ ఉవాచ:—

అవిసంవాదినార్థే యద్యత్ప్రామాణికదృష్టిభిః
వీతరాగైర్వినిర్ణీతం తచ్ఛాస్త్రమితికథ్యతే. 15

శ్రీరాముడు:.... ఓ మునీంద్రా! అలౌకికములగు ధర్మ వ్రతాది విషయములందు వేదములే ప్రమాణములు. అట్టి వేదములందలి సత్యముల నెఱింగిన మహాత్ములగు వీతరాగులైన మన్వాదులు ధర్మాధర్మములగూర్చి నిర్వివాదముగను, వేదసమ్మతముగను నిర్ణయించిరి. మఱియు స్మృతి, పురాణ, కల్పసూత్రేతిహాసాదుల లిఖించిరి. వాటినే శాస్త్రములందురు. అనగా యలౌకిక విషయములందు శ్రుతి స్మృత్యాదులే ప్రమాణములుగదా!

మహాసత్త్వగుణోపేతా యేధీరాః సమదృష్టయః
అనిర్దేశ్యకలోపేతాః సాధవస్త ఉదాహృతాః. 16

విశుద్ధ సత్త్వగుణోపేతులును, ధీరులును (విషయ, దుఃఖాదులచే చలింపనివారు), సమదృష్టి గలవారును, అవర్ణనీయమగు యానంద మనుభవించువారును, బ్రహ్మసాక్షాత్కారముగలవారును సాధువులనంబడుదురు.

ద్వయంహి దృష్టిర్బాలానాం సిద్ధయే సర్వకర్మణామ్
సాధువృత్తం తథా శాస్త్రం సర్వదైవానువర్తతే. 17

ఇట్టిసాధువులగు మహాత్ముల యాచరణ, మఱియు శ్రుతిస్మృత్యాది శాస్త్రములు - ఈ రెండును తత్త్వజ్ఞానానుభవము లేనివారలకు నేత్రముల వంటివి. అనగా వీటిచేతనే ధర్మమును, బ్రహ్మతత్త్వమును నెఱుంగగలరు. వీటిననుసరించియే సర్వ కార్యములును జరుపబడును.

సాధునం వ్యవహారార్థం శాస్త్రం యోనానువర్తతే
బహిః కుర్వంతితం సర్వే సచదుఃఖే నిమజ్జతి. 18

సాధువుల యుత్తమ యాచరణను దెల్పునట్టి శాస్త్రములననుసరించి వర్తింపనివానిని శిష్టులగువారు బహిష్కరింతురు, మఱియు నాతడు దుఃఖమునే పొందును.

ఇహలోకేచ వేదేచ శ్రుతిరిత్థం సదా ప్రభో
యథాకర్మచ కర్తాచ పర్యాయేణేహ సంగతౌ. 19

ఓ మహాత్మా! కర్మ, కర్తలు రెండును యొకదానిచే మఱియొకటి గలుగుచున్నవనుట లోకమునను వేదములందును ప్రసిద్ధమేయున్నది.



కర్మణా క్రియతే కర్తా కర్త్రా కర్మ ప్రణీయతే
బీజాంకురాదివన్న్యాయో లోకవేదోక్తపవసః. 20

కర్మచే కర్తయేర్పడును; కర్త, కర్మను సిద్ధింపజేయును. ఇట్లు, కర్మ కర్తల విషయమై వేదోక్తమును, లోకప్రసిద్ధమునగు బీజాంకురన్యాయమే చెప్పబడుచున్నది.

కర్మణో జాయతే జంతుర్బీజాదివ నవాంకురః
జంతోః ప్రజాయతే కర్మ పునర్బీజమివాంకురాత్. 21

బీజమునుండి నూతనాంకురమువలె కర్మచే జీవుడుత్పన్నమగుచున్నాడు. మరల అంకురమునుండి బీజమేర్పడునట్లు, జీవునినుండి కర్మ యుద్భవించుచున్నది.

యయావాసనయా జంతుర్నీయతే భవపంజరే
తద్వాసనానురూపేణ ఫలంసమనుభూయతే. 22

జీవుడే వాసనలు గల్గియుండి సంసార పంజరమున త్రోయబడుచున్నాడో, అట్టి వాసనల ననుసరించియే ఫలానుభవమును పొందును.

ఏవంస్థితే కథంనామ జన్మబీజేన కర్మణా
వినోత్పత్తిస్త్వయా ప్రోక్తా భూతానాం బ్రహ్మణః పదాత్. 23

అట్టైన జన్మకు బీజభూతమగు కర్మ లేకయే బ్రహ్మమునుండి జీవులుత్పన్నమైరని మీరేల వచించితిరి? (అట్లు చెప్పుట 'సాధుకారీసాధుభవతి' పాపకారీ పాపోభవతి పుణ్యోవై పుణ్యేన కర్మణా భవతిపాపః పాపేన కర్మణా జాయతే' - ఇత్యాది శ్రుతివాక్యములకు విరుద్ధము గదా!)

పక్షేణానేన భగవన్భవతా జన్మకర్మణోః
తిరస్కృతా జగజ్జాతా సాఽవినాభావితైతయోః. 24

కర్తయు, కర్మయు, కూడియే ఉత్పన్నమగుననుపక్షమవలంబించి జన్మ కర్మల పరస్పర హేతుఫలరూపమగు యీ జగత్తు అన్వయ వ్యతిరేకములచే ప్రసిద్ధముగదా! అద్దానిని మీరేల తిరస్కరించితిరి?

బ్రహ్మణ్యకారణే బ్రహ్మన్ బ్రహ్మాదిషు ఫలేషుచ
కర్మణాం ఫలమస్తీతి ద్వయం లోకే ప్రమార్జితమ్. 25

మాయాసహితుడును, కారణరహితుడును నగు బ్రహ్మమందు, ఆకాశాది స్థూల దేహ పర్యంతము గల భోగ్యజాతమును, చతుర్ముఖ బ్రహ్మ మొదలుకొని స్థూల సూక్ష్మోపాధి రూపములగు ఫలానుభవమును, సృష్టిరూప ఫలమేయగునుగదా! అట్టిచో ప్రసిద్ధములగు యీ రెండు విషయములను మీరేల యుపేక్షించితిరి?

సంజాతే సంకరే లోకే కర్మస్వఫలదాయిషు
మాత్స్యన్యాయే విలసతి నాశఏవావశిష్యతే. 26

కర్మ నిష్ఫలమైనచో నపుడు నరకాదులగూర్చిన భయము లేకపోవుటచే, లోకసాంకర్యమేర్పడ, మత్స్యన్యాయము (బలవంతమగు మత్స్యము బలహీనమైన వాటిని మ్రింగుట. అనగ యొకరి నొకరు వధించుకొనుట) ప్రబల, సర్వనాశనము చేకూరునుగదా!

కింతత్కృతంభవత్యేవ భగవన్నాహితత్త్వతః
ఏనంమేసంశయంస్ఫారం ఛింధివేద్యవిదాంవర. 27

వేదవిద్వరేణ్యా! చేయబడిన కర్మ ఫలవంతమగునా, కాదా! యను విషయమునుగూర్చి బాగుగదెల్పి నా గొప్పసంశయమును దొలగింపుడు.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

సాధురాఘవపృష్టోఽస్మి త్వయాప్రశ్నమిమంశుభమ్
శృణువక్ష్యామి తేయేన భృశంజ్ఞానోదయోభవేత్. 28

వసిష్ఠుడు :—ఓ రామా ! నీవుత్తమ ప్రశ్న గావించితివి. ప్రత్యుత్తరించెద వినుము. దీనిచే నీకు విశేషజ్ఞానము కలుగగలదు.

మానసోఽయంసమున్మేషః కలాకలనరూపతః
ఏతత్తత్కారణాంబీజం ఫలమస్యైవవిద్యతే. 29

మనస్సంబంధమగు క్రియయే కర్మలకు బీజము. దీనికే ఫలము గలుగును.

యదైవహిమనస్తత్త్వ ముత్థితం బ్రహ్మణఃపదాత్
తదైవకర్మజంతూనాం జీవోదేహతయాస్థితః. 30

ప్రథమ సృష్టియందు పరబ్రహ్మనుండి మనోరూప మావిర్భవించినది. అపుడే యట్టిమనోరూపోపాధిచే గల్గిన సమష్టి వ్యష్టిజీవుల కర్మయు ప్రకటితమయ్యెను. మఱియు జీవులు పూర్వకల్ప వాసనానుసారము దేహమందహంభావము గల్గియుండిరి.

కుసుమాశయయోర్భేదో నయథాభిన్నయోరిహ
తథైవకర్మమనసోర్భేదో నాస్త్యవిభిన్నయోః. 31

పుష్ప సుగంధములు రెండును భిన్నముగానట్లు మనఃకర్మలు రెండును అభిన్నముగనే యుండును. వాటియందు భేదములేదు.

క్రియాస్పందో జగత్యస్మిన్ కర్మేతికథితోబుధైః
పూర్వంతస్యమనోదేహం కర్మాతశ్చిత్తమేవహి. 32

క్రియాస్ఫురణమునే విజ్ఞులు కర్మయందురు. సంస్కారరూపమగు మనస్సే యట్టి కర్మకాశ్రయము. కాన కర్మయే మనస్సు.

నసశైలోనతద్వ్యోమ నసోఽబ్ధిశ్చనవిష్టపమ్
అస్తియత్రఫలంనాస్తి కృతానామాత్మకర్మణామ్. 33

పర్వతముపైనగాని, ఆకాశమునగాని, సముద్రమునగాని, స్వర్గమునగాని—యెచట నున్నను కర్మఫలము కలుగక మానదు.

ఐహికంప్రాక్తనంవాపి కర్మయద్రచితంస్ఫురత్
పౌరుషోఽసౌపరోయత్నో నకదాచననిష్ఫలః. 34



ఈ జన్మమునగాని, లేక పూర్వ జన్మమునగాని యొనర్చబడిన కర్మయే పురుషప్రయత్నము. అట్టి యుత్తమ పురుష ప్రయత్న మెన్నటికి నిష్ఫలముకానేరదు. (అవిద్యచే గలిగిన మనస్సే క్రియావంతమైనది, మరియా నది చిదాత్మ కుపాధియగుటచే కర్తయు భోక్తయుకూడ నగును. కాన కృతహానము (చేయబడిన కర్మ నశించుట), అకృతాభ్యాగమము (చేయబడనిదాని ఫలము గలుగుట), శాస్త్రప్రమాణ విరోధము, మత్స్యన్యాయ ప్రసక్తి — ఇత్యాది దోషములు కలుగజాలవు.

కృష్ణతాసంక్షయేయద్వత్క్షీయతే కజ్జలంస్వయమ్
స్పందాత్మకర్మవిగమే తద్వత్ప్రక్షీయతేమనః. 35

నలుపుదనమే లేనిచో కాటుకయే యుండనట్లు, గతిశీలమగు కర్మనశించిన, కర్మరూపమగు మనస్సును స్వయముగ శాంతించును.

కర్మనాశేమనోనాశో మనోనాశోహ్యకర్మతా
ముక్తస్యైషభవత్యేవ నాముక్తస్యకదాచన. 36

కర్మ నాశనమే మనోనాశము. మనస్సు నశించుటయే కర్మ సంక్షయము. ఇట్టి మనోనాశము ముక్తులకే గల్గును గాని బద్ధులగు అజ్ఞానులకు గలుగదు.

వహ్న్యౌష్ణ్యయోరివసదా శ్లిష్టయోశ్చిత్తకర్మణోః
ద్వయోరేకతరాభావే ద్వయమేవవిలీయతే. 37

అగ్ని యుష్ణత్వములవలె నెల్లప్పుడును కలసియేయుండు చిత్తకర్మలలో నొకటి నశించిన, రెండును నశించును.

చిత్తంసదాస్పందవిలాసమేత్య స్పందైకరూపంననుకర్మవిద్ధి
కర్మాథచిత్తంకిలధర్మకర్మపదంగతేరామపరస్పరేణ. 38

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే దేవదూతోక్తే
మోక్షోపాయే ఉత్పత్తిప్రకరణే కర్మపురుషయోరైక్యప్రతి
పాదనం నామ పంచనవతితమః సర్గః ॥ 95 ॥

ఓ రామా ! చిత్తము స్ఫురణరూపమును బొంది, విహిత నిషిద్ధ కర్మలద్వారా, పుణ్యాపాప, ధర్మాధర్మ రూపములఁ బరిణమించుచున్నది. కర్మయు, దాని ఫల భోగానుసారముగ స్ఫురణ (చలన) రూపమును బొంది చిత్తమగు చున్నది. కాన, ఈ రెండును పరస్పర మొకదానికొకటి కారణభూతమై లోకమున వర్తించుచు, చిత్తకర్మలను రెండు నామములచేతను వ్యవహరింప బడుచున్నవి.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
కర్మ పురుషయోరైక్యప్రతిపాదనమను పంచనవతితమ
సర్గము ॥ 95 ॥

———:o:———

# షణ్ణవతితమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

మనోహిభావనామాత్రం భావనాస్పందధర్మిణీ
క్రియాతద్భావితారూపం ఫలంసర్వోఽనుధావతి. 1

వసిష్ఠుడు:— ఓ రామా! మనస్సు భావనా మాత్రమే. భావనయు చలన స్వభావముగలది. ఈ మనస్సుచేతనే విహిత నిషిద్ధ కర్మలాచరింపబడుచున్నవి. సూక్ష్మములగుటచే నదృష్ట రూపమును బొందిన క్రియల (సంస్కారములులేక సూక్ష్మవాసనలు)చే జన్మాంతరాది భావికాల ఫలములను జీవులందఱును అనుసరించుచున్నారు.

శ్రీ రామ ఉవాచ:—

విస్తరేణమమబ్రహ్మన్ జడస్యాప్యజడాకృతేః
రూపమారూఢసంకల్పం మనసోవక్తుమర్హసి. 2

శ్రీరాముడు:— ఓ మునీంద్రా! జడచైతన్య రూపములుగల మనస్సుయొక్క దృఢ సంకల్పాత్మక స్వరూపమును విపులముగ దెలియజేయుడు"

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అనంతస్యాత్మతత్త్వస్య సర్వశక్తేర్మహాత్మనః
సంకల్పశక్తిరచితం యద్రూపంతన్మనోవిదుః. 3

వసిష్ఠుడు:— ఓ రామా! అనంతుడును, సర్వశక్తిమంతుడును, మాయావేష్టితుఁడును నగు పరమాత్మచే, సంకల్పాత్మకమగు యే రూపము ప్రథమమున గల్పింపబడెనో, అదియే మనస్సన బడును.

భావఃసదసతోర్మధ్యే నృణాంచలతియశ్చయః
కలనోన్ముఖతాంయాతస్తద్రూపంమనసోవిదుః. 4

(ఇది స్థాణువా, పురుషుడాయను) వికల్పాత్మక వ్యవహారములందు, సదసత్తుల రెంటిమధ్య నున్నదియు రెంటియొక్క స్మృతి రూపమును బొందియుండునదియునగు భావమే మనస్సని చెప్ప బడును.

నాహంవేదావభాసాత్మా కుర్వాణోఽస్మీతినిశ్చయః
తస్మాదేకాంతకలనస్తద్రూపంమనసోవిదుః. 5

చిద్రూపమై భాసించు ఆత్మయందు 'నేనెఱుంగను' ను ప్రతీతియు, అకర్తయందు కర్తయను వ్యవహారమును దేనిచే గలుగుచున్నవో, అదియే మనస్సు.

కల్పనాత్మికయా కర్మశక్త్యావిరహితంమనః
నసంభవతిలోకేఽస్మిన్ గుణహీనోగుణీయథా. 6

గుణరహితుడగు గుణి యుండనట్లు, జగత్తున స్పందస్వభావముగల కల్పనాత్మకమగు కర్మశక్తి లేకయే మనస్సుండుట సంభవింపదు.



యథావహ్న్యౌష్ణ్యయోఃసత్తా నసంభవతిభిన్నయోః
తథైవకర్మమనసోస్తథాత్మమనసోరపి. 7

అగ్ని యుష్ణత్వములు భిన్నములుగా నుండుటెట్లు ఘటస్థింపదో, అట్లనే కర్మమనంబులును, మనోజీవులును వేర్వేఱుగా నుండజాలవు.

స్వేనైవచిత్తరూపేణ కర్మణాఫలధర్మిణా
సంకల్పైకశరీరేణ నానావిస్తరశాలినా. 8
ఇదంతతమనేకాత్మ మాయామయమకారణమ్
విశ్వంవిగతవిన్యాసం వాసనాకల్పనాకులమ్. 9

ఫలధర్మిణియగు సంకల్పమే శరీరముగ గలదియు, అనేకవిధములుగ విస్తరించుచున్నదియు, మాయామయమును, కారణరహితమును, వివిధ రచనాయుక్తమును, వాసనాయుతమును నగు చిత్తము చేతనే ఈ జగత్తంతయు వ్యాప్తమైయున్నది.

యాయేనవాసనాయత్ర సతేవారోపితాయథా
సాతేనఫలసూస్తత్ర తదేవప్రాప్యతేతథా. 10

ఎవడెచట యేరూపమున నున్నట్లు కల్పనచేయునో, యా కల్పన ననుసరించి ఫలస్వరూపముగ నట్టిరూపమునే నాతడు పొందును.

కర్మబీజం మనస్పందః కథ్యతేఽథానుభూయతే
క్రియాస్తువివిధాస్తస్య శాఖాశ్చిత్రఫలాస్తరోః. 11

వాసనావృక్షమునకు కర్మయే బీజము. మనోగతియే శరీరము. చిత్రవిచిత్రములగు వివిధ క్రియలన్నియును శాఖలు. అనుభూతమగు క్రియాఫలములే ఫలములు. ఇవ్విధంబున శాస్త్రము లందు వచింపబడినది.

మనోయదనుసంధత్తే తత్కర్మేంద్రియవృత్తయః
సర్వాఃసంపాదయంత్యేతాస్తస్మాత్కర్మమనఃస్మృతమ్. 12

మనస్సు చింతించుదానినే కర్మేంద్రియము లొనర్చునుగాన మనస్సే కర్మయనఁదగును.

మనోబుద్ధిరహంకారశ్చిత్తంకర్మాథకల్పనా
సంసృతిర్వాసనావిద్యా ప్రయత్నఃస్మృతిరేవచ. 13
ఇంద్రియంప్రకృతిర్మాయా క్రియాచేతీతరాఅపి
చిత్రాఃశబ్దోక్తయోబ్రహ్మన్సంసారభ్రమహేతవః. 14
కాకతాలీయయోగేన త్యక్తస్ఫారదృగాకృతేః
చితేశ్చేత్యానుపాతిన్యాః కృతాఃపర్యాయవృత్తయః. 15

మనస్సు, అహంకారము, చిత్తము, కర్మము, కల్పన, సంసృతి, వాసన, విద్య, ప్రయత్నము స్మృతి, ఇంద్రియములు, ప్రకృతి, మాయ, క్రియలను ఈ పదములైదును, మఱియు దృశ్య ప్రసక్తిఁజెందిన

యితర విచిత్ర శక్త్యోస్తులును, కాకతాళీయ యోగముచే నకస్మాత్తుగ స్వస్వరూపమును మఱచిన యపరిచ్ఛిన్న చిదేకరూపుడగు పరబ్రహ్మముయొక్క, అనగా బాహ్య విషయోన్ముఖమైన చిత్-శక్తియొక్క నామాంతరములే యగును.

పరాయాఃసంవిదో బ్రహ్మన్నేతాఃపర్యాయవృత్తయః
కల్ప్యమానవిచిత్రార్థాః కథంరూఢిముపాగతాః. 16

శ్రీరాముడు:—ఓ మునీంద్రా శుద్ధచైతన్యముయొక్క ఈ విచిత్రకాల్పనిక పర్యాయవృత్తులెట్లు రూఢిని బొందినవి?

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

గతేవ సకలంకత్వం కదాచిత్కల్పనాత్మకమ్
ఉన్మేషరూపిణీ నానా తదైవహిమనఃస్థితా. 17

వసిష్ఠుడు:— ఓ రామా! శుద్ధచైతన్య మెప్పుడవిద్యచే కలుషితమైనట్లున్నదై, స్ఫురణరూపముగల్గి వికల్పములచే ననేకరూపములఁజెందునో అపుడయ్యది మనస్సని పేర్కొనబడును.

భావనామనుసంధానం యదానిశ్చిత్యసంస్థితా
తదైషాప్రోచ్యతేబుద్ధి రియత్తాగ్రహణక్షమా. 18

పదార్థముల పూర్వోత్తర వికల్పములను నిశ్చయించుచు, 'ఈవస్తువిట్లనే యున్నదా'నునట్టి విశేషరూపమును గ్రహింప సమర్థమెపుడగునో, అపుడది బుద్ధియనఁబడును.

యదామిథ్యాభిమానేన సత్తాంకల్పయతిస్వయమ్
అహంకారాభిమానేన ప్రోచ్యతే భవబన్ధనీ. 19

మిథ్యయగు దేహమందాత్మాభిమానముగల్గి, సత్తనుగూర్చిన కల్పనయెపుడు స్వయముగనొనర్చుచున్నదో, అపుడహంకరించు నదగుటచేనది అహంకారమని పిలువబడుచున్నది. ఈ యహంకారమే లోకమున సర్వానర్థములకును కారణమగుటచే బంధహేతువగును.

ఇదంత్వక్త్వేదమాయాతి బాలవత్పేలవాయదా
విచారంసంపరిత్యజ్య తదాసాచిత్తముచ్యతే. 20

విచారణచేయకయే, ఒక విషయమును త్యజించి మఱియొక దానిని స్మరించునపుడు చిత్తమనఁబడుచున్నది.

యదాస్పందైకధర్మత్వా త్కర్తుర్యాశూన్యశంసినీ
ఆధావతిస్పందఫలం తదాకర్మేత్యుదాహృతా. 21

ఆ చైతన్యము స్పందన (చలన) మే ముఖ్యధర్మముగా గల్గియుండు నపుడసద్వస్తువునే గోచరింపఁజేయుచు, స్పందరూప ఫలమగు కర్తయొక్క శరీరావయవాదులను దేశాంతరమునకు చేర్చుటకై ప్రవృత్తమగునపుడు కర్మయనియు చెప్పబడును.



కాకతాలీయయోగేన త్యక్త్వైకఘననిశ్చయమ్
యదేహితం కల్పయతి భావంతేనేహాకల్పనాః 22

ఆకస్మికముగ తన పూర్ణస్వరూపమును త్యజించి, అభిలషిత పరిచ్ఛిన్నభావము నెపుడు కల్పించునో, అపుడా చిద్వస్తువు కల్పనయనఁబడును.

పూర్వదృష్టమదృష్టంవా ప్రాగ్దృష్టమితినిశ్చయైః
యదైవేహాం విధత్తేఽంత స్తదాస్మృతిరుదాహృతా. 23

పూర్వ దృష్టములును, అదృష్టములు లేక ప్రాగ్దృష్టములునగు నిశ్చయములచే నంతఃకరణమున చేష్టితమగు నపుడది సంస్మృతి యనఁబడును.

యదాపదార్థశక్తీనాం సంభుక్తానామివాంబరే
వసత్యస్తమితాన్యేహా వాసనేతి తదోచ్యతే. 24

అనుభవించిన పదార్థములయొక్క సూక్ష్మశక్తులుగల్గి భావనారూపమున యాకాశమువలె సూక్ష్మమై, సూక్ష్మ చేష్టాసహితమై యుండునపుడా చైతన్యమే వాసనయని చెప్పబడును.

అస్త్యాత్మతత్త్వంవిమలం ద్వితీయాదృష్టిరంకితా
జాతాహ్యవిద్యమానైవ తదావిద్యేతికథ్యతే. 25

శుద్ధమగు ఆత్మతత్త్వమొక్కటియే సత్యమైనది. ద్వైతదృష్టి అవిద్యచే గల్గినది. యథార్థముగ దృశ్యప్రతీతి త్రికాలములందును సత్యముగాదు. ఇట్టి జ్ఞానరూపమున బ్రకాశించునపుడా సంవిదాత్మయే విద్యయని పేర్కొనబడును.

స్ఫురత్యాత్మవినాశాయ విస్మారయతితత్పదమ్
మిథ్యావికల్పజాలేన తన్మలం పరికల్ప్యతే. 26

ఆత్మను మఱుగుపఱచి, యద్దానిని విస్మరింపజేయు నపుడావరణశక్తి ప్రాధాన్యత్వముచే మలమనియు, మిథ్యారూప వికల్పములచే పలువిధవిక్షేపములఁ గల్గజేయునపుడు విక్షేపశక్తి ప్రాధాన్యత్వమున విస్మృతియనియు, అయ్యది వ్యవహరింపబడును.

శ్రుత్వాస్పృష్ట్వాచ దృష్ట్వాచ భుక్త్వాఘ్రాత్వావిమృశ్యచ
ఇంద్రమానందయత్యేషా తేనేంద్రియమితిస్మృతమ్. 27

మనోరూపమును బడసిన చైతన్యము వినుచు, స్పృశించుచు, చూచుచు, ఆస్వాదించుచు, మూర్కొనుచు, సంకల్పించుచు ఇట్లు సర్వేంద్రియములచే భోగానుభవకార్యములఁ గావించుచు, తద్ద్వారా జీవత్వమునుబొందిన యింద్రుడను పేరుగల పరమేశ్వరుని తృప్తిపఱచుటచే యింద్రియమనంబడుచున్నది.

సర్వస్యదృశ్యజాలస్య పరమాత్మన్యలక్షితే
ప్రకృతత్వేన భావానాం లోకేప్రకృతిరుచ్యతే. 28

దృశ్యముచే నలక్షితమగు పరమాత్మయందు యుపాదానముకంటె నన్యముగాని కర్తృరూపత్వము (కారణత్వము) గల్గియుండుటచే నది ప్రకృతియనఁ బడుచున్నది.

సదసత్త్వాంనయత్యాశు సత్తాంవా సత్త్వమంజసా
సత్తాసత్తావికల్పోఽయం తేనమాయేతికథ్యతే. 29

సత్యమును మిథ్యగను, మిథ్య (దేహాదుల) ను సత్యముగను దోపింపజేయునదగుటచే, అనగా సత్యాసత్య వికల్పమునకు హేతువగుటచే, చైతన్యమే మాయయని చెప్పబడుచున్నది.

దర్శనశ్రవణస్పర్శ రసనఘ్రాణకర్మభిః
క్రియేతికథ్యతేలోకే కార్యకారణతాంగతా. 30

దర్శన, శ్రవణ, స్పర్శన, రసన, ఘ్రాణాది కర్మలచే లోకమున కార్యకారణ రూపత్వ మొందుటచే నది క్రియయనఁబడుచున్నది.

చితేశ్చేత్యానుపాతిన్యా గతాయాఃసకలంకతామ్
ప్రస్ఫురద్రూపధర్మిణ్యా ఏతాఃపర్యాయవృత్తయః. 31

ఓ రామా! ఇవన్నియు చేత్యో (విషయ) న్ముఖమును అవిద్యచే మలినమై స్ఫురణరూప ధర్మము బొందినట్టియునగు చైతన్యముయొక్క నామాంతరములు.

చిత్తతాముపయాతాయా గతాయాఃప్రకృతంపదమ్
స్వైరేవసంకల్పశతై ర్భృశంరూఢిముపాగతాః. 32

చిత్తరూపత్వము జెంది తద్ద్వారా సంసారబంధమున తగుల్కొనిన చైతన్యముయొక్క ఈ వివిధ నామాంతరములన్నియు క్రమముగ రూఢి గాంచెను.

చేతనీయకలంకాంకా జాడ్యజాలానుపాతినీ
సంఖ్యావిభాగకలనా స్వవైకల్యాకులేవచిత్. 33
జీవఇత్యుచ్యతేలోకే మనఇత్యపికథ్యతే
చిత్తమిత్యుచ్యతేసైవ బుద్ధిరిత్యుచ్యతే తథా. 34

'నేనజ్ఞుడను'నట్టి అనుభవయోగ్యమగు దోషముచేగాని, లేక విషయములవలన ప్రాప్తించిన ద్వైతవాసనాకళంకసన్నిధానవశముచే గాని పూర్ణమగు స్వస్వరూపమునుండి తొలగి, వివిధ కల్పనలతో గూడి జడమగు దేహాదులవైపున కభిముఖమైన చిద్వస్తువే జీవుడు, మనస్సు, చిత్తము, బుద్ధి, అని పలువిధముల జెప్పఁబడుచున్నది.

నానాసంకల్పకలిలం పర్యాయనిచయంబుధాః
వదంత్యస్యాఃకలంకిన్యాశ్చ్యుతాయాః పరమాత్మనః. 35

పరమాత్మ పదమునుండి తొలగి అవిద్యచే కళంకితమైనట్టి ఈ చైతన్యమునే ఆయా ప్రకటిత వృత్తులననుసరించి వివిధనామంబులచే పండితులు పేర్కొనుచున్నారు.

శ్రీరామ ఉవాచః—

మనఃకింస్యాజ్జడంబ్రహ్మం స్తథావాపిచచేతనమ్
ఇత్యేకోమమతత్త్వజ్ఞ నిశ్చయోఽంతర్నజాయతే. 36



శ్రీరాముడు:— ఓ మునీంద్రా! సర్వజ్ఞా! ఈ మనస్సు జడమా లేక చేతనమా? ఈ మనోరూపమునుగూర్చిన నిశ్చయము నాకు గలుగుటలేదు.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

మనోహినజడంరామ నాపిచేతనతాంగతమ్
మ్లానాఽజడా తదాదృష్టిర్మనఇత్యేవకథ్యతే. 37

వసిష్ఠుడు:— ఓ రామా! ఈ మనస్సు జడముకాదు, చేతనముకాదు. అది ఉభయ (చిదచిత్) రూపమగుటచే, జడచేతనములలో నేదియుఁగాదు. యథార్థముగ 'మన్వానోమనః' (మననశక్తి నిచ్ఛగించును ఆత్మమనస్సాయెను) అను శ్రుతివాక్యమునుబట్టి, సంసారదశయందుపాధి దోషముతో గూడిన చైతన్యమే మనస్సనఁబడును.

మధ్యేసదసతోరూపం ప్రతిభాతంయదావిలమ్
జగతఃకారణం నామ తదేతచ్చిత్తముచ్యతే. 38

మనస్సు సదసత్తుల మధ్యనుండునది (అనగా సదసద్విలక్షణమైనదని భావము). జగత్కారణభూతమును, ఉపాధిభేదముచే భిన్నముగానున్నదియు, అవిద్యచే కళంకితమునునగు రూపమే చిత్తమనంబడును.

శాశ్వతేనైకరూపేణ నిశ్చయేనవినాస్థితిః
యేనసాచిత్తమిత్యుక్తా తస్మాజ్జాతమిదంజగత్. 39

లేక, ఆత్మనుగూర్చిన నిశ్చయము (ఆత్మజ్ఞానము) లేమి గల్గుస్థితియే చిత్తమనిచెప్పవచ్చును. అట్టి చిత్తముచేతనే ఈ జగత్తంతయునుత్పన్నమైనది.

జడాజడదృశోర్మధ్యే దోలారూపంస్వకల్పనమ్
యచ్చితోమ్లానరూపిణ్యా స్తదేతన్మనఉచ్యతే. 40

లేక, మలినోపాధిని బడసిన చైతన్యముయొక్క జడచేతనములమధ్యగల స్వీయకల్పిత చంచలరూపమే మనస్సనందగును.

చిన్నిస్పందోహిమలినః కలంకవికలాంతరమ్
మనఇత్యుచ్యతేరామ నజడంనచచిన్మయమ్. 41

ఓ రామా! మలినోపాధిసంబంధముచే చంచలభావయుక్తమును, ఆవరణరాహిత్యముచే కళంకవర్జితమునునగు చిద్వస్తురూపమే మనస్సు, అది జడముకాదు. చైతన్యముగాదు. చిజ్జడవిలక్షణమైనది.

తస్యేమాని విచిత్రాణి నామానికలితాన్యలమ్
అహంకారమనోబుద్ధి జీవాద్యానీతరాణ్యపి. 42

ఈ మనంబునే అహంకారమనియు, బుద్ధియనియు, జీవుడనియు నందురు. ఇంకను విచిత్రములగు పేర్లనేకములు దానికిఁగలవు.

యథాగచ్ఛతిశైలూషో రూపాణ్యలంతథైవహి
మనోనామాన్యనేకాని ధత్తేకర్మాంతరంవ్రజేత్. 43

నటుఁడనేక వేషములు క్రమముగ నెట్లుధరించునో, అట్లే మనస్సును క్రియాభేదములచే ననేక నామములఁ గలదగుచున్నది.

చిత్రాధికారవశతో విచిత్రావిక్రుతాభిధాః
యథాయాతినరః కర్మవశాద్యాతితథామనః. 44

అధికారభేదముచే నొకఁడే పలువిధములఁ బిలువఁబడునట్లు, కర్మభేదముచే మనస్సును అనేక నామంబుల గల్గియున్నది.

యాఏతాఃకథితాఃసంజ్ఞా మయారాఘవచేతసః
ఏతాఏవాన్యథాప్రోక్తా వాదిభిఃకల్పనాశతైః. 45

ఓ రామా! ఇవ్విధముగ చిత్తముయొక్క వివిధసంజ్ఞలను నీకతెలిఁగించితిని. వీనినే, భిన్నభిన్న మతవాదులు కల్పనాభేదములచే పెక్కురీతులుగ వచించిరి.

స్వభావాభిమతాంబుద్ధి మారోప్యమనసాకృతాః
మనోబుద్ధీంద్రియాదీనాం విచిత్రానామరీతయః. 46

కుతర్కములచే వారివారి కభిమతములగు అణుత్వద్రవత్వాది ధర్మములను మనస్సునందారోపించి తమబుద్ధిననుసరించి, మనోబుద్ధీంద్రియములఁగూర్చిన సంజ్ఞాభేదమును వారు విచిత్రముగ నొనర్చిరి.

మనోహిజడమన్యస్య భిన్నమన్యస్యజీవతః
తథాహంకృతిరన్యస్య బుద్ధిరన్యస్యవాదినః. 47

ఈ మనస్సు ఒకని మతానుసారము జడమును, మఱియొకని మతానుసారము జీవునకు భిన్నమును యగుచున్నది. ఇట్లే అహంకార, బుద్ధులుగూడ యొకని మతమందొక విధముగను, మఱియొకని మతమందు మఱియొక విధముగను చెప్పబడుచున్నవి.

అహంకారమనోబుద్ధి దృష్టయఃసృష్టికల్పనాః
ఏకరూపతయాప్రోక్తా యామయారఘునందన. 48

ఓ రామా! సంకల్పాది వృత్తిభేదముచే అహంకార మనోబుద్ధులనునట్టి యీసృష్టి కల్పనలన్నియును, అంతఃకరణముయొక్క ఏకత్వముచే నొకేరూపమని నామతము.

నైయాయికైరితరథా తాదృశైఃపరికల్పితాః
అన్యథాకల్పితాఃసాంఖ్యై శ్చార్వాకైరపిచాన్యథా. 49

జైమినీయైశ్చార్హతైశ్చ బౌద్ధైర్వైశేషికైస్తథా
అన్యైరపి విచిత్రైస్తైః పాంచరాత్రాదిభిస్తథా. 50



ఈ మనోబుద్ధ్యహంకారములఁగూర్చి గౌతముని యనుయాయులగు నైయ్యాయికులు తమ బుద్ధివికల్పములననుసరించి భిన్నముగ కల్పనజేసిరి — అహంకారమొక ద్రవ్యవిశేషమనియు, జీవుడు విభువనియు, మనస్సణువనియు, ఆత్మ సాక్షాత్కారమందు కరణము, బుద్ధి, ఆత్మగుణము, త్రిక్షణపర్యంతముండుననియు వారు చెప్పుదురు. అట్లే సాంఖ్యులును, చార్వాకులును, భిన్నభిన్నకల్పనల నొనర్చిరి — ఎట్లన, సాంఖ్యులు బుద్ధిని త్రిగుణాత్మకమగు ప్రకృతియొక్క సాక్షాత్కార్యమగు మహత్తత్త్వమనియు, మనస్సు పదునొకండింద్రియముల యంతర్గతమనియు, వచింతురు. ఇక, చార్వాకులు — బుద్ధిశరీరాంతర్గతము; చైతన్యము శరీరముయొక్క గుణము. ఆత్మ అహంకారరూపము; పూర్వాపర విచారమొనర్చునది మనస్సు అని చెప్పుదురు. ఈ విధముగనే జైమినీయ, జైన, బౌద్ధ, వైశేషిక, పంచరాత్రాగమికులును విచిత్రరీతి కల్పనగావించిరి — జైమినీయులు, మనస్సు విభువనియు, జైనులు, జీవుడు శరీరప్రమాణము గలవాడనియు, అర్థప్రఖ్యాతియే బుద్ధియనియు, బౌద్ధులు క్షణికాలయవిజ్ఞానమను బుద్ధితత్త్వమే ఆత్మయనియు బల్కుదురు. అహంకార మనంబులఁగూర్చి వైశేషికులు నైయ్యాయికులవలెనే వచింతురుగాని, బుద్ధియనునది స్మృతి, ప్రత్యక్ష, అనుభావ, తర్క, విపర్యయమను పంచవికల్పములచే పంచవిధములుగ నుండునందురు. పంచరాత్రులు వాసుదేవుఁడను నామముగల పరమాత్మనుండి సంకర్షణుడను జీవుడు గలిగెననియు, అతడే యహంకారమనియు, వానినుండి ప్రద్యుమ్నుడను మనస్సు, అనిరుద్ధుడను బుద్ధి యుదయించెననియు చెప్పుదురు. ఇంకను భోగి, మహేశ్వర, నకులాది పెక్కు మతములుగలవు.

సర్వైరేవచగంతవ్యం తైఃపదంపారమార్థికమ్
విచిత్రందేశకాలోత్థైః పురమేకమివాధ్వగైః. 51

భిన్న భిన్న దేశకాలములందు బయలుదేఱు బాటసారు లొకేనగరమును వేఱు వేఱుగ గాంచునట్లు, పైని దెల్పిన వారందఱును ఒకే పరమాత్మనుగూర్చి వివిధ రీతులఁ దెల్పికొనిరి. (అనగ, వారి వారి బుద్ధి ననుసరించి, అందఱును పరమాత్మ నొక్కనిగూర్చియే వేఱు వేఱుగ నిర్ణయమొనర్చిరని భావము.)

అజ్ఞానాత్పరమార్థస్య విపరీతావబోధతః
కేవలం వివదంత్యేతే వికల్పైరారురుక్షవః. 52

ఆత్మపద మధిష్ఠింపదలఁచిన వీరందఱును పరమార్థమగు బ్రహ్మతత్త్వము నెఱుఁగమిచే, విపరీతజ్ఞాన కారణమున, తమలో తాము వివాద మొనర్చుకొనుచున్నారు.

స్వమార్గమభిశంసంతి వాదినశ్చిత్రయాదృశా
విచిత్రదేశకాలోత్థా మార్గంస్వంపథికాఇవ. 53

భిన్న భిన్న దేశకాలములలో బయలుదేరిన పాంథులవలె, నైయ్యాయికాది మతవాదులు వారివారి మార్గములనే ప్రశంసించుచుందురు.

తైర్మిథ్యారాఘవప్రోక్తాః కర్మమానసచేతసామ్
స్వవికల్పార్పితైరర్థైః స్వాఃస్వావైచిత్రయుక్తయః. 54

ఆయా మతవాదులు, ఫలేచ్ఛచే నట్టి ఫలమునకు సాధనభూతమగు కర్మయందే నాసక్తమగు చిత్తముగలవారై, ఉపనిషత్ప్రమాణమును గైకొనక, కపోల కల్పిత వచనముల వ్యర్థముగ పల్కుచు, విచిత్రములగు యుక్తులఁజూపిరి.

యథైవపురుషః స్నాన దానాదానాదికాః క్రియాః
కుర్వం స్తత్కర్తృవై చిత్ర్య మేతితద్వదిదంమనః. 55

స్నాన, దానాదిక్రియల నొనర్చు మనుజుఁడెట్లాయా కార్యముల ననుసరించి భిన్నరీతులఁ గర్తృత్వమొందునో యట్లనే మనస్సుకూడా బొందును.

విచిత్రకార్యవశతో నామభేదేనకర్తృతా
మనఃసంప్రోచ్యతే జీవ వాసనాకర్మనామభిః. 56

కార్య వైచిత్ర్యము ననుసరించి కర్త భిన్న భిన్నములుగ చెప్పబడుచుండును. అట్లే మనస్సొక్కటియే జీవుఁడనియు, వాసనయనియు, కర్మయనియు బిలువఁబడుచుండును.

చిత్తమేవేదమఖిలం సర్వైర్వానుభూయతే
అచిత్తోహినరోలోకం పశ్యన్నపినపశ్యతి. 57

జీవులచే ననుభవింపబడునదంతయు చిత్తమే యేలయన, చిత్తరహితుఁడు చూచుచున్నను దేనినియును గాంచఁజాలఁడు.

శ్రుత్వాస్పృష్ట్వాచ దృష్ట్వాచ భుక్త్వాఘ్రాత్వాశుభాశుభమ్
అంతర్హర్షంవిషాదంచ సమనస్కోహివిందతి. 58

చిత్తసహితుఁడే శుభాశుభములను వినుచు, స్పృశించుచు, చూచుచు, భుజించుచు, మూర్కొనుచు, యాంతరమున సుఖముగాని, దుఃఖముగాని పొందుచుండును.

ఆలోకఇవరూపాణా మర్థానాంకారణంమనః
బధ్యతే బద్ధచిత్తోహి ముక్తచిత్తోహిముచ్యతే. 59

రూప గ్రహణమునకు ప్రకాశము కారణమైనట్లు సమస్త పదార్థములకును మనస్సు కారణము. ఏలన, బద్ధచిత్తుఁడే బంధమును పొందుచున్నాఁడు. ముక్తచిత్తుఁడే ముక్తిని బడయుచున్నాఁడు.

తజ్జడానాం పరం విద్ధి జడంయేనోచ్యతే మనః
నచావగచ్ఛతి జడం మనోయస్యహిచేతనమ్. 60

మనస్సు జడమని వచించువానిని మూర్ఖునిగ నెంచుము. మనస్సు చేతనమైనచో దానికి జడరూపజ్ఞానమే యుండదు. (మనస్సు జడముగాదు, చేతనముగాదని భావము.)

నచేతనం నచజడం యదిదంప్రోత్థితంమనః
విచిత్రసుఖదుఃఖేహం జగదభ్యుదితంతదా. 61

విచిత్ర సుఖదుఃఖ రూపక్రియలు గలిగిన యీ మనస్సు జడముకాదు, చేతనమునుగాదు. ఎపుడది వ్యక్తమయ్యెనో, అపుడే ఈ జగత్తున్నూ అదేవిధమున (జడచేతన విలక్షణమై) యావిర్భవించినది.



ఏకరూపేహిమనసి సంసారఃప్రవిలీయతే
ఉపావిలంకారణంతై ర్భ్రాంత్యాజగదుపస్థితమ్. 62

మనస్సెయేకరూప మెపుడగునో, అనగా, భ్రాంతిరూపముఁ ద్యజించి బ్రహ్మాకార మెప్పుడగునో, అప్పుడే జగత్తుగూడ నశించును. మలిన జలమువలె నది కలుషితమైనప్పుడు కారణరూపమును బడయును. అట్టి కలుషిత సమష్టిరూప మనంబునుండియే యీ జగత్తంతయు నుత్పన్నమైనది.

అజడంహిమనోరామ సంసారస్యనకారణమ్
జడంచోపలధర్మాపి సంసారస్యనకారణమ్. 63

ఓ రామా! జడత్వరహితమైన మనస్సు బ్రహ్మరూపమే యగుటచే, అయ్యది జగత్కారణము గానేరదు. ఇక శిలవంటి జడరూపమున్నూ కారణము గాఁజాలదు.

నచేతనంనచజడం తస్మాజ్జగతిరాఘవ
మనఃకారణమర్థానాం రూపాణామివభాసనమ్. 64

ఓ రామా! రూపగ్రహణమునకు ప్రకాశము కారణమెట్లగునో, అట్లే జడమును చైతన్యమునుగాని యీ మనస్సు సమస్త పదార్థములకును కారణమగుచున్నది.

చిత్తాదృతేఽన్యద్యదస్తి తదచిత్తస్యకింజగత్
సర్వస్యభూతజాతస్య సమగ్రంప్రవిలీయతే. 65

జీవునకు చిత్తములయించిన, జగత్తున్నూ లయించును. కాన, అచిత్తునకు జగత్తే యుండనేరదు.

నానాకర్మవశావేశా న్మనోనానాభిధేయతామ్
ఏకంవిచిత్రతామేతి కాలోనానాయథర్తుభిః. 66

కాలమొకటే యైనను, ఋతుభేదముచే ననేకరూపముల ధరించునట్లు, ఒకే మనస్సు వివిధ కర్మలచే వివిధనామముల ధరించుచున్నది.

యదినామానమస్కార మహంకారేంద్రియక్రియాః
క్షోభయంతిశరీరం తత్సంతుజీవాదయఃపరే. 67

మనస్సంబంధము లేకయే, అహంకారము, యింద్రియములు, క్రియలును, దేహమును క్షోభపెట్టుచో, అపుడే జీవుఁడు, అహంకారము మున్నగునవి మనస్సునకు వేఱుగావచ్చును. (అనగా నట్లెన్నటికిని సంభవింపదని యర్థము.)

దర్శనేషుతుయేప్రోక్తా భేదామనసితర్కతః
క్వచిత్క్వచిద్వాదకరై రపవాదకరైఃకిల. 68
తేహిరామనబుధ్యంతే విశిష్యంతేనచక్వచిత్
సర్వాహిశక్తయోదేవే విద్యంతే సర్వగాయతః. 69

ఓ రామా! ఏ కుతర్క పరాయణులగు మతవాదులు తమ తమ శాస్త్రములందచ్చటచ్చట దేహ మనోజీవులందు భేదము గల్పించిరో, అట్టివారు నిశ్చయముగ యథార్థవస్తువు నెఱుంగనివారే

యగుదురు. మఱియు వారు వ్యాసాదులచే నుత్తమ శిక్షణను బొందకయు నుండిరి. మనశ్శక్తి సర్వవ్యాపకము గాన, వారి యీ కుతర్కశక్తియు మనస్సను దేవునియందే గలదు.

యద్వైవఖలుశుద్ధాయా మనాగపిహిసంవిదః.
జడేవశక్తిరుదితా తదావైచిత్ర్యమాగతమ్. 70

శుద్ధచైతన్య మందెప్పుడు జడత్వరూపమగు కలుషితశక్తి యుదయించునో, అపుడే ఈ జగద్వైచిత్ర్యమంతయు గలుగును.

ఊర్ణనాభాద్యథాతంతు ర్జాయతేచేతనాజ్జడః
నిత్యప్రబుద్ధాత్పురుషా ద్బ్రహ్మణఃప్రకృతి స్తథా. 71

చేతనమగు ఊర్ణనాభి (సాలీడు) నుండి జడమగు తంతు వుత్పన్నమగునట్లు నిత్య జ్ఞానస్వరూపుడైన పరబ్రహ్మమునుండి మనోరూపమగు ప్రకృతి కలిగినది.

అవిద్యావశతశ్చిత్త భావనాఃస్థితిమాగతాః
చితిపర్యాయశబ్దాహి భిన్నాస్తేనేహవాదినామ్. 72

అవిద్యాకారణముననే యీ మతవాదులందఱి యందును వారివారి భావనయే చిత్తమున స్థిరత్వముఁజెందినది. ఇందుచే వారు జగత్తును, చైతన్యముయొక్క పర్యాయవృత్తులను, చైతన్యముకంటె భిన్నముగ తలంచిరి.

జీవోమనశ్చనను బుద్ధిరహంకృతిశ్చేత్యేవంప్రథాముపగతేయమనిర్మలాచిత్
సైవోచ్యతేజగతిచేతనచిత్తజీవ సంజ్ఞాగణేనకిలనాస్తివివాదపక్షః. 73

ఇత్యార్షే శ్రీ వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
మనఃసంజ్ఞావిచారో నామషణ్ణవతితమః సర్గః ॥ 96 ॥

నిర్మలమగు చైతన్య మొక్కటియే జీవమనో బుద్ధ్యహంకారరూపముల ప్రసిద్ధికెక్కెను. అదియే లోకమున చేతన జీవ చిత్తాది సంజ్ఞలచే బిలువబడుచున్నది. ఈ విషయమున సంశయముగాని వాదముగాని లేదు.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు, ఉత్పత్తిప్రకరణమున
మనః సంజ్ఞావిచారమను షణ్ణవతితమ సర్గము ॥ 96 ॥

## సప్తనవతితమః సర్గః.

శ్రీ రామ ఉవాచ:—

బ్రహ్మన్మనస ఏవేదమంతశ్చాడంబరంస్ఫుతమ్
యత స్తదేవకర్మేతి వాక్యాద్యారాదుపలభ్యతే. 1



శ్రీరాముడు:— ఓ మునీంద్రా! ఈ జగద్వైచిత్ర్యమంతయును మనస్సునుండియే ఆవిర్భవించినదనియు, కాన అంతయును మనఃకల్పితమేయనియు, మీ యభిప్రాయముగదా!

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

దృఢభావోపరక్తేన మనసైవోరరీకృతమ్
మరుచండాతపేనేవ భాస్వరావరణంపునః. 2

వసిష్ఠుడు:— ఓ రామా! మరుభూమియందు ప్రచండ సూర్యతేజముచే నుత్పన్నమైన మృగతృష్ణాజలము, సూర్యప్రకాశము నావరింపగలుగుచున్నదో, అట్లనే జడమగు మనస్సు ప్రకాశవంతమగు ఆత్మనావరింప గల్గుచున్నది. (అనగ, మనస్సుయొక్క జడాంశముచే, ఆత్మ మఱుగుబడ జగత్ప్రతీతి యగుచున్నదని భావము.) ఇవ్విధముగ మనస్సే జగత్తునకు కారణమని నీవెఱింగినది సత్యమే.

బ్రహ్మాత్మనిజగత్యస్మిన్మనఏకాకృతింగతమ్
క్వచిన్నరతయారూఢం క్వచిత్సురతయోత్థితమ్. 3

బ్రహ్మరూపమేయగు ఈ జగత్తున మనస్సే జగదాకృతినిబడసి యొకచోట మనుష్యరూపముగను, మఱియొకచోట దేవతారూపముగను రూఢిని బొందుచున్నది.

క్వచిద్దైత్యతయోల్లాసి క్వచిద్యక్షతయోదితమ్
క్వచిద్గంధర్వతాంప్రాప్తం క్వచిత్కిన్నరరూపిచ. 4

అదియే యింకొకచోట దైత్యరూపమున శోభించుచున్నది; యక్షరూపమున ఉత్పన్నమగుచున్నది; గంధర్వరూపత్వమును బొందుచున్నది; మఱియు కిన్నరరూపమును బడయుచున్నది.

నానాచారనభోభాగ పురపత్తరరూపయా
మన్యేవితతయాకృత్యా మనఏవవిజృంభతే. 5

భిన్న భిన్న యాచారములుగను ఆకాశాది పంచభూతములుగను, గ్రామ నగరాదుల రూపముననను ఈ మనస్సే విస్తరించుచు, తన విశాలరూపమును వ్యక్తమొనర్చుచున్నదని నేనెంచెద.

ఏవంస్థితేశరీరాఖ్య స్తృణకాష్ఠలతోపమః
తద్విచారణయా కోఽర్థో విచార్యంమనఏవనః. 6

అట్లయినచో నిక తృణ కాష్ఠ లతాసదృశమగు స్థూలదేహమునుగూర్చి విచారించుటచే నేమి ప్రయోజనము? మనస్సును గూర్చియే విచారింపవలెనుగదా?.

తేనేదంసర్వమాభోగి జగదిత్యాకులంతతమ్
మన్యేతద్వ్యతిరేకేణ పరమాత్మైవశిష్యతే. 7

సర్వవ్యాపకమగు ఈ జగత్తంతయును మనస్సుచే పూర్ణమైయున్నదిగాన, యట్టి మనస్సును శోధించుటచే కర్తృ కర్మలరూపము లెస్సగ తెలియబడగా నిక పరమాత్మయే శేషించునని నేను తలంచుచున్నాను.

ఆత్మా సర్వపదాతీతః సర్వగః సర్వసంశ్రయః
తత్ప్రసాదేన సంసారే మనో ధావతి వల్గతి. 8

ఆత్మ సర్వవస్తువుల కతీతమును, సర్వవ్యాపియు, సర్వాశ్రయమును నై యున్నది. అద్దాని కృపాతిశయముచేతనే మనస్సు లోకమునం బరువిడుచున్నదై పలువిధముల విజృంభించుచున్నది.

మనో మన్యే మనఃకర్మ తచ్ఛరీరేషు కారణమ్
జాయతే మ్రియతే తద్ధి నాత్మనీదృగ్విధా గుణాః. 9

మనస్సు, మనస్సుయొక్క కర్మయేయని నేనెంచెదను. అట్టి మనస్సే దేహాదులకు కారణము. అదియే ఉత్పన్నమగుచున్నది. అదియే లయించుచున్నది. ఏలయన, ఆత్మకు జనన మరణాదులు లేవుకదా?

మనఏవ విచారేణ మన్యే విలయమేష్యతి
మనోవిలయమాత్రేణ తతః శ్రేయో భవిష్యతి. 10

ఆత్మవిచారముచే మనస్సు లయించునని నా నిశ్చయము. మనస్సు లయించినతోడనే మోక్షప్రాప్తి చేకూరును.

మనో నామ్ని పరిక్షీణే కర్మణ్యాహితసంభ్రమే
ముక్త ఇత్యుచ్యతే జంతుః పునర్నా మన జాయతే. 11

భ్రమదాయకమగు మనస్సను కర్మ క్షయింప జీవుడపుడు ముక్తుండనబడును. అట్టివాడీ ప్రపంచమున మరల జన్మింపడు.

శ్రీ రామ ఉవాచ:—

భగవన్ భవతా ప్రోక్తా జాతయస్త్రివిధా నృణామ్
ప్రథమం కారణం తాసాం మనః సదసదాత్మకమ్. 12

శ్రీరాముడు:—ఓ మునిశ్రేష్ఠా! సాత్త్విక రాజస తామసభేదములచే (తక్కిన పంద్రెండు భేదములును వీనియందంతర్గతములు) త్రివిధ జీవజాతులంగూర్చి దెల్పియుంటిరి. వాటి యన్నిటికి ముఖ్యకారణము సదసదాత్మకమగు మనస్సే యగును.

తత్కథం శుద్ధచిన్మాత్ర స్తత్త్వాద్బుద్ధివివర్జితాత్
ఉత్థితం స్ఫారతాం యాతం జగచ్చిత్రకరం మనః. 13

ఆమనస్సు, బుద్ధిరహిత శుద్ధచైతన్యమునుండి యెట్లుత్పన్నమాయెను? మఱియు చిత్రవిచిత్రములగు జగన్నిర్మాణమొనర్చ నయ్యెదెట్లు విస్తరించెను? బుద్ధియున్నగదా సృష్టి సంభవించును.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

ఆకాశాహి త్రయో రామ విద్యంతే వితతాంతరాః
చిత్తాకాశశ్చిదాకాశో భూతాకాశ స్తృతీయకః. 14



వసిష్ఠుడు:— ఓ రామా! అతివిశాలమైన మూడాకాశములు గలవు. అయ్యవి చిత్తాకాశ చిదాకాశ, భూతాకాశము లనంబరగు.

ఏతే హి సర్వసామాన్యాః సర్వత్రైవ వ్యవస్థితాః
శుద్ధచిత్తత్త్వశక్త్యాతు లబ్ధసత్తాత్మతాం గతాః. 15

సర్వసామాన్యములగు నీమూడును వాటివాటికార్యములందు సువ్యవస్థితములై యున్నవి. శుద్ధ చిత్-శక్తిచే నీమూటికిని స్థితిగల్గుచున్నది.

సబాహ్యాభ్యంతరస్థో యః సత్తాసత్తావబోధకః
వ్యాపీ సమస్తభూతానాం చిదాకాశః స ఉచ్యతే. 16

బాహ్యజగత్తునకును, మఱియు బుద్ధ్యాదులస్థితి లేములకును సాక్షియైయుండునదియు, సర్వభూతములందును వ్యాపించియున్నదియు చిదాకాశమనంబడును.

సర్వభూతహితః శ్రేష్ఠో యః కాలకలనాత్మకః
యేనేదమాతతం సర్వం చిత్తాకాశః స ఉచ్యతే. 17

జీవులందఱి వ్యవహారములకు హేతువగుటచే సర్వహితమును, కార్యకారణములన్నింటికిని మూలమగుటచే సర్వశ్రేష్ఠమును జగద్వ్యాపకమును వికల్పరూపమును నగునదే చిత్తాకాశము.

దశదిఙ్మండలాభోగై రవ్యుచ్ఛిన్నవపుర్హి యః
భూతాత్మాసా య ఆకాశః పవనాబ్దాదిసంశ్రయః. 18

దశదిక్కుల వ్యాపించి విశాలదేహముగలదై వాయు, మేఘ, (సంవత్సరస్వరూపుడగు) సూర్యుల ప్రకాశమై వెలయునది భూతాకాశమనంబడును.

ఆకాశచిత్తాకాశౌ ద్వౌ చిదాకాశబలోద్భవౌ
చిత్కారణం హి సర్వస్య కార్యౌఘస్య దినం యథా. 19

భూతాకాశ చిత్తాకాశములు రెండును చిదాకాశమునుండి యుత్పన్నమైనవి. ఏలయన, దినమందలి కార్యములన్నిటికిని పగలు కారణమైనట్లు చైతన్యమే అన్నిటికిన్ని కారణమగుచున్నది.

జడోఽస్మి న జడోఽస్మీతి నిశ్చయో మలినశ్చితః
య స్తదేవ మనో విద్ధి తేనాకాశాది భావ్యతే. 20

'నేను జడస్వరూపుడను, జడ స్వరూపుడను గాను' నట్టి చిద్వస్తువుయొక్క మలిన నిశ్చయమే మనస్సు. దీనివలననే ఆకాశాదులుత్పన్నమగుచున్నవి.

అప్రబుద్ధాత్మవిషయ మాకాశత్రయకల్పనం
కల్ప్యతే ఉపదేశార్థం ప్రబుద్ధవిషయం నతు. 21

ఆత్మతత్త్వము నెఱుంగనివాని కుపదేశించుటకొఱకే యీమూడాకాశములు కల్పింపబడుచున్నవి గాని జ్ఞానికొఱకు గాదు.

ఏకమేవ పరం బ్రహ్మ సర్వం సర్వావపూరకం
ప్రబుద్ధవిషయం నిత్యం కలాకలనవర్జితమ్. 22

పరమమగు బ్రహ్మమొక్కటియే అంతటను నిండియున్నది. మఱియు అంతయును తానై వెలుగుచున్నది. త్రికాలములందును అయ్యది యేకరసమును, నిత్యమును, కాలకల్పనా వర్జితమునునై యున్నది.

ద్వైతాద్వైతసముద్భేదై ర్వాక్యసందర్భగర్భితైః
ఉపదేశ్యత ఏవాజ్ఞో నప్రబుద్ధః కథంచన. 23

వాక్యరచన (ఉపదేశాదులు), ద్వైతాద్వైతవికల్పన, అజ్ఞుల కొఱకేయగును గాని జ్ఞానులకు గాదు.

యావద్రామాప్రబుద్ధస్త్వ మాకాశత్రయకల్పనా
తావదేవావబోధార్థం మయాత్వముపదిశ్యసే. 24

ఓ రామా! జ్ఞానప్రాప్తి కలుగ నంతవఱకు, నీకీ మూడాకాశముల కల్పనయుండియే యుండును. మఱియు జ్ఞానోదయముకొఱకై నీవంతవరకు నాచే యుపదేశింపబడుచునే యుందువు.

ఆకాశచిత్తాకాశాద్వ్యాశ్చిదాకాశకలంకితాత్
ప్రసూతా దావదహనా ద్యథా మరుమరీచయః. 25

దావాగ్నివలె తీక్ష్ణమైనట్టి అగ్నితాపముచే మరుభూమియందెండమావు లుత్పన్నమగునట్లు మాయాకళంకితమగు చిదాకాశమునుండి చిత్తాకాశ భూతాకాశములుత్పన్నమైనవి.

చినోతిమలినంరూపం చిత్తతాంసముపాగతం
త్రిజగంతీంద్రజాలాని రచయత్యాకులాత్మకమ్. 26

మాయావేష్టితమగు చైతన్యము చిత్తత్వమంది, మలినరూప సంచయము గావించుచు, వివిధ కల్పనలతోకూడి, త్రిలోకములను యింద్రజాలమును నిర్మించుచున్నది.

చిత్తత్వమస్యమలినస్యచిదాత్మకస్య తత్త్వస్యదృశ్యతఇదంననుబోధహీనైః
శుక్తౌయథారజతతా నతుబోధవద్భి ర్మౌర్ఖ్యేణబంధఇహబోధబలేనమోక్షః. 27

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకియే ఉత్పత్తిప్రకరణే
చిదాకాశమాహాత్మ్యం నామ సప్తనవతితమః సర్గః ॥ 97 ॥

ముత్తెపుచిప్పయొక్క యథార్థజ్ఞానములేనివానికద్దానియందు వెండి గన్పించునట్లు, అజ్ఞానికే, చైతన్యమందు మలిన రూపమగు చిత్తముయొక్క అనుభవము గల్గుచున్నది. కాన లోకమందు అజ్ఞానమను దోషముచే బంధమును, జ్ఞానబలముచే మోక్షమును సిద్ధించుచున్నవి.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
చిదాకాశమాహాత్మ్యమను సప్తనవతితమ సర్గము ॥ 97 ॥



## అష్టనవతితమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

యతఃకుతశ్చిదుత్పన్నం చిత్తంయత్కించిదేవహి
నిత్యమాత్మవిమోక్షాయ యోజయేద్యత్నతోఽనఘ. 1

వసిష్ఠుడు:—పాపరహితుడవగునో రామచంద్రా! ఎచటినుండియో యాకస్మికముగ నుత్పన్నమైన యీ చిత్తమును ఆత్మవిముక్తియందే జాగరూకతతో నియోగింపుము.

సంయోజితంపరేచిత్తం శుద్ధంనిర్వాసనంభవేత్
తతస్తుకల్పనాశూన్య మాత్మతాంయాతిరాఘవ. 2

ఓ రామా! బ్రహ్మతత్త్వ స్వరూపుడగు పరమాత్మయందు లగ్నమైన చిత్తము వాసనారహితముకాగా, నపుడేవిధమగు కల్పనయులేక ఆత్మస్వరూపమును ప్రాప్తినొందును.

చిత్తాయత్తమిదంసర్వం జగత్స్థిరచరాత్మకమ్
చిత్తాధీనావతోరామ బంధమోక్షావపిస్ఫుటమ్. 3

ఈ చరాచరజగత్తంతయును చిత్తమునకధీనమైయున్నది. కాన, నోరామా! బంధమోక్షములుగూడ చిత్తాధీనములనుట స్పష్టము.

అత్రార్థేకథ్యమానంమే చిత్తాఖ్యానమనుత్తమం
బ్రహ్మణాయత్పురాప్రోక్తం శృణురామాతియత్నతః. 4

ఓ రామా! ఈ సందర్భమున, పూర్వము బ్రహ్మదేవుడు నాకు వచించిన చిత్తాఖ్యానమును జెప్పుచున్నాను. సావధానచిత్తుడవై వినుము.

అస్తిరామాటవీస్ఫారా శూన్యాశాంతాతిభీషణా
యోజనానాంశతంయస్యాం లక్ష్యతే కణమాత్రకమ్. 5

ఓ రామా! అతివిశాలమును, శూన్యమును, అశాంతియుతమును, భయంకరమునునగు మహారణ్యమొకండుకలదు. దానియందనేకయోజనములుగూడ అతిస్వల్పముగ గాన్పించును.

తస్యామేకోహిపురుషః సహస్రకరలోచనః
పర్యాకులమతిర్భీమః సంస్థితో వితతాకృతిః. 6

ఆ మహారణ్యమందనేక హస్తనేత్రాదులుగల్గి, వ్యాకులచిత్తుడై, విశాలాకృతిగలవాడై భయంకరముగ గన్పట్టు పురుషుడొకడుండెను.

స సహస్రేణబాహూనా మాదాయపరిఘాన్బహూన్
ప్రహరత్యాత్మనఃపృష్ఠే స్వాత్మనైవవలాయతే. 7

అతడు తన వేలకొలది చేతులతో, పెక్కుగుదియలఁగైకొని, వాటిచే తనవీపుపై కొట్టుకొనుచు ఆ మహారణ్యమున బరుగెత్తుచుండెను.

దృఢప్రహారైః ప్రహరన్ స్వయమేవాత్మనాత్మని
ప్రవిద్రవతి భీతాత్మా స యోజనశతాన్యపి. 8

ఇట్లు తన్ను తాను బాధించుకొనుచు, భయభీతుడై అనేక యోజనముల వఱకు బఱగిడుచుండెను.

క్రందన్పలాయమానోఽసౌ గత్వా దూరమితస్తతః
శ్రమవాన్వివశాకారో విశీర్ణచరణాంగకః. 9

పతితోఽవశ ఏవాశు మహత్యంధోఽంధకూపకే
కృష్ణరాత్రితమోభీమే నభోగంభీరకోటరే. 10

వివేకదృష్టి లేనందున అవశుడై యాతడు పడుచు, పరుగెత్తుచు, యిటునటు సంచరించుచు, చాలదూరమేగి, అలసినవాడై, అవయవములు చిన్నభిన్నములవ, కృష్ణపక్షపు రాత్రియందలి యంధకారమువలె మిగుల భయంకరమును ఆకాశమువలె గంభీరమునునగు నొక యంధకూపమునఁబడెను.

తతః కాలేన బహునా సోఽంధకూపాత్సముత్థితః
పునః ప్రహారైః ప్రహరన్ విద్రవత్యాత్మనాత్మనః. 11

చాలసేపటికా యంధకూపమునుండి బయల్వెడలి, మరల తన్ను తాను కొట్టుకొనుచు పరువెత్తుచుండెను.

పునర్దూరతరం గత్వా కరంజవనగుల్మకమ్
ప్రవిష్టః కంటకవ్యాప్తం శలభః పావకం యథా. 12

అట్లు చాలదూరమేగి, కంటకావృతమై, తరుగుల్మలతాదులచే దట్టముగ వ్యాపించియున్నట్టి యరణ్యమునుపొంది, అగ్నియందు మిడుతవలె, యద్దానియందు ప్రవేశించెను.

తస్మాత్కరంజగహనా ద్వినిఃసృత్య క్షణాదివ
పునః ప్రహారైః ప్రహరన్విద్రవత్యాత్మనాత్మనః. 13

పిమ్మట యొక్క క్షణములో నచటనుండి బయలుదేరి, తన్ను తాను కొట్టుకొనుచు యిటునటు బరువెత్తసాగెను.

పునర్దూరతరం గత్వా శశాంకకరశీతలమ్
కదలీకాననం కాంతం సంప్రవిష్టో హసన్నివ. 14

అట్లు చాలదూరమేగి, చంద్రకిరణములవలె శీతలమును, మనోహరమునునగు నొక కదళీవనమందు ప్రవేశించెను.

కదలీఖండకాత్తస్మా ద్వినిఃసృత్య క్షణాత్పునః
స్వయం ప్రహారైః ప్రహరన్విద్రవత్యాత్మనాత్మని. 15

మరలనొక క్షణములో నాకదళీవనమును వీడి తన్ను తాను బాధుకొనుచు బరుగెత్తెను.

పునర్దూరతరం గత్వా తమేవాంధోఽంధకూపకమ్
స సంప్రవిష్టస్త్వరయా విశీర్ణావయవాకృతిః. 16



పిమ్మట శీఘ్రముగ చాలదూరమేగి అవయవములన్నియు ఛిన్నభిన్నములుకాగా, నంధప్రాయుడై ఆ యంధకూపమునే మరల ప్రవేశించెను.

అంధకూపాత్సముత్థాయ ప్రవిష్టః కదలీవనం
కదలీకాననాచ్ఛ్వభ్రం కరంజవనగుల్మకమ్. 17

ఆ యంధకూపమునుండి బయలుదేరి మరల కదళీవనముఁజొచ్చి, యటనుండి గంభీరమును కంటకయుక్తలతాగుల్మములచే వ్యాప్తమునునగు వనమందు ప్రవేశించెను.

కరంజకాననాత్కూపం కూపాద్రంభావనాంతరమ్
ప్రవిశన్ప్రహారం శ్చైవ స్వయమాత్మని సంస్థితః. 18

ఇట్లా కరంజవనమునుండి యంధకూపమునకును, అటనుండి కదళీవనమునకును బోవుచు, తన్ను తాను కొట్టుకొనుచునుండెను.

ఏవంరూపనిజాచారః సోఽవలోక్య చిరం మయా
అవష్టభ్య బలాదేవ ముహూర్తం రోధితః పథి. 19

పృష్టః సక స్త్వం కిమిదం కేనార్థేన కరోషి వా
కిం నామాభిమతం తేఽత్ర కిం ముధా పరిముహ్యసి. 20

ఇవ్విధమున వర్తించుచున్న యాతనిని నేను వివేకదృష్టితో బరికించి, యోగబలముచే నొక ముహూర్తకాలమాతనిని మార్గమందాపి, 'నీవెవరవు? ఏల యిట్టి విచిత్రకార్యముల నొనర్చుచున్నావు? నీవు దేనినభిలషించుచున్నావు? వ్యర్థముగ యిట్లేల విమోహితుడవగుచుంటివ'ని ప్రశ్నించితిని.

ఇతి పృష్టేన కథితం తేన మే రఘునందన
నాహం కశ్చిన్న చైవేదం మునే కించిత్కరోమ్యహమ్. 21

త్వయాహమవభగ్నోఽస్మి త్వం మే శత్రురహో బత
త్వయా దృష్టోఽస్మి నష్టోఽస్మి దుఃఖాయ చ సుఖాయ చ. 22

ఓ రామా! నేనిట్లడుగ, నంత యాతడు 'ఓమునీ! నేనెవరనుగాను, నేనేమియు చేయుట లేదు; నీవు నన్ను హింసించితివి; కాన నీవు నాశత్రువు; నిన్ను చూచుటతోడనే నేను సుఖముగాని దుఃఖముగాని బొందక నశించుచున్నాన'ని బల్కెను.

ఇత్యుక్త్వా విక్లవాన్యంగాన్యాలోక్య స్వాన్యతుష్టిమాన్
రురోదాతిరవం దీనో మేఘో వర్షన్నివాటవీమ్. 23

ఇట్లు వచించి యాతడు తన శిథిలావయవములఁగాంచి యసంతుష్టుడయ్యెను. మఱియు దుఃఖితుడగు నాతడు మేఘము వర్షించినట్లు యరణ్యమున అశ్రుధారలఁ బ్రవహింపఁజేయుచు నేడ్వఁదొడగెను.

క్షణమాత్రేణ తత్రాసావుపసంహృత్య రోదనమ్
స్వాన్యంగాని సమాలోక్య జహాస చ ననాద చ. 24

క్షణములో నారోదనము చాలించి, తన యంగములఁజూచి నవ్వి, యట్టహాసమొనర్చెను.

అథాట్టహాసపర్యంతే సపుమాన్పురతో మమ
క్రమేణ తానితత్యాజ స్వాన్యంగాని సమంతతః. 25

ఆ యట్టహాసమును ముగించి నాయెదుట నాతడు క్రమముగ తన అవయవము లన్నింటిని త్యజించివై చెను.

ప్రథమం పతితం తస్య శిరః పరమదారుణమ్
తతస్తే బాహవః పశ్చాద్వక్షస్తదను చోదరమ్. 26

అతిభయంకరమగు నాతని శిరస్సు, మొదట క్రిందపడెను. పిదప బాహువులును, ఆ పిమ్మట వక్షఃస్థలమును, యుదరభాగమును క్రమముగ జారిపడెను.

అథ తేనైవ సపుమాం స్తాన్యంగానియథాక్రమమ్
సంత్యజ్య నియతేః శక్త్యా క్వాపి గంతుముపస్థితః. 27

ఇట్లు నియతి (జ్ఞాన) శక్తిచే నాతడు క్రమముగ తన యంగములఁద్యజించి పిమ్మట యెటకో పోనుద్యుక్తుడయ్యెను.

దృష్టవానహమేకాంతే పునరన్యం తథానరమ్
సోఽపి ప్రహారాన్పరితః ప్రయచ్ఛన్స్వాయమాత్మని. 28

అనంతర మొక యేకాంత ప్రదేశమున అట్టివానినే మఱియొకనిని గాంచితిని. ఆతడును వెనుకటి వానివలెనే తనపై తాను ప్రహారము సల్పుకొనుచుండెను.

బాహుభిః పీవరాకారైః స్వయమేవ పలాయతే
కూపే పతతి కూపాత్తు సముత్థాయాభిధావతి. 29

పునః పతతి కుండేఽంతః పునరారత్ పలాయతే
పునః ప్రవిశతి శ్వభ్రం క్షణం శిశిరకాననమ్. 30

మిగుల స్థూలమైనట్టి తన బాహువులచే నాతడును, తన్నుతాను కొట్టుకొనుచు పరువెత్తుచుండెను. త్రోవలో యంధకూపమునఁబడి, యటనుండి లేచి, పరుగెత్తుచు మరల యానూతియందు బడి దీనుడై యటనుండి కరంజవనమునకుఁజని, మరల యొక్కక్షణములో కదళీవనమును ప్రవేశించుచు నుండెను.

శష్టం పునః పునస్తుష్టః పునః ప్రహరతి స్వయమ్
ఏవం ప్రాయనిజాచారశ్చిరకాలోక్య సస్మయమ్. 31

స మయా సమవష్టభ్య పరిపృష్టస్తథైవ హి
తేనైవాసౌ క్రమేణాద్య రుదిత్వా నం ప్రహస్య చ. 32

అంగాన్యశీర్ణతామేత్య యయావలమలక్ష్యతామ్
విచార్య నియతేః శక్తిం తతో గంతుముపస్థితః. 33



యతడు మరల మరల దుఃఖించుచు, మరల మరల సంతసించుచు, తన్నుతాను బాధించుకొనుచు నుండెను. అట్టివాని కృత్యములను చాలసేపు వీక్షించి వెనుకటివానిచందమున యాతనిని గూడ నాపి, ప్రశ్నోత్తరముల మూలకమున బోధించితిని. కాని యతఁడేడ్చుచు, నవ్వుచు, నియతి (జ్ఞాన) శక్తినిగూర్చి విచారించినవాడై, అంగములన్నియును ఛిన్నభిన్నములవ, అదృశ్యరూపము జెంది యటనుండి వెడల నుద్యుక్తుడయ్యెను.

దృష్టవానహమేకాంతే పునరన్యం తథానరం
ప్రహారం స్తద్వదేవాసౌ స్వయమేవ పలాయతే. 34

ఓ రామా! మఱియొక యేకాన్తప్రదేశమున, ఇట్టివానినే యింకొకనిని నేను జూచితిని. అతడు నట్లే తన్నుతాను హింసించుకొనుచు బరుగెత్తుచుండెను.

పలాయమానః పతితో మహత్యంధేఽంధకూపకే
తత్రాహం సుచిరం కాలమవసంత్ప్రతీక్షకః. 35

అట్లు పరుగెత్తుచు, విశాలమగు యంధకూపమునఁబడెను. అచట చాలసేపు వానికొఱకై నేను నిరీక్షించుచుంటిని.

యావత్సుచిరేణాపి కూపాన్నాభ్యుదితః శఠః
అథాహముత్థితో గంతుం దృష్టవాన్పురుషం పునః. 36

ఆ మూర్ఖుడా యంధకూపమునుండి బయటకేతెంచువరకు నేనచటనే ప్రతీక్షించుచుంటిని. పిదప యటనుండి పోనుంకింప, నంతలో యాతడు వచ్చుచుండుట గాంచితిని.

తాదృశం తాదృశాకారం ప్రపతంతం తథైవ చ
అవష్టభ్య తథైవాశు తస్య ప్రోక్తం పునర్మయా. 37

మరల అట్లనే యంధకూపమున బడుచుండ నేను వానినాపి ప్రశ్నించితిని.

తథైవోత్పలపత్రాక్ష నాసౌ తదవబుద్ధవాన్
కేవలం మామసౌ మూర్ఖో నైవజానాసి కించన. 38

కమలనేత్రుడగు నో రామా! ఆ ప్రశ్నల నాతడు తెలిసికొనజాలడయ్యె. 'మూర్ఖుడా! నీవేమియు నెఱుంగవని మాత్రమాతడు ప్రత్యుత్తరించెను.

ఆః పాపదుర్ద్విజేత్యుక్త్వా స్వవ్యాపారపరో యయౌ
అథ తస్మిన్మహారణ్యే తథా విహరతా మయా. 39

బహవస్తాదృశా దృష్టాః పురుషా దోషకారిణః
మత్ప్రపృష్టాః కేచిదాయాంతి స్వప్నసంభ్రమవచ్ఛమమ్. 40

"ఓరీ పాపీ, దుష్టబ్రాహ్మణుడా! యని యఱచుచు నాతడు స్వవ్యాపారపరాయణుడై వెడలెను. పిదప నేనా మహారణ్యమున సంచరించుచు యిట్టి పాపుల నేకుల జూచితిని వారిలో కొందఱు నా ప్రశ్నోత్తరములచే బోధితులై స్వప్నమువలె మిథ్యయగు దేహమునశింప, శాంతిని బొందుచుండిరి.

మదుక్తంనాభినందంతి కేచిచ్ఛవతనుంయథా
పినిపత్యాంధకూపేభ్యః కేచిత్తత్రోత్థితాఃపునః 41

మృతశరీరమునువలె నా వచనములను కొందరభినందింపక యుండిరి. కొందరంధకూపమునఁ బడి లేచుచుండిరి.

కదలీఖండకాత్కేచిచ్చిరేణాపినిర్గతాః
కేచిదంతర్హితాఃస్ఫారేకరంజవనగుల్మకే. 42

మఱికొందఱు కదలీవనమునుండి చాలసేపటికి బయటకు వచ్చుచుండిరి. ఇంకకొందఱు కరంజలతాగుల్మముల వనమందే లుప్తమగుచుండిరి.

నక్వచిత్థ్సితిమాయాంతి కేచిద్ధర్మపరాయణాః
ఏవంవిధాసావితతా రఘూద్వహమహాటవీ. 43

కొందఱు కామ్యకర్మపరాయణులై యెచటను శాంతిని బడయకుండిరి. రఘుకులతిలకుఁడవగు నో రామా! ఆ మహారణ్య మివ్విధముగనున్నది.

అద్యాపివిద్యతేయస్యా మిత్థంతేపురుషాఃస్థితాః
సాచదృష్టాత్వయారామ త్వయేవావ్యవహారిణీ
బాల్యాత్తుబుద్ధితత్త్వస్య నతాంస్మరసిరాఘవ. 44

ఓ రామా! ఆ మహారణ్యము (సంసారము) యిప్పటికిని గలదు. దానియందల్లే ఆయా పురుషులును, ఆయా విచిత్రవ్యవహారములును గలవు. నీవద్దానిని చూచియేయున్నావు. కాని బుద్ధి సూక్ష్మతలేమి దాని నీవెఱుంగకున్నావు.

సాభీషణావివిధకంటక సంకటాంగీ ఘోరాటవీ ఘనతమోగహనాపిలోకే
ఆగత్యనిర్వృతిమలబ్ధపరావబోధై రాసేవ్యతే కుసుమగుల్మకవాటికేవ. 45

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
చిత్తోపాఖ్యాననామ అష్టనవతితమః సర్గః ॥ 98 ॥

మనుష్యజన్మమును పొందియు దౌర్భాగ్యవశమున జ్ఞానప్రాప్తినిబడయక, విషయులగు జీవులతిభయంకరమును, కంటకావృతమును గాఢాంధకారముచే వ్యాప్తమును నగు సంసారారణ్యమును పుష్పవాటికగ దలంచి యద్దానిని సేవించుచున్నారు.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
చిత్తోపాఖ్యానమను అష్టనవతితమ సర్గము ॥ 98 ॥



## నవనవతితమః సర్గః

శ్రీ రామ ఉవాచ:—

కాసామహాటవీబ్రహ్మన్ కదాదృష్టాకథంమయా
కేచతేపురుషాస్తత్ర కింతత్కర్తుంకృతోద్యమాః. 1

శ్రీరాముడు:— ఓ మహాత్మా! ఆమహారణ్య మెచటగలదు? అది యెవ్విధమున నున్నది? నేనద్దాని నెచట జూచితిని? అందున్న మనుజులెవరు? ఏల వారట్టి విచిత్రక్రియల నొనర్చుచుండిరి.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

రఘునాథమహాబాహో శృణువక్ష్యామితేఽఖిలం
నసామహాటవీరామ దూరేనైవచ తేనరాః. 2
యేయంసంసారపదవీ గంభీరాఽపారకోటరా
తాంతాంశూన్యాం వికారాఢ్యాం విద్ధిరామమహాటవీమ్. 3

వసిష్ఠుడు:— మహాబాహుఁడవగు నో రామా! వినుము, నేనావృత్తాంతమంతయును నీకెఱింగించుచున్నాను. ఆ మహారణ్యము గాని, ఆ మనుజులు గాని యెచటనో లేరు. గంభీరమును, విశాలమునునగు యీ సంసారమే పలువిధ వికారములతోగూడిన శూన్యమహారణ్యమని తెలిసికొనుము.

విచారాలోక లభ్యేయం యదైకేనైవవస్తునా
పూర్ణానాన్యేన సంయుక్తా కేవలేవ తదైవసా. 4

బ్రహ్మవిచారముచే యెపుడంతటను అద్వితీయమగు ఆత్మచే పూర్ణమైయుండి అన్యమేదియు గోచరింపకయుండునో, అనగ పరమార్థదృష్టియందు యెపుడు సర్వమును బ్రహ్మరూపముగ గన్పించునో, అపుడే సంసారారణ్యము శూన్యమగును. కాని జగద్దృష్టిచేనది వికారయుక్తమై యుండును.

తత్రయేతేమహాకారాః పురుషాఃప్రభ్రమంతిహి
మనాంసితానివిద్ధిత్వం దుఃఖేనిపతితాన్యలమ్. 5

ఆ మహారణ్యమందు భీకరాకృతిగల్గి సంచరించు పురుషులు, భ్రాంతిచే సంసారమున దుఃఖితులగువారి చిత్తములని యెరుగుము.

ద్రష్టాయోఽయమహంతేషాం సనివేకోమహామతే
వివేకేనమయాతాని దృష్టాన్యన్యేననానఘ. 6

ఓ మహామతీ! వారల ద్రష్టయగు నేను వివేకమగుదును. ఏలయన, వివేకముచేగదా నేను వారల జూడగల్గితిని!

మయాతాన్యేవబోధ్యంతే వివేకేనమనాంసిహి
సతతంసుప్రకాశేన కమలానీవభానునా. 7

తన యుత్తమప్రకాశముచే సూర్యుడు కమలములను వికసింపజేయునట్లు వివేకముచే నేను నిరంతరము వారి మనంబులకు ప్రబోధము గలుగజేయుచున్నాను.

మత్ప్రబోధంసమాసాద్య మత్ప్రసాదాన్మహామతే
మనాంసికానిచిత్తాని గతాన్యుపశమాత్పరమ్. 8

ఓ మహామతీ! నా ప్రబోధము (తత్త్వజ్ఞానము)ను బడసి అద్దాని ప్రభావముచే యెందరో చిత్తశాంతిని బొంది ముక్తులైరి.

కానిచిన్నాభినందంతి మాంవివేకంవిమోహతః
మత్తిరస్కారవశతః కూపేష్వేవపతంత్యధః. 9

వివేకరూపుడగు నన్ను జ్ఞానముచే యెందరో వాంఛింపకయుండిరి. నన్ను తిరస్కరించిన అట్టి యధముల వివేకముచే నంధకూపమునఁ బడుచునుండిరి.

యే తేఽంధకూపాగహనా నరకాస్తేరఘూద్వహ
కదలీకాననయాని సంప్రవిష్టానితానితు. 10

స్వర్గైకరసికానిత్యం మనాంసిజ్ఞాతుమర్హసి
ప్రవిష్టాన్యంధకూపాంత ర్నిర్గతానినయానితు. 11

మహాపాతకయుక్తాని తానిచిత్తానిరాఘవ
కదలీకాననస్థాని నిర్గతానినయానితు. 12

పుణ్యసంభారయుక్తాని తానిచిత్తానిరాఘవ
కరంజవనయాతాని నిర్గతానినయానితు. 13

తానిమానుష్యజాతాని చిత్తానిరఘునందన
కానిచిత్సంప్రబుద్ధాని తత్రముక్తానిబంధనాత్. 14

ఓ రఘుకులతిలకా! అగాధములగు నాయంధకూపములు నరకములని యెఱుంగుము. మఱియు కదళీవనమందు ప్రవేశించినవారు స్వర్గాసక్తులగు రసికులనియు, అంధకూపమునఁబడి, యద్దానినుండి లేవనివారు మహాపాపులనియు, కదళీవనమునుండి వెలుపలకు రానివారు పుణ్యవంతులనియు, కరంజ లతాగుల్మముల వనమందున్నవారై యటనుండి వినిర్గతులుగానివారు మనుజరూప పరిణామమును బొందినవారనియు నీవు తెలిసికొనుము. ఇట్టి మనుష్యరూప పరిణామమునుబొందిన వారిలో ననేకులు జ్ఞానసంపన్నులై సంసారబంధమునుండి తప్పించుకొని ముక్తులైరి.

కానిచిద్బహురూపాణి యోనేర్యోన్యంవిశంతిహి
మనాంసితానితిష్ఠంతి నిపతంత్యుత్పతంతిచ. 15

అనేక యుపాధుల జెందుచు, ఒకయోనినుండి మఱియొకయోనిఁ బ్రవేశించుచు నరకమున బడుచు, స్వర్గమునకు బోవుచు యెందఱో పరిభ్రమించుచున్నారు.

యత్తత్కరంజగహానం తత్కలత్రరసంవిదుః
దుఃఖకంటకసంబాధం మానుష్యంవివిధైషణమ్. 16



దుఃఖములను కంటకముచే పూర్ణమును, మనుష్యస్వభావయుక్తమును, కుటుంబ బంధుస్నేహముగలిగి వివిధేచ్ఛలతో కూడియున్నదియునగు చిత్తమే పైనదెల్పిన కంటకవనమని గ్రహించుము.

కరంజగహానంయాని ప్రవిష్టానిమనాంసితు
మానుష్యేతానిజాతాని తత్రైవరసికానిచ. 17

తరుగుల్మముల వనమందు ప్రవేశించినవారు మనుజరూప పరిణామమును బొందిన వారని యెంచుము. దానియందును వారు విషయసేవనమందే మగ్నులైయుండిరి.

కదలీకాననంయత్తచ్ఛశాంకకరశీతలమ్
తన్మనోహ్లాదనకరం స్వర్గంవిద్ధిరఘూద్వహ. 18

ఓ రఘుకులతిలకా! చంద్రకిరణములవలె శీతలమైన కదళీవనమయ్యది వచింపబడెనో అది మనంబు నానందింపఁజేయు స్వర్గమని భావింపుము.

కానిచిత్పుణ్యభూతేన తపసాధారణాత్మనా
ధారయంతిశరీరాణి సంస్థితాన్యుదితాన్యపి. 19

కొందఱు శాస్త్రవిహిత పుణ్యకర్మల నాచరించి, తపస్సుచే ధ్యేయవస్తువందు సంలగ్నమగు చిత్తముగలవారై, అనగ యోగాభ్యాసనాదుల నొనర్చుచు, గ్రహ, సప్తర్షి, ధ్రువాదిపదముల నొందుచున్నారు. వారితరులకంటె యధిక తేజోసంపన్నులై తత్త్వజ్ఞానముచే నెల్లపుడును శ్రేయునే బొందుచుందురు.

యైరహంపుంభిరబుద్ధై ర్బుద్ధిచిత్తతిరస్కృతః
తైర్మనోభిరనాత్మజ్ఞైః స్వవివేకస్తిరస్కృతః. 20

ఏ యజ్ఞులు నన్ను తిరస్కరించిరో, ఆత్మజ్ఞానశూన్యులగు నట్టివారు తమ వివేకముచే తాము తిరస్కరించిరని తలంపుము.

త్వయాదృష్టోవినష్టోఽస్మి త్వంమేశత్రురితిద్రుతమ్
యదుక్తంతద్ధిచిత్తేన గలతాపరిదేవితమ్. 21

'నిన్ను జూచుటతోడనే నశించితిని, హా! కష్టము? నీవు మాశత్రువ'నునిట్టి బల్కులు చిత్తముయొక్క విలాపమేయగును. ఏలయన, వివేక దృష్టిచే చిత్తము నశించును గదా!

రుదితంయన్మహాక్రందం పుంసాబహ్వాశురాఘవ
తద్భోగజాలంత్యజతా మనసా రోదనంకృతమ్. 22

ఓరామా! ఆర్తనాదమొనర్చుచు బిగ్గరగ యేడ్చినవాడు, భోగత్యాగ సమయమున ఖేదమొందు చిత్తమని గ్రహింపుము.

అర్ధప్రాప్తవివేకస్య నప్రాప్తస్యామలంపదమ్
చేతనస్త్యజతోభోగాన్పరితాపోభృశంభవేత్. 23

పూర్ణజ్ఞానమును బడసినదియు, శుద్ధ, బ్రహ్మపదమును ప్రాప్తినొందినదియును నగు చిత్తము భోగములఁద్యజించు నపుడు మిక్కిలి దుఃఖము కలుగును.

రుదతాంగానిదృష్టాని కారుణ్యేనావబోధినా
కష్టమేతానిసంత్యజ్య కింప్రయామీతిచేతసా. 24

ఏడ్చుచు, తన యంగములఁదాను జూచుకొనెనని చెప్పబడిన దాని తాత్పర్యము, అల్ప వివేకముగల చిత్తము స్త్రీ పుత్రాదులను కరుణాదృష్టితో దిలకించి, 'హా! కష్టము, వీరిని పరిత్యజించి నేను వెడలుచున్నా'నని తలపోయుటయే యగును.

అర్ధప్రాప్తవివేకస్య నప్రాప్తస్యామలంపదమ్
చేతసస్త్యజతోఽంగాని పరితాపోహివర్ధతే. 25

ఏలయన, పూర్ణజ్ఞానము బడయక, ఆత్మపదప్రాప్తిలేక యుండు చిత్తము స్నేహ లోభాది తన యంగములను విడచు నప్పుడధిక సంతాపమును బొందును.

హసితంతుయదానంది పుంసా మదవబోధతః
పరిప్రాప్తవివేకేన తత్తుష్టంరామచేతసా. 26

నన్నెఱుంగుటచే ఆ పురుషుఁడు నవ్వెననగా, వివేకప్రాప్తిచే చిత్తము సంతుష్టిని బొందెనని భావము.

పరిప్రాప్తవివేకస్య త్యక్తసంసారసంస్థితేః
చేతసస్త్యజతోఽరూప మానందోహి వివర్ధతే. 27

వివేకమునుబొంది సంసారస్థితిని చిత్తత్వమును త్యజించునట్టి చిత్తమున కానందము వృద్ధి యగునుగదా!

హసతాంగానిదృష్టాని పుంసాయాన్యుపహాసతః
తానిదృష్టానిమనసా విప్రలంభపదానిహ. 28

ఆ పురుషుడు తన యందములఁగాంచి నవ్వెననుట, స్నేహ లోభాదులు తన్ను వచించు చుండుటఁజూచి చిత్తము పరిహసించుటయే యగును.

మిథ్యావికల్పరచితై ర్విప్రలబ్ధమహోచిరమ్
ఇత్యంగాన్యుపహాసేన ద్రష్టానిస్వానిచేతసా. 29

'అహో! మిథ్యావికల్పజాలముచే రచింపబడినను విషయములచే నేను చిరకాలము వంచింపబడితినని యుపహాస మొనర్చుచు చిత్తము లోభాదులను తన యంగములఁజూచెను.

మనఃప్రాప్తవివేకంహి విశ్రాంతంవితతేపదే
ప్రాక్తనాదీనతాధారం హసన్పశ్యతిదూరతః. 30

వివేకప్రాప్తిని బడసినదియు, వ్యాపక బ్రహ్మపదమందు విశ్రాంతినొంది నదియు నగు చిత్తము పూర్వకాలపు తన దీనత్వమునకు హేతువగు విషయసమూహమును దూరమునుండియే గాంచి నవ్వెను.

యదసానమవష్టభ్య మయాపృష్టఃప్రయత్నతః
తద్వివేకోఽబలాచ్చిత్త మాదత్తఇతిదర్శితమ్. 31



వాని నాపి నేను ప్రయత్నపూర్వకముగ ప్రశ్నించితిని ననుటయందు, వివేకబలముచే చిత్తము నిగ్రహింపబడెనను భావము వ్యక్తీకరింపబడెను.

యదంగానివిశీర్ణాని గతాన్యంతర్ధిమగ్రతః
తచ్చిత్తేనవినార్థాశా శామ్యతీతిప్రదర్శితమ్. 32

అవయవములన్నియు ఛిన్నభిన్నములై చూచుచుండగనే లుప్తమైపోయెననగా—చిత్తము లేనపుడు పదార్థములందలి యాశ శాంతించునని యర్థము.

సహస్రనేత్రహస్తత్వం యత్పుంసఃపరివర్ణితమ్
తదనంతాకృతిత్వంహి చేతసఃపరిదర్శితమ్. 33

వెయ్యిచేతులు, కండ్లు గలవాడని చెప్పుటచే మనస్సున కనేక యాకృతులుగలవని నిరూపింపబడినది.

యదాత్మనిప్రహారౌఘైః పుమాన్ప్రహరతిస్వయమ్
తత్తత్కుకల్పనాఘాతైః ప్రహరత్యాత్మనోమనః. 34

తనపైతాను ప్రహారము సల్పుకొనెననగా—దుష్టసంకల్పములచే మనస్సు తన్నుతాను బాధించుకొనునని భావము.

పలాయతేయత్పురుషః స్వాత్మనఃప్రహరన్స్వయమ్
స్వవాసనాప్రహారేభ్యస్తన్మనఃప్రపలాయతే. 35

తన్నుతాను గొట్టుకొనుచు పరుగెత్తెననగా మనస్సు తనయందలి వాసనలచే కొట్టబడుచు పరుగిడుచున్నదని తాత్పర్యము.

స్వయంప్రహరతి స్వాంతం స్వయమేవస్వయేచ్ఛయా
పలాయతేస్వయంచైవ పశ్యాజ్ఞానవిజృంభితమ్. 36

ఆహా! అజ్ఞానముయొక్క విచిత్రలీలఁగాంచుము! తనకోర్కె చొప్పుననే చిత్తము తన్నుతాను బాధించుకొనుచు పరుగెత్తుచున్నది.

స్వవాసనోపతప్తాని సర్వాణ్యేవమనాంసిహి
స్వయమేవపలాయంతే గంతుంయుక్తానితత్పదమ్. 37

బ్రహ్మపదమెఱుంగ నుద్యుక్తములయ్యు, వాసనలచే క్షోభపెట్టబడు చిత్తములన్నియు నివ్విధముననే బరువిడుచుండును.

యదిదంవితతందుఃఖం తత్తనోతిస్వయంమనః
స్వయమేవాతిఖిన్నంతు పునస్తస్మాత్పలాయతే. 38

మనస్సే దుఃఖమును విస్తరించుచున్నది. మఱియు నట్టిదుఃఖముచే మిగుల ఖిన్నమై యది పలాయన మొనర్చుచున్నది.

సంకల్పవాసనాజాలైః స్వయమాయాతిబంధనమ్
ఘనోలాలామయైర్జాలైః కోశకారకృమిర్యథా. 39

పట్టుపురుగు తనచే నిర్మింపబడిన గూటియందు తానే చిక్కుకొనునట్లు, మనస్సున్ను, సంకల్ప, వాసనాదులచే తన్ను తానే బంధించుకొనుచున్నది.

యథానర్థమవాప్నోతి తథా క్రీడతిచంచలమ్
భావిదుఃఖమపశ్యన్స్వం దుర్లీలాభిరివార్భకః. 40

బాలుడెట్లు భవిష్యద్దుఃఖమెఱుంగక, చపలత్వముతోగూడి యాడుచు, అనర్థమును బొందునో, అట్లనే మనస్సును గూర్చియు నెఱుంగుము.

అపశ్యన్కాష్ఠరంధ్రస్థ వృషణాక్రమణంయథా
కీలోత్పాటీకపిర్దుఃఖమేతీదంహి తథామనః. 41

చపలమగు వానరమొకటి తనచాపల్యముచే యరణ్యమున దుఃఖమనుభవించినట్లు, చంచలమగు యీ మనస్సున్ను దుఃఖములపాలగుచున్నది. (ఒక యరణ్యమున పనివాండ్రు కొందఱు కొయ్యను సగమునఱకి, అందు చీలయుంచివెడలగా నంత చపలచిత్తముకల వానరమొకటి యద్దానిపై గూర్చుండి చీలను బెరకివేయ, దానియంగములందు తగులొ,, నుటచే మరణించెనను సంగతి యిట సూచితము.)

చిరపాలనయాచైవ చిరభావనయాతథా
అభ్యాసాత్తుచ్ఛతామేత్య నభూయఃపరిశోచతి. 42

చిరకాలముసమాధి నభ్యసించుటచేతను, ఆత్మభావన దృఢపడుట వలనను, మనస్సు తన చాపల్యమును వీడి దుఃఖమునొందకుండును.

మనఃప్రమాదాద్వర్ధంతే దుఃఖానిగిరికూటవత్
తద్వశాదేవ నశ్యంతి సూర్యస్యాగ్రే హిమంయథా. 43

మనస్సుయొక్క ప్రమాదమువలననే జీవులకు దుఃఖములు పర్వతాకారమున వృద్ధియగుచున్నవి. కాని, మనస్సు వశీకృతమైనచో నవన్నియు సూర్యుని యెదుట మంచుబొట్లవలె శీఘ్రముగ నశించును.

యావజ్జీవమనింద్యయాచ రమతే శాస్త్రార్థసంజాతయా
తుల్యంవాసనయామనోహి మునివన్మౌనేనరాగాదిషు
పశ్చాత్పావనపావనం పదమజం తత్ప్రాప్యతచ్ఛీతలం
తత్సంస్థేననశోచ్యతే పునరలం పుంసామహాపత్స్వపి. 44

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
చిత్తోపాఖ్యానం నామైకోనశతతమః సర్గః ॥ 99 ॥
చిత్తోపాఖ్యానం సంపూర్ణమ్.

శాస్త్రార్థగ్రహణముచే నుత్పన్నమైన యుత్తమసంస్కారములును, సమభావమున్ను గల్గి రాగద్వేషాదులచే చలింపక యింద్రియ నిరోధమొనరుచు మునివలె సంచరించుచో నపు డతిపవిత్రమును, జన్మాదివికారరహితమును, శాంతిదాయకమును (ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక తాపముల నశింపచేయునదియు) నగు బ్రహ్మపదమందు చిరకాలము ప్రతిష్ఠితుడై యనుజుడెట్టి విపత్తులందుగూడ చలింపక, దుఃఖమును బొందక యుండును.



ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
చిత్తోపాఖ్యానమను ఏకోనశతతమ సర్గము ॥ 99 ॥
చిత్తోపాఖ్యానము సంపూర్ణము

## శతతమః సర్గః

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

చిత్తమేతదుపాయాతం బ్రహ్మణఃపరమాత్పదాత్
అతన్మయంతన్మయంచ తరంగఃసాగరాదివ. 1

వసిష్ఠుడు:— ఓ రామా! పరమపదమగు బ్రహ్మమునుండి అతన్మయ (బ్రహ్మభూతమగు అజ్ఞానముయొక్క వికారము) తన్మయాత్మకమగు (శుద్ధ బ్రహ్మముయొక్క వివర్తరూపమగు) యీ మనస్సు సముద్రమునుండి తరంగమువలె నుత్పన్నమాయెను.

ప్రబుద్ధానాంమనోరామ బ్రహ్మైవేహహినేతరత్
జలసామాన్యబుద్ధీనామబ్ధేర్నాన్యస్తరంగకః. 2

ఓ రామా! జలసామాన్య రూపమెఱింగిన వాని దృష్టియందు తరంగము సముద్రమునకెట్లు వేఱుగాకయుండునో, అట్లనే జ్ఞానులదృష్టియందు మనస్సు బ్రహ్మమేగాని యన్యము గాదు.

మనోరామాప్రబుద్ధానాం సంసారభ్రమకారణమ్
అపశ్యతోఽంబుసామాన్య మన్యతాంబుతరంగయోః. 3

జలసామాన్య రూపమెఱుంగనివాడు జల, తరంగములందు భేదముగాంచుచు భ్రమను పొందునట్లు, అజ్ఞులచిత్తమే యీ సంసార భ్రమణమునకు కారణమగును.

అప్రబుద్ధదృశాంపక్షే తత్త్వబోధాయకేవలమ్
వాచ్యవాచకసంబంధకృతోభేదఃప్రకల్ప్యతే. 4

అజ్ఞుల యుపదేశార్థమే వాచ్యవాచక సంబంధముచే భేదకల్పన యొనర్పబడుచుండును.

సర్వశక్తిపరంబ్రహ్మ నిత్యమాపూర్ణమవ్యయమ్
నతదస్తినతస్మిన్య ద్విద్యతే వితతాత్మని. 5

పరమాత్మ సర్వశక్తిమంతుడును, నిత్యుడును, సర్వత్ర పూర్ణమైయుండి వెలుగుచున్నవాడును గాన, నట్టివ్యాపక పరబ్రహ్మమునందు లేని వస్తువేలేదు.

సర్వశక్తిర్హి భగవాన్ యైవ తస్మై హి రోచతే
శక్తిం తామేవ వితతాం ప్రకాశయతి సర్వగః. 6

భగవంతుడగునాతడు సర్వశక్త్యుపేతుడు. అతనికట్టి సర్వశక్తిత్వమే శోభించును. సర్వవ్యాపియగు నాతడు తన సర్వశక్తిత్వము నంతటను కార్యరూపమున ప్రకటిత మొనర్చుచున్నాడు.

చిచ్ఛక్తిర్బ్రహ్మణో రామ శరీరేష్వభిదృశ్యతే
స్పందశక్తిశ్చ వాతేషు జడశక్తిస్తథోపలే. 7

ఓ రామా! బ్రహ్మముయొక్క చేతనాశక్తి, అండజాది చతుర్విధ ప్రాణులన్నింటియందును గలదు. మఱియునది వాయువందు చలనశక్తిగను, శిలయందు జడత్వముగను నున్నది.

ద్రవశక్తిస్తథాంభఃసు తేజఃశక్తిస్తథానలే
శూన్యశక్తిస్తథాకాశే భావశక్తిర్భవస్థితౌ. 8

అట్లే జలమందు ద్రవశక్తిగను, అగ్నియందు ప్రకాశశక్తిగను, ఆకాశమున శూన్యశక్తిగను, సంసారస్థితియందు వ్యవహార యోగ్యత్వశక్తిగను, అయ్యది (బ్రహ్మముయొక్క చేతనాశక్తి) గాంచబడుచున్నది.

బ్రహ్మణః సర్వశక్తిర్హి దృశ్యతే దశదిగ్గతా
నాశశక్తిర్వినాశేషు శోకశక్తిశ్చ శోకిషు. 9

బ్రహ్మముయొక్క శక్తులన్నియు దశదిక్కులందును వ్యాప్తమై యున్నవి. నాశవంతములగు పదార్థములందలి నాశశక్తియు, దుఃఖితులందలి శోకశక్తియు నవియే.

ఆనందశక్తిర్ముదితే వీర్యశక్తిస్తథా భటే
సర్గేషు సర్వశక్తిశ్చ కల్పాంతే సర్వశక్తితా. 10

ప్రసన్నునియందలి ప్రసన్నత్వమును, శూరవీరులందలి పరాక్రమశక్తియు, సృష్టులందలి సృష్టిరచనాశక్తియు, ప్రళయమందలి సర్వశక్తిత్వమును, ఆ పరబ్రహ్మయే యగును. ఏలయనగా పదార్థములన్నింటి యొక్క బీజమదియే గదా!

ఫలపుష్పలతాపత్ర శాఖావిటపమూలవాన్
వృక్షబీజే యథా వృక్షస్తథేదం బ్రహ్మణి స్థితమ్. 11

బీజమందెట్లు ఫలపుష్ప లతాపత్ర శాఖావిటప మూలసహితమగు వృక్షమెట్లుండునో అట్లే బ్రహ్మమందీ జగత్తుగలదు.

ప్రతిభాసవశాదేవ మధ్యస్థం చిత్తజాడ్యయోః
జీవేతరాభిధం చిత్తమంతర్బ్రహ్మణి దృశ్యతే. 12



చిత్తజడత్వముల మధ్యనున్న జీవుడను సంజ్ఞగలిగినట్టి చిదాభాసుడు సాక్షిచైతన్యముయొక్క బలముచే బ్రహ్మమందు స్థితి గల్గియుండును.

నానాతరులతాగుల్మ జాలపల్లవశాలయః
నిర్వికల్పకచిన్మాత్రం నానాఽనిర్జ్ఞాతకల్పనా. 13

నానావిధములగు తరుగుల్మలతా పల్లవసమూహములును, ధాన్యాదులును, మఱియు నీ దృశ్యప్రపంచమంతయును (అజ్ఞాత) చైతన్యముయొక్క వివర్తమే గాన, అవన్నియు శుద్ధచైతన్య రూపములే యగును.

బ్రహ్మైవేదమహం త్వం జగత్పశ్యాద్య రాఘవ
స ఆత్మా సర్వగో నామ నిత్యోదితమహావపుః. 14

ఓ రామా ! ఈ జగత్తును, 'నేన'ని భావించు జీవత్వమును చిద్రూప పరబ్రహ్మముగ నే గాంచుము. చిత్స్వరూపుడును, సర్వవ్యాపియు నగు ఆ పరమాత్మ మహచ్ఛరీరయుతుడై సదా ప్రకాశించుచుండును.

యన్మనాఙ్మననీం శక్తిం ధత్తే తన్మన ఉచ్యతే
పిచ్ఛభ్రాంతిర్యథా వ్యోమ్ని పయస్యావర్తధీర్యథా. 15
ప్రతిభాసకలామాత్రం మనో జీవస్తథాఽఽత్మని
యదేతన్మనసో రూపముదితం మననాత్మకమ్. 16

మననశక్తిని గల్గియుండు చైతన్యమే మనస్సనబడును. మఱియు నాకసమున నెమలి పింఛముయొక్క నీలత్వమునుగూర్చిన భ్రాంతిగల్గునట్లును, జలమందావర్తబుద్ధి గల్గునట్లును, ప్రతిభాసారూపముననే మనస్సును జీవుడును ఆత్మయందుగలరు. కాన అట్టి ఆత్మనుండియే మననరూపమగు మనస్సావిర్భవించినదగును.

బ్రహ్మశక్తిరసౌ తస్మాద్బ్రహ్మైవ తదరిందమ
ఇదం తదహమిత్యేవ విభాగః ప్రతిభాసజః. 17

శత్రునాశకుడవగు నో రామా ! ఈ సమస్తమును బ్రహ్మముయొక్క శక్తియే గాన, బ్రహ్మాండమంతయును బ్రహ్మస్వరూపముగ నెఱుంగుము. 'ఇది' 'అది' 'నేన'ను భిన్న విభజన యంతయును ప్రతిభాసావశమున నుత్పన్నమైనది.

మనసో బ్రహ్మణోఽన్యచ్చ మోహే పరమకారణమ్
యద్యచ్చేతన్మనస్యేవ కించిత్సదసదాత్మకమ్. 18
వ్యాశబ్దితం సర్వశక్తేస్తాం శక్తిం బ్రహ్మతాం విదుః
మనః సత్తాత్మకం నామ యథైతన్మనసి స్థితమ్. 19

మనోజీవబ్రహ్మల భిన్నత్వమునకు హేతువగునదిగూడ మనస్సనందే ఆవిర్భావతిరోభావముల బొందునదగుటచే నదియు సదసదాత్మకమగు బ్రహ్మయొక్క బ్రహ్మత్వమనియే చెప్పబడునుగాని, అన్యముగ గాదు. సంసర్గాధ్యాసముచే బ్రహ్మసత్త మనస్సున ప్రతిష్ఠితమైయున్నది.

యథర్తోః శక్తయస్తద్వ జ్జీవేహ బ్రహ్మణి స్థితాః
వ్యాప్తసర్వర్తుకుసుమా త్స్మాద్దేశవిధిభేదతః. 20
యథా దదాతి పుష్పాణి తథా చిత్తాని లోకకృత్
క్వచిత్క్వచిత్కదాచిద్ధి తస్మాదాయాంతి శక్తయః. 21
దేశకాలాదివైచిత్ర్యాత్ క్ష్మాతలాదివశాలయః
న జాతం ప్రతిభాసేన తేనైవాన్యేన పశ్యతి. 22

వసంతాది ఋతువులశక్తి వృక్షమందుండులాగున, జీవుని క్రియలును, మనోధర్మము లన్నియును బ్రహ్మమందే గలవు. ఋతువులన్నిటియందలి పుష్పసమూహముల నుత్పన్నముచేయు శక్తి భూమియందున్నను ఆయాప్రదేశమందలి ఆయాబీజముల సంస్కారభేదము ననుసరించియే యుత్పన్న మొనర్చు విధమున బ్రహ్మము చిత్తశక్తులన్నంటిని తనయందు ధరించియున్నది. దేశకాల వైచిత్ర్యము ననుసరించి భూమియందు ధాన్యశక్తి ప్రకటితమగునట్లు, పరమాత్మయు దేశకాలముల ననుసరించి వ్యవస్థిత ఫలరూపముగ ఆయాశక్తులను వ్యక్త మొనర్చుచుండును. ప్రతిభాసముచే నుత్పన్నమైనది యథార్థముగ లేనిదే యగును. ఏలన, ప్రతిభాసికము (మృగతృష్ణాదులు) నకు కర్తృత్వముండజాలదు. ఇక పరమార్థస్థితియం దెవరు దేనిచే దేనిని జూతురు? (యత్రత్వస్యాద్వైత మేవాభూత్ తత్ర కేన పశ్యేత్) ఎచట ఆత్మసత్త యొక్కటిమాత్రము గలదో అచ్చట యెవరు దేనిచే దేనిని జూతురు?

ప్రతియోగివ్యవచ్ఛేద సంఖ్యారూపాదయశ్చ యే
మనః శబ్దైః ప్రకల్ప్యంతే బ్రహ్మజాన్బ్రహ్మ విద్ధి తాన్. 23

ప్రతియోగి (ఒకదాని యభావము, లేక విశేషణము), వ్యవచ్ఛేదము, (ఒక శబ్దమునుండి వేఱు చేయుబడునది), సంఖ్యా రూపాదులనునట్టి యీ జగద్వైచిత్ర్యములన్నియును మనస్సుచేతనే కల్పింపబడి, వివర్తరూపమున బ్రహ్మమునుండి యుత్పన్నమగుచున్నవి గాన యవియును బ్రహ్మమే యని యెఱుంగుము.

యథా యథాఽస్య మనసః ప్రతిభాసః ప్రవర్తతే
తథా తథైవ భవతి దృష్టాంతోఽత్ర కిలైందవాః. 24

ఏయేవిధమున యీ ప్రతిభాసాత్మకమగు మనస్సు ప్రవృత్తమగుచుండునో ఆయావిధమున అంతయును నిక్కముగ సంభవించుచుండును. ఐందవుల సృష్టియే యిందులకు దృష్టాంతము.

స్వయముద్భుద్ధవిమలే యథా స్పందో మహాంభసి
సంసారకారణం జీవస్తథాఽయం పరమాత్మని. 25

ప్రశాంతజలమున తరంగమువలె పరమాత్మయందీ ప్రపంచకల్పన యంతయును గలదు. ఇట్టి కల్పనకు కారణము జీవరూపముననున్న పరబ్రహ్మమేగాని అన్యముకాదు.

జ్ఞస్య సర్వంచితం రామ బ్రహ్మైవావర్తతే సదా
కల్లోలోర్మితరంగాఖ్యైరబ్ధేర్జలమివాత్మని. 26

సముద్రమందలి కల్లోల బుద్బుద తరంగాదులన్నియు జలమే యగునట్లు జ్ఞానికంతటను బ్రహ్మమే వ్యాపమై యున్నట్లు కాన్పించును.



ద్వితీయా నాస్తి సత్తైకా నామరూపక్రియాత్మికా
పరే నానాతరంగేఽబ్ధౌ కల్పనేవ జలేతరా. 27

అనేక తరంగములతో కూడియున్న సముద్రమందును జలముకంటె అన్యముగ యేదియు లేనట్లు, వికారవంతమగు యీ జగత్తునందును పరమాత్మకు వేఱుగ నెద్దియును లేదు. ఆ పరబ్రహ్మమున నామరూప క్రియాత్మకమగు వేఱొకసత్త లేదు.

జాయతే నశ్యతి తథా యదిదం యాతి తిష్ఠతి
తదిదం బ్రహ్మణి బ్రహ్మ బ్రహ్మణా చ వివర్తతే. 28

ఉత్పన్నమగుట, నశించుట, పోవుట, ఉండుట మొదలగు దృశ్యవికారములన్నియును ముత్తెపుచిప్పయందు వెండివలె బ్రహ్మమందు భాసించుచున్నవి.

స్వాత్మన్యేవాతపస్తీవ్రో మృగతృష్ణికయా యథా
విచిత్రేణ విచిత్రోఽపి ప్రస్ఫురత్యాత్మనా తథా. 29

తీక్ష్ణాతపమెట్లు మృగతృష్ణారూపమున భాసించునో, అట్లే నామరూపసహితమైయున్నను ఆత్మ స్వయముగ యీ జగద్వైచిత్ర్యరూపమున భాసించుచున్నది.

కరణం కర్మకర్తా చ జననం మరణం స్థితిః
సర్వం బ్రహ్మైవ న హ్యస్తి తద్వినా కల్పనేతరా. 30

కరణ కర్మకర్తలును, జననమరణములును ఆ పరమాత్మయే. ఆతనికన్యముగ యే కల్పనయు లేదుగదా?

న లోభోఽస్తి న మోహోఽస్తి న తృష్ణాఽస్తి న రంజనా
క ఆత్మన్యాత్మనో లోభస్తృష్ణామోహోఽథవా కుతః. 31

పరమార్థమున లోభమోహతృష్ణాసక్తు లెవ్వియునులేవు. ఆత్మయందాత్మకు లోభము గాని తృష్ణగాని యెట్లుండును?

ఆత్మైవేదం జగత్సర్వమాత్మైవ కలనాక్రమః
హేమాంగదతయేవాయ మాత్మోదేతి మనస్తయా. 32

జగత్తున్ను, కల్పనాక్రమమంతయున్ను ఆత్మయేయగును. ఆభరణరూపమున సువర్ణమే ప్రకాశించునట్లు ఆత్మయే మనోరూపమున ప్రకటితమగుచున్నది.

అబుద్ధం యత్పరం ధామ తచ్చిత్తం జీవ ఉచ్యతే
అపరిజ్ఞాత ఏవాశు బంధురాయాత్యబంధుతామ్. 33

ఉత్తమమగు ఆత్మపదముయొక్క అనభిజ్ఞత్వమే చిత్తమనియు, జీవుడనియు చెప్పబడును. అజ్ఞానదశయందలి బంధము జ్ఞానముచే విచ్ఛేదమై బంధరహితమగుచున్నది.

చిన్మయేనాత్మనాఽజ్ఞేన స్వసంకల్పనయా స్వయమ్
శూన్యతా గగనేనేవ జీవతా ప్రకటీకృతా. 34

ఆకాశము శూన్యత్వమును వ్యక్తమొనర్చునట్లు అజ్ఞాత చిన్మయ పరమాత్మయే తనసంకల్పముచే జీవత్వమును ప్రకటిత మొనర్చుచున్నాడు.

ఆత్మైవానాత్మవదిహ జీవో జగతి రాజతే
ద్వీందుత్వమివ దుర్దృష్టేః సచ్చాసచ్చసముత్థితమ్. 35

ఈ జీవు డాత్మస్వరూపుడైనను, అనాత్మభూతమగు అహంకారాదులతో నభేదమును పొందుటచే యీ దృశ్యజగత్తంతయు నావిర్భవించినది. జీవుని యీ కలుషితదృష్టి ద్వైతరూపమున యిద్దరు చంద్రులవలె మిథ్యగను, అద్వైతరూపమున సత్తగను యగును.

మోహార్థశబ్దార్థదృశో రేతయోరత్యసంభవాత్
సత్యత్వాదాత్మనశ్చైవ క్వాత్మా బద్ధః క్వ ముచ్యతే. 36

ఇట్లు, శబ్దార్థ దృష్టులన్నిటియొక్క అత్యంతాసంభవము సిద్ధించుచున్నందునను, ఆత్మ సర్వదా సత్యమును, అసంగమును నగుటచేతను, యిక బంధము క్తులెచట ?

నిత్యాసంభవబంధస్య బద్ధోఽస్మీతి కుకల్పనా
యస్య కాల్పనిక స్తస్య మోక్షో మిథ్యా న తత్త్వతః. 37

సదా బంధరహితుడై యుండువానిని బద్ధుడనుట కల్పనయే యగును. యథార్థముగ మోక్షమునుగూడ లేదు. ఎవనికి బంధము కల్పితమే యగునో వానికిక మోక్షమున్నా మిథ్యయే యగునుగాని వాస్తవముగాదు.

శ్రీరామ ఉవాచ:—

మనోఽయం నిశ్చయం యాతి తత్తద్భవతి నాన్యథా
తేన కాల్పనికో నాస్తి బంధః కథమిహ ప్రభో. 38

శ్రీరాముడు:— ఓ మునీంద్రా! ఈ మనస్సెట్లు నిశ్చయించునో అట్లే యగును గాని మఱొక విధముగ కాదుగదా! అట్లయిన మనః కల్పనయు కల్పితమే యగును. గాన యిక దానికి బంధమెచట ?

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

మిథ్యా కాల్పనికీ వేయం మూర్ఖాణాం బంధకల్పనా
మిథ్యైవాభ్యుదితా తేషామితరా మోక్షకల్పనా. 39

వసిష్ఠుడు:— ఓ రామా! స్వప్నపదార్థములు జాగ్రద్దశయందెట్లు మిథ్యయగునో, అట్లే బంధమునుగూర్చిన అజ్ఞానుల కల్పనయు మిథ్యయే. కాన జ్ఞానుల దృష్టియందు మోక్షకల్పనయు మిథ్యయే యగును.

ఏవమజ్ఞానకాదేవ బంధమోక్షదృశోఽస్మృతేః
వస్తుతస్తు న బంధోఽస్తి న మోక్షోఽస్తి మహామతే. 40

ఓ మహామతీ! ఇవ్విధమున బంధమోక్షకల్పన, తుచ్ఛమును అనిర్వచనీయమును నగు



అజ్ఞానమువలననే కలుగుచున్నది. ఈ బంధమోక్షములు సత్యములనుట స్మృతి విరుద్ధము ('న ముముక్షుర్న వై ముక్త ఇత్యేషా పరమార్థతా' = యథార్థముగ ముముక్షువుగాని ముక్తుడుగాని లేడు.) పరమార్థమున బంధమోక్షములే లేవు.

కల్పనాయా అవస్తుత్వం సంప్రబుద్ధమతిం ప్రతి
రజ్జ్వహేరివ హే ప్రాజ్ఞ తత్త్వాబుద్ధమతిం ప్రతి. 41

ప్రాజ్ఞుడగు ఓ రామా! రజ్జుసర్ప దృష్టాంతమునందువలె కల్పనయొక్క అవస్తుత్వమేది వచింపబడెనో, అది ప్రబుద్ధుడగు జ్ఞానినిగూర్చి యనియు, పూర్వోక్తమగు అనిర్వచనీయత్వమజ్ఞానినిగూర్చి యనియు తెలిసికొనుము.

బంధమోక్షాదిసంమోహో న ప్రాజ్ఞస్యాస్తి కశ్చన
సంమోహాబంధమోక్షాది వ్యాజ్ఞస్యైవాస్తి రాఘవ. 42

ఓ రామా! బంధమోక్షములఁగూర్చిన వ్యామోహము తత్త్వవేత్తల కేమియును లేదు. ఆ బంధ మోక్ష కల్పన అజ్ఞానికిమాత్రమే యగును.

ఆదౌ మనస్తదనుబంధవిమోక్షదృష్టీ
పశ్చాత్ప్రపంచరచనా భువనాభిధానా
ఇత్యాదికాస్థితిరియం హి గతా ప్రతిష్ఠా
మాఖ్యాయికా సుభగ బాలజనోదితేవ. 43

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
చిత్తచికిత్సాపూర్వకం చిత్తోత్పత్తివర్ణనంనామ
శతతమః సర్గః ॥ 100 ॥

సత్యవ్రతుడగునో రామా! మాయావేష్టితుడగు పరమాత్మనుండి ప్రథమమున మనస్సున్ను, పిమ్మట బంధ మోక్షములగూర్చిన కల్పనయు, ఆ పిదప జగన్నిర్మాణము మొదలైనవాని స్థితియు క్రమముగ బాలకాఖ్యానమువలె రూఢిని బొందినవి.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
చిత్తచికిత్సాపూర్వక చిత్తోత్పత్తివర్ణనమను
శతతమ సర్గము ॥ 100 ॥

## ఏకాధికశతతమః సర్గః.

శ్రీరామ ఉవాచ:—

కిముచ్యతే మునిశ్రేష్ఠ బాలకాఖ్యాయికా క్రమః
క్రమేణ కథయైతన్మే మనోవర్ణనకారణమ్. 1

శ్రీరాముడు:— ఓ మునీంద్రా ! బాలకాఖ్యానమేమి ? అది లోకమున యెట్లు వచింపబడుచున్నది? మఱియు నీ మనోవర్ణనకుఁగల కారణమేమి ? క్రమముగ తెలియజేయుఁడు.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

కోఽపి ముగ్ధమతిర్బాలో ధాత్రీం పృచ్ఛతి రాఘవ
కాంచిద్వినోదినీం ధాత్రి వర్ణయాఖ్యాయికామితి. 2

వసిష్ఠుడు:— ఓ రామా ! సత్యాసత్య వివేచనా శూన్యమగు బుద్ధిగల బాలుఁడొకడు తన దాదితో, మనోరంజకమగు కథ నొకదానిఁ జెప్పుమని యడిగెను.

స బాలస్య వినోదాయ ధాత్రీ తస్య మహామతే
ఆఖ్యాయికాం కథయతి ప్రసన్నమధురాక్షరామ్. 3

మహామతివగు నో రామా ! అంత నాదాది యబ్బాలుని వినోదార్థ మానందదాయకమును, మధుర పదసహితమును నగు నొక కథను యిట్లు చెప్ప దొడగెను.

క్వచిత్సంతి మహాత్మానో రాజపుత్రాస్త్రయః శుభాః
ధార్మికాః శౌర్యముదితా అత్యంతాసతి పత్తనే. 4

ఓ బాలకా! ఒకానొక శూన్యనగరమున సౌందర్యవంతులును, ధార్మికులును, వీరులును నగు ముువ్వురు రాజపుత్రులు గలరు.

విస్తీర్ణే శూన్యనగరే వ్యోమ్నీవ జలతారకాః
ద్వౌ న జాతౌ తథైకస్తు గర్భ ఏవ న సంస్థితః. 5

ఆకసమున జలమందు నక్షత్రములవోలె వారిలో నిద్దఱు జన్మించనే లేదు. మఱియొకడు తల్లి గర్భముననే యింక ప్రవేశింపలేదు.

అథాత్యుత్తమలాభార్థం కదాచిత్సమవాయతః
విబంధవః ఖిన్నముఖాః శోకోపహతచేతసః. 6

దైవవశమున బంధువులు మరణించుటచే మలినముఖులును, దుఃఖాక్రాంతులునునై, అందఱును కలసి నిశ్చయించుకొన్నవారై యుత్తమలాభార్థ మా శూన్యనగరమునుండి మఱియొక నగరమునకు బోవుటకై వారు బయలుదేఱిరి.

తే తస్మాచ్ఛూన్యనగరాన్నిర్గతా వితతాననాః
గగనాదివ సంశ్లిష్టా బుధశుక్రశనైశ్చరాః. 7

విశాలముఖులగు నా ముువ్వురు రాజతనయులును గలసి యాకసమునుండి వెడలిన బుధ శుక్ర శనులవలె, ఆ శూన్యనగరమునుండి బయలుదేఱిరి.

శిరీషసుకుమారాంగాః పృష్ఠతోఽర్కేణ తాపితాః
మార్గేఽహని గతా గ్రీష్మతాపార్తాః పల్లవా ఇవ. 8



శిరీష (దిరిశెన) పుష్పమువలె కోమలమైన అవయవములు గల వారు ముగ్గురును మార్గమున గ్రీష్మర్తునందలి పల్లవములవలె యెండవేడిమిచే తపించిరి.

సంతప్తమార్గసికతా దగ్ధపాదసరోరుహాః
హా తాత చేతి శోచంతో మృగా యూథచ్యుతా ఇవ. 9

మార్గమునగల వేడియిసుకచే పాదములు కాలినందున, సమూహమునుండి వేఱుపడిన మృగమువలె వారు ఖిన్నులై 'అయ్యో' అని విలపించిరి.

దర్భాగ్రభిన్నచరణా స్తాపఖిన్నాంగసంధయః
ఉల్లంఘ్య దూరమధ్వానం ధూలిధూసరమూర్తయః. 10
మంజరీజాలజటిలం ఫలపల్లవమాలితమ్
మృగపక్షిగణాధారం ప్రాపుర్మార్గే తరుత్రయమ్. 11

కుశాగ్ర భాగములచే పాదస్థలము పీడింపబడ, సూర్యతాపముచే సంతప్తులైన ధూసరిత గాత్రులగు ఆ రాజకుమారులు చాలదూర మేఁగి, యచట పెక్కులతలచే శోభితములును, ఫలపత్రములచే పూర్ణమై యొప్పునవియు, పలువిధములగు పక్షుల కాశ్రయములు నగు మూఁడు వృక్షములఁ జూచిరి.

తస్మిన్వృక్షత్రయే వృక్షౌ ద్వౌ న జాతౌ మనాగపి
బీజమేవ తృతీయస్య స్వారోహస్య న విద్యతే. 12

ఆ మూఁడు వృక్షములలో రెండుత్పన్నమే గాకయుండెను. మూఁడవదానికి బీజమేలేదు.

విశ్రాంతాస్తే పరిశ్రాంతాస్తత్రైకస్య తరోరధః
పారిజాతతలే స్వర్గే శక్రానిలయమా ఇవ. 13

వాటిలో నొకదానిక్రింద, స్వర్గమందు కల్పవృక్షము క్రింద యింద్రాగ్ని యములవలె, వారు విశ్రమించిరి.

ఫలాన్యమృతకల్పాని భుక్త్వా పీత్వా చ తద్రసమ్
కృత్వా గులుచ్ఛకైర్మాలాం చిరం విశ్రమ్య తే యయుః. 14

అమృతతుల్యములగు నా వృక్షఫలములఁ భుజించి, వాని రసముఁ త్రావి, పుష్పమాలలధరించి, చాలసేపచట విశ్రమించి, పిదప యటనుండి మరల బయలుదేరిరి.

పునర్దూరతరం గత్వా మధ్యాహ్నే సముపస్థితే
సరిత్త్రితయమాసేదుస్తరంగతరలారవమ్. 15

చాలదూరమేగిన పిదప, మధ్యాహ్నసమయము కాగా, నపుడొకచోట తరంగములచే చంచలమై, శబ్దమొనర్చుచున్న మూఁడు నదులఁ గాంచిరి.

తత్రైకా పరిశుష్కైవ మనాగప్యంబు న ద్వయోః
విద్యతే సరితోర్దృష్టిరంధలోచనయోరివ. 16

వాటిలో నొకదానియం దెప్పుడును జలము శుష్కించియే యుండును. అంధుని నేత్రము లందు దృష్టివలె, తక్కిన రెంటియందును జలమేమియు నుండదు.

పరిశుష్కా భృశంయాసా తస్యాంతే సస్నురాదృతాః
ఘర్మార్తా ఇవ గంగాయాం బ్రహ్మవిష్ణుహరా ఇవ. 17

ఆ శుష్కజలముగల నదియందు, సూర్య తాపపీడితులగు వారు ముప్పురును, గంగయందు బ్రహ్మ విష్ణు మహేశ్వరులవలె స్నానమొనర్చిరి.

చిరం కృత్వా జలక్రీడాం పీత్వా క్షీరోపమం పయః
జగ్ముస్తే రాజతనయాః ప్రహృష్టమనసః స్వయమ్. 18

చాలసేపచట జలక్రీడలుసల్పి, క్షీరమువలె స్వచ్ఛమైన యా జలముఁద్రావి, ఆ రాజపుత్రులు ప్రసన్నులైరి.

అథాసేదుర్దినస్యాంతే లంబమానే దివాకరే
భవిష్యన్నవనిర్మాణం నగరం నగసన్నిభమ్. 19

పిమ్మట, సూర్యాస్త సమయమునకు, వారు నూతనముగ నిర్మింపబడినదియు, పర్వతమువలె యెత్తైన భవనములు గలదియునగు భవిష్యన్నగరమును జేరిరి.

పతాకా పద్మినీవ్యాప్తం నీలాకాశజలాశయమ్
దూరశ్రుతసముల్లాప గాయన్నాగరమండలమ్. 20

పతాకయుక్తములును, కమలములచే నిండియున్నవియు నీలాకాశమువలె సుందరములును నగు వనములు గలదియు, శూన్యసరోవరములచే నొప్పునదియు, దూరమునకు వినిపించుచున్న నగర నివాసుల గానముగలదియు నగు ఆ నగరమును వారపుడు ప్రవేశించిరి.

దదృశుస్తత్ర రమ్యాణి త్రీణి సద్మవనాని తే
మణికాంచనగేహాని శృంగాణీవ మహాగిరేః. 21

అచట, సుమేరు పర్వతఖండమువలె మణి జటిత సువర్ణమయమగు శ్రేష్ఠభవనముల మూఁడింటిని గాంచిరి.

అనిర్మితే ద్వే సదనే ఏకం నిర్భిత్తి తత్ర వై
అభిత్తిమందిరం చారు ప్రవిష్టాస్తే నరాస్త్రయః. 22

వాటిలో రెండింకను నిర్మింపబడలేదు. ఇక మూఁడవదానికి గోడలే లేవు. గోడలు లేనట్టి ఆ యుత్తమగృహమందు, ముప్పురు రాజతనయులును బ్రవేశించిరి.

సంప్రవిశ్యోపవిశ్యాశు విహరన్తో వరాననాః
ప్రాపుః స్థాలీత్రయం తత్ర తప్తకాంచనకల్పితమ్. 23

అట్లు బ్రవేశించి, సుందరముఖులగు వారచట విహరించుచుండ నొకచోట తప్త సువర్ణ నిర్మితములగు మూడు పాత్రలఁజూచిరి.



తత్ర కర్పరతాం యాతే ద్వే ఏకా చూర్ణతాం గతా
జగృహుశ్చూర్ణరూపాం తాం స్థాలీంతే దీర్ఘబుద్ధయః. 24

ద్రోణైర్నవనవత్యా తై స్తస్యాం ద్రోణేన చాంధసః
తత్ర ద్రోణశతం హీనం రంధితం బహుభోజిభిః. 25

వానిలో రెండు కపాలరూపము గల్గియు, నొకటి చూర్ణమైపోయియు నుండెను. ఉత్తమ ధీశాలురగు వారా చూర్ణమైన పాత్రనే గ్రహించి, అద్దానియందు నూఱు ద్రోణములు (10 సేర్లు) తక్కువగనున్న నూఱు ద్రోణముల యన్నమును, యితర సంభారము లనేకములతోగూడ వండిరి.

నిమంత్రితాస్త్రయస్తైస్తు బ్రాహ్మణా రాజసూనుభిః
ద్వౌ నిర్దేహావథైకస్య ముఖమేవ న విద్యతే. 26

వారపుడు ముగ్గురు బ్రాహ్మణులను భోజనార్థమై బిలచిరి. వారిలో నిరువురకు దేహమే లేదు. ఒకనికి ముఖముమాత్రము లేకుండెను.

నిర్ముఖేనాంధసస్తత్ర భుక్తం ద్రోణశతం సుత
విప్రభుక్తావశేషం తు భుక్తమంధో నృపాత్మజైః. 27

ఓ బాలకా! అంతనా ముఖములేని బ్రాహ్మణుఁడా నూఱుద్రోణముల యన్నమును తిని వైచెను. మిగిలినదాని నా ముప్పురు రాజపుత్రులును భక్షించిరి.

త్రిభిస్తే రాజపుత్రాశ్చ పరాం నిర్వృతిమాగతాః
భవిష్యన్నగరే తస్మిన్ రాజపుత్రాస్త్రయో హి తే
సుఖమద్య స్థితాః పుత్ర మృగయావ్యవహారిణః. 28

దానిచే తృప్తిఁజెందిన యా రాజతనయు లపుడా భవిష్యన్నగరమున వేటాడబోయిరి. వారు నేటికిని సుఖముగనే యున్నారు.

ఆఖ్యాయికైషా కథితా మయా రమ్యా తవానఘ
ఏతాం హృది కురు ప్రాజ్ఞ విదగ్ధస్త్వం భవిష్యసి. 29

పాపరహితుఁడవగు బాలకా! ఇట్టి యుత్తమ కథను నీకుఁజెప్పితిని. ఇద్దానిని నీవు మఱువక, హృదయమున ధరించుచో, గొప్ప పండితుడవు కాగలవు.

ధాత్ర్యేతి కథితా రామ బాలకాఖ్యాయికా శుభా
తుష్టిం జగామ బాలశ్చ శుభాఖ్యాయికయాఽనయా. 30

ఓ రామా! ఈ యుత్తమాఖ్యానమును, దాది బాలునకు వచింప నంత నాతఁ డదివిని ప్రసన్నుఁడయ్యెను.

ఏషా హి కథితా రామ చిత్తాఖ్యానకథాం ప్రతి
బాలకాఖ్యాయికా తుభ్యం మయా కమలలోచన. 31

కమలనేత్రుడవగు నో రామా! చిత్తాఖ్యానమును జెప్పినమీదట యీ జగత్తంతయును మనోవికల్పమాత్రమే యని చూపుటకొఱకై దృష్టాంతపూర్వకముగ నీ బాలకాఖ్యానమును నీకుం జెప్పితిని.

ఇయం సంసారరచనా స్థితిమేవముపాగతా
బాలకాఖ్యాయికేవోగ్రైః సంకల్పైర్దృఢకల్పితైః. 32

బాలకాఖ్యానమువలెనే సంకల్ప కల్పనలన్నియు దృఢపడగా, యీ సంసార రచనయంతయును స్థిరత్వముం జెందినది.

వికల్పజాలకైవేయం ప్రతిభాసాత్మికానఘ
బంధం మోక్షాదికలనారూపేణ పరిజృంభతే. 33

పాపరహితుఁడవగు నో రామా! ప్రతిభాసరూపమే యగు యివ్వికల్పజాలమంతయు బంధమోక్షాది కల్పనారూపమున విస్తరించుచున్నది.

సంకల్పమాత్రాదితర ద్విద్యతే నేహ కించన
సంకల్పవశతః కించిన్న కించిత్కించిదేవ వా. 34

ఈ కాన్పించునదంతయును సంకల్పమాత్రమే గాని అన్యము గాదు. ఇట్లు సంకల్పముచే భాసించునదంతయును యథార్థముగ భాసింపనిదే యగును. వాస్తవమునకది లేనిదిగాని, అనిర్వచనీయముగాని యగును.

ద్యౌః క్షమా వాయురాకాశం పర్వతాః సరితో దిశః
సంకల్పకచితం సర్వమేవం స్వప్నవదాత్మనః. 35

స్వర్గ, పృథ్వీ, వాయురాకాశ, దిక్, పర్వత, నదులన్నియును స్వప్నమువలె సంకల్పరూపములేయైయున్నవి.

రాజపుత్రాస్త్రయో నద్యో భవిష్యన్నగరే యథా
యథా సంకల్పరచనా తథేయం హి జగత్స్థితిః. 36

పైన దెల్పిన భవిష్యన్నగరమందలి ముగ్గురు రాజకుమారులును, నదులును సంకల్పమాత్రమే యగునట్లు, యీ జగత్-స్థితి యంతయునుకూడ సంకల్పమాత్రమే యగును.

సంకల్పమాత్రమభితః పరిస్ఫురతి చంచలః
పయోమాత్రాత్మకోఽంభోధిరంభసీవాత్మనాత్మని. 37

తరంగయుక్త సముద్రము జలమాత్రమే యగునట్లు, ఈ స్ఫురించున దంతయును సంకల్పమాత్రమే యగుచున్నది.

సంకల్పమాత్రం ప్రథమముత్థితం పరమాత్మనః
తదిదం స్ఫారతాం యాతం వ్యాపారైర్దివసం యథా. 38

పరమాత్మనుండి మొట్టమొదట సంకల్పముమాత్ర ముదయించెను. ప్రాణులయొక్కయు, సూర్యునియొక్కయు దైనిక క్రియలచే దినము విస్తరించునట్లు, పిమ్మట యీ జగద్రూపమంతయును క్రమముగ విస్తారమును బొందినది.



సంకల్పజాలకలనైవ జగత్సమగ్రం
సంకల్పమేవననువిద్ధి విలాసచేత్యమ్
సంకల్పమాత్రమలముత్సృజ నిర్వికల్ప
మాశ్రిత్య నిశ్చయమవాప్నుహి రామ శాంతిమ్. 39

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
బాలకాఖ్యాయికా నామైకాధికశతతమః సర్గః ॥ 101 ॥

ఓ రామా! ఈ ప్రపంచమంతయును సంకల్పరూపమే. మరియు మనోవికారములును, రాగాది వృత్తులును, వాటి విషయములును అన్నియు సంకల్పమాత్రమే యని యెఱుంగుము. కాన నిర్వికల్ప సమాధి నాశ్రయించి సంకల్పత్యాగమొనర్చుచో నిశ్చయముగ నీవు శాంతిఁబొందగలవు.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తి ప్రకరణమున
బాలకాఖ్యాయిక యను ఏకాధికశతతమ సర్గము ॥ 101 ॥

———:o:———

## ద్వ్యుత్తరశతతమః సర్గః.

**శ్రీ వసిష్ఠ ఉవాచః—**

స్వసంకల్పవశాన్మూఢో మోహమేతి న పండితః
అక్షయేఽక్షయసంకల్పాన్ముహ్యతే శిశురేవ హి. 1

వసిష్ఠుడు:— ఓ రామా! అజ్ఞాని తన సంకల్పవశమున మోహితుడగును గాని జ్ఞాని యెన్నటికిని కానేరడు. నాశరహితమగు పరమాత్మయందు నశ్వరమగు మనస్సుయొక్క సంకల్పముచే అజ్ఞుడే భ్రాంతిని గొనుచున్నాడు.

**శ్రీరామ ఉవాచః—**

కోఽసౌ సంకల్పితః కేన క్షయో బ్రహ్మవిదాంవర
అసత్యైవ మహామోహం యేనాదాత్తత్సదైవ హి. 2

శ్రీరాముడు:— ఓ బ్రహ్మవిద్వరా! దేనిచే ఈయాత్మ మహామోహమయమగు సంసార భ్రమను పొందుచున్నది? నశ్వరమగు సంకల్పమును కల్పనచేయున దెవరు? నిత్యాత్మయా లేక నశ్వరాత్మయా? ప్రథమపక్షము యుక్తము కాదు. ఏలన, అట్లొనర్చుటచే ఆత్మయొక్క నిత్యత్వమునకు హాని గల్గును. ఇక రెండవపక్షమును సరికాదు. నశ్వరాత్మ తన సంకల్పముచే తన్ను రచించుటనునది ఆత్మాశ్రయ దోషమగును. మరియు సంకల్పితమగు నశ్వరాత్మ జడమా? చేతనమా? జడమనిన చిదాత్మతో నైక్యమెట్లు పొందును? చేతనమనిన, చిద్వస్తువెట్లు సంకల్పించును?

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

అసతా భూతసంఘేన తయోఽహంకారనామధృక్
వేతాలః శిశునేవేహ మిథ్యైవ పరికల్పితః. 3

వసిష్ఠుడు:—ప్రాణులందఱియందును, అహంభావనా రూపమున నున్నట్టి, అవిద్యతో కూడుకొనిన పరమాత్మ ఆయా ప్రాణుల (నశ్వర సంకల్పాత్మలు)ను బేతాలుని బాలుడు కల్పించు నట్లు మిథ్యారూపములుగ కల్పనజేసెను.

ఏకస్మిన్నేవ సర్వస్మిన్ స్థితే పరమవస్తుని
కుతః కోఽయమహం నామ కథం నామ కిలోదితః. 4

ఒకే పరమాత్మయందంతయును స్థితిఁబొందియుండ యిక అహంకారమను వేఱొక టెట్లుండగలదు?

వస్తుతో నాస్త్యహంకారః పరమాత్మన్యభేదిని
అసమ్యగ్దర్శనాన్మార్గీ సరిత్తీవ్రాతపే యథా. 5

యథార్థముగ భేదరహితమగు పరమాత్మయందు అహంకారమనునదే లేదు. కాని తీక్ష్ణాతపమున మృగతృష్ణవోలె భ్రాంతిచే నయ్యది ప్రతిభాసించుచున్నది.

మనోమణిమహారంభః సంసార ఇతి లక్ష్యతే
ఆత్మనాత్మానమాశ్రిత్య స్ఫురత్యంతర్యథాంభసా. 6

జలము తనయందు తాను తరంగరూపమున వ్యక్తమగునట్లు, మనస్సను చింతామణి తన్ను తానాశ్రయించినదై తనయందే కార్యరూపమగు యీ జగత్తుగ ప్రకటితమగుచున్నది.

అసమ్యగ్దర్శనం తేన త్యజ రామ నిరాశ్రయమ్
సాశ్రయం సత్యమానంది సమ్యగ్దర్శనమాశ్రయ. 7

కావన నో రామా! అసద్విషయమునుగూర్చిన భ్రాంతిని నీవు త్యజింపుము. సత్యస్వరూపమును, ఆనందమయమును నగు సమ్యగ్దర్శనము (పరమాత్మ) నే ఆశ్రయింపుము.

ధియా విచారధర్మిణ్యా మోహసంరంభహీనయా
విచారయాధునా సత్యమసత్యం సంపరిత్యజ. 8

అజ్ఞానరహితుడవై నీవిపుడు విచారబుద్ధిచే ఆత్మతత్త్వ విచారణ సల్పి, అసద్వస్తువుఁ ద్యజింపుము.

అబద్ధో బద్ధ ఇత్యుక్త్వా కిం శోచసి ముధైవ హి
అనంతస్యాత్మతత్త్వస్య కిం కథం కేన బధ్యతే. 9

బద్ధుడవు గాకున్నను, బద్ధుడనని యెంచి యేల దుఃఖించుచున్నావు? అనంతమగు ఆత్మ యెవనిచే యెట్లు బంధింపబడును?

నానాఽనానాత్వకలనా త్వవిభిన్నమహాత్మని
సర్వస్మిన్బృంహితత్వేఽస్మిన్కిం బద్ధం కిం విముచ్యతే. 10



భేదరహితమగు పరమాత్మయందు భేదాభేదములఁగూర్చిన భ్రాంతి కల్పింపబడుచున్నది. అదంతయును తొలగగా, నిక బంధమేమి? ముక్తియేమి?

అనార్తోప్యార్తిమాన్ భాతి ఛిన్నేఽంగే కించ తామ్యతి
భేదాభేదవికారార్తిః కాచిన్నాత్మని విద్యతే. 11

ఆత్మ దేహరహితమైనను, దేహముతో కూడియున్నట్లు కన్పించుచున్నది. అట్టిచో నీ దేహము ఛిన్నభిన్నమైనను ఆత్మకేమి హాని? భేదాభేదములును, వికారములును శరీరమునకేగాని ఆత్మకు గావు.

దేహే నష్టే క్షతే క్షీణే కాత్మనః క్షతిరాగతా
భస్త్రాయాం పరిదగ్ధాయాం భస్త్రాపూరో న నశ్యతి. 12

దేహము నశించినను, వ్రణయుక్తమైనను, క్షీణించినను ఆత్మకేమి నాశము గల్గును? కొలిమితిత్తి దహింపబడిన, అందలి వాయువునకు ముప్పు సంభవించునా?

దేహః పతతు వోదేతు కా నః క్షతిరుపస్థితా
కో నష్టః ప్రక్షతే పుష్పే ఆమోదో వ్యోమసంశ్రయః. 13

దేహము పడుగాక, లేచుగాక! మనకేమి హాని? పుష్పము నశించినను, ఆకాశము నాశ్రయించునదగు గంధమునకేమి చెఱుపు గల్గును?

ఆపతంతు వపుః పద్మే సుఖదుఃఖహిమశ్రియః
ఆకాశోడ్డయనాలీనాం కా నః క్షతిరుపస్థితా. 14

సుఖదుఃఖ హిమము శరీరకమలముపై బడుగాక! అయినను, ఆకసమున నెగురు తుమ్మెదకు వలె దానిచే మనకుగాని లేక చంద్ర నక్షత్రాదులకుగాని యేమియును కీడు గల్గజాలదు.

దేహః పతతు వోదేతు యాతు వా గగనాంతరమ్
తద్విలక్షణరూపస్య కాసా భవతి మే క్షతిః. 15

ఈ శరీరము పడుగాక, లేచుగాక, ఆకసమున సంచరించుగాక! శరీర విలక్షణ స్వరూపుడగు నాకు దానిచే నేమి హాని గల్గును?

యథా పయోదమరుతోర్యథా షట్పదపద్మయోః
తథా రాఘవ సంబంధస్త్వచ్ఛరీరత్వదాత్మనోః. 16

ఓ రామా! దేహాత్మలకు సంబంధము గలదనినను, అయ్యది మేఘ వాయువులయొక్కయు, కమల భ్రమరములయొక్కయు సంబంధమువంటిదే యని తెలిసికొనుము.

మనో రామ శరీరం హి జగతః సకలస్య చ
ఆద్యా శక్తిశ్చిదధ్యాత్మా న నశ్యతి కదాచన. 17

ఈ జగద్రూపమంతయును మనస్సే యగును. మనోరూపమగు జగత్తుయొక్క ఆది... యగు చిదాత్మ మనస్సునకు పరమైనది. అదెన్నటికిని నశింపదు.

యోఽసావాత్మా మహాప్రాజ్ఞ న నశ్యతి న గచ్ఛతి
న నశ్యతి కదాచిచ్చ కిం ముధా పరితప్యసే. 18

ప్రజ్ఞాస్వరూప మెప్పుడును నశింపకయుండును. అయ్యదెచ్చటికిని బోదు. ఇట్లాత్మ యెన్నటికిని నశింపని దగుచున్నను, దేహాదుల వినాశముచే యేల వ్యర్థముగ దుఃఖితుడ వగుచున్నావు?

విశీర్ణేఽభ్రే యథా వాతః శుష్కేఽబ్జే షట్పదో యథా
యాత్యనంతపదం వ్యోమ తథాఽఽత్మా దేహసంక్షయే. 19

మేఘము నశించినపుడును, కమల మెండినపుడును, వాయుభ్రమరములు క్రమముగ నాకసముఁ బొందునట్లు దేహము నశింప ముక్తాత్మ బ్రహ్మపదము నొందుచున్నది.

సంసారేఽస్మిన్విహరతో మనోఽపి హి న నశ్యతి
జ్ఞానాగ్నినా వినా జంతోరాత్మనాశే తు కా కథా. 20

సంసారమున పరిభ్రమించు జీవునియొక్క మనస్సే శాశ్వతమైయుండగా నిక ఆత్మ విషయమై వేఱుగ జెప్పవలయునా?

యః కుండబదరన్యాయో యో ఘటాకాశయోః క్రమః
స్థితిర్దేహాత్మనోః సైవ సవినాశావినాశయోః. 21

నశ్వరమగు దేహముయొక్కయు, అవినాశియగు ఆత్మయొక్కయు సంబంధము కుండబదరన్యాయ (కుండపగిలినను, అందున్న ఫలము నశింపకయుండుట) ఘటాకాశ క్రమములవంటిదేయని యెఱుంగుము.

బదరం హస్తమాయాతి యథా స్ఫుటతి కుండకే
ఆత్మా గగనమాయాతి తథా చలతి దేహకే. 22

ఘటము నశించినను, యందున్న ఫలము నశింపక చేతికి జిక్కునట్లు శరీరము నశింప జీవాత్మ చిత్తాకాశమును పొందుచున్నది.

కుంభే గచ్ఛత్యకుంభత్వం కుంభాకాశో యథాంబరే
తిష్ఠత్యేవమయం క్షీణే దేహే దేహీ నిరామయః. 23

ఘటము నశించినను, ఘటాకాశము మహాకాశమందు యథారీతి యుండునట్లు శరీరము నశించినను, జీవాత్మ చిత్తాకాశమందు యథాప్రకారము స్థితి గల్గియుండును.

మనో దేహో హి జంతూనాం దేశకాలతిరోహితః
మహాకర్మ్రతిపటాచ్ఛన్నః శేతే కిం పరిదేవనా. 24

ప్రాణుల మనోమయ దేహము, మృత్యువను వస్త్రముఁ గప్పుకొని దేశకాలములందు దాగుకొనియున్నది. కాన, ఇట్టి వంచకమనంబునకై యేల పరితపింపవలెను?

దేశకాలతిరోధానే మూఢోఽపి మరణే నరః
కిం బిభేతి మహాబాహో నేహ పశ్యతి కశ్చన. 25



గృహాదిప్రదేశములందును, అంతిమశ్వాససూచితమగు మరణకాలమందును, ఆత్మ మఱుగుపడుటయే మరణము. దీనిని మూర్ఖుడును నెఱుఁగుచున్నాడు. ఇట్టి మరణమునుగూర్చి యేల భయపడెదవు? మహాబాహుపగునో రామా! లోకములో నెవ్వడును ఆత్మనాశమును గాంచుటలేదు.

అతస్త్వం వాసనాం రామ మిథ్యైవాహమితి స్థితామ్
త్యజ పక్షీశ్వరో వ్యోమ గమనోత్క ఇవాండకమ్. 26

కాన నోరామా! శక్తిగలిగినమీదట నాకసమున నెగుఱుటకొఱకై పక్షిపిల్ల గ్రుడ్డును వదలిజనునట్లు, మిథ్యారూపమున ప్రకటితమైన యీవాసనను నీవు త్యజించివేయుము.

ఏషా హి మానసీ శక్తిరిష్టానిష్టనిబంధనీ
అసత్యైవ ముధా భ్రాంత్యా స్వప్నవత్పరికల్పనా. 27

ఈమనశ్శక్తియే యిష్టానిష్ట వస్తువులందు రాగద్వేషములు గలదై తద్ద్వారా బంధనమున దగుల్కొనుచున్నది. భ్రాంతిచేతనే అయ్యది స్వప్నమువలె యీకల్పన యంతయును వ్యర్థముగ నొనర్చినది.

అవిద్యైషా దురంతైషా దుఃఖాయైషా వివర్ధతే
అపరిజ్ఞాయమానైషా తనోతీదమసన్మయమ్. 28

ఈమనస్సవిద్యారూపమే యగుటచే నద్దానిని నశింపజేయుట దుస్సాధ్యము. మఱియు నది వృద్ధినొందినచో దుఃఖమే గలుగును. తత్త్వజ్ఞానాభావముచే నయ్యది మిథ్యారూపమగు జగత్తును విస్తరింపజేయుచునేయుండును.

ఏషా తుచ్ఛవదాకాశం తుషారమలినం యథా
పరిపశ్యతి విభ్రాంతా స్వరూపస్య స్వభావతః. 29

మంచుచే గప్పబడిన యాకసము మలినముగ గన్పట్టునట్లు భ్రాంతిచే నీమనస్సు తాను సహజముగ తుచ్ఛమును మలినమును నైనట్లు భావించుచున్నది.

అసదేవేదమారంభ మంథరం సదివోత్థితమ్
కల్పితం జగదాభోగి దీర్ఘస్వప్న ఇవైతయా. 30

ఈ మానసికశక్తియే దీర్ఘస్వప్నమువంటి, మిథ్యారూపమగు జగద్వైచిత్ర్యమునంతను సత్యముగనే కల్పన మొనర్చినది.

భావనామాత్ర ఏవాస్యాః స్వరూపం కర్తృతాం గతమ్
జగన్నామావిలం చక్షుర్వ్యోమ్ని బింబరుచామివ. 31

తిమిరాదిదోషములుగల నేత్రమెట్లాకసమందలి నీలత్వముయొక్కయు, సూర్యచంద్రాదులయొక్కయు భావనమాత్రము గల్గియుండి అట్టి భావనామాత్రముననే కర్త యెట్లగుచున్నదో అట్లే యీమానసికశక్తి జగదాకారభావనామాత్రముననే కర్తృత్వము పొందుచున్నదిగాని అన్యముగకాదు.

లయమస్యాః స్వరూపం త్వం నయ రామ విచారణాత్
యథా హిమశిలాయాస్తు తపనాద్దివసాధిపః. 32

ఓ రామా! సూర్యుడెట్లు తన వేడిమిచే మంచును కఱగించివైచి నశింపజేయునో, అట్లే నీవును ఆత్మవిచారణచే యిద్దాని (మనస్సుయొక్క) స్వరూపమును నశింపజేయుము.

హిమాభావార్థినోఽర్కస్య స్వోదయేనేప్సితం యథా
సిద్ధ్యత్యేవం విచారేణ మనోనాశార్థినోఽర్థితమ్. 33

హిమరూప నాశనమాశించువాని యభీష్టము సూర్యోదయముచే సిద్ధించునట్లు మనోనాశమున్ను తత్త్వవిచారముచే నవశ్యము సిద్ధించును.

అవిద్యాఽసంప్రబుద్ధా హి వితతానర్థదుర్గమా
నానేంద్రజాలకలనాం శంబరో హేమ వర్షతి. 34

శంబరాసురుఁడు యింద్రజాల ప్రభావముచే (అసత్యమగు) సువర్ణము నెట్లు వర్షింపఁజేయునో, అట్లే ఆత్మతత్త్వ మెఱుంగనిచో, అనేక యనర్థముల గల్గించు యీ అవిద్యారూప మేఘము పలువిధ బ్రహ్మాండములనునట్టి వృష్టి గావించుచున్నది.

స్వవినాశక్రియాం చైతాం మన ఏవ కరోత్యలమ్
మనో హ్యాత్మవధం నామ నాటకం పరినృత్యతి. 35

ఈ మనస్సు తన నాశనమును తానే యొనర్చుకొనుచున్నది. కాన ఇయ్యది స్వసంహార నాటకమున నృత్యమొనర్చుచున్నదగును.

ఆత్మానమీక్షతే చేతః స్వవినాశాయ కేవలమ్
న హి జానాతి దుర్బుద్ధిర్వినాశం ప్రత్యుపస్థితమ్. 36

తన నాశనముకొఱకే యీ మనస్సు ఆత్మను దర్శించుచున్నది. మఱియు నిది తనకు ప్రాప్తింపనున్న నాశము నెఱుంగజాలకున్నది. దుర్బుద్ధియగువాడు తనకు సంభవింపనున్న వినాశనమునుగూర్చి యేమియు నెఱుంగజాలకుండునుగదా!

స్వయం సంకల్పమాత్రేణ స్వవినాశదృశామిదమ్
మనః సంసాధయత్యాశు క్లేశో నాత్రోపయుజ్యతే. 37

మనోనాశమును వాంఛించు వివేకుల యభీష్టము నీమనస్సు సంకల్పమాత్రమున శీఘ్రముగ సిద్ధింపజేయును. ఇక్కార్యమున దానికి క్లేశమేమియును లేదు.

స్వసంకల్పవికల్పాంశం వివేకోపహితం మనః
సంత్యజ్య రూపమాభోగి కరోత్యాత్మావబోధనమ్. 38

వివేకసంస్కారముగల చిత్తము తన పూర్వకాలపు సంకల్ప వికల్పములను, ఆశలను త్యజించి ఆత్మా (బ్రహ్మ) కార వృత్తి గల్గియుండును.

మహోదయో మనోనాశో మహోచ్ఛేదస్య తూదయః
మనోనాశే ప్రయత్నం త్వం కురుమామనసోజవే. 39



మనస్సు నశించిన పరమ పురుషార్థమగు మోక్షముదయించును. కాన మనోనాశము మోక్షప్రాప్తియనదగును. అట్టి మోక్షస్థితియందు దుఃఖములన్నియు శమించును. కాన యట్టి మనోనాశముకొఱకై నీవు ప్రయత్నింపుముగాని మనోవిస్తృతికొఱకు గాదు.

అవిరలసుఖదుఃఖవృక్షఖండే విషమకృతాంతమహోరగే వనేఽస్మిన్
ప్రభురిదమఖిలే వివేకహీనం సుభగ మనో సుమహాదాపదేక హేతుః. 40

మిగుల దట్టమైనదియు, సుఖదుఃఖములను వృక్షములును, భయంకరమగు మృత్యువను సర్పములును గలదియు నగు యీ ఘోరారణ్యమున అవివేకయుక్తమగు మనస్సే ప్రభువు. ఇదొక్కటియే గొప్ప విపత్తునకు హేతువగును.

ఇత్యుక్తవత్యథ మునౌ దివసో జగామ
సాయంతనాయ విధయేఽస్తమినో జగామ
స్నాతుం సభా కృత నమస్కరణా జగామ
శ్యామాక్షయే రవికరైశ్చ సహాజగామ. 41

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ఉపదేశకరణంనామ ద్వ్యుత్తరశతతమః సర్గః ॥ 102 ॥

అష్టమదినం.

వాల్మీకి:— వసిష్ఠ మునీంద్రులిట్లు బల్కునపుడు దినము సమాప్తికాగా సూర్యభగవానుడస్తాద్రిఁగ్రుంక నాటికి సభ విరమింపబడెను. అపుడు సాయంసంధ్యాదికృత్యముల నొనర్పుటకై సభాసదులు వెడలిరి. ఆ రాత్రి గడచిన మీదట మరల సూర్యోదయకాలమునకు సభికులందఱును యథోచితరీతి నమస్కరించుకొనుచు వారివారి స్థానముల వచ్చిచేరిరి.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
ఉపదేశకరణమను ద్వ్యుత్తర శతతమ సర్గము ॥ 102 ॥

ఎనిమిదవరోజు.

## త్ర్యుత్తరశతతమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

పరస్మాదుత్థితం చేతస్తత్కల్లోల ఇవార్ణవాత్
స్ఫారతామేత్య భువనం తనోతీదమితస్తతః. 1

వసిష్ఠుడు:— ఓ రామా! సముద్రమందు తరంగమువలె యీ చిత్తము ప్రకటితమై, క్రమముగ విశాల రూపమంది, యంతటను జగద్విస్తార మొనర్చుచున్నది.

హ్రస్వం దీర్ఘం కరోత్యాశు దీర్ఘం నయతి ఖర్వతామ్
స్వతాం నయత్యన్యదలం స్వం తథైవాన్యతామపి. 2

ఇయ్యది హ్రస్వమును దీర్ఘముగను, దీర్ఘమును హ్రస్వముగను అల్పకాలములో నొనర్చుచున్నది. మఱియు తనరూపమును అన్యముగను, అన్యరూపమును తనదిగను (ఆత్మనాత్మగను, అనాత్మనాత్మగను) గావించుచున్నది.

ప్రాదేశమాత్రమపి యద్వస్తు భావనయైవ తత్
స్వయం సంపన్నమేవాశు కరోత్యద్రీంద్రభాసురమ్. 3

దృష్టముగాని వస్తువుఁగూడ నది తనభావనచే సుమేరుపర్వతమువలె ప్రకాశింపఁజేయుచు ప్రత్యక్షమొనర్చుచున్నది.

లబ్ధప్రతిష్ఠపరమాత్మపదాదుల్లసితం మనః
నిమేషేణైవ సంసారాన్కరోతి న కరోతి చ. 4

బ్రహ్మచైతన్యమునుండి వికాసమును బొందిన యీ మనస్సొక్క నిమిషములో ననేక బ్రహ్మాండములను నిర్మించుచు నాశ మొనర్చుచున్నది.

యదిదం దృశ్యతే కించిజ్జగత్స్థాస్ను చరిష్ణు చ
సర్వం సర్వప్రకారాఢ్యం చిత్తాదేతదుపాగతమ్. 5

స్థావరజంగమాదియుక్తమగు యీ దృశ్యమాన ప్రపంచమంతయును చిత్తమునుండియే యావిర్భవించినది.

దేశకాలక్రియాద్రవ్యశక్తిపర్యాకులీకృతమ్
భావాద్భావాంతరం యాతి లోలత్వాన్నటవన్మనః. 6

దేశకాలక్రియాద్రవ్యశక్తులచే పూర్ణమైయొప్పు యీ మనస్సు చంచలత్వకారణమున, నటునివలె యొక భావననుండి మఱియొక భావనకుఁజనుచున్నది.

సదసత్తాం నయత్యాశు సత్తాం చాసన్నయత్యలమ్
తాదృశస్యైవ చాదత్తే సుఖదుఃఖాని భావితమ్. 7

ఈ మనస్సే సత్యమును మిథ్యగను, మిథ్యను సత్యముగను జేయుచున్నది. మఱియు నది స్వకర్మోపార్జితములగు సుఖదుఃఖముల నట్లే గ్రహించుచున్నది.

యదాప్తం స్వయమాదత్తే యథైవ చంచలం మనః
హస్తపాదాదిసంఘాతస్తదా ప్రయతతే తథా. 8

చంచలమగు యీ మనస్సు స్వకర్మచే సంప్రాప్తించిన భోగ్యవస్తువుల నెప్పుడెట్లు తన కల్పనచే అనుకూలముగ గాని ప్రతికూలముగ గాని గ్రహించునో, అపుడు హస్తపాదాదులు దాని ననుసరించి యావిధముననే ప్రవృత్తములగును.

తతః సైవ క్రియాచిత్తసమాహితఫలాఫలమ్
క్షణాత్ప్రయచ్ఛతి లతా కాలసిక్తేవ తాదృశమ్. 9



పిమ్మట, నీటిచే బాగుగ పోషింపబడిన లతవలె భోగ్యవస్తువును ప్రాప్తింపఁజేయు క్రియ, చిత్తముచే కల్పింపబడిన సుఖదుఃఖరూప ఫలమును యథాసమయమున శీఘ్రముగ గల్గఁజేయును.

చిత్రాం క్రీడనకశ్రేణీం యథా పంకాద్గృహే శిశుః
కరోత్యేవం మనో రామ వికల్పం కురుతే జగత్. 10

గృహమందు మృత్తికచే బాలుఁడెట్లు బొమ్మలఁజేయునో అట్లనే మనస్సనూ యీ జగద్వికల్పనల నొనర్చుచున్నది.

మనః సర్వజనక్రీడా సృజం బాలలవేష్వతః
కిమేతద్ధి పదార్థేషు రూఢం జగతి కల్ప్యతే. 11

ఈ కారణముచే, మనస్సుయొక్క సర్వజనాత్మకమగు యీ బాలక్రీడయందలి మనుజుల యొక్క దేహాదులను మృత్తికయందే సత్యత్వ బుద్ధి కల్పింపబడుచున్నచో, అయ్యది మిథ్యయే.

కరోత్యృతుకరః కాలో యథా రూపాన్యథా తరోః
చిత్తమేవం పదార్థానామేషామేవాన్యతామివ. 12

వసంతాది ఋతు విభాగ మొనర్చు కాలమున వృక్షరూపములను భిన్నభిన్నముగా నొనర్చునట్లు, చిత్తము పదార్థములన్నింటియందును మార్పును గల్గఁజేయుచు భేదమును ప్రదర్శించుచున్నది.

మనోరథే తథా స్వప్నే సంకల్పకలనాసు చ
గోష్పదం యోజనవ్యూహాః స్యాసు లీలాసు చేతసః. 13

మనోరథ, స్వప్న సంకల్పాదులందీ చిత్తమనేక యోజనముల దూరమునుగూడ గోష్పద తుల్యముగ నొనర్చుచున్నది. ఇవ్విధముననే యద్దాని క్రియలన్నిటినిగూర్చియు తెలియంగును.

కల్పం క్షణీకరోత్యంతః క్షణం నయతి కల్పతామ్
మనస్తదాయత్తమతో దేశకాలక్రమం విదుః. 14

ఈ మనస్సు క్షణమును కల్పముగను, కల్పమును క్షణముగను చేయుచున్నది. కావున దేశకాలములు మనస్సున కధీనములనియే విజ్ఞులు వచించుచున్నారు.

తీవ్రమందత్వసంవేగాద్బహుత్వాల్పత్వభేదతః
విలంబనేన చ చిరం న తు శక్తిమశక్తితః. 15

రజోగుణాధిక్యముచే తీవ్రముగను, తమోగుణాధిక్యముచే మందముగను ప్రవర్తించు యీ మనస్సు అధికాల్పత్వ భేదములచే నాయా కార్యములందు శక్తివంతమగుచున్నది. అనగా, ఏకవస్తురచనయందైనను మనశ్శక్తి ప్రవర్తింపకయున్నను, లేక అల్పముగ ప్రవర్తించినను, అయ్యది పూర్ణముగ సిద్ధింపకయుండును. కాని, మనస్సుయొక్క ఏకాగ్రతచే నది విలంబనము లేకయే అవశ్యము సిద్ధించును.

వ్యామోహాసంభ్రమానర్థదేశకాలగమాగమాః
చేతసః ప్రభవంత్యేతే పాదపాదివ పల్లవాః. 16

భ్రమ, వ్యామోహము మొదలైన యనర్థములును, దేశకాలాదుల గమనాగమనములును, వృక్షమునుండి పత్రము లావిర్భవించునట్లు, చిత్తమునుండియే కలుగును.

జలమేవ యథాఽమ్భోధి రౌష్ణ్యమేవ యథాఽనిలః
తథా వివిధసంరంభః సంసారశ్చిత్తమేవ వా. 17

అగ్ని యుష్ణత్వమాత్రమును, సముద్రము జలమాత్రమును యగునట్లు, వివిధసాంసారిక కార్యసమూహమంతయును చిత్తమాత్రమే యగును.

సకర్తృకర్మకరణం యదిదంచేత్యమాగతమ్
ద్రష్టృదర్శనదృశ్యాఢ్యం తత్సర్వం చిత్తమేవ చ. 18

ద్రష్టృదర్శన దృశ్యములు, కర్తృ కర్మకరణములు, భోక్తృ భోగ్య భోగములను యనర్థములతోఁగూడి యుత్పన్నమైన యీ జగత్తంతయును చిత్తమాత్రమే అయియున్నది.

చిత్తం జగంతి భువనాని వనాంతరాణి
సంలక్ష్యతే స్వయముపాగతమాత్మభేదైః
కేయూరహారకటకైశ్చ లసత్స్వరూపం
త్యక్త్వేవ కాంచనధియేవ జనేన హేమ. 19

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
చిత్తమాహాత్మ్యంనామ త్ర్యుత్తరశతతమః సర్గః ॥ 103 ॥

సువర్ణపరీక్షకులెట్లు కటక కేయూరాది యాభరణముల రూపముఁగాంచక కేవలము సువర్ణమందే దృష్టిగల్గియుందురో, అట్లే వివేకులీ బ్రహ్మాండమందలి లోకములన్నిటి రూపమునను, అందుగల వన పర్వతాది వస్తువుల రూపమునను చిత్తమే స్వయముగ ప్రకటితమైనదని నిశ్చయింతురు.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
చిత్తమాహాత్మ్యమను త్ర్యుత్తరశతతమ సర్గము ॥ 103 ॥

## చతురధికశతతమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

అత్ర తే శృణు వక్ష్యామి వృత్తాంతమిమముత్తమమ్
జాగతీహేంద్రజాలశ్రీ శ్చిత్తాయత్తా యథాస్థితా. 1

వసిష్ఠుడు:— ఓ రామా! ఈ సందర్భమున నీకొక యాఖ్యాన మెఱింగించెద వినుము. అద్దానిని విని ఈ జగద్రూపమగు యింద్రజాలమంతయును చిత్తమున కధీనమైయున్నదని నీవు తెలిసికొనగలవు.



అస్త్యస్మిన్వసుధాపీఠే నానావనసమాకులః
ఉత్తరాపాండవో నామస్ఫీతో జనపదో మహాన్. 2

ఈ భూతలమున అనేకవనములతోఁగూడి యొప్పుచున్న ఉత్తరాపాండవమను రాజ్య మొండు గలదు,

నీరంధ్రఘనగంభీర వనవిశ్రాంతతాపసః
విద్యాధరీకృతలతా దోలోపవనపత్తనః. 3
వాతోద్ధూతాబ్జకింజల్క పుంజపింజరపర్వతః
లసత్కుసుమసంభార వనమాలావతంసకః. 4
కరంజమంజరీకుంజ గుచ్ఛపర్యంతజంగలః
ఖర్జూరాంతరితగ్రామో ఘుంఘుమధ్వనితాంబరః. 5
ఏకపింగశిలాశ్రేణీ శాలికేదారపింగలః
నీలకంఠారవోద్దామ వనజంగలమండితః. 6
సారసారవసంరంభ రణత్కనకకాననః
తమాలపాటలీనీల గిరిగ్రామకకుండలః. 7
విచిత్రవిహగవ్యూహ విరావకృతకాకలిః
నదీపరిసరోన్నిద్ర పారిభద్రద్రుమారుణః. 8
గాయత్కలమకేదార దారికాహృతమన్మథః
పుష్పఫలచలద్వాత వ్యాధూతకుసుమాంబుదః. 9
దరీగృహవినిష్క్రాంత సిద్ధచారణబందికమ్
స్వర్గాదివసమానీయ లావణ్యమభినిర్మితః. 10
గాయత్కిన్నరగంధర్వ కదలీఖండమండపః
మందానిలరవోద్ధూతః పుష్పోపవనపాండురః. 11

అనేక వృక్షములచే దట్టమై గంభీరముగనున్న యా వనములందు తాపసులు విశ్రమించుచుండిరి. ఉపవనములందుగల లతలందు విద్యాధరులూయల లూగుచుండిరి. వాయువుచే గొంపోబడు కమల పుష్పపరాగముచే నచటిపర్వతములు రక్త, పీత వర్ణయుక్తములుగ నొనర్పబడినవి. అత్యంత శోభాయమానముగనున్న పుష్పసమూహములుగల వనము లా ప్రదేశమునకు శిరోభూషణములై యొప్పుచుండెను. పుష్పలతానికుంజములచే నలంకృతమగు వనములు గ్రామములవఱకును వ్యాపించియుండెను. ఖర్జూర వృక్షములమధ్య యచటి గ్రామములు దాగి కొనినట్లుండెను. శబ్దమాకసమువరకును వ్యాపించుచుండెను. పింగళవర్ణపు శిలవలె నొప్పుచున్నట్టి వరిపక్వధాన్యముగల పొలములును, మయూర శబ్దములచే శోభించు యుత్తమ అరణ్యములును, సారసపక్షుల శబ్దములతోఁగూడినవై సువర్ణమువలె మనోహరముగ వెలయుచున్నట్టి వనములును, తమాల, పాటల వృక్షములచే నీలముగనున్నదై పర్వత గ్రామములు గలిగి యా ప్రదేశము మిగుల శోభించుచుండెను. అనేక చిత్రవిచిత్రములగు పక్షులచట మధురగాన మొనర్చు-

శబ్దము చేయుచుండెను. వికసిత పుష్పములుగల వృక్షములచే నదీతటములు రక్తవర్ణములుగా నుండెను. తోటలయందు గానము చేయుచున్న కన్నియలు మన్మథుని చిత్తమునుగూడ హరించు నట్లుండిరి. పుష్పములను మేఘములను వాయువునట్టి చలింపజేయుచుండెను. పర్వతగుహలను గృహములనుండి సిద్ధచారణులు వెడలుచుండిరి. అయ్యది, స్వర్గమునుండి గొనితాబడి నిర్మింప బడినదా యనునంత సుందరముగ నుండెను. కదళీఖండనిర్మిత మండపములందు కిన్నర గంధర్వులు గానమొనర్చుచుండిరి. మందశీతల సుగంధ వాయువుచే నాప్రదేశ మతిరమణీయముగ నుండెను. ఉపవనములచే శ్వేతవర్ణయుక్తమై యొప్పుచున్న ఆ యుత్తరాపాండవమను జనపదము మిగుల శోభాయమానముగ నుండెను.

తత్రాస్తి లవణో నామ రాజా పరమధార్మికః
హరిశ్చంద్రకులోద్భూతో భూమావివ దివాకరః. 12

హరిశ్చంద్రుని వంశజుఁడును, మహాధార్మికుడును నైన లవణుడను భూపాలుడు దాని నేలుచు భాస్కరునివలె వెన్నొందుచుండెను.

యద్యశఃకుసుమోత్తంస పాండురస్కంధమండలాః
తత్ర శైలా విరాజంతే హరాః ప్రోద్ధూలితా ఇవ. 13

ఆతని కీర్తియను పుష్పములచే నలంకృతమైన శిరోభూషణముచే శ్వేతవర్ణయుక్తమై యున్న పర్వతము లచ్చట విభూతిధారుఁడగు శివునివలె కన్పట్టుచుండెను.

కృపాణశకలోత్కృత్త నిఃశేషారాతిమండలః
అరాతిలోకః ప్రాప్నోతి యదనుస్మరణాజ్జ్వరమ్. 14

ఆతని తీక్ష్ణఖడ్గము శత్రువుల నందఱిని ఛేదించునదై యుండెను. మఱియు వాని స్మరణమాత్రముననే శత్రువర్గము భీతిఁజెందుచుండెను.

యస్యోదారసమారంభ మార్యలోకానుపాలనమ్
చరితం సంస్మరిష్యంతి హరేరివ చిరం జనాః. 15

ఆతని యుపకారములను, ఉదార చరితమును, శిష్టసంరక్షణాది కార్యములను విష్ణుని చరితమువలె జనులు చిరకాలము స్మరించెదరు.

యస్యాప్సరోభిరద్రీంద్ర మూర్ధస్వమరసద్మసు
వికాసిపులకోల్లాసం గీయంతే గుణగీతయః. 16

సుమేరుపర్వత శిఖరములందును, స్వర్గమందును అప్సరసలు పులకాంకితులై యానందముతో వాని గుణగాన మొనర్చుచుండిరి.

యస్య స్వః సుందరీ గీతా లోకపాలచిరశ్రుతాః
విరించిహంసైర్ధ్వన్యంతే స్వభ్యాసాద్గుణగీతయః. 17

స్వర్గమందలి అప్సరసలాతని గుణముల కీర్తించుచుండ, ఇంద్రాది లోకపాలు రద్దానిని వినుచుండిరి. మఱియు నా గానమును వినిన బ్రహ్మవాహనమగు హంస, దాని ననుసరించి యుక్కుట నభ్యసించుచుండెను.



స్వప్నేష్వపి న సామాన్యా యస్యోదారచమత్కృతిః
రామ దృష్టా శ్రుతా వాపి దైన్యదోషమయీ క్రియా. 19

ఓ రామా! ఇతరరాజులయొక్క మహాకార్యములు స్వప్నమునందైనను గానవచ్చుట లేదు. దీనత్వముగాని, మఱి యేదోషముగాని వానియందెవ్వఁడును కని విని యుండలేదు.

జిహ్మతాం యో న జానాతి న దృష్టా యేన ధృష్టతా
ఉదారతా యేన ధృతా బ్రహ్మణేవాక్షమాలికా. 19

కౌటిల్యమే యెఱుఁగఁడు. అవినయము లేశమైనను వానియందు లేదు. బ్రహ్మదేవుడక్షమాలను ధరించునట్లాతఁ డుదారత్వమును వహించియుండెను.

దినాష్టభాగమాకాశ మాగతే దివసాధిపే
స కదాచిత్సభాస్థానే సింహాసనగతోఽభవత్. 20

ఇట్టి యుత్తమగుణములుగల నా రాజు సూర్యోదయమైనపిదప నాల్గగడియల కాలము నకు సభాస్థానమును ప్రవేశించి సింహాసనముపై గూర్చుండెను.

సుఖోపవిష్టే తత్రాస్మిన్ రాజనీందావివాంబరే
ప్రవిశంతీషు సామంతసేనాసు చ ససంభ్రమమ్. 21
గాయంతీష్వథ కాంతాసు సూపవిష్టేషు రాజసు
మనో హరతి సాహ్లాదే వీణావంశకలారవే. 22
చారుచామరహస్తాసు సవిలాసాసు రాజని
దేవాసురగురుప్రఖ్యే విశ్రాంతే మంత్రిమండలే. 23
ప్రస్తుతేషు ప్రవిష్టేషు రాజకార్యేషు మంత్రిభిః
ప్రోక్తాసు దేశవార్తాసు నిపుణైశ్చారుమంత్రిభిః. 24
ఇతిహాసమయే పుణ్యే వాచ్యమానే చ పుస్తకే
పఠత్సు చ స్తుతీ పుణ్యా పురప్రహ్వేషు బందిషు. 25

ఆకాశమున చంద్రునివలె ప్రకాశించుచున్న యా రాజు సింహాసనముపై సుఖాసీనుడయ్యెను. అప్పుడు కప్పమును చెల్లించు సామంతరాజులును, సైనికులును భయవినయములతో గూడి నట ప్రవేశించుచుండిరి. కాంతలును యాసీనులై నపిదప యువతులు మధురగానమొనర్చిరి. అచటి మురళీవీణల మధురశబ్దము సర్వుల చిత్తమును హరించుచుండెను. ఉత్తమాంగనలు రాజుచెంత చామరముల వీచుచుండిరి. బృహస్పతి శుక్రాచార్యులవంటి యుత్తమ మేధాసంపన్నులగు మంత్రులచట సమావేశమై యుండిరి. అప్పుడుపయుక్తములగు రాజకార్యములనుగూర్చి వకలురగు మంత్రులు రాజును ప్రశ్నించి యావిమ్మట దేశాంతర వార్తలను వాని కెఱింగించిరి. పవిత్ర ఇతిహాస పురాణాదుల శ్రవణమట యొనర్పబడుచుండెను. వందిమాగధులు వినమ్రులై రాజెదుట నిలఁబడి స్తోత్రము చేయుచుండిరి.

సభాం వివేశ సాటోపః కశ్చిత్తత్రైంద్రజాలికః
వర్షేణాహితసంరంభో వసుధామివ వారిదః. 26

అత్తఱి మేఘగర్జన, విద్యుత్ప్రకాశము మున్నగువానితోఁగూడి వర్షింపనున్నట్టి మేఘము ఆకసమునఁ బ్రవేశించులాగున వేషభూషాదియాడంబరసమేతుఁడై, అనేక వత్సరములు యత్నించి సామగ్రినంతయు సమకూర్చుకొనిన యింద్రజాలికుఁ డొకఁడా రాజసభయందు బ్రవేశించెను.

స ననామ మహీపాలం శిఖరోదారకంధరమ్
పాదోపాంతగతః కాంతం శైలం ఫలతరుర్యథా. 27

ఫలయుక్తమగు వృక్షము ఫలభారముచే వంగి రమణీయమగు పర్వతమునకు బ్రణమిల్లునట్లు పర్వత శృంగములవలె గంభీరమైన కంఠప్రదేశముగల యా నృపాలుని చరణముల సమీపించి, ఆ యింద్రజాలికుఁడు బ్రణమిల్లెను.

సచ్ఛాయస్యోన్నతాంసస్య ఫలినః పుష్పభాసినః
స వివేశ పురో రాజ్ఞస్తరోరగ్రే కపిర్యథా. 28

ఉత్తమఛాయ నొసంగు ఫలపుష్ప సంయుక్తమగు వృక్షమెదుట వానరమువలె, అతఁడా రాజెదుట గూర్చుండెను.

చపలో లంపటోఽర్థానా మామోదసుఖమారుతమ్
ఉవాచోత్కంధరం భూపం సపద్మమివ షట్పదః. 29

సుఖప్రదమగు పరిమళ వాయువుచే పరివేష్టించియున్న పద్మములో, పదార్థముల నాశించు స్వభావముగల చంచల భ్రమరము బల్కునట్లు ఉన్నత కంఠభాగముగల ఆరాజుతో నాతఁడు బల్కెను.

విలోకయ విభో తావదేకామిహ ఖరోలికామ్
పీఠస్థ ఏవ సాశ్చర్యాం వ్యోమ్నిచంద్ర ఇవావనిమ్. 30

ఓ ప్రభూ! చంద్రు డాకసమునుండి భూమిని గాంచునట్లు, సింహాసనముపై గూర్చుండియే, ఆశ్చర్యజనకమగు నొక మిథ్యాకౌతుకమును వీక్షింపుము.

ఇత్యుక్త్వా పిచ్ఛికా తేన భ్రామితా భ్రమదాయినీ
నానావిరచనాబీజం మాయేవ పరమాత్మనః. 31

ఇట్లు వచించి యాతఁడు పలువిధ రచనలకు మూలకారణమైన యీశ్వర మాయవలె నున్నదై భ్రమఁగొల్పునట్టి నెమలి పింఛమొకదానిని గైకొని దాని నటునిటు త్రిప్పెను.

తాం దదర్శ మహీపాలస్తేజోరేణువిరాజితామ్
శక్రః సురవిమానస్థః స్వకార్ముకలతామివ. 32

దేవతల విమానములపై నారూఢుఁడగు యింద్రుఁడు తన ధనుస్సును చూచునట్లు, పలువిధ రమణీయకాంతులతో శోభించుచున్న యద్దానిని (నెమలి పింఛమును) రాజు గాంచెను.

సభాం సైంధవసామంతో వివేశాస్మిన్ క్షణే తదా
తారాపరికరాపూర్ణాం వ్యోమవీథిమివాంబుదః. 33



నక్షత్రములను పరికరములతోఁగూడి మేఘ మాకాశమార్గమందు బ్రవేశించునట్లు అప్డు సైంధవసామంతుఁ డొకఁడా సభయందు బ్రవేశించెను.

తం చైవానుజగామాశ్వః సామ్యః పరమవేగవాన్
దేవలోకోన్ముఖం తుష్టం శక్రముచ్చైఃశ్రవా ఇవ. 34

ప్రసన్నుఁడును, దేవలోకోన్ముఖుఁడును నగు యింద్రుని వెంట వాని గుఱ్ఱమగు ఉచ్చైశ్శ్రవమువలె, అతివేగముగ బరువెత్తునదియు, శాంతగుణముగలదియు నగు గుఱ్ఱమొకటి వాని వెనువెంట వచ్చుచుండెను.

స తమశ్వముపాదాయ పార్థివం సమువాచ హ
సోచ్చైఃశ్రవా ఇవ క్షీరసాగరో మరుతాంపతిమ్. 35

ఇంద్రునితో ఉచ్చైశ్శ్రవయుక్తమగు క్షీరసముద్రమువలె, ఆ యశ్వరక్షకుఁడు రాజుతో నిట్లు బల్కెను.

ఇదముచ్చైఃశ్రవః ప్రఖ్యం హయరత్నం మహీపతే
జవోడ్డయనశీలేన మూర్తిమానివ మారుతః. 36

ఓ రాజా! ఉచ్చైశ్శ్రవమువలె నియ్యది అశ్వములలోనెల్ల శ్రేష్ఠమైనది. మూర్తివంతమగు వాయువువలె నిది అతివేగముగ బోఁగలదు.

అశ్వోఽయమస్మత్ప్రభుణా ప్రభో సంప్రహితస్త్వయి
రాజతే హి పదార్థశ్రీః స్వమహాత్మస్వనాచ్ఛభా. 37

ఓ రాజా! మా ప్రభు విద్దానిని తమకొఱకు బంపెను. మహాత్ములకు సమర్పించుట చేతనేగదా పదార్థముల శోభ యినుమడింపబడును?

ఇత్యుక్తవతి తస్మింస్తు ప్రత్యాహైంద్రజాలికః
జలదస్తనితే శాంతే చాతకోఽంబుధరం యథా. 38

అశ్వరక్షకుఁడిట్లు వచింప, మేఘగర్జన శాంతించిన పిమ్మట చాతకము మేఘముతో బల్కునట్లా యింద్రజాలికుఁడు రాజుతో నిట్లు బల్కెను.

సదశ్వమేనమారుహ్య భువనే విహర ప్రభో
స్వప్రతాపాహితానల్పశోభ ఉర్వీం గతో యథా. 39

ఓ ప్రభూ! తన తేజముచే యధికశోభను గల్గఁజేయుచు సూర్యభగవానుఁడు భూమిపై విహరించునట్లు, నీవీ యుత్తమ గుఱ్ఱమునెక్కి లోకలోకాంతరములందు సంచరింపుము.

అశ్వమాలోకయామాస తేనోక్త ఇతి పార్థివః
నిర్ఘాతస్తనితం మేఘం మయూర ఇవ సూత్సుకః. 40

అతఁడిట్లు వచింపనంత నా రాజు ... మ్రోగుచున్న మేఘమును కంఠమెత్తి నెమలి చూచులాగున, రాజా గుఱ్ఱమును వీక్షించెను.

అథానిమేషయా దృష్ట్యా రాజా చిత్రోపమాకృతిః
బభూవాలోకయన్నశ్వం లిపికర్మార్పితోపమః. 41

అపుడా రాజు విచిత్రాకృతిగలవాడై తదేకదృష్టితో దాని నవలోకించుచు, గోడపై లిఖింపబడిన చిత్రమువలె కదలక యుండెను.

క్షణమాలోక్య పీఠస్థస్తస్థౌ సంస్థగితేక్షణః
దృష్ట్వాఽఽక్షుబ్ధః సముద్రోఽద్రిమీనకైః కరవో యథా. 42

అట్లొక క్షణకాలము పరికించి, ఆ సింహాసనముపైననే యుండి, కనులుమూసికొని శబ్దాయమానమగు సముద్రము తనయందలి జలమును త్రాగుటకు సిద్ధముగనున్న అగస్త్యునిజూచి మిగుల క్షోభంజెందినదై స్తంభించినట్లు చేష్టారహితుడై యుండెను.

తస్థౌ ముహూర్తయుగ్మం స ధ్యానాసక్త ఇవాత్మని
వీతరాగో మునిః క్షుబ్ధః పరానంద ఇవ స్థితః. 43

రాగరహితుడగు మునీశ్వరుడు బాహ్యదృష్టిని నిరోధించి అంతర్ముఖుడై ఆత్మానందమును బొందుచు నిశ్చలముగ నుండునట్లా రాజున్ను, నాల్గు ఘడియలవరకు ధ్యానాసక్తునివలె నిశ్చేష్టుడై యుండెను.

బోధితః కేనచిన్నాసౌ స్వప్రతాపజితోర్జితః
ధియా తామప్యయం భూయశ్చింతాం చింతయతీతి చ. 44

స్వబుద్ధిచే బాగుగ యోచించువాడును, తన భుజబల తేజముచే మహాబలశాలుర నైతము జయించువాడును, ధీశాలియునగు నా రాజా నపుడెవరును చేష్టిత మొనర్ప జాలకుండిరి.

బభూవుః కేవలం తత్ర నిఃస్పందసితచామరాః
చామరిణ్యో హి శర్వర్యః స్తంభితేందుకరా ఇవ 45

అట్టి సమయమున, ధవళకాంతులతో నొప్పు వింజామరములట చలించుట మానెను. ఆ చామరముల వీచు యంగనలున్ను రాత్రియందలి స్తంభించిన చంద్రకిరణములవలె చేష్టారహితులై యుండిరి.

విరేజుర్విస్మయాపూర్ణా నిఃస్పందాస్తే సభాసదః
నిఃస్పందకింజల్కదలాః పద్మాః పంకకృతా ఇవ. 46

ఆశ్చర్యచకితులగు నా సభాసదులపుడు చలింపని పుష్ప రేణువులుగల్గి పంకమునం బడియున్న కమలమువలె చలనరహితులై యుండిరి.

ప్రశశామ సభాస్థానే జనకోలాహలః శనైః
ప్రశాంతప్రావృషివ్యోమన్యంభోదమివ గర్జితమ్. 47

వర్షము శమించిన పిమ్మట మేఘగర్జన ముడుగునట్లు, ఆ సభాస్థలమున జనుల కోలాహలమంతయును క్రమముగ శాంతించెను.



సందేహసాగరే మగ్నా జగ్ముశ్చింతాం సుమంత్రిణః
విషీదతి గదాపాణౌ వసురాజావివామరాః. 48

విష్ణుఁడసురుల యుద్ధమందు దుఃఖాక్రాంతుడైనపుడు దేవతలందఱును ఖిన్నులైనట్లు, అచటి యుత్తమ మంత్రులందఱును సంశయార్ణవమున మునింగినవారై విషాదమును పొందిరి.

వితతవిస్మితజిహ్మితయా తయా జనతయా భృశమోహవిషణ్ణయా
స్తిమితచక్షుషి భూమిపతౌ స్థితే ముకులితాబ్జవనస్య ధృతా ద్యుతిః. 49

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ఇంద్రజాలోపాఖ్యానే నృపవ్యామోహో నామ
చతురధిక శతతమః సర్గః ॥ 104 ॥

రాజట్లు కనులు మూసికొనియుండ, మిక్కుటముగ నాశ్చర్యమును పొందినవారలై నిరుత్సాహితులును, దుఃఖితులునునై యున్న యచటి జన సమూహమంతయును ముకుళిత కమల వనమువలె నొప్పుచుండెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
ఇంద్రజాలోపాఖ్యానమున నృపవ్యామోహమను
చతురధిక శతతమ సర్గము ॥ 104 ॥

## పంచోత్తర శతతమః సర్గః

శ్రీవసిష్ఠ ఉవాచ:—

ముహూర్తద్వితయేనాథ బోధమాప మహీపతిః
ప్రావృషేణ్యాంబుసిక్తం సదంభోరుహమివోత్తమమ్. 1

వసిష్ఠుడు:— ఓ రామా! వర్షాకాలపు మేఘములన్నియును తొలగగా, ఉత్తమకమలము వికాసమును పొందునట్లు, నాల్గు ఘడియలైన పిదప ఆ రాజు క్రమముగ ప్రబోధమును జెందెను.

ఆసనాత్సంగతోత్తంసః ప్రబుద్ధోఽసావకంపయత్
సవనాభోగశృంగాగ్ర్యో భూకంప ఇవ పర్వతః. 2

వన, శిఖరయుక్త పర్వతమును భూకంపము చలింపజేయునట్లు, ప్రబుద్ధుడును, అంగదాది భూషణములచే నలంకృతుడును నగు రాజపుడు తన శరీరమును కదలించెను.

బభూవాథ ప్రబుద్ధోఽసావాసనో పరికంపితః
విక్షుబ్ధ ఇవ పాతాలపవనే శంకరాచలః. 3

భూమిని ధరించునట్టి దిగ్గజములు చలింప కైలాసపర్వతము చలించునట్లు, జాగ్రతుడైన రాజపుత్రుడు సింహాసనముపై యూగెను.

పతంతం ధారయామాసు స్తం పురోగా నృపం భుజైః
మేరుం ప్రలయవిక్షుబ్ధం కులశైలా స్తటైరివ. 4

ప్రళయకాలమున సుమేరుపర్వతము చలింపగా, మహేంద్రాది కులపర్వతములు దానిని కదలక నిలుపునట్లు, సింహాసనమునుండి పడుచున్న రాజును యెదుటనున్నవారు పట్టుకొనిరి.

పురోగై ర్ధార్యమాణోఽసౌ పర్యాకులమతిర్నృపః
వీచివిక్షోభితస్యేందో ర్బభార వనమాశ్రియః. 5

అట్లెదుట నున్నవారిచే పట్టుకొనబడిన రాజపుత్రుడు, చంద్రోదయానంతరమందలి తరంగ సంచాలిత సముద్రమువలె గన్పట్టుచుండెను.

కోఽయం ప్రదేశః కస్యేయం సభేతి స నృపః శనైః
దధ్యావ మజ్జదంభోజకోశస్థ ఇవ షట్పదః. 6

'ఈ స్థానమెయ్యది? ఈ సభ యేమి?' అని కమలకోశమున బంధింపబడుచున్న భ్రమరమట్లా రాజు మెల్లగ బల్కెను.

అథోవాచ సభా దేవ కిమేతదితి సాదరమ్
రణన్మధుకరీభానుం దృష్ట్వా రావామివాబ్జినీ. 7

అప్పుడా సభాసదులు యాదరముతో నిట్లనిరి — 'దేవా! లోన భ్రమరమునకు (ఝంకరించిన) కమలమువలెను, రాహువును దర్శించిన సూర్యునివలెను తామేల యిట్లు చింతాక్రాంతులై యుంటిరి?

అథైనం పరిపప్రచ్ఛుః పురోగా మంత్రిణ స్తథా
ప్రలయోల్లాససంత్రస్తం మార్కండేయమివామరాః. 8

ప్రళయ సంరంభమును గాంచి భయభీతుడైన మార్కండేయ ఋషిని దేవతలు ప్రశ్నించునట్లు, ఎదుటనున్న సభికులును మంత్రులును రాజు నిట్లు ప్రశ్నించిరి.

త్వయ్యార్థం సంస్థితే దేవ వయమత్యంతమాకులాః
అభేద్యమపి భిందంతి నిర్నిమిత్తం ప్రభవామనః. 9

దేవా! తమకిట్టి స్థితి సంప్రాప్తించుట గాంచి మే మత్యంత వ్యాకులురమైతిమి. దృఢచిత్తమునుగూడ కారణము లేకయే భ్రాంతి ఛేదింపగల్గుచున్నది.

ఆపాతరమణీయేషు పర్యంతవిరసేషు చ
భోగేష్వివ వికల్పేషు కేషు తే లులితం మనః. 10

అవిచారముచే మొదట రమణీయముగ గన్పట్టుచు, తుదకు తుచ్ఛముగ పరిణమించుచుండు వికల్పమయములగు అల్పభోగములం దెవ్వియందు తగుల్కొనని మీ చిత్తమేల రాగాదులచే మోహితమయ్యెను?



సతతోదారవృత్తాసు కథాసు పరిశీలితమ్
మన స్తే నిర్మలం కస్మాత్సంభ్రమేషు నిమజ్జతి. 11

వివేకుల చరిత్రములను, ఉత్తమగాథలను నిత్యము వినుచుండు మీ శాంత, నిర్మల మనం బేకారణమున భయోత్పాదక విషయములందు మగ్నమయి భ్రమను పొందెను?

తుచ్ఛాలంబనమాలూన విశీర్ణం లోకవృత్తిషు
మనో మోహముపాదత్తే న మహాత్త్వవిజృంభితమ్. 12

విషయములు నశించిన తాను నశించెనని తలంచు క్షుద్ర మనస్సే లోకకార్యములందు విమోహిత మగును గాని, శుద్ధమును, వివేకయుక్తమునగు మనస్సుగాదు.

సాతత్యేన హి యైవాస్య మనసో వృత్తిరుత్థితా
శరీరమదనుత్తాసు తాస్వేవైతద్విధావతి. 13

దేహాభిమానముగల్గి, అజ్ఞాన స్థితియందున్నపుడీ మనస్సునం దేవిషయవృత్తి యుదయించునో దానివైపునకే యది పరుగిడును.

అతుచ్ఛాలంబనం ధీరం ప్రబుద్ధం గుణహారి చ
తవాపి హి మనశ్చిత్రమాలూనమివ లక్ష్యతే. 14

ఉత్తమవస్తువు నాశ్రయించువారును, ధీరులును, వివేకులును, తమ యుత్తమగుణములచే నితరచిత్తముల హరించువారునగు మీయొక్క మనస్సుగూడ భ్రమజెంది విచ్ఛిన్నమైనదే! అహో ఆశ్చర్యము!

అనభ్యస్తవివేకం హి దేశకాలవశానుగమ్
మంత్రౌషధివశం యాతి మనో నోదారవృత్తిమత్. 15

వివేకాభ్యాసములేక, దేశకాలముల వైపునకే పరుగిడు మనస్సు మంత్రౌషధాదులకు వశమగును గాని, వివేకయుక్తమై, ఉదారవృత్తిగలిగియున్న మనస్సుగాదు.

నిత్యమాత్తవివేకస్య కథమాలూనశీర్ణతా
ధునోతి వితతం చేతో వాత్యేవ విబుధాచలమ్. 16

నిత్యము వివేకముగల్గియుండు చిత్తమునకు, ప్రజ్ఞావినాశనము, అల్ప విషయాశ్రయ మెట్లు కలుగును? సుమేరుపర్వతమును వాయువు చలింపజేయజాలనట్లు, అట్టి దృఢచిత్తమును విషయవృత్తులేమియు చేయజాలవు.

ఇతి జాతానుగీర్ణస్య భూపతేః కాంతిరాననమ్
భూషయామాస శీతాంశుం మాసాంత ఇవ పూర్ణతా. 17

స్వజనుల యిట్టి ప్రియవచనములచే ధైర్యమును జెందిన రాజపుత్రుడు పూర్ణచంద్రుని భంగి శోభిల్లెను.

స రరాజ రాజా సౌమ్యాస్యమున్మీలితవిలోచనః
గతే హిమర్తావుల్లాసి పుష్పౌఘ ఇవ మాధవః. 18

హేమంత ఋతువు గడచినమీదట వికసిత పుష్ప సమూహములతో కూడి వసంత ఋతువు శోభించునట్లు మెల్లగ నేత్రములను దెఱచిన రాజుయొక్క ముఖమండలమపుడు ప్రకాశించెను.

అథాతిసంభ్రమాశ్చర్యఖిన్నాస్మృతిముఖో బభౌ
ఆసన్నమృత్యుర్యాలోక్య రాహుమిందురివాంబరే. 19

పిమ్మట భయము, ఆశ్చర్యములచే తనయందుదయించిన ఖిన్నత్వమునుగూర్చి విచారించుకొనుచు (పూర్వాపర వృత్తాంతముల స్మరించుచు) యింద్రజాలకునిజూచిన రాజపుడు, అస్తమింపబోవుచు నాకసమున రాహువును జూచిన చంద్రునివలె నుండెను.

ఐంద్రజాలికమాలోక్య ప్రోవాచాథ హసన్నివ
బభ్రుం హింసాత్మకం దృష్ట్వా సర్పరూపీవ తక్షకః. 20

క్రూర స్వభావముగల ముంగిసనుగూర్చి క్షుద్ర సర్పరూపమును ధరించిన తక్షకుడు పల్కునట్లా యింద్రజాలికునితో రాజిట్లు పలికెను.

జాల్మజాలజటాలేన కిమేతద్భవతా కృతమ్
యేనాస్పందప్రసన్నోఽబ్ధిః క్షణాదేత్య ప్రసన్నతామ్. 21

ఓయీ! నీవు క్షణములో శాంతసముద్రమును కూడ క్షుభితమొనర్చునట్టి యీ మాయాజాలమేమి రచించితివి?

చిత్రం చిత్రాహి దేవస్య పదార్థశతశక్తయః
సుశక్తమపి మే చిత్తం యాభిర్మోహే నివేశితమ్. 22

ఆహా! మంత్రాదులందలి యీశ్వరీయశక్తి అత్యద్భుతమైనది. సమర్థుల చిత్తమును గూడ నయ్యది విమోహితమొనర్చును గదా!

క్వ వయం లోకసర్యాయకృతాంతపదవేదినః
క్వ మనోమోహదాయిన్యో వితతాః ప్రకృతాపదః. 23

లోక వ్యవహారదక్షులగు మేమెచట మోహప్రదమగు ఈ యాపదలెచట!

అప్యభ్యస్తమహాజ్ఞానం మనస్తిష్ఠతి దేహకే
కదాచిన్మోహమాదత్తే క్షణం మతిమతామపి. 24

ప్రజ్ఞావంతుల ఉత్తమ వివేకయుక్తమగు మనంబుగూడ అప్పుడప్పుడు క్షణకాలము స్వప్న ఇంద్రజాలాదులందువలె మోహితమగును.

ఇదమాశ్చర్యమాఖ్యానం శ్రూయతాం రే సభాసదః
మమ శాంబరికేణేహ యన్ముహూర్తం ప్రదర్శితమ్. 25

ఓ సభికులారా! శంబరాసురుని మాయనెఱింగిన ఈ యింద్రజాలకునిచే నొక్క ముహూర్త సమయమున ఎయ్యది నాకు జూపబడెనో, అట్టి ఆశ్చర్యజనకమగు వృత్తాంతమును వినుడు.



దృష్టవానహమేతస్మిన్బహ్వీః కార్యదశాశ్చలాః
ముహూర్తం ప్రార్థితోఽధ్వస్తశక్రసృష్టిరివాబ్జజః. 26

బలిచక్రవర్తిచే ప్రార్థితుడగు బ్రహ్మదేవుడు యింద్రుని సృష్టిని నాశమొనర్చి, ఒక్క ముహూర్తకాలములో నాకౌతుకమంతయు నెట్లు దర్శించెనో, అట్లే యీ ఇంద్రజాలమున నేననేక కార్యములను, పెక్కు చంచల పరిస్థితులను గాంచితిని.

ఇత్యుక్త్వోన్ముఖనేత్రేషు సభ్యేషు స హసన్నివ
రాజా వర్ణయితుం చిత్రం వృత్తాంతముపచక్రమే. 27

రాజిట్లుపల్కనంత సభాసదులందఱును దానింగూర్చి విన నుత్కంఠితులుకాగా, అపుడు నవ్వుచు నా విచిత్రవృత్తాంతమంతయు నాతడిట్లు వర్ణింపదొడగెను.

రాజావాచ :—

ఇహ వివిధపదార్థసంకులాయాం హ్రదనదపత్తనపర్వతాకులాయామ్
కులశిఖరిసముద్రసంకిరాయాం భువి విభవావలితోఽస్త్యయం ప్రదేశః. 28

ఇత్యార్షే శ్రీవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ఇంద్రజాలోపాఖ్యానే రాజావబోధోనామ పంచోత్తర
శతతమః సర్గః ॥ 105 ॥

రాజు:— వివిధ పదార్థములు గలిగి నదీనద నగర పర్వతాదులచే పూర్ణమై, మహేంద్రాది కులపర్వతములతో నేకమైయున్న పృథ్వీతలమున పలువిధ యైశ్వర్యములతో తులతూగుచున్న యీ మనదేశముగలదు.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
ఇంద్రజాలోపాఖ్యానమున రాజావబోధమను పంచోత్తర
శతతమ సర్గము ॥ 105 ॥

## షడుత్తరశతతమః సర్గః

రాజోవాచ:—

అస్తి తావదయం దేశో నానావననదీయుతః
వసుధామండలస్యాస్య సహోదర ఇవానుజః. 1

రాజు:— సభికులారా! సుప్రసిద్ధమగు యీ మనదేశము నేక నదీవనములతో కూడియున్న భూమండలమునకు కనిష్ఠభ్రాతవలె నొప్పుచున్నది.

అస్మింశ్చాయమహం రాజా పౌరాభిమతవృత్తిమాన్
ఇంద్రః స్వర్గ ఇవాస్యాం తు సభాయాం మధ్యసంస్థితః. 2

నగర నివాసులకును ప్రజలకును సర్వదా యనుకూలముగనే వర్తించు స్వభావముగల

నేనీ దేశమునకు ప్రభువైయున్నాను. మఱియు స్వర్గమందలి 'సుధర్మ' సభయందింద్రునివలె నేనీ సభయందాసీనుడనై యుంటిని.

యావదభ్యాగతో దూరా త్కశ్చిచ్ఛాంబరిక స్స్వయమ్
రసాతలాదభ్యుదితో మాయీ మయ ఇవ స్వయమ్. 3

ఇంతలో రసాతలమునుండి మాయావియగు మయుడను యసురుడేతెంచెనో యన శంబరుని మాయనెఱింగిన యింద్రజాలికుడొకడు దూరదేశమునుండి యటకువచ్చెను.

అనేన భ్రమితాద్యేహ పిచ్ఛికా తేజసోర్జితా
కల్పాంతపవనాభ్రేణ శక్రచాపలతా యథా. 4

ప్రళయవాయుతాడిత మేఘ మింద్రధనుస్సును అతను చలింపజేయునట్లాతడొక నెమలి పింఛమును నాయెదుట వేగముగ త్రిప్పెను.

ఆలోక్య తామహం లోలా మస్యాశ్వస్య పురః స్థితః
పృష్ఠమారూఢవానేక ఆత్మనా భ్రాంతమానసః. 5

ఏకాకినై యద్దానిని గాంచిన నేను భ్రాంతచిత్తుడనయి యెదుటనున్న గుఱ్ఱముపై నెక్కితిని.

తతోఽద్రిం ప్రలయక్షుబ్ధం పుష్కరావర్తకో యథా
తథా చలంతం చలితః స్వాశ్వమారూఢవానహమ్. 6

అంత ప్రళయవాయువులచే క్షుభితమగు పుష్కరావర్తమను మేఘము పర్వతముపై వేగముగ బోవునట్లు నేనా బలిష్ఠమగు గుఱ్ఱమునెక్కి కదలితిని.

గంతుం ప్రవృత్తో మృగయామేకోఽహమతిరంహసా
ఉర్వరామివ నిర్భర్తుః కల్లోలః ప్రలయాంబుధేః. 7

ప్రళయకాలమందు విజృంభించిన సముద్రముయొక్క యున్నత తరంగము ఫలవంతమగు భూమిపైకిపోవునట్లు నేను వేటాడుటకై యొంటరిగనే బహువేగమున పయనమైతిని.

తేనానిలవిలోలేన దూరం నీతోఽస్మి వాజినా
భోగాభ్యాసజడేనాజ్ఞో ముగ్ధస్య మనసా యథా. 8

అవిచారముచే రమణీయములుగ గన్పట్టు విషయములను సేవించుటచే, మనస్సు మలినమై జడత్వమొంది పరమాత్మకు దూరమగునట్లు నేనాగుఱ్ఱమెక్కి వాయువేగమున చాలదూరమేగితిని.

అకించనమనః శూన్యం స్త్రీచిత్తమివ నిర్భరమ్
తతః ప్రలయనిర్దగ్ధ జగదాస్పదభీషణమ్. 9

నిష్పక్షితూరనీహారం నిర్వృక్షమజలం మహత్
సంప్రాప్తోఽహమపర్యంత మరణ్యం శ్రాంతవాహనః. 10

అటుపిమ్మట, విరాగులగు మునుల చిత్తమువలె విషయరహితమును, స్త్రీచిత్తమువలె భయంకరమును, ప్రళయకాలమందు [illegible] భయప్రదమును, పక్షిగణవర్జితమును,



శీత వాయువులచే నతి దుస్సహమును, వృక్ష జల శూన్యమును, విశాలమును, అనంతమునగు నొక వనముం జేర నంత నా గుఱ్ఱమలసినదాయెను.

తద్ద్వితీయమివాకాశం తథాష్టమమివాంబుధిమ్
పంచమం సాగరమివ సంశుష్కం శూన్యకోటరమ్. 11

జ్ఞస్యేవ వితతం చేతో మూర్ఖస్యేవ రుషాఽజవమ్
అదృష్టజనసంసర్గ మజాతతృణపల్లవమ్. 12

అరణ్యమిదమాసాద్య మతిర్మే ఖేదమాగతా
లలనేవైత్య దారిద్ర్యం నిరన్నఫలబాంధవమ్. 13

రెండవ ఆకాశమువలె నున్నదియు, స్వాదుజలసముద్రము కావలనున్న భూమి కగత్తవలె నున్న అష్టమసముద్రము వంటిదియు, శుష్కించిన ప్రదేశముగలదియు, శూన్యమును, బ్రహ్మసాక్షాత్కారమునొందిన జ్ఞానియొక్క చిత్తమువలె నపరిమితమును, మూర్ఖుని క్రోధమువలె భయంకరమును, జన సంచారవర్జితమును, తృణ పల్లవ రహితమునునగు యరణ్యముంజేర నంత నేనతిఖిన్నుడనైతిని. అపుడు నేను ఫల, భోజన, బంధువర్జితమై దారిద్ర్య మనుభవించు స్త్రీవలె దైన్యమొందితిని.

కచన్మరుమరీచ్యంబు పురః ప్లుతశకున్ముఖమ్
ఆసూర్యాస్తందినం తత్ర ప్రక్రాంతం సీదతా మయా. 14

అచ్చోట మృగతృష్ణాజలమే సర్వత్ర శోభావంతమై యుండెను. అవ్వనమున నేను సూర్యాస్తమయమువఱకు సంచరించితిని.

తదరణ్యం మయాఽతీతమతికృచ్ఛ్రేణ ఖేదినా
వివేకినేవ సంసారో మధ్యశూన్యతతాకృతి. 15

వివేకులు సంసారమును దాటునట్లు మధ్య శూన్యభాగముగల్గి విశాలమైనట్టి యావనమును నేనతికష్టముతో దాటగల్గితిని.

యదేతేనాతివాహ్యాహం ప్రాప్తవాఞ్జంగలం క్రమాత్
అస్తాద్రిసానుం ఖిన్నాశ్వః శూన్యభ్రాంత్యేవ భాస్కరః. 16

ఆకాశ భ్రమణము సూర్యుని అస్తాద్రిం బొందింప జేయునట్లు, అలసిన గుఱ్ఱముచే గొంపోబడి క్రమముగ నేను మఱియొక అరణ్యమునకు జేర్చబడితిని.

జంబూకదంబప్రాయేషు కలాలాపాః పతత్త్రిణః
యత్ర స్ఫురంతి ఖండేషు పాంథానామివ బాంధవాః. 17

యత్ర శష్పశిఖాశ్రేణ్యో దృశ్యంతే విరలాః స్థలే
కదర్థలబ్ధ్యాజిహ్మాన్య హృదీవానందవృత్తయః. 18

అచట జంబూ, కదంబాది వృక్షములపై పక్షులు మధుర గానమొనర్చుచు, పాంథులకు బంధువులవలె నుండెను. మఱియు నధర్మముచే ధనమార్జించు దుష్టునం దానంద వృత్తులేవియు నుండనట్లు అచట కోమలతృణ సమూహము లేకుండెను.

పూర్వాదరణ్యాదరసాత్తద్ధి కించిత్సుఖావహమ్
అత్యంతదుఃఖాన్మరణాద్వరం వ్యాధిర్హి జంతుషు. 19

వెనుకటి యరణ్యముకంటె నియ్యది కొంచెము సుఖకరముగనే యుండెను. అత్యంత దుఃఖదాయకమగు మరణముకంటె రోగమే యుత్తమమని జీవులు తలంతురుగదా!

తత్ర జంబీరఖండస్య తలం సంప్రాప్తవానహమ్
మార్కండేయ ఇవాగేంద్ర మేకార్ణవవిహారతః. 20

అపుడు, మహాసముద్రమున విహరించు మార్కండేయుడు విష్ణునిలయమగు వటవృక్షమును పొందినట్లు నేనొక జంబీర (నిమ్మ) వృక్షతలమును చేరితిని.

ఆలంబితా మయా తత్ర స్కంధసంసర్గిణీ లతా
నీలా జలదమాలేవ తాపతప్తేన భూభృతా. 21

సూర్యతాపముచే తపించిన పర్వతము మేఘము నాశ్రయించునట్లావృక్షము క్రిందనున్న లతయందు నా కంఠము తగుల్కొన, నేనద్దాని నాలంబనముగా గైకొంటిని.

మయి ప్రలంబమానేఽస్యాం ప్రయాతః స తురంగమః
గంగావలంబిని నరే యథా దుష్కృతసంచయః. 22

అట్లు నేనా లత నాశ్రయించి వ్రేలాడుచుండ, సంతలో గంగానది నాశ్రయించినవానిని పాపసమూహము వీడునట్లు నా గుఱ్ఱము నన్నువీడి జనెను.

చిరం దీర్ఘాధ్వగః ఖిన్న స్తత్ర విశ్రాంతవానహమ్
భానురస్తాచలోత్సంగే తలే కల్పతరోరివ. 23

అస్తాద్రి శిఖరమున కల్పవృక్షముక్రింద సూర్యుడు విశ్రమించునట్లు, చాలదూరమేగుటచే నలసి ఖిన్నుడనైయున్న నేనపుడా వృక్షముక్రింద చాలసేపు విశ్రమించితిని.

యావత్సమస్త సంసార వ్యవహారభరైః సమమ్
రవిర్విశ్రమణాయేవ నివిష్టోఽస్తాచలాంగణే. 24
శనైః శ్యామికయా గ్రస్తే సమస్తే భువనోదరే
రాత్రిసంవ్యవహారేషు సంప్రవృత్తేషు జంగలే. 25

అత్తటి సమస్త వ్యవహారములను చాలించి సూర్యభగవానుఁ డస్తాచల ప్రాంగణమున విశ్రమించెను. క్రమముగ రాత్రిప్రవేశించి లోకములనన్నింటిని తన యుదరమున నిడుకొన, ఆ యరణ్యమందంతటను అంధకారము వ్యాపించెను.

అహం తరుతృణే తస్మిన్స్వేలవే ఖండకోటరే
నిలీనశ్చిరలీనాస్యః స్వనీడే విహగో యథా. 26

అపుడు ముఖమును ఱెక్కలందుంచి పక్షిగూటియందు దాగుకొనునట్లు, కోమల పత్రములుగల నొక వృక్షకోటరమందు నేను దాగుకొంటిని.



విషదష్టవివేకస్య కీనాశస్య గలత్స్మృతేః
విక్రీతస్యేవ దీనస్య మగ్నస్యేవాంధకూపకే. 27
తత్ర కల్పనమా రాత్రి ర్మోహమగ్నస్య మే గతా
ఏకార్ణవోహ్యమానస్య మార్కండేయమునేరివ. 28

పాము కరచుటచే, నశించిన వివేకముగలవాని చందమున మృత్యువశమై స్మృతి, జ్ఞానములులేక, అస్వతంత్రునివలె దైన్యమునొందుచు, అంధకూపమున బడినవానివలె విమోహితుఁడనైయున్న నాకారాత్రి మహాసముద్రమున కొట్టుకొనిపోవుచున్న మార్కండేయునికివలె, కల్పముగ తోచెను.

న స్నాతవాన్నార్చితవాన్న తదా భుక్తవానహమ్
కేవలం మే గతా రాత్రిః సాపదాం ధురి తిష్ఠతః. 29

అపుడు స్నానముగాని పూజగాని గావింపలేదు. భోజన మొనర్పలేదు. విపద్గ్రస్తునికివలె నాకా రాత్రి బహుకష్టముగ గడచెను.

వినిద్రస్య వివైధుర్యస్య స్ఫురతః సహ పల్లవైః
సమం దుష్టాతిదైర్ఘ్యేణ సా వ్యతీయాయ శర్వరీ. 30

నిద్రలేక, ధైర్యము గోల్పోయి, చెట్లయాకులవలె చలించుచున్న నే నతిదీర్ఘమగు యా రాత్రి నెట్టకేలకు గడపితిని.

తత స్తిమిరలేఖాసు సహ తారేందుకైరవైః
మయీవాపాద్యమానాసు మ్లానతామలమాననే. 31
శామ్యంతీషు చ వేతాలక్ష్వేడాసు జవజంగలే
సహ శీతార్తిమద్దంత పంక్తిటాంకారసీత్కృతైః. 32
మామేవార్తివినిర్మగ్నం హసంతీమివ దృష్టవాన్
అహం పూర్వాం దిశం ప్రాప్త మధుపానారుణామివ. 33

అపుడంధకార, నక్షత్ర, చంద్ర, కుముదలు నావలెనే క్షీణదశను పొంద, ఆ విశాలారణ్యమున బేతాలముల సింహనాద యుక్తమగు క్రీడలు శాంతింప, దుస్సహమగు శైత్యముచే బాధితులగు జీవుల దంత సంఘట్టన, చీత్కారశబ్దములు శమింప, యాపద్గ్రస్తుఁడవగు నేనంత, మధుపాన క్రీడచే నన్నుజూచి నవ్వుచున్నట్లున్న రక్తవర్ణమయమగు పూర్వదిశను గాంచితిని.

తృణాదజ్ఞ ఇవ జ్ఞానం దరిద్ర ఇవ కాంచనమ్
దృష్టవానహమర్కం ఖే వారణారోహణోన్ముఖమ్. 34

అజ్ఞాని జ్ఞానమును, దరిద్రుడు సువర్ణమును పొందినట్లు, నేనపుడొక క్షణములో తూర్పు దిక్కున, ఐరావత దిగ్గజముపై నారూఢుడైన సూర్యభగవానుని వీక్షించితిని.

ఉత్థాయాస్తరణం వస్త్రం తత్తదాస్ఫోటితం మయా
హస్తిచర్మహారేణేవ సంధ్యానృత్యానురాగిణా. 35

అపుడే లేచి, సంధ్యాకాల నృత్యమొనర్పనున్న శంకరుడు తన హస్తిచర్మమును దులుపునట్లు నేను నా పడకను, దుప్పటిని విదిలించితిని.

ప్రవృత్తస్తామహం స్ఫారాం విహర్తుం జంగలస్థలీమ్
కాలో జగత్కుటీం కల్పదగ్ధభూతగణామివ. 36

ప్రళయకాలమున దహింపబడిన ప్రాణికోట్లుగల జగత్తునందు కాలుడు విహరించునట్లు నేనపుడా యరణ్యమున విహరింపసాగితిని.

న కించిద్దృశ్యతే తత్ర భూతం జరఠజంగలే
అభిజాతో గుణలవో యథా మూర్ఖశరీరకే. 37

మూర్ఖునియం దుత్తమ గుణమువలె నా విశాలారణ్యమున యొక ప్రాణియైనను గన్పింపకుండెను.

కేవలం విగతాశంకం ఖండభ్రమణచంచలమ్
చీచీకూచీతివచనా విహరంతి విహంగమాః. 38

కేవలము, ఫలరహిత వృక్షములపై స్వేచ్ఛగ సంచరించుచు, 'చీచీ కూచీ' శబ్దముల నొనర్చుచున్న పక్షులుమాత్ర మట గలవు.

అథాష్టభాగమాపన్నే వ్యోమ్నా దివసనాయకే
శుష్కావశ్యాయలేశాసు స్నాతాస్వివ లతాసు చ. 39
దృష్టా మయా ప్రభ్రమతా దారికౌదనధారిణీ
గృహీతామృతసత్కుంభా దానవేనేవ మాధవీ. 40

నాల్గు ఘడియల ప్రొద్దెక్కిన మీదట మంచుచే తడుపబడిన తీగలపైగల మంచంతయు నెండిపోవ, యచట సంచరించుచున్న నేనపుడు, స్త్రీవేషధారియు, అమృత కలశ హస్తుండునునైన విష్ణువును దానవులు వీక్షించునట్లు, చేతియందన్నము గైకొనియున్న కన్నియ నొకతె జూచితిని.

తరత్తారకనేత్రాం తాం శ్యామామధవలాంబరామ్
అహమభ్యాగతస్తత్ర శర్వరీమివ చంద్రమాః. 41

చంచల నేత్రములుగల్గి, మలినవస్త్రమును ధరించియున్న యాకన్యకఁ జూచి, రాత్రి సమీపమునకు చంద్రునివోలె, నే నామెవద్దకుఁ బోయితిని.

మహ్యమోదనమాశ్వేతద్బాలే బలవదాపది
దేహి దీనార్తిహరణాత్ స్ఫారతాం యాంతి సంపదః. 42

మఱియు నే నామెతో నిట్లంటిని — 'ఓ బాలికా! ఈ విపత్సమయమున నాకీయన్నము పెట్టుము. దీనుల దుఃఖములను తొలగించువారి సంపదలు వృద్ధినొందునుగదా.

క్షుదంతర్మమహాతీయం మే బాలే వృద్ధిముపేయుషీ
కృష్ణసర్పప్రసూతేవ కోటరస్థా జరద్ద్రుమే. 43



ఓ బాలికా! పాడువడిన చెట్టుతొఱ్ఱయందు ప్రసవించిన కాలసర్పమునకువలె నా కిపుడాకటిబాధ యధికమగుచున్నది.

యాఞ్చ్యయాపి తయా మహ్యమిత్థం దత్తం న కించన
యత్నప్రార్థనయా లక్ష్మ్యా యథా దుష్కృతినే ధనమ్. 44

ఇవ్విధమున నే నెంతప్రార్థించినను, పాపికి లక్ష్మి ధనమీయనిలాగున, ఆమె నాకేమియు నొసంగకుండెను.

కేవలం చిరకాలేన మయాత్యంతానుగామినా
ఖండాత్ఖండం నిపతతి చ్ఛాయాభూతే పురః స్థితే. 45

అయినను నేనామెను వీడక, యొక వనమందుండి మఱియొక వనమునకు ఛాయవలె యామె ననుగమించుచు నే బోయితిని.

తయోక్తం హారకేయూరింశ్చండాలీం విద్ధి మామితి
రాక్షసీమివ సుక్రూరాం పురుషాశ్వగజాశనామ్. 46

అపుడాకన్యక యిట్లనెను — ఓ హారకేయూరధారీ! నేను చండాలకన్యకను, మఱియు మనుజాశ్వగజ మాంసముల భక్షించు అతిక్రూరమగు రాక్షసివంటిదానను (అవగ నా యాహారము నీకు భుజింప యోగ్యమైనది కాదు.)

రాజన్యార్చనమాత్రేణ మత్తో నాప్నోషి భోజనమ్
గ్రామ్యాదనభిజాతేహాత్సౌజన్యమివ సుందరమ్. 47

రాజకులోద్భవా! నీచుడగు గ్రామస్థునియందు సౌహార్దమువలె, నావెంట వచ్చినంతమాత్రమున, నీవు భోజనమేమియు పొందజాలవు.

ఇత్యుక్తవత్యా గచ్ఛంత్యా ఖేలయా చ పదేపదే
కుంజకేషు నిమజ్జంత్యా లీలావనతయోదితమ్. 48

ఇట్లు వచించుచు క్రీడాపూర్వకముగ జనుచుండి లతాకుంజములఁ దాగుకొనుచు, వినోదముగ కటాక్షాది చేష్టలనొనర్చుచు తద్ద్వారా తన యభిమతమును వ్యక్తమొనర్చుచు, త్రోవలో నామె నాతో యిట్లనియె. —

దదామి భోజనమిదం భర్తా భవసి చేన్మమ
లోకో నోపకరోత్యర్థైః సామాన్యః స్నిగ్ధతాం వినా. 49

ఓ ప్రభూ! నీవు నాభర్తవైనచో నీకీ యన్నమిచ్చెదను. ఏలన, నావంటి సామాన్యులు గొప్ప ప్రయోజనములేకయే యితరుల కుపకారము చేయనొల్లరు.

వాహయత్యత్ర మే దాంతాన్కేదారే పుల్కసః పితా
శ్మశాన ఇవ వేతాలః క్షుధితో ధూలిధూసరః. 50

ధూళిచే ధూసరితుడగు శ్మశానమున భేతాళునివలె, చండాలుడగు నా తండ్రి యెద్దుల దోలుచు, పొలమును దున్నుచున్నాడు.

తస్యేదమన్నం భవతి భర్తృత్వే దీయతే స్థితే
ప్రాణైరపి హి సంపూజ్యా వల్లభాః పురుషా యతః. 51

ఈ యన్నమాతనికొఱకే నేను గొనిపోవుచున్నాను. అయినను, నీవు నా పతివైనచో నీకిద్దాని నివ్వగలను. ఏలయన, స్త్రీలకు పతి ప్రాణములకంటె నధికపూజనీయుడగును గదా!

అథోక్తా సా మయా భర్తా భవామి తవ సువ్రతే
కేనాపది విచార్యంతే వర్ణధర్మకులక్రమాః. 52

అపుడు నేనామెతో నిట్లంటిని — 'ఓ సువ్రతా! అట్లనే నేను నీ భర్త యయ్యెదను. ఆపత్కాలమున కుల, జాతి, ధర్మములనెవడు విచారించును?

తతస్తయాదనాదర్ధం మహ్యమేకం సమర్పితమ్
మాధవ్యేవామృతాదర్ధ మింద్రాయార్తిమహత్పురా. 53

స్త్రీ వేషధారియగు విష్ణువు అమృతమందలి సగముభాగమును ఇంద్రునికిచ్చినట్లా కన్నియ ఆ యన్నమందలి సగము భాగము నాకొసంగెను. క్షుధార్తుడనగు నేనద్దానినే యధికముగ దలంచితిని.

జంబూఫలరసః పీతః స భుక్తః పక్కణౌదనః
విశ్రాంతం చ మయా తత్ర మోహోపహతచేతసా. 54

అజ్ఞానముచే నశించిన బుద్ధిగల నేనపుడు జంబూ (నేరెడు) ఫల రసముద్రోలి, ఆ యన్నముదిని కొంచము సేపు విశ్రమించితిని.

మాం తత్రార్కమివావూర్య సా ప్రావృట్ శ్యామలా గతా
హస్తేన సముపాదాయ ప్రాణం బహిరివ స్థితమ్. 55

సూర్యుని విడచి మేఘము జనునట్లు, శ్యామవర్ణయగు నాకన్నియ నన్నువీడి జనెను. అపుడామె బాహ్యదేశమునగల ప్రాణమును హస్తమున గొనిపోవునట్లుండెను.

దురాకృతిం దురారంభమాససాద భయప్రదమ్
పితరం పీవరాకారమవీచిమివ యాతనా. 56

అంత నామె, అవీచియను నరకమునకు దుఃఖము బోవునట్లు కురూపుడును, దుష్టుడును, భయదాయకుడును, దీర్ఘదేహుడునగు తన తండ్రిని సమీపించెను.

తయా మదనుషంగిణ్యా స్వార్థస్తస్మై నివేదితః
మాతంగాయ భ్రమర్యేవ నిఃస్వనేనాలిలగ్నయా. 57

మధురస్వరమున భ్రమరముతో భ్రమరి బల్కునట్లు, తనతండ్రి కామె వివాహవిషయమంతయు దెలిపెను.

అయం మమ భవేద్భర్తా తాత హే తవ రోచతామ్
స తస్యా బాఢమిత్యుక్త్వా దినాంతే సముపస్థితే. 58



ముమోచ దాంతావాబద్ధౌ కృతాంతః కింకరావివ
నీహారాభ్రకడారాసు దిక్షు ప్రోద్ధూలితాసు చ
వేతాలబంధనాత్తస్మాద్దినాంతే చలితా వయమ్. 59

'ఈతడు నా భర్తయగుటను మీరు సమ్మతింపుడ'ని యామె తనతండ్రితో వచింప, నంతయాతడును 'వల్లె' యనెను. అపుడు సాయంకాలము కాగా యమరాజు తన కింకరులను బంపునట్లాతడు బంధింపబడిన తనరెండెద్దులను విడచిపంపెను. మేఘములు మంచును దిక్కులను ధూసరితమొనర్ప పిశాచములకు నిలయమగు అవ్వనమును మేము మువ్వురము వీడితిమి.

క్షణేన పక్కణం ప్రాప్తాః సంధ్యాయాం దీర్ఘజంగలాత్
శ్మశానాదివ వేతాలాః శ్మశానమితరన్మహత్. 60

బేతాలమొక శ్మశానమునుండి మఱియొక శ్మశానమునకు బోవునట్లు మేమా సంధ్యాకాలమున యొకక్షణములో ఆ విశాలారణ్యమునుదాటి శబరాలయమును జేరితిమి.

విశ్రుతవిభాగస్థ కపికుక్కుటవాయసమ్
రక్తసిక్తోర్వరాభాగ ప్రభ్రమన్మక్షికాగణమ్. 61
శోషార్థం ప్రసృతార్ద్రాంత్ర తంత్రీజాలవతత్ఖగమ్
నిష్కుటస్థితజంబీర ఖండలగ్నఖగధ్వని. 62
శుష్యద్గురువసాపిండ పూర్ణాలిందలసత్ఖగమ్
దృష్టిప్రసృతరక్తాక్త చర్మస్రవదసృగ్లవమ్. 63
బాలహస్తస్థితక్రవ్య పిండక్వణితమక్షికమ్
జర్జరాధిష్ఠచండాల తర్జితారటితార్భకమ్. 64

ఆ చండాల వాటికయందు కోతులు, కోళ్లు, కాకులు ముక్కలు ముక్కలుగా కోయబడి పడియుండెను. రక్తముచే తడుపబడిన నేలపై దోమలు వ్రాలుచుండెను. ఎండపెట్టబడిన తడిప్రేవులపై పక్షులు తిరుగాడుచుండెను. అచ్చోట వేపచెట్లపై పక్షులు శబ్దమొనర్చుచుండెను. ఎండుచున్న క్రొవ్వు గృహ బహిర్ద్వారమున పఱుపబడ నచట పక్షులువచ్చి చేరుచుండెను. కంటినుండి వెడలుచున్న రక్తముచే తడచిన చర్మమునుండి రక్తబిందువులు పడుచుండెను. బాలుర చేతియందున్న పచ్చిమాంసపు ముక్కలపై దోమలు వ్రాలుచు ధ్వనిచేయుచుండెను. వృద్ధులు, శ్రేష్ఠులునగు చండాలురు యఱచుచున్న బాలుర మందలించుచుండిరి.

తత్ప్రవిష్టా వయం కీర్ణ శిరాంత్రం భీమపక్కణమ్
మృతభూతం జగత్కల్పే కృతాంతానుచరా ఇవ. 65

ప్రళయకాలమున ప్రాణికోట్లన్నియు మరణించుచుండ యచటకు యమకింకరులు బోవునట్లు, నాడులతోను ప్రేవులతోను నిండియున్న ఆ చండాలగృహమును మేము ప్రవేశించితిమి.

సంభ్రమోపహితానల్ప కదలీదలపీఠకే
అహమాస్థితవాంస్తత్ర నవే శ్వశురమందిరే. 66

ఆ నూతన శ్వశుర గృహమున, మిక్కిలి యాదరముతో గొనిరాబడిన అరటియాకుల యాసనముపై నేను కూర్చుంటిని.

శ్వశ్ర్వా మే కేకరాక్ష్యాతు తేనాసృగ్లవచక్షుషా
జామాతాఽయమితి ప్రోక్తం తయా తదభినందితమ్. 67

కంటియందు రక్తబిందువుగల మాయత్తగారు 'ఈతడు మాయల్లుడు'ని బల్కి మిగుల సంతసించినదాయెను.

అథ విశ్రమ్య చండాల భోజనాన్యజినాసనే
సంచితాన్యవభుక్తాని దుష్కృతానీవ భూరిశః. 68

పిదప కొంచము సేపు విశ్రమించి, కృష్ణాజినముపై గూర్చుండి, అనేక కర్మలచే సంచిత మొనర్పబడిన పాపమును పాపి యనుభవించునట్లు నేనా చండాలురచే గొనితేబడిన పదార్థములను భుజించితిని.

అనంతదుఃఖబీజాని న మనోజ్ఞతరాణ్యపి
తాని ప్రణయవాక్యాని శ్రుతాన్యసుభగాన్యలమ్. 69

మఱియు అనేక దుఃఖములకు హేతువును, అప్రియమునునగు కుత్సిత ప్రణయవాక్యములం గూడ యపుడు వింటిని.

నిరభ్రాంబరనక్షత్రే కస్మింశ్చిద్దివసే తతః
తైస్తైరారంభసంరంభైస్తైర్వ్యత్రవిభవార్పణైః. 70
దత్తావ్యనేన సా మహ్యం కుమారీ భయదాయినీ
సుకృష్ణా కృష్ణవర్ణేన దుష్కృతేనేవ యాతనా. 71

పిదప యొక శుభదినమున శుభముహూర్తమున ఆకసము మేఘరహితమై నిర్మలముగానుండ చండాలోచిత మద్యమాంసాది వస్తువులన్నియు సమకూర్పబడగా, వివాహయోగ్యమగు సమస్త పదార్థములును సిద్ధము చేయబడ, పాపునకు నరక దుఃఖమువలె భయదాయినియు, కృష్ణవర్ణయునగు నాకన్య నా మామచే నాకు సమర్పింపబడెను.

నరభసముభితో వినేదురత్ర ప్రసృతమహామదిరాసవాః శ్వపాకాః
హతపటుపటహా విలాసవంతః స్వయమివ దుష్కృతరాశయో మహాంతః. 72

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ఇంద్రజాలోపాఖ్యానే చాండాలీవివాహో నామ
షడుత్తరశతతమః సర్గః ॥ 106 ॥

ఆ వివాహ మహోత్సవసమయమున యచటనున్న చండాలురందఱును మద్యపానముచే ప్రమత్తులై పెద్ద పెద్ద వాయిద్యముల వాయించిరి. ఆడుచు పాడుచు విలాసముతో వారందఱును



నలువైపుల పరుగిడుచు, మూర్తివంతమగు బ్రహ్మహత్యాది మహాపాప సముదాయమువలె శబ్ద మొనర్చిరి.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
ఇంద్రజాలోపాఖ్యానమున చాండాలీ వివాహమను
షడుత్తర శతతమ సర్గము ॥ 106 ॥

## సప్తోత్తర శతతమః సర్గః.

రాజోవాచ :—

బహునాఽత్ర కిముక్తేన సోత్సవావర్జితాశయః
తదాప్రభృతి తత్రాహం సంపన్నః పుష్టపుల్కసః. 1

రాజు:— ఇంక నధికముగ జెప్పనేల, ఆ వివాహోత్సవమునకు వశుడనై నే నది మొదలు పూర్ణచండాలత్వమును బడసితిని.

సప్తరాత్రోత్సవస్యాంతే క్రమాన్మాసాష్టకే గతే
పుష్పితా సాస్య సంపన్నా స్థితా గర్భవతీ తతః. 2

ఏడు రాత్రులవఱకు వివాహోత్సవము కొనసాగెను. ఆ పిదప క్రమముగ ఎనిమిది నెలలు గడచినమీదట నా భార్య ఋతుమతియై పిమ్మట గర్భము ధరించెను.

ప్రసూతా దుఃఖదాం కన్యాం విపద్దుఃఖక్రియామివ
సా కన్యా వవృధే శీఘ్రం మూర్ఖచింతేవ పీవరీ. 3

ఆపదల గల్గజేయు దుష్క్రియవలె నామెకు దుఃఖదాయినియగు కన్నియ జనించెను. మూర్ఖుని సంకల్పమువలె నాకన్నియ శీఘ్రముగ వృద్ధినందెను.

పునః ప్రసూతా సావర్షైస్త్రిభిః పుత్రమశోభనమ్
అనర్థమివ దుర్బుద్ధి రాశాపాశవిధాయకమ్. 4

మూఁడు వత్సరములు గడచిన పిమ్మట, ఆశాపాశ నిర్మాణమొనర్చు మూర్ఖునివలన యనర్థము గల్గునట్లామెవలన నాకు భాగ్యహీనుడగు పుత్రుడు గల్గెను.

పునః సుతాం దుహితరం పునరప్యర్భకం తతః
కలత్రవానహం జాతో వనే జరఠపుల్కసః. 5

ఆ పిదప మఱియొక కన్యకయు, పుత్రుడును జనించిరి. ఇవ్విధమున చండాలుడనగు నా కౌటుంబము క్రమముగ వృద్ధినందెను.

తయా సహ సమాస్తత్ర మయా బహ్వ్యోఽతివాహితాః
నారకే చింతయా సార్ధం బ్రహ్మఘ్నేనేవ యాతనాః. 6

బ్రహ్మహత్య యొనర్చినవాడు నరకమున పలు యాతనల ననుభవించునట్లు నేనామెతో గూడ చాలయేండ్లతిదుఃఖముతో గడపితిని.

శీతవాతాతపక్లేశ వివశేన వనాంతరే
చిరం విలులితం వృద్ధకచ్ఛపేనేవ పల్వలే. 7

అపుడు వనమధ్యమున శీతవాతాతపముల క్లేశముచే వివశుఁడనై అల్పజలాశయమందలి వృద్ధమత్స్యమువలె, అచటనే చాలకాలము సంచరించుచుంటిని.

కలత్రచింతాహతయా ధియా సందహ్యమానయా
దృష్టాః కష్టసమారంభా దిశః ప్రజ్వలితా ఇవ. 8

కుటుంబ పోషణచింతచే నశించినబుద్ధిగల్గి, దుఃఖపీడితుఁడనై అగ్నిచే దహింపబడువానివలె క్లేశమునొందుచు దిక్కులనన్నిటిని పరిభ్రమించితిని.

క్షామానేకసమాక్షీణపటే చేండకధారిణా
కాష్ఠభారో వనే వ్యూఢో యో మూర్తమివ దుష్కృతమ్. 9

చినిగిన వస్త్రముపై గడ్డిమోపునుంచి యద్దానిని శిరముపై బెట్టుకొని మూర్తివంతమగు పాపమువోలె కష్టదాయకమగు నా భారమును మోసితిని.

యూకాకీర్ణ జరత్క్లిన్న గంధికౌపీనవాససా
ఆశ్వస్య ధవలీకానాం తలే నీతాఘనాః సమాః. 10

ఈగలు వ్రాలుచున్నట్టి చినిగిన దుర్గంధయుక్తమగు కౌపీనము ధరించి ధవలీకమను వృక్షము క్రింద నేను చాలకాలము విశ్రమించితిని.

కలత్రాపూరణోత్కేన జర్జరేణ హిమానిలైః
హేమంతే దర్దురేణేవ విలీనం వనకుక్షిషు. 11

కుటుంబపోషణ చింతయందే మగ్నుడనై శీతవాయువులచే బాధింపబడుచు జీర్ణదేహుడనై అడవినమధ్యమున కప్పవలె దాగుకొని యుంటిని.

నానాకలహకల్లోల తాపప్రసరవిద్రుతాః
బాష్పవ్యాజేన నిర్ముక్తా నేత్రాభ్యాం రక్తబిందవః. 12

అనేక కలహములవలన గల్గిన దుఃఖతాపముచే కరగిన రక్తబిందుయుక్త బాష్పములు నేత్రమునుండి ప్రవహింపజొచ్చెను.

యామినోష్ణ విపినే క్లిన్నే వరాహామిషభోజనాః
శిలాతలకుటీకోశే నీతా జలదవిక్లవాః. 13

ఆ యరణ్యమున శిలల క్రింద కుటీరమువలె నున్న గుప్త గృహములందు పందిమాంసము భక్షించుచు, మేఘములచే నతి భయంకరముగ గప్పట్టు రాత్రులనేకముల గడపితిని.



కాలే క్షయం గతే రోహ కాలాభ్రఘనతాం గతే
అసౌహార్దేన బంధూనాం కలహైశ్చాపి సంతతైః. 14
సర్వత్ర జాతశంకేన కలాభిముఖరార్భకైః
మయా కృపణచిత్తేన నీతాః పరగృహే సమాః. 15

దట్టముగ వ్యాపించు నల్లని మేఘములు గలదియు, సస్యోత్పత్తికి కారణభూతమును నగు వర్షాకాలముగడువ, నంత బంధు విద్వేషముచేతను, నిరంతర కలహక్రియచేతను దుఃఖితుడనై అతి దీనుడనగు నేనపుడా కోమలగాత్రులగు బాలబాలికల వెంటనిడుకొని మఱియొక చండాలగృహము నకుఁజని అనేక వత్సరములట గడపితిని.

చండాలీకలహోద్విగ్న చండచండాలతర్జనైః
ముఖం జర్జరతాం యాత మిందురాహురదైరివ. 16

భార్యతో కలహించుటచేతను చండాలురతోటి సంఘర్షణ మొనర్చుటచేతను యుద్విగ్నుడనైయున్న నాముఖము రాహుదంతములచే పీడితుడగు చంద్రుని ముఖమువలె వాడువడెను.

చర్వితాః ఖర్వితోష్ఠేన ద్వీపీ పిశితపేశయః
నారకాహృతవిక్రీతా నారక్యో రశనా ఇవ. 17

నరకమందలి జీవులచే గొనితాబడినదానివలె నొప్పుచున్నట్టి వ్యాఘ్రాదుల మాంసమును బాగుగ నమలి భుజించితిని.

హిమవత్కందరోద్గీర్ణాశ్చండా హేమంతవీచయః
శిశిరే శీకరాసార తుషారనిచయాశ్చిరమ్. 18
అంగే నిరంబరే సోఢా మృత్యుముక్తా ఇవేషవః
జరా జరఠమూఢేన మూలాని క్షీణభూరుహామ్. 19
సుకృతానామివైకేన సముత్ఖాతాని భూరిశః
శరావకేష్వటవ్యాం చ పలలం పక్వమాదరాత్. 20
అస్పృష్టేన జనైర్భుక్తాం కుకలత్రవతా మయా
గృహీత తేజః క్షతయే బహువక్త్రవికారిణా. 21
మార్గావికమివాత్మీయం విక్రీతం పణ్యమన్యతః
ప్రాణ్యంగవపుషస్తస్య ప్రోత్కృత్యోత్కృత్య పేశలః. 22
అయసంపరివిక్రీతా వింధ్యపక్కణభూమిషు
జన్మాంతరసహస్రోత్థం స్వపాపమివ వృద్ధయే. 23
అవకీర్ణ ముసల్కీర్ణం చండాలారామభూమిషు
దృష్టః కుద్దాలకో దృష్ట్వా సంధ్యాస్నేహవిముక్తయా. 24
రారవాపతితేనేవ తత్కాలస్నిగ్ధతాంగతః
వింధ్యకందరగుల్మానాం బంధుత్వమివ గచ్ఛతా. 25

మృత్యువుచే విసరబడిన బాణమును వృద్ధాప్యముసహించునట్లు, హిమాలయ పర్వతములనుండి బయలుదేఱినవియు, దుఃఖప్రదములు నగు హిమతరంగములను, శిశిర ఋతువందలి జలబిందువృష్టిని వస్త్రహీనుడనగు నేను చాలకాలము సహించితిని. శిథిలగాత్రుడును, మూఢచిత్తుడును నగు నేనపుడనేక వృక్షములను సుకృతములవోలె నఱికితిని. మఱియు నాయరణ్యమున మృణ్మయపాత్రలందు వండబడిన మాంసమును, అస్పృశ్యయగు చండాలస్త్రీయే భార్యగాగల నేను భుజించితిని. వికృతాకారుఁడనగు నేను శేళ్ళయొక్కయు, గొఱ్ఱెలయొక్కయు మాంసమును యితరులవద్దకొంటిని. ఆయా ప్రాణుల అవయవములను ఛేదించి వాటి కోమల భాగములనొక యినుప పాత్రయందుంచి బాగుగ సంస్కరించి, పెక్కువేల జన్మలందలి పాపములనింకను వృద్ధిపఱచులాగున, లాభార్థము వాటి నధికమూల్యమునకు అమ్మితిని. అట్లమ్మగా మిగిలినట్టి మలమూత్ర సంయుక్తమగు యపవిత్రమాంసము నంతయును యెండుటకొఱకై చండాలుర గృహవాటికలందు పఱచియుంచితిని. రౌరవ నరకమునుండి పడినవానివలె దుర్దశాగ్రస్తుడును, వింధ్యపర్వత గుహలందలి లతాగుల్మములందువలె బంధితుడునునగు నేను కంద మూల, మాంసాది వస్తుసంపాదనమందు విఘ్నభూతమైన సంధ్యాకాలమును ద్వేషదృష్టితోను, కుటుంబపోషణకు సహాయభూతమగు కుద్దాలము (పాఱ)ను స్నేహదృష్టితోను పరికించితిని.

పులిందవపుషా యత్ర యుక్తయోగైః సమర్పితాః
తర్పితాం లగుడాఘాత జితకౌలేయరంహసా. 26
పుత్రదారైః కదన్నేన గ్రామకాంధోచితేన చ
ధారాసారరణత్పత్ర శుష్కతాలతలే నిశాః. 27
నీతా రణితదంతేన సార్థం విపినవానరైః
రోమభిః కోటిముద్రోద్యైః శీతేనాధ్యుషితస్య మే. 28
వర్షాసు ముక్తాకణవద్ధృతా వానలబిందవః
అజాజీమూతఖండార్థం క్షుత్క్షుణ్ణక్షీణకుక్షిణా. 29
కలత్రేణ సహాటవ్యాం కృతః కలహ ఆకులః
వనే రణితదంతేన శీతకీకరచక్షుషా. 30
మషీమలినగాత్రేణ వేతాలస్య జనాయితమ్
సరిత్తీరేషు మత్స్యార్థం భ్రాంతం బడిశధారిణా. 31
కల్పే జగత్సు నాశార్థం కృతాంతేనేవ పాశినా
పీతం బహూపవాసేన సద్యః కృత్తమృగోరసః. 32
తత్కాలకోష్ణం రుధిరం మాతుస్తనపయో యథా
శ్మశానసంస్థితాన్మత్తో రక్తరక్తాన్మలాశినః 33
విద్రుతా వనవేతాలా శ్చండికాభిద్రుతా ఇవ
వాగురా విపినే వ్యస్తా బంధార్థం మృగపక్షిణామ్ 34
ఆశా ఇవ వివృద్ధ్యర్థం పుత్రదారకలత్రజాః
మయా మాయామయైర్లోకాః సూత్రజాలమయైః ఖగాః. 35



జాలైర్జర్జరతాం నీతా దిశశ్చాసుకృతాయుషా
తత్రాపి దత్తః ప్రసరో మనసో దుష్కృతోదయే. 36

అట్టి దుస్థితియందు చండాలత్వయోగమున సంభవించిన యాపదలను తొలగించుకొనుచు, జంతువులవలని యుపద్రవములను దండ ప్రహారములచే నివారించుచు, నికృష్టమగు యన్నముచే భార్యాపుత్రాదుల పోషించితిని. జలధారవేగముచే శబ్దమొనర్చుచున్న యాకులుగల తాళవృక్షముల క్రింద ఆ యరణ్యమందలి వానరములతోగూడి పెక్కురాత్రులు గడపితిని. చలిచే బాధింపబడుచు, సూదివంటి యగ్రభాగముగల రోమములు గలిగి, ముత్యములవలె నున్న వర్షాకాల జలబిందువుల ధరించియుంటిని. మఱియు నాకటిచే పీడింపబడి కృశించియున్న నేను వ్యాకులచిత్తుడనై మేఘఖండమువంటి తుచ్ఛ మాంసశకలముకొఱకై నాకుటుంబముతో కలహించితిని. మంచుపడుచున్న యచ్చోట పండ్లు పటపట కొఱకుచు, మలినదేహముగల్గి బేతాలుని బంధువువలె గన్పట్టుచుంటిని. ప్రళయకాలమున ప్రాణుల సంహరించు నిమిత్తము చేత యమునిచేత త్రాడు గైకొని కాలము లోకములందు సంచరించునట్లు, నేనును చేపలు బట్టుటకొఱకై గాలముగైకొని నదీతీరముల విహరించితిని. చాల కాలముపవసించిన పిదప, అపుడే కోయబడిన మృగముయొక్క వక్షస్థలమందలి రక్తమును, బాలుడు స్తన్యపాన మొనర్చునటుల, నేను పాన మొనర్చితిని. శ్మశానమందలి రక్తముచే పూయబడి అపవిత్ర భోజనమొనర్చుచున్న నన్ను జూచి ఆ యరణ్యమందలి బేతాలురు, చండికచే తఱుమబడిన చందమున పరుగిడసాగిరి. మఱియు కుటుంబవృద్ధిని గూర్చిన యాశ విస్తరించునట్లు మృగములను, పక్షులను పట్టుటకొఱకై నేనా యరణ్యమున జాలమును విస్తరించితిని. లోకములన్నిటిని మాయ వ్యాపించి యుండునట్లు సుకృతరహితుడనగు నేనావనమందంతట వలలఁబఱచి యుంచితిని. వాటిచే ననేక పక్షులఁబట్టి హింసించితిని. నాయందు పాప మాదయించుటచేతనే నా మనస్సట్టి దుష్కృత్య మొనర్చుట కుపక్రమించినది.

ఆశా ప్రసారితా దూరం ప్రావృషీవ తరంగిణీ
కరభ్యా ఇవ సర్పేణ విద్రుతం దూరతో ధియా. 37

వర్షాకాలమందలి నదివలె నాయాశ పెరుఁగజొచ్చెను. భల్లూకముచే తఱుమబడిన సర్పమువలె నాసంకల్పము పరుగిడసాగెను.

దూరే త్యక్తా దయా దేహే భుజంగేనేవ కంచుకమ్
క్రౌర్యం సుఖేన సంరంభం శరవర్షి నినాది చ. 38
అంగీకృతం నిదాఘాంతే నభసేవాసితాంబుదః
వికాసిన్యో క్షతాః ఘోరా దూరం పరిహృతా జనైః. 39

సర్పము తన కుబుసమును విడుచునట్లు జీవకారుణ్యమును నేను పూర్ణముగ విడనాడితిని. గ్రీష్మాంతమున యాకసము మేఘముల గల్గియుండునట్లు, శరవర్షముచే గల్గిన శబ్దమువోలె నిష్ఠుర భాషణ మొనర్చుచు, క్రౌర్యము గలిగియుంటిని. జనులను దూరముగ తొలగించునట్టి దుర్గంధ యుక్తమగు లతల పెక్కింటిని నేను నఱికితిని.

శ్వభ్రేణేవ కుమంజర్యా శ్చిరమూఢా మయాపదః
స్వకాలకులకోణాసు నరకోద్దామభూమిషు. 40
ఉప్తాదుష్కృతబీజానాం ముష్టయో మోహవృష్టయః
వాగురాభిర్మయా వింధ్యకందరస్థేన నిర్దయమ్. 41
భూతేష్వివ కృతాంతేన మృగేషు పరివల్గితమ్
చామరీకంఠకుడ్యేషు విశ్రాంతశిరసా మయా. 42
సుప్తమస్తవివేకేన శేషాంగేష్వివ శౌరిణా
విలోలచరణాంబరయా సరావోల్లాసిధూమ్రమయా. 43
మమ తన్వా సనీహార వింధ్యకచ్ఛగుహాయితమ్
కృష్ణదేహేన యాఃకాఠ్యా కంథాస్కంధే మయా చిరమ్. 44
గ్రీష్మే సోఢా చలద్భూతా వరాహేణ యథోర్వరా
బహుశోఽహం వనోత్థాగ్ని నిర్దగ్ధప్రాణిమండలః. 45
కల్పాగ్నిభుక్తజగతః కాలస్యానుగతిం గతః
లోభిలింగో యథా రోగమనర్థానివ దుర్గ్రహః
ప్రసూతాస్తత్ర మే దారా దుఃఖాన్యథ సుఖాన్యపి. 46

గోతులందు మలినములైన తీగలుండునట్లు నేను చిరకాలమాపత్తుల ధరించియుంటిని నియతకాలముననే ఫలమనుభవింపవలెనను కాలనియతి యెచటి క్షేత్రములను లెస్సగ విభజించుచుండెనో, యట్టి భయంకరములగు నరకభూములం దజ్ఞానవృష్టిచే వృద్ధినొంది ఫలవంతమగునట్టి పాపబీజములనే నేను నాటితిని. మఱియు, కల్పాంతమున యముఁడు ప్రాణికోట్లపై మృత్యుజాలములను పఱచునట్లు వింధ్యపర్వత గుహయందున్న నేను నిర్దయుఁడనై, మృగముల బట్టుటకొఱకు వలలఁ బన్నితిని. శేషుని యంగములపై విష్ణువువలె సెమళ్ళ కంఠములపై శిరస్సునుంచి విశ్రమించితిని. చంచలపాదములుగల పక్షుల కాకసమువలె నాశ్రయభూతమై, వ్యాఘ్రాది జంతువులవలె శబ్దమొనర్చుచు, ధూమ్రవర్ణము గల్గియున్న నాదేహము వింధ్యపర్వత గుహవలె నొప్పుచుండెను. వరాహావతారుడగు విష్ణుభగవానుడు, ప్రాణికోట్లుగల్గి సస్య సమృద్ధమైయున్న భూమిని ధరించునట్లు, యీగలు మొదలగునవి వ్రాలుటచే నింద్యమైయున్న బొంత నొకదానిని నా నల్లనిశరీరము చాలకాలము గ్రీష్మర్తువునందు ధరించెను. ప్రళయాగ్నిచే జగత్తును భక్షించు కాలునివలె నేనావనమందలి దావాగ్నియం దనేక ప్రాణులవైచి భస్మీభూత మొనర్చితిని. వ్యభిచారి యనేక రోగములఁ గల్గజేయునట్లును, దురాగ్రహశీలు డనర్థముల పెంపొందింపజేయువిధముననను, నా భార్య సుఖదుఃఖములను హేతువగు సంతానము నుత్పన్నము గావించెను.

నృపాలపుత్రకేనైక తనయేన తదా మయా
నీతా నీరంధ్రదోషేణ షష్టిః కల్పసమాస్సమాః. 47

దోషరహితుడగు రాజపుత్రుడనైన నేనివ్విధమున యఱువది వత్సరములను ఱువది కల్పములవలె గడపితిని.



ఆకృష్టముద్ధురతరం రుదితం విపత్సు భుక్తం కదన్నముషితం హతపక్కణేషు
కాలాంతరం బహు మయోపహతేన తత్ర దుర్వాసనానిగడబంధగతేన సభ్యాః. 48

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ఇంద్రజాలోపాఖ్యానే ఆపద్వర్ణనంనామ సప్తోత్తర
శతతమః సర్గః ॥ 107 ॥

ఓ సభ్యులారా! మీ యీ కాలక్రమముకంటె విలక్షణమైన మఱియొక కాలక్రమమందు వర్తించుచున్న నేనపుడు శబరాలయమున దుష్టవాసనలను శృంఖలములచే బంధింపబడి క్రోధముచే యితరులఁదిట్టితిని; ఆపదలందు యేడ్చితిని. నింద్యాన్నము భుజించితిని; నికృష్ట స్థానములందు వసించితిని.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
ఇంద్రజాలోపాఖ్యానమందు ఆపద్వర్ణనమను సప్తోత్తర
శతతమ సర్గము ॥ 107 ॥

—:o:—

## అష్టోత్తరశతతమః సర్గః.

—:o:—

రాజోవాచ:—

అథ గచ్ఛతి కాలేఽత్ర జరాజర్జరితాయుషి
తుషారపూర్ణశష్పౌఘసమశ్మశ్రుభృతే మయి. 1
కర్మవాతాపనున్నేషు సరసేష్వరసేష్వపి
పతత్సు వాసరౌఘేషు శీర్ణపర్ణగణేష్వివ. 2

రాజు:—అటుపిమ్మట కాలచక్రము పరిభ్రమింప, వృద్ధాప్యముచే నా దేహము కృశించెను. మంచుచే గప్పబడి తృణసమూహమువలె నున్నట్టి నెరసిన మీసములుగల్గియున్న నాపై కర్మయను వాయువుచే ప్రేరితములై సుఖదుఃఖములు పండినయాకులవలె వ్రాలసాగెను.

ఆజావివ శరౌఘేషు సుఖదుఃఖేష్వనారతమ్
కలహేష్వవ్యకార్యేషు చాగచ్ఛత్సు పతత్సు చ. 3
వికల్పకల్పనావర్తవర్తిని ద్విజగే జడే
సముద్ర ఇవ కల్లోలభరే భ్రమితచేతసి. 4

యుద్ధమందు బాణములవలె సుఖదుఃఖములు నిరంతరము నాపైబడ, కలహములు సంభవింప, వికల్పములను యావర్తములందు జిక్కుకొనిన నేనపు ఢాకసమందలి పక్షివలె నిరాధారుడనై జడత్వమంది తరంగాకులితమగు సముద్రమువలె భ్రాంతచిత్తుడనైతిని.

చలచ్చింతాచితం చక్రమారూఢే భ్రాంత ఆత్మని
ప్రోహ్యమానే తృణ ఇవ సావర్తం కాలసాగరే. 5

అపుడు చింతాక్రాంతుడనై, చక్రారూఢునివలె పరిభ్రమించుచు, భ్రాంతిఁగొని యావర్తమందలి తృణమువలె కాలసాగరమున కొట్టుకొని పోవుచునుంటిని.

విన్ధ్యోర్వీవనకీటస్య గ్రాసైకశరణస్య మే
ద్విబాహోర్గర్దభస్యాత్ర క్షీణ ఇత్థం సమాగణే. 6

వింధ్యపర్వత వనమందలి కీటమువలె తుచ్ఛమైయుండి, భోజన విషయము మాత్రము గమనించుచు, ద్విబాహుగర్దభమువలెనున్న నా కివ్విధమున వత్సరము గడచెను.

విస్మృతే మమ భూపత్వే శవస్యేవ మహాజవే
చాండాలత్వే స్థిరీభూతే పక్షచ్ఛిన్న ఇవాచలే. 7

శవము వేగమును త్యజించునట్లు నేను నా నృపత్వమునుమఱచి పక్షములు తెగిన పర్వతమువలె శక్తిహీనుడనై చండాలత్వము బడసియుంటిని.

సంసారమివ కల్పాంతో దావాగ్నిరివ కాననమ్
సాగరోర్మిస్తటమివ శుష్కవృక్షమివాశనిః. 8
అకాండే మరణోడ్డీనం చండచండాలమండలమ్
నిరన్నతృణపత్రాంబు విన్ధ్యకచ్ఛం తదా యయౌ. 9

జగత్తున ప్రళయమువలెను, వనమందు దావాగ్నివలెను, తటముపై సముద్ర తరంగమువలెను, శుష్కతరువుపై వజ్రపాతమువలెను, చండాలనివాసమును అన్న తృణజలశూన్యమునునగు ఆ వింధ్యపర్వతప్రాంత ప్రదేశమున, అకాలమరణముచే పరలోకగమనము సంప్రాప్తించునటుల, దుర్భిక్ష (కఱవు) వ్యాపించెను.

న వర్షతి ఘనవ్రాతే దృష్టనష్టే క్వచిత్స్థితే
పూతాంగారకణోన్మిశ్రగతౌ వహతి మారుతే. 10

అపుడు మేఘములు వర్షించలేదు. ఒకప్పుడు గాంచిన వస్తువు మఱుక్షణములో నశించునట్టి దుస్థితి యట సంభవించినది. అగ్నికణములవలె యుష్ణవాయువులు వీవదొడగెను.

శీర్ణమర్మరపర్ణాసు దావాగ్నివలితాసు చ
వనస్థలీషు శూన్యాసు చిరప్రవ్రజితాస్వివ. 11

శబ్దమొనర్చుచున్న యెండుటాకులుగల దావాగ్నిచే వనభూమి గప్పువడెను. ఏకాంతమున చిరకాలము నివసల్పుకొను పింగళవర్ణ జటాయుక్త సన్న్యాసినులవలె నా ప్రదేశమంతయు పింగళవర్ణమయముగ గన్పట్టుచుండెను.

అకాండమభవద్భీమ ముద్దామదవపావకమ్
శోషితాశేషగహనం భస్మశేషతృణోపలమ్. 12



అకాలమున సంభవించిన యా దుర్భిక్షము భయంకరమును, అతి ప్రబలమునగు దావాగ్నియుక్తమై, జలప్రదేశముల శుష్కింపజేయుచు, తృణ పాషాణములను భస్మమొనర్చుచు నుండెను.

పాంసుధూసరసర్వాంగం క్షుధితాశేషమానవమ్
నిరన్నతృణపానీయం దేశాద్యుద్దావమండలమ్. 13

ప్రాణులందఱి అవయవములును ధూళిచే గప్పబడి మలినమై యుండెను. జనులాకటి బాధచే పరితపించుచుండిరి. తృణాన్నపానీయములు లేనందున జనపదమంతయును అరణ్యమువలె జనశూన్య మాయెను.

కచన్మరుమరీచ్యంబు మజ్జన్మహిషమండలమ్
వాతోత్థసీకరవ్యూహా పరివాహవనాంబరమ్. 14

మృగతృష్ణా నదీజలమున మహిషములుబడి చచ్చుచున్నవి. వాయువుచే గొంపోబడిన జలకణములను గూడ నా వనాకాశము ధరింపకుండెను.

పానీయశబ్దమాత్రైక శ్రవణోత్కనరవ్రజమ్
ఆతపాతతిసంశోష సీదత్సకలమానవమ్. 15

జలమను శబ్దము వినుటతోడనే జనులుత్కంఠితులగుచుండిరి. ఉష్ణాధిక్యముచే పదార్థములన్నియు శుష్కించినందున ప్రాణులు దుఃఖపడుచుండెను.

పత్రగ్రసనసంరబ్ధ క్షుధితోత్థితజీవితమ్
స్వాంగచర్వణసంరంభ లుఠద్దశనమండలమ్. 16

ఆకులనుగూడ మ్రింగివేయు నంతటి యాకటిచే బాధితులగుచు జనులు ప్రాణముల గోల్పోవుచుండిరి. తమ యంగములనే తాము భక్షింప నుంకించుచు జనులొకరినొకరు దంతములచే కొఱికి తినుచుండిరి.

మాంసశంకానిగీర్ణోగ్ర ఖదిరాగ్నికణోత్కరమ్
మండకాసారసంగ్రస్త వనపాషాణఖండకమ్. 17

ఖదిర వృక్షములనుండి బయల్వెడలిన దావాగ్ని కణములచే మాంసఖండములన్నియు నశించినవి. భ్రమచే నన్నశకలములని భావించి సారరహితములగు వనమందలి శిలాఖండములను గూడ కొందఱు భక్షించుచుండిరి.

అన్యోన్యభూతసంసక్త మాతృపుత్రపితృవ్రజమ్
గృధ్రోదరరటత్సార నిగీర్ణవరసారికమ్. 18

మాతాపుత్రాదులొకరిపై నొకరు పడి దుఃఖించుచుండిరి. గృధ్రపక్షివలె నాకటిచే పరితపించుచున్న జీవుల ప్రాణపక్షు లెగిరి పోవుచుండెను.

పరస్పరాంగవిచ్ఛేద రక్తసిక్తధరాతలమ్
హరిగ్రసనసంరబ్ధ మత్తక్షుధితవారణమ్. 19

ఒకరినొకరు ఛేదించుకొనుటచే, రక్తముచే భూమి తడుపబడెను. క్షుద్బాధపొందిన మదించిన గజసమూహము సింహములఁ జంపి తినుట కెత్నించుచుండెను.

దరీనిగరణైకైక సింహభ్రమణభీషణమ్
అన్యోన్యగ్రసనోద్యుక్త లోకమల్లకృతం వహత్. 20

ఆత్మభక్షణ మొనర్ప నెంచుచున్న సింహముల సంచారముచే పర్వతగుహలు భయంకరముగ నుండెను.

నిష్పత్రపాదపోడ్డీన ప్రోఢాంగారమయానిలమ్
రక్తపానోత్కమార్జార లీఢధాతుతటావని. 21

పత్రరహిత వృక్షములపై యుష్ణవాయువులు వీచుచుండెను. రక్తపాన మొనర్ప దలంచు మార్జాలము భూమిపైనిగల ధాతుమయప్రదేశమును నాకుచుండెను.

జ్వాలాఘనఘటాటోప సావర్తపవనానిలమ్
సర్వస్థలరసద్వహ్ని పుంజపింజరజంగలమ్. 22

వనవాయువు లగ్ని జ్వాలలతోఁగూడి, ఆవర్తయుక్తమై చలించుచుండెను. భయంకర ధ్వని గావించుచున్న యగ్నిచే నయ్యారణ్యమంతయును రక్తవర్ణముగా నొనర్పబడెను.

దగ్ధాజగరకుంజోత్థ ధూమమాంసలగుల్మకమ్
మారుతావలితజ్వాలా సంధ్యాభ్రవలితాంబరమ్. 23

దగ్ధమగు కొండశిలువల దేహములనుండి వెడలుచున్న పొగచే పుష్పలతాగుచ్ఛము లావృతము లగుచుండెను. ఆకసమును గప్పుచున్న వాయువేష్టితములగు అగ్నిజ్వాలలు సంధ్యాకాల మేఘముల వలె నుండెను.

ఉద్దామరవముద్భ్రాంత భస్మనాఽస్తంభమండలమ్
సాక్రందనరదారాగ్ర దీనార్భకకృతారవమ్. 24

మిక్కుటముగ ధ్వనిజేయుచు వ్యాపించుచున్న ధూళిచే ఛత్రములు దండములవీడి యెగిరి పోవుచుండెను. ఏడ్చుచున్న తల్లిదండ్రులయెదుట దీనులగు బాలు రార్తనాద మొనర్చుచుండిరి.

సంభ్రాంతపురుషవ్యూహ దంతకృత్తమహాశవమ్
మాంసగంధజన్రగ్రస్త రక్తార్తనిజాంగులి. 25

స్త్రీ పురుషులు సంచరించుచు దంతములచే పెద్దపెద్ద శవములఁ గొఱికి తినుచుండిరి. అట్లు వాటిని భక్షించునపుడు తొందరలోఁ దమవ్రేళ్లనే కొఱుకుటచే నవి రక్తవర్ణములు గాఁదొడఁగెను.

నీలపత్రలతాశంకా పీతధూమఘనచ్ఛవి
భ్రమద్గృధ్రనిగీర్ణోగ్ర నభోభ్రాంతోల్ముకామిషమ్. 26

ధూమమును, మేఘచ్ఛాయను గాంచి జలభ్రాంతిచే జనులు వాటిని త్రావుట కుద్యుక్తులగుచుండిరి. చరించు గృధ్రములాకసమున నెగయుచున్న అగ్నికణములను మాంసమని యెంచి భక్షించుచుండెను.



ఇతరేతరభిన్నాంగ లోకవిద్రవణాకులమ్
జ్వలితాగ్నిటణత్కార విదీర్ణహృదయోదరమ్. 27

ఛిన్నాంగములుగల్గి లోకమును వీడి జననెంచుచు వ్యాకులచిత్తులైయున్న జీవుల హృదయ, ఉదరములు జ్వలించుచున్న అగ్నియొక్క టాంకార శబ్దముచే విచ్ఛిన్నములగుచుండెను.

గర్తమారుతఝాంకార భీమదావాగ్నివల్గనమ్
భీతాజగరఫూత్కార పతదంగారపాదపమ్. 28

వీచుచున్న వాయువుయొక్క ఝుంకారశబ్దమువలె భయంకరముగ దావాగ్ని ప్రజ్వలించుచుండెను. అచటి వృక్షములు, భీతిల్లిన కొండశిలువల ఫూత్కారముచే నెగిరిన నిప్పుకణములు గల్గియుండెను.

సదకాండస్ఫుటద్దేశం ప్రావ్య తచ్ఛుష్కకోటరమ్
ద్వాదశార్కాగ్నిదగ్ధస్య జగతోఽనుకృతిం యయౌ. 29

అట్టి యకాలదుర్భిక్షముచే నా ప్రదేశమంతయును శుష్కించి పోవ, యందున్న రమణీయ పదార్థములన్నియును, ప్రళయకాలమందు ద్వాదశాదిత్యులచే దగ్ధమొనర్పబడిన జగత్తువలె తేజోవిహీనము లయ్యెను.

జ్వలదనలజటాలవృక్షఖండ ప్రసరమరుత్ప్రసరావనున్నలోకః
జ్వలనతపనభాస్కరాత్మజానాం రమణగృహానుకృతిం జగామ దేశః. 30

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే మోక్షోపాయే ఉత్పత్తిప్రకరణే
ఇంద్రజాలోపాఖ్యానే అకాండవర్ణనం నామాష్టోత్తర
శతతమః సర్గః ॥ 108 ॥

ఓ సభ్యులారా! ఎగయుచున్న అగ్నిజ్వాలలతోఁ గూడియున్న వృక్షసమూహమందలి యుష్ణవాయు ప్రసారముచే సందఱును పీడితులైరి. అట్టి యా వింధ్యపర్వత ప్రాంత ప్రదేశము శని, అగ్ని, సూర్యులకు క్రీడాస్థానమై యొప్పుచుండెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
ఇంద్రజాలోపాఖ్యానమున అకాండ దుర్భిక్షవర్ణనమను
అష్టోత్తర శతతమ సర్గము ॥ 108 ॥

———:o:———

## నవాధిక శతతమః సర్గః.

———:o:———

రాజోవాచః—

తస్మింస్తదా వర్తమానే కష్టే విధివిపర్యయే
అకాలోల్బణకల్పాంతే నితాంతం తాపదాయిని. 1

జనాః కేచన నిష్క్రమ్య సకలత్రసుహృజ్జనాః
గతా దేశాంతరం వ్యోమ్నః శరదీవ పయోధరాః. 2

రాజు:—అపుడు దైవము ప్రతికూలుడై యుండ, అకాలమున సంభవించిన ప్రళయమువలె మిగుల దుఃఖకరమగు నాపద తటస్థింప శరదృతువునం దాకసమును మేఘము వీడునట్లు కుటుంబ బంధుమిత్ర సమేతులై కొందఱు దేశాంతరమునకు వెడలిపోయిరి.

దేహావయవసంలీన పుత్రదారాగ్ర్యబంధవః
శీర్ణాః కేచన తత్రైవ ఛిన్నా ఇవ వనే ద్రుమాః. 3

తమ యంగములనువలె పుత్రమిత్ర స్త్రీ బాంధవులఁ ద్యజింపనొల్లని మఱికొందఱచటనే ఛిన్నవృక్షమువలె పడి నశించిరి.

భుక్తాః కేచన చ వ్యాఘ్రైర్నిర్గతాస్తు స్వమందిరాత్
అజాతపక్షకాః శ్యేనైః ఖగా నీడోద్గతా ఇవ. 4

ఱెక్కలురాని పక్షి గూటిని వదలిపోయినచో డేగలచే భక్షింపబడునట్లు కొందఱు తమ తమ స్థానములనువీడి జనుచుండ వ్యాఘ్రాది క్రూరజంతువులచే భక్షింపబడిరి.

ప్రవిష్టాః కేచిదనలం జ్వలితం శలభా ఇవ
కేచిచ్ఛ్వభ్రేషు పతితాః శిలాః శైలచ్యుతా ఇవ. 5

దీపమందు మిడుతలవలె యొందఱో అగ్నియందుబడి కాలిపోయిరి. పర్వతములనుండి జారిన శిలలవలె కొందఱు గోతులలో బడుచుండిరి.

అహం తు తాన్పరిత్యజ్య శ్వశురాదీన్స్వకం క్షమమ్
కలత్రమాత్రమాదాయ కృచ్ఛ్రాద్దేశాద్వినిర్గతః. 6

అపుడు నేను నా మామను, తక్కినవారిని యచటనే విడచి, కుటుంబము మాత్రము వెంటనిడుకొని దుఃఖవంతమగు నా దేశమునుండి బయలుదేఱితిని.

అనలాననిలాంశ్చైవ భక్షకాంస్తక్షకానపి
వంచయిత్వా భయాన్మృత్యోః సదారోఽహం వినిర్గతః. 7

అగ్ని, వాయువు, వ్యాఘ్రాది క్రూరజంతువులు, సర్పములు మొదలగువాటినుండి తప్పించుకొని మృత్యుభయముచే కుటుంబములోకూడ నచ్చోటు వీడి పయనమైతిని.

ప్రాప్య తద్దేశపర్యంతం తత్ర తాలతరోస్తలే
అవరోప్య సుతాన్స్కంధా న్నానానర్థానివోల్బణాన్. 8
విశ్రాంతోఽస్మి చిరం శ్రాన్తో రౌరవాదివ నిర్గతః
దీర్ఘాద్దావనిదాఘార్తో గ్రీష్మే పద్మ ఇవాజలః. 9

మహానర్థములనువోలె నా పుత్రులను భుజములపై నెక్కించుకొని, ఆ దేశముదాటి యచట నున్న యొక తాళవృక్షముక్రింద రౌరవ నరకమును వీడినవానివలెను, గ్రీష్మర్తువందలి దావాగ్నిచే జలము నశింప శుష్కించినట్టి కమలమువలెను, విశ్రమించితిని.



అథ చాండాలకన్యాయాం విశ్రాన్తాయాం తరోస్తలే
సుప్తాయాం శీతలచ్ఛాయే ద్వా సమాలింగ్య దారకౌ. 10
వృచ్ఛకో నామ తనయో మమైకః పురతః స్థితః
అత్యంతవల్లభోఽస్మాకం కనీయాన్మార్గవానితి. 11
స మామువాచ దీనాత్మా బాష్పపూర్ణవిలోచనః
తాత దేహ్యాశు మే మాంసం పాతుం చ రుధిరం క్షణాత్. 12

ఆ వృక్షముక్రిందనే, తన యిద్దఱు పిల్లలను కౌగలించుకొని యా చండాలకన్య నిదురింప, నంత కనిష్ఠుడగుటచే మాకత్యంత ప్రియుడగు వృచ్ఛకుఁడను కొమరుడు అశ్రుముఖుడై యేడ్చుచు 'తండ్రీ! నాకు తినుటకు మాంసమును, త్రాగుటకు రక్తమును యిమ్మ'ని యతి దీనముగఁబల్కెను.

పునః పునర్వదన్నేవం స బాలస్తనయో మమ
ప్రాణాంతికీం దశాం ప్రాప్తః సాక్రందో హి పునః క్షుధా. 13

వాడదేవిధమున పలుమాఱు బల్కుచు ప్రాణావసానస్థితిఁబొందుచు నాకటిచే యేడ్వఁ దొడగెను.

తస్యోక్తం తు మయా పుత్ర మాంసం నాస్తీతి భూరిశః
తథాపి మాంసం దేహీతి వదత్యేవ స దుర్మతిః. 14

మాంసము లేదని నేననేకసార్లు వానికిఁజెప్పినను నా దుష్టుడదేవిధమున మాంసమును కోరుచునే యుండెను.

అథ వాత్సల్యమూఢేన మయా దుఃఖార్తిభారిణా
తస్యోక్తం పుత్ర మన్మాంసం పక్వం సంభుజ్యతామితి. 15

అపుడు పుత్రవాత్సల్యముచే వ్యథితుడనై, దుఃఖభారముచే క్రుంగుచు — 'బాలకా! పక్వమగు నా యీ మాంసము భుజింపు'మని యంటిని.

తదప్యంగీకృతం తేన దేహీతి వదతా పునః
మన్మాంసభక్షణం క్షీణవృత్తినాఽఽక్లేశవృత్తినా. 16

భోజనము లభింపమిచే మిగుల యాకలిఁజెందిన యాతడట్లనే యద్దానినిమ్మని వచించి నా మాంసమును భక్షించుటకు సమ్మతించెను.

సర్వదుఃఖాపనోదాయ స్నేహకారుణ్యమోహినా
తస్య తామార్తిమాలోక్య మయా దుఃఖాతిభారిణా. 17
సోఢుం తామాపదం తీవ్రామశక్తేన హతాత్మనా
మరణాయాతిమిత్రాయ కృతోఽంతర్నిశ్చయో మయా. 18

స్నేహ కారుణ్యములకు వశుఁడనై, దుఃఖభారముచే బీడితుడనగుచు యాబాలుని సంకటమును జూచి అయ్యాపదను సహింపజాలక, సర్వదుఃఖోపశమన మొనర్చునట్టి మిత్రుడగు మృత్యువునే యాశ్ర యింప నిశ్చయించితిని.

తత్ర కాష్ఠాని సంచిత్య చితాం రచితవానహం
చితాచటచటాస్ఫోటైః స్థితా మదభికాంక్షిణీ. 19

అపుడిటనటకొన్ని చితుకల నేఱుకొనివచ్చి చితి పేర్చితిని. చటచటాయని శబ్దమొనర్చుచు నయ్యది నాప్రాణములఁ గాంక్షించుచుండెను.

తస్యాం తు యావదాత్మానం చితాయాం నిక్షిపామ్యహమ్
చలితోఽస్మి జవాత్తావదస్మాత్సింహాసనాన్నృపః. 20

అంత నాశరీరమునట చితియందు బడద్రోయుటయే తడవుగా యిచట సింహాసనమునుండి యతివేగముగ క్రిందకు బడుచుంటిని.

తతస్తూర్యనినాదేన జయశబ్దేన బోధితః
ఇతి శామ్బరికేణాయం మోహ ఉత్పాదితో మమ. 21

అపుడు తూర్యనాద జయజయ శబ్దములచే నేను ప్రబోధితుడనైతిని. ఓ సభ్యులారా! ఇవ్విధమున నా యింద్రజాలికుడు నన్ను మోహపఱిచెను.

అజ్ఞానేనేవ జీవస్య దశాశతసమన్వితః
ఇత్యుక్తవతి రాజేంద్రే లవణే భూరి తేజసి. 22
అంతర్ధానం జగామాశు తత్ర శామ్బరికః క్షణాత్
అథేదమూచుస్తే సభ్యా విస్మయోత్ఫుల్లలోచనాః. 23

పలుదశలతోగూడియున్నవాని కజ్ఞానమువలె, మహాతేజస్వియు రాజేంద్రుడును నగు లవణుడిట్లు వచింప నంత నా యింద్రజాలికు డంతర్ధాన మాయెను. అపుడాశ్చర్యముచే నేత్రముల బెద్దజేసి సభాసదులు రాజుతో నిట్లనిరి.

నాయం శామ్బరికో దేవ యస్య నాస్తి ధనైషణా
దైవీ కాచన మాయేయం సంసారస్థితిబోధినీ. 24

దేవా! ధనాపేక్షలేని యీతడు ప్రపంచస్థితిని బోధింపవచ్చిన యొకానొక దైవమాయయే గాని శాంబరికుడు (ఇంద్రజాలికుడు) కాడు.

మనోవిలాసః సంసార ఇతి యస్యాం ప్రతీయతే
సర్వశక్తేరనంతస్య విలాసో హి మనో జగత్. 25

అట్టి దైవమాయచేతనే యీ ప్రపంచమంతయును మనోవిలాసమాత్రమే యని తెలియుచున్నది. ఏలయన, సర్వశక్తిమంతుడగు విష్ణుభగవానుని మనస్సేగదా యీ జగత్తు!

సర్వశక్తేర్విచిత్రా హి శక్తయః శతశో విభోః
యద్వివేకిమనోఽప్యేష విమోహయతి మాయయా. 26

సర్వశక్తిమంతుడగు పరమాత్మకనేక విచిత్రములగు శక్తులుగలవు. తన మాయచే నాతడు వివేకుల మనంబులగూడ మోహమున బడద్రోయగలడు.



విజ్ఞాతలోకవృత్తాంతః క్వ నామాయం మహీపతిః
క్వ సామాన్యమనోవృత్తియోగ్యో విపులసంభ్రమః. 27

ఎంతయో లోకానుభవముగల ఈ రాజెక్కడ! సామాన్యమానవుల మనోవృత్తికి యోగ్యమగు ఈ యల్పభ్రమయెక్కడ!

న చ శాంబరికేచ్ఛేయం మాయా మనసి మోహినీ
అర్థస్య సిద్ధ్యై చేహంతే నిత్యం శాంబరికాః కిల. 28

ఓ రాజా! శాంబరికుల కివ్విధమున జనుల విమోహితులఁ జేయు తలంపు యుండనేరదు. ప్రజల చిత్తమును రంజింపజేసి ధనము సంపాదించుటకే వారు యత్నింతురుగాని యిట్టి భ్రాన్తి యొన్నటికిని గలుగజేయరు.

యత్నేన ప్రార్థయంతేఽర్థం నాంతర్ధానం వ్రజంతి భో
ఇతి సందేహవేలాయాం సంస్థితా లులితా వయమ్. 29

ఓ ప్రభూ! వారెవ్విధమునైనను ధనమునే బడయనెంచుదురు గాని యంతర్ధానమవరు. కాన యీ రెండు కారణములఁబట్టియు మేము సంశయార్ణవమును దాటగల్గి విషయనిర్ణయమను దరి జేరగల్గితిమి.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

సభాయామవసం తస్యామహం రామ తదా కిల
తేన ప్రత్యక్షతో దృష్టం మయైతన్నాన్యతః శ్రుతమ్. 30

వసిష్ఠుడు:—ఓ రామా! పూర్వమా రాజసభయందు నేనుగూడ యుంటిని. కాన యీ వృత్తాంతమంతయును నేను ప్రత్యక్షముగ జూచితినిగాని యొరులవలన వినినదికాదు.

ఇతి బహుకలనా వివర్ధితాంగం జయతి చిరం వితతం మనో మహాత్మన్
శమముపగమితే పరస్వభావే పరముపైష్యసి పావనం పదం యత్. 31

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే మోక్షోపాయే ఉత్పత్తిప్రకరణే
ఇంద్రజాలోపాఖ్యానే చండాలత్వవ్యపగమో నామ
నవాధిక శతతమః సర్గః ॥ 109 ॥

ఆత్మస్వరూపుడవగు నోరామా! ఇట్లు వివిధరచనలచే వృద్ధినొంది ఫలపల్లవ శాఖాదులతో గూడిన వృక్షమువలె విస్తరించియున్న యీ మనస్సే యన్నిటికంటె ప్రధానమైనది (దొడ్డది). జ్ఞాన విచారాదులచే నిర్వ్యాధి వాసనారహితమై, ఆత్మైక్యము నొంది, పరమశాంతిని బడయగా నపుడు భేదకల్పనయంతయు నశింప పరమపవిత్రమును పరిపూర్ణమునునగు ఆత్మపదమును నీవు ప్రాప్తి నొందగలవు.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
ఇంద్రజాలోపాఖ్యానమున చండాలత్వవ్యపగమమను
నవాధిక శతతమ సర్గము ॥ 109 ॥

## దశోత్తర శతతమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

పరమాత్కారణాదాదౌ చిచ్చేత్య పదపాతినీ
కలనాపదమాసాద్య కలాకలిలతాం గతా. 1

వసిష్ఠుడు :—ఓ రామా! పరమకారణమగు అజ్ఞానమువలననే చిత్తము విషయాభిముఖమగుచున్నది. మఱియు నది ఆయా పదార్థముల రూపము నొంది పలువిధ వైచిత్ర్యములతో గూడి మలినత్వము నొందుచున్నది.

అసత్స్వేవ విమోహేషు రామైవంప్రాయవృత్తిషు
ఘనేషు తుచ్ఛతామేత్య చిరాయ పరిమూర్ఛతి. 2
అసదేవ మనోవృత్తి ర్ల్మ్రానా విస్తారయత్యలమ్
దుఃఖం దోషసహస్రేణ వేతాలానివ బాలికా. 3

ఇట్టి మిథ్యా వ్యాపారములచే భ్రాంతి దృఢపడగా, ఈ చైతన్యము తన పూర్ణరూపమును మఱచి తుచ్ఛమగు మనోరూపము నొంది, అనాదికాలమునుండి జనన మరణాదులచే విమోహితమగుచున్నది. ఇవ్విధమున తుచ్ఛమనోవృత్తి రూపముననున్నదై పలువిధ వాసనలను దోషములచే మలినమై బాలిక బేతాలముల కల్పనను విస్తరించునట్లు యీ చిద్వస్తువు దుఃఖముల విస్తరింపజేయుచున్నది.

సదేవ హి మహాదుఃఖ మసత్తాం నయతి క్షణాత్
నిష్కలంకా మనోవృత్తి రంధకారమివార్కరుక్. 4

వాసనలు క్షయించుటచే నిర్మలమగు మనోవృత్తి, సద్వస్తువగు చైతన్యమును పొంది, సూర్య కిరణములంధకారమును నశింపజేయునట్లు క్షణకాలములో దుఃఖము నంతయును పటాపంచలుగ చేయుచున్నది.

నయత్యభ్యాశతాం దూరం దూరమభ్యాశతాం నయేత్
మనో వల్గతి భూతేషు బాలో బాలఖగేష్వివ. 5

ఓ రామా! ఈ మనస్సు దూరమును సమీపముగను, సమీపమును దూరముగను నొనర్చుచున్నది. చిన్న చిన్న పక్షుల మధ్యమున బాలుడతిశయముగ క్రీడించునట్లియ్యది జీవులందు విజృంభించుచున్నది.

అభయం భయమజ్ఞస్య చేతసో వాసనావతః
దూరతో ముగ్ధపాంథస్య స్థాణుర్యాతి పిశాచతామ్. 6



అజ్ఞానియగు పాంథునకు దూరముననున్న స్థాణువందు పిశాచబుద్ధి యుదయించునట్లు, వాసనాయుక్తమగు చిత్తమున కభయమందును భయము గల్గుచున్నది.

శత్రుత్వం శంకతే మిత్రే కలంకమలినం మనః
మదావిష్టమతిర్జంతు ర్భ్రమత్పశ్యతి భూతలమ్. 7

మత్తునస్తువు తినుటచే నశించిన బుద్ధిగలవానికి ప్రపంచమంతయు తిరుగుచున్నట్లు కన్పించులాగున, వాసనలను కళంకముచే మలినమగుమనస్సు మిత్రునియందును శత్రుత్వమును శంకించుచున్నది.

పర్యాకులే హి మనసి శశినో జాయతేఽశనిః
అమృతం విషభావేన భుక్తం యాతి విషక్రియామ్. 8

మనస్సు వ్యాకులమవ, చంద్రునినుండియు వజ్రపాతము కలుగుచున్నది. మఱియు విషభావనచే అమృతమును విషమగుచున్నది.

సురపత్తననిర్మాణ మసత్సదివ పశ్యతి
వాసనావలితం చేతః స్వప్నవజ్జాగ్రదేవ హి. 9

వాసనాచ్ఛాదితమగు చిత్తము స్వప్నమందువలె నసత్తగు గంధర్వనగరాదుల రచనను గాంచుచున్నది. మఱియు జాగ్రత్ - స్థితియు స్వప్నమువంటిదే యగును.

మోహైకకారణం జంతోర్మనసో వాసనోల్బణా
ఉత్ఖాతవ్యా ప్రయత్నేన మూలోచ్ఛేదేన సైవ చ. 10

ప్రబలమగు వాసనయే జీవుని మోహమునకు కారణము; కాన అట్టి వాసనను సమూలముగ ఛేదించి పెఱికి వేయవలెను.

వాసనా వాగురాకృష్టో మనో హరిణకో నృణామ్
పరాం వివశతామేతి సంసారవనగుల్మకే. 11

సంసారవనమందలి లతానికుంజములందు మనోమృగము వాసనా జాలముచే నీడ్వబడి ప్రబలమగు దుఃఖవేదనను పొందుచున్నది.

యేన ఛిన్నా విచారేణ జీవస్య జ్ఞేయవాసనా
నిరభ్రస్యేవ సూర్యస్య తస్యాలోకో విరాజతే. 12

తత్త్వవిచారముచే పదార్థములందలి వాసన యెవనికి నశించునో, యట్టివాని జ్ఞానప్రకాశము మేఘరహితమగు నాకసమున సూర్యుని ప్రకాశమువలె శోభించును.

అతస్త్వయం మన ఏవేదం నరం విద్ధి న దేహకమ్
జడో దేహో మనశ్చాత్ర న జడం నాజడం విదుః. 13

కాన నో రామా! మనస్సే మానవుడుకాని తుచ్ఛమగు దేహము గాదు. దేహము జడము, దానియందలి మనస్సు జడముగాక చైతన్యము గాక రెంటికిని విలక్షణమై యున్నది.

యత్కృతం మనసా తాత తత్కృతం విద్ధి రాఘవ
యత్త్యక్తం మనసా తావత్తత్త్యక్తం విద్ధి చానఘ. 14

పాపరహితుడవగు నో రామా! మనస్సేకార్యమును చేయునో, అదియే వాస్తవముగ చేయబడినదనియు, దేనిని త్యజించునో అదియే త్యజింపబడినదనియు నెఱుంగుము.

మనోమాత్ర జగత్కృత్స్నం మనః పర్యంతమండలమ్
మనో వ్యోమ మనో భూమిర్మనో వాయుర్మనో మహాన్. 15

ఈ జగత్తంతయును మనస్సే. భూమండలము, ఆకాశము, పృథివి, వాయువు, మహత్తున్ను మనస్సే యగును.

మనో యది పదార్థే తు తద్భావేన న యోజయేత్
తతః సూర్యోదయోఽప్యేతే న ప్రకాశాః కదాచన. 16

మనస్సు పదార్థములందాయా (ప్రకాశాది) రూపమున భావనయొనర్పనిచో, సూర్యాదులు గూడ యెన్నటికిని ప్రకాశవంతముగ గోచరింపక యుందురు. (ఏలయన, గుడ్లగూబ మొదలైనవి దినమందును జూచుట లేదుకదా!)

మనో మోహముపాదత్తే యస్యాసౌ మూఢ ఉచ్యతే
శరీరే మోహమాపన్నే న శవో మూఢ ఉచ్యతే. 17

ఎవని మనస్సు అజ్ఞానమును జెందునో యాతడే మూఢుడనఁబడుచున్నాడు. కాని దేహమజ్ఞస్థితియందుండ నట్టిదానిని (శవమును) మూఢుడని యెవరందురు?

మనః పశ్య భవత్యక్షి శృణ్వచ్ఛ్రవణతాం గతమ్
త్వగ్భావం స్పర్శనాదేతి ఘ్రాణతామేతి జిఘ్రణాత్. 18

చూచుటచే ఈ మనస్సు నేత్రమున్ను, వినుటచే శ్రవణేంద్రియము, స్పృశించుటచే త్వగింద్రియమున్ను, మూర్కొనుటచే ఘ్రాణేంద్రియమున్ను అగుచున్నది.

రసనాద్రసతామేతి విచిత్రాస్తత్ర వృత్తిషు
నాటకే నటవద్దేహే మన ఏవానువర్తతే. 19

ఆస్వాదించుటచే నదియే జిహ్వేంద్రియ మగుచున్నది. ఆయా వృత్తులందు ప్రవర్తించు యీ మనస్సుయొక్క శక్తి విచిత్రమైనది. నాటకమందు నటుఁ డనేకరూపములను ధరించునట్లియ్యది దేహమందింద్రియముల రూపమున వర్తించుచున్నది.

లఘుదీర్ఘం కరోత్యేవ సత్యేఽసత్తాం ప్రయచ్ఛతి
కటుతాం నయతి స్వాదు రిపుం నయతి మిత్రతామ్. 20

ఈ మనస్సల్పము నధికముగను, అధికము నల్పముగను చేయుచున్నది. సత్యము నసత్యముగను, కటువస్తువును మధురముగను, శత్రువును మిత్రునిగను జేయుచున్నది.

య ఏవ ప్రతిభాసోఽస్య చేతసో వృత్తివర్తినః
తత్తదేవ ప్రత్యక్షం తథా త్రానుభవాదిహ. 21

వృత్తులందున్న యీ చిత్త మెట్లు ప్రతిభాసించునో నట్లే యది ప్రత్యక్షమగుచున్నది. మఱియు నదేవిధమున యనుభవమునకును వచ్చుచున్నది.

ప్రతిభాసవశాదేవ స్వప్నాకులితచేతసః
హరిశ్చంద్రస్య సంపన్నా రాత్రిర్ద్వాదశ వార్షికీ. 22

ఇట్టి ప్రతిభాసా (స్ఫురణ) వశముననే, స్వప్నమందు వ్యాకులచిత్తుడైయున్న హరిశ్చంద్రున కొకే రాత్రి పండ్రెండు వత్సరములుగ దోచెను.

చిత్తానుభావవశతో ముహూర్తేన గతం యుగం
ఇంద్రద్యుమ్నస్య వైరించ్యపురాభ్యంతరవర్తినః. 23

ఈ చిత్త ప్రభావమువలననే బ్రహ్మపురమందున్న యింద్రద్యుమ్న (శేవతు) న కొక్క ముహూర్తకాలమందు యుగము గడచెను.

మనోజ్ఞయా మనోవృత్త్యా సుఖతాం యాతి రౌరవమ్
ప్రాతః ప్రాప్తవ్యరాజ్యస్య సుబద్ధస్యేవ బంధనమ్. 24

మఱునాడుదయమున రాజ్యమవశ్యముగ లభింపనున్నవానికి దృఢమగు బంధమున్ను సుఖప్రదమే యగునట్లు పరమాత్మ చింతనచేగల్గు మనస్సుయొక్క ప్రియవృత్తిచే రౌరవ నరకదుఃఖము గూడ సుఖమే యగుచున్నది.

జితే మనసి సర్వైవ విజితా చేంద్రియావలిః
శీర్యతే చ యథా తంతౌ దగ్ధే మౌక్తికమాలికా. 25

లేనిచో దారము కాలినయెడల ముత్యముల మాలయంతయును శిథిలమగునట్లు, మనస్సు జయింపబడిన, తక్కిన యింద్రియములన్నియును జయింపబడును.

సర్వత్ర స్థితయా స్వచ్ఛరూపయా నిర్వికారయా
సమయా సూక్ష్మయా నిత్యం చిచ్ఛక్త్యా సాక్షిభూతయా. 26
సర్వభావానుగతయా న చేత్యార్థవిభిన్నయా
రామాత్మసత్తయా మూకమపి దేహసమం జడమ్. 27
మనోఽంతశ్చలతి వ్యర్థం మనసైషణముహ్యయా
బహిర్గిరిసరిద్వ్యోమసముద్రపురలీలయా. 28

ఓ రామా! పదార్థములఁ గూర్చిన విపరీతకల్పన యొనర్చుటయం దీమనస్సునకు సామర్థ్యముగలదు. అంతటను సమరూపమున నున్నదియు, స్వచ్ఛమును, నిర్వికారమును, సూక్ష్మమును, నిత్యమును, సాక్షి స్వరూపమును, సమస్త పదార్థములందును వ్యాపించియున్నదియు, విషయాభిన్నమును నగు ఆత్మ (బ్రహ్మము) వాగాదింద్రియముల కతీతమగుటచే మౌనభావము వహించియున్నను, అట్టి బ్రహ్మమును దేహముతో నైక్యపఱచి యభేదకల్పనచే నద్దానిని దేహమువలె జడముగఁజేసి, యీ మనస్సంతఃకరణమున యిచ్ఛాసంకల్పదుల రూపముననను, బాహ్యమున పర్వత నద్యాకాశ సముద్రనగరాదుల రూపముననను వ్యర్థముగ భ్రమను గలుగజేయుచున్నది.

జాగ్రచ్ఛాభిమతం వస్తు నయత్యమృతమృష్టతామ్
అనీహితం చ విషతాం నయత్యమృతమవ్యలమ్. 29

వివేకముచే ప్రబోధితమగుచున్నను మనస్సు తనకిష్టమైనట్టి తుచ్ఛవస్తువులనుగూడ అమృతతుల్యముగను, అమృతమువంటి యనిష్ట వస్తువులనుగూడ విషతుల్యముగ నొనర్చుచున్నది.

అమృష్టసర్వభావానా మలమాత్మచమత్కృతిమ్
మనః స్వాభిమతాకారం రూపం సృజతి వస్తుషు. 30

ఏ మనస్సు పూర్ణమగు ఆత్మ స్వరూపముయొక్క సాక్షాత్కారమును బడయకున్నదో, అదియే వస్తువులందిష్టానిష్టములను కల్పించుచున్నది. కాని తత్త్వజ్ఞుల మనస్సుకాదు.

స్పందేషు వాయుతామేతి ప్రకాశేషు ప్రకాశతామ్
ద్రవేషు ద్రవతామేతి చిచ్ఛక్తిస్ఫురితం మనః. 31

చేతనశక్తినుండి స్ఫురించిన యీ మనస్సు చలన స్వభావముగల పదార్థములందు వాయుత్వమును, ప్రకాశవంతమగువానియందు ప్రకాశత్వమును, ద్రవవస్తువులందు ద్రవత్వమును పొందుచున్నది.

పృథ్వ్యాం కఠినతామేతి శూన్యతాం శూన్యదృష్టిషు
సర్వత్రేచ్ఛాస్థితిం యాతి చిచ్ఛక్తిస్ఫురితం మనః. 32

మఱియునది పృథివియందు కాఠిన్యమును, ఆకాశాదులందు శూన్యత్వమును పొందుచున్నది. చైతన్యమునుండి స్ఫురించిన యీ మనస్సంతటను తన యిచ్ఛచొప్పుననే స్థితిగల్గి యున్నది.

శుక్లం కృష్ణీకరోత్యేవ కృష్ణం నయతి శుక్లతామ్
వినైవ దేశకాలాభ్యాం శక్తిం పశ్యాస్య చేతసః. 33

ఓ రామా! ఈ చిత్తముయొక్క శక్తిని గాంచుము! దేశకాలములు లేకయే ఇయ్యది తన భావనామాత్రమున తెలుపు వస్తువును నలుపుగను, నలుపు వస్తువును తెలుపుగను జేయుచున్నది.

మనస్యన్యత్ర సంసక్తే చర్వితస్యాపి జిహ్వయా
భోజనస్యాపి మృష్టస్య న స్వాదోఽస్యానుభూయతే. 34

మనస్సితరచోట్ల సంలగ్నమై యుండునపుడు మృష్టాన్నము భుజించినను, దానిరుచి నది యనుభవించుటలేదు.

యచ్చిత్తదృష్టం తద్దృష్టం న దృష్టం తదలోకితమ్
అంధకారే యథా రూపమింద్రియం నిర్మితం తథా. 35

చిత్తమెద్దానిని జూచునో, అదియే చూడబడినదగును. చిత్తముచే జూడబడనిది యెదుట నున్నను చూడబడక యుండును. అంధకారమందు విచిత్రరూపములను కల్పన చేయునట్లే యిది, సమస్తేంద్రియనిర్మాణమును తనయందే గావించుకొనుచున్నది.

ఇంద్రియేణ మనో దేహి మనసేంద్రియమున్మనః
ఇంద్రియాణి ప్రసూతాని మనసో నేంద్రియాన్మనః. 36

ఇంద్రియములచే ననుభవింపబడిన పదార్థముల యాకారమును తాను బొందుటచేత మనస్సు యింద్రియరూపమును, మనస్సునకధీనమగు పదార్థముల గ్రహించుటచేత యింద్రియములు మనోరూపములు నగును. రెంటికిని యిట్టి సమత్వమున్నను, మనస్సే యింద్రియములకంటె శ్రేష్ఠమైనది. ఏలయనగ యింద్రియములు మనస్సునుండియే యుత్పన్నమైనవిగాని మనస్సింద్రియములనుండి కాదు.



అత్యంతభిన్నయోరైక్యం యేషాం చిత్తశరీరయోః
జ్ఞాతజ్ఞేయా మహాత్మానో మనస్యాస్తే సుపండితాః. 37

మిగుల భిన్నముగనున్న యీ చిత్తశరీరముల యైక్యమెఱింగినవారు, అనగా మనస్సు నాత్మయని తలంపక శరీరమువలె జడమని యెఱుంగువారు జ్ఞేయమగు నాత్మను దెలిసికొనినవారగుదురు. అట్టి మహాత్ములు వందనీయులు.

కుసుమోల్లాసిధమ్మిల్లా హేలా చలితలోచనా
కాష్ఠకుడ్యోపమాంగేషు లగ్నాప్యమనసోఽంగనా. 38

మనోరహితులగు మహాత్ములకు, అనగా వాసనలను నశింపజేసి మనస్సును జయించిన ధీరులకు, పుష్పములచే నలంకరింపబడిన కేశములు గలదియు, విలాసపూర్వకముగ కటాక్షముల నొనర్చునదియునగు స్త్రీయొక్క సంయోగము సంభవించినను, కాష్ఠకుడ్యములవలె వికారమేమియు గలుగకుండును.

మనస్యన్యత్ర సంసక్తే వీతరాగేణ కాననే
క్రవ్యాదచర్వితోఽప్యంగః స్వకరోఽపి న లక్షితః. 39

మనస్సన్యస్థాన (ఆత్మధ్యాన) మందు లగ్నమైయుండుటచే, తన హస్తము క్రూరజంతువులచే భక్షింపబడినను వీతరాగుడగు ముని యేమియు యెఱుంగకుండును.

సుఖీకర్తుం సుదుఃఖాని దుఃఖీకర్తుం సుఖాని చ
సుఖేనైవాశు యుజ్యంతే మనసోఽతిశయామునేః. 40

అభ్యాసవశమున మునులకు సిద్ధించిన దృఢమనోభావములు, దుఃఖములను సుఖములుగాను, సుఖములను దుఃఖములుగాను యతిసులభముగ నొనర్పగల్గుచున్నవి.

మనస్యన్యత్ర సంసక్తే కథ్యమానాపి యత్నతః
లతాపరశుకృత్తేవ కథావిచ్ఛిద్యతే బత. 41

ఆహా! చూడుము! మనస్సు మఱియొకచోట లగ్నమైయుండుటచే, మిగులయత్నముచే జెప్పబడిన కథయైనను, గొడ్డలిచే నరుకబడిన తీగవలె ఛిన్నమైపోవును.

మనస్యద్రితటారూఢే గృహస్థేనాపి జంతునా
శ్వభ్రాభ్రకందరభ్రాంతి దుఃఖం సమనుభూయతే. 42

గృహమందున్నను, మనస్సు పర్వతముపై లగ్నమైయుండినచో నచటి స్వచ్ఛమగు మేఘములయొక్కయు, గుహలయొక్కయు భ్రాంతినిబొంది స్వప్నమున మనుజుడు దుఃఖమవశ్యమనుభవించుచున్నాడు.

మనస్యుల్లసితే స్వప్నే హృద్యేవ పురపర్వతాః
ఆకాశ ఇవ విస్తీర్ణే దృశ్యంతే నిర్మితాః క్షమాః. 43

స్వప్నమం దెపుడీమనస్సు తన విలాసమునుజూపుచు విజృంభించుచున్నదో, అపుడు తమ తమ స్వభావములతోఁగూడి నగర పర్వతాదులు, విశాలాకాశమునందువలె ప్రత్యక్షమగుచున్నవి.

మనోవిలులితే స్వప్నే హృద్యేవాద్రిపురావలిమ్
తనోతి చలితాంభోధి ర్వీచీచయమివాత్మని. 44

స్వప్నమందాత్మ యెపుడు స్వస్వరూపమునుండి చ్యుతినిబొంది క్షుభితమగుచున్నదో, అపుడు చంచలసముద్రము తనయందే తరంగములను విస్తరింపజేయునట్లే మనస్సున్ను హృదయమున పర్వత నగరాదులను విస్తరింపజేయుచున్నది.

అంతరబ్ధిజలాద్యద్వ త్తరంగావీడవీచయః
దేహాంతర్మనస్తద్వత్స్వప్నాద్రిపురరాజయః. 45

సముద్రజలమునుండి తరంగాదు లుత్పన్నమగునట్లు, దేహాంతర్గతమున మనస్సునుండియే స్వప్నాద్యవస్థలందు పర్వత నగరాదు లుద్భవించుచున్నవి.

అంకురస్య యథా పత్ర లతాపుష్పఫలశ్రియః
మనసోఽస్య తథా జాగ్రత్స్వప్నవిభ్రమభూమయః. 46

పత్రపుష్పలతాఫలాదులన్నియును అంకురమునుండియే కలుగు విధమున, జాగ్రత్స్వప్నాదులు మనస్సునుండియే యుత్పన్నమగుచున్నవి.

వ్యతిరిక్తా యథా హేమ్నో న హేమవనితా తథా
జాగ్రత్స్వప్నక్రియాలక్ష్మ్యో వ్యతిరిక్తా న చేతసః. 47

సువర్ణముచే నిర్మింపబడిన స్త్రీ (విగ్రహము) సువర్ణమునకు వేరుగానట్లు జాగ్రత్స్వప్న క్రియలును చిత్తమునకు వేఱుకావు.

ధారాకణోర్మిఫేనశ్రీర్యథా సంలక్ష్యతేఽంభసః
తథా విచిత్రవిభవా నానాతేయం హి చేతసః. 48

ప్రవాహము, బిందువు, తరంగము, ఫేనము (నురుగు) మొదలగునవన్నియూ జలమునుండియే యేర్పడునట్లు, ఈ నానావిధ వైచిత్ర్యమంతయును చిత్తమునుండియే గలిగినది.

స్వచిత్తవృత్తి రేవేహ జాగ్రత్స్వప్నదృశోదితమ్
రసావేశాదుపాదత్తే శైలూష ఇవ భూమికమ్. 49

శృంగారాది రసముల వ్యక్తీకరించు నటుడు భిన్న భిన్న వేషములను ధరించునట్లు, స్వచిత్తవృత్తియే జాగ్రత్స్వప్నాది రూపములను ధరించుచున్నది.

చండాలత్వం హి లవణే ప్రతిభాసవశాద్యథా
తథేదం జగదాభోగి మనో మననమాత్రకమ్. 50

ప్రతిభాసావశమున లవణునియందు చండాలత్వమెట్లుకల్గెనో, అట్లనే యీ జగద్విస్తారమంతయును మనస్సుయొక్క స్ఫురణమాత్రమే యగును.



యద్యత్సంవేద్యతే కించిత్తేన తేనాశు భూయతే
మనో మనననిర్మాణం యథేచ్ఛసి తథా కురు. 51

ఓ రామా! స్ఫురణయే రూపముగ గల్గియున్న యీ మనస్సేయే రూపమును భావించునో, అద్దానినే శీఘ్రముగ పొందును. ఇక నీ కేదిసమ్మతమో దానినే యొనర్పుము.

నానాపురసరిచ్ఛైలరూపతామేత్య దేహినామ్
తనోత్యంతఃస్థమేవేదం జాగ్రత్స్వప్నమయం మనః. 52

ఈ మనస్సు జీవుల యాంతరముననున్నదై పలువిధ నగరనదీపర్వతాది రూపములను పొంది, జాగ్రత్స్వప్నమయమగు యీ జగత్తును విస్తరింపజేయుచున్నది.

సురత్వాద్దైత్యతామేత్య నాగత్వాన్నగతామపి
ప్రతిభాసవశాచ్చిత్త మాపన్నం లవణో యథా. 53

లవణుడు చండాలత్వమును పొందినట్లు ప్రతిభాసావశముననే చిత్తము దేవత్వమునుండి యసురత్వమును, సర్పత్వమునుండి వృక్షత్వమును పొందుచున్నది.

నరత్వాదేతి నారీత్వం పితృత్వాత్పుత్రతాం గతః
యథా ధ్రువం ప్రతినరః స్వసంకల్పాత్తథా మనః. 54

ఒకడే తనపత్నియొక్క దృష్టియందు పతిగను, తండ్రిదృష్టియందు పుత్రుడును యగునట్లు స్వసంకల్పముచే నీ మనస్సభిలషితరూపమును బడయుచున్నది.

సంకల్పతః ప్రమ్రియతే సంకల్పాజ్జాయతే పునః
మనశ్చిరంతనాభ్యస్తా జీవతామేత్యనాకృతి. 55

మనస్సు సంకల్పముచేతనే నశించుచు, మరల సంకల్పముచేతనే యుత్పన్నమగుచున్నది. మఱియు నాకార రహితమైనను చిరకాలాభ్యాసముచే జీవాకారమగుచున్నది.

మనో మననసంమూఢ మూఢవాసనమాతతమ్
సంకల్పాదేత్యనిమాయాతి సుఖదుఃఖే భయాభయే. 56

మోహమయమగు నీమనస్సు వాసనాసహితమై సర్వత్ర వ్యాపించియున్నది. సంకల్పమునుండియే యిది జన్మించుచున్నది. మఱియు నట్టి సంకల్పముచేతనే సుఖదుఃఖములను, భయాభయములను ప్రాప్తినొందుచున్నది.

సుఖం దుఃఖం చ మనసి తిలే తైలమివ స్థితమ్
తద్దేశకాలవశతో ఘనం వా తను వా భవేత్. 57

నువ్వులందు నూనెయుండునట్లు సుఖదుఃఖములు రెండును మనస్సునందే గలవు. కాని అయా దేశకాలముల ననుసరించి నయ్యవి అల్పాధికముగ సంభవించుచుండును.

తైలం తిలస్య చాక్రాంత్యా స్ఫుటతామేతి శాశ్వతీమ్
చేతసో మననాసంగాద్ఘనీభూతే సుఖాసుఖే. 58

నువ్వులను బిండుటచే నూనె వ్యక్తమగునట్లు చిత్తమందు ఘనీభూతమైయున్నట్టి సుఖదుఃఖములు మనస్సుయొక్క స్ఫురణచే వ్యక్తమగుచున్నవి.

దేశకాలాభిధానేన రామ సంకల్ప ఏవ హి
కథ్యతే తద్వశాద్యస్మాద్దేశకాలౌ స్థితిం గతౌ. 59

ఓ రామా! మనస్సంకల్పమే దేశకాలముల సంజ్ఞచే చెప్పబడుచున్నది. ఏలయన సంకల్పమువలననే దేశకాలములు స్థితిగల్గియున్నవి.

ప్రశామ్యత్యుల్లసత్యేతి యాతి నందతి వల్గతి
మనః శరీరసంకల్పే ఫలితే న శరీరకమ్. 60

మనస్సను (సూక్ష్మ) శరీరముయొక్క సంకల్పముచేతనే స్థూలశరీరము శాంతినిబొందుచు, శోభించుచు, స్థానాంతరమును జెందుచు, ప్రసన్నమగుచు, విజృంభించుచున్నది.

నానాస్ఫారసముల్లాసైః స్వసంకల్పోపకల్పితైః
మనో వల్గతి దేహేఽస్మిన్ సాధ్వీవాంతఃపురాజిరే. 61

స్వసంకల్పముచే కల్పింపబడిన వివిధక్రియాసంరంభములచే నీ మనస్సు అంతఃపురమునందలి సాధ్వియగు స్త్రీవలె, దేహమునందతిశయించి వర్తించుచున్నది.

చాపలే ప్రసరస్తస్మాదంతర్యేన న దీయతే
మనో విలయమాదత్తే తస్యాలాన ఇవ ద్విపః. 62

కాన యెవడు తనమనమున విషయచింతనయను చాపల్యమునకు చోటీయడో యట్టివాని మనస్సు బంధింపబడిన యేనుగువలె శాంతించును.

న స్పందతే మనో యస్య శస్త్రిస్తంభ ఇవోత్తమః
సద్వస్తుతోఽసౌ పురుషః శిష్టాః కర్దమకీటకాః. 63

స్తంభనాస్త్రముచే శత్రువు చేష్టారహితుడగునట్లు, తత్త్వవిచారముచే నిగ్రహింపబడి విషయములపై పునకు జననట్టి యుత్తమ మనంబుగలవాడే శ్రేష్ఠుడనదగును. తక్కినవారు పంకమునసున్న కీటములతో సమానులు.

యస్యాచపలతాం యాతం మన ఏకత్ర సంస్థితమ్
అనుత్తమపదేనాసౌ ధ్యానేనానుగతోఽనఘః. 64

ఓ రామా! ఎవనిమనస్సు యేకాగ్రతనొంది స్థిరముగనుండునో, యాతడు ధ్యానముచే సర్వోత్తమమగు బ్రహ్మపదము నొందును.

సంయమాన్మనసః శాంతిమేతి సంసారవిభ్రమః
మందరేఽస్పందతాం యాతే యథా క్షీరమహార్ణవః. 65

మందరపర్వతము చలింపకయున్నచో క్షీరసాగరము శాంతముగానుండునట్లు, మనస్సంయమముచే సంసారభ్రమయు శాంతించును.



మానస్యో వృత్తయో యాయా భోగసంకల్పవిభ్రమైః
సంసారవిషవృక్షస్య తా ఏవాంకురయోనయః. 66

విషయభోగములందు ప్రవర్తించు మనోవృత్తులే సంసారమను విషవృక్షముయొక్క అంకురముత్పన్నమగు తావు.

చిత్తం చలత్కువలయం వలయంత ఏతే
మూఢా మహాజడజవే మదమోహమందాః
ఆవర్తవర్తిని విలూనవిశీర్ణచింతా
చక్రభ్రమే పురుషదుర్భ్రమరాః పతంతి. 67

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
చిత్తవర్ణనం నామ దశోత్తరశతతమః
సర్గః ॥ 110 ॥

కావున క్రోధ మోహాదులతోకూడి ప్రమత్తులైయున్న మందబుద్ధులగు జీవులను దుష్టభ్రమరములు సంసార నదీప్రవాహమున చపలచిత్తమను కమలము నాశ్రయించి సంచరించుచు, జడత్వ (అజ్ఞాన) మను జలావర్తవేగమున తగుల్కొని, ప్రబలమగు ననేక దుఃఖములచే విచ్ఛిన్నములై చక్రభ్రమవంటి చిన్తారూప యావర్తమున నిరంతరము పడుచున్నవి.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
చిత్తవర్ణనమను దశోత్తరశతతమ
సర్గము ॥ 110 ॥

—:o:—

## ఏకాదశోత్తరశతతమః సర్గః.

—:o:—

శ్రీవసిష్ఠ ఉవాచః—

అస్య చిత్తమహావ్యాధేశ్చికిత్సాయామహౌషధమ్
స్వాయత్తం శృణు వక్ష్యామి సాధు సుస్వాదు నిశ్చితమ్. 1

వసిష్ఠుడు:— ఓ రామా! ఈ చిత్తమను ఘోరవ్యాధిని నిర్మూలించుటకై వారి వారి యధీనముననే యున్నదియు, పురుషార్థసాధకమును, ఉత్తమ సుఖదాయకమును, లెస్సగ పరీక్షింపబడినదియు నగు గొప్పయౌషధమును వచించుచున్నాను వినుము.

స్వేనైవ పౌరుషేణాశు స్వసంవేదనరూపిణా
యత్నేన చిత్తవేతాలస్త్యక్త్వేష్టం వస్తు జీయతే. 2

ఆత్మ సాక్షాత్కారరూపమగు పురుషప్రయత్నముచే వాంఛితవస్తువును త్యజించుటద్వారా చిత్తమను బేతాలము శీఘ్రముగ జయింపబడుచున్నది.

త్యజన్నభిమతం వస్తు యస్తిష్ఠతి నిరామయః
జితమేవ మనస్తేన కుదంత ఇవ దంతినా. 3

ఓ రామా ! ఇష్టవస్తువులఁ ద్యజించుచు, యెవడు రాగద్వేషాది చిత్తదోషములులేక యుండునో యట్టివాని మనస్సు, దంతములుగల యేనుగుచే దంతములులేని యేనుగువలె జయింపబడునని యెంచుము.

స్వసంవేదనయత్నేన పాల్యతే చిత్తబాలకః
అవస్తుతో వస్తుని చ యోజ్యతే బోధ్యతేపి చ. 4

ఆత్మసాక్షాత్కారమను యత్నముచే చిత్తమను బాలుడు మిథ్యయగు సాంసారిక పదార్థ సముదాయమునుండి తొలగింపబడి ఆత్మస్వరూపమను సత్యవస్తువునందు నియోజితుడై, జ్ఞానయుక్తుడుగావింపబడి రక్షింపబడుచున్నాడు.

శాస్త్రసత్సంగధీరేణ చింతాతప్తమతాపినా
ఛింధి త్వమాయసేనాయో మనసైవ మనో మునే. 5

మననశీలుడవగు నో రామా ! దుఃఖాగ్నియందు పరితప్తమగు మనస్సను లోహమును చింతారహితమును శాస్త్ర, సత్సంగములచే ధీరమును ప్రశాంతమునగు మనంబను లోహముచేతనే ఛేదించివేయుము.

అయత్నేన యథా బాల ఇతశ్చేతశ్చ యోజ్యతే
భావస్తథైవ చేతోఽంతః కిమివాత్రాస్తి దుష్కరమ్. 6

లాలన, తాడనాది యుపాయములచే బాలుడొక కార్యమునుండి మరియొక కార్యమందు నియోగింపబడునట్లు చిత్తమున్ను, యొకభావమునుండి మరియొకభావమున జేర్చబడగలదు. ఇందు దుష్కరమెయ్యది?

సత్కర్మణి సమాక్రాంత ముదర్కోదయదాయిని
స్వపౌరుషేణైవ మనశ్చేతనేన నియోజయేత్. 7

ఉత్తమ ఫలదాయకమగు సమాధియను సత్కర్మయందు మనస్సును నియోగించి, అట్టి సమాధిద్వారా చిదాత్మతోటి మనస్సు నైక్యపఱచవలెను.

స్వాయత్తమేకాంతహితం స్వేప్సితత్యాగవేదనమ్
యస్య దుష్కరతాం యాతం ధిక్తం పురుషకీటకమ్. 8

తన యధీనముననే నున్నదియు, సర్వదా హితకరమునునగు యభిలషిత బాహ్యవిషయ నిరాకరణమను వైరాగ్యవృత్తి యెవనికి దుష్కరముగ తోచునో, అట్టి మనుజరూపుడగు కీటకమునకు ధిక్కారము !

అరమ్యం రమ్యరూపేణ భావయిత్వా స్వసంవిదా
మల్లేనేవ శిశుశ్చిత్త మయత్నేనైవ జీయతే. 9

ఓ రామా ! అరమణీయములగు విషయములనుగూడ నాత్మ సాక్షాత్కారరూప భావనచే పరమోత్తమమగు బ్రహ్మరూపముగనే భావించుచు, మల్లునిచే బాలునివలె, శ్రమలేకయే సులభముగ చిత్తమును జయించుము.

పౌరుషేణ ప్రయత్నేన చిత్తమాశ్వేవ జీయతే
అచిత్తేనాప్రయత్నేన పదం బ్రహ్మణి దీయతే. 10



ఆత్మ సాక్షాత్కారరూపమగు పురుషప్రయత్నముచే చిత్తము శీఘ్రముగ జయింపబడగలదు. మఱియు నట్లు జయింపబడిన చిత్త మప్రయత్నముగనే బ్రహ్మమును పొందును.

స్వాయత్తం చ సుసాధ్యం చ స్వచిత్తాక్రాంతిమాత్రకమ్
శక్నువంతి న యే కర్తుం ధిక్తాన్పురుషజంబుకాన్. 11

తన యధీనమున నున్నదియు, అతి సులభసాధ్యము నగు మనోనిగ్రహమునుగూడ నొనర్పజాలని, మనుజరూపులగు శృగాలము (నక్క) లకు ధిక్కారము.

స్వపౌరుషైకసాధ్యేన స్వేప్సితత్యాగరూపిణా
మనః ప్రశమమాత్రేణ వినా నాస్తి శుభాగతిః. 12

స్వపౌరుషమాత్ర సాధ్యమగు అభిలషితవస్తు త్యాగరూపమగు మనోనిగ్రహము లేనిచో, మోక్షరూపమగు సద్గతి మిగుల దుష్కరమగును.

మనోమారణమాత్రేణ సాధ్యేన స్వాత్మసంవిదా
నిఃసపత్నమనాద్యంత మనింగనమిహోచ్యతామ్. 13

ఆత్మ సాక్షాత్కారసాధ్యమగు మనోనాశముచే కామాది శత్రురహితమై, ఆద్యంతరహితమగు స్వారాజ్యసుఖము నీ దేహముండగనే సంపాదింపుము. (అనగా, జీవన్ముక్తుడవు కమ్ము).

ఈప్సితావేదనాఖ్యాత్తు మనః ప్రశమనాదృతే
గురూపదేశశాస్త్రార్థ మంత్రాద్యాయుక్తయస్తృణమ్. 14

బాహ్యవిషయముల యప్రతీతిగాని, అభిలషితమోక్ష సుఖసాధనరూపమగు మనోనాశముగాని లేనిచో, గురూపదేశము, శాస్త్రార్థవిచారము, మంత్రములు మొదలగు యుపాయములన్నియు తృణప్రాయములై వ్యర్థములగును.

సర్వం సర్వగతం శాంతం బ్రహ్మసంపద్యతే తదా
అసంకల్పనశస్త్రేణ ఛిన్నం చిత్తం గతం యదా. 15

సంకల్పాభావమను శస్త్రముచే చిత్తమను వృక్షము సమూలముగ ఛేదింపబడ, జీవుడపుడు సర్వరూపమును, సర్వవ్యాపియు, శాంతమునగు బ్రహ్మరూపముఁజెందును.

స్వసంవేదనసాధ్యేఽస్మిన్సంకల్పానర్థశాసనే
శాంతాయామత్ర వపుషి పుంసః క్వైవ కదర్థనా.

ఆత్మసాక్షాత్కారముచే సంకల్పములను అనర్థములను నిర్మూలనమొనర్చుటచే ప్రశాంతమగు జీవన్ముక్తి స్థితి లభించును. మనుజదేహధారియగు అధికారి జీవునకిద్దానియందు క్లేశమేమి గలదు?

నూనం దైవమనాదృత్య మూఢసంకల్పకల్పితమ్
పురుషార్థేన సంవిత్త్యా నయ చిత్తమచిత్తతామ్.

ఓ రామా ! మూఢునిచే కల్పింపబడిన ప్రారబ్ధము నేమియు నాదరింపక
త్కార రూపమగు పురుషప్రయత్నముచే చిత్తమును అచిత్తముగ జేయుము.

తాం మహాపదవీమేకాం కామవ్యధిగతం చిరమ్
చిత్తం చిద్భక్షితం కృత్వా చిత్తాదపి పరో భవ. 18

ప్రసిద్ధమగు యుత్తమ బ్రహ్మపదమును చిరకాలాభ్యాసముచే పొంది పిదప యంతరిన సాక్షాత్కారవృత్తిచే నావిర్భూతమగు చైతన్యముచే అవిద్యను సంపూర్ణముగ నశింపజేసి, చిత్తము నాత్మయందు లయమునొంది, చిత్తమునకు పరమైన పూర్ణాత్మస్వరూపమును బొందుము.

భవ భావనయా యుక్తో యుక్తః పరమయా ధియా
ధారయాత్మానమవ్యగ్రో గ్రస్తచిత్తం తతఃపరమ్. 19

ఇట్లొనర్చుటకై ప్రథమమున చిద్వస్తుభావనజేసి, పిదప యజ్ఞానిని స్థిరపఱచుటయందే మిక్కిలి సావధానముగ బుద్ధిని నియోగింపుము. ఆ పిమ్మట స్వస్థచిత్తుడవై; చిత్తమునుగూడ గ్రసించు నదియు, చిత్తమునకు పరమైనదియునగు పరమాత్మయందు నిలుకడగల్గి యుండుము.

పరం పౌరుషమాశ్రిత్య నీత్వా చిత్తమచిత్తతామ్
తాం మహాపదవీమేహి యత్ర నాశో న విద్యతే. 20

ఆత్మ సాక్షాత్కారరూపమగు యుత్తమ పురుషప్రయత్నము నాశ్రయించి చిత్తము నచిత్తముగజేసి ప్రసిద్ధమును శాశ్వతమునగు బ్రహ్మపదమును పొందుము.

సంవేదనవిపర్యాస రూపిణీ ధీరివాచలా
జేతుమాశుమనోరామ పౌరుషేణైవ శక్యతే. 21

ఓ రామా! దిగ్భ్రమచే, పశ్చిమదిక్కును పూర్వదిక్కని తలంచినను, పశ్చిమ దిజ్నిశ్చయ మను పురుషప్రయత్నముచే ఆ భ్రమతొలగునట్లు, పురుష ప్రయత్నముచే మనస్సుగూడ జయింప శక్యమైనదే.

అనుద్వేగశ్రియో మూల మనుద్వేగాత్ప్రవర్తతే
జంతోర్మనోజయో యేన త్రిలోకీవిజయస్తృణమ్. 22

అనుద్వేగ (భయ) రాహిత్యమే, రాజ్యాది విభవములకు మూలము. అట్టి యనుద్వేగముచేతనే మనోజయము సిద్ధించును. మనస్సును జయించినవానికి త్రిలోకజయమున్ను తృణమువలె తోచును.

న శస్త్రదలనోత్పాతపాతా యస్యాం మనాగపి
స్వభావమాత్రవ్యావృత్తౌ తస్యాం క్లైవ కదర్థనా. 23

రాజ్యసుఖమందు శత్రువుల శస్త్రప్రహారమను దుఃఖముగలదు. స్వర్గసుఖమున, మరణించిన పిదప యూర్ధ్వగమనము, పుణ్యక్షయముచే నధఃపతనమను క్లేశముగలదు. కాని శస్త్రప్రహారముగాని, ఊర్ధ్వాధోగమనములుగాని లేశమైననులేని స్వభావమాత్ర వ్యావృత్తి (చిత్తమును విషయములనుండి తొలగించి ఆత్మయందు నిలుపుట) యందు క్లేశమేమి గలదు?

అపి స్వవేదనాక్రాన్తా న శక్తా యే నరాధమాః
కథం వ్యవహరిష్యంతి వ్యవహారదశాసు తే. 24



తన మనస్సునుగూడ జయించుటకు సమర్థుడు కాని యధముడు యిక లోకమునసెట్లు వ్యవహరింపగలడు?

పుమాన్మృతోఽస్మి జాతోఽస్మి జీవామీతి కుదృష్టయః
చేతసో వృత్తయో భ్రాంతి చపలస్యాసదుత్థితాః. 25

'నేను పురుషుడను' 'నేను మరణించితిని' 'జన్మించితిని' 'జీవించుచున్నాను' — ఈ మొదలగు కుకల్పనలన్నియును చంచలచిత్తముయొక్క వృత్తులేయగుచు, మిథ్యారూపమున నుద యించుచున్నవి.

న కశ్చనేహ మ్రియతే జాయతే న చ కశ్చన
స్వయం వేత్తి మృతం స్వస్య లోకమన్యం స్వకం మనః. 26

యథార్థముగ నెవరును మరణించుటలేదు, జన్మించుటయులేదు. ఏలయన యీ మనస్సే తన మరణమును పరలోకగమనమును స్వయముగ నెరుంగుచున్నది.

ఇతో యాతి పరం లోకం స్ఫురత్యన్యతయా మనః
తత్రస్యైవైతదా మోక్షమతో మృతిభయం కుతః. 27

ఈ మనస్సు (జీవుడు) యిటనుండి పరలోకమునకుబోవుట, మఱియొకరూపమున స్ఫురించుట యనునది మోక్షప్రాప్తి పర్యంతమును, మనఃకల్పనచే సంభవించుచునే యుండును. కాన యిక మరణభయమేచట?

ఇహ లోకేన విచర త్విహలోకే పరత్ర చ
చిత్తమామోక్షమాస్తేఽన్య రూపమన్యన్న విద్యతే. 28

ఆయా రూపములధరించి, చిత్తమిహ పరలోకములందు సంచరించుచున్నను, మోక్ష పర్యంత మిదంతయును చిత్తమేయగును. యేలయన, చిత్తమునకన్యముగ యీ జగత్తునకు మఱియొక రూపమేలేదు.

మృతే భ్రాతరి భృత్యాదౌ క్లేశ ఆక్రియతేఽనృతః
తత్స్వచిత్తం స్వచైతన్య వ్యావృత్తాత్మేతి మే మతిః. 29

భ్రాతృపితృభృత్యాదులు మరణించునపుడు భ్రాంతిచే పొందబడు క్లేశము నిర్వికార శుద్ధచైతన్యమునకంటె వేఱగు చిత్తమేయగును.

సతి పథ్యేతతే శుభ్రే చిత్తోపశమనాదృతే
తిర్యగూర్ధ్వమధస్తాచ్చ భూయోభూయో విచారితమ్. 30

ఏ యపేక్షలేనిదియు, శక్తివంతమును, సర్వహితమును, మాయాదోషరహితమును, శ్రుతి ప్రతిపాదితమునగు పరమాత్మయందు చిత్తమును లయమొనర్చుటచే తప్ప మఱియుపాయముచే నైనను ముక్తిలభింపనేరదనుట, స్వర్గపాతాళ ద్వీపద్వీపాంతరములందున్న తత్త్వవేత్తలందఱియొక్క దృఢసమ్మతమైయున్నది.

యావన్నాస్తి గిలోపాయ శ్చిత్తోపశమనాదృతే
ఋతే తథ్యేతతే శుభ్రే బోధే హృద్యుదితే సతి. 31

మనోవిలయమాత్రేణ విశ్రాంతిరుపజాయతే
వ్యాయతే హృదయాకాశే చితిచిచ్చక్రధారయా. 32

మనో మారయ నిఃశంకం త్వాం ప్రబధ్నంతి నాధయ
యది రమ్యమరమ్యత్వే త్వయా సంవిదితం విదా. 33

ఛిన్నాన్యేవ తదంగాని చిత్తస్యేతి మతిర్మమ
అయం సోఽహమిదం తన్మ ఏతావన్మాత్రకం మనః. 34

చిత్తోపశమనముచే కేవలచిన్మాత్ర వస్తువు శేషించుటయే ముక్తి. చిత్తోపశమనము దప్ప ముక్తిఁ బొందుటకు మఱియొక యుపాయమెద్దియును లేదు. సత్యమును, త్రికాలాబాధ్యమును, వ్యాపకమును, అజ్ఞాన మాలిన్యరహితమునగు ఆత్మసాక్షాత్కార రూపమైన ప్రబోధము హృదయమున నుత్పన్నమౌకాగా, జీవునకు పరమశాంతి లభించును. ఓ రామా! అతివిస్తీర్ణమగు హృదయాకాశమున, అంతిమ బ్రహ్మాకారవృత్తిచే ప్రకాశమానమగు చిద్రూపచక్రముచే మనస్సును ఛేదించివేయుము. అపుడు మానసికవ్యథలేవియు నిన్ను బాధింపజాలవు. అవిచారముచే రమణీయములుగ గన్పట్టు స్త్రీపుత్రాదులందు దోషబుద్ధిగల్గి, వానియందరమణీయత్వమెప్పుడు గాంచుదువో, అపుడే చిత్తముయొక్క సర్వాంగములును భిన్నములైనవని నేనెంచుచున్నాను. ఈ దృశ్యమానమగు ప్రపంచము, దేహము, మనోబుద్ధ్యాదులు, దేహసంబంధములగు గృహధనక్షేత్రాదులే, మనస్సుయొక్క వివిధాంగములని గ్రహింపుము.

తదభావనమాత్రేణ దాత్రేణేవ విలూయతే
ఛిన్నాభ్రమండలం వ్యోమ యథా శరది ధూయతే. 35

మనస్సుయొక్క ఈ యంగములను భావింపకుండినమాత్రమున ఆకాశమున శరత్కాల మేఘమువలె నవన్నియును విచ్ఛిన్నములై పోవును.

వాతేనాకల్పనేనైవం తథా తద్ధూయతే మనః
భవంతి యత్ర శస్త్రాగ్నిపవనాస్తత్ర భీర్భవేత్. 36

స్వాయత్తే మృదుని స్వచ్ఛే కిమసంకల్పనే భయమ్
ఇదం శ్రేయ ఇదం నేతి సిద్ధమాబాలమక్షతమ్. 37

శరత్కాలమేఘము వాయువుచే నశించునట్లు, సంకల్పరాహిత్యముచే మనస్సున్ను నశించుచున్నది. శస్త్రములు, అగ్ని మొదలగునవి యుండుచోట భయముత్పన్నమగును గాని, తన స్వాధీనమందున్నదియు, అనాయాసముగ సిద్ధించునదియు, స్వచ్ఛమునగు సంకల్పరాహిత్యమందేమి భీతిగలదు? ఇది శ్రేయము, ఇదికాదను విషయమాబాలము సర్వులు నెఱుంగుచున్నారు.

బాలం పుత్రమివోదారే యే మనః శ్రేయసి యోజత్
అక్షయం దానవం చేతఃసింహం సంసృతిబృంహణమ్
ఘ్నంతి యే తే జయంతీహ నిర్వాణపదదాయినః. 38



బాలునివలె యీ మనస్సును ఉత్తమమగు శ్రేయోమార్గమున నియోగింపవలెను. ఏలయన సింహమువలె నిదియు జయించుటకు కష్టసాధ్యమైనది. ఏ మహాత్ము లీ మనస్సును నశింపజేయుదురో వారే సర్వోత్తము లనందగుదురు. అట్టివా రితరులనుగూడ ముక్తులుగఁ జేయగలరు.

భీమాః సంభ్రమదాయిన్యః సంకల్పకదనాదిమాః
విపదః సంప్రసూయంతే మృగతృష్ణామరావివ. 39

భయంకరములును, భ్రమదాయకములునగు విపత్తులనేకములు, మరుభూమియందు మృగతృష్ణాజలమువలె సంకల్పమునుండియే యుత్పన్నమగుచున్నవి.

కల్పాంతపవనావాంతు యాంతు చైకత్వమర్ణవాః
తపన్తు ద్వాదశాదిత్యా నాస్తి నిర్మనసః క్షతిః. 40

ప్రళయవాయువులు వీచినను, సముద్రములన్నియు పొంగి యేకమైనను, ద్వాదశాదిత్యులు తపింపజేసినను, అమనస్కునకేమియు హానిలేదు.

మనో బీజాత్సముద్యంతి సుఖదుఃఖే శుభాశుభే
సంసారఖండకా ఏతే లోకసప్తకపల్లవాః. 41

మనస్సను బీజమునుండియే, సుఖదుఃఖ రూపములగు శుభాశుభములు, సప్తలోకములు యనునట్టి పల్లవములతోకూడిన సంసారవృక్షము మావిర్భవించుచున్నది.

అసంకల్పనమాత్రైక సాధ్యే సకలసిద్ధిదే
అసంకల్పనసామ్రాజ్యే తిష్ఠావష్టబ్ధతత్పదః. 42

ఓ రామా! కేవల మసంకల్పముచే సాధ్యమును, సంకల్పసిద్ధుల గలుగజేయునదియునగు నిస్సంకల్ప సామ్రాజ్యమున, యుత్తమ ఆత్మపదమను సింహాసనముపై గూర్చుండుము.

ప్రయచ్ఛత్యుత్తమానందం క్షీయమాణం మనః క్రమాత్
కాష్ఠక్షీణాగ్నికాంగారో యథాంగారక్షయార్థినః. 43

శీతశాన్తిచేగల్గు సుఖమునపేక్షించువానికి అగ్నిప్రశమనము సుఖమునే గలుగజేయునట్లు క్రమముగ క్షయించుచున్న యీ మనస్సనిర్వచనీయమగు యుత్తమసుఖమును జీవునకు గలుగజేయుచున్నది.

అపి బ్రహ్మకుటీలక్షం మనసశ్చేత్సమీహితమ్
తదణోరంతరే వ్యక్తం విభక్తం పరిదృశ్యతే. 44

మనస్సభిలషించుచో, లక్షలకొలది బ్రహ్మాండములను కుటీరములను, చిదణువందు వేర్వేఱుగ విస్పష్టముగ గోచరింపజేయగలదు.

సంకల్పమాత్ర విభవేన కృతాత్యనర్థం
సంకల్పమాత్రవిభవేన సుసాధితార్థమ్
సంతోషమాత్రవిభవేన మనోవిజిత్య
నిత్యోదితేన జయమేహి నిరీప్సితేన. 45

ఓ రామా! సంకల్పమాత్రమున ననేక బ్రహ్మాండముల నుత్పన్నము చేయునదియు, జననమరణాది పెక్కు యనర్థములఁ గల్గజేయునదియునగు యీ మనస్సును సంతతాభ్యాసముచే సిద్ధించు సంతోష (తృష్ణారాహిత్య) విభవముచే జయించి, సర్వోత్తమమగు జయమును పొందుము.

పరమపావనయా విమనస్తయా సమతయామతయాత్మవిదామపి
శమితయామితయాంతరహంతయా యదవశిష్టమజం పదమస్తు తత్. 46

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
చిత్తచికిత్సానామైకాదశోత్తర శతతమః
సర్గః ॥ 111 ॥

ఓ రామా! ఆత్మవేత్తలకు సమ్మతమును, పరమపవిత్రమును, అమనస్కమును, అహంకారవర్జితమును, దుఃఖరహితమును, శాంతమును, జన్మాదివికార శూన్యమునగు ఆత్మపదమును నీవు పొందెదవు గాక!

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తి ప్రకరణమున
చిత్త చికిత్సయను ఏకాదశోత్తర శతతమ
సర్గము ॥ 111 ॥

## ద్వాదశోత్తరశతతమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

యస్మింస్తస్మిన్పదార్థే హి యేనతేన యథాతథా
తీవ్రవనంవేగసంపన్నం మనః పశ్యతి వాంఛితమ్. 1

వసిష్ఠుడు:- ఓ రామా! మనస్సేయేపదార్థమునుగూర్చి యెవ్విధమున తీవ్రవేగముతో ప్రవృత్తమగునో, ఆయా వాంఛిత పదార్థము నా విధముగనే గాంచును.

జాయతే మ్రియతే చైషా మనసస్తీవ్రవేగితా
సౌమ్యాంబుబుద్బుదాలీవ నిర్నిమిత్తా స్వభావతః. 2

సౌమ్యుడవగు నో రామచంద్రా! జలమందు బుద్బుదములు నిమిత్తములేకయే స్వభావముగ నుత్పన్నమగుచు, నశించుచు నుండునట్లు మనస్సుయొక్క తీవ్రవేగత్వమున్ను ఉత్పన్నమగుచు నశించుచుండును.

శీతతా తుహినస్యేవ కజ్జలస్యేవ కృష్ణతా
లోలతా మనసోరూపం తీవ్రా తీవ్రైకరూపిణీ. 3

శీతలత్వము మంచుయొక్కయు, నలుపుతనము కాటుకయొక్కయు గుణమగునట్లు సంకల్పముయొక్క తీవ్రాతీవ్రమను చంచలత్వమే మనస్సుయొక్క రూపమైయున్నది.



శ్రీరామ ఉవాచః—

కథమస్యాతిలోలస్య వేగో వేగైకకారణమ్
చలతా మనసో బ్రహ్మన్బలతో వినివార్యతే. 4

శ్రీ రాముడు:— ఓ మునీంద్రా! సర్వప్రవృత్తులకును ముఖ్యహేతువగు యీ చపలమనంబుయొక్క వేగము బలాత్కారముగనైన యెట్లు నివారింపబడగలదు?

శ్రీ వసిష్ఠ ఉవాచః—

నేహ చంచలతాహీనం మనః క్వచన దృశ్యతే
చంచలత్వం మనోధర్మో వహ్నేర్ధర్మో యథోష్ణతా. 5

వసిష్ఠుడు:— ఓ రామా! చంచలత్వమును విడచి మనస్సెలోకమున నెచటనుగూడ గాంచబడుటలేదు. అగ్నికి యుష్ణత్వమువలె, చంచలత్వమే మనస్సుయొక్క ధర్మము.

యైషా హి చంచలా స్పంద శక్తిశ్చిత్తత్వసంస్థితా
తాం విద్ధి మానసీం శక్తిం జగదాడంబరాత్మికామ్. 6

మాయావేష్టితమగు చైతన్యముయొక్క స్వరూపమగు చిత్తత్వమందున్న జగత్కారణమగు చంచల క్రియాశక్తియే, జగదాడంబరరూపముననున్న మానసికశక్తియని యెఱుంగుము.

స్పందాస్పందాదృతే వాయోర్యథా సత్తైవ నోహ్యతే
తథాచ చిత్తసత్తాస్తి చంచలస్పందనాదృతే. 7

స్పందాస్పందముల విడచి వాయువునకు మఱొకసత్తయే లేనట్లు, స్పందనము (చంచలత్వము) తప్ప చిత్తమునకు మఱొకసత్తయును లేదు.

యత్తు చంచలతాహీనం తన్మనోమృతముచ్యతే.
తదేవ చ తపః శాస్త్రసిద్ధాంతో మోక్ష ఉచ్యతే. 8

చంచలత్వరహితమగు చిత్తము నాశమొందెననియే చెప్పనగును. అట్టి మనోనాశమే తపస్సనియు, మోక్షమనియు శాస్త్రసిద్ధాంతమైయున్నది.

మనోవిలయమాత్రేణ దుఃఖశాంతిరవాప్యతే
మనోమననమాత్రేణ దుఃఖం పరమవాప్యతే. 9

మనస్సు లయింపగనే దుఃఖము నశించును. స్ఫురించిన వెంటనే దుఃఖము ప్రాదుర్భవించును.

దుఃఖముత్పాదయత్యుచ్చై రుత్థితశ్చిత్తరాక్షసః
సుఖాయానంతభోగాయ తం ప్రయత్నేన పాతయ. 10

ఈ చిత్తమను రాక్షసుడు విజృంభించిన, మిక్కిలి దుఃఖమును కలుగజేయును. కాన దేశకాలవస్తువులచే నపరిచ్ఛిన్నమును, అనంతమునగు మోక్షసుఖము ననుభవించుటకొఱకై నీవీ మనస్సును ప్రయత్నపూర్వకముగ నశింపజేయుము.

తస్య చంచలతా యైషా త్వవిద్యా రామ సోచ్యతే
వాసనాపదనామ్నీం తాం విచారేణ వినాశయ. 11

వాసనలకు తావగు యీ మనోచాంచల్యమే యవిద్య. ఇద్దాని నాత్మవిచారముచే నీవు నాశ మొనర్పుము.

అవిద్యయా వాసనయా తయాంతశ్చిత్తసత్తయా
విలీనయా త్యాగవశాత్పరం శ్రేయోఽధిగమ్యతే. 12

చిత్తశక్తి దేనియందంతర్భూతమై యున్నదో అట్టి వాసనారూపమగు అవిద్యను నాశ మొనర్చుటచేతను, బాహ్యవిషయములను త్యజించుటచేతను మోక్షమను యుత్తమశ్రేయము లభించును.

యత్తత్సదసతోర్మధ్యం యన్మధ్యం చిత్తజాడ్యయోః
తన్మనః ప్రోచ్యతే రామ ద్వయోర్దోలయితాకృతి. 13

ఓ రామా! సదసత్తులకును జడచైతన్యములకును మధ్యగల రూపమే మనస్సని చెప్పబడును. ఈ మనస్సు జడచైతన్యముల రెంటిపై పునకును ప్రవృత్తిగలదగుచున్నది.

జాడ్యానుసంధానహతం జాడ్యాత్మకతయోద్ధయా
చేతో జడత్వమాయాతి దృఢాభ్యాసవశేన హి. 14

జడత్వచింతనచేతను, అట్టి చింతనయొక్క దృఢాభ్యాసముచేతను కలుషితమైన యీ చిత్తము జడత్వమునే పొందును.

వివేకైకానుసంధానా చ్చిదంశాత్మతయా మనః
చిదేకతాముపాయాతి దృఢాభ్యాసవశాదిహ. 15

చిద్వస్తుచింతనచేతను, అట్టి చింతనయొక్క దృఢాభ్యాసముచేతను చిత్తము చైతన్యముతో నేకమగును.

పౌరుషేణ ప్రయత్నేన యస్మిన్నేవ పదే మనః
పాత్యతే తత్పదం ప్రాప్య భవత్యభ్యాసతో హి తత్. 16

శాస్త్రీయమగు పురుషప్రయత్నముచే దేనియందు చిత్తము నియోగింపబడుచున్నదో, దాని రూపమునే యభ్యాసబలమున నది పొందుచున్నది.

పునః పౌరుషమాశ్రిత్య చిత్తమాక్రమ్య చేతసా
విశోకం పదమాశ్రిత్య నిరాశంకః స్థిరో భవ. 17

మరల పురుషప్రయత్నముచే చిత్తమును చిత్తముచే జయించి దుఃఖరహితమగు నాత్మపదము నాశ్రయించి సందేహరహితుడవై నిశ్చలముగ నుండుము.

భవభావనయా మగ్నం మనసైవ న చేన్మనః
బలాదుత్తార్యతే రామ తదుపాయోఽస్తి నేతరః. 18



ఓ రామా! నీవు మనోనాశన క్రియయందే సదా సంలగ్నుడవై యుండుము. మనస్సును బలాత్కారముగ విషయములనుండి విముఖ మొనర్చుట తప్ప మోక్షప్రాప్తికి మఱియొండుపాయ మెద్దియును లేదు.

మన ఏవ సమర్థం వో మనసో దృఢనిగ్రహే
అరాజా కః సమర్థః స్యాద్రాజ్ఞో రాఘవ నిగ్రహే. 19

ఓ రాఘవా! నీ మనస్సే నీ మనంబును నిగ్రహించగలదు. రాజును జయించుటకు రాజు గాక యన్యుడు సమర్థుడగునా?

తృష్ణాగ్రాహగృహీతానాం సంసారార్ణవరంహసి
ఆవర్తైరుహ్యమానానాం దూరే స్వం మన ఏవ నౌః. 20

సంసారసముద్ర జలవేగమున తృష్ణయను మొసలిచే పట్టుకొనబడి, విషయములను యావర్తముల జిక్కుకొని, దూరముగ కొట్టుకొనిపోవుచున్న జీవులకీ వివేకయుక్తమగు మనస్సే నౌకవంటిది.

మనసైవ మనశ్ఛిత్త్వా పాశం పరమబంధనమ్
ఉన్మోచితో న యేనాత్మా నాసావన్యేన మోచ్యతే. 21

పాశమువంటిదియు, దృఢబంధనమునగు మనస్సును మనస్సుచేతనే ఛేదించి, ఆత్మను బంధనమునుండి విడిపింపవలెను. అట్లుకానిచో మఱేక్రియచేనైనను ఆత్మకు బంధవిమోచనము గలుగదు.

యా యోదేతి మనో నామ్నీ వాసనా వాసితాంతరా
తాంతాం పరిహరేత్ప్రాజ్ఞ స్తతోఽవిద్యాక్షయో భవేత్. 22

విషయములచే గ్రుచ్చబడినవియు, బాహ్యపదార్థముల వైపునకు ప్రవృత్తిగలవియు, మనస్సని పేర్కొనబడునట్టివియునగు వాసనలను ప్రాజ్ఞుడు వెంటనే రహిత మొనర్పవలెను. ఏలయన, ఉష్ణత్వము శమించిన నగ్నియు శమించునట్లు వాసనాక్షయముచే అవిద్యయు క్షయించును.

భోగౌఘవాసనాం త్యక్త్వా త్యజ త్వం భేదవాసనామ్
భావాభావౌ తత స్త్యక్త్వా నిర్వికల్పః సుఖీ భవ. 23

ఓ రామా! ప్రథమమున భోగవాసనను, పిదప భేదవాసనను తొలగించి యాపిమ్మట చిత్తమును, విషయములనుగూడ త్యజించి వికల్పరహితుడవై సుఖముగ నుండుము.

అభావనం భావనాయా స్త్వేతావాన్వాసనాక్షయః
ఏష ఏవ మనోనాశ స్త్వవిద్యానాశ ఉచ్యతే. 24

పూర్ణానందమును మఱుగుపఱచు అవిద్యయను ఆవరణమును ఆత్మసాక్షాత్కారరూప భావనచే తొలగించుటయే వాసనాక్షయ మనబడును. ఇదియే మనోనాశమనియు, అవిద్యానాశ మనియుగూడ చెప్పబడును.

యద్యత్సంవేద్యతే కించి త్తత్రాసంవేదనం పరమ్
అసంవిత్తిస్తు నిర్వాణం దుఃఖం సంవేదనాద్భవేత్. 25

చిత్తముద్వారా సాక్షి, యేయే పదార్థముల ననుభవించునో, ఆయా యనుభవము లేకుండుటయే సర్వోత్తమమగు మనోనాశమగును. విషయానుభవరాహిత్యమే నిర్వాణము. విషయానుభవమే దుఃఖము.

స్వేనైవ తత్ప్రయత్నేన పుంసః సంవేద్యతే క్షణాత్
భావస్యాభావనం భూత్యై తత్తస్మాన్నిత్యమాహరేత్. 26

ఈ విషయానుభవరాహిత్యము స్వప్రయత్నముచే క్షణములో సిద్ధించును. కాన నట్టి ప్రయత్నమునే నిత్య మభ్యసించుచుండవలెను.

రాగాదయో యే మనసీప్సితాస్తే బుద్ధ్వేహ తాంస్త్వం స్వమనస్తు భూతాన్
త్యక్త్వా తదాస్యాంకురమస్తబీజం మా హర్షశోకం సముపైహి తృప్తః. 27

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
ముఖరవేణోపదేశాంశకథనంనామ ద్వాదశోత్తర
శతతమః సర్గః ॥ 112 ॥

ఓ రామా! ఏయేవిషయములును, వానిని పొందింపజేయు యేయే యుపాయములును నీ మనంబునగలవో అవన్నియు మిథ్యయని యెఱింగి, అజ్ఞానబీజమునుండి యుత్పన్నమైన అంకురములగ వాటిని నిశ్చయించి, మనస్సు నట్టి అజ్ఞాన వాసనాబీజములతోగూడ త్యజించి, నిత్యతృప్తుడవై, యిక విషయజనితములగు హర్షశోకముల నెన్నటికిని పొందకయుండుము.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
ముఖరవేణోపదేశాంశ కథనమను ద్వాదశోత్తరశతతమ
సర్గము ॥ 112 ॥

## త్రయోదశోత్తర శతతమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఏషా హి వాసనా నిత్యమసత్యైవ యదుత్థితా
ద్విచంద్రభ్రాంతివత్తేన త్యక్తుం రాఘవ యుజ్యతే. 1

వసిష్ఠుడు:— ఓ రామా! ద్విచంద్ర భ్రాంతివలె యీ వాసన మిథ్యారూపమునే యుదయించుచున్నది గాన త్యజింపతగినదై యున్నది.

అవిద్యా విద్యమానేవ నష్టప్రజ్ఞేషు విద్యతే
నామ్నైవాంగీకృతాభావాత్సమ్యక్ప్రజ్ఞేషు సా కుతః. 2

మిథ్యారూపముగలదైనను, ఈ యవిద్య అవివేకులకు సత్యముగనే గన్పట్టుచున్నది. వివేకుల దృష్టియందు పరమార్థమున నిది లేనిదే కావున, వంధ్యాపుత్రునివలె కేవలము నామమాత్రముననే యంగీకరింపబడినది. అట్టిచో నది సత్యమెట్లగును?



మా భవాజ్ఞో భవ ప్రాజ్ఞః సమ్యగ్రామ విచారయ
నాస్త్యేవేందుర్ద్వితీయః ఖే భ్రాంత్యా సంలక్ష్యతే ముధా. 3

ఓ రామా! నీ వజ్ఞానివి కాకుము. లెస్సగ ఆత్మవిచారము సల్పి తత్త్వజ్ఞానివి కమ్ము. వాస్తవముగ నాకసమున రెండవచంద్రుడు లేకున్నను భ్రాంతిచేనట్టి ప్రతీతిగలుగునట్లు, ద్వైతరూపమగు అవిద్యయు యథార్థమున లేనిదేయగును.

నాత్ర తత్త్వాదృతే కించిద్విద్యతే వస్త్వవస్తు చ
ఊర్మిమాలిని విస్తీర్ణే వారిపూరాదృతే యథా. 4

ఈ ప్రపంచమున బ్రహ్మతత్త్వమొకటి తప్ప, అన్యమగు భావాభావములేవియును లేవు. తరంగయుక్తమగు విశాలసముద్రమున జలముతప్ప మఱియొక పదార్థమేదియును లేదుగదా!

స్వవికల్పాదృతేనైతాన్ భావాభావానసన్మయాన్
నిత్యేసితేతతే శుద్ధే మా సమారోపయాత్మని. 5

భావాభావయుక్తమగు మిథ్యారూపములైన యీ పదార్థములన్నియును సంకల్పమునకన్యములు గావు. అట్టివానిని మాయా బంధరహితమును, నిత్యమును వ్యాపకమును, శుద్ధమునగు ఆత్మయందారోపింపకుము.

నాసికర్తా కిమేతాసు క్రియాసు మమతా తవ
ఏకస్మిన్విద్యమానే హి కిం కేన క్రియతే కథమ్. 6

ఓ రామా! నీవు కర్తవుకానందున యీ క్రియలందు నీకు మమత్వమేల? అద్వితీయుడగు పరమాత్మయొకడే స్థితిగల్గియుండ, యిక యెవనిచే యెట్లు యేక్రియ యొనర్పబడగలదు?

మా వాఽకర్తా భవ ప్రాజ్ఞ కిమకర్తృతయే హితే
సాధ్యం సాధ్యముపాదేయం తస్మాత్స్వస్థో భవానఘ. 7

ప్రాజ్ఞుడవగు నో రామా! నీవకర్తవు గాకుము. అకర్తృత్వాభిమానముచే స్వప్రయత్నసాధ్యమగు ఫలమేదియును ప్రాప్తింపదు.

కర్తా సంస్త్వమసక్తత్వాద్భావాభావే రఘూద్వహ
అసక్తత్వాదకర్తాపి కర్తృవత్స్పందనం కుతః. 8

రఘుకులశ్రేష్ఠుడవగు నో రామా! అభిమానరహితుడవై కార్యములాచరించుచో, ఆసక్తిలేమిచే నీవకర్తయే యగుదువు. అట్లనే, అకర్తవైయున్నను నట్టి యకర్తృత్వమందభిమానము లేనందుచే కర్తయునగుదువు. అట్టిచో నిష్క్రియుడవును, ఆత్మదర్శియునగు నీకు, దేహక్రియచే ఆత్మక్రియాభ్రమరూపమగు కర్తృత్వమెట్లు గలుగును?

సత్యం స్యాచ్చేదుపాదేయం మిథ్యా చేద్ధేయమేవ చేత్
ఉపాదేయైకసక్తత్వాద్యుక్తా సక్తిర్హి కర్మణి. 9



కర్తృత్వము సత్యమైనచో గ్రహింపదగినదియు, అసత్యమైనచో త్యజింపదగినదియునగును.

ఫలప్రాప్తియందే క్రియా ప్రసక్తి గలదు కాన, క్రియాఫలము నిత్యమైనచో కర్మలందాసక్తి యుక్తమే (క్రియాఫలము మిథ్య గాన, కర్మాసక్తి యుక్తముగాదని భావము.)

యత్రేంద్రజాలమఖిలం మాయామయమవస్తుకమ్
తత్ర కాస్థా కథం నామ హేయోపాదేయదృష్టయః. 10

ఎచట అంతయును ఇంద్రజాలమువలె మాయామయమై వస్తుశూన్యమై తనరుచున్నదో నచట యిక దేనియందాసక్తి యుండగలదు ? అచట నిక హేయోపాదేయ (త్యాజ్య, గ్రాహ్య) దృష్టియు నెట్లుండును ?

సంసారబీజకణికా హ్యైషాఽవిద్యా రఘూద్వహ
ఏషా హ్యవిద్యమానైవ సతీవ స్ఫారతాం గతా. 11

రఘుకుల శ్రేష్ఠుడగు నో రామా ! ఈ సంసారమునకు బీజమగు అవిద్య లేనిదే అయినను; ఉన్నట్లు తోచుచు విశాలరూపమును పొందియున్నది.

యేయమాభోగినః సారా సంసారారంభచక్రికా
విజ్ఞేయా వాసనైషా సా చేతసో మోహదాయినీ. 12

కృత్రిమ వేషధారిణియగు నియ్యది, అసారమగు నీ సంసార (యంత్ర)మును ప్రారంభించునట్టి చక్రమైయున్నది. దీనినే జీవుని మోహపెట్టునదగు చిత్తమందలి వాసనయని యెఱుంగుము.

చారువంశలతేవాంతః శూన్యా నిస్సారకోటరా
సరిత్తరంగమాలేవ సవ్యుచ్ఛిన్నాపి నశ్వరీ. 13

ఈ యవిద్య అందమైన వెదురుతీగవలె, అంతమున శూన్యముగను నిస్సారముగనునుండును. నదీతరంగ సమూహమువలె నిది భిన్నమొనర్పబడినను నశింపకున్నది.

గృహ్యమాణాపి హస్తేన గృహీతుం నైవ యుజ్యతే
మృద్వ్యప్యత్యంతతీక్ష్ణాగ్రా నిర్ఝరోర్మిరివోత్థితా. 14

హస్తముచే గ్రహించినను గ్రహింపబడకున్నది. సెలయేటియందలి తరంగములవలె కోమలమైనను, తీరమందలి వృక్షములకు విషయాసక్తులగు జీవులను ఛేదింప సమర్థమగు తీక్ష్ణమైన యగ్రభాగము గలిగియున్నది.

దృశ్యతే ప్రకరాభాసా సదర్థేనోపయుజ్యతే
తరంగిణ్యాతరంగాభా స్వాకారపరినిష్ఠితా. 15

కార్యసమర్థమగు కారణసమూహముతో కూడియున్నట్లు గోచరించినను, సత్యవస్తువును గూర్చిన పురుషార్థమందు దీని యుపయోగమేమియును లేదు. సత్యతరంగశూన్యమును, ప్రతీతి మాత్రమున నే శోభించు యాకారమమాత్రము గలదియునగు మృగతృష్ణానదివలె నిది గన్పట్టుచున్నది.

క్వచిద్వక్రాః క్వచిత్స్పష్టా దీర్ఘాః ఖర్వాః స్థిరాశ్చలాః
యత్ప్రసాదోద్భవా [illegible] తేముపాగతాః. 16



ఒకచోట వక్రముగను, మఱొకచోట స్వచ్ఛముగను, ఒకచోట దీర్ఘముగను, మఱొకచోట లఘువుగను, అట్లే యొకచో స్థిరముగను, మఱియొకచోట చంచలముగను నిది భాసించుచున్నది. దీని ప్రభావముచేతనే యుత్పన్నమైన యీ సకల పదార్థములును పరస్పర భేదభావమును పొందియున్నవి.

అంతఃశూన్యాపి సర్వత్ర దృశ్యతే సారసుందరీ
న క్వచిత్సంస్థితాపీహ సర్వత్రైవోపలక్ష్యతే. 17

లోన శూన్యమైనను, అంతట నిది (అవిద్య) సారవంతముగను సుందరముగను గన్పించుచున్నది. ఎచటను లేనిదైనను, అంతటను గన్పట్టుచున్నది.

జడైవ చిన్మయీవ వాసావన్యస్పందోపజీవినీ
నిమేషమప్యతిష్ఠంతీ స్థైర్యాశంకాం ప్రయచ్ఛతి. 18

జడమైనను చైతన్యమువలె గన్పించుచు మనస్సుయొక్క చపలత్వము నుజ్జీవింపజేయుచున్నది. నిమిషమైనను యొకచోట నిలుకడలేనిదైనను స్థిరముగ యున్నట్లు తోచుచున్నది.

జ్వాలావచ్ఛుద్ధవర్ణాపి మషీమలినకోటరా
వల్గత్యన్యప్రసాదేన దీయతే తదవేక్షణాత్. 19

సత్వగుణముచే అగ్నిజ్వాలవలె శుద్ధవర్ణముగలదైనను, తమోగుణముచే మినపగింజవలె మలినవర్ణముగలదై యున్నది. పరమాత్మయొక్క ప్రభావముచేతనే నిది విజృంభించుచు, వాని సాక్షాత్కారముచే నశించుచున్నది.

ఆలోకే విమలే మ్లానా తమస్యపి విరాజతే
మృగతృష్ణేవ శుష్కాభా నానావర్ణావిలాసినీ. 20

ఈ యవిద్య, ఆత్మప్రకాశమున మలినమగును. మఱియు, అజ్ఞానాంధకారమున శోభించును. మృగతృష్ణవలె శుష్కప్రాయమైయున్నను. యిది పలువిధ వర్ణములతో కూడి విలాసముగ నొప్పుచున్నది.

వక్రా విషమయీ తన్వీ మృద్వీ సంకటకర్కశా
లలనా చంచలా లుబ్ధా తృష్ణాకృష్ణేవ భోగినీ. 21

మఱియు నీ యవిద్య వక్రమును, విషపూర్ణమును, అతిసూక్ష్మమును, ఆపదలకు హేతువగుటచే కర్కశమును, లుబ్ధస్త్రీవలె చంచలమును, కృష్ణసర్పమువంటిదగు తృష్ణయే రూపముగా గలదియునై యున్నది.

స్వయం దీపశిఖేవాశు క్షీయతే స్నేహసంక్షయే
సిందూరధూలిలేఖేవ వినా రాగం విరాజతే. 22

రాగమునశింప, తైలములేని దీపమువలె స్వయముగ నిది శీఘ్రముగ నశించును. తైలము లేకున్నను, సిందూరకణమువలె నయ్యది ప్రకాశించుచునే యుండును.

క్షణప్రకాశతరలా కృతసంస్థా జడాశయా
ముగ్ధానాం త్రాసజననీ వక్రా విద్యుదివోదితా. 23

క్షణకాలము స్ఫురించుచు, చంచలమై, జడత్వము నాశ్రయించు అజ్ఞులకు దుఃఖప్రదమై యొప్పుచు నీ యవిద్య భయంకరమగు మెఱుపుతీగవలె వ్యక్తమగుచున్నది.

యత్నాద్గృహీత్వా దహతి భూత్వాభూత్వా ప్రలీయతే
లభ్యతేపి హి నాన్విష్టా విద్యుద్వదతి భంగురా. 24

ఇయ్యది యత్నముచే బట్టి దహింపజేయుచున్నది. మరల మరల యుత్పన్నమై లయించుచున్నది. విద్యుల్లతవలె క్షణభంగురమై, వెదకినను ఎచటగూడ లభింపకున్నది.

అప్రార్థితైవోపనతా రమణీయాప్యనర్థదా
అకాలపుష్పమాలేవ శ్రేయసే నాభినందితా. 25

కోరకున్నను యిది ప్రాప్తించుచునేయున్నది. రమణీయమైనను, అనర్థకారిణి యగుటచే యకాల పుష్పమాలవలె శ్రేయముకొఱకభిలషింపబడుటలేదు.

అత్యంతవిస్మృతైవాతిసుఖాయ భ్రమదాయినీ
దుఃస్వప్నకలనేవేయ మనర్థాయైవ తర్కితా. 26

బాగుగ విస్మరింపబడినను, అతిశయ సుఖాన్విభ్రమను గల్గజేయుచున్నది. దుస్స్వప్నకల్పనవలె ఈ యవిద్య అనర్థకారిణియే యని పలుమారు నిశ్చయింపబడినది.

ప్రతిభాసవశాదేషా త్రిజగంతి మహాంతి చ
ముహూర్తమాత్రేణోత్పాద్య ధత్తే గ్రాసీకరోతి చ. 27

ఈ యవిద్య తనకల్పనచే విశాలములగు త్రిలోకములనుకూడ ముహూర్తమాత్రమున సృజించి ధరించుచు మరల నశింపజేయుచున్నది.

ముహూర్తో వత్సరశ్రేణీ లవణస్యానయా కృతా.
రాత్రిర్ద్వాదశవర్షాణి హరిశ్చంద్రస్య నిర్మితా. 28

లవణుడను రాజునకొక ముహూర్తము ననేకవత్సరములుగ నిదియే యొనర్చినది. మఱియు హరిశ్చంద్రునకొక రాత్రి పండ్రెండు వత్సరములుగ నిదియే తోపింపజేసినది.

వియోగినామథాన్యేషాం కాంతా విభవశాలినామ్
శర్వరీవత్సరవద్దీర్ఘా భవేత్తస్యాః ప్రసాదతః. 29

దీని ప్రభావముచేతనే వియోగము బొందినవారికిని, స్త్రీ, ఐశ్వర్యాదులతో తులతూగువారికిని, యొకరాత్రి వత్సరముగ గన్పట్టుచు నతిదీర్ఘమగుచున్నది.

సుఖితస్యాల్పతామేతి దుఃఖితస్యైతి దీర్ఘతామ్
కాలో యస్యాః ప్రసాదేన వివర్త్యాస్యై కళీలినామ్. 30



ఈ యవిద్యాప్రభావముననే భ్రమశీలుర దృష్టియందు కాలము విభిన్నముగ స్ఫురించుచున్నది. ఎట్లన, సుఖవంతునికది అల్పముగను, దుఃఖితులకు దీర్ఘముగను గన్పట్టుచున్నది.

అస్యాః స్వసత్తామాత్రేణ కర్తృత్వైతాసు వృత్తిషు
దీపస్యాలోకకార్యాణాం యథా తద్వన్న వస్తుతః. 31

ప్రకాశాది కార్యములందు దీపమునకెట్టి కర్తృత్వముగలదో, చైతన్యశక్తియొక్క సన్నిధానమాత్రమున ఆయా వృత్తులందవిద్యకును అట్టి కర్తృత్వము గలదు.

ననితంబస్తనీచిత్రే న స్త్రీ స్త్రీధర్మిణీ యథా
తథైవాకారచింతేయం కర్తుం యోగ్యా న కించన. 32

నితంబస్తనాది చిహ్నములుగల్గియున్న స్త్రీచిత్రము స్త్రీధర్మములుగల స్త్రీయెట్లు కానేరదో, మఱియు నయ్యది గృహకృత్యాదులనొనర్ప యెట్లసమర్థమైయుండునో, అట్లే పూర్వానుభూత పదార్థముల వాసనారూపమగు యీ అవిద్యయు పారమార్థిక కృత్యములందసమర్థమైయుండును.

మనోరాజ్యమివాకార భాసురా సత్యవర్జితా
సహస్రశతశాఖాపి న కించిత్పరమార్థతః. 33

ఈ యవిద్య మనోరాజ్యమువలె కల్పితమగు యాకృతిగల్గి ప్రకాశించినను సత్యవర్జితమైయు, సహస్రశాకములగు శాఖలుగల్గి విస్తరించినను పరమార్థమున లేనిదే యగుచున్నది.

అరణ్యే మృగతృష్ణేవ మిథ్యైవాడంబరాన్వితా
విడంబయతి తాన్ముగ్ధమృగానేవ న మానుషాన్. 34

మిథ్యారూపములగు యాడంబరములతోగూడి, వనమందు మృగముల మోహితమొనర్చు మృగతృష్ణవలె నీ యవిద్య అజ్ఞుల మోహపెట్టునుగాని వివేకులఁగాదు.

ఫేనమాలేవ సంజాత ధ్వస్తా విచ్ఛేదవర్జితా
జడేవ చంచలాకార గృహ్యమాణా న కించన. 35

నీటియందలి నురుగువలె నుత్పన్నమగుచు వెంటనే నశించుచు, క్షణభంగురమైయున్నను నిది ప్రవాహరూపమున నిత్యమేయగును. మఱియు జడమగు నీహారపటలమువోలె చంచలాకృతిగలదై, గ్రహించినచో నేమియు లేకపోవుచున్నది.

అటత్యుడ్డామరాకారా రజః ప్రసరధూసరా
బలాత్కల్పాంతవాత్యేవ స్వాక్రాంతభువనాంతరా. 36

భయంకరాకృతి గలదియును, ధూళి (రజోగుణము) చే ధూసరితమును, తనశక్తిచే లోకములన్నింటిని ఆక్రమించునదియునగు యీ అవిద్య సర్వత్ర పరిభ్రమించుచున్నది.

ధూమాలీవాంగసంలగ్నా నానాఖేదప్రదాయినీ
గర్భీకృతరసాకీర్ణా జగంతి పరివర్తతే. 37

ధూళికణమువలె అవయవముల స్పర్శించినంతనే దుఃఖబాధ గలుగజేయుచు, తనగర్భమందు

పరమాత్మరూపమను జలమును ధరించి, ఈ యవిద్య జగంబులనన్నిటిని యాక్రమించి సంచరించుచున్నది.

ధారాజలధరస్యేవ సుదీర్ఘా జలనిర్మితా
అసారసంసారదృఢా రజ్జుస్తృణగణై రివ. 38

ఇది జలమయమగు విశాలమేఘమువంటిది. తృణసమూహములచే రజ్జువువలె నీ యవిద్య అసారమును, సంసృతిరూపమునగు సంసారముచే దృఢత్వముఁ జెందుచున్నది.

తరంగోత్పలమాలేవ కల్పనామాత్రవర్ణితా
మృణాలీవ బహుచ్ఛిద్రా పంకప్రౌఢా జలాత్మికా. 39

తరంగతుల్యమనియు, కమల సదృశమనియు దీనిని కవులు కల్పనజేసి వర్ణించిరి. పంకమున నుత్పన్నమై, అనేకరంధ్రములు గల్గియుండునట్టి కమలనాళ—సూత్రము నిది పోలియున్నది.

జనేన దృశ్యతే వృద్ధి తత్పరా న చ వర్ధతే
విషాస్వాద ఇవాపాత మధురాంతే సుదారుణా. 40

వృద్ధిజెందునట్లు దీనిని జనులు గాంచినను, వాస్తవమున కయ్యదట్లగుటలేదు. విషముయొక్క స్వాదముపలె, అవిచారముచే నారంభమున మధురముగ తోఁచినను, తుద కతిభయంకరముగ పరిణమించును.

నష్టా దీపశిఖేవైషా న జానే క్వేవ గచ్ఛతి
మిహికేవాగ్రదృష్టాపి గృహ్యమాణా న కించన. 41
పాంసుముష్టిరివాకీర్య ప్రేక్షితా పారమాణవీ
ఆకాశనీలిమేవైషా నిర్నిమిత్తైవ దృశ్యతే. 42

ఈ యవిద్య నశించినచో, ఆరిన దీపమువలె లుప్తమై యెచటికో పోవుచున్నది. ధూళిని పిడికిటితోఁ గైకొని వెదజల్లినచో నదంతయు పరమాణుమయమై, గ్రహించినచో శూన్యమేయగునట్లు, నీహార ధూమ పటలమువలె యగ్రభాగమున గన్పించినను, గ్రహించిన లుప్తమైపోవుచున్నది. మఱియు ఆకాశమందు నీలత్వమువలె కారణములేకయే నిది వ్యక్తమగుచున్నది.

ద్విచంద్రమోహవజ్జాతా స్వప్నవద్విహితభ్రమా
యథా నౌయాయినః స్థాణుస్పంద స్తద్వదిహోత్థితా. 43

చంద్రద్వయమునుగూర్చిన యజ్ఞానమువంటిదియు, స్వప్నమువలె భ్రాంతిదాయకమునగు యీ అవిద్య ఉత్పన్నమై నౌకయందున్న వానికి తీరమునగల వృక్షాదులగమనమువలె మిథ్యారూపమున ప్రతీతమగుచున్నది.

అనయోపహతే చిత్తే దీర్ఘకాలమివాకులైః
జనైరాకల్ప్యతే దీర్ఘ సంసారస్వప్నవిభ్రమః. 44

చిత్తమెప్పుడు దీనిచే కలుషితమగునో, అపుడు మనుజుఁడు చిరకాలము దీర్ఘసంసారస్వప్న భ్రమను కల్పించుచున్నాడు.



అనయోపహతే స్వస్మింశ్చిత్రాశ్చేతసి విభ్రమాః
ఉత్పద్యంతే వినశ్యంతి తరంగాస్తోయధేరివ. 45

ఈ యవిద్యచే ఆత్మ మలినమొనర్పబడ, అనగా ఆవరణయుక్తము కాఁగా, సముద్రమందలి తరంగములవలె చిత్తమందు పలువిధములగు భ్రమలుదయించుచు నశించుచుండును.

మనోజ్ఞమపి సత్యం చ దృశ్యతే సదసత్తయా
అమనోజ్ఞమసత్యం చ దృశ్యతే సత్తయాప్యసత్. 46

దీని ప్రభావముననే సత్యమును, సర్వోత్తమమునగు బ్రహ్మ అసద్రూపమును, అమనోజ్ఞమును, మిథ్యారూపమునగు జగత్తు రమణీయముగను సత్యముగను గన్పట్టుచున్నది.

పదార్థరథమారూఢా భావనైషా బలాన్వితా
ఆక్రామతి మనః క్షిప్రం విహగం వాగురా యథా. 47

విషయములను రథముపైనెక్కి, వాసనారూపమగు నీ యవిద్య చిత్తమును విమోహితమొనర్చి, జాలము పక్షిని బంధించునట్లు, జీవులను బంధనమున పడద్రోయుచున్నది.

కరుణా స్యందమానాక్షీ ప్రవత్క్షీరలవస్తనీ
భవత్యుల్లసితానందం జననీ గృహిణీ యథా. 48

కరుణారసపూరితలోచనములును, క్షీరాధిక్యముగల స్తనములును గల మాతృరూపమును ధరించి యవిద్య, ఆనందోల్లాసముల గొల్పుచున్నది.

విషీకరోతి నిఃస్యంద సంతర్పితజగత్త్రియమ్
సుధార్ద్రార్ద్రమపి క్షిప్రం ప్రవృద్ధం బింబమైందవమ్. 49

త్రిలోకములకుకూడ తృప్తినిగల్గజేయు చంద్రికయను అమృత ప్రవాహముచే నిండియున్న పూర్ణచంద్రబింబమును కూడ నీ యవిద్య విషయమొనర్చుచున్నది.

ఉన్మత్తరవవేతాల నర్తనారంభసంభ్రమమ్
స్థాణవః సంప్రయచ్ఛంతి మూకా అప్యేతయాంధయా. ౫౦

వాగాదింద్రియముల వ్యాపారములేనిదియు, జీవులందఱను అంధులుగ జేయునదియునగు యీ అవిద్య స్థాణువందును, ఉన్మత్తునివలె శబ్దమొనర్చుచు నృత్యముచేయు బేతాలురగూర్చిన భ్రమను గలుగజేయుచున్నది.

సంధ్యాదిషు చ కాలేషు లోష్టపాషాణభిత్తయః
అస్యాః ప్రసాదాద్దృశ్యంతే సర్పాజగరదృష్టిభిః. 51

దీని ప్రభావముచేతనే సంధ్యాకాలాదులందు, మృత్తిక శిలానిర్మిత కుడ్యములు భ్రాంతిచే అజగరసర్పములుగ గన్పట్టుచున్నవి.

ఏకోఽపి ద్విత్వమాదేతి యథా ద్విశశిదర్శనే
దూరమభ్యాశతాం యాతి స్వప్నే స్వమరణం యథా. 52

భ్రాంతిచే రెండు చంద్రులగుపడునట్లు, అవిద్యచే నొకేవస్తువు రెండుగ తోచుచున్నది. మఱియు స్వప్నమందలి స్వమరణమువలె దూరమున్న సమీపమ్మగుచున్నది.

అదీర్ఘం క్షణతామేతి కాలస్యేష్టా యథా నిశా
క్షణో వర్ష మివాభాతి కాంతావిరహిణామివ. 53

సంహారకుడగు కాలునకు ప్రళయరాత్రి యల్పముగ తోచునట్లు అతిదీర్ఘ కాలముగూడ అవిద్యచే క్షణముగ నొప్పుచున్నది. మఱియు విరహజనులకువలె క్షణమున్న వత్సరముగ గన్పట్టుచున్నది.

న తదస్తీహ యన్నామ న కరోతీయముద్ధతా
అస్యాస్త్వకించనాయాస్తు శక్తతాం పశ్య రాఘవ. 54

ఓ రామా ! ఈ యవిద్యాసామర్థ్యమును తిలకింపుము ! సత్యవస్తుశూన్యమైనను నియ్యది విజృంభించినదై యీ బ్రహ్మాండమున నొనర్పని కార్యమేలేదు.

సంరోధయేత్ప్రయత్నేన సంవిదేవాశుసంవిదమ్
సరిత్స్రోతో నిరోధేన శుష్యత్యేషా మనోనదీ. 55

కాన బుద్ధిమంతుడు తన వివేకముచే చిత్తమును విషయములనుండి ప్రయత్నపూర్వకముగ మరలింపవలెను.

శ్రీరామ ఉవాచ:—

అవిద్యమానయైవేదం పేలవాంగ్యాసుతుచ్ఛయా
మిథ్యాభావనయా నామ చిత్రమంధీకృతం జగత్. 56

శ్రీ రాముడు:— ఓ మునీంద్రా ! మిథ్యారూపమును, అల్పమును, తుచ్ఛమును, అవస్తువునగు ఈ యవిద్య జగంబు నంధప్రాయమొనర్చినది! ఆహా! ఏమి యాశ్చర్యము !

అరూపయా నిరాకృత్యా చారుచేతనహీనయా
అసత్యేవాప్యనశ్యంత్యా చిత్రమంధీకృతం జగత్. 57

రూపముగాని యాకృతిగానిలేనిదై, పరమోత్తమచైతన్య రహితమై, అసత్తయినను నశింపనిదై యున్న ఈ యవిద్య జగత్తును మోహపఱచినది ! ఆశ్చర్యము !

ఆలోకేన వినశ్యంత్యా స్ఫురంత్యా తమసోఽంతరే
కౌశికేక్షణధర్మిణ్యా చిత్రమంధీకృతం జగత్. 58

ప్రకాశము (జ్ఞానము) న నశించునదియు, అంధకారము (అజ్ఞానము) న స్ఫురించునదియు నగు ఉలూక (గుడ్లగూబ) నేత్రములవంటి ఈ యవిద్య జగత్తును విమోహితమొనర్చినది ! ఏమి యాశ్చర్యము !

కుకర్మైకాంతకారిణ్యా న సహంత్యా విలోకనమ్
దేహమప్యవిజానంత్యా చిత్రమంధీకృతం జగత్. 59



క్రియాశక్తినిమాత్ర మాశ్రయించుటచే సదా దుష్కర్మములనే చేయునదియు ప్రకాశము (జ్ఞానము) ను సహింపనిదియు, జ్ఞానశూన్యమగుటచే స్వశరీర జ్ఞానమును లేనిదియునగు యీ అవిద్య ప్రాయముగ జేసివైచినది! ఆహా! ఏమి చిత్రము!

సుదీనాచారధర్మిణ్యా నిత్యం ప్రాకృతకాంతయా
అనారతాస్తంగతయా చిత్రమంధీకృతం జగత్. 60

దుష్టాచారములు, నీచస్వభావములు గలదియు, అజ్ఞుల వరించునదియు (అనగ మూఢులకు రమణీయముగ దోచునదియు) అసతీరూపమునగు అవిద్య లోకమును మోహవంతముగ జేసినది ! ఆశ్చర్యము!

అనంతదుఃఖాకులయా సదైవమృతయాఽనయా
సంబోధహీనయా యత్ర చిత్రమంధీకృతం జగత్. 61

పలువిధ దుఃఖములతో కూడినదియు, మృతప్రాయము:ను, జ్ఞానరహితమునగు అవిద్య జగత్తును మోహపరచినది ! ఏమి యాశ్చర్యము !

కామకోపఘనాంగిన్యా తమఃప్రసరవక్రియా
అచిరేణాశరీరిణ్యా చిత్రమంధీకృతం జగత్. 62

కామక్రోధమయమగు అంగములు గలదియు, అజ్ఞానమును ప్రసరించుచు భయంకరముగ నొప్పునదియు, జ్ఞానోదయముచే శీఘ్రఃముగ నశించునదియునగు యీ అవిద్య జగత్తు నంధీకృతమొనర్చినది! ఏమి చిత్రము!

స్వాత్మాంధరూపాస్పదయా జడయా జాడ్యజీర్ణయా
దుఃఖదీర్ఘప్రలాపిన్యా చిత్రమంధీకృతం జగత్. 63

ఆత్మనెఱుంగని యజ్ఞుల హృదయములందు వసించునదియు, జడత్వముచే శిథిలమైనదియు, దుఃఖములచే నతిదీర్ఘమును, ప్రలాపముచేయు నిశాచరివంటిదియునగు యీ అవిద్య జగత్తు నంధప్రాయముగ జేసినది ! ఆహా! ఏమి చిత్రము !

పురుషాసంగసంగిన్యా రాగిణ్యా క్రియయాఽనయా
విద్రవంత్యా వివశ్యాసు చిత్రమంధీకృతః పుమాన్. 64

చైతన్యమను పురుషునితో ఏకత్వాధ్యాసము నొందునది గాన పురుషసంగినియు, పలువిధ కల్పనలనొనర్చి భోగార్థము పురుషునియందనురక్తయై యుండునదియు, ఆత్మతత్త్వ విచారము నుండి పలాయనమగునదియునైన స్త్రీరూపిణియగు అవిద్య పురుషుని విమోహితునిగ జేసినది.

పురుషస్యనయా శక్తా సోఢుమీక్షితమప్యలమ్
తయాస్త్రియావరణయా చిత్రమంధీకృతః పుమాన్. 65

పురుషుని సాక్షాత్కరించుటయందసమర్థయు, ఆవరణముగలుగజేయునదియు నగు యీ అవిద్యారూపిణియైన స్త్రీ పురుషుని అంధప్రాయముగ నొనర్చివైచినది ! ఏమి యాశ్చర్యము !

నయస్యాశ్చేతనై వాస్తి యావ్యనష్టైవ నశ్యతి
తయా స్త్రియా పరుషయా చిత్రమంధీకృతః పుమాన్. 66

చైతన్యశక్తి యొకింతయు లేనిదియు (అన్యపదార్థములచే) నశింపనిదైనను (జ్ఞానముచే) నాశమునొందునదియునగు యీ అవిద్యయను స్త్రీ పురుషుని యంధునిగ జేసినది! అహా! ఏమిచిత్రము!

అనంతదుర్భ్రమసరవిలాసకారిణీ క్షయోదయోన్ముఖదుఃఖభాగినీ
ఇయం ప్రభో విగలతి కేన వాఽసమా మనోగుహానిలయనిబద్ధవాసనా. 67

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
అవిద్యావర్ణనంనామ త్రయోదశోత్తరశతతమః
సర్గః ॥ 113 ॥

ఓ మునీంద్రా! పలువిధ దుష్టభ్రమలచే విలాసమొనర్చునదియు, నాశోత్పత్తులు గలదియు, జననమరణాది దుఃఖముల ప్రాప్తినొందునదియు, విషమమును, మనోగుహయందు వాసనారూపమున నున్నదియునగు యీ అవిద్య యెట్లు నశించును?

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తి ప్రకరణమున
అవిద్యావర్ణమను త్రయోదశోత్తర శతతమ
సర్గము ॥ 113 ॥

## చతుర్దశోత్తరశతతమః సర్గః.

శ్రీ రామ ఉవాచః—

అవిద్యావిభవః ప్రోత్థం నిబిడం పురుషస్య హి
మహాదాంధ్యమిదం బ్రహ్మన్కథం నామ వినశ్యతి. 1

శ్రీరాముడు:— ఓ మునీంద్రా! అవిద్యచేగల్గినదియు, ఘనీభూతమును, ఆవరణరూపము నగు యీ అంధత్వము జీవునకెట్లు నశించును?

శ్రీవసిష్ఠ ఉవాచః—

యథా తుషారకణికా భాస్కరాలోకనాత్క్షణాత్
నశ్యత్యేవమవిద్యేయం రాఘవాత్మావలోకనాత్. 2

వసిష్ఠుడు:— ఓ రామా! సూర్యప్రకాశముచే మంచుబిందు వొక్కక్షణములో నశించునట్లు, ఆత్మావలోకనముచే నీ యవిద్య వెంటనే నశించును.



తావత్సంసారభృగుషు స్వాత్మనా సహ దేహినమ్
ఆందోలయతి నీరంధ్ర దుఃఖకంటకశాలిషు. 3

అవిద్యా యావదస్యాస్తు నోత్పన్నా క్షయకారిణీ
స్వయమాత్మావలోకేచ్ఛా మోహసంక్షయదాయినీ. 4

అవిద్యా, మోహముల నశింపజేయునట్టి ఆత్మసందర్శనమును గూర్చిన తీవ్రేచ్ఛ యెంత వఱకుత్పన్నమవదో, అంతవఱకీ యవిద్య, దుఃఖకంటక యుక్తమగు సంసార పర్వత శిఖరముపై జీవుని యాందోళిత మొనర్చుచునే యుండును.

అస్యాః పరం ప్రపశ్యంత్యాః స్వాత్మనాశః ప్రజాయతే
ఆతపానుభవార్థిన్యా శ్ఛాయయా ఇవ రాఘవ. 5

ఓ రామా! పరమాత్మను సందర్శించుటతోడనే, ఆతపానుభవమును వాంఛించు ఛాయవలె నీ యవిద్య నశించుచున్నది.

దృష్టే సర్వగతే బోధే స్వయమేవ విలీయతే
సర్వాశాభ్యుదితేచ్ఛాయా ద్వాదశార్కగణే యథా. 6

ద్వాదశాదిత్యు లుదయించినతోడనే దిక్కులందెల్లెడల యంధకారము నశించునట్లు, సర్వవ్యాపియు, బోధస్వరూపమునగు ఆత్మానుభవము కలుగగనే అవిద్యయు నాశమొందును.

ఇచ్ఛామాత్రమవిద్యేహ తన్నాశో మోక్ష ఉచ్యతే
స చాసంకల్పమాత్రేణ సిద్ధో భవతి రాఘవ. 7

ఓ రామా! ఇచ్ఛయే అవిద్య; కాన యిచ్ఛానాశమే మోక్షమని వచింపబడినది. అట్టి మోక్షము అసంకల్పమాత్రముననే సిద్ధించును.

మనాగపి మనో వ్యోమ్ని వాసనా రజనీక్షయే
కాలికా తనుతామేతి చిదాదిత్యమహోదయాత్. 8

చైతన్య భాస్కరోదయముచే కామ, వాసనారూపమగు రాత్రి క్షయింప, అవిద్యావరణమను అంధకారమున్ను నశించును.

యథోదితే దినకరే క్వాపి యాతి తమస్వినీ
తథా వివేకేభ్యుదితే క్వాప్యవిద్యా విలీయతే. 9

సూర్యోదయమగుటతోడనే రాత్రి యెచటికో పలాయనమగునట్లు వివేకోదయముచే అవిద్యయు విలీనమైపోవును.

దృఢవాసనయా బంధో ఘనతామేతి చేతసః
బలాద్వేతాలసంకల్పః సంధ్యాకాలే యథా శిశోః. 10

సంధ్యాకాలమున బాలుని హృదయమున వేతాలునిగూర్చిన సంకల్పము దృఢపడునట్లు ఘనవాసనలచే చిత్తముయొక్క బంధనము దృఢమగుచున్నది.

శ్రీ రామ ఉవాచ :—

యావత్కించిదిదం దృశ్యం సాఽవిద్యా క్షీయతే చ సా
ఆత్మభావనయా బ్రహ్మన్నాత్మాఽసౌ కీదృశః స్మృతః. 11

శ్రీ రాముడు:— ఓ మునీశ్వరా! ఈ దృశ్యప్రపంచ మవిద్యాత్మకమనియు, ఇయ్యది ఆత్మభావనచే నశించుననియు జెలవిచ్చితిరిగదా! అట్లయిన ఈ యాత్మయొక్క స్వరూప మెట్టిదో తెలియజేయుడు.

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

చేత్యానుపాతరహితం సామాన్యేన చ సర్వగమ్
యచ్చిత్తత్త్వమనాఖ్యేయం స ఆత్మా పరమేశ్వరః. 12

వసిష్ఠుడు:— విషయవర్జితమును, అవిద్యాశక్తులగు ఆవరణవిక్షేపములు లేనిదియు, సర్వవ్యాపియు, వాగతీతమునగు చిత్ తత్త్వమే ఆత్మయగు పరమేశ్వరుడు.

ఆబ్రహ్మస్తంబపర్యంతం తృణాది యదిదం జగత్
తత్సర్వం సర్వదాత్మైవ నావిద్యా విద్యతేఽనఘ. 13

ఓ రామా! బ్రహ్మాది తృణపర్యంతమగుగల యీ జగత్తంతయును సర్వదా ఆత్మస్వరూపమే అయియున్నది. అవిద్యయనునది లేనేలేదు.

సర్వం చ ఖల్విదం బ్రహ్మ నిత్యం చిద్ఘనమక్షతమ్
కల్పనాన్యా మనోనామ్నీ విద్యతే న హి కాచన. 14

ఈ దృశ్యప్రపంచమంతయును, చిద్ఘనస్వరూపమును, నాశరహితమును, నిత్యమునగు బ్రహ్మమే యగును. మనస్సను మఱియొక కల్పన యెద్దియునులేదు.

న జాయతే న మ్రియతే కించిదత్ర జగత్త్రయే
న చ భావవికారాణాం సత్తా క్వచన విద్యతే. 15

పరమార్థమున ఈ మూడులోకములం దేదియు నుత్పన్నమగుటలేదు, నశించుటలేదు. పదార్థములయొక్క వికారములు సత్యములు కావు.

కేవలం కేవలాభాసం సర్వసామాన్యమక్షతమ్
చేత్యానుపాతరహితం చిన్మాత్రమిహ విద్యతే. 16

ఈ జగత్తు కేవల మద్వితీయమును, స్వప్రకాశమును, సర్వవ్యాపకమును, సద్రూపమును, నాశరహితమును, విషయవర్జితమునగు చైతన్యమే అయియున్నది.

తస్మిన్నిత్యే తతే శుద్ధే చిన్మాత్రే నిరుపద్రవే
శాంతే సమసమాభోగే నిర్వికారోదితాత్మని. 17

కైషా స్వభావాతిగతం స్వయం సంకల్ప్య ధావతి
చిచ్చేత్యం స్వయమామ్లానా మామ్లానా తన్మనః స్మృతమ్. 18



నిత్యమును, వ్యాపకమును, శుద్ధమును, చిన్మాత్రస్వరూపమును, దుఃఖరహితమును, శాంతమును, విశాలమును, సర్వత్ర యేకరూపమును, నిర్వికారమునగు ఆత్మ, ఆవరణయుక్తమై చిత్స్వభావ విరుద్ధమగు జడత్వమును గ్రహించి, పరిచ్ఛిన్నములగు విషయములను సంకల్పించుచు, వానిపై పునః పరుగిడుచున్నది. మలినమగు యీ విక్షేపశక్తియే మనస్సనబడును.

ఏతస్మాత్సర్వగాద్దేవాత్సర్వశక్తేర్మహాత్మనః
విభాగకలనాశక్తిర్లహరీవోత్థితాంభసః. 19

సర్వవ్యాపియు, సర్వశక్తివంతమును, మహత్తరమునగు యీ మనస్సను దైవముచే, పదార్థము లన్నింటియొక్క విభాగమునుగూర్చిన కల్పనాశక్తి, సముద్రమందు తరంగమువలె నుత్పన్నమాయెను.

ఏకస్మిన్వితతే శాంతే యా న కించన విద్యతే
సంకల్పమాత్రేణ గతా సా సిద్ధిం పరమాత్మని. 20

ఏకమును, అద్వితీయమును, వ్యాపకమును, శాంతమునగు పరమాత్మయందు యథార్థముగ లేనిదేయగు యీ అవిద్య, సంకల్పమాత్రముననే అట నుత్పన్నమగుచున్నది.

అతః సంకల్పసిద్ధేయం సంకల్పేనైవ నశ్యతి
యేనైవ జాతా తేనైవ వహ్నిజ్వాలేవ వాయునా. 21

కాన, యీ అవిద్య సంకల్పముచే నుత్పన్నమగుచు, మరల సంకల్పముచేతనే నశించుచున్నది. అగ్నిజ్వాల వాయువుచే గలుగుచు, మరల నా వాయువుచేతనే నశించునట్లు, ఎయ్యది దేనిచే నుత్పన్నమగునో అయ్యది దానిచేతనే నశించును.

పౌరుషోద్యోగసిద్ధేన భోగాశారూపతాం గతా
అసంకల్పనమాత్రేణ సాఽవిద్యా ప్రవిలీయతే. 22

విషయభోగాభిలాషచే రూపమును గ్రహించిన యీ అవిద్య దృఢ నిదిధ్యాసనారూపమగు పురుషప్రయత్నముచే సిద్ధించునట్టి అసంకల్పత్వముచే వెంటనే నశించుచున్నది.

నాహం బ్రహ్మేతి సంకల్పాత్సుదృఢాద్బధ్యతే మనః
సర్వం బ్రహ్మేతి సంకల్పాత్సుదృఢాన్ముచ్యతే మనః. 23

ఈ మనస్సు 'నేను బ్రహ్మమును గా'నను దృఢసంకల్పముచే బంధమును, 'సర్వము ఆత్మస్వరూపమగు బ్రహ్మమే'యను దృఢసంకల్పముచే ముక్తిని బొందుచున్నది.

సంకల్పః పరమో బంధస్త్వసంకల్పో విముక్తతా
సంకల్పం సువిజిత్యాంతర్యథేచ్ఛసి తథా కురు. 24

సంకల్పమే దృఢబంధము, అసంకల్పమే ముక్తి. ఓ రామా! నేను బ్రహ్మమును గానను సంకల్పమును, సర్వమాత్మరూపమగు బ్రహ్మమేయను విశుద్ధ సంకల్పముచే గలిగిన జ్ఞానముచే జయించి యిమ్మట నీ కోర్కె-చొప్పున యొనర్పుము.

దృఢా న యాంబరేఽత్రాస్తి నలినీ హేమపంకజా
లోలవైదూర్యమధుపా సుగంధితదిగంతరా. 25

ఉద్దండైః ప్రకటాభోగైర్మృణాలభుజమండలైః
విహసంతీ ప్రకాశస్య శశినో రశ్మిమండలమ్. 26

వికల్పజాలికేవేత్థమసత్యేవాపి సత్సమా
మనః స్వార్థవిలాసార్థం యథా బాలేన కల్ప్యతే. 27

తథైవేయమవిద్యేహ భవబంధనబంధనీ
చపలా న సుఖాయైవ బాలేన కలితా దృఢా. 28

ఓ రామా! చిదాకాశమున లేనిదేయగు నీ యవిద్య, సువర్ణపంకమున నుత్పన్నమైనదియు, వైదూర్యమణియొక్క వర్ణముగల చంచలభ్రమరములు గలదియు, సర్వత్ర సుగంధమును వ్యాపింపజేయునదియు, యుద్దండరూపమున వ్యక్తమైనదియు, కమలనాళములను భుజసమూహములుగల్గి ఆత్మప్రకాశమను చంద్రకిరణముల జూచి పరిహాసమొనర్చునదియునగు పద్మమును బోలియున్నది. మఱియు, వికల్పజాలముల విస్తరించునదియు, యథార్థముగ లేనిదైనను యున్నట్లు గన్పించునదియు, లోకమున బంధహేతువును, చపలమునగు యీ అవిద్యను వినోదమునకై బాలుడు తన మనంబుచే కల్పనలజేయునట్లు, అజ్ఞులు సుఖమునకుగాక యనంత దుఃఖమునకొఱకే దృఢముగ కల్పనజేయుచున్నారు.

కృశోఽతిదుఃఖీ బద్ధోఽహం హస్తపాదాదిమానహమ్
ఇతి భావానురూపేణ వ్యవహారేణ బధ్యతే. 29

‘నేను దుర్బలుడను, అతిదుఃఖిని, బద్ధుడను, హస్తపాదాద్యవయవ సహితుడ’నని భావించుచు, తదనురూపముగ వ్యవహరించుచునుండు జీవుడు బంధనమున తగుల్కొనును.

నాహం దుఃఖీ న మే దేహో బంధః కస్యాత్మనః స్థితః
ఇతి భావానురూపేణ వ్యవహారేణ ముచ్యతే. 30

‘నేను దుఃఖినిగాను, నాకు దేహమేలేదు, యిక బంధమెవనికి’ యనునిట్టి యుత్తమభావనలం గల్గి వ్యవహరించువాడు ముక్తుడగును.

నాహం మాంసం న చాస్థీని దేహాదన్యః పరో హ్యయమ్
ఇతి నిశ్చయవానంతః క్షీణావిద్య ఇహోచ్యతే. 31

‘నేను మాంసముగాను, యెముకలుగాను. దేహవిలక్షణమును, బుద్ధ్యాతీతమునగు చిద్రూపమే నే’నని నిశ్చయించువాడే అవిద్యారహితు డనఁబడును.

ప్రోత్తుంగసురశైలాగ్రవైదూర్యశిఖరప్రభా
అథవార్కాంశుదుర్భేదా తిమిరశ్రీః స్థితోపరి. 32

కల్ప్యతే హి యథా వ్యోమ్నః కాలిమేతి స్వభావతః
పుంసా ధరణిసంస్థేన స్వసంకల్పనయేద్ధయా. 33



కల్పితైవమవిద్యేయమనాత్మన్యాత్మభావనా
పురుషేణాప్రబుద్ధేన న ప్రబుద్ధేన రాఘవ. 34

ఓ రామా! భూమిపైనున్నవా డాకాశముయొక్క నీలత్వమునుగూర్చి - (యోగభాష్యకారుల మతానుసారము) అత్యున్నతమగు మేరుపర్వత నీలమణిశిఖరముయొక్క కాంతి వ్యాపించెననియు, లేక (జ్యోతిష్కుల మతానుసారము) అతిదూరమున నున్నందున సూర్యకిరణ ప్రసారము లేమి, బ్రహ్మాండముయొక్క యూర్ధ్వభాగమందంధకారమే నీలత్వరూపమున గన్పించుచున్నదనియు కల్పనజేయువిధమున, అనాత్మభూతమగు దేహాదులం దాత్మభావనగలిగించు నీ యవిద్యయు అజ్ఞానముచే కల్పింపబడినది.

శ్రీ రామ ఉవాచ :—

మేరునీలమణిచ్ఛాయా నేయం నాపి తమః ప్రభా
తదేతత్కిం కృతం బ్రహ్మ నీలత్వం నభసో వద. 35

శ్రీరాముడు:— ఓ మహాత్మా! ఆకాశమందలి నీలత్వము నీలమణి శిఖరకాంతిగాని, అంధకార కాంతిగాని కానేరదు. ఏలయన, ప్రథమ పక్షమున మేరుపర్వతశిఖరము పద్మరాగాదియుతముగాన, ఆకసము రక్తవర్ణమే గల్గియుండవలెను గదా! ఇక రెండవపక్షమందు, బ్రహ్మాండముయొక్క రెండుభాగములును సువర్ణమయములని వర్ణింపబడినవి గదా! మఱియు సత్యాది యూర్ధ్వలోకములు ప్రకాశవంతములైనవి గదా! అట్టిచో నీ యాకసముయొక్క నీలత్వమునకు కారణమేమియో తెలియజేయుము.

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

న నామ నీలతా వ్యోమ్నః శూన్యస్య గుణవత్త్వినితా
అన్యరత్నప్రభాభావాన్న వాప్యేషా చ మైరవీ. 36

వసిష్ఠుడు:— ఓ రామా! ఈ నీలత్వము శూన్యమగు ఆకాశముయొక్క గుణమునుకాదు, అన్య పద్మరాగాదికాంతుల యభావముచే మేరుపర్వత శిఖరకాంతియును కాదు.

తేజోమయత్వాదండస్య స్ఫారత్వాదివ తేజసః
ప్రకాశ్యాదండపారస్య తమసో నాత్ర సంభవః. 37

‘తదండమభవద్ధైమం సహస్రాంశు సమప్రభమ్’ అనునట్లు బ్రహ్మాండము తేజోమయమగుటచేతను, ప్రకాశాతిశయముచే బ్రహ్మాండాంతమునగల యాకాశమందును సూర్యకాంతి వ్యాపించుటచేతను, యీ నీలత్వమునకు కారణమంధకారము కానేరదు. అనగ, పై రెండుపక్షములను నీవు నిరాకరించినవిధము తథ్యమైనదేయగును.

కేవలం శూన్యతైవైషా బహ్వీ సుభగ లక్ష్యతే
వయస్యేవానురూపాయా అవిద్యాయా అసన్మయీ. 38

ఓ రామా! ఇదంతయును కేవలము శూన్యత్వమేయగును. మఱియు అవిద్యవలెనే యిదియు నీలరూపముగల్గు అవిద్యయొక్క సఖివలె గన్పట్టుచున్నది.

స్వదృష్టిక్షయసంపత్తా వర్ణో శేవోదితం తమః
వస్తుస్వభావాత్తద్వ్యోమ్నః కార్ష్ణ్యమిత్యవలోక్యతే. 39

ఆకాశమున నేత్రదృష్టి ప్రసరింపనిచోట, అంధకారరూపమగు అదర్శనమే వస్తుస్వభావముచే నీలత్వముగ దృష్టిగోచరమగుచున్నది.

ఏతద్బుద్ధ్వా యథా వ్యోమ్ని దృశ్యమానోఽపి కాలిమా
న కాలిమేతి బుద్ధిః స్యాదవిద్యా తిమిరం యథా. 40

ఇట్లెఱింగిన పిమ్మట మరల యాకసమున నీలత్వముగుపడినను, అయ్యది ఆకాశగుణము కాదనుబుద్ధి యెట్లుత్పన్నమగునో, అట్లే అవిద్యాంధకారమునుగూర్చియు నెఱుంగుము.

అసంకల్పో హ్యవిద్యాయా నిగ్రహః కథితో బుధైః
యథా గగనపద్మిన్యాః న భాతి సుకరః స్వయమ్. 41

ఆకాశమున కమలసరోవరమువలె మిథ్యారూపమున నుదయించు అవిద్యను జయించుట కుపాయము సంకల్పాభావమేయని విజ్ఞులు సెలవిచ్చిరి. మఱియు నిది సులభసాధ్యమైనదే యగును.

భ్రమస్య జగతస్యాస్య జాతస్యాకాశవర్ణవత్
అపునఃస్మరణం మన్యే సాధో విస్మరణం వరమ్. 42

సాధుశీలుడగు నో రామా! ఆకాశమున నీలత్వమువలె మిథ్యయగు యీ జగద్భ్రమను పూర్ణముగ విస్మరించినవాడవై, మరల యద్దానిని స్మరింపకయుండుము. ఇదియే యుత్తమ మార్గము.

నష్టోఽహమితి సంకల్పాద్యథా దుఃఖేన నశ్యతి
ప్రబుద్ధోఽస్మీతి సంకల్పాజ్జనో హ్యేతి యథా సుఖమ్. 43
తథా సంమూఢసంకల్పా న్మూఢతామేతి వై మనః
ప్రబోధోదారసంకల్పా త్ప్రబోధాయానుధావతి. 44

'నేను నశించితి'నను సంకల్పముచే స్వప్నమున మనుజుడు దుఃఖముచే నశించుచు, మరల 'నేను మేల్కొంటి'నను సంకల్పముచే స్వప్నజనిత దుఃఖమును పారద్రోలి సుఖమునే పొందునట్లు, దుష్టసంకల్పములచే నీమనస్సు యల్పత్వమునే పొందుచున్నది. మఱియు జ్ఞానరూపమగు యుత్తమ సంకల్పముచే బ్రహ్మైక్యజ్ఞానముపై పునకే నిది పరువిడుచున్నది.

క్షణాత్సంస్మరణాదేషా హ్యవిద్యోదేతి శాశ్వతీ
యస్మాద్విస్మరణాదంతః పరిణశ్యతి నశ్వరీ. 45

'నేనజ్ఞుడ'నను సంకల్పముచే క్షణములో, అనాదియగు నీ యవిద్య యుదయించును. కాని నశ్వరమగు యీ సంకల్పమును సమూలగ ఛేదించుచో (పూర్ణముగ విస్మరించిన) నయ్యది శీఘ్రముగ నశించును.

భావనీ సర్వభావానాం సర్వభూతవిమోహినీ
మారిణీ స్వాత్మనో నాశే స్వాత్మవృద్ధా వినాశినీ. 46



పదార్థములన్నింటి నుత్పన్నము చేయునదియు, జీవులందఱిని మోహితులజేయునదియు నగు అవిద్య, ఆత్మాదర్శనముచే విశాలమగును. కాని అపరిచ్ఛిన్నమగు నట్టి యాత్మస్వరూపమును ప్రాప్తిజెందినచో వినాశముఁజెందును.

మనో యదనుసంధత్తే తత్సర్వేంద్రియవృత్తయః
క్షణాత్సంపాదయంత్యేతా రాజాజ్ఞామివ మంత్రిణః. 47

రాజానుజ్ఞను మంత్రులు పాలించునట్లు, మనస్సు చింతించుదానిని ఇంద్రియ వృత్తులన్నియును వెంటనే సిద్ధింపజేయును.

తస్మాన్మనోనుసంధానం భావేషు న కరోతి యః
అంతశ్చేతనయత్నేన స శాంతిమధిగచ్ఛతి. 48

కాన బ్రహ్మాహంభావమను యత్నమందే నిమగ్నమై, విషయములఁ జింతింపని మనస్సు పరమశాంతిని బొందును.

యదాదావేవ నాస్తీదం తదద్యాపి న విద్యతే
యదిదం భాతి తద్బ్రహ్మ శాంతమేకమనిందితమ్. 49

ఏ జగత్తు సృష్టికి పూర్వములేదో, అది యిప్పుడును లేనిదేయగును. మఱియు నీ జగద్రూపమున భాసించునదంతయు, శాంతమును పరమోత్తమమునగు బ్రహ్మమే యగుచున్నది.

మనసీయమతో నాన్యత్కదా కస్య కథం కుతః
నిర్వికారమనాద్యంత మాస్యతామపయంత్రణమ్. 50

బ్రహ్మముకంటె నన్యముగ చింతింపదగిన వస్తువొద్దియు, యెచటను, యెపుడును, యెవరికిని లేదు. కాన అనాదియు, అనంతమును, నిర్వికారమునగు బ్రహ్మమందే పూర్ణముగ స్థితిగల్గియుండుము.

పరం పౌరుషమాశ్రిత్య యత్నాత్పరమయా ధియా
భోగాశాభావనాం చిత్తాత్సమూలామలముద్ధరేత్. 51

శాస్త్రాదులచే పరిష్కృతమైన యుత్తమబుద్ధిచే, పురుషప్రయత్నము నాశ్రయించి, విషయభోగాశారూపమగు భావనను చిత్తమునుండి సమూలముగ తొలగించివేయుము.

యదుదేతి పరో మోహో జరామరణకారణమ్
ఆశాపాశశతోల్లాసి వాసనా తద్విజృంభతే. 52

పలువిధములగు యాశాపాశములతో కూడినదియు, వార్ధక్యమరణాది వికారములకు హేతువును, అజ్ఞానరూపమునగు యే మహామోహము జీవునియం దుదయించుచున్నదో, అయ్యది వాసనావిజృంభణమే యని గ్రహింపుము.

మమ పుత్రా మమ ధనమయం సోఽహమిదం మమ
ఇతీయమింద్రజాలేన వాసనైవ వివల్గతి. 53

'నా పుత్రులు, నా ధనము, నా దేహము, నా గృహక్షేత్రాదులు' ను నీ యింద్రజాలరూపమున వాసనయే విజృంభించుచున్నది.

శూన్య ఏవ శరీరేఽస్మిన్విలోలో జలవాతవత్
అనన్యయా వాసనయా త్వహంభావాహిరర్పితః. 54

వాయువుచే జలమున తరంగము కల్పింపబడునట్లు, శూన్యమగు యీ దేహమున, వాసన చేతనే, యహంభావమను సర్పము కల్పింపబడినది.

పరమార్థేన తత్త్వజ్ఞ మమాహమిదమిత్యలమ్
ఆత్మతత్త్వాదృతే సత్యం న కదాచన కించన. 55

తత్త్వజ్ఞుడగు నో రామా! పరమార్థమున 'నాది' 'నేనను' నదియును లేదు. ఆత్మతత్త్వమున కన్యమగున దేదియును యెన్నటికిని సత్యము కానేరదు.

ఖాద్రిద్యూర్వీనదీశ్రేణ్యో దృష్టిసృష్ట్యా పునఃపునః
సైవాన్యేవ విచిత్రేయ మవిద్యా పరివర్తతే. 56

జీవుని దృష్టియు, ఆకాశపర్వతపృథివీనద్యాదుల సృష్టియు, సమకాలముననే సంభవించుచున్నవి*. ఈ యవిద్యయే వేఱురూపమును బొందినట్లున్నదై అనేక విచిత్రాకారములను ధరించి మరల మరల ప్రవర్తించుచున్నది.

ఉదేత్యజ్ఞానమాత్రేణ నశ్యతి జ్ఞానమాత్రతః
సన్మాత్రేపరివిచ్ఛేద్యా రజ్జ్వామివ భుజంగధీః. 57

దేశకాల వస్తువులచే పరిచ్ఛిన్నమగు నీ యవిద్య అజ్ఞానముచే నుదయించుచున్నది. జ్ఞానమాత్రమున నయ్యది రజ్జువందలి సర్పత్వబుద్ధివలె వెంటనే నశించుచున్నది.

ఖాద్ర్యబ్ధ్యుర్వీ నదీ నేయం యాఽవిద్యాఽజ్ఞస్య రాఘవ
నావిద్యా జ్ఞస్య తద్బ్రహ్మ స్వమహిమ్నా వ్యవస్థితమ్. 58

ఓ రాఘవా! ఆకాశ పృథివీనద్యాదుల రూపముననున్న యీ అవిద్య అజ్ఞానికే యుదయించుచున్నదిగాని జ్ఞానికికాదు. జ్ఞానికి అవిద్యయే లేదు. ఏలనన అతడు సర్వరూపములందును, బ్రహ్మమే తన మహిమాతిశయముచే ప్రతిష్ఠితమైనట్లు గాంచును.

రజ్జుసర్పవికల్పౌ ద్వావజ్ఞేనైవోపకల్పితౌ
జ్ఞేనత్వేకైవ నిర్ణీతా బ్రహ్మదృష్టిరకృత్రిమా. 59

రజ్జుసర్ప వికల్పమువంటి వ్యావహారిక, ప్రాతిభాసిక దశలు రెండును అజ్ఞానిచేతనే కల్పింపబడినవి. వికారరహితమగు పారమార్థిక దృష్టి యొకటియే జ్ఞానికెల్లెడల నిర్ణీతమైయున్నది.

మా భవాజ్ఞో భవ ప్రాజ్ఞో జహి సంసారవాసనామ్
అనాత్మన్యాత్మభావేన కిమజ్ఞ ఇవ రోదిషి. 60

* దృష్టిచేతనే సృష్టియేర్పడుచున్నదని యిట తెలుపబడినది. ఇదియే దృష్టిసృష్టివాదము.



ఓ రామా! నీ వజ్ఞుడవు గాకుము. జ్ఞానివే యగుము. అనాత్మభూతములగు దేహాదులందాత్మభావనగల్గి, అజ్ఞానివలె యేల దుఃఖించుచుంటివి?

కస్తవాయం జడో మూకో దేహో భవతి రాఘవ
యదర్థం సుఖదుఃఖాభ్యా మవశః పరిభూయసే. 61

దేని నిమిత్తమవశుండవై నీవు సుఖదుఃఖములచే పరాజితుడవగుచుంటివో, అట్టి యీ జడదేహము నీ కేటగలదు?

యథా హి కాష్ఠజతునోర్యథా బదరకుండయోః
శ్లిష్టయోరపి నైకత్వం దేహదేహవతోస్తథా. 62

లోహకాష్ఠములును, ఘటఫలములును కలసియున్నను మిళితమై యేకమెట్లు కానేరవో అట్లే దేహాత్మలకేకత్వమును ఎన్నటికిని గలుగదు.

భస్త్రాదాహే యథా దాహో న భస్త్రాంతరవర్తినః
పవనస్య తథా దేహనాశేనాత్మా న నశ్యతి. 63

కొలిమితిత్తి దహింపబడినను యందలివాయువు నశింపకయుండునట్లు దేహము నశించినను, ఆత్మ నశింపకుండును.

దుఃఖితోఽహం సుఖాఢ్యోఽహమితి భ్రాంతిం రఘూద్వహ
మృగతృష్ణోపమాం బుద్ధ్వా త్యజ సత్యం సమాశ్రయ. 64

రఘుకులశ్రేష్ఠుడవగు నో రామా! 'నేను దుఃఖిని, విషయసుఖములచే పూర్ణుడ'నను భ్రాంతిని మృగతృష్ణవలె మిథ్యగనెఱింగి త్యజించివేయుము. సత్యమునే ఆశ్రయింపుము.

అహో ను చిత్రం యత్సత్యం బ్రహ్మతద్విస్మృతం నృణామ్.
యదసత్యమవిద్యాఖ్యం తన్నూనం స్మృతిమాగతమ్. 65

ఆహా! ఏమి ఆశ్చర్యము! సత్యమగు బ్రహ్మమును మఱచి, అసత్యమగు యవిద్యనే జనులెల్లపుడు స్మరించుచున్నారే!

ప్రసరం త్వమవిద్యాయా మా ప్రయచ్ఛ రఘూద్వహ
అనయోపహితే చిత్తే దుష్పారేహ కదర్థనా. 66

ఓ రామా! ఆత్మను విస్మరింపఁజేయు నీ యవిద్యకు తావీయకుము. ఏలయన, దీనిచే చిత్తము కలుషితముకాగా నపుడుగల్గు దుఃఖ మనతిక్రమణీయమై యుండును.

మిథ్యైవానర్థకారిణ్యా మనోమననపీనయా
అనయా దుఃఖదాయిన్యా మహామోహఫలాంతయా. 67
చంద్రబింబే సుధార్ద్రేఽపి కృత్వా రౌరవకల్పనమ్
నారకం దాహనంశోష దుఃఖం సమనుభూయతే. 68

మిథ్యారూపములగు ననేకయనర్థములఁ గల్గజేయునదియు, సంకల్పముచే విశాలమగునదియు,

దుఃఖదాయినియు, చివరకజ్ఞానరూప ఫలము నొసంగునదియునగు అవిద్యయే, అమృతముచే పరిపూర్ణమగు చంద్రబింబమందును రౌరవ నరకకల్పన యొనర్చి, దహన శోషణాది నరకదుఃఖముల ననుభవింప జేయుచున్నది.

జలకల్లోలకల్హార పుష్పనీకరవీచిషు
సరస్సు మృగతృష్ణాఢ్యం మరుత్త్వం పరిదృశ్యతే. 69

ఈ యవిద్యాప్రభావముననే కల్లోలముగనున్నదియు, కమల పుష్పయుక్తమును, తరంగ సహితమునగు సరోవరముగూడ మృగతృష్ణచే పూర్ణమగు మరుభూమిగ గన్పట్టుచున్నది.

నభోనగరనిర్మాణ పాతోత్పాతనసంభ్రమాః
స్వప్నాదిష్వనుభూయంతే విచిత్రాః సుఖదుఃఖదాః. 70

ఈ యవిద్యచేతనే ఆకాశమందలి నగరనిర్మాణము, నరకాదులందలి పతనము, స్వర్గారోహణము మున్నగు సుఖదుఃఖప్రదములైన విచిత్రభ్రమలు స్వప్నమున ననుభూతమగుచున్నవి.

సంసారవాసనాశ్చేతో యది నామ న పూరయేత్
తజ్జాగ్రత్స్వప్నసంరంభాః కిం నయేయురిహాపదమ్. 71

ఈ యవిద్య చిత్తమును సాంసారికవాసనలతో నింపనిచో, నిక జాగ్రత్స్వప్న విభ్రమము లాత్మ నేమిచేయగలవు?

దృశ్యతే రౌరవావీచి నరకానర్థశాసనా
మిథ్యాజ్ఞానే గతే వృద్ధిం స్వప్నే వవనభూమిషు. 72

మిథ్యారూపమగు యజ్ఞానము వృద్ధినొందుటవలననే స్వప్నాదులలో వనవాటికలందుగూడ రౌరవ, అవీచ్యాది నరకయాతనలు గన్పట్టుచున్నవి.

అనయా వేధితం చేతో బిసతంతావపి క్షణాత్
పశ్యత్యఖిలసంసార సాగరానర్థవిభ్రమమ్. 73

ఈ యవిద్యచే బాధితమగు చిత్తము కమలసూత్రమందును క్షణములో విశాలసంసార సాగరభ్రమను, తద్గత అనర్థములను గాంచుచున్నది.

అనయోపహతే చిత్తే రాజ్య ఏవ హి సంస్థితాః
తాస్తాదృశ్యో జనా యాంతి యా న యోగ్యాః శ్వపాకినః. 74

అవిద్యచే చిత్తము కాలుష్యమొంద, రాజ్యాధిపత్యము లభించినను, చండాలురకును అయోగ్యములగు దుఃఖములను జీవు లనుభవించుచున్నారు.

తస్మాద్రామ పరిత్యజ్య వాసనాం భవబంధినీమ్
సర్వరాగమయీం తిష్ఠ నీరాగః స్ఫటికో యథా. 75

ఓ రామా! కాన ఈ ప్రపంచమున బంధహేతువును, రాగమయమును, అవిద్యామయము నగు వాసనను వదలి రాగరహితుడ [illegible] ప్రకాశింపుము.



తిష్ఠత స్తవ కార్యేషు మాఽస్తు రాగేషు రంజనా
స్ఫటికస్యేవ చిత్రాణి ప్రతిబింబాని గృహ్ణతః. 76

పలువిధ చిత్రవిచిత్రములగు ప్రతిబింబములను గ్రహించుచున్నను, స్ఫటికము వానియందాసక్తి లేనట్లు వ్యవహరించుచున్నను నీవకార్యములం దాసక్తిలేక రాగాది రహితుడవై యుండుము.

విదితకౌతుకసంఘసమిద్ధయా యది కరోషి సదైవ సుశీలయా
వరధియాగతప్రాకృతికక్రియ స్తదసి కేన సహానుపమీయసే. 77

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
యథాకథితదోషపరిహారోపదేశో నామ చతుర్దశాధిక
శతతమః సర్గః ॥ 114 ॥

నిరతిశయానందరూపమగు బ్రహ్మము నెఱింగిన తత్త్వవేత్తల సంసర్గము జేయుచు, మరల మరల ఆత్మవిచారణసల్పుచు, బ్రహ్మభావనను దృఢపఱచి, అట్టి దృఢనిశ్చయముచే శోభించుచు, సమత్వ సౌశీల్యములుగల్గి, ఆసక్తిరహితుడవై ఉత్తమ వివేకబుద్ధితోగూడి సదా వ్యవహరించుచో, అవిద్యాజనితములగు జననమరణాది వికారములులేక, నిత్యముక్తుడవై యుందువు. మఱియు నట్టిస్థితి యందున్న నీకు హరిహరబ్రహ్మాదులైనను సాటి కానేరరు.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
యథాకథితదోషపరిహారోపదేశమను చతుర్దశాధికశతతమ
సర్గము ॥ 114 ॥

## పంచదశాధిక శతతమః సర్గః.

శ్రీ వాల్మీకి రువాచః—

ఏవముక్తో భగవతా వసిష్ఠేన మహాత్మనా
రామః కమలపత్రాక్ష ఉన్మీలిత ఇవాబభౌ. 1

వాల్మీకి:—ఓ భరద్వాజా! మహాత్ముడగు వసిష్ఠభగవానుడిట్లు వచింప, నంత కమలనేత్రుడగు శ్రీరాముడు వికాసముఁజెంది శోభించెను.

వికాసితాంతఃకరణః శోభామలముపాయయౌ
ఆశ్వస్త స్తమసి క్షీణే పద్మోఽర్కాలోకనాదివ. 2

అంధకారము శమింప, సూర్యప్రకాశముచే కమలము వికసించునట్లు వసిష్ఠమునీంద్రుఁ డొసగిన సమాధానముచే సంతుష్టిఁజెందిన శ్రీరాముడు వికసితాంతఃకరణుడై మిగుల శోభను పొందెను.

బోధవిస్మయసంజాత సౌమ్యస్మితసితాననః
దంతరశ్మిసుధాధౌతామిమాం వాచమువాచ హ. 3

వసిష్ఠునిబోధచే నాశ్చర్యము జనింప, చిరునవ్వుచే శోభించు గౌరవర్ణముఖము గల్గిన శ్రీరాముడంత, నిజదంతప్రకాశమను అమృతముచే పరిశుద్ధములగు వాక్యముల నిట్లు బల్కెను.

**శ్రీరామ ఉవాచ:—**

అహో ను చిత్రం పద్మోత్థైర్బద్ధాస్తంతుభిరద్రయః
అవిద్యమానా యాఽవిద్యా తయా సర్వే వశీకృతాః. 4

శ్రీ రాముడు:— ఆహా! ఆశ్చర్యము! కమలసూత్రముచే పర్వతములు బంధింపబడినవను పట్లు, లేనిదే యైనను ఈ అవిద్య యందఱిని తనవశము గావించుకొనినది.

ఇదం తద్వజ్రతాం యాతం తృణమాత్రం జగత్త్రయే
అవిద్యయాఽపి యన్నామ సదేవ సదివ స్థితమ్. 5

తృణమాత్రమైనను, ఇయ్యది మూల్లోకములందును వజ్రప్రాయమై దనరుచున్నది. ఈ యవిద్యచే మిథ్యయు సత్యముగనే గన్పట్టుచున్నది.

అస్యాః సంసారమాయాయా నద్యాస్త్రిభువనాంగణే
రూపం మదవబోధార్థం కథయానుగ్రహాత్మనః. 6

త్రిభువన ప్రాంగణమునను సంసార హేతువగు యీ మాయానదీస్వరూపమును నేను దృఢముగ నెఱుంగుటకొఱకై, దయచేసి మరల యద్దానిని వచింపుడు.

అన్యో యత్సంశయోఽయం మే మహాత్మన్హృది వర్తతే
లవణోఽసౌ మహాభాగః కింనామాపదమాప్తవాన్. 7

ఓ మహాత్మా! ఉత్తమ భాగ్యశీలుఁడగు లవణునకేల యట్టియాపద తటస్థించినదను మఱియొక సంశయమున్న నాకుగలదు.

సంశ్లిష్టయోరాహతయోర్ద్వయోర్వా దేహదేహినోః
బ్రహ్మన్క ఇవ సంసారీ శుభాశుభఫలైకభాక్. 8

ఓ మునీంద్రా! లోహ, కాష్ఠమువలె పరస్పరముగూడియున్న దేహాత్మలందేది ముఖ్యముగ శుభాశుభ కర్మఫలముల ననుభవించును?

లవణస్య తథా దత్వా తామాపదమనుత్తమామ్
కిం గతశ్చంచలారంభః కశ్చాసావైంద్రజాలికః. 9

మఱియు, లవణునకు గొప్పయాపద కల్పింపజేసి విచిత్ర కార్యారంభమొనర్చిన నాయింద్రజాలికుఁడెవఁడు? అతఁడెటకేగెను?

**శ్రీ వసిష్ఠ ఉవాచ:—**

కాష్ఠకుడ్యోపమో దేహో న కించన ఇహానఘ
స్వప్నాలోక ఇవానేన చేతసా పరికల్ప్యతే. 10



వసిష్ఠుడు:— పాపరహితుఁడవగు నో రామా! కాష్ఠ, కుడ్యాదులవలె నీ దేహము జడమైనది. స్వప్నప్రకాశమునువలె చిత్తము దీనిని కల్పించినది.

చేతస్తు జీవతాం యాతం చిచ్ఛక్తిపరిభావితమ్.
విద్యాత్సంసారసంరంభం కపిపోతకచంచలమ్. 11

దేహీ హి కర్మభాగ్భోక్తా హి నానాకారశరీరధృక్
అహంకారమనోజీవ నామభిః పరికల్ప్యతే. 12

చైతన్యశక్తిచే ప్రకాశితమగుచు అనగా చిదాభాసునితో నైక్యము బొందుచున్నదియు, ప్రపంచమున భోక్తృత్వాభిమానముగలదియు, వానరముగల నాకవలె చంచలమునునగు యీ చిత్తమే జీవభావమును పొందెనని తెలియవలెను. పలువిధ శరీరముల ధరించుటచే నది దేహియనియు, కర్మఫల భోక్తయనియు, జీవుడనియు పేర్కొనబడుచు వివిధ సంజ్ఞలచే పరికల్పింపబడుచున్నది.

తస్యైవాస్యాప్రబుద్ధస్య న ప్రబుద్ధస్య రాఘవ
సుఖదుఃఖాన్యనంతాని శరీరస్య న కానిచిత్. 13

ఓ రామా! అనంతములగు యీ సుఖదుఃఖములు అజ్ఞానిచిత్తమునకేగాని జ్ఞానికిగావు. మఱియు నవి శరీరమునకైనను గావని యెఱుంగుము.

అప్రబుద్ధం మనో నానాసంజ్ఞాకల్పితకల్పనమ్
వృత్తీరనుపతచ్చిత్రా విచిత్రాకృతితాం గతమ్. 14

వివిధసంజ్ఞలచే కల్పితములగు పెక్కుకల్పనల నొనర్చు అజ్ఞానియొక్క మనసు, అనేక చిత్ర విచిత్రములగు వృత్తులందు తగుల్కొనుచు విచిత్రాకృతులఁబొందును.

అప్రబుద్ధం మనో యావన్నిద్రితం తావదేవ హి
సంభ్రమం పశ్యతి స్వప్నే న ప్రబుద్ధం కదాచన. 15

ఎంతవఱకీమనస్సు ప్రబుద్ధము గాకయుండునో, అంతవఱకును నిద్రించుచున్నదే యగుచు (అజ్ఞానమున నేయున్నదై) స్వప్నమున ననేకభ్రమలఁ గాంచుచుండును గాని, ప్రబుద్ధమానస మెట్లున్నటికిని గాంచదు.

అజ్ఞాననిద్రాక్షుభితో జీవో యావన్న బోధితః
తావత్పశ్యతి దుర్భేదం సంసారారంభవిభ్రమమ్. 16

అజ్ఞాననిద్రచే క్షుభితమగు యీ జీవుడు, ప్రబోధము నొందనంతవఱకును, సంసారభ్రమ యందున్నవాడై, వివిధకార్యములందు ప్రవృత్తుడగుచు భేదదృష్టి గల్గియుండును.

సంప్రబుద్ధస్య మనసస్తమః సర్వం విలీయతే
కమలస్య యథా హార్దం దినాలోకవికాసినః. 17

సూర్యప్రకాశముచే వికసించిన కమలముయొక్క తమోపటలమంతయు నశించులాగున, లెస్సగ ప్రబోధమందిన మనస్సుయొక్క అంధకార (అజ్ఞాన) మంతయు నశించును.

చిత్తావిద్యామనోజీవవాసనేతి కృతాత్మభిః
కర్మాత్మేతి చ యః ప్రోక్తః స దేహీ దుఃఖకోవిదః. 18

తత్త్వవేత్తలెద్దానిని చిత్తము, అవిద్య, జీవుడు, వాసన, కర్మ మున్నగు నామంబులచే పేర్కొనిరో, ఆ జీవాత్మయే విషయసంబంధమగు సుఖదుఃఖముల భోక్తయగును.

జడో దేహో న దుఃఖార్హో దుఃఖీ దేహ్యవిచారతః
అవిచారో ఘనాజ్ఞానాదజ్ఞానం దుఃఖకారణమ్. 19

జడమగు దేహము దుఃఖమును పొందజాలదు. ఆత్మ దుఃఖమునొందుటకు కారణ మవిచార మేయగును. అధికమగు అజ్ఞానముచే ఆ అవిచార ముత్పన్నమగుచున్నది. కాన అజ్ఞానమే దుఃఖమునకు కారణమగును.

శుభాశుభానాం ధర్మాణాం జీవో విషయతాం గతః
అవివేకైకదోషేణ కోశేనేవ హి కీటకః. 20

తనగూటివలననే పట్టుపురుగు వినాశమొందులాగున, కేవల మవివేకమాత్ర దోషమున జీవుడు శుభాశుభములకు లోనగుచున్నాడు.

అవివేకామయోన్నద్ధం మనో వివిధవృత్తిమత్
నానాకారవిహారేణ పరిభ్రమతి చక్రవత్. 21

అజ్ఞానరోగముచే బాధింపబడుచు, అనేక వృత్తులతో కూడియున్నట్టి యీ మనస్సు వివిధాకారముల నొందుచు చక్రమువలె పరిభ్రమించుచున్నది.

ఉదేతి రౌతి హంత్యత్తి యాతి వల్గతి నిందతి
మన ఏవ శరీరేఽస్మిన్న శరీరం కదాచన. 22

ఉత్పన్నమగునది, దుఃఖించునది, వధించునది, భుజించునది, సంచరించునది, విజృంభించునది, నిందించునది మనస్సేగాని శరీరము గాదు.

యథా గృహపతిర్గేహే వివిధం హి విచేష్టతే
న గృహం తు జడం రామ తథా దేహే హి జీవకః. 23

గృహమందలి సమస్తవ్యవహారములను గావించునది గృహ యజమానియేగాని జడమగు గృహము కాదుగదా! ఓ రామా! అట్లనే, యీ శరీరమందును జీవుడు వర్తించుచున్నాడని తెలిసికొనుము.

సర్వేషు సుఖదుఃఖేషు సర్వాసు కలనాసు చ
మనః కర్తృ మనో భోక్తృ మానసం విద్ధి మానవమ్. 24

సుఖదుఃఖము లన్నిటియందును, సర్వవిధ కల్పనలయందును మనస్సే కర్తయు భోక్తయు నగును. వెయ్యేల, మనస్సే మానవుడని యెఱుంగుము.

అత్ర తే శృణు వక్ష్యామి వృత్తాంతమిమముత్తమమ్
లవణోఽసా యథా యాతశ్చండాలత్వం మనోభ్రమాత్. 25



ఓ రామా! చిత్తభ్రమచే లవణుఁడెట్లు చండాలత్వమందెనో, ఆ యుత్తమ వృత్తాంత మంతయుఁ జెప్పుచున్నాను, వినుము.

మనః కర్మఫలం భుంక్తే శుభం వాఽశుభమేవ వా
యథైతద్బుద్ధ్యసే నూనం తథాఽఽకర్ణయ రాఘవ. 26

శుభమైనను, అశుభమైనను, కర్మఫల మనుభవించునది మనస్సేయని నీ వెవ్విధముగ తెలిసికొనగలవో, యాక్రమము నెఱింగించుచున్నాను, యాకర్ణింపుము.

హరిశ్చంద్రకులోత్థేన లవణేన పురాఽనఘ
ఏకాంతేనోపవిష్టేన చింతితం మనసా చిరమ్. 27

పాపరహితుఁడవగు నో రామా! పూర్వకాలమున హరిశ్చంద్రుని వంశమున నుత్పన్నమైన లవణుఁడొకనాడేకాంతప్రదేశమున గూర్చున్నవాఁడై చాలసేపిట్లు మనంబున చింతనజేయదొడగెను.

పితామహో మే సుమహాన్రాజసూయస్య యాజకః
అహం తస్య కులే జాతస్తం యజే మనసా మఖమ్. 28

అధిక తేజస్సంపన్నుఁడగు నా పితామహుడు పూర్వము రాజసూయయాగ మొనర్చియుండెను. అతని వంశజుడనైన నేనట్టి యజ్ఞమును (యజ్ఞసామగ్రి లేకపోవుటచేతను, రాజాదుల బాధింపవలసి వచ్చుటచేతను, మంత్ర్యాదుల యసమ్మతిచేతను) మానసికముగ నాచరించెదను.

ఇతి సంచిత్య మనసా కృత్వా సంభారమాదృతః
రాజసూయస్య దీక్షాయాం ప్రవివేశ మహీపతిః. 29

ఇవ్విధమున నిశ్చయించి యారాజంత మనంబుననే అత్యాదరముగ యజ్ఞసామగ్రినంతయును సమకూర్చి యజ్ఞదీక్ష వహించెను.

ఋత్విజశ్చాహ్వయామాస పూజయామాస సన్మునీన్
దేవానామంత్రయామాస జ్వాలయామాస పావకమ్. 30

మనంబుననే యాతడు ఋత్విజులఁబిలచెను. శ్రేష్ఠులగు మునులఁబూజించెను. దేవతల నాహ్వానించెను. హవిస్సుద్వారా అగ్నిని ప్రజ్వలింపఁజేసెను.

యథేచ్ఛం యజమానస్య మనసోపవనాంతరే
యయౌ సంవత్సరః సాగ్రో దేవర్షి ద్విజపూజయా. 31

ఇట్లు, యజ్ఞవాటికామధ్యమున, తనకోర్కెచొప్పున మానసికముగ యజ్ఞమొనర్చుచు, దేవర్షులను, ద్విజులను పూజించుచు నుండ ఒక నిండువత్సరము గడచెను.

భూతేభ్యో ద్విజపూర్వేభ్యో దత్వా సర్వస్వదక్షిణామ్
విబుధ్యత దినస్యాంతే స్వ ఏవోపవనే నృపః. 32

తన సర్వస్వమును బ్రాహ్మణాదులకు దక్షిణగానొసంగి, రాజు తన యుద్యానవనమున బాహ్యదృష్టి గలవాడాయెను. (అనగా మానసిక యజ్ఞమునుండి మేల్కొనెను)

ఏవం స లవణో రాజా రాజసూయమవాప్తవాన్
మనసైవ హి తుష్టేన యుక్తం తస్య ఫలేన చ. 33

ఇవ్విధమున ఆ లవణుఁడు సంతుష్టమానసుఁడై రాజసూయయజ్ఞముఁ జేసెను; కావున యద్దాని ఫలమాతనికి లభింపవలసియున్నది.

అతశ్చిత్తం నరం విద్ధి భోక్తారం సుఖదుఃఖయోః
తన్మనః పావనోపాయే సత్యే యోజయ రాఘవ. 34

కాన నో రామా! సుఖదుఃఖముల భోక్తయగు చిత్తమే మానవుడని యెఱుంగుము. అట్టి చిత్తమును (ఆత్మ) విచారముచే నిగ్రహించి, యద్దానిని పవిత్రమును, సత్యవంతమైనదియునగు యుపాయమునందు జేర్చుము. మనస్సే క్రియాశక్తిప్రాధాన్యముచే కర్తయు, కరణమును, క్రియయునగును. అట్టి క్రియయే సుఖదుఃఖాదిరూపమున పరిణమించి ఫలదాయిని యగుచున్నది. చిదాభాసుని వ్యాప్తి చేతను, చిత్-శక్తియొక్క ప్రధానత్వముచేతను మనస్సే భోక్తయు, భోగమును యగుచున్నది. కాన కర్తృత్వభోక్తృత్వ ప్రవాహమే మాయానదీస్వరూపమగును (ఇవ్విధమున ప్రథమప్రశ్నకు సమాధాన మొసగబడినది.)

పూర్ణే దేశే సుసంపూర్ణః పుమాన్నష్టే వినశ్యతి
దేహోఽహమితే యేషాం తు నిశ్చయస్తైరలం బుధాః. 35

బుధజనులగు నో సభ్యులారా! ఈ మనస్సను పురుషుడు దేశకాలవస్తువులచే పరిచ్ఛిన్నము గానట్టి తన యాత్మనవలంబించి, అద్దానియందు ప్రతిష్ఠుడగుచో, పరిపూర్ణుడు కాగలడు. కాని అనిత్యమును పరిచ్ఛిన్నమునగు దేహాదుల నాశ్రయించినచో వినాశమునే చెందును. కాన 'దేహమే నేనను' నశ్వరాహంభావ మెవరు గల్గియుందురో, వారిచే నీ ప్రపంచమున నేమియు ప్రయోజనములేదు.

ఉచ్చైర్వివేకవతి చేతసి సంప్రబుద్ధే దుఃఖాన్యలం విగలితాని వివిక్తబుద్ధేః
భాస్వత్కరప్రకటితే నను పద్మఖండే సంకోచజాడ్యతిమిరాణి చిరం గతాని. 36

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
సుఖదుఃఖభోక్తృత్వోపదేశో నామ పంచదశోత్తర
శతతమః సర్గః ॥ 115 ॥

వేదాంతాది శాస్త్రములవలనను, ఆచార్యునివద్ద గావించిన సమ్యగ్విచారణచేతను సారాసారముల నెఱింగిన వివేకియొక్క ప్రబుద్ధచిత్తమున 'నశ్వరమగు దేహము నేనుగాను, పూర్ణానంద స్వప్రకాశైకరూపుడగు బ్రహ్మము మాత్రమగుదు'నను నిశ్చయము కలుగును. బ్రహ్మాకారవృత్తి గల్గియుండునట్టి యధికారిజీవుని దుఃఖమంతయు పూర్ణముగ నశించును. కమలములపై సూర్యకిరణములు ప్రసరింప, పుష్పదళసంకోచము, తుషారమాలిన్యము, అంధకారము సంపూర్ణముగ నశించును గదా!



ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
సుఖదుఃఖ భోక్తృత్వ కథనమను పంచదశోత్తర
శతతమ సర్గము ॥ 115 ॥

—:o:—

## షోడశాధికశతతమః సర్గః.

—:o:—

శ్రీ రామ ఉవాచ:—

రాజసూయఫలం ప్రాప్తం లవణేన కిల ప్రభో
ప్రమాణం కిమిహాత్ర స్యాత్కల్పనాజాలశంబరే. 1

శ్రీ రాముడు:— ఓ మునీంద్రా! ఇంద్రజాలికునిచే చూపబడిన చండాలత్వాది వివిధ కల్పనామయమగు మాయాజాలమే, లవణుని రాజసూయయజ్ఞ ఫలమనుటకేమి ప్రమాణము?

శ్రీ వసిష్ఠ ఉవాచ:—

యదా శాంబరికః కాలే సంప్రాప్తో లావణీం సభామ్
తదాఽహమవసం తత్ర తత్ప్రత్యక్షేణ దృష్టవాన్. 2

వసిష్ఠుడు:— ఓ రామా! ఆ యింద్రజాలికుడు లవణుని రాజసభయందు ప్రవేశించినపుడు నేనచటనే యుంటిని గాన నంతయును ప్రత్యక్షముగ నవలోకించితిని.

అహం సభ్యైస్తతస్తత్ర గతే శాంబరికర్మణి
కిమేతదితి యత్నేన పృష్టశ్చ లవణేన చ. 3

ఇంద్రజాలమంతయు సమాప్తమొనర్చి శాంబరికుడు వెడలిపోగా, అపుడు సభాసదులును, రాజగు లవణుడున్నూ యీ చిత్రమంతయు, నేమియో తెలుపుండని పలువిధముల నన్ను గోరిరి.

చింతయిత్వా మయా దృష్ట్వా తత్ర కత్థితం తతః
శృణు తత్తే ప్రవక్ష్యామి రామ శాంబరికే హితమ్. 4

ఓ రామా! అపుడు నేను చింతనయొనర్చి, యోగబలముచే నంతయు నెఱింగి, వారలకా వృత్తాంతమంతయును జెప్పితిని. ఆ శాంబరికుని యభిప్రాయమును నీకుఁ దెలియచేసెద వినుము.

రాజసూయస్య కర్తారో యే హి తే ద్వాదశాబ్దికమ్
ఆపద్దుఃఖం ప్రాప్నువంతి నానాకారవ్యథామయమ్. 5

రాజసూయయజ్ఞ మొనర్చువారలు పలువిధములగు యాపదలను, దుఃఖములను, పండ్రెండు వత్సరములవఱకును పొందుదురు.

అతః శక్రేణ గగనాద్దుఃఖాయ లవణస్య సః
ప్రహితో దేవదూతో హి రాజ్ఞః శాంబరికాకృతిః. 6

కావున ఓ రామా! రాజసూయయజ్ఞ మొనర్చిన నా లవణునకు దుఃఖము గలుగజేయు నిమిత్తము ఇంద్రుడాకసమునుండి దేవదూతను యింద్రజాలికరూపమున వానిచెంతకు బంపెను.

రాజసూయక్రియాకర్తు స్తస్య దత్వా మహాపదమ్
అగచ్ఛత్స నభోమార్గం సురసిద్ధనిషేవితమ్. 7

ఆ దేవదూత, రాజసూయయజ్ఞకర్తయగు లవణునకు అఱువది వత్సరముల † వఱకును గొప్ప యాపద గలుగజేసి, దేవతలచేతను సిద్ధులచేతను సేవింపబడుచు యాకాశమార్గమునఁజనెను.

తస్మాత్ప్రత్యక్షమేవైతద్రామ నాత్ర సందేహోఽస్తి మనో హి విలక్షణానాం క్రియాయాం కర్తృభోక్తృ చ తదేవ నిర్ఘృష్య సంశోధ్య చిత్తరత్నమిహ హిమకణమివాతపేన విలీనతాం వివేకేన నీత్వా పరం శ్రేయః ప్రాప్స్యసి. చిత్తమేవ సకలభూతాడంబరకారిణీమవిద్యాం విద్ధి విచిత్రకేంద్రజాలవశాదిదముత్పాదయతి అవిద్యాచిత్తజీవబుద్ధిశబ్దానాం భేదో నాస్తి వృక్షతరుశబ్దయోరివ. ఇతి జ్ఞాత్వా చిత్తమేవావికల్పనం కురు అభ్యుదితే చిత్తవైమలార్కబింబే సకలంకవికల్పోత్థదోషతిమిరాపహారణం న తదస్తి రాఘవ యన్న దృశ్యతే యన్నాత్మీక్రియతే యన్న పరిత్యజ్యతే యన్న మ్రియతే యన్నాత్మీయం యన్న పరకీయం సర్వం సర్వదా సర్వో భవతీతి పరమార్థః. 8

ఓ రామా! ఇదంతయును ప్రత్యక్షముగ జరిగియుండెను. కాన, దీనియందు సందేహమిసుమంతయును లేదు. మనస్సే విలక్షణములగు యీ క్రియలన్నింటియొక్క కర్తయు, భోక్తయు నగును. మనస్సను రత్నమును హఠయోగముచే ఘర్షణయొనర్చి, రాజయోగముచే సంశోధించి, సూర్యరశ్మియందు మంచుబిందువువలె, నిర్వికల్ప సమాధియందు విలయమొనర్చుము. అపుడే తత్వసాక్షాత్కారరూపమగు వివేకముచే మోక్షమను శ్రేయమును నీవు పొందగలవు. ఈ చిత్తమే జీవులందఱిని మోహపఱచు అవిద్యయని యెఱుంగుము. ఈ అవిద్యయే, విచిత్రమగు నింద్రజాలముచే యీ జగత్తంతయు నుత్పన్నము కావించుచున్నది. 'వృక్ష' 'తరు' శబ్దములవలె, అవిద్య, చిత్తము, జీవుడు, బుద్ధి మున్నగువానియందును భేదమేమియు లేదు. ఇట్లెఱింగినవాడవై, నీవు చిత్తమును సంకల్పరహితమొనర్చుము. చిత్తనైర్మల్యమను సూర్యుడుదయించుచో, అజ్ఞానాంధకారమంతయును నశించిపోవును. స్వచిత్తలయముచేతను లేక స్వావిద్యావినాశముచేతను, కేవలము నీయొక్క అవిద్యాకారమమాత్రము నివర్తించుననియు, సర్వులయదృష్టముచే నుత్పన్నమైన అవిద్యాకార్యమునకు కారణము నీ చిత్తాదులు కానందున అయ్యది నివర్తింపదనియు తలంపకుము. ఏలన, సర్వుల యదృష్టకార్యమును, ఉపభోగ్య పదార్థములును అవిద్యాకార్యమే యగును. కాన, సర్వాత్మకమగు స్వాత్మదర్శనముచే దర్శితమవనిదియు, ఆత్మవంతము గానిదియు, త్యజింపబడనిదియు, బాధితమవనిదియు, ఆత్మీయము గాని పరకీయముగాని కానిదియు నగు పదార్థమే యుండజాలదు. అట్టి స్వాత్మదర్శనముచే

† శారీరిక యజ్ఞముకంటె మానసికయజ్ఞమునకు అఱువదిరెట్లధిక సుఖదుఃఖములు గలుగును. కావున లవణుడు అఱువది (12 X 5) సంవత్సరములు దుఃఖముల ననుభవింపవలసివచ్చెను.



సకలయును యెల్లకాలములందును సర్వరూపమగు ఆత్మయే అయి వెలుగుచుండును. ఇదియే పరమార్థస్థితి.

భావరాశిస్తథా బోధః సర్వం యాత్యేకపిండతామ్
విచిత్రమృద్భాండగణో యథాఽపక్వో జలే స్థితః. 9

అపక్వములగు చిత్రవిచిత్రములైన మృణ్మయ పాత్రలన్నియు జలమందేకమగునట్లు, ఈదృశ్యప్రపంచమును, యందలిసర్వజీవులును, దృశ్యజ్ఞానమంతయును, బ్రహ్మైకత్వరూపమునే పొందును.

## శ్రీ రామ ఉవాచ :—

ఏవం మనః పరిక్షయే సకలసుఖదుఃఖానామంతః ప్రాప్యత ఇతి భవతా ప్రోక్తం తత్కథం మహాత్మంశ్చపలవృత్తిరూపస్యాస్య మనసోఽసత్తా భవతి. 10

శ్రీ రాముడు:—ఓ మునీంద్రా! మనస్సు నశించినచో, సుఖదుఃఖములన్నియును నశించునని తాము సెలవిచ్చియున్నారు. కాని, చంచల వృత్తిరూపమగు యీ మనస్సు బ్రహ్మసత్తయెట్లగును?

## శ్రీ వసిష్ఠ ఉవాచ :—

రఘుకులేందో శృణు మనః ప్రశమనే యుక్తిం యాం జ్ఞాత్వా స్వస్వాచారదూరే మనః సంస్థిరయమేష్యసి. 11

వసిష్ఠుడు:—రఘుకుల శ్రేష్ఠుడవగు ఓ రామా! మనోనాశమున కుపాయము వచించుచున్నాను, వినుము. దాని నెఱింగినచో బాహ్యోన్ముఖములగు ఇంద్రియవృత్తులేవియు లేనట్టి శుద్ధమగు బ్రహ్మమందు మనస్సునుజేర్చి, నీవు మనోలయమును ప్రాప్తినొందగలవు.

ఇహ హి తావద్బ్రహ్మణః సర్వభూతానాం త్రివిధోత్పత్తిరితి తత్పూర్వోక్తమ్. 12

ఈ బ్రహ్మాండమున సాత్త్వికరాజసతామస భేదములచే మూడువిధములగు జీవులు బ్రహ్మవలన సృష్టింపబడుచున్నారని నేను పూర్వము వచించియుంటిని.

తత్రేదం ప్రథమయా మనః కల్పనయా దేహీంతి సా బ్రహ్మరూపిణీ సంకల్పమయీ భూత్వా యదేవ సంకల్పయతి తదేవ పశ్యతి తేనేదం భువనాడంబరం కల్ప్యతే.

ఆ సృష్టియందు ప్రథమ హిరణ్యగర్భరూపమగు మనస్సు 'నేను చతుర్ముఖుండ నగుదును గాక' యని సంకల్పించెను. సత్యసంకల్పము గలవాడు కాన తన్నట్లే బ్రహ్మదేవుడు గాంచగలెను. ఆ చతుర్ముఖబ్రహ్మయే యీ సమస్తలోకములను కల్పన యొనర్చుచున్నాడు.

తత్ర జననమరణసుఖదుఃఖమోహాదికం సంసరణం కల్పయంతీ కల్పానురచనా బహునామ మంథరం స్థిత్వా స్వయం విలీయతే హిమకణికేవాతపగతా. 14

తన సమష్టిమనస్సున జననమరణ సుఖదుఃఖరూపమును సంసరణ శీలమునునగు సంసారమును కల్పించుచు, చతుర్ముఖుండగు బ్రహ్మ సహస్రకల్పపరిమితిగల దినములతోగూడిన తన ఆయువునందు, ఆయాప్రదేశముల కనుకూలమగు దేవాసురమనుష్యాది వివిధ జీవులను సృష్టించి, చిరకాలముండి, యటుపిదప శేషశాయియగు విష్ణుభగవానునియందు, తన కారణరూపమగు సూర్యతేజమందు

మంచుబొట్టు లీనమగునట్లు, లీనమగును. ఇట్లు సమష్టిరూపమగు మనస్సు లయించుటచే అస్మదాదుల మనంబులుకూడ లయించునని గ్రహింపవలెను.

కాలోదితః సంకల్పవశాత్పునరన్యతయా జాయతే సా పునర్విలీయతే పురనప్యుదేతి
సైవేతి భూయోభూయోఽనుసంసరంతీ స్వయముపశామ్యతి. 15

మరల, సృష్టికాలమున విష్ణుభగవానుని నాభికమలమునుండి యభివ్యక్తమై, పూర్వకాలపు సృష్టికల్పన మరల నుదయింప నా సమష్టి మనస్సు సృష్టియొనర్ప నిచ్ఛగించును. అపుడు మరల చతుర్ముఖరూపమును ధరించి జగద్రచనయంతయు గావించును. ఆ పిదప, కల్పాంతమున మరల లయమును పొందును. ఇవ్విధమున పలుమార్లు జగత్కల్పన యొనర్చుచు ద్విపరార్ధాంతమున, యధికార సమాప్తికాగా పూర్ణముగ శాంతినొందును.

ఇత్థమనంతా బ్రహ్మకోటయోఽస్మిన్ బ్రహ్మాండేఽన్యేషు చ సమతీతా భవిష్యం-
తీతి సంతి చేతరా అనంతా యాసాం సంఖ్యాఽపి న విద్యతే. 16

ఇట్లీబ్రహ్మాండమందును, తదితర బ్రహ్మాండములందును అనేక జగత్సమూహము లుత్పన్నమయియుండెను. ఇపుడును నుత్పన్నమగుచున్నవి. ఇంకను నుత్పన్నము కాగలవు. మఱియు నీ బ్రహ్మాండాంతర్గతమందలి యొక్కొక్క పరమాణువందును గూడ ఇంకను అసంఖ్యాకములగు జగత్తులు గలవు.

ఏవమస్యాం తాదృశి వర్తమానాయామీశ్వరాదాగత్య జీవో యథా జీవ్యతే
విముచ్యతే తచ్ఛృణు. 17

పూర్వోక్త విశేషణములుగల పరమాత్మయందు నెలకొనియున్న యీ సమష్టి మనంబున వ్యష్టిస్వరూపుడగు జీవుడెట్లు స్థితిగల్గియున్నాడు, యెట్లు ముక్తుడగునను విషయము నెఱింగించెద యాకర్ణింపుము.

బ్రహ్మణో మనః శక్తిరభ్యుదితా పురః స్థితాకాశశక్తిమవలంబ్య తత్రస్థ పవన-
తానుపాతినీ ఘనసంకల్పత్వం గచ్ఛతి. 18

ప్రళయకాలమున యుపాధులన్నియు లయింప, అవ్యాకృతమున లీనమైన జీవుల సంస్కారరూపమాత్రమున శేషించిన మనశ్శక్తి—ప్రథమమున అవ్యాకృతమునుండి శబ్దతన్మాత్రకమగు ఆకాశశక్తి యావిర్భవింప, యద్దానినవలంబించి పవనశక్త్యాత్మకమగు స్పర్శతన్మాత్రముదయింప — యందలి వాయుత్వము ననుసరించి కించిచ్చలనయోగ్యమగు రూపమునొంది, దృఢసంకల్పత్వమును ప్రాప్తినొందుచున్నది.

తతః పురః ప్రాప్తభూతతన్మాత్రపంచకతామేత్యాంతఃకరణతాం నీత్వా సా
త్వసూక్ష్మప్రకృతిర్భూత్వా గగనపవనతేజోరూపతాసంకల్పాత్ప్రాలేయరూ-
పతాముపేత్య శాల్యోషధిం విశంతీ ప్రాణినాం గర్భతాం చ గచ్ఛతి. 19

పిదప సమ్ముఖమునన్న రూపరసగంధతన్మాత్ర ఉత్పత్తిక్రమముచే, అపంచీకృత పంచభూతరూపమై యటుపిమ్మట మనోబుద్ధిచిత్తాహంకారరూపమగు యంతఃకరణదశ నొంది యా



పూర్వోక్తమగు మనశ్శక్తియే క్రమముగ వృద్ధిజెందుచు, పంచీకృత స్థూలపంచభూతప్రకృతియై, ఆకాశవాయ్వగ్నిజలపృథివీరూపములను కల్పనగొనర్చి, క్రమముగ హిమవర్షాదులద్వారా యోషధులందు ప్రవేశించినదై అన్నరూపమును జెందుచున్నది. అపుడయ్యది పురుషులచే భక్షింపబడి, వీర్యరూపమై, స్త్రీ గర్భమున ప్రవేశించి క్రమముగ గర్భత్వదశనొందుచున్నది.

జాయతే తస్మాత్తతః పురుషః సంపదత్యే. 20

పిదప గర్భమునుండి జనించినదై యధికసుకృతముండిన, కర్మజ్ఞానముల కధికారియగు పురుషుడై చెన్నొందును.

తేన పురుషేణ జాతమాత్రేణైవ బాల్యాత్ప్రభృతి విద్యాగ్రహణం కర్తవ్యం
గురవోఽనుగంతవ్యాః. 21

అట్లు జన్మించిన పురుషుడు బాల్యకాలమునుండియే విద్యాగ్రహణ మొనర్చుచు, తత్త్వవేత్తలగు గురువుల నాశ్రయింపవలెను.

తతః క్రమాత్స్వంసత్తవేవ చమత్కృతిర్జాయతే. 22

అపుడు వానియందు నీయందుదయించిన విధముననే క్రమముగ సాధనచతుష్టయసంపత్తియను చమత్కృతి యుదయించును.

స్వచ్ఛదృశా చిత్తవృత్తేః పురుషస్య హేయోపాదేయవిచార ఉత్పద్యతే. 23

ఆ పిదప పరిశుద్ధచిత్తుడగు నాతనికి, యనర్థభూతమగు నీ సంసారము త్యజింపదగినది, మోక్షమే గ్రహింపదగినదను విచారముత్పన్నమగును.

తాదృగ్వివేకవతి సంకలితాభిమానే పుంసి స్థితే విమలసత్త్వమయాగ్రజాతౌ
సప్తాత్మికావతరతి క్రమశః శివాయ చేతః ప్రకాశనకరీ నను యోగభూమిః. 24

ఇత్యార్షేవాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
సాధకజన్మావతారోనామ షోడశాధికశతతమః
సర్గః ॥ 116 ॥

ఇవ్విధమున వివేకసంపన్నుడై నిర్మలమును, సత్త్వగుణమయమునునగు బ్రాహ్మణాది యుత్తమజాతులందు స్థితినిబడసిన యాతనికి మోక్షశ్రేయమునకై, జ్ఞానముచే చిత్తమును ప్రకాశింపజేయు నీవచింపబోవు సప్తయోగ (జ్ఞాన) భూమికలును క్రమముగ సంపన్నమగును.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తి ప్రకరణమున
సాధకజన్మావతారమను షోడశాధికశతతమ
సర్గము ॥ 116 ॥

## సప్తదశాధికశతతమః సర్గః.

**శ్రీ రామ ఉవాచః—**

కీదృశ్యో భగవన్యోగ భూమికాః సప్తసిద్ధిదాః
సమాసేనేతి మే బ్రూహి సర్వతత్త్వవిదాం వర. 1

శ్రీరాముడు:—ఓ మహాత్మా! బ్రహ్మవిద్వరా! మోక్షసిద్ధిని జేకూర్చునట్టి సప్తజ్ఞాన భూమిక లెవ్వియో! సంగ్రహముగ దెలియజేయుము.

**శ్రీవసిష్ఠ ఉవాచః—**

అజ్ఞానభూః సప్తపదా జ్ఞభూః సప్తపదైవ హి
పదాంతరాణ్యసంఖ్యాని భవంత్యన్యాన్యథైతయోః. 2

వసిష్ఠుడు:—ఓ రామా! అజ్ఞాన భూమిక లేడును, జ్ఞానభూమిక లేడును గలవు. ఇంకను వీనికి అవాంతభేదము లెన్నియో గలవు.

స్వాయత్నసాధకరసాన్మహాసత్తాభరోన్నతేః
ఏతే ప్రతిపదం బద్ధమూలే సంఫలతః ఫలమ్. 3

స్వాభావిక ప్రవృత్తిరూపమగు పురుషయత్నము, విషయభోగములందు దృఢమగు నాసక్తి యను నీ రెండును అజ్ఞానభూమికాస్థితి కసాధారణ హేతువులు. అధిష్ఠానమగు బ్రహ్మసత్తకధీనమగు యాత్మలాభప్రాప్తి రెంటికిని సాధారణ హేతువగును. ఈ హేతువులచే నీ ద్వివిధభూమికలును క్రమముగ దృఢపడుచు తమకు యోగ్యమగు సంసారస్థితిని, దుఃఖమును, దుఃఖవిముక్తిరూపమగు నిరతిశయానందప్రాప్తియను ఫలమును గల్గింపజేయుచున్నవి. ఎట్లు అధోలోకము లేడును ఉత్తరోత్తరముగ నధిక దుఃఖమయములును, యూర్ధ్వలోకము లేడును అధిక సత్వ జ్ఞానమయములును నైయున్నవో అట్లే యీ ద్వివిధభూమికలనుగూర్చియును యెఱుంగుము.

తత్ర సప్తప్రకారాం త్వమజ్ఞానస్య భువం శృణు
తతః సప్తప్రకారాం త్వం శ్రోష్యసి జ్ఞానభూమికామ్. 4

ఓ రామా! ఈ రెంటిలో మొదట అజ్ఞానభూమికలనుగూర్చి వినుము. ఆ పిదప సప్తజ్ఞాన భూమికల నెఱింగించెదను.

స్వరూపావస్థితిర్ముక్తిస్తద్భ్రంశోఽహంత్వవేదనమ్
ఏతత్సంక్షేపతః ప్రోక్తం తజ్జ్ఞత్వాజ్ఞత్వలక్షణమ్. 5

శుద్ధమగు నాత్మస్వరూపమందు స్థితిఁబొందుటయే ముక్తి (జ్ఞానము). అట్టి స్వస్వరూపస్థితి నుండితొలగి బాహ్యవిషయ ప్రవృత్తిగల్గి, దేహాదులందహంభావనను పొందియుండుటయే అజ్ఞానము. ఇది దుఃఖహేతువగును. జ్ఞానాజ్ఞానభూమికల సంక్షిప్త లక్షణములివియే.

శుద్ధసన్మాత్రసంవిత్తేః స్వరూపాన్న చలంతి యే
రాగద్వేషాదియాభావా స్తేషాం నాజ్ఞత్వసంభవః. 6



రాగద్వేషము లుదయింపమిచే సద్వస్తువగు శుద్ధజ్ఞానస్వరూపమునుండి చలింపక యుండువా డజ్ఞానియగుట యెన్నటికిని తటస్థింపదు.

యత్స్వరూపపరిభ్రంశా చ్చేత్యార్థే చితిమజ్జనమ్
ఏతస్మాదపరో మోహో న భూతో న భవిష్యతి. 7

స్వస్వరూపమునుండి మరలి విషయములందు మగ్నమగుటయే అజ్ఞానము. దీనికి మించిన యజ్ఞానమేదియును యుండియుండలేదు, ఇక నుండబోదు.

అర్థాదర్థాంతరం చిత్తే యాతి మధ్యే హి యా స్థితిః
నిరస్తమననాయాసా స్వరూపస్థితిరుచ్యతే. 8

చిత్తమొక పదార్థమునుండి మఱియొక పదార్థముపైకి బోవునపుడు, మధ్యనుండు స్థితి అనగా మననరహితమగు (పూర్వవిషయమును మఱచి మఱియొకదానిని చింతించుటకు పూర్వమున్నట్టి) శుద్ధ చైతన్యముయొక్క స్థితియే స్వరూపస్థితి యనబడును.

సంశాంతసర్వసంకల్పా యాశిలాంతరివ స్థితిః
జాడ్యనిద్రావినిర్ముక్తా సా స్వరూపస్థితిః స్మృతా. 9

సర్వసంకల్పవర్జితమును, నిద్రా జడత్వరహితమును, శిలలవలె అచంచలమును నగు చైతన్య స్థితియే స్వరూపస్థితియని పేర్కొనబడును.

అహంతాంశే క్షతే శాంతే భేదే నిఃస్పందతాం గతే
అజడా యా ప్రకచతి తత్స్వరూపమితి స్థితమ్. 10

దేహాదులందలి యహంభావము నశింప, భేదజ్ఞానమంతయు సమసిపోవ, చైతన్యరూపమున ప్రకాశించునదే (ఆత్మ) స్వరూపమనబడును.

తతారోపితమజ్ఞానం తస్య భూమీరిమాః శృణు
బీజజాగ్రత్తథా జాగ్రన్మహాజాగ్రత్తథైవ చ. 11
జాగ్రత్స్వప్నస్తథా స్వప్నః స్వప్నజాగ్రత్సుషుప్తకమ్
ఇతి సప్తవిధో మోహః పునరేవ పరస్పరమ్. 12
శ్లిష్టో భవత్యనేకాఖ్యః శృణు లక్షణమస్య చ
ప్రథమే చేతనం యత్స్యాదనాఖ్యం నిర్మలం చితః. 13
భవిష్యచ్చిత్తజీవాది నామశబ్దార్థభాజనమ్
బీజరూపం స్థితం జాగ్రద్బీజజాగ్రత్తదుచ్యతే. 14

ఓ రామా! సాక్షిచైతన్యమునం దనాదికాలమునుండి యధ్యస్తమైన అజ్ఞానముయొక్క వివిధ భూమికలనుగూర్చి నీవువినుము — (1) బీజజాగ్రత్తు (2) జాగ్రత్తు (3) మహాజాగ్రత్తు (4) జాగ్రత్స్వప్నము (5) స్వప్నము (6) స్వప్నజాగ్రత్తు (7) సుషుప్తి — అను నీ యేడును అజ్ఞాన భూమికలగును. ఇయ్యవి పరస్పరము మిళితమై యనేకవిధములగుచున్నవి. ఓ రామా! ఇక నీవు వీని లక్షణములను వినుము. సృష్ట్యాదియందు (లేక జాగ్రదవస్థాప్రారంభమున) మాయావేష్టితమగు చేతన

వస్తువునుండి గల్గిన ప్రాణధారణాది క్రియలచే ముస్ముందు చిత్తము, జీవుడు, ఇత్యాది సంజ్ఞలచే పేర్కొనబడునదియు, జాగ్రదవస్థకు బీజభూతమునునగు ప్రథమచైతన్య (చిదాభాసస్వరూప) మే బీజజాగ్రత్తనబడును. అనగా జాగ్రదవస్థయొక్కయు, సుషుప్త్యంతముయొక్కయు అజ్ఞానోపహితమగు చైతన్యస్థితియే బీజజాగ్రత్తనబడును.

ఏషా జ్ఞప్తేర్నవావస్థా త్వం జాగ్రత్సంస్మృతిం శృణు
నవప్రసూతస్యపరాదయం చాహమిదం మమ. 15
ఇతి యః ప్రత్యయః స్వస్థస్తజ్జాగ్రత్ప్రాగభావనాత్
అయం సోఽహమిదం తన్మ ఇతి జన్మాంతరోదితః. 16

ఇయ్యది జ్ఞప్తియొక్క నూతనయవస్థయగును. ఓ రామా! ఇక నీవు జాగ్రత్స్థితినిగూర్చి వినుము. నవోత్పన్న బీజజాగ్రత్స్థితికి పూర్వము 'ఈ స్థూలదేహము నేను' 'ఈ భోగ్యపదార్థములు నావి' యనునట్టి ప్రతీతియే జాగ్రత్తనబడును. ఏలయన దీనియందు జీవునకు పూర్వకాలస్థితినిగూర్చిన భావన లేదు గదా! 'ఈ దేహమే నేను, దేహసంబంధములగు గృహధనాదులు నావి' యను నీ జాగ్రత్ప్రత్యయములు పూర్వజన్మపు దృఢసంస్కారములచే నుదయించును.

పీవరః ప్రత్యయః ప్రోక్తో మహాజాగ్రదితి స్ఫురన్
అరూఢమథవారూఢం సర్వథా తన్మయాత్మకమ్. 17
యజ్జాగ్రతో మనోరాజ్యం జాగ్రత్స్వప్నః స ఉచ్యతే
ద్విచంద్రశుక్తికారూప్య మృగతృష్ణాదిభేదతః. 18
అభ్యాసాత్ప్రాప్య జాగ్రత్త్వం స్వప్నోఽనేకవిధో భవేత్
అల్పకాలం మయా దృష్ట మేవం నో సత్యమిత్యపి. 19
నిద్రాకాలానుభూతేఽర్థే నిద్రాంతే ప్రత్యయో హి యః
న స్వప్నః కథితస్తస్య మహాజాగ్రత్స్థితేర్హృది. 20

ఈ జన్మమందుగాని, లేక పూర్వజన్మమందు గాని గావింపబడిన యభ్యాసముచే దృఢపడిన సంస్కారములచే స్ఫురించు జాగ్రత్స్థిత్యనుభవమే మహాజాగ్రత్తనబడును. అభ్యాసాభావముచేగాని, అదృఢాభ్యాసముచే గాని (లవణుడు పూర్ణముగ తన్మయుండైనట్లు) గల్గు జాగ్రత్స్థితియందలి మనోరాజ్యమే జాగ్రత్స్వప్నమనఁబడును. ద్విచంద్రదర్శన, శుక్తికారజతత్వ, మృగతృష్ణాదులీజాగ్రత్స్వప్నభూమికయొక్క భేదములు. స్వప్నమందు పలువిధములుగనున్నను అభ్యాసముచే నీస్థితి క్రమముగ జాగ్రద్దశనొందును గాన నియ్యది జాగ్రత్స్వప్న మనఁబడినది. నిద్రామధ్యమునగాని, నిద్రాంతమునగాని, నిద్రయందుగాని యనుభవించిన పదార్థమునుగూర్చి, 'నేను దానిని స్వల్పకాలము మాత్రము గాంచితిని, కాని అయ్యది అసత్యముగాదు' అను నీ యనుభవమునకు హేతువగునదియే స్వప్నమనఁబడును. అయ్యది, మహాజాగ్రత్స్థితియందున్న యజ్ఞుని స్థూలశరీరమందలి కంఠభాగమునుండి హృదయమువఱకును వ్యాపించిన నాడీప్రదేశమున గల్గును.

చిరసందర్శనాభావాదప్రఫుల్లబృహద్వపుః
స్వప్నో జాగ్రత్తయారూఢో మహాజాగ్రత్పదంగతః. 21



అక్షతే వా క్షతే దేహే స్వప్నజాగ్రన్మతం హి తత్
షడవస్థాపరిత్యాగే జడాజీవస్య యా స్థితిః. 22
భవిష్యద్దుఃఖబోధాఢ్యా సౌషుప్తీ సోచ్యతే గతిః
ఏతే తస్యామవస్థాయాం తృణలోష్టశిలాదయః. 23
పదార్థాః సంస్థితాః సర్వే పరమాణుప్రమాణినః
సప్తావస్థా ఇతి ప్రోక్తా మయాఽజ్ఞానస్య రాఘవ. 24

చిరజాగ్రదభావముచే అవికసితమును, మహచ్ఛరీరయుతమును, దృఢాభిమానముచేగాని, చిరకాలస్థాయిత్వకల్పనచే (హరిశ్చంద్రున కొకరాత్రి పండ్రెండు వత్సరములుగ తోచినట్లు) గాని జాగ్రద్రూపముగ వృద్ధినొందినదియు, మహాజాగ్రత్స్థితిని బడసినట్టిదియునగు స్వప్నము, స్వప్నజాగ్రత్తని నుడువఁదగును. ఇయ్యది దేహము నశించినను, నశింపకున్ననుగూడ కలుగును. పైన దెల్పిన ఆఱవ అవస్థను బొందిన జీవునియొక్క జడత్వస్థితి, భావికాలమున దుఃఖమును గలుగజేయు వాసనలచే పూర్ణమైయుండి సుషుప్తి యనంబడును. ఈ యవస్థయందు తృణ, లోష్ట, శిలాది పరమాణుమయ వస్తువులవలె జీవుడు జడరూపమున నుండును. ఓ రామా! ఇవ్విధమున సప్తప్రకారంబులగు అజ్ఞానభూమికలను నీకుఁ దెలియజేసితిని.

ఏకైకా శతశాఖాఽత్ర నానావిభవరూపిణీ
జాగ్రత్స్వప్నశ్చిరం రూఢో జాగ్రత్తామేవ గచ్ఛతి. 25

పలువిధరూపములు గల్గియున్న వీనిలో మరల నొక్కొక్కటి యనంతశాఖలుగలదై యుండును. చిరకాలము రూఢిఁజెందిన జాగ్రత్స్వప్నము జాగ్రదవస్థయందే పరిసమాప్తిని బొందును.

నానాపదార్థభేదేన నవికాసం విజృంభతే
అస్యామప్యుదరే సంతి మహాజాగ్రద్దశాదృశః. 26

నానాప్రకారములగు పదార్థముల విభేదముతోకూడి జాగ్రత్స్వప్నము విశాలరూపమును ధరించుచున్నది. ఇట్లు జాగ్రద్దశనుపొందిన జాగ్రత్స్వప్నావస్థయందును గూడ మహాజాగ్రత్తుయొక్క అసంఖ్యాకములగు యనుభవములు స్థితిఁబొందియుండును.

తాసామవ్యంతరే లోకో మోహాన్మోహాంతరం వ్రజేత్
అంతఃపాతిజలావర్త ఇవ ధావతి సౌభ్రమమ్. 27

ఈ మహాజాగ్రదాద్యవస్థలందు గూడ, నదీజలయావర్తములఁ దగుల్కొనిన నౌకవలె, జీవుఁడొక భ్రమనుండి మఱియొక భ్రమను పొందుచుండును.

కాశ్చిత్సంస్మృతయో దీర్ఘం స్వప్నజాగ్రత్తయా స్థితాః
కాశ్చిత్పునః స్వప్నజాగ్రజ్జాగ్రత్స్వప్నాస్తథేతరాః. 28

సంసారము దీర్ఘకాలపర్యంతము స్వప్నజాగ్రద్రూపముననే నుండును. జీవులలో కొందఱు స్వప్నజాగ్రత్తునందు స్వప్నజాగ్రద్రూపమున నుందురు. మఱికొందఱు జాగ్రత్స్వప్నరూపమును బొందియుందురు.

అజ్ఞానభూమిరితి సప్తపదా మయోక్తా నానావికారజగదంతరభేదహీనా
అస్యాః సముత్తరసి చారువిచారణాభిర్దృష్టే ప్రబోధవిమలే స్వయమాత్మనీతి. 29

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
అజ్ఞానభూమికావర్ణనంనామ సప్తదశాధిక
శతతమః సర్గః ॥ 117 ॥

ఓ రామా! పలువిధ యవాంతర భేదములచే నింద్యములగు యీ సప్తయజ్ఞానభూమికలను నీ కిపుడు జెప్పితిని. ఉత్తమవిచారణచేతను జ్ఞానముచేతను నిర్మలమగు ఆత్మస్వరూపమును సాక్షాత్కరించుకొనినచో నిక ఈ అజ్ఞానభూమిక లన్నింటిని దాటితివనియే యెఱుంగుము.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తి ప్రకరణమున
అజ్ఞానభూమికావర్ణనమను సప్తదశాధికశతతమ
సర్గము ॥ 117 ॥

---

## అష్టాదశోత్తరశతతమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఇమాం సప్తపదాం జ్ఞానభూమిమాకర్ణయానఘ
నానయాజ్ఞాతయా భూయో మోహపంకే నిమజ్జసి. 1

వసిష్ఠుడు:—పాపరహితుఁడవగు నో రామా! ఇకనీవు సప్తజ్ఞాన భూమికలఁగూర్చి వినుము. వీని నెఱింగుచో మరల నీ వజ్ఞాన పంకమున బడనేరవు.

వదంతి బహుభేదేన వాదినో యోగభూమికాః
మమ త్వభిమతా నూనమిమా ఏవ శుభప్రదాః. 2

భిన్నభిన్న మతవాదు లీజ్ఞానభూమికలను పలువిధముల వర్ణించుచుందురు కాని, సిద్ధిప్రదములగు నివి (యీ క్రింద తెలుపబడినవి) యే (వేదాంతసిద్ధాంతము ననుసరించి) నాకు ప్రియములగును.

అవబోధం విదుర్జ్ఞానం తదితం సప్తభూమికమ్
ముక్తిస్తు జ్ఞేయమిత్యుక్తం భూమికా సప్తకాత్పరమ్. 3

అఖండమగు స్వాత్మాకారవృత్తియం దారూఢమగు బ్రహ్మము అజ్ఞాననివర్తక మగుటఁజేసి యీ సప్తభూమికలే జ్ఞానమున్ను, వానికి పరమగు ముక్తి జ్ఞేయమున్ను నగును.

సత్యావబోధో మోక్షశ్చైవేతి పర్యాయనామనీ
సత్యావబోధో జీవోఽయం నేహ భూయః ప్రరోహతి. 4



సత్యస్వరూపుఁడగు పరమాత్మనుగూర్చిన జ్ఞానము, మోక్షము — ఈ రెండును పర్యాయవాచకములేయగును. అట్టి సత్యవస్తుజ్ఞానము నెవడు పొందునో యాతడీసంసారమున మరల జన్మింపడు.

జ్ఞానభూమిః శుభేచ్ఛాఖ్యా ప్రథమా సముదాహృతా
విచారణా ద్వితీయా తు తృతీయా తనుమానసా. 5
సత్త్వాపత్తిశ్చతుర్థీ స్యాత్తతోఽసంసక్తినామికా
పదార్థాభావనీ షష్ఠీ సప్తమీ తుర్యగా స్మృతా. 6

ఆత్మజ్ఞానముయొక్క ప్రథమభూమిక శుభేచ్ఛయనఁబడును. రెండవది విచారణ; మూడవది తనుమానస; నాల్గవది సత్త్వాపత్తి; ఐదవది అసంసక్తి; ఆఱవది పదార్థాభావని; ఏడవది తుర్యగ,

ఆసామంతే స్థితా ముక్తిస్తస్యాం భూయో న శోచ్యతే
ఏతాసాం భూమికానాం త్వమిదం నిర్వచనం శృణు. 7

ఈ సప్తభూమికల యంతమున ముక్తిస్థితమైయున్నది. అద్దానిని బొందినచో నిక జీవుడు దుఃఖమును పొందనేరడు. ఓ రామా! ఇక నీభూమికల లక్షణములను వినుము.

స్థితః కిం మూఢ ఏవాస్మి ప్రేక్ష్యోఽహం శాస్త్రసజ్జనైః
వైరాగ్యపూర్వమిచ్ఛేతి శుభేచ్ఛేత్యుచ్యతే బుధైః. 8

'ఇంకను మూఢునివలె యుండనేల? శాస్త్రములఁబరికించెద; సజ్జనులగు మహాత్ముల దర్శించెద—' యను నిట్టివైరాగ్యపూర్వకమగు సత్సంకల్పమే శుభేచ్ఛయని విజ్ఞులు బల్కుదురు.

శాస్త్రసజ్జనసంపర్కవైరాగ్యాభ్యాసపూర్వకమ్
సదాచారప్రవృత్తిర్యా ప్రోచ్యతే సా విచారణా. 9

శాస్త్ర సజ్జనసంపర్కముచే వైరాగ్యమందును, అభ్యాసపూర్వకముగ నొనర్పబడు (శ్రవణ మననాదిరూపమగు) సదాచారమందును గల్గు ప్రవృత్తియే విచారణయనబడును.

విచారణా శుభేచ్ఛాభ్యామింద్రియార్థేష్వసక్తతా
యాత్రసాతనుతాభావాత్ప్రోచ్యతే తనుమానసా. 10

విచారణ శుభేచ్ఛలచే గల్గుశబ్దస్పర్శాదులందలి యనాసక్తియే, నిదిధ్యాసనారూపమగుటచే తనుమానస యనఁబడుచున్నది.

భూమికాత్రితయాభ్యాసాచ్చిత్తేఽర్థే విరతేర్వశాత్
సత్యాత్మని స్థితిః శుద్ధే సత్త్వాపత్తిరుదాహృతా. 11

పై మూడు భూమికలను అభ్యసించుచురాగా, బాహ్యవిషయములనుండి చిత్తము మఱలి విరామముఁజెంద, అట్టి విరతి స్థైర్యముచే మాయయు, అద్దాని కార్యరూపమగు అవస్థాత్రయ బంధమును (త్రిపుటీవిలయముచే) తొలఁగ, సర్వాధిష్ఠాన సన్మాత్రరూపమగు ఆత్మయందు స్థితిగల్గియుండుటయే సత్త్వాపత్తియనఁబడును. (సత్వమగు ఆత్మయందు స్థిరుడైయుండుటఁబట్టి నిది సత్త్వాపత్తి యనఁ

బడినది. ఇయ్యది నిర్వికల్ప సమాధిరూపమగును. ఈ భూమికయందుండు వివేకి బ్రహ్మవిత్తని పేర్కొనబడును.)

దశా చతుష్టయాభ్యాసా దసంసంగఫలేన చ
రూఢసత్త్వచమత్కారాత్ ప్రోక్తాఽసంసక్తినామికా. 12

ఈ నాల్గు భూమికలను లెస్సగ నభ్యసించుటచేత బాహ్యాభ్యంతర విషయములచే గాని, తద్గత సంస్కారములచే గాని స్పృశింపబడకయుండ, అసంగరూపమగు సమాధిపరిపాకముచే వృద్ధినొందిన నిరతిశయానందరూపమగు బ్రహ్మాత్మభావనగల, అనగా ఆత్మసాక్షాత్కారము గల్గియుండు నటిస్థితియే అసంసక్తియని చెప్పబడును. (ఈ భూమికయందుండు జ్ఞాని బ్రహ్మవిద్వరుడనబడును.)

భూమికాపంచకాభ్యాసా త్స్వాత్మారామతయా దృఢమ్
అభ్యంతరాణాం బాహ్యానాం పదార్థానామభావనాత్. 13
పరప్రయుక్తేన చిరం ప్రయత్నేనార్థభావనాత్
పదార్థాభావనానామ్నీ షష్ఠీ సంజాయతే గతిః. 14

ఈ యైదుభూమికలను బాగుగ నభ్యసించుటచే యుపరతిగల్గి సదా ఆత్మారాముడై, బాహ్యాభ్యంతర పదార్థములేవియును భావింపక, దేహయాత్రకొఱకు మాత్రము, పరప్రయత్నముచే ప్రబోధితుడై ఆయాపదార్థములగూర్చి యించుక భావించు యవస్థ ఆఱవదగు పదార్థాభావన యనఁబడును. ఏలయన, దీనియందు జ్ఞానికి పదార్థములగూర్చిన రాగయుక్తమగు భావనయుండనేరదు. ఈ భూమికయందు ప్రతిష్ఠితుడగు జ్ఞాని బ్రహ్మవిద్వరీయుడని యెన్నబడును.

భూమిషట్కచిరాభ్యాసా ద్భేదస్యానుపలంభతః
యత్స్వభావైకనిష్ఠత్వం సా జ్ఞేయా తుర్యగా గతిః. 15

ఈ యాఱవ భూమికనే చిరకాలమభ్యసించుటచే భేదభావమంతయు సమసిపోవ, కేవలము స్వస్వరూపమందు స్థితిని బడయుటచే యేడవదగు తుర్యగయను భూమికయగును. ఇట్లు జాగ్రదాది త్రివిధయవస్థలనుండి విముక్తుడై కేవలము, శివము, అద్వైతమునగు తురీయస్థితియందు నిలుకడజెంది యుండు జ్ఞాని బ్రహ్మవిద్వరిష్ఠుఁడనబడును.

ఏషా హి జీవన్ముక్తేషు తుర్యావస్థేహ విద్యతే
విదేహముక్తివిషయ స్తుర్యాతీమతః పరమ్. 16

ఓ రామా! ఈ తురీయస్థితి జీవన్ముక్తులకే సిద్ధించును. విదేహముక్తికి సంబంధించినదగు తురీయాతీతస్థితి దీనికిని పరమై యొప్పును.

యే హి రామ మహాభాగాః సప్తమీం భూమికాం గతాః
ఆత్మారామా మహాత్మాన స్తే మహత్పదమాగతాః. 17

ఓ రామా! ఏ మహాత్ములీ యేడవభూమికను పొందుదురో, వారాత్మారాములనఁబడుదురు. అట్టివారు బ్రహ్మరూపమగు మహాత్పదమును ప్రాప్తినొందిరనియే యెఱుంగుము.



జీవన్ముక్తా న పజ్జంతి సుఖదుఃఖరసస్థితౌ
ప్రకృతేనార్థకార్యాణి కించిత్కుర్వంతి వా న వా. 18

జీవన్ముక్తులగు మహాత్ములు సుఖదుఃఖములచే చలింపక సమస్థితియందే యుందురు. ఈ యేడవ భూమికయందుండువారు తమ దేహరక్షణకొఱకై కార్యములఁజేయుదురు; లేక, చేయకయు నుందురు.

పార్శ్వస్థబోధితాః సంతః సర్వాచారక్రమాగతమ్
ఆచారమాచరంత్యేవ సుప్తబుద్ధవదక్షతమ్. 19

సమీపస్థులగువారి ప్రబోధముచే నట్టివారు పరంపరాగత వర్ణాశ్రమోచిత కార్యములను అనాసక్తులై పూర్ణముగ నాచరింతురు.

ఆత్మారామతయా తాంస్తు సుఖయంతి న కాశ్చన
జగత్క్రియాః సుసంసుప్తాన్ రూపాలోకాః స్త్రియో యథా. 20

సౌందర్యాధిక్యముచే శోభించు లలనలు గాఢనిద్రయందున్న పురుషునకు సుఖము గలుగ జేయజాలనట్లు, సదా యాత్మారాములై యుండు జీవన్ముక్తులకు ప్రపంచమందలి క్రియలేవియును సుఖమును గల్గుగజేయజాలవు.

భూమికాసప్తకం చైతద్ధీమతామేవ గోచరః
న పశుస్థావరాదీనాం న చ మ్లేచ్ఛాదిచేతసామ్. 21

ఈ యేడుభూమికలును ధీమంతులకొఱకే యగునుగాని పశుస్థావరమ్లేచ్ఛాదులవంటి దేహాత్మబుద్ధి గలవారలకు గానేరవు.

ప్రాప్తా జ్ఞానదశామేతాం పశుమ్లేచ్ఛాదయోఽపి యే
సదేహా వాప్యదేహా వా తే ముక్తా నాత్ర సంశయః. 22

పశుమ్లేచ్ఛాదులైనప్పటికిని, యిట్టి జ్ఞానదశను పొందుచో దేహసహితులైయున్నను దేహరహితులై యున్నను, ముక్తులే యగుదురు. ఇందేమియు సంశయములేదు. (ఆంజనేయులు, ప్రహ్లాదుడు మున్నగువారు ముక్తులగుటయే యిందులకు తార్కాణము.)

జ్ఞప్తిర్హి గ్రంథివిచ్ఛేద స్తస్మిన్సతి హి ముక్తతా
మృగతృష్ణాంబుబుద్ధ్యాది శాంతిమాత్రాత్మక స్త్వసౌ. 23

విషయరాహిత్యము, విద్యాగ్రంథివిచ్ఛేదనము జ్ఞానమగును. అది గల్గినచో నిక ముక్తికరతలామలకమై యుండును. అట్టి జ్ఞానముగలవాడు మృగతృష్ణయందు జలబుద్ధియు, శుక్తియందు రజతత్వబుద్ధియు నశించినవాని తెఱఁగున నుండును. అనగా, జ్ఞానికి సాంసారికవస్తుసముదాయమంతయును మృగతృష్ణవలె మిథ్యారూపముగ గోచరించునని భావము.

యే తు మోహాత్సముత్తీర్ణా న ప్రాప్తాః పావనం పదమ్
ఆస్థితా భూమికాస్వాసు స్వాత్మలాభపరాయణాః. 24

మోహము నతిక్రమించినవారును, కాని పరమపవిత్రమును నిరతిశయానందస్వరూపమునగు

విదేహకైవల్యమును పొందకయున్నవారును†, వారివారి భూమికలందున్నవారై ఆత్మారాములై యుందురు.

సర్వభూమిగతాః కేచిత్కేచిద్ద్వైత్రైకభూమికాః
భూమిషట్కగతాః కేచిత్కేచిత్సప్తైకభూమికాః. 25
భూమిత్రయగతాః కేచిత్కేచిదంత్యాం భువంగతాః
భూచతుష్టయగాః కేచిత్కేచిద్భూమిద్వయే స్థితాః. 26
భూమ్యంశభాజనాః కేచిత్కేచిత్సార్ధత్రిభూమికాః
కేచిత్సార్ధచతుర్భాగాః సార్ధషడ్భూమికాః పరే. 27

కొందఱు మహాత్ములీ భూమికలన్నింటిని ఒకేజన్మమున పొందగల్గి యుందురు. మఱికొందఱు రెండవ భూమికవఱకుగాని మూడవ భూమికవఱకుగాని రాగల్గియుందురు. కొందఱు, యాఱవభూమికను జేరుదురు. సనకాదులవంటి మఱికొందఱు మహనీయులు ప్రథమముననే సప్తమ భూమికయగు తుర్యగను పొందుదురు. కొందఱు మూఁడు భూమికలవఱకు వత్తురు. కొందఱు అంతిమమగు యేడవభూమికను పొందగల్గియుందురు. మఱికొందఱు నాల్గవభూమికవఱకు వత్తురు. కొందఱు రెండవదానియందే యుందురు. కొందఱర్ధభూమికను, కొందఱు నాల్గవవంతుభూమికను, మఱికొందఱు మూడున్నర, నాల్గున్నర లేక ఆఱున్నర భూమికలను పొందగల్గియుందురు.

వివేకినో నరా లోకే చరంత ఇతి భూమిషు
గ్రహాయతనతాపస్య దృశావేశేషు సంస్థితాః. 28

వివేకులీ భూమికలందు సంచరించుచు, విశాలమగు ఆత్మదృష్టిగల్గి బాహ్యాభ్యంతర యింద్రియములను, తద్గతవిషయములను, వాని కాధారభూతమగు శరీరమును తత్సంబంధములగు ఆధ్యాత్మికాది తాపములను నివారింపఁజేయునదైన ఆత్మనిష్ఠయందే నిమగ్నులై యుందురు.

తే హి ధీరాః సురాజానో దశాస్వాసు జయంతి యే
తృణాయ తేఽత్ర దిగ్దంతిఘటాభటపరాజయః. 29

ఎవరీ భూమికలనుపొంది మనస్సను శత్రువును జయింతురో వారే సర్వోత్తములగు నృపతు లనఁదగుదురు. అష్టదిగ్గజములును, సమస్తశత్రువుల పరాజయమును, సప్తద్వీప సామ్రాజ్యమును, ఆత్మప్రాప్తిని పొందినవానికి తృణప్రాయముగ నుండును.

ఏతాసు భూమిషు జయంతి హి యే మహాంతో
వంద్యాస్త ఏవ హి జితేంద్రియశత్రవస్తే
సమ్రాడ్విరాడపి చ యత్ర తృణాయ తే వై
తస్మాత్పరం జగతి తే సమవాప్నువంతి. 30

† ద్వితీయభూమిక మొదలుకొని చతుర్థభూమికవఱకు గల భూమికలందున్నవారలకు జ్ఞానోదయముచే అజ్ఞానము శమించినను, ప్రబల ప్రారబ్ధవిశేషముచే నిరతిశయమగు పూర్ణానందమును పొందక యుందురు.



ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
జ్ఞానభూమికోపదేశో నామాష్టాదశోత్తర
శతతమః సర్గః ॥ 118 ॥

ఓ రామా! ఈ యేడుభూమికలను పొందినట్టి మహాత్ములు వందనీయులగుదురు. ఏల యనిన, వారు తమ యింద్రియములను శత్రువులను జయించినవారై యుందురు. సమస్తభూమిక యందుండువారికి భూమండలాధిపతియు, బ్రహ్మయుగూడ తృణప్రాయమగును. ఏలయనగా దేవతల యానందమునకు పరమావధియగు బ్రహ్మదేవుని యానందముకంటె పరమగు విదేహకైవల్యానందమును వారీలోకముననే పొందగల్గియుందురు.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
జ్ఞానభూమికోపదేశమను అష్టాదశోత్తరశతతమ
సర్గము ॥ 118 ॥

## ఏకోనవింశత్యుత్తర శతతమః సర్గః.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

ఊర్మికాసంవిదా హేమ యథా విస్మృత్య హేమతామ్
విరౌతి నాహం హేమేతి తథాత్మాహంతయానయా. 1

శ్రీ వసిష్ఠుడు:— ఓ రామా! సువర్ణము తనయందు కల్పింపబడిన యంగుళీయకమును గూర్చిన బుద్ధిగలదై, తన సహజసువర్ణత్వమును మైమరచి 'నేను సువర్ణముకా'నని యేడ్చు తెఱగున, అహంకారముచే ఆత్మ తన యథార్థరూపమును విస్మరించి దుఃఖించుచున్నది.

శ్రీ రామ ఉవాచః—

ఊర్మికాసంవిదుదయః కథం హేమ్నో యథా మునే
అహంతాచాత్మన ఇతి యథావద్బ్రూహి మే ప్రభో. 2

శ్రీ రాముడు:— ఓ మునీంద్రా! సువర్ణమందంగుళీయకత్వబుద్ధి గల్గునట్లు ఆత్మయందు అహంభావబుద్ధి గలుగుచున్నదను విషయమును యథారీతి నాకుఁ దెలియజేయుము.

శ్రీ వసిష్ఠ ఉవాచః—

సత ఏవాగమాపాయౌ ప్రవృత్త్యా నాసతః సతా
అహంత్వమూర్మికాత్వం చ సతీ తు న కదాచన. 3

శ్రీ వసిష్ఠుడు:— ఓ రామా! ఉనికిగల పదార్థముయొక్క ఉత్పత్తి నాశములగూర్చి ప్రశ్నింపవలెనుగాని అసత్తగు పదార్థమునుగూర్చి కాదు. అహంకారమునకుగాని, సువర్ణమందలి యంగుళీయకమునకు గాని యునికి యేకాలమునందుగూడ లేదు.

యన్నాస్తి తస్య నాస్తిత్వం ప్రేక్ష్యమాణం ప్రకాశతే
అప్రేక్ష్యమాణం స్ఫురతి మృగతృష్ణాస్వివాంబుధిః. 11

ఏ పదార్థము యథార్థముగ లేదో, అట్టిదానిలేమి తత్త్వవిచారముచే గన్పట్టును, కాని, విచారాభావముచే నయ్యది శుక్తియందలి రజతమువలెను, మృగతృష్ణయందలి జలమువలెను మిథ్యారూపమున స్ఫురించును.

అసదేవ చ సత్కార్యకరం భవతి చ స్థిరమ్
బాలానాం మరణాయైవ వేతాలభ్రాంతిసంభ్రమః. 12

బేతాలము లేకున్నను, అద్దానికల్పన బాలురను వధించుటయందు సమర్థమగునట్లు, అసత్తయినను పదార్థము స్థిరరూపమున కార్యవంతము కాగలదు.

హేమతాం వర్జయిత్వైకాం విద్యతే హేమ్ని నేతరత్
ఊర్మికాకటకాదిత్వం తైలాదిసికతాస్వివ. 13

ఇసుక మొదలగు పదార్థములందు తైలాదులుండనట్లు, సువర్ణమందు సువర్ణముగాక అన్యమగు అంగుళీయక, కటకాదులేవియును లేవు.

నేహాస్తి సత్యం నో మిథ్యా యద్యథా ప్రతిభాస్యతే
తత్తదర్థక్రియాకారి బాలయక్షవికారవత్. 14

ఈ ప్రపంచమున సత్యవస్తువుయొక్కగాని, మిథ్యావస్తువుయొక్కగాని అర్థక్రియాకారిత్వమందు నియమమేదియును లేదు. కాని యే పదార్థము అధిష్ఠానమగు సత్తయందెట్లారోపింపబడునో, దాని ప్రతిభాసమున్నూ బాలునికి బేతాలుని యాకారమువలె, అయా అర్థక్రియ నొనర్చుచున్నది.

సద్వా భవత్వసద్వాపి సురూఢం హృదయే హి యత్
తత్తదర్థక్రియాకారి విషస్యేవామృతక్రియా. 15

అమృతభావన విషమమృతమగునట్లు, సత్యమైనను మిథ్యయైనను, ఏ యే పదార్థమెట్లు హృదయమందారూఢమైయుండునో, అయ్యదట్లే అర్థక్రియాకారకమగును.

పరమాత్మైవ సాఽవిద్యా మాయైషా సంసృతిర్హ్యసౌ
అసతో నిష్ప్రతిష్ఠస్య యదహంత్వస్య భావనమ్. 16

మహాచ్ఛక్తియుతమగు నీ యవిద్యయే మాయయు, సంసారము నగును. ప్రతిష్ఠారహితమును, అసత్తును నగు అనాత్మయం దహంభావము దీనివలననే జీవునకు గల్గుచున్నది.

హేమ్న్యస్తి నోర్మికాదిత్వ మహంతాద్యస్తి నాత్మని
అహంతాభావవత్త్వేవం స్వచ్ఛే శాంతే సితే పరే. 17

సువర్ణమం దంగుళీయకాదులు లేనిచందమున ఆత్మయం దహంకారాదులున్ను లేవు. ఏలయనగా స్వచ్ఛమును, శాంతమును, నిర్మలము నగు పరబ్రహ్మమం దహంకారము అసత్తేయగును కాని యథార్థము కానేరదు గదా ?

న సనాతనతా కాచిన్న చ కాచిద్విరించితా
న చ బ్రహ్మాండతా కాచిన్న చ కాచిత్సుతాదితా. 18
న లోకాంతరతా కాచిన్న చ స్వర్గాదితా క్వచిత్
న మేరుతా నాసురతా న మనస్త్వం న దేహతా. 19
న మహాభూతతా కాచిన్న చ కారణతా క్వచిత్
న చ త్రికాలకలనా న భావాభావవస్తుతా. 20
త్వత్తాహంతాత్మతాతత్తా సత్తాసత్తా న కాచన
న క్వచిద్భేదకలనా న భావో న చ రంజనా. 21

ఓ రామా! సనాతనత్వముగాని, బ్రహ్మత్వముగాని, బ్రహ్మాండముగాని, ప్రజాపతిత్వముగాని యథార్థముగ లేవు. అన్యలోకములుగాని, స్వర్గాదులుగాని, సుమేరుత్వముగాని, అసురత్వముగాని, మనస్సుగాని, సత్వముగాని, దేహత్వముగాని, మహాభూతములుగాని, కారణత్వముగాని, త్రిలోకకల్పనగాని, వస్తుగతమగు భావాభావత్వముగాని, 'నీవు, నేను, నాది' యను కల్పనగాని, సదసత్తులుగాని, భేదకల్పనగాని, రాగముగాని, ఆసక్తిగాని పరమార్థమున లేవని యెఱుంగుము.

సర్వం శాంతం నిరాలంబం జగత్త్వం శాశ్వతం శివమ్
అనామయమనాభాస మనామకమకారణమ్. 22

న సన్నాసన్న మధ్యాంతం న సర్వం సర్వమేవ చ
మనోవచోభిరగ్రాహ్యం శూన్యాచ్ఛూన్యం సుఖాత్సుఖం. 23

శాంతమును, అధిష్ఠానమును, సత్తామాత్రస్వరూపమును, నిత్యమును, శివమును, నిరామయమును, ఆభాసవర్జితమును, నామరహితమును, కారణవర్జితమును, ఆద్యంతమధ్యములుగాని ఉత్పత్తి వినాశాది వికారములుగాని లేనిదియు, మనస్సునకును వాక్కునకును విషయముగానిదియు, ఏదియు కానిదైనను అంతయు తానైనదియు, ఆకాశముకంటె నతిసూక్ష్మమును, సుఖములన్నింటికి నెక్కుడు సుఖమునునగు బ్రహ్మమే ఈ జగత్తంతటియొక్కయు పారమార్థిక స్వరూపమైయున్నది.

శ్రీ రామ ఉవాచ :—

అవబుద్ధం సమం బ్రహ్మ సర్వమేవ మయాఽధునా
తథాపి భూయః కథయ సర్గః కిమివలోక్యతే. 24

శ్రీ రాముడు:— ఓ మునీంద్రా! అంతటను సమరూపముగ వ్యాపించియున్న బ్రహ్మమును నేనిప్పుడెఱింగితిని. కాని నామరూపాత్మకమగు యీ జగత్తునకు హేతువగు అజ్ఞానము జ్ఞానముచే శమించినను, మరల ఈ జగత్తేల దృగ్గోచరమగుచున్నది?

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

పరేశాంతే పరం నామ స్థితమిత్థమిదంతయా
నేహ సర్గో న సర్గాఖ్యా కాచిదస్తి కదాచన. 25



శ్రీ వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! పరబ్రహ్మము తన రూపముననే యెల్లప్పుడున్న వాడై యటనుండి చ్యుతిని బొందకయుండును. కాన, సృష్టియని పేర్కొనబడు నిదంతయు నాబ్రహ్మమునకు వేఱుగ లేదు. బ్రహ్మమే యిద్దాని స్వరూపమైయున్నది.

మహార్ణవాంభసీవాంబు సంస్థితా పరమేశ్వరే
జలం ద్రవత్వాత్స్పందీవ నిస్పందం పరమంపదమ్. 26

జలరూపమేయగు మహాసముద్రమున జలమెట్లుగలదో, అట్లనే యీ సృష్టియు పరమాత్మయందుగలదు. కాని ద్రవశీలమగుటచే జలము చంచలమును, పరమాత్మ చలనరహితమును నగును — ఇదియే యీ రెంటికినిగల భేదము.

భాఃస్వాత్మనీవ కచతి న కచత్యేవ తత్పదమ్
భాసాం తత్త్వం హి కచనం పదం త్వకచనం విదుః. 27

పరమాత్మ సూర్యునివలె ప్రకాశించువాడు కాడు. ఏలన, భౌతికప్రకాశము సూర్యాదుల స్వభావమగును కాని, నిష్క్రియుడును స్వయంజ్యోతిస్వరూపుడునునగు పరమాత్మ భౌతిక వికారరహితమైయుండును.

అథ ఊర్ధ్వం వర్జయిత్వా యథాఽబ్ధేరుదరే పయః
స్ఫురత్యేవం పరే చిత్త్వాదిదం నానేవ తత్పరమ్. 28

క్రిందిజలము, పైజలము అని పేర్కొనబడినను సముద్రగర్భమున జలముమాత్రమెట్లుగలదో అట్లే, పరబ్రహ్మమున వివిధరూపములుగల యీజగత్తు స్ఫురించుచున్నను, అంతయు నా పరబ్రహ్మమే యగును.

ఈషద్విదః స్వాత్మం చిత్త్వాచ్చేత్యతామివ గచ్ఛతి
బుధ్యతే సర్గ ఇత్యేవ సమాస్థాస్యతి శాశ్వతమ్. 29

దృఢజ్ఞానము లేనివానికీ జగత్తు పరమాత్మకు భిన్నముగను విషయరూపముగను గన్పించును. 'ఇది సృష్టి'యను జ్ఞానము వానికుండియే యుండును. కాని, జ్ఞానపరిపక్వస్థితి యందు సృష్టియంతయు నిత్యమగు పరబ్రహ్మముననే ప్రతిష్ఠితమైయున్నట్లు వాని కనుభూతము కాగలదు.

సర్గస్తు పరమార్థస్య సంజ్ఞైత్యేవ వినిశ్చయః
నానాస్తి నాయమత్యంత మంబరస్య యథాంబరమ్. 30

అజ్ఞానికి నానావిధములుగ గన్పట్టు ఈ జగత్తు యథార్థముగ యేకాలమునను లేనిదే యగును. ఆకాశమున మఱొక యాకాశముండనట్లు పరమార్థవస్తువందు అన్యమగు మఱొక పరమార్థవస్తువుండజాలదు. కాన సృష్టియు పరబ్రహ్మముయొక్క సంజ్ఞయేయని నిశ్చితమగుచున్నది.

చిత్తాత్సర్గసమాపత్తి రచితాత్సర్గసంక్షయః
పరే పరమసంశాంతే హేమ్నీవ కటకభ్రమః. 31

చిత్తమువలననే యీ సృష్టియంతయును ప్రతీతియగుచున్నది. చిత్తము పూర్ణముగ బ్రహ్మమందు లయించినచో నపుడు సువర్ణమందు కటకము లీనమగునట్టుల నీ సృష్టియు లయించును.

సన్నేవ సర్గో సత్యత్వమేతి చిత్తశమోదయే
అసత్సత్తామవాప్నోతి స్వతః సంవేదనోదయే. 32

చిత్తము శమింప, నిక సృష్టి యంతయు పరబ్రహ్మరూపమేయగును. అనగా అధిష్ఠానమగు సత్తారూపమున నయ్యది భాసించును. చిత్తముదయించిన, అసత్తగు నామరూపాత్మక జగత్తంతయు సత్తను బొందును.

సంవేదనమహాంతావత్సర్గసంభ్రమసంభ్రమః
అసంవేదనమాశాంతం పరం విద్ధి న తజ్జడమ్. 33

ఓ రామా! ఈసృష్టిభ్రాంతియంతయును అభిమానయుక్తమగు చిత్తమేయని యెఱుంగుము. చిత్తముశమించిన నిక నాసృష్టి పరబ్రహ్మరూపమే యగును గాని జడము గాదు.

నానేవ సర్గో నానాయాం జ్ఞస్యైకాత్మశివాత్మకః
పుంస్త్వాకర్మక్రియాసేనా మృన్మయీ శిల్పినాం యథా. 34

శిల్పియొక్క చాతుర్యముచే నిర్మింపబడిన మృత్తికాసైన్యము మృత్తికే అయినను సైన్యరూపముగనే గన్పించునట్లు, యథార్థముగ భేదరహితమైనను, సమాధియొక్క వ్యుత్థానకాలమున జ్ఞానికిగూడ నీ సృష్టి పలువిధమున భాసించును.

ఇదం పూర్ణమనారంభ మనంతమనఘోదగమ్
పూర్ణే పూర్ణపరాపూరైః పూర్ణమేవావతిష్ఠతే. 35

జ్ఞానులయొక్క పరమార్థదృష్టియందీ జగత్తు ఉత్పత్తి నాశరహితమును, వికారరహితమునునగును. ఏలన, పూర్ణమగు పరమాత్మయొక్క వ్యాప్తిచే పూర్ణమై నియ్యది పరమాత్మయందే వెలుగుచున్నది. కాన పూర్ణమగు పరమాత్మయే యిచట శేషించుచున్నది. దీనియం దపూర్ణత్వము లేశమైనను లేదు.

యదయం లక్ష్యతే సర్గ స్తద్బ్రహ్మ బ్రహ్మణి స్థితమ్
నభో నభసి విశ్రాంతం శాంతం శాంతే శివే శివమ్. 36

దృశ్యమానమగు యీ జగత్తు బ్రహ్మమేయగుచు బ్రహ్మమునందే స్థితిఁబొందియున్నది. ఆకాశమున నాకాశము శాంతముగనున్నట్లు శివరూపమగు పరమాత్మయందు శివరూపమగు జగత్తున్న గలదు.

ముకురప్రతిబింబస్థే నగరే నవయోజనే
యథా దూరమదూరం చ తథేశే తదతత్క్రమః. 37

అద్దమందు ప్రతిబింబించినట్టి తొమ్మిది యోజనముల దూరముననున్న నగరమున దూరత్వ సమీపత్వములు రెండును యెట్లుగలవో, అట్లే బ్రహ్మమందును యీరెంటి క్రమమును గలదు.

అసదభ్యుదితం విశ్వం సదప్యభ్యుదితం సదా
ప్రతిభాసాత్సదాభాస మసత్తుల్యాదసన్మయమ్. 38

అజ్ఞానుల దృష్టియందే అసత్తగు యీజగత్తు స్థితిని పొందుచున్నది. కాని జ్ఞానుల దృష్టియందియ్యది సత్స్వరూపమగు బ్రహ్మమేయగును. అనగా సద్రూపమగు బ్రహ్మమే జగద్రూపమున



నున్నట్లు వారించుదురు. ఏలయన, బ్రహ్మముతో అభేదాధ్యాసమును పొందియున్నదగుటచే నీ జగత్తు సదా సద్రూపముననే నుదయించుచున్నదగును. కాని భేదదృష్టిచే నిది అవస్తు (మిథ్య), వగుటచే నసన్మయముగనున్నది.

ఆదర్శనగరాకారే మృగతృష్ణాంబుభాస్వరే
ద్విచంద్రవిభ్రమాభాసే సర్గేఽస్మిన్నైవ సత్యతా. 39

ఓ రామా! అద్దమందు ప్రతిబింబించిన నగరమువలెను, మృగతృష్ణాజలమువలెను, ద్విచంద్రభ్రమవలెను భాసించు యీ సృష్టి సత్యమెట్లగును!

మాయాచూర్ణపరిక్షేపాద్యథా వ్యోమ్ని పురభ్రమః
తథా సంవిదిసంసారః సారోఽసారశ్చ భాసతే. 40

ఇంద్రజాలికునిచే విసరబడి మాయాచూర్ణముచే నాకసమున మిథ్యారూపమున నుదయించు నగరమువంటిదగు యీ జగత్తు చేతనవస్తువందు సారమును, అసారమునుగూడ నగును. అనగా నధిష్ఠానరూపమున సత్యమును, తద్వ్యతిరిక్తమగు రూపమున మిథ్యయు నగును.

యావద్విచారదహనేన సమూలదాహం
దగ్ధా న జర్జరలతేవ బలాదవిద్యా
శాఖాప్రతానగహనాని బహూని తావ
న్నానావిధాని సుఖదుఃఖవనాని సూతే. 41

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
హేమోర్మ్యుపదేశో నామైకోనవింశత్యుత్తర
శతతమః సర్గః ॥ 119 ॥

ఆత్మవిచారమను యగ్నిచే వాసనాసహితమగు అవిద్యయను లత యెంతవఱకు సమూలముగ దహింపబడదో, అంతవఱకు నయ్యది క్రమముగ యనేకశాఖలను విస్తరించుచు వానిచే వ్యాప్తమైన సుఖదుఃఖరూపములగు ననేకవనముల నుత్పన్నము చేయుచునుండును.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్యప్రకాశికయందు ఉత్పత్తి ప్రకరణమున
హేమోర్మ్యుపదేశమను ఏకోనవింశత్యుత్తరశతతమ
సర్గము ॥ 119 ॥

---

## వింశత్యుత్తరశతతమః సర్గః.

శ్రీవసిష్ఠ ఉవాచ:—

హేమోర్మికాదివన్మిథ్యా కథితాయాః పురోన్ముఖమ్
స్వరూపమాత్మవిద్యాయాః శృణు రాఘవ కీదృశమ్. 1

శ్రీ వసిష్ఠుడు:— ఓ రామచంద్రా! సువర్ణమున అంగుళీయకమువలె మిథ్యయని తెలుపబడినదియు, విచారణచే నశించునదియునగు అవిద్యయొక్క ప్రభావమెట్టిదో వినుము.

లవణోఽసౌ మహీపాల స్తథా దృష్ట్వా తదా భ్రమమ్
ద్వితీయే దివసే గంతుం ప్రవృత్తస్తాం మహాటవీమ్. 2

పూర్వము రాజగు లవణుఁడాప్రకారము భ్రమనుగాంచి, మఱునాఁడే యా మహారణ్యమునకు బోవ నుద్యుక్తుఁడాయెను.

యత్ర దృష్టం మయా దుఃఖమరణ్యానీం స్మరామి తామ్
చిత్తాదర్శగతాం వింధ్యాత్క్వదాచిల్లభ్యతే హి సా. 3
ఇతి నిశ్చిత్య సచివైః ప్రయయౌ దక్షిణాపథమ్
పునర్దిగ్విజయాయేవ ప్రాప్య వింధ్యమహీధరమ్. 4
పూర్వదక్షిణపాశ్చాత్య మహార్ణవతటస్థలీమ్
బభ్రామ కౌతుకాత్సర్వాం వ్యోమవీథీమివోష్ణగుః. 5

మహద్దుఃఖమనుభవించిన ప్రదేశమును, నా చిత్తమున బాగుగ యంకితమైయున్నదియునగు నా యరణ్యము యపుడు నాకు బాగుగ స్మరణకు వచ్చుచున్నది. ఒకవేళ వింధ్యపర్వతమునకుఁ బోయిన, యిపుడుగూడ యచ్చోటు లభింపగలదేమోయని తలంచి లవణుడు మరల దిగ్విజయమునకై బోవుచుండెనా యనునట్లుండ, దక్షిణమార్గమును జేబట్టి వింధ్యపర్వతముఁజేరి పూర్వ, దక్షిణ, పశ్చిమ మహాసముద్రముల తటప్రదేశమున, ఆకసమున సూర్యునివలె, కౌతుకముతో సంచరింపఁదొడగెను.

అథైకస్మిన్ప్రదేశే తాం చింతామివ పురోగతామ్
దదర్శోగ్రామరణ్యానీం పరలోకమహీమివ. 6

అంతట నొకచోట దుఃఖమే యెదుటనున్నదా యనుపించుచున్న యా మహాభీకరారణ్యమును, పరలోక భూభాగమువలె నాతడు గాంచెను.

స తత్ర విహరంస్తాంస్తాం వృత్తాంతాన్సకలానథ
దృష్టవాన్పృష్టవాంశ్చైవ జ్ఞాతవాంశ్చ విసిస్మియే. 7

ఆ రాజట సంచరించుచు, తన పూర్వకాలానుభూతవిషయములన్నింటిని జూచియు, అడిగి తెలిసికొనియు ఆశ్చర్యచకితుఁడాయెను.

తాన్పరిజ్ఞాతవాంశ్చాసీద్వ్యాధాన్పుల్కసజాన్పునః
విస్మయాకులయా బుద్ధ్యా భూయో బభ్రామ సంభ్రమీ. 8

అంత రాజా చండాలురందఱను గుర్తెఱింగినవాఁడై విస్మితుడును వ్యాకులచిత్తుడునునై యింకను నట సంచరింపఁదొడగెను.

అథ ప్రాప్య మహాటవ్యాం పర్యంతే ధూమధూసరే
తమేవ గ్రామకం యస్మిన్సోఽభవత్పుష్టపుల్కసః. 9



పిదప, ధూళిధూమములచే ధూసరితమొనర్పబడిన ఆ మహారణ్యముయొక్క చివఱిభాగమున, తా నిదివఱలో చండాలుడై వసించిన గ్రామమును జూచెను.

తత్రాపశ్యజ్జనాంస్తాంస్తా స్త్రియస్తాః కుటీరకాః
నానాకారాన్ జనాధారాంస్తాంస్తాంశ్చ వసుధాతటాన్. 10

పూర్వము తానుజూచిన మనుజులను, స్త్రీలను, కుటీరములను, జనులకాధారభూతమై యున్న పలువిధములగు భూప్రదేశములను రాజట గాంచెను.

తాంశ్చాకాండపరిభ్రష్టాంస్తాన్వృక్షాంస్తాం స్త్వనువ్రజాన్
తాం స్తథైవ సముద్దేశాంస్తాన్వ్యాధానేకలాన్సుతాన్. 11

పూర్వమట యాకస్మికముగ సంభవించిన క్షామమునందుపడి వృక్షముల నాతడు జూచెను. మఱియు తన సహచరులను, ఆయా పూర్వపుస్థానములను బంధువుల గోల్పోయిన కిరాతులను, పుత్రులనుగూడ గాంచగల్గెను.

అన్యాసు వృద్ధాసు సబాష్పనేత్రాస్వార్తార్తియుక్తాసు చ వర్ణయంతీ
అకాలకాంతారవిశీర్ణబంధు దుఃఖాన్యసంఖ్యాని సఖీషు వృద్ధా. 12
వృద్ధా ప్రవృద్ధోజ్జ్వలనేత్రబాష్పా కష్టం బతాశుష్కకుచా కృశాంగీ
అవగ్రహోగ్రాశనిదగ్ధదేశే తత్రార్తనాదా పరిరోదితీదమ్. 13

ఇతర వృద్ధస్త్రీలతోగూడి యేడ్చుచున్నదియు, విపద్గ్రస్తులైన సఖులతోగూడినదై అకాలమున యట సంభవించిన క్షామముచే నశించిన తన బంధువులయొక్క అసంఖ్యాకములగు దుఃఖములన్నింటిని వర్ణించుచున్నదియు, తక్కిన వృద్ధస్త్రీలకంటె యధికముగ నేడ్చుచు నశ్రువులరాల్చుచున్నదియు, శుష్కకుచధారిణియు, అనావృష్టియను భయంకర వజ్రపాతముచే దహింపబడినట్లుండి యార్తనాదమొనర్చుచు వృద్ధురాలగు ఆరాజుయొక్క శ్వశ్రువు(అత్త)అచ్చోటనిట్లు విలపింపదొడఁగెను:

హా పుత్రిపుత్రావృతసర్వగాత్రే దినత్రయో భోజనజర్జరాంగి
కృత్వాసినా వర్మణి జీర్ణదేహాః కథం క్వముక్తాభవతాసవస్తే. 14

'ఓ పుత్రీ! పుత్రులను కౌగలించుకొనుటచే వారలచే గప్పబడిన దేహముగలదానవును, మూడుదినము లన్నము లభింపనందుచే కృశించిన శరీరము గలిగియున్నదానవునగు నిన్నును, అట్లే భోజనములేనందుచే క్షీణించిన దేహములుగల ప్రాణప్రియులగు నీ పుత్రులను, ఒఱయందు ఖడ్గమువలె మీ హృదయములందెల్లప్పుడు వసించు రాజెచట యెట్లు విడచిపోయెను ?

తాలీదలాలంబనమంబుదాద్రౌ దంతాంతరస్థారుణసత్ఫలస్య
స్మరామి గుంజాఫలదామభర్తుః పురస్థముద్రామరహాసినస్తే. 15

మేఘమువలె యెత్తైన తాళవృక్షముపైనుండి ఫలముగైకొని దిగునపుడు రెండుచేతులందు చిక్కుకొనగా, దంతములచే [illegible]ఫలంబును గ్రహించియున్నవాడును, అప్పటి తన యాక[illegible] నాంజ సేయునిగూడ జయించినవాడును, ఉత్తమములైన గురిగింజమాలలను ధరించినవాడును నగు నీ

భర్త యిపుడు దైవయోగముచే పైనుండి పడగా, సమీపముననున్న మఱియొక తాళవృక్షముయొక్క శాఖను సాహసయుతుడై గ్రహించియుండుట నాకిపుడు స్మరణకు వచ్చుచున్నది.

కదంబజంబీరలవంగగుంజా కుంజాంతరం తస్తుచరత్తరక్షోః
పశ్యామి పుత్రస్య కదానుభూయో భయంకరాణ్యుద్యతివల్గితాని. 16

కదంబ, జంబీర, లవంగ, గుంజాది వృక్షములందు సంచరించు వ్యాఘ్రాదులను వధింప జనుచుండు, పుత్రునికంటె యతిప్రియుండగు ఆ నా యల్లుని గంతులను, యుఱుపులను మరల నెపుడు గాంతునో!

న తాని కానుస్య విలాసినీహా ముఖేఽపి శోభాలసితాని సంతి
తమాలనీలే చిబుకైకదేశే సుతస్య చాన్యాస్యగతామిషస్య. 17

మద్యము త్రావునప్పుడు తనప్రియురాలి మోమునుండి లభించిన మాంసశకలమును భుజించువాడును, తమాలవృక్షమువలె నల్లనైన గడ్డముగలవాడునునగు ఆ నాయల్లుని ముఖమండలమందలి శోభ మన్మథుని విలాసపూర్ణమగు ముఖమందుకూడ లేదు.

సుతాపనీతానహ తేన భర్త్రా యమేన యస్యా యమునాసమానా
తమాలవల్లీసహ పుష్పగుచ్ఛా సమీరణేనేవ వనే వరేణ. 18

బలవత్తరమగు వాయుప్రవనమున పుష్పగుచ్ఛయుతమగు తమాలలతను త్రెంపుకొని పోవు విధమున, యమునానదివంటి వర్ణముగల నా పుత్రికను, శ్రేష్ఠుడగు యాపె పతిని, యముఁడుగైకొని పోయెను.

హా పుత్రి గుంజాఫలదామహారే సమున్నతాభోగపయోధరాంగి
వాతోల్లసత్కజ్జలలోలవర్ణే పర్ణాంబరే బాదరజంబుదంతే. 19

గురిగింజల మాలలను ధరించునదియు, విశాలమైన స్తనములుగలదియు, కాటుకవలె నల్లనిదియు, నార వస్త్రములను ధరించునదియు, రేగుగింజలవలెను, జంబూఫలములవలెను నల్లగనున్న దంతములు గలదియునగు నాపుత్రి యెటకేగెనో! ఆహా!

హా రాజపుత్రేందుసమానకాంత సంత్యజ్య శుద్ధాంతవిలాసినీస్తాః
రతిం ప్రయాతోఽసి సుమాత్మజాయాం ససాపి తే సుస్థిరతాముపేతా. 20

చంద్రునివంటి కాంతిగల నో రాజపుత్రా! నీవాయుత్తమ అంతఃపురవిలాసినులఁ ద్యజించి నా కన్యకతో రతిఁజెందితివి. ఆ మీయిరువురప్రేమబంధముకూడ స్థిరత్వముఁజెందకుండెను గదా!

సంసారనద్యాః సుతరంగభంగైః క్రియావిలాసైర్విహితోపహాసైః
కిం నామ తుచ్ఛం న కృతం నృపేణ యద్యోజితః పుష్కసకన్యకాయామ్. 21

తరంగములవలె క్షణభంగురమైన సంసారనదీక్రియావిలాసము (కర్మపరిపాకము) లతో కూడి, చండాలకన్యకను పరిగ్రహించిన ఆ రాజొనర్పని క్రియ యెద్దిగలదు?

సా త్రస్తసారంగసమాననేత్రా స దృప్తశార్దూలసమానవీర్యః
ఉభౌ గతావేకపదేన నాశమాశాసహార్ఘేన యథా మహేహా. 22



భీతిఁగొన్న హరిణముయొక్క నేత్రములవంటి నేత్రములుగల నాపుత్రికయు, సింహపరాక్రమముగల నాయల్లుడును, ధనముతోగూడ గొప్పయభిలాషయు నశించులాగున, క్షణములో నశించిరి.

మృతేశ్వరాశ్వస్తనిజాత్మజాస్మి దుర్దేశయాతాస్మి చ దుర్గతాస్మి
దుర్జాతిజాతాస్మి మహాపదేఽస్మి సాక్షాద్భయం భోఽస్మి మహాపదస్మి. 23

ఓ దైవమా! నేనిపుడు భర్తృవియోగమును పుత్రికావియోగమునుగూడ బొందితిని. అనాగరికదేశమున వసించుచు మిగుల యాపద్గ్రస్తనైయుంటిని. దుష్టజాతియందు జన్మించినదాననై భయంకర పరిస్థితులందు పడద్రోయబడితిని. వెయ్యేల నేను, సాక్షాత్తు భయమును యాపదయు రూపముగా గల్గియున్నాను.

నీచావమానప్రభవస్య మన్యోః క్షుధాప్రసన్నస్య కలత్రకస్య
శోకస్య వృత్తావనివార్యవృత్తేర్నార్యస్మ్యనేకాయతనం వినాథా. 24

నేననాథను. నీచులచే యవమానింపబడుచు, ఆకటిచే బాధింపబడుచున్న క్రుద్ధులగు పోష్యవర్గముయొక్క యాహారము నిమిత్తము అనివారణీయములగు దుఃఖము లనుభవించుచు, యిట్లనేకయాపదలకు నిలయమైయున్న నన్ని విధముగ బ్రహ్మదేవుడు సృష్టించెను.

దైవోపతప్తస్య విబాంధవస్య మూఢస్య రూఢస్య మహాధిభూమౌ
యత్ప్రాణనం యన్మరణం మహాపద్యస్యాత్మనిర్జీవితముత్తమం తత్. 25

దైవయోగమున మరణించిన బంధువులుగల్గి, గొప్ప మానసికవ్యథచే పీడింపబడుచు, ఆపదలఁజెందుచున్న యీ మూఢులకంటె నిర్జీవములగు శిలాదులే యుత్తమములు.

జన్మైర్విహీనస్య కుదేశవృత్తే ర్దుఃఖాన్యనంతాని సముల్లసంతి
సహస్రశాఖారససంకులాని తృణాని వర్షాస్వివ పర్వతస్య. 26

వర్షాకాలమున పర్వతముపై తృణసమూహమంతయు రసయుక్తమై వేలకొలఁది శాఖలుగల్గి విస్తరించునట్లు, జనసేవితము గాని దుష్టప్రదేశమున జన్మించువానికని పెక్కు దుఃఖములు సంప్రాప్తించి వృద్ధిఁజెందుచుండును.

ఏవం లపంతీం స్వకలత్రవృద్ధాం దాసీభిరాశ్వాస్య నృపః స్త్రియం తామ్
పప్రచ్ఛ కిం వృత్తమిహైవ కా చ కా తే సుతా కశ్చ సుతస్తవేతి. 27

ఇట్లు విలపించుచున్న వృద్ధురాలగు తన శ్వశ్రువుఁగాంచి, రాజు దాసీజనులచే ధైర్యము గొల్పింపఁజేసి — 'నీ వృత్తాంతమేమి? నీవెవతెవు? నీ పుత్రిక యెవరు? పుత్రుఁడెవ'రని యామె నడిగెను.

ఉవాచ సా బాష్పవిలోచనాఽథ గ్రామస్త్వయం పుష్కసఘోషనామా
ఇహాభవత్పుష్కసకః పతిర్మే బభూవ తస్యేందుసమా సుతైకా. 28

అంత యశ్రుముఖియగు నావృద్ధస్త్రీ యిట్లుపల్కెను — 'ఓ రాజా! పుష్కసఘోషయను యీ గ్రామమున పుష్కసుఁడను నాపతి జన్మించెను. [illegible] చంద్రసమానయగు కన్నియయొకతె గల్గెను.

సా దైవయోగాత్పతిమిందుతుల్య మిహాగతం దైవవశేన భూపమ్
అయం విశీర్ణం మధుకుంభమాప వనే వరాకీ కరభీ యథైకా. 29

మధుపూరితఘటమును యరణ్యమున దీనగర్దభము పొందినట్లు, దైవయోగమువలనిటకు విచ్చేసిన యిందుసముడగు రాజునొకని యాకన్నియ తనభర్తగా బడసెను.

సా తేన సార్ధం సుచిరం సుఖాని భుక్త్వా ప్రసూతా తనయాః సుతాంశ్చ
వృద్ధిం గతా కాననకోటరేఽస్మింస్తుంబీలతా పాదపసంశ్రితేవ. 30

ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
చండాలీశోచనంనామ వింశత్యుత్తర
శతతమః సర్గః ॥ 120 ॥

అంత చిరకాలమామె తన భర్తయగు రాజుతో సుఖములనుభవించి, వానివలన సంతానమునుబడసి, ఈ యరణ్యముననే వసించుచు వృక్షము నాశ్రయించిన సొరతీగవలె క్రమముగ వృద్ధి నందజొచ్చెను.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
చండాలీశోచనమను వింశత్యుత్తరశతతమ
సర్గము ॥ 120 ॥

—:౦:—

## ఏకవింశత్యుత్తరశతతమః సర్గః.

—:౦:—

చండాల్యువాచ:—

కేనచిత్త్వథ కాలేన గ్రామకేఽస్మిన్జనేశ్వర
అవృష్టిదుఃఖమభవద్భీషణం భగ్నమానవమ్. 1

చాండాలి:— ఓ రాజా! ఇట్లుండ కొంతకాలమునకా గ్రామమున, వర్షము లేనందుచే నతిభయంకరమును, ప్రాణుల నశింపజేయునదియు, దుఃఖప్రదమునునగు క్షామము సంభవించెను.

మహతాఽనేన దుఃఖేన సర్వే తే గ్రామకా జనాః
వినిర్గత్య గతా దూరం సర్వే పంచత్వమాగతాః. 2

అట్లచట గొప్ప యాపద తటస్థింప, గ్రామవాసులందరును యచ్చోటుబాసి, చాలదూరమేగి మృత్యువాతఁబడిరి.

తేనేమా దుఃఖభాగిన్యః శూన్యా వయమిహ ప్రభో
సౌమ్య శోచామ సద్బాష్పమాచాంతేక్షణధారయా. 3

ఓ ప్రభూ! ఆ దుర్భిక్షము చేతను, బంధువియోగము చేతను యభాగినులగు మేమందరమును శూన్యహృదయులమై, అశ్రుధారలఁబ్రవహింపఁజేయుచు నిట్లు దుఃఖించుచుంటిమి.



ఇత్యాకర్ణ్యాంగనావక్త్రాద్రాజా విస్మయమాగతః
మంత్రిణాం ముఖమాలోక్య చిత్రార్పిత ఇవాభవత్. 4

ఇట్లు చండాలి ముఖమునుండి యా పల్కుల విన్న రాజు విస్మితుడై మంత్రులఁగాంచి చిత్రమువోలె నిశ్చేష్టుడై యుండెను.

భూయో విచారయామాస తదాశ్చర్యమనుత్తమమ్
భూయోభూయోఽథ పప్రచ్ఛ బభూవాశ్చర్యవానితి. 5

ఆ యపూర్వ వృత్తాంతమును తాను పలుమార్లు యోచించి పలుమార్లు వారలనడిగి, ఆశ్చర్యచకితుఁడాయెను.

తేషాం సముచితైర్దాన సన్మానైర్దుఃఖసంక్షయమ్
కృత్వా కరుణయావిష్టో దృష్టలోకపరావరః 6
స్థిత్వా తత్ర చిరం కాలం విమృశ్య నియతేర్గతిః
ఆజగామ గృహం పౌరైర్వందితః ప్రవివేశ హ. 7

ఇహపరలోక దర్శనుడును, కరుణాన్వితుడునగు రాజంత సముచిత దానసన్మానములచే నా చండాలుర దుఃఖమును తొలగించినవాడై చాలసేపటయుండి దైవగతిగూర్చి చింతించుచు పిమ్మట స్వగృహాభిముఖుఁడాయెను. ఆ పిదప, నగరనివాసులచే నభినందితుడై రాజు తన నగరమును బ్రవేశించెను.

ప్రాతస్తత్ర సభాస్థానే మామపృచ్ఛదసౌ నృపః
కథమేవం మునే స్వప్నః ప్రత్యక్షమితి విస్మితః. 8
యథా వస్తుతయా తస్య తత ఉక్తః స తాదృశః
సంశయో హృదయాన్మన్యో వాతేనేవాంబుదో దివః. 9

ఓ రామా! ఆశ్చర్యాన్వితుడగు నా రాజంత మఱునాడుదయమున సభాస్థలమున 'ఓ మునీంద్రా! స్వప్నము ప్రత్యక్షముగ యేల గాన్పించె'నని నన్నడిగెను. అపుడు, వాయువాకాశమునుండి మేఘములను తొలగించునట్లు, నేనా ప్రశ్నకు తగు సమాధానమొసంగి, వాని సంశయమును నివారించితిని.

ఇత్యేవం రాఘవావిద్యా మహతీ భ్రమదాయినీ
అసత్సత్తాం నయత్యాశు సచ్చాసత్తాం నయత్యలమ్. 10

ఓ రామా! ఇవ్విధమున అవిద్య విశేషభ్రమను గలుగజేయునదై యున్నది. క్షణములో నియ్యది పూర్ణరీతిగ నసత్తును సత్తుగను, సత్తునసత్తుగను జేసివేయుచున్నది.

శ్రీ రామ ఉవాచ:—

కథమేవం వద బ్రహ్మన్స్వప్నః సత్యత్వమాగతః
భ్రమోదార ఇవైషోఽర్థో న మే గలతి చేతసి. 11

శ్రీ రాముడు:— ఓ మునీంద్రా! (పైనదెల్పిన విధమున) స్వప్నము సత్య (జాగ్రత్కాలానుభూత) మెట్లయ్యెనో దయచేసి తెలియజేయుడు. భ్రమదాయకములగు యీ మీవాక్యములను నేను విశ్వసింపజాలకున్నాను.

**శ్రీ వసిష్ఠ ఉవాచ :—**

సర్వమేతదవిద్యాయాం సంభవత్యేవ రాఘవ
ఘటేషు పటతా దృష్టా స్వప్నసంభ్రమితాదిషు. 12

శ్రీవసిష్ఠుడు:— ఓ రామచంద్రా! అవిద్యయం దిదంతయును సంభవము కాగలదు. స్వప్న సంభ్రమాదులందు ఘటము పట (వస్త్ర) మగుట గాంచుటలేదా!

దూరం నికటవద్భాతి ముకురేఽంతరివాచలః
చిరం శీఘ్రత్వమాయాతి పునః శ్లేష్మేవ యామినీ. 13

అద్దమందు ప్రతిబింబించిన పర్వతమువలె దూరముననున్న పదార్థమున్ను సమీపవర్తియగుచున్నది. సుఖనిద్రజెందిన రాత్రివలె చిరకాలముగూడ యల్పమగుచున్నది.

అసంభవచ్చ భవతి స్వప్నే స్వమరణం యథా
అసచ్చ సదివాభాతి స్వప్నేష్వివ నభోగతిః. 14

స్వప్నమందలి స్వమరణమువలె, ఈ అవిద్యయం దసంభవమును సంభవము కాగలదు. మఱియు స్వప్నమందలి ఆకాశగమనమువలె అసత్యముగూడ సత్యముగ భాసించును.

సుస్థితం సుష్టు చలతి భ్రమే భూపరివర్తవత్
అచలం చలతామేతి మదవిక్షుబ్ధచిత్తవత్. 15

భూమి స్థిరముగనున్నను, తనచుట్టు తాను పరిభ్రమణ మొనర్చుచుండువాని కయ్యది కదలుచున్నట్లగపడు చందమునను, మద్యపానముచే చిత్తము క్షుభితమవ నంతయు చలించుచున్నట్లు తోచు విధమునను, అవిద్యచే నచలమగు వస్తువుగూడ చంచలత్వమును పొందగలదు.

వాసనావలితంచేతో యద్యథా భావయత్యలమ్
తత్తథానుభవత్యాశు న తదస్తి న వాప్యసత్. 16

పదార్థము సత్యమైనను, మిథ్యయైనను వాసనావేష్టితమగు చిత్తమెద్దాని నెట్లు తీవ్రముగ భావించునో దానినట్లే సత్వరమనుభవించును.

యదైవాభ్యుదితాఽవిద్యా త్వహంత్వాదిమయీ ముధా
తదైవానాదిమధ్యాంతా భ్రమస్యానంతతోదితా. 17

అహంకారాదియుక్తమగు నీయవిద్య యెప్పుడుదయించునో, అపుడే అనాది మధ్యాంతమగు భ్రమయొక్క అనంతత్వమును ఉదయించుచున్నది.

ప్రతిభాసవశాదేవ సర్వో విపరివర్తతే
క్షణః కల్పత్వమాయాతి కల్పశ్చ భవతి క్షణః. 18



పదార్థములన్నింటియొక్క పరిణామమున్ను ప్రతిభాసవశముననే గలుగుచున్నది. దీనివలననే క్షణము కల్పముగను, కల్పము క్షణముగను నగుచున్నది.

విపర్యస్తమతిర్జంతుః పశ్యత్యాత్మానమేడకమ్
బిభర్తి సింహతామేడో వాసనావశతః స్వయమ్. 19

విపరీతబుద్ధిగలవాడు తన్ను మేషముగ భావించును. ఈ వాసనావశముననే మేషము స్వయముగ సింహత్వముఁ జెందుచున్నది.

విషమభ్రమదాఽవిద్యా మోహాహంతాదయః సమాః
సర్వే చిత్తవిపర్యాస ఫలసంపత్తిహేతుతః. 20

మిగుల భయమునుగొల్పు అవిద్య, మోహము, అహంభావము — ఇవన్నియు సమములే యగును. మఱియు నివన్నియు చిత్తవైపరీత్యమును గల్గజేయుటయందు హేతువులగును.

కాకతాలీయవచ్చేతో వాసనావశతః స్వతః
సంపదంతి మహారంభా వ్యవహారాః పరస్పరమ్. 21

కాకతాళీయ న్యాయమువలె చిత్తమందలి వాసనలచే మహాత్కార్యముగూడ స్థానాంతరమునుఁ జెందుచున్నది.

వృత్తం ప్రాక్స్వక్షణే రాజ్ఞః కస్యచిల్లవణస్య యత్
ప్రతిభాతం తదేతస్య సద్వాసద్వా మనోగతమ్. 22

మఱియొకని మనంబుననున్న శబరాలయస్థ చాండాలకన్యావివాహాది వృత్తాంతమంతయును లవణుని మనంబున భాసించెను.

విస్మరత్యపి విస్తీర్ణాం కృతాంచేతః క్రియాం యథా
తథా కృతామప్యకృతామితి స్మరతి నిశ్చితమ్. 23

మహాత్కార్య మొనర్చిగూడ యద్దానిని మఱచునట్లు, యొనర్చినదిగాని యొనర్పకున్నదిగానియగు క్రియనుగూర్చినస్మృతి మనుజునకు కలుగగలదు.

తథా న భుక్తవానస్మి భుక్తవానితి చేతసి
స్వప్నే దేశాంతరగమే ప్రాకృతోఽప్యవబుధ్యతే. 24

అట్లే ప్రాకృతజీవుడు, తాను భుజించినను భుజింపలేదని స్వప్నమునగాని, దేశాంతరమునగాని తలంచును.

వింధ్యపుష్కసగ్రామే వ్యవహారోఽయమీదృశః
ప్రతిభాసాగతస్తస్య స్వప్నే పూర్వకథా యథా. 25

వింధ్యపర్వతసమీపస్థగ్రామమునందట్టి వ్యవహారము జరుగుచున్నదని, స్వప్నమందలి పూర్వానుభవమువలె రాజుమనమున ప్రతిభాసించెను.

అథవా లవణేనాశు దృష్టో యః స్వప్నవిభ్రమః
స ఏవ సంవిదం ప్రాప్తో విన్ధ్యపుల్కసచేతసి. 26

లేక, లవణుడు గాంచిన స్వప్నభ్రమ విన్ధ్యపర్వతసమీపస్థచాండాలుని చిత్తమందును స్ఫురించెను.

లావణీప్రతిభాఽఽరూఢా విన్ధ్యపుల్కసచేతసి
విన్ధ్యపుల్కససంవిద్వాఽఽరూఢా పార్థివచేతసి. 27

లవణుని వృత్తాంతము విన్ధ్యాద్రి చెంతనున్న చాండాలుని హృదయమున రూఢిపడి యుండెను. లేక చండాలుని వృత్తాంతము లవణుని హృదయమున రూఢిపడియుండెను.

యథా బహూనాం సదృశం వచనం నామ మానసమ్
తథా స్వప్నేఽపి భవతి కాలో దేశః క్రియాపి చ. 28

సమస్యాపూర్తి మున్నగువానియందు పెక్కుకవుల మానసవచనములు సమముగనే యుండునట్లు, స్వప్నమందుకూడ దేశకాలక్రియలు సమముగనే యుండును.

వ్యవహారగతేస్తస్యాః సత్తాస్తి ప్రతిభాసతః
సత్తా సర్వపదార్థానాం నాన్యా సంవేదనాదృతే. 29

వ్యవహారదశయొక్క సత్తయు చైతన్య ప్రతిభాసమువలననే గలుగుచున్నది. ఏలయనిన, సమస్తపదార్థములయొక్క సత్తయు అధిష్ఠానమగు చైతన్యసత్తయొక్క స్ఫురణవలననే గలుగుచున్నది.

సంవేదనేతరా భాతి వీచిర్వా జలసంగతిః
భూతభవ్యభవిష్యస్థా తరుబీజే తరుర్యథా. 30

అధిష్ఠానమగు చేతనసత్తయే భూత భవిష్యద్వర్తమానప్రపంచమున వ్యాప్తమై యుండియు జలమందు తరంగమువలెను, బీజమందు వృక్షమువలెను యద్దానికి భిన్నముగ భాసించుచున్నది.

తస్యాః సత్త్వమసత్త్వం చ న సన్నాసదితి స్థితమ్
సత్సదేవ హి సంవిత్తే రసంవిత్తేరసన్మయమ్. 31

అధిష్ఠానమగు చేతనసత్తకంటె యన్యముగ భాసించు పదార్థములసత్త, సదసద్విలక్షణమైనది ('నాసదాసీన్నోసదాసీత్' — శ్రుతి — అనగా యీ జగత్తు సత్తునుగాదు అసత్తునుగాదు.) జగత్తు స్థూలదృష్టియందు సత్యముగను పరమార్థదృష్టియం దసన్మయముగనునుండును.

నావిద్యా విద్యతే కించిత్తైలాదిసికతాస్వివ
హేమ్నః కిం కటకాదన్యత్పదం స్యాద్ధేమతాం వినా. 32

ఇసుక మొదలైన పదార్థములందు తైలములేనట్లు, యథార్థముగ అవిద్యయనునదే లేదు. కటకాదులందు సువర్ణముగాక వేఱుపదార్థ మేమిగలదు ?



అవిద్యయాఽఽత్మతత్త్వస్య సంబన్ధో నోపపద్యతే
సంబన్ధః సదృశానాం చ యః స్ఫుటః స్వానుభూతితః. 33

చేతనవస్తుసంబంధముచే అవిద్య సత్తను గలిగియున్నదనియును చెప్పరాదు. ఏలయనిన అవిద్యాత్మలసంబంధమెన్నటికిని సంభవింపదు. సమవస్తువుల సంబంధము మాత్రమే లోకప్రసిద్ధమై యున్నదిగదా !

జతుకాష్ఠాదిసంబన్ధో యః సమాసమయోగతః
నాన్యోన్యానుభవాయాసౌ తదేకస్పందమాత్రకమ్. 34

జతు (లక్క) కాష్ఠ (కొయ్య)ల వలె అసదృశవస్తువుల సంబంధము సిద్ధించుననిన, యట్లు కాదు. ఈ యుదాహరణ సరికాదు. ఎట్లనిన పై రెండును (ద్రవశీలమగు లక్కయు, అద్రవ శీలమగు కాష్ఠమును) అవిద్యాంతర్గతములే గాన సదృశవస్తువులే యగును.

పరమార్థమయం సర్వం యథా తేనోపలాదయః
చితాసమభిచేత్యంతే సంబన్ధవశతః సమాః. 35

సమస్తపదార్థములును చైతన్యమయములేగాన సాదృశ్యసంబంధముచే చైతన్యమువలననే అవన్నియు ప్రకాశితములగుచున్నవి.

యదా చిన్మాత్రసన్మాత్రమయాః సర్వే జగద్గతాః
భావాస్తదా విభాంత్యేతే మిథః స్వానుభవస్థితేః. 36

జగత్తునందలి పదార్థములన్నియు సచ్చిన్మాత్రములే గాన స్వప్రకాశత్వబలముచేతనే అయ్యవి ప్రకాశితములగుచున్నవిగాని మఱియొక చైతన్యముచే గాదు. దీపమును ప్రకాశింపజేయుటకు మఱియొక దీపమక్కరలేదు కదా !

న సంభవతి సంబన్ధో విషమాణాం నిరంతరః
న పరస్పరసంబన్ధాద్వినాఽనుభవనం మిథః. 37

అసదృశవస్తువుల సంబంధమెన్నటికిని కలుగదు. మఱియు పరస్పర సంబంధములేక పరస్పర యనుభవమున్ను ఘటిల్లదు.

సదృశే సదృశం వస్తు క్షణాద్గత్వైకతామలమ్
రూపమాస్ఫారయత్యేకమేకత్వాదేవ నాన్యథా. 38

సదృశమగు పరమాత్మస్వరూపమున, సదృశమగు జగత్తు క్షణములో పూర్ణముగ నేకత్వమొందినదై, అట్టి యేకత్వకారణముననే తనరూపమును విస్తరించుచున్నదిగాని అన్యముగ గాదు.

చిచ్చేత్యమిలితాద్దృశ్య రూపమోదేతి చేతనః
[జడం జడేన మిలితం ఘనం సంపద్యతే జడమ్.]
న చ చిజ్జడయోరైక్యం వైలక్షణ్యాత్క్వచిద్భవేత్. 39

అజ్ఞుల దృష్టియందు చేతన, చేతయిత్వ, ద్రష్టృదర్శన దృశ్యములను త్రిపుటీరూపమున నేది యుదయించుచున్నదో, అయ్యది చిజ్జడముల యభేదసంబంధముచే గలిగినదనిగాని, లేక కేవలము

జడముయొక్క సంబంధముచే గలిగినదనిగాని చెప్పరాదు. ఎందువలననగా జడమజడముతో గలసిన యధికజడమే యగును. ఇక చిజ్జడములు పరస్పర విలక్షణములై యున్నవిగాన వాని యైక్యము సంభవింపనేరదు.

చిజ్జడౌ చిత్ర ఏకత్ర న తౌ సంమిలతః క్వచిత్
చిన్మయత్వాచ్చిదాలంభశ్చిదాలంభేన వేదనమ్. 40

త్రిపుటియను చిత్రమున చిజ్జడములు రెండును అసదృశకారణమున కలియనేరవు. చిన్మయ పదార్థములన్నియు చైతన్యసంబంధములే యగుటచే, చైతన్యమాత్రమే యట మిగులుచున్నది. కాన దృశ్యమే లేదని సిద్ధించుచున్నది.

దారుపాషాణభేదానాం న తు హ్యేతే చిదాత్మకాః
పదార్థో హి పదార్థేన పరిణామ్యనుభూయతే. 41

గృహ నిర్మాణమున కుపకరించు దారుపాషాణాది నామరూపాత్మకములగు పదార్థములు చిదాత్మకములు గావు. ఏలయనిన, అవన్నియు యొక్కటగు మాయయొక్క విలాసమాత్రములే యగుచు నొకటి మఱొకదానిరూపమున పరిణామముం జెందుచున్నవి. కాని, చైతన్యమట్లు పరిణామ మొందునది కాదు.

జిహ్వాయైవ రసాస్వాదః సజాతీయామలోదయః
ఐక్యం చ విద్ధి సంబంధం నాన్యస్యావసమానయోః. 42

జిహ్వచేగలుగు భిన్నపదార్థరసాస్వాదనము సజాతీయవస్తుసంబంధమే యగును. సదృశవస్తువుల యైక్యమే యెల్లప్పుడు సంభవించుచుండును గాన అసదృశములగు జడచైతన్యము లెట్లైక్యమగును?

జడచేతనయోస్తేన నోపలాదిజడం మతమ్
చిదేవోపలకుడ్యాదిరూపిణీతి మితాచితా. 43

ఏకీభావం గతా ద్రష్టృదృశ్యాదికురుతే భ్రమమ్
కాష్ఠోపలాద్యశేషం హి పరమార్థమయం యతః. 44

కాన, శిలాది పదార్థములును యథార్థముగ జడములుకావు. చైతన్యమే శిలాభిత్త్యాది రూపములను ధరించుచున్నది. ఏకీభావమొందినదై సద్వస్తువగు చైతన్యమే ద్రష్టృదృశ్యాది భ్రమను గలుగజేయుచున్నది. అందుచే కాష్ఠశిలాది పదార్థములన్నియును చైతన్యమయములే యగును.

తదాత్మనా తత్సంబంధం దృశ్యత్వేనోపలభ్యతే
సర్వం సర్వప్రకారాఢ్య మనంతమివ యత్నతః. 45

చిదాత్మతో చిదాత్మయొక్క సంబంధమే కల్పిత దృశ్యభావమున నుపయించుచున్నది. (అనగా కాష్ఠశిలాదులరూపములే కల్పితములుగాని వానియధిష్ఠానమగు సద్వస్తువు సత్యమైనదే యని భావము.) అనంతమగు పరబ్రహ్మము సర్వవిధముల పరిపూర్ణమై సర్వరూపములందును సమముగా వెలుగుచున్నది.



విశ్వం సన్మాత్రమేవైత ద్విద్ధి తత్త్వవిదాంవర
అసత్తాత్యాగనిష్ఠేన విశ్వం లక్షశతభ్రమైః. 46

ఉత్తమ తత్త్వజ్ఞుడవగు నో రామా! కాన, నీవీ విశ్వమంతయు సన్మాత్రమనియే యెఱుంగుము. మిథ్యాత్వగ్రహణరూపమగు చిచ్చమత్కృతిచే పలువిధ భ్రమలతోకూడి జగత్తు యొప్పుచున్నది.

పూరితం చిచ్చమత్కారో న చ కించన పూరితమ్
సంకల్పనాగరా నృణాం మిథః స్పందంతి నో యథా. 47

న దేశకాలరోధాయ తథా సర్గేష్వితి స్థితిః
భేదబోధే హి సర్గత్వమహంత్వాదిభ్రమోదయః. 48

హేమసంవిత్పరిత్యాగే కటకాదిభ్రమో యథా
కటకాదిభ్రమో హేమ్ని దేశాద్దేశం భవాద్భవమ్. 49

మఱియు యథార్థముగ నా చిచ్చమత్కృతి దేనిచేతను పూరితముగాక యుండును. మనుజుల సంకల్పనగరనివాసులు దేశకాలముల యవరోధముకొఱకై పరస్పరము చేష్టనొనర్పకుండుట యెట్లుగలదో, అట్లే యీ సృష్టినిగూర్చియు నెఱుంగుము. సువర్ణజ్ఞానమును త్యజించువో కటకాదుల భ్రమ యుదయమగునట్లు, భేదజ్ఞానముచేతనే సృష్టి, అహంభావము — ఇత్యాది భ్రమ లుదయించుచున్నవి. కటకాదుల యునికియు, ఉత్పత్తియు, సువర్ణముయొక్క యునికి, ఉత్పత్తులపైననే ఆధారపడియున్నట్లు, జగత్స్థితి సద్వస్తువగు చైతన్యముపై నాధారపడియున్నదని గ్రహింపుము.

దృగ్దర్శనపరిత్యాగే నావిద్యాస్తి పృథక్సదా
కటకాదిమహాభేదమేకం హేమ యథా మలమ్. 50

సువర్ణమునువిడచి కటకాదులకు వేఱుసత్తయే లేనివిధమున, దృగ్దర్శనశక్తిని విడచి అవిద్యకు వేఱు సత్తయెచటను లేదు.

బోధైకత్వాదయం సర్గస్తదేవానన్యయత్యలమ్
సేనా మృత్సంవిదా చిత్రా మృన్మాత్రమివ మృన్మయీ. 51

తత్త్వజ్ఞానము అసద్రూపమగు యీ జగత్తును సమమును సత్స్వరూపమునునగు పరమాత్మతో నైక్యపఱచుచున్నది. మృత్తికానిర్మితసైన్యము చిత్రవిచిత్రములుగ గన్పట్టినను, విచారదృష్టిచే మృత్తికామాత్రమే యగునట్లు, ఈ జగత్తున్ను పరమాత్మస్వరూపముమాత్రమే యగును.

జలమేకం తరంగాది దార్వేకం శాలభంజికా
మృన్మాత్రమేకం కుంభాది బ్రహ్మైకం త్రిజగద్భ్రమః. 52

తరంగాదులన్నియు జలమాత్రమును, దారుగ్రహములన్నియు దారుమాత్రమును, ఘటాదులన్నియు మృత్తికామాత్రమును నెట్లగునో, అట్లే యీ ముల్లోకముల భ్రమయు బ్రహ్మముమాత్రమే యగును.

సంబంధే దృశ్యదృష్టీనాం మధ్యే ద్రష్టుర్హి యద్వపుః
ద్రష్టృదర్శనదృశ్యాదివర్జితం తదిదం పరమ్. 53

దృశ్యదృష్టుల సంబంధమున, ద్రష్టృదర్శనదృశ్యాదివర్జితమగు నే ద్రష్టయొక్క శుద్ధరూపము గలదో, అదియే త్రిపుటియందంతటను వ్యాప్తమైయుండు పరబ్రహ్మము.

దేశాద్దేశం గతే చిత్తే మధ్యే యచ్చేతసో వపుః
అజాడ్యసంవిన్మననం తన్మయో భవ సర్వదా. 54

ఓ రామా! చిత్తమొక స్థానమునుండి మఱొక స్థానమునకు జనునపుడా రెంటిమధ్యనుగల చిత్తముయొక్క జడత్వరహితమగు శుద్ధస్వరూపమేదిగలదో, అదియే చైతన్యము. ఎల్లప్పుడును నీవట్టి శుద్ధచైతన్యస్వరూపుడవై యుండుము.

అజాగ్రత్స్వప్ననిద్రస్య యత్తే రూపం సనాతనమ్
అచేతనం చాజడం చ తన్మయో భవ సర్వదా. 55

జాగ్రత్స్వప్నసుషుప్తివర్జితమును, చిత్తవృత్తిరహితమునునగు శుద్ధచిన్మాత్రమే నీయొక్క స్వరూపముగాన సదా యట్టి చిద్వస్తుస్వరూపుడవై యుండుము.

జడతాం వర్జయిత్వైకాం శిలాయా హృదయం హి తత్
అక్షుబ్ధో వాథవా క్షుబ్ధస్తన్మయో భవ సర్వదా. 56

జడత్వరహితుడవగు చిద్ఘనస్వరూపుడవే నీవు. కాన సమాధియందున్నను వ్యవహారము చేయుచున్నను సర్వదా నీవట్టి చైతన్యరూపుడవే అయియుండుము.

కస్యచిత్కించనాపీహ నోదేతి న విలీయతే
అక్షుబ్ధో వాథవా క్షుబ్ధః స్వస్థస్తిష్ఠ యథా సుఖమ్. 57

పరమార్థమున నీ ప్రపంచమున ఎవనికిని యేదియు నశించుటలేదు. కాన నీవు సమాధిస్థుడవై యున్నను వ్యవహరించుచున్నను, స్వస్థచిత్తుడవై యుండుము.

నాభివాంఛతి నో ద్వేష్టి దేహే కించిత్క్వచిత్పుమాన్
స్వస్థస్తిష్ఠ నిరాశంకం దేహవృత్తిషు మా పత. 58

ఆత్మ యీ దేహమం దేదియు వాంఛించుటలేదు. దేనినిగూర్చియు ద్వేషించుటలేదు. కాన నీవు యిచ్ఛారహితుడవై, ప్రశాంతచిత్తుడవై, నశ్వరమగు దేహాదుల వృత్తులందు తగుల్కొనక యుండుము.

భవిష్యద్గ్రామకగ్రామ్యకార్యవ్యవసితో యథా
చిత్తవృత్తిషు మా తిష్ఠ తథా సత్త్వాత్మతాం గతః. 59

ఓ రామా! భవిష్యద్గ్రామవ్యవహారమం దెట్లాసక్తిరహితుడవై యుందువో, అట్లే చిత్తవృత్తులందాసక్తిలేక సత్స్వరూపమగు ఆత్మయందే నిష్ఠగల్గి యుండుము.

యథా దేశాంతరనరో యథా కాష్ఠం యథోపలః
తథైవ పశ్య చిత్తం త్వమచిత్తైవ యదాత్మనా. 60



ఓ రామా! నీవీ చిత్తమును దేశాంతరమునకు బోయిన మనుజునివలె అసత్తుల్యముగను, కాష్ఠశిలాదులవలె చైతన్యరహితముగను గాంచుము. ఏలయనిన, ఆత్మదృష్టిగల్గి వివేచించిచూడ, విజ్ఞుల యనుభవమున అచిత్తత్వమే ప్రసిద్ధమగుచున్నది.

యథా దృషది నాస్త్యంబు యథాంభస్యనలస్తథా
స్వాత్మన్యేవాస్తి నో చిత్తం పరమాత్మని తత్కుతః. 61

రాతియందు జలములేనట్లును, జలమందగ్ని లేని విధమునను జీవాత్మయందు చిత్తమున్నులేదు. అట్టిచో నిక పరమాత్మయం దయ్యదెట్లుండగలదు?

ప్రేక్షమాణం న యత్కించిత్తేన యత్క్రియతే క్వచిత్
కృతం భవతి తన్నేతి మత్వా చిత్తాతిగో భవేత్. 62

విచారదృష్టిచే గాంచిన చిత్తమునదే యుండనేరదు. కాన, అట్టి చిత్తముచే యొనర్పబడు కార్యమంతయు అకృతమేయగును. ఓ రామా! నీవా చిత్తమునకు పరమైయుండుము.

అత్యంతానాత్మభూతస్య యశ్చిత్తస్యానువర్తతే
పర్యంతవాసినః కస్మాన్న మ్లేచ్ఛస్యానువర్తతే. 63

మిక్కిలి యనాత్మభూతమగు యీ చిత్తముయొక్క వృత్తిననుసరించువాడన్యదేశవాసులగు మ్లేచ్ఛుల నేల యనుసరింపరాదు? (మ్లేచ్ఛుల ననుసరించుట నిషిద్ధమైయున్నది.)

నిరంతరమనాదృత్య త్వమారాచ్చిత్తపుక్కసమ్
స్వస్థమాస్స్వ నిరాశంకం పంకేనేవ కృతోఽజడః. 64

ఓ రామా! నిరంతరము చిత్తమను చండాలుని దూరమునుండియే యనాదరించి, మృణ్మయ విగ్రహమువోలె యచంచలముగ నున్నవాడవై యిచ్ఛారహితుడవై ప్రశాంతముగ నుండుము.

చిత్తం నాస్త్యేవ మే భూతం మృతమేవాద్య నేత్తి వా
భవనిశ్చయవాన్భూత్వా శిలాపురుషనిశ్చలః. 65

ఓ రామా! యథార్థముగ చిత్తము లేనిదే యగును. మిథ్యారూపముననే యది గన్పించుచున్నది. ఇవ్విధమున నిశ్చయించి శిలాపురుషునివలె నిశ్చలముగ నుండుము.

ప్రేక్షాయామస్తి నో చిత్తం తద్విహీనోఽసి తత్త్వతః
న కిమర్థమనర్థేన తద్వ్యర్థేన కదర్థ్యసే. 66

ఆత్మదృష్టియందు చిత్తమే యుండనేరదు. నీవు యథార్థముగ చిత్తరహితుడవే యగుదువు. అట్టిచో ననర్థములకు హేతుభూతమగు యీ చిత్తముతోగూడి యేల వ్యర్థముగ దుఃఖించుచుంటివి?

అసతా చిత్తయక్షేణ యే ముధా స్వవశీకృతాః
తేషాం పేలవబుద్ధీనాం చంద్రాదశనిరుత్థితః. 67

ఓ రామా! అసత్తగు చిత్తమను బేతాళునిచే వశీకరింపబడిన అదృఢబుద్ధులకు చంద్రుని నుండియు వజ్రపాతము సంభవించుచున్నది.

చిత్తం దూరే పరిత్యజ్య యోఽసి సోఽసి స్థిరో భవ
భవ భావనయా ముక్తో యుక్త్యా పరమయాన్వితః. 68

చిత్తమును దూరముగ తొలగింప, మిగులునదే నీ రూపము. నీవట్టి యాత్మస్వరూపముననే స్థిరుడవై యుండుము. అందులకై మననమను యుత్తమ ఉపాయమునుబడసి ధ్యాననిష్ఠుడవు కమ్ము.

అసతో యేనువర్తంతే చేతసోఽసత్యరూపిణః
వ్యోమమారణకర్మైకసీతకాలాన్ధిగస్తు తాన్. 69

అసత్యమగు చిత్తముననుకరించుచు యాకసమును భేదింప నెంచునట్టి మూర్ఖులకు ధిక్కారమగు గాత !

వ్యపగలితమనా మహానుభావో
భవ భవపారగతో భవామలాత్మా
సుచిరమపి విచారితం న లబ్ధం
మలమమలాత్మని మానసాత్మకించిత్. 70

ఇత్యార్షే వాసిష్ఠ మహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
చిత్తాభావప్రతిపాదనం నామైకవింశత్యుత్తర
శతతమః సర్గః ॥ 121 ॥

ఓ రామా ! మొట్టమొదట తత్త్వబోధయందు కుశలుఁడవై మనోనాశముగలిగి, యనంతరమట్టి బోధచే నిర్మలాత్ముడవై సంసారమును దాటివేయుము. ఎంతయన్వేషించినను, నిర్మలమగు ఆత్మయందు మనస్సను మాలిన్యము లేశమైనను గాన్పింపకున్నది. కావన నీవు యీ వాక్యముననుసరించి ఆత్మయందే స్థిరచిత్తుడవై యుండుము.

ఇది శ్రీవాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తి ప్రకరణమున
చిత్తాభావప్రతిపాధనమను ఏకవింశత్యుత్తర శతతమ
సర్గము ॥ 121 ॥

---

## ద్వావింశత్యుత్తరశతతమః సర్గః.

---

శ్రీ వసిష్ఠ ఉవాచ :—

ప్రథమం జాతమాత్రేణ పుంసా కించిద్వికసితబుద్ధినైవం
సత్సంగమపరేణ భవితవ్యమ్. 1

శ్రీ వసిష్ఠుడు:—ఓ రామా ! జన్మించిన పిదుపరి బుద్ధి కొంచెము వికాసము జెందగనే మనుజుడు ప్రథమమున సత్సంగతత్పరుడై యుండవలెను.



అనవరతప్రవాహపతితోఽయమవిద్యానదీనివహః శాస్త్రసజ్జన సంపర్కాదృతే
న తరితుం శక్యతే. 2

నిరంతర ప్రవాహశీలమగు అవిద్యానదీసమూహము శాస్త్రాభ్యాస సత్సాంగత్యములులేక దాట నశక్యమైనది.

తేన వివేకతః పురుషస్య హేయోపాదేయవిచార ఉపజాయతే. 3

ఇట్టి శాస్త్రాభ్యాస సత్సాంగత్యములచే త్యాజ్యగ్రాహ్యవస్తువులఁగూర్చిన వివేకము జీవునకుత్పన్నమగును.

తదాసా శుభేచ్ఛాభిధాం వివేకభువమాపతితో భవతి. 4

అపుడే యాతడు శుభేచ్ఛయను భూమికను పొందును.

తతో వివేకవశతో విచారణాయామ్. 5

దానినుండి, వివేకముద్వారా క్రమముగ విచారణయను రెండవ భూమికయందు ప్రవేశించును.

సమ్యగ్జ్ఞానేనాసమ్యగ్వాసనాం త్యజతః సంసారభావనాతో మనస్తనుతామేతి. 6

అపుడుత్తమమగు నాత్మజ్ఞానముచే దుష్టవాసనలన్నియు తొలగింపబడును. మఱియు నిరంతర పరమార్థభావనచే మనస్సు సూక్ష్మత్వమందును.

తేన తనుమానసానామ వివేకభూమిమవతీర్ణో భవతి. 7

ఇవ్విధముగ మనస్సు సూక్ష్మమైనపుడు సాధకుడు తనుమానసయను మూడవ జ్ఞానభూమికయందు ప్రవేశించును.

యదైవ యోగినః సమ్యగ్జ్ఞానోదయస్తదైవ సత్త్వాపత్తిః. 8

ఎపుడా యోగికి సమ్యక్‌జ్ఞానోదయమగునో అపుడే యాతడు సత్త్వాపత్తియను నాల్గవ భూమికను పొందును.

తద్వశాద్వాసనాతనుతాంగతా యదా తదైవాసా
వసంసక్త ఇత్యుచ్యతే కర్మఫలేన న బధ్యత ఇతి. 9

ఆత్మజ్ఞానముచే వాసనలు సూక్ష్మమవ, అంత నాయోగి అసంసక్తుడనఁబడును. అనగా, అసంసక్తియను భూమికను ప్రవేశించుటచే నాతడు కర్మఫలములచే బద్ధుడు గాకయుండును.

అథ తానసనవశాదసత్యే భావనాతానవమభ్యస్యతి. 10

పిమ్మట వాసనలను సూక్ష్మమొనర్చుచు క్రమముగ బాహ్యపదార్థముల సూక్ష్మత్వ మభ్యసించును. అనగా నంతర్ముఖవృత్తిచే బ్రహ్మాహంభావము దృఢపడగా అపుడు బాహ్యపదార్థముల విస్మృతి వానికి సంభవించును.

యావన్న కుర్వన్నపి వ్యవహారన్నప్యనత్యేషు సంసారవస్తుషు స్థితోఽపి స్వాత్మన్యేవ క్షీణమనస్త్వాదభ్యాసవశాద్బాహ్యం వస్తు కుర్వన్నపి న పశ్యతి నాలంబనేన సేవతే నాభిధ్యాయతి తనువాసనత్వాచ్చ కేవలం మూఢః సుప్తప్రబుద్ధ ఇవ కర్తవ్యం కరోతి. 11

సమాధిస్థుడైయున్నను, ప్రపంచమున వ్యవహరించుచున్నను, అసత్యములగు స్త్రీ పుత్రాది ప్రాపంచిక వస్తువులందు వర్తించుచున్నను, స్నానభోజనాది బాహ్యక్రియల నొనర్చుచున్నను, మనస్సు సూక్ష్మత్వముఁ జెందుటచేతను, బ్రహ్మాహంభావాభ్యాసముచేతను యోగి వానిని యథార్థముగ గమనింపకుండును. మఱియు అప్రీతితో నాచరించుచు, వానిని స్మరింపకయు నుండును. వాసనలు సన్నగిల్లుటచే కేవలము బాలునివలెగాని, అపుడే నిద్రనుండి మేల్కాంచినవానివలెగాని యుండి, కర్తవ్యములగు స్నానపానాదికర్మల నొరుల ప్రేరణచే నాచరించుచు యివ్విధమున బాహ్యపదార్థవిస్మృతి రూపమగు యుపరతిస్థితి స్థిరత్వముఁ జెంది స్వస్వరూపమున నిలుకడ జెందువఱకు యోగి అభ్యాస మొనర్చుచునే యుండును.

తనుభావితమనస్కస్తేన యోగభూమికాం భావనామధిరూఢః. 12

సూక్ష్మమగు బ్రహ్మముతో చిత్తము నైక్యపఱచు యోగి పూర్వోక్తలక్షణములుగలవాడై పదార్థాభావనియను ఆఱవ భూమికయం దారూఢుడగును.

ఇత్యంతర్లీనచిత్తః కతిచిత్సంవత్సరానభ్యస్య సర్వథైవ కుర్వన్నపి బాహ్యపదార్థాన్ భావనాం త్యజతి తుర్యాత్మా భవతి తతో జీవన్ముక్త ఇత్యుచ్యతే.

ఇవ్విధమున బాహ్యపదార్థములను భావింపక, బ్రహ్మమందు చిత్తమును లయపఱచుచు కొన్ని వత్సరములభ్యసించి యొరులప్రేరణచే స్నానపానాది కృత్యముల నొనర్చుచుండినను వానినేమియు భావింపకయుండువాడు స్వయముగ తురీయుఁడగును. అపుడే ఆయోగి జీవన్ముక్తుడనబడును.

నాభినందతి సంప్రాప్తం నాప్రాప్తమభిశోచతి
కేవలం విగతాశంకం సంప్రాప్తమనువర్తతే. 14

అపుడు తుర్యగయను యేడవ భూమికనుపొంది, యోగి అభిలషితపదార్థప్రాప్తిచే ప్రసన్నుడును, అప్రాప్తిచే దుఃఖితుడును గాకయుండును. ఇచ్ఛారహితుడై ప్రారబ్ధకర్మానుసారము లభించిన దానినిమాత్ర మనుభవించును.

త్వయాపి రాఘవ జ్ఞాతం జ్ఞాతవ్యమఖిలాంతరమ్
నను తే సర్వకార్యేభ్యో వాసనా తనుతాం గతా. 15

ఓ రామా! నీవును అత్యంత చిత్తనైర్మల్యముచేతను స్వవిచారముచేతను జ్ఞాతవ్యమగు ప్రత్యగాత్మను లెస్సగ దెలిసికొంటివి. ఏలయన, ప్రాపంచిక వ్యవహారము లన్నిటియందును నీకు విరక్తి యుదయించినది. మఱియు వాసనలును సన్నగిల్లినవి.

శరీరాతీతవృత్తిస్త్వం శరీరస్థోఽథవా భవ
మాగాః శోకం చ హర్షం త్వం త్వమాత్మా విగతామయః. 16



ఓ రామా! నీ వెల్లప్పుడును సమాధిస్థుడవై యుండుము. లేక లోకసంగ్రహార్థము వ్యవహారమును జేయుము. కాని సర్వదుఃఖరహితమగు చిదాత్మస్వరూపుఁడవగు నీవు హర్షశోకముల నెన్నటికిని పొందక యుండుము.

త్వయాత్మని సితే స్వచ్ఛే సర్వగే సర్వదోదితే
కుతో దుఃఖసుఖే రామ కుతో మరణజన్మనీ. 17

స్వయంప్రకాశమును, నిర్మలమును, సర్వవ్యాపియు, నిత్యమునునగు ఆత్మయే స్వరూపముగాగల నీకు దుఃఖముగాని, విషయసుఖముగాని, జనన మరణములుగాని యెట్లుండును?

అబంధురపి కస్మాత్త్వం బంధుదుఃఖాని శోచసి
అద్వితీయే స్థితే హ్యస్మిన్ బాంధవాః క ఇవాత్మని. 18

జ్ఞానముచే నిజజన్మమరణాదుల దుఃఖమునశించినను, బంధువులగూర్చిన దుఃఖము లెట్లు నశించునని సంశయింపరాదు. ఏలయనిన బంధురహితమగు శుద్ధాత్మస్వరూపుడవై యుండియు యింకను బంధువుల దుఃఖములఁగూర్చిన చింతయేల? అద్వితీయమగు పరమాత్మకు బంధువులెచట?

దృశ్యతే కేవలే దేహే పరమాణుచయః పరమ్
దేశకాలాన్యతావర్తైర్నాత్మోదేతి న లీయతే. 19

బంధువుల దేహాత్మలు రెండునుగూడ శోకింపదగినవి కానేరవు. ఏలన, దేహము పృథ్వ్యాది పంచభూతముల పరమాణుసమూహముచే నిర్మితమై, దేశకాలభేదములచే నన్యరూపము నొందుచు పరివర్తనముఁ జెందుచున్నది. ఇక ఆత్మయో, ఉత్పన్నముగాకయు నశింపకయు నుండును.

అవినాశోఽపి కస్మాత్త్వం వినశ్యామీతి శోచసి
అమృత్యువసతౌ స్వచ్ఛే వినాశః క ఇవాత్మని. 20

నాశరహితుడవై యుండియు నశించుదునని తలంచి యేల దుఃఖించుచున్నావు? మృత్యురహితమగు ఆత్మకు నాశమెచట?

ఘటే కపాలతాం యాతే ఘటాకాశో న నశ్యతి
యథా తథా శరీరేఽస్మిన్నష్టేఽపి న వినశ్యతి. 21

ఘటము రెండు వ్రక్కలైనను అందలి ఘటాకాశము నశింపనట్లు దేహము నశించినను ఆత్మ నాశమొందదు.

మృగతృష్ణాతరంగిణ్యాం క్షీణాయామాతపో యథా
న నశ్యతి తథా దేహే నష్టేనాత్మా వినశ్యతి. 22

మృగతృష్ణాస్రవంతి వినాశమైనను సూర్యరశ్మి నశింపకుండునట్లు శరీరము నశించినను ఆత్మ నశింపనేరదు.

వాంఛైవోదేతి తే కస్మాద్భ్రాంతిరంతర్నిరర్థికా
అద్వితీయోఽద్వితీయం కిం యద్వస్త్వాత్మాభివాంఛతు. 23

ఓ రామా! నిరర్థకములును, భ్రాంతిరూపములునునగు పదార్థముల యభిలాష నీయందేల యుదయించుచున్నది? ఆత్మ సర్వవస్తుస్వరూపమైయుండ యిక నీవు వాంఛించుటకు రెండవ పదార్థ మెచట?

శ్రవ్యం స్పృశ్యం తథా దృశ్యం రస్యం ఘ్రేయం చ రాఘవ
న కించిదస్తి జగతి వ్యతిరిక్తం యదాత్మనః. 24

ఓ రాఘవా! వినునదంతయును, స్పృశించునదంతయును, చూచునదంతయును, ఆస్వాదించునదంతయును, ఆఘ్రాణించునదంతయును ఆత్మయే. ఆత్మకన్యమగు వస్తువీ ప్రపంచమున లేనే లేదు.

సర్వశక్తావిమాస్తస్మిన్నాత్మన్యేవాఖిలాః స్థితాః
శక్తయో వితతేవ్యక్తే ఆకాశ ఇవ శూన్యతా. 25

సర్వశక్తిమంతుడును, వ్యాపకుడును, సుప్రసిద్ధుడునగు నా పరమాత్మయందు, ఆకాశమున శూన్యత్వమువలె దర్శన, స్పర్శనాది శక్తులన్నియును గలవు.

చిత్తాద్రాఘవ రూఢేయం త్రిలోకీ లలనోదితా
త్రివిధేన క్రమేణేహ జన్మనా జనితభ్రమా. 26

ఓ రామా! సాత్త్విక రాజస తామసములను త్రివిధజన్మలచే భ్రమనుగొల్పు యీ త్రైలోక్యలలన చిత్తమునుండియే యుత్పన్నమైనది.

మనః ప్రశమనే సిద్ధే వాసనాక్షయనామని
కర్మక్షయాభిధానైవ మాయేయం ప్రవినశ్యతి. 27

వాసనాక్షయ మనంబడు మనోనాశము సిద్ధింపగా, కర్మకు నివాసభూతమగు యీ మాయయు స్వయముగ నశించును.

సంసారోగ్రారఘట్టేఽస్మిన్నారూఢా యంత్రవాహినీ
రజ్జుస్తాం వాసనామేతాం ఛింధి రాఘవ యత్నతః. 28

ఓ రామా! సంసారమను యంత్రము (పిండిమర)ను నడపునట్టి (అధోభాగమునగల మధ్యమున బంధింపబడినదగు) వాసనయను రజ్జువును నీవు ప్రయత్నపూర్వకముగ ఛేదించివేయుము.

అపరిజ్ఞాయమానైషా మహామోహప్రదాయినీ
పరిజ్ఞాతాత్వనంతాఖ్య సుఖదా బ్రహ్మదాయినీ. 29

ఎఱుంగబడనిచో వాసనారూపమగు యీ మాయ గొప్పమోహమును కలుగజేయును. ఎఱుంగబడిన నియ్యది అనంతసుఖమును ప్రసాదించును. మఱియు బ్రహ్మస్వరూపసాక్షాత్కారముగూడ కలుగజేయును.

ఆగతా బ్రహ్మణో భుక్త్వా సంసారమిహ లీలయా
పునర్బ్రహ్మైవ సంస్మృత్య బ్రహ్మణ్యేవ విలీయతే. 30

ఈ మాయ బ్రహ్మమునుండి యుద్భవించినదై లీలామాత్రముగ సంసారమనుభవించి



స్వలీలయేయగు బ్రహ్మవిద్యచే సంసారనాశమొనర్చి, బ్రహ్మమును స్మరించి మరల బ్రహ్మమునందే లీనమగుచున్నది.

శివాద్రాఘవ నీరూపాదప్రమేయాన్నిరామయాత్
సర్వభూతాని జాతాని ప్రకాశా ఇవ తేజసః. 31

ఓ రామా! మంగళస్వరూపుడును, రూపరహితుడును, అప్రమేయుడును, నిరామయుడునునగు పరబ్రహ్మమునుండి, అగ్నినుండి ప్రకాశమువలె ప్రాణికోట్లన్నియు నుత్పన్నములాయెను.

రేఖావృందం యథా పర్ణే వీచిజాలం యథా జలే
కటకాదియథా హేమ్ని తత్త్వాది యథాఽనలే. 32

తదేతద్భావనారూపే తథేదం భువనత్రయమ్
తస్మిన్నేవ స్థితం జాతం తస్మాదేవ తదేవ చ. 33

పత్రమున రేఖలును, జలమందు తరంగములును, సువర్ణమున కటకాద్యాభరణములును, అగ్నియందు దుష్ణత్వాదులును ఎట్లుగలవో, అట్లే ధ్యానరూపుడగు పరమాత్మయందీ ముల్లోకములును గలవు. వానియందే యీ జగత్తు ఉత్పన్నమైనది. వానియందే స్థితిఁబొందియున్నది. కాన యీ జగత్తు పరమాత్మయే యగును.

స ఏవ సర్వభూతానామాత్మా బ్రహ్మేతి కథ్యతే
తస్మిన్ జ్ఞాతే జగజ్జాతం స జ్ఞాతా భువనత్రయే. 34

ఆ పరమాత్మయే సమస్తప్రాణికోట్లయొక్క అంతరాత్మయగు బ్రహ్మమని చెప్పబడును. అతని నెఱింగిన నీ జగత్తంతయు నెఱుంగబడును. మఱియు నీ ముల్లోకములందు జ్ఞాతయు నాతడే యగును.

శాస్త్రసంవ్యవహారార్థం తస్యాస్యవితతాకృతేః
చిద్బ్రహ్మాత్మేతి నామాని కల్పితాని కృతాత్మభిః. 35

శాస్త్రీయ లౌకిక వ్యవహారార్థము అనంతాకారముగల నా పరమాత్మకు చిత్తు, బ్రహ్మము మున్నగు నామములను తత్త్వజ్ఞులు కల్పించిరి.

విషయేంద్రియసంయోగే హర్షామర్ష వివర్జితా
సైషా శుద్ధానుభూతిర్హి సోఽయమాత్మా చిదవ్యయః. 36

దైవవశమున యింద్రియములకు ప్రియాప్రియవిషయములతో సంబంధము కలిగినను జీవన్ముక్తులు పైనదెల్పిన అవినాశియగు చిదాత్మయొక్క యనుభవమునే గలిగియుందురు కాని సంసారస్వభావము కాదు.

ఆకాశాతితరాచ్ఛాచ్ఛ ఇదం తస్మింశ్చిదాత్మని
స్వాభోగ ఏవ హి జగత్పృథగ్వాత్ప్రతిబింబితః. 37

బుద్ధిస్తద్వ్యతిరేకేణ లోభమోహ దయో హి తాన్
సాత్యసద్వ్యతిరేకేణ తే చ తస్మింస్తదేవ తే. 38

ఆకాశముకంటె అతినిర్మలమగు ఆ చిదాత్మయందే యీ జగత్తు ప్రతిబింబితమగుచున్నది. అట్లు ప్రతిబింబించిన జగత్తునకు శుద్ధసాక్షిస్వరూపదృష్టియు, ప్రియాప్రియవిభాగపూర్వకమగు వివేకమున్ను కలుగజాలనందున, ఆరెంటి (సాక్షి చైతన్యజగత్తుల) మధ్యను బుద్ధి ప్రతిబింబించుచున్నది. అదియే లోభమోహాది విషయములందు ప్రవృత్తమగుచు నున్నది. బుద్ధిప్రేరితములగు ఆ లోభమోహాదులు యథార్థముగ లేకున్నను, పరస్పరవిభేదముచేనా చిదాత్మయందు ప్రతిబింబించుచున్నవి గాన అయ్యవి లేనివేయగును.

అదేహస్యైవ తే రామ నిర్వికల్పచిదాకృతేః
లజ్జాభయవిషాదేభ్యః కుతో మోహః సముత్థితః. 39

ఓ రామా! దేహరహితమును, నిర్వికల్పమును చిదాకారమునునగు నీకు లజ్జాభయ విషాదములతో కూడిన యీ మోహమెటునుండి సంప్రాప్తించినది ?

అదేహో దేహజైరేభిర్లజ్జాదిభిరసన్మయైః
కిం మూర్ఖ ఇవ దుర్బుద్ధిర్వికల్పైరభిభూయసే. 40

దేహరహితుడవగు నీవు అసత్యమగు దేహముచే నుత్పన్నమైన లజ్జాదులచే, దుర్బుద్ధియగు మూర్ఖునివలె యేల దుఃఖితుడవగుచుంటివి ?

అఖండచిద్రూపస్య దేహే ఖండనమాగతే
అసమ్యగ్దర్శినోఽప్యస్తి న నాశః కిము సన్మతేః. 41

దేహము ఛేదింపబడినను, అఖండమగు చైతన్యము ఛేదింపబడకుండును. దేహము నశించిన, అజ్ఞానియొక్క ఆత్మయే నశింపకయుండ నిక సమ్యగ్దర్శియగు జ్ఞానియొక్క ఆత్మ యెట్లునశించును ?

అపతేదర్కమార్గేఽపి న నిరుద్ధగమాగమమ్
చిత్తం నామ స విజ్ఞేయః పురుషో న శరీరకమ్. 42

స్వతంత్రమగుటచే నిరుద్ధముగాని గమనాగమనములుగల యే చిత్తము ఆశ్రయరహితమగు సూర్యమార్గమున బోగల్గియుండునో అట్టి చిత్తమే (దేహమనుపురమున నుండునది గాన) పురుషుడగును గాని, దేహముకాదు.

శరీరే సత్యసతివా పుమానేవ జగత్త్రయే
జ్ఞోఽప్యజ్ఞోఽపి స్థితో రామ నష్టే దేహే న నశ్యతి. 43

దేహముండినను నశించినను జ్ఞానియొక్కగాని, అజ్ఞానియొక్కగాని ఆత్మ ముల్లోకములందును యథారీతి అచంచలముగ నుండియే యుండును. దేహనాశనముచే అయ్యది నశింపనేరదు.

యానీమాని విచిత్రాణి దుఃఖాని పరిపశ్యసి
తాని దేహస్య సర్వాణి నాగ్రాహ్యస్య చిదాత్మనః. 44

దృశ్యమానమగు ఈసుఖదుఃఖములన్నియును శరీరమునకే గాని అగ్రాహ్యమగు ఆత్మకుగావు.



మనోమార్గాదతీతత్వాద్యాసా శూన్యమివ స్థితా
చిత్కథంనామదుఃఖైర్వా సుఖైర్వా పరిగృహ్యతే. 45

ఓ రామా! మనోమార్గముకంటెను పరమగు యే చిద్వస్తువాకసమువలె వ్యాప్తమైయున్నదో, అయ్యది దుఃఖములచేగాని, విషయసుఖములచేగాని యెట్లు ప్రభావితము కాగలదు?

స్వాత్మనాత్మానమేవాసౌ వినష్టాద్దేహపంజరాత్
అభ్యస్తాంవాసనాం యాతః షట్పదః ఖమివాంబుజాత్. 46

ఈ చైతన్యము నీక జన్మలందభ్యస్తమగు వాసనలతో కూడియున్నను దేహమను పంజరము నుండి వడలి తన యథార్థస్వరూపమగు పరమాత్మయందే ప్రతిష్ఠితమగుచున్నది.

అసచ్చేదాత్మతత్త్వంతదస్మింస్తేదేహపంజరే
నష్టే కిం నామ నష్టం స్యాద్రామ కేనానుశోచసి. 47

జీవుడు ప్రతిబింబితుడే యగుచో, యుపాధికంటె వేఱుగ వానికి సత్తయే యుండజాలదు. మఱియు నపుడుపాధి నశించిన, నాశముగూడ నొందును. కాన ఆత్మ జీవుడు కానేరదు. జీవుడే కానపుడు యిక దేహమెట్లగును? కాన దేహమను పంజరము నశించిన నీకేమి హాని? నీవు జీవుడవు కానపుడు యిక నేల దుఃఖము నొందుచున్నావు ?

సత్యం భావయ తేన త్వం మా మోహమనుభావయ
నిరిచ్ఛస్యాత్మనో నేచ్ఛా కాచిదప్యనఘాకృతేః. 48

కాన నో రామా! జీవుని, వాని యుపాధిని పరిత్యజించి సత్యస్వరూపమగు బ్రహ్మమును భావింపుము. భ్రాంతిరూపములగు నశ్వరదేహాదులం దాత్మభావన జేయకుము. ఇచ్ఛారహితమును, శుద్ధమునునగు పరమాత్మకేవిధమగు యిచ్ఛయు నుండజాలదు.

సాక్షిభూతే సమే స్వచ్ఛే నిర్వికల్పే చిదాత్మని
నిరిచ్ఛం ప్రతిబింబంతి జగంతి ముకురే యథా. 49

సర్వులకు సాక్షిభూతమును, సర్వత్ర సమమును, నిర్మలరూపమును నిర్వికల్పమునగు చిదాత్మయందు, అద్దమందు వస్తువులవలె అనిచ్ఛాపూర్వకముగ బ్రహ్మాండములన్నియును ప్రతిబింబించుచున్నవి.

సాక్షిభూతే సమే స్వచ్ఛే నిర్వికల్పే చిదాత్మని
స్వయం జగంతి దృశ్యంతే సన్మణావివ రశ్మయః. 50

స్వచ్ఛమగు మణియందు సూర్యకిరణములవలె సాక్షిస్వరూపమును, వికల్పరహితమునునగు చిదాత్మయందు జగత్సమూహములన్నియు గోచరించుచున్నవి.

అనిచ్ఛమపి సంబంధో యథా దర్పణబింబయోః
తథైవేహాత్మజగతో ర్భేదాభేదౌ వ్యవస్థితౌ 51

ఓ రామా! దర్పణప్రతిబింబములు సంబంధ మనిర్వాచ్యపూర్వకముగనే సిద్ధించునట్లు, ఆత్మ జగత్తుల భేదాభేదసంబంధమున్ను సిద్ధించుచున్నది. అనగా సత్యమైన భానమాత్రముచే భిన్నముగను యథార్థముగ నభిన్నముగను నుండును.

సూర్యసన్నిధిమాత్రేణ యథోదేతి జగత్క్రియా
చిత్సత్తామాత్రకేణేదం జగన్నిష్పద్యతే తథా. 52

సూర్యుని సన్నిధానమాత్రముననే జగత్క్రియ యంతయును సిద్ధించువిధమున చేతనసత్తామాత్రముననే యీ జగత్తుత్పన్నమగుచున్నది.

పిండగ్రహో నివృత్తోఽస్యా ఏవం రామ జగత్స్థితేః
ఆకాశమేషా సంపన్నా భవతామపి చేతసి. 53

ఓ రామా! ఇట్టిజగత్స్థితియొక్క మూర్తిమంతమగు నాకృతి (నామరూపములు) యెపుడు నివర్తించునో, అపుడే దీనియొక్క ఆకాశమునంటి శుద్ధచైతన్య స్వరూపము చిత్తమున గోచరింపగలదు.

సత్తామాత్రేణ దీపస్య యథాలోకః స్వభావతః
చిత్తత్త్వస్వభావాత్తు తథేయం జాగతీస్థితిః. 54

దీపపు సత్తామాత్రముచే స్వభావముగనే ప్రకాశ మావిర్భవించునట్లు, చిద్వస్తు స్వభావ మాత్రముచే నీ జగత్తు స్థితిగల్గియున్నది.

పూర్వం మనః సముదితం పరమాత్మతత్త్వా
త్తేనాతతం జగదిదం స్వవికల్పజాలైః
శూన్యేన శూన్యమపి తేన యథాంబరేణ
నీలత్వముల్లసితచారుతరాభిధానమ్. 55

ఓ రామా! ఆకాశము శూన్యమేయైనను, సర్వులచే ననుభూతమును, సుందరమును, శోభాయమానమును, మఱియు (క్రిందుగగల స్వచ్ఛనీలమణియొక్క కాంతివంటిదియునగు నీలత్వము నెట్లు కల్పించెనో, అట్లే, పరమాత్మనుండి మొట్టమొదట మనస్సు ఉత్పన్నమగు అయ్యది తన వికల్పములచే నీజగదాడంబరమంతయు రచించెను.

సంకల్పసంక్షయవశాద్గలితే తు చిత్తే
సంసారమోహమిహికా గలితా భవంతి
స్వచ్ఛం విభాతి శరదీవ ఖమాగతాయాం
చిన్మాత్రమేకమజమాద్యమనంతమంతః. 56

సంకల్పనాశముచే చిత్తము క్షయింప, సంసార మోహమను నీహారము స్వయముగనే నశించును. అపుడే జన్మవర్జితుడును, అనాద్యనంతస్వరూపుడును, నిర్మలుడును, చిన్మాత్ర స్వరూపుడునగు పరమాత్మ శరదృతు ప్రవేశమున నిర్మలాకాశము శోభించునట్లు, అంతఃకరణమున ప్రకాశించును.



కర్మాత్మకం ప్రథమమేవ మనోఽభ్యుదేతి
సంకల్పతః కమలజప్రకృతీస్తదేత్య
నానాభిధం జగదిదం హి ముధా తనోతి
వేతాలదేహకలనామివ ముగ్ధబాలః. 57

ప్రథమమున సమస్త ప్రాణులయొక్క సమష్టికర్మరూపమును సమష్టిక్రియాశక్తి ప్రధానమునగు మనస్సావిర్భవించుచున్నది. పిదప బ్రహ్మదేవుని మనంబునుండి యుత్పన్నమైన మన్వాదులు దేహము ధరించి, ముగ్ధుడగు బాలుడు బేతాలుని దేహమునుగూర్చిన కల్పనను విస్తరించునట్లు వివిధ నామయుక్తమగు యీ మిథ్యాజగత్తును విస్తరింపజేయుచున్నారు.

అనన్మయం సదివ పురో విలక్ష్యతే
పునర్భవత్యథ పరిలీయతే పునః
స్వయం మనశ్చితి చితసంస్ఫురద్వపు
ర్మహార్ణవే జలవలయావలీ యథా. 58


ఇత్యార్షే వాసిష్ఠమహారామాయణే వాల్మీకీయే ఉత్పత్తిప్రకరణే
స్వరూపనిరూపణం నామ ద్వావింశత్యుత్తర
శతతమః సర్గః ॥ 122 ॥

ఉత్పత్తిప్రకరణం సంపూర్ణమ్.


(కాన సమష్టి వ్యష్టిభేదములచే కల్పితమగు నీ జగత్తంతయు మనోమాత్రమేయగును. మఱియు నీ మనస్సు అసత్తగు అజ్ఞానముయొక్క కార్యమేగాన నదియు అసత్తేయగుచున్నది. అందుచే, అధిష్ఠానమగు సాక్షి చైతన్యముయొక్క స్ఫూర్తిచే అసత్తగు జగత్తు స్ఫురించుటయే దీని యుత్పత్తియగును. ఇక్కారణమున ప్రపంచరహితమగు సచ్చిదానంద పరిపూర్ణ బ్రహ్మమే జగద్రూపముగ గన్పట్టుచున్నదనుట (శ్రుతులన్నిటియొక్క సిద్ధాంతమైయున్నది. ఈ యాశయమును బట్టియే యిట చెప్పబడుచున్నది—) అసత్తగు అజ్ఞానముయొక్క పరిణామమేయైన మనస్సు తన యధిష్ఠానమగు చైతన్యమందు స్వయముగ వృద్ధినొంది, జగత్తను ప్రకాశమానమగు దేహముగలదై, పూర్ణ మహాసముద్రముయొక్క సత్తామాత్రమునందు వలయాకారమగు తరంగముల పంక్తి యుద్భవించి స్థితిబొందులాగున సమ్ముఖముననున్న సాక్షి చైతన్యప్రభావముచే సద్వస్తువువలెనే భాసించుచున్నది. కాన వాక్కునకు విషయమగు యీ దృశ్యమాత్రమంతయు మిథ్యయే యగుటచే సచ్చిదానంద స్వరూపమగు పరిపూర్ణ బ్రహ్మమే అవికృతరూపమున సదా నెలకొనియున్నదని సిద్ధించుచున్నది.

ఇది శ్రీ వాసిష్ఠ తాత్పర్య ప్రకాశికయందు ఉత్పత్తిప్రకరణమున
స్వరూపనిరూపణమను ద్వావింశత్యుత్తర
శతతమ సర్గము ॥ 122 ॥

ఉత్పత్తి ప్రకరణము సమాప్తము.



మహర్షి సద్గురు శ్రీమలయాళస్వాములవారు




**శ్రీ వ్యాసాశ్రమము**


ఏర్పేడు, చిత్తూరు జిల్లా - 517 621.

ఫోన్: 08578-287528, ఫ్యాక్స్: 287647